'అఖండ-2' సందడి

వేదికపై బాలకృష్ణ, బోయపాటి శ్రీను

విశాఖ నగరంలో 'అఖండ-2' చిత్ర బృందం సందడి చేసింది. ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణ ఈ చిత్రంలో చేసిన పాత్రపై ఇప్పటికే అంచనాలు భారీగా పెరిగాయి. 'అఖండ' భారీ విజయం నేపథ్యంలో ఈ చిత్రం వీక్షించేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్రంలో ఓ గీతాన్ని సాగర తీర నగరంలో మంగళవారం రాత్రి విడుదల చేశారు. అభిమానుల సమక్షంలో ఈ కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. హీరోయిన్ సంయుక్తామేనన్, దర్శకుడు బోయపాటి శ్రీను అభిమానులతో ముచ్చటించారు.

–న్యూస్‌టుడే, విశాఖపట్నం

మాట్లాడుతున్న సంయుక్తామేనన్

అరణ్యంలో అలజడి!

★ మారేడుమిల్లిలో మావోయిస్టులు, బలగాల నడుమ కాల్పులు

★ భారీ ఎన్‌కౌంటర్‌తో ఉలిక్కిపడిన మన్యం

ఈనాడు డిజిటల్, పాడేరు, మారేడుమిల్లి, రంపచోడవరం, సీలేరు, చింతూరు, న్యూస్‌టుడే

ప్రకృతి రమణీయత.. ఆహ్లాదకర వాతావరణం... నిత్యం రాకపోకలు సాగించే సందర్శకులు.. సుందరమైన పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో తుపాకులు గర్జించాయి. సాయుధ బలగాలకు, మావోయిస్టులకు మధ్య కాల్పులతో మన్యం ప్రతిధ్వనించింది. మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడివలస పంచాయతీ పరిధిలోని ఇజ్జులూరు పరిసర దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం మావోయిస్టులకు, కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో మావోయిస్టు అగ్రనేత హిడ్మా, ఆయన భార్య, మరో నలుగురు మావోయిస్టులు తుపాకీ తూటాలకు నేలకొరిగారు. తప్పించుకున్న మావోయిస్టులు జనజీవనంలో కలిసిపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చూసేందుకు వచ్చిన వాహనాలు, బస్సులను సైతం జల్లెడ పడుతున్నారు. ప్రస్తుతం పరిణామాల నేపథ్యంలో మన్యంవ్యాప్తంగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఎప్పుడు, ఏం జరుగుతుందోనని గిరిజనం బిక్కుబిక్కుమంటున్నారు.

ఆపరేషన్ కగార్‌తో.. ఏఓబీలోకి రాక... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్రంతోపాటు అక్కడి రాష్ట్ర ప్రభుత్వ బలగాలు నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్ మావోయిస్టు పార్టీకి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మావోయిస్టుల కదలికలపై పూర్తిగా నిఘా పెట్టడం, విస్తృతంగా దాడులు జరుగుతుండటంతో.. వారు తలదాచుకునేందుకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతాలకు చేరుకుంటున్నారు. ఈ మేరకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందుకున్న ఆంధ్రా పోలీసులు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టడంతోపాటు నిఘాను విస్తృతం చేశారు. ఏఓబీలో మావోయిస్టుల అడుగుజాడలను గుర్తించిన బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం మావోయిస్టులకు, సాయుధ బలగాలకు ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో ప్రాణాలు కోల్పోయిన అగ్రనేత, కేంద్రకమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్యతోపాటు మరో నలుగురి మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఆసుపత్రి వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మారేడుమిల్లిలో ఇదే పెద్ద ఘటన... మారేడుమిల్లి మండలంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్ భారీ ఘటనగా చెప్పుకోవచ్చు. గతంలో మావోయిస్టులే పోలీసులపై దాడులకు తెగబడ్డారు.

✦ 1993లో లోతట్టు ప్రాంతంలో కూంబింగ్ కోసం ఒక మినీ వ్యాన్‌లో వెళ్తున్న పోలీసులపై బొడ్డగండి వద్ద మావోయిస్టులు మందుపాతర పేల్చి దాడి చేశారు. దీంతో అప్పటి మారేడుమిల్లి ఎస్సై రవికిశోర్‌తోపాటు మరో ఆరుగురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణనష్టం సంభవించలేదు.

✦ 2002లో మారేడుమిల్లి మండలం వేజువాడ వద్ద ఆర్టీసీ బస్సును అపహరించి, పోలీస్‌స్టేషన్‌పై దాడికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో [illegible] ప్రాంతానికి తీసుకుపోయారు. బస్సు ఆచూకీ కనిపెట్టడం కోసం అధికారుల నుంచి మారేడుమిల్లికి సీఆర్‌పీఎఫ్ దళాలు వ్యానులో వస్తుండగా మారేడుమిల్లి- రంపచోడవరం ప్రధాన రహదారిపై మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఆరుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు దుర్మరణం పాలయ్యారు.

✦ ఆ తర్వాత లోతట్టు ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నా పెద్దగా నష్టం జరగలేదు.

రంపచోడవరం ఆసుపత్రి శవాగారం వద్ద కాపలా కాస్తున్న సాయుధ బలగాలు

ఐదుసార్లు పేలిన తూటాలు.. 11 మంది మృతి

ఏఓబీని షెల్టర్ జోన్‌గా తిరిగి వాడుకోవడానికి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించిందన్న సమాచారంతో జిల్లాలో పోలీసులు ఏప్రిల్ నుంచి గాలింపు చర్యలను ఉద్ధృతం చేశారు. మావోయిస్టుల జాడకోసం పోలీసు అడవులను జల్లెడ పడుతున్నారు. వరస ఎన్‌కౌంటర్లతో వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఈ ఏడాది ఇంతవరకు జిల్లాలో ఐదుసార్లు ఎదురుకాల్పుల ఘటనలు జరిగాయి. వీటిలో 11 మంది మావోయిస్టులు మృతి చెందారు.

అవన్నీ కనుమరుగు: ఏఓబీలో కలిమెల, నారాయణపట్నం, నందాపూర్, కాఫదళం, గాలికొండ, పెదబయలు, గుమ్మ, బోయిపరిగూడ పేర్లతో సుమారు 8కి పైగా ప్రాంతీయ కమిటీలుండేవి. ప్రస్తుతం ఇవి దాదాపుగా కనుమరుగయ్యాయి. ముఖ్య నాయకుల అరెస్టులు, లొంగుబాట్లు, ఎదురు కాల్పులు పార్టీపై తీవ్ర ప్రభావం చూపాయి.

వివరాలు వెల్లడిస్తున్న ఇంటెలిజెన్స్ అదనపు డీజీ మహేశ్‌చంద్ర లడ్హా, చిత్రంలో ఎస్పీ అమిత్

ఏప్రిల్‌లో

▌కొయ్యూరు మండలంలో ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ రెండు ఘటనల్లో మావోయిస్టులు తప్పించుకున్నప్పటికీ వారికి చెందిన కీలక సమాచారాన్ని పోలీసులు సేకరించారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలతో గాలింపు చర్యలను కొనసాగిస్తూ వచ్చారు.

మే 7న

▌వై.రామవరం మండలం శేషారం అటవీప్రాంతంలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు సీనియర్ నేత కాకూరి పండన్న అలియాస్ జగన్‌తోపాటు డీసీఎం రమేష్ మృతి చెందారు. ఈ ఘటనలో అరుణ, గాజర్ల రవి అలియాస్ ఉదయ్ తప్పించుకున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం లభించింది. పెరిగిన సాంకేతికతను వినియోగించుకుని వారి కదలికలపై దృష్టి పెట్టారు.

జూన్ 18న

▌జిల్లాలోని రంపచోడవరం-మారేడుమిల్లి అటవీప్రాంతాల సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఏఓబీ ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యురాలు అరుణతోబాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఏసీఎం అంజూ మృతి చెందారు.

నవంబరు 18న

▌ఈ ఘటన మరవక ముందే కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా తన బృందంతో జిల్లాలో ప్రవేశించారని నిఘావర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో కూంబింగ్ విస్తృతం చేశారు. తరవాత హిడ్మా ఛత్తీస్‌గఢ్ వెళ్లిపోయారనే సమాచారం రావడంతో గాలింపు చర్యలకు విరామమిచ్చారు. ఆరునెలల తరవాత మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో హిడ్మా మృతి చెందారు.

సల్వాజుడుంతో హిడ్మా హిట్

చింతూరు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో కొన్నేళ్ల క్రితం మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతియాత్ర పేరుతో సల్వాజుడుంను ఏర్పాటు చేసిన నేపథ్యంలో మావోయిస్టులు ఏపీని షెల్టర్ జోన్‌గా చేసుకుని కార్యకలాపాలను ముమ్మరం చేశారు. దీంతో దండకారణ్యంలో మకాం వేసిన మావోయిస్టులు కొత్త వ్యూహాన్ని పన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాలకు రక్షణగా ఉన్న దళాలపై ప్రత్యేక వ్యూహాలు రచించారు. ఈ క్రమంలో దాడులకు పాల్పడటంతో వందలాది మంది జవాన్లు, గ్రామీణులు మృత్యువాత పడ్డారు. ఈ సమయంలోనే హిడ్మా మావోయిస్టుల్లో చేరి ప్రధాన పాత్ర పోషించాడు. అనతి కాలంలోనే పార్టీలో కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగాడు.

★ హిడ్మా నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రాలోని ఖమ్మం జిల్లాలో మావోయిస్టు కమిటీలు ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లో ముమ్మరంగా కార్యకలాపాలను నిర్వహిస్తూ తీవ్ర అలజడి సృష్టించేవి. శబరి ఏరియా, గోదావరిలోయ కమిటీలు చింతూరు డివిజన్‌లో చురుగ్గా ఉండేవి.

★ వీరికి అడ్డుకట్ట వేయడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కావడంతో మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి.

తాడు తెగితే... ప్రమాదం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఆంధ్రా - ఒడిశా రాష్ట్రాల సరిహద్దున ఉన్న జోలాపుట్టు జలాశయం పరిధిలో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డ పరివాహక గ్రామాల గిరిజనులు ప్రమాదమని తెలిసినా పడవ ప్రయాణాలు సాగిస్తున్నారు. సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామ సమీపంలో తాడు ఆధారంగా పడవపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల గిరిజనులు మండల కేంద్రం ముంచంగిపుట్టు వచ్చేందుకు నిత్యం పడవ ప్రయాణాలు సాగిస్తుంటారు. వారపుసంత రోజుల్లో పరిమితికి మించి రైతులు, మహిళలు పడవపై రాకపోకలు చేస్తుంటారు. కుమ్మరిపుట్టు సమీపంలో కాలిబాట వంతెన నిర్మించాలని పాడేరు ఐటీడీఏ అధికారులు నాలుగేళ్ల క్రితం హామీ ఇచ్చినా.. కార్యరూపం దాల్చలేదు. మత్స్యగెడ్డ ఒక ఒడ్డున చెట్టుకు తాడు కట్టి రెండో ఒడ్డున మరో చెట్టుకు తాడును కట్టి ఆ తాడు ఆధారంగా పడవను నడుపుతున్నారు. తాడు తెగితే పడవ నీట మునిగే ప్రమాదం పొంచి ఉంది. మొంథా తుపాను సమయంలో తాడుతెగి, పడవ అదుపు తప్పింది. అయితే పడవను నడిపే గిరిజన మత్స్యకారులు చాకచక్యంగా వ్యవహరించి ఒడ్డుకు చేర్చారు. తాడు ఆధారంగా నడిపే పడవ శిథిలమై, రంధ్రాలు ఏర్పడి గెడ్డనీరు లోపలికి చేరుతోంది. ఒకవైపు నీటిని తోడుకుని, తాడును పట్టుకుని ఒడ్డుకు చేరుతున్నారు. కాలిబాట వంతెన నిర్మించాలని, ప్రభుత్వం కొత్త పడవలను అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

కుమ్మరిపుట్టు వద్ద తాడు ఆధారంగా నడుపుతున్న పడవ

400 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన ఏడాదిలో జిల్లా ఆసుపత్రిలో సీటీస్కాన్‌ను అందుబాటులోకి తెచ్చాం. డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో 200 పడకలుగా ఉన్న ఈ ఆసుపత్రిని 400 పడకలుగా మారుస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సదరం శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అర్జీదారులతో మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు అందించేలా చొరవ చూపుతున్నామని తెలిపారు. జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, నక్కపల్లి ఆసుపత్రుల్లో సదరం శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులను గుర్తించి వీరందరికీ పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

బొడ్డెంగుల విందు.. మన్యంలో పసందు



సేకరించిన బొడ్డెంగులు

మన్యం రొయ్యగా పేరొందిన 'బొడ్డెంగులు' సీజన్ వచ్చేసింది. ఈత చెట్ల దుబ్బుల అడుగు భాగంలో ఏటా శీతాకాలంలో లభ్యమవుతాయి. గిరిజన ప్రాంతంలో లభించే బొడ్డెంగులు తెల్లని పురుగు ఆకారంలో ఉంటాయి. దశాబ్దాలుగా ఆదివాసీలు వీటిని ఆహారంగా తీసుకుంటున్నారు. అటవీ ప్రాంతంలో ఈ నెలాఖరు నుంచి బొడ్డెంగుల సేకరణకు వెళ్తారు. జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో అధికంగా లభ్యమవుతాయి. నాలుగు బొడ్డెంగులను ఒక పుంజు అంటారు. పది పుంజుల ధర రూ.వందకు పైగా ఉంటుంది.

– న్యూస్‌టుడే, పాడేరు పట్టణం

ఈ-నారిది కొత్త దారి

పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు

రాజవొమ్మంగి, నర్సీపట్నం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం వ్యవస్థల్లో మార్పులకు శ్రీకారం చుట్టి వడివడిగా అడుగులు వేస్తోంది. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందులో భాగంగా పలు పథకాలను అమలు చేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఇతర రుణాలు అందజేసి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూత అందిస్తోంది. ఇటీవల ఈ-నారీ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. గ్రామాల్లో నివసించే మహిళల జీవనోపాధికి దోహదపడుతుంది. వెలుగు సిబ్బంది సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ-నారీలను ఎంపికచేయడంలో నిమగ్నమయ్యారు. ఎంపికైన మహిళలకు బ్యాంకింగ్, రికార్డుల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత వారు సంఘాల నిర్వహణ పక్కాగా ఉండేలా పర్యవేక్షిస్తారు.

పది సంఘాలకు ఒకరు..

» గ్రామాల్లో వెలుగు సంఘాలను ఇప్పటివరకు సీసీ, వీవోఏలు పర్యవేక్షించారు. ఇకపై ఈ-నారీగా ఎంపికైన వారు ఆ బాధ్యతలు చూస్తారు.

» పది సంఘాలకు ఒకరిని ఎంపిక చేసి గౌరవ వేతనం ఇవ్వనున్నారు. ఎంపికైన మహిళ తన పరిధిలోని పరిధిలోని పది సంఘాల బాధ్యతలు నిర్వర్తిస్తారు.

» సభ్యులు పొదుపు చేసేలా.. రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించడం, రికార్డులు నిర్వహించడం వంటి కార్యకలాపాలు చేపడతారు. ఈ-నారీగా ఎంపిక కావాలంటే పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి.

శిక్షణ పూర్తి చేసుకున్న నర్సీపట్నం ఈ -నారీలు

▶▶ **సమర్థంగా సంఘాల నిర్వహణ:** గ్రామైక్య సంఘాల నిర్వహణకు ఈ-నారీ వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. సంఘాలను సక్రమంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం.

– పి.కనకారావు, డీపీఎం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

అల్లూరి జిల్లాలో..

మండలాలు	22
పొదుపు సంఘాలు	22,275
గ్రామైక్య సంఘాలు	1,107
సభ్యులు	2,06,195
ఈ-నారీ లక్ష్యం	2,300

యాప్‌లో సమగ్ర సమాచారం

★ సభ్యుల పొదుపు నిల్వలు, ఖర్చులు తదితర సమాచారమంతా త్వరలోనే యాప్‌లో అందరికీ అందుబాటులోకి రానుంది. వీటిపై పొదుపు మహిళలకు ఈ-నారీలుగా ఎంపికైన వారు అవగాహన కల్పిస్తారు. – రమణకుమారి, ఏపీఎం

మూడు సెంట్లలో ఇంటి నిర్మాణం

లేఅవుట్ల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు, న్యూస్‌టుడే: కొత్తగా గృహాల మంజూరు కోరుతూ వచ్చే దరఖాస్తులను దృష్టిలో ఉంచుకుని లేఅవుట్లను సిద్ధం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జీవో నం.23 ప్రకారం మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి వీలుగా స్థలాలకు మార్కింగ్ ఇవ్వాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, ఆర్ఓఎఫ్ఆర్, మ్యుటేషన్లకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఆధార్ నంబర్లను సరిచేసి వెంటనే అనుమతి వచ్చేలా మండల వ్యవసాయ అధికారుల లాగిన్‌కు పంపాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య భూతగాదాలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలను సివిల్ కోర్టుకు పంపాలన్నారు. రేషను దుకాణాలను తనిఖీ చేయడంతోపాటు సరకుల పంపిణీ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

★ పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని, చనిపోయిన వారి పేర్లను కార్డుల నుంచి తొలగించడంతోపాటు, అర్హులుంటే కొత్త కార్డులు మంజూరు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేసేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. యాప్‌లో ఓటర్లను పోలింగ్ కేంద్రంతో మ్యాపింగ్ చేయాలని బూత్‌స్థాయి అధికారులను ఆదేశించారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు శ్రీపూజ, స్మరణ్‌రాజ్, శుభమ్ నొఖ్వాల్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మలత, పాడేరు ఇన్‌ఛార్జి ఆర్డీవో లోకేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

జి.మాడుగులలో 7.4 డిగ్రీల నమోదు

చింతపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో శీతల వాతావరణం కొనసాగుతోంది. కొద్దిరోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జి.మాడుగులలో మంగళవారం అత్యల్పంగా 7.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి చెప్పారు. అరకులోయలో 7.6, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడలో 8.7, పాడేరులో 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు.

మంచు ముసుగులో చింతపల్లి

కాలం చెల్లిన సరకులతో వంట

▌రాజేంద్రపాలెం ఆశ్రమ సిబ్బందిపై పీఓ ఆగ్రహం

▌డిప్యూటీ మేట్రిన్ సస్పెన్షన్, హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల డిప్యూటీ మేట్రిన్ జ్యోతిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌కు షోకాజ్‌కు జారీ చేశారు. మూడు రోజుల్లో పాఠశాలలోని 54 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించిన పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల వారీ విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడారు. మెనూ అమలుపై ఆరా తీశారు. వంట, సరకుల నిల్వ గదులు పరిశీలించారు. పాడైన ఉల్లిపాయలు ఉండటం, ఉప్పు, కారం ప్యాకెట్లు ఈనెల 25తో కాలం చెల్లినవి ఉండటంపై ఆమె హెచ్‌ఎం, మేట్రిన్‌లపై మండిపడ్డారు. తాగునీటి ట్యాంక్ ఎప్పుడు క్లోరినేషన్ చేయించారని పంచాయతీ కార్యదర్శి మౌనిక కమలను పీఓ ప్రశ్నించారు. కార్యదర్శి సమాధానం చెప్పలేక నీళ్లనమిలారు. వసతి గృహాల్లోని ట్యాంకులను క్లోరినేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు గత నెలలోనే తెలియజేశామని సహాయ గిరిజన సంక్షేమాధికారి క్రాంతికుమార్ తెలిపారు.

హెచ్‌ఎం గోపాల్, డిప్యూటీ మేట్రిన్ జ్యోతిలను ప్రశ్నిస్తున్న ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ

● అంతకుముందు కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించిన పీఓ ఆవరణలోనే మురుగు గుంత ఉండటం గమనించి ప్రత్యేకాధికారి పరిమళపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతపై మూత ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. దీని వల్ల విద్యార్థినులు చాలా ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీపీ జి.సత్యనారాయణ తెలిపారు. పాఠశాలకు ఆవలవైపు ప్రభుత్వ భూమి ఏమైనా ఉందేమో పరిశీలించాలని తహసీల్దార్ ప్రసాద్‌ని పీఓ ఆదేశించారు. వెంటనే మురుగు గుంతపై మూత వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారిని పీవో ఆదేశించారు.

అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వైద్యులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తినాయక్ హెచ్చరించారు. శిశు మరణాలు సంభవించిన దారెల పంచాయతీ చిపుకుచింత, కుమ్మరిపుట్టు, తలింబా గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఇటీవల మృతిచెందిన శిశువుల తల్లిదండ్రులతో మాట్లాడి విచారణ జరిపారు. శిశువుల మరణాలకు కారణాలను ప్రత్యేక వైద్యబృందం ద్వారా సేకరించామని, పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ వార్డులను, ప్రసూతి గదిని పరిశీలించారు.

కుమ్మరిపుట్టులో బాలింత ఆరోగ్యస్థితిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

డొక్రిపుట్టులో మరో శిశు మరణం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల పంచాయతీలోని డొక్రిపుట్టు గ్రామంలో మరో శిశువు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన పాంగి బలరామ్ అనే గిరిజనుడి మూడు నెలల బాబు సోమవారం మృతి చెందారని చెప్పారు. దారెల పంచాయతీలో వరుసగా ఆరుగురు శిశువులు మృత్యువాత పడటంతో గ్రామంలో ఏడాది లోపు వయస్సు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లల వైద్య నిపుణుల పర్యవేక్షణలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు.

(c) eenadu

నషా ముక్త భారత్‌కు కృషి: కలెక్టర్

పాడేరు, న్యూస్‌టుడే: ఒక్కసారే కదా అంటూ మొదలయ్యే మత్తు అలవాటు క్రమంగా యువత జీవితాన్ని అంధకారం చేస్తోందని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా ఆసుపత్రిలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా ఆసుపత్రి నుంచి పాతబస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యసనాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. మత్తు పదార్థాల వినియోగాన్ని సమూలంగా అరికట్టడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ హేమలత దేవి మాట్లాడుతూ ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం సమాజానికి ఎంతో కీడు చేస్తుందన్నారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఇతర విభాగ అధిపతులు, వైద్యులు నర్సింగరావు, ఎర్రయ్య, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్.. చిత్రంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ హేమలతదేవి, డీఎంహెచ్‌ఓ కృష్ణమూర్తి నాయక్

యువత పాత్ర కీలకం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: నషాముక్త్ భారత్ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్ అన్నారు. జాతీయ సేవాపథకం, కళాశాల ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. కళాశాల నుంచి రవ్వలగుడ వరకు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు విజయలక్ష్మి, అనితకుమారి, అధ్యాపక సిబ్బంది, ఈగల్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం చేసుకోవద్దు: సీఐ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని అరకులోయ సీఐ హిమగిరి సూచించారు. అనంతగిరిలోని బాలికల పాఠశాల-1లో మంగళవారం మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, తద్వారా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులు సెలవుల సమయంలో గ్రామాలకు వెళ్లినప్పుడు చదువు సంస్కారంతో పాటు సామాజిక స్పృహ కలిగి, సన్మార్గం కలిగి నడుచుకోవాలని, మంచి విషయాలను అందరికీ తెలియజేయాలని మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు తరిమికొట్టడంలో ప్రతి ఒక్కరు బాగస్వామి కావాలని తెలిపారు. సైబర్ క్రైమ్, వ్యక్తిగత సమాచారం విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏఎస్ఐ రాజానాయుడు, ట్రైనీ ఆర్ఎస్ఐ లోకేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ హిమగిరి అన్నారు. కొత్త భల్లుగుడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో సైబర్ నేరాల్లో అప్రమత్తతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పటం, అనవసర లింక్‌లను తెరవడం చేయరాదన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పకూడదన్నారు. విద్యార్థులు అవగాహన పొందటంతోపాటు గ్రామాలకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులను సైతం వీటిపై చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తభల్లుగుడ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

చింతపల్లి డిగ్రీ కళాశాలలో...

చింతపల్లి గ్రామీణం, ఎటపాక, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ ఆర్ ఎస్సై శ్రీరామమూర్తి సూచించారు. చింతపల్లి డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో గోడపత్రికలు ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ విజయభారతి, హెడ్ కానిస్టేబుల్ ఎలీషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✦ ఎటపాక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో శక్తి యాప్ వినియోగం, మాదక ద్రవ్యాల అనర్థాలపై సీఐ కన్నపరాజు అవగాహన కల్పించారు. ఎస్సై అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత పాఠశాలల్లో వసతులు కల్పిస్తాం

వై.రామవరం, గంగవరం, న్యూస్‌టుడే: భవిత పాఠశాలల్లో ప్రత్యేక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సెంట్రల్ కమిషన్ టీం డిప్యూటీ సెక్రటరీ జష్‌బీర్‌సింగ్ చెప్పారు. మారేడుమిల్లి, వై.రామవరం, గంగవరం మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. భవిత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలు, పునరావాస కార్యక్రమాలపై ఆరా తీశారు. యూఐడీ నంబరు ఉన్న విద్యార్థులు ప్రతి నెలా రూ.అయిదు వేలు పొందవచ్చన్నారు. పలువురు అధికారులు వెంట ఉన్నారు.

డిప్యూటీ కార్యదర్శికి ఆహ్వానం పలుకుతున్న ఎంపీడీవో బాపన్నదొర, అధికారులు

కాఫీ తోటల మీదుగా రహదారి నిర్మించొద్దు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కాఫీ తోటల మీదుగా రహదారి నిర్మించి జీవనోపాధి దూరం చేయవద్దని లంబసింగి కూడలి ఆదివాసీ మహిళా రైతులు విజ్ఞప్తి చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని వారంతా మంగళవారం వివరించారు. లంబసింగిలో నివాసం ఉంటున్న బొల్లల లక్ష్మి, పిట్ట రత్నకుమారి, కాకరి దేవి, చింత లక్ష్మి, చుక్కా సింహాచలంకు అర ఎకరం నుంచి 1.5 ఎకరాల భూమి తాతల నుంచి వారసత్వంగా వచ్చింది. ఈ భూముల్లో మహిళా రైతులు 50 ఏళ్లుగా కాఫీ తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు మహిళా రైతులకు చెందిన సుమారు వెయ్యి కాఫీ మొక్కలను రాత్రికి రాత్రి తొలగించారు. దీనిపై బాధితులు చింతపల్లి తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయం జరగకపోవడంతో ఆగస్టులో పాడేరు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదన్నారు. ప్రస్తుతం కాఫీ తోటల మీదుగా జలగంగెడ్డ గ్రామానికి రహదారి నిర్మించేందుకు అధికారులు యత్నిస్తున్నారన్నారు. జలగంగెడ్డకు మరోవైపు కాలిబాట ఉందని, ఆ మార్గంలో రోడ్డు నిర్మిస్తే ఎవరికీ నష్టం ఉండదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పాసు పుస్తకాలు చూపుతున్న గిరి మహిళలు

ఘాట్‌రోడ్డులో రాకపోకలకు అంతరాయం

చింతూరు: చింతూరు - మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో లారీ నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చింతూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లోడు లారీ సాంకేతిక సమస్య తలెత్తి అడ్డంగా నిలిచిపోయింది.

ఉక్కు బ్లాస్ట్ ఫర్నేస్‌లో తెగిపోయిన కన్వేయర్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారంలోని బ్లాస్ట్ ఫర్నేస్-3కి ముడిసరుకు సరఫరా చేసే కన్వేయర్ మంగళవారం తెగిపోయింది. దీంతో సుమారు మూడు రోజులపాటు ఆ ఫర్నేస్‌లో ఉత్పత్తి నిలిచిపోనుంది. కర్మాగారంలో నిర్వహణ, క్లీనింగ్, పర్యవేక్షక సిబ్బంది లేకపోవడంతో ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ అన్నారు. దీని ప్రభావం ఎస్ఎంఎస్, కోకోవెన్, సింటర్ ప్లాంటు వంటి విభాగాలపై పడనుందన్నారు.

తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే..

అడ్డతీగల, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం.మురళీగంగాధర్‌రావు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో వృద్ధుల హక్కులు, పిల్లల బాధ్యతలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు పట్టించుకోకుండా, వృద్ధాశ్రమాల్లో ఉంచడం చట్టరీత్యా నేరమన్నారు. న్యాయవాదులు రమణ, శ్రీధర్, గౌరీశంకర్, శ్రీనివాసరావు, గంగాధర్ పాల్గొన్నారు.

అడ్డతీగలలో మాట్లాడుతున్న న్యాయమూర్తి మురళీ గంగాధర్‌రావు

పర్యవేక్షణ లేకే శిశుమరణాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల పంచాయతీ కుమ్మరిపుట్టు, తలిబా, చిడుబండ, డొక్కిపుట్టు గ్రామాల్లో సంభవించిన శిశుమరణాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర డిమాండు చేశారు. కుమ్మరిపుట్టు గ్రామాన్ని మంగళవారం సందర్శించి, అక్కడ శిశువులను కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మరణాలపై ఆరాతీశారు. వైద్యారోగ్యశాఖ అధికారులు ముందస్తుగా అప్రమత్తమై వైద్య సేవలు అందించి ఉంటే మరణాలు సంభవించేవి కావని సుభద్ర అన్నారు. గ్రామాల్లో శుభ్రత కోసం బ్లీచింగ్ పౌడర్ కూడా ఇవ్వడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైకాపా నాయకులు జగబంధు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

✦ బంగారుమెట్ట గ్రామంలోని బాలికల, కిలగాడలోని బాలుర ఆశ్రమ పాఠశాలలను ఎమ్మెల్యే మత్స్యలింగం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బంగారుమెట్ట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయటం లేదన్నారు.

కుమ్మరిపుట్టులో బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

ముఖ్యమంత్రి దృష్టికి నిర్వాసితుల సమస్యలు: ఎమ్మెల్యే

దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శిరీషాదేవి హామీ ఇచ్చారు. ఇందుకూరుపేటలో దేవీపట్నం మండల అధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సహకార సంఘం అధ్యక్షుడు బాబూరావు, సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముంపు గ్రామాల్లో నిర్వాసితుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి విన్నవించేందుకు పంచాయతీకి ఇద్దరు చొప్పున అమరావతి తీసుకువెళ్తానన్నారు. ఎస్టీ కమిషన్ డైరెక్టర్ సునీత, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మణరావు, కూటమి నాయకులు పెద్దిరాజు, సుబానీ, రాంబాబు, రాయుడు, రమణారెడ్డి, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

అమ్మవారి దర్శన వేళల్లో మార్పులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శన వేళల్లో మార్పులు చేసినట్టు ఈఓ కె.శోభారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ★ ఈనెల 27, డిసెంబరు 4, 11 తేదీల్లో.. తెల్లవారుజాము 2.30 గంటల నుంచి ఉదయం 11 వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 వరకు, సాయంత్రం 7 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్మవారిని దర్శించుకోవచ్చు. ★ డిసెంబరు 18న తెల్లవారుజాము 2.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు, సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు దర్శనాలు ఉంటాయి. ★ మిగిలిన రోజుల్లో ఉదయం 6 నుంచి 8 వరకు, 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 12.45 నుంచి సాయంత్రం 5.30 వరకు, రాత్రి 7 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు దర్శనాలు ఉంటాయి. ★ ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు అష్టాదళ పాదపద్మారాధన, సహస్ర తులసి పూజ, ఆయుష్‌హోమం, లక్ష కుంకుమ, లక్ష పసుపు కొమ్ముల పూజలు నిలిపేస్తున్నట్టు తెలిపారు.

నేడు అనంతుని దీపోత్సవం

పద్మనాభం: పద్మనాభం క్షేత్రంలో ఉన్న అనంత పద్మనాభ స్వామివారి కొండమెట్ల దీపోత్సవం బుధవారం జరగనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నేతృత్వంలో ఈనెల 5న నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, విద్యుత్, మండల పరిషత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత స్వామివారి ఉత్సవమూర్తులను తొలిపావంచా వద్దకు తోడ్కొని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం అయిదు గంటలకు తొలి పావంచా వద్ద దీపాలు వెలిగించడంతో దీపోత్సవం ప్రారంభమవుతుంది.

యువతకు పిలుపు... అదిగో గెలుపు!

సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ

ఈనాడు, విశాఖపట్నం: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసు ప్రిలిమినరీ పరీక్ష-2026కు డా.బీఆర్ అండేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు చేసిన వారికి ముందుగా పరీక్ష నిర్వహించి వంద మందిని ఎంపిక చేయనున్నారు. స్టడీ మెటీరియల్ అందజేస్తారు.

శిక్షణ సబ్జెక్టులు ★ జనరల్ స్టడీస్ పేపర్-1 ★ సీఎస్‌ఏటీ పేపర్-2

అర్హతలు ఇవి : జిల్లాకు కేటాయించిన సీట్లు : 100(ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ, జనరల్ కోటా ప్రకారం తీసుకుంటారు) ★ గిరిజన శాఖ ద్వారా 20 సీట్లు ప్రత్యేకంగా ఎస్టీలకు కేటాయిస్తారు. ★ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ★ కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

★ ఈ నెల 13 నుంచి 26 మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ★ ఈ నెల 27 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ★ 30.11.25న విశాఖలో ఓఎంఆర్ బేస్డ్ స్క్రీనింగ్ పరీక్ష ఉండనుంది. ★ డిసెంబరు 10 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తారు.

దరఖాస్తు ఇలా: apstudycircle.apcfss.inలో తగిన ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని కె.పి.అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.ఉమామహేశ్వరరావు సస్పెండ్ అయ్యారు. మూడురోజుల కిందట చోడవరంలో ఆయన భార్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఈ కేసులో ఉమామహేశ్వరరావును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావునాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు.

25 నుంచి అంచనాల కమిటీ పర్యటన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ 25 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. కమిటీ సభ్యులు 25వ తేదీ రాత్రి విశాఖ చేరుకుని, ప్రభుత్వ బంగ్లాలో బస చేస్తారు. 26న విశాఖ, 27న విజయనగరం, 28న శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి, 28వ తేదీ రాత్రి తిరుగుపయనమవుతారు. కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు, సభ్యులుగా భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, పార్థసారథి తదితరులు ఉన్నారు.

కోలుకుంటున్న ఆశ్రమ విద్యార్థినులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులు క్రమేపీ కోలుకుంటున్నారు. మూడు రోజుల్లో ఈ పాఠశాలలోని మొత్తం 54 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఆదివారం ఆరుగురు, సోమవారం 12 మంది, మంగళవారం రాత్రి 25 మందిని డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం రాజేంద్రపాలెంలో ఎనిమిది మంది మాత్రమే చికిత్స పొందుతున్నారు. ఇద్దరు కేజీహెచ్, ఒకరు నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే.

ఆశీళ్ల వసూలుకు ఆశీస్సులు ఎవరివో?

జీవీఎంసీ ఆదాయానికి గండి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: టెండరులో లేని కాలానికి కూడా గుత్తేదారు రోడ్డు మార్జిన్ ఆశీళ్లు వసూలు చేస్తుండగా.. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్న వైనం జోన్-6 పరిధిలో చర్చనీయాంశమవుతోంది.

ఏం జరిగిందంటే: 2025-26 ఆర్థిక సంవత్సరానికి శ్రీ వెంకట గోవింద సత్య ఇంజినీరింగ్ సంస్థ గాజువాక రోడ్డు మార్జిన్ల ఆశీళ్ల వసూలుకు 9 నెలల కాలానికిగాను రూ. 1,35,75,000లకు టెండరు దక్కించుకుంది. జీఎస్టీ, సెస్సు కలిపి రూ.1,64,41,875 జీవీఎంసీకి చెల్లించాలి.

ఏం చేశారంటే: రూ.45లక్షలు మాత్రం చెల్లించారు. దీనికి తోడు ఆశీలు పాట మొత్తంలో 3/4వంతు బ్యాంకు గ్యారంటీ సమర్పించడంతో పాటు అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ నిమిత్తం బిడ్ మొత్తంపై 2 శాతం అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉండగా.. ఈ నిబంధన పాటించకుండానే ఆశీళ్ల వసూళ్లు మొదలైపోయాయి.

చేతులెత్తేసిన అధికారులు: జీవీఎంసీ అక్టోబరు 15 నుంచి నవంబరు 5 వరకు మాత్రం ఆశీలు వసూలు చేసి తర్వాత చేతులెత్తేసింది. మళ్లీ పాత గుత్తేదారే రంగంలోకి దిగి వసూళ్లపర్వం కొనసాగించారు.

★ టెండరు కాలంలో లేని సుమారు 4 నెలలు గుత్తేదారు అనధికారికంగా ఆశీలు వసూలు చేసి జీవీఎంసీ ఆదాయానికి గండికొట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నోటీసులిచ్చినా..: గుత్తేదారు నిబంధనలు పాటించని విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన జీవీఎంసీ రెవెన్యూ అధికారులు 30-08-25న నోటీసు జారీచేశారు. ఇవి అందిన 3 రోజుల్లో నిబంధన ప్రక్రియ పూర్తి చేయకపోతే టెండరు రద్దవుతుందన్నారు. అంటే సెప్టెంబరు 2తో టెండరు రద్దు కావాలి. అప్పటి నుంచి గుత్తేదారు సంస్థ చేస్తున్న ఆశీళ్ల వసూళ్లు ఆగిపోవాలి. కానీ అది జరగలేదు.

వేలం పాటలు ఆగిపోతున్నాయ్: కొత్త గుత్తేదార్ల కోసం గతనెల 17, 22, ఈ నెల 12 తేదీల్లో జరగాల్సిన టెండరు ప్రక్రియ వాయిదా పడగా.. మళ్లీ ఈనెల 18కి ముహూర్తం నిర్ణయించారు. అది కూడా జరుగుతుందా? అనేది సందేహం లేకపోలేదు. ఈ టెండరు తేదీలు ఎందుకు వాయిదా పడుతున్నాయనే ప్రశ్నలు తలెత్తున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' ఆర్వో రామ్‌నారాయణ వివరణ కోరగా.. ఇవన్నీ సూపరింటెండెంట్, గుమస్తాలే చూసుకుంటారన్నారు. ★ గుమస్తా వద్ద టెండరు రద్దు విషయం ప్రస్తావించగా.. పై నుంచి ఆర్డరు తెచ్చుకున్నారన్నారు. ఆర్డరు ఎవరిచ్చారని ప్రశ్నించగా.. సమాధానం చెప్పలేక పోయారు.

అలలపై అలా... గాలిలో తేలేలా

సాగర్‌నగర్ తీరంలో పర్యాటకులకు ఎప్పటికప్పుడు సరికొత్త అనుభూతి కలిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా తీసుకొచ్చిన 'పారా మోటరింగ్' సందర్శకులను ఆకట్టుకుంటోంది. పచ్చని కొండల చెంతన... నీలి సాగర అలలపైన తేలియాడుతూ సందడి చేస్తున్నారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో 'అడ్వెంచర్ టూరిజం' సదుపాయాలు పెంచాలన్నది అధికారుల ప్రణాళిక. వాతావరణ పరిస్థితుల అనుకూలతనుబట్టి పారామోటరింగ్ నిర్వహిస్తున్నారు. -ఈనాడు, విశాఖపట్నం

ఐటీ ఉద్యోగాల పేరిట మోసం

నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు

విశాఖపట్నం: మధురవాడ ప్రాంతంలోని ఓ ఐటీ సంస్థ ఉద్యోగాలు ఇస్తామని తమను నమ్మించి లక్షల్లో నగదు వసూలు చేసి మోసగించిందని పలువురు యువకులు మంగళవారం పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన పి.సాయికుమార్, జి.రమేష్, కె.చైతన్య గతేడాది డిసెంబర్‌లో సామాజిక మాధ్యమ లింక్ ద్వారా మధురవాడ మిధిలాపురి వుడాకాలనీలో ఉన్న 'వారుష్‌టెక్నాలజీస్' సంస్థ ఐటీ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలుసుకున్నారు. వారిని సంప్రదించడంతో విశాఖతో పాటు హైదరాబాద్, బెంగళూరుల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. మొదట మూడు నెలల శిక్షణా కాలంగా పరిగణించి నెలకు రూ.15 వేలు వేతనంగా అందిస్తామన్నారు. ఆపై వార్షిక వేతనాల ప్యాకేజీని వివరిస్తూ వారు చెల్లించాల్సిన డిపాజిట్‌లను వివరించారు. ముగ్గురు కలిసి ఒక్కొక్కరు రూ.3 లక్షల వరకు సంస్థ ఇచ్చిన బ్యాంకు ఖాతాలకు పంపించారు. ఈ ఏడాది జనవరి నుంచి వర్క్ ఫ్రంహోమ్ పేరుతో విధులు చేయించారు. ఒక్క నెల జీతం కూడా చెల్లించలేదన్నారు. అనుమానంతో కంపెనీకి వచ్చి సీఈఓ వి.సాయికుమార్‌ను కలిసి తాము కట్టిన డిపాజిట్ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంతకం తప్పుగా రాసి చెక్ అందించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సుమారు 135 మంది వరకు నిరుద్యోగులు ఈ సంస్థ బారిన పడినట్లు తెలుస్తోందన్నారు.

భార్య మృతి కేసులో భర్త అరెస్టు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న భార్య మృతి చెందిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ చంద్రశేఖరరావు మంగళవారం తెలిపారు. ఈనెల 15న పూడిమడకకు చెందిన పెద్ది చిన్ని (30) భర్త పోలయ్య ఇంటి వద్ద ఉన్న సమయంలోనే శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ ఈనెల 16న కేజీహెచ్‌లో మృతి చెందింది. మద్యానికి అలవాటు పడిన పోలయ్య తరచూ కొట్టడం, వేధించడం వల్లే చిన్ని చనిపోయిందని ఈమె సోదరి భూలోక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు భర్త పోలయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో తెదేపా నేత మృతి

హుకుంపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తెదేపా నాయకుడు మృతి చెందిన ఘటన హుకుంపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రంగశీలకు చెందిన తెదేపా నాయకులు **చొంపి అప్పలస్వామి** (50) హుకుంపేటలో నివాసం ఉంటున్నారు. ఆయన మంగళవారం సాయంత్రం హుకుంపేట నుంచి బైకుపై రంగశీల వెళ్తుండగా మార్గమధ్యలో టిటింగ్‌వలస గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ ఆగి ఉన్న టిప్పర్ లారీని ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో అప్పలస్వామి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులకు సైతం సమాచారం అందించారు. ఇతని మృతిపై కుటుంబ సభ్యులు, తెదేపా నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడు...

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెందాడని తుని రైల్వే ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎలమంచిలి - నర్సింగపల్లి స్టేషన్ల మధ్య రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు నుంచి 20 ఏళ్ల యువకుడు జారిపడ్డాడని చెప్పారు. మృతుని వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచామని తెలిపారు. వివరాలకు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

నిషా తలకెక్కి.. వేగంతో రోడ్డెక్కి!

ఈనాడు-విశాఖపట్నం: నగరంలో సరాసరిన రోజుకు ఒకరు చొప్పున రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు. మద్యం మత్తుతో అతివేగంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారే ఎక్కువగా ఉండటం కలవరపెడుతోంది. మద్యం తాగి స్పృహలేకుండా వాహనాలు నడిపి ఇతరులనూ ప్రమాదాల్లో పడేస్తున్నారు. వీరిని కట్టడిచేసేందుకు సాగాల్సిన తనిఖీలన్నీ నామమాత్రంగా జరుగుతున్నాయి.

మద్యం మత్తులో ప్రమాదాల బారిన

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	1353	358	1273
2023	1180	324	1224
2024	1094	335	1125
2025	1045	274	564
(అక్టోబర్ వరకు)			

నామమాత్రంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

మత్తే కారణం: ద్విచక్రవాహనాలు డివైడర్లకు తగిలి పడిపోయినా...ఎదురెదురుగా వాహనాలు ఢీకొట్టుకున్నా...ఆగిన వాహనాలను వెనుక నుంచి బలంగా ఢీకొట్టినా... పాదచారులపైకి దూసుకెళ్లినా... ఇలా చాలా ప్రమాదాల్లో మద్యం మత్తు కారణమని పోలీసులు గుర్తిస్తున్నారు. నగరంలో రాత్రిళ్లు చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో 50శాతంపైగా మద్యం మత్తులో జరుగుతున్నవే.

అలాగేనా.. తనిఖీలు?: నగరంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు పెరుగుతున్నా అవి మొక్కుబడిగా సాగుతున్నాయి. కొందరు సిబ్బందే మద్యం తాగి బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయడంపైనా ఫిర్యాదులందుతున్నాయి. ఇంకొందరు తనిఖీల్లో కాసులవేట సాగిస్తున్నారు. బార్లకు సమీప సర్వీసు రోడ్లల్లో తనిఖీల పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అక్కయ్యపాలెం సిగ్నల్ వద్ద రాత్రి సమయాల్లో కొందరు ట్రాఫిక్ పోలీసుల తీరు దారుణంగా ఉంది. తొలుత హెల్మెట్ తీయించి బ్రీత్ అనలైజర్ టెస్టులు చేయడం, మద్యం తాగలేదని తేలితే.. ఆ వెంటనే మరో కానిస్టేబుల్ హెల్మెట్ లేదంటూ ఫొటోలు తీసి హడావుడి చేస్తున్నారు. ఈ విషయంపైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.

మహిళా భద్రతకు సమష్టి కృషి

ఏయూ ప్రాంగణం: మహిళల భద్రత కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదని, వారి భద్రత కోసం అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ అన్నారు. 'సస్టెనింగ్ ఉమెన్ సేఫ్టీ-బెంచ్ మార్కింగ్ విశాఖపట్నం సక్సెస్ అండ్ ఫ్యూచర్ ప్రూఫింగ్ గవర్నెన్స్' అనే అంశంపై రాష్ట్ర మహిళా కమిషన్, ఏయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా ఏయూలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. మహిళా భద్రతపై జాతీయ స్థాయిలో నిర్వహించిన నారీ-2025 ఇండెక్స్‌లో జాతీయ స్థాయిలో విశాఖ నగరం ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విశాఖ నగరం మహిళా భద్రతకు ఎంతో సురక్షితమైన నగరంగా నిలవడం పట్ల ఆమె హర్షం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం విశాఖ ఎంతో 'సేఫ్ సిటీ' అని చెబుతుంటారని, ఈ నేపథ్యంలో మహిళల భద్రతకు ఇక్కడి విధానాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ విద్యతోనే ప్రతి మహిళకు పూర్తి స్థాయిలో భద్రత, భరోసా లభిస్తాయన్నారు. ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లేలా, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేలా చూడాల్సిన అవసరముందన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో మహిళల భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి కూడా మాట్లాడారు. ముందుగా వక్తలంతా దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతిథులను నిర్వాహకులు జ్ఞాపికలతో సత్కరించారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శైలజ, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, వీసీ రాజశేఖర్ తదితరులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

(c) eenadu

ఆధునికత దిశగా అన్నదాత అడుగులు

పెరుగుతున్న యంత్రాల వినియోగం

చింతపల్లి, న్యూస్‌టుడే: కాలంతోపాటు గిరిజన రైతులు ఆధునికత దిశగా అడుగులు వేస్తున్నారు. విత్తు మొదలు పంట చేతికొచ్చే వరకు పంటల సాగులో యంత్రాలు, యంత్ర పరికరాలను వినియోగిస్తున్నారు. మన్యంలో వ్యవసాయం పరస్పర సహకారంతో సాగేది. తద్వారా పెట్టుబడి ఖర్చులు పెద్దగా అయ్యేవి కావు. పశు సంపద తగ్గడంతో పొలాలను దుక్కి చేసేందుకు, విత్తు వేసేందుకు మినీ ట్రాక్టర్లు, డ్రమ్ సీడర్, కలుపుతీతకు కోనోవీడర్ వాడుతున్నారు. వరి కోతలు, నూర్పిడికి కూలీల సమస్య అధికంగా ఉండటంతో యంత్రాలను వినియోగిస్తున్నారు.

వరికోతలు కోస్తున్న గిరిరైతులు

రబీలో ఆరుతడి పంటగా వేరుసెనగ

చింతపల్లి, జి.మాడుగుల, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో తొలిసారిగా రబీలో ఆరుతడి పంటగా వేరుసెనగ సాగుకు శ్రీకారం చుడుతున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ తిరుమలరావు చెప్పారు. తాజంగిలో 90 శాతం రాయితీపై మంగళవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో రబీలో 500 ఎకరాల్లో వేరుసెనగ, 900 ఎకరాల్లో అపరాలు, ఒక్కో మండలంలో 350 ఎకరాల్లో పెసర, మినుము సాగయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విత్తనాలతోపాటు రైతులకు వేపనూనె అందజేశారు. సర్పంచి మహేశ్వరి, తాజంగి జలాశయ సంఘం అధ్యక్షుడు బోనంగి బాలయ్యపడాల్, చింతపల్లి, గూడెంకొత్తవీధి వ్యవసాయాధికారులు మధుసూదనరావు, గిరిబాబు, వీఏఏ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీ తిరుమలరావు, ఏఓ మధుసూదనరావు

ప్రకృతి వ్యవసాయంతో మేలు..: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి వరప్రసాద్ చెప్పారు. జి.మాడుగుల సచివాలయంలో వ్యవసాయ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రబీలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వరి కోతల అనంతరం వేరుశనగ, మినుము సాగు చేయాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేశారు. ఎంపీపీ అప్పలరాజు, సర్పంచులు రాంబాబు, రామకృష్ణ, తెదేపా నాయకుడు ప్రసాద్, రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్‌ఛార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమ్మెకు తెర

చింతపల్లి, న్యూస్‌టుడే: అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ)కు చెందిన కాఫీ తోటల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మె విరమించారు. సంస్థ ఎండీ, ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ హామీతో తాత్కాలికంగా విరమించినట్లు సీఐటీయూ అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ మంగళవారం చెప్పారు. పండ్ల సేకరణ, కూలీ ధరల పెంపుతోపాటు పలు అంశాలపై కార్మికుల తరఫున సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్ తదితరులు సోమవారం విజయవాడలో ఏపీఎఫ్‌డీసీ ఎండీని కలిశారు. స్పందించిన ఎండీ శ్రీధర్ న్యాయపరమైన సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల ప్రమాద బీమా, నివాస గృహాల మరమ్మతు, కూలీ ధరల పెంపుపై సానుకూలంగా స్పందించారు. సిబ్బంది నియామకంపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. ఆయన హామీతో కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించి విధుల్లో చేరారని చిన్నయ్యపడాల్ చెప్పారు. ఈ నెలాఖరులోగా చింతపల్లి వచ్చి కాఫీ కార్మికులు, సంఘాల నాయకులు, అధికారులతో మాట్లాడతానని ఎండీ చెప్పారన్నారు. 12 రోజుల నిరవధిక సమ్మెకు తెరదించడంతో మంగళవారం నుంచి కాఫీ కార్మికులు తోటల్లో పనులకు వెళ్లారన్నారు.

ఏపీఎఫ్‌డీసీ ఎండీ శ్రీధర్‌ను కలిసిన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, చిన్నయ్యపడాల్ తదితరులు

గుత్తేదార్ల సంఘ అధ్యక్షుడిగా ప్రభాకరరావు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు డివిజన్ మోదమాంబ గుత్తేదారుల సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. స్థానిక కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అయ్యప్పరెడ్డి, అధ్యక్షుడిగా ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా వీరబాబు, చైతన్య, కార్యదర్శులుగా నాగరాజు, రాజుబాబు, సంయుక్త కార్యదర్శులుగా చలపతి, రామారావు ఎన్నికయ్యారు.

క్షేత్ర సహాయకుల సంఘం అధ్యక్షుడిగా కామ్‌దేవ్

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఉపాధిహామీ క్షేత్ర సహాయకుల మండల శాఖ అధ్యక్షుడిగా కిల్లో కామ్‌దేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన కామ్‌దేవ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాటం సాగిస్తామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా రామన్న, కార్యదర్శిగా రాంబాబు, ఉప కార్యదర్శిగా సుందరరావు ఎన్నికయ్యారు.

గిరిజన ఉద్యోగుల సంఘ మండల కమిటీ ఎన్నిక

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం గూడెంకొత్తవీధి మండల కమిటీ అధ్యక్షుడిగా దొండ వెంకట కళ్యాణరావు, ప్రధాన కార్యదర్శిగా కొర్రా మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచల రామకృష్ణ, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సాగిన పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో రింతాడలో మంగళవారం ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా చెర్రెకి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా పాతూను రామరాజు, సంయుక్త కార్యదర్శిగా రెడ్డి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. సంఘ పూర్వ అధ్యక్షుడు వెంకటరమణ, కామేశ్వరరావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అంబలంపూజ

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా - ఒడిశా సరిహద్దులోని ఒనకడిల్లీలో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. ఒనకడిల్లీ పీఠానికి చెందిన బి.వెంకటరమణ, బి.గోపాలకృష్ణ గురుస్వాముల 18వ పడి సందర్భంగా ప్రత్యేక అంబలం పూజ ఏర్పాటుచేశారు. అయ్యప్ప దీక్షాదారులు మధ్యాహ్నం అయ్యప్ప విగ్రహంతో పేటతుల్లి ఆడారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన అంబలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు ప్రకాశం జిల్లా ముక్తినూతనపాడు నుంచి బాలు గజ్జల కొండతో ప్రత్యేక గానకచేరి ఏర్పాటుచేశారు. ఈ అంబలంపూజలో జోలాపుట్, విశాఖ, పెదబయలు, మల్కాన్‌గిరి, సిమిలిగుడ, మత్తిలి ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది స్వాములు పాల్గొన్నారు. ఒనకడిల్లీ పీఠం గురుస్వామి బి.రామారావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గంగవరంలో పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

గంగవరం, న్యూస్‌టుడే: పాత గంగవరం, కొత్త గంగవరం గ్రామాల్లో మంగళవారం రాత్రి అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. దీక్షాస్వాములు భక్తి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. గురుస్వాములు శేషాచార్యులు, వైఆర్‌కే ప్రసాద్, వీరాచార్యులు, ప్రభాకరరావు, భద్రరావు పర్యవేక్షించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

జి.మాడుగుల, న్యూస్‌టుడే: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. 98 మందికి పరీక్షలు చేసి వారిలో 24 మందికి శస్త్రచికిత్స, 34 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వైద్యులు కిషోర్, ఇందిర, లిఖిత సహాయకులు మౌనిక, హరిబాబు, సమన్వయకర్త భీమశంకర్, ఆరోగ్య విస్తరణాధికారి ప్రకాష్, హెచ్‌వీలు మేనక, రత్నం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటపాక, వీఆర్‌పురం, న్యూస్‌టుడే: భద్రాచలంకు చెందిన నేతాజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో పురుషోత్తపట్నంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. ఎంపీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. వంద మందికిపైగా మధుమేహ పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ గద్దం శ్రీనివాసరావు, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నర్సింహరెడ్డి పాల్గొన్నారు. వరరామచంద్రాపురం మండలం మొద్దులగూడెంలో వనవాసి కల్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో వైద్యులు శ్రీనివాసరావు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు.

జి.మాడుగులలో బాలుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు కిషోర్

రచనలతో సమాజంలో చైతన్యం

పాడేరు, న్యూస్‌టుడే: తన రచనలతో సమాజంలో చైతన్య జ్యోతిని వెలిగించిన మహోన్నత వ్యక్తి కనకదాసు అని కలెక్టర్ దినేష్‌కుమార్ కొనియాడారు. కవిగా, తత్వవేత్తగా, సామాజిక సంస్కర్తగా అందించిన సేవలను దేశం స్మరించుకుంటోందన్నారు. భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మంగళవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డీఎఫ్‌వోకు ఘనంగా వీడ్కోలు..: సేవా దృక్పథం ఉన్న వ్యక్తి డీఎఫ్‌వో పి.వి.సందీప్‌రెడ్డి అని కలెక్టర్ దినేష్‌కుమార్ కొనియాడారు. పాడేరు డివిజనల్ అటవీ అధికారిగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఆయనకు స్థానిక కాఫీ హౌస్‌లో మంగళవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటైంది.

సందీప్ రెడ్డిని సత్కరిస్తున్న విశాఖ సీఎఫ్ దివాన్ మేడిన్, రేంజర్ ప్రేమ తదితరులు

శివయ్యకు ప్రణమిల్లి..

రాజవొమ్మంగి, సీలేరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం త్రయోదశి సందర్భంగా శైవక్షేత్రాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. రాజవొమ్మంగిలో రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, జడ్డంగిలో స్వయంభూ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి, అబ్బులకోటలో మల్లేశ్వర సమేత దారాలమల్లిఖార్జున స్వామి, లబ్బర్తి, వాతంగి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. సీలేరు శివాలయంలో శివలింగానికి అభిషేకాలు చేసి నదిలో నిమజ్జనం చేశారు.

సీలేరు శివాలయంలో శివలింగానికి భక్తుల అభిషేకం

పొల్లూరులో వనభోజనాల సందడి

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టులోని పొల్లూరులో మంగళవారం వనభోజనాల సందడి నెలకొంది. దారాలమ్మ గుడి సమీపంలోని సీలేరు నది వద్ద గ్రామస్థులు సుమారు 150 మంది వనసమారాధనకు హాజరయ్యారు. గ్రామ పెద్దలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తూ మహిళలు, చిన్నారులకు అంత్యాక్షరి, కుర్చీలాట, లెమన్ అండ్ స్పూన్, జల్దీ ఫైవ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల

పాడేరు, అరకులోయ, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద జిల్లా వ్యాప్తంగా రూ.101.14 కోట్ల నిధులు 1,44,222 మంది రైతుల ఖాతాల్లో బుధవారం జమవుతాయని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. అరకులోయ నియోజకవర్గంలో రూ.38.95 కోట్లు, పాడేరు నియోజకవర్గంలో రూ.33.94 కోట్లు, రంపచోడవరం నియోజకవర్గానికి రూ.28.23 కోట్లు రెండో విడత అన్నదాత సుఖీభవ, 21వ విడత పీఎం కిసాన్ నిధులుగా విడుదలవుతాయని పేర్కొన్నారు. స్థానిక కాఫీ హౌస్‌లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నిధులు విడుదల చేస్తారన్నారు.

సమయపాలన లేకుంటే క్రమశిక్షణ చర్యలు

గ్రామస్థులతో మాట్లాడుతున్న నారాయణమూర్తి

పాడేరు, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి నారాయణమూర్తి స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పాడేరు డివిజన్‌లో పనిచేస్తున్న గ్రామ సచివాలయాల నిర్వహణ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై పలు ఆరోపణలు వస్తున్నాయని, సిబ్బందిని నియంత్రించాల్సిన ఎంపీడీఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది రోజూ ఉదయం, సాయంత్రం విధిగా హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. హాజరు ఆధారంగా మాత్రమే జీతాలు చెల్లించాలని ఆదేశించారు. వెల్ఫేర్ సహాయకులు వారానికి రెండుసార్లు పాఠశాలల్లో మరుగుదొడ్ల తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆధార్ కిట్ల నిర్వహణకు సహకరించని డిజిటల్ సహాయకులను గుర్తించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలకు ఆదేశించారు. డివిజన్ వ్యాప్తంగా తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షించారు. పింఛను బట్వాడా తర్వాత మిగిలిన సొమ్ము జమచేయని సచివాలయ ఉద్యోగులపై కేసు నమోదు చేసి రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం రికవరీ చేయాలని స్పష్టం చేశారు. సంపద తయారీ కేంద్రాలను సమగ్రంగా నిర్వహించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాల శాఖ జిల్లా నోడల్ అధికారి పీఎస్ కుమార్ మాట్లాడుతూ ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు వారానికి నాలుగు సచివాలయాలు తప్పనిసరిగా తనిఖీ చేయాలని, కౌశలం సర్వే, ఈకేవైసీ తదితర పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కోరారు. గ్రామీణ నీటిసరఫరా ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ చంద్రశేఖర్, ఉపాధి హామీ ఏపీడీ సీతయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, డీఎల్‌డీఓ జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ▲ అనంతగిరి సంపద కేంద్రాన్ని జడ్పీ సీఈఓ పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఐవీఆర్‌ఎస్ ఫోన్ కాల్స్‌పై సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ప్రజాఫిర్యాదులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలపై సర్పంచులు, కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో నరసింగరావు, గ్రామీణ తాగునీటి విభాగం జేఈ గౌతమ్, కార్యదర్శి దేవా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సర్వీసుల ఏర్పాటుకు వినతి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: కూనవరం, వీఆర్‌పురం మండల కేంద్రాల నుంచి విజయవాడ, గుంటూరు వెళ్లేందుకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని తెదేపా మండల అధ్యక్షుడు బొర్రా నరేశ్ తదితరులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే శిరీషాదేవిని రంపచోడవరంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో రేఖపల్లి నుంచి విజయవాడ, గుంటూరుకు బస్సు సర్వీసులు నడిపేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం భద్రాచలం వెళ్లి అక్కడి నుంచి వెళ్లాల్సి వస్తోందన్నారు. ముత్యాల రామారావు, రాజు, విష్ణు పాల్గొన్నారు.

23న ఉపాధ్యాయుల సమావేశం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం ఈ నెల 23న జరగనుంది. తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని సంఘ నాయకులు ప్రసాద్, గంగాభావాని, అర్జున్ మంగళవారం తెలిపారు. సమావేశం అనంతరం అల్లూరి జిల్లా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు.

పైపులైన్‌కు తాత్కాలిక మరమ్మతు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సత్యసాయి రక్షిత తాగునీటి పైపులైన్ లీకేజీకి తాత్కాలిక మరమ్మతు చేశారు. ప్రస్తుతానికి నీరు లీకవకుండా చర్యలు చేపట్టారు. మారేడుమిల్లిలో శివాలయం వద్ద పైపులైను పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతుండటంతో సిబ్బంది స్పందించి రబ్బరు ట్యూబులు కట్టారు. కొత్త పైపులు వేసేందుకు తీసుకువచ్చి పక్కన పడేయడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

కూనవరం, న్యూస్‌టుడే: బాగా చదువుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వీఆర్‌పురం ఎంఈవో-2 చిచ్చడి బాబూరావు విద్యార్థులకు సూచించారు. జిన్నెలగూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాత పుస్తకాలు, పెన్నులు, రబ్బర్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు కన్నారావు, రాంబాబు, సీత పాల్గొన్నారు.

మినీ గోకులం సందర్శన

జీకొయ్యూరు, న్యూస్‌టుడే: కినపర్తి పంచాయతీ భీమవరంలో నిర్మించిన మినీ గోకులాన్ని ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు మంగళవారం సందర్శించారు. గతంలో ట్రైకర్ నిధులతో నిర్మించిన మినీ గోకులాల్లో ఎంత మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రాజేంద్రపాలెంలో అస్వస్థతకు గురైన బాలికలను పరామర్శించారు. భాజపా గిరిజన మోర్చా నాయకులు చంద్రరావు, రాజు వెంట ఉన్నారు.

గోకులాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

మారుమూల గ్రామాలకు తాగునీరు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల గిరిజన గ్రామాలకు తాగునీటి వసతి, రహదారుల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. జల్‌జీవన్‌లో భాగంగా బెన్నవరం పంచాయతీ కట్టువీధిలో మంగళవారం తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. సర్పంచి సన్యాసమ్మ, నారాయణమూర్తి, ఆశోక్, సురేంద్ర పాల్గొన్నారు.

కట్టువీధిలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న రమేష్‌నాయుడు

శ్రమదానంతో పరిసరాలు శుభ్రం

చింతపల్లి, న్యూస్‌టుడే: మిషన్ తాజంగి సభ్యులు మంగళవారం శ్రమదానంతో పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి వారం తాజంగి పంచాయతీలోని వీధుల్లో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. సొనాయి వీధిలో రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు, పొదలను తొలగించారు. మిషన్ తాజంగి అధ్యక్షుడు శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

తుప్పలు తొలగిస్తున్న మిషన్ తాజంగి సభ్యులు

స్థానిక పోరుకు సన్నద్ధమవుదాం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జనసేన సైనికులు, కార్యకర్తలు పనిచేయాలని జనసేన మండల అధ్యక్షులు శ్రావణ్‌కుమార్ అన్నారు. సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టులో మంగళవారం క్షేత్రస్థాయి సమావేశం నిర్వహించారు. పంచాయతీ అధ్యక్షులు సింహాద్రి ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలకు సంసిద్ధులు కావాలని సూచించారు. సర్పంచి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు విజయానికి కృషి చేయాలని శ్రావణ్‌కుమార్ సూచించారు. మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొడుగులపుట్టు గ్రామస్థులతో జనసేన నాయకులు

మన డబ్బులు.. మన లెక్కలపై అవగాహన

పెదబయలు, న్యూస్‌టుడే: 'మన డబ్బులు...మన లెక్కలు' పైలట్ ప్రాజెక్టు-3 కింద మహిళా సంఘాల నుంచి ఎంపిక చేసిన ఈ - నారీలకు మంగళవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల్లోని ప్రతీ సభ్యురాలు మన డబ్బులు - మన లెక్కలు యాప్ ద్వారా పొదుపు, అప్పుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వివరించారు. ప్రతీ గ్రూపులో పదో తరగతి ఉత్తీర్ణులైన వారిని ఈ - నారీలుగా ఎంపికచేసి శిక్షణ ఇచ్చారు. అనంతరం పెదబయలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు ఏపీఎం ఎం.దేవమంగ, పి.నాగవెంకటలక్ష్మి, బి.మేరి తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో వెలుగు సిబ్బంది, మహిళా సంఘ సభ్యుల ర్యాలీ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రమ్య, సిరి

ఝాన్సీరాణి

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు క్రీడల్లో సత్తా చాటారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.రమ్య, ఎం.సిరి, అండర్-14 విభాగంలో ఖోఖోలో ఎం.ఝాన్సీరాణి విజేతలుగా నిలిచారు. నెల్లూరులో ఈ నెల 20న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పీడీ శశికాంత్‌రెడ్డి, పీఈటీ సురేశ్ మంగళవారం చెప్పారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: రంపచోడవరంలో 220 కేవీ ఉప కేంద్రం నిర్వహణ, మరమ్మతు దృష్ట్యా బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రమణ చెప్పారు. మారేడుమిల్లి, పరిసర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

ఎంపీడీవోగా విజయదత్

ఎటపాక, న్యూస్‌టుడే: మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా విజయదత్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి బదిలీపై ఇక్కడకు వస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

రంపచోడవరం: దుకాణదారులు, హోటళ్ల యజమానులు ఆహార పదార్థాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డిప్యూటీ ఎంపీడీవో రాజబాబు ఆదేశించారు. స్థానిక దుకాణాలు, హోటళ్లు, మొబైల్ క్యాంటీన్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

మాజీ ఎంపీపీ మృతి పార్టీకి తీరని లోటు

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, నాయకులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మాజీ ఎంపీపీ, గడుతూరు ఎంపీటీసీ సభ్యురాలు పద్మ మృతి తెదేపాకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. జి.మాడుగుల మండలం గడుతూరు పంచాయతీ గానుగురోలు గ్రామంలో పద్మ అంత్యక్రియలు మంగళవారం జరిగాయి. భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు గోవింద్, వరహాలరాజు, చిట్టిబాబు, కొండలరావు, కళ్యాణం, చిరంజీవి, కృష్ణమూర్తి, భీంబాబు, భీంబాబు, పిన్నయ్య, రెడ్డిబాబు, లక్ష్మణరావు, కొండబాబు, నితిన్, రామన్నదొర, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

చెత్తను ఆదాయ వనరుగా మార్చుకోండి

శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల్లో వీధులను శుభ్రం చేయడం ద్వారా వచ్చిన చెత్తను ఆదాయ వనరుగా మార్చుకోవాలని ఎంపీపీ లలిత కుమారి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో 'పచ్చదనం- పరిశుభ్రత' అంశంపై సర్పంచి, ఉప సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలను తరలించాలన్నారు. అక్కడ తయారయ్యే సేంద్రియ ఎరువు విక్రయం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. జడ్పీటీసీ సభ్యుడు బాలాజీబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో రత్నకుమారి, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి సమీపంలో చెట్టు విరిగి రహదారిపైకి వాలడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- రాంబాబు, దేవరపల్లి**, ✓: చెట్టును తొలగించేందుకు చర్యలు చేపడతాం. **- ప్రదీప్, ఏఈ, ర.భ.శా.**

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పాడేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పెదపేట గ్రామానికి వెళ్లే రహదారి రాళ్లు తేలి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. కిలగాడ కూడలి నుంచి పెదపేట వరకు రోడ్డు ఛిద్రమై గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- చిరంజీవి, స్థానికుడు.**, ✓: కిలగాడ కూడలి నుంచి పెదపేట, దారెల వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ప్రతిపాదనలు అందించాం. నిధులు విడుదలైతే మరమ్మతు చేపట్టేందుకు చర్యలు చేపడతాం. **- పాండురంగస్వామి, సర్పంచి, దారెల**

రహదారికి ఇరువైపులా తుప్పల తొలగింపు

స్పందనకు వందనం

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ నుంచి పాడేరు వెళ్లే మార్గంలోని ఎండపల్లివలస వద్ద రహదారిపై పెరిగిన పొదలు, తుప్పలను మంగళవారం ఆర్ అండ్ బీ సిబ్బంది తొలగించారు. 'ఈనాడు'లో ఈనెల 10న ప్రచురితమైన 'నమ్మండి ఇది రహదారే' కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. రహదారి కనిపించకుండా పెరిగిపోయిన పొదలు, తుప్పలు తొలగించారు. రహదారిపై అధికారులు దృష్టిసారించి పనులు చేపట్టటంపై వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని, ఉపాధి పథకం వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పోతురాజు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొస్తూ లబ్ధిదారులను ఇబ్బందికి గురి చేస్తోందన్నారు. బకాయి బిల్లులు విడుదల చేయాలని, లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు.

బంగారం తాకట్టుపై రుణాలివ్వండి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక పీఏసీఎస్‌లో రైతులకు బంగారం తాకట్టుపై రుణాలు మంజూరు చేయాలని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామిని రాజవొమ్మంగి సొసైటీ ఛైర్మన్ కేశవ్ కోరారు. కాకినాడలో మంగళవారం రామస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

రక్షణ గోడ నిర్మాణం

సున్నంపాడు వద్ద నిర్మాణంలోనున్న గోడ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. మారేడుమిల్లి - రంపచోడవరం మార్గంలో సున్నంపాడు వద్ద రోడ్డు పక్కగా కొండవాగు ప్రవహిస్తోంది. రహదారితోపాటు అంచులు కోతకు గురవుతున్నాయి. మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతుండటంపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారి కోతకు గురయ్యే ప్రదేశంలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

దారిలా.. రాకపోకలెలా?

మోతుగూడెం, న్యూస్‌టుడే: మంగంపాడు - బచ్చులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ మంగంపాడు నుంచి బచ్చులూరు వరకు 15 కి.మీ. దూరం గోతులమయంగా మారింది. రాళ్లు తేలడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

(c) eenadu

ఈనాడు
అమరావతి
గుంటూరు
బుధవారం నవంబరు 19, 2025


బాబా విగ్రహం వద్ద పార్వతమ్మ

పేదలకు భోజనం పెడుతూ..

మనసున్న అమ్మ.. ఆకలి తీర్చేనమ్మ..

పేదల ఆకలి తీర్చడానికి ధనవంతులే కానక్కర్లేదని, మంచి ఆశయం ఉంటే చాలని పార్వతమ్మ అనే వృద్ధురాలు చేసి చూపిస్తున్నారు. గుంటూరు మూడుబొమ్మల కూడలిలోని చిన్న బాబా విగ్రహం వద్ద 16 ఏళ్లుగా ప్రతి గురువారం సుమారు 150 మందికి ఆమె అన్నదానం చేస్తున్నారు. ఆమె ఆశయానికి స్థానికులు కొందరు ఆర్థిక సహకారం అందించడంతో అన్నదానం నిరాటంకంగా సాగుతోంది. -ఈనాడు, గుంటూరు

గుంటూరు ఐఎంఏకు ఐదు రాష్ట్ర అవార్డులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆయా సేవలకు వివిధ విభాగాల్లో అందించే అవార్డుల్లో గుంటూరు ఐఎంఏ ఐదు అవార్డులు దక్కించుకుందని గుంటూరు ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ సేవకుమార్ మంగళవారం తెలిపారు. 1) డా.యార్లగడ్డ సుబ్బారాయుడు, 2) కార్యనిర్వాహక వర్గం (బెస్ట్ ఆలౌండ్ పెర్ఫార్మెన్స్), 3)డా.సౌజన్య (ఉత్తమ శాఖ కార్యదర్శి) 4. ఐఎంఏ బృందం (తురకపాలెంలో అత్యవసర సేవలకు ఉత్తమ సేవా అవార్డు), 5) డా. సేవాకుమార్ (బెస్ట్ స్టాండింగ్ ఆఫీస్ బేరర్) అవార్డులు లభించాయన్నారు. వీటిని ఈనెల 22, 23 తేదీల్లో అనకాపల్లి జిల్లా రాజుపేటలో జరగనున్న ఐఎంఏ రాష్ట్ర సదస్సుల్లో ప్రదానం చేస్తారని తెలిపారు. గుంటూరు శాఖకు అవార్డులు రావడంపై ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నాగ కిషోర్, సీజీసీ డైరెక్టర్ నాగ కిషోర్, డాక్టర్లు పలువురు తదితరులు అభినందనలు తెలిపారు.

మురుగు కదలదు.. ముంపు వదలదు!

- ఏఎన్‌యూలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణంలో లోపం
- చిన్నపాటి వర్షానికే చెరువులా ప్రాంగణం

ఈనాడు, అమరావతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మూడేళ్ల కిందట అనాలోచితంగా చేసిన భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం అక్కరకు రాకుండా పోయింది. మురుగు నీరు ముందుకు కదలక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. చిన్నపాటి వర్షానికి వసతిగృహాల్లోకి పోటెత్తుతున్న వరదతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని 1976లో మొత్తం 300 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ప్రారంభంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల వెంబడి వర్షపు నీరు వెళ్లేందుకు అనువుగా కాలువలు నిర్మించారు. గత పాలకుల హయాంలో కొందరు అధికారులు అనాలోచితంగా వాటిని పూడ్చేసి కొత్త నిర్మాణాలకు తెరతీశారు. రూసా నిధులు రూ.కోటితో ఏపీ ఈఐడీసీ ఆధ్వర్యంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ పనులు చేపట్టారు. ఏఎన్‌యూలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఉన్నప్పటికీ వారిని కాదని సదరు విభాగానికి అప్పగించడం గమనార్హం.

ఆగమేఘాలపై పనులు..

ఏఎన్‌యూలో మహిళా వసతిగృహం వెనుక వైపు నుంచి ఇంజినీరింగ్ వసతి గృహం మీదుగా ఫిషరీస్, ఫార్మసీ కళాశాల, గ్రంథాలయం వెనుక వైపు వరకు సుమారు 2 కి.మీ మేర భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం జరిగింది. ఇందుకోసం ఇప్పటివరకు రూ. 80లక్షలకు పైగా బిల్లులు చెల్లించినట్లు సమాచారం. అనంతరం నిర్మాణం ముందుకు సాగకపోవడం.. చేసిన చోట్ల వివిధ భవనాల నుంచి ఔట్‌లెట్లకు అనుసంధానం జరగకపోవడంతో సమస్య నెలకొంది. మరోదారి లేక ఎక్కడికక్కడ సెప్టిక్ ట్యాంకుల్లోకి వ్యర్థ జలాలను నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి డిపార్ట్‌మెంట్లలో ఏర్పడింది. అవి తరచూ పూడిపోయి వ్యర్థాలను తీయించడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

వర్షాలకు వసతిగృహంలోకి నీరు రావడంతో విద్యార్థుల అవస్థలు (పాతచిత్రం)

చినుకు పడితే వణుకే

వర్సిటీలో చిన్నపాటి వర్షం పడినా కొన్నిచోట్ల జలమయం అవుతున్నాయి. డ్రెయినేజీ కాలువలు పొంగి పొర్లుతున్నాయి. వసతిగృహాల వద్ద మడుగులను తలపిస్తుండడంతో విద్యార్థులు నిచ్చెనలు వేసుకుని భవనాలపైకి వెళ్లాల్సిన దుస్థితి. గ్రంథాలయంలోకి నీరు చేరి పుస్తకాలు తడిసిపోతున్నాయి. వర్సిటీలో కొన్నిచోట్ల ఏకంగా నెల తరబడి మురుగు నీరు కదలకుండా ఉండిపోయి దోమలకు ఆవాసమవుతోంది. దీంతో అధికారులు తాత్కాలికంగా జేసీబీలతో కాలువలు ఏర్పాటు చేసి కల్వర్టులు కట్టిస్తున్నారు. ఈ ఖర్చు విద్యాలయంపై అదనపు భారంగా మారింది. మొత్తంగా గత పాలకుల తప్పిదాలు ఇప్పటికీ విద్యాలయాన్ని వెంటాడుతుండడం గమనార్హం. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ సైతం జరగ్గా వారి నివేదికపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది.

గ్రంథాలయంలోకి నీరు రావడంతో తడిసిన పుస్తకాలు (పాతచిత్రం)

లేఖ రాయండి.. బహుమతి పొందండి

తపాలా శాఖ ఆధ్వర్యంలో పోటీలు

గోరంట్ల, న్యూస్‌టుడే

తోకలేని పిట్ట తొంభై మైళ్ల దూరం పోయిందంట. ఈ పొడుపు కథ వేస్తే టక్కున చెప్పే సమాధానం ఉత్తరం. ప్రస్తుత కాలంలో ఆ ఉత్తరం కనుమరుగవుతోంది. ఈనేపథ్యంలో స్వదస్తూరి లేఖల ప్రాశస్త్యాన్ని గుర్తు చేస్తూ.. డాయి ఆఖర్ పేరిట కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖల పోటీలు నిర్వహిస్తోంది. ఈ సారి థీమ్‌గా ‘నీ రోల్ మోడల్‌కు ఉత్తరం రాస్తే’గా ప్రకటించారు. తపాలా శాఖ ఇటీవల గుంటూరు రూరల్ మండలంలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు.

బహుమతి	రాష్ట్ర స్థాయి	జాతీయ
ప్రథమ	రూ.25వేలు	రూ.50వేలు
ద్వితీయ	రూ.10 ”	రూ.25 ”
తృతీయ	రూ.5 ”	రూ.10 ”

రెండు కేటగిరీల్లో... 18 సంవత్సరాలలోపు వారు జూనియర్‌గా, 18 ఏళ్లు దాటిన వారు సీనియర్ కేటగిరీల్లో పోటీలుంటాయి. ‘లెటర్ టు మై రోల్ మోడల్’ అనే అంశంపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో లేఖ రాయొచ్చు. ఎన్వలప్ విభాగంలో ఏ4 పేపరుపై వెయ్యి పదాలు, ఇన్‌లాండ్ లెటర్ విభాగంలో 500 పదాలకు మించకుండా లేఖ రాయాలి. పోటీదారు 2025, జనవరి నాటికి వయసు తెలుపుతూ డిక్లరేషన్ ఫారం, నిర్ధారణ ప్రతి జత చేయాలి. లేఖ రాసిన దరఖాస్తులు డిసెంబరు 8వ తేదీ లోగా గుంటూరు డివిజన్ తపాలా శాఖ కార్యాలయానికి చేరాలని తపాలా శాఖ సూపరింటెండెంట్ యల్లమందయ్య తెలిపారు.

వైద్యులు, సిబ్బందితో సూపరింటెండెంట్ సమీక్ష

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో మంగళవారం సూపరింటెండెంట్ యశస్వి రమణ సమీక్ష నిర్వహించారు. రాత్రిపూట వైద్యసేవలు సరిగా అందడం లేదంటూ మంగళవారం ‘ఈనాడు’లో ‘రోగమా.. రాత్రిపూట రాకుమా..!’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. వైద్యులు డ్యూటీ సమయంలో తప్పక అందుబాటులో ఉండాలని.. సేవల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. రోగులకు వైద్యం అందించే క్రమంలో లోపాలకు తావివ్వరాదని, నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.

సర్దుబాటు.. గ్రహపాటు..!

- సబ్జెక్టు ఉపాధ్యాయులతో ఎంఈఓ ఖాళీ పోస్టుల భర్తీ
- అడ్డదిడ్డంగా కదిపేయడంతో బడుల్లో బోధనకు కొరత

ఈనాడు, అమరావతి

గుంటూరులోని పులిపాక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంను కాకాణి ఎంఈఓ (ఎఫ్‌ఏసీ)గా, బయాలజీ బోధించే ఉపాధ్యాయుణ్ని తుళ్లూరుకు, గణిత ఉపాధ్యాయుణ్ని అమరావతికి, సాంఘికశాస్త్రం బోధించే ఇంకొకరిని క్రోసూరుకు ఎంఈఓగా పంపించారు. ఇక్కడ ఒకే పాఠశాలలో నలుగురు వెళ్లిపోవడంతో బోధన అగమ్యగోచరమైంది. చేబ్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎంఈఓగానూ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, అదే పాఠశాలలో పీఎస్ బోధించే ఉపాధ్యాయుణ్ని పొన్నూరుకు, ఇంగ్లీషు ఉపాధ్యాయుణ్ని కారంపూడి ఎంఈఓగా పంపించారు. గుంటూరు శారదానికేతన్‌లో పనిచేసే పీఎస్ ఉపాధ్యాయుణ్ని చుండూరుకు నియమించారు. ఇక్కడి హెచ్‌ఎంను మంగళగిరికి కేటాయించారు.

సర్దుబాట్లు గ్రహపాట్లుగా మారాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశాఖలో ఎంఈఓ పోస్టుల భర్తీకి అధికారులు తీసుకున్న నిర్ణయాలు విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించాయి. పదుల సంఖ్యలో ఈ తరహా నియామకాలు చేపట్టడంతో ఆయా చోట్ల బోధనకు కొరత ఏర్పడింది. ఎంఈఓలుగా వెళ్లిన వారిలో కొందరు ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు పరంగా ఏకోపాధ్యాయులు కావడంతో ఇక అక్కడ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళిక అమలుపై నీలినీడలు కమ్ముకున్నట్లయింది. కొన్ని పాఠశాలల్లో నలుగురు వెళ్లడంతో అక్కడ నిర్వహణ ఎలాగో హెచ్‌ఎంలకు అర్థం కావడం లేదు.

ఇదీ పరిస్థితి..

వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. 5వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించగా ఎక్కువ మొత్తంలో గుంటూరు, బాపట్లకు వచ్చేయడం.. పల్నాడు జిల్లాలో 300 పోస్టుల కొరత ఏర్పడటం.. మరోదారి లేక బదిలీ అయిన వారినే వెనక్కి పంపి బోధన సాగించడం తెలిసిందే. ఇటీవల జిల్లాలో 1460 ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ 2025 ద్వారా భర్తీ చేయడంతో కొంతమేర ఊరట ఏర్పడింది. తాజా నియామకాలు కొత్త చిక్కులు తెచ్చి పెట్టాయి. తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయోనంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

డిప్యుటేషన్లకు వరుస

క్షేత్రస్థాయి అవసరాల దృష్ట్యా ప్రభుత్వం ఎంఈఓల భర్తీకి కొన్ని సడలింపులు ఇవ్వడాన్ని ఆసరాగా మార్చుకుంటున్నారు. ఆ బాధ్యతలు దక్కించుకునేందుకు మూడు జిల్లాల్లో కొందరు ఉపాధ్యాయులు వరుస కడుతున్నారు. డిప్యుటేషన్ల కోసం జూనియర్లు సైతం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తరగతులకు డుమ్మా కొడుతున్నారు. ఇది వంద రోజుల ప్రణాళిక అమలుకు ప్రతిబంధకమైంది. మూడు జిల్లాల మంత్రులు, కలెక్టర్లు సమస్యపై చొరవచూపాల్సిన అవసరం ఉంది.

3 రోజులకు.. ముందస్తు సన్నద్ధం!

ట్యాంకర్ల ద్వారా నీటి సేకరణపై జీజీహెచ్ దృష్టి

ఈనాడు, అమరావతి

ఈ నెల 20వ తేదీ నుంచి 22 వరకు మూడు రోజుల పాటు గుంటూరు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ప్రకటించారు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో ప్రధాన పైపులైనుపై ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేసే క్రమంలో నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. నెహ్రూనగర్, శారదాకాలనీ, వసంతరాయపురం, హెచ్ఎల్ఆర్, హనుమయ్యనగర్, స్తంభాలగరువు, శ్యామలనగర్, గుజ్జనగుండ్ల, కోర్ట్ కాంపౌండ్, ఏటీ అగ్రహారం, మార్కెట్ యార్డు, హౌసింగ్‌బోర్డు, బీఆర్ స్టేడియం, నల్లచెరువు, శ్రీనివాసరావుతోట, కేవీపీ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, తారకరామనగర్ రిజర్వాయర్ల పరిధిలో అంతరాయం కలుగుతుందని స్పష్టం చేశారు.

ఆస్పత్రిపై ప్రభావం

ఈ నిర్ణయం గుంటూరు జీజీహెచ్‌పైనా కొంతమేర ప్రభావం చూపనుంది. ఇక్కడ నీటి సరఫరా కోసం సొంతంగా ఆరు బోర్లు పనిచేస్తున్నాయి. ఇవి కాకుండా మూడు లైన్ల ద్వారా 6 సంపుల్లో జీఎంసీ నీటిని నింపుతున్నారు. ఇందుకోసం కోర్టు వైపు లైను నుంచి నిత్యం ఉదయం 7.30-10.30 గంటల మధ్య మూడు గంటల పాటు నీటిని సరఫరా చేస్తున్నారు. సాంబశివరావుపేట లైనులో మధ్యాహ్నం 2-5 గంటల మధ్య.. నాజ్‌సెంటర్ లైనులో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఇస్తున్నారు. ఇందుకోసం జీజీహెచ్‌లో 6 సంపులను నిల్వకు వినియోగిస్తుండగా.. జీఎంసీ తాజా ప్రకటనతో ఈ లైన్లలో కొన్నింట సరఫరా ఆగనుంది. దీంతో జీజీహెచ్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టారు. మూడు రోజుల పాటు ఆసుపత్రి ప్రాంగణంలో నీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. తులసీ రామచంద్రప్రభు సహకారంతో 5 ట్యాంకర్ల ద్వారా నీటిని సేకరించి రోగుల అవసరాల మేరకు అందించేందుకు నిర్ణయించారు.

1,06,329 మంది రైతులు.. రూ.70 కోట్లు

రెండో విడత అన్నదాతా సుఖీభవ నిధుల విడుదల నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రైతులకు అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేయనుంది. జిల్లాలో 1,06,329 మంది రైతుల ఖాతాల్లో రూ. 70 కోట్లు జమ కానున్నాయి. అన్నదాతా సుఖీభవ కింద రూ. 53.16 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ. 16.84 కోట్లు అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. అన్నదాతా సుఖీభవ జిల్లా స్థాయి కార్యక్రమం గుంటూరు సమీపంలోని లాంఫాం ఆడిటోరియంలో బుధవారం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎం.పద్మావతి తెలిపారు.

ఒక్క క్లిక్‌తో విద్యుత్తు బిల్లుల చెల్లింపు!

సదా మీసేవలో...

- గ్రూప్ పేమెంట్ ఫీచర్‌తో వెసులుబాటు
- అందుబాటులోకి తెచ్చిన సీపీడీసీఎల్...

ఈనాడు – అమరావతి

“ఉద్యోగరీత్యా రవి విజయవాడలో స్థిరపడ్డాడు. తల్లిదండ్రులు గుంటూరు జిల్లాలో ఉంటారు. వారి ఇంటి కరెంటు బిల్లు ప్రతి నెలా రవి చెల్లిస్తుంటాడు. గత నెలలో తాను ఉంటున్న విజయవాడలో ఇంటి బిల్లు చెల్లించాడు. ఊళ్లోని బిల్లును చెల్లించడం మర్చిపోయాడు. గడువు తేదీ దాటాక గుర్తురావడంతో.. ఆ తర్వాత జరిమానాతో చెల్లించాల్సి వచ్చింది.”

తాజాగా తెచ్చిన కొత్త ఫీచర్‌తో ఈ సమస్యలకు సీపీడీసీఎల్ చెక్ పెట్టింది. ఒకటి కంటే ఎక్కువ సర్వీసుల బిల్లులు చెల్లించే వారికి ఇది ఉపకరించనుంది. దీనిని ఇటీవల డిస్కమ్‌లోని ఐటీ విభాగం ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్‌ను ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యుత్తు వినియోగదారులు వాడుకోవచ్చు. ఇందుకు apcpdcl.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈ సేవను సద్వినియోగం చేసుకోవచ్చు.

1. ముందుగా వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. హోమ్ పేజీలో కనిపించే ‘గ్రూప్ సర్వీసెస్ పేమెంట్’ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత మొబైల్ నెంబరు నమోదు చేస్తే.. ఓటీపీ వస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆపై లాగిన్ అనే టాబ్‌పై క్లిక్ చేయాలి.

2. తర్వాత వచ్చే ఎడిట్ స్క్రీన్‌లో కనెక్షన్.. 13 అంకెల సర్వీసు నెంబరు, మెయిల్ ఐడీ నమోదు చేయాలి. గరిష్ఠంగా 20 సర్వీసులు నమోదు చేసుకోవచ్చు. ఎక్కువుంటే.. సీపీడీసీఎల్‌కు మెయిల్‌లో విన్నవించాలి.
3. సర్వీసు నెంబర్లు నమోదు చేశాక.. ఒకే చోట వాటి సమాచారమంతా కనిపిస్తుంది. వినియోగదారు పేరు, బిల్లు తేదీ, గడువు తేదీ, డిస్‌కనెక్షన్ గడువు, కనెక్షన్ కేటగిరీ వస్తాయి. సర్వీసు నెంబర్లను సెలెక్ట్ చేసుకుంటే.. వాటి బిల్లు కింద కనిపిస్తుంది. pay the group bill అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
4. తర్వాత పేమెంట్ గేట్‌వేలోకి వెళ్లాక.. బిల్లును క్రెడిట్, డెబిట్ కార్డులు, వ్యాలెట్, క్యూఆర్, యూపీఐ, గూగుల్ పే ద్వారా చెల్లించే వీలుంది. ఇలా ఒక్క క్లిక్‌తో అన్ని విద్యుత్తు బిల్లులను చెల్లించవచ్చు.

ఆలకిస్తాం... పరిష్కరిస్తాం

ఈనాడు, అమరావతి, తుళ్లూరు, న్యూస్‌టుడే

- క్షేత్రస్థాయిలో సమస్యలపై అధ్యయనం
- రైతుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి
- సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగరం రైతుల భాగస్వామ్యం, సహకారంతో అభివృద్ధి సాధ్యమవుతుందని సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు పేర్కొన్నారు. సీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం అర్బన్ డిజైన్, ఆర్కిటెక్చరల్ మార్గదర్శకాలపై రైతు ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు గంటల పాటు రైతు జేఏసీ చెప్పిన 14 సమస్యలు సావధానంగా విని పరిష్కారానికి అంశాల వారీగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. సీఆర్‌డీఏ, రైతులకు మధ్య సమాచారలోపం ఉన్నట్లు గుర్తించామని, ఇక నుంచి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని అధికారుల స్థాయిలో నిర్ణయాలు తీసుకునే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు.

సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రైతులు

ఆర్-5 జోన్‌లో సెంటు స్థలాలు, న్యాయస్థానంలో కేసుల పరిష్కారం వంటి వాటిపై సమయానుకూలంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిగా గుర్తిస్తూ పార్లమెంటులో వచ్చే సమావేశాల్లో బిల్లు పెట్టడానికి కసరత్తు జరుగుతోందన్నారు. రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పనులు ఈ నెల 21 నుంచి చేపడతామని పేర్కొన్నారు.

రైతులతో కొందరు అధికారులు గౌరవంగా ఉండడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయని, వారిని పిలిచి మాట్లాడి పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

టీడీఆర్ బాండ్లను రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా విక్రయించుకునే వెసులుబాటుపై చర్చిస్తున్నామన్నారు. వాగులు, కాలువలు యుద్ధప్రాతిపదికన విస్తరించడంతో పాటు ఎత్తిపోతల పథకాలు నిర్మించి వరద ముంపు లేకుండా చూస్తామన్నారు.

కరకట్ట అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, రైతులతోనూ చర్చించి ప్రణాళికలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రతి నెలా 3వ శనివారం సమావేశం

రైతులతో ప్రతి నెలా 3వ శనివారం సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు హామీ ఇచ్చారు. సీఆర్‌డీఏ ఆయా సమస్యలపై సమగ్ర అధ్యయనం చేస్తోందని, వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామన్నారు. ప్రధానంగా గ్రామకంఠాలు, జరీబు భూములు, రోడ్డుపోటు ప్లాట్లు, ఎఫ్ఎస్ఐ పెంపు వంటి సమస్యలు కేంద్ర సహాయ మంత్రి ఆధ్వర్యంలోని కమిటీ తీసుకునే నిర్ణయాల ఆధారంగా పరిష్కరిస్తామన్నారు.

రాజధాని రైతుల ప్లాట్లలో నుంచి వెళ్తున్న విద్యుత్తు లైన్లకు సంబంధించి 220 కేవీ వరకు భూగర్భంలో వేస్తామని, 400కేవీ తీగలు మాత్రం టవర్లు వేసి ఒక ప్రణాళిక ప్రకారం ఇబ్బందులు లేకుండా చూస్తామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయన్నారు.

★ రైతు ప్రతినిధులు సమావేశంలో పలు సమస్యలు ప్రస్తావించి అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించడం లేదన్నారు. గ్రామాల మధ్యలో ప్రధాన రోడ్లు వెళ్తున్నందున రోడ్డుకి ఇరువైపులా గ్రామం ఉన్నట్లయితే అనుసంధానం ఎలా చేస్తారని ప్రశ్నించారు. రోడ్డుకు ఒకవైపు గ్రామం, మరోవైపు సామాజిక అవసరాలు తీర్చుకునే స్థలాలు ఉన్నట్లయితే ఇబ్బందులు తలెత్తుతాయని, కొన్ని ఉదాహరణలతో రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

★ రైతులు చెప్పిన అభ్యంతరాలు, సమస్యలకు పరిష్కారాలు చూపిస్తామని, వాటిని వెబ్‌సైట్‌లో పెట్టిన తర్వాత అందరి ఆమోదంతోనే ముందుకెళ్తామని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ భార్గవతేజ తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుత్తు మీటరు వివాదం

ఓ వ్యక్తి గొంతు నులిమేయడంతో ఘటన

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటరు వివాదం ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆత్మకూరులోని ఓ బహుళ అంతస్తులో **దామర్ల రాఘవేంద్రరావు**(44) నివాసం ఉంటున్నారు. అందులోని ఓ ఫ్లాట్‌కు సంబంధించి విద్యుత్తు మీటరు మార్పు చేసే విషయంపై అందులోనే నివాసం ఉండే హుస్సేన్‌తో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హుస్సేన్.. రాఘవేంద్రరావు గొంతు పట్టుకున్నాడు. కుటుంబ సభ్యులు విడిపించేందుకు ఎంత ప్రయత్నించినా విడవలేదు. కొద్దిసేపటికి రాఘవేంద్రరావు కూర్చున్నట్లుగానే కుప్పకూలిపోయారు. ఈ ఘటన ఈ నెల 17వ తేదీ సాయంత్రం జరిగింది. ఇదిలా ఉండగా రాఘవేంద్రరావు అనారోగ్య కారణాలతో కొంతకాలంగా విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇద్దరి మధ్య వివాదం జరగడం, అతని గొంతు నులమడం వంటి ఘటనలతో రాఘవేంద్రరావు మృతి చెందారు. తన భర్త మరణానికి హుస్సేన్ కారణమని భార్య పద్మజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని ఎయిమ్స్ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా కోర్టు ఆవరణలోకి రైల్వే కోర్టు మార్పు

గుంటూరులీగల్, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు ఆవరణలోకి రైల్వే కోర్టును తాత్కాలికంగా మారుస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అరండల్‌పేట 1వ లైనులో రైల్వేస్టేషన్ ఆవరణలో కొనసాగుతున్న రైల్వే కోర్టును జిల్లా కోర్టు ప్రాంగణంలోకి మార్చారు. బుధవారం నుంచి అక్కడ విచారణలు కొనసాగిస్తారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగలశెట్టి శివసూర్యనారాయణ తెలిపారు. శంకర్ విలాస్ వంతెన నిర్మాణం కొనసాగుతుండడంతో జిల్లా కోర్టు నుంచి రైల్వేస్టేషన్‌లో ఉన్న కోర్టుకు వెళ్లడానికి న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యాయవాదులు ఈ సమస్యను జిల్లా జడ్జి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి హైకోర్టుకు తెలిపారు. జిల్లా జడ్జి సూచన మేరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేవరకు జిల్లా కోర్టులో రైల్వే కోర్టును తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు అనుమతి లభించింది. దీంతో కోర్టు ఆవరణలోని కొత్త భవనం రెండో అంతస్తులో ఉన్న పర్మినెంట్ లోక్ అదాలత్ పక్కన రైల్వే కోర్టు ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ఇక్కడే విచారణలు జరుగుతాయని సూర్యనారాయణ తెలిపారు.

రాగోలు రకం.. దిగుబడి వరం

ఖర్చు రూ.23000.. పంట 40 బస్తాలు
– రైతు మోహన్‌రెడ్డి

న్యూస్‌టుడే, దుగ్గిరాల

ఎప్పటికప్పుడు కొత్త రకాలు సాగు చేస్తూ అటు వ్యవసాయ శాఖ పరిశోధనా కేంద్రాలకు, ఇటు అధికారులకు, వ్యవసాయ విద్య చదివే విద్యార్థులకు తన పొలాన్ని ఒక అధ్యయన క్షేత్రంగా మార్చేశారు దుగ్గిరాల మండలం వీర్లపాలెంకు చెందిన రైతు ఆళ్ల మోహన్‌రెడ్డి. 2017 నుంచి ఆయన ఏటా కొత్త రకాలు వేస్తున్నారు. లాంలోని రీసెర్చి విభాగం డైరెక్టర్ పాలడుగు సత్యనారాయణ ద్వారా మోహన్‌రెడ్డి ఈ ఏడాది రాగోలు-7034 రకం విత్తనాల నమూనా సంచి తెచ్చి వేశారు. ఇటీవల తెనాలి ఇన్‌ఛార్జి ఏడీఏ ఆర్.విజయ్‌బాబు పరిశీలించి నాణ్యమైన రకమని అన్నారు. ఈ విత్తనం వల్ల ఒక విడత ఎరువులు తగ్గుతాయని తద్వారా పెట్టుబడిలో తగ్గుదల ఉంటోందని ఆయన తెలిపారు. తెగుళ్లు, దోమకాటు లేవన్నారు. సాధారణ బీపీటీ రకాలకన్నా ఐదు రోజులు కాలవ్యవధి ఎక్కువగా ఉందని మోహన్‌రెడ్డి చెప్పారు.

రైతు మోహన్‌రెడ్డితో తెనాలి ఇన్‌ఛార్జి ఏడీఏ విజయ్‌బాబు

గొర్రు, రొటోవేటరు వేసినందుకు రూ.3 వేలు, వెద పెట్టినందుకు రూ. 1600, విత్తనం ఎకరానికి రూ. 1500 ఖర్చయింది. కూలీలను పెట్టుకుని కలుపు తీయించడానికి రూ. 2000, నూర్పిడికి ఎకరాకు రూ. 2600 నుంచి రూ. 3వేల వరకు అవుతోంది. మొత్తం మీద రూ. 22,950 ఖర్చయింది. దిగుబడి 40 బస్తాల వరకూ వస్తుంది. ఇటీవల డైరెక్టర్ సత్యనారాయణ పరిశీలించి ఇదే విషయాన్ని వెల్లడించారు.

దారి దొరికితేనే దరి చేరేది..

మండలంలోని చినలింగాయపాలెం నుంచి బీకేపాలెంకు వెళ్లే జడ్పీ రహదారి పూర్తిగా ధ్వంసమయ్యింది. 2016-17లో తెదేపా ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి దీనిని నిర్మించింది. అనంతరం వచ్చిన వైకాపా సర్కారు గాలికొదిలేయడంతో భారీ గుంతలు ఏర్పడి నరకంలా తయారయ్యింది. వాహనాలు రాకపోకలు సాగించాలంటే దారి వెతుక్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాకుమాను

ఈ రాళ్లను తింటారు తెలుసా!

రాళ్లేంటి.. తినడమేంటి.. అనుకుంటున్నారా.. అవునండీ. ఈ చిత్రంలో కనిపిస్తున్న రాళ్లను తినొచ్చు. దీన్ని రాతి ఉప్పు (సైంధవ లవణం) అంటారు. దీన్ని నేరుగా కాకుండా ఫోర్టిఫైడ్ చేసి తీసుకుంటే శరీరానికి అవసరమైన లవణాలు అందుతాయని జీజీహెచ్ జనరల్ మెడిసిన్ వైద్యులు అనిల్‌కుమార్ తెలిపారు. విజయవాడ-గుంటూరు ప్రధాన జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద హరియాణాకు చెందిన వ్యాపారులు విక్రయిస్తున్నారు. - ఈనాడు, గుంటూరు

(c) eenadu

రాష్ట్రంలో 4వేల ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఎస్పీ వకుల్ జిందాల్, వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆరుల్ మౌళి వర్మన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్

గుంటూరు నేరవార్తలు, తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. మంగళవారం గుంటూరు జిల్లా పోలీసు, విట్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా 'సంకల్పం-మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథిగా హాజరైన ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కేసుల్లో పట్టుబడి జైలులో ఉన్నవారిని కలిస్తే తమ స్నేహితులతో గంజాయి, మాదక ద్రవ్యాలు తీసుకోవడం కోసం వెళ్లి పోలీసులకు దొరికి జైలుకు వచ్చినట్లు తెలిపారని చెప్పారు. జైలులో ఉన్నవారిలో చదువుకుంటున్న, చదువు పూర్తయి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నవారు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలించడానికి ఇప్పటి వరకు 4000 ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఒకసారి ఎవరైనా మాదక ద్రవ్యాల కేసుల్లో పట్టుబడితే వారి పేరును నిదాన్ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఆ రికార్డుల్లో నుంచి ఎప్పటికీ తొలగించరని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆపరేషన్ చైతన్యం అనే కార్యక్రమాన్ని చేపట్టి గంజాయి సాగును నిర్మూలించినట్లు చెప్పారు.

మాదక ద్రవ్యాల కేసులో ఉంటే

ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ఎక్కువగా కళాశాలల విద్యార్థులు ప్రభావితం అవుతున్నారని పేర్కొన్నారు. ఒకసారి మాదక ద్రవ్యాల కేసులో ఉంటే ఉద్యోగాలకు ఎంపికైనప్పుడు అనర్హులవుతారని తెలిపారు. కళాశాలల్లో ఈగల్ క్లబ్ విభాగాలను ఏర్పాటు చేసి సమాచార (డ్రాప్) పెట్టెలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా మత్తు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే వారి వివరాలను రాసి ఆ పెట్టెలో వేయాలన్నారు. తమ సిబ్బంది ఆయా విద్యార్థులను డీఎడిక్షన్ కేంద్రాల్లో చేరించి మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా కాపాడతారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. మత్తు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆరుల్ మౌళి వర్మన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

అక్రమాల లెక్క రూ. 22.25 కోట్లు

- ★ డ్వాక్రా బృందాల పేరుతో బోగస్ రుణాలు
- ★ నల్లపాడు డీసీసీబీ శాఖపై సర్‌ఛార్జి విచారణకు కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: శీతల గోదాములో మిర్చి నిల్వకు రుణాలు, డ్వాక్రా మహిళల పేరుతో బోగస్ రుణాలు ద్వారా రూ. 22.25 కోట్ల సొమ్ము దుర్వినియోగమైనట్లు విచారణ కమిటీ గుర్తించింది. జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని నల్లపాడు శాఖలో వైకాపా హయాంలో శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి రూ.కోట్లలో రుణాలు ఇచ్చారు. నిబంధనలు పాటించకుండా రుణాలు ఇవ్వడంతో ఇప్పటికీ రూ.10 కోట్లకు పైగా సొమ్ము రికవరీ కాలేదు. దీంతోపాటు స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన రుణాలు బోగస్ అని అధికారుల విచారణలో తేలింది. అక్షరాలా రూ.22.25 కోట్లు సొమ్ము పక్కదారి పట్టినట్లు 51వ విచారణలో తేటతెల్లమైంది.

బోగస్ రుణాల్లో.. ప్లెడ్జ్ రుణాలు సుమారు రూ.13 కోట్లు, మెప్మా పరిధిలో రూ.6 కోట్లు, డీఆర్‌డీఏ పరిధిలో రూ.1.50 కోట్లు, జేఎండీ కింద 311 మందికి రూ.50 వేల చొప్పున 2021-22 ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు చేసినా రూపాయి కూడా వసూలు చేయలేదు. ఈ మేరకు జిల్లా పాలనాధికారికి విచారణ నివేదికను అందించగా.. దీనిపై గుంటూరు డివిజన్ సహకార శాఖ అధికారికి సర్‌ఛార్జి విచారణకు ఆదేశించారు. దీనిపై అప్పట్లో నల్లపాడులో పనిచేసిన బ్యాంకు మేనేజరు, నోడల్ అధికారి, సీఈవో పర్యవేక్షణ లోపం వల్లే రుణాల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించి వారిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. ఆ పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించిన వైకాపా నేత తెచ్చిన ఒత్తిడి వల్లే రుణాలు మంజూరు చేశారన్న ఆరోపణలున్నాయి. కీలక స్థానంలో ఉన్న నేత ఒత్తిడితో బ్యాంకు ఉన్నతాధికారులు ఎదురు చెప్పలేకపోయారు. ఒకే బ్రాంచి పరిధిలో రూ.100 కోట్లకు పైగా రుణాలిస్తున్నా ఏ స్థాయిలోనూ అడ్డు చెప్పకపోవడమే అక్రమాలు జరగడానికి కారణమైంది.

లెక్కలన్నీ తేలుస్తారా?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో పలు శాఖల్లో వైకాపా హయాంలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా అక్రమార్కులపై నిర్మాణాత్మక చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నల్లపాడు శాఖలో జరిగిన అక్రమాల కంటే ముందు వినుకొండ, నరసరావుపేట, ప్రత్తిపాడు తదితర శాఖల్లో అక్రమ రుణాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అప్పట్లో ఆయా శాఖల్లో విచారణకు ఆదేశించి తాత్కాలికంగా కొందరిపై చర్యలు తీసుకున్నా తర్వాత మిన్నకుండిపోయారు. వైకాపా హయాంలో జరిగిన ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగుల నియామకాలపైనా నిర్ణయం తీసుకోలేదు. సొసైటీల్లో రుణాల రికవరీలో జాప్యం జరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

★ బ్యాంకు సీఈవో నియామకానికి సంబంధించి ప్యానల్ ఖరారై నెలలు గడుస్తున్నా రెగ్యులర్ సీఈవోను నియమించకుండా ఇన్‌ఛార్జి సీఈవోనే కొనసాగించారు. బ్యాంకులో అక్రమాలపై అసెంబ్లీ హౌస్ కమిటీ వేసి విచారణ చేస్తున్న కీలక సమయంలోనూ రెగ్యులర్ సీఈవో నియామకం జరగలేదు. రెగ్యులర్ సీఈవో నిమాయకం చేపట్టాల్సిన సమయంలో ప్యానల్‌లో ఉన్నవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం చర్చనీయాంశమైంది.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు అర్హత

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం మందడం జిల్లా పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం రాజధాని సీడ్‌యాక్సెస్ రహదారిపై జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్-14 విభాగంలో మందడం హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న సరిత, చరణ్, అండర్-17లో 9వ తరగతి చదువుతున్న ధరణి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి ఈ నెల 21, 22న జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కోచ్ కనకయ్య, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సాంబశివరావు, సునీల్ కుమార్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

13 పాఠశాలలకు రూ.33 లక్షల సామగ్రి

సీఎస్‌ఆర్ కింద సామగ్రి వితరణ వివరాలను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: మంగళగిరి మండలంలోని 13 పాఠశాలలకు టయోటా కిర్లోస్కర్ మోటార్స్ సంస్థ సీఎస్‌ఆర్ కింద రూ.33 లక్షల విలువైన సామగ్రిని వితరణగా అందించగా.. వాటిని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా చేతుల మీదుగా పాఠశాలలకు అందజేశారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో సంస్థ ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి పాఠశాలలకు అవసరమైన ఫర్నిచర్‌తో పాటు క్రీడా, వంట సామగ్రి అందించిన టయోటా కిర్లోస్కర్ మోటార్స్ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో డీఈవో సి.వి.రేణుక, సంస్థ ప్రతినిధి బి.నిఖిల్, సీఎస్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్‌రావు, పృధ్వి టయోటా ఎండీ పృధ్వి మలెంపాటి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక

క్రీడాకారులతో ఉపాధ్యాయులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14 బాలబాలికల కబడ్డీ జట్టుకు మంగళగిరి మండలం నూతక్కి పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. పోటీలను వల్లూరు సూర్యలక్ష్మీనారాయణ ప్రసాద్ ప్రారంభించారు. ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని జేమ్స్‌వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు నూతక్కి రవి, దాసరి భాస్కరరావు, మెల్లెంపూడి రవి, మంజులత, కరిముల్లా, నూతక్కి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన 16 మంది క్రీడాకారులను కళాశాలల డైరెక్టర్ రాజశేఖర్ అభినందించారు.

ఆర్టీసీకి రూ.19 లక్షల ఆదాయం

పట్నంబజారు, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా ఆర్టీసీకి రూ.19లక్షల ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం తెలిపారు. మంగళవారం ఆమె 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కార్తిక మాసంలో ప్రతి శని, ఆదివారాల్లో పంచారామాలైన అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరానికి 32 ప్రత్యేక బస్సులు, శైవ క్షేత్రాలైన యాగంటి, శ్రీశైలం, మహానందికి 15 ప్రత్యేక బస్సులు, శ్రీశైలంకు 10 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

దేశ సేవకు అగ్నిపథ్ సదవకాశం

మాట్లాడుతున్న వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ అలీ

గోరంట్ల, న్యూస్‌టుడే: దేశ సేవ చేయాలనుకున్న యువతకు అగ్నిపథ్ సదవకాశమని 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ అలీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో భారత వైమానిక దళంలో అవకాశాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. వింగ్ కమాండర్ యాకుబ్ అలీ మాట్లాడుతూ భారత వైమానిక దళంలోని ఉద్యోగ అవకాశాలను వివరించారు. దేశ సేవ కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అగ్నిపథ్ పథకం, దాని ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గాబాయి, డీఈవో సి.వి.రేణుక, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి గుణశీల, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వదేశాగమన శుభాకాంక్షలు

శ్రీ బోయపాటి వెంకటరమణ - శ్రీమతి ధనలక్ష్మి గార్లు

అధ్యక్షులు : శ్రీ మల్లేశ్వరస్వామి సేవాసమితి, పెదకాకాని

కన్వీనర్ : పెదకాకాని అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి

కార్యదర్శి : అమేయ అమెచ్యూర్ రేడియో అసోసియేషన్

ఆం.ప్ర. రాష్ట్ర ఖాదీ బోర్డు మాజీ సభ్యులు

ఆం.ప్ర. రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి మాజీ సభ్యులు

అనురాగ ఆప్యాయతలకు నిలయమై అందరి పట్ల ప్రేమాభిమానాలు పంచుతున్న

శ్రీ బోయపాటి వెంకటరమణ గారు

శ్రీమతి ధనలక్ష్మి గారు

అమెరికా పర్యటనను దిగ్విజయముగా ముగించుకొని

నేడు మాతృ భూమికి విచ్చేయుచున్న సందర్భంగా

స్వాగత సుమాంజలులు

కుటుంబసభ్యులు & బంధుమిత్రులు

మరియు శ్రీ మల్లేశ్వరస్వామి సేవాసమితి కార్యనిర్వాహక వర్గం

ఎందుకొచ్చారు.. ఎందుకెళ్లారు?

అక్రమ తవ్వకాలపై నోరు మెదపని అధికారులు

స్పందనకు వందనం

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను భూగర్భ గనుల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. గుంటూరుకు చెందిన వైకాపా సానుభూతిపరుడు గ్రామంలో శనివారం గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టాడు. భారీ యంత్రాలతో తవ్వకాలు చేసి టిప్పర్ల సహాయంతో మట్టిని తరలించే ప్రయత్నం చేశాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు టిప్పర్లను క్వారీ నుంచి బయటకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. అక్రమ తవ్వకాలపై 'ఈ మట్టి దోపిడీకి అంతేది? శీర్షికతో నవంబర్ 18న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులు స్పందించి మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ విషయంపై భూగర్భ గనుల శాఖ అధికారులను ఫోన్‌లో పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. అక్రమ తవ్వకాల్లో ఉన్నతాధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. తూతూమంత్రంగా విచారణ చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరీక్షల నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా..?



చేతిరాతతో ఇచ్చిన ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ మూడో సెమిస్టర్ పరీక్ష పత్రం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్, అనలిటికల్ కెమిస్ట్రీ తదితర విభాగాల్లోని విద్యార్థులకు చేతిరాతతో తయారు చేసిన ప్రశ్నపత్రం ఇవ్వడంతో అర్థంకాక ఆందోళన చెందారు. సాధారణంగా ప్రతిసారి 10 ప్రశ్నలిచ్చి ఏవైనా ఐదు రాయాలని సూచిస్తారు. కానీ ఈసారి 10 ప్రశ్నలిచ్చి ఎన్ని రాయాలో సూచనల్లో పేర్కొనలేదు. అన్నింటికి సమాధానం రాయాలా? ఐదు ప్రశ్నలకే రాయాలా తెలియక విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి లోపభూయిష్టంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. బోధనేతర సిబ్బందిని పరీక్షల పరిశీలకులుగా నియమించినట్లు తెలిసింది. బాపట్ల జిల్లాలోని ఓ కళాశాలలో అదే కళాశాలకు చెందిన అధ్యాపకుడిని పరిశీలకుడిగా నియమించగా.. పల్నాడు జిల్లాలోని ఓ కళాశాల కరస్పాండెంట్‌ను గత ఏడాదిన్నరగా ఏ పరీక్ష నిర్వహించినా పరిశీలకుడిగా పంపిస్తున్నట్లు సమాచారం. దీనిపై పీజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య సుబ్బారావును న్యూస్‌టుడే వివరణ కోరగా.. తుపాను ప్రభావంతో ప్రశ్నపత్రం తయారీలో ఆలస్యమైందన్నారు. పరీక్షలను కొన్ని రోజులు వాయిదా వేయాలని అధికారులను అడిగినా పట్టించుకోలేదని చెప్పారు. ప్రశ్నపత్రం తయారు చేసిన వ్యక్తి చేతిరాతతో పంపించారని, సమయం లేకపోవడంతో దానిని ప్రింట్ తీసి ఇచ్చామన్నారు. కేవలం పది మంది ఉన్నారనే ఉద్దేశంతోనే అలా చేశామని చెప్పారు. మరోసారి ఇలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సర్వేలను నిరంతరం పర్యవేక్షించాల్సిందే

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలకు సంబంధించి జిల్లాలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వెంగళాయపాలెం చెరువు తరహా అభివృద్ధికి ఇతర గ్రామాల్లో అనువైన చెరువులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పీఎంఏవై గ్రామీణ్‌కు డిమాండ్ సర్వే వేగవంతానికి సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవోలు సమావేశం నిర్వహించాలని సూచించారు. అర్బన్ హౌసింగ్ లేఔట్లలో మౌలిక సౌకర్యాల కల్పన ప్రతిపాదనలు మున్సిపల్ కమిషనర్లు సోమవారం నాటికి అందించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించి ఆటో డ్రైవర్ల సేవలో, తల్లికి వందనం నగదు జమ పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. సర్వేల్లో నిర్లక్ష్యం వహించే సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేను అధికారులు పర్యవేక్షించాలని, మ్యుటేషన్లను డివిజన్ అధికారులు పరిశీలించాలన్నారు. సరిహద్దు వివాదాలు, విస్తీర్ణం తేడాలపై జారీ చేసిన స్పీకింగ్ ఆర్డర్లను మరోసారి తనిఖీ చేయాలని సూచించారు. సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఏపీఎఫ్ఐఆర్‌లో రైతుల ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, డీపీవో నాగసాయికుమార్, డ్వామా పీడీ శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

'పెట్టుబడులు తీసుకురాలేక వైకాపా చౌకబారు విమర్శలు'

మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, మాధవి, నసీర్, నాయకులు మోహనకృష్ణ, దేగల ప్రభాకర్, దాసరి రాజా మాస్టారు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'అయిదేళ్ల అసమర్థ పాలన వెలగబెట్టిన జగన్ హయాంలో పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడం చేతగాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారు. దీనిని చూసి ఓర్వలేక వైకాపా నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నారు'.. అని తెదేపా ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ మండిపడ్డారు. తెదేపా జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ 'విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో ప్రపంచంలోని దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకొచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్‌తో నాడు హైదరాబాద్, నేడు అమరావతి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. జగన్ హయాంలో అమరరాజా బ్యాటరీస్, కియా మోటార్స్ సంస్థలు తరలిపోయాయి. నీటిపారుదల శాఖను వెలగబెట్టిన వైకాపా నేత అంబటి ఏమీ చేయలేక చేతులెత్తేశారు'.. అని ఎద్దేవా చేశారు.

అధికారంలోకి వచ్చే అవకాశాలు లేక..

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రాబోయే పదేళ్లలో అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో వైకాపా నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పర్సంటేజీల కోసం బెదిరించడంతో పారిశ్రామికవేత్తలు పారిపోయారన్నారు. సీఐఐ సదస్సు విజయవంతంతో ఓర్వలేక అసత్య ప్రచారం చేస్తున్న జగన్ సైన్యాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను కుప్పకూల్చిందన్నారు. వాటిని గాడిలో పెట్టుకుంటూ సీఎం చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీఐడీసీ ఛైర్మన్ దేగల ప్రభాకర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ ఛైర్మన్ దాసరి రాజా మాస్టారు మాట్లాడుతూ వైకాపా హయాంలో ఉద్యోగాల్లేవ్, పరిశ్రమల్లేవ్, ఉద్యోగాల కల్పనలో యువతను దగా చేశారని మండిపడ్డారు. సమావేశంలో తెదేపా నాయకులు కంచర్ల శివరామయ్య, గోళ్ల ప్రభాకర్, కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, బొబ్బిలి రామారావు, అన్నాబత్తుని జలయక్ష్మి, తిరువళ్లూరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త

లక్ష్మీపార్వతి (పాత చిత్రం)

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం యర్రబాలెంలోని పుచ్చలపల్లి సుందరయ్య రోడ్డులో నివాసం ఉంటున్న తులిమి లక్ష్మీపార్వతి(29) మంగళవారం భర్త చేతిలో హత్యకు గురైంది. మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన లక్ష్మీపార్వతికి.. శంకర్‌రెడ్డితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దికాలం మచిలీపట్నంలో కలిసి ఉన్న వీరు.. మనస్పర్థల కారణంగా విడిపోయారు. అనంతరం లక్ష్మీపార్వతి గుంటూరు జిల్లా మంగళగిరి మండలం యర్రబాలెంలో ఉంటోంది. ఈ నేపథ్యంలో మండలంలోని చినకాకాని గ్రామానికి చెందిన మరో వ్యక్తితో పరిచయం ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న భర్త శంకర్‌రెడ్డి అనుమానంతో భార్యపై కక్ష పెంచుకుని ఆమెను అంతమొందించాలని భావించాడు. ఈ క్రమంలో సాయంత్రం 3 గంటల సమయంలో ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లి ఆమెను బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకుని గొంతుపట్టుకున్నాడు. భయంతో ఆమె కేకలు వేస్తూ తప్పించుకునేందుకు ఇంట్లో నుంచి పక్కింటి వైపు పరుగులు తీసింది. అయినా శంకర్‌రెడ్డి ఆమెను వెంటాడి గొంతు నులిమి హత్య చేసినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడించారు. సీఐ బ్రహ్మం, ఎస్ఐ వెంకట్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మహిళ హత్యకు గల కారణాలపై విచారణ జరిపారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఆమెకు సంబంధించిన పాత చిత్రాలను మీడియాకు విడుదల చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆధార్ శిబిరాల నిర్వహణపై డీఎల్‌పీవో, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఈవో కృష్ణ మాట్లాడుతూ ఆధార్ నమోదుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలన్నారు.

నూర్పిడి యంత్రంలో పడి మహిళ మృతి

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మినుముల నూర్పిడి యంత్రంలో పడి మహిళ మృతిచెందిన ఘటన కొల్లిపర మండలం వల్లభాపురం శివారు లంకభూముల్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలేనికి చెందిన షేక్ కాశింబి (35). మంగళవారం వల్లభాపురం శివారులోని లంక భూముల్లో మినప పంట కోసేందుకు కూలీకి వెళ్లారు. కోసిన పంటను యంత్రంలో వేస్తుండగా చీర కొంగు అందులో పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన కాశింబి అక్కడికక్కడే మృతిచెందారు. భర్త ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని కొల్లిపర ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు. కాశింబికి ఇద్దరు పిల్లలున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ౹కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 650 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

కక్షతోనే వెంకటరెడ్డి అరెస్టు

మాజీ మంత్రి అంబటి రాంబాబు

గుంటూరు(గోరంట్ల), న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరెడ్డిని కక్ష పెట్టుకుని అరెస్టు చేశారని మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే వెంకటరెడ్డిని అరెస్టు చేశారని, దీనికి గల కారణాలు తక్షణమే వెలువరించాలన్నారు. అరెస్టు ఎందుకు చేశారో కనుక్కునేందుకు ఫోన్ చేసినా పోలీసుల నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. పరకామణి చోరీ కేసులో విచారణకు వెళ్తూ.. సీఐ చనిపోతే అది హత్యా.. ఆత్మహత్యా అనేది ఎవ్వరికీ తెలియదన్నారు. సీఐ మృతి ఘటనపై మాట్లాడకూడదా, మాట్లాడితే అరెస్టులు చేస్తారా.. అని ప్రశ్నించారు. తక్షణం పోలీసులు వెంకటరెడ్డిని ఎందుకు అరెస్టు చేశారో.. ఎప్పుడు కోర్టులో హాజరు పరుస్తారో చెప్పాలన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

TO LET

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No: 6-11-39, 1st Floor Backside Office/ Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

గుంటూరు, గుంటూరు వారి తోట 1వ లైన్, డి.నెం: 13-2-17, గ్రౌండ్ ఫ్లోర్, 1500 S.Ft., హాస్పిటల్స్, క్లినిక్స్, ల్యాబ్స్, ఫార్మసీ అనుకూలం. 97032 22607.

JOBS

Wanted Export Company Staff 1. Accountant, 2. Supervisor (10th Pass), 3. Security Guard. Contact: 73864 82800, 99082 14472.

Sonal Group Wanted for vacancies cotton Industry All Andhra Pradesh District &Villages Reposhed, Experienced in cotton Field, (Position) sampling, Inspection &Testing, value of vacancies 100no,s & above, Qlf: Inter&above, Experienced/Freshers, Salary 15000/-PM&Petrol, Please Call and collect Address in Guntur, interview on 19-11-25 to 20-11-25& timing 9am to 6pm, Send CV & bio-data can send to WhatsApp/Contact: Mr.K.S Rao: 9374731234, Email id: office@sonalgroup.in

DSA ఏజెన్సీ గుంటూరు నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99489 35789, 80081 00872.

గుంటూరు జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వయసు 50 సం॥ లోపు. ఆకర్షణీయమైన జీతము. 90100 42973, 82478 14976.

కస్టమర్ అడ్రస్ వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. 81251 10304 గూడూరు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, సూళ్లూరుపేట.

గుంటూరులో గల కాలేజి హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు 35 సంవత్సరాల పైబడిన లేడీ వార్డెన్స్ మరియు బస్సు డ్రైవర్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61124.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూమ్‌లను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు 1) Pharmacist, 2) Receptionist కావలెను. 85199 93945.

తుళ్లూరు మం, అనంతవరం గ్రామం లోని 2-3 సం॥ అనుభవమున్న క్రషర్ మెయింటెన్స్ చేయుటకు సూపర్‌వైజర్ మరియు క్రషర్ డిస్పాచ్ సూపర్‌వైజర్ కావలెను. 80082 95361.

తాడికొండ X రోడ్‌లో క్రొత్తగా ప్రారంభిస్తున్న హోటల్ రూమ్స్ & కన్వెన్షన్ హాల్ నందు సూపర్‌వైజర్స్, లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. 98492 14413.

స్వర్ణముఖి పెట్రోలియం (బోయపాలెం) నందు పంపు బాయ్స్ కావలెను. (24x7). Cont: 90001 75999, 90001 02177.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం. పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

(c) eenadu

శాకాహారం అమృతాహారం

ప్రదర్శనలో సుబ్బారావు, మల్లికార్జునరావు తదితరులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: శాకాహారం అమృతాహారమని తెనాలి పిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటీ నిర్వాహకులు జాస్తి సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన 'మహాకరుణ శాకాహార ర్యాలీ'లో ఆయన పాల్గొన్నారు. సకల జీవరాశుల స్వేచ్ఛకై ఈ ర్యాలీ చేపట్టినట్లు వివరించారు. చుండూరు నాగమల్లికార్జున రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి

●తెనాలి ●పొన్నూరు

సందడిగా ఆటల పోటీలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య దివ్యతేజోమూర్తి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. బుధవారం ఫార్మసీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం: 1100
అత్యల్పం: 700
సగటు: 900

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ షరాఫ్‌బజార్ జైన్ మందిరం వీధి వాహనాల పార్కింగ్ ప్రాంతంగా మారింది. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా వాహనాలు నిలుపుతున్నారు. - ప్రకాష్, మురళి - తెనాలి
✓ ట్రాఫిక్ పోలీసులతో రోజూ పర్యవేక్షణ చేయిస్తాం. - జనార్దనరావు, డీఎస్పీ

? బస్టాండ్ వెనుక ప్రాంతం నుంచి ప్రకాశంబజార్ వెళ్లే మార్గంలోని కాలువల్లో మురుగు పారడం లేదు. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - సుధాకర్, ప్రకాశంబజార్
✓ మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటాం. - రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు పట్టణ పరిధిలోని శాంతినగర్ ప్రధాన రహదారిలో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేసే విధంగా చూడండి. - ఎన్.రాంబాబు
✓ వీధి దీపాన్ని బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. - షేక్ హసీనా, సహాయ ఇంజినీరు

? పొన్నూరు పరిధిలోని వీవర్స్ కాలనీలో చెత్త పేరుకుంది. - డి.వెంకట్రావు, వీవర్స్‌కాలనీ
✓ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - పోతురాజు, ప్రజారోగ్య శాఖాధికారి - న్యూస్‌టుడే, పొన్నూరు

✦ తెనాలి పట్టణ యడ్లలింగయ్య కాలనీలో సర్వీస్ లైన్లు కిందుగా వేలాడుతున్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. లైన్లను సరిచేయించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్ ✦ పట్టణ పరిధి డీవీసీ కాలనీలోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

స్పందనకు వందనం

ప్రమాదకరంగా ఫిట్‌వాల్వులు.. పట్టించుకోని అధికారులు

పట్టణం	పొన్నూరు
వార్డులు	31
కుటుంబాలు	19,075
జనాభా	61,500
కుళాయిలు	5500
ఫిట్‌వాల్వులు	45

పొన్నూరు, న్యూస్‌టుడే

పుర ప్రజలకు రోజూ లక్షలాది లీటర్ల తాగునీటిని నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణ పరిధిలోని పాత పొన్నూరు, సంజీవ్‌నగర్, సాయినగర్, నిడుబ్రోలు, రైలుపేట, క్యాబిన్‌పేట, తదితర ప్రాంతాల్లో పైపులను అనుసంధానం చేసే సమయంలో మంచినీటి సరఫరాను నియంత్రించేందుకు ఫిట్‌వాల్వులు ఏర్పాటు చేశారు. అవి నిర్మించిన సమయంలో రహదారి కంటే ఎత్తుగా ఉన్నాయి. కాలక్రమేణ నూతన సిమెంటు రహదారులు నిర్మించారు. కొన్ని ప్రాంతాల్లో ఫిట్‌వాల్వులు రహదారికి సమాంతరంగా ఉండగా.. మరి కొన్ని ప్రాంతాల్లో రహదారి కంటే తక్కువ ఎత్తులో ఉండడంతో ఈ సమస్య మరింత ఇబ్బందిగా మారింది.

పాత పొన్నూరులో ఇలా...

బండలు విరిగి..

భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరంతా ఆ ఫిట్‌వాల్వుల్లోకి చేరుతోంది. ఎక్కడైనా పైపులైనుకు లీకు ఏర్పడితే మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం లేకపోలేదు. ఆ ఫిట్‌వాల్వులపై ఏర్పాటు చేసిన బండలు విరిగిపోయాయి. అవి ప్రధాన రహదారుల వెంట ఉండడంతో వాటిపై బండలు సరిగా లేకపోవడంతో.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది తాత్కాలికంగా ఏదో ఒక వస్తువును వాటిపై అడ్డంగా పెట్టి కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫిట్‌వాల్వుల గోడలు ఎత్తు పెంచడంతో పాటు వాటిపై బండలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోడల ఎత్తు పెంచుతాం..

దీనిపై పురపాలక సంఘం సహాయ ఇంజినీరు షేక్ హసీనాను న్యూస్‌టుడే వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫిట్‌వాల్వుల గోడలను ఎత్తు పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విరిగిన బండలు తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కంపోస్టుయార్డులో ఆకస్మిక తనిఖీ

అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రామఅప్పలనాయుడు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: వీధి కుక్కల సంరక్షణ, ఆవశ్యక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె. రామఅప్పలనాయుడు అధికారులను సూచించారు. ఆయన మంగళవారం కంపోస్టుయార్డులో తనిఖీలు చేశారు. వినియోగంలో లేని బయో గ్యాస్ ప్లాంటు, కొబ్బరి పీచు తయారీ యంత్రం పరికరాలను పరిశీలించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వీధి కుక్కల ఆహారానికి సంబంధించి మాంసం వ్యాపారులతో మాట్లాడాలని సూచించారు. కూరగాయల మార్కెట్ వ్యర్థాలతో తయారు చేస్తున్న ఎరువు పరిమాణం పెంచాలన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భరోసా

మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, న్యూస్‌టుడే: రజక కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు సానుకూలంగా ఉన్నామని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. ఆయన మంగళవారం రజక సంఘ నేతలతో సమావేశం నిర్వహించారు. కల్యాణ మండపం నిర్మించేందుకు నెలకొన్న జాప్యానికి గల కారణాల గురించి చర్చించారు. తొలిదశలో గుర్తించిన స్థలం వివాదాస్పదంగా మారిందని పేర్కొన్నారు. మండపం నిర్మాణానికి అనువైన స్థలాలు గుర్తించామని, పంచాయతీ తీర్మానం పొందిన వెంటనే అనుమతులు జారీ చేసేందుకు సిద్ధమని సంఘ నేతలకు భరోసానిచ్చారు.

CHANGE OF NAME

I, SAMBRAJYAM VALLURU W/o MAHALAKSHMIPATHI RAO (Old Name), R/O, D. N: 3-14-29, Nehru Road, Rajakapet, Tenali,Guntur(Dist), A. P. I Have changed my Name VALLURU SAMRAJYAM W/o V MAHALAKSHMIPATHI RAO (New Name) Hereafter my Name is VALLURU SAMRAJYAM W/o V MAALAKSHMIPATHI RAO.

డిజిటల్ అగ్రికల్చర్ విధానం పరిశీలన

పెదకాకాని, న్యూస్‌టుడే: నంబూరులో రైతులు పాటిస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ విధానాన్ని మంగళవారం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర డిజిటల్ అగ్రికల్చర్ ప్రాజెక్టు అధికారులు అనుష్క, శుభమ్, చిరంజీవి పరిశీలించారు. కేంద్ర వ్యవసాయ యాప్‌ల పనితీరు గురించి రైతులతో చర్చించారు. ఇంకా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయ అధికారి అరవింద్ ఏపీఏఎస్ యాప్ పనితీరు తెలుసుకున్నారు. అవసరం మేరకు ఎరువులు, రసాయనాలు వాడాలని రైతులకు సూచించారు. ఏవో రమణకుమార్, రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో కుప్పకూలిన ఉద్యోగిని

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాధిక అకౌంట్స్ విభాగంలోని బీరువాలో దస్త్రాలు తీస్తుండగా ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలి స్పృహ కోల్పోయారు. అప్రమత్తమైన సహచర ఉద్యోగులు వెంటనే కమిషనర్ రామఅప్పలనాయుడు, మేనేజర్ జయకర్ దృష్టికి తీసుకెళ్లారు. వారు వచ్చి ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేసి షుగర్ స్థాయిలు తగ్గాయని విజయవాడ నరాల వైద్య నిపుణుల వద్దకు తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించారు. ప్రస్తుతం ఆమె క్షేమంగా ఉన్నట్లు తెలిసింది.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

పొన్నూరు, న్యూస్‌టుడే: ధాన్యం తేమశాతం 17 లోపు ఉండాలని మండల వ్యవసాయ అధికారి రాజవరపు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దొప్పలపూడి, మన్నవ గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కరపత్రాలను రైతులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల్లో పేరు నమోదు చేసి ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. దళారులకు తక్కువ ధరకే ధాన్యం విక్రయించొద్దని తెలిపారు. రబీలో సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏఈవో శ్రీకాంత్, సిబ్బంది పవన్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న వెంకటేశ్వరరావు

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధి 29వ వార్డులో విద్యుత్తు లైన్లు మరమ్మతుల దృష్ట్యా షరాఫ్‌బజార్, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం రోడ్డు, ఆర్టీసీ డిపో, డీవీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఆర్.వీ.శంకర్ మంగళవారం తెలిపారు.

చక్కటి చేతిరాతతో మెరుగైన ఫలితాలు

విజేతలతో తహసీల్దార్, ఎంఈవోలు, ఉపాధ్యాయులు

తెనాలి టౌన్: చక్కటి చేతిరాతతో పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని తహసీల్దార్ గోపాలకృష్ణ, మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, జయరామిరెడ్డి పేర్కొన్నారు. తెనాలి మారీసుపేటలోని నెల్లూరి చెంచురామానాయుడు పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మహారాష్ట్రకు చెందిన రెయిన్‌బో సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన చేతి రాత పోటీల్లో పతకాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కోటమల్లు, చిత్రలేఖనోపాధ్యాయుడు వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల మేర ధాన్యం కొనుగోళ్లు

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనల మేర ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దారు మహమ్మద్ జియావుల్ హక్ పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో రైస్ మిల్లర్లతో మంగళవారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యాపారి తప్పని సరిగా బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని చెప్పారు. రైతు సేవ కేంద్రాల్లో గోతాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

మిల్లర్లతో చర్చిస్తున్న తహసీల్దారు మహమ్మద్ జియావుల్ హక్

In the Court of the Hon'ble Prl Junior Civil Judge: Tenali

E.P.51/2025 in O.S.256/23

Between: Somavarapu Sunitha .. D.Hr

And

Kodali Saraswati Devi .. J.Dr

Subject: పై నెంబర్ ఇ.పి.లో యున్నటువంటి జారీకాబడి ఉన్న షెడ్యూలు ఆస్తి [illegible] 08-12-2025 ఉదయం 10.30 గంటలకు [illegible] వేలం వేయబడును. [illegible]

Schedule: Guntur District, Tenali Sub District, Tenali Mandal Survey No.293, an extent of Ac.2.18 cents of wet land is bounded by: **East:** Nannapaneni Subbarao's land, **South:** Kanneganti Srinivasa Rao's land, **West:** Tenali Sri Venugopala Swamy Vari Devasthanam's land. **North:** Annabathuni Srinivasu's land. Within these boundaries to an extent of A.C.2.18 Cents of wet land.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

డి.హెచ్.ఆర్ Value: 30,00,000/-,
అమీనా Value: 35,00,000/-,
మార్కెట్ Value: 1,30,80,000/-,
ప్రోక్లమేషన్ & సేల్: 8/12/2025

Further Hearing: 15/12/2025

ఇట్లు, పరిశా రవీంద్రబాబు, డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేట్, తెనాలి. గుంటూరు జిల్లా. సెల్: 98483 56442.

వ్యాయామశాలల్లో సాధకుల సందడి

సత్యనారాయణ పార్కులో..

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: రోజువారీ జీవితంలో ఉత్సాహంగా ఉండడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రైవేటు వ్యాయామశాలల్లో రుసుములు చెల్లించి చేసుకోలేని వారి కోసం.. మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని ఆరు ఉద్యానాలు, రెండు ఓపెన్ స్థలాలు, ఇండోర్ స్టేడియంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. వీటికి సాధకుల నుంచి విశేష ఆదరణ లభిస్తుంది. రోజూ ఉదయం, సాయంత్రం సుమారు రెండు వేల మంది వీటిపై సాధన చేస్తున్నారు. పైకస్, సత్యనారాయణ పార్కుల్లో మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా పదేసి చొప్పున వ్యాయామ పరికరాలు బిగించారు.

కార్తిక దీపం.. సకల శుభకరం

పొన్నూరు: ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

విశేష అలంకారంలో బాలత్రిపురసుందరీదేవి

కార్తిక మాస మంగళవారం సందర్భంగా పలు ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని దీపారాధన పూజలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

– న్యూస్‌టుడే బృందం

సంగంజాగర్లమూడిలోని శ్రీసంగమేశ్వర ఆలయంలో..

కొత్తపేట: శివలింగానికి అన్నాభిషేకం

రామలింగేశ్వరపేటలో సామూహిక కుంకుమ పూజ..

మహిళా గ్రంథాలయంలో విద్యార్థులతో కమిషనర్ రామఅప్పలనాయుడు

వల్లభాపురంలో తాము గీసిన చిత్రాలు చూపుతూ..

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని వక్తలు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, పద్యాల అప్పగింత తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. - న్యూస్‌టుడే, బృందం

కొలకలూరులో..

చేబ్రోలు: పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

వర్సిటీలో వనసమారాధన

ఐక్యత చాటుతున్న బీసీ ఉద్యోగ, అధ్యాపకుల సంఘం నేతలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బీసీ ఉద్యోగ, అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.శంకర్రావు, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పులెకు బీసీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ.. బీసీలంతా ఐక్యంగా కలిసి పనిచేయాలని సూచించారు. శంకర్రావు మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు సంఘం అండగా ఉంటుందన్నారు. ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించాలన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వీరయ్య, ఆచార్య త్రిమూర్తిరావు, డీఈఈ వెంకటేశ్వరరావు, బీసీ సంఘం నాయకులు క్రాంతికుమార్, రమణయ్య, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

కొల్లిపర, న్యూస్‌టుడే: సహకార సంఘాల అభ్యున్నతికి కృషి చేయాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ భావన్నారాయణ అన్నారు. 72వ ఆల్‌ఇండియా సహకార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కొల్లిపర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో సంఘ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రైతులకు బాసటగా నిలవాలని పేర్కొన్నారు. రాయితీతో కూడిన రుణం, గిడ్డంగి సదుపాయాలు, ఎరువుల పంపిణీ తదితర అంశాలను రైతులకు వివరించారు. సంఘం అభ్యున్నతికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి శివనాగిరెడ్డి, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు మార్చి.. ఉన్నతాధికారులకు దొరికిపోయాడు

కొల్లిపర, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకుని (వీఆర్‌ఏ)గా బాధ్యతలు నిర్వహించాల్సిన ఉద్యోగికి కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో కీలక బాధ్యతలు అప్పగించారు. దీంతో అతను ఉన్నతాధికారులకు తలలో నాలుకలా మారాడు. సదరు వీఆర్‌ఏపై పలుమార్లు అర్జీదారులు ఫిర్యాదులు చేసిన ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరించారు. దీంతో అతను జనన మరణ రికార్డుల్లో తఖరారుకు పాల్పడ్డాడు. రికార్డుల్లో కొత్తగా పాత తేదీలతో పేరును నమోదు చేశాడు. ప్రతిఫలంగా రూ.10 వేలు పుచ్చుకున్నాడు. ఈ విషయం తెలిసిన అధికారులు తెల్లబోయారు. చేసిన తప్పుకు సదరు ఉద్యోగిని కార్యాలయం నుంచి పంపించేశారు. క్రమశిక్షణ చర్యలపై మీమాంస అధికారులను వేధిస్తోంది.

బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

తక్కెళ్లపాడు (పెదకాకాని), న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై మిరాజ్ తెలిపారు. తక్కెళ్లపాడులోని ఎమ్‌జీఎస్ పారిశ్రామిక శిక్షణ సంస్థ కళాశాలలో మంగళవారం బాల భవన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. యుక్త వయసులో చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ల మూడి శేఖర్‌బాబు చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ టి.ఇమ్మానుయేల్, సంస్థ కోఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'నాయీ బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం'

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌కే కళాసదనంలో నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల వనసమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయీ బ్రాహ్మణులకు సముచిత గౌరవం కల్పించారని తెలిపారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, విశ్రాంత డీఐజీ ఎం.రవీంద్రబాబు, విశ్రాంత ట్రెజరీస్ జె.డి. ఎం.సురేంద్రబాబు, సహాయ లేబర్ కమిషనర్ శివప్రసాద్, డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు శివశేషగిరిరావు, కె.వెంకట్, కె.రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూంలో కిందపడి మహిళ మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన హసీనా (28) సోమవారం రాత్రి స్నానం చేసేందుకు బాత్ రూంకు వెళ్లి ఎంతసేపయినా తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఆమె కింద పడిపోయి ఉన్నారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు.

బంగారు నగల చోరీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పాండురంగపేటలో నివాసముంటున్న వృద్ధ దంపతులు చెంచుపేటలో బడ్డీ కొట్టు నిర్వహిస్తున్నారు. రోజూ మధ్యాహ్నం ఒకరి తర్వాత మరొకరు ఇంటికి వెళ్లి భోజనం చేసి దుకాణానికి వస్తారు. అదే విధంగా సోమవారం భర్త భోజనం చేసి దుకాణం వద్దకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, పైన ఇల్లు ఖాళీ ఉందా? తాను రైల్వే ఉద్యోగిని అంటూ పరిచయం చేసుకున్నాడు. పెద్దాయన అతనికి ఇల్లు చూపించారు. అనంతరం ఇంటికి గొళ్లెం పెట్టి తాళం వేయకుండా దుకాణానికి బయల్దేరారు. రాత్రి దుకాణం మూసేసి ఇంటికి వచ్చిన దంపతులకు మంచం కింద దాచిన 50 గ్రాముల నల్లపూసల గొలుసు, మరో గొలుసు కనిపించలేదు. చోరీకి గురయ్యాయని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి కోసం వచ్చిన వ్యక్తిపై అనుమానంతో స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు ఖమ్మం వాస్తవ్యులు మాడభూషి లేటు శ్రీనివాసాచార్యులు గారి కుమారుడు మాడభూషి చంద్రమోహన్ గారి సంజాయిషీ పొంది తెలియచేయునది ఏమనగా .

ఈ క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్థి నాక్లయింటు తాతగారు అయిన లేటు కిళాంబి కృష్ణావతారంగారి స్వార్జితపు ఆస్థి అని, ఆయన తదనతరం ది. 16-11-1967 తేదీగల రిజిష్టరు వీలునామా నం 118/1967 ద్వారా షెడ్యూలు దాఖలా ఆస్థి తన భార్య అయిన కిళాంబి రుక్మిణమ్మకు సంక్రమించినదని, సదరు రుక్మిణమ్మ గారి తదనంతరం ది. 15-05-1985 తేదీగల రిజిష్టరు వీలునామా నం 160/1985 ద్వారా షెడ్యూలు దాఖలా ఆస్థి నా క్లయింటు తల్లిగారయిన మాడభూషి వెంకట సీతాదేవిగారికి సంక్రమించినదని, సీతాదేవిగారి సోదరురులు సౌభాగ్యం అనే ఆమె ద్వారా షెడ్యూలు ఆస్థిని కాజేయటానికి ప్రయత్నం చేయగా మాడభూషి వెంకట సీతాదేవిగారు OS No. 45/1994 నంబరు గల దావా తెనాలి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారికోర్టులో తన సోదరులపైన మరియు తాళ్ళూరి సౌభాగ్యంపైన మరికొందరి పైన దాఖలు చేసి ది.19-05-2005న డిక్రీ పొంది దరిమిలా స్వాధీనము పొందియున్నారని. దరిమిలా మాడభూషి వెంకట సీతాదేవి ఇంటేస్టేటుగా చనిపోగా ఆమె షెడ్యూలు దాఖలా ఆస్థి నాక్లయింటుకు, నాక్లయింటు సోదరి స్వర్ణలతకు సంక్రమించినదని, వారు ఎవరికి ఆస్థిని అన్యాక్రాంతములు చేయలేదని, మాక్లయింటు మాడభూషి వెంకట సీతాదేవి సోదరులు చనిపోయిన దరిమిలా షెడ్యూలు దాఖలా ఆస్థిని ఎలాగైనా కాజేయాలనే దుర్బుద్ధితో, తాళ్ళూరి సౌభాగ్యం మరియూ లక్కరాజు కృష్ణకిషోర్ అనే వ్యక్తులు ఇద్దరు కుట్ర పన్ని, తాళ్ళూరి సౌభాగ్యం ఆస్థికి తనను యజమానిగా చూపుకుంటూ ఒక విక్రయ అగ్రిమెంటును లక్కరాజు కృష్ణకిషోర్ పేరున తయారు చేసి, లక్కరాజు కృష్ణకిషోర్ చేత తనపై దావ నం 284/2022 తెనాలి జూనియర్ సివిల్ జడ్జికోర్టులో దాఖలు చేయించుకుని, సదరు దావాలో తాళ్ళూరి సౌభాగ్యం వాదన చేయకుండా లక్కరాజు కృష్ణకిషోరుకు డిక్రి వచ్చేలాగా సహకరించినదని, దరిమిలా లక్కరాజు కృష్ణకిషోర్ చేత ఇపి దాఖలు చేయించినదని, అప్పుడుకూడా తాళ్ళూరి సౌభాగ్యం కోర్టుకు హాజరుకాకుండా లక్కరాజు కృష్ణకిషోరుకు అనుకూల తీర్పు వచ్చేలాగా సహకరించినదని, అనుకూల తీర్పు వచ్చిన దరిమిలా తాళ్ళూరి సౌభాగ్యం రిజిస్ట్రారు ఆఫీసువారిని మేనేజి చేసి లక్కరాజు కృష్ణకిషోర్ పేరున ది.25-04-2023 తేదీన విక్రయ దస్తావేజు నం 2493/2023 రుగా రిజిష్టరు చేసినారని, ఈ విషయము తెలిసి నాక్లయింటు లక్కరాజు కృష్ణకిషోరుకు లీగల్ నోటీసు పంపి దస్తావేజు మరియు ఓయస్ నం 284/2022 డిక్రీ రద్దు కొరకు దావా దాఖలు చేసినాడని ఇది తెలుసుకున్న లక్కరాజు కృష్ణకిషోర్ ఆస్థిని మరొకరికి అమ్మటానికి తీవ్రంగా ప్రయత్నాలు చేయుచున్నారని, షెడ్యూలు దాఖలా ఆస్థిపై లక్కరాజు కృష్ణకిషోర్ ఎటువంటి హక్కులు లేవని ఆస్థి ఒరిజినల్ దస్తావేజులు ఇప్పటికి నాక్లయింటు వద్దనే వున్నాయని, ఈరోజు వరకు ఆస్థి పన్నులు నా క్లయింటు తల్లిగారు అయిన మాడభూషి వెంకట సీతాదేవి పేరున చెల్లించుచున్నారని లక్కరాజు కృష్ణకిషోర్ సదరు లక్కరాజు పేరున వున్న విక్రయ దస్తావేజు రద్దు పరచి స్వాధీనం ఇప్పించమని కోరుచూ నాక్లయింటు తెనాలి 11 వ అదనపు డిస్ట్రిక్టు & సెషన్స్ జడ్జివారి కోర్టులో OS No. 17/2025 నంబరు గల దావా దాఖలు చేసియున్నాడని, కోర్టులో OS No. 17/2025 నంబరు గల దావాలో లక్కరాజు కృష్ణకిషోర్ అడ్వొకేట్లను నియమించుకుని వాదించుకొనుచూ దావా ఆస్తిని నాక్లయింట్లకు చెందకుండా చేయాలని దురుద్దేశ్యముతో ది 14-11-2025 తేదిన లక్కరాజు కృష్ణకిషోర్ స్నేహితులు అయిన కొల్లిపర శివశంకరుగారితో కలసి తన భార్య కొల్లిపర మాధవి పేరున దస్తావేజు నంబరు 5486/2025 విక్రయ దస్తావేజు ఎటువంటి ప్రతిఫలం లేకుండా క్రియేట్ చేసి సదరు కొల్లిపర మాధవి పేరున కరెంటు మీటరు ఇంటిపన్ను రశీదులు పొంది తద్వారా సదరు ఆస్థిని బ్యాంకులో తనఖా పెట్టి పెద్దమొత్తములో లోను పొంది సదరు లోను సొమ్ము వాటాలు పంచుకుని ఇతరులను మోసగించే ప్రయత్నములు చేయుచున్నారని, మునిసిపాలిటీవారు ఎలక్ట్రికల్ డిపార్టుమెంటువారు దస్తావేజు రిజిష్టరు అయిన వెను వెంటనే నోటీసు షెడ్యూలు ఆస్తివద్దకు వచ్చి ఎంక్వయిరీ చేయుచుండగా నాక్లయింటుకు తెలిసిన వ్యక్తుల ద్వారా విషయం తెలిసినదని, నాక్లయింటు సదరు కొల్లిపర మాధవిని పైతెలిపిన దావాలో పార్టీగా చేర్చి ఆమె పేరును వున్న విక్రయ దస్తావేజు సంబరు 5486/2025 దస్తావేజును రద్దు పరపించుటకు కోర్టులో పిటిషనులు దాఖలు చేసినాడని సదరు నంబరు 5486/2025 దస్తావేజు చట్టప్రకారం చెల్లదని, వారి మాటలు నమ్మి నోటీసు షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయరాదని తనఖాలు పెట్టుకోరాదని ఇందుకు భిన్నముగా ఎవరైనా ప్రవర్తించిన యడల నాక్లయింటు వారిని కూడా పైతెలిపిన దావాలో పార్టీలుగా చేర్పించికోర్టుద్వారా తగు చర్యలు తీసుకుని పరిహారములు పొందగలడని సంజాయిషీ పొంది తెలియచేయటమైనది.

షెడ్యూలు గుంటూరు జిల్లా, తెనాలి మండలం, తెనాలి టౌన్, బోసురోడ్డు, ఇంటినంబరు 22-11-110 TS No. 46,7వ వార్డు, 2వ బ్లాకులోగల 225 చ.గల స్థలం మరియూ దానిలోని RCC 412 చ.అ గ్రౌండ్ అంతస్థు, రేకుల షెడ్డు, 320 చ.అలో వున్న పెంకుటి ఇల్లు గల మొదటి అంతస్థుకు హద్దులు తూర్పు మునిసిపల్ బజారు దక్షిణం కోట బదరినాద్ వగైరాలు, పడమర బోసు రోడ్డు, వుత్తరం మాడభూషి చంద్ర మోహన్ ఈ హద్దుల మధ్య 225 చగల స్థలం మరియూ దానిలోని RCC గ్రౌండ్ అంతస్థు, రేకుల షెడ్డు పెంకుటి ఇల్లు గల మొదటి అంతస్థు మాత్రం.

ఇట్లు : నందికట్టి వెంకట మహేశ్వరరావు అడ్వోకేట్, # 5-23-15, పంచామృతం స్ట్రీట్ జయప్రకాశ్ నగర్, తెనాలి : 9676158237

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సీఆర్‌డీఏ యంత్రాంగం జవాబుదారీగా ఉండాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'రైతుల భాగస్వామ్యంతో రాజధాని అభివృద్ధి చేయాలి. సీఆర్‌డీఏ యంత్రాంగం రైతులకు జవాబుదారీతనంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రతి నెలా మూడో శనివారం సమావేశం నిర్వహించి చర్చించడం వల్ల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతు ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం రాయపూడి సమీపంలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో సీఆర్‌డీఏ అధికారులతో సమావేశం ముగిసిన తర్వాత వారు విలేకరులతో మాట్లాడారు. 'రైతులకు ఉన్న అనుమానాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకున్నాం. గ్రామ కంఠాలు, జరీబు భూముల సమస్యలు పరిష్కరించాలని కోరామ'న్నారు. డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ రైతులకు సమాధానం చెప్పకపోవడంపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటివరకు ఒక్క సమస్య పరిష్కరించలేదన్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, గతంలో ఇక్కడ పనిచేసి భూవ్యవహారాలు చూసిన అధికారి వల్లే సమస్యలు వచ్చాయని ప్రస్తావించామని వివరించారు.

వైద్య శిబిరానికి స్పందన

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మండలంలోని ఆత్మకూరులో వీజే డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పలువురికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావులు ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవో పుష్కార్ తదితరులు పాల్గొన్నారు.

పొనుగుపాడులో..

ఫిరంగిపురం: మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో పొనుగుపాడు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామలింగారెడ్డి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శుక్లం ఆపరేషన్ చేయించుకోనేవారికి ఉచిత రవాణా, భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా మాక్లయింట్ మంగళగిరి మండలం నిడమర్రు గ్రామ కాపురస్తుడు, ఎమ్మెల సుబ్బారావు గారి కుమారుడు, ఎమ్మెల నవీన్ కుమార్ గారి సంజాయిషి పొంది తెలియజేయునది ఏమనగా

దీ: 15-11-2025 తేదిన మాక్లయింట్ నిడమర్రు సెంటర్‌లో తను నెమలికంటి మురళిగారి వద్ద దీ: 04-12-2014న విక్రయదస్తావేజు ద్వారా కొనుగోలు చేసి దస్తావేజు నెం.2646/2014 గా రిజిస్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజు జిరాక్సు సెంటర్‌లో జిరాక్సులు తీయించి ఇంటి వెళ్ళి కాగితాలు సరిచూచుకొనగా అందులో దస్తావేజు నెం:2646/2014. యస్.ఆర్.ఒ. క్రోసూరు కనపడ లేదు ఎంత వెదకినను కనిపించలేదు. పైన తెలిపిన దస్తావేజు నెం.2646/2014 యస్.ఆర్.ఒ. క్రోసూరు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది వారికి అందజేయవలసినదిగాను, అట్లు కాక దానితో ఏదైనా లావాదేవీలు నెరపిన యెడల మాక్లయింటుకు బాధ్యత లేదు అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

Kurmala Durga Prasad, M.A., LL.M
Kurmala Bala Sai, B.Sc., LL.M, Advocates
Park Road, Mangalagiri-522 503. 9848148573, 9705402285

మృత్యు మార్గం.. తీస్తోంది ప్రాణం

10 రోజుల్లో ఇద్దరి మృతి

దుగ్గిరాల, న్యూస్‌టుడే

మంగళగిరి-తెనాలి ప్రధాన రహదారి మృత్యుపాశంలా మారింది. ఇటీవల జరుగుతున్న వరుస ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనికితోడు అతివేగంగా గమ్యం చేరాలనే ఆలోచన వాహన చోదకుల ప్రాణాలను హరిస్తోంది. గత పది రోజుల్లో ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

దుగ్గిరాల-మంగళగిరి ప్రధాన రహదారి

వరుస ప్రమాదాలతో ప్రజల బెంబేలు

★ **ఈ నెల ఒకటో తేదీన** దుగ్గిరాల ప్రధాన రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ముగ్గురు ఒకేసారి రోడ్డు మీద స్పృహ లేకుండా పడిపోయారు. వీరిలో ఇద్దరు ఇంకా ఆస్పత్రిలోనే ఉన్నారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన చొప్పర దయాకర్ అనే యువకుని కుడికాలు నుజ్జయ్యింది. స్థానిక సగర కాలనీకి చెందిన మరో యువకుడు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు మీదే పడిపోయిన యువకులు (పాత చిత్రం)

★ **9వ తేదీన** చింతలపూడి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని తెనాలి మండలం అంగలకుదురుకు చెందిన దుడ్డి ప్రశాంత్, ఈమనికి చెందిన కారాబత్తిని శ్రీకాంత్‌కు, నంది వెలుగుకు చెందిన జాన్‌సైదా, సీతారామయ్యలకు గాయాలయ్యాయి. వీరిలో ప్రశాంత్ మృతి చెందగా మిగిలిన ముగ్గురిలో ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

★ **10వ తేదీన** మోరంపూడి వద్ద కారు ఢీకొని రెండు ద్విచక్ర వాహనాలపై వెళుతున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో తెనాలి పట్టణానికి చెందిన కర్నాటి వెంకట్రావ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అమృతలూరుకు చెందిన జాలంతకి శిరీష తొడ వద్ద ఎముక పూర్తిగా విరిగిపోయింది.

ఇలా చేస్తే ప్రయోజనం

★ మంగళగిరి, దుగ్గిరాల మండలాల పరిధిలో ఉన్న రేవేంద్రపాడు నుంచి తెనాలి గ్రామీణ మండలం నందివెలుగు వరకు మధ్యలో తుమ్మపూడి వద్ద, మోరంపూడి మూల మలుపు వద్ద వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి. గతంలో దుగ్గిరాల పాతలాకు జెండా చెట్టు వద్ద, ఈమని రోడ్డు మలుపు తిరిగే చోట వేగనిరోధకాలు ఉండేవి. ఇప్పుడు కొత్తగా రోడ్డు వేశాక తొలగించారు. వాటిని తిరిగి వేయాలి. ★ కొన్నిచోట్ల ప్రమాద సూచికల బోర్డులు కనిపించకుండా పిచ్చిమొక్కలు కమ్మేశాయి. వాటిని తొలగించాలి.

★ వాహనాలను వేగంగా నడిపే చోదకులపై చర్యలు తీసుకోవాలి.

స్థిరాస్థి వేలం ప్రకటన

మహారాజశ్రీ బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 50/2009 in O.S. 1918/2007 & E.A. No. 274/2011

Between

గుజ్జం మాలకొండ రాయుడు ...D.Hr.

Vs

1. గార్లపాటి రామచంద్రయ్య (లేటు)
2. గార్లపాటి పార్వతి ...J.Drs.

(Note E.A. 274/2011, dated 22-12-2011)
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు 2వ J.Dr implead ఆయినారు)

ఈ నెంబరు పిటీషన్ షెడ్యూలు దాఖలా ఆస్తి 2వ J.Dr స్వాధీనానుభవంలో ఉండి, శ్రీ కోర్టు వారిచే జప్తు కాబడి ది. 17-12-2025న పగలు 10.30 గం॥లు మొదలు శ్రీ కోర్టు వారిచే బహిరంగముగా వేలము జరుపబడును. కావున ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియపరచడమైనది.

వేలం కాబోయే స్థిరాస్థి షెడ్యూలు

An extent of 800 Sq. Ft. of House Site with an R.C.C. roof building in an extent of 555 Sq. Ft. plinth area present in Sy. No. 261-2 previous Survey No. 205/2 with Door No. 1-114, Assesment No. 144, situated at Bodipalem Village, Kakumanu Mandal, S.R.O., Ponnur Guntur District. As per CFR No. 356/2024 letter addressed on 22-08-2025 to MRO Kakumanu by the Hon'ble Court is bounded by: **East:** 12' feet width gally, **South:** House of Garlapati Siva Prasad, **West:** R&B Main Road, **North:** House of Ganga Kasiviswanadham.

వేలం వాయిదా: 17-12-2025 D.Hr. Value: **Rs. 3,00,000/-**
Further Hearing: **24-12-2025** Amon Value: **Rs. 11,00,000/-**

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
**AVSRN చలపతిరావు, అయినంపూడి వెంకటేశ్వరరావు
నిమ్మకూరి వెంకటేశ్వర్లు, Advocates for D.H.R.,**

ఎన్‌ఆర్‌ఐ విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి, న్యూస్‌టుడే: తిరుపతి అపోలో క్లినిక్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియోగ్రాఫర్స్, టెక్నాలజిస్టులు(ఐఎస్ఆర్‌టీ), తిరుపతి అకాడమీ క్లబ్‌లు సంయుక్తంగా ప్రపంచ రేడియోలజీ-2025 పేరుతో మంగళవారం సింపోజియం నిర్వహించారు. మంగళగిరి ఎన్నారై అల్లైడ్ అండ్ హెల్త్‌కేర్ కళాశాల విద్యార్థులు పాల్గొని ఎంఆర్‌ఐ బ్రెస్ట్, ఆర్థోప్లాస్ట్ అంశాలపై అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి ప్రతిభ చాటారని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆ విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంకమ్మరావు, నిర్వాహకులు రంగారావు, కృష్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అంకమ్మరావు నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

రైతులను ఇబ్బందిపెడితే సహించం

ప్రత్తిపాడు (కాకుమాను), న్యూస్‌టుడే: తుపాను కారణంగా పత్తి పంట కొంత తేమ వచ్చిందని అయినా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉందని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయన్నారు. తెదేపా నాయకులు శివరాంప్రసాద్, వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, శ్రీకాంత్, పెంటారెడ్డి, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

కోయవారిపాలెం: పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పత్తి రైతులకు అండగా ఉంటుందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పేరేచర్ల శివారు ఉన్న శ్రీ వెంకటేశ్వర కాటన్ మిల్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి సాయంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. నగరంలోని ప్రత్తిపాడు నియోజక వర్గ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఐదు మండలాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

రేవేంద్రపాడు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి పేదలకు భరోసా నిలుస్తోందని తెదేపా మండల అధ్యక్షురాలు శ్రీఅనిత అన్నారు. మంగళవారం రేవేంద్రపాడులో సీఎం సహాయనిధి జగ్గారావు నాగేశ్వరరావుకు రూ. 52724, సజ్జాపురం రాజుకు రూ. 21588, కంఠంరాజుకొండూరులో తోలుచూరి ధర్మారావుకు రూ. 47450, కొండూరు బుజ్జిబాబుకు రూ. 25350, పెదకొండూరులో సోమరౌతు సీతారామహేమంత్‌కుమార్‌కు రూ. 31500, మోరంపూడిలో షేక్ దస్తగిరికి రూ. 1,02,028లు మంజూరు అయ్యాయి. లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

స్వాధీనత ప్రకటన

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
MINI RACPC, HLC, 2వ అంతస్తు, కొత్తపేట, తెనాలి, గుంటూరు జిల్లా-522 201.

(APPENDIX-IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002
రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్తి కొరకు)

1) HTL A/c No.39902567738

... భారతీయ స్టేట్ బ్యాంక్, Mini RACPC బ్రాంచ్, తెనాలి, గుంటూరు జిల్లా ... తేది.01.09.2025 నాటికి HTL కు రూ.24,47,995/- ... శ్రీ పి. రవి, తండ్రి : పి.పిచ్చుముత్తు ... తేది.01.09.2025 న డిమాండ్ నోటీసు జారీచేసినారు. ... తేది.15.11.2025 నాటికి HTL కు రూ.26,20,650/- ... తేది.15.11.2025 న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. ...

స్థిరాస్తి వివరములు: ...

తేది : 15.11.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: తెనాలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రకటన

నా క్లయింట్లు అయిన శ్రీ గుంటూరు వెంకటేశ్వర శర్మ గారి సంజాయిషీ మేరకు యావత్ ప్రజలకు తెలియజేయునదేమనగా, నా క్లయింట్ క్రింద షెడ్యూలులో పేర్కొన్న స్థిరాస్తిని, తెలంగాణ రాష్ట్రం, నాగోల్, హైదరాబాద్‌లో నివసించే శ్రీ ములుగు శరత్ కుమార్ గారి నుండి కొనుగోలు చేయాలని నిర్ణయించుకుని, వారి మధ్య విక్రయ ఖరారు జరిగి కొంత మొత్తాన్ని బయానాగా చెల్లించియున్నారు. సదరు ఆస్తి శ్రీ ములుగు శరత్ కుమార్ గారికి 06-02-2015న మంగళగిరి సబ్-రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో డాక్యుమెంట్ నెం. 1632/2015 ద్వారా లభించి, ఆయన తండ్రి శ్రీ ములుగు సాయిబాబా గారు 07-05-1980న కొనుగోలు చేసి డాక్యుమెంట్ నెం. 1534/1980గా రిజిస్టర్ చేయించుకున్న స్థిరాస్తియైయున్నది. పై విక్రయ దస్తావేజు గ్రైర్వలు కావున, తెలుగు మరియు ఇంగ్లీష్ పత్రికలలో ప్రకటనలు ఇచ్చినప్పటికీ కనుగొనబడక, 27-01-2015న ఉప్పల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, స్టేషన్ హౌస్ ఆఫీసర్ గారు Not Traceable Certificate జారీ చేశారు. ఆ ఆధారంతో, డాక్యుమెంట్ నెం. 1534/1980 పబ్లిక్ కాపీని శ్రీమతి విశాలాక్షి మరియు శ్రీమతి కొంపెల్ల శ్రీవల్లి గార్లు శ్రీ ములుగు శరత్ కుమార్ గారికి అందజేసినట్లు డాక్యుమెంట్ నెం. 1632/2015లో స్పష్టంగా ప్రస్తావించబడింది. అనంతరం వారసులైన విశాలాక్షి, శ్రీవల్లి మరియు శరత్ కుమార్ తమ వారసత్వ హక్కులను రిలీంక్విష్‌మెంట్ డీడ్ (డాక్యుమెంట్ నెం.1632/2015) ద్వారా రిజిస్టర్ చేయించి, శ్రీ ములుగు శరత్ కుమార్ గారిని సదరు ఆస్తిపై ఏకైక హక్కుదారునిగా పేర్కొన్నారు. కావున ఎవరైనా సదరు స్థిరాస్తిపై హక్కులు, అభ్యంతరాలు, తనఖాలు, కోర్టు జప్తులు, లబ్ధి తగాయిదాలు, ష్యూరిటీలు లేదా ఇతర క్లెయిమ్స్ ఏదైనా కలిగియున్నచో, ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజుల్లోపు తగిన ఆధారాలతో దిగువ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టు (తిరుగు రశీదు సహితంగా) ద్వారా తెలియజేయగలరు. గడువు లోపు ఎటువంటి అభ్యంతరాలు అందని పక్షంలో, నా క్లయింట్ ఈ ఆస్తిని నిర్వివాద ఆస్తిగా పరిగణించి, పై పేర్కొన్న విక్రేతల నుండి రిజిస్టరు విక్రయ దస్తావేజు ద్వారా పొందును. గడువు అనంతరం అందే ఏవైనా అభ్యంతరాలు నా క్లయింటును లేదా ఆస్తిని బంధించవు.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నవులూరు గ్రామ పరిధిలోని డీమార్కేషన్ నెం. 777/4లో ఉన్న ప్లాట్ నెం.6 మరియు ప్లాట్ నెం.7 కలిపి, మొత్తం చ.గ. 245.0లు (చ.మీ. 204.85) విస్తీర్ణముగల ఖాళీ నివేశన స్థలం. **హద్దులు: తూర్పు-** కోయ రమేశ్ బాబు గారి ఆస్తి (అ.70-0లు); **దక్షిణం-** ప్రభుత్వ డొంక రోడ్డు (అ. 31-6లు); **పడమర-** కోయ రమేష్ బాబు గారి ఆస్తి (అ. 70-0లు); **ఉత్తరం-** 20 అ॥ వెడల్పు గల రోడ్డు.

తూటుపల్లి కోదండ రామయ్య, అడ్వకేట్
ప్లాట్ నెం: 2, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ నిలయం, సెక్టార్- 5, లోటస్ ల్యాండ్ మార్క్, రామలింగేశ్వరపేట, అయోధ్యనగర్, విజయవాడ-520 003
విజయవాడ, 18/11/2025 మొబైల్: 99487 32666

చట్టాలను గౌరవించడం మన విధి

అబ్బినేనిగుంటపాలెం(పెదనందిపాడు), న్యూస్‌టుడే: చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని డీఎస్పీ భానోదయ అన్నారు. మండలంలోని అబ్బినేనిగుంటపాలెంలో మంగళవారం రాత్రి 'పల్లె నిద్ర' కార్యక్రమంలో భాగంగా జరిగిన గ్రామస్థుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనవసర వివాదాలకు పోవద్దని సూచించారు. బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో కేసులు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఆర్థిక నేరాల బారినపడ వద్దని, అనవసర లింకులు, యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దన్నారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై మధూపవన్, అబ్బినేనిగుంటపాలెం సొసైటీ ఛైర్మన్ పార్వతి, తెదేపా నాయకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ భానోదయ

ప్రాంగణ ఎంపికల్లో 41 మందికి ఉద్యోగాలు

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే: ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థినులు 41 మంది ఉద్యోగాలు సాధించారని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ రవీంద్ర, ప్లేస్‌మెంట్ అధికారులు శ్రీనివాసరావు, సురేష్‌బాబు, వివిధ విభాగాధిపతులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను మంగళవారం కళాశాలలో అభినందించారు.

విద్యార్థినులతో సెక్రటరీ గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ తదితరులు

ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల రాష్ట్ర ఛైర్మన్‌గా కోయి

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల అసోషియేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా కోయి సుబ్బారావును విజయవాడలో ఎన్నుకోవడం జరిగిందని మంగళవారం ఆయన తెలిపారు. తనను ఎన్నుకున్న సభ్యులు, మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాలల సమస్యలపై దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

సుబ్బారావు

బీమా చెక్కు అందజేత

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెదేపా కార్యకర్త రామారావు కుటుంబానికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న రామారావు భార్య కోటేశ్వరమ్మకు రూ.5లక్షల బీమా చెక్కును తెదేపా నాయకులు మహేష్, షేక్ రియాజ్ తదితరులు అందజేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

తాడికొండ: లాం పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామస్థుడు షేక్ నసీబ్‌మియా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో డీఎల్‌పీవో శ్రీనివాసరావు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ రమణతో కలిసి దస్త్రాలు తనిఖీ చేశారు. గ్రామంలోని సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాల్లో నకిలీ బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేశారని షేక్ నసీబ్ మియా ఫిర్యాదులో ఆరోపించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఫిరంగిపురం: అన్నదాతా- సుఖీభవ రెండో విడత నిధుల విడుదల సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ బుధవారం ఫిరంగిపురం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

రక్షిత జలం అందిస్తాం

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పొట్లపాడులో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాన్ని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ప్రభుత్వం ప్రజలకు రక్షిత జలం అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. తమ ప్రభుత్వం కొత్తగా రూ.5లక్షలతో నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నీటిశుద్ధి యంత్రం ప్రారంభోత్సవంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

దుగ్గిరాలలో శివునికి అన్నాభిషేకం

మంగళగిరి మల్లేశ్వరాలయంలో..

అన్నపర్రు బొడ్డురాయి కూడలిలో..


వట్టిచెరుకూరు బ్రహ్మేశ్వర స్వామి దేవాలయంలో..

దుగ్గిరాల శివాలయంలో..

మార్మోగిన శివనామస్మరణ

న్యూస్‌టుడే బృందం: కార్తిక మాసం చివరి దశకు చేరుకోవడంతో మంగళవారం మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. పలుచోట్ల శివునికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన దీపోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొమ్మూరులో..

ఘనంగా ప్రకృతి వైద్య దినోత్సవం

తుళ్లూరు: రాజధాని గ్రామం వెంకటపాలెంలోని డా. మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయంలో మంగళవారం 8వ జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం నిర్వహించారు. ప్రకృతి వైద్యాన్ని వెలుగులోకి తీసుకు వచ్చిన గాంధీ, ప్రముఖ వైద్యులు డా.వేగిరాజు కృష్ణంరాజు, బలిజేపల్లి వెంకట్రావు, విజయలక్ష్మి, వేగిరాజు వెంకటరామరాజు, ద్రోణంరాజు వేంకటాచలపతిశర్మ, మంతెన రామరాజుల విగ్రహాలను వారి కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. ప్రకృతి వైద్యుల కుటుంబ సభ్యులు, దాతలు మాట్లాడుతూ గాంధీ సేవలను కొనియాడారు.

స్థల వివాదంలో 15 మందిపై కేసు

మేడికొండూరు: మేడికొండూరులో రెండున్నర సెంట్లు స్థలం విషయంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. చేతులు, కర్రలతో కొట్టుకోవడంతో రెండు వర్గాలకు చెందిన 15 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

దుగ్గిరాల: బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే బృందం: మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పలుచోట్ల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్‌తో పాటు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం

పేరకలపూడి(దుగ్గిరాల): పేరకలపూడిలో ఈనెల 16న జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ఎస్.లక్ష్మి కుటుంబానికి మంత్రి లోకేశ్ రూ.20 వేలు నగదు, నిత్యావసర సరకులను వితరణ చేశారు. వీటిని ఎంపీటీసీ సభ్యుడు అశోక్, నాగేశ్వరరావు, ఫణిశంకర్, సంపతి నాగేశ్వరరావులు బాధిత కుటుంబానికి అందజేశారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్లు 1) ఒంటెద్దు శ్రీను గారి కుమారుడు పరమేశ్వరరావు, డోర్ నెం.121-4-921, జన్మ భూమి నగర్, సమ్మక్క సారక్క టెంపుల్, పెదపాలకలూరు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522005, 2)ఒంటెద్దు వీరయ్య గారి కుమారుడు రామచంద్రయ్య, డోర్ నెం.26-45-141/15/15, శీతమ్మకాలనీ ,5వ లైను, కుందుల రోడ్డు, పట్టాభిపురం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 522006, 3) ఒంటెద్దు కనకయ్య గారి కుమారుడు మాబు సుభాని, డోర్ నెం.5-967, లాల్ బహదూర్ నగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522 503. గార్ల సంజాయిషీ పొంది యావన్మందికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా:

నాక్లయింట్లు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని మాణెం వీరాంజనేయులు గారి కుమారుడు భూషయ్యా గారి నుండి కొనుగోలు చేయుటకు మూజువాణిగా విక్రయ ఒప్పందము చేసుకొనియున్నారు. సదరు మాణెం భూషయ్యా గారు బత్తిన సాంబశివరావు గారి కుమారుడు శివనాగ మల్లేశ్వరరావు గారికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చియున్నారు. సదరు ఆస్థికి లింకు దస్తావేజులు 1) జి.పి.ఎ ద.నెం.25061/2025, 2) దఖలు ద.నెం.6348/2001, 3) విక్రయ ద.నెం. 385/1983 అన్ని యస్. ఆర్.ఒ మంగళగిరి అయివున్నవి. ఒరిజినల్ లింకు విక్రయ ద.నెం.385/1983 మాణెం భూషయ్యా గారి వద్ద పోయినది. సదరు విషయము పోలీసువారికి రిపోర్టు ఇచ్చి సర్టిఫికేట్ పొందియున్నారు. ఆవిధంగా దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి నిర్వివాదఆస్థి అని సదరు విషయములు వాస్తవములని, సదరు దస్తావేజును ఏవిధంగాను దుర్వినియోగం చేయలేదని నాక్లయింటును నమ్మించియున్నారు

సదరు విషయమును నమ్మి నాక్లయింట్లు సదరు ఆస్థిని కొనుగోలు/విక్రయించుట గానీ, ఏదైనానేషనలైజ్డ్ బ్యాంకు, ప్రైవేటు బ్యాంకు, ఇతర ఋణసంస్థలమండి గానీ, వ్యక్తుల నుండి గానీ ఋణమును పొందగోరు చున్నారు. సదరు ఆస్తి విక్రయం, తనఖాపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈబహిరంగ ప్రకటన తేది నుంచి వారం రోజులలోగా నాకు లిఖిత పూర్వకంగా తెలియజేయవలెను. తదుపరి క్లయిములు నాక్లయింట్లను గానీ, సదరు ఋణదాతలైన నేషనలైజ్డ్ బ్యాంకు, కార్పోరేట్/ప్రైవేటు బ్యాంకు, ఇతర ఋణసంస్థలనుగానీ, వ్యక్తులను గానీ బైండు చేయజాలవు.

షెడ్యూలు : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ - రిజిస్ట్రారు వారి యిలాకా మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన ఆత్మకూరు గ్రామం తాలూకు దస్తావేజు దాఖలా డి.నెం.356/2ఎరు అయివుండి ప్రస్తుత సబ్ డివిజను కాబడిన రెవెన్యూ రికార్డు దాఖలా డి.నెం.356/3 ఎరు యం.0.50 సెంట్లు భూమికి హద్దులు:

తూర్పు:- వీరంకి ముత్తయ్య గారి భూమి హద్దు, దక్షిణం:- పంటకాలువ హద్దు, పడమర:- యసమల భిక్షాలు &సామ్యేల్ గార్ల భూమి హద్దు, ఉత్తరం:- బచ్చు వీర వెంకట సుబ్రహ్మణ్యం గారి భూమి హద్దు,

మంగళగిరి, ది.19-11-2025
ఇట్లు : వాకా రామగోపాల్ గౌడ్, న్యాయవాది, డోర్ నెం.1-443, కొత్తపేట, మంగళగిరి,సెల్ నెం: 9848116475

గుంటూరు తూర్పు

ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల రాష్ట్ర ఛైర్మన్‌గా కోయి

కోయి సుబ్బారావు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా కోయి సుబ్బారావును విజయవాడలో ఎన్నుకోవడం జరిగిందని మంగళవారం ఆయన తెలిపారు. తనను ఎన్నుకున్న సభ్యులు, మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాలల సమస్యలపై దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

ఎస్‌బీ డీఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా గొట్టిపాటి శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. 1995లో ఎస్సైగా పోలీసుశాఖలో చేరి గుంటూరు రేంజ్‌పరిధిలోని పలు జిల్లాల్లో పనిచేశారు. సీఐగా నేర రికార్డుల బ్యూరో, మహిళా పీఎస్, ఇంటిలిజెన్స్, సీఐడీలో విధులు నిర్వహించారు. డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది గుంటూరు ఎస్‌బీకి నియమితులయ్యారు.

ఎస్పీ వకుల్ జిందాల్‌కు మొక్క అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఇస్రాయిల్‌పేట 3వ లైన్ సైడుకాల్వల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో కాల్వల్లో పూడికలు తీయించారు.

★ సుద్దపల్లిడొంక విజయశంకరనగర్ రెండోలైన్‌లో చెత్తకుప్పలు తీయకుండా వదిలేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికులు రాజు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో చెత్తకుప్పలు తొలగించారు.

? బాలాజీనగర్‌లోని రంగామ్మ సెంటర్లో వీధి పంపు అధ్వాన స్థితికి చేరింది. పంపుతో పాటు, చుట్టూ ఉన్న సిమెంటు దిమ్మె పాడైంది. - శ్రీను, మణిహోటల్ సెంటర్

✔ సమస్యను అధికారులకు వివరించి పరిష్కరిస్తాం. - రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? నగరంలోని పలు వ్యాపార సంస్థల్లో నకిలీ పూజా నూనెల విక్రయాలు చేస్తున్నారు. అధికారులు వీటిని కట్టడి చేయాలి. - సుధాకర్, నల్లచెరువు

✔ నకిలీ పూజా నూనెల విక్రయాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. -ఎన్.పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

? లాలాపేట పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. -యుగంధర్, చౌత్రాసెంటర్

✔ ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి రోడ్లను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం. -రవీంద్ర, ట్రాఫిక్ ఎస్సై

? బస్టాండు సెంటర్‌లోని రైతుబజారు ముందు భాగంలో చిరు వ్యాపారాలతో వినియోగదారులు లోపలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. - మురళీ, పాతగుంటూరు ✔ రైతుబజారు ముందు భాగంలో వ్యాపారాలు చేయరాదని ఆదేశాలు జారీ చేశాం. -స్వప్న, ఎస్టేట్ ఆఫీసర్ – న్యూస్‌టుడే, పట్నంబజారు

తాగి నడిపితే జైలుకే!

న్యూస్‌టుడే, నెహ్రూనగర్ (గుంటూరు)

- రోడ్డు ప్రమాదాల కట్టడికి కఠిన చర్యలు
- చోదకులకు ముమ్మరంగా శ్వాస పరీక్షలు

బస్సు డ్రైవర్‌కు శ్వాస పరీక్ష చేస్తూ..

నిత్యం ఏదో ఒకచోట ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, లారీలు, బస్సులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. మితిమీరిన వేగంతో పాటు మద్యం తాగి వాహనాలు నడపడంతో అధికంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో రోడ్డు ప్రమాదాల కట్టడిపై పోలీసులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా నగరంలో శ్వాస పరీక్షలు (డ్రంక్ అండ్ డ్రైవ్) విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాలతో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తూర్పు, పశ్చిమ సీఐలు అశోక్‌కుమార్, సింగయ్యలు తమ సిబ్బందితో నగరంలోని ప్రధాన కూడళ్లలో శ్వాస పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జరిమానా, జైలుశిక్ష..

మద్యం తాగి వాహనం నడిపితే అతని వల్ల ఎదురుగా వస్తున్న వాహనదారులు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న ఉదంతాలు ఉన్నాయి. దీంతో మద్యం తాగి వాహనాలు నడపకుండా ఉండాలంటే కఠిన శిక్షలు విధిస్తున్నారు. గతంలో శ్వాస పరీక్షల్లో పట్టుబడితేవారికి రూ.వెయ్యి జరిమానా విధించేవారు. నూతన చట్టాల ప్రకారం మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేల వరకు జరిమానా విధిస్తున్నారు. అధిక మొత్తంలో తాగినట్లు శ్వాస పరీక్షల్లో తేలితే అతనికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నారు. ఇటీవల తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి న్యాయస్థానం వారం రోజులు జైలు శిక్ష విధించింది. తాగి వాహనాలు నడిపిన మరో 19 మందికి జరిమానా విధించడంతో పాటు కోర్టు పరిసరాలు శుభ్రం చేయాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

866 మందిపై కేసులు నమోదు

నగరంలో ఈ ఏడాది ఇప్పటి వరకు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 866 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో గుంటూరు తూర్పు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో 499 మంది, పశ్చిమ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో 367 మందిపై కేసులు నమోదు చేశారు.

ప్రాణం ఎంతో విలువైనది

– బెల్లం శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ

మద్యం తాగి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రాణం ఎంతో విలువైంది. రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో శ్వాసపరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎవరూ తాగి వాహనాలు నడపవద్దు.

ఫిజియోథెరపీ వైద్యానికి ఉజ్వల భవిష్యత్తు



సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఛైర్మన్ షేక్ మహినా

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: వైద్య రంగంలో ఫిజియోథెరపీకి అత్యుత్తమ భవిష్యత్తు, గ్లోబల్ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మంగళవారం రాజాగారితోటలోని తితిదే కల్యాణమండపంలో హారిక కళాశాల ఆఫ్ ఫిజియోథెరపీ మొదటి గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా ఫిజియోథరపీ అధునాతన శాస్త్ర సాంకేతిక, అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో హారిక ఫిజియోథెరపీ విద్యా సంస్థల ఛైర్మన్ షేక్ మహినా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబాని, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరికృష్ణ, పారా మెడికల్ ప్రిన్సిపల్ పుష్పలీల, శామ్యూల్ సతీష్, వైద్యులు మృదుల, మొహిద్దీన్, ఏడుకొండలు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సౌదీ మృతుల కుటుంబాలకు అండగా నిలుద్దాం

మౌజన్లు, ఇమామ్‌లతో సమావేశమైన ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్,న్యూస్‌టుడే: బస్సు ప్రమాదంలో సౌదీలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అండగా నిలిచేందుకు సీఎం చంద్రబాబుతో మాట్లాడతానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. బస్సు ప్రమాద ఘటన మృతులకు సంతాపం తెలిపేందుకు క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఇమామ్, మౌజన్లుతో సమావేశమయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర యాత్రకు వెళ్లిన వారు అర్ధంతరంగా తనువు చాలించడం విచారకరమన్నారు. గుంటూరు నుంచి మక్కా యాత్రకు వెళ్లిన ముస్లిం సోదరులు క్షేమంగా ఉన్నారన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదల సంజీవని.. సీఎం రిలీఫ్ ఫండ్ పేదల సంజీవని అని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. రూ.19లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల్ని ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు రూ.6.50 కోట్ల నిధులు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాధితులకు అందజేశామన్నారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

విద్యార్థి మృతికి కారకులను శిక్షించాలి

కొవ్వొత్తుల ర్యాలీలో దళిత బహుజన సంఘాలు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో చదువుతున్న విద్యార్థి సృజన్‌ను కొట్టి చంపేసి ఫ్యాన్‌కు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి శిక్షించాలని దళిత బహుజన సంఘాలు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి లాడ్జి కూడలి నుంచి శంకర్‌విలాస్ కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మృతుని తల్లిదండ్రులు శివకృష్ణ, జ్యోతి, నాయకులు విద్యాసాగర్, ఎస్‌ఎఫ్‌ఐ కిరణ్, శ్రీనివాసరావు, నరసింహారావు, వీరయ్య, రవి, కమలకుమారి, విల్సన్, అనిల్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు ఆరు ఆర్వో ప్లాంటు కూలర్ల వితరణ

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో శ్రీరాజా కరణం రూ.12లక్షల విలువైన ఆరు కెంట్ ఆర్వో వాటర్ ప్లాంటు కూలర్లను అందజేశారు. రోగులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది అవసరాల కోసం తన సతీమణి, వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ నిర్మల జ్ఞాపకార్థం వీటిని అందించినట్లు రాజా కరణం తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ పొదిలి ప్రసాద్, డాక్టర్ రంగారావు, నాట్కో సమన్వయకర్త అశోక్‌కుమార్, డాక్టర్ రాధిక రాణి తదితరులు పాల్గొన్నారు.

దాతతో సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు

ఝాన్సీలక్ష్మీబాయి శౌర్యం నేటితరానికి ఆదర్శం

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాశ్ నారాయణ

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఝాన్సీలక్ష్మీబాయి శౌర్యం నేటి యువతులకు ఆదర్శనీయమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్‌నారాయణ అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్త్రీశక్తి రన్నింగ్ కాంపిటీషన్ కార్యక్రమం నిర్వహించారు. పోటీల్లో పలు కళాశాలలకు చెందిన బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయప్రకాశ్‌నారాయణ మాట్లాడుతూ క్రీడలు, వ్యక్తిత్వ వికాసానికి, శారీరక దృఢత్వానికి ఎలా దోహదపడతాయో వివరించారు. ఈదర శ్రీనివాసరెడ్డి, వెంకటేష్, రాయుడు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చీటీ డబ్బులు తీసుకుని.. కిస్తీలు కట్టకుండా ఎగ్గొట్టి..

రూ.1.5కోట్లకు ష్యూరిటీ ఇచ్చిన వారి ఫిర్యాదు

పట్నంబజారు, న్యూస్‌టుడే: గుజ్జనగుండ్ల సెంటర్ సిద్ధార్థనగర్‌లోని తూనికలు, కొలతలశాఖలో పనిచేసే ఓ ఉద్యోగి తోటి ఉద్యోగులతో ష్యూరిటీ సంతకాలు పెట్టించుకొని ఆరు ప్రైవేటు సంస్థల్లో చీటీ పాటలు పాడుకుని కొన్ని నెలలుగా డబ్బులు కట్టడం మానేశాడు. దీంతో ష్యూరిటీగా ఉన్న ఉద్యోగులకు ప్రైవేటు చీటీ సంస్థలు నోటీసులు జారీ చేసి కోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఆయా ఉద్యోగుల జీతాల నుంచి చీటీపాటల తాలూకు సొమ్ము కోర్టులో చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ష్యూరిటీగా ఉన్న ఉద్యోగుల జీతాల్లో నుంచి ప్రతి నెలా కొంత నగదు ప్రైవేటు చీటీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. సదరు ఉద్యోగి దాదాపు రూ.1.5కోట్లకు పైగా చీటీ పాటల తాలూకు సొమ్ము చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో బాధిత ఉద్యోగులు ఇటీవల సదరు ఉద్యోగిపై పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తూనికలు, కొలతలశాఖ అధికారులు ఈ విషయాన్ని బయటకు రానివ్వకుండా గుట్టుగా ఉంచుతున్నారు.

ఈ బాలుడు ఎవరు? రైల్వేస్టేషన్‌లో గుర్తించిన పోలీసులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఒంటరిగా తిరుగుతున్న మూడేళ్ల బాలుడిని ఆర్పీఎస్ పోలీసులు, చైల్డ్ హెల్ప్‌డెస్క్ సిబ్బంది సంరక్షించారు. బాలుడు ఏమీ మాట్లాడలేకపోవడంతో అతన్ని బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచారు. బాలుడి తల్లిదండ్రులు, బంధువులు కొత్తపేట పోలీసులను సంప్రదించాలని సీఐ వీరయ్యచౌదరి తెలిపారు.

ముక్కుమూసుకుని సాగాలి..

స్థానిక జీజీహెచ్ సమీపంలోని సరస్వతి థియేటర్ పక్క వీధిలోకి మురుగునీరు పెద్దఎత్తున చేరి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వాడుక నీరు రోడ్డుపైకి చేరుతోంది. మురుగు నీటితో తాము రోగాల పాలవుతామేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజారోగ్య అధికారులు జీజీహెచ్‌లో డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

పైపులైను పగిలింది..

జీజీహెచ్‌కు తాగునీరందించే పైపులైనుకు మంగళవారం లీకేజీ ఏర్పడింది. దీంతో ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, కాన్పుల విభాగానికి తాగునీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వెంటనే పైపులైను లీకేజీకి మరమ్మతులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. - నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

గుంతల దారి.. గంతులే మరి..

ఎత్తురోడ్డు సెంటర్‌లో రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా పగుళ్లు ఇచ్చి కంకర రాళ్లు పైకి తేలాయి. ఉదయం వేళల్లో ద్విచక్ర వాహనాలపై కళాశాలలకు వెళ్లే యువకులు ప్రమాదవశాత్తు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడి గుంతల్ని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. -పట్నంబజారు, న్యూస్‌టుడే

పనిచేయని సిగ్నళ్లు.. ట్రాఫిక్ చిక్కులు

ఎత్తురోడ్డు సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు మొరాయించాయి. దాదాపు 2నెలల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నరసరావుపేట, చిలకలూరిపేట, ప్రత్తిపాడు, సత్తెనపల్లి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు, ఇతరత్రా వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతమంతా నిత్యం రద్దీగా ఉంటోంది. పనిచేయని సిగ్నల్ లైట్ల కారణంగా ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించడానికి తిప్పలు పడుతున్నారు. -పట్నంబజారు, న్యూస్‌టుడే

3 రోజుల్లో తాగునీటి బిల్లులు చెల్లించాలి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో తాగునీటి మీటర్లు కలిగిన వారు రానున్న మూడు రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. మీటర్ ఛార్జీలు ఎక్కువ మంది చెల్లించడం లేదన్నారు. ఇప్పటికే రూ.29 కోట్లు బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు.

దాసులకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి

నగరపాలకసంస్థ: అంకిరెడ్డిపాలెం దాసులకాలనీలో వెంటనే డ్రెయిన్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం దాసులకాలనీలో పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోర్ల ఏర్పాటుకు రెండు రోజుల్లో ప్రతిపాదనలు పూర్తి చేసి పనులు జరిగేలా చూడాలన్నారు. సమస్యలపై ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

యాత్రికుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలి

పట్నంబజారు: సౌది అరేబియాలో జరిగిన యాత్రికుల బస్సు ప్రమాద ఘటనలో 42 మంది హజ్ యాత్రికులు చనిపోవడం బాధాకరమని డిప్యూటీ మేయర్ షేక్ సజీల అన్నారు. మంగళవారం కింగ్స్ హోటల్ సెంటర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మరణించిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

జేఏసీని రాజకీయాల్లోకి లాగొద్దు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో జేఏసీని రాజకీయాల్లోకి లాగొద్దని జేఏసీ కన్వీనర్ ఎల్ఎస్ భారవి అన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేట్ పేయర్స్ నాయకులు ఎం.రాధాకృష్ణ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వి.సదాశివరావు, అరండల్‌పేట, బ్రాడీపేట మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. హైకోర్టు కమిషన్ బ్రిడ్జిని సందర్శించిన సందర్భంగా జేఏసీ నాయకుల్ని ఉద్దేశించి మేయర్ దుష్టశక్తులు అని మాట్లాడడం సభ్యత కాదన్నారు. వివిధ వర్గాలకు చెందిన 22 సంఘాలు గత ఆరు నెలలుగా బ్రిడ్జికి అనేక సవరణలు చేస్తూ, వాటి సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో సర్వీసు రోడ్డు ఇస్తామని జీఎంసీ, ఇవ్వలేమని ఆర్‌అండ్‌బీ విరుద్ధంగా వ్యవహరించారన్నారు. విస్తరణలో నష్టపోతున్న వ్యాపారులకు చట్ట ప్రకారం పరిహారం ఇవ్వకుండానే పాతబ్రిడ్జిని కూల్చివేసి హడావుడిగా నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. వాటన్నింటిపై కోర్టులో కేసులు నడుస్తున్నాయని తెలిపారు. 46 మంది వ్యాపారులు పరిహారం కోరుతూ వేసిన పిటిషన్‌పై వారికి అనుకూలంగా కోర్టు డిక్రి ఇచ్చిందన్నారు. కోర్టు ఆదేశాలు అమలు చేయడం లేదని తెలిపారు. టీడీఆర్ బాండ్లు ఇస్తామని, కోర్టులో కేసులు వాపసు తీసుకోవాలని అధికారులు వ్యాపారులను బెదిరించడం సరికాదన్నారు. ఆర్‌యూబీని ముందుగా నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తవని మొత్తుకున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టారన్నారు. బ్రిడ్జి ప్రారంభమైనప్పటి నుంచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరం నడిబొడ్డున ఉన్న బ్రిడ్జికి రూ.98 కోట్లు కేటాయించి, శివారు ప్రాంతాల్లో ఇటీవల మంజూరు చేసిన బ్రిడ్జిలకు రూ.130 కోట్ల వరకు మంజూరు చేయడం ఏమిటన్నారు. కేంద్ర సహాయ మంత్రికి అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, పరిహారం ఇచ్చి, రోడ్డు విస్తరణ తర్వాత బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బి.సర్వేష్ (26) కొద్దికాలం నుంచి గుంటూరుకు వచ్చి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 17న స్టేడియం సెంటర్‌లో పురుగు మందు తాగాడు. వెంటనే స్థానికులు అతణ్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సర్వేష్ మంగళవారం మృతి చెందినట్లు పాతగుంటూరు పోలీసులు తెలిపారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయ్యేనా..?

నగరంలో 20 వేల మందికి చేరని పరిస్థితి

గోరంట్ల, న్యూస్‌టుడే:

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం ప్రహసనంగా మారింది. సెప్టెంబరు నెలాఖరున జిల్లాకు స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయి. అక్టోబరు మొదటి వారంలోనే వాటిని లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించినా క్షేత్ర స్థాయిలో వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కార్డుల పంపిణీ సిబ్బందికి కష్టంగా మారింది. అధికారుల ఒత్తిడితో కొంత మేరకు పంపిణీ చేపట్టినా చివరకు మిగిలిన కార్డులను పంపిణీ చేయలేక సచివాలయాల్లోనే ఉంచేశారు. ఎవరైనా కార్డుదారులు వచ్చి అడిగితే మాత్రం వారి వివరాలను పరిశీలించి అందిస్తున్నారు.

నగరంలో స్మార్ట్ కార్డుల గణాంకాలిలా..

	పశ్చిమ	తూర్పు
కార్డుదారులు	83,674	99061
పంపిణీ చేసినవి	73,853	87264
చేయాల్సినవి	9,821	11797

నెలాఖరు వరకు అవకాశం

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను నెలాఖరు లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో కార్డుదారులు ఎవరైనా స్మార్ట్ కార్డును పొందకపోతే... వారు ఏ డీలర్ వద్ద నమోదై ఉన్నారో అక్కడకు వెళ్లి సంబంధిత సచివాలయాల్లో స్మార్ట్ రేషన్ కార్డు పొందవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పోర్టబులిటీ విధానంలో రేషన్ పొందుతున్నవారు వారి సొంత ప్రాంతానికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డును పొందాల్సి ఉంటుంది. నెలాఖరు నాటికి కార్డులను తప్పనిసరిగా పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్తు స్తంభాలకు కేబుల్ వైర్లను తొలగించాలి

తీగలను తీసేయిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బంది కలిగించేలా విద్యుత్తు స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన హౌసింగ్‌బోర్డు కాలనీ, ఏటి.అగ్రహారం, శ్యామలానగర్, నాయుడుపేట ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పరిశీలించారు. కార్యదర్శులు భవన నిర్మాణ సమయంలోనే నిర్దేశిత అనుమతి పొందిన ప్లాను ప్రకారం నిర్మాణం చేస్తున్నారా లేదా అనేది చూడాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈలు విష్ణు, కోటేశ్వరరావు, డీఈఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైఫ్రూట్స్ షాపులపై అధికారుల దాడులు

తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పట్నంబజారు పరిసర ప్రాంతాల్లోని డ్రై ఫ్రూట్స్ షాపులపై మంగళవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో కొందరు వ్యాపారులు డ్రై ఫ్రూట్స్ ప్యాకెట్లపై కస్టమర్ కేర్ నంబరు లేకుండా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొందరు వ్యాపారులు ఎమ్మార్పీ లేకుండా సొంతంగా తయారు చేసిన ప్యాకెట్లను అమ్ముతున్నట్లు తేలింది. దీంతో మొత్తం 10 షాపులపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ అల్లురయ్య, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

9న అవినీతి వ్యతిరేక కవితల పోటీ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వచ్చే నెల 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరు అమరావతి సాహితీ మిత్రులు, ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా అవినీతి వ్యతిరేక కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ టి.సేవకుమార్, డాక్టర్ రావి రంగారావు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. అవినీతిని వ్యతిరేకించే ఏ అంశం పైనైనా కవులు అయిదు పద్యాలు, ఒక గేయం, అయిదు మినీ కవితలు, ఒక వచన కవితలో.. ఏదో ఒక ప్రక్రియలోనే కవులు పాల్గొనాలన్నారు. ఏ కవిత అయినా 24 లైన్లకు మించకుండా రాయాలని, నగదు బహుమతులు ఉంటాయన్నారు. కవితలను వాట్సప్ నంబరు 94936 86165కు ఈనెల 30వ తేదీలోగా పంపాలన్నారు. కవితతో పాటు కవిత పేరు, కవి పేరు, చిరునామా, వాట్సప్ నంబరు, హామీపత్రం, ఫొటో తప్పనిసరి, తప్పులు లేకుండా యూనికోడ్ తెలుగులో టైప్ చేసి పెట్టాలన్నారు. పీడీఎఫ్, ఇమేజ్ తదితర ఫైల్స్ ఆమోదించరన్నారు.

సొసైటీల్లోనూ డిజిటల్ సేవలు అమలవ్వాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: సహకార రంగంలోని అన్ని స్థాయుల్లోనూ డిజిటల్ విధానంలో లావాదేవీలను అమలు చేయాలని రాయపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్‌చౌదరి కోరారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. డీసీసీబీల్లో పని చేస్తున్న ఉద్యోగుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం వల్ల ఆర్థిక అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో సహకార రంగంలో డిజిటల్ సేవల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

డీసీసీబీ ఇన్‌ఛార్జి సీఈవోగా ఫణి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఇన్‌ఛార్జి సీఈవోగా ఫణికి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బ్యాంకు ఛైర్మన్ మంగళవారం సాయంత్రం ఫణికి నియామకపత్రాన్ని అందించారు.

పురావస్తు శాఖలోని సిబ్బందిని కొనసాగించాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్‌లోని సిబ్బందిని కొనసాగించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు దిల్లీలో కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్‌రావత్, కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌లను మంగళవారం కలిసి వినతిపత్రం అందించినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిత

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కార్యదర్శి విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ మహమ్మద్(తొమ్మిదో తరగతి) 100 మీటర్ల పరుగు పోటీలో పసిడి పతకాన్ని సాధించాడన్నారు. 400 మీటర్ల రిలే పరుగు పోటీలో మహమ్మద్(తొమ్మిదో తరగతి), భార్గవ్, సాహిర్, షణ్ముఖ్(ఎనిమిదో తరగతి) పసిడి పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపల్ దుర్గాశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

గుంటూరు సిటీ, కంకరగుంట, నియర్ పెట్రోలు బంక్, డోరు నెం.28-1-78 నివాసి షేక్ మొయినుద్దీన్ (సెల్:80196 00786) తండ్రి: షేక్ సాహెబ్ పీరాన్ తెలియజేయునది- నా పేరిటకు రిజిస్ట్రరైన కాబడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన అస్వాధీనపు విక్రయ అగ్రిమెంటు ద.నెం.6603/2006రు ఒరిజినల్‌ను ది.20-10-2025న పాత గుంటూరులోని డాక్యుమెంటు రైటరును కలిసేందుకు వెళ్లి, సమీపంలోని ఫొటోస్టాట్ సెంటర్‌కు వెళ్లి జిరాక్సు తీయించుకుని తిరిగి డాక్యుమెంటు రైటరు ఇంటికి వెళ్లుచుండగా పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

సరకులు ఇంటిదారి పట్టడంపై కలెక్టర్ ఆరా

ఈనాడు కథనానికి స్పందన

జిల్లాపరిషత్తు-కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలో ఓ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంగన్‌వాడీ సిబ్బంది నుంచి కిరాణా సరకులు తెప్పించుకోవడంపై నివేదిక సమర్పించాలని జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. 'ఈనాడు'లో 'పాల ప్యాకెట్లు పక్కదారి.. సరకులు ఇంటిదారి' శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు సదరు సూపర్‌వైజర్‌పై విచారణ చేసి నివేదించాలని సూచించారు. ఇదే కథనంపై రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయ అధికారులు కూడా ఆరా తీశారు. దాంతో ఆ శాఖ జిల్లా అధికారి పి.పి.జి.ప్రసూన నగర ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అరుణను వివరణ ఇవ్వాలన్నారు. సీడీపీవో అరుణ నగరంలోని ఐసీడీఎస్ క్లస్టర్ల సూపర్‌వైజర్లను కార్యాలయానికి పిలిపించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. దీనిపై కొందరు జిల్లా కార్యాలయానికి వెళ్లారు. అధికారి అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ ఎం.ఎన్.మూర్తిని కలిసి వారి సమస్యను తెలియజేసి వెళ్లారు. సదరు ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్‌వైజర్‌పై అన్నింటా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు: ఆకులవారితోట పీకలవాగు దగ్గర చెత్తతో కూడిన వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బంది సాయంతో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

కాలువల్లో పూడికతీత: ఎన్జీవో కాలనీ దగ్గరున్న సైడ్ డ్రెయిన్‌లో మురుగు నీటి పారుదల సక్రమంగా లేదు. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ అంగడి రాజేష్ దృష్టికి తీసుకెళ్లాం. యాన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించారు. **-న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్వీయ క్రమశిక్షణతోనే వ్యసనాలకు దూరం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ గోపీచంద్ తదితరులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: స్వీయ క్రమశిక్షణతోనే వ్యవసనాలకు దూరంగా ఉండవచ్చని జేకేసీ కళాశాల ప్రిన్సిపల్ పి.గోపీచంద్ అన్నారు. నిషాముక్త్ ఏర్పడి ఐదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కళాశాల ఎక్స్‌టెన్షన్ విభాగం, ఈగల్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈగల్ టీమ్ సభ్యులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయి వివిధ రకాల నార్కోటిక్స్ చెడ్డ ప్రభావాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాల జాడ తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలపాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఆంగ్ల విభాగాధిపతి పి.నాగసుశీల, పీడీ కృష్ణారావు, అధ్యాపకులు చరణ్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

మహిళల సంతోషమే ధ్యేయం

సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి కళ్లల్లో సంతోషం చూడటమే ధ్యేయమని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహిళా గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలు ప్రాంతాల మహిళలు సమస్యలు విన్నవించారు. పింఛన్లు అందడం లేదని, రేషన్ కార్డులు గత ప్రభుత్వంలో తొలగించారని, వీధి దీపాలు వెలగడం లేదని, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజలతో మమేకమవుతూ పని చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక మహిళల సమస్యలు పరిష్కరించాలని ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించామన్నారు. మహిళలు స్వేచ్ఛగా సమస్యలు చెప్పుకునే వాతావరణం కల్పించడమే మా ధ్యేయమని, మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెరిగేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి మాట్లాడుతూ గతంలో నాయకుల్ని కలిసి సమస్యలు చెప్పాలంటే యాతన పడాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. సమస్య ఎక్కడుంటే.. అక్కడకు ఎమ్మెల్యే మాధవి స్వయంగా ద్విచక్ర వాహనంపై వెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారన్నారు. ప్రత్యేకంగా మహిళల కోసం గ్రీవెన్స్ నిర్వహించడం రాష్ట్రంలో ఎక్కడా లేదని, ఇది అందరికీ ఆదర్శప్రాయమన్నారు.

ఎక్కడుండాలి.. ఎలా పర్యవేక్షించాలి?

జీజీహెచ్‌లో పోలీస్ ఔట్ పోస్టుకు గది కరవు

కూల్చివేసేందుకు సిద్ధంగా పోలీసు ఔట్ పోస్టు గది

నగరంపాలెం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో పోలీసు ఔట్‌పోస్టు చాలా కీలకం. జీజీహెచ్‌కు వచ్చే రోగులు, సహాయకులు, వైద్యాధికారులు, వైద్యులు, నర్సులు, సిబ్బందికి ఈ ఔట్‌పోస్టు పోలీసులే రక్షణ కల్పించాల్సి ఉంది. ఇప్పుడీ పోలీస్ ఔట్‌పోస్టుకు ప్రస్తుతం కొత్త చిక్కు వచ్చి పడింది.

★ శంకర్‌విలాస్ పైవంతెన నిర్మాణంలో భాగంగా జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం సమీపంలోని ఆసుపత్రి ప్రహరీని తొలగించి కొత్తగా నిర్మాణం చేపట్టారు. గతంలో ప్రహరీ లోపల జీజీహెచ్ పోలీసు ఔట్‌పోస్టు ఉండేది. గోడ కూల్చివేయడం, కొత్తది నిర్మించడంతో ఇది పూర్తిగా బయటకు వెళ్లిపోయింది. దాని కూల్చివేతకు అధికారులు సన్నద్ధం కాగా.. తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులు కొంత గడువు ఇచ్చారు. అయితే ఇప్పటికిప్పుడు ఏం చేయాలో తెలియక సిబ్బంది సతమతం అవుతున్నారు.

మని, ప్రత్యామ్నాయం చూసుకోవాలని వారం సమయం ఇచ్చారు. దీంతో గతంలో కట్టించిన దాతనే పోలీసు అధికారులు సంప్రదించారు. సానుకూలంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వారు స్పందించకపోవడంతో.. ఈ అంశం పెండింగ్‌లో పడింది.

దాతలు ముందుకొస్తేనే..

పొదిల ప్రసాద్ బ్లాక్ నిర్మించినప్పుడు పోలీసు ఔట్ పోస్టు అత్యవసర వైద్యసేవల విభాగంలో ఉండాలని దాత ప్రత్యేకంగా గది ఏర్పాటు చేశారు. తర్వాత దానిని బయటకు తరలించడంతో దాత సహకారంతో నిర్మాణం చేపట్టి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం శంకర్‌విలాస్ పైవంతెన నిర్మాణ పనుల్లో భాగంగా దానిని తొలగిస్తు

ఎంతో కీలకమైనా..

గుంటూరు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి ఎమ్మెల్సీ కేసులు, పోక్సో కేసుల బాధితులను జీజీహెచ్‌కు తీసుకొస్తుంటారు. జీజీహెచ్‌లో దొంగతనాలు, చిన్నపిల్లల అపహరణ, ద్విచక్ర వాహనాల చోరీ, ఆకతాయిల అల్లర్లను సమర్థంగా అడ్డుకునే పోలీసు సిబ్బందికి కనీసం ఆసుపత్రి ప్రాంగణంలో గది లేకుండాపోయింది. అత్యవసర వైద్యసేవల విభాగం లోని చిన్న గదిని వినియోగిస్తున్నారు. ఆ గదిని ఖాళీ చేయాలంటున్నారని సిబ్బంది పేర్కొంటున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడో ఒకచోట దీనికి స్థలం కేటాయించాలని, దాతల నుంచి సాయం విషయంలో కలెక్టర్, ఎస్పీ, సూపరింటెండెంట్ ప్రత్యేక దృష్టి సారిస్తే ఔట్‌పోస్టు నిర్మాణం సులువవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 40, వంగ (సన్నాలు) 54, బెండ 48, పచ్చిమిర్చి 46, కాకర 56, బీర 45, క్యాలిఫ్లవర్ 25, క్యాబేజి 30, క్యారెట్ 60, దొండ 64, బంగాళదుంప 24, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 64, దోస 32, సొర 29, పొట్ల 44, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 86, చామదుంప 24, మునగ 10, బీట్‌రూట్ 45, కీరదోసకాయ 29, బీన్స్ 50, క్యాప్సికమ్ 80, కొత్తిమీర 30, ఆకుకూరలు 20, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

చీటీ డబ్బులు తీసుకుని.. కిస్తీలు కట్టకుండా ఎగ్గొట్టి..

రూ.1.5 కోట్లకు ష్యూరిటీ ఇచ్చిన వారి ఫిర్యాదు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుజ్జనగుండ్ల సెంటర్ సిద్ధార్థనగర్‌లోని తూనికలు, కొలతలశాఖలో పనిచేసే ఓ ఉద్యోగి తోటి ఉద్యోగులతో పూచీకత్తు సంతకాలు పెట్టించుకుని ఆరు ప్రైవేటు సంస్థల్లో చీటీ పాటలు పాడుకుని కొన్ని నెలలుగా డబ్బులు కట్టడం మానేశాడు. దీంతో పూచీకత్తు ఉన్న ఉద్యోగులకు ప్రైవేటు చీటీ సంస్థల నోటీసులు జారీ చేసి కోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఆరు ఉద్యోగుల జీతాల నుంచి చీటీపాటల బాకాయి సొమ్ము కోర్టులో చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో పూచీకత్తు ఉన్న ఉద్యోగుల జీతాల్లో నుంచి ప్రతి నెల కొంత నగదు ప్రైవేటు చీటీ సంస్థల వసూలు చేస్తున్నాయి. సదరు ఉద్యోగి దాదాపు రూ.1.5 కోట్ల పైగా చీటీ పాటల బాకాయి సొమ్ము చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో బాధిత ఉద్యోగులు ఇటీవల సదరు ఉద్యోగిపై పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తూనికలు, కొలతలశాఖ అధికారులు ఈ విషయాన్ని బయటకు రానివ్వకుండా గుట్టుగా ఉంచుతున్నారు.

జేఏసీని రాజకీయాల్లోకి లాగొద్దు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో జేఏసీని రాజకీయాల్లోకి లాగొద్దని జేఏసీ కన్వీనర్ ఎల్ఎస్ భారవి అన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేట్ పేయర్స్ నాయకులు ఎం.రాధాకృష్ణ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వి.సదాశివరావు, అరండల్‌పేట, బ్రాడీపేట మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. హైకోర్టు కమిషన్ బ్రిడ్జిని సందర్శించిన సందర్భంగా జేఏసీ నాయకుల్ని ఉద్దేశించి మేయర్ దుష్టశక్తులు అని మాట్లాడడం సభ్యత కాదన్నారు. వివిధ వర్గాలకు చెందిన 22 సంఘాలు గత ఆరు నెలలుగా బ్రిడ్జికి అనేక సవరణలు చేస్తూ, వాటి సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో సర్వీసు రోడ్డు ఇస్తామని జీఎంసీ, ఇవ్వలేమని ఆర్అండ్‌బీ విరుద్ధంగా వ్యవహరించారన్నారు.

బడుగులపై ఆగని దాడులు

కలెక్టరేట్ ఎదుట సీపీఐ నాయకుల ఆందోళన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: దేశంలో మూడోసారి అధికారం చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలపై దాడులను కొనసాగిస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కులగణనతో కూడిన జనగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ అశాస్త్రీయ ప్రకటనలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, సహాయ కార్యదర్శులు చిన్ని తిరుపతయ్య, మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి అరుణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, ఎం.శివశంకరరావు, ఆర్.ఆదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ మహోత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మారుతినగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్తిక మాస మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, సహస్ర మృత్తిక లింగార్చన, అభిషేక కార్యక్రమాలు, గౌరీ శంకర స్వామికి ప్రదోషకాల అభిషేకం, గంగా గౌరీ సమేత గౌరీశంకర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ పాలకమండలి సభ్యులు కొర్రపాటి రామారావు, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఏటీ అగ్రహారం: మల్లారెడ్డినగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో, ఏటీ అగ్రహారంలోని గాయత్రీ కంచి కామకోటి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు.

బ్రాడీపేట 2/7లోని శ్రీగౌరీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గౌరీవిశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శ్రీనివాసరావు, రాజేశ్వరి దంపతులచే అర్చకస్వామి విశ్వేశ్వరశర్మ కల్యాణం చేయించారు. కార్యక్రమాలను సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్ కుమారశర్మ, మల్లి, చక్రపాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. **-న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం**

కనులపండువగా సహస్ర జోతిర్లింగార్చన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యానగర్ మూడో లైనులోని శ్రీసాయినాథ సన్నిధానంలో కార్తిక మాసశివరాత్రి సందర్భంగా సహస్ర జ్యోతిర్లింగ అర్చన మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీప అలంకరణ చేశారు. ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయ్యేనా..?

నగరంలో 20 వేల మందికి చేరని పరిస్థితి

గోరంట్ల, న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం ప్రహసనంగా మారింది. సెప్టెంబరు నెలాఖరున జిల్లాకు స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయి. అక్టోబరు మొదటి వారంలోనే వాటిని లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించినా క్షేత్ర స్థాయిలో వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కార్డుల పంపిణీ సిబ్బందికి కష్టంగా మారింది. అధికారుల ఒత్తిడితో కొంత మేరకు పంపిణీ చేపట్టినా చివరకు మిగిలిన కార్డులను పంపిణీ చేయలేక సచివాలయాల్లోనే ఉంచేశారు. ఎవరైనా కార్డుదారులు వచ్చి అడిగితే మాత్రం వారి వివరాలను పరిశీలించి అందిస్తున్నారు.

నగరంలో స్మార్ట్ కార్డుల గణాంకాలిలా..

నియోజకవర్గం	పశ్చిమ	తూర్పు
కార్డుదారులు	83,674	99061
పంపిణీ చేసినవి	73,853	87264
చేయాల్సినవి	9,821	11797

నెలాఖరు వరకు అవకాశం.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను నెలాఖరు లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో కార్డుదారులు ఎవరైనా స్మార్ట్ కార్డును పొందకపోతే... వారు ఏ డీలర్ వద్ద నమోదై ఉన్నారో అక్కడకు వెళ్లి సంబంధిత సచివాలయాల్లో స్మార్ట్ రేషన్ కార్డు పొందవచ్చని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పోర్టబులిటీ విధానంలో రేషన్ పొందుతున్న వారు వారి సొంత ప్రాంతానికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డును పొందాల్సి ఉంటుంది. నెలాఖరు నాటికి కార్డులను తప్పనిసరిగా పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

పుస్తకాలే విద్యార్థుల నేస్తాలు

బహుమతులు అందజేస్తున్న కన్నా మాస్టారు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: పుస్తకాలే విద్యార్థుల నేస్తాలని కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్నా మాస్టారు, ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రిలు పేర్కొన్నారు. టీజేపీఎస్ కళాశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'భవిష్యత్తులో కృత్రిమ మేధ పాత్ర' అనే అంశంపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పదో తరగతి విభాగంలో ఎస్కేబీఎం (ప్రథమ), ది సెంట్రల్ స్కూల్ (ద్వితీయ), ఇంటర్ విభాగంలో శ్రీశారదా నికేతన్ (ప్రథమ, ద్వితీయ), చలమయ్య, మాజేటి గురవయ్య, శారదానికేతన్, ది సెంట్రల్ స్కూల్‌లు ప్రోత్సాహక బహుమతులు పొందాయి. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డిగ్రీ, పీజీ గ్రంథాలయ శాఖాధిపతులు బి.సాయికళ, కె.పద్మజ పాల్గొన్నారు.

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కవి సమ్మేళనం నిర్వహించారు. కవులను గ్రంథాలయాధికారిణి శకుంతల సత్కరించారు.

సామర్థ్యాలు వెలికితీసేందుకు పోటీలు దోహదం

బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

గోరంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యాలను వెలికితీసేందుకు, వాటిని మరింతగా పెంపొందించేందుకు క్విజ్ దోహదపడుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ నిర్వహణలో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపగ్రంథపాలకురాలు కందుల ఝాన్సీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఎస్వీఎన్ కాలనీలోని గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు షరీనా, లక్ష్మీకుమారి పోటీలు నిర్వహించారు.

గుంటూరు పశ్చిమ: ఎన్జీవో కాలనీలోని పట్టాభిపురం గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. సిటిజన్స్ అండ్ వాకర్స్ ఎన్జీవోస్ కాలనీ అధ్యక్షురాలు జె.సుబ్బాయమ్మ, జె.వీరారెడ్డి, మున్నంగి స్కూల్ పీటీ మాస్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

మానవాళికి వరం.. ప్రకృతి వైద్యం

మాట్లాడుతున్న డాక్టర్ ఉమాసుందరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఏటీ అగ్రహారం జీరో లైన్‌లోని త్రిగుణ వైద్యశాల ప్రాంగణంలో జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పలువురు ప్రముఖులు ప్రకృతి వైద్య విధానం ఆవిర్భావ విశేషాలు, ప్రయోజనాలను వివరించారు. విశ్రాంత అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వైద్యం మానవాళికి అందించిన వరంలాంటిదన్నారు. డాక్టర్ ఉమాసుందరి మాట్లాడుతూ ప్రకృతి వైద్య విధానం ఆవిర్భావ వికాసాలను వివరించారు. వైద్యులు నిరుపమ, రాధాబాయి, సమీర, సోమేశ్వరి, డాక్టర్ పృధ్విరాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఈ వైద్య విధానాన్ని అనుసరిస్తూ మేలు పొందిన పలువురు తమ అనుభవాలు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిత

విద్యార్థులను అభినందించిన పాటిబండ్ల విష్ణువర్ధన్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కార్యదర్శి విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ మహమ్మద్(తొమ్మిదో తరగతి) 100 మీటర్ల పరుగు పోటీలో పసిడి పతకాన్ని సాధించాడన్నారు. 400 మీటర్ల రిలే పరుగు పోటీలో మహమ్మద్(తొమ్మిదో తరగతి), భార్గవ్, సాహిర్, షణ్ముఖ్(ఎనిమిదో తరగతి) పసిడి పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపల్ దుర్గాశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయిబాబా రథోత్సవం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల్లో భాగంగా బాబా రథోత్సవం మంగళవారం కనులపండువగా నిర్వహించారు. సత్యసాయిబాబా మందిర ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సేవా సమితి ఆధ్వర్యంలో రథోత్సవాన్ని మంచెల పూడి సాంబశివరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి ఎడ్యుకేషన్ అండ్ సర్వీస్ సొసైటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.ఎల్.నరసింహారావు, సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ, సభ్యులు సత్యనారాయణ, మహంకాళి శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపల్స్ పి.సీతామహాలక్ష్మి, లీలావతి, కిశోర్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

సొసైటీల్లోనూ డిజిటల్ లావాదేవీలు తేవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సహకార రంగంలోని అన్ని స్థాయుల్లోనూ డిజిటల్ విధానంలో లావాదేవీలను అమలుచేయాలని రాయపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్‌చౌదరి కోరారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. డీసీసీబీల్లో పని చేస్తున్న ఉద్యోగుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం వల్ల ఆర్థిక అక్రమాలు జరుగుతున్నాయన్నారు.

పురావస్తు శాఖలోని సిబ్బందిని కొనసాగించాలి

కలెక్టరేట్: కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్‌లోని సిబ్బందిని కొనసాగించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు దిల్లీలో కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్‌రావత్, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌లను మంగళవారం కలిసి వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

డీసీసీబీ ఇన్‌ఛార్జి సీఈవోగా ఫణి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఇన్‌ఛార్జి సీఈవోగా ఫణికి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బ్యాంకు ఛైర్మన్ మంగళవారం సాయంత్రం ఫణికి నియామకపత్రాన్ని అందించారు.

విద్యుదాఘాతంతో యువతి దుర్మరణం

పట్టాభిపురం: బ్యాంక్ కాలనీ రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన ఓ యువతి వాటర్ హీటర్ తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. దేవి ప్రత్యూష (24) ఏంబీఏ చదువుతూనే హైదరాబాద్‌లోని డీఎల్ఎఫ్ ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. గత అక్టోబరులో అరండల్‌పేటకు చెందిన గోకుల్ కృష్ణతో వివాహమైంది. మంగళవారం బకెట్‌లో హీటర్ పెట్టి భర్త కోసం స్నానానికి వేడి నీళ్లు పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయారు. ప్రభుత్వాసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. తండ్రి వెంకట సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారంతా గుంతలు.. రాకపోకలకు కష్టాలు

గుజ్జనగుండ్ల కూడలి నుంచి విద్యుత్తు కార్యాలయం వరకు రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహన చోదకులు పేర్కొంటున్నారు. పలుచోట్ల గుంతల వద్ద డస్ట్ పోసి వదిలేశారు. దీంతో అందులోని రాళ్లు వాహనాల రాకపోకల సమయంలో ఎగిరి పడుతున్నాయి. అధికారులు స్పందించి గుజ్జనగుండ్ల -పలకలూరు రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గోరంట్ల**

9న అవినీతి వ్యతిరేక కవితల పోటీ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వచ్చే నెల 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరు అమరావతి సాహితీ మిత్రులు, ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా అవినీతి వ్యతిరేక కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ టి.సేవకుమార్, డాక్టర్ రావి రంగారావు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. అవినీతిని వ్యతిరేకించే ఏ అంశం పైనైనా కవులు అయిదు పద్యాలు, ఒక గేయం, అయిదు మినీ కవితలు, ఒక వచన కవితలో.. ఏదో ఒక ప్రక్రియలోనే కవులు పాల్గొనాలన్నారు. ఏ కవిత అయినా 24 లైన్లకు మించకుండా రాయాలని, నగదు బహుమతులు ఉంటాయన్నారు. కవితలను వాట్సప్ నంబరు 94936 86165కు ఈనెల 30వ తేదీలోగా పంపాలన్నారు. కవితతో పాటు కవిత పేరు, కవి పేరు, చిరునామా, వాట్సప్ నంబరు, హామీపత్రం, ఫొటో తప్పనిసరి, తప్పులు లేకుండా యూనికోడ్ తెలుగులో టైప్ చేసి పెట్టాలన్నారు. పీడీఎఫ్, ఇమేజ్ తదితర ఫైల్స్ ఆమోదించరన్నారు.

ప్రతిభావంతులకు అభినందన

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి పోటీలకు టీజేపీఎస్ కళాశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలిపారు. డిసెంబరు రెండో వారంలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జూనియర్ ఇంటర్ విద్యార్థిని బి.రోచిష్మతి, మధ్యప్రదేశ్‌లో వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు అకియర్ అహమ్మద్ ఎంపికయ్యారన్నారు. వీరిని కళాశాలలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, వ్యాయామ అధ్యాపకుడు టి.వాసుదేవరరావు, ఇన్‌ఛార్జి జి.సురేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హోమ్ లోన్ సెంటర్ (RACPC), గుంటూరు, 26-1-52, కన్నవారితోట, గుంటూరు-522004. ఇ-మెయిల్ : sbi.05256@sbi.co.in

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్తి కొరకు))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి ... తేది.21.08.2025 నాటి డిమాండ్ నోటీసు ... రూ.26,73,557/- ... తేది.13.11.2025 న స్వాధీనం చేసుకున్నారు. ...

[illegible]

తేది : 13.11.2025 | సం/- అధీకృత అధికారి

ప్రదేశం : గుంటూరు | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అద్విక కేసులో ఆదిత్య కస్టడీ కోసం పిటిషన్

ఈనాడు - అమరావతి: అద్విక కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు ఆదిత్యను మరో విడత కస్టడీ కోరుతూ మంగళవారం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం ఈనెల 20కి వాయిదా పడింది. తొలి విడత కస్టడీలో ఆదిత్యతోపాటు, అతని భార్య, బాలకృష్ణలను పోలీసులు ప్రశ్నించారు. అయినా లెక్కలు చూపని సొమ్ముకు సంబంధించి వివరాలు వెల్లడించలేదు.

అన్నదాతా.. ఖుషీభవ!

✦ నేటి నుంచి పీఎం, కిసాన్, సుఖీభవ సొమ్ము జమ

ఈనాడు, అమరావతి: అన్నదాతా... సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ సొమ్ము జమ చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. బుధవారం నుంచి సొమ్ము జమ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ నుంచి రూ.5 వేలు, పీఎం కిసాన్ రూ.2 వేలు చొప్పున జమ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 2,52,485 మంది రైతుల ఖాతాలకు రూ.168.23 కోట్లు బదిలీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న వేళ.. ఈ సొమ్ము ఉపయుక్తంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ✦ ఎన్టీఆర్ జిల్లాలో సుఖీభవ కింద రూ.59.31 కోట్లు, పీఎం కిసాన్ నుంచి రూ.20.40 చొప్పున రూ.79.72 కోట్లు జమవుతుంది. ✦ కృష్ణా జిల్లాలో సుఖీభవ కింద రూ.66.93 కోట్లు.. పీఎం కిసాన్ కింద రూ.21.56 కోట్లు చొప్పున రూ.88.49 కోట్లు జమవ్వనున్నాయి. ✦ అత్యధికంగా కృష్ణాలో పామర్రుకు రూ.19.56 కోట్లు, ఎన్టీఆర్‌లో నందిగామకు రూ.20.40 కోట్లు జమకానున్నాయి.

లబ్ధి (రూ.కోట్లలో)	సుఖీభవ		పీఎం కిసాన్		మొత్తం
నియోజకవర్గం	రైతులు	లబ్ధి	రైతులు	లబ్ధి	లబ్ధి
మచిలీపట్నం	7,526	3.76	7,071	1.41	5.17
అవనిగడ్డ	30,316	15.16	24,906	4.98	20.14
పెడన	24,202	12.10	19,656	3.93	16.03
గుడివాడ	11,168	5.58	9,283	1.86	7.44
పామర్రు	29,680	14.84	23,591	4.72	19.56
పెనమలూరు	8,013	4.01	7,067	1.41	5.42
గన్నవరం	22,951	11.48	16,236	3.25	14.73

గతి తప్పిన వేగం.. గాలిలో ప్రాణం!

ప్రైవేటు ట్రావెల్స్ వాహన దూకుడుకు పడని కళ్లెం

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, నందిగామ



■ విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలో అనాసాగరం వద్ద వేగంగా దూసుకొచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. ప్రమాదంలో ఏనిమిది మందికి గాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అతివేగమే దుర్ఘటనకు కారణం.

■ గతంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పెనుగంచిప్రోలు మండలం ముక్త్యాల సమీపంలో వేగంగా వెళ్తూ ఎద్దుల బండిని ఢీకొని ప్రమాదానికి గురైంది. 11 మంది ప్రయాణికులు ఆస్పత్రిపాలవ్వగా ఒకరు మృత్యువాత పడ్డారు. చాలా మంది గాయాలపాలయ్యారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంతో.. ఇటీవల కర్నూలు జిల్లాలో 19 మంది సజీవ దహనమయ్యారు. ఈ ఘటనతో రాష్ట్రమంతా ఉలిక్కిపడినా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తీరు మారడం లేదు. దూకుడు తగ్గించుకునే ప్రయత్నం చేయడం లేదు. మంగళవారం నందిగామ పరిధిలో జరిగిన ప్రమాదం వారి నిర్లక్ష్యాన్ని మరోమారు నిరూపించింది.

నందిగామ: అనాసాగరం వద్ద సోమవారం అర్ధరాత్రి లారీని ఢీకొని ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు

■ ఉమ్మడి జిల్లాలో మూడు ప్రధాన ఎన్‌హెచ్‌ల్లో ఈ ఏడాది ప్రమాద గణాంకాలు భయపెడుతున్నాయి. మొత్తం 479 ప్రమాదాలు జరిగితే 199 మంది మృత్యువాతపడ్డారు. 440 మంది గాయాల బారిన పడ్డారు. ■ ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో అతివేగంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో స్పీడ్ లాక్ సిస్టం ఉంటుంది. 70 కిమీ వేగం దాటి వెళ్లే అవకాశం ఉండదు. ప్రైవేటు బస్సుల్లో ఈ నిబంధన లేకపోవడంతో రాత్రిళ్లు గంటకు 120 కిమీ వేగంగా అడ్డగోలు నడిపేస్తున్నారు. ఆరు గంటల ప్రయాణం 4 గంటల్లో ముగిస్తున్నారు. ■ బస్సుపైనా, లగేజ్ కౌంటర్ పరిమితికి మించి బరువున్న పార్సిళ్లు, సామగ్రి రవాణా చేయడం నిబంధనలకు విరుద్ధమైనా గుట్టుగా సాగిపోతోంది. ఈ అధిక బరువు సైతం వేగంలో బస్సు నియంత్రణకు రాకుండా చేస్తోంది. ■ విజయవాడ కేంద్రంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు నిత్యం 500పైగా బస్సులు తిప్పుతున్నారు. రవాణా శాఖ అధికారులు తనిఖీలు గాలికొదిలిన ఈ ఫలితమే ఈ రహ''దారుణా''లనేది సుస్పష్టం.

నగరంలో అలజడి

32 మంది మావోయిస్టుల అరెస్టు

పెనమలూరు, కానూరు - న్యూస్‌టుడే

కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన పోలీసులు

నగర శివారు ప్రాంతాలు తెలతెలవారుతూనే ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యాయి. కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందారనే సమాచారం సంచలనం రేపింది. మంగళవారం ఉదయం ఆక్టోపస్, బాంబ్ స్క్వాడ్, క్లూస్‌టీం, భారీ ఎత్తున పోలీసు, కేంద్ర ప్రభుత్వ బలగాలు.. ఆ పారిశ్రామికవాడలోకి ప్రవేశించడం, 27 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. వీరితో పాటు రామవరప్పాడు, ఎనికేపాడు ప్రాంతాల్లో మూడు చోట్ల నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మూడు నెలల నుంచి ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారిలో ఓ అగ్రనేత కూడా ఉన్నట్లు తెలిసింది. గన్నవరంలో చికిత్స చేయించుకునేందుకు వచ్చి మరొక మావోయిస్టు దొరికిపోయాడు.

సమాచారం, కదలికలు బయటకు పొక్కకుండా..

కొత్త ఆటోనగర్‌లో పట్టుబడ్డ మావోయిస్టులు స్థానికంగానే ఉంటున్నా ఏ మాత్రం సమాచారం, కదలికలు బయటకు పొక్కకపోవడంపై స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవడంతో పాటు పెద్ద చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టులు ఐదో నంబరు రహదారిలోని ఓ భవనంలో మకాం వేయగా.. వారంతా ఒకేసారి అందులోకి ప్రవేశించలేదని తెలుస్తోంది. అలా వస్తే స్థానికులకు అనుమానం వస్తుందని, సమాచారం పోలీసులకు చేరుతుందనే అనుమానంతో రోజుకు ఇద్దరు, ముగ్గురు, నలుగురైదుగురు చొప్పున ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతంలో అందరూ కార్మికులు ఉండటం, వారంతా ఉదయం వచ్చి రాత్రి సమయంలో తిరిగి వెళ్లిపోయే వారు కావడంతో.. రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు జనసంచారం అంతగా ఉండదు. దీంతో భవనంలోకి మావోయిస్టుల చేరిక సులువైందంటున్నారు. భవనం యజమాని విదేశాల్లో ఉంటారని గుర్తించారు. నిర్వహణ, పర్యవేక్షణంతా కాపలాదారుగా ఉన్న వ్యక్తి చూస్తుంటారని తెలుస్తోంది. మావోయిస్టులు తాత్కాలికంగా ఆశ్రయం పొందారా లేక ఏదైనా లక్ష్యంతో ఇక్కడకొచ్చారా అన్న దిశగా విచారణ సాగుతోంది.

మీడియాను నిలువరించిన పోలీసులు

గతంలో రాకెట్ లాంచర్లు స్వాధీనం

వాస్తవానికి కానూరు ఆటోనగర్‌లో మావోయిస్టుల కదలికలు కొన్నేళ్ల క్రితమే వెలుగులోకి వచ్చాయి. గతంలో మావోయిస్టులకు చెందిన వందల కొద్దీ రాకెట్ లాంచర్లు ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పట్టుబడటాన్ని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.

మావోయిస్టులు ఉన్న భవనం వద్దకు చేరుకున్న క్లూస్ టీం

తనిఖీలకు వచ్చిన డాగ్ స్క్వాడ్

బందరులో 400 ఎకరాల్లో పరిశ్రమలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: బందరు పోర్టు సమీపంలో 400 ఎకరాల్లో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. మంగళవారం మచిలీపట్నంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పారిశ్రామికవేత్తల సదస్సు ద్వారా రూ.13.50 లక్షల పెట్టుబడులు వచ్చాయన్నారు. మచిలీపట్నంలో గోవా ప్రభుత్వ నౌకాయాన సంస్థ షిప్ యార్డు నిర్మాణానికి ముందుకొచ్చిందని, దానికి సంబంధించి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందన్నారు. మచిలీపట్నంకు చెందిన గ్రీన్‌కో సంస్థ నిర్వాహకులు రూ.4వేల కోట్ల పెట్టుబడితో కెమికల్ కంపెనీ పెట్టేందుకు ముందుకొచ్చారన్నారు. పోర్టు చుట్టుపక్కలే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మెగా సంస్థకు చెందిన వారు విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ మాదిరిగా బందరులో కూడా ఓ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

పలువురు ఎస్సైలకు స్థానచలనం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న కేఫై దాస్‌ను చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు, చల్లపల్లి ఎస్సై పీఎస్వీ సత్యనారాయణను.. ఇనగుదురు పోలీస్‌స్టేషన్-1కు, ఇనగుదురు ఎస్సై వైవీవీ సత్యనారాయణను ఏలూరు జిల్లా పెదవేగిలోని డీటీసీకి బదిలీ చేశారు. జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరోకి అటాచ్ చేసిన కోడూరు ఎస్సై పి.శిరీషను కూచిపూడి పోలీస్‌స్టేషన్‌కు, మోపిదేవి పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేసిన అవనిగడ్డ ఎస్సై-2 వైవీవీ సత్యనారాయణను గుడివాడ-1టౌన్ స్టేషన్‌కు, గుడివాడ-1టౌన్ ఎస్సై పి.గౌతమ్‌కుమార్‌ను అవనిగడ్డ ఎస్సై-2గా బదిలీ చేస్తూ.. మోపిదేవి పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేశారు. కూచిపూడి పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేసి, వీఆర్‌లో ఉన్న కె.నాగవిశ్వనాథ్‌ను జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరోకు అటాచ్ చేశారు.

20న పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం

కొండపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 20న గురువారం పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నామని పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు మంగళవారం తెలిపారు. దీపోత్సవానికి కావాల్సిన అన్ని వస్తువులను మహిళలే స్వయంగా సమకూర్చుకోవాలన్నారు.

సైకిల్ ఇష్టమే.. సవారీ కష్టమే

★ విజయవాడ, మచిలీపట్నం అత్యంత అనుకూలం
★ ఒక్క ట్రాక్ కూడా లేక తొక్కేందుకు వెనుకడుగు

సైకిల్ తొక్కేందుకు అత్యంత అనువైన నగరాలు.. విజయవాడ, మచిలీపట్నం. రెండు నగరాల్లో ఎక్కడా ఎత్తుపల్లాలు, కొండలు, గుట్టల మీదుగా రహదారులు లేవు. నగరం ఆ చివరి నుంచి ఈ చివరికి హాయిగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిపోవచ్చు. కానీ రెండు నగరాల్లోనూ కనీసం ఒక్కటంటే ఒక్క సైకిల్ ట్రాక్ కూడా లేదు. అందుకే నగరవాసులు సైకిల్ తొక్కాలని ఉండి.. కొనుగోలు చేస్తున్నా.. రహదారులపైకి ధైర్యంగా వచ్చే పరిస్థితి లేదు. ఎటు నుంచి ఏ వాహనం మీదకు దూసుకొస్తుందో తెలియదు.

15 ఏళ్ల కిందటే..

విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు ఉన్న సమయంలో బెంజిసర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ఓ సైకిల్ ట్రాక్‌ను 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. ఉచితంగా కొన్ని సైకిళ్లను ఉంచారు. ప్రతి శనివారం సైక్లింగ్‌ను ఉదయాన్నే నిర్వహించారు. జనంలోనూ స్పందన విపరీతంగా వచ్చింది. కమిషనర్ బదిలీపై వెళ్లడంతో తర్వాత అధికారులు పట్టించుకోక ట్రాక్ గాలిలో కలిసిపోయింది. తర్వాత బీఆర్‌టీఎస్ రహదారిపైనా ట్రాక్‌కు ప్రణాళికలు సిద్ధం చేసినా అమలు జరగలేదు.

- ఈనాడు, అమరావతి

గంట చాలు..

విజయవాడ, మచిలీపట్నం.. వైశాల్యంలో రెండూ చిన్న నగరాలే. ఆ చివరి నుంచి ఈ చివరికి.. సైకిల్‌పై సరిగ్గా గంటలోపే వెళ్లిపోయేంత దూరంలోనే అన్ని ప్రాంతాలూ ఉన్నాయి. సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు డబ్బులు ఆదా అవుతాయి. అందుకే పాఠశాలలు, కార్యాలయాల్లో కచ్చితంగా సైకిల్‌ను ప్రోత్సహించాలంటూ చాలాకాలంగా విజయవాడ బైసైకిల్ అసోసియేషన్ సహా పలు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ఆరోగ్య ప్రయోజనం

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సైకిల్‌ను కొనుగోలు చేయండి. రోజూ కనీసం గంటసేపు సైకిల్ తొక్కడం వల్ల శారీరకంగా ఎంతో ప్రయోజనం' అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం(ఎస్‌పీఎఫ్) విజయవాడ రీజియన్‌కు కమాండెంట్‌గా పనిచేసిన కె.ఎన్.రావు.. పదేళ్ల కిందటే ఓ ఉద్యమంలా సైకిల్ గురించి నగరంలో ప్రచారం చేశారు. అప్పట్లో ఎస్‌పీఎఫ్ సిబ్బందికి 3వేల సైకిళ్లను కొనుగోలు చేసి ఇచ్చారు. దీనివల్ల అనూహ్యంగా సిబ్బంది వైద్య ఖర్చుల బిల్లు ఏడాదికి రూ.20 లక్షలకు పైగా తగ్గిందని స్వయంగా కె.ఎన్.రావు ప్రకటించారు. సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలకు ఇదో ప్రత్యక్ష నిదర్శనం.

ఒక్క క్లిక్‌తో..

విద్యుత్తు బిల్లుల చెల్లింపు!

✷ గ్రూప్ పేమెంట్ ఫీచర్‌తో వెసులుబాటు
✷ అందుబాటులోకి తెచ్చిన సీపీడీసీఎల్...

'ఉద్యోగరీత్యా రవి విజయవాడలో స్థిరపడ్డాడు. తల్లిదండ్రులు గుంటూరు జిల్లాలో ఉంటారు. వారి ఇంటి కరెంటు బిల్లు ప్రతి నెలా రవి చెల్లిస్తుంటాడు. గత నెలలో తాను ఉంటున్న విజయవాడలో ఇంటి బిల్లు చెల్లించాడు. ఊళ్లోని బిల్లును చెల్లించడం మర్చిపోయాడు. గడువు తేదీ దాటాక గుర్తురావడంతో.. ఆ తర్వాత జరిమానాతో చెల్లించాల్సి వచ్చింది.'

తాజాగా తెచ్చిన కొత్త ఫీచర్‌తో ఈ సమస్యలకు సీపీడీసీఎల్ చెక్ పెట్టింది. ఒకటి కంటే ఎక్కువ సర్వీసుల బిల్లులు చెల్లించే వారికి ఇది ఉపకరించనుంది. దీనిని ఇటీవల డిస్కమ్‌లోని ఐటీ విభాగం ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్‌ను ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యుత్తు వినియోగదారులు వాడుకోవచ్చు. ఇందుకు apcpdcl.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈ సేవను సద్వినియోగం చేసుకోవచ్చు.

☆ ముందుగా వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. హోమ్ పేజీలో కనిపించే 'గ్రూప్ సర్వీసెస్ పేమెంట్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత మొబైల్ నంబరు నమోదు చేస్తే.. ఓటీపీ వస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆపై లాగిన్ అనే టాబ్‌పై క్లిక్ చేయాలి.

ఒకేసారి.. 20



☆ తర్వాత వచ్చే ఎడిట్ స్క్రీన్‌లో కనెక్షన్... 13 అంకెల సర్వీసు నెంబరు, మెయిల్ ఐడీ నమోదు చేయాలి. గరిష్ఠంగా 20 సర్వీసులు నమోదు చేసుకోవచ్చు. ఎక్కువుంటే.. సీపీడీసీఎల్‌కు మెయిల్‌లో విన్నవించాలి.

☆ సర్వీసు నంబర్లు నమోదు చేశాక.. ఒకేచోట వాటి సమాచారమంతా కనిపిస్తుంది. వినియోగదారు పేరు, బిల్లు తేదీ, గడువు తేదీ, డిస్‌కనెక్షన్ గడువు, కనెక్షన్ కేటగిరీ వస్తాయి. సర్వీసు నెంబర్లను సెలెక్ట్ చేసుకుంటే.. వాటి బిల్లు కింద కనిపిస్తుంది. pay the- group bill అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

☆ తర్వాత పేమెంట్ గేట్‌వేలోకి వెళ్లాక.. బిల్లును క్రెడిట్, డెబిట్ కార్డులు, వ్యాలెట్, క్యూఆర్, యూపీఐ, గూగుల్ పే ద్వారా చెల్లించే వీలుంది.

– ఈనాడు, అమరావతి

దిమ్మెకో లెక్క.. దశదిశా పక్కా!

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఈ దిమ్మెకు.. ప్రత్యేక స్థానం ఉంది. 1910లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం జరిపిన దేశవ్యాప్త గ్రేట్ ట్రిగ్నోమెట్రికల్ భూసర్వేకు గుర్తుగా "ప్రామాణిక బెంచ్ మార్క్" పేరుతో దీనిని నిర్మించారు. ఇది... భూమి ఉపరితలంపై స్థిర బిందువులు, సముద్ర మట్టం ఎత్తులను కచ్చితంగా తెలపటానికి ఉపకరిస్తుంది. దీని ఆధారంగా భూమి కొలతలు, పర్వతాలు, గుట్టల ఎత్తులను కొలిచేవారు. కచ్చితమైన మ్యాపింగ్, సర్వేయింగ్ నిర్ధారణకు ఇది ముఖ్య రిఫరెన్స్ పాయింట్. ఇదేతరుణంలో జియో స్పేషియల్ డైరెక్టరేట్, హైదరాబాద్ వారు.. జియోస్పేషియల్ డేటా సమగ్రతకు సంకల్పించారు.. వీటి పరిరక్షణ బాధ్యత చేపట్టి... ఆవశ్యకత తెలిసేలా బోర్డులను పెట్టారు.

- ఈనాడు, అమరావతి

రాకాసి అల.. దివిసీమ విలవిల

ఆ దుర్ఘటనకు నేటితో 48ఏళ్లు..

పరిస్థితిని తెలుసుకుంటున్న మదర్ థెరిస్సా


సర్వం కోల్పోయి నిరాశ్రయులైన జనం

1977 నవంబరు 19.. దివిసీమను కడలి కాలనాగై ఉవ్వెత్తున ఎగసిపడిన కెరటాలతో అతలాకుతలం చేసి మరుభూమిగా మార్చిన రోజు. తాడి ఎత్తు పడగలతో సముద్రుడు ముంచెత్తి, గ్రామాలకు గ్రామాలనే తుడిచి పెట్టిన రోజు. ఉప్పెనకు వేలాది ఎకరాల్లోని వరి పంట కనుమరుగై, వేలాది పశువులు మృత్యువాత పడిన దుర్దినం. 10 వేల మందిని పొట్టన పెట్టుకున్న ఆ కాళరాత్రికి, ఆ ఘోర కలికి నేటికి సరిగ్గా 48 ఏళ్లు. సస్యశ్యామల దివిసీమ మరుభూమిగా మారిన నాటి సంగతులు గుర్తుకు వస్తే దివి వాసుల వెన్నులో ఇప్పటికీ వణుకు పుడుతుంది. నాడు ప్రాణాలతో బయటపడిన ఓ వ్యక్తి అవనిగడ్డలో అప్పటి మంత్రి మండలి వెంకట కృష్ణారావు వద్దకు వెళ్లి 'సముద్ర ప్రాంతంలో ఉన్న ఊళ్లన్నీ కొట్టుకుపోయాయి. జనం అంతా చచ్చిపోయారు. మాకు దిక్కులేకుండా పోయింది' అని చెప్పడంతో ఆయన హతాశుడయ్యాడు. వెంటనే ఆయన తీరానికి అతి కష్టం మీద వెళ్లి చూసి తీవ్ర దుఃఖంతో పరిస్థితిని ప్రభుత్వం, విలేకర్లు, స్వచ్ఛంద సేవా సంస్థలకు తెలియజేశారు. దివిసీమలో జరిగిన భారీ నష్టం గురించి అంతటా పాకడంతో యంత్రాంగం, సేవా సంస్థలు ముందుకు వచ్చి దాతృత్వం చాటుకున్నాయి. ★ నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం మండలాల్లోని చాలా గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. వేల కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. వ్యవసాయ భూములు ఉప్పుగా మారాయి. రోజుల వ్యవధిలోనే పునరావాస కేంద్రాలు, తాత్కాలిక వసతి కోసం పాకలు నిర్మించారు. ★ కుప్పలుగా ఉన్న మృతదేహాలను తొలగించేందుకు ప్రజలెవరూ ముందుకు రాకపోవడంతో ప్రభాకర్‌జీ ఆధ్వర్యంలో 'శవసేన' ద్వారా చర్యలు చేపట్టారు. దేశం నలుమూలల నుంచి వైద్య విద్యార్థులు, వైద్యులు, అధికారులు వచ్చి సేవ చేశారు.

★ రాష్ట్రపతి, ప్రధాని, మాజీ ప్రధాని సహా జాతీయ నాయకులు, మదర్ థెరిసా, ఎవాంజలిస్టు బిల్లీ గ్రహం, ప్రభవానంద స్వామి, జిల్లెళ్లమూడి అమ్మ వంటి వారు ప్రజలను ఓదార్చి చేయూతనిచ్చారు.

★ ఉప్పెనలో 25వేలకు పైగా గృహాలు కొట్టుకుపోయాయి. 13వేల నివాసాలను ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వివిధ దశల్లో నిర్మించాయి. 300కిపైగా తుపాను షెల్టర్లు నిర్మించారు. ప్రజలకు జీవనోపాధి చూపించారు. దివిసీమ ఉప్పెన వచ్చి 48 ఏళ్లయిన సందర్భంగా నేడు అవనిగడ్డలో సంస్మరణ సభ నిర్వహిస్తున్నారు.

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం అవనిగడ్డ, అవనిగడ్డ గ్రామీణం, నాగాయలంక, మచిలీపట్నం గ్రామీణం – న్యూస్‌టుడే

పీజీ మెడికల్ యాజమాన్య సీట్లకు దరఖాస్తులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025- 26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నీట్ పీజీ అర్హత, ఈ ఏడాది జులై 31 లోపు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులు 23న మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పారు. అపరాధ రుసుము రూ.10వేలతో 24న ఉదయం 11 నుంచి 26న ఉదయం 11 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 50 పర్సంటైల్ (276 మార్కులు కటాఫ్ మార్కులు), జనరల్- పీడబ్ల్యూబీడీ వారు 45 పర్సంటైల్ (255 కటాఫ్ మార్కులు), ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ కేటగిరీ అభ్యర్థులు 40 పర్సంటైల్ (235 కటాఫ్ మార్కులు) ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సందేహాలుంటే 89787-80501, సాంకేతిక సమస్యలుంటే 90007-80707 నివృత్తి చేసుకోవచ్చని, యాజమాన్య కోటాలో 777 పీజీ మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.



(c) eenadu

స్వర్ణమయం.. చేసేదెప్పుడో..

పూర్తికాని దుర్గగుడి స్వర్ణ తాపడం పనులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం స్వర్ణతాపడం పనులు రెండు దశాబ్దాలుగా నిలిచిపోయాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రాజధాని నగరంలో దుర్గగుడి కీలకంగా మారింది. కూటమి ప్రభుత్వం దుర్గగుడి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. గడిచిన వైకాపా పాలనలో అమరావతి రాజధానితో పాటు దుర్గగుడి అభివృద్ధి సైతం ఆటకెక్కింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాశ్వత ప్రాతిపదికన దేవస్థానం అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టింది. స్వర్ణ తాపడం పనులు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్ణయించింది.

☛ తిరుమల తరహాలో దాతలు ఇచ్చిన విరాళాలతోపాటు దేవస్థానం వద్ద ఇప్పటి వరకు ఉన్న బంగారాన్ని కూడా దీనికి వినియోగించాలని నిర్ణయించారు. 20 ఏళ్ల కిందట దుర్గగుడి ప్రధాన ఆలయం విమాన గోపురానికి 80 కిలోల బంగారాన్ని దేవస్థానం అధికారులు వినియోగించారు. అయితే తరువాత వచ్చిన అధికారులు స్వర్ణ తాపడం నిమిత్తం వచ్చిన బంగారంతోపాటు హుండీల్లో వేసిన చిన్న బంగారపు వస్తువులు, హారాలు, కిరీటాలు, అభయ హస్తాలు వంటివి భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకొని 92 కిలోలను కరిగించి గోల్డు బాండ్లుగా మార్చారు. ప్రస్తుతం దేవస్థానం వద్ద పరిమితంగా ఉన్న బంగారంతో పాటు దాతల సహకారంతో మల్లేశ్వరాలయం స్వర్ణ తాపడం చేసేందుకు 15 కిలోలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

☛ నానోటెక్నాలజీ సహకారంతో ఆలయ విమాన గోపురం తాపడం పనులను వీలైనంత తక్కువ బంగారంతో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో దేవస్థానం అధికారులు బంగారు తాపడం పనులు పూర్తి చేయడానికి వెనకంజ వేయడంతో ఆ పనిని తితిదే చేపట్టి విమాన గోపురం వరకు పూర్తి చేశారు.

పాలకమండలి సమావేశంలో చర్చ

ఈనెల 7న నిర్వహించిన దుర్గగుడి పాలకమండలి సమావేశంలో దేవస్థానం అధికారులతోపాటు పాలకమండలి సభ్యులు కూడా దుర్గమ్మ ఆలయ ప్రధాన గోపురంతోపాటు మల్లేశ్వరాలయాన్ని కూడా స్వర్ణ తాపడం చేయాల్సిన అంశంపై చర్చించారు. పలువురు దాతలు సైతం రాజధాని నగరంలో ప్రధానమైన దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం స్వర్ణకాంతులతో విరాజిల్లాలని ముందుకు వస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. దేవాదాయ శాఖ, పాలకమండలి సమన్వయంతో స్వర్ణ తాపడం పనులను ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

గ్రంథాలయాలు.. ఉపాధికి మార్గాలు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: గ్రంథాలయాలు ఉపాధికి మార్గాన్ని చూపుతున్నాయని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకొని ఉద్యోగాలు సాధించిన 17 మందిని ఆయనతో పాటు రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం గేదెల అప్పారావు ఏర్పాటు చేసిన మైక్రో ఎగ్జిబిషన్‌ను కోటేశ్వరరావు ప్రారంభించి తిలకించారు. శ్లోకాల పోటీ నిర్వహించగా 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాలను సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ పర్యవేక్షించగా డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం పొందిన ఉద్యోగులతో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు

'స్వచ్ఛ చల్లపల్లి'ని సందర్శించిన విశ్రాంత కలెక్టర్

చల్లపల్లి, న్యూస్‌టుడే : స్వచ్ఛ చల్లపల్లిని కృష్ణా జిల్లా విశ్రాంత కలెక్టర్ బి.లక్ష్మీకాంతం దంపతులు మంగళవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ హోదాలో గతంలో స్వచ్ఛ చల్లపల్లికి సహకారం అందించిన ఆయన గ్రామాన్ని పరిశీలించేందుకు వచ్చారు. డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు లక్ష్మీకాంతం దంపతులకు స్వాగతం పలికారు. 11 ఏళ్ల స్వచ్ఛ చల్లపల్లి ప్రస్థానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో మేకల డొంక వద్ద, శ్మశాన వాటిక ప్రాంగణంలో నాటిన దేవకాంచన, కొబ్బరి చెట్లు ఏపుగా పెరగటం చూసి లక్ష్మీకాంతం సంతోషం వ్యక్తం చేశారు. సంపద తయారీ కేంద్రాన్ని, వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. స్వచ్ఛ కార్యకర్తలతో మాట్లాడి వారిని అభినందించారు.

డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్‌తో లక్ష్మీకాంతం దంపతులు

వైద్యుల సూచన మేరకే మందులు వాడాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: వైద్యుల సూచన మేరకు మందులు వినియోగించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహించనున్న ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాల ప్రచార పత్రాలు, బ్యానర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి యుగంధర్ మాట్లాడుతూ అనవసరంగా లేదా, తప్పు విధానంలో మందులు వినియోగిస్తే కలిగే ఇబ్బందులు, అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, డీఎంహెచ్‌వో యుగంధర్ తదితరులు

మరపురాని నాయకుడి సేవలకు గుర్తుగా..

నేడు 'మహాపురుషుడు మండలి' నాటక ప్రదర్శన

అవనిగడ్డ, న్యూస్‌టుడే

విజయ భాస్కర్


గంగోత్రి సాయి

నాటి ఉప్పెన గ్రామాల్లో పర్యటిస్తున్న మండలి వెంకట కృష్ణారావు

ఉప్పెన ముప్పు దివిసీమను కబళించి వేస్తే.. దాన్ని చూసి మండలి వెంకట కృష్ణారావు విలవిల్లాడారు. ఇక్కడి ప్రజలను భరోసాగా నిలిచారు. జాతీయ నాయకుల్ని, ప్రేమను దుల్లి ఇక్కడికి తీసుకొచ్చి ప్రజల వేదనను చూపించారు. జనం జీవితాల్లో వెలుగులు నింపేందుకు, దివిసీమ పునర్నిర్మాణానికి ఎనలేని కృషి చేశారు. నాటి సంఘటన జరిగి నేటికి 48 ఏళ్ల కావడంతో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన జీవిత చరిత్ర కళ్లకు కట్టేలా 'మహాపురుషుడు మండలి' నాటకం రూపుదిద్దుకుంది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో దీన్ని డాక్టర్ వీర్రాజు విజయ భాస్కర్ రచించారు, గంగోత్రి సాయి దర్శకత్వంలో నేటి సాయంత్రం 6.30 గంటలకు అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో ప్రదర్శించనున్నారు. ఆధునిక సాంకేతిక అంటుబాటుతో నాటి పరిస్థితుల కళ్లకు కట్టేలా 40 మంది పైగా నటులు ఈ నాటకాన్ని ప్రదర్శించనున్నారు. కృష్ణారావు చేసిన సేవలను వివరించడం ద్వారా ఆయన స్ఫూర్తిని ప్రజలలో నింపడమే లక్ష్యంగా ఇది సాగనుందని నిర్వాహకులు ప్రకటించారు. దివిలో కృష్ణారావు జననం, విద్యాభ్యాసం, స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న సంఘటనలు, 1945లో ముంబయిలో మహాత్మా గాంధీని సందర్శించడం, 1946లో బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమంలో లాఠీ దెబ్బలు తినడం వంటి వన్నీ చూపనున్నారు. ఆయన రాజకీయ ప్రవేశం, ఎమ్మెల్యేగా ఆర్టీసీ బస్సులో ప్రయాణాలు, దివిసీమ పునర్నిర్మాణానికి చేసిన కృషి, తెలుగు భాషోద్ధరణకు పాటుపడిన వైనం... ఇలా అనేక మజిలీలు రసరమ్యంగా మలిచారు.

★ ఆదర్శ ప్రాయమైన కృష్ణారావు జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా ఉండాలన్న ఉద్దేశంతో దీనికి దృశ్యరూపమే 'మహా పురుషుడు మండలి నాటకం'. పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తరలి వచ్చి ఈ నాటకాన్ని తిలకించాలని మండలి అభిమానులు కోరుతున్నారు.

అతివేగం.. ఆపై నిర్లక్ష్యం

లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు ● ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు

నందిగామ, న్యూస్‌టుడే

ప్రమాదం ధాటికి నుజ్జయిన సీట్లు

దెబ్బతిన్న లారీ

వరుస ప్రైవేట్ బస్సుల ప్రమాదాలు గుబులుపుట్టిస్తున్నా డ్రైవర్లలో మార్పు రావటం లేదు. ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కె.కావేరి ట్రావెల్స్ బస్సు నందిగామ మండలం అనాసాగరం వద్ద లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, మరో 20 మందికి గాయాలయ్యాయి. అదృష్టం వల్ల ప్రాణాలతో బయటపడ్డారు.

★ విజయవాడ వైపు వెళ్తున్న లారీని అనాసాగరం వద్ద ఓవర్‌టేక్ చేసేందుకు బస్సు డ్రైవర్ ప్రయత్నిస్తుండగా లారీని ఢీకొట్టింది. ఓవర్‌టేక్ చేసేందుకు జాతీయ రహదారిపై తగినంత స్థలం లేక పక్కన రోడ్డు మధ్యలో డివైడర్ ఉండటంతో బస్సు డ్రైవర్ లారీని ఢీ కొట్టకుండా ముందుకు బ్రేక్ వేశాడు. అదే డివైడర్‌ను ఢీకొట్టి ఉంటే బస్సు పల్టీ కొట్టి ప్రమాద తీవ్రత ఎక్కువై ప్రాణహాని జరిగేది.

నలుగురికి తీవ్రగాయాలు

బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలు కాగా వీరిలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 35 మందితో బయలుదేరిన అనాసాగరం వద్దకు వచ్చే సరికి ఈ ఘటన జరిగింది. ప్రమాదంతో ప్రయాణికులంతా వణికిపోయారు. కాపాడాలంటూ కేకలు వేశారు.

నందిగామ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

బస్సు సామర్థ్యం సరిగానే ఉంది

ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సును నందిగామ ప్రాంతీయ రవాణా శాఖ అధికారి రోజ పర్యవేక్షణలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పూర్తిగా పరిశీలించారు. బస్సు నడిపే కండిషన్ బాగానే ఉందని నిర్ధారించారు. బస్సు ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగా ఉన్నట్లు గుర్తించారు. హైవేపై తగినంత స్థలం లేక పోయినా లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించడం వల్లే ప్రమాదం జరిగిందని ఎంవీఐ పూర్తిగా తెలిపారు.

దీపోత్సవం.. నయనానందకరం

కార్తిక మాసోత్సవాలలో భాగంగా మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని కృష్ణా జిల్లాలోని పలు ఆలయాల్లో కోటి దీపోత్సవాలు కనుల పండువగా సాగాయి. మహిళలు అధిక సంఖ్యలో విశేష పూజలు నిర్వహించారు. కార్తిక దీపాలతో సామూహిక హారతులు సమర్పించారు. ఆ దృశ్యాలివీ.. - న్యూస్‌టుడే బృందం

నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలో రామలింగేశ్వరుడికి సామూహిక హారతులు సమర్పిస్తున్న భక్తులు

తోట్లవల్లూరు మండలంలోని పెనమకూరు గ్రామంలో చెన్న మల్లికార్జునస్వామి ఆలయంలో..

అవనిగడ్డ బందలాయిచెరువు పోతురాజు స్వామి గుడి వద్ద..

గుడ్లవల్లేరు మండలం కూరాడలోని శ్రీకోదండ రామాలయం వద్ద..

పామర్రు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో..

యనమలకుదురు రామలింగేశ్వరస్వామి అలయంలో..

మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..

స్వామి సేవలో మంత్రి రవీంద్ర

ధ్వజస్తంభం వద్ద నమస్కరిస్తున్న మంత్రి రవీంద్ర

మోపిదేవి, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి ధ్వజస్తంభం వద్ద హారతులిచ్చారు. నాగేంద్ర పుట్ట వద్ద పూజలు చేశారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలలో పాల్గొన్నారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించి పట్టువస్త్రాలతో సత్కరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ☛ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన లక్ష్మీకాంతం దంపతులు స్వామిని పూజలు చేశారు.

ఇమిటేషన్ జ్యుయలరీ కోర్సుపై ఉచిత శిక్షణ

పోతేపల్లి (మచిలీపట్నంగ్రామీణ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మచిలీపట్నం ఇమిటేషన్ జ్యుయలరీ పార్కు సంయుక్త ఆధ్వర్యంలో ఇమిటేషన్ జ్యుయలరీకి సంబంధించిన కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జ్యుయలరీ పార్క్ కార్యదర్శి అంకెం జితేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఈ నెల 22న మచిలీపట్నం ఇమిటేషన్ జ్యుయలరీ పార్క్ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలోని స్కిల్ హబ్‌లో ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన 16నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9966489796 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 650 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

అయిదు ఆటిజం కేంద్రాల ఏర్పాటు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలకు అయిదు ఆటిజం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఎస్ సహిత విద్య సమన్వయకర్త ఏడుకొండలు తెలిపారు. పెడన పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మచిలీపట్నం పాండురంగ ఉన్నత పాఠశాల, గుడివాడ ఏకేటీపీ ఉన్నత పాఠశాల, మోటూరు గురుకుల పాఠశాల, ఉయ్యూరు జడ్పీ పాఠశాలల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆయా స్కూల్స్‌లో కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించినట్లు వివరించారు.

ప్రకటన

మా క్లయింట్ ప్రస్తుతం యన్‌టీఆర్ జిల్లా, విజయవాడ, పటమటలో కాపురస్తులు షేక్ గాలిబ్ సాహెబ్ గారి కుమారుడు షేక్ బాషా గారి సంజాయిషీ పొంది తెలియజేయునదేమనగా...

మా క్లయింటు దిగువ షెడ్యూలాస్థిని విజయవాడ, ఇబ్రహీంపట్నం కాపురస్తులు దేవరపల్లి శ్రీధర్ గారి భార్య రావినూతల మాలతీ గారు నుండి కొనుగోలు చేయుటకు నిశ్చయించుకుని కొంత సొమ్ము బయానాగా యిచ్చి విక్రయ ఖరారుపరచుకున్నారు.

సదరాస్తిపై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు గాని, క్లయిములు గాని, కోర్టు అటాచ్‌మెంట్లు గాని, తనఖాలు గాని, మనోవర్తి భాగలబ్ధి తగాయిదాలు గాని, ఇంజక్షన్లు గాని ఉన్న యెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోగా తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు గడువులోపు ఏ విధమైన అభ్యంతరములు రానియెడల షెడ్యూలు ఆస్థిని నిర్వివాద ఆస్థిగా భావించి నా క్లయింటు రిజిస్ట్రేషన్ పొందగలరు. గడువు దరిమిలా వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూల్: కృష్ణా జిల్లా, శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, వై.యస్.ఆర్ తాడిగడప మున్సిపాల్టి ఏరియాలో చేరిన యనమలకుదురు రీ సర్వే నెం.46/1 రు, సమీప డోర్ నెం.20-1092/1 రు చ॥గ॥ 291 లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి ఏ.సి.సి రేకులు యింటికి హద్దులు: తూర్పు: విశ్వనాధపల్లి బుల్లి వెంకటేశ్వరరావు గారు బోలెం వినయ్ బాబు గారి ఆస్థి-అ॥ 54.0 లు, దక్షిణం: అ॥ 30 లు వెడల్పు గల జాయింటు రోడ్డు-అ॥ 48.6 లు, పడమర: జక్కుల ఆంజనేయులు గారి ఆస్థి-అ॥ 54.0 లు, ఉత్తరం: కృష్ణా కరకట్ట రోడ్డు (విజయవాడ-అవనిగడ్డ రోడ్డు)-అ॥ 48.6 లు.

SK. పర్వీన్
అడ్వకేట్
59ఎ-1-6/2, కె.పి.నగర్, మాతా టవర్స్ ప్రక్కన, స్టెల్లా కాలేజి రోడ్, విజయవాడ. సెల్: 9030706786

భార్యను హతమార్చిన భర్త

లక్ష్మీపార్వతి (పాత చిత్రం)

మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ బ్రహ్మం, ఎస్ఐ వెంకట్

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం యర్రబాలెంలోని పుచ్చలపల్లి సుందరయ్య రోడ్డులో నివాసం ఉంటున్న తులిమి లక్ష్మీపార్వతి(29) మంగళవారం భర్త చేతిలో హత్యకు గురైంది. మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన లక్ష్మీపార్వతికి.. శంకర్‌రెడ్డితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది కాలం మచిలీపట్నంలో కలిసి ఉన్న వీరు. . మనస్పర్థల కారణంగా విడిపోయారు. అనంతరం లక్ష్మీపార్వతి గుంటూరు జిల్లా మంగళగిరి మండలం యర్రబాలెంలో ఉంటోంది. ఈ నేపథ్యంలో మండలంలోని చినకాకాని గ్రామానికి చెందిన మరో వ్యక్తితో పరిచయం ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న భర్త శంకర్‌రెడ్డి అనుమానంతో భార్యపై కక్ష పెంచుకుని ఆమెను అంతమొందించాలని భావించాడు. ఈ క్రమంలో సాయంత్రం 3 గంటల సమయంలో ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లి ఆమెను బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకుని గొంతుపట్టుకున్నాడు. భయంతో ఆమె కేకలు వేస్తూ తప్పించుకునేందుకు ఇంట్లో నుంచి పక్కంటి వైపు పరుగులు తీసింది. అయినా శంకర్‌రెడ్డి ఆమెను వెంటాడి గొంతు నులిమి హత్య చేసినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడించారు. సీఐ బ్రహ్మం, ఎస్ఐ వెంకట్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మహిళ హత్యకు గల కారణాలపై విచారణ జరిపారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఆమెకు సంబంధించిన పాత చిత్రాలను మీడియాకు విడుదల చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో గృహ నిర్మాణ సంస్థ, మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తేనే లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు జరుగుతుందన్నారు. లేకుంటే వారు నష్టపోయే అవకాశం ఉందన్నారు. పీఎంఏవై పథకంలో ఇళ్లు నిర్మించుకునే వారికి ఈ నెల 30 వరకు గడువు పొడిగించినందున అందరూ వినియోగించుకోవాలన్నారు. దీనిపై అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పీఎంఏవై-1.0 పథకంలో మిగిలిన ఇళ్లన్నీ ఉగాది నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, జిల్లాలో మిగిలి ఉన్న 31,381 ఇళ్లను ఆ లోపే పూర్తిచేయాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ పోతురాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అసభ్య పోస్టుల కేసులో విజయ్‌భాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్

ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో మహిళలు, కూటమి నేతలు, న్యాయమూర్తులే లక్ష్యంగా అసభ్య పోస్టులు పెట్టి జైల్లో ఉన్న మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డిని వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్, నిందితుడి బెయిల్ పిటిషన్ బుధవారానికి వాయిదా పడ్డాయి. విజయ్‌భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన క్రమంలో పోలీసులతో దురుసుగా వ్యవహరించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. డిసెంబరు 2లోగా నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని న్యాయాధికారి ఆదేశాలు ఇచ్చారు. నిందితుడు నెల్లూరు కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. పోలీసులపై దాడి చేసిన కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న విజయ్‌భాస్కర్‌రెడ్డి సోదరుడు ఓబుల్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తయింది. ఈ నెల 24న దీనిపై కోర్టు తీర్పు వెలువరించనుంది.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

మాట్లాడుతున్న సీఐ చిట్టిబాబు, ప్రక్కన ఎస్సై శ్రీను

పమిడిముక్కల, న్యూస్‌టుడే : రాత్రి సమయాల్లో గృహాలు, దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నేరస్థుడ్ని చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశామని పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మిలిటరీ మాధవరం గ్రామానికి చెందిన కడియాల శ్రీధర్ జల్సాలకు అలవాటు పడి సులభంగా సంపాదన మోజులో పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామం వద్ద పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. విచారించగా పమిడిముక్కల మండలం మంటాడ శివాలయంలో, కంకిపాడు, తిరుపతి, పశ్చిమ తిరుపతిలో నేరాలు చేశానని అంగీకరించాడు. గతంలో ఇతడిపై జీఆర్పీ విజయవాడలో మొత్తం 13 కేసులు ఉన్నాయని తెలిపారు. ఇతను రైళ్లలో, రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలపై దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల బంగారం, రెండు మోటారు సైకిళ్లు, రూ. 10,250 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. శ్రీధర్‌ను అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై శ్రీను, సిబ్బందిని పోలీసు అధికారులు అభినందించారు.

మినుముల నూర్పిడి యంత్రంలో పడి మహిళ మృతి

కాశీంబి (పాతచిత్రం)

కొల్లిపర, తోట్లవల్లూరు: ప్రమాదవశాత్తు మినుముల నూర్పిడి యంత్రంలో పడి మహిళ మృతిచెందిన ఘటన కొల్లిపర మండలం వల్లభాపురం శివారు లంకభూముల్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలేనికి చెందిన షేక్‌కాశీంబి (35). మంగళవారం వల్లభాపురం శివారులోని లంకభూముల్లో మినప పంట కోసేందుకు కూలీకి వెళ్లారు. మధ్యాహ్నం వరకూ కోసిన పంటను యంత్రంలో వేస్తుండగా చీర కొంగు అందులో పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన కాశీంబి అక్కడికక్కడే మృతిచెందారు. భర్త ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని కొల్లిపర ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు. కాశీంబికి ఇద్దరు పిల్లలున్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

FOR SALE

ఏలూరు నడిబొడ్డులో బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, మెయిన్‌బజార్ దగ్గర్లో GNT రోడ్, పవర్‌పేట నందు అక్షయ లాడ్జి అమ్మకమునకు కలదు. Cont: 98483 55649.

BUILDING CONSTRUCTION

ARCHITECT & ENGINEERS

Contact For Building Plan Approvals & BPS, LRS Plans of AP CRDA Vijayawada Municipal Corporation. ✆ 83747 33456

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

FLAT FOR SALE

కానూరు TVS, అశోక్‌నగర్ బందరు రోడ్డుకి ప్రక్కన నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి. ✆ 76800 70510.

PLOT FOR SALE

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

కేసరపల్లి - మేధా IT పార్క్ సమీపంలో 2100 చ॥గ॥ లేఅవుట్ స్థలం అమ్మకం. 60 అ॥ రోడ్, IT కంపెనీలు, కమర్షియల్‌కు, ఆఫీస్‌లకు అనుకూలమైనది. ✆ 70366 62888 ✆ 89780 66103

JOBS

Wanted Computer Hardware, Printer Engineers for VLMS IT Solutions. Bhavanipuram, www.vlms.in 98488 18090, 97012 27778.

అలంకార్ థియేటర్ దగ్గర సైట్‌కి సె.గార్డ్స్, 12 గం. డ్యూటీ, జీతం: 15K & తుళ్ళూరులో సె. సూ.వైజర్స్-3 (ఎకామిడేషన్ ఫ్రీ) కావలెను. ✆ 93911 11702.

KOTAK నూతన బ్యాంక్ నందు పనిచేయుటకు Rtd,VRS,టీచర్స్ మరియు గృహిణులు కావలెను Q: SSC To P.G Age: 35& Above. ✆ 94935 75370

ప్రముఖ ఆర్కిటెక్ ఆఫీసులో పనిచేయుటకు ITI CIVIL, Diploma Civil, B.T Civil (Auto CAD Civil)లో అనుభవం ఉన్న Male కావలెను. ✆ 93973 41745

గొల్లపూడి కమర్షియల్ కాంప్లెక్స్‌లో హోల్‌సేల్ డ్రైఫ్రూట్స్ స్టోర్స్ నందు Tally నాలెడ్జి అనుభవం గల అకౌంటెంట్ కావలెను. (విజయవాడ వారికి ప్రాధాన్యత) ✆ 90524 87777.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

రైతులకు వడ్డీ రాయితీ జమ

సమావేశంలో మాట్లాడుతున్న గోపు సత్యనారాయణ

వన్నారుకానూరు (మచిలీపట్నం రూరల్): మచిలీపట్నం మండలం వన్నారుకానూరు శ్రీవెంకటేశ్వర సొసైటీ సభ్యులు 469 మందికి రూ.5,42,335 వడ్డీ రాయితీని జమ చేస్తామని తెలుగు రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తెలిపారు. సొసైటీ సమావేశం కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ తీసుకున్న రుణాలకు రైతులు సకాలంలో వడ్డీ చెల్లించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం నుంచి 3 శాతం రాయితీ వచ్చిందన్నారు.

ధర వరలు

టమాట 41, వంగ 50, బెండ 46, పచ్చిమిర్చి 44, కాకర 46, క్యాబేజీ 28, క్యారెట్ 68, దొండ 60, బంగాళదుంప 31, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 58, దోస 30, సొర 25, అరటికాయ 7,6, చిక్కుళ్లు 80,బీర 30, చామదుంప 28,మునగ 10/12, కంద 44, బీట్‌రూట్ 48, కీరదోస 38, బీన్స్ 68, క్యాప్సికం 70, అలసందలు 60, చిలకడదుంప 44, కొత్తిమీర 28/14, పుదీనా 20/5 బుధవారం రైతుబజారుకు సెలవు, గురువారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి, ఫోన్ 9182361295లో సంప్రదించవచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

సినిమాలు

రేవతి: కాంత
మినీరేవతి: సంతాన ప్రాప్తిరస్తు
సిరికృష్ణ: [illegible]
సిరివెంకట్: ది గర్ల్ ఫ్రెండ్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

❖ నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం కూడలిలో రహదారి పక్కన చెత్తను తొలగించడం లేదని ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించి.. సమస్య పరిష్కరించారు.

❖ నగరంలోని మాచవరం ప్రాంతంలో ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా. సంబంధిత అధికారులు స్పందించి గుంత పూడ్చారు. – మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

? మచిలీపట్నం రైల్వే గేటు సమీపంలో ప్రధాన రహదారికి అడ్డుగా ఉన్న పైపులు ప్రమాదకరంగా మారాయి. - ఎండీ జిలానీ

✔ పైపులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - కాగిత రామాంజనేయులు, ఇన్‌ఛార్జి కమిషనర్

? పెడన ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో రాళ్లు లేచి ఇబ్బంది గా ఉంది. - ప్రయాణికులు

✔ బస్సులు నిలిపే చోట సిమెంటుతో ఫ్లోరింగ్ చేయిస్తున్నాం. త్వరలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. - పెద్దిరాజు, మచిలీపట్నం డిపో మేనేజర్ – న్యూస్‌టుడే, పెడన

అనుమతి తీసుకునేలా.. రుసుం చెల్లించేలా..!

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

కోనేరు సెంటర్‌లోని నగరపాలక సంస్థ దుకాణ సముదాయం

నగరపాలక సంస్థకు ఆదాయం సమకూర్చే వాటిలో ట్రేడ్ లైసెన్స్ ఒకటి. దుకాణాల్లో జరిగే విక్రయాలను బట్టి రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే దీని గురించి అంతగా పట్టించుకోకపోవడం లేదు. దీంతో నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయం తగ్గడంతో పాటు బకాయిలు కూడా పెరిగిపోతున్నాయి. మరోవైపు నగరంలో అనేక చోట్ల కొత్తగా దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారులకు అవగాహన కల్పించి లైసెన్స్‌లు తీసుకునేలా నగరపాలక సంస్థ అధికారులు కార్యాచరణ చేపట్టారు.

వైకాపా అనాలోచిత నిర్ణయాలతో వెనుకంజ

నగరాలు, పట్టణాల్లో వ్యాపారం చేసుకునేందుకు చిన్నపాటి దుకాణాలకు రూ.500, కొద్దిగా పెద్దవాటికి రూ.1000, ఏసీ సౌకర్యం కలిగిన వాటికి రూ.8వేల నుంచి రూ.10వేల వరకు రుసుం చెల్లించాలి. ప్రస్తుతం మచిలీపట్నంలోని దుకాణాల నుంచి ఏడాదికి రూ.21లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. వైకాపా హయాంలో లైసెన్సు పునరుద్ధరించుకునే సమయంలో చెత్తపన్ను చెల్లించి, ఆతరువాత లైసెన్సు రుసుము చెల్లించాలని ఆదేశించడంతో చాలామంది ట్రేడ్ లైసెన్స్ తీసుకునేందుకు వెనుకంజ వేశారు. దీంతో బకాయిలు పేరుకుపోయి అనేక మంది దుకాణదారులు జరిమానాలు చెల్లించాల్సి వచ్చింది. దీనిపై వారు ఆందోళన చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. అలాంటివి పునరావృతం కాకుండా లైసెన్స్ రుసుము ఎంత చెల్లించాలి, ఎప్పటి లోపు చెల్లించాలి. తదితర అంశాలపై అవగాహన కల్పించి సకాలంలో వసూలు చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

కొత్తవి గుర్తింపునకు ఆదేశాలు

నగరంలో ప్రస్తుతం 2700కు పైగా ట్రేడ్ లైసెన్స్‌లు మంజూరు చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల పలు ప్రాంతాల్లో కొత్తగా దుకాణాలు వెలుస్తున్నాయి. అలాంటి వాటిని ఎప్పటికప్పుడు గుర్తించేలా డివిజన్ల వారీగా సచివాలయాల ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ట్రేడ్ లైసెన్స్‌ల రుసుము వసూలు చేయాల్సి ఉండగా ముందుగానే అందరినీ అప్రమత్తం చేయడంతో పాటు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. చాలా మంది సమయం లోపే చెల్లిస్తున్నా, కొందరు వివిధ కారణాలతో బకాయి పెడుతుంటారు. రూ.1000 చెల్లించాల్సిన వారు అదనంగా 50శాతం అంటే మరో రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. సకాలంలో చెల్లించని వారి బకాయిలు పేరుకుపోవడంతో వ్యాపారులకు కూడా ఇబ్బందికరంగా మారుతుందని, ఎవరికి వారు స్వచ్ఛందంగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవడంతో పాటు సకాలంలో రుసుము చెల్లించాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

మచిలీపట్నం (గొడుగుపేట): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. బందరు మండల పరిధిలోని క్యాంప్‌బెల్‌పేటలో క్రై, జిల్లా న్యాయసేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టపరంగా శిక్షలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. బాలల హక్కులతో పాటు వివిధ చట్టాల గురించి వివరించారు. న్యాయవాది చీలి ముసలయ్య, తాలూకా ఎస్సై జీవీవీ సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. క్రై సంస్థ ప్రతినిధి సుధారాణి, గ్రామస్థులు పాల్గొన్నారు. ❖ న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య ఉదయం నగరంలోని సర్కారుతోట వాసవీ వృద్ధాశ్రమాన్ని సందర్శించి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

మచిలీపట్నం (గొడుగుపేట): పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆశాలత అన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరదాగా చేసుకునే అలవాటే భవిష్యత్తును నాశనం చేస్తుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లను గమనిస్తూ ఉండాలని సూచించారు.

ప్రదర్శనలో సూపరింటెండెంట్ ఆశాలత తదితరులు

వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి టి.శివయ్య, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో నిరంజన్, నర్సింగ్‌కళాశాల ప్రిన్సిపల్ రోజారమణి, నోడల్ అధికారి సత్యనారాయణచౌదరి, నర్సింగ్‌కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం

చోడవరంలో దస్త్రాలు తనిఖీ చేస్తున్న ఏవో జెన్నీ

పెడన, న్యూస్‌టుడే : మండలంలోని 16 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 6,466 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మంగళవారం నాటికి సేకరించామని మండల ఏవో జెన్నీ చెప్పారు. చోడవరంలోని కేంద్రాన్ని ఆమె సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు దాదాపు 50 శాతం వరి కోతలు పూర్తైనట్లు వివరించారు. ధాన్యం సేకరణలో పెడన మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు.

తుపాను బాధితులకు సాయం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మొంథా తుపానుకు పాకలు కూలిపోయి ఇబ్బందులు పడుతున్న ఒకటో డివిజన్ పరిధిలోని ఎనిమిది మంది పేదలకు తెదేపా ఇన్‌ఛార్జి బత్తిన దాసు మంగళవారం రూ.8వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రణతి, వార్డు అధ్యక్షుడు మురాల గణేష్, వేముల సాంబశివరావు పాల్గొన్నారు.

అందరికీ ఇళ్లు.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు అర్హులకు ఇళ్ల కేటాయించేలా కృషిచేస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని 35, 48 డివిజన్లలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో అభివృద్ధి జరిగింది అంటే.. అది తెదేపా హయాంలోనేనన్నారు. డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించేందుకు రూ.60 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే చాలా వరకు సమస్య తగ్గుతుందన్నారు. 6,400 జీప్లస్‌త్రీ ఇళ్లు కేటాయిస్తే.. వైకాపా ప్రభుత్వం వాటిని కూడా సక్రమంగా అందించలేకపోయిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరికి కేటాయించడం జరిగిందని, మిగిలిన వారికి త్వరలోనే పంపిణీ చేయడంతో పాటు పునాదుల దశలో ఆగిపోయిన వాటిని కూడా పూర్తిచేసేందుకు కృషి చేస్తామన్నారు. వైకాపా హయాంలో నగరంలోని వారికి దూరంగా ఉన్న కరగ్రహారంలో స్థలాలు కేటాయించడంతో చాలామంది ఇళ్లు నిర్మించుకోకుండా వదిలేశారన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. నాయకులు హసీబ్ బేగ్, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాదు, గోపు సత్యనారాయణ, అక్కు మహంతి రాజా, లోగిశెట్టి వెంకటస్వామి, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు, డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవీంద్ర

ఫొటోగ్రాఫర్లకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తాం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఫొటోగ్రాఫర్ల సౌకర్యార్థం మంగినపూడి బీచ్ వద్ద ఎకరం స్థలం కేటాయిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. మచిలీపట్నం డివిజన్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం హౌసింగ్ బోర్డు పార్కులో మంగళవారం నిర్వహించిన కార్తిక వనసమారాధనలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన జ్ఞాపకాలను భద్రపరచేది ఫొటోగ్రఫీ మాత్రమేనన్నారు. అధునాతన కెమెరాల వినియోగంపై ఫొటోగ్రాఫర్లకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. పట్టణ పరిధిలో కూడా అయిదు సెంట్ల స్థలాన్ని కేటాయించి షూటింగ్‌లకు అనువైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు మంత్రిని ఘనంగా సన్మానించారు.

ప్రతిభ చాటేందుకు పోటీలు దోహదం


బహుమతులు అందుకున్న వారితో ప్రిన్సిపల్ శివరామకృష్ణ, అధ్యాపకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రతిభ చాటేందుకు పోటీలు దోహదపడతాయని స్థానిక ఆర్యే కళాశాల ప్రిన్సిపల్ డి. శివరామకృష్ణ అన్నారు. కళాశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఐ వల్ల వచ్చే మార్పులు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలను వారు ఉపన్యసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన కలగడంతో పాటు సామర్థ్యాలను పరిశీలించుకుని, ఉన్నతంగా ఎదిగేందుకు ఉపయోగపడతాయన్నారు. పోటీల్లో బి.భువనశ్రీ(ఇంటర్ ప్రథమ), ఎల్.లాలిత్యశ్రీ(ఇంటర్ ప్రథమ), ఎన్ఎంవో మణికంఠ(ఇంటర్ ద్వితీయ) సంవత్సర విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు ఎం.ఏసుపాదం, ఆర్.విజయ, ఎల్.ప్రసన్న లక్ష్మి తదితరులు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

పెడన, న్యూస్‌టుడే : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని లైబ్రేరియన్ షేక్ కాలేషా తెలిపారు. 20న విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. సమాజ నిర్మాణంలో గ్రంథాలయాల పాత్ర అన్న అంశంపై ఈ పోటీలు జరిగాయన్నారు.

పెడన: పోటీలో విద్యార్థులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : ఇటీవల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కర్తవ్యమే దైవం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. మండల స్థాయిలో దివిజ, నాగకార్తీక్ ప్రథమ, యస్.షాలిని, పి.పూర్ణ చంద్రిక ద్వితీయ, కె.గీతిక, బి.హేమశ్రీలు తృతీయ స్థానాలు సాధించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. వీరిని పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిశోర్, కరస్పాండెంట్ శోభ, కొమ్మారెడ్డి చైతన్య, హరణి తదితరులు మంగళవారం అభినందించారు.

బ్రోచర్ ఆవిష్కరణ

భాస్కరపురం(మచిలీపట్నం): విద్యార్థుల్లోని ఆలోచనా సామర్థ్యాలను వెలికితీయాలనే లక్ష్యంతో బాలాజీ వీర్నాల ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి స్టెమ్, క్రీడాపోటీలు-2026 బ్రోచర్‌ను కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. మచిలీపట్నం నోబుల్ కళాశాలలో జనవరి 8, 9వ తేదీల్లో జరిగే పోటీల్లో చెస్, మ్యాథ్స్ ఒలింపియాడ్, క్విజ్, సైన్స్ ఒలింపియాడ్, డిబేట్ వంటి పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

కృత్తివెన్ను, న్యూస్‌టుడే : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి పరీక్ష ఫీజులను ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే ఎక్కువగా వసూలు చేస్తే అటువంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో-2 ఎస్‌కేడీవీ ప్రసాదరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం నిర్వహించిన వెబెక్స్ మీటింగ్ అనంతరం ప్రసాదరావు మాట్లాడారు. పదో తరగతి తుది పరీక్షలకు సంబంధించి 100 రోజుల ప్రణాళిక తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

అలరించిన నాటక ప్రదర్శనలు

భాస్కరపురం(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విజయవాడ శ్రీశారద కళానికేతన్ వారు స్థానిక బచ్చుపేటలోని మహతి లలిత కళావేదికపై సోమ, మంగళవారాల్లో పద్యనాటక సంరంభం నిర్వహించారు. బాలనాగమ్మ, చింతామణి, సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శించారు. బోలెం రామారావు, విజయ, ముత్యాల ఏసుబాబు, సాంబశిరి, ముత్యాల ఏసుబాబు, రాణి, నాంచారయ్యల నటన ప్రేక్షకులను అలరించింది. అనంతరం కళాకారులను నిర్వాహకులు సన్మానించారు.

సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకం

పెడన: చేవేంద్రపాలెంలో సెల్ టవర్ నిర్మాణాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. ఒక ప్రైవేటు సంస్థ ఈ గ్రామంలో పనులు చేపడుతుండగా మంగళవారం ఉదయం గ్రామస్థులు నిలిపేశారు. గ్రామానికి దూరంగా నిర్మించాలని సూచించారు.

భోళాశంకరునికి అభిషేకాలు, పూజలు

పెడన : దీపాలతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు

అగస్త్యేశ్వర ఆలయంలో సహస్ర దీపారాధన

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: మాస శివరాత్రిని పురస్కరించుకుని ఎస్ఎన్ గొల్లపాలెంలోని ఉమా సమేత సోమేశ్వరస్వామికి మంగళవారం మహన్యాస పూర్వక ఏకరుద్ర అభిషేకం, అర్చన, పూజలు చేశారు. స్వామివారు, అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగినపూడిలో నగరేశ్వరస్వామి, పోతేపల్లిలో విజయ కనక దుర్గ మల్లేశ్వరస్వామి, తపసిపూడిలో పార్వతీసమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెడన, న్యూస్‌టుడే : కార్తిక మాసం సందర్భంగా మంగళవారం స్థానిక 13వ వార్డులోని శ్రీసిద్ధేశ్వర స్వామి మఠం భక్తులు దీపాలతో ప్రదర్శన నిర్వహించారు. మఠం నుంచి దీపాలతో బయలుదేరిన మహిళా భక్తులు పురవీధుల మీదుగా అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి తరలివెళ్లారు. స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. కార్తికంలో నెల రోజులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించామని అర్చకుడు గూడూరి అగస్త్యేశ్వరశర్మ తెలిపారు.

బంటుమిల్లి, న్యూస్‌టుడే : స్థానిక శ్రీగంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి లక్ష బిల్వార్చన చేశారు. పెదతుమ్మిడిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సహస్ర లింగార్చన చేపట్టారు.

మంగినపూడిలో నగరేశ్వరస్వామి

ఎస్ఎన్ గొల్లపాలెంలో ..

పెదతుమ్మిడిలో..

బంటుమిల్లిలో..

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఆలయ అభివృద్ధి కృషి చేయాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. నగరంలోని గొడుగుపేట శాంతామల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అతిథులుగా పాల్గొని.. సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ఛైర్మన్‌గా ఉడత్తు కృష్ణచైతన్య, సభ్యులుగా మురాల శ్రీనివాసరావు, బోడి గణపతి, గాదె వెంకటరమణ, దేవత నాని, వేముల సుబ్బారావు, శివశర్మ, దిమ్మెట పోతురాజు, బూరగడ్డ రామాంజనేయులు ప్రమాణస్వీకారం చేశారు. కార్పొరేటర్ అన్నం ఆనంద్, నాయకులు మోటమర్రి బాబా ప్రసాదు, లోగిశెట్టి వెంకటస్వామి, పల్లపాటి సుబ్రహ్మణ్యం, అక్కు మహంతిరాజా, గడ్డం రాజు తదితరులు కమిటీ సభ్యులను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

కమిటీ సభ్యులతో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల తదితరులు

వైభవంగా కోటి దీపోత్సవం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలో ప్రసిద్ధి చెందిన బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ముత్తేవి రవికాంత్, ప్రధాన అర్చకుడు ముత్తేవి శశికాంత్, ఈవో గోవాడ వెంకటకృష్ణారావు తదితరులు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు. మాచవరం శివాలయంలో విశేషపూజలు, అన్నదానం చేశారు. ఈడేపల్లి జోడుగుళ్ల ఆలయంలో శివకల్యాణం నిర్వహించారు.

బచ్చుపేట: దీపోత్సవంలో భక్తులు

ఈడేపల్లిలో శివకల్యాణం

సందడిగా అన్నసమారాధన

కులగణన చేపట్టాలని వినతి

నిరసనలో వివిధ పక్షాల నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, ఒడుగు చైతన్యకుమార్, యర్రంశెట్టి ఈశ్వరరావులు మాట్లాడుతూ.. కులగణన చేపట్టడంతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ ప్రక్రియలు పూర్తయిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ సంఘ నాయకుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీల స్థానాలు తగ్గించడం ద్వారా వేల సంఖ్యలో పదవులు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్‌మతీన్, నారాయణరావు, తాడిపర్తి రామకృష్ణ, నాగుల వాకలయ్య, ఒడుగు రత్నకుమారి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

బస్సు ప్రమాద మృతులకు నివాళి

భాస్కరపురం (మచిలీపట్నం): ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనాకు వెళుతూ బస్సు దగ్ధమైన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి మంత్రి రవీంద్ర మంగళవారం నివాళులర్పించారు. 39వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ముస్లిం నాయకులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న యుగంధర్

తాళ్లపాలెం (మచిలీపట్నంరూరల్): తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు అయిదు ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. మంగళవారం తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలు, మందుల గదిని పరిశీలించారు. పీహెచ్‌సీ పనితీరు మెరుగుపడాలని సూచించారు. రోగులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పోషకాహారాన్ని గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు.

రోడ్డు అంచులు సరి చేయించిన కూటమి నాయకులు

స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి జాతీయ రహదారికి చేరుకునే రోడ్డు వెంబడి అంచులు ప్రమాదకరంగా ఉన్నాయని ఇటీవల 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు పరిష్కారమైంది. ఈ మేరకు సోమవారం కూటమి నాయకులు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు రోడ్డు అంచుల్లో ఉన్న గుంతలను పూడ్చించి సరి చేయించారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

జాతీయ రహదారిపై అంధకారం!

బంటుమిల్లి పరిధిలోని జాతీయ రహదారి- 216పై అంధకారం నెలకొంది. సకాలంలో రహదారి వెంబడి ఉన్న దీపాలను సరిచేయక పోవడంతో అవి వెలగడం లేదు. శీతాకాలం కావడంతో పొగ మంచు తీవ్రంగా వ్యాప్తి చెందుతుంది. దీంతో వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కన్పించడం లేదు. ముంజులూరులోని టోల్‌ప్లాజా వద్ద కూడా పూర్తి స్థాయిలో దీపాలు వెలగకపోవడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దీపాలు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ఆలయ నిర్మాణానికి విరాళం

నగదు అందజేస్తున్న దాతలు

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీవిహారానికి అయ్యప్ప స్వామి దేవాలయానికి బాపులపాడుకు చెందిన శానంపూడి వెంకటేశ్వరరావు, సౌజన్యలక్ష్మి దంపతులు రూ.1,16,000 విరాళంగా అందజేశారు. తన తండ్రి వెంకటరత్నం జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణానికి చేయూతనిస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం తల్లి దుర్గావతితో కలిసి, ఆలయ నిర్వాహకులు గూడపాటి రత్నశేఖర్, గూడవల్లి చిన్నా, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు తదితరులకు ఈ మొత్తాన్ని అందించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పోరంకి, న్యూస్‌టుడే: మరమ్మతుల నిమిత్తం పోరంకి సర్కిల్ పరిధిలోని ప్రభునగర్, నిడమానూరు డొంకరోడ్డు, ఎమ్మెల్యే ఆఫీసురోడ్డు, పోరంకి సెంటర్, శివాలయం రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, బందరు రోడ్డు ప్రాంతాల్లో బుధవారం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: సాధారణ నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా పెరికీడు, కానుమోలు, దంటగుంట్ల, శేరీనరసన్నపాలెం గ్రామాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు సీపీడీసీఎల్ గుడివాడ ఈఈ జి.బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కాలర్ : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

★ కానూరు సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేయడంలేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కమిషనర్ షేక్ నజీర్ స్పందించి.. సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. - కానూరు, న్యూస్‌టుడే

★ పెనమలూరు అంబేడ్కర్, ఎస్సీ కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోవడంతో నీరు వృథా అవుతోందంటూ ఆయా ప్రాంతాల నివాసితులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించారు.

★ పెనమలూరు అంబేడ్కర్ కాలనీలో డ్రెయిన్లలో చెత్త, పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోందంటూ కాలనీ వాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి.. డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ★ గంగూరులో మసీదు కాలనీ, ఎస్సీకాలనీ, సచివాలయం ప్రాంతాల్లో కాలువలకు తూములు లేకపోవడంతో మురుగు సరిగా పారడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. గ్రామకార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి.. ఆయా ప్రాంతాల్లో మూడు తూములను ఏర్పాటు చేయించారు. ★ బందరురోడ్డు నుంచి గంగూరు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి.. 12 కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు. - పెనమలూరు, న్యూస్‌టుడే

సంపద సృష్టిస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..

కంకిపాడు, న్యూస్‌టుడే

గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాల సమస్య శాశ్వత పరిష్కారం దిశగా కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లు పంచాయతీ చేపట్టిన కార్యాచరణ మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఊరి పరిధిలో పలు అపార్ట్‌మెంట్లు, ప్రముఖ విద్యా సంస్థల క్యాంపస్‌లు, దుకాణ సముదాయాలతో పాటు సుమారు 4వేల కుటుంబాలున్నాయి. దీంతో నిత్యం సుమారు 20 టన్నుల వ్యర్థాలు పోగవుతున్నాయి. అధిక పరిమాణంలో పోగవుతున్న చెత్తను ఇతర ప్రదేశాలకు తరలించే అవకాశం లేక ఇప్పటి వరకు అక్కడే నిప్పుపెడుతూ వచ్చారు. దీంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వారు, సమీప

తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేసే తొట్టెలు

పాఠశాలల విద్యార్థులు, నివాసితులు పొగ, దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. సమస్యకు పరిష్కారంలో భాగంగా విశాలమైన ప్రభుత్వ స్థలంలో చుట్టూ ప్రహరీ, ఆర్‌సీసీ తొట్టెలు నిర్మించారు. దీంతో క్లాప్ మిత్రలు (పారిశుద్ధ్య కార్మికులు) నిత్యం తడి, పొడి, ప్రమాకదర వ్యర్థాలను వేరుచేసి తొట్టెలో

వివరాలు
గ్రామ జనాభా:
సుమారు 12వేలు
వార్డులు: 14
క్లాప్‌మిత్రలు (పారిశుద్ధ్య కార్మికులు): 15 మంది
చెత్త సేకరణ ఈ-వాహనాలు: 2
ఇతర వాహనాలు: 10

వేస్తున్నారు. తడి చెత్తతో తయారు చేసిన వానపాముల ఎరువు, పొడి వ్యర్థాలను విక్రయిస్తున్నారు. దీంతో గత పదేళ్ల అవస్థలకు తెరపడింది. పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరు నగర పంచాయతీ, తాడిగడప పురపాలిక, మిగత 37 గ్రామాల్లోనూ చెత్త సమస్య అధికంగా ఉంది. ఈడుపుగల్లు తరహా ప్రణాళిక అమలుతో మంచి ప్రయోజనంతో పాటు ఆదాయం కూడా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానాధికారి చందు జోసెఫ్ సుందరం సూచించారు. మల్లవల్లి, రంగన్నగూడెం గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోసెఫ్ సుందరం మాట్లాడుతూ నూరు శాతం రాయితీపై మొక్కలు, వాటి పోషణకు హెక్టారుకు రూ.5,250, అంతరపంటల సాగుకు మరో రూ.5,250, ఇవి కాకుండా 50 శాతం రాయతీపై అనేక యంత్ర పరికరాలు ఇస్తున్నామన్నారు. పతంజలి ఫుడ్స్ మేనేజర్ పొట్లూరి ప్రసాద్.. ధర, కొనుగోలు విధానాన్ని వివరించారు.

అవగాహన కల్పిస్తున్న ఉద్యానాధికారి జోసెఫ్ సుందరం

'చుక్కల భూములపై నిషేధం ఎత్తివేయాలి'

ఉయ్యూరు, న్యూస్‌టుడే : చుక్కల భూములపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఉయ్యూరులోని నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన భూ సర్వేలో అనుమానం వచ్చిన ప్రతి భూమిని చుక్కల భూమిగా పరిగణించి వాటి అమ్మకాలు, కొనుగోలు, రిజిస్ట్రేషన్లను నిషేధించిందని చెప్పారు. దీని వల్ల వేలాది మంది తమ భూములను అమ్ముకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో సుబ్బారావు తదితరులు

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా. . బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. పచ్చదనం-పరిశుభ్రత అంశంపై మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్, తెదేపా మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అటు శునకాలు.. ఇటు వానరాలు

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండలం వీరవల్లిలో వానరాలు, వీధి కుక్కల బెడద తీవ్రతరమైంది. ఎక్కడ చూసినా ప్రధాన, అంతర్గత రహదారులపై వీటి సంచారం ఉండడంతో రాకపోకలు సాగించే స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఒకేసారి గుంపులుగా ఇవి రావడంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, స్థానికంగా ఉండే మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల కాలంలో కుక్కలు దాడులు చేయడం, వానరాలు పంటలకు నష్టం కల్గించడంతో పాటు, ఇంట్లో వస్తువుల్ని తీసుకెళ్లిపోతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాలివాహన కాలనీ ప్రధాన రహదారిపై ఇలా..

సంక్షేమ పథకాల పునరుద్ధరణ

ఉయ్యూరు : వైకాపా ప్రభుత్వంలో నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్ సంక్షేమ పథకాలను పునరుద్ధరించి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ పి.వి.ఫణికుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని విష్ణాలయంలో బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చనిపోయిన నిరుపేద బ్రాహ్మణుల మట్టి ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబాలకు రూ.10వేలు అందించే కార్యక్రమాన్ని త్వరలో అమలు చేస్తామని చెప్పారు. కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటి ద్వారా అందించే అరుంధతి సూక్ష్మ రుణం, వశిష్ట, అర్చక మిత్ర, పురోహిత మిత్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉయ్యూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చోడవరపు బాపిరాజు, కార్యదర్శి ప్రభాకరశర్మ, కోశాధికారి కోదండ రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫణికుమార్

వాతావరణంలో మార్పులు.. రైతుల్లో ఆందోళన

కంకిపాడు బైపాస్ సర్వీస్ రహదారిపై ధాన్యం తిరగబోస్తున్న కూలీలు

కంకిపాడు, న్యూస్‌టుడే: వాతావరణం అనుకూలించడంతో వరి పంట కోత, నూర్పిడి పనులు గత రెండ్రోజులుగా ఊపందుకున్నాయి. అయితే మంగళవారం సాయంత్రానికి ఆకాశం మేఘావృతం అవడంతో పాటు తుపాను సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటనతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. 90శాతం మంది కోతలకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. దీంతో గంటల వ్యవధిలోనే ధాన్యం బయటకు వస్తోంది. సేకరణ నిబంధనల మేరకు తేమ శాతం 17 లోపు ఉంటేనే పూర్తిస్థాయిలో మద్దతు ధర లభిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యాన్ని రహదారుల అంచులు, కల్లాల్లో ఆరబోస్తున్నారు. రోజుకోసారి కూలీలు తిరగేస్తున్నారు. మండలంలో ఇప్పటికే 11 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు ప్రకటించారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు, పరిశీలన, ట్రక్‌షీట్ జారీ తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. తగినన్ని గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

శంకుస్థాపనతో సరిపెట్టారు!

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు-వణుకూరు రహదారి అభివృద్ధి పనులు వాయిదా పడుతూ వస్తున్నాయి. దాదాపు రెండు నెలల కిందట రూ.1.85 కోట్ల నాబార్డు నిధులతో శంకుస్థాపన జరిగినా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ఎపుడు అవుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. 3.4 కిమీ మేర అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రస్తుతం అడుగుకో గొయ్యితో రహదారి పూర్తి అధ్వాన స్థితికి చేరింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని చోట్ల కొట్టుకుపోయింది. కనీసం నడవటానికి కూడా వీలులేని స్థితికి చేరింది. ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిందే. వ్యవసాయ ఉత్పత్తులు తరలించాలన్నా, రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలన్నా కష్టంగా ఉంది. ఈ ప్రాంతంలో వందల ఎకరాల్లో క్యాలీఫ్లవర్, పసుపు, కంద, కూరగాయల తోటలు ఉన్నాయి. ఆయా ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు. 'వణుకూరు-పెనమలూరు అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తాం. ఇప్పటికే అన్నీ అనుమతులు వచ్చాయి'అని అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్ తెలిపారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రహదారి

పవనసుతుడికి పండ్ల హారం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గన్నవరంలో 16వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం బయట పంచముఖ ఆంజనేయస్వామి మందిరం ఉంది. కార్తిక మాసం సందర్భంగా ప్రతి మంగళవారం స్వామికి వారికి వివిధ రకాల ఫలాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ మంగళవారం దాతల సహకారంతో అనాస పండ్లతో విశేషంగా అలంకరించారు. ఇది భక్తుల్ని విశేషంగా ఆకట్టుకుంది.

అనాస పండ్లతో స్వామి అలంకరణ

సామాజిక మాధ్యమాలతో తస్మాత్ జాగ్రత్త

విద్యార్థులు, యువత సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న తీరుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ సమన్వయకర్త డి. వెంకటేశ్వరరావు సూచించారు. గన్నవరం మండలం కేసరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 'బాలలపై సోషల్ మీడియా ప్రభావం' "అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. -న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడుకు చెందిన ఎమ్మెస్సీ విద్యార్థి గుండిమెడ దినేష్‌కు మానవత సంస్థ తరఫున రూ.7,500 ఆర్థిక సాయం అందించారు. సంస్థ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, బాణాల నరసింహారావు, జన్యావుల సత్యనారాయణ, పాబోలు గణేష్, తదితరులు మంగళవారం సంస్థ కార్యాలయంలో ఈ మొత్తాన్ని దినేష్‌కు అందజేశారు.

తడి, పొడి చెత్త వర్గీకరణపై అవగాహన

పోరంకి: విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని ఆల్ ఇండియా లిస్ట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ జిల్లా కోఆర్డినేటర్ ఏకాంతనాయక్ అన్నారు. మంగళవారం పోరంకి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తడి, పొడిచెత్త వర్గీకరణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపల్ సుహాసిని, విద్యార్థులు మొక్కలు నాటారు.

రోడ్డు ప్రమాదంలో తొమ్మిదిమందికి గాయాలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల చెక్‌పోస్టు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ న్యూ ఆటోనగర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్న 20 మంది సిబ్బంది మంగళవారం ఉదయం మినీ లారీలో శ్రీశైలం మల్లన్న దర్శనానికి బయలుదేరారు. వారి వాహనం పెద్దదోర్నాల అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో అదుపు తప్పి పడిపోయింది. ఈ సంఘటనలో భవానీ, సుభానీ, నాగమణి, ఆనంద్, భాగ్యలక్ష్మి, వనజ, ధనుష్, లోకేశ్, నీరజకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై మహేష్ ప్రమాదానికి గల కారణాలను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే: కోడి పుంజు చోరీ వ్యవహారంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి, గాయపరిచిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురు చింతలకట్టకు చెందిన జక్కుల వెంకటేష్.. తమ కోడిపుంజు చోరీ చేశాడని కొద్దిరోజుల కిందట మార్తిన దాసు, రవి అనే వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారమై ఇటీవల పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నారు. ఆ సమయంలో జరిమానాగా రూ.25 వేలు చెల్లించాలని దాసు డిమాండ్ చేశాడు. చోరీతో తనకు సంబంధం లేదని వెంకటేష్ చెప్పడంతో దాసు, రవిలు మంగళవారం మద్యం తాగి అతడితో గొడవపడ్డారు. ఆ సమయంలో కత్తితో దాడి చేయడంతో వెంకటేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శివోహం.. భజేహం

శ్రీకాళహస్తీశ్వరుడికి బిల్వార్చన

పెరికీడులో..

యనమలకుదురులో కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అభివృద్ధి దాత నరసింహారావు దంపతులు

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: తాడిగడప శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం స్వామివారికి బిల్వార్చన, ప్రత్యేక అభిషేకాలు, కలశ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, హేమాచౌదరి దంపతులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో కోటిదీపోత్సవం

యనమలకుదురు: యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోటి దీపోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు దంపతులు ప్రారంభించారు. కోటి దీపాల వెలుగులో ఆలయ ప్రాంగణం ధగధగలాడింది. కార్యక్రమంలో ఈవో భవానీ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెరికీడు శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దశసహస్ర దీపాలంకరణ ఘనంగా నిర్వహించారు. 10,116 దీపాలు ఏర్పాటు చేసి భక్తులతో వెలిగింపజేశారు. దీపక్ నెక్స్‌జెన్ ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, అనూరాధ దంపతులు ఈ కార్యక్రమానికి సహకారం అందించారు.

మృత్యుంజయ హోమం

పటమట: కార్తిక మాస శివరాత్రి సందర్భంగా రామవరప్పాడులోని పేరంటాలమ్మ ఆలయంలోని రామలింగేశ్వరస్వామి గుడిలో మంగళవారం అన్నాభిషేకం, నవగ్రహ సహిత మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఛైర్మన్ పట్టపు వెంకటేశ్వరరావు, ఈవో ప్రియాంక ఏర్పాట్లు పరిశీలించారు.

'పచ్చదనం-పరిశుభ్రత'కు శ్రీకారం

కంకిపాడు, న్యూస్‌టుడే : 'పచ్చదనం-పరిశుభ్రత' (ఎల్ఎస్‌డీజీ-5) పేరుతో మండల స్థాయిలో చేపట్టిన కార్యాచరణకు అందరూ సహకరించాలని ఎంపీడీవో అనూష కోరారు. మంగళవారం కంకిపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులకు కార్యశాల నిర్వహించారు. ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దడానికి అమలు చేయనున్న ప్రణాళికపై అవగాహన కల్పించారు. పరిపాలనాధికారి బసవయ్య, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పపడి పూజ

పోరంకి: పోరంకి గంగానమ్మ ఆలయం వద్ద బొర్రా కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం అయ్యప్ప పడి పూజ చేశారు. సాయంత్రం అయ్యప్ప భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్షాధారులు, భవానీలు, శివస్వాములు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్ఎసిపిసి-1), కె.కె.టవర్స్,
మొదటి అంతస్థు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా.

Appendix – IV –A
[See Provison to rule 8(6) R/w 9(1)]

స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది.22-12-2025

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకపు నోటీసు రూల్ 8(6) ఆర్/డబ్ల్యూ రూల్ 9(1) ప్రకారం

భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడిన నోటీసు ప్రకారం దిగువ ఋణ ఖాతాలలో **"ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే ఏది ఉన్నది ఉన్నట్లుగానే మరియు ఏది ఉంటే అది ఉన్నది ఉన్నట్లుగానే"** అనే నిబంధనపై బ్యాంక్ బకాయిలను మరియు వడ్డీను వసూలు చేయటానికి విక్రయించే హక్కుతో దిగువ ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. కావున బకాయిలను తిరిగి చెల్లించటంలో విఫలమైన తరువాత దిగువ అధీకృత అధికారి పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద ఇవ్వబడిన అధికారాన్ని ఉపయోగించి సదరు ఆస్తిని విక్రయించడం ద్వారా బ్యాంకు బకాయిలను రాబట్టుకొనుటకు ప్రతిపాదిస్తున్నారు. https://www.baanknet.com వెబ్ పోర్టల్‌లో పేర్కొన్న ఇ-వేలం ప్లాట్‌ఫాం ద్వారా దిగువ సంతకం చేసిన వ్యక్తి ద్వారా అమ్మకం జరుగుతుంది.

ఋణగ్రహీత(ల) పేరు: 1. శ్రీ మద్దెల భాస్కరరావు, తండ్రి: పుల్లన్న, ఫ్లాట్ నెం.202, 3వ అంతస్థు, సాయి బ్లోక రెసిడెన్సి, బెలికం నగర్, కర్నూలు-518 002, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. శ్రీమతి పొల్ల వెంకటరమణ, తండ్రి: పొల్ల నరసింహారావు, 32-40/1-97, కార్మిక నగర్, 2వ లైను, మాచవరం, విజయవాడ-520 004, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.

బకాయి మొత్తం: ది.19-03-2025 నాటికి రూ.18,06,946/- (అక్షరాల పద్దెనిమిదిలక్షల ఆరువేల తొమ్మిదివందల నలభైఆరు రూపాయలు మాత్రమే) & ది.15-11-2025 నాటికి రూ.19,40,970/- (అక్షరాల పందొమ్మిదిలక్షల నలభైవేల తొమ్మిదివందల డెబ్బై రూపాయలు మాత్రమే)(ఏదైనా చెల్లింపులు ఉంటే తగ్గించగా) తదుపరి వడ్డీ, ఖర్చులు.

స్థిరాస్తి వివరము: ఎ-షెడ్యూల్: యన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, గుణదల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, విజయవాడ రూరల్, నిడమానూరు, ఆర్‌యస్ నెం.156/1ఎ లోని 705.14 చ॥గ॥లు లేక 589.89 చ॥మీ॥ల ఆస్థి శ్రీ మద్దెల భాస్కరరావు, తండ్రి: యం. పుల్లన్న మరియు శ్రీమతి పొల్ల వెంకటరమణ, తండ్రి: పి. నరసింహారావు గార్లకు చెందిన డాక్యుమెంట్ నెం.358/2023, తేది:20-01-2023. హద్దులు: తూర్పు: ఆలపాటి రామమోహనరావు, ఆలపాటి శరత్, పరిమి రవి మరియు గూడూరు లక్ష్మీపతి గార్ల కొంత విస్తీర్ణములో ఆస్థి, దక్షిణం: ఆలపాటి సుబ్రమణ్యం గారి ఆస్థి, పడమర: శ్రీ రాజేశ్వరస్వామి గుడి మరియు ఇతరుల ఆస్థి, ఉత్తరం: పంచాయితి బజారు. పైన నాలుగు హద్దుల మధ్యగల విస్తీర్ణం 705.14 చ॥గ॥లు లేక 589.89 చ॥మీ॥ల విస్తీర్ణములోని అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగము 27.14 చ॥గ॥లు లేక 22.69 చ॥మీ॥ల స్థలం.

బి-షెడ్యూల్: ఎ షెడ్యూల్‌లో తెలుపబడిన మొత్తం స్థలములోని గ్రూప్ హౌస్, శ్రీ రాజేశ్వర రెసిడెన్సి, మొదటి అంతస్తు, ఫ్లాట్ నెం.యఫ్‌యఫ్-3 (203), అసెస్‌మెంట్ నెం.3540, డోర్ నెం.5-80/1 నకు హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి వరండా మరియు మెట్లు, ఉత్తరం: ఓపెన్ టు స్కై. ఈ నాలుగు హద్దుల మధ్య గల విస్తీర్ణం 850.0 చ॥అడుగుల ప్లింత్ ఏరియా, 100 చ॥అడుగుల కామన్ ఏరియా, 100 చ॥అడుగుల కారు పార్కింగ్‌తోపాటు అన్ని హక్కులతో కలిగిన ఫ్లాట్.

రిజర్వు ధర: రూ.25,61,000/- ధరావత్తు: రూ.2,56,100/- బిడ్ పెంపుదల: రూ.10,000/-
ఇ-వేలం తేదీ & సమయం: 22-12-2025 ఉ॥ గం॥ 11.00 ల నుండి సా॥ గం॥ 05.00 ల వరకు

సొమ్మును సమర్పించుటకు A/c No:30733231487, IFSC Code: SBIN0011098, Name of the Bank, SBI, SARC, (RACPC-1, Vijayawada, NTR District) వెబ్‌పోర్టల్ https://www.baanknet.com (యూజర్ ఐడి & పాస్‌వర్డ్ ఉచితంగా https://www.baanknet.com లో రిజిష్టర్ చేసుకొన్న పేరు మీద లభించును) ద్వారా పాస్‌వర్డ్ & లాగిన్ ఐడి కలిగివుండవలెను.

తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా M/s PSB Alliance PVT Ltd., టోల్ ఫ్రీ నెం: +91 8291220220 వారి వెబ్ పోర్టల్ https://www.baanknet.com మరియు పై లభించు ఇ-వేలపు నియమ నిబంధనల పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరుచున్నాము. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్థుల తనిఖీ కొరకు చీఫ్ మేనేజర్-మొబైల్ నెం.9424690028, ఇ-మెయిల్ ఐడి: sbi.05252@sbi.co.in మరియు రికవరీ ఏజెన్సి: M/s.Sarah Associates: 9849189726 & 7396223738 వారిని బ్యాంకు పనిదినములలో సంప్రదించవచ్చును. నియమ నిబంధనలు వర్తిస్తాయి.

ప్రదేశం : విజయవాడ
తేది : 17-11-2025

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకొస్తాం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. గన్నవరం ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వారోత్సవాల్లో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఆధునిక పుస్తకాలయాలు ఉన్నప్పటికీ పాఠకులు వినియోగించుకోవడం లేదన్నారు. డిజిటలైజేషన్ ప్రభావంతో వాటి ఉనికిని కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. తిరిగి పాఠకులను ఆకట్టుకునేందుకు మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేయనున్నట్లు తెలిపారు. విలువైన పుస్తక సంపదను విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 50 మంది విద్యార్థులకు ఎస్ఐ శ్రీధర్ సహకారంతో సభ్యత్వాన్ని అందజేశారు.

మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు, వేదికపై అతిథులు

ఉయ్యూరు, ఉయ్యూరు గ్రామీణం: ఉయ్యూరులోని గ్రంథాలయంలో జూనియర్ విభాగం విద్యార్థులకు క్రమశిక్షణ, సీనియర్స్ విభాగంలో మీకు నచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెద ఓగిరాల శాఖలో చిత్రలేఖనం, ముదునూరులో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు.

కంకిపాడు: తెన్నేరు, కంకిపాడు శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పించారు. వీటిలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు, కానుమోలు, వీరవల్లి గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకత గురించి వివరించడంతో పాటు, వివిధ పోటీలు నిర్వహించారు. బాపులపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చరవాణి వల్ల కలిగే లాభనష్టాల గురించి అవగాహన కల్పించారు.

సిప్‌అబాకస్ పోటీల్లో ప్రతిభ

కానూరు, న్యూస్‌టుడే: కానూరు సిప్ అబాకస్‌కు చెందిన కె. మోన్యశ్రీ.. అంతర్జాతీయ స్థాయి సిప్ అబాకస్ పోటీల్లో 3బీ కేటగిరిలో ఛాంపియన్‌గా నిలిచిందని ఆ సంస్థ ప్రిన్సిపల్ మంజుల పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ చెన్నైలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి 5700 మంది పాల్గొనగా.. తమ విద్యార్థులు 10 మంది వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించారన్నారు. గార్విక్, మోహిద్‌అబాన్, మేఘశ్యామ్, చంద్రికలు మూడో రన్నరప్‌గా నిలిచారన్నారు. మానస, సన, కార్తికేయ ఉత్తమ ప్రతిభా అవార్డులు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్ మంజుల

ఉచిత పశు వైద్య సేవలు

గన్నవరం గ్రామీణం: ఉంగుటూరు మండలం వేంపాడులో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ చిననరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భకోశ, ఇతర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. గన్నవరం శాఖ ఉపసంచాలకుడు చంద్రమోహన్, డాక్టర్ బాలక్రిష్ణ, డాక్టర్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

గన్నవరం గ్రామీణం: అన్ని ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు కేటాయించాల్సిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గన్నవరం పర్యటనకు వచ్చిన ఏపీ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ జి.కోటేశ్వరరావును సంఘ నాయకులు మంగళవారం కలిశారు. దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, సీహెచ్.వెంకటేశ్వరరావు, భాస్కరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

దత్తాత్రేయకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మండలి

మోపిదేవిలో బండారు దత్తాత్రేయ

మోపిదేవి, న్యూస్‌టుడే: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం రాత్రి మోపిదేవిలో బస చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, భాజపా సీనియర్ నేత చిరువోలు బుచ్చిరాజు ఆయనకు స్వాగతం పలికారు. బుధవారం అవనిగడ్డలో జరిగే 1977 దివిసీమ ఉప్పెన సంస్మరణ సభలో ఆయన పాల్గొంటారు.

శ్రీపృథ్వీశ్వరస్వామిని దర్శించుకున్న ఉన్నతాధికారులు

చల్లపల్లి, న్యూస్‌టుడే : ప్రాచీన శైవక్షేత్రం నడకుదురు శ్రీపృథ్వీశ్వరస్వామి వారి ఆలయాన్ని పలువురు ఉన్నతాధికారులు మంగళవారం దర్శించుకొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్(జేడీఏ) ఎన్.పద్మావతి, డీసీవో కె.చంద్రశేఖర్‌రెడ్డిలతోపాటు పలువురు ప్రముఖులు పూజలు చేశారు. అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు, భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ఆలయం వద్ద జేడీఏ పద్మావతి, ఏడీఏ, ఏవోలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? చల్లపల్లి ప్రధాన సెంటర్, చల్లపల్లి-మచిలీపట్నం రహదారుల్లో దుకాణాల ముందు ద్విచక్ర వాహనాల నిలుపుదలతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. **-కె.రామకృష్ణ, చల్లపల్లి**

✔ ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందుల్లేవు. చల్లపల్లిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగితే వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. **-పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, ఎస్.ఐ.-చల్లపల్లి**

465 గృహ నిర్మాణాలకు నిధుల మంజూరు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ నియోజకవర్గం పరిధిలో గృహ నిర్మాణానికి 932 మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో 465 మందిని ఎంపిక చేసినట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ప్రజా వేదికలో ఎంపీడీవోలు, గృహనిర్మాణ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం అయ్యారు. గుడివాడ నియోజకవర్గంలో నూతనంగా 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. గుడ్లవల్లేరులో 3, నందివాడలో 5, గుడివాడలో 4 పీహెచ్‌సీలు నిర్మిస్తామన్నారు.

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాము

చదువుతో ఏదైనా సాధ్యం

వెంకటపురం (మోపిదేవి): చదువుతోనే ఏదైనా సాధించవచ్చునని ఎంపీపీ రావి దుర్గావాణి పేర్కొన్నారు. వెంకటపురం జడ్పీ పాఠశాలలో పదిలో అత్యధిక మార్కులు సాధించిన శీలం సాయిశ్రీ, శీలం హేమశ్రీలకు సర్పంచ్ తుమ్మా సోములమ్మ, రావి నాగేశ్వరరావు, పరుచూరి శ్రీనివాసరావు, నారగం పరంజ్యోతి, అబ్బూరి నాంచారయ్య తదితరులు వితరణగా అందించిన నగదును మంగళవారం పంపిణీ చేశారు. డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన పేరుపోయిన శ్రీనివాసరావు, ఉల్లంకి లావణ్యలను సత్కరించారు. హెచ్ఎం సుభాషిణి పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంపీపీ దుర్గావాణి తదితరులు

కోసూరుపాలెంలో దాతల ఔదార్యం

కోసూరుపాలెం(మోపిదేవి), న్యూస్‌టుడే: కోసూరుపాలెం గ్రామస్థులలో వస్తున్న మార్పు అభివృద్ధికి సంకేతాలుగా నిలవాలని మండలి వెంకటరామ్ పేర్కొన్నారు. దాదాపు 35మంది దాతలు రూ.లక్షతో సమకూర్చిన 145 కుర్చీలను రైతు సేవా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, సామాజిక భవనానికి పంపిణీ చేశారు. సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ❖ కోసూరు గోపాలకృష్ణమూర్తి(అద్దర్ గాంధీ)-లక్ష్మీకాంతమ్మల పేరిట ఆరు నెలల క్రితం పంచాయతీకి మార్చురీ బాక్సు ఇచ్చిన వారి కుమారులు అజయ్య, రవి, వెంకటేశ్వరరావు రూ.35 వేలతో ప్రత్యేకంగా నిర్మించిన షెడ్డును ప్రారంభించారు.

శిథిలావస్థలో రక్షిత భవనాలు

అవనిగడ్డ, అవనిగడ్డ గ్రామీణం, నాగాయలంక - న్యూస్‌టుడే

దివిసీమ ప్రజల్ని ఉప్పెన లాంటి విపత్తుల నుంచి రక్షణ కల్పించేందుకు తుపాను రక్షిత భవనాలు నిర్మించారు. ఇవి ఎన్నో విపత్తుల నుంచి ప్రజలకు రక్షణగా నిలిచాయి. రాన్రాను నిర్వహణ కొరవడటంతో శిథిలావస్థకు చేరాయి. ఉప్పెనలో నాగాయలంక మండలంలోని ఎదురుమొండి, ఈలచెట్ల దిబ్బ, నాచుగుంట, మూలపాలెం, కమ్మనమోలు, సొర్లగొంది, భావదేవరపల్లి, సంగమేశ్వరం, ఏటిమొగ, గుల్లలమోద.., కోడూరు మండలంలోని హంసలదీవి, గొల్లపాలెం తదితర గ్రామాలు నేలమట్టమయ్యాయి. రామకృష్ణ మిషన్, ఆర్ఎస్ఎస్, రెడ్‌క్రాస్, టాటా రిలీఫ్ తదితర స్వచ్ఛంద సంస్థలు ఆయా గ్రామాలను దత్తత తీసుకొని పునఃనిర్మించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు అప్పటి మంత్రి మండలి వెంకట కృష్ణారావు సూచనలు, ప్రజల అవసరాల మేరకు నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలో సుమారు 300పైగా తుపాను రక్షిత భవనాలు నిర్మించారు. ప్రస్తుతం వాటిలో చాలా భవనాలు కనుమరుగవగా. . ఉన్నవి శిథిలావస్థకు చేరుకున్నాయి.

నాగాయలంక మండలం పాత ఉపకాలిలో శిథిలావస్థలో తుపాను రక్షిత భవనం

నాగాయలంక మండలంలోని సొర్లగొందిలో కోతకు గురైన సముద్రపు కరకట్ట

❖ తీరం వెంబడి ఉన్న సముద్రపు కరకట్టలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. కృష్ణానదికి వరదలు వచ్చినా, సముద్ర అలల ఉద్ధృతి పెరిగినా తీర గ్రామాల ప్రజల గుండెల్లో గుబులు వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం తీరప్రాంత గ్రామాల్లో రహదారుల అభివృద్ధి, కరకట్టల పటిష్టత వంటి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దివిసీమ బాధితుల్ని ఆదుకున్న మానవత్వం

నాగాయలంక, న్యూస్‌టుడే: ఉప్పెన బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రపంచ దేశాల నుంచి మానవతా సాయం అందిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నాగాయలంకలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద మంగళవారం 107వ రోజు శత జయంతి కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న మండలి వెంకట కృష్ణారావు దేశ, విదేశాల నుంచి ఆర్థిక సాయం రప్పించి దివిసీమను ఏడాదిలోగా పునరుద్ధరించారన్నారు. ఈ సందర్భంగా బుధవారం అవనిగడ్డలో జరిగే దివిసీమ ఉప్పెన మృతుల సంస్మరణ సభకు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. జె.దాస్, తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, నాగమల్లికార్జునరావు, కైతేపల్లి అంకాలు, నేతలు పాల్గొన్నారు.

కృష్ణారావు విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ప్రతిభా పాటవ పోటీకి విశేష స్పందన

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మంగళవారం ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీకి విశేష స్పందన లభించింది. 'విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసం పోటీలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని అందరూ ఆకాంక్షించారు. ఈ పోటీలో ఎం.అమృత ప్రథమ, డి.తణ్మశ్రీ ద్వితీయ, టి.తస్వీష్ తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు వైస్ ప్రిన్సిపల్ డి.దిలీప్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలతో వైస్ ప్రిన్సిపల్ డి.దిలీప్

జనగణనతోపాటు కులగణన నిర్వహించాలి

చల్లపల్లి, న్యూస్‌టుడే : జనగణనతోపాటు కులగణన సైతం నిర్వహించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాదబాబు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సీపీఐ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా చల్లపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి ఆందోళన నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు శ్రీలతకి అందజేశారు. రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించటం వల్ల వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులను బీసీలు కోల్పోయారన్నారు. తెలంగాణాలో ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కుల గణన చేపట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నక్కా శీను, పెనుమత్స రామకృష్ణంరాజు, అల్లూరి బాబూరావు, గోగినేని రత్తయ్య, హర్షవర్ధన్, శ్రీనివాసరావు, సిద్ధాంతపు వాసు తదితరులు పాల్గొన్నారు.

డీటీ శ్రీలతకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాదబాబు తదితరులు

అగ్నికుల క్షత్రియుల వన సమారాధన

నాగాయలంక, న్యూస్‌టుడే: అగ్నికుల క్షత్రియులు అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి కార్తిక వన భోజనాలు నాగాయలంకలోని శ్రీరామపాద పుష్కర ఘాట్ ప్రాంగణంలో వైభవంగా జరిగాయి. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి అగ్నికుల క్షత్రియులు విరివిగా పాల్గొన్నారు. వేలాది మందికి అన్న సమారాధన జరిగింది.

వన భోజనాలు చేస్తున్న సంఘీయులు

భవనాన్ని పొక్లెయిన్లతో తొలగిస్తున్న దృశ్యం

మున్సిపల్ మాజీ ఛైర్మన్ భవనం కూల్చివేత

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ - పామర్రు రోడ్డులోని భీమవరం రైల్వే గేటు సమీపంలోని మున్సిపల్ మాజీ ఛైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావుకు చెందిన భవనంలో కొంతమేరకు జాతీయ రహదారుల శాఖ, రెవెన్యూ శాఖలు పోలీసు వారి సమక్షంలో మంగళవారం తొలగించారు. ఆర్‌వోబీ పనులలో భాగంగా పట్టణంలోని పలు చోట్ల ఇంకా కొందరు వ్యక్తులు భూసేకరణలో నష్ట పరిహారం తీసుకుని కూడా స్థలం ఖాళీ చేయకపోవడం, భవనాలు అలాగే ఉంచడం చేస్తున్నారు. దీంతో ఆర్‌వోబీ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో నుగలాపు వెంకటేశ్వరరావుకు చెందిన భవనంలో సుమారు 60 చదరపు గజాల స్థలం సేకరించారు. దీనికిగాను సుమారు రూ.1.35 కోట్లు రెండు దఫాలుగా విడుదల చేశారు. ఈనేపథ్యంలో స్థలం ఖాళీ చేయడానికి ఇచ్చిన సమయం పూర్తయిందంటూ కూల్చి వేసి, మార్కు చేసినంత వరకూ ఖాళీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల శాఖ ఏఈ శరత్, తహసీల్దారు కిరణ్ కుమార్, వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

ఘంటసాల, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక రంగంలో మరింత ముందంజలో ఉండాలని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ అన్నారు. మంగళవారం ఘంటసాల జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి, హైదరాబాద్ ఈజడ్ టాక్స్ సీఈవో దాసరి సునీల్ విద్యాలయకు ఉపయోగపడేలా 9 కంప్యూటర్లను వితరణగా ప్రధానోపాధ్యాయిని ఎ.శ్రీలంకలక్ష్మికి అందజేశారు. ఈయన దివంగత గణిత ఉపాధ్యాయుడు దాసరి వెంకటేశ్వర్లు(డీవీఆర్) కుమారుడు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పరచుకున్న లక్ష్యాలను సాధించడానికి ఉత్తమ ప్రణాళికతో శ్రమించాలన్నారు. సునీల్‌ను సత్కరించారు.

దాత సునీల్‌ను సత్కరిస్తున్న వెంకటరామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రూ.3.96 కోట్లతో బైపాస్ రోడ్డు అభివృద్ధి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో చాలా కాలంగా ప్రధాన సమస్యగా ఉన్న బైపాస్ రోడ్డును రూ. 3.96 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. రహదారులు భవనాల శాఖ అధికారులతో ఆయన మంగళవారం సమావేశం అయ్యారు. ఏలూరు రోడ్డు నుంచి వలివర్తిపాడు అడ్డరోడ్డు వద్ద గల చింతల కాలువ వరకూ బైపాస్ రోడ్డును రూ.2.50 కోట్లతోనూ, రెండు వైపులా డ్రెయిన్లను రూ.1.46 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. ఆర్అండ్‌బీ డీఈ కామేశ్వరరావు, కాంట్రాక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకూరులో శ్రీ గంగాపార్వతి సమేత బుద్ధేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం చేస్తున్న అర్చక బృందం

సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

కూచిపూడిలో రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

పామర్రు మండలం కొమరవోలులో శివ లింగాకారంలో పుష్పాలంకరణ

అవనిగడ్డ శివాలయంలో..

పారిశ్రామిక ప్రాంతంలో ప్రత్యేక చర్యలు

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల ఆధునికీకరణ కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పార్టనర్‌షిప్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు గుడివాడ ఆటోనగర్ ప్రాంతంలో నిర్వహించనున్నట్లు ఏపీఐఐసీ కమిషనర్ జి.దివెన్ అన్నారు. ఆటోనగర్ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఆటోనగర్‌లో సమీపంలో చెట్లను తొలగించారు. కార్మికులు రహదార్లను శుభ్రం చేశారు. క్లీన్ ఆటోనగర్‌గా అభివృద్ధి పరిచేందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

ఆర్టీసీ కాలనీ పార్కు వద్ద చెట్లను తొలగించిన దృశ్యం

గుడివాడ క్షత్రియ సేవా సమితి ఎన్నిక

గుడివాడ,. న్యూస్‌టుడే: గుడివాడ క్షత్రియ సేవా సమితి నూతన కార్యవర్గం బైపాస్ రోడ్డులోని ముదునూరి సూరిబాబు కాంప్లెక్స్‌లో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సమితి అధ్యక్ష, కార్యదర్శులుగా కోసూరి రవిరాజు, దళపతిరావు దామోదర్ రాజు, గౌరవాధ్యక్షుడిగా కనుమూరి భాస్కరరాజు, గౌరవ సలహాదారుగా గాదిరాజు జగ్గరాజు, కోశాధికారిగా కుచ్చర్లపాటి శ్రీనివాసరాజు, ముఖ్య సలహాదారులుగా ముదునూరి సత్యనారాయణ రాజు, రుద్రరాజు విజయ్ కమార్ రాజు, ఉపాధ్యక్షుడిగా సాగిరాజు ఉదయ భాస్కరరాజు, వర్కింగ్ కార్యదర్శిగా సాగిరాజు విజయ రంగరాజు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


రవిరాజు దామోదర్ రాజు

సహకార రంగంతోనే సాధికారత సాధ్యం

చల్లపల్లి, న్యూస్‌టుడే : సహకార రంగం ద్వారానే యువత, మహిళలు, బలహీనవర్గాల సాధికారత సాధ్యమవుతుందని కృష్ణా జిల్లా సహకార అధికారి కె.చంద్రశేఖర రెడ్డి అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం పురిటిగడ్డ సొసైటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. యువశక్తి సహకార ఉద్యమంలో పాలుపంచుకోవాల్సిన ఆవశ్యకత గురించి తెలిపారు. మచిలీపట్నం విభాగ సహకార అధికారి వి.వి.ఫణికుమార్, రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ విద్యాధికారి కె.భోజరంగరాజు, చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు మేనేజరు వై.నగరాజకుమారి, అవనిగడ్డ సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, అసిస్టెంటు రిజిస్ట్రార్ మహమ్మద్ గౌస్, కొడాలి సొసైటీ ఛైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్‌లు ప్రసంగించారు. పురిటిగడ్డ సొసైటీ ఛైర్‌పర్సన్ పెద్దిబోయిన హరినాథ్ అధ్యక్షతన జరిగిన సభలో సొసైటీల ఛైర్‌పర్సన్లు అర్జా రాధిక, నాదెళ్ళ శరత్‌చంద్రబాబు(బుజ్జి), రావి శ్రీనివాసరావు, బళ్లా సీతారామప్రసాద్, సూపర్‌వైజర్లు వినయకుమార్, సత్యనారాయణ, స్థానిక సీఈవో కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సహకార సహపంక్తి వనభోజనాలలో పాల్గొన్నారు.

సహకార వారోత్సవాల్లో పాల్గొన్న డీసీవో చంద్రశేఖరరెడ్డి, అధికారులు, సొసైటీల ఛైర్మన్లు, సీఈవోలు

కొత్తవరం పీహెచ్‌సీ పరిశీలన

కొత్తవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తవరం పీహెచ్‌సీని మంగళవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

ఆలయానికి ఆదాయం

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానంలో మంగళవారం భక్తులు సమర్పించిన తలనీలాలు, ధాన్యం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. తలనీలాల్ని రూ.8 లక్షలకు ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన కత్తుల రాజు దక్కించుకున్నారు.

వాహనాల తనిఖీ

వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్న మచిలీపట్నం రవాణాధికారి శ్రీదేవి

పామర్రు, న్యూస్‌టుడే: గుడివాడ రోడ్డులోని చాట్లవానిపురం రహదారి చివర మంగళవారం మచిలీపట్నం రవాణాధికారి శ్రీదేవి వాహన తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించి సరిగా లేని వాహనాలకు రూ.25వేలు జరిమానా విధించారు.

మత్తు పదార్థాలతో యువత భవిత నాశనం

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మత్తు పదార్థాలకు 15 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు గల విద్యార్థులు అధికంగా బానిసలై వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని గుడివాడ వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 'మత్తు పదార్థాల వాడకం.. దుష్ప్రభావం' అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనలను పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి, సైకాలజిస్టు జగదీష్, ఎన్‌వైకే సభ్యురాలు ఏ.శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్.కుమార్, కరస్పాండెంట్ కెఎస్.అప్పారావు, అధ్యక్షుడు ఎల్ఆర్‌కె.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ భూతంపై ప్లకార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక సింహాద్రి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ జె.నాగసుబ్రహ్మణ్యం అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చీటీల పేరుతో ఒక మహిళ మోసం చేసిందని సోమవారం ఉదయం అతను సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. ఎంత కట్టినా అప్పులు మాత్రం తీరడం లేదని, దీంతో ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు చెప్పాడు. ఆ తర్వాత చల్లపల్లి వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత ఇంటి వద్ద ఉరిపోసుకుని చనిపోయినట్లు ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తన భార్యా పిల్లలకు న్యాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని సెల్ఫీలో వేడుకున్నాడు. ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

నాగసుబ్రహ్మణ్యం

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుడివాడ, న్యూస్‌టుడే: మండలంలోని మల్లాయపాలెం గ్రామ పరిధిలోని టిడ్కో కాలనీలో నివసించే షేక్ సలీం కుమారుడు షేక్ రహమత్ (30) ఈనెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. ఈక్రమంలో కుటుంబం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో రహమత్ తల్లి జహీరున్నీసా ఫిర్యాదు మేరకు ఎస్.ఐ నంబూరి చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహమత్

ఉసిరి చెట్టు వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, తదితరులు

నాయీబ్రాహ్మణుల వనసమారాధన

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన జరిగింది. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ శోభన్‌బాబులు పాల్గొన్నారు.

డిజిటల్ బోర్డుల బహూకరణ

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు అస్సెస్సీ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో 1999-2000కి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.3.5లక్షలతో అత్యాధునికమైన డిజిటల్ క్లాస్ రూము బోర్డులను బహూకరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థి డాక్టర్ ధీరజ్ తూము, కరస్పాండెంట్ రోజ్, ప్రిన్సిపల్ తలసా పాల్గొన్నారు.

డిజిటల్ క్లాసురూమ్ బోర్డులను ప్రిన్సిపల్‌కి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

తోట్లవల్లూరు: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు పచ్చదనం, పరిశుభ్రతపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రవికాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రతపై ప్రజలకు ఏవిధంగా అవగాహన కల్పించాలనే అంశాలపై వివరించారు. ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రవికాంత్

త్వరితగతిన పూర్తిచేయాలి

పామర్రు, న్యూస్‌టుడే: వీరాంజనేయ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే కుమార్‌రాజా ఆదేశించారు. మంగళవారం ఆ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

గ్రామాల అభివృద్ధే.. దేశాభివృద్ధి

గుడివాడ, న్యూస్‌టుడే: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని గుడివాడ మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దె పుష్పరాణి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ)లో భాగంగా పచ్చదనం, పరిశుభ్రత అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదపారుపూడి, న్యూస్‌టుడే: గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌లుగా తయారు చేసుకోవాలని ఎంపీడీవో జె.విమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

SRI CONSTRUCTIONS
గుడివాడ పట్టణంలో అత్యధిక ఇండిపెండెంట్ హౌస్‌లు నిర్మించిన నిర్మాణ సంస్థ
బిల్డర్స్ డే శుభాకాంక్షలు
దాసరి మహేష్
✆ 98497 73799
శ్రీ కన్‌స్ట్రక్షన్స్
గుడివాడ
మీ ఇంటిని అత్యంత క్వాలిటీతో అతి తక్కువ ధరతో మీరు కోరుకున్న విధముగా కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్మించి ఇవ్వబడును.
GSTIN : 37APHPD5842D2Z2
A BRAND WITH QUALITY

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
శ్రీ ఉషోదయ
చేనేత, హస్తకళా మేళా
అఖిల భారత హస్తకళా, చేనేత వస్త్రప్రదర్శన & అమ్మకం
కొద్ది రోజులు మాత్రమే
పోచంపల్లి, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల, కాటన్ సిల్క్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెడ్ షీట్స్, ఖాళీ వస్త్రాలు, అలంకృత ఆభరణాలు మొ॥నవి లభించును.
Exhibition cum Sale
వేదిక : ఆర్యవైశ్య కళ్యాణ మండపము, శరత్ టాకీస్ దగ్గర, గుడివాడ
ది. 12-11-2025 నుండి ప్రారంభం
సమయం : ఉదయం 10-00 గం॥ల నుండి రాత్రి 9-00 గం॥ల వరకు
పాత పట్టుచీరలు కొనబడును.

(c) eenadu

నగరంలో అలజడి

32 మంది మావోయిస్టుల అరెస్టు


కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన పోలీసులు

పెనమలూరు, కానూరు న్యూస్‌టుడే

నగర శివారు ప్రాంతాలు తెలతెలవారుతూనే ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యాయి. కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందారనే సమాచారం సంచలనం రేపింది. మంగళవారం ఉదయం ఆక్టోపస్, బాంబ్ స్క్వాడ్, క్లూస్‌టీం, భారీ ఎత్తున పోలీసు, కేంద్ర ప్రభుత్వ బలగాలు.. ఆ పారిశ్రామికవాడలోకి ప్రవేశించడం, 27 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. వీరితో పాటు రామవరప్పాడు, ఎనికేపాడు ప్రాంతాల్లో మూడు చోట్ల నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మూడు నెలల నుంచి ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారిలో ఓ అగ్రనేత కూడా ఉన్నట్లు తెలిసింది. గన్నవరంలో చికిత్స చేయించుకునేందుకు వచ్చి మరొక మావోయిస్టు దొరికిపోయాడు.

మీడియాను నిలువరించిన పోలీసులు

సమాచారం, కదలికలు బయటకు పొక్కకుండా..

కొత్త ఆటోనగర్‌లో పట్టుబడ్డ మావోయిస్టులు స్థానికంగానే ఉంటున్నా ఏ మాత్రం సమాచారం, కదలికలు బయటకు పొక్కకపోవడంపై స్థానికంగా భయాందోళనలు వ్యక్తమవడంతో పాటు పెద్ద చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టులు ఐదో నంబరు రహదారిలోని ఓ భవనంలో మకాం వేయగా.. వారంతా ఒకేసారి అందులోకి ప్రవేశించలేదని తెలుస్తోంది. అలా వస్తే స్థానికులకు అనుమానం వస్తుందని, సమాచారం పోలీసులకు చేరుతుందనే అనుమానంతో రోజుకు ఇద్దరు, ముగ్గురు, నలుగురైదుగురు చొప్పున ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతంలో అందరూ కార్మికులు ఉండటం, వారంతా ఉదయం వచ్చి రాత్రి సమయంలో తిరిగి వెళ్లిపోయే వారు కావడంతో.. రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు జనసంచారం అంతగా ఉండదు. దీంతో భవనంలోకి మావోయిస్టుల చేరిక సులువైందంటున్నారు. భవనం యజమాని విదేశాల్లో ఉంటారని గుర్తించారు. నిర్వహణ, పర్యవేక్షణంతా కాపలాదారుగా ఉన్న వ్యక్తి చూస్తుంటారని తెలుస్తోంది. మావోయిస్టులు తాత్కాలికంగా ఆశ్రయం పొందారా లేక ఏదైనా లక్ష్యంతో ఇక్కడకొచ్చారా అన్న దిశగా విచారణ సాగుతోంది.

మావోయిస్టులు ఉన్న భవనం వద్దకు చేరుకున్న క్లూస్ టీం

తనిఖీలకు వచ్చిన డాగ్ స్క్వాడ్

గతంలో రాకెట్ లాంచర్లు స్వాధీనం

వాస్తవానికి కానూరు ఆటోనగర్‌లో మావోయిస్టుల కదలికలు కొన్నేళ్ల క్రితమే వెలుగులోకి వచ్చాయి. గతంలో మావోయిస్టులకు చెందిన వందల కొద్దీ రాకెట్ లాంచర్లు ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పట్టుబడటాన్ని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.

అద్విక కేసులో ఆదిత్య కస్టడీ కోసం పిటిషన్

ఈనాడు - అమరావతి: అద్విక కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు ఆదిత్యను మరో విడత కస్టడీకి కోరుతూ మంగళవారం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం ఈనెల 20కి వాయిదా పడింది. తొలి విడత కస్టడీలో ఆదిత్యతోపాటు, అతని భార్య, బాలకృష్ణలను పోలీసులు ప్రశ్నించారు. అయినా లెక్కలు చూపని సొమ్ముకు సంబంధించి వివరాలు వెల్లడించలేదు.

గతి తప్పిన వేగం.. గాలిలో ప్రాణం!

ప్రైవేటు ట్రావెల్స్ వాహన దూకుడుకు పడని కళ్లెం

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, నందిగామ



☛ విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలో అనాసాగరం దగ్గర వేగంగా దూసుకొచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అతివేగమే దుర్ఘటనకు కారణం.

☛ గతంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడు సమీపంలో వేగంగా వంతెన ఎక్కే క్రమంలో ప్రమాదానికి గురైంది. 11 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. చాలా మంది గాయాలపాలయ్యారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంతో.. ఇటీవల కర్నూలు జిల్లాలో 19 మంది సజీవ దహనమయ్యారు. ఈ ఘటనతో రాష్ట్రమంతా ఉలిక్కిపడినా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తీరు మారడం లేదు. దూకుడు తగ్గించుకునే ప్రయత్నం చేయడం లేదు. మంగళవారం నందిగామ పరిధిలో జరిగిన ప్రమాదం వారి నిర్లక్ష్యాన్ని మరోమారు నిరూపించింది.

నందిగామ: అనాసాగరం వద్ద సోమవారం అర్ధరాత్రి లారీని ఢీకొని ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు

☛ ఉమ్మడి జిల్లాలో మూడు ప్రధాన ఎన్‌హెచ్‌ల్లో ఈ ఏడాది ప్రమాద గణాంకాలు భయపెడుతున్నాయి. మొత్తం 479 ప్రమాదాలు జరిగితే 199 మంది మృత్యువాతపడగా. 440 మంది గాయాల బారిన పడ్డారు. ☛ ప్రైవేటు ట్రావెల్ బస్సుల్లో అతివేగంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో స్పీడ్‌లాక్ సిస్టం ఉంటుంది. 70 కిమీ వేగం దాటి వెళ్లే అవకాశం ఉండదు. ప్రైవేటు బస్సుల్లో ఈ నిబంధన లేకపోవడంతో రాత్రుళ్లు గంటకు 120 కిమీ వేగంగా అడ్డగోలు నడిపేస్తున్నారు. ఆరు గంటల ప్రయాణం 4 గంటల్లో ముగిస్తున్నారు. ☛ బస్సుపైనా, లగేజీ కౌంటర్‌లో పరిమితికి మించి బరువున్న పార్సిళ్లు, సామగ్రి రవాణా చేయడం నిబంధనలకు విరుద్ధమైనా గుట్టుగా సాగిపోతోంది. ఈ అధిక బరువు సైతం వేగంలో బస్సు నియంత్రణకు రాకుండా చేస్తోంది. ☛ విజయవాడ కేంద్రంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు నిత్యం 500పైగా బస్సులు తిప్పుతున్నారు. రవాణా శాఖ అధికారులు తనిఖీలు గాలికొదిలిన ఈ ఫలితమే ఈ రహ''దారుణా''లనేది సుస్పష్టం.

20న పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం

కొండపల్లి, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రులు విజయవంతమైన నేపథ్యంలో ఈ నెల 20న గురువారం పవిత్ర సంగమం వద్ద కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నామని పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద పది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వరదలు వచ్చినా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో సంగమం వద్ద మండలంలోని గ్రామాల మహిళలతో పాటు పురపాలిక, నగరంలోని మహిళలు దీపోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. సంగమం వద్ద అన్ని ఏర్పాట్లను పురపాలిక నిర్వహిస్తుండగా దీపోత్సవానికి కావాల్సిన అన్ని వస్తువులను మహిళలే స్వయంగా సమకూర్చుకోవాలన్నారు.

అన్నదాతా.. ఖుషీభవ!

✧ నేటి నుంచి పీఎం, కిసాన్, సుఖీభవ సొమ్ము జమ

ఈనాడు, అమరావతి: అన్నదాతా... సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ సొమ్ము జమ చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. బుధవారం నుంచి సొమ్ము జమ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఒక్కో రైతుకు అన్నదాతా సుఖీభవ నుంచి రూ.5 వేలు, పీఎం కిసాన్ రూ.2 వేలు చొప్పున జమ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 2,52,485 మంది రైతుల ఖాతాలకు రూ.168.23 కోట్లు బదిలీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న వేళ.. ఈ సొమ్ము ఉపయుక్తంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ✦ ఎన్టీఆర్ జిల్లాలో సుఖీభవ కింద రూ.59.31 కోట్లు, పీఎం కిసాన్ నుంచి రూ.20.40 కోట్ల చొప్పున రూ.79.72 కోట్లు జమవుతుంది. ✦ కృష్ణా జిల్లాలో సుఖీభవ కింద రూ.66.93 కోట్లు.. పీఎం కిసాన్ కింద రూ.21.56 కోట్ల చొప్పున రూ.88.49 కోట్లు ఇవ్వనున్నారు. ✦ అత్యధికంగా కృష్ణాలో పామర్రుకు రూ.19.56 కోట్లు, ఎన్టీఆర్‌లో నందిగామకు రూ.20.40 కోట్లు జమకానున్నాయి.

లబ్ధి: (రూ.కోట్లలో)

నియోజకవర్గం	సుఖీభవ రైతులు	సుఖీభవ లబ్ధి	పీఎం కిసాన్ రైతులు	పీఎం కిసాన్ లబ్ధి	మొత్తం లబ్ధి
తిరువూరు	33,658	16.83	28,623	5.72	22.55
విజయవాడ వెస్ట్	–	–	22	0.0044	0.0044
విజయవాడ సెంట్రల్	–	–	108	0.0216	0.0216
విజయవాడ ఈస్ట్	–	–	32	0.0064	0.0064
మైలవరం	30,241	15.12	23,933	4.79	19.91
నందిగామ	30,216	15.11	26,560	5.31	20.42
జగ్గయ్యపేట	24,514	12.26	22,737	4.55	16.80

వదిలేస్తే ఎలా.. సరిచేస్తే పోలా?!

"ప్రజల చేతిలో ప్రభుత్వం" అని దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ గవర్నెన్స్‌ని తీసుకొచ్చారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలలో వీటిపై అవగాహన కల్పిస్తూ క్యూఆర్ కోడ్ స్కానర్‌లను ఏర్పాటుచేశారు. ఒకసారి స్కాన్‌చేసి.. చాట్ చేస్తే చాలు 300పైగా సేవలు ఫోన్‌లోనే పొందవచ్చు. విజయవాడ జీజీహెచ్‌లో ఓపీ కౌంటర్‌కు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండేలా.. అవగాహన కోసం ఏర్పాటుచేసిన ఈ వాట్సప్ గవర్నెన్స్ క్యూఆర్ కోడ్ చిరిగిపోయినా పట్టించుకునే వారేలేరు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చిత్రాలతో ఏర్పాటుచేసిన ఈబోర్డు నిరుపయోగంగా ఇలా చిరిగి కనిపిస్తున్నా పట్టించుకోకపోతే ఎలా..?

– ఈనాడు, అమరావతి

పీజీ మెడికల్ యాజమాన్య సీట్లకు దరఖాస్తులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025- 26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నీట్ పీజీ అర్హత, ఈ ఏడాది జులై 31 లోపు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులు 23న మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పారు. అపరాధ రుసుము రూ.10వేలతో 24న ఉదయం 11 నుంచి 26న ఉదయం 11 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 50 పర్సంటైల్ (276 మార్కులు కటాఫ్ మార్కులు), జనరల్- పీడబ్ల్యూబీడీ వారు 45 పర్సంటైల్ (255 కటాఫ్ మార్కులు), ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ కేటగిరీ అభ్యర్థులు 40 పర్సంటైల్ (235 కటాఫ్ మార్కులు) ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సందేహాలుంటే 89787-80501, సాంకేతిక సమస్యలుంటే 90007-80707 నివృతి చేసుకోవచ్చని, యాజమాన్య కోటాలో 777 పీజీ మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our VIJAYAWADA BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT D	50	50,000	25,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
FT WA	40	2,50,000	1,00,00,000
FT Z	40	25,000	10,00,000
FT N	40	12,500	5,00,000
FT B	40	5,000	2,00,000
TT X	30	20,000	6,00,000

Please contact Branch Manager Mr. K.KRISHNA MOHAN, for further details.
Mobile No. 80082-23481, Landline: 0866-2433270, 2432870

సైకిల్ ఇష్టమే.. సవారీ కష్టమే

★ విజయవాడ, మచిలీపట్నం అత్యంత అనుకూలం
★ ఒక్క ట్రాక్ కూడా లేక తొక్కేందుకు వెనుకడుగు

సైకిల్ తొక్కేందుకు అత్యంత అనువైన నగరాలు.. విజయవాడ, మచిలీపట్నం. రెండు నగరాల్లో ఎక్కడా ఎత్తుపల్లాలు, కొండలు, గుట్టల మీదుగా రహదారులు లేవు. నగరం ఆ చివరి నుంచి ఈ చివరికి హాయిగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిపోవచ్చు. కానీ రెండు నగరాల్లోనూ కనీసం ఒక్కటంటే ఒక్క సైకిల్ ట్రాక్ కూడా లేదు. అందుకే నగరవాసులు సైకిల్ తొక్కాలని ఉండి.. కొనుగోలు చేస్తున్నా.. రహదారులపైకి ధైర్యంగా వచ్చే పరిస్థితి లేదు. ఎటు నుంచి ఏ వాహనం మీదకు దూసుకొస్తుందో తెలియదు.

15 ఏళ్ల కిందటే..

విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు ఉన్న సమయంలో బెంజిసర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ఓ సైకిల్ ట్రాక్‌ను 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. ఉచితంగా కొన్ని సైకిళ్లను ఉంచారు. ప్రతి శనివారం సైక్లింగ్‌ను ఉదయాన్నే నిర్వహించారు. జనంలోనూ స్పందన విపరీతంగా వచ్చింది. కమిషనర్ బదిలీపై వెళ్లడంతో తర్వాత అధికారులు పట్టించుకోక ట్రాక్ గాలిలో కలిసిపోయింది. తర్వాత బీఆర్‌టీఎస్ రహదారిపైనా ట్రాక్‌కు ప్రణాళికలు సిద్ధం చేసినా అమలు జరగలేదు.

గంట చాలు..

విజయవాడ, మచిలీపట్నం.. వైశాల్యంలో రెండూ చిన్న నగరాలే. ఆ చివరి నుంచి ఈ చివరికి.. సైకిల్‌పై సరిగ్గా గంటలోపే వెళ్లిపోయేంత దూరంలోనే అన్ని ప్రాంతాలూ ఉన్నాయి. సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు డబ్బులు ఆదా అవుతాయి. అందుకే పాఠశాలలు, కార్యాలయాల్లో కచ్చితంగా సైకిల్‌ను ప్రోత్సహించాలంటూ చాలాకాలంగా విజయవాడ బైసైకిల్ అసోసియేషన్ సహా పలు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ఆరోగ్య ప్రయోజనం

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సైకిల్‌ను కొనుగోలు చేయండి. రోజూ కనీసం గంటసేపు సైకిల్ తొక్కడం వల్ల శారీరకంగా ఎంతో ప్రయోజనం' అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం(ఎస్‌పీఎఫ్) విజయవాడ రీజియన్‌కు కమాండెంట్‌గా పనిచేసిన కె.ఎన్.రావు.. పదేళ్ల కిందటే ఓ ఉద్యమంలా సైకిల్ గురించి నగరంలో ప్రచారం చేశారు. అప్పట్లో ఎస్‌పీఎఫ్ సిబ్బందికి 3వేల సైకిళ్లను కొనుగోలు చేసి ఇచ్చారు. దీనివల్ల అనూహ్యంగా సిబ్బంది వైద్య ఖర్చుల బిల్లు ఏడాదికి రూ.20 లక్షలకు పైగా తగ్గిందని స్వయంగా కె.ఎన్.రావు ప్రకటించారు. సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలకు ఇదో ప్రత్యక్ష నిదర్శనం.

- ఈనాడు, అమరావతి

ఒక్క క్లిక్‌తో..

విద్యుత్తు బిల్లుల చెల్లింపు!

✸ గ్రూప్ పేమెంట్ ఫీచర్‌తో వెసులుబాటు
✸ అందుబాటులోకి తెచ్చిన సీపీడీసీఎల్...

'ఉద్యోగరీత్యా రవి విజయవాడలో స్థిరపడ్డాడు. తల్లిదండ్రులు గుంటూరు జిల్లాలో ఉంటారు. వారి ఇంటి కరెంటు బిల్లు ప్రతి నెలా రవి చెల్లిస్తుంటాడు. గత నెలలో తాను ఉంటున్న విజయవాడలో ఇంటి బిల్లు చెల్లించాడు. ఊళ్లోని బిల్లును చెల్లించడం మర్చిపోయాడు. గడువు తేదీ దాటాక గుర్తురావడంతో.. ఆ తర్వాత జరిమానాతో చెల్లించాల్సి వచ్చింది.'

తాజాగా తెచ్చిన కొత్త ఫీచర్‌తో ఈ సమస్యలకు సీపీడీసీఎల్ చెక్ పెట్టింది. ఒకటి కంటే ఎక్కువ సర్వీసుల బిల్లులు చెల్లించే వారికి ఇది ఉపకరించనుంది. దీనిని ఇటీవల డిస్కమ్ లోని ఐటీ విభాగం ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్‌ను ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యుత్తు వినియోగదారులు వాడుకోవచ్చు. ఇందుకు apcpdcl.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈ సేవను సద్వినియోగం చేసుకోవచ్చు.

☆ ముందుగా వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. హోమ్ పేజీలో కనిపించే 'గ్రూప్ సర్వీసెస్ పేమెంట్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత మొబైల్ నంబరు నమోదు చేస్తే.. ఓటీపీ వస్తుంది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆపై లాగిన్ అనే టాబ్‌పై క్లిక్ చేయాలి.

ఒకేసారి.. 20



☆ తర్వాత వచ్చే ఎడిట్ స్క్రీన్‌లో కనెక్షన్... 13 అంకెల సర్వీసు నెంబరు, మెయిల్ ఐడీ నమోదు చేయాలి. గరిష్ఠంగా 20 సర్వీసులు నమోదు చేసుకోవచ్చు. ఎక్కువుంటే.. సీపీడీసీఎల్‌కు మెయిల్‌లో విన్నవించాలి.

☆ సర్వీసు నంబర్లు నమోదు చేశాక.. ఒకేచోట వాటి సమాచారమంతా కనిపిస్తుంది. వినియోగదారు పేరు, బిల్లు తేదీ, గడువు తేదీ, డిస్‌కనెక్షన్ గడువు, కనెక్షన్ కేటగిరీ వస్తాయి. సర్వీసు నెంబర్లను సెలెక్ట్ చేసుకుంటే.. వాటి బిల్లు కింద కనిపిస్తుంది. pay the- group bill అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

☆ తర్వాత పేమెంట్ గేట్‌వేలోకి వెళ్లాక.. బిల్లును క్రెడిట్, డెబిట్ కార్డులు, వ్యాలెట్, క్యూఆర్, యూపీఐ, గూగుల్ పే ద్వారా చెల్లించే వీలుంది. ఇలా ఒక్క క్లిక్‌తో చెల్లించవచ్చు.

ఈనాడు, అమరావతి

దిమ్మెకో లెక్క.. దశదిశా పక్కా!

కలెక్టరేట్ ఆవరణలో ఈ దిమ్మెకు.. ప్రత్యేక స్థానం ఉంది. 1910లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం జరిపిన దేశవ్యాప్త గ్రేట్ ట్రిగ్నోమెట్రికల్ భూసర్వేకు గుర్తుగా 'ప్రామాణిక బెంచ్ మార్క్'' పేరుతో దీనిని నిర్మించారు. ఇది... భూమి ఉపరితలంపై స్థిర బిందువులు, సముద్ర మట్టం ఎత్తులను కచ్చితంగా తెలపటానికి ఉపకరిస్తుంది. దీని ఆధారంగా భూమి కొలతలు, పర్వతాలు, గుట్టల ఎత్తులను కొలిచేవారు. కచ్చితమైన మ్యాపింగ్, సర్వేయింగ్ నిర్ధారణకు ఇది ముఖ్య రిఫరెన్స్ పాయింట్. ఇదేతరుణంలో జియోస్పేషియల్ డైరెక్టరేట్, హైదరాబాద్ వారు.. జియోస్పేషియల్ డేటా సమగ్రతకు సంకల్పించారు.. వీటి పరిరక్షణ బాధ్యత చేపట్టి... ఆవశ్యకత తెలిసేలా బోర్డులను పెట్టారు. - **ఈనాడు, అమరావతి**

పది విద్యార్థులూ.. వివరాలు సరిచేసుకోవాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : మార్చి 2026లో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు యుడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని, పాఠశాల రికార్డు ప్రకారం వాటిని విద్యార్థుల తల్లిదండ్రులు సరి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. తర్వాత తప్పులు లేకుండా ప్రధానోపాధ్యాయుడు ఆ వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థి వివరాలు తప్పుగా నమోదై ఉంటే ఆధార్, అపార్ ఐడీ, యు డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో తప్పులు ఉంటే సరి చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఇప్పుడే జాగ్రత్తగా నమోదు చేయాలని, ఇప్పుడు సరి చేసుకోకపోతే పదో తరగతి ధ్రువపత్రాల్లో ఆ వివరాలే వస్తాయని తెలిపారు.

ఆమోదించాలంటే.. చేయి తడపాల్సిందే

✦ ఆదాయానికి గండి కొడుతున్న కొందరు వైకాపా సభ్యులు
✦ దుకాణాల లీజులు పొడిగించేందుకు ససేమిరా

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ స్థాయీ సంఘం అవినీతి కూపంగా మారింది. కొందరు వైకాపా సభ్యులు కాసులు తీసుకోనిదే దుకాణాల లీజులు, అద్దె పెంపు ప్రతిపాదనలు ఆమోదించడం లేదు. ఫలితంగా వివిధ ప్రతిపాదనలు ఒకటికి రెండుసార్లు వాయిదా పడుతున్నాయి.

✦ కార్పొరేషన్‌కు చెందిన 61 సముదాయాల్లో 3,540 దుకాణాలు ఉన్నాయి. పలు దుకాణాల లీజుకాలం ముగిసిపోగా, అద్దె పెంచి తిరిగి 3 ఏళ్లకు పొడిగించాల్సి ఉంటుంది. అదనపు ఆదాయం సమకూరే ప్రతిపాదనలైనందున ఆమోదించాలని అధికారులు కోరినా, పలు సాకులతో వాయిదాలు వేస్తున్నారు. ఛైర్‌పర్సన్ హోదాలో మేయర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశాల్లో ఆదాయానికి గండికొట్టే నిర్ణయాలపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

✦ కొందరు స్థాయీ సంఘ సభ్యులను వ్యాపారులు కలిసి ఎంతోకొంత ముట్టజెప్పాల్సి వస్తోంది. నిరాకరించిన పక్షంలో లీజుల పొడిగింపు, అద్దెల పెంపు ప్రతిపాదనలు వాయిదాలు వేస్తున్నారు. చట్టప్రకారం 1-2 సమావేశాల్లోనే ప్రతిపాదనలు ఆమోదించాలి. కొన్నిసార్లు మేయర్ చెప్పినా.. వినడం లేదు.

నాలుగు నెలలుగా నిలిచిన ఆదాయం

వారి తీరుతో కార్పొరేషన్ అదనపు ఆదాయానికి గండిపడుతోంది. లీజు, అద్దె పెంచని కారణంగా 216 దుకాణాలపై దాదాపు 4 నెలలుగా అదనపు ఆదాయం రాలేదు. వీటిపై సగటున రూ.1.46 కోట్ల అద్దెల కింద రావాల్సి ఉండగా, 33 1/3 శాతం పెంపుతో అదనంగా రూ.48.81 లక్షలు వస్తుంది. కానీ సభ్యుల వైఖరితో అదనపు ఆదాయానికి గండి పడుతోంది.

ఇవీ ఉదాహరణలు..

✪ హోల్‌సేల్ ఫ్లవర్ మార్కెట్లో 78 దుకాణాలు, జక్కంపూడి కాలనీ కాంప్లెక్సు 5 దుకాణాల లీజు కాలం ముగిసింది. తిరిగి పొడిగింపు, 33 1/3 శాతం అద్దె పెంపు ప్రతిపాదన సెప్టెంబరు 19న స్థాయీ సంఘం ముందు ప్రతిపాదన ఉంచగా వాయిదా వేశారు. అక్టోబరు 23న తిరిగి ప్రవేశపెట్టినా మళ్లీ వాయిదా వేశారు.

✪ బ్రహ్మానందరెడ్డి కాంప్లెక్సులోని 18 దుకాణాలు, దర్శిపేట వెజిటబుల్ మార్కెట్ 16 దుకాణాలు, ఇందిరాగాంధీ మున్సిపల్ కాంప్లెక్సు 10, డ్వాక్రా బజార్, ఏఆర్ కాలనీ కాంప్లెక్సు 3 పటమట వీఎంసీ కాంప్లెక్సు, బొబ్బా వెంకటేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్సుల 4 దుకాణాలు, దర్శిపేట చేపల మార్కెట్ 53 దుకాణాల లీజు పొడిగింపు, అద్దెపెంపు రెండుసార్లు వాయిదా వేశారు.

✪ గరిమెళ్ల సత్యనారాయణ కాంప్లెక్సు 7 దుకాణాలు, సీవీఆర్ కాంప్లెక్సు 26 దుకాణాల లీజు, అద్దె పెంపు ప్రతిపాదనలను వాయిదా వేసి సభ్యులు తమ వైఖరి చాటుకున్నారు.

స్వర్ణమయం.. చేసేదెప్పుడో..

పూర్తికాని దుర్గగుడి స్వర్ణ తాపడం పనులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం స్వర్ణతాపడం పనులు రెండు దశాబ్దాలుగా నిలిచిపోయాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రాజధాని నగరంలోని దుర్గగుడి కీలకంగా మారింది. కూటమి ప్రభుత్వం దుర్గగుడి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. గడిచిన వైకాపా పాలనలో అమరావతి రాజధానితో పాటు దుర్గగుడి అభివృద్ధి సైతం అటకెక్కింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాశ్వత ప్రాతిపదికన దేవస్థానం అభివృద్ధి చేయడంపై దృష్టిపెట్టింది. స్వర్ణ తాపడం పనులు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్ణయించింది.

★ విరాళాల తరహాలో దాతలు ఇచ్చిన విరాళాలతోపాటు దేవస్థానం వద్ద ఇప్పటి వరకు ఉన్న బంగారాన్ని కూడా దీనికి వినియోగించాలని నిర్ణయించారు. 20 ఏళ్ల కిందట దుర్గగుడి ప్రధాన ఆలయం విమాన గోపురానికి 80 కిలోల బంగారాన్ని దేవస్థానం అధికారులు వినియోగించారు. అయితే తరువాత వచ్చిన అధికారులు స్వర్ణతాపడం నిమిత్తం వచ్చిన బంగారంతోపాటు హుండీల్లో వేసిన చిన్న బంగారు వస్తువులు, హారాలు, కిరీటాలు, అభయ హస్తాలు వంటివి భద్రత సమస్యలను దృష్టిలో ఉంచుకొని 92 కిలోలను కరిగించి గోల్డ్ బాండ్లుగా మార్చారు. ప్రస్తుతం దేవస్థానం వద్ద పరిమితంగా ఉన్న బంగారంతో పాటు దాతల సహకారంతో మల్లేశ్వరాలయం స్వర్ణ తాపడం చేసేందుకు 15 కిలోలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

☛ నానోటెక్నాలజీ సహకారంతో ఆలయ విమాన గోపుర తాపడం పనులను పిల్లినంత ఎత్తున బంగారంతో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో దేవస్థానం అధికారులు బంగారు తాపడం పనులు పూర్తి చేయడానికి వెనకడుగు వేయడంతో ఆ పనిని తిరిగి చేపట్టి విమాన గోపురం వరకు పూర్తి చేశారు.

పాలకమండలి సమావేశంలో చర్చ

ఈనెల 7న నిర్వహించిన దుర్గగుడి పాలక మండలి సమావేశంలో దేవస్థానం అధికారులతోపాటు పాలకమండలి సభ్యులు కూడా దుర్గమ్మ ఆలయ ప్రధాన గోపురంతోపాటు మల్లేశ్వరాలయాన్ని కూడా స్వర్ణ తాపడం చేయాల్సిన అంశంపై చర్చించారు. పలువురు దాతలు స్వర్ణ రాజధాని నగరంలో ప్రధానమైన దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయం స్వర్ణకాంతులతో విరాజిల్లాలని ముందుకు వస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. దేవాదాయ శాఖ, పాలకమండలి సమన్వయంతో స్వర్ణతాపడం పనులను ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

భవానీలు సంతృప్తి చెందేలా అమ్మవారి దర్శనం

దీక్షల విరమణకు ఆరు లక్షల మంది వస్తారని అంచనా

సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్ తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తులు.. సంతృప్తి చెందేలా అమ్మవారి దర్శనభాగ్యం కల్పించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై దీక్షల విరమణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఈవో శీనానాయక్, సీపీ రాజశేఖరబాబు హాజరై మాట్లాడారు. గతేడాది విరమణ దీక్షకు 3.20 లక్షల మంది భక్తులు వచ్చారని.. ఈ ఏడాది ఆరు లక్షల మంది వస్తారని అంచనాగా తెలిపారు. 36 సెక్టార్లను ఏర్పాటు చేశారు. హోల్డింగ్ పాయింట్లు, కేశఖండనశాలలు, స్నాన ఘాట్లు, గిరిప్రదక్షిణ, క్యూలైన్లు, ఇరుముడుల సమర్పణ, హోమగుండం, లడ్డూ విక్రయ కేంద్రాల వద్ద పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఉచిత భోజన కేంద్రాలు ఉండాలని పేర్కొన్నారు. సుమారు పది వేల మంది భక్తులు కలశ జ్యోతులు సమర్పిస్తారని, తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్యూలైన్లలో షామియానాలు, కాలిబాట తివాచీలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు.

సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా.. నగరంలో 300లకు పైగా సీసీ కెమెరాలు, అలాగే డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామని అధికారులు తెలిపారు. క్లాక్ రూమ్‌ల సంఖ్య పెంపు, 14 లడ్డూల విక్రయ కేంద్రాలు, 850 మంది నాయీ బ్రాహ్మణులతో 24 గంటలు కేశఖండన కేంద్రం సేవలు కొనసాగేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 15 లక్షల మంచినీటి బాటిళ్లు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, ఏడీసీపీ జి.రామకృష్ణ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈఈలు జి.కోటేశ్వరరావు, పి.రాంబాబు, సహాయ ఇంజినీర్లు, పర్యవేక్షకులు, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

పునరుద్ధరణ పనుల్లో ప్రాధాన్యం ఇవ్వండి

సూర్యారావుపేట: ఉమ్మడి కృష్ణా జిల్లాలో చేపట్టిన వరద నష్ట నివారణ, పునరుద్ధరణ పనుల టెండర్లలో చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) జిల్లా ప్రతినిధులు కోరారు. మంగళవారం జలవనరుల శాఖ కార్యాలయంలో కృష్ణాడెల్టా చీఫ్ ఇంజినీర్ రాంబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి జిల్లాలో రూ.30కోట్ల విలువైన పనుల టెండర్లను ప్యాకేజీలుగా కాకుండా.. విడివిడిగా పిలవాలని విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న పనులకు టెండర్లను డివిజన్ స్థాయిలోనే ఖరారు చేయాలని, పారదర్శకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సబ్కా కృష్ణా అధ్యక్షుడు మండవ సాయి, కోశాధికారి వెంకటేశ్వరరాజు, సంయుక్త కార్యదర్శి భూపతిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు వీరంకి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగం.. ఆపై నిర్లక్ష్యం

లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు ● ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు

నందిగామ, న్యూస్‌టుడే

ప్రమాదం ధాటికి నుజ్జయిన సీట్లు

దెబ్బతిన్న లారీ

వరుసగా ప్రైవేట్ బస్సులు ప్రమాదాలకు గురవుతున్నా డ్రైవర్లలో మార్పు రావటం లేదు. ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి అతివేగం, నిర్లక్ష్యం డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కె.కావేరీ ట్రావెల్స్ బస్సు నందిగామ మండలం అనాసాగరం వద్ద లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. అదృష్టం వల్ల ప్రాణాలతో బయటపడ్డారు.

★ విజయవాడ వైపు వెళ్తున్న లారీని అనాసాగరం పై వంతెన వద్ద ఓవర్ టేక్ చేసేందుకు బస్సు డ్రైవర్ ప్రయత్నిస్తుండగా లారీని ఢీకొట్టింది. ఓవర్‌టేక్ చేసేందుకు హైవేపై తగినంత స్థలం లేక పక్కన రోడ్డు మధ్యలో డివైడర్ ఉండటంతో బస్సు డ్రైవర్ లారీని ఢీ కొట్టుకుంటూ ముందుకెళ్లి బ్రేకు వేశాడు. అదే డివైడర్‌ను ఢీకొట్టి ఉంటే బస్సు పల్టీ కొడితే ప్రమాద తీవ్రత ఎక్కువై ప్రాణహాని జరిగేది.

నలుగురికి తీవ్రగాయాలు

నందిగామ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలు కాగా వీరిలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 35 మందితో బయలుదేరగా అనాసాగరం వద్దకు వచ్చే సరికి 25 మంది ఉన్నారు. ప్రమాదంతో ప్రయాణికులంతా వణికిపోయారు. కాపాడాలంటూ కేకలు వేశారు.

బస్సు సామర్థ్యం సరిగానే ఉంది

ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సును నందిగామ ప్రాంతీయ రవాణా శాఖ అధికారిణి పద్మావతి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పూర్ణిమ పరిశీలించారు. బస్సు నడిచే కండిషన్ బాగానే ఉందని నిర్ధారించారు. బస్సు బ్రేకులు, రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగా ఉన్నట్లు గుర్తించారు. హైవేపై తగినంత స్థలం లేకపోయినా లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించడం వల్లే ప్రమాదం జరిగిందని ఎంవీఐ పూర్ణిమ తెలిపారు.

పెండింగ్ రైల్వే సమస్యలపై చర్చ

సోనాకియాకు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ చిన్ని

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలు పరిష్కరించాలని డీఆర్ఎం మోహిత్ సోనాకియాను ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. డీఆర్ఎంగా మోహిత్ సోనాకియా బాధ్యతలు చేపట్టిన తర్వాత మంగళవారం మొదటి సారి కలిసిన ఎంపీ చిన్ని ఆయనను అభినందించారు. కొండపల్లి బొమ్మ బహూకరించారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు, కొండపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారాల విస్తరణ పనులతో పాటు లెవల్ క్రాసింగ్ గేట్ల అంశంపై చర్చించారు. వాంబే కాలనీ మధురానగర్ మధ్య ఎల్.హెచ్.ఎస్. నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగించేందుకు కె.ఎల్.రావు బ్రిడ్జ్ (ఎల్హెచ్ఎస్) వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని కోరారు. ఆర్.ఓ.బి, ఆర్.యు.బి నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన లెవెల్ క్రాసింగ్ నంబర్లు 316, 147, 148, 8 నిర్మాణానికి టెండర్లు త్వరగా పిలిచి ప్రాజెక్ట్‌లను పట్టాలెక్కించాలని కోరారు. ఎంపీ అభ్యర్థనలపై డీఆర్ఎం మోహిత్ సోనాకియా సానుకూలంగా స్పందించారు. డీసీఎం కమలాకర్ పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో జిల్లాను ఆదర్శంగా నిలుపుదాం

పాయకాపురం, న్యూస్‌టుడే : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో పారిశ్రామిక అభివృద్ధిలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక అనుమతులు, ప్రోత్సాహకాలు, పథకాల అమలుపై దాదాపు రూ.69 వేల కోట్లతో 190 ఎంవోయూలు కుదిరాయని తెలిపారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో పెట్టుబడిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర సాకారంలో పారిశ్రామిక అభివృద్ధి కీలకమని చెప్పారు. ఇటీవల విజయవాడ సెంట్రల్, మైలవరం, నియోజవర్గాలలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులతో పాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబరు 17 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 6037 దరఖాస్తులు రాగా, 5,949 దరఖాస్తులు పరిష్కారమయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీపీవో పి.లావణ్యకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ కె.ప్రియాంక, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రమే లక్ష్యం

ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే రామ్మోహన్, నగేశ్ తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రాష్ట్రం, దేశాన్ని మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలనేది ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని ఫాదర్ దేవయ్య ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదన్న సంకల్పంతో ఈగల్ వ్యవస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేశామని తెలిపారు. తద్వారా మత్తు పదార్థాలు ఉత్తరాంధ్రలో అధికంగా సాగుచేసే ప్రాంతాలను డ్రోన్ల ద్వారా గుర్తించి గంజాయి పంటను నిర్వీర్యం చేశామని చెప్పారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి పెంచితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. గంజాయిని లిక్విడ్, చాక్లెట్, సిగరెట్ రూపాల్లో తరలిస్తున్నారని విద్యాసంస్థల పరిసరాల్లో మాదక ద్రవ్యాలను గుర్తించి.. వాటిని సరఫరా చేసిన వారికి కఠిన శిక్షలు అమలయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఏ దేశానికైనా తిరుగులేని సంపద యువత అని, అలాంటి యువశక్తి మాదక ద్రవ్యాల బారిన పడకుండా నశాముక్త భారత్ అభియాన్ ద్వారా ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపట్టి.. యువతను రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈగల్ ఎస్పీ కేఎస్ నగేశ్ మాట్లాడుతూ గంజాయి పండించడాన్ని పూర్తిగా అరికట్టామని.. దీని ఫలితమే నేడు జీరో కల్టివేషన్ రాష్ట్రంగా చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిసేబుల్డ్ అండ్ నశాముక్త భారత్ అభియాన్ డైరెక్టర్ రవి ప్రకాష్‌రెడ్డి, నశాముక్త భారత్ రాష్ట్ర సమన్వయకర్త ఉమా రాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి విద్యార్థులతో ఆంధ్ర రాష్ట్రాన్ని మాదక ద్రవ్య రహితంగా మార్చడానికి దృఢమైన సంకల్పం తీసుకుంటున్నామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

ఎన్టీఆర్ కమిషనరేట్‌లో ఆరోగ్య సురక్ష

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయశేఖర్

విజయవాడ నేరవార్తలు: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. అత్యవసర సమయాల్లో చేయాల్సిన ప్రథమ చికిత్సపై పోలీస్ సిబ్బందికి వైద్య నిపుణులు వివరించారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగినప్పుడు అందరి కంటే ముందుగా చేరుకునేది పోలీసులు అని, అందుకే ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ కోలా విజయ శేఖర్.. చికిత్స ఎలా చేయాలి? సీపీఆర్ విధానం, అధిక రక్తస్రావం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావు, ఏఆర్ ఏసీపీ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 650 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

పాస్టర్లంతా ఐక్యంగా ఉండాలి

ఫెలోషిప్ లోగో ఆవిష్కరిస్తున్న జయప్రకాష్, థామస్, ఇన్నయ్య, శ్రీనివాసరావు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పాస్టర్లంతా ఐక్యంగా ఉండాలని ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ గంజికుంట జయప్రకాష్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని పాస్టర్లందరూ కలిసి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్‌గా ఏర్పడగా, మంగళవారం రాత్రి విజయవాడలోని కందుకూరి కల్యాణ మండపంలో దీన్ని ప్రారంభించారు. దీనికి రాజమహేంద్రవరం 'దహించు అగ్ని' మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు థామస్ ముఖ్య అతిథిగా పాల్గొని దైవసందేశం అందించారు. ఫెలోషిప్ అధ్యక్షుడు జయప్రకాష్ మాట్లాడుతూ.. ఈ ఫెలోషిప్ రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఉండే స్థానిక ఫెలోషిప్‌లతో కలిసి పనిచేస్తుందన్నారు. విశిష్ట అతిథి ఫాదర్ బెల్లంకొండ ఇన్నయ్య మాట్లాడుతూ.. అర్హత కలిగిన పాస్టర్లకు ఇచ్చే మ్యారేజ్ లైసెన్స్ విషయంలో దళారీల వ్యవస్థ లేకుండా ఉచితంగా అందించేందుకు ఫెలోషిప్ కృషి చేస్తుందన్నారు. మంచి పాలన సాగించేలా సీఎం చంద్రబాబు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని పాస్టర్లకు సూచించారు. పాస్టర్లందరికీ ఫెలోషిప్ నుంచి పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్ తెలిపారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వడ్లమూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాస్టర్లపై దాడులు జరిగినప్పుడు ఫెలోషిప్ వెంటనే స్పందిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు పి.సుందరరావు, పి.నతానియేల్, కార్యదర్శి ఎ.యెహోషువ, కోశాధికారి కె.మోజెస్, ముఖ్య సలహాదారుడు ఎ.మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

'డాక్టర్స్ అసోసియేషన్‌కు గుర్తింపు ఏది?'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద సంఘంగా ఉన్న తమకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గుర్తింపు కోసం ప్రభుత్వానికి ఎన్ని సార్లు వినతి పత్రాలు సమర్పించినా.. ఎలాంటి స్పందన లేదన్నారు. బకాయిలు చెల్లించాలని కోరారు. డాక్టర్లకు ఆర్థిక బకాయిలు ఆపవద్దని సుప్రీం కోర్టు సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. 1800 మంది వరకు తమ సంఘంలో సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్, జ్వలిత, పి.అనిల్‌కుమార్, సరళ, పర్వీన్, గిరీష్‌బాబు, స్వర్ణ, స్వరూప్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

'హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సీబీఐ విచారణ చేపట్టాల్సిందే'

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా మతం ముసుగులో ఒక పథకం ప్రకారం మారణహోమం జరుగుతున్నా.. మోదీ ప్రభుత్వం మౌనం ప్రదర్శించడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా మంగళవారం సాయంత్రం విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంవద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, మైనార్టీలను చిన్న చూపు చూడడం సరికాదన్నారు. దాడులకు పాల్పడుతున్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా.. అణగారిన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో కులగణన చేపట్టి ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కగర్ పేరుతో అమాయక గిరిజనులను కాల్చివేస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విజయవాడలో పట్టుబడిన మావోయిస్టులను వెంటనే న్యాయస్థానంలో హాజరుపరచాలని కోరారు. దేశంలో పెరిగిపోతున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ రాబోయే రోజుల్లో అన్ని విపక్షాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, పెనుమత్స దుర్గాభవానీ, పంచదార్ల దుర్గాంబ, లంకా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె.రామకృష్ణ. పక్కన కోటేశ్వరరావు, విల్సన్, శంకర్ తదితరులు

కమీషన్ ఇస్తామని కన్సల్టెన్సీకి టోకరా..

పటమట, న్యూస్‌టుడే : కమీషన్ ఎక్కువ ఇస్తామంటూ ఏకంగా కన్సల్టెన్సీకే రూ.30 లక్షలు టోకరా పెట్టాడు ఘరానా మోసగాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం. . పటమటకు చెందిన శరత్‌చంద్ర, శ్రీలక్ష్మి దంపతులు గ్లోబల్ అడ్వాంటేజ్ అనే ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థులకు వీసా ప్రాసెస్‌తో పాటు రుణాలు ఇప్పిస్తుంటారు. దానికి కొంత మొత్తంలో కమీషన్ తీసుకుంటారు. ఈ క్రమంలో వారికి సమీప బంధువైన బోడ్డుపల్లి అభినందన్ వారి వద్దకు వచ్చి తాను పని చేస్తున్న బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. తనకు తెలిసిన ఇద్దరి ద్వారా విద్యార్థులను విదేశాలకు పంపితే విద్యార్థులు చెల్లించే ఫీజులో 5 శాతం ఇస్తామని నమ్మబలికాడు. దీంతో పలువురి విద్యార్థులకు సంబంధించి ముందస్తుగా రూ.30 లక్షలను అభినందన్ తెలిపిన ఖాతాలకు వారు పంపారు. నెల తర్వాత విదేశాల్లోని విద్యార్థులు తమ ఫీజులు చెల్లించలేదని శ్రీలక్ష్మికి తెలిపారు. దీంతో అభినందన్‌ను అడుగగా తనకు సంబంధం లేదని అతను చెప్పాడు. విద్యార్థులు ఒత్తిడి చేయగా శరత్‌చంద్ర దంపతులు ఆ నగదు చెల్లించారు. దీనిపై శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు అభినందన్‌తో పాటు మరో ఇద్దరిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ నల్లు ధరణీకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శివకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డాక్టర్ ప్రశాంత్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఆయుర్వేద వైద్యులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. విజయవాడలోని ఏసీబీ కోర్టులో మంగళవారం విచారణకు వచ్చింది. వీటిని తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 21కి న్యాయాధికారి వాయిదా వేశారు. జైలులో వసతులు కల్పించాలని చెవిరెడ్డి పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ.. బుధవారానికి కోర్టు వాయిదా పడింది. ఇదే కారాగారంలో రిమాండ్‌లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు మంగళవారం బెయిల్ పిటిషన్లు వేశారు. ఇవి నోటీసుల కోసం వాయిదా పడ్డాయి.

అసభ్యకర పోస్టుల కేసులో విజయ్‌భాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్...

ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో మహిళలు, కూటమి నేతలు, న్యాయమూర్తులే లక్ష్యంగా అసభ్య పోస్టులు పెట్టి జైల్లో ఉన్న మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డిని వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్, నిందితుడి బెయిల్ పిటిషన్ బుధవారానికి వాయిదా పడ్డాయి. విజయ్‌భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన క్రమంలో పోలీసులతో దురుసుగా వ్యవహరించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. డిసెంబరు 2లోగా నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని న్యాయాధికారి ఆదేశాలు ఇచ్చారు. నిందితుడు నెల్లూరు కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. పోలీసులపై దాడి చేసిన కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న విజయ్‌భాస్కర్‌రెడ్డి సోదరుడు ఓబుల్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తయింది. ఈ నెల 24న దీనిపై కోర్టు తీర్పు వెలువరించనుంది.

ప్రకటన

మా క్లయింట్ ప్రస్తుతం యన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, పటమటలో కాపురస్తులు షేక్ గాలిబ్ సాహెబ్ గారి కుమారుడు షేక్ బాషా గారి సంజాయిషీ పొంది తెలియజేయునదేమనగా...

మా క్లయింటు దిగువ షెడ్యూలాస్థిని విజయవాడ, ఇబ్రహీంపట్నం కాపురస్తులు దేవరపల్లి శ్రీధర్ గారి భార్య రావినూతల మాలతీ గారు నుండి కొనుగోలు చేయుటకు నిశ్చయించుకుని కొంత సొమ్ము బయానాగా యిచ్చి విక్రయ ఖరారుపరచుకున్నారు.

సదరాస్తిపై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు గాని, క్లయిములు గాని, కోర్టు అటాచ్‌మెంట్లు గాని, తనఖాలు గాని, మనోవర్తి భాగలబ్ధి తగాయిదాలు గాని, ఇంజక్షన్లు గాని ఉన్న యెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోగా తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు గడువులోపు ఏ విధమైన అభ్యంతరములు రానియెడల షెడ్యూలు ఆస్థిని నిర్వివాద ఆస్థిగా భావించి నా క్లయింటు రిజిస్ట్రేషన్ పొందగలరు. గడువు దరిమిలా వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూల్: కృష్ణా జిల్లా, శ్రీ పటమట సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా, వై.యస్.ఆర్ తాడిగడప మున్సిపాల్టి ఏరియాలో చేరిన యనమలకుదురు రీ సర్వే నెం.46/1 రు, సమీప డోర్ నెం.20-1092/1 రు చ॥గ॥ 291 లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి ఏ.సి.సి రేకులు యింటికి హద్దులు: తూర్పు: విశ్వనాథపల్లి బుల్లి వెంకటేశ్వరరావు గారు బోలెం వినయ్ బాబు గారి ఆస్థి-అ॥ 54.0 లు, దక్షిణం: అ॥ 30 లు వెడల్పు గల జాయింటు రోడ్డు-అ॥ 48.6 లు, పడమర: జక్కుల ఆంజనేయులు గారి ఆస్థి-అ॥ 54.0 లు, ఉత్తరం: కృష్ణా కరకట్ట రోడ్డు (విజయవాడ-అవనిగడ్డ రోడ్డు)-అ॥ 48.6 లు.

SK. పర్వీన్
అడ్వకేట్
59ఎ-1-6/2, కె.పి.నగర్, మాతా టవర్స్ ప్రక్కన,
స్టెల్లా కాలేజి రోడ్, విజయవాడ. సెల్: 9030706786

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

TENDER NOTIFICATION

'e' Konugolu Tender-cum-Auction Notice

Rc.N3-119292/2025/VMC/2025-26, Dt. 18-11-2025

RAHIMAN PARK SHOPS:

S. No.	Name of the work	No. of call	Extent in Sft. per each Shop Room	Goodwill fixed by this office (per year) Rs.	Payable EMD Rs.	Monthly Rent Rs.
1.	Leasing of Shop Room Nos. 1, 3, 5 & 6 (for General Category)	1st call	92.4	3,03,000/-	75,800/-	8,422/-
2.	Leasing of Shop Room Nos. 2 & 7 (for SC Category)	1st call	92.4	3,03,000/-	75,800/-	231/-
3.	Leasing of Shop Room Nos. 10 (for ST Category)	1st call	92.4	3,03,000/-	75,800/-	231/-

Contact details: VMC Circle-II Office, Estate Section, Satyanarayana Puram, Vijayawada.

Further details can be seen @ https://konugolu.ap.gov.in

Download of bid documents starts from - From 19-11-2025 16.00 Hrs to 03-12-2025 up to 17.00 Hrs

Date and time for uploading documents/ Pre - Bid EMD - 03-12-2025 up to 17.00 Hrs

E-auction Date & Time for Sl.No. 1, 2 &3 - From 15.00 Hrs. to 16.00 Hrs. on 05-12-2025

Note: The Commissioner, VMC has full authority to change the Tender date, time, place and also accept / reject the tenders.

Sd/- ESTATE OFFICER

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

FOR SALE

ఏలూరు నడిబొడ్డులో బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, మెయిన్‌బజార్ దగ్గర్లో GNT రోడ్, పవర్‌పేట నందు అక్షయ లాడ్జి అమ్మకమునకు కలదు. Cont: 98483 55649.

BUILDING CONSTRUCTION

ARCHITECT & ENGINEERS

Contact For Building Plan Approvals & BPS, LRS Plans of AP CRDA Vijayawada Municipal Corporation. ✆ 83747 33456

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూపు, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/వంట బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

FLAT FOR SALE

కాసా TVS, అశోక్‌నగర్ బందరు రోడ్డుకి ప్రక్కన నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి. ✆ 76800 70510.

PLOT FOR SALE

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

కేసరపల్లి - మేధా IT పార్క్ సమీపంలో 2100 చ॥గ॥ లేఅవుట్ స్థలం అమ్మకం. 60 అ॥ రోడ్, IT కంపెనీలు, కమర్షియల్‌కు, ఆఫీస్‌లకు అనుకూలమైనది. ✆ 70366 62888 ✆ 89780 66103

JOBS

Wanted Computer Hardware, Printer Engineers for VLMS IT Solutions. Bhavanipuram, www.vlms.in 98488 18090, 97012 27778.

అలంకార్ థియేటర్ దగ్గర సైట్‌కి సె.గార్డ్స్, 12 గం. డ్యూటీ, జీతం: 15K & తుళ్ళూరులో సె.సూ.వైజర్స్-3 (ఎకామిడేషన్ ఫ్రీ) కావలెను. ✆ 93911 11702.

KOTAK నూతన బ్యాంక్ నందు పనిచేయుటకు Rtd,VRS,టీచర్స్ మరియు గృహిణులు కావలెను Q: SSC To P.G Age: 35& Above. ✆ 94935 75370

ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆఫీసులో పనిచేయుటకు ITI CIVIL, Diploma Civil, B.T Civil (Auto CAD Civil)లో అనుభవం ఉన్న Male కావలెను. ✆ 93973 41745

గొల్లపూడి కమర్షియల్ కాంప్లెక్స్‌లో హోల్‌సేల్ డ్రైఫ్రూట్స్ స్టోర్స్ నందు Tally నాలెడ్జి అనుభవం గల అకౌంటెంట్ కావలెను. (విజయవాడ వారికి ప్రాధాన్యత) ✆ 90524 87777.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు

● తిరువూరు ● మైలవరం

ఉపకరణాల నిర్ధారణ శిబిరం నేడు

మైలవరం : సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని దివ్యాంగులకు కావాల్సిన ఉచిత ఉపకరణాల కోసం ఈ నెల 19న స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయ కర్త ఎం.రజనికుమారి తెలిపారు. నియోజకవర్గంలో 18 సంవత్సరాల లోపు వయసు ఉండి, సదరం ధ్రువపత్రం కలిగిన విద్యార్థులు వారి పాఠశాలల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

✤ స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ భవన నిర్మాణ పనులకు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3 కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

92 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

గోసవీడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడులో మంగళవారం తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. బాపులపాడు మండలం చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల వైద్యులు సాహిత, సంజన పాల్గొని 92 మందికి కంటి పరీక్షలు చేశారు. ఏడుగురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసి ప్రత్యేక బస్సులో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. తెదేపా నాయకులు కె.వెంకటేశ్వర్లు, జి.మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

తిరువూరులోని 8వ వార్డు కాలువల నుంచి తీసిన బురద, వ్యర్థాలను తన ఇంటి ముందు నిల్వ ఉన్నాయని స్థానికుడైన రామకిశోర్ 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ✤ స్థానిక ఒకటో వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికురాలైన అప్సరీబేగం 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ శానిటరీ అధికారి స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువల్లో పూడిక తీయించారు. సమస్య పరిష్కరించారు. - **న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

సాగర్ జలాల సరఫరా పరిశీలన

గంపలగూడెం: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ నియంత్రిక నుంచి మధిర బ్రాంచి కెనాల్‌కు మంగళవారం 620 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈఈలు మహేష్ బాబు, సునీత నాగలక్ష్మి తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 332 క్యూసెక్కులు చేరగా, దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం- 20, ఊటుకూరు- 1కి 40, పెదకొమిర- 25, మధిర- 30, నిదానపురం- 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. మధిర మేజర్ కాల్వకు సరఫరా చేసిన జలాలను ఏఈలతో పాటు నీటి సంఘం అధ్యక్షుడు అచ్చంరాజు తదితరులు పరిశీలించారు.

పరిధి విస్తారం.. పర్యవేక్షణ పరిమితం

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్

★ కొండపల్లి శివారు పారిశ్రామికవాడ వద్ద గత నెల 10న శ్రామిక నగర్‌కు చెందిన ఓ వివాహిత హత్యకు గురైంది. మరుసటి రోజు ఉదయం స్థానికులు భయాందోళనలకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు.

★ నవంబర్ 6న ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయనపాడు ఖాళీ ప్లాట్లలో ఇబ్రహీంపట్నానికి చెందిన మహిళ బలవన్మరణం చెందారు. హత్య, ఆత్మహత్య అనే సందేహాలు సైతం అప్పట్లో వ్యక్తమయ్యాయి.

★ ఇబ్రహీంపట్నం సహాయమాత పాఠశాల సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

★ గుంటుపల్లి శివారు మామిడి చెట్ల వద్ద ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి బలవన్మరణం చెందాడని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు.

ఇటువంటి సంఘటనలకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ శివారు ప్రాంతాలు వేదికగా మారాయి. గత ఆరు నెలల్లో బలవన్మరణాలు- 8, అనుమానాస్పద మృతి కేసులు- 10 వరకూ నమోదు కావడం స్థానికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఇది ముమ్మాటికీ నిఘా వైఫల్యమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిఘా పెట్టడం కష్టం

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి విస్తారంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లో నిఘా పోలీసులకు కష్టంగా మారింది. కంచికచర్ల మండలం పరిటాల శివారుతో పాటు జాతీయ రహదారులు, కొండపల్లి పారిశ్రామికవాడ, విజయవాడ రూరల్ శివారు రాయనపాడు, పైడూరుపాడుతో పాటు కృష్ణానదీ తీరం స్టేషన్ పరిధిలోనే ఉండటంతో పరిమితమైన సిబ్బందితో పర్యవేక్షణ అసాధ్యంగా మారింది.

వివాదాలకు కొరతే లేదు..

కొండపల్లి పురపాలక సంఘం, మండలంలోని గ్రామాలు స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి. పురపాలికలో పూర్తిగా నగర వాతావరణం నెలకొనగా ఇతర చోట్ల గ్రామీణ వాతావరణం ఉంటుంది. పురపాలికలో నిత్యం ఏదో వివాదం స్టేషన్‌కు రావడం సాధారణం. దీంతో పాటు భూములకు అనుసంధానంగా ఉన్న వివాదాలకు కొరతే లేదు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడమే పోలీసులకు, ట్రాఫిక్ సిబ్బందికి పెద్ద సవాలు అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల పర్యవేక్షణ సిబ్బందికి, అధికారులకు కత్తిమీద సాముగా మారింది. వీటన్నింటికి మించి నగరంలో ఏ కార్యక్రమం జరిగినా స్థానిక సిబ్బంది మొత్తం అక్కడ విధుల్లో ఉంటారు.

సిబ్బంది గస్తీలోనే..

శివారు ప్రాంతాల వరకూ మొబైల్ బృందాలు గస్తీ కాస్తూనే ఉన్నారు. రెండు వాహనాల్లో ఎస్సైలు, ఆరు ద్విచక్ర వాహనాలపై 12 మంది సిబ్బంది గస్తీకి వెళ్తున్నారు. వీరికి తోడు జాతీయ రహదారులపైన నేషనల్ హైవే వెహికల్ వస్తోంది. - **సీఐ చంద్రశేఖర్**

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

విజేతలతో ప్రిన్సిపల్ రఘునాథ్, ఉపాధ్యాయులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక శ్రీశ్రీనివాస హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో 8, 9, 10 తరగతుల వారు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. బి.జస్విక్ రెడ్డి(7వ తరగతి), ఎం.వాత్సల్య(9వ తరగతి), కె.ఉదయ్ చరణ్(7వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు శ్రీశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ ఎం.రఘునాథ్ బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు ఎ.రాజరమేష్, ఎస్.మన్మధరావు, జి.సాయి ప్రసన్న, ఎస్కే. అతియా సుల్తానా, వి.నీలిమ, జి.అంజమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన నిధులతో నియోజకవర్గ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధి, మరమ్మతుల పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆ శాఖ అధికారులను కోరారు. మంగళవారం తిరువూరులోని తన కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేయాల్సిన రహదారుల గురించి చర్చించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ ఎం.సిద్దయ్య, డీఈ ఎం.లోకేశ్‌కుమార్, ఏఈ ఈలు ఒ.అచ్చారావు, గాయత్రి పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : అన్నదాత సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ యోజన 21వ విడత నిధులు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్న సందర్భంగా బుధవారం గంపలగూడెం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద నిర్వహించే నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

54,174 మంది రైతులకు లబ్ధి

ఇబ్రహీంపట్నం (గ్రామీణ), న్యూస్‌టుడే : మైలవరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని 54,174 మంది రైతులకు రెండో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రూ.19.91 కోట్లను ప్రభుత్వం బుధవారం జమ చేయనున్నట్లు సహాయ సంచాలకులు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలోని మూలపాడులో జరిగే ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొననున్నారు.

మారెమ్మ తల్లి దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి దేవస్థానం ఛైర్మన్‌గా శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారాన్ని దేవస్థానం ఈవో దుర్గాప్రసాద్, గన్నవరం గ్రామ దేవస్థానాల అధికారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తెదేపా యువ నాయకుడు, ఎన్నార్ పల్లెపోగు గిరిబాబు, గొట్టిపాటి సుబ్రహ్మణ్యం(బుజ్జయ్య), రాయల సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న ఛైర్మన్ శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు

వనసమారాధన జరుపుకోవడం మన సంప్రదాయం

జి.కొండూరు, న్యూస్‌టుడే : కార్తిక మాసంలో వనసమారాధన జరుపుకోవడం మన సంప్రదాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం ఆధ్వర్యంలో చెవుటూరు మామిడితోటలో నిర్వహించిన వనసమారాధనకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెవుటూరు : ప్రత్యేక పూజలో మాధవ్, శ్రీరాం తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మైలవరంలోని ర.భ.కార్యాలయ అధికారులు, సిబ్బంది మంగళవారం భోజన విరామ సమయంలో స్థానిక తోటల్లో వన భోజనాలు నిర్వహించారు. ర.భ.ఈఈ ఎం.సిద్దయ్య, డీఈ అప్పారావు, అధికారులు జి.శ్రీకాంత్, కేఎస్ సుకుమార్, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం: దీపాల వద్ద భక్తులు

మైలవరం మండలం వెల్వడంలో..

గొల్లపూడి శివాలయంలో..

కొత్తపల్లిలో..

వైభవంగా కార్తిక దీపోత్సవం

కార్తిక మాసం సందర్భంగా మంగళవారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని శివాలయాల్లో భక్తులు దీపోత్సవాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో జరిగిన దీపోత్సవంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, బృందం**

ఘనంగా పడిపూజ

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక పార్వతీ సమేత అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి భక్తులు పడిపూజ నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో మండలంలోని అయ్యప్పలు భక్తి గీతాలు ఆలపిస్తు ఇందులో పాల్గొన్నారు.

భజన చేస్తు భక్తి గీతాలు ఆలపిస్తున్న స్వాములు

మురుగు పోయేదెలా.. వాసన తొలగేదెలా!

స్థానిక టమాట మార్కెట్ సమీపంలోని కాలువలో మురుగు నిలిచి దుర్గంధంతో అపరిశుభ్రంగా తయారైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువ పల్లంగా ఉండి మురుగు పారే అవకాశం లేకపోవడంతో నీరంతా అక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన చెందుతున్నారు. మరో పక్క చుట్టు పక్కల వారందరూ చెత్త చెదారం ఆ ప్రదేశంలో పడేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, జి.కొండూరు**

దారంతా గోతులు.. నిత్యం అవస్థలు

రెడ్డిగూడెం : అధ్వానంగా మామిడి తోటలకు వెళ్లే డొంక రోడ్డు

రెడ్డిగూడెం గ్రామంలోని ఎన్నెస్పీ నూజివీడు బ్రాంచి కాల్వ దగ్గర నుంచి తూర్పు వైపు ఉన్న పంట పొలాలు, మామిడి తోటలకు వెళ్లే డొంక రోడ్డు గోతులమయంగా మారడంతో అన్నదాతలు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారి బురదమయంగా తయారైంది. రహదారికి ఇరువైపుల పెరిగిన పిచ్చిపొదల మధ్య రాకపోకలు సాగించాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మామిడి తోటల్లో వ్యవసాయ పనులు, ఎరువులు ట్రాక్టర్లలో తరలించేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గతంలో పెద్ద వాగు వైపు నుంచి వెళ్లేందుకు కొంతమేర అవకాశం ఉండేది. భారీ వర్షాలకు వాగు కోతకు గురై అటు వైపు వెళ్లలేక పోతున్నామని కర్షకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ రహదారి అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – **రెడ్డిగూడెం, న్యూస్‌టుడే**

నిర్వహణ నీదా.. నాదా?

జడ్పీ ఉన్నత పాఠశాల, గణపవరం

మండల పరిధి గణపవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అధికార పార్టీలో వర్గపోరాటానికి దారి తీసింది. ఆయాగా పని చేస్తున్న మహిళకే భోజన ఏజెన్సీ ఎలా అప్పగిస్తారంటూ మొదలైన రగడ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుండగా 125 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజన పథకానికి వంట ఏజెన్సీగా ఉన్న మహిళ ఈ ఏడాది మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యురాలే అప్పటి నుంచి అదే పాఠశాలలో ఆయాగా విధులు నిర్వర్తిస్తుండగా, ఈ ఏడాది వంట బాధ్యతలూ అప్పగించారు. దాంతో ఒకే మహిళకు రెండు బాధ్యతలు ఇవ్వడంపై గ్రామంలోని పలువురు నాయకులు ప్రశ్నిస్తూ మార్చాలని డిమాండ్ చేశారు. తనకు బిల్లులు బకాయిలు ఉన్నాయని, వాటిని ఇస్తే ఏజెన్సీ వదిలేస్తానని ఆమె చెప్పగా అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో బాధ్యతల మార్పు విషయంలో మండల అధికారి సరిగా వ్యవహరించడం లేదంటూ గత వారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈవో ఎల్.బాలును సంప్రదించగా, విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. - **న్యూస్‌టుడే, మైలవరం**

'నాలుగేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదు'

వేదికపై శ్రీలక్ష్మి, శామ్యూల్, సరస్వతి, రాజకుమారి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిషత్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంపీటీసీ సభ్యులు సత్వరమే పూర్తి చేయాలని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి కోరారు. గతంలో ఎంపీటీసీలకు తమ గ్రామాల్లో అభివృద్ధికి రూ.1.40 కోట్లు మంజూరు చేయగా ఇంకా పూర్తిగా పనులు చేపట్టలేదన్నారు. తాజాగా మరో రూ.1.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు నుంచి అంచనా, తీర్మానం ప్రతులను తీసుకుని పనులు ప్రారంభించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అనుముల్లంక ఎంపీటీసీ సభ్యురాలు గౌరసాని కమల మాట్లాడుతూ తమ గ్రామానికి కేటాయించిన రూ.13 లక్షలతో పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఎంపీడీవో టి.సరస్వతి స్పందించి పంచాయతీ తీర్మానం ఇచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యదర్శి మాణిక్యాలరావును ఆదేశించారు. తహసీల్దార్ వి.రాజకుమారి, ఏవో వి.హరీష్ కుమార్, ఎంఈవో నరసింహారావు, డిస్కం ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ ఏఈ స్వర్గం కిషోర్ పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు తమకు నాలుగేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. మరికొన్ని నెలల్లో పదవీ కాలం పూర్తవుతున్న నేపథ్యంలో తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, సీడీపీవో పి.కృష్ణకుమారి, ఎన్నెస్పీ ఏఈ సునీత నాగలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తత అవసరం

మైలవరం, న్యూస్‌టుడే : కొత్త పుంతలు తొక్కుతున్న మోసాల్లో డిజిటల్ అరెస్టు ఒకటని, అసలు అటువంటిదే లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ డి.చంద్రశేఖర్ సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న బ్యాంకుల్లో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఆయా బ్యాంకుల్లో సిబ్బంది, వినియోగదారులకు పలు అంశాలను వివరించారు. డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ మోసాలు, ఇతర సైబర్ నేరాలు జరుగుతున్న తీరును తెలిపారు.

మైలవరం : బ్యాంకులో సూచనలు ఇస్తున్న సీఐ చంద్రశేఖర్

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని అన్ని ప్రధాన బ్యాంకుల్లో తిరువూరు పోలీసులు అవగాహన కల్పించారు. ఇందులో ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో మోసగాళ్లు వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటుండంతో జాగ్రత్తలు అత్యవసరమని స్పష్టం చేశారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని వాణిజ్య, సహకార, గ్రామీణ బ్యాంకుల అధికారులు, ఖాతాదారులకు స్థానిక ఎస్సై జి.మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఏదైనా మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మండలం మల్లేల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరువూరు- నూజివీడు రోడ్డుపై వెళ్తున్న కారు మల్లేల వద్ద పొలంలో నుంచి రహదారిపైకి వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఆ వెనుకనే వస్తున్న మరో కారు దీన్ని తగిలింది. స్థానికులు గమనించి పోలీసులు, 108కు సమాచారం అందిచారు. కారులో ఉన్న నలుగురు తెలంగాణ రాష్ట్రం చిన్నమ్మగూడేనికి చెందిన వారు కాగా క్రరీ.పెద్ద బసవయ్య(80) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురికి గాయాలు అవ్వడంతో తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్ద బసవయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్లారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

✤ ఆటో ఢీకొని లారీ చోదకుడు...

ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : జాతీయ రహదారి జూపూడి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ చోదకుడు మృతి చెందాడు. సిమెంట్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ గఫూర్(47) మంగళవారం జగ్గయ్యపేటలోని సిమెంట్ కంపెనీ నుంచి లోడుతో చెన్నైకి బయలుదేరాడు. మార్గం మధ్యలో జూపూడి వద్ద లారీని నిలిపి రోడ్డు పక్కన ఇంజిన్ ఆయిల్ కొనుగోలు చేశాడు. తిరిగి లారీ వద్దకు వచ్చేందుకు రహదారి దాటుతుండగా విజయవాడ వైపు వస్తున్న ఆటో అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతనిని చికిత్స నిమిత్తం సమీపంలోని నిమ్రా ఆసుపత్రికి తరలించగా వైద్యుడు క్షతగాత్రుడిని పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆలయాల్లో అమ్మవారి సూత్రాల చోరీ

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక వైకుంఠధామం వెనుక గల శ్రీరేణుకాదేవి అమ్మవారు, పాండురంగ స్వామి దేవాలయాల్లో చోరీ జరిగింది. ఆయా ఆలయాల్లో గేట్లు, తలుపుల తాళాలు పగలగొట్టిన దొంగలు, అమ్మవారి విగ్రహాల మెడలోని బంగారు సూత్రాలను దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన వారికి తలుపులు తెరిచి ఉండటంతో, గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు

గంపలగూడెం, తిరువూరు టౌన్: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక లావాదేవీల విషయంలో టేకులపల్లి గ్రామానికి చెందిన హేమంత్ రెడ్డిపై అదే గ్రామానికి చెందిన దొంగల.రవి, సాంబశివరావు కర్రతో దాడికి పాల్పడగా గాయపడిన హేమంత్ రెడ్డి తిరువూరు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో మంగళవారం హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

కరాటేలో ప్రతిభ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మల్లవల్లి లక్ష్మీప్రసన్న తెలంగాణ రాష్ట్రం మేడ్చల్‌లో ఈ నెల 16న నిర్వహించిన కరాటే అండర్- 18 విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆ కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్రారెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, హరిబాబు, వేణుబాబు, సిబ్బంది ఆమెను మంగళవారం ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.





నందిగామ

● నందిగామ ● జగ్గయ్యపేట

రైతులు హాజరుకావాలి

నందిగామ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అన్నదాత- సుఖీభవ పథకం రెండో విడతలో రైతులకు నిధులు జమ చేస్తుండటంతో నందిగామలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయ ప్రతినిధి తెలిపారు. స్థానిక బాబూ జగ్జీవన్‌రాం ఫంక్షన్ హాలులో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు చొప్పున అర్హులైన రైతులకు రూ.7 వేలు రెండో విడతలో బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి రైతులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నిమ్మలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

తెగుళ్లు పరిశీలిస్తున్న రవికిశోర్, శాస్త్రవేత్త లక్ష్మీకళ, ఏవో నీలిమ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: నిమ్మ తోటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని డాక్టర్ కేఎల్‌రావు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ ఎం.రవికిషోర్ తెలిపారు. స్థానిక సహకార సంఘం ఆవరణలో మంగళవారం నిమ్మ తోటల్లో పురుగులు, తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త లక్ష్మీకళ మాట్లాడుతూ.. నిమ్మలో బంక, గజ్జి తెగులు వల్ల ఎక్కువగా నష్టం వాటిల్లుతుందని చెప్పారు. దీని నివారణకు లీటరు నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ గ్రాము చొప్పున పది లీటర్ల నీటిలో వేసి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పెనుబంక నివారణకు లీటరు నీటిలో అసిటామిప్రిడ్ 0.3 గ్రాములు వేసి పిచికారీ చేయాలన్నారు. అనంతరం మిర్చి పైర్లు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. నల్లతామర పురుగుల నివారణకు పది వేల పీపీఎం సామర్థ్యం ఉండే వేప నూనె మిల్లీ లీటరు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి నీలిమ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

నియమావళి చూపుతున్న ఎస్సై అభిమన్యు తదితరులు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే : సీబీఐ, ఈడీ, కస్టమ్స్, పోలీసు అధికారులమంటూ ఫోన్ చేసి బెదిరింపులు పాల్పడేవారిని నమ్మవద్దని, అలా ఎవరైనా చేస్తే వెంటనే స్థానిక పోలీసులకు తెలపాలని ఎస్సై బి.అభిమన్యు ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని జుజ్జూరు ఇండియన్ బ్యాంక్‌లో ఎస్సై ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీబీఐ, ఈడీ, కస్టమ్స్, పోలీసులు, జడ్జీలు వీడియో కాల్‌లో అరెస్ట్ చేయడం లేదని పేర్కొన్నారు. బాధితులు వెంటనే సంప్రదిస్తే ఇలాంటి మోసాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ మేరకు నేరాలను నివారించేందుకు పాటించాల్సిన నియమావళి ప్రతులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్, సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

20న చలో విద్యుత్తు సౌధ

కరపత్రాలు విడుదల చేస్తున్న వెంకటేశ్వరరావు, గోపాల్, నేతలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : ఈనెల 20న చేపట్టే చలో విద్యుత్తు సౌధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని చందాపురం విద్యుత్తు ఉప కేంద్రంలో చలో విద్యుత్తు సౌధ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలతో పాటు ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు, కార్మికులు, జేఎల్ఎం గ్రేడ్- 2, స్టోర్ హమాలీలు తదితర కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. ప్రైవేటీకరణ ఆపే ప్రతిపాదన 20న అన్ని రాష్ట్రాల్లో చలో రాజధాని కార్యక్రమానికి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఈఎఫ్ఐ) పిలుపు ఇచ్చిందన్నారు. ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, రూ.కోటి బీమా, కారుణ్య నియామకాల్లో నియమించిన ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు ఇవ్వాలని డిమాండు చేశారు. సీఐటీయూ నాయకులు కటారపు గోపాల్, బండి సత్యనారాయణ, రాజేష్, గాంధీ, బాషా, కిశోర్ పాల్గొన్నారు.

సీసీఐ కొనక.. దళారుల కినుక

అగమ్యగోచరంగా పత్తి రైతుల పరిస్థితి

నందిగామ గ్రామీణం, చందర్లపాడు, న్యూస్‌టుడే

జీవితం కరిగిన అధిక వర్షాలు పత్తి రైతుల ఆశలు నీరుగార్చాయి. నాణ్యత లేని పత్తి, గుడ్డికాయలతో వచ్చిన దిగుబడి కూలీ ఖర్చులకు సరిపోని దుస్థితి నెలకొంది. నాణ్యత లేని పత్తిని కొనడం లేదని సీసీఐ కేంద్రాల సిబ్బంది చెబుతుండటంతో.. దళారులు సైతం కొనడానికి ముందుకు రావడం లేదు. దీంతో కర్షకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

★ నందిగామ నియోజకవర్గంలో ఈ ఖరీఫ్‌లో 12,453 హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో అధిక వర్షాలకు పూతరాలి, కాయ కుళ్లి దిగుబడి ఎకరాకు నాలుగు క్వింటాళ్లకు పడిపోయింది. అది కూడా నాణ్యత లేక దళారులు క్వింటా రూ.4 వేలకు కొంటున్నారు. మరోవైపు మొంథా తుపాను నష్టపరిహారం అయినా వస్తుందని ఆశిస్తే.. వీరా అధికారులు రాదని చెప్పడంతో రైతులు కుంగిపోతున్నారు. మాగల్లు, పల్లగిరి, రామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పత్తి చేలను దున్నించి మొక్కజొన్న సాగుకు ఉపయుక్తమ చేస్తున్నారు.

తేమ శాతంతో తంటా : పత్తిలో తేమ శాతం 8 లోపు ఉంటే క్వింటాకు రూ.8110 మద్దతు ధర ఇస్తారు. నందిగామ సీసీఐ కేంద్రంలో పత్తి పరిశీలించిన బయ్యర్ తేమ శాతం 12 శాతం కంటే ఎక్కువగా తేమ ఉందని, నిబంధనల ప్రకారం కొనడానికి వీలుపడదని చెప్పడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐలో పత్తి విక్రయించాలంటే కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. ఈ యాప్ గురించి రైతులకు అవగాహనలేక ఇబ్బంది పడుతున్నారు. నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, మైలవరం సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి.

రూ.3 లక్షలు నష్టం

పదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశా. రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టా. అధిక వర్షాలకు దిగుబడి తగ్గింది. పువ్వు కాయ అధికంగా వచ్చింది. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల దిగుబడి రాదు. ఈ పత్తిని విక్రయించినా కూలీలకు సరిపోదు. ఉన్న నిబంధనలు సడలించి సీసీఐ మద్దతు ధరకు కొనాలి. - సూరా కొండలరావు, అడవిరావులపాడు

మాగల్లులో కొనని పత్తిని చూపుతున్న రైతు శ్రీనివాసరావు

అధిక వర్షాలకు కాయ కుళ్లింది

రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశా. ఎకరానికి రూ.12 వేలు కౌలు, రూ.15 వేలు పెట్టుబడి వంతున రెండెకరాలకు రూ.54 వేలు పెట్టా. అధిక వర్షాలకు కాయ కుళ్లింది. మొదటి తీత ద్వారా వచ్చిన పత్తిని ఇంటి ముందు ఆరబోశా. నాణ్యత లేదని దళారులు కొనడం లేదు. పత్తిని తీయించడానికి కూలీలకు రూ.20 వేలు అయ్యింది. విక్రయిస్తే రూ.15 వేలు వస్తాయి. పత్తిని తొలగించి మొక్కజొన్న సాగు చేస్తా. - బిక్కి శ్రీనివాసరావు, మాగల్లు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శ్రీను తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన సమావేశం ప్రారంభవుతుందని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ రైతుపేట భగవాన్ సత్య సాయిబాబా మందిరం బాబా శత జయంత్యుత్సవాలకు ముస్తాబైంది. మందిరాన్ని విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు.

21న సొసైటీలో సహకార వారోత్సవాలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : పెనుగంచిప్రోలు సొసైటీలో ఈనెల 21న సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కర్ల వెంకటనారాయణ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా సొసైటీలోని 1200 మంది సభ్యులకు రూ.57 లక్షల డివిడెండ్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సంఘ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కంచికచర్ల, జగ్గయ్యపేట : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో, జగ్గయ్యపేట గ్రేడ్-1 గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కంచికచర్లలో ఎంఈఓ బాలాజీ వీటిని ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. గ్రంథాలయాధికారి అమరేశ్వరి పాల్గొన్నారు.

నందిగామ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని నందిగామ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మంగళవారం గ్రంథాలయంలో సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలను పౌరాణిక కళాకారుడు ఆత్కూర్ ఆంజనేయులు ప్రారంభించారు. జూనియర్ విద్యార్థులకు జాతీయ జెండాను, సీనియర్ విద్యార్థులకు నచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడు చిత్రాన్ని వేసేందుకు పోటీలు నిర్వహించారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గరికపాడులోని కేఎల్‌రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆసక్తి, వనరులు ఉన్న గ్రామాల్లో మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రవికిషోర్ తెలిపారు. బూదవాడ గ్రామంలో 60 మంది మహిళలకు అల్ట్రాటెక్ సంస్థ ఏర్పాటు చేసిన సామగ్రి తయారీ శిక్షణలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న అవకాశాలను, వనరులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఆర్.ప్రభావతి ఆధ్వర్యంలో కేవీకే బృందం మహిళలకు తయారీ మెలకువలు, ముడి పదార్థాల లభ్యత, మిశ్రమాల నిష్పత్తి తదితర విషయాలపై తర్ఫీదునిచ్చారు. అల్ట్రాటెక్ సంస్థ మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది, బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడిన సిబ్బంది సస్పెన్షన్

కంచికచర్ల, న్యూస్‌టుడే : కంచికచర్ల పంచాయతీలో వివిధ రకాల పద్దుల రూపంలో వసూలు చేసిన నగదును పంచాయతీకి ఖాతాకు జమ చేయని ముగ్గురు సిబ్బందిపై జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్య కుమారి మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. గత ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ పరిధిలో వసూలు చేసిన నగదు రూ.24.41 లక్షలు పంచాయతీ ఖాతాకు జమ చేయలేదని అందిన ఫిర్యాదు మేరకు డీఎల్పీవో రాఘవన్ గత నెల 17న కంచికచర్ల పంచాయతీ కార్యాలయంలో విచారణ చేసి.. నివేదికను డీపీవో లావణ్య కుమారికి అందజేశారు. అవినీతి నిర్ధారణ కావడంతో అప్పటి జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగుల్ మీరా, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తా, జూనియర్ అసిస్టెంట్ ఇల్లా సుబ్బారావును బాధ్యులుగా గుర్తించి.. సస్పెండ్ చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు.

పత్తి నాణ్యత పరిశీలన

నందిగామ: స్థానిక మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రంలో 450 పత్తి బోరాలను కొన్నారు. సీసీఐ బయ్యర్ వెంకటేశ్వర నాయక్, సహాయ బయ్యర్ సంపత్ పత్తిలో తేమ శాతం, నాణ్యత పరిశీలించారు.

మృతులకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

హజ్‌యాత్ర మృతులకు నివాళి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ముస్లింలు ఎంతో పవిత్రంగా చేపట్టే హజ్ యాత్రలో మృతి చెందిన వారికి ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య నివాళులర్పించారు. ఇలాంటి ఘటన జరగడం అత్యంత బాధాకరమని చెప్పారు. మంగళవారం స్వగృహంలో తన అనుచరులతో కలిసి మౌనం పాటించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ దుర్ఘటన తీవ్రంగా కలిచి వేసిందని అన్నారు. ఒకే కుటుంబంలోని 18 మృతి చెందడం బాధ కలిగించిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ అన్వర్, తెదేపా మైనార్టీ సెల్ ప్రతినిధులు సయ్యద్ షబ్బు, అబ్దుల్ గఫూర్, సయ్యద్ అహ్మద్, రహీం, రఫీ, మహ్మద్ జమీరుద్దీన్, అస్లాం, కౌన్సిలర్ మనోహర్, కొండయ్య, కోటేశ్వరరావు, గోపి, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏటిపట్టున తీరని దాహం

● కదలని పంచాయతీ ట్యాంకర్లు ● నీటిని కొంటున్న జనం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

డబ్బాలు, బిందెలతో ఆటోలో తాగునీరు తెచ్చుకుంటున్న స్థానికులు

ఏటిపట్టు గ్రామాల్లో దాహం వెతలు తీరలేదు. మునేటికి వరద రావడంతో రాఘవాపురం పైలెట్ ప్రాజెక్టు ద్వారా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచింది. మునేటిలో బోర్లు మునిగి ఏట్లో ఇసుకను కట్టగా ఏర్పాటు చేసి బోర్లు, పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. వీటిలో ఒక బోరు మాత్రమే పని చేయడంతో కొన్ని గ్రామాలకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది.

★ మాగల్లు, కొణతమాత్మకూరు, సోమవరం తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా అవ్వక జనం ఆటోల్లో ప్లాస్టిక్ డబ్బాలు, బిందెలతో బావులు, ఇతర ప్రత్యామ్నాయ నీటి వనరుల ద్వారా తాగునీరు తెచ్చుకుంటున్నారు. వీధి కుళాయిల ద్వారా చుక్కనీరు సరఫరా అవడం లేదు. మరమ్మతుల్లో జాప్యంతో ఏటిపట్టు గ్రామాలకు గొంతెండుతోంది.

★ పంచాయతీల్లో ట్యాంకర్ల ద్వారా కాలనీలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పట్టించుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాగల్లు ఎస్టీ కాలనీలో తాగునీరు లేక జనం ఆటోల్లో తెచ్చుకుంటున్నారు. కొన్ని గ్రామాల జనం నందిగామ నుంచి వాహనాలపై డబ్బాల్లో శుద్ధజలం కొంటున్నారు.

★ మునేటి ఒడ్డున ఫిల్టర్ బెడ్లు నిర్మించి నిరంతరం తాగునీరు సరఫరాకు ఎమ్మెల్యే తాతయ్య చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎంవీవీఎస్ శాస్త్రిని అడుగగా ప్రస్తుతం ఒక బోరు పని చేస్తోందని, దీని ద్వారా సగం గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, మరో బోరునకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

నవాబుపేట చెరువుకు గండి.. నీరు వృథా

మండలంలోని నవాబుపేట చెరువుకు పడిన గండి పూడ్చకపోవడం వల్ల నీరు వృథాగా పోతుంది. గ్రామంలో 260 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. దీని ద్వారా సుమారు 200 ఎకరాల్లో సాగు అవుతుంది. అనధికారికంగా మరికొంత భూమి సాగులో ఉంది. గతంలో భారీ వరదలకు హైవే పక్కన చెరువు అలుగులు వద్ద గండి పడింది. అప్పటి నుంచి గండికి మరమ్మతులు చేయలేదు. దీని వల్ల వర్షాలు లేకపోతే చెరువు ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని చెరువు గండి పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

ఎస్‌జీఎస్ కళాశాలను ప్రభుత్వ కాలేజీగా మార్చండి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట ప్రాంతంలో విద్యాసేవలు అందిస్తున్న శ్రీమతి గెంటేల శకంతలమ్మ ఎయిడెడ్ కళాశాలను ఇటీవల ప్రైవేటు కళాశాలగా మార్చడం వల్ల పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఇంటూరి చిన్నా పేర్కొన్నారు. కళాశాలను తిరిగి ప్రభుత్వ కాలేజీగా మార్చే చొరవను నాయకులు తీసుకోవాలని మంగళవారం ఆయన పేర్కొన్నారు.

వైద్యశిబిరం నేడు

పెనుగంచిప్రోలు : మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండెపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహరావు తెలిపారు. స్థానిక శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, శుక్లాలు ఉన్న వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామని చెప్పారు.

గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: నవాబుపేటలో కార్తికమాసం సందర్భంగా గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి శాంతి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు.

నిధులు రాక.. నిర్మాణం పూర్తికాక

చందర్లపాడు, న్యూస్‌టుడే

అసంపూర్తిగా భవనాలు

చందర్లపాడు మండలం కొడవటికల్లు పంచాయతీ పరిధిలోని కొండపేట ప్రాథమికోన్నత పాఠశాలను 2017లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కొన్ని గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రామస్థులు స్థలం వితరణ చేయగా.. ఉన్నత పాఠశాలకు భవనాల నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు కేటాయించారు.

☛ తొమ్మిది తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటగది, ప్రహరీ, ఫర్నీచర్ తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. 2023 నంబరులో ఐదు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.60 లక్షల పనులు మాత్రమే చేశారు. వీటిలో గదులు నిర్మించి ప్లాస్టింగ్ చేశారు. తర్వాత నిధులు విడుదల కాక నిలిపివేశారు.

☛ విద్యుత్తు పనులు, మరుగుదొడ్లు, ప్రహరీ, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. విద్యుత్తు సామగ్రి సిద్ధంగా ఉన్నా.. కూలీలకు ఇవ్వటానికి నగదు లేక పనులు చేయించటం లేదు. రెండేళ్లయినా పనులు పూర్తికాక పిల్లల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో చాలీచాలని గదుల్లో ఉన్నత పాఠశాల నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నాసిరకం భోజనం పెడితే కఠిన చర్యలు

జుజ్జూరులో కోడిగుడ్లు పరిశీలిస్తున్న ఛైర్మన్ విజయ్‌ప్రతాప్

జుజ్జూరు (వీరులపాడు), నందిగామ గ్రామీణం, కంచికచర్ల, చందర్లపాడు, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పిల్లలకు సరైన పోషక విలువలు కలిగిన పదార్థాలు అందించినప్పుడే వారు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ ఆహార సంస్థ ఛైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రతాప్ రెడ్డి అన్నారు. వీరులపాడు మండలం జుజ్జూరు బీసీ బాలుర వసతి గృహాన్ని, నందిగామ గిరిజన గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కంచికచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, అంగన్‌వాడీ కేంద్రాలు, చందర్లపాడు మండలం ముప్పాళ్ల గురుకుల పాఠశాలలో, జగ్గయ్యపేట బలుసుపాడురోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మెనూ అమలు, ఆహార పదార్థాలను ఆయన తనిఖీ చేశారు. వసతిగృహంలోని వంటగదులను పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పిల్లలకు అందించే ఆహారం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని అన్నారు. డబ్బులకు ఆశపడి నాసిరకం ఆహారం పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

నందిగామలో జ్యోతిర్లింగార్చన

మార్కండేయస్వామికి విశేషాలంకరణ



నందిగామలో బిల్వపత్రాలతో రామలింగేశ్వర స్వామికి ..

రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

డాంగేనగర్‌లో ...

కనుల పండువగా జ్యోతిర్లింగార్చన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం జ్యోతిర్లింగార్చన కనుల పండువగా నిర్వహించారు. శివలింగాకారంలో మహిళలు జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. సాయి అయ్యప్ప దేవాలయంలో ఈవూరి వినోద్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు ఏకశిలపై 18 మెట్లకు పడిపూజ నిర్వహించారు.

జగ్గయ్యపేట : మంగళవారం కార్తిక మాస శివరాత్రి పురస్కరించుకుని మార్కండేయస్వామి ఆలయంలో అన్నాభిషేకం, పంచామృతాభిషేకం, విశేష పూజలు, అలంకరణలతో క్రతువులు నిర్వహించారు. డాంగేనగర్‌లోని పంచ ముఖాంజయ స్వామి ఆలయంలోని శివలింగానికి అర్చకులు అన్నాభిషేకం నిర్వహించారు.

రామలింగేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన..

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ శివాలయంలో మంగళవారం మాస శివరాత్రి పురస్కరించుకుని రామలింగేశ్వర స్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అర్చకులు దండిభొట్ల బాలకృష్ణ శాస్త్రి, వైఎస్ఆర్‌కే ప్రసాద్ లక్ష బిల్వార్చన నిర్వహించి స్వామికి అలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తుల శివనామస్మరణ మార్మోగింది. దేవాలయ వంశ పారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవకుమార్, ఈవో కంచర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు. పల్లగిరిపై భవానీ శంకరుని వాయులింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. 21న సాయంత్రం గౌరీ పాడ్యమి పురస్కరించుకుని సాయి అయ్యప్ప దేవాలయంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని దేవాలయ ఛైర్మన్ శాఖమూరు వంశీధర్ మంగళవారం కోరారు.

ఘనంగా ఇరుముడుల కార్యక్రమం

కంచికచర్ల, న్యూస్‌టుడే : శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో దర్శనం ప్రారంభం కావడంతో మండల దీక్ష చేపట్టిన మాలధారుల ఇరుముడుల కార్యక్రమం కంచికచర్ల శివసాయి క్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప శరణు ఘోష నడుమ దీక్షాధారులు గురుస్వామి నంబూద్రి పద్మనాభ స్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టించుకొని శబరిమల యాత్రకు బయల్దేరారు. భక్తులు ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దీక్షాధారులకు ఇరుముడి కడుతున్న గురుస్వామి

విశ్రాంత ఉద్యోగుల సూచనలు విలువైనవి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : వివిధ వృత్తి, ఉద్యోగాల్లో విశేషానుభవంతో ఉద్యోగ విరమణ చేసిన వారి ఆలోచనలు, సూచనలు విలువైనవని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పింఛనర్ల సంఘ ప్రతినిధులతో సమావేశమైన ఆయన సమాజానికి అవసరమైన సేవల విషయంలో తనకు విలువైన సూచనలు చేయాలని కోరారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న పింఛనుదారుల దినోత్సవంపై పింఛనుదారులు ఆయనతో చర్చించారు. సంఘ అధ్యక్షుడు ధరణికోట రమణ, నియోజకవర్గ యూనిట్ ప్రతినిధులు దారా వినోద్‌బాబు, మరియదాసు, షేక్ షకీర్ మహమ్మద్, కాశినీడి పూర్ణచంద్రరావు, జీవరత్నం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

విజయవాడ తూర్పు

త్వరలో రూ.3 కోట్లతో డ్రైనేజీ నిర్మాణ పనులు

పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల(పటమట), న్యూస్‌టుడే : వర్షాలు పడిన సమయంలో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా తూర్పు నియోజకవర్గంలో సుమారు రూ.3 కోట్ల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం 2వ డివిజన్‌లో కుమ్మరి బజార్, గంగానమ్మ గుడి ఏరియాలో ఎమ్మెల్యే పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.13 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తర్వాత స్వయంఉపాధి నిమిత్తం డివిజన్‌కు చెందిన రాపోలు మల్లేశ్వరి, అంబళ్ల మంగకు జీవనోపాధి నిమిత్తం రూ.30 వేలు విలువ చేసే రెండు తోపుడుబండ్లను ఆయన సొంత డబ్బుతో కొని ఉచితంగా అందజేశారు. నాయకులు ముత్యాల కృష్ణ, సుగసాని కృష్ణ ప్రసాద్, గల్లా రవి, గద్దె రమేష్, పేరేపి ఈశ్వర్, గుత్తికొండ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు

ప్రదర్శనలో కళాకారులు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఎంజీరోడ్డులోని పీవీపీ మాల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన జపాన్ బృందం డ్రమ్ టావో ప్రదర్శన ఆకట్టుకుంది. దేశంలోని 14 నగరాల పర్యటనలో భాగంగా కళాకారులు ఆ దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా డ్రమ్ములు వాయించి ఉత్సాహపరిచారు. ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

జాతీయ పారా పోటీల్లో రాష్ట్ర స్విమ్మర్ల సత్తా

పతకాలు సాధించిన వారితో రామస్వామి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఆక్వాటిక్ స్టేడియంలో జరిగిన 25వ జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్విమ్మర్లు సత్తా చాటి 13 పసిడి, పది రజత, నాలుగు కాంస్య పతకాలతో మొత్తం 27 పతకాలు సాధించారని రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘ కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. మంగళవారం నాటి పోటీల్లో సీనియర్ విభాగంలో బీవీవీ కార్తీక్ ఎస్- 13 కేటగిరిలో 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లెలో పసిడి, సబ్ జూనియర్ విభాగంలో ఎ.మానవిత్ చౌదరి ఎస్-10 కేటగిరిలో 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లెలో రజత పతకం సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. వారిని ఆయన అభినందించారు.

జాతీయ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో 21 నుంచి 23 వరకు జరిగే జాతీయ కేడెట్ కిరోగి, పూంసే తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టులో జిల్లా క్రీడాకారులు ఇద్దరు స్థానం సాధించారని జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి ఎల్.శివభాస్కర్ తెలిపారు. 14 నుంచి మూడు రోజుల పాటు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కేడెట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో డి.శ్రీశాంత్ 57 కిలోల కేటగిరిలో పసిడి, జె.సందీప్‌రెడ్డి 61 కిలోల కేటగిరిలో పసిడి పతకాలు సాధించి.. రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్కూల్ గేమ్స్ క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని అరవింద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లోని క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ అండర్- 17 బాలికల, అండర్- 14 బాలుర క్రికెట్ జట్ల ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. వీటిలో పలువురు ప్రతిభ చూపి జట్లలో స్థానం సాధించారని ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య పరిపాలన కార్యదర్శి టి.శ్రీలత తెలిపారు. ఎంపికైన జిల్లా అండర్- 17 జట్టు వచ్చే నెలలో ఎన్టీఆర్ స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 17 బాలికల క్రికెట్ పోటీల్లో తలపడుతుందని తెలిపారు. ఎంపికల్లో పలువురు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసపోయిన బాలిక

కృష్ణలంక, న్యూస్‌టుడే : పెళ్లి చేసుకుందామని ఒంటరిగా వచ్చిన బాలికను పోలీసులు సురక్షితంగా తల్లికి అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం జిల్లాలోకి ఓ గ్రామానికి చెందిన బాలిక (15) పదో తరగతి చదువుతోంది. ఆమెకు కొద్ది రోజుల క్రితం విజయవాడకు చెందిన 22 ఏళ్ల యువకుడు ఫేస్‌బుక్‌లో పరిచయం అయ్యాడు. అనంతరం ఇద్దరూ తరుచుగా ఫోన్‌లో మాట్లాడుకుంటూ ప్రేమలో పడ్డారు. యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పగా నమ్మిన బాలిక అందుకు సమ్మతించింది. మంగళవారం మధ్యాహ్నం స్వగ్రామంలో ఒంటరిగా బస్సెక్కి విజయవాడ బస్‌స్టేషన్‌కు చేరి..అతని కోసం ఎదురు చూసింది.

✤ తల్లికి అప్పగించిన పోలీసులు

✤ బస్సులో ఉన్నంతసేపు యువకుడితో ఫోన్‌లో మాట్లాడింది. బస్సు దిగాక సుమారు రెండు గంటలు అతడి కోసం వేచి చూసింది. ఎంతసేపటికి అతడు రాకపోవడం.. కొద్దిసేపటికి ఫోన్ స్విచ్ఛాఫ్ అని రావడంతో ఏం చేయాలో తెలియక ఏడుస్తూ కూర్చుంది. బస్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న పోలీసులు ఆమెను గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యువతిని స్టేషన్‌కు తరలించి.. ఆమె ద్వారా యువకుడి నంబరుకు ఫోన్ చేసి.. సాంకేతికత సాయంతో అతను గొల్లపూడిలోని ఓ కంపెనీలో పని చేస్తున్నట్లు గుర్తించారు. ప్రేమ పేరుతో బాలికను ప్రలోభానికి లోనయ్యేలా చేసినట్లు నిర్ధారించి.. అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం బాలికను కృష్ణలంక సీఐ నాగరాజు తల్లికి అప్పగించారు.

అనర్హత విద్యాపత్రాల ఫిర్యాదుపై లోకాయుక్తకు వివరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న పలువురు హెల్త్ అసిస్టెంట్లు, మేస్త్రీలు, సిబ్బంది అర్హత లేని విద్యాపత్రాలతో ఉద్యోగాలు, పదోన్నతులు పొందుతున్నారంటూ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు ఎ.రంగనాయకులు లోకాయుక్తకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో పూర్తి వివరాలు పంపాలని లోకాయుక్త నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను ఆదేశించగా, ఆయన పేరిట అధికారులు వివరణ పంపారు. ప్రజారోగ్య విభాగంలోని హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ మేస్త్రీలు, సిబ్బంది నకిలీ విద్యార్హత ధ్రువపత్రాలు కలిగిలేరని తమ పరిశీలనలో తేలినట్లు అధికారులు పేర్కొన్నారు. వారి పత్రాలను తాము ధ్రువీకరించినట్లు వివరించారు. ఫిర్యాదులో నిజం లేదని వివరణ పంపారు. ఫిర్యాదుదారుడైన యూనియన్ నాయకుడు ఆర్టీఐ యాక్టు ద్వారా ఉద్యోగుల విద్యార్హత పత్రాల వివరాలు కోరారని, ఆ సమాచారాన్ని తమ అధికారులు ఆయనకు అందించగా, వివరాలను వక్రీకరిస్తూ ఉద్యోగుల విద్యార్హతలపై ఆయన నిరాధార ఆరోపణలతో లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు వివరణలో అధికారులు పేర్కొన్నారు.

మరిన్ని ఫిర్యాదులు..

అయితే నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఫుల్‌టైం వర్కర్లు, వాహన డ్రైవర్లు, ప్రజారోగ్య విభాగం అధికారులు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సంబంధించిన పలు అంశాలపై ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు మంగళవారం లోకాయుక్తకు తిరిగి ఫిర్యాదులు పంపారు.

కష్టపడితేనే లక్ష్యాలు సాధిస్తాం

మాట్లాడుతున్న జయలక్ష్మి, వేదికపై సుబ్రహ్మణ్య కుమార్, సంధ్యాలక్ష్మి

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే కష్టపడాలని, ఏదైనా రంగంలో వెళ్లాలంటే పూర్తిగా తెలుసుకుంటేనే విజయాలు సాధిస్తామని పృథ్వీ ఇన్నోవేషన్స్ సంస్థ డైరెక్టర్ ఎస్.జయలక్ష్మి అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో 'మహిళా సాధికారత' అనే అంశంపై సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తాను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి ఓ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగానని, కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా మారాలనే ఆలోచనలతో ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్, వాణిజ్య మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వి.సంధ్యాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల భావోద్వేగ స్థితిని అంచనా వేయాలి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే : విద్యార్థుల భావోద్వేగ స్థితిని అధ్యాపకులు అంచనా వేసే కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని, విద్యార్థులకు ఈఎస్ అవగాహన కార్యక్రమం ప్రయోజనమని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎ.ఏడుకొండలరావు అన్నారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులకు ఈఎస్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.ప్రభాకర్, కళాశాల ప్రొఫెసర్లు రామ్ నరేష్ రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

ఉన్నాయ్ సమస్యలు.. పరిష్కరించాలి మీరు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

నగరంలోని ఎనిమిదో డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ, రఘురామవీధి, టిక్కిల్ రోడ్డు ప్రాంతాల్లో ప్రజలు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ కాలనీలోని పార్క్ రోడ్డులో విద్యుత్తు నియంత్రిక ఉంది. దాని పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. ఏ మాత్రం తగిలినా ప్రమాదమేనని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. దీనికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే ప్రాంతంలో కరాచి బేకరి వద్ద ఇటీవల కురిసిన వర్షాలు, గాలులకు ఏళ్ల నుంచి నెలకొన్న భారీ వృక్షం కూలింది. దీని వల్ల డ్రెయిన్ రక్షణ గోడ పడిపోయింది. రహదారి మార్జిన్ దెబ్బతింది. రాత్రివేళ వాహనదారులు గమనించక పక్కకు వెళితే పడిపోయే ప్రమాదం ఉంది.

★ రఘురామవీధి నుంచి పార్క్ రోడ్డులోకి వచ్చే చోట రహదారిపై గుంత పడింది. వర్షం కురిస్తే నీరు అందులోకి చేరుతోంది. కొన్నిచోట్ల అంతర్గత రహదారుల్లో వేసిన వేగ నిరోధకాలు విరిగాయి. వీటి వల్ల వాహనదారులు వేగంగా వస్తున్నారు. వాటిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ కంచె లేని విద్యుత్తు నియంత్రిక

అధికారులకు ప్రజల విజ్ఞప్తి

పార్క్‌రోడ్డులో రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా

రహదారులపై పార్కింగ్

టిక్కిల్ రోడ్డు, రెవెన్యూ కాలనీల్లో వ్యాపార, విద్యాసంస్థలు ఉన్నాయి. ఇక్కడకు వచ్చే వారు తమ వాహనాలను రహదారుల పైనే నిలుపుతున్నారు. దీంతో మిగతా వారికి అసౌకర్యంగా మారింది. తరచూ ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. కొన్ని వ్యాపార సంస్థలకు పార్కింగ్ వసతి ఉన్నా అనుమతించడం లేదు. కొన్నింటికి లేవు. రహదారులపై వాహనాలు నిలపకుండా ట్రాఫిక్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చట్టంలో డిజిటల్ అరెస్టు లేదు

ఖతాదారులకు అవగాహన కల్పిస్తున్న మాచవరం సీఐ ప్రకాష్

పటమట, న్యూస్‌టుడే : డిజిటల్ అరెస్టు మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చట్టంలో డిజిటల్ అరెస్టు అనే పదమే లేదని మాచవరం సీఐ ప్రకాష్ అన్నారు. మంగళవారం మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ప్రకాష్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి బ్యాంకులకు వెళ్లి డిజిటల్ అరెస్టుపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు.

ప్రజల భద్రతకు పలు సంస్థలకు నోటీసులు జారీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని పలు సంస్థలు తమ ప్రాంగణంలోకి వీధి కుక్కలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ నగరపాలక సంస్థ అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు.

పూడ్చని గోతులు.. రాకపోకలకు ఇబ్బందులు

హైటెన్షన్ రోడ్డు నాగార్జున నగర్‌లో ఇటీవల భూగర్భ డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేసి సరిగా పూడ్చక వాహన చోదకులు పడిపోతున్నారు. మహానాడు జంక్షన్ నుంచి నాగార్జున నగర్ ప్రధాన వీధిలోకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటోంది. పాదచారులు గోతులు కనపడక పడిపోతున్నారు. సర్కిల్- 3 ఇంజినీర్లు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

\- కరెన్సీనగర్, న్యూస్‌టుడే

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

కృష్ణలంక : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సహకారంతో డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు 18వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య అన్నారు. డివిజన్ పరిధిలోని సాయిబాబా మందిరం వద్ద భక్తులకు ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన కుళాయిని మంగళవారం స్థానిక నేతలతో కలసి ఆయన ప్రారంభించారు. గోళ్ల శాంతిబాబు, కొండ, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, పడిగపాటి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా తెదేపా

పటమట : రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి చిరునామాగా తెదేపా నిలిచిందని, కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని తెదేపా నేత గద్దె క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం గుణదలలో పార్టీ కార్యాలయంలో నాళం నరేంద్ర కుమారుడి ఫీజు నిమిత్తం రూ.15 వేలు ఆయన అందజేశారు. రత్నకుమారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమెకు రూ.15 వేలు ఇచ్చారు. నాయకులు దాసరి గాబ్రియేలు, రత్నశ్రీ, సుగసాని కృష్ణ ప్రసాద్, ముత్యాల కృష్ణ, రవి కుమార్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో పిల్లల్లో మానసిక వికాసం

పటమట : మనిషి మెదడుకు పదును పెట్టే కేంద్రాలు గ్రంథాలయాలని.. వీటిని సరిగా వినియోగించుకుంటే మంచి జీవన విధానానికి దారి చూపుతాయని.. ప్రత్యేకించి పిల్లల్లో చురుకుదనంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి.రాధికా రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం బెంజ్‌సర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవ సభ నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు రాధికారెడ్డి, సర్వోత్తమ గ్రంథాలయం అధ్యక్షుడు కామినేని పట్టాభి రామయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద బహుమతులు అందజేశారు.

కరెన్సీనగర్ : ప్రస్తుతం డిజిటలైజేషన్ పెరుగుతున్నా విద్యార్థులు పుస్తక పఠనాసక్తిని పెంపొందించుకోవాలని ఆంధ్రా లయోల ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.విద్యాసాగర్ అన్నారు. కళాశాల గ్రంథాలయం, ఐక్యూఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం కళాశాలలో నిర్వహించారు. అనంతరం వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

తాగునీటి సరఫరా నిలుపుదల

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ సర్కిల్-3 పరిధిలోని ఐటీఐ కళాశాల ప్రాంతంలో 600 ఎం.ఎం డయా పంపింగ్ లైను మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం నుంచి తూర్పు పరిధిలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేస్తామని తెలిపారు. ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

క్రీడాకారుడికి ఎంపీ అభినందనలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : మలేషియాలోని కౌలాలంపూర్‌లో 4 నుంచి 16 వరకు జరిగిన కామన్వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్- 2025లో కాంస్య పతకం సాధించిన నగరానికి చెందిన గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్‌బాబును ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం లలిత్‌బాబు తన కుటుంబ సభ్యులతో ఎంపీని కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఫోన్ చేయాల్సిన నంబరు: 80085 74652

✤ 4వ డివిజన్ శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ ఎన్‌సీసీ క్యాంటీన్ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి రమణ మూర్తి మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు.

✤ 3వ డివిజన్ గుణదల అయ్యప్పనగర్ ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి రంగనాయకమ్మ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులు పిచికారీ చేయించారు. * 10వ డివిజన్ ఆర్టీసీ కాలనీ రెండో రోడ్డులో 10-42/144 విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి సదాశివరావు ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. **-న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

నేటి నుంచి ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 19 నుంచి మూడు రోజుల పాటు సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన ఉద్యోగులు త్వరలో జరిగే అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉద్యోగులు వారి గుర్తింపు కార్డులతో ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు ఐజీఎంసీ స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయం వద్ద హాజరవ్వాలని కోరారు. వివరాలకు ఫోన్ 98661 34016 నంబరులో సంప్రదించాలని కోరారు.

TEXMO AQUATEX
బిల్డర్ల దినోత్సవ శుభాకాంక్షలతో..
శివా కమర్షియల్ ఏజన్సీస్
షేక్ ఉమ్మర్ వీధి, గాంధీపార్క్ వెనుక, తారాపేట, విజయవాడ-1 ఫోన్: 0866-2426566 (షాపు)
ఆథరైజ్డ్ డీలర్స్: టెక్స్‌మో డొమెస్టిక్ మోనోబ్లాక్స్, జెట్‌పంప్స్, సబ్‌మెర్సిబుల్స్ మరియు ఆక్వాటెక్స్ మోటర్స్, అగ్రికల్చరల్ మోనోబ్లాక్స్ & స్పేర్స్
కె.శ్రీధర్ ✆ 98482 30066

మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు
సుధీర్ టింబర్ డిపో
యాకమూరు, ఉయ్యూరు.
98489 10892
గత 45 సం॥లుగా మీ అందరి ఆదరాభిమానాలు పొందుతున్న సుధీర్ & వంశీ (గ్రూపు) వారి ఉయ్యూరు నేషనల్ హైవేకి అతి దగ్గరలో ప్రభుత్వ అన్ని అనుమతులతో మెగా ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీగా మన ముందుకు వచ్చిన మెగా వెంచర్
VAMSI'S ROYAL CITY
OPEN PLOTS, DUPLEX VILLAS
నూకల వెంకట శేషగిరిరావు, నూకల వెంకట సాంబశివరావు, తల్లం హనుమంతరావు, N.N.V.S. సుధీర్‌కుమార్, N.M.V. వంశీకృష్ణ
వంశీ రాయల్ సిటీ NH 65 సర్వీస్ రోడ్డు, ఉయ్యూరు
✆ 98486 62222, 94401 58793

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
విజయవాడ సిటీ రామవరప్పాడులో
350 ఎకరాల మెగా గేటెడ్ కమ్యూనిటీ టౌన్‌షిప్
CRDA ఓపెన్ ప్లాట్స్ సేల్
వరల్డ్ క్లాస్ ఎమినిటీస్‌తో
350 ACERS MEGA GATED VENTURE
Club hous
International school
Star hotel
PHASE -1 FEW PLOTS ONLY
సంప్రదించండి ✆ 77 888 999 99

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

జననం 15-07-1939
మరణం 09-11-2025

కీ॥శే॥ Ln రేగుల గోపాలకృష్ణ వరప్రసాద్ (RGKV) గారు
Rtd. Physics Lecturer, Andhra Loyola College, Vijayawada

ఉన్నతమైన వ్యక్తిత్వంతో కుటుంబ శ్రేయస్సుతో పాటు ఎంతో మంది విద్యార్థినీ, విద్యార్థులకు క్రమశిక్షణే ఊపిరిగా, కష్టమే ఇష్టంగా, అభివృద్ధే ధ్యేయంగా ఎందరికో మార్గదర్శకులుగా నిలిచి, లయన్స్ క్లబ్, అభ్యుదయ వేదిక ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేసి ఆదర్శనీయులుగా నిలిచిన మీరు మా నుండి దూరమవడం మాకు తీరని లోటు. మీ ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: రేగుల లీల (Late)
కుమారుడు: రేగుల శ్రీనివాస్ ప్రవీణ్ కోడలు: పావని
మనుమరాండ్రు: శ్రీరాధ, పర్ణిక మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: ది: 19-11-2025 బుధవారం మధ్యాహ్నం బెంజ్‌సర్కిల్ దగ్గర లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలు నందు జరుపబడును. కావున తెలియజేయడమైనది. ✆ 93469 63201, 98494 71909

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ పశ్చిమ

చక్కటి ఉపన్యాసం.. బహుమతులు కైవసం

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్‌లోని శ్రీగౌతమ్ హైస్కూల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. ప్రథమంగా షేక్ హుమేరా(9వ తరగతి), ద్వితీయ వి.శ్రీవల్లి(8వ తరగతి), తృతీయ ఎ.జశ్వంతి(10వ తరగతి) స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎస్.సూర్యారావు, ప్రిన్సిపల్ పి.తులసి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పోటీలకు హాజరైన విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ సూర్యారావు, ప్రిన్సిపల్ తులసి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

★ చిట్టినగర్ రైల్వే యార్డు రోడ్డుకు వెళ్లే మార్గంలో రైల్వే క్వాటర్స్ ప్రారంభంలో రోడ్డుపై చెత్త కుండీల్లో చెత్త తరలించడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తీయించారు. ★ పాతరాజరాజేశ్వరీపేట నుంచి పూర్ణానందంపేట ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు సిబ్బందిని పంపి కుక్కలను పట్టారు. **– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

? విద్యాధరపురం చెరువు సెంటర్ ప్రాంతం భవానీగ్యాస్ కంపెనీ మార్గంలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. **- రామకృష్ణ, స్థానికుడు.** ✔ సిబ్బందిని పంపిస్తాం. **- డి.రాజు, స్థానిక శానిటరీ అధికారి** ? నాలుగు స్తంభాల సెంటర్ కూడలిలో కుక్కల బెడద అధికంగా ఉంది. **- పూర్ణ, స్థానికురాలు** ✔ పరిశీలించి వాటిని పడతాం. **- సోమశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్**

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

భవానీపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా భవానీపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం రెండు గంటల పాటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అల్లుడుపేట, నాగార్జున వీధి, మసీదు వీధి, రంగూన్ సాహెబ్ వీధి, మీరా సాహెబ్ వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్కు అభివృద్ధి అంతంతే..!

అటకెక్కిన బోటు షికారు

చిట్టినగర్, న్యూస్‌టుడే

విజయవాడ నగరంలో కేఎల్‌రావు పార్కును అతి పెద్ద పార్కులో రెండోదిగా భావిస్తారు. చుట్టూ గ్రీనరీ.. మంచి ఆదాయ వనరుగా ఉన్న ఈ పార్కు అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. టికెట్ తీసుకుని సందర్శకులు లోపలికి వస్తే అసహనంతో తిరిగి వెళ్లాల్సిందే. బోటు షికారు లేదు, ఆట పరికరాలు ఉన్నప్పటికీ పిల్లలు ఆడుకునేందుకు అనువుగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● వర్షం పడితే వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలిచి బురదగా మారుతుంది. వాకర్స్ కాసేపు సేద తీరేందుకు నిర్మిస్తున్న పరగోలు సగంలోనే నిలిచిపోయింది. స్కేటింగ్ గ్యాలరీలో ఓపెన్ థియేటర్ నిర్మాణం ఒక్క అడుగు కూడా పడలేదు. అపరిశుభ్రత వాతావరణంలో మగ్గుతుంది.

కేఎల్‌రావు పార్కు ఆదాయ వివరాలు				
నెల	పెద్దలు	పిల్లలు	వాకర్స్	రూపాయల్లో
ఆగస్టు	6999	500	165	88,990
సెప్టెంబరు	6,480	454	139	80,980
అక్టోబరు	6,030	432	130	75,500

కొలను గోడ విరిగి ప్రమాదభరితంగా..

● బోటు కొలనుపై చెక్క వంతెనలు రెండు ప్రమాదభరితంగా మారాయి. చెక్కలు ఊడిపోయి ఖాళీలు ఏర్పడ్డాయి. కొలను అంచు గోడ విరిగిపోయి 3 నెలలు గడుస్తున్నా ఇంత వరకు దాన్ని పట్టించుకునే లేదు. బోటు షికారు సందర్శకులకు ఏడేళ్లుగా అందని ద్రాక్షగానే మిగిలింది.

● పార్కు మధ్య భాగంలో ఉన్న ఫౌంటెన్ 2017లో రూ.2.6లక్షలతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. ప్రస్తుతం అది కూడా పని చేయడం లేదు. వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఆదాయ వనరుగా ఉన్న కేఎల్‌రావుపార్కును అభివృద్ధి చేయాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

● 2016లో తెదేపా ప్రభుత్వంలో ఉన్న మాదిరిగా పూర్వ వైభవం తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర జోక్యం చేసుకుని పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● కేఎల్‌రావు పార్కు అభివృద్ధి విషయమై వీఎంసీ ఉద్యానం విభాగం **డీఈ చంద్రశేఖర్‌ను** 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విరిగిన కొలను గోడకు మరమ్మతులు చేపడతామని చెప్పారు. బోటు షికారు విషయం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. స్కేటింగ్ గ్యాలరీలో ఓపెన్ థియేటర్, ఇతర పనులు వారం రోజుల్లో మొదలు పెడతామని చెప్పారు.

అధ్వానంగా స్కేటింగ్ గ్యాలరీ

'మాలలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి'

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో మాల సామాజిక వర్గానికి రిజర్వేషను ప్రకారం 7.5 శాతం కేటాయించాలని నేతలు కామా దేవరాజు, హనుమంతరావు నేతృత్వంలో నాయకులు ఎంపీ కేశినేని శివనాథ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో మాల సామాజిక వర్గానికి తగిన గుర్తింపు లభించని విషయాన్ని వారు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలిసి త్వరలో వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. జిల్లాలో మాలలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని, సమస్యను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంపీ హామీ ఇచ్చారని నేతలు తెలిపారు. వైకాపా పాలనలో కేసులను ఎదుర్కొని తాము పడిన ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో నాయకులు రెంటపల్లి శ్యామ్, దాసరి జయరాజు,శంకరరావు, వెంకటేశ్వర్లు, విజయశ్రీ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శివనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాగునీటి సరఫరా నిలుపుదల

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ సర్కిల్-3 పరిధిలోని ఐటీఐ కళాశాల ప్రాంతంలో 600 ఎం.ఎం డయా పంపింగ్ లైను మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం నుంచి తూర్పు పరిధిలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రూ.14 లక్షలతో సీసీ రోడ్డు

చిట్టినగర్: కేఎల్‌రావునగర్‌లోని 6వ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఆ రోడ్డు లోతట్టుగా ఉండడం, వర్షం పడినప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పలు మార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ఎత్తు పెంచాల్సి రావడంతో అధికారులు పనులు చేస్తున్నారు. సుమారు రూ.14 లక్షలతో 85 మీటర్ల పొడవు, 6.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. 3 రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు గుత్తేదారు తెలిపారు.

కనులపండువగా.. దీపోత్సవం

చిట్టినగర్, న్యూస్‌టుడే: పాలప్రాజెక్టు సమీపంలోని విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సహస్ర దీపార్చన కనుల పండువగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం విభూది అభిషేకం చేశారు. అనంతరం ఆలయం ఎదుట శివలింగాకారం, ఓం, స్వస్తిక్‌తో రంగవల్లులు తీర్చిదిద్దిన తీరు భక్తులను ఆకట్టుకుంది. పంచహారతులు అనంతరం భక్తులు దీపాలు వెలిగించి దీపోత్సవాన్ని విజయవంతం చేసినట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రి, నాగవెంకట పవన్‌కుమార్‌శర్మ తెలిపారు.

ఆకట్టుకుంటున్న శివలింగం

జగన్మాత సేవలో మంత్రి నిమ్మల

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు. తెలంగాణకు చెందిన మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు.

మంత్రి రామానాయుడు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన రాళ్ల గణపతి రావు దంపతులు రూ.1,00,116, విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన కె.రవికుమార్ రూ.లక్ష విరాళాన్ని వేర్వేరుగా మంగళవారం అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్, ఆలయ ఇన్‌స్పెక్టర్ వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాతలు రవికుమార్, గణపతిరావు కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆలయ ఇన్‌స్పెక్టర్

శివయ్యకు సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మల్లేశ్వరాలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన సేవను మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఆది దంపతులకు ఊంజల్ సేవను రుత్వికులు భక్తుల సమక్షంలో చేశారు. దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా భ్రమరాంబ

వైభవంగా విజయేశ్వరస్వామి కల్యాణం: విజయేశ్వరస్వామి ఆలయంలో గంగా, పార్వతి సమేత విజయేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు సూర్యకుమార శర్మ, మోహన కృష్ణ శర్మ కల్యాణాన్ని రుత్వికులు నిర్వహించారు. ✦ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమార్చన చేశారు. దేవస్థానం ఈవో సలగాల షణ్ముఖం, అర్చకులు మురళీధరన్ నంబూద్రి, నాగరాజశర్మ పాల్గొన్నారు.

గంగా, పార్వతి సమేత విజయేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

కనకదుర్గ పైవంతెనపై ప్రమాదం

భవానీపురం: కనకదుర్గ పైవంతెన ప్రమాదం జరగడంతో మంగళవారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒక కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. దీంతో పైవంతెనపై వాహనాలు స్తంభించాయి. ట్రాఫిక్ పోలీసులు క్రేన్‌ను తెప్పించి కార్లను పక్కకు పెట్టించడంతో వాహనాలు సజావుగా వెళ్లాయి. ట్రాఫిక్ సీఐ సురేష్ పర్యవేక్షించారు.

దెబ్బతిన్న కార్లు

దుర్గమ్మ భక్తుల భద్రతపై నిర్లక్ష్యం..!

దిల్లీ పేలుళ్ల నుంచి పాఠం నేర్చుకోని అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవాలయానికి నిత్యం వేలల్లో భక్తులు వస్తుంటారు. రాజధానికి వచ్చే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అధిక శాతం దుర్గమ్మ దర్శనం చేసుకుంటారు. నిత్యం వేలాది భక్తులు, ప్రముఖులు తరలి వస్తున్నా వారి భద్రత గురించి పట్టించుకునేవారు కరవయ్యారు. సెక్యూరిటీ, ఎస్పీఎఫ్, హోంగార్డుల జీతాల కోసం ఏటా రూ.3 కోట్లు ఖర్చు పెడుతున్నారు. వీరు కాకుండా ఇంజినీరింగ్ సిబ్బంది కోసం మరో రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారు. భక్తుల భద్రత విషయంపై అధికారులు ప్రదర్శిస్తున్న అలసత్వం మాత్రం అలానే ఉంది. ఇటీవల దిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఉగ్రవాదులు పేల్చిన బాంబుల కారణంగా అమాయక ప్రజలు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన తర్వాత దేశం అప్రమత్తం అవుతున్నా దుర్గగుడి అధికారులకు మాత్రం పట్టించుకోవడం లేదు.

లగేజ్ స్కానింగ్ లేకుండానే కౌంటర్లలో పెడుతున్న భక్తులు

కనిపించని లగేజ్ స్కానర్స్

తిరుమలలో వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడి బ్యాగ్ మూడు చోట్ల స్కాన్ అయిన తర్వాత మాత్రమే కౌంటరులోకి వెళ్తుంది. ఆక్టోపస్ విభాగం ఏటా దుర్గగుడి భద్రతపై తీసుకోవాల్సిన అంశాలపై మాక్ డ్రిల్ చేసి లోపాలపై దేవస్థానం ఈవో, పోలీసు కమిషనర్‌కు నివేదిక రూపంలో సమర్పించినా చర్యలు శూన్యమని తెలుస్తోంది. ✦ దుర్గగుడిలో క్యూలైన్లో వచ్చే భక్తులు మెటల్ డిటెక్టర్ డోర్ ఫ్రేమ్స్ నుంచి వెళ్లాల్సి ఉంది. రూ.లక్షలు వెచ్చించి దేవస్థానం కొనుగోలు చేసిన డోర్ ఫ్రేమ్స్ పని చేస్తున్నాయో లేదో కూడా అధికారులకు తెలియని పరిస్థితి. గతంలో విశ్రాంత మిలటరీ ఉద్యోగులు హ్యాండ్ స్కానర్స్‌తో తనిఖీ చేసేవారని పలువురు భక్తులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం : దుర్గమ్మ దర్శనానికి నిత్యం వేలాది భక్తులు తరలి వస్తున్న నేపథ్యంలో మరింత నిఘా చేస్తున్నాం. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరుగుతున్న తరుణంలో భద్రతా పరంగా దర్శనానికి వచ్చే భక్తుల బ్యాగులను తిరుమల తరహాలో స్కాన్ చేయాలి. సీసీ కెమెరాల విషయంలో ఇప్పటికే దుర్గగుడి అధికారులకు పోలీసు ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారని తెలిపారు. దేవస్థానం భద్రతపై ఆక్టోపస్, పోలీసు, అగ్నిమాపక విభాగాల సూచనలను దేవస్థానం అధికారుల దృష్టిలో ఉంచుతామన్నారు. **- గురుప్రకాష్, వన్‌టౌన్ సీఐ**

క్యూలైన్లలో పనిచేయని మెటల్ డిటెక్టర్ డోర్ ఫ్రేమ్స్

మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు సఖి సురక్ష ద్వారా నగరంలోని కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్ కల్యాణ మండపం, సూర్యారావుపేట ఐవీ ప్యాలెస్, పటమట హైస్కూలు రోడ్డు కనకమేడల రవీంద్రకుమార్ కల్యాణ మండపం ప్రాంతాల్లో మంగళవారం ఉచిత వైద్య, క్యాన్సర్ పరీక్షలు చేశారు. దాదాపు 600 మంది మహిళా సంఘాల సభ్యులకు థైరాయిడ్, హిమోగ్లోబిన్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా యూసీడీ పీవో వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలపై 35 ఏళ్లు నిండిన మహిళలకు శిబిరాలు నిర్వహించి, ఆరోగ్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూసీడీ అధికారులు, ఉద్యోగులు జీఎస్ సుజాత, శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజల భద్రతపై పలు సంస్థలకు నోటీసులు జారీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని పలు సంస్థలు తమ ప్రాంగణంలోకి వీధి కుక్కలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ నగరపాలక సంస్థ అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు సిబ్బంది ద్వారా పలు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, బస్టాండ్లు, డిపోలు, రైల్వేస్టేషన్ల బాధ్యులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ అధికారి కె.అర్జునరావు మాట్లాడుతూ నగరంలోని అన్నిరకాల సంస్థలు తమ ప్రాంగణాల్లోకి వీధి కుక్కలు రాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను ఎవరికి వారే తమ ప్రాంగణాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రాంగణాల్లో ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచవద్దని సూచించారు. వీధి కుక్కలకు నగరంలోని 61 ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఆహార కేంద్రాలు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో మాత్రమే ఆహారం ఉంచాలని సూచించారు. నగరంలోని ప్రతి సంస్థ ఇందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించుకోవాలని సూచించారు.

ప్రతినిధికి నోటీసులు ఇస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

యాంటీబయోటిక్స్ అతిగా వాడొద్దు

కార్యక్రమంలో డా.ఎం.సుహాసిని, అధికారులు తదితరులు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురైతే అతిగా యాంటీ బయోటిక్స్ వాడుతున్నారని.. ఇది అంతగా శరీరానికి మంచిది కాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని తెలిపారు. మంగళవారం పాతాసుపత్రిలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) వారోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మన శరీరంలో వివిధ రకాల జీవక్రియకు ఉపయోగపడే మైక్రోబియల్ క్రిములు, నాశనం కాకుండా రెసిస్టెన్స్ పెరగకుండా వెంటనే స్పందించాలని తెలిపారు. అవసరం లేకుండా యాంటీ బయోటిక్స్ వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఇందుమతి, డీపీఎంవో డా.నవీన్, డా.మాధవీనాయుడు, డా.బాలాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బడిబాట

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లాకు చెందిన రమీజా దంపతులు ఇద్దరి పిల్లలతో కలిసి జీవనం నిమిత్తం విజయవాడ కంసాలిపేటలో ఇటీవల స్థిరపడ్డారు. వారి కుమార్తె సుహానా(09) మూడో తరగతి, కుమారుడు జాను(10) ఐదో తరగతి చదువుతున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో రావడంతో కంసాలిపేటలోని పాఠశాలలో చేరాలని నిర్ణయించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడిని అడ్మిషన్ అడిగితే టీసీ లేనిదే చేర్చుకోమని సమాధానం వచ్చింది. దీంతో ఈ విషయాన్ని వారు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీంతో సుజనాచౌదరి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి శ్రీధర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి చిన్నారులకు అడ్మిషన్ ఇప్పించారు. ఈ క్రమంలో రమీజా దంపతులు ఎమ్మెల్యే సుజనాచౌదరికి ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే సుజనాచౌదరికి ధన్యవాదాలు తెలుపుతున్న రమీజా దంపతులు

ఉమ్రా యాత్రలో ప్రమాదం బాధాకరం

భవానీపురం, న్యూస్‌టుడే: ఉమ్రా యాత్రలో యాత్రికులు మరణించడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. యాత్రలో చనిపోయిన యాత్రికుల ఆత్మలకు శాంతి చేకూరాలని భవానీపురంలోని హజరత్ గాలిబ్ షాహీద్ దర్గాలో మంగళవారం సాయంత్రం ప్రార్థనలు నిర్వహించారు. 41, 38 డివిజన్ల కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, రెహ్మాతున్నీసా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వెలంపల్లి, నాయకులు

సినిమాలు

● **సంతాన ప్రాప్తిరస్తు, కాంత:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు) ● **కె. ర్యాంప్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు) ● **ది గర్ల్ ఫ్రెండ్, మాస్ జాతర:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), రాజకుమారి, సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు) - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

కమనీయం.. శివయ్య కల్యాణం

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్‌లోని శమీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శివ కల్యాణం మంగళవారం వైభవంగా సాగింది. నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు రెంటచింతల సాయిశర్మ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎం.హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శీరం వెంకట్రావు, సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, పోతిన వెంకట ధర్మారావు, కామందుల నరసింహరావు, పిళ్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో కాశీవిశ్వేశ్వరస్వామి

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

పమిడిముక్కల, న్యూస్‌టుడే: రాత్రి సమయాల్లో గృహాలు, దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నేరస్థుడ్ని చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశామని పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మిలిటరీ మాధవరం గ్రామానికి చెందిన కడియాల శ్రీధర్ జల్సాలకు అలవాటు పడి సులభంగా సంపాదన మోజులో పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామం వద్ద పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. విచారించగా పమిడిముక్కల మండలం మంటాడ శివాలయంలో, కంకిపాడు, తిరుపతి, పశ్చిమ తిరుపతిలో నేరాలు చేశానని అంగీకరించాడు. గతంలో ఇతడిపై జీఆర్పీ విజయవాడలో మొత్తం 13 కేసులు ఉన్నాయని తెలిపారు. ఇతను రైళ్లలో, రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలపై దొంగతనాలకు పాల్పడ్డాడని చెప్పారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల బంగారం, రెండు మోటారు సైకిళ్లు, రూ.10,250 స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.3,10,250 ఉంటుందని తెలిపారు. శ్రీధర్‌ను అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై శ్రీను, సిబ్బందిని అధికారులు అభినందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు
దక్షిణభారత దేశంలోనే అతిపెద్ద వ్యాపార కలప డిపో
సుధీర్ టింబర్ డిపో
ఇండియన్ వుడ్ అక్షన్ బయ్యర్స్ / ఇంపోర్టర్స్, ఎక్స్‌పోర్టర్స్
యాకమూరు, ఉయ్యూరు.
98489 10892
గత 45 సం॥లుగా మీ అందరి ఆదరాభిమానాలు పొందుతున్న సుధీర్ & వంశీ గ్రూపు వారి ఉయ్యూరు నేషనల్ హైవేకి అతి దగ్గరలో ప్రభుత్వ అన్ని అనుమతులతో మెగా ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీగా మన ముందుకు వచ్చిన మెగా వెంచర్
OPEN PLOTS, DUPLEX VILLAS
VAMSI'S ROYAL CITY
నూకల వెంకట శేషగిరిరావు, నూకల వెంకట సాంబశివరావు, తల్లం హనుమంతరావు, N.N.V.S. సుధీర్‌కుమార్, N.M.V. వంశీకృష్ణ
వంశీ రాయల్ సిటీ NH 65 సర్వీస్ రోడ్డు, ఉయ్యూరు
✆ 98486 62222 94401 58793

TEXMO AQUATEX
బిల్డర్ల దినోత్సవ శుభాకాంక్షలతో..
శివా కమర్షియల్ ఏజన్సీస్
షేక్ ఉమ్మర్ వీధి, గాంధీపార్క్ వెనుక, తారాపేట, విజయవాడ-1 ఫోన్: 0866-2426566 (షాపు)
ఆథరైజ్డ్ డీలర్స్: టెక్స్‌మో డొమెస్టిక్ మోనోబ్లాక్స్, జెట్‌పంప్స్, సబ్‌మెర్సిబుల్స్ మరియు ఆక్వాటెక్స్ మోటర్స్, అగ్రికల్చరల్ మోనోబ్లాక్స్ & స్పేర్స్
కె.శ్రీధర్ ✆ 98482 30066

World Toilets Day
SAIRAM ENTERPRISES
Wholesale & Retails Dealers : Ashirvad, Astral CPVC Pipe & Fittings, G.I. PVC Pipe & Fittings & G.M. Valves & Cocks, C.P. Bathroom Fittings
Manikondavari Street, Main Road, Opp. Steel Palace, Vijayawada-1. Cell: 99126 36266
ashirvad Jaquar PRINCE Xen Parryware

(c) eenadu

విజయవాడ మధ్య

33 మందికి జరిమానా

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : నగరంలో మద్యం తాగి, వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా 2, 4 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల అధికారులు.. 33 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. ఆరుగురికి రూ.15వేలు, 27 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు తీర్పు చెప్పారు.

కల్యాణం.. కమనీయం..

అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కార్తిక మాసం మాస శివరాత్రి సందర్భంగా గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం ఉదయం నుంచి అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నవగ్రహ హోమాలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అన్నాభిషేకం చేశారు. రాత్రి గంగా సమేత కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ కల్యాణం కమనీయంగా నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తులతోపాటు తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, జోండ సిద్ధార్థ తదితరులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. వీరికి ఈవో వై.సీతారామయ్య, పాలకమండలి సభ్యులు స్వాగతం పలికారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
సీతారాంపురం– 63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందనకు వందనం

❖ సూర్యారావుపేట జగన్నాథం వీధిలో విద్యుత్తు పోల్ (నం.23/93/1264)కు ఉన్న దీపం గత నెల రోజులుగా వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం అందించారు. దీనిపై ఈ నెల 18వ తేదీన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన వీఎంసీ ఏఈ బాలసుబ్రహ్మణ్యం.. తమ సిబ్బందితో దీపం ఏర్పాటు చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, సీతారాంపురం

ఎత్తైన గట్లు.. ఎక్కలేక ఇక్కట్లు

నిరుపయోగంగా బస్ షెల్టర్లు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

కలెక్టరేట్ వద్ద.. బస్టాపు ఉన్నా ఎండలోనే మహిళల పడిగాపులు

నగరంలో బస్టాపుల్లో షెల్టర్లు ఉన్నా ప్రయాణికులు ఉపయోగించుకునే వీలు లేకుండా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో షెల్టర్ల గట్టు ఎత్తుగా ఉన్నాయి. ఎక్కేందుకు మెట్లు లేకపోవటంతో ప్రయాణికులు.. ప్రధానంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కారల్‌మార్క్స్ రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్డులో చాలా చోట్ల ఈ పరిస్థితులు నెలకొన్నాయి. పాత బస్టాండ్ ఎదురు, బందరు లాకులు, ఆకాశవాణి, కలెక్టరేట్ వద్ద బస్టాపులు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. సౌకర్యవంతమైన షెల్టర్లు ఉన్నా... ఎండైనా వానైనా రోడ్డు మీద నిలబడాల్సి వస్తోంది.

మరొకరు సాయం తీసుకోవాల్సిందే

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రముఖ ప్రాంతాల్లో బస్టాపులను ఏర్పాటు చేశారు. కూర్చోవడానికి వీలుగా ఇనుప కుర్చీలు ఉన్నాయి. చాలా సౌకర్యవంతంగాను తీర్చిదిద్దారు. షెల్టర్లు శుభ్రంగా ఉన్నా.. వాటిని ఉపయోగించుకునే వీలు లేకుండా పోయింది. గట్టు అడుగున్నర నుంచి రెండు అడుగుల ఎత్తులో ఉన్నాయి. దాన్ని ఎక్కాలంటే మరొకరు సాయం తీసుకోవాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉండడంతో.. ఎక్కువ మంది సిటీ బస్సులను వినియోగించుకుంటున్నారు. దీనిద్వారా రాకపోకలు పెరిగాయి.

నగరంలో సిటీ బస్సులు	380
ప్రయాణికులు	70 వేల మంది
ఇబ్బందికరంగా ఉన్న బస్టాపులు	15
ఇక్కడ ఎక్కే వారి సంఖ్య	5,000 మంది

అడుగున్నర ఎత్తున్న గట్టు ఎక్కలేక వృద్ధుడి ఎదురుచూపులు

మెట్లు కడితేనే ఉపయోగం

బస్టాపులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలంటే గట్టు ఎక్కేలా వీలు ఉండాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో గట్టు కట్ చేసి మెట్లు ఏర్పాటు చేయాలి. ఇబ్బందికరంగా ఉన్న వాటిని గుర్తించి.. వాటిని సరి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అందరూ విజ్ఞప్తి చేస్తున్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం

దాత రవికుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన కె.రవి కుమార్ రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మర్యాదపూర్వక కలయిక

పాస్‌పోర్ట్ అధికారి విజయలక్ష్మికి మొక్క అందిస్తున్న ఎంపీ శివనాథ్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి ఎస్.విజయలక్ష్మికి ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలియజేశారు. మహాత్మా గాంధీ రోడ్డులోని స్టాలిన్ సెంట్రల్ మాల్‌లోని పాస్‌పోర్ట్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. కొండపల్లి బొమ్మను బహూకరించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను అధికారి వివరించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

గవర్నర్‌పేట: విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా గవర్నర్‌పేట సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు బుధవారం సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు రెహమాన్‌వీధి, మల్లాది వారి వీధి, కోదండరామిరెడ్డి వీధి, వెంకటేశ్వరరావు వీధి, రామమందిరం వీధి, శేషాద్రిశాస్త్రి వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్తు ఉండదని ఈఈ తెలిపారు.

విద్యాభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి డోలా

అరండల్‌పేట (సీతారాంపురం), న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్య సంక్షేమంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో మంగళవారం ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. మంత్రి మాట్లాడుతూ.. గురుకులాల విద్యార్థులకు ఇప్పటికే ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్లను మూడు నుంచి పదికి పెంచామన్నారు. విజయవాడ కబేళా సెంటర్‌లో రూ.80 లక్షలతో శాశ్వత శిక్షణ కేంద్రాలు నిర్మిస్తున్నామన్నారు. పేద విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చైనా భరిస్తుందన్నారు. విద్యార్థులు అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరాలని ఆయన ఆకాంక్షించారు.

బెదిరిస్తే.. భయపడకండి..

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : మీపై కేసు నమోదైందని, మిమ్మలను అరెస్టు చేస్తున్నామంటూ బెదిరించి డబ్బులు పంపని ఎవరైనా ఫోన్‌లో బెదిరిస్తే భయపడవద్దని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. సైబర్ సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం తమ తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బ్యాంకుల్లో సిబ్బందికి, ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంకర్ల పాత్ర ముఖ్యమని, వారు అప్రమత్తంగా ఉంటే చాలా వరకు వాటిని నియంత్రించవచ్చని వివరించారు. ఎవరైనా పొదుపు ఖాతా నుంచి కరెంట్ ఖాతాకు డబ్బులు పంపమని వస్తే.. వారిని పూర్తిగా ప్రశ్నించిన తర్వాతే నగదు బదిలీ చేయాలని సూచించారు. దీని కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ప్రశ్నావళితో కూడిన కరపత్రాలను బ్యాంకు సిబ్బందికి అందించారు. ఖాతాదారులతో మాట్లాడి.. మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెట్టుబడుల పేరుతో తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఇస్తామంటే.. వారి మాటలు నమ్మవద్దని సూచించారు.

బ్యాంకు సిబ్బందికి కరపత్రాలు అందిస్తున్న సీఐ శ్రీనివాస్

TEXMO AQUATEX
బిల్లర్ల దినోత్సవ శుభాకాంక్షలతో..
శివా కమర్షియల్ ఏజెన్సీస్
ఫోన్: 0866-2426566
ఆథరైజ్డ్ డీలర్స్: టెక్స్‌మో డొమెస్టిక్ మోనోబ్లాక్, జెట్‌పంప్స్, సబ్‌మెర్సిబుల్ మరియు ఆక్వాటెక్స్ మోటార్స్, అగ్రికల్చరల్ మోనోబ్లాక్ & స్పేర్స్
కె.శ్రీధర్ 98482 30066

సుధీర్ టింబర్ డిపో
98489 10892
OPEN PLOTS, DUPLEX VILLAS
N.N.V.S. N.M.V.
NH 65 సర్వీస్ రోడ్డు
98486 62222
94401 58793

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
విజయవాడ సిటీ రామవరప్పాడులో 350 ఎకరాల మెగా గేటెడ్ కమ్యూనిటీ టౌన్‌షిప్
International school
Club house
Star hotel
PHASE -1 FEW PLOTS ONLY
CRDA ఓపెన్ ప్లాట్స్ సేల్
వరల్డ్ క్లాస్ ఎమినిటీస్‌తో
సంప్రదించండి 77 888 999 99

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

విజయవాడ నగరపాలక సంస్థ, : నగరంలోని స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు సఖి సురక్ష ద్వారా నగరంలోని కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్ కల్యాణ మండపం, సూర్యారావుపేట ఐవీ ప్యాలెస్‌లో మంగళవారం ఉచిత వైద్య, క్యాన్సర్ పరీక్షలు చేశారు. దాదాపు 600 మంది మహిళా సంఘాల సభ్యులకు థైరాయిడ్, హిమోగ్లోబిన్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా యూసీడీ పీవో వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలపై 35 ఏళ్లు నిండిన మహిళలకు శిబిరాలు నిర్వహించి, ఆరోగ్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు సుజాత, శ్రీకాంత్, జగదీశ్వరి, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

కళా సేవ.. స్ఫూర్తిదాయకం

ప్రవీణ్‌కు అవార్డు అందిస్తున్న నరసింహారావు, విజయ్ కుమార్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : కళలు, సాంస్కృతిక, సేవా రంగాల్లో రాణిస్తున్న అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య సమితి అధ్యక్షుడు గంగళ విజయ్‌కుమార్ సేవలు నిరుపమానం అని విజయవాడ ప్రథమ మెట్రోపాలిటన్ ప్రత్యేక న్యాయమూర్తి దేవు నరసింహారావు అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సమితి ఆధ్వర్యంలో ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. న్యాయమూర్తి నరసింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్‌జేడీ కుమార్‌ల చేతుల మీదుగా వివిధ రంగాల్లోని ప్రతిభావంతులైన 24 మంది అవార్డులు అందజేశారు. ఒక సంస్థ 25ఏళ్లుగా సేవలు అందించడం స్ఫూర్తిదాయకం అన్నారు.

కనకదుర్గ పైవంతెనపై ప్రమాదం

భవానీపురం: కనకదుర్గ పైవంతెన ప్రమాదం జరగడంతో మంగళవారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒక కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. దీంతో పైవంతెనపై వాహనాలు స్తంభించాయి. ట్రాఫిక్ పోలీసులు క్రేన్‌ను తెప్పించి కార్లను పక్కకు పెట్టించడంతో వాహనాలు సజావుగా వెళ్లాయి. ట్రాఫిక్ సీఐ సురేష్ పర్యవేక్షించారు.

ప్రకటన

నా క్లయింటు విజయవాడ కానూరి వారి వీధి, ముకేష్. పి.షా గారి భార్య సవితా ఎమ్‌షా గారి సూచన ప్రకారము తెలియజేయునది ఏమనగా.. దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని విజయవాడ కాపురస్తురాలు అరుణ్‌కుమార్ గారి భార్య సోనమ్ జైన్ గారు దస్తావేజు నెం. 3421/ 2012 Dt. 6-7-2012 (SRO గుణదల) రీత్యా క్రయము పొంది సర్వసంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్న షెడ్యూలు ఆస్తిని నా క్లయింటుకు విక్రయించుటకు ఖరారు పడి కొంత అడ్వాన్సును తీసుకునియున్నారు. నా క్లయింటు మిగతా క్రయ ప్రతిఫలమునిచ్చి, సక్రమమైన Regd దస్తావేజు వ్రాయించుకొనుటకు సిద్ధముగా ఉన్నారు. కావున ఎవరికైననూ అభ్యంతరములు, వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన లగాయతు 15 రోజులు లోపుగా క్రింది అడ్రస్సుకు Regd Post With Ack Due ద్వారా తెలియజేయగలరు. తదుపరి వచ్చు క్లయిములు, ఆక్షేపణలు గాని, వగైరాలు నా క్లయింటును గాని సదరు ఆస్తిని గాని బైండు చేయజాలవని, సదరు ఆస్తి నిష్పేచి ఆస్తిగా ఎంచెదరని యావన్మందికీ తెలియజేయుడమైనది.

షెడ్యూలు An extent of undivided 35 Sq. Yds of Site and Flat no.4 in Second Floor With 920 Sq. ft. Plinth area +50 Sq. ft Common area +30 Sq.ft Parking in Poosapati Enclave in NTS No 61/2, 65, 66 Part, 72/B Situated in Masid Street Governorpet, Vijayawada Within the Following Boundaries. **East-** Open to sky; **South-** Open to Sky; **West-** Open to Sky; **North-** Flat No.3 of Varre Sumathi and With all Easementary Rights.

T.V.N. Vasudevarao, Advocate,
Gudivada Vari Street,
Vijayawada- 520 001, A.P

రైతులతో సమావేశాలు నిర్వహించండి

కమిటీ సభ్యులతో చర్చిస్తున్న వై.ఎస్.షర్మిల

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఏఐ, డేటా సెంటర్, క్వాంటం వ్యాలీ అనే కొత్త ముచ్చట్లు పెడుతూ అమరావతిని నిర్లక్ష్యం చేస్తోందని, దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అమరావతి కోర్ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సాయంత్రం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో కోర్ కమిటీ సభ్యులతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల సమావేశం నిర్వహించారు. అమరావతి ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. విశాఖ కేంద్రంగా జరిగిన సదస్సులో రూ.13 లక్షల కోట్లు ఎంఓయూలు కుదుర్చుకున్నామని చెబుతున్నారని.. వాటిలో అమరావతి ప్రాంతం లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాజధాని రైతులతో సీఆర్‌డీఏ అధికారులు సమావేశం కావడం లేదని.. నెలకు ఒకసారైనా సమావేశమవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు కొలనుకొండ శివాజీ, నరహరిశెట్టి నరసింహారావు, చిలక విజయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు

మాట్లాడుతున్న నరసింహారావు. వేదికపై రవీంద్రనాథ్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నరసింహారావు తెలిపారు. మంగళవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్మికులనుద్దేశించి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలను సీఎం మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ప్రైవేటీకరణను వ్యతిరేకించి.. ఇప్పుడు మాట తప్పడం సరికాదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికుల పని గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర వనరులను అప్పనంగా పంచుతున్నారని విమర్శించారు. ప్రజా పోరాటాలతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. 26న తలపెట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వై.కేశవరావు, ఎ.వి.నాగేశ్వరరావు, సింహాద్రి ఝాన్సీ, ఎం.వెంకటరెడ్డి, ఎం.రామకృష్ణ, సుధీర్, జానకీరాములు, మరీదు ప్రసాదబాబు, చలసాని రామారావు, కృష్ణమూర్తి, ఆంజనేయులు, ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు విజయవాడ, సీతారామపురం కాపురస్తులు కర్రి కృష్ణమూర్తి గారి భార్య కర్రి రమణ కుమారి గారి నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా..

ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తిని, నా క్లయింటు క్రయము చేయుటకు నిర్ణయించుకొని విక్రయదారులు అయిన విజయవాడ, సీతారామపురం వాస్తవ్యులు బంటుమిల్లి లక్ష్మీ సాయి గారి కుమారుడు బంటుమిల్లి సాయికృష్ణ, గుంటూరు జిల్లా కావూరు వాస్తవ్యులు అయిన కర్రావుల మున్నయ్య గారి భార్య కర్రావుల సాయి భవాని గార్లకు కొంత బయాన యిచ్చివున్నారని, ఈ దిగువ షెడ్యూలు ఆస్తి, గతములో విజయవాడ, సీతారామపురం వాస్తవ్యులు జామి అంజయ్య గారిదని వారు విజయవాడ, సీతారామపురం వాస్తవ్యులు స్వయంబారపు (లేటు) రామయ్య గారి కుమారుడు గోపయ్య వగైరాల నుండి ది. 31-10-1968వ తేదీన విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయము నుండి విక్రయ దస్తావేజు నెం. 4127/1968రుగా క్రయము చేసియున్నారని ఆ విధముగా జామి అంజయ్య గారి హక్కుభుక్తములలో ఉండగా వారి జీవిత కాలములో అనగా ది. 19-12-1997వ తేదీన ఒక వీలునామా వ్రాసి అదియే ఆఖరి వీలునామాగా ఉంచి వారు ది. 24-01-1998వ తేదీన మరణించినారని, వారి మరణానంతరము ఆ వీలునామా రీత్యా దిగువ షెడ్యూలు ఆస్తి వారి భార్య అయిన జామి సోమాలు (సోమాలమ్మ) గారికి సంపూర్ణ హక్కులతో సంక్రమింపచేసినారని సదరు ఆస్తిని వారు అనుభవించుచూ ఉండగా వారికి ఎటువంటి సంతతి లేనందున వారి దత్తత కుమార్తె అయిన బంటుమిల్లి లక్ష్మీ సాయి స్వాధీనము చేసుకొని జీవిత కాలపు హక్కులతో అనుభవించెలాగును ఆమె తదనానంతరము ఆమె కుమారుడు మరియు కుమార్తెలకు సదరు ఆస్తిని సమాన వాటాలుగా పంచుకొని దాన దమన వినిమయ విక్రయాది హక్కు భుక్తములతో అనుభవించేలాగును ఏర్పాటు చేస్తూ ది.10-08-2017 తేదీన ఒక వీలునామాను వ్రాయించి గుణదల సబ్ రిజిష్ట్రారు వారి కార్యాలయములో దస్తావేజు నెం.129/2017రుగా రిజిష్టరు చేయించి సదరు జామి సోమాలు గారు ది. 16-11-2019వ తేదీన అలాగే వారి దత్తత కుమార్తె అయిన బంటుమిల్లి లక్ష్మీసాయి గారు ది. 22-05-2021వ తేదీన మరణించుట వలన వారి యిరువురు మరణానంతరము నా క్లయింటు యొక్క విక్రయదారులకు పూర్తి హక్కులతో సంక్రమించి వారి యిరువురు జాయింటుగా అనుభవిస్తూ పై చెప్పబడిన విధముగా నా క్లయింటుకు విక్రయించుటకు నిర్ణయించుకొని ఉన్నారని కావున నా క్లయింటు తన విక్రయదారులకు పూర్తి విక్రయ ప్రతిఫలము చెల్లించి తన పేరున గాని తాను కోరిన వారి పేరు మీదగాని క్రమమైన విక్రయ దస్తావేజు పొందుటలో ఎవ్వరికైనా, ఏవిధమైన న్యాయపరమైన అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ నోటీసు వెలువడిన 7 (ఏడు) దినముల లోపల వ్రాతపూర్వకముగా తిరుగు రసీదుతో ఈ క్రింది చిరునామకు తెలియచేయవలెను. అటు పిమ్మట వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండ్ చేయజాలవు.

షెడ్యూలు: యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, సీతారామపురంలో గల ఆస్తికి రెవిన్యూ వార్డు నెం.11, బ్లాకు నెం.1, యన్.టి.యస్. నెం.8, ప్రస్తుత అసెస్మెంటు నెం. 1073093944, డోర్ నెం. 33-5-32ల్లు దాఖలా ప్రస్తుత కొలతల ప్రకారం 86-0 చ.గ.లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి డాబా బిల్డింగుతో సహా గల స్థిరాస్తికి **హద్దులు: తూర్పు :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** బోయపాటి వెంకటరత్నం గారి ఆస్తి, **పడమర:** ధూళిపాల కోటేశ్వరరావు వగైరాల ఆస్తి మరియు బజారు, **ఉత్తరం :** పోల కనకమ్మ డాబా.

D.S.V. PRASADA RAO B.Com, B.A., B.L, ADVOCATE
Flat No: 502, Datta Sai Towers, Alluri Sita Rama Raju Road,
Indira Nayak Nagar Colony, Azith Singh Nagar, Vijayawada -15.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాలు మనిషి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని.. వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐ అడపా నాగమురళి పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరమైన వ్యసనమని, అందరూ దూరంగా ఉండాలని కోరారు. అలవాటు పడినవారు చదువులు మానివేసి సర్వస్వం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగం నిరోధానికి భారత ప్రభుత్వం కఠినమైన చట్టాలను చేసిందని.. దీని ప్రకారం శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. బాగా చదువుకుని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై నాయక్, గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, స్వాతి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. తొలుత చిన్నారులకు వక్తృత్వ పోటీలు, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు.

ప్రకటన

నా క్లయింటు విజయవాడ కానూరువారి వీధి, పరాస్మల్‌షా గారి కుమారుడు ముకేష్‌షా గారి సూచన ప్రకారము తెలియజేయునది ఏమనగా.. దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని, విజయవాడ కాపురస్తురాలు జవేరీలాల్ గారి భార్య వాల్మీదేవి, దస్తావేజు No. 3258/2012 ది.28-6-2012 (SRO గుణదల) రీత్యా క్రయము పొంది సర్వసంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్న షెడ్యూలు ఆస్తిని నా క్లయింటుకు విక్రయించుటకు ఖరారు పడి కొంత అడ్వాన్సును తీసుకొనియున్నారు. నా క్లయింటు మిగతా క్రయ ప్రతిఫలమును ఇచ్చి, సక్రమమైన రిజిష్టర్డ్ దస్తావేజును వ్రాయించుకొనుటకు సిద్ధముగా ఉన్నారు. కావున ఎవరికైననూ అభ్యంతరములు గాని వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన లగాయితు 15 రోజులు లోపుగా క్రింది అడ్రస్సుకు Regd. Post With Ack Due ద్వారా తెలియజేయగలరు. తదుపరి వచ్చు క్లెయిములు, అభ్యంతరములు వగైరాలు, నా క్లయింటును గాని, సదరు ఆస్తిని గాని బైండు చేయజాలవని, సదరు ఆస్తిని నిష్పేచి ఆస్తిగా ఎంచెదరని యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూల్: An extent of undivided 37 Sq.Yds and Flat no.4 in 3rd Floor With 920 Sq.ft. Plinth area+ 30 Sq.ft Common area in Poosapati Enclave in NTS No. 61/2, 65, 66 Part, 72/B Situated in Masid Street, Governor pet,Vijayawada Within The Following Boundaries. **East:** Open to sky; **South**: Open to Sky; **West**: Open to Sky; **North:** property of R.Subbamma & Others With all easement Rights.

T.V.N. Vasudevarao
Advocate, Gudivada vari Street,
Vijayawada- 520 001. A.P.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

వివేకానంద పాఠశాలలో వ్యాస రచన రాస్తున్న చిన్నారులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : భారత రాజ్యాంగంపై ప్రతి పౌరులకు అవగాహన ఉండాలని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బెజ్జం జయపాల్ అన్నారు. మంగళవారం పలు పాఠశాలల్లో 'రాజ్యాంగం విశిష్టత, అంబేడ్కర్ కృషి' అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ దినోత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా వ్యాస రచన పోటీలు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక చిత్తరంజన్ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ.. వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి విద్య చాలా ముఖ్యమని చెప్పారు. అది విద్యార్థికి నైపుణ్యాలు, జ్ఞానం అందిస్తుందని చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.వై.వరప్రసాద్, డి.సునీల్‌కుమార్, ప్రణీత, మానస, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిద్ర మత్తులోనే ఎక్కువ ప్రమాదాలు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : అర్ధరాత్రి దాటిన తర్వాత చోదకుల నిద్ర మత్తు వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని మూడో ట్రాఫిక్ సీఐ కొత్తూరు కిషోర్ బాబు అన్నారు. సీపీ రాజశేఖర బాబు ఆదేశాల మేరకు మూడో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి జాతీయ రహదారుల్లో వాహనదారుల రోడ్డు భద్రత కోసం 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించారు. ట్రావెల్స్ బస్సులు, హెవీ వెహికల్స్, కార్లు ఆపి.. చోదకులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ ఎన్ని గంటల నుంచి చేస్తున్నారు, ప్రయాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు నివారించేందుకు.. నీటితో ముఖం కడిగించారు. అలసట తగ్గే మార్గాలు సూచించారు. మత్తులో డ్రైవింగ్ చేయడం.. మద్యం తాగి వాహనాలు నడపడంతో సమానమని పేర్కొన్నారు. ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చోదకుడి ముఖం కడిగిస్తున్న సీఐ కిషోర్‌బాబు

'సతీష్ మృతిపై అనుమానాలు అనేకం'

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అనంతపురం జిల్లా పత్తికొండకు చెందిన సీఐ సతీష్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కేదరాశిపల్లి నరేంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఐని కిరాతకంగా చంపడం, మృతదేహాన్ని రైలు పట్టాల పక్కన పడేసి ప్రమాదంలా సృష్టించిన ఘటనపై కుటుంబ సభ్యులకు, కుమ్మర్లకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన డీజీపీకి వినతిపత్రం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రజల భద్రతపై పలు సంస్థలకు నోటీసులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని పలు సంస్థలు తమ ప్రాంగణంలోకి వీధి కుక్కలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ నగరపాలక సంస్థ అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు సిబ్బంది ద్వారా పలు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, బస్టాండ్లు, డిపోలు, రైల్వేస్టేషన్ల బాధ్యులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ అధికారి కె.అర్జునరావు మాట్లాడుతూ నగరంలోని అన్నిరకాల సంస్థలు తమ ప్రాంగణాల్లోకి వీధి కుక్కలు రాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను ఎవరికి వారే తమ ప్రాంగణాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రాంగణాల్లో ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచవద్దని సూచించారు. వీధి కుక్కలకు నగరంలోని 61 ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఆహార కేంద్రాలు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో మాత్రమే ఆహారం ఉంచాలని సూచించారు. నగరంలోని ప్రతి సంస్థ ఇందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించుకోవాలని, సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని, అందుకు 10 రోజుల్లోగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్‌ఎసిపిసి-1), కె.కె.టవర్స్,
మొదటి అంతస్థు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా.

Appendix – IV –A
[See Provison to rule 8(6) R/w 9(1)]

స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది.22-12-2025

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకపు నోటీసు రూల్ 8(6) ఆర్/డబ్ల్యూ రూల్ 9(1) ప్రకారం

భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడిన నోటీసు ప్రకారం దిగువ ఋణ ఖాతాలలో **"ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే ఏది ఉన్నది ఉన్నట్లుగానే మరియు ఏది ఉంటే అది ఉన్నది ఉన్నట్లుగానే"** అనే నిబంధనపై బ్యాంక్ బకాయిలను మరియు వడ్డీను వసూలు చేయటానికి విక్రయించే హక్కుతో దిగువ ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. కావున బకాయిలను తిరిగి చెల్లించటంలో విఫలమైన తరువాత దిగువ అధీకృత అధికారి పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద ఇవ్వబడిన అధికారాన్ని ఉపయోగించి సదరు ఆస్తిని విక్రయించడం ద్వారా బ్యాంకు బకాయిలను రాబట్టుకొనుటకు ప్రతిపాదిస్తున్నారు. **https://www.baanknet.com** వెబ్ పోర్టల్‌లో పేర్కొన్న ఇ-వేలం ప్లాట్‌ఫాం ద్వారా దిగువ సంతకం చేసిన వ్యక్తి ద్వారా అమ్మకం జరుగుతుంది.

ఋణగ్రహీత(ల) పేరు: **1. శ్రీ కుర్రా మారుతి శంకర్, తండ్రి: వెంకటేశ్వరరావు,** 2వ అంతస్థు, బి-5, చంద్రహాస అపార్ట్‌మెంట్, పెట్రోల్ బంక్ ప్రక్కన, ఆంధ్రప్రభ కాలని, విజయవాడ-520 013, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్. **2. శ్రీమతి కుర్రా సుశీల, తండ్రి: బాలసుబ్బారావు వేల్పుల, భర్త: కుర్రా మారుతి శంకర్,** డోర్ నెం: 41-29/1-25, చలసాని నగర్, రాణిగారి తోట, విజయవాడ-520 013, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

బకాయి మొత్తం: **ది.04-06-2025 నాటికి రూ.1,37,69,216/- (అక్షరాల ఒకకోటి ముప్పైఏడులక్షల అరవైతొమ్మిదివేల రెండువందల పదహారు రూపాయలు మాత్రమే) & ది.15-11-2025 నాటికి రూ.1,43,19,997/- (అక్షరాల ఒకకోటి నలభైమూడులక్షల పందొమ్మిదివేల తొమ్మిదివందల తొంభైఏడు రూపాయలు మాత్రమే)** (ఏవైనా చెల్లింపులు ఉంటే తగ్గించగా) **తదుపరి వడ్డీ, ఖర్చులు.**

స్థిరాస్తి వివరము: కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, విజయవాడ గ్రామం, రీ సర్వే నెం.18/4 లోని ఉత్తర భాగం 207.33 చ॥గ॥లు శ్రీమతి కుర్రా సుశీల, భర్త: మారుతి శంకర్ గారికి చెందిన డాక్యుమెంట్ నెం.3578/2013, తేది:15-05-2013. **హద్దులు: తూర్పు:** 30 అడుగుల వెడల్పుగల రోడ్డు-30.0 అడుగులు, **దక్షిణం:** ఇతరుల ఆస్తి-62.2 అడుగులు, **పడమర:** సుందరరావు గారి ఆస్తి-30.0 అడుగులు, **ఉత్తరం:** పి. కనకదుర్గా గారి ఆస్తి-62.2 అడుగులు. ఈ నాలుగు హద్దుల మధ్య గల విస్తీర్ణం 207.33 చ॥గ॥లు లేక 173.35 చ॥మీ॥లు (ఆర్‌సిసి భవనము నిర్మించబడుచున్నది స్టిల్ట్ & జి+2).

రిజర్వు ధర: రూ.1,51,33,000/- ధరావత్తు: రూ.15,13,300/- బిడ్ పెంపుదల: రూ.10,000/-
ఇ-వేలం తేదీ & సమయం: 22-12-2025 ఉ॥ గం॥ 11.00 ల నుండి సా॥ గం॥ 05.00 ల వరకు

సొమ్మును సమర్పించుటకు **A/c No:30733231487, IFSC Code: SBIN0011098, Name of the Bank, SBI, SARC, (RACPC-1, Vijayawada, NTR District)** వెబ్‌పోర్టల్ **https://www.baanknet.com** (యూజర్ ఐడి & పాస్‌వర్డ్ ఉచితంగా **https://www.baanknet.com** లో రిజిష్టర్ చేసుకొన్న పేరు మీద లభించును) ద్వారా పాస్‌వర్డ్ & లాగిన్ ఐడి కలిగివుండవలెను.

తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా **M/s PSB Alliance PVT Ltd., టోల్ ఫ్రీ నెం: +91 8291220220** వారి వెబ్ పోర్టల్ **https://www.baanknet.com** మరియు పై లభించు ఇ-వేలపు నియమ నిబంధనల పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరుచున్నాము. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తుల తనిఖీ కొరకు **చీఫ్ మేనేజర్-మొబైల్ నెం.9424690028, ఇ-మెయిల్ ఐడి: sbi.05252@sbi.co.in** మరియు రికవరీ ఏజెన్సీ: **M/s.Sarah Associates: 9849189726 & 7396223738** వారిని బ్యాంకు పనిదినములలో సంప్రదించవచ్చును. నియమ నిబంధనలు వర్తిస్తాయి.

ప్రదేశం : విజయవాడ
తేది : 17-11-2025

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ఈనాడు
అనకాపల్లి
బుధవారం 19 నవంబరు 2025

విదేశాల నుంచి అతిథులొచ్చారు!

చెరువులు, సరస్సుల్లో సందడి చేసే సైబీరియా పక్షులు కొండకర్ల ఆవ ప్రాంతంలో సందడి చేస్తున్నాయి. ఇవి ఆంగ్ల అక్షరం 'వి' ఆకారంలో ఎగురుతూ వేల కిలోమీటర్ల ప్రయాణిస్తాయి. ఏటా అక్టోబర్‌లో సైబీరియా నుంచి ఏడు వేల కిలోమీటర్ల వరకు ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుంటాయి. వీటి రెక్కలు మిగిలిన పక్షుల కంటే చాలా పొడవుగా ఉన్న కారణంగా వేల కిలోమీటర్ల దూరాన్ని సులభంగా ప్రయాణిస్తాయి. చిన్న చేపలు, పురుగులు, కప్పలు వంటి జలచరాలే వీటికి ప్రధాన ఆహారం. నీటిలో నిలబడేందుకు వీటి కాళ్లు చాలా పొడవుగా ఉంటాయి. లోతైన ప్రాంతంలో సైతం ఆహారం సులభంగా పొందగలుతాయి. ప్రమాదాన్ని, వేటగాడిని గమనించిన వెంటనే ఒక్కసారిగా గాల్లో ఎగిరిపోతాయి.

– అచ్యుతాపురం, న్యూస్‌టుడే

20న అప్రెంటిస్‌షిప్‌పై యువతకు అవగాహన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఈనెల 20న అప్రెంటిస్‌షిప్‌పై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లైఫ్‌సైన్స్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సౌత్ ఇండియా హెడ్ అమరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఏపీఐఐసీ వన్‌స్టాప్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఇది జరుగుతుందన్నారు. అచ్యుతాపురం ఇండస్ట్రియల్ అసోసియేషన్‌తో కలిసి దీనిని ఏర్పాటు చేశామన్నారు. దీనికి వివిధ కంపెనీల మానవ వనరుల విభాగాల మేనేజర్లు, ప్లాంట్స్ హెడ్స్, అధికారులు, కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగాధిపతులు హాజరవుతారన్నారు. ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు, నియమావళి, సీఎస్ఆర్ నిధుల ఖర్చు, మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాలపై హాజరైన అభ్యర్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు కె.వాసు, అభిషేక్‌రాణా, 90595 36122, 88002 82887 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు.

ఇసుకే బంగారం

జోరుగా అనధికార వేలం పాటలు

- దేవరాపల్లి, న్యూస్‌టుడే

మొంథా తుపాను పంటలకు నష్టం కలిగించినా.. ఇసుకాసురులకు మాత్రం పంట పండించింది. ఓ వైపు ప్రభుత్వం ఉచితంగా ఇసుక తరలించుకోవచ్చని చెబుతున్నా దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటి తవ్వకాలకు అనధికారికంగా నిర్వహిస్తున్న వేలం పాటల్లో రూ. లక్షలు దారపోసి దానికి రెండింత వసూలు చేస్తున్నారు.

దేవరాపల్లి మండలంలోని శారదానదిలో గతంలో నిల్వలు భారీగా తగ్గాయి. ఇటీవల తుపాను కారణంగా నదిలో ఇసుక మేటలు వెలిశాయి. దీంతో ఇటీవల పరివాహక గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించారు. మండలంలోని ఒక గ్రామంలో నిర్వహించిన వేలం పాటలో మండలం నలుమూలల నుంచి అధికసంఖ్యలో పాల్గొన్నారు. కేవలం ఈ గ్రామం సమీపంలోని ఇసుక తరలించడానికి నిర్వహించిన వేలంలో ఒక్క రీచ్‌కు రూ. 30 లక్షలకు పాడారు. ఇదే కాకుండా ఆ గ్రామానికి అతి సమీపంలోని వేరొక రీచ్ నిర్వహించిన వేలంలో రూ. 2 లక్షలకు పాడినట్లు తెలిసింది.

నది పరివాహక ప్రాంతాలైన చింతలపూడి, సమ్మెద, తామరబ్బ, దేవరాపల్లి, తెనుగుపూడి, వెంకటరాజపురం, మారేపల్లి, తారువ, తిమిరాం, మామిడిపల్లి, కలిగొట్ల, బోయిలకింతాడ తదితర ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

★ గ్రామాభివృద్ధి పేరిట రాజకీయంగా అతీతంగా వేలం నిర్వహిస్తూ, పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారు. మండలాలకు పరిమితం కావలసిన తరలింపు జిల్లాలు దాటుతోంది. దీనిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు తదితర ప్రభుత్వ యంత్రాంగాలు మిన్నకుండిపోతున్నాయి. దీంతో ఇసుక మాఫియా దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

అనధికారిక వేలం పాటలు నిర్వహించి, గ్రామాల్లో ఆలయాల పేరిట నగదు వసూలు చేస్తుండటంతో ఇసుకను ట్రాక్టరులో తరలించడానికి రూ.వేలల్లో కొనుగోలుదారుకు ముట్టజెప్పాల్సి వస్తోంది.

దీనివల్ల శారదా నది పరివాహక ప్రాంతాల్లోని దేవరపల్లి, తెనుగుపూడి, తారువ, కలిగొట్ల, గవరవరం వంటి గ్రామాలకు ముప్పు వాటిల్లుతోంది. అంతే కాకుండా గ్రామాలకు ఆనుకొని ఉన్న నది గట్లు కోతకు గురవుతున్నాయి.

ఈ-నారిది కొత్త దారి

పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు

నర్సీపట్నం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం వ్యవస్థల్లో మార్పులకు శ్రీకారం చుట్టి పదివేలకు అడుగులు వేస్తోంది. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందులో భాగంగా పలు పథకాలను అమలు చేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఇతర రుణాలు అందజేసి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూత అందిస్తోంది. ఇటీవల ఈ-నారీ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. గ్రామాల్లో నివసించే మహిళల జీవనోపాధికి దోహదపడుతుంది. వెలుగు సిబ్బంది సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ-నారీలను ఎంపికచేయడంలో నిమగ్నమయ్యారు. ఎంపికైన మహిళలకు బ్యాంకింగ్, రికార్డుల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత వారు సంఘాల నిర్వహణ పర్యవేక్షణ ఉండేలా పర్యవేక్షిస్తారు.

పది సంఘాలకు ఒకరు..

» గ్రామాల్లో వెలుగు సంఘాలను ఇప్పటివరకు సీసీ, వీవోలు పర్యవేక్షించారు. ఇకపై ఈ-నారీగా ఎంపికైన వారు ఆ బాధ్యతలు చూస్తారు.

» పది సంఘాలకు ఒకరిని ఎంపిక చేసి గౌరవ వేతనం ఇవ్వనున్నారు. ఎంపికైన మహిళ తన పరిధిలోని పది సంఘాల బాధ్యతలు నిర్వర్తిస్తారు.

» సభ్యులు పొదుపు చేసేలా.. రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించడం, రికార్డుల నిర్వహించడం వంటి కార్యకలాపాలు చేపడతారు. ఈ-నారీగా ఎంపిక కావాలంటే పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి.

శిక్షణ పూర్తి చేసుకున్న నర్సీపట్నం ఈ -నారీలు

▶▶ **సమర్థంగా సంఘాల నిర్వహణ:** గ్రామైక్య సంఘాల నిర్వహణకు ఈ-నారీ వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైంది. సంఘాలను సక్రమంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. – పి.కనకరావు, డీపీఎం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

అనకాపల్లి జిల్లాలో..
మండలాలు 24
పొదుపు సంఘాలు 39,453
ఈ-నారీ లక్ష్యం 4,000
గ్రామైక్య సంఘాలు 1,270
సభ్యులు 4,12,000

యాప్‌లో సమగ్ర సమాచారం

★ సభ్యుల పొదుపు నిల్వలు, ఖర్చులు తదితర సమాచారమంతా త్వరలోనే యాప్‌లో అందరికీ అందుబాటులోకి రానుంది. వీటిపై పొదుపు మహిళలకు ఈ-నారీలుగా ఎంపికైన వారు అవగాహన కల్పిస్తారు. – రమణకుమారి, ఏపీఎం

దీపాలంకరణ సేవలో భక్తులు

ఆకట్టుకున్న శారదమ్మ హారతి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి పరశురామపేటలోని ఉమా రామలింగేశ్వరాలయం వద్ద మంగళవారం రాత్రి శారదానదికి సంప్రదాయబద్ధంగా హారతి ఇచ్చారు. ముందుగా ప్రధాన అర్చకులు సాలగ్రామ రఘు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం గంగా హారతి తరహాలో శారదా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నది ఒడ్డున ఉన్న ఘాట్‌లలో పెద్ద సంఖ్యలో భక్తులు దీపాలను వెలిగించారు. జడ్పీ ఉపాధ్యక్షురాలు సత్యవతి, పలకా కాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి నాలుగు స్వర్ణాలు

రోలుగుంట, న్యూస్‌టుడే: రోలుగుంట ఆంగ్ల ఉపాధ్యాయిని నాగజ్యోతి మరోసారి తన సత్తాచాటారు. ఇందులో భాగంగానే ఈ నెల 14నుంచి 17వరకూ భూటాన్‌లోని 'సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్' నిర్వహించిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ పోటీల్లో రోలుగుంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని పి.వి.ఎం. నాగజ్యోతి అద్భుతమైన క్రీడాప్రతిభను ప్రదర్శించి నాలుగు స్వర్ణాలను సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో నాగజ్యోతి 60మీటర్ల పరుగు, 100మీటర్ల పరుగు, డిస్క్‌త్రో, పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు.

అన్నదాతకు ఆసరా

నేడు సుఖీభవ నగదు ఖాతాల్లో జమ

అనకాపల్లి, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో భాగంగా జిల్లాలోని రైతులకు రూ. 158.40 కోట్ల ఆర్థిక సహాయం అందనుంది. జిల్లాలోని 2,42,480 మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. సూపర్ సిక్స్ హామీలో భాగంగా అన్నదాతకు ఏటా రూ. 20 వేల ఆర్థిక సహాయం చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడత కింద ఇప్పటికే ఒక్కో రైతుకు రూ. 7 వేలు అందించారు. రెండో విడతగా బుధవారం మరో రూ. 7 వేలు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట పక్వదశకు చేరుకుంది. త్వరలోనే కోతలకు సిద్ధమవుతున్నారు. ఈదశలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ. 7 వేలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పి.బాబు, మారిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

నియోజకవర్గం	రైతులు	రూ.కోట్లు
అనకాపల్లి	22,300	14.6
ఎలమంచిలి	33,760	21.9
చోడవరం	51,260	33.5
మాడుగుల	45,340	29.7
పాయకరావుపేట	39,300	23.1
నర్సీపట్నం	35,040	23.1
పెందుర్తి	15,480	10.1

సబ్బవరంలో జిల్లాస్థాయి కార్యక్రమం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పీఎం-కిసాన్ అన్నదాత సుఖీభవ జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బురద.. పండగ సరదా

జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పోలిస్తే అత్యంత ప్రత్యేకంగా నిలిచేది రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో జరిగే జాతర. ఈ గ్రామంలో రెండేళ్లకోసారి బురదమాంబ పండగ ఘనంగా నిర్వహిస్తారు. ఈ పండగ నాడు ఊరిలో చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అంతా ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటారు. గ్రామంలోకి వచ్చే ఎంతటి ప్రముఖులకైనా బురద జల్లుతారు. ఈ ఉత్సవం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం పది గంటల వరకు సాగింది. చిన్నారులు, యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని వేపకొమ్మలను బురదలో ముంచి నృత్యాలు చేసుకుంటూ ఎదురుపడిన ప్రతి ఒక్కరిపై జల్లుకుంటూ వెళ్లారు. డ్రమ్ముల్లో సిద్ధం చేసిన బురదను సంతబయలు ఆవరణలో యువకులు పూసుకొని నృత్యాలు చేశారు. గ్రామంలో అన్ని వీధుల్లోనూ ఇదే సందడి. అనంతరం శివారులో ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు చేయడంతో ఉత్సవం ముగిసింది. ఆంగ్లేయుల కాలం నుంచి ఈ ఉత్సవం కొనసాగుతోందని పూర్వీకులు వెల్లడించారు.

– రాంబిల్లి, న్యూస్‌టుడే

తమలపాకు పరిహారంపై వివాదాల ముసురు

పూర్తి స్థాయిలో సర్వేకి వినతి

పాయకరావుపేట, న్యూస్‌టుడే

తమలపాకు తోటల పరిహారంపై వివాదాల ముసురు ముదురుతోంది. గత నెలలో వచ్చిన మొంథా తుపానుకు సత్యవరం, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, కొత్తూరు, మంగవరం తదితర గ్రామాల పరిధిలో తోటలకు నష్టం వాటిల్లింది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉద్యానశాఖ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈ గ్రామాల పరిధిలో 555 మందికి పైగా పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదికలు సిద్ధం చేశారు. సుమారు 150 ఎకరాల్లో పంట దెబ్బతిందని పేర్కొన్నారు. ఆ తర్వాతే అసలు కథ మొదలైంది. మాసాహెబ్‌పేట, సత్యవరం గ్రామాల్లో సగం మంది అనర్హులు జాబితాల్లో చొరపడ్డారని కలెక్టర్‌కు కొంతమంది గ్రామస్థులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. మరో రెండడుగులు ముందుకువేసి ఎన్నడూ లేని విధంగా రెండు గ్రామాల్లో జాబితాల్లో ఉన్న పేర్లను ఫ్లెక్సీలు వేసి కూడళ్లలో ఏర్పాటు చేశారు. దీంతో అవాక్కవడం గ్రామస్థుల వంతయింది. పార్టీలకు అతీతంగా మూకుమ్మడిగా అనర్హులు పరిహారం జాబితాల్లో చోటు దక్కించుకున్నారు. దీనిపై 'ఈనాడు'లో సైతం కథనం ప్రచురితమైంది. వరి రైతులు, అసలు వ్యవసాయమే లేని చోటామోటా నాయకులు, పేర్లను దీనిలో చేర్పించారు. దీనిపై ఉద్యాన శాఖ అధికారిణి సాయిప్రియ మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో మరోసారి సర్వేచేసి గ్రామ సభలు నిర్వహించి జాబితాలు రూపొందిస్తామన్నారు.

నేలకొరిగిన తమలపాకు తోట

నష్టం గోరంత.. జాబితా కొండంత అన్నచందంగా తయారు చేశారు.

ఫ్లెక్సీల్లో చోటు దక్కించుకున్న పేర్లపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో రెండోదఫా సర్వేను మాసాహెబ్‌పేటలో చేపట్టారు. అదీ తూ.తూ. మంత్రంగా నిర్వహించారు. సత్యవరంలో ఇప్పటికీ రీ సర్వే చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తున్నా ఉద్యానశాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నామని స్థానికులు పేర్కొన్నారు.

మీ సొమ్ములే.. తిరిగి తీసుకోండి!

కలెక్టరేట్, న్యూస్‌టుడే

ప్రజలు తమ పేర్లపై ఉన్న క్లెయిమ్ చేయని లేదా మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందేందుకు భారత ప్రభుత్వం 'మీ డబ్బు-మీహక్కు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో బ్యాంకులు, బీమా, ఆర్థిక సంస్థల్లో క్లెయిమ్ చేయకుండా నిల్వలుగా ఉండిపోయిన ఆర్థిక ఆస్తులను వారసులు లేదా సంబంధిత వ్యక్తులు సరైన పత్రాలు సమర్పించి తిరిగి పొందవచ్చు. దీనిపై మూడు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమం చేపట్టనున్నారు. సంబంధికులు సరైన క్లెయిమ్ పత్రాలను సమర్పించి ఖాతాల్లో నిల్వలుగా ఉన్న ఆస్తులు, నగదు ఈ కార్యక్రమం ద్వారా తిరిగి పొందవచ్చు.

జిల్లాలో ఈ తరహా మొత్తం రూ.57.29 కోట్ల నిల్వలు ఉందని అంచనా.

నిర్వహణలోని లేని ఖాతాలను ఆయా బ్యాంకు వెబ్‌సైట్ లింకుల్లో తెలుసుకోవచ్చు. ఆర్‌బీఐ యూడీజీఏఎం పోర్టల్ https://udgam.rbi.org.in లోనూ చూడొచ్చు.

కొన్ని సందర్భాల్లో ఆస్తులు పరిపక్వతకు వచ్చిన తర్వాత అవి లబ్ధిదారులకు చేరడం లేదు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, నామినీ వివరాల్లో లోపం తదితర కారణాలుగా ఉన్నాయి. దీంతో పెద్ద మొత్తంలో నిధులు బ్యాంకు, బీమా, ఆర్థిక సంస్థల్లో క్లెయిమ్ చేయని రూపంలో ఏళ్ల తరబడి ఉండిపోతున్నాయి. ఖాతాలు, మ్యూచువల్ ఫండ్లలో ఉండిపోయిన ఆర్థిక ఆస్తులను ఎలా తీసుకోవాలో వారసులు లేదా కుటుంబ సభ్యులకు అర్థం కాక మిన్నకుండిపోతున్నారు.

ఆర్థిక సంస్థలు సాధ్యమైనంత వరకు లబ్ధిదారులు లేదా చట్టపరమైన వారసులను గుర్తించి వారికి అందించేందుకు కృషి చేస్తున్నా కొన్ని సందర్భాల్లో అది సాధ్యం కావడం లేదు. ఈ క్రమంలో భారత ప్రభుత్వం ఐదు ప్రధాన ఆర్థిక సంస్థలైన ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ తదితర సంస్థలతో కలిసి మూడు నెలలపాటు విస్తృతంగా ప్రచారం చేయనున్నాయి. బ్యాంకు వినియోగదారులు ఇది సదవకాశం కానుంది.

జిల్లాలో కార్యకలాపాలు లేని ఖాతాలు..

	ఖాతాలు	నగదు నిల్వలు (రూ. లలో)
వ్యక్తిగతం	3,16,075	44.82 కోట్లు
వర్తక, వ్యాపార సంస్థలు	11,565	9.32 కోట్లు
ప్రభుత్వ సంస్థలు	4,611	3.06 కోట్లు

అవగాహన కల్పిస్తాం

బ్యాంకు వినియోగదారులు, పౌరులు బ్యాంకుల్లో నిల్వలుగా మిగిలిపోతున్న వాటిని తిరిగి పొందేందుకు మీ డబ్బు-మీ హక్కు కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తాం. క్లెయిమ్ చేయని ఆస్తులను సరైన ధ్రువపత్రాలతో ఎలా తీసుకోవాలో తెలియజేస్తాం. అన్ని పత్రాలతో వచ్చిన వారికి నిర్ధారించి తిరిగి వారి ఆర్థిక ఆస్తులను అందిస్తాం. కలెక్టర్ సైతం క్లెయిమ్ చేయమని ఆస్తులకు సంబంధించి కుటుంబ సభ్యులు, వారసులు సంబంధికులను గుర్తించి ఇచ్చేలా చర్యలు చేపట్టాలి.

– సత్యనారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్

'అఖండ-2' సందడి

వేదికపై బాలకృష్ణ, బోయపాటి శ్రీను

మాట్లాడుతున్న సంయుక్తా మేనన్

విశాఖ నగరంలో 'అఖండ-2' చిత్ర బృందం సందడి చేసింది. ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణ ఈ చిత్రంలో చేసిన పాత్రపై ఇప్పటికే అంచనాలు భారీగా పెరిగాయి. 'అఖండ' భారీ విజయం నేపథ్యంలో ఈ చిత్రం వీక్షించేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్రంలో ఓ గీతాన్ని సాగర తీర నగరంలో మంగళవారం రాత్రి విడుదల చేశారు. అభిమానుల సమక్షంలో ఈ కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. హీరోయిన్ సంయుక్తామేనన్, దర్శకుడు బోయపాటి శ్రీను అభిమానులతో ముచ్చటించారు. **– న్యూస్‌టుడే, విశాఖపట్నం**

అనకాపల్లి ఆసుపత్రిని
400 పడకలుగా తీర్చిదిద్దుతాం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన ఏడాదిలో జిల్లా ఆసుపత్రిలో సీటీస్కాన్‌ను అందుబాటులోకి తెచ్చాం. డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో 200 పడకలుగా ఉన్న ఈ ఆసుపత్రిని 400 పడకలుగా మారుస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సదరం శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అర్జీదారులతో మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు అందించేలా చొరవ చూపుతున్నామన్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు అందించేలా చొరవ చూపుతున్నామని తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, నక్కపల్లి ఆసుపత్రుల్లో సదరం శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులను గుర్తించి వీరందరికీ పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో కార్పొరేట్ సామాజిక సేవా నిధులు రూ. 80 లక్షలతో ఆధునిక శస్త్రచికిత్స గదుల నిర్మాణం పూర్తయ్యిందన్నారు.

సదరం శిబిరంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ఆసుపత్రిలో గైనిక్ సేవలు మెరుగ్గా అందుతున్నాయన్నారు. సాధారణ ప్రసవాలు ఎక్కువగా చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు. గర్భిణుల సహాయకులు ఉండేందుకు వీలుగా ఆసుపత్రి వద్ద రూ. 68 లక్షల సీఎస్ఆర్ నిధులతో పనులు చేపడతామన్నారు. పోస్టుమార్టం గది ఆధునికీకరణకు రూ. 58 లక్షలతో త్వరలోనే పనులు చేపడతామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో నెఫ్రాలజీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెచ్చేలా చొరవ చూపుతున్నట్లు వివరించారు. డీసీహెచ్ఎస్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డీడీ నాయుడు పాల్గొన్నారు.

విశాఖ రేంజ్‌లోనూ అప్రమత్తం : డీఐజీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: విజయవాడ నగర శివారులోని కొత్త ఆటోనగర్‌లో ఓ భవనాన్ని మావోయిస్టులు షెల్టర్‌గా చేసుకున్న ఘటన వెలుగు చూసిన నేపథ్యంలో విశాఖ రేంజ్‌లోనూ అప్రమత్తమైనట్లు డీఐజీ గోపీనాథ్ జెట్టి చెప్పారు. నర్సీపట్నం డీఎస్పీ కార్యాలయం, మాకవరపాలెం పోలీసు స్టేషన్‌లో మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా సహా ఆరుగురు మృతి చెందారన్నారు. అల్లూరి జిల్లాలో ఇటీవల కాలంలోనే రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయని గుర్తు చేశారు. మావోయిస్టుల కోసం రానున్న రోజుల్లోనూ కూంబింగ్ ఆపరేషన్లు కొనసాగుతాయని పేర్కొన్నారు. మావోయిస్టుల విముక్త ప్రాంతంలో అభివృద్ధికి ఇక ఆటంకాలు ఉండవని అభిప్రాయపడ్డారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్‌సిన్హా

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అభ్యుదయం పేరిట నిర్వహిస్తున్న సైకిల్ యాత్రలో పౌరులు అధికంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో (ఏఓబీ) గంజాయి సాగు, రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, డ్రోన్లతో నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో 2,500 మందిని అరెస్టు చేశామని, 65 మందిపై పీడీ చట్టం ప్రయోగించామన్నారు. ఆర్థిక సంబంధ నేరాలకు పాల్పడిన 14 మంది ఆస్తులను సీజ్ చేసినట్లు చెప్పారు.

★ అధిక వేతనాలతో ఉద్యోగాలు ఇస్తామని, డిజిటల్ అరెస్టులో ఉన్నారని బెదిరించడం తదితర సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్టు అని ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అల్లూరి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే రంపచోడవరం, చింతూరు ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్లను గుర్తించినట్లు చెప్పారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎస్పీ శ్రీనివాసరావు వెంట ఉన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

త్వరితగతిన ఓటర్ల మ్యాపింగ్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఓటర్ల మ్యాపింగ్‌ను వేగంగా పూర్తిచేయాలని ప్రత్యేక ఉప కలెక్టర్ మనోరమ కోరారు. అచ్యుతాపురం మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం బూత్ స్థాయి అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఎలమంచిలి నియోజకవర్గంలో 2,07,716 మంది ఓటర్లలో అచ్యుతాపురానికి చెందిన 62,786 ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో మ్యాపింగ్ 7.14 శాతం పూర్తికాగా అచ్యుతాపురంలో కేవలం 2.62 శాతం మాత్రమే పూర్తి చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రకారం మ్యాపింగ్‌ను వెంటనే పూర్తిచేయాలన్నారు. తహసీల్దార్ వరహాలరావు, ఉప తహసీల్దార్లు వాలేశ్వరరావు, శ్యామ్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఎల్‌ఓలు, వీఆర్వోలు

ముందే గుర్తిద్దాం!

జిల్లాలో జోరుగా సర్వే

నక్కపల్లి, అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కుష్ఠు నివారణలో భాగంగా ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టింది. జిల్లాలో ఈనెల 17న మొదలైన ఈ ప్రక్రియ ప్రస్తుతం జోరుగా సాగుతోంది. నెలాఖరులోగా దీన్ని పూర్తి చేయనున్నారు. స్పర్శలేని మచ్చలను గుర్తించి పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి కుష్ఠును నియంత్రించడానికి ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయినింగ్ (ఎల్‌సీడీసీ) సర్వే చేస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఆరో విడత కొనసాగుతోంది.

సర్వేలో ఆశా వర్కర్‌తోపాటు, ఓ మేల్ సహాయకుడిని బృందంగా ఏర్పాటు చేశారు. వీరు ప్రతిరోజూ ఉదయం వేళల్లో రెండు గంటలపాటు 20-25 ఇళ్లకు వెళతారు. సదరు ఇంట్లో వారితో మాట్లాడి కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా శరీరంపై మచ్చలు ఉన్నాయా? అవి నొప్పి కలిగిస్తున్నాయా? లేదా? ఎన్నాళ్లగా మచ్చలున్నాయి? ఇలా పలు అంశాలతో నివేదిక తయారు చేస్తారు. అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు చేసి కుష్ఠు ఉందా? లేదానే నిర్ధారణ చేస్తారు. రెండు వారాల పాటు జరిగే సర్వే ద్వారా ఎంతమంది రోగులున్నారనేది గుర్తిస్తారు.

▼జిల్లాలో ప్రస్తుతం 67 కేసులున్నాయి. ఇందులో ఈ ఏడాదిలో కొత్తగా నమోదైనవి 33 కేసులు. అయిదు మచ్చలు లోపు ఉంటే వ్యాధి ప్రాథమిక దశలో, అయిదు దాటి ఉంటే వ్యాధి పెరుగుతున్నట్లు గుర్తిస్తారు. బాధితులు వ్యాధి ప్రాథమిక స్థాయిలో ఉంటే ఆరు నెలల కోర్సు, తీవ్రత పెరిగితే 12 నెలల కోర్సు కింద వైద్యంలో భాగంగా మందులు వాడాల్సి ఉంటుంది. అవసరమైన మందులన్నీ ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా ఇస్తారు. వీటిని ఆశాలు సంబంధిత రోగుల ఇళ్లకు తీసుకెళ్లి అందిస్తారు. రోగుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. మందులు సక్రమంగా వాడుతున్నారా లేదానేది వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. గడచిన రెండేళ్లతో పోల్చితే ప్రభుత్వ చర్యలతో ఇవి బాగా తగ్గుముఖం పట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

జిల్లా సమాచారం

కుటుంబాలు: 5,87,339
జనాభా: 17,49,302
సర్వే బృందాలు: 1489

నిర్లక్ష్యం వద్దు..: ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా అక్కడక్కడ కొన్ని కొత్త కేసులు వస్తున్నాయి. దీంతో కుష్ఠు పూర్తిస్థాయి నియంత్రణకే ఇంటింటి సర్వే చేస్తున్నారు. వీటిని ఆదిలోనే గుర్తించినప్పుడే వ్యాధిని తగ్గించగలం. అనుమానిత లక్షణాలు ఉంటే అందుబాటులో నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాసుపత్రికి వెళితే చాలు. వ్యాధి నిర్ధారణ చేసి, తక్షణ వైద్యం అందిస్తారు. వ్యాధి సోకిన వారు దీనిపై నిర్లక్ష్యం చేస్తే మరింత ముదిరి అవయవలోపానికి దారి తీసే ప్రమాదం ఉంది. - డాక్టర్ కె.స్వప్న, జిల్లా కుష్ఠు/ఎయిడ్స్/క్షయ నివారణాధికారి

మహిళా భద్రతకు సమష్టిగా కృషి చేయాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మహిళల భద్రత కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదని, వారి భద్రత కోసం అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ అన్నారు. 'సస్టైనింగ్ ఉమెన్ సేఫ్టీ-బెంచ్ మార్కింగ్ విశాఖపట్నం సక్సెస్ అండ్ ఫ్యూచర్ ప్రూఫింగ్ గవర్నెన్స్' అనే అంశంపై రాష్ట్ర మహిళా కమిషన్, ఏయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా ఏయూలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. మహిళా భద్రతపై జాతీయ స్థాయిలో నిర్వహించిన నారీ-2025 ఇండెక్స్‌లో జాతీయ స్థాయిలో విశాఖ నగరం ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విశాఖ మహిళా భద్రతకు ఎంతో సురక్షితమైన నగరంగా నిలవడం పట్ల ఆమె హర్షం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం విశాఖ ఎంతో 'సేఫ్ సిటీ' అని చెబుతుంటారని, ఈ నేపథ్యంలో మహిళల భద్రతకు ఇక్కడి విధానాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విద్యతోనే ప్రతి మహిళకు పూర్తి స్థాయిలో భద్రత, భరోసా లభిస్తాయన్నారు. ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లేలా, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేలా చూడాలన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో మహిళల భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, దుర్గాబాయి, దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి మాట్లాడారు. ముందుగా వక్తలంతా దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జ్యోతి వెలిగిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

అభ్యుదయంతో మాదకద్రవ్య నిరోధం

అనకాపల్లిలో సైకిల్ యాత్ర

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: డ్రగ్స్ రహిత సమాజస్థాపన కోసం పోలీసులు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర మంగళవారం అనకాపల్లి చేరుకుంది. పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం పేరుతో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ చేపట్టిన సైకిల్ యాత్రకు అనకాపల్లిలో స్వాగతం పలికారు. ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్‌యార్డు వద్ద నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల బారిన పడి చాలామంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీనివల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ చేపట్టిన సైకిల్ యాత్రకు మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ మార్గంలో యువత, విద్యార్థులు ఇలా అన్ని వర్గాలకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు వివరిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగు నెలల్లో 20 వేల మందికిపైగా అవగాహన కల్పించిన, ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి మాదక ద్రవ్యాలు కలిగించే అనర్థాలను సందేశం చేరవేయడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. అనంతరం సైకిల్ యాత్రలో పోలీసు ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు నిర్వహించిన అవగాహన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డైట్ కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లిలోని సైకిల్‌ర్యాలీలో డీఐజీ, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

వైభవంగా సహస్ర శివలింగార్చన

పూజల్లో భక్తులు

బోడవరం, న్యూస్‌టుడే: జుత్తాడ గ్రామంలో మంగళవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మల్లికార్జున స్వామి ఆలయంలో 11,116 మట్టితో తయారు చేసిన శివ లింగాలకు పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించి, భక్తులందరితో పాలాభిషేకం చేయించారు. ఆలయ అర్చకుడు సంతోష్ కృష్ణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ ప్రసాదు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి.అప్పలరాజు హాజరయ్యారు. సర్పంచి దొడ్డి ప్రసాదు, ఆలయ కమిటీ ఛైర్మన్ రామకృష్ణులు తదితరులు పాల్గొన్నారు. పూజ అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన జరిగింది.

మహారుద్రునికి దీపారాధన

కశింకోట, న్యూస్‌టుడే: కార్తిక మాస శివరాత్రిని పురస్కరించుకొని కశింకోట త్రిపురాంతకస్వామి దేవాలయంలో స్వామివారికి మంగళవారం సాయంత్రం రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని దేవాలయ ప్రాంగణంలో దీపాలంకరణ చేశారు. ప్రాంగణం దీపజ్యోతులతో నిండిపోయింది.

కశింకోట త్రిపురాంతకస్వామి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

దత్తతపై శ్రద్ధ చూపండి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దత్తత తీసుకునేలా శ్రద్ధ చూపాలని జిల్లా సమన్వయకర్త మేరీ సువార్త సూచించారు. జోగునాథునిపాలెంలోని సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. దత్తతపై ప్రచారం కల్పించి దత్తత జరిగేలా చూడాలన్నారు. పిల్లలకు సంబంధించి ఏ సమస్య ఉన్నా 1098, 112, 100 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. బాలల సంరక్షణాధికారి రమేష్, సీడీపీఓ రమణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సమన్వయకర్త మేరీ సువార్త

జిల్లా వ్యవసాయాధికారిగా ఆశాదేవి

అనకాపల్లి, న్యూస్‌టుడే: జిల్లా వ్యవసాయాధికారిగా ఎం.ఆశాదేవిని ప్రభుత్వం నియమించింది. ఈమెను మంగళవారం జిల్లాలోని పలువురు ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యాపారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన బి.మోహనరావును రైతు శిక్షణ కేంద్రం ఉప సంచాలకులుగా బదిలీ చేశారు. ఆశాదేవి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇంతవరకు పనిచేశారు. ఈ స్థానంలో వ్యవసాయశాఖ విశాఖ జిల్లా ఉప సంచాలకులు అప్పలస్వామిని నియమించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించరూ!

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన విధుల్లో చేరి ఏడాది అయిన సందర్భంగా మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పది మూల్యాంకనం విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డీఏ చెల్లించాలన్నారు. మండలాల్లో మిగులు ఉన్న ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ఆశ, ఈశ్వర్, కాంత్రికిరణ్ పాల్గొన్నారు.

డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం కేపీ అగ్రహారం మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పి.ఉమామహేశ్వరరావును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. ఇతని భార్య ఈనెల 13న ఆత్మహత్య చేసుకున్న కారణంగా పోలీసులు అతనిని అరెస్టు చేశారు. ఎంఈఓ నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

తెలుగు భాష పరిరక్షణ బాధ్యత అందరిదీ

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: అమ్మ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలుగుభాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కొయిలాడ రామ్మోహన్ పేర్కొన్నారు. సమితి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కథల పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. కథల పోటీల్లో 13 నుంచి 25 సంవత్సరాల విభాగంలో అంజనా సాత్విక (విశాఖ) ప్రథమ, ఆశ్రితరెడ్డి (హైదరాబాద్) ద్వితీయ, శర్వాణి (విశాఖ) తృతీయ నగదు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్, సాహితీ మిత్రుల సంఘం సభ్యులు డాక్టర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి, మాధవి సనారా, తమ్మిరాజు, గొంతిన రంగబాబు, గాయత్రి, మల్లీశ్వరి, అమరజ్యోతి పాల్గొన్నారు.

విజేతలతో సంఘ సభ్యులు

ప్రీ రిపబ్లిక్‌డే ఎంపిక శిబిరంలో జీవీపీ విద్యార్థిని

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల ఎన్ఎస్ఎస్ (జాతీయసేవా పథకం) విద్యార్థిని టి.అక్షిత హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్సిటీలో జరిగిన ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి హాజరయ్యారు. భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పదిరోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 200 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఇందులో ఈమె ఒకరు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 40 మందిని 2026 జనవరిలో దిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఎంపిక చేస్తారని జీవీపీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎస్.బోస్, ఎన్ఎస్ఎస్ విభాగాధికారి డాక్టర్ జి.లక్ష్మీనారాయణ తెలిపారు.

ప్రిన్సిపల్ కె.ఎస్.బోస్ తదితరులతో విద్యార్థిని అక్షిత

పార్టీలో యువతకు ప్రోత్సాహం

అనకాపల్లి, న్యూస్‌టుడే: తెదేపాలో యువతకు ప్రోత్సాహం అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన కర్రి బాబీతో అనుబంధ కమిటీలకు ఎన్నికైన సభ్యులతో మంగళవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడు ప్రజల్లో విశ్వసనీయత కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, వైకాపా చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని, మాజీలను తాజాలను చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నాయని తెలిపారు. పేదలకు అండగా నిలిచేది తెదేపా అని, అటువంటి పార్టీలో ఉండటం మన అదృష్టమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులతో వ్యాపారం చేపట్టాలని, అటువంటి వారికి రూ. లక్ష నుంచి రూ. కోటి వరకు రుణం అందిస్తారన్నారు. దీనిలో 35 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో వెయ్యి ప్రాజెక్టులు మంజూరు చేయాలని భావిస్తున్నారని వివరించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలకు దేశంలోనే ఆద్యుడు ఎన్.టి.రామారావు అని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్యే, కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ పదవులను అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతగా చెయ్యాలన్నారు. జిల్లాలో 3.50 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ కోట్ని బాలాజీ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పచ్చికూర రాము, నాయకులు డాక్టర్ కె.కె.వి.నారాయణరావు, డాక్టర్ పీలా శ్రీకాంత్, గొంతిన శ్రీనివాసరావు, కాశీనాయుడు, స్వరూప పాల్గొన్నారు. అంతకుముందు అనకాపల్లి నూకాలమ్మను చిరంజీవిరావుతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న చిరంజీవిరావు

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక ఋణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUILDING CONSTRUCTION

VIZAG TDR BPS
Contact for BPS PLAN APPROVALS
PILLA BRAHMAJI RAO
Rtd. BUILDING INSPECTOR
GVMC PRESENT LICENSED SURVEYOR
92904 41348

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటి బ్యాంక్, ✆ 9396 999 669.

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

PEOPLE CARE

OLD AGE HOME

ఆధునిక వసతులతో AC మరియు నాన్ AC రూమ్స్ మరియు డాక్టర్ పర్యవేక్షణలో రిటైర్మెంట్ హోమ్, అక్కయ్యపాలెం, హైవే బస్టాప్ దగ్గర. Cont: 7794948777.

REAL ESTATE

FLAT FOR SALE

DWARAKANAGAR

Commercial Space for sale an area of 1100 Sft, 4th floor at Road No. 4, Dwarakanagar for Immediate Sale Contact Phone No: 8688921089, 9110750234.

GENERAL

MVP **కాలనీలో** 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. Contact Ph: 8686997700.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

GENERAL

పెందుర్తి- దొగ్గవానిపాలెం E/F 147చ॥గ॥ గ్రౌండ్ 2 BHK+ పైన ఓపెన్ సెల్లార్, 2 ఫ్లోర్స్ GVMC ప్లాన్ అప్రూవల్‌తో ఇల్లు అమ్మకం. ✆ 8125222119.

JOBS

Required Chemist. Salary as per Existing Situation Sri Satya Sai Pharmacy, KP Infra, Opp; Gold Coast Apt., Yandla, Vizag- 530 045 ✆ 97044 64829.

Wanted Accountant for Laxmi Exports, VSP. Qlf: Bachelor's Degree in Accounting Proficiency in Tally. ✆ 9393422622.

Wanted Telecallers-2 No's (F) Age 30 Yrs above, English & Hindi Must * Jr. Accountant (F) @ Akkayyapalem. Ph: 9348738659.

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact Ph: 7032015042.

JOB OPPORTUNITY
A Fast growing and 2 decades successfully completed organisation requires the below positions in Vizag Division and Branches.
❖ADMINISTRATIVE OFFICERS - 5 No's
❖OFFICE INCHARGES - 7 No's
❖FIELD OFFICERS - 15 No's
Qual: Working / Retired Govt. / Pvt. & Public sectors
Monthly Package: 60,000/- to 1,30,000/-
NOTE: Above posts & Packages decided at the time of interview and based on previous experience.
Interview on 19th & 20th Nov. 2025
C. RAMA KRISHNA, DGM
SEETHAMMADHARA, VIZAG
9676811666

రూ. 9 లక్షల బెస్ట్ ప్యాకేజీపై పనిచేయుటకు 3 సం॥ ఏదైనా ఫీల్డ్ Exp. ఉన్న M/F ఏజ్: 30+ & రిటైర్డ్ / గృహిణులు కావలెను. Contact Ph: 9014737483.

టోల్‌గేట్ వద్ద పనిచేయుటకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ, ఇన్‌ఛార్జ్, ఫైర్ & సేఫ్టీ కావలెను. Q: 10th - డిగ్రీ, ITI, B.టెక్, జీ: 18K-28K. Contact Ph: 9573635594, 9121044796.

FACULTY/ TEACHERS

Wanted Experienced & Trained Lady Teachers to Teach Physics & Maths for MID & High School. Candidates who have studied in English Medium Schools only. Need to appply. Olivet School, VSP. Ph: 0891-2569859, 9848498510.

Physics Faculty to Teach 8, 9, 10th CBSE & IIT-Foundation at Kurmannapalem. Resume: hr@varahaacademy.com

Wanted Pre-Primary, Primary Teachers, Ayas, Scavengers (Contract Basis) Sri Raghavendra School, Srinagar, GWK. ✆ 7095646444.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఐటీ ఉద్యోగాల పేరిట మోసం

నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతంలోని ఓ ఐటీ సంస్థ ఉద్యోగాలు ఇస్తామని తమను నమ్మించి లక్షల్లో నగదు వసూలు చేసి మోసగించిందని పలువురు యువకులు మంగళవారం పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన పి.సాయి కుమార్, జి.రమేష్, కె.చైతన్య గతేడాది డిసెంబర్‌లో సామాజిక మాధ్యమ లింక్ ద్వారా మధురవాడ మిథిలాపురి వుడాకాలనీలో ఉన్న 'వారుష్‌టెక్నాలజీస్' సంస్థ ఐటీ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆపై వారిని సంప్రదించడంతో విశాఖతో పాటు హైదరాబాద్, బెంగళూరుల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. మొదట మూడు నెలల శిక్షణా కాలంగా పరిగణించి నెలకు రూ.15 వేలు వేతనంగా అందిస్తామన్నారు. ఆపై వార్షిక వేతనాల ప్యాకేజీని వివరిస్తూ డిపాజిట్ రూపంలో రూ.2.4 లక్షలకు (రూ.75 వేలు), రూ.3 లక్షలకు (రూ.85 వేలు), రూ.3.8 లక్షలకు (రూ.లక్ష), రూ.4 లక్షలకు (రూ.1.50 లక్షలు), రూ.4.8 లక్షలకు (రూ.1.70 లక్షలు) చెల్లించాలన్నారు. దీంతో ముగ్గురు కలిసి ఒక్కొక్కరు రూ.3 లక్షల వరకు సంస్థ ఇచ్చిన బ్యాంకు ఖాతాలకు పంపించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఉద్యోగాలు కల్పించి వర్క్ ఫ్రంహోమ్ పేరుతో విధులు చేయించారు. మూడు నెలల పాటు ఉద్యోగం చేసినా నెల జీతం కూడా చెల్లించలేదన్నారు. అనుమానంతో కంపెనీకి వచ్చి సీఈఓ వి.సాయికుమార్‌ను కలవగా బ్యాంకు ఖాతాల ఇబ్బందుల కారణంగా వేతనాల్లో జాప్యం జరిగిందని జవాబివ్వడంతో వారికి నమ్మకం కలగలేదు. ఈ క్రమంలో తాము కట్టిన డిపాజిట్ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో గడచిన మే నెలలో ఇస్తానని చెప్పినా ఇవ్వలేదు. మరోమారు అడగడంతో సంతకం తప్పుగా చేసి చెక్ అందించాడు. చివరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సుమారు 135 మంది వరకు నిరుద్యోగులు ఈ సంస్థ బారిన పడినట్లు తెలుస్తోందన్నారు.

సంస్థల పేర్లు మార్చి వల..: వారుష్ టెక్నాలజీస్ సంస్థను నిర్వహిస్తున్న వి.సాయికుమార్ గతంలో 'వి టెక్నాలజీస్' పేరుతో కంపెనీ పెట్టి సుమారు 100 మందికి పైగా నిరుద్యోగులను మోసగించాడు. వైకాపా ప్రభుత్వ హయాంలో హిల్-2పై మొదట 'వి టెక్నాలజీస్' సంస్థను ఏర్పాటు చేశాడు. 2017లో ఏయూ వేదికగా అప్పటి వైకాపా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఉద్యోగ మేళాలో 'వి టెక్నాలజీస్' పేరుతో స్టాల్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు వల విసిరింది. అనతి కాలంలోనే దాదాపు 100 మంది నిరుద్యోగుల నుంచి రూ.కోట్లలో వసూళ్లు చేసి బోర్డు తిప్పేశారు. తిరిగి 2023లో మళ్లీ 'వారుష్ టెక్నాలజీస్' పేరుతో రంగ ప్రవేశం చేసి సుమారు 150 మంది నిరుద్యోగులను మోసగించినట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు మధురవాడలోని పలు ప్రాంతాల్లో సంస్థల చిరునామాలు మార్పులు చేస్తూ వచ్చాడు.

జాతీయ రహదారిపై రెండు టిప్పర్లు ఢీ

సీటులో ఇరుక్కుపోయి ఏడు గంటల పాటు డ్రైవర్ నరకయాతన

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న టిప్పర్‌ను మరో టిప్పర్ బలంగా ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ సీటులో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఏడు గంటలపాటు శ్రమించి అతణ్ని సురక్షితంగా బయటకు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు కంకర లోడుతో వెళ్తున్న ఓ టిప్పర్ టైర్ పేలిపోవడంతో విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం రాంపురం వద్ద జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచారు. అదే సమయంలో ఫ్లైయాష్ లోడుతో వెళ్తున్న మరో టిప్పర్ అతి వేగంగా దాన్ని ఢీకొట్టింది. వెనకాల ఉన్న టిప్పర్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. ఆ వాహనంలో ఉన్న అనకాపల్లి జిల్లా వెంకన్నపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ డొక్కరి సాయికుమార్(30) ఎడమ కాలు సీటులో ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కట్టర్లతో టిప్పర్‌ను కత్తిరించడానికి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో పొక్లెయిన్‌ను తీసుకొచ్చి టిప్పర్లను వేరు చేయాలని చూశారు. ఎట్టకేలకు కొన్ని ప్రయత్నాల తర్వాత మధ్యాహ్నం 12.10 గంటలకు డ్రైవర్‌ను బయటకు తీసి అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్యం నిలకడగా ఉందని ట్రాఫిక్ ఎస్సై నరసింగరాజు తెలిపారు.

ప్రమాద స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

కొబ్బరిచెట్టు పైనుంచి పడి ఒకరి మృతి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సంపతిపురంలో మంగళవారం కొబ్బరి చెట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. కశింకోటకు చెందిన కొత్తం నాగేశ్వరరావు (46) సంపతిపురంలోని పొలంలోని కొబ్బరి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై రవికుమార్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడు..

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని ఓ యువకుడు మృతి చెందాడని తుని రైల్వే ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎలమంచిలి - నర్సింగపల్లి స్టేషన్ల మధ్య రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు నుంచి 20 ఏళ్ల యువకుడు జారిపడ్డాడని చెప్పారు. మృతుని వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచామని తెలిపారు. వివరాలకు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

భార్య మృతి కేసులో భర్త అరెస్టు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న భార్య మృతి చెందిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చంద్రశేఖరరావు మంగళవారం తెలిపారు. ఈనెల 15న పూడిమడకకు చెందిన పెద్ది చిన్ని (30) భర్త పోలయ్య ఇంటి వద్ద ఉన్న సమయంలోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. పూర్తిగా కాలిపోయిన ఈమెను బంధువులు కేజీహెచ్‌కు తరలించినా ప్రయోజనం లేకపోయింది. చికిత్స పొందుతూ ఈనెల 16న మృతి చెందింది. మద్యానికి అలవాటు పడిన పోలయ్య తరచూ కొట్టడం, వేధించడం వల్లే చిన్ని చనిపోయిందని ఈమె సోదరి భూలోక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు భర్త పోలయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

యువకుడి దుర్మరణం

పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలో ఊటగెడ్డ పెట్రోల్ బంకు సమీపాన సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పరవాడ సీఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన శిడా పెడెంటి (28) కొంతకాలంగా లంకెలపాలెంలోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై అచ్యుతాపురం వైపు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెంది ఉన్నాడు. ఆయన పక్కనే గేదె మృతదేహం ఉంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని సీఐ తెలిపారు. దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **మాస్ జాతర,** సత్యనారాయణ స్ర్కీన్2: **ఆటగదరా శివ,** పర్తిసాయి: **కాంత,** షిర్డిసాయి: **గర్ల్‌ఫ్రెండ్,** రామచంద్ర: **జిగ్‌రిస్,** సత్య నారాయణ స్ర్కీన్1: **శివ,** వెంకటేశ్వర: **లవ్ ఓటీపీ,** **అచ్యుతాపురం:** ఎస్‌టీబీఎల్ సినీవరల్డ్ స్ర్కీన్-1 **కాంత,** స్ర్కీన్-2: **గర్ల్‌ఫ్రెండ్**

శుభ్రతకు నిలయాలుగా గ్రామాలు

పాయకరావుపేట: గ్రామాలను శుభ్రతకు నిలయాలుగా మార్చాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో మంగళవారం పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల్లో అవకాశం ఉన్నచోట పెద్దఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. అందరి సహకారంతో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని తెలిపారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

సినీ నటుడికి సత్కారం

పాయకరావుపేట: 'రోలుగుంట సూరి' చిత్రంలో నటించిన ప్రతినాయకుడు ముకుందరాజుపేటకు చెందిన టి.శ్రీనును కూటమి నాయకులు సత్కరించారు. పట్టణంలోని గౌతమ్ థియేటర్ వద్ద కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మరిన్ని చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకోవాలని వివరించారు. నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, చింతలపు ప్రదీప్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరీ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, యాళ్ల వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనును సత్కరిస్తున్న నాయకులు

కాలువ పనుల్లో నాణ్యత ఎక్కడ?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

కాలువల నిర్మాణాలు నాణ్యతా లోపంతో సాగుతున్నాయి. వీటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నాసిరకంగా చేపట్టిన పనులతో రెండు నెలలకే రూపురేఖలు మారిపోతున్నాయి. పట్టణంలోని గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ మైదానం నుంచి నూకాలమ్మ కోవెలకు వెళ్లే దారిలో రెండు నెలల కిందట రూ. 8లక్షలతో 180 మీటర్ల దూరంలో కాలువ నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ రోడ్డును విస్తరించి అవసరమైన చోట కాలువ పనులు చేపటారు. ఈ పనులు నాసికరంగా, నాణ్యతా లోపంతో చేపట్టిన కారణంగా రెండు నెలలకే పెచ్చులు ఊడిపోతున్నాయి. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లక్షలు వెచ్చించి చేపట్టిన పనులను పట్టించుకోని కారణంగా ఈ పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు. దీనిపై జీవీఎంసీ డీఈ గోపాలకృష్ణను వివరణ కోరగా కాలువ నిర్మాణాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

నూకాలమ్మ కోవెల దారిలో ఇటీవల నిర్మించిన కాలువ

అందని ఆర్టీసీ సేవలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే

వివిధ గ్రామాలకు రహదారులు ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణం నడిబొడ్డున ఆర్టీసీ డిపో ఉన్నా సమీప గ్రామాలకు సైతం బస్సులు వేయడం లేదు. కలెక్టరేట్‌కు వెళ్లడానికి సైతం బస్సు లేక ఆటోలపైనే ఆధారపడే దుస్థితి ఏర్పడింది. అనకాపల్లి మండలంలోని 32 పంచాయతీల పరిధిలో 130కి పైగా గ్రామాలు ఉన్నాయి. వీటిలో 11 నుంచి 15 గ్రామాలకు మాత్రమే బస్సులు నడుస్తున్నాయి. అనకాపల్లి నుంచి చోడవరం, సబ్బవరం, గాజువాక, విశాఖ, తట్టబంద, కొత్తూరు తదితర ప్రాంతాలకు వెళ్లే మార్గాలకు ఆనుకొని ఉన్న గ్రామాలకు మాత్రమే ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. మిగిలిన గ్రామస్థులకు పట్టణానికి రావాలంటే ఆటోలే దిక్కు. భట్లపూడి కొండుపాలెం, కోడూరు, రేబాక, కాపుశెట్టివానిపాలెం, గోపాలపురం, కొప్పాక గ్రామాల్లో రూ. లక్షలు వెచ్చించి రహదారులు నిర్మించారు. పరిమితికి మించిన ప్రయాణికులతో కిక్కిరిసిన ఆటోల్లో కుక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రద్దీ ఉన్న మార్గాల్లో అయినా బస్సులు నడిపేందుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొండుపాలెం ప్రధాన రహదారి

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

మునగపాక: మాదక ద్రవ్యాల జోలికి యువత పోవద్దని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోరుతూ పోలీసులు చేపట్టిన సైకిల్ ర్యాలీకి మునగపాకలో మంగళవారం స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో ఏర్పడే అనర్థాలను వివరించారు. జీవితాలను నాశనం చేసే డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఎలమంచిలి సీఐ ధనుంజయరావు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మత్తును స్నేహంగా అలవాటు చేసేవారి పట్ల ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండాలని సీఐ చంద్రశేఖరరావు కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపట్టిన సైకిల్ ర్యాలీ మంగళవారం అచ్యుతాపురం చేరుకున్న సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. డ్రగ్స్ తీసుకునేవారు మన పక్కన ఉంటే వారివల్ల ఏక్షణమైనా ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. పోలీసులకు, 1972 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం చెప్పాలని కోరారు. ఎంపీడీఓ చిన్నారావు, హెచ్‌డీటీ శ్యామ్, అప్పలకొండ, ఎస్సై వెంకటరావు పాల్గొన్నారు.

ర్యాలీలో ఎమ్మెల్యే సుందరపు, ప్రగడ తదితరులు

సంక్షేమానికి చిరునామా కూటమి పాలన

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కూటమి పాలన సంక్షేమానికి చిరునామాగా నిలుస్తోందని పేట నియోజకవర్గ తెదేపా కన్వీనరు కొప్పిశెట్టి వెంకటేష్ పేర్కొన్నారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. పార్టీ విజయానికి కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తే వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు. పార్టీ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు చింతలపు ప్రదీప్, కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, పి.విలియంకేరీ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సొంతింటి కలను నెరవేర్చుతోందని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ పేర్కొన్నారు. నక్కపల్లి పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత పాలనలో గృహ నిర్మాణంలో అక్రమాలు జరిగడంతో పాటు, బిల్లులు మంజూరు లేక ఇళ్లన్నీ అసంపూర్తిగానే ఉండిపోయాయన్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వాళ్లకు అవకాశం ఉందని, వీరంతా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో తెదేపా మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, నేతలు పెదపూడి శంకరరావు, దార్ల కృష్ణ, గరికిన నూకరాజు పాల్గొన్నారు.

LOST PASSPORT

ALLA BALASUBRAHMANYAM
S/o Late Appa Rao Dr. No: 12-3-30/E Ramalayam Street, Pudimadaka Road, Bajaj Show Room Backside, Anakapalli, Anakapalli Dist-531001. My Passport bearing **No.X3796904** while I am Travelling on My Motor cycle from my House towards Nehru chowk Junction at Anakapalli on 12-11-2025 & I Made efforts to recover the Same, But in vain. If anybody find please return on above Address

Ph: 9177864969

CHANGE OF NAME

I, **SAKA SOWMYA** resident of Sarvasiddi, S.Rayavaram Mandal, Visakhapatnam 531060. After marriage changed my name to **PUSARLA SOWMYA** W/O PUSARLA AKHIL, Resident of H.No. 10-10-81/2, Sairam Nagar, Gajuwaka, Visakhapatnam 530026. Hence, I will be called as **PUSARLA SOWMYA** for all purposes.

ఆదమరిస్తే కాలువలోకే..

పట్టణంలోని భూమి కాలువపై బృందావనం వద్ద రక్షణ గోడ లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు. రాజీవ్‌నగర్ కాలనీ, ధనిశెట్టినగర్, మేకలరేవు పుంత, శీలానగర్ తదితర కాలనీల్లో వెళ్లాలంటే ఈ కల్వర్టుపై నుంచే రాకపోకలు సాగించాలి. ఏమాత్రం ఆదమరిచినా కాలువలోకి బోల్తా కొట్టాల్సిందే. ఈ కాలువలో నిత్యం తాండవ నుంచి వచ్చే నీరు ప్రవహిస్తుంది. ఈ కారణంగా పాదచారులు, వాహన చోదకులు కల్వర్టు దాటేందుకు హడలిపోతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పాయకరావుపేట

రక్షణ గోడ లేని కల్వర్టు

పొగతో ఉక్కిరి బిక్కిరి

పెనుగొల్లు- మమ్మవరం రహదారిలో పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. సంపద కేంద్రాలకు తరలించాల్సిన చెత్తను ఈ రహదారి పక్కనే పోగులుగా పోసి, నిప్పు పెడుతున్నారు. దీని నుంచి వెలువడుతున్న పొగతో ఈ రహదారిపై ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేనంత దట్టంగా పొగ వ్యాపించడంతో రహదారిపై వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వారంలో మూడు సార్లు ఇదే పరిస్థితి ఉంటుంది. పంచాయతీ అధికారులు చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని రెండు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎస్.రాయవరం

పొలాలకు వెళ్లే దారేది?

పుంతరోడ్లు నరకానికి నకళ్లుగా దర్శనమిస్తున్నాయి. పెదరామభద్రపురం శివారు చిన నర్సాపురంలో పుంత రోడ్డులో అడుగు పెట్టాలంటేనే భయపడుతున్నారు. ముళ్లకంచెలతో నిండిపోయింది. ఈ రోడ్డులో ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని అంటున్నారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలుండటం లేదు. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి పుంతరోడ్డును కొత్తగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పాయకరావుపేట

ఎస్.నర్సాపురంలోని పుంతరోడ్డు

ఈ నీరు తొలగేదెన్నడో..

ఎలమంచిలి న్యూ స్టేట్‌బ్యాంకు కాలనీలోని ఖాళీ ప్రదేశంలో భారీ వర్షాలకు చేరిన నీరు సుమారు మూడు అడుగుల మేర నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో సమీప నివాసాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా దోమల బెడద ఎక్కువైంది. గతంలో మున్సిపల్ అధికారులు పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని మోటార్లతో తోడేవారు. ఈ ఏడాది అటువైపుగా కన్నెత్తి చూసే నాథుడే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఎలమంచిలి గ్రామీణం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎలమంచిలి గ్రామీణం: పోతిరెడ్డిపాలెంలో బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

పాయకరావుపేట: ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. పాల్తేరు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

వేమగిరిలో పశువైద్య శిబిరం

ఎస్.రాయవరం: పశువుల పునరుత్పత్తిలో యాజమాన్య, పోషణ చర్యలు పాటించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. వేమగిరిలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరానికి ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాసరావుతో కలిసి హాజరయ్యారు. ఏడీ వీర్రాజు, పశు వైద్యాధికారులు భరత్‌కుమార్, వంశీకృష్ణ, సంస్థ డైరెక్టర్ రామకృష్ణ, సర్పంచి ముప్పిన అబ్బాయిదొర పాల్గొన్నారు.

మిర్యాల కాలనీలో సిమెంటు రహదారి

అనకాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక మిర్యాల కాలనీలో రూ.20 లక్షలతో సిమెంటు రహదారిని నిర్మిస్తున్నారు. ఈ పనులను మంగళవారం కూటమి నాయకులు పరిశీలించారు. తెదేపా 82, 83 వార్డు ఇన్‌ఛార్జులు పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, నాయకులు యాంద్ర రామకృష్ణ, ఎన్.అఖి, కొణతాల గణేష్, వెల్లంకి వాసు పాల్గొన్నారు.

హెటెరో డైరెక్టర్‌కు సత్కారం

నక్కపల్లి: హెటెరో మందుల పరిశ్రమ డైరెక్టర్ మోహన్‌రెడ్డిని ఉపమాక శివాలయంలో నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కంపెనీ తరఫున ఆలయానికి రంగులు వేయడం, క్యూ లైన్ల నిర్మాణం, మూడు వారాల పాటు అన్నసమారాధనకు ఆయన సహకారం అందించారు. అర్చకులు సంతోష్, స్థానికులు కొప్పిశెట్టి శ్రీను, నరిశే దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక లాభాలు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు వీలుంటుందని పేట వ్యవసాయశాఖ డివిజనల్ అధికారి కె. ఉమా ప్రసాద్ తెలిపారు. పెదరామభద్రపురం, గుంటపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పిల్లలకు మానవతా విలువలు నేర్పండి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: కథల ద్వారా పిల్లలకు మానవతా విలువలు నేర్పించాలని రచయిత శంకరమంచి సత్యం పేర్కొన్నారు. తుమ్మపాల గ్రంథాలయంలో మంగళవారం జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల నాటికల ప్రదర్శన ఆకట్టుకుంది. తాళ్లపాలెం లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు తోట నగేష్ అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వివరించారు. చినదొడ్డిగల్లులో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పరిసరాల శుభ్రతపై చిత్రలేఖనం పోటీలు, నక్కపల్లిలో పద్య పఠన పోటీలు, కోటవురట్లలో క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఎలమంచిలి, మునగపాక, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. గణపర్తిలో చిత్రలేఖనం, వ్యాస రచన, కుర్చీఆట పోటీలు నిర్వహించారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ముఖ్యమంత్రిని కలిసేందుకు తుది జాబితా రూపకల్పన

నక్కపల్లి, న్యూస్‌టుడే: బల్క్‌డ్రగ్ పార్కు సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసేందుకు రాజయ్యపేట మత్స్యకార నాయకులు మంగళవారం మరో జాబితా అందజేశారు. ఇక్కడకు వచ్చిన తహసీల్దార్ ఆర్.నరసింహమూర్తికి జాబితా అందజేసిన అనంతరం నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఇచ్చిన జాబితాలో స్థానికేతరులు కొందరున్నారని, వీరిని తొలగించి మార్పులతో దీన్ని అందజేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మహిళలను కలిపి 61 మందితో లిస్టు తయారు చేసినట్లు వెల్లడించారు. మంత్రి అనితకు ద్వారా సీఎం వద్దకు తీసుకెళ్లే ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై తహసీల్దారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ద్వారా విషయాన్ని మంత్రికి తెలియజేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎరిపల్లి నాగేశ్, పిక్కి సత్తియ్య, వెంకటేశ్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

PUBLIC NOTICE

Under the instructions of my client **M/s. SHRIRAM FINANCE LIMITED, ANAKAPALLI Branch, Anakapalli District**, I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. GORLI RAVI** S/o G Ramu Naidu by keeping the below mentioned schedule property of **Mr. GORLI RAVI** S/o G Ramu Naidu & **Mr. GORLI APPA RAO** S/o G Ramu Naidu as Security by way of Registered Mortgage. As such if any one has any claims, charges, mortgages, Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices, otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Erstwhile Visakhapatnam District, presently Anakapalli District, Makavarapalme, Mandalam, Kotauratla Sub-District, Settipalem Gram panchayat and village accounts zeriothy dry land covered by S. No. 56-1 an extent of 290 Sq. yards or 242.476 Sq. meters of vacant site is measured and bounded by:

East	Site of Gorli Pentaiah	60 feet or 18.300 meters
South	6 feet width passage	44 feet or 13.420 meters
West	Site of Kamireddty Ganga Thalli	60 feet or 18.300 meters
North	Site of Allu Narasimha Murthy and Gorli Konda	43 feet or 13.115 meters

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments,
Behind Rythu Bazar, Seethammadhara,
Visakhapatnam-13.
Visakhapatnam Dt.18.11.2025
Mobile No. **9885166648**
Mail: sreenivaskoduri@gmail.com

సామూహిక రుద్రాభిషేకాలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో శ్రీగౌరీ పంచాయతన దేవాలయంలో మంగళవారం రుద్రాభిషేక పూజల్లో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ అధ్వర్యంలో 400 మంది దంపతులతో శివునికి రుద్రాభిషేకాలు చేయించారు. వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ, జోనల్ కమిషనర్ చక్రవర్తి దంపతులు, గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయ భవనం సిద్ధం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం భవన నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. పది రోజుల్లో కార్యాలయాన్ని ప్రారంభించి, ఇక్కడి నుంచే అన్ని కార్యకలాపాలు నిర్వహించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నేళ్లుగా సాగుతూ వస్తున్న నిర్మాణాన్ని ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. తుది మెరుగులు దిద్దే పనుల్లో సిబ్బంది తలమునకలయ్యారు. ఈ భవన నిర్మాణం పదేళ్లుగా సాగుతూ ఉంది. ప్రస్తుతం అనకాపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ అతిథి గృహంలోనే చాలీచాలని సదుపాయాలతో ఈ కార్యాలయం నడుస్తోంది. ఇటీవల భవనాన్ని ఖాళీ చేసి అప్పగించాలని జిల్లా పరిషత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఇక్కడ నిర్మాణాన్ని పూర్తి చేసుకొని స్వంత భవనంలోకి మారేందుకు అధికారులు పనులు ముమ్మరం చేశారు.

కొత్తూరులో నిర్మించిన భవనం

పట్టాలమ్మతల్లి ఆలయంలో రుద్ర పూజలు

కోటవురట్ల, న్యూస్‌టుడే: పట్టాలమ్మతల్లి ఆలయంలో మంగళవారం ఆలయ వ్యవస్థాపకులు వెంకటరమణ ఆధ్వర్యంలో, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన నిర్మలానంద స్వామీజి బృందం రుద్ర పూజల నిర్వహించారు. దీనికి పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో తిలకించారు. పీఏసీఎస్ ఛైర్మన్ వేచలపు జనార్దన్ దంపతులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న నిర్మలానంద స్వామీజీ

హాజరైన భక్తులు

PUBLIC NOTICE

Under the instructions of my client **M/s. SHRIRAM FINANCE LIMITED, ANAKAPALLI Branch, Anakapalli District,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. PAPPALA KRISHNAM RAJU** S/o P Ramana by keeping the below mentioned schedule property as Security by way of Registered Mortgage. As such if any one has any claims, charges, mortgages, Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices, otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Anakapalli District, Anakapalli District Registrar area, Yelamanchili Mandalam, Yelamanchili Sub-District, Yetikoppaka Gram panchayat and village accounts zeriothy dry land covered by LP No.2158, S. No.243-3 out of an extent of Ac.0.29.5 cents an extent of Ac.0.15 cents or 726 Sq. yards or 607 Sq. meters of site converted for non-agriculture purpose is measured and bounded by: **EAST:** Land of Lanaka Ramana -144 feet or 43.872 meters; **SOUTH:** Land of Lanaka Appa Rao - 45.4 feet or 13.831 meters; **WEST:** Property gifted to Pappala Babuji-144 feet or 43.872 meters; **NORTH:** Rahadari and thereafter land of Pappala Naga Raju- 45.4 feet or 13.831 meters

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar, Seethammadhara, Visakhapatnam-13.
VISAKHAPATNAM Dt.18.11.2025.
Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com

పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

కోటవురట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని డీడీఓ అధికారిణి నాగలక్ష్మి హెచ్చరించారు. లింగాపురం, సుంకపూరు గ్రామాల్లో జరిగిన స్వామిత్వ గ్రామ సభలకు మంగళవారం ఆమె హాజరయ్యారు. సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ కూర్మారావు, రఘురాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో మాట్లాడుతున్న నాగలక్ష్మి

తెగుళ్లపై అప్రమత్తం

రాంబిల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వరి పంటను ఆశించే తెగుళ్లపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.బి.భవాని సూచించారు. ఎలమంచిలి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో మంగళవారం అచ్యుతాపురంలో కొండకర్ల, అందలాపల్లి, యర్రవరంలోని వరి పొలాలను వ్యవసాయాధికారులు, బీసీటీ శాస్త్రవేత్తలతో కలిసి ఆమె పరిశీలించారు. బీసీటీ-కేవీకే శాస్త్రవేత్త డా.ప్రసాదరావు, ఏఓ వసంత పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికపై శిక్షణ తరగతులు

నక్కపల్లి: రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వెలుగు వార్షిక ప్రణాళికపై స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులు మొదలయ్యాయి. వెలుగు ఉద్యోగులు, గ్రామైక్య సంఘాల సిబ్బందికి జిల్లా కార్యాలయం నుంచి వచ్చిన వివిధ విభాగాల అధికారులు వెంకటరమణ, వరప్రసాద్, కల్యాణి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సంఘాల పనితీరు, వాటి రుణాలు, రికవరీ, జీవనప్రమాణాల పెంపు, స్త్రీనిధి నిర్వహణ తదితర వాటిపై మాట్లాడారు. నాలుగు రోజులపాటు జరిగే శిక్షణ ద్వారా లక్ష్య సాధన జరగాలన్నారు. నక్కపల్లి ఏపీఎం కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: శారదానగర్‌లో పందుల సమస్య ఎక్కువగా ఉంది. – **రాము, శారదానగర్,** ✓: పందులను నివాసాలకు దూరంగా తరలిస్తాం. – **సుభాష్, పంచాయతీ కార్యదర్శి**

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: అనకాపల్లి బెల్లం మార్కెట్ సమీపంలోని ఓంశక్తి కాలనీలో కాలువలు లేవు. దీంతో మురుగంతా ఖాళీ స్థలాల్లో విడిచిపెడుతున్నారు. – **కాండ్రేగుల బాబ్జి, అనకాపల్లి,** ✓: కాలువ పనులు చేపడతాం. – **కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్**

పాయకరావుపేట గ్రామీణం: ?: పాయకరావుపేట పట్టణంలోని పలుచోట్ల పంచాయతీ తాగునీటి కుళాయిలకు పైపులు తగిలించి నీరు చౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో శివారు కాలనీలకు తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో అందడం లేదు. – **అప్పారావు, పేట,** ✓: నీటి చోరీ చేసే ప్రాంతాలన్ని గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. – **డేవిడ్, పంచాయతీ ఈవో**

?: నామవరంలో ప్రభుత్వ పాఠశాలకు సమీపాన కొండ కాలువపై కల్వర్టు నిర్మించాలి. కాలువపై నుంచి సమీప నివాసాలకు వెళ్లేవారి ఇబ్బందులు తప్పడం లేదు. – **సూరిబాబు, గ్రామస్థుడు,** ✓: కల్వర్టు నిర్మాణానికి పంచాయతీ ద్వారా చర్యలు తీసుకుంటాం. – **డేవిడ్, డిప్యూటీ ఎంపీడీవో**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: ఎస్.నర్సాపురంలో తాగునీటి ట్యాంకు వద్ద మురుగు పేరుకుపోయింది. నీటిని పట్టుకునేందుకు వీలుండటం లేదు. బురదలో అడుగు పెట్టలేకపోతున్నాం. – **రాజు, స్థానికుడు,** ✓: మురుగు తొలగిస్తాం. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. – **కె.డేవిడ్, డిప్యూటీ ఎంపీడీఓ**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని ప్రశాంతినగర్‌లో విద్యుద్దీపాలు వెలగడం లేదు. నెలల తరబడి ఇదే పరిస్థితి ఉంది. చీకటిలో భయాందోళన చెందుతున్నాం. – **చినబాబు, స్థానికుడు,** ✓: విద్యుద్దీపాలు తక్షణమే ఏర్పాటు చేయిస్తాం. – **కె.డేవిడ్, ఈవో**

తీరంలో చేతిబోరు బాగు

స్పందనకు వందనం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వెంకటనగరం పంచాయతీ రాజానగరం తీరంలో మరమ్మతుకు గురైన మూలకు చేరిన చేతి బోరును పంచాయతీ కార్యదర్శి వై.సత్యనారాయణ మరమ్మతు చేయించి అందుబాటులోకి తెచ్చారు. బోరు సమస్యపై ఈనెల 6న 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కార్యదర్శి బాగు చేయించారు. బోరు అందుబాటులోకి రావడంతో మత్స్యకారులకు, పర్యాటకులకు తాగునీటి సమస్య తీరిందని పలువురు పేర్కొన్నారు.

చెరువు గర్భాన్ని జిరాయితీగా ఎలా మార్చారు?

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పెదపల్లి సమీపాన చెరువు గర్భాన్ని రెవెన్యూ అధికారులు జిరాయితీగా మార్చి మూడు గ్రామాలకు అన్యాయం చేశారని గ్రామస్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామపెద్ద దాసరి కుమార్ మాట్లాడుతూ 20, 21 వార్డుల పరిధిలో 3.27 ఎకరాలు చెరువు గర్భం ఉందని, దీన్ని పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు యువకులు చాలా ఏళ్లగా క్రీడామైదానంగా వాడుకుంటున్నారన్నారు. గ్రామ అవసరాలకు వాడుకుంటున్నారన్నారు. జాతరలు వంటివి ఇక్కడే నిర్వహిస్తారన్నారు. దీన్ని ఈ ఏడాది రెవెన్యూ అధికారులు జిరాయితీగా మార్చారని, ఇది అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో గ్రామపెద్దలు బొద్దపు శివ, బొద్దపు శ్రీను, బొద్దపు ఎర్రయ్యదొర, కోడిగుడ్డు రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుమార్

బిల్డర్స్ "డే" శుభాకాంక్షలు
సోదర బిల్డర్స్ అందరికీ బిల్డర్స్ "డే" శుభాకాంక్షలు

3 BHK-1680 Sft, 2 BHK-1180 Sft
Rs. 3250/- Per Sft
FLATS FOR SALE
సిరిపురం గార్డెన్స్
అచ్యుతాపురం
భువనేశ్వరి బిల్డర్స్
Cell: 7386333555

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి 1:** గోపికల గోవా ట్రిప్, అట్టా కాదరా శివ, సీతా ప్రయాణం కృష్ణతో, లవ్ ఓటీపీ, మా ఊరి వెంకన్న **ఆడి 2:** ది గర్ల్ ఫ్రెండ్, సంతాన ప్రాప్తిరస్తు **ఆడి 3:** కాంత, **ఆడి 4:** శివ, రోలుగుంట సూరి, జిగిరిస్ బంగార్రాజు: ప్రీ వెడ్డింగ్‌షో **రాజు:** జింగిరి **చోడవరం:** శ్రీసాయిలక్ష్మి: కాంత సాయిలక్ష్మి: శివ, పూర్ణ: జటాధర

ఏజీపీగా లోవరాజు

నర్సీపట్నం అర్బన్: నర్సీపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా లోకా లోవరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ శాసన వ్యవహారాలు(న్యాయం) కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మూడేళ్లు లేదా సర్వీసు ముగింపు వరకు ప్రభుత్వం తరపున సివిల్ కేసులు చూసుకుంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

కోటపాడు అయ్యప్ప ఆలయం వద్ద యాగపూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే : కె.కోటపాడు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి ధర్మశాస్త్ర సేవా పీఠం గురుస్వామి భూపతి అప్పలరాజు ఆధ్వర్యంలో పడి పూజ జరిగింది. బండారు వెంకటరమణమూర్తి గురుస్వామి అయ్యప్పకు అభిషేకాలు, దీపహారతి పూజలు, 18 మెట్లకు కర్పూర హారతి, పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వాములకు అల్పాహారం, ప్రసాదాలను అందించారు.

జూదర్లపై కేసు నమోదు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : అధిక మొత్తంలో నగదుతో జూదం(ఏట్లాట) ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ప్రాంతంలో పోలీసులు మంగళవారం మెరుపుదాడి చేశారు. దేవరాపల్లి సమీపంలోని కొల్లి అప్పలనాయుడు కల్లం వద్ద జరిగిన ఈ దాడిలో ఏడుగురు చిక్కారు. వారి నుంచి రూ.62,200 స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో వారికి చెందిన 21 ద్విచక్ర వాహనాలను, 7సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో జూదం ఆడుతున్న శిబిరాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారని ఎస్.ఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

రోలుగుంట, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ 21వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ఈనెల 19న రోలుగుంట రామాలయం వద్ద నిర్వహించనున్నామని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరవ్వాలని కోరారు.

నిరుపేదలకు పండ్ల పంపిణీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి శతజయంతిని పురస్కరించుకుని నర్సీపట్నంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రం, రోలుగుంట మండలం కొవ్వూరు వృద్ధాశ్రమంలోని 45 మంది నిరుపేదలకు సత్యసాయి భక్తులు మంగళవారం పండ్లు, ఇతర ఆహారపదార్థాలను అందజేశారు. నర్సీపట్నం సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ, నానాజీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

చిన్న గదిలోనే సేవలన్నీ!

ఏడేళ్లుగా రోగులకు, సిబ్బందికి ఇబ్బంది

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

ఆసుపత్రి అంటే చికిత్స కోసం వచ్చే రోగులకు, విధులు నిర్వర్తించే సిబ్బందికి అనువుగా ఉండాలి. పెదబొడ్డేపల్లిలోని ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రం మాత్రం పరిస్థితి ఇంకోలా ఉంది. తగిన వసతిలేక అన్ని విభాగాలను ఒక గదిలోనే నిర్వహించాల్సివస్తోంది. దాదాపు నలభై అడుగు పొడవు, ఇరవై అడుగల వెడల్పు ఉన్న గదిని వివిధ విభాగాల వారు వినియోగిస్తున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి ప్రదేశాన్నే కార్డుబోర్డు అట్టలతో గదులుగా కేటాయించుకున్నారు.

సిబ్బంది తిరుగాడేందుకు వీలులేని ప్రయోగశాల

2018 నవంబరు 18న తెదేపా అధికారంలో ఉన్నప్పుడు అప్పటి మంత్రి అయ్యన్న మున్సిపాలిటీలోని కీలకమైన పెదబొడ్డేపల్లి ప్రాంతీయుల ఆరోగ్య అవసరాల కోసం అప్పట్లో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనంలో ఆసుపత్రి ఏర్పాటు చేయించారు. 2021లో రూ.10లక్షలు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు.

ఎన్నెన్ని ఇబ్బందులో...

రోగికోసం వేసిన పడక కింద మందుల పెట్టెలు

ఫార్మసీ విభాగంలో కొన్ని మందుల పెట్టెలను నేలమీదే ఉండాల్సి వస్తోంది. దీన్నే సామగ్రి నిల్వ గదిగా వినియోగిస్తున్నారు. ప్రయోగశాల(ల్యాబ్)కు అన్ని రకాల పరీక్షలకు అవసరమైన పరికరాలన్నీ ఉన్నాయి. సిబ్బంది తిరుగాడేందుకు కొద్దిపాటి ప్రదేశం సైతం అందుబాటులో లేదు. వైద్యాధికారి పోస్టు ఇన్‌ఛార్జితో నడుస్తోంది. వైద్యాధికారి గదిలోనే వ్యాక్సిన్లు నిల్వ చేశారు. సిబ్బంది వాహనాలు పెట్టుకునేందుకు చోటు లేక ఆసుపత్రి వరండాలో ఉంచుతున్నారు. రోగులు కూర్చోవడానికి ఈ వరండానే దిక్కు. భవనానికి మెట్ల లేకపోవడంతో శ్లాబ్‌పై పేరుకుపోతున్న వ్యర్థాలు తొలగించేందుకు వీలు పడటంలేదు.

ఈ ఆసుపత్రి కోసం ఆరు పడకలను, సమావేశాల నిర్వహణకు 30 కుర్చీలను అందజేశారు. అవసరమైన వసతిలేక ఒక్క పడకని మాత్రమే వినియోగిస్తున్నారు. కొన్ని మందుల పెట్టెలను ఈ పడక కిందే పేర్చేశారంటే వసతి సమస్య ఎంతగా ఉందో ఊహించుకోవచ్చు.

కలెక్టర్‌కు నివేదించాం

ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వసతి సమస్యని జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. భవనాన్ని విస్తరించి అదనంగా రెండు గదులు నిర్మించాలని కోరాం. ప్రహరీ, ఇనుపగేట్లు కావాలని, తాగునీటి మోటారు మార్చాలని, విద్యుత్తు పనులు, శుద్ధ జలం ప్లాంటు ఏర్పాటు, ప్రయోగశాలకు ఏసీ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశాం. సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ కంపెనీల నుంచి నిధులు రప్పించేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. **– వీరజ్యోతి, జిల్లా ఉప వైద్యారోగ్య అధికారి**

భారీగా తగ్గిన చెరకు సాగు

కె.కోటపాడు, న్యూస్‌టుడే : సహకార రంగంలోని చోడవరం చెక్కర పరిశ్రమ చెరకు సేకరణలో విఫలం కావడంతో ప్రైవేటు క్రషర్ల వైపు రైతులు మరలుతున్నారు. ఒక టన్నుకు రూ. 2,500 వరకు చెల్లిస్తున్నందున చాలా మంది వీటిపై ఆధారపడుతున్నారు. మండలంలో ఏకోదూరులోని చెరకును సేకరించి బెల్లం తయారు చేసే క్రషర్ ఉండటంతో అక్కడికే తరలిస్తున్నారు.

చెరకు క్రషరు

307 హెక్టార్లలోనే..

కె.కోటపాడు మండలంలో ఒకప్పుడు 3,500 హెక్టార్లకు పైగా చెరకు సాగు ఉండేది. ప్రస్తుతం సాధారణ విస్తీర్ణం 1100 హెక్టార్లకు కేవలం 97 హెక్టార్లలోనే సాగు చేశారు. మిగతా వాటిలో వరి తదితర పంటలను వేస్తున్నారు. మండలంలో ఎక్కువగా చౌడువాడ, మల్లంపాలెం, పైడమ్మ పేట, రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల, ఎ.భీమవరం, ఎ.కోడూరు, వారాడ, గుల్లిపల్లి, గోండుపాలెం గ్రామాల్లో సాగు చేస్తున్నారు

మొండిగోడలు... పిచ్చితుప్పలు

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కవగుంటలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షల నిధులతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. గోడలు నిర్మించి శ్లాబు వేసి వదిలేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టాక పనులు ముందుకు సాగలేదు. ప్లాస్టింగ్, గచ్చులు పూర్తిచేయలేదు. తలుపులు, కిటికీలు అమర్చడం వంటి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి కట్టిన పంచాయతీ భవనం ప్రస్తుతం పిచ్చి మొక్కలు మధ్య అసంపూర్తి పనులతో వృథాగా దర్శనమిస్తోంది.

అసంపూర్తిగా పంచాయతీ భవనం

పనులు పూర్తిచేసి పంచాయతీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచి దాసరి సూర్యకుమారి, గ్రామస్థులు కోరుతున్నారు.

శ్మశానవాటికలో మంచినీటి సదుపాయం

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని ముషిడిపల్లి శివారురెడ్డి వారి కాలనీకి చెందిన శ్మశానవాటికలో మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి పేర్కొన్నారు. ఇందుకోసం తమ నిధుల నుంచి మంజూరు చేసిన బోరు పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డు లక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భూమి పూజచేస్తున్న ఎంపీపీ బుల్లి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి తదితరులు

అధిక పాలఉత్పత్తికి యాజమాన్య పద్ధతులు

రోలుగుంట, న్యూస్‌టుడే: అధిక పాల ఉత్పత్తికి పాడిరైతులు తగు యాజమాన్య పద్ధతులు పాటించాలని పాటించాలని జిల్లా పశుగాభివృద్ధి సంస్థ నోడల్ అధికారిణి డాక్టర్ సౌజన్య పేర్కొన్నారు. మండలంలోని కొంతలంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నాయకులు కుంజంగి హరిబాబు ప్రారంభించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై తగు సూచనలిచ్చారు. రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దమయంతి, బాలాజీ, జూనియర్ వెటర్నరీ ఆఫీసరు అన్నపూర్ణతోపాటు ఇతర సిబ్బంది రాజేశ్వరి, రాజు, కృష్ణ, శివ, నానాజీ, సాయికృష్ణ, దివ్య, హారిక తదితరులు పాల్గొన్నారు.

చినగోగాడలో స్వామిత్వ గ్రామసభ

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం జి.కొత్తపల్లి పంచాయతీ చినగోగాడలో పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం నివాసగృహాలకు యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీకి సంబంధించిన స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్ని ఇళ్లు, స్థలాలకు సంబంధించిన మ్యాప్ పత్రాలను ఇన్‌ఛార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచి కొల్లి సూర్యనారాయణ, ఇన్‌ఛార్జి పంచాయతీ విస్తరణాధికారి గోపి చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అద్దిపల్లి చినఅప్పారావు, పడాల అప్పలనాయుడు, బలిజి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమ్మెకు తెర

చింతపల్లి: ఏపీఎఫ్‌డీసీకు చెందిన కాఫీ తోటల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మె విరమించారు. సంస్థ ఎండీ, ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ హామీతో తాత్కాలికంగా విరమించినట్లు సీఐటీయూ అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ మంగళవారం చెప్పారు. పండ్ల సేకరణ, కూలీ ధరల పెంపుతోపాటు పలు అంశాలపై కార్మికుల తరపున సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్ తదితరులు సోమవారం విజయవాడలో ఏపీఎఫ్‌డీసీ ఎండీని కలిశారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

చీడికాడ, కె.కోటపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు మంగళవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. ఎం.కృష్ణాపురం (మాడుగుల), దండిసురవరం (చీడికాడ), చంద్రయ్యపేట (కె.కోటపాడు) మూడు పంచాయతీ కార్యాలయ భవనాలకు ఒక్కొక్క దానికి రూ.32 లక్షల చొప్పున మంజూరు చేశారు. వీటితో పాటు మాడుగుల మండలంలో నాలుగు, చీడికాడ మండలంలో ఆరు, దేవరాపల్లి మండలంలో ఒకటి, కె.కోటపాడు మండలంలో రెండు మొత్తం 13 చేతిబోర్లకు రూ.13 లక్షలు, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో 16 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు రూ.2606.94 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. నిధుల మంజూరుతో కూటమి నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దండిసురవరం కూడలి

అన్నదాతలు అప్రమత్తంగా ఉండండి

దేవరాపల్లి, న్యూస్‌టుడే : తుపాను ముప్పు ఈనెల 24న పొంచి ఉన్నందున అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. తుపాను ప్రభావం వల్ల పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు జాగ్రత్తలు వివరించాలన్నారు. తిమిరాం శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం జరిగిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. మాడుగుల-చీడికాడ-దేవరాపల్లి-కె.కోటపాడు మండలాలను కలుపుతూ పెందుర్తి హైవేకి నాలుగు వరసల రోడ్డు నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేయడానికి టెండరు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పర్యాటకం, పారిశ్రామిక రంగాల్లో ఈ ప్రాంతంలో అవకాశాలను తెలియజేస్తూ ఒక బ్రోచర్‌ను రూపొందించామన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, డి.డి. నాయుడు తదితరులున్నారు.

ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న ఆలయ అర్చకుడు కామేశ్వరరావు శర్మ తదితరులు

డిజిటల్ లైబ్రరీలతో స్వయం ఉపాధి

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకే గ్రామాల్లో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకులు ఎ.శ్రీనివాసరావు అన్నారు. జమ్మాదేవిపేట గ్రామంలో గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించిన డిజిటల్ గ్రంథాలయంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి పొందేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. నెలరోజుల పాటు ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చి సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ధ్రువపత్రాలు ఇస్తామన్నారు. వాటిని ఉపయోగించుకొని రుణాలు తీసుకుని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తిదారులు సంఘం సీఈఓ వడ్డి రాజ్‌కుమార్, ఆర్.కె.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జాజిమొగ్గల ప్రసాద్, తవ్వా సన్యాసిశెట్టి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అదనపు భవనాలకు ప్రతిపాదనలు

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కొమిర ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలోని భవనాలు తొలగింపు, వసతి సమస్య తీరేలా అదనపు తరగతి గదుల భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఎంపీడీవో మహేష్ చెప్పారు. ఎంఈవో-2 బ్రహ్మాజీతో కలిసి ఆయన మంగళవారం కొమిర ప్రాథమిక పాఠశాలను సందర్శించి శిథిల భవనాలను పరిశీలించారు. పాఠశాలలో సమస్యను ఇటీవల జరిగిన మండల సమావేశంలో సర్పంచి గొర్లె రవి ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మహేష్ మంగళవారం పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న ఈ భవనంలో బోధన సాగించవద్దని హెచ్ఎంకు సూచించారు. వీటిపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించట్లు ఎంఈవో-2 బ్రహ్మాజీ తెలిపారు. సర్పంచి రవి, ఉప సర్పంచి సత్యారావు, తెదేపా నాయకులు కృష్ణ, ఈశ్వరరావు, గోవింద పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పెచ్చులు ఊడిపడుతున్న పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

రుద్రాభిషేకంలో భక్తులు

గోమాతకు పూజలు చేసిన అనంతరం మేళతాళాలతో పుర వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : కార్తిక మాసంలోని మాసశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. గోమాతకు పూజలు చేసిన అనంతరం గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు పాకల కామేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి.

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కొవ్వూరులో కార్తికమాసం సందర్భంగా 21శివలింగాలకు పంచామృతంతో రుద్రాభిషేకం చేశారు. అభయ్ హిందూ సేన డైరెక్టరు బంటు రాజు ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో మంగళవారం వార్షిక లక్షపత్రి పూజ ఘనంగా జరిగింది. వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గౌరీపార్వతులను దర్శించుకున్నారు.

రబీలో ఆరుతడి పంటలతో మేలు

రబీలో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే ఆపరాలు, నువ్వులు, కూరగాయలు పంటల్లో రబీ ఆరుతడి విధానాన్ని అవలంబించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి సీహెచ్ లచ్చన్న తెలిపారు. మండలంలోని వీరనారాయణం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుతడి పంటలలో ఆముదం, గోరుచిక్కుడు, అనుములు, సజ్జలు, బొబ్బర్లు, జొన్న, తోటకూర గోంగూర, మొదలైన పంటలను అంతర పంటలుగా వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మాడుగుల గ్రామీణం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

మాకవరపాలెం పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈవో మూర్తి

కె.కోటపాడులో..

చోడవరంలో బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

గ్రంథాలయ 58వ వారోత్సవాల్లో భాగంగా ఉద్యమనాయకులకు నివాళ్లు అర్పించారు. ఆ తరువాత విద్యార్థులకు గ్రంథాలయాలు ప్రయోజనాలు అనే అంశంపై డిబేట్ పోటీలను నిర్వహించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

– న్యూస్‌టుడే, బృందం

కొత్తకోటలో గీసిన ముగ్గులు ప్రదర్శిస్తున్న బాలికలు

నర్సీపట్నంలో జూ.కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీ

పనుల అడ్డగింత

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ఆర్.భీమవరంలో ప్రభుత్వ భూముల చుట్టూ అధికారులు కందకం తవ్వకం పనులు చేయిస్తుండగా మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. పొక్లెయిన్‌కు అడ్డుగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గాజువాక ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారవేత్త గతంలో ఇక్కడ 30 ఎకరాలను కొనుగోలు చేశారు. అవి డి.పట్టా భూములని తెలియడంతో తర్వాత వాటిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. జిల్లా కలెక్టరును కలిసి భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. పట్టాదారులు పీఓటీ నిబంధనలను ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో గతంలో ఇచ్చిన డి.పట్టాలను రద్దు చేస్తూ తహసీల్దారు నిర్ణయం తీసుకున్నారు. వాటిని ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు పరిగణిస్తూ చర్యలు తీసుకున్నారు. మళ్లీ వాటిని ఎవరూ ఆక్రమించుకోకుండా చుట్టూ కందకాలు తవ్విస్తున్నారు. చీపురపల్లి మల్లమ్మ, ఎర్రన్న, నారాయణమ్మ, రొంగలి యర్రయ్య, చంద్రయ్య, సన్యాసిరావు తదితరులు వెళ్లి కందకం తవ్వకం పనులను అడ్డుకున్నారు.

పొక్లెయిన్ వద్ద బైఠాయించిన స్థానికులు

భూ నిర్వాసితులను వేధించడం తగదు

దేవరాపల్లి : రైవాడ జలాశయ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన చిన సోంపురం గిరిజన రైతుల్ని ఇతర గ్రామాలకు చెందిన వారు వేధింపులకు గురి చెయ్యడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. బాధిత గిరిజనుల్ని ఆయన మంగళవారం కలిసి వారు సాగు చేసుకుంటున్న భూముల్ని ఆయన పరిశీలించారు. జలాశయానికి అవసరం ఉన్నపుడు రైతులు ఆ భూమిని ఖాళీ చేస్తారని, అప్పటి వరకు సాగు చేసుకోడానికి అడ్డంకులు లేకుండా చూడాలని వెంకన్న కోరారు.

మహారాజశ్రీ చోడవరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP No. 19/2022 OS No. 922/2011
వాకాడ సత్యనారాయణ ...DHR
మరియు:
1. వాకాడ రామలక్ష్మి
2. వాకాడ శ్రీనివాసు ...JDRS

వేలం ప్రకటన

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈదిగువ షెడ్యూలులో వివరించిన, జె.డి.ఆర్‌లకు పూర్తి హక్కు అనుభవములు గల షెడ్యూలు ఆస్తిని పైనెంబరు అమలు బాకీ రాబట్టే నిమిత్తం పైకోర్టులో తే.15.12.2025దీని పగలు గం.10.30ల నుండి సాయంత్రం గం.5.00ల మధ్య బహిరంగంగా వేలం వేయుదురు. కావున వలయువారు పై వేలములో పాల్గొని పాడుకోవలసినదిగా యిందుమూలముగా తెలియజేయడమైనది. మరిన్ని వివరములకు డి.హెచ్.ఆర్ తరపు వకీలుగారిని సంప్రదించవచ్చు.

SCHEDULE

House bearing Door No.4-92 measuring an extent of 43½ Sq. Yards or 35.540 Sq. meters in S.No. 66/1 situate at Chandaka veedhi, Chodavaram in ward no. 4 within limits of Chodavaram Panchayat Visakhapatnam District now Anakapalli District with the following boundaries.
EAST: Ground wall belongs to Vakada Ramakrishna; SOUTH: Panchayat Road; WEST: Site belongs to Vakada Demudamma; NORTH: Site belongs to Chandaka Chilukamma and Gokada Demudamma
Amin Value : Rs. 1,25,000/-
Market Value : Rs. 6,18,730/-
DHR Value : Rs. 1,00,000/-
The schedule property will be auctioned subject two mortgage deed dated 13-12-2010 for Rs. 75,000/-

Chodavaram
Date : 18-11-2025
VARADI RAJU
Advocate for DHR, Chodavaram
Phone number: 7569492880

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, న్యూస్‌టుడే: 90 శాతం నిధులను వెచ్చించి నిర్మించిన అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా నిర్మాణం నిలిచిపోయింది. దీంతో అర్లలోని అద్దె భవనంలో నిర్వహించాల్సి వస్తోంది.– పోతురాజుదొర, అర్ల

✓: ఈ తరహా భవనాలకు సంబంధించి నిధులను మంజూరు చేయాలని అధికారులకు గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. – యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ, రోలుగుంట

సీఎం సహాయనిధితో పేదలకు ఊరట

బాధితులకు చెక్కు అందజేస్తున్న నీలవేణి

రావికమతం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మహిళా సాధికారత, సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని చోడవరం నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేని చెప్పారు. కొత్తకోటలో నెల్లూరు సుహాసినికి రూ.23.920 ఆర్థికసాయం చెక్కును మంగళవారం అందజేశారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే ఎందరికో సీఎం సహాయనిధి ఉపకరిస్తుందని నీలవేణి తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోట గోవింద రావు, దొరబాబు, పూడి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

6వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మరో వసంతం నిండిన మీ దాంపత్యం అనునిత్యం సుఖసంతోషాలతో సాగిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ..

శ్రీమతి & శ్రీ శానాపతి నాయుడు - రామలక్ష్మి
గుర్రందొరపాలెం
నాయుడు బ్యాటరీస్
TRENDS షోరూమ్ ఎదురుగా..
అనకాపల్లి రోడ్, నర్సీపట్నం
సెల్: 9666544947, 9393213232
సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోండి.. విద్యుత్తు బిల్లు తగ్గించుకోండి

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 కాంత
స్క్రీన్-2 ది గర్ల్‌ఫ్రెండ్

నేడు రైతులకు చెక్కుల పంపిణీ

సబ్బవరం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్య రహిత సమాజం కోసం నిర్వహించే సైకిల్ ర్యాలీలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రెండో విడత పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

గుత్త సంస్థపై మేయర్‌కు ఫిర్యాదు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాల గుత్త సంస్థ దుర్గా కన్సల్టెన్సీపై కార్మికులు మంగళవారం మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. క్లాప్ వాహనాలతో వెళ్లి చెత్త సేకరించే కార్మికుల పర్యవేక్షకులుగా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, సంస్థ గుత్తేదారు ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏడాదిన్నర కిందట డబ్బులు తీసుకుని, నేటికీ ఉద్యోగాలు ఇవ్వలేదని వివరించారు. ఇటీవల ఆ గుత్త సంస్థను జీవీఎంసీ బ్లాక్ లిస్టులో పెట్టడంతో, తామంతా మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లపై విచారణ జరిపిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం అంతర్ల గ్రామంలోని రామాలయం రోడ్డుపై వర్షం పడితే నీరు నిలిచిపోతుంది. – వై.సోమినాయుడు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై.రాజేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ, సబ్బవరం

?: సబ్బవరం నుంచి వెదనాయుడుపాలెం వెళ్లే దారిలో వృక్షాలు పేరుకుపోయాయి. – ఎన్.నాగేంద్ర ✓: వృక్షాలను తొలగించే ఏర్పాటు చేస్తాం. – వై.రాజేశ్వరరావు, గ్రామకార్యదర్శి, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వ వార్డు బాలాజీ గార్డెన్స్ లింక్ రోడ్డు కాలువలపై పలకలు, ఇనుప గ్రిల్స్ పాడైపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. – రాజేశ్వరరావు ✓: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – రాపర్తి కన్నా, 93వ వార్డు కార్పొరేటర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ బాలుర వసతి గృహం, కొత్త రోడ్డు సమీపంలోని కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. – రవి ✓: మరమ్మతులు చేయిస్తాం. – లలిత, ఏఈ, ఆర్అండ్‌బీ

స్పందించిన వీఎంఆర్డీఏ అధికారులు

స్పందనకు వందనం

వేపగుంట, న్యూస్‌టుడే : వేపగుంట-పినగాడి రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా మేహాద్రి రిజర్వాయర్ బ్రిడ్జి నుంచి పినగాడి వరకు సుమారు 3.92 కిలోమీటర్ల రోడ్డును వీఎంఆర్డీఏ నిర్మిస్తోందని అధికారులు తెలిపారు. శంకుస్థాపన చేసి ఎప్పటికీ పనులు చేపట్టకపోవడంతో ఈ నెల 15న 'రహదారి నిర్మాణం శిలా ఫలకానికే పరిమితమా' శీర్షికతో 'ఈనాడు' పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి వీఎంఆర్డీఏ అధికారులు స్పందించారు. బ్రిడ్జి అవతలి భాగాన్ని అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. విద్యుత్తు స్తంభాలు, మంచి నీటి పైపు లైన్లు మార్పునకు సంబంధించి ఆయా విభాగాలకు ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించామని.. త్వరితగతిన పూర్తి చేస్తామని వీఎంఆర్డీఏ అధికారులు ప్రకటించారు. వేపగుంట నుంచి మేహాద్రి రిజర్వాయర్ బ్రిడ్జి వరకు మిగిలిన భాగాన్ని జీవీఎంసీ నిర్మిస్తోందని తెలిపారు.

వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం

నిర్వహణ శూన్యం.. స్పందించని యంత్రాంగం

పెందుర్తి, న్యూస్‌టుడే: నిత్యం వేలాది వాహనాలు, రైల్వే ప్రయాణికుల రాకపోకలకు వినియోగించే పెందుర్తి రైలు పైవంతెన నిర్వహణ లేక ప్రమాదకరంగా మారింది. పెందుర్తి - సబ్బవరం మార్గంలోని వెంకటేశ సమీపంలో రైలు పైవంతెన ఉంది. వంతెన కింద నుంచి రైళ్లు, పైనుంచి వాహనాలు వెళ్తాయి. దశాబ్దాల క్రితం దీన్ని నిర్మించారు. నిర్వహణను యంత్రాంగం పూర్తిగా విస్మరించింది. దీంతో ప్రమాదకరంగా మారింది.

వంతెన వెంబడి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పలుచోట్ల ఛిద్రమైపోయాయి. కొన్నిచోట్ల పూర్తిగా కూలిపోయాయి. గతంలో పలు వాహనాలు గోడలను ఢీకొన్న ఘటనలున్నాయి. పలు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు జరిగాయి. అయినప్పటికీ గోడల పటిష్టతపై యంత్రాంగం దృష్టి సారించలేదు. నిర్వహణ లేకపోవడంతో రక్షణ గోడలకు ఇరువైపులా పెద్దఎత్తున పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు పెరిగిపోయాయి. రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకుల ముఖాలకు తగిలేలా రోడ్డుపైకి వచ్చేశాయి. దీంతో నడక మార్గంలో ఎవరైనా వస్తే చీకట్లో కనిపించని పరిస్థితి నెలకొంది.

వంతెన పైనుంచి కిందకు వెళ్లే మార్గం

ప్రమాదకరంగా మార్గాలు

వంతెనపై నుంచి అటు ఇటు రాకపోకలు సాగించేందుకు రెండు మార్గాలున్నాయి. ఒక మార్గంలో రైల్వేగేటు పరిసర ప్రాంతాల నివాసితులు వినియోగిస్తున్నారు. ఇది పూర్తిగా ధ్వంసమైపోయింది. ఇనుప మెట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రక్షణ గోడ కూలిపోయింది. మరోవైపు మార్గాన్ని రైలు ప్రయాణికులు ఉపయోగిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో దిగిన పలువురు ప్రయాణికులు ఈ మార్గం ద్వారా వంతెనపైకి వచ్చి సబ్బవరం, అనకాపల్లి వైపు వెళ్తుంటారు. ఈ మార్గం పూర్తిగా ఏటవాలుగా ఉంటుంది. కనీసం రక్షణ కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవు. అదుపు తప్పితే సుమారు యాభై అడుగుల దిగువకు పడిపోయే ప్రమాదం ఉంది.

అంతటా చీకటి

వంతెనపై ఒక్క వీధి దీపం కూడా లేదు. జీవీఎంసీ పరిధిలోనే వంతెన ఉన్నప్పటికీ యంత్రాంగం వెలుగులు నింపడంపై దృష్టి సారించలేదు. రాత్రి పూట పాదచారులు ఈ వంతెనపై ప్రయాణించేటప్పుడు వాహనాలు ఢీకొంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. వంతెనపై నెలకొన్న సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టిసారించి ప్రమాదాలు జరగక ముందే నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'మన గ్రామం...మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధికారులతో కలిసి ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫార్మా, ఎన్టీపీసీ అధికారులతో మాట్లాడి కాలుష్య సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం ముత్యాలమ్మపాలెంలో కొద్ది నెలల క్రితం హత్యకు గురైన బంగార్రాజు కుటుంబ సభ్యులకు రూ.5లక్షల నగదును అందజేశారు. బంగార్రాజు భార్యకు ఎన్టీపీసీలో ఉపాధి కల్పించి.. వారి పిల్లలను ఎన్టీపీసీ బాలభారతి పబ్లిక్ స్కూల్లో చేర్పించినట్లు తెలిపారు. రూ.2.15కోట్ల విలువ చేసే చేపల వేట సామగ్రిని 43 మంది మత్స్యకార కుటుంబాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్లె రామునాయుడు, ఎంపీడీవో రమేశ్‌నాయుడు, తహసీల్దార్ నాగరాజు, సర్పంచిలు చింతకాయల సుజాత, ఎంపీటీసీ సభ్యులు అర్జిల్లి దేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

చిన్నారి ఎత్తును పరిశీలిస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఎన్.సూర్యలక్ష్మి

సబ్బవరం, న్యూస్‌టుడే: గర్భిణిల్లో తగిన హిమోగ్లోబిన్ ఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఎన్. సూర్యలక్ష్మి అన్నారు. సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం పంచాయతీ పరిధి ఆదిరెడ్డిపాలెంలోని 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు రక్తహీనత నివారణకు అందించాల్సిన పోషక పదార్థాలను వివరించారు. రక్తంలో హిమోగ్లోబిన్ ఉండేలా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల భద్రతకు సంబంధించిన హెల్ప్‌లైన్ నెం. 1098ను తల్లులందరికీ ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లల బరువు, ఎత్తు కచ్చితంగా లెక్కించి రికార్డులో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు డి. అప్పలనరసమ్మ, వై. ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం ప్రారంభమై అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఏయూలోని డా.వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో మంగళవారం జిల్లా యంత్రాంగం, జాతీయ సేవా పథక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ బారిన పడిన వారిని రక్షించే ప్రయత్నం జరగాలని, అది మన నుంచే ఆరంభం కావాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలతో పోలీసులకు చిక్కితే బెయిల్ కూడా రాదని అన్నారు. డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ యువతే భారతదేశానికి పెద్ద సంపద అని, ఈ పరిస్థితిలో పెరుగుతున్న సాంకేతికత, విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు కె.కవిత, పంకజ్ కుమార్ ద్వివేది, ఎస్.ఎస్.పాషా, కె.రామలక్ష్మి, డి.సింహాచలం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

గ్రావెల్ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేస్తున్న దేశపాత్రునిపాలెం గ్రామస్థులు

దేశపాత్రునిపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం కొండ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని... దీనికి తామంతా వ్యతిరేకమని.. తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయవద్దని గ్రామస్థులు ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతి పత్రం అందించారు. గ్రామ రెవెన్యూ పరిధి 9709 హెక్టార్ల విస్తీర్ణంలో గ్రావెల్ తవ్వకాలకు శ్రీలక్ష్మి నరసింహ మినరల్స్ సంస్థ ప్రభుత్వాన్ని అనుమతి కోరడంతో మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో హాజరై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కాలుష్య సమస్య తీవ్రం కావడంతో పాటు పర్యావరణం దెబ్బతిని రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆర్డీవోకు తెలిపారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ ముకుందరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● పర్యావరణ నిబంధనలకు వ్యతిరేక చర్యలు చేపట్టడం సరికాదని సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వి.వి.రమణ, ఐద్వా నాయకురాలు మాణిక్యం తదితరులు మండిపడ్డారు.

యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో మంగళవారం నుంచి ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత (ఏఎంఆర్)పై అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి పాల్గొని ప్రత్యేక వీడియో విడుదల చేశారు. అనంతరం వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు యాంటీ బయోటిక్స్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 'వర్తమానాన్ని కాపాడుకోండి... భవిష్యత్తును భద్రపర్చుకోండి' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదంతో కూడిన బ్యానర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.కల్యాణి, ఏఎంఆర్ నివారణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు ఐ.వాణి, పి.రత్నకుమారి తదితరులు

బాధితుల సమస్యల పరిష్కారంపై దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : హెచ్ఐవీ బాధిత పిల్లలు, వారి అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మంగళవారం కేజీహెచ్ ప్రసూతి విభాగం సమావేశ మందిరంలో అంతర్గత శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్ఐవీ బాధితులకు అందుతున్న సహాయం, వారి ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు శ్రీహరి, రాధాకృష్ణ, రమణమూర్తి, సౌమని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పెందుర్తి సూర్యానగర్‌లో..

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోని శివాలయాల్లో మంగళవారం ఆదిదంపతుల కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు పార్వతీ పరమేశ్వరుల పరిణయాన్ని కనులపండువగా జరిపించారు. ★ జీవీఎంసీ 96వ వార్డు పాత పెందుర్తిలోని శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిగింది. మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు దంపతులు పాల్గొని దేవతామూర్తులకు నూతన వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ★ 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని సంపత్ వినాయక ఆలయ ప్రాంగణంలోని పశుపతినాథుడి ఆలయంలో లక్ష బిల్వార్చన జరిగింది. ★ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టు కాలనీలోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల పరిణయం వేడుకగా జరిగింది. ప్రధానార్చకుడు శ్రీకాంత్ శర్మ దేవతామూర్తులకు విశేష అభిషేకాలు, పరిణయోత్సవాలు జరిపించారు.

శ్రమశక్తినగర్‌లో...

పాత పెందుర్తిలో..

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

వేపగుంట: జీవీఎంసీ పరిధి 89వ వార్డు పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు వస్త్రాలు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది కార్మికులకు మంగళవారం అందించారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఏ ప్రభుత్వం వస్త్రాలు ఇవ్వలేదని. . కూటమి ప్రభుత్వం అందించడం ఆనందంగా ఉందని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

అల్లుడిపై దాడి.. మేనమామలకు రిమాండ్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పాత గొడవల నేపథ్యంలో అల్లుడిపై దాడి చేసిన కేసులో ముగ్గురు మేనమామలను పీఎంపాలెం పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ ఏడోవార్డు ప్రియదర్శిని కాలనీకి చెందిన పెంట్ర అప్పన్న (48) కుమార్తెకు అక్క కొడుకు ఆసనాల జాన్(33)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఈ ఏడాది జనవరిలో భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో పంచాయితీ పోలీసుల వరకు వెళ్లింది. దీంతో అల్లుడిపై కక్ష పెంచుకున్న అప్పన్న అతని సోదరులు పెంట్ర కుంటోడు(45), పెంట్ర అప్పడు(40) ముగ్గురు కలిసి ఈ నెల 5న జాన్‌ను కొట్టి చాకుతో గాయపరిచారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. న్యాయస్థానం ఆదేశాలతో ముగ్గురి నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై డి.రాము తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక

పరవాడ, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా భీమిలిలో ఈ నెల 8వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 యోగా పోటీల్లో పరవాడ మండలం వాడచీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎస్.అభిరామ్ ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు ఈ నెల 22 నుంచి 24 వరకు బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు, సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు, తదితరులు

స్విమ్మింగ్‌లో ప్రతిభ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ నెల 16న విశాఖ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ మధుబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన కె.ఆద్య, సాకేత్ ప్రధాన్, జయదీప్, నిఖిల్, బేర్నిక, కార్తిక్, హిమప్రభాస్, యువరాజ్ బంగారు పతకాలు, వైష్ణవి, శరత్, తేజస్వరూప్ రజత పతకాలు, కార్తికేయ, యశ్వంత్, ఇక్రమ్, సాహెల్ గోవిందు కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ హరినాథ్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పి.పద్మజ

సబ్బవరం, న్యూస్‌టుడే: బహిరంగ మల విసర్జన నిర్మూలనే లక్ష్యంగా గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్ల నిర్మించేందుకు సర్పంచులు, కార్యదర్శులు కృషిచేయాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం స్వచ్ఛతపై నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంఈవో ఎం.జె రవీంద్రబాబు, బి.రామునాయుడు పాల్గొన్నారు.

25 నుంచి అంచనాల కమిటీ పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ 25 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. కమిటీ సభ్యులు 25వ తేదీ రాత్రి విశాఖ చేరుకుని, ప్రభుత్వ బంగ్లాలో బస చేస్తారు. 26న విశాఖ, 27న విజయనగరం, 28న శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి, 28వ తేదీ రాత్రి తిరుగుపయనమవుతారు. కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు, సభ్యులుగా భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, పార్థసారథి, సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, పి.వి.వి.సూర్యనారాయణరాజు, వరుదు కల్యాణి ఉన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

ప్రదర్శన చేస్తున్న పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు

పెందుర్తి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్య రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా చేపట్టిన మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు విద్యాలయాల్లో ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు దేముడునాయుడు, విజయ్‌కుమార్, చిన్నబాబు, తదితరులు పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన ఆదర్శ్ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం సుజాతనగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొని కాలనీవాసులకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 150 మంది ఈ సేవలు వినియోగించుకున్నట్లు థియోఫిలస్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జి.మంజుల, ఉప ప్రిన్సిపల్స్ శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న కాలనీవాసులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ఫార్మాసిటీ ఎస్ఈజెడ్‌లోని ఫైజర్ కంపెనీలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కంపెనీ అధినేత మురళీధర్ శర్మ ప్రారంభించారు. శంకర ఫౌండేషన్ కంటి వైద్య సిబ్బంది పరిసర గ్రామాల్లోని 500 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 350 మందికి కంటి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. 40 మందికి శస్త్ర చికిత్సలు చేయిస్తామని ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. బంగార్రాజు తెలిపారు. కార్యక్రమంలో ఫైజర్ కంపెనీ ప్రతినిధులు రాధాకృష్ణన్, రమేశ్‌కుమార్, రవిచంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

పెందుర్తి, సబ్బవరం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెందుర్తి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. గ్రంథాలయ అధికారిణి బి.చంద్రకళ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ రహిత భారత్' అనే అంశంపై జరిగిన పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు చంద్రకళ తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ★ సబ్బవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 'నాకు నచ్చిన పుస్తకం, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సరోజిని, రత్న, రాజేశ్వరి, ఆనంద్, గ్రంథాలయ అధికారిణి వి.శిరీష పాల్గొన్నారు.

యోగా పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన చిన్నారులు పోటీలో పాల్గొని యోగాసనాలు వేశారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి లక్ష్మణరావు తెలిపారు.

పెందుర్తి శాఖా గ్రంథాలయంలో..


సబ్బవరంలో..

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
కెనరా బ్యాంక్ పరవాడ బ్రాంచ్
కెనరా బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బ్రాంచి మేనేజర్ గారికి మరియు సిబ్బందికి శుభాకాంక్షలు.
శ్రీ B.RAMESH గారు బ్రాంచ్ మేనేజర్
SNEHA Fabricators & Erectors, PARAWADA 9908126928, 9391089480
ప్రొ. S. RAVINDRA REDDY

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
కెనరా బ్యాంక్ పరవాడ బ్రాంచ్
కెనరా బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బ్రాంచి మేనేజర్ గారికి మరియు సిబ్బందికి శుభాకాంక్షలు.
శ్రీ B.RAMESH గారు బ్రాంచ్ మేనేజర్
దుర్గా పౌల్ట్రీ ఫామ్ భరణికం- పరవాడ(మం)

(c) eenadu

కొత్త కోర్సులతో నిరుద్యోగులకు ఉపాధి చూపాలి

అనంత సంక్షేమం, రాప్తాడు, న్యూస్‌టుడే: శిక్షణ సాంకేతిక అభివృద్ధి కేంద్రం(టీటీడీసీ)లో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి మరికొంత మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సీడాప్ వారి ఆధ్వర్యంలో పంగల్ రోడ్డులో ఉన్న టీటీడీసీ సెంటర్లో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజ్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ టీటీడీసీ సెంటర్ పరిసరాలను, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణ కాలంలో ఏకాగ్రత వహించి ఉపాధి పొంది స్వశక్తి మీద నిలబడి తల్లిదండ్రులకు బాసటగా, పది మందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ ప్రోగ్రాం గురించి విద్యార్థులు తమ గ్రామంలో నిరుద్యోగ యువతకు కూడా తెలపాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. డీఆర్‌డీఏ పీడీ శైలజ, జాబ్ డిస్ట్రిక్ మేనేజరు సూర్యనారాయణ, డీపీఎం సత్యనారాయణ, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బాలికలు

విద్యార్థినులతో పీడీ ఓబులేసు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ఎన్. నరసాపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వర్షిత, శంకరానందగిరిస్వామి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఇంద్రలేఖ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బాలికలిద్దరూ అక్కాచెల్లెళ్లు అని తెలిపారు. జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో వర్షిత 800 మీటర్ల, 1500 మీటర్ల పరుగులో మొదటి స్థానంలో, ఇంద్రలేఖ 200, 400 మీటర్ల పరుగులో మొదటిస్థానంలో నిలిచారు. ఈనెల 24, 25, 26వ తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. హెచ్ఎం మరియమ్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు అక్కాచెల్లెళ్లను అభినందించారు.

ప్రశాంతి నిలయంలో సామూహిక వ్రతాలు

హాజరైన భక్తులు

వందేళ్ల పండగ.. కనువిందుగా!

సత్యసాయి నామస్మరణతో మార్మోగిన పుట్టపర్తి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయిబాబా నడయాడిన నేల ఉత్సవ శోభను సంతరించుకుంది. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో వందేళ్ల పండుగ సంబరాలు అట్టహాసంగా మొదలయ్యాయి. బాబా నామాన్ని స్మరించుకుంటూ దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు పరవశించిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బాబా శత జయంతి ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులతో పుట్టపర్తి కిటకిటలాడింది. సాయి చూపిన సేవామార్గాన్ని అనుసరిస్తూ చిన్న, పెద్ద, పేద, ధనిక తేడా లేకుండా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల వేదపఠనం అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం ఉదయం నిర్వహించిన బాబా రథోత్సవం భక్తుల్ని పరవశింపజేసింది. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి చిత్రావతి నదిలో సత్యసాయి తెప్పోత్సవం కనులపండువగా సాగింది.

తెప్పోత్సవం

పులకించిన భక్తజనం

రథోత్సవంలో భాగంగా ఉదయం 9 గంటలకు రథాన్ని ఉత్తరగోపురం వద్దకు తీసుకొచ్చారు. వేణుగోపాలస్వామి, సీతారాములు, హనుమాన్ ఉత్సవ విగ్రహాలతో పాటు సత్యసాయిబాబా బంగారు విగ్రహాన్ని మంగళవాయిద్యాల మధ్య గోపురం వద్దకు తీసుకొచ్చి రథంపై ప్రతిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతుండగా భక్తజనం పులకించిపోయింది. ఉదయం 11.30 గంటలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ రత్నాకర్ సతీమణి హిమవాహిని మంగళహారతి ఇచ్చారు.

★ పట్టణ పురవీధుల్లో ఏపీ, తెలంగాణకు చెందిన సత్యసాయి భక్తులు, బాలవికాస్ విద్యార్థులు భారతీయ, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ నృత్యం, కీలుగుర్రాలు, కోలాటాలు, గొరవయ్య నృత్యాలు.. ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

విశ్వశాంతికి సామూహిక వ్రతాలు

ప్రశాంతి నిలయంలో శత జయంతి ఉత్సవాల్లో భాగంగా లోకకల్యాణం కోరుతూ సామూహిక సత్యసాయి, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి, కలశపూజ అనంతరం సత్యసాయి, సత్యనారాయణస్వామిలను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు వ్రతాలు జరిపించారు.

సాయి కుల్వంత్ మందిరంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు స్వాగతం

పుట్టపర్తికి మంగళవారం చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం లభించింది. ఉదయం 8.45 గంటలకు శాంతిభవన్ అతిథి గృహం వద్ద ఆయనకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, మంత్రి సవిత, సత్యకుమార్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. 9.30 గంటలకు సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. 10 గంటలకు శ్రీసత్యసాయి రథోత్సవంలో పాల్గొన్నారు.

మహా సమాధిని దర్శించుకుంటున్న సినీనటి ఐశ్వర్యరాయ్

సత్యసాయి సన్నిధిలో జస్టిస్ ఎన్‌వీ రమణ

ప్రశాంతి నిలయంలోని మహాసమాధిని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ దర్శించుకున్నారు. మంగళవారం పుట్టపర్తి చేరుకున్న ఆయనకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఘనస్వాగతం పలికారు. బుధవారం హిల్‌వ్యూస్టేడియంలో జరిగే సత్యసాయి శత జయంతి వేడుకల్లో జస్టిస్ ఎన్‌వీ రమణ పాల్గొననున్నారు.

ఆకట్టుకున్న నృత్య సాధన

కదిరి, పెనుకొండ, బుక్కపట్నం, న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంత్యుత్సవంలో భాగంగా బుధవారం .జరగనున్న మహిళా దినోత్సవాన్ని ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న సాంస్కృతిక ప్రదర్శనలకు విద్యార్థినులు మంగళవారం హిల్‌వ్యూ స్టేడియంలో సాధన చేశారు. ప్రముఖ వాయిద్య కళాకారుడు శివమణి డ్రమ్స్ వాయిస్తూ వారిని ఉత్సాహపరిచారు. స్థానికులతో పాటు బాబా భక్తులు నృత్య సాధనను ఆసక్తిగా తిలకించారు.

డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

సాధన చేస్తున్న విద్యార్థినులు

కదళీ ఫలం.. నష్టాల కల్లోలం!

యాడికి, న్యూస్‌టుడే : యాడికి మండలంలో అరటి సాగు చేపట్టిన రైతులకు నిలువునా నష్టపోయారు. ఇక్కడ సుమారు 400 ఎకరాల్లో అరటి తోటలు ఉన్నాయి. ఈఏడాది దిగుబడి బాగున్నా.. మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోయాయి. సొంత వ్యవసాయ భూమి, కౌలుకు తీసుకొని కొంత సాగు చేసినవారు చాలా మంది ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితి కారణంగా తోటల్లోనే అరటి గెలలు మాగిపోతున్నాయి. కొందరు పంటను వదిలేయగా, మరికొందరు ట్రాక్టర్ డోజర్‌తో దున్నేస్తున్నారు. ఓ రైతు మంగళవారం అరటి తోటను తొలగిస్తున్న దృశ్యం మండలంలోని రాయలచెరువులో 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది.

ట్రాక్టర్ డోజర్‌తో తోటను దున్నేస్తున్న రైతు

రోడ్డు పక్కనే అరటి గెలలు పడేశారిలా..

అర్జీల పరిష్కారంలో మాయాజాలం!

● 54 శాతం మంది అసంతృప్తి ● సర్వేలో రెవెన్యూ, పోలీసు శాఖలు అధ్వానం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని క్షేత్ర అధికారులు అభాసుపాలు చేసేలా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ఆనంద్ సైతం ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షిస్తున్నా కొందరు బాధ్యతారాహిత్యంగా ఉన్నారు. ఈనెల 13న తెరపైకి వచ్చిన ఓ ఘటనే నిదర్శనం. 'ఈ రోజు (ఈనెల 13న) మధ్యాహ్నం 10.30 నుంచి 12 గంటల మధ్యలో అర్జీ పరిష్కారం కోసం మీ వద్దకు వస్తున్నాం. అందుబాటులో ఉండాలి'.. అంటూ కుందుర్పికి చెందిన అర్జీదారు మంజునాథ్ మొబైల్‌కు సంక్షిప్త సమాచారం (ఎస్ఎంఎస్) మధ్యాహ్నం 1.57 గంటలకు వెళ్లింది. వారు చెప్పిన సమయానికి దాదాపు రెండు గంటలు ఆలస్యంగా ఎస్ఎంఎస్ వెళ్లడమే కాదు.. వెనువెంటనే మీ సమస్య పరిష్కారమైంది.. అంటూ మరొక సందేశం వెళ్లింది. అర్జీల పరిష్కారంలో మాయాజాలం ఏ స్థాయిలో ఉందో అవగతం అవుతోంది.

కమాండ్ కంట్రోల్ విభాగం నుంచి ఫోన్ (ఆడిట్) చేసిన వివరాలు	
స్పందించిన అర్జీదారులు	10,395
సంతృప్తి వ్యక్త పరిచినవారు	4,815
అసంతృప్తి చెందినవారు	5,580

చేయకున్నా.. చేసినట్లుగా..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజా వేదిక కార్యక్రమంలో ఇప్పటిదాకా మొత్తం 52,297 అర్జీలు వచ్చాయి. ఏకంగా 46,194(88%) పరిష్కరించినట్లు లెక్క నమోదైంది. కేవలం 6,103 (12%) అర్జీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. పరిష్కారం కాకున్నా... అయినట్లు అధికారులే మూసేస్తున్నారు. దీంతో ఇప్పటి దాకా వచ్చిన అర్జీల్లో 14 శాతం వరకు మళ్లీ రావడం గమనార్హం. ఎప్పటిలాగే రెవెన్యూలో 4055, సర్వే 781, పోలీసు 295, పంచాయతీరాజ్ 249, విద్యుత్తు 126, పురపాలికలకు సంబంధించి 121 అర్జీలు పెండింగ్ ఉన్నాయి.

రోజూ 12 ప్రశ్నలతో ఆడిట్..

అర్జీల పరిష్కారంపై ప్రతి రోజూ 'ఆడిట్' జరుగుతోంది. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి శాఖల వారీగా సిబ్బంది అర్జీదారులకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారు. మీ సమస్య పరిష్కారం అయిందా. అధికారులు మీ వద్దకు వచ్చారా... తదితర 12 ప్రశ్నలతో ఆడిట్ జరుగుతోంది. ఈ క్రమంలోనే 54 శాతం మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మా వద్దకే ఎవరూ రావడం లేదంటూ కొందరు వాపోయారు. రెవెన్యూ, సర్వే, పోలీసు, మున్సిపల్, బీసీ గురుకులాలు, విద్యుత్తు, పంచాయతీరాజ్, రవాణా(ఆర్టీసీ), ప్రొబేషన్-ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, రిజిస్ట్రేషన్, సమగ్ర శిక్షా.. తదితర శాఖల పనితీరు అధ్వానంగా ఉంది. మొత్తం 59 శాఖల్లో 18 శాఖల్లోనే వంద శాతం సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.

టీబీ కాలువ మట్టి తవ్వకాల పరిశీలన

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: కాలువ పక్కన మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆంధ్ర, కర్ణాటక హెచ్చెల్సీ అధికారులు హెచ్చరించారు. ఈనెల 17న 'కాలువ గట్టులో మట్టి దందా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి స్పందించారు. ఆంధ్ర, కర్ణాటక ఏఈఈలు రంజిత్, అల్తాఫ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి మట్టి తవ్వకాలు చేయరాదని స్థానిక రైతు చంద్రన్నను హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు, ప్రజలు డిమాండ్ చేశారు.

నేడు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ సొమ్ము జమ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం కింద బుధవారం రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు చొప్పున మొత్తం కలిపి మొత్తం రూ.7వేలు జమ చేస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 5,40,682 మంది రైతులకు రూ.367.68 కోట్లు నిధులు మంజూరు చేశారు. బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాలతోపాటు 814 రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ప్రత్యేకంగా ఎల్ఈడీలు ఏర్పాటు చేసి, ప్రత్యక్ష ప్రసారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మాత, శిశు మరణాలను నివారించండి

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: మాత, శిశు మరణాల నివారణ కోసం వైద్యులు, సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి ఆదేశించారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మాత, శిశు మరణాలపై వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ఇటీవల గుంతకల్లు ప్రాంతీయ ఆసుపత్రిలో జరిగిన మాతృమరణానికి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించటమే కారణమని

నిర్లక్ష్యంపై సిబ్బందికి నోటీసులు

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సు, మెటర్నిటీ అసిస్టెంట్‌కు మెమో జారీ చేయాలన్నారు. మాత, శిశు మరణాలు జరిగితే సంబంధిత ఆసుపత్రుల వైద్యులు, సిబ్బందిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైరిస్క్ కేసులను గుర్తించి.. ముందుగా గర్భిణులను ఆసుపత్రుల్లో చేరిస్తే మరణాల శాతాన్ని పూర్తిగా నివారించవచ్చని వెల్లడించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని సక్రమంగా పర్యవేక్షించి వారికి ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. సమావేశంలో అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ నవీన్‌కుమార్, వైద్యులు విష్ణుమూర్తి, రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, దినకర్, సీడీపీవో అనురాధ, పీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల పరిధిలో మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు

అనంత నేరవార్తలు: జిల్లా కేంద్రం లోని విద్యాసంస్థల భద్రతను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల చుట్టూ ఉన్న కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపార సముదాయాలను పరిశీలించారు. పొగాకు పదార్థాలు, గుట్కా, సిగరెట్లు, అనుమతి లేని మత్తు పదార్థాలు, అనుమానిత వస్తువుల విక్రయంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 100 మీటర్ల పరిధిలో నిషేధిత పదార్థాలు విక్రయాలపై హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని డీఎస్పీ హెచ్చరించారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు అవకాశం

● వ్యాపారులు, యజమానుల నుంచి స్పందన కరవు ● చైతన్య పరచడంలో అధికారుల విఫలం

గుత్తిలో అనుమతి లేకుండా నిర్మించిన భవనం

గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, న్యూస్‌టుడే : పురపాలికల్లో అనుమతిలేని లేఅవుట్లు, అక్రమ భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు ఇస్తున్నా ప్రజలు, స్థిరాస్తి వ్యాపారులు ముందుకు రావడంలేదు. ప్రధానంగా గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పురపాలికల్లో రోజురోజుకీ అక్రమ నిర్మాణాలు, ప్లాట్ల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

పురపాలిక	ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులు	అక్రమ నిర్మాణాలివి
గుత్తి	82	244
గుంతకల్లు	400	210
తాడిపత్రి	44	300

● పురపాలికల పరిధిలో మూడు సెంట్ల విస్తీర్ణంలో భవనం నిర్మించాలంటే పురపాలికకు రూ.2లక్షలు దాకా చెల్లించాల్సి ఉంది. బ్యాంకుల్లో గృహనిర్మాణాలకు రుణాలు తీసుకునేవారు మాత్రమే పురపాలికల్లో అన్ని అనుమతులు తీసుకుంటున్నారు. మిగిలిన వారిలో ఎక్కువ మంది నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో లేఅవుట్లను అప్రూవల్ చేయించామని నమ్మ బలుకుతూ ప్లాట్లను విక్రయిస్తున్నారు. మూడు పురపాలికల్లో దాదాపు రూ.200 కోట్ల విలువ చేసే లేఅవుట్లు వేసినట్లు సమాచారం.

ప్రభుత్వం గడువు ఇచ్చినా...

అక్రమ లేఅవుట్లు, అనుమతులు లేని భవనాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గడువు ఇస్తున్నా వ్యాపారులు, ప్రజలు ముందుకు రావడంలేదు. రెండు నెలల నుంచి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశాన్ని ఇస్తోంది. ఖాళీ స్థలానికి మార్కెట్ విలువలో 50 శాతం రాయితీ ఇస్తోంది. దీనిపై కూడా పెద్దగా స్పందన ఉండటం లేదు. తాజాగా ప్రభుత్వం మరికొన్ని రోజులు గడువు పొడిగించింది. 1985-2025 మధ్య అనుమతులు లేకుండా నిర్మించుకున్న భవనాలకు అవకాశం ఇచ్చారు. 2026 మార్చి 11వ తేదీ వరకు గడువు ఇచ్చింది. వ్యాపారులు, ప్రజలను చైతన్య పరచడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

నోటీసులు సిద్ధం చేస్తున్నాం

- మారుతీప్రసాద్, పట్టణ ప్రణాళిక అధికారి,గుత్తి

అక్రమంగా భవనాలను నిర్మించుకున్న వారికి నోటీసులు జారీ చేస్తాం. ఇప్పటికే అన్నీ సిద్ధం చేస్తున్నాం. క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఇచ్చి వాటిని క్రమబద్ధీకరిస్తున్నాం. ప్రభుత్వం మరో రెండునెలలు గడువును పెంచింది. అన్నీ పూర్తయితే పురపాలికలకు ఆదాయం పెరుగుతుంది.

అనురాగమూర్తికి అశ్రునివాళి

మంచికి మారుపేరుగా, అందరిని అప్యాయతగా ఆదరించి, పదుగురి శ్రేయస్సు కాంక్షించి, మా అందరి హృదయాలలో చెరగని సుస్థిరస్థానం ఏర్పరచుకొని దైవసన్నిధికి చేరిన మా మార్గదర్శకులు కీ॥శే॥ శ్రీ తమ్మినేని రామానాయుడు గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ.. మీ..

కీ॥శే॥ శ్రీ తమ్మినేని రామానాయుడు గారు
రావివెంకటాంపల్లి, తాడిపత్రి (మం॥)
జననం: 17-10-1957, మరణం: 10-11-2025

భార్య: శ్రీమతి తమ్మినేని లక్ష్మి

మనవళ్లు: ఎం.శశినందన్, ఎం.జుహిత్‌శ్రీనందన్
మనుమరాళ్లు: జి.నిహాశ్విప్రియ, జి.పర్ణికప్రియ

కూతుర్లు - అల్లుళ్లు
టి.జ్ఞానజ్యోతి - ఎం.సత్యనారాయణ
టి.నిహారిక - జి.సురేష్

మరియు సమస్త బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, అనంతపురము (జిల్లా)

వైకుంఠ సమారాధన: రేపు 20-11-2025 వ తేది గురువారం ఉదయం 10 గంటల నుండి తాడిపత్రి (మం॥), రావివెంకటాంపల్లి గ్రామంలోని వారి స్వగృహం నందు కార్యక్రమం జరుపబడును.
విన్నపము: సకాలంలో సమాచారం అందనివారు ఇదే మా మనవిగా భావించగలరు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

(c) eenadu

పీజీఆర్ఎస్ సమస్యలపై కలెక్టర్ ఆరా

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని వీరన్నపల్లి సమీపంలో నిర్మిస్తున్న పుల్లేటి వాగు వంతెన నిర్మాణంపై రైతులకు ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. వంతెన నిర్మాణ పనులు చేస్తే తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేక అనేక అవస్థలకు గురవుతామని రైతులు గత వారంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా, క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కలెక్టర్ మంగళవారం వచ్చారు. అక్కడి పొలాలకు వెళ్లేందుకు రైతులు రెవెన్యూ అధికారులతో గ్రామసభలను ఏర్పాటు చేసుకుని సమస్యను పరిష్కారం చేసుకోవాలని రైతులకు సూచించారు. పత్తిపంటను పరిశీలించి దిగుబడులు, ధరలపై ఆయన ఆరాతీశారు. ఆయన వెంట తహసీల్దారు ఉషారాణి, ఎంపీడీవో బారన్‌సాహెబ్, సర్పంచి ఆదినారాయణ, మండల సర్వేయర్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు ఆంజనేయులు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు మధు, రామకృష్ణ పాల్గొన్నారు.

మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా సత్యశ్రీ

అనంతపురం(మూడోరోడ్డు): మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా సత్యశ్రీని నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పని చేస్తున్న సత్యశ్రీని అనంతపురం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ చేశారు. ప్రస్తుతం గత కొన్నేళ్లుగా అనంతపురం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పోస్టు ఖాళీగా ఉంది.

పతాక స్థాయికి రిద్ధి

పరుగు, బ్యాడ్మింటన్‌లో అసమాన ప్రతిభ

క్రీడాకారిణి ఎ.రిద్ధితో సంఘాల ప్రతినిధులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పరుగులో జాతీయ స్థాయికి ఎంపికై, షటిల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయికి చేరుకుని అసమాన ప్రతిభ చూపుతోందీ అమ్మాయి. అనంతపురం నగరానికి చెందిన కృష్ణమూర్తి, నాగమణి దంపతుల కుమార్తె రిద్ధి తొలుత బ్యాడ్మింటన్‌లో అరంగేట్రం చేసింది. అనంతరం పరుగులోనూ సత్తాచాటుతోంది. ఇటీవల పలాసలో జరిగిన పాఠశాల క్రీడల రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్‌లో ఊహించని విధంగా రెండు పతకాలు కైవసం చేసుకుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.

మూడేళ్ల క్రితం బ్యాడ్మింటన్ రాకెట్ చేతబట్టింది. ఫిట్‌నెస్ కోసమని కొద్దిరోజులు పరుగు కూడా సాధన చేసింది. పరుగులో ఈ బాలిక ప్రతిభను గుర్తించిన డీఎస్‌డీఏ ఎస్ఎం మంజుల ప్రోత్సహించారు. అనేక మెలకువలు నేర్పించి రోజుకు 3.30 గంటల సేపు సాధన చేయించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీలం సంజీవరెడ్డిలో సాధన చేసింది.

గత ఆగస్టులో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, జోన్ స్థాయిలో జరిగిన 400 మీ. పరుగులో ప్రథమ స్థానం సాధించింది. మరింత కఠినంగా సాధన చేసి రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల అండర్-14 అథ్లెటిక్స్‌లో పాల్గొంది. కష్టానికి తగ్గట్టుగా 400 మీ. పరుగులో రజతం, 600 మీ. పరుగులో కాంస్య పతకం సాధించింది. మధ్యప్రదేశ్‌లో డిసెంబరులో జరగనున్న జాతీయ స్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించింది.

మరోవైపు విజయవాడలో జరగనున్న అండర్-14 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు రిద్ధి ఎంపికైంది. ప్రస్తుతం నగరంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈ బాలిక అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్న లక్ష్యం నిర్దేశించుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, డీఎస్ఏ శిక్షకుల సహకారంతో కలలు నెరవేర్చుకుంటానని అంటోంది. అథ్లెటిక్స్‌లో పరుగుల రాణిగా పేరు తెచ్చుకుంటానని ధీమాగా చెబుతోంది.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు (బుధవారం) ఉదయం ఆరు గంటలకు సాధారణ దర్శనం ఉంటుంది. 7 గంటలకు అభిషేక, స్వర్ణకవచ సేవలు జరుగుతాయి. 9 గంటల నుంచి మధాహ్నం 2.30గంటలు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుంది.

జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికల ప్రకటన విడుదల

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికల సందడి మొదలైంది. ఈనెల 29న క్రికెట్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం ఏడు పదవులకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. మూడేళ్లకోసారి ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఈ ఎన్నికలు ప్రతిసారి ఏకగ్రీవం అవుతున్నాయి. ఈసారి కార్యదర్శి పదవికి తీవ్ర పోటీ ఉన్నందున ఎన్నికలు అనివార్యమన్న చర్చ నడుస్తోంది. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, సంయుక్త కార్యదర్శి, ఒక జిల్లా అధికారిక ప్రతినిధిని ఎన్నుకుంటారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత ఆర్డీఓ బీఆర్ ఈశ్వర్‌ను నియమించారు. ఈ ఎన్నికల ప్రక్రియ అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తామని ఆ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఓటు ఉన్న సభ్యులంతా హాజరై ఎన్నికలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తెదేపాకు కార్యకర్తలే ఊపిరి, బలం

కోవెలమూడి రవీంద్ర

కొత్త కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కోవెలమూడి రవీంద్ర, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దగ్గుపాటిప్రసాద్, వెంకటశివుడు యాదవ్, తదితరులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: తెదేపాకు కార్యకర్తలే ఊపిరి, బలం.. గత ఎన్నికల్లో మీరు కష్టపడి పార్టీని గెలిపించారు. అదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు తెదేపా అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి జిల్లా తెదేపా పరిశీలకుడు కోవెలమూడి రవీంద్ర (నాని) పిలుపునిచ్చారు. మంగళవారం బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కల్యాణ మండపంలో అనంతపురం అర్బన్ నూతన క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం అర్బన్ పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ముందుగా తెదేపా జెండా ఎగురవేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. రవీంద్ర మాట్లాడుతూ.. పదవులు రాకపోయినా కార్యకర్తలెవరూ నిరుత్సాహపడొద్దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయాల్లో కొందరు సామాజిక మాధ్యమాల్లో పార్టీ గురించి ఇష్టానుసారంగా పెడుతున్నారని, అది బాగోదన్నారు. పార్టీలో పదవులు శాశ్వతం కాదని, కష్టపడి పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వచ్చే నగరపాలక సంస్థ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా తనకు టికెట్ ఇచ్చినపుడు అనంతపురంలో వైకాపా నాయకులు సంబరాలు చేసుకున్నారని, చంద్రబాబు ఆశీస్సులతో కార్యకర్తల కష్టంతో తాను గెలిచామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

సేవ చేయడం సామాజిక బాధ్యతగా స్వీకరించండి

ఘనంగా వైద్య విద్యార్థుల స్వాగతోత్సవం

భరత నాట్యం చేస్తున్న విద్యార్థులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం 2025 సంవత్సరం వైద్య విద్యార్థులకు ఆడిటోరియంలో స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని, క్రమశిక్షణతో చదువుకోవాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చి భవిష్యత్తులో ఉత్తమ వైద్యులుగా రాణించాలని తెలిపారు. ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దని, వైద్య వృత్తిలో వస్తున్న ఆధునిక మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటికి అనుగుణంగా అప్‌డేట్ కావాలన్నారు. పేదలకు సేవాభావంతో వైద్యసేవలు అందించటం సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. రోగులతో వైద్యులు మాట్లాడే తీరు వారిపై చాలా ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపల్ విజయశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులు సబ్జెక్టుపై పట్టుసాధిస్తే భవిష్యత్తులో సునాయసంగా ఉన్నత విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పలు అంశాలను వివరిస్తూ చేసిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పలు సినిమా పాటలకు చేసిన నృత్యాలతో సభా ప్రాంగణం అంతా కేరింతలతో మారుమోగింది. సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్‌సోనియా, శంషాద్‌బేగం, శంకర్ నాయక్, పద్మ శ్రావణి, ఫోరెన్సిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాలేటి చంద్రశేఖర్‌తోపాటు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పురాతన శ్రీకృష్ణుడి విగ్రహం లభ్యం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: గాండ్లపెంట మండలం కటారుపల్లిలో రైతు వెంకటనారాయణరెడ్డికి చెందిన పొలంలో పురాతన శ్రీకృష్ణుడి రాతి విగ్రహం బయటపడింది. ఆయన తన పొలాన్ని కౌలుకు ఇచ్చారు. కౌలు రైతు ట్రాక్టర్‌తో ఐదు మడకలు దుక్కి చేస్తుండగా రాతివిగ్రహం బయటపడింది. పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి ఏకాలం నాటిదో తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫోర్జరీ కేసులో దోషికి జైలుశిక్ష

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టాదారు పాసుపుస్తకం ఫోర్జరీ, తహసీల్దారు విధులకు ఆటంకం కలిగించిన కేసులో దాసరి సాలమ్మ అనే మహిళను దోషిగా నిర్ధారించి 14 నెలల జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ మంగళవారం ధర్మవరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి పి.వెంకటహరీష్ తీర్పు ఇచ్చారు. ఒకటో పట్టణ ఇన్‌ఛార్జి సీఐ రెడ్డప్ప, కోర్టు పోలీసు రాము తెలిపిన మేరకు... 2017లో అప్పటి ధర్మవరం తహసీల్దారు మహబూబ్‌బాషా సాలమ్మకు చెందిన పట్టాదారు పాసుపుస్తకాన్ని పరిశీలించగా అది నకిలీదని తేలింది. దీనిపై సాలమ్మ తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆయనగో గొడవపడింది. తహసీల్దారు తన విధులకు ఆటంకం కలిగించిందని, నకిలీ పాసుపుస్తకం తయారు చేయించుకుందని ధర్మవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాటి ఎస్సై సురేష్ కేసు నమోదు చేశారు. కోర్టు వాయిదాలకు సాలమ్మ హాజరుకాకపోవడంతో ఈ ఏడాది జులైలో అరెస్టు చేసి కడప జైలుకు పంపారు. కేసు విచారణ కోర్టులో సాగింది. దోషిని పోలీసులు కడప మహిళా ప్రత్యేక జైలుకు తరలించారు.

'రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలి'

మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

రుద్రంపేట (అనంతపురం), న్యూస్‌టుడే: రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా లేదా కేంద్రపాలిత ప్రాంతంగా 2029 సం. లోపు ప్రకటించాలని ప్రధాన మంత్రికి లేఖ పంపుతున్నట్లు రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలతోపాటు అఖిలపక్ష సమావేశం ఎప్పుడు జరిపినా.. అజెండాలో పెట్టి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంగా తీర్మానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి 12 జిల్లాలతో కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా రాయలసీమను ఏర్పాటు చేసి ఈ ప్రాంతం ప్రజల మనోభావాలను గౌరవించాలని కోరారు. శ్రీబాగ్ ఒప్పందం చెరిగిపోని జ్ఞాపకమని, రాయలసీమకు జరిగిన అన్యాయానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. రుతుపవనానికే కాదు, తరతరాలుగా పాలకులకు కూడా సీమవాసులు సవితి బిడ్డలయ్యారని, ఈ అన్యాయం ఇలాగనే కొనసాగితే సీమ భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు? అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ప్రత్యేక రాయలసీమను సాధించేందుకు కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. మైనార్టీ రాష్ట్ర నాయకులు సాధిక్ వలి, జిల్లా నాయకులు ముష్కిన్ పాల్గొన్నారు.

పాఠశాల క్రీడల జిల్లా ఖోఖో, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

ఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అండర్-17 ఖోఖో, అథ్లెటిక్స్ జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఖోఖో జట్లను రాప్తాడు జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో, అథ్లెటిక్స్ జట్లను కొత్తవూరు జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించి అందులో చేవ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జట్ల ఎంపిక జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు ప్రభాకర్, రమేష్, నిర్మల, శాంతలింగం, రాఘవేంద్ర, వెంకటేష్, జగదీష్‌ల పర్యవేక్షణలో జరిగింది.

ఎంపికైన వారి వివరాలు ఇలా..

ఖోఖో బాలుర జట్టు: ఆంజనేయులు, నాగరాజు, గణేష్, చరణ్, లోహిత్‌రాజు, మహేంద్ర, సిద్ధార్థ, ప్రతాప్, నవదీప్, సాయి కుమార్, ధనుష్ కుమార్, నవదీప్ కుమార్

బాలికల జట్టు: చైతన్య, శాంతి, శరణ్య, భార్గవి, ఉదయ్, శ్రీచందన, యజ్ఞశ్రీ, జాషప్రియ, కావ్యశ్రీ, ప్రవళిక, వర్షిని, స్రవంతి.

అథ్లెటిక్స్ బాలురు: ఎ.అరవింద్, ఎస్.భరత్ కుమార్ (100 మీ. పరుగు), టి.రాజేష్, ఎ.అరవింద్ (200 మీ. పరుగు), రాజేష్, ఎ.మణికంఠ (400 మీ. పరుగు), సుశాంత్, వై.మణిదీప్ (800, 1500 మీ. పరుగు), ఈ.భరత్‌కుమార్, టి.హేమంత్‌బాబు (3వేల మీ. పరుగు), ఎ.భార్గవ్, ఎస్.జాన్ అబ్బాస్ (100 మీ. హర్డిల్స్), ఎ.మణికంఠ, ఎస్.చరణ్ (400 మీ. హర్డిల్స్), ఎం.భరత్, దివాకర్ (హైజంప్), పి.సులేమాన్, కె.సంతోష్ (లాంగ్‌జంప్), ఎ.అరవింద్, పి.సులేమాన్ (త్రిపుల్ జంప్), వి.అభి, డి.ముర్తు జావలి (షాట్‌పుట్), కె.భరత్ కుమార్, కె.తేజస్ నాయక్ (డిస్కస్‌త్రో), కె.రాజశేఖర్, కె.వర్షిత్ (హ్యామర్‌త్రో), అరవాజ్ ఖాన్, రాజశేఖర్ (జావెలిన్‌త్రో), ఎన్.ఖాదర్, సెల్వనాథకుమార్ నాయక్ (5 కి.మీ నడక).

అయోధ్యకు సైకిల్ యాత్ర

తలుపుల మండలం గంటాపురం గ్రామానికి చెందిన శ్రీరామ భక్తుడు జంపుల శ్రీనివాసులు మంగళవారం ఉదయం రామాలయం నుంచి అయోధ్యకు సైకిల్‌యాత్రను ప్రారంభించారు. తొలుత రామాలయ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు సైకిల్‌యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని పూజలు చేశారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో యాత్రికుడికి దాతలు సహాయ సహకారాలు అందించాలని రామాలయ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. **- న్యూస్‌టుడే, బత్తలపల్లి**

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

JOBS

Mypatta కంపెనీలో నైట్ షిఫ్ట్ (4.00 PM to 12.00 AM) కోసం అబ్బాయిలు కావాలి. అర్హత ఏదైనా డిగ్రీ చదువుతున్నవారు/ డిగ్రీ పూర్తిచేసినవారు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటే చాలు, ఆకర్షణీయమైన శాలరీ. Cell: 9000088636.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

వెంకటరెడ్డిని విచారించిన పోలీసులు

గుంతకల్లు, గుంతకల్లుపట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వంపైన, రైల్వే రిజర్వుడు సీఐ సతీశ్‌కుమార్ మృతిపైన అనుచితమైన వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా అధికార ప్రతినిధి, మదనపల్లికి చెందిన వెంకటరెడ్డిని పోలీసులు మంగళవారం రాత్రి మూడు గంటల పాటు విచారించారు. ఇతన్ని గుంతకల్లులో విచారించడానికి తాడిపత్రి పోలీసులు తీసుకొచ్చారు. తాడిపత్రిలో విచారిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనే ఉద్దేశంతోనే పోలీసు అధికారులు గుంతకల్లు డీఎస్పీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.15 వరకు విచారించారు. సమాచారం అందుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డితో పాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారు. పోలీసుల విచారణ పూర్తయ్యాక అతన్ని తాడిపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులకు వైకాపా నాయకులకు వాగ్వాదం జరిగింది. అనంతరం బందోబస్తు మధ్య తాడిపత్రికి తీసుకెళ్లారు.

రూ.5 కోట్ల విలువైన వక్కల స్వాధీనం

4 లారీల్లో తరలింపుపై విచారణ

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి ఈ-వేబిల్లు లేకుండా రూ.5 కోట్లు విలువ చేసే 4 లారీల వక్కలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి దిల్లీకి వక్కలను సరఫరా చేస్తున్నారని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ హేమ ఆదేశాల మేరకు అనంతపురం, కర్నూలు జిల్లాల అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని 4 లారీలను స్వాధీనం చేసుకున్నారు. రికార్డులు పరిశీలిస్తున్నారు. లారీలను స్వాధీనం చేసుకున్నపుడు రవాణాకు సంబంధించి ఈ-వేబిల్లు లేదని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ-వేబిల్లు డౌన్‌లోడ్ కావడంలో జాప్యం జరిగిందని సమాధానం ఇవ్వడంతో అధికారులు ఈ దిశగా పరిశీలిస్తున్నారు. వక్కల విలువ రూ.5 కోట్లు ఉంటుందని అంచనా వేశామన్నారు.

'దళితుల శ్మశానవాటికను ఆక్రమించారు'

దారి, వంకను ఆక్రమించారని చెబుతున్న దళితులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో దళితులకు చెందిన శ్మశానవాటికను, మరువ వంకను గ్రామానికే చెందిన కొందరు రాళ్లు, మట్టి వేసి పూడ్చి ఆక్రమించారని ఇందిరా గాంధీనగర్ దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ వందల ఏళ్లుగా చిక్కవడియార్ చెరువు మరువ వంక ఒడ్డున శ్మశాన వాటిక ఉందన్నారు. గ్రామానికే చెందిన కొందరు మరువ వంక, శ్మశానవాటిక స్థలాన్ని సుమారు 50 సెంట్లకు పైగా ఆక్రమించారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని దళితులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



సందీప్ హారిక

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం కమ్మూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రవిశంకర్ మంగళవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న సందీప్ బేస్‌బాల్, హారిక సాఫ్ట్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 16న జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో వారు ఉత్తమ ప్రతిభ చూపడంతో వారిని అధికారులు రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారన్నారు. త్వరలో జరుగనున్న పోటీల్లోనూ వీరు రాణించేలా తర్ఫీదు ఇస్తున్నట్లు హెచ్ఎం పేర్కొన్నారు.

రుణదాత దాడి.. మహిళ మృతి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలంటూ రుణదాత దాడికి పాల్పడటంతో శాంతమ్మబాయి(55) అనే మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగుబ్బలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న కాలనీలో నరసింహులునాయక్, శాంతమ్మబాయి దంపతులు కూల్ డ్రింక్, టెంకాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు రమేష్‌నాయక్ మూడేళ్ల క్రితం అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన ఎరికల రామకృష్ణ అనే వ్యక్తి దగ్గర రూ.30వేలు అప్పు తీసుకున్నాడు. కొంత చెల్లించి మిగిలింది ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రామకృష్ణ, అతడి భార్య, కుమారుడు, మరో ఇద్దరు కలిసి ముదిగుబ్బలోని రమేష్ ఇంటి వద్దకు వచ్చి వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో జరిగిన తోపులాటలో శాంతమ్మ కింద పడి అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె భర్తకూ గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఇస్మాయిల్ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి అశోక్‌నగర్‌లో గుజిరీ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన వడ్డే తిరుమలేశ్‌కు (41) శింగనమల మండల కేంద్రానికి చెందిన అరుణతో పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారులు కార్తిక్, అభిరామ్‌లు సంతానం. వీరు ఇంటింటా గుజిరీ వస్తువులను సేకరించి, వాటిని విక్రయించి జీవనం సాగించేవారు. అతడు కొంత కాలంగా మద్యానికి అలవాటు బానిసై, భార్యను మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. విసిగిపోయిన భార్య మూడేళ్ల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి చేరి, అక్కడే కూలి పనులకు వెళ్తుండేది. అప్పటినుంచి అతను అశోక్‌నగర్‌లో అద్దె గదిలో ఉంటూ గుజిరీ వ్యాపారం చేస్తూ, వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. భార్య, పిల్లలు దూరమై మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గదిలో ఉరి బిగించుకుని బలవన్మరణం చెందాడు. గుజిరి దుకాణం ఓనర్ చాంద్‌బాషా మంగళవారం మధ్యాహ్నం వెళ్లి చూడగా తలుపునకు గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం వన్‌టౌన్ పోలీసులకు తెలపడంతో.. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఘటనపై ఆరా తీసి కేసు నమోదు చేసుకున్నారు.

పురుగుమందు తాగి యువకుడి..

గోపి

పరిగి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాత్రగానిపల్లికి చెందిన గోపి(18) ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. వివరాలిలా.. గోపి బెంగళూరులోని యలహంక వద్ద ఓ పరిశ్రమలో పని చేసేవాడు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం స్వగ్రామానికి వచ్చాడు. గ్రామ సమీపంలో ఉన్న గొల్లపల్లి నేరేడు వంక వద్దకు వెళ్లి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని స్నేహితుడు రాజుకు ఫోన్‌లో మెసేజ్ పంపాడు. అతను మరికొందరి మిత్రులతో ఘటనా స్థలానికి వెళ్లేలోపే తన వెంట తెచ్చుకున్న పురుగుమందు తాగేశాడు. కొనఊపిరితో కొట్టు మిట్టాడుతున్న గోపిని వారు చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తూ కుటుంబ సభ్యులకు చెప్పారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడని, తన తండ్రి మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు..


లక్ష్మన్న

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పద్నాలుగు ఎకరాల భూమి సాగుకు 14 బోర్లు వేయించగా.. ఒక దానిలోనే అరకొరగా నీళ్లు పడగా. . దీంతో వ్యవసాయం అంతంత మాత్రంగానే సాగుతోంది. ఇంతలో కుమారుడికి చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు ఖర్చవడంతో అప్పులు పెరిగిపోయిన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కళ్యాణదుర్గం పట్టణ పరిధి ముదిగల్లుకు చెందిన లక్ష్మన్న(57)ది ఉమ్మడి కుటుంబం. వివాహాలైన ఇద్దరు కుమారులతో కలిసి సంతోషంగా ఉంటున్న ఆయనకు అప్పులు పెరిగిపోయాయి. వీటిని తీర్చేమార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం తెల్లవారుజామున ఇంటినుంచి వెళ్లిపోయి కంది చేనులో పురుగుమందు తాగి పడిపోయాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా కందిలో విగత జీవిగా పడి ఉండడాన్ని గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతిథుల రాక.. రహదారులు తళతళ

మెరుస్తున్న ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారి

ధర్మవరం పట్టణం, కొత్తచెరువు, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయి శతజయంత్యుత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటితోనే పట్టణానికి వచ్చే రహదారులను అందంగా తయారుచేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా ధర్మవరం-పుట్టపర్తి రోడ్డుపై గుంతలు పూడ్చి, తారు వేయడంతో కొత్తగా మెరుస్తోంది. వేడుకలకు ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ నజీర్ అహమ్మద్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రముఖులు హాజరవుతున్న విషయం తెలిసిందే. పుట్టపర్తిలో వారానికి ఒకసారైనా ఇలాంటి వేడుకలు జరిగితే ప్రగతి పరుగులు తీస్తుందని స్థానికులు అనుకోవడం వినిపించింది.

పురుగుమందు పిచికారీ చేసి అస్వస్థత

చికిత్స పొందుతూ యువరైతు మృతి

భూమ ప్రతాప్

విడపనకల్లు: విడపనకల్లు మండలం హావళిగిలో పంటకు పురుగుమందు పిచికారీ చేసిన రైతు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... హావళిగికి చెందిన భూమ ప్రతాప్(24) సోమవారం పంటలకు క్రిమిసంహారక మందును పిచికారీ చేయడానికి వెళ్లి అస్వస్థతకు గురై మధ్యాహ్నానికి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం బళ్లారి ఓపీడీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున భూమ ప్రతాప్ మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

సభ్యత్వ పత్రాలు ఇస్తున్న ఎస్టీయూ సంఘం నాయకులు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: గొంచిరెడ్డిపల్లి, ఎర్రకొండాపురం, నాగిరెడ్డిపల్లి, భైరవసముద్రం, బ్రహ్మసముద్రం, ఎర్రప్ప దొడ్డి, ఎరడికెర, పడమటి కోడిపల్లి, మాముదూరు, పాలవెంకటాపురం, కోనాపురం పాఠశాలల్లో మంగళవారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు కొనసాగింది. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా నాయకులు సుదాకర్, బ్రహ్మసముద్రం ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి కమిషనర్ సురేష్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిషోర్, ఆర్వో కొండన్న, సీనియర్ అకౌంట్స్ అధికారి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణం: మాదక ద్రవ్యాల జోలికి వెళితే జీవితాలు అంధకారం అవుతాయని ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం జూ.కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం, విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డా.విజయలక్ష్మి

ఘనంగా జ్వాలాతోరణం

రాయదుర్గం గ్రామీణం: మల్లాపురం సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ గౌరవ అధ్యక్షుడు రామమూర్తి స్వామి ఆధ్వర్యంలో జ్వాలాతోరణం, కార్తిక దీపోత్సవం వైభవంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి కమిటీ అధ్యక్షుడు బీసీ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు దస్తగిరి, సత్యనారాయణ, జీవన్ నరసింహులు, కమలాక్షులు, గురు గురునాథరెడ్డి పాల్గొన్నారు.

దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఇంకుడు గుంతలు నిర్మించినా.. నిధులివ్వరా?

న్యూస్‌టుడే, గుమ్మఘట్ట, రాయదుర్గం పట్టణం

నీటి భూమిలోకి ఇంకేలా రాయదుర్గం నియోజకవర్గంలోని 5 మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో ఇంటింటికి ఇంకుడు గుంతలు(సోక్ పిట్స్) తవ్వుకున్నా.. బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీరా పనులు పూర్తయ్యాక నిధులు మంజూరు చేయకపోవడం ఏమిటని లబ్ధిదారులు, గుత్తేదార్లు ప్రశ్నిస్తున్నారు. 'ఇప్పటికే నిర్మించుకున్న వాటికి బిల్లులు రాలేదు. వస్తాయో.. రావో తెలియదు. తాము ఇంకుడు గుంతలు నిర్మించిన ఇబ్బందులు పడటం ఎందుకని' మిన్నకుంటున్నామని కొందరు వాపోతున్నారు.

నేత్రపల్లిలో తవ్విన ఇంకుడు గుంత

నియోజకవర్గంలో నిర్మాణాలు..

రాయదుర్గం మండలంలో 308, కణేకల్ 341, గుమ్మఘట్టలో 544, డి.హీరేహాళ్‌లో 180, బొమ్మనహాళ్‌లో 20 చొప్పున మొత్తంగా 1393 ఇంకుడు గుంతలు పూర్తిచేసుకుని తొమ్మిది నెలలు కావస్తోంది. ఒక్కోదానికి రూ.4900 చొప్పున మొత్తంగా రూ.6.83 కోట్ల బిల్లులు మంజూరు కావాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకునే వారే కరవయ్యారు.

వారంలో చెల్లింపునకు ఏర్పాట్లు

మార్చి 31, 2025 వరకు నిర్మించుకున్న ఇంకుడుగుంతలకు బిల్లుల ఎఫ్‌టీవోలు పూర్తిచేశాం. వారంలోపే లబ్ధిదారులకు నగదు అందేలా చేర్పాట్లు చేస్తున్నాం. మార్చి 31 తరువాత నిర్మించుకున్న పనుల బిల్లులు మాత్రం ఆలస్యం అవుతాయి. - నలీంబాషా, డ్వామా పీడీ

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: పాతబస్టాండ్‌లో చౌడేశ్వరి కాలనీ(క్రాస్) దుకాణం సమీపంలోని ఇనుప స్తంభం షాక్ కొడుతోంది. వర్షం పడినప్పుడు తీగలు విద్యుత్ అవుతున్నాయి. దీనికితోడు స్తంభం విద్యుత్ దీపం వెలగడం లేదు. - పవన్‌కుమార్, ఆటో డ్రైవర్

పరిష్కారం: విద్యుత్ సిబ్బంది తగిన చర్యలు తీసుకుంటాం. -జయకృష్ణ, ఏఈ

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

ఎస్సీలు, మైనార్టీలకు రక్షణ కల్పించండి

నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

రాయదుర్గం పట్టణం: కేంద్రంలో భాజపా మూడోసారి అధికారంలోకి వచ్చాక ఎస్సీలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని, వారికి రక్షణ కల్పించాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. మంగళవారం వినాయక సర్కిల్‌లో నిరసనలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దురుస్వామి, నరసింహులు, తిప్పేస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

కుందుర్పి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఐసీడీఎస్ కంబదూరు ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం ఎంఆర్సీ సమావేశ భవనంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, చిన్నారులు, గర్భిణుల సంక్షేమ కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు ఓబుళమ్మ, సుశీల, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ప్రాముఖ్యతపై ప్రచారం

ఉరవకొండ: గ్రంథాలయాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృత ప్రచారం కొనసాగిస్తున్నామని గ్రంథపాలకుడు ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని సెంట్రల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

'క్వారీకి అన్ని అనుమతులు ఉన్నాయి'

శెట్టూరు: శెట్టూరు మండలం యాటకల్లు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 185లో 3.78 హెక్టార్లలో కొనసాగుతున్న క్వారీకి గనుల శాఖ అధికారుల నుంచి లీజు అనుమతులున్నాయని స్థానిక తహసీల్దారు ఈశ్వరమ్మ మంగళవారం పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిం

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

చిన గ్రీవెన్స్ సెల్‌లో కళ్యాణదుర్గం వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక అధికారులు విచారణ చేపట్టారు.

బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ

డి.హీరేహాళ్: అనారోగ్యంతో మృతిచెందిన హెచ్.ప్రకాష్ కుటుంబానికి జీవిత బీమా పథకం ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎస్‌బీఐ మేనేజర్ రాజేష్ మంగళవారం వెలుగు ఏపీఎంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఏపీఎల్ రాయదుర్గం కొన్నెర్లు వంశీకృష్ణ యాదవ్, కృష్ణమూర్తి, ఎర్రిస్వామి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ముప్పు

కళ్యాణదుర్గం గ్రామీణం: శ్రీశైలంకు సుమారు 51 మంది ప్రయాణికులతో వెళ్తున్న కళ్యాణదుర్గం డిపోకు చెందిన బస్సు మంగళవారం రాత్రి కొల్లాపురం ఆలయం వద్ద డ్రైవర్‌ను ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి చిన్నపాటి గాయాలయ్యాయి. డిపో తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యుడి మృతికి సంతాపం

బెళుగుప్ప: పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలోకి ఈతకు దిగి మొదట గల్లంతైన తదుపరి మృతిచెందిన వైద్యాధికారి కార్తీక్‌రెడ్డికి తహసీల్దార్ అనిల్‌కుమార్‌తోపాటు ఇతర వైద్యులు, ఎంపీపీ పెద్దన్న సంతాపం తెలిపారు. మంగళవారం వ్యవసాయక్షేత్రంలో జరిగిన అంత్యక్రియల్లో పలువురు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుకు కౌంటర్లు

రాయదుర్గం: పట్టణంలో కొన్నేళ్లుగా పేరుకుపోయిన ఆస్తి పన్ను వసూళ్ల బకాయిలను మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి కొండన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పన్నుల వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యాపార దుకాణాలు, ఇళ్లు తిరుగుతూ పన్నులు వసూళ్లు చేస్తున్నారు. పురపాలక సంఘంలో ఇప్పటివరకు రూ.5.74 కోట్లు ఉండగా, రూ.2.09 కోట్ల మేర వసూలయ్యాయి.

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవలకు రూ.28.95 కోట్లు

కణేకల్లు, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకాల కింద రెండోవిడత రాయదుర్గం నియోజకవర్గంలోని పలు మండలాల్లోని 38,508 మంది రైతులకు రూ.28.958 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరు కానున్నాయని స్థానిక ఏఓ జగదీష్ మంగళవారం పేర్కొన్నారు.

వాహనాలు సీజ్ చేయాలని ఆందోళన

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రయివేటు ట్రావెల్స్, పాఠశాలలు, కళాశాలల బస్సులను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, విద్యార్థి యువజన సంఘాల నాయకులు మంగళవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాయదుర్గం నియోజకవర్గం నాయకులు కుమార్, నాగయ్య, రాజు, తరుణ్, మున్నా, హరికృష్ణ, భాను, ప్రకాష్, శంకర్, సురేష్, జునైద్, అమన్, అల్తాఫ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ చేయాలని ఎంవీఐ విశ్వనాథరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హంద్రీనీవా కాలువ పరిశీలన

పనుల తీరు తెలుసుకుంటున్న నాబార్డు అధికారులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఇప్పటికే కొనసాగుతున్న హంద్రీనీవా పథకం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నాబార్డు నుంచి రూ.950 కోట్ల రుణం కోరుతూ దరఖాస్తు చేసింది. ఈ మేరకు విజయవాడలోని నాబార్డు రాష్ట్ర కార్యాలయ ఆర్వో కావ్య, కన్సల్టెంటు కేశవయ్య, ఆ కాలువ ఎస్ఈ రాజాస్వరూప్ కుమార్ బృందంతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గుంతకల్లు నుంచి శ్రీసత్యసాయి జిల్లా సీకేపల్లి వరకు కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఈఈ శ్రీనివాస్, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

రాకపోకలకు మార్గం సుగమం

కణేకల్లు: బెణికల్లు వంక వద్ద కుంగిన రోడ్డుకు ర.భ అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. 'దారి కుంగినా పట్టదా?' అను శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి డీఈ రవిశంకర్‌రెడ్డి స్పందించారు. సిమెంటు దిమ్మెతో కప్పి మట్టిపోయడంతో రాకపోకలకు మార్గం ఏర్పడింది.

మూడు నెలల ఉచిత శిక్షణ

రాయదుర్గం పట్టణం: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో మూడు నెలలు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్ కేంద్రంలో అసిస్టెంట్ డెవలపర్, మొబైల్స్, సామాజిక మాధ్యమాల ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి ఆసక్తి ఉన్నవారు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు, రిజిస్ట్రేషన్లకు 78010 31771 నంబరులో సంప్రదించాలని కోరారు.

టెండర్ల వాయిదా

ఉరవకొండ, న్యూస్‌టుడే: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం తలనీలాలు పోగు చేసుకునే హక్కునకు ఎవరూ టెండరు దాఖలాలు చేయకపోవడంతో వాయిదా వేసినట్లు ఈవో తిరుమలరెడ్డి చెప్పారు.

క్రీడాకారులకు సన్మానం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వేపరాళ్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జిల్లా, డివిజన్‌స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీలు ఈశ్వర్‌రెడ్డి, వీరేష్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు వన్నూరప్ప, వీరేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులు చైత్ర, భరత్, లావణ్య, విజయ్, అమృత్‌కు సన్మానించారు.

పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం శ్రీనివాసులు రెడ్డి, పీఈటీ, ఉపాధ్యాయులు

ధోబీఘాట్ నిర్మించరూ!

ఉరవకొండలో 200 వరకు రజక సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలున్నాయి. వీటిలో సుమారు 120కి పైగా కుటుంబాలు కులవృత్తిలో భాగంగా దుస్తులు ఉతుకుతూ ఉపాధి పొందుతున్నాయి. పట్టణంలో ధోబీ ఘాటు లేకపోవడంతో వారు తమ పనిని కొనసాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా నీరున్న వాగులు, వంకల్లో ఇబ్బందికర వాతావరణంలో దుస్తులు ఉతుకుతున్నారు. ప్రభుత్వం స్పందించి వీరికి ధోబీఘాట్‌లు నిర్మిస్తే వృత్తి మరింత సులువు అయ్యే ఆస్కారం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, ఉరవకొండ

ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రం

కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామం బీసీ కాలనీలోని తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. సమీప ఇళ్ల నుంచి వృథా పదార్థాలు, చెత్తను ట్యాంకు వద్దే వేస్తుండటంతో దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం తాగునీటిని పట్టుకునేందుకు అవస్థలు పడుతున్నట్లు మహిళలు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ట్యాంకు వద్ద శుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కుందుర్పి

ఎన్నాళ్లీ నేల చూపులు!

ఉరవకొండ పట్టణంలో జాతీయ రహదారి కనేకల్ క్రాస్ నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా మరమ్మతులకు గురైంది. అది కిందకు వేలాడుతూ నేలను చూస్తోంది. చాలాకాలంగా దీని మరమ్మతును పట్టించుకునే వారే కరవయ్యారు. ఈ దారిలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఏదైనా ప్రమాదం, ఇతర ఘటనలు జరిగినప్పుడు గుర్తించడానికి అవకాశం లేని పరిస్థితి. దీనిని పంచాయతీ, పోలీసు అధికారులు గుర్తించి వెంటనే సీసీ కెమెరాకు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

నిర్మాణం పూర్తయినా.. ప్రారంభ గ్రహణం

వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ప్రజలకు మెరుగైన సేవలు కల్పించడానికి రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన గ్రామ సచివాలయ పక్కా భవనం నిరుపయోగంగా మారింది. అన్ని వసతులతో నిర్మాణం పూర్తిచేసినా రెండేళ్లుగా భవనాన్ని ప్రారంభించలేదు. దీంతో అక్కడ ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం భవనం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వజ్రకరూరు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కూడేరు(ఉరవకొండ), బ్రహ్మసముద్రం, శెట్టూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో పవన విద్యుత్పత్తి ఉద్యోగి మృతిచెందిన ఘటన కూడేరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా... కూడేరుకు చెందిన తెదేపా క్రియాశీలక కార్యకర్త పెద్దన్న(22) స్థానిక పవన విద్యుత్పత్తి సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి విధులు ముగించుకొని సహ ఉద్యోగి ప్రశాంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుంగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. పెద్దన్న అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. ప్రశాంత్‌తోపాటు దారిలో నడుచుకుంటూ వెళ్తున్న పశ్చిమబంగాకు చెందిన భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అత్యవసర వాహనంలో అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దన్న

గుంతలో పడి...: బ్రహ్మసముద్రం మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన కురబ నాగరాజు(52) ఆదివారం అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన గోతుల్లోకి పడిపోయాడు. ఆయన ముళ్ల పొదల్లో ఇరుక్కుపోగా ద్విచక్రవాహనం తనపైనే పడిపోయింది. బయటకు రాలేక రాత్రంగా అక్కడే పడి ఉన్నాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు ఆయనను గుర్తించి కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. తీవ్ర గాయాలైన నాగరాజును అనంతపురం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. నాగరాజుకు భార్య జ్యోతి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

నాగరాజు

కర్ణాటకలో ములకలేడు వాసి.. శెట్టూరు మండలం ములకలేడుకు చెందిన తపాలా శాఖ ఉద్యోగి తిప్పేస్వామి(45) కర్ణాటక పరుశురాంపురం సమీపం గౌరీపురంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వ్యక్తిగత పనులపై ఆయన అమరాపురం వెళ్లి తిరిగొస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయాలై దుర్మరణం చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రైమ్.. కార్నర్

హెచ్చెల్సీలో విగత జీవిగా...

కణేకల్లు, న్యూస్‌టుడే: రెండు రోజుల అదృశ్యమైన నేసేపేట కాలనీకి చెందిన తెదేపా కార్యకర్త బోయ తిప్పేస్వామి(34) తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించి ఆయన హెచ్చెల్సీ వైపునకు వెళ్లినట్లు గుర్తించారు. కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తిప్పేస్వామి

చికిత్స పొందుతూ వృద్ధుడు...

శెట్టూరు: శెట్టూరు మండలం కైరేవు గ్రామానికి చెందిన ఈరన్న(74)కు రెండు రోజుల కిందట గుర్తుతెలియని విషపురుగు కాటు వేయడంతో అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

మందునీళ్లు తాగి జీవాలు...

బెళుగుప్ప: అరటి చెట్ల తెగుళ్ల నివారణకు డ్రమ్ములో కలిపి ఉంచిన మందు నీళ్లను తాగి రైతు సంజీవకు చెందిన 25 మేకలు, గొర్రెలు మృతిచెందిన ఘటన వీరాంజినేయకొట్టాలలో మంగళవారం చోటుచేసుకుంది. దీంతో రైతుకు రూ.3 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. దీనిని చూడటానికి వచ్చిన రైతు సంజీవ అక్క రామాంజినమ్మ అక్కడే కుప్పకూలిపోయారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఆమె గుండెకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది.

'బెదిరింపులకు గురిచేయడం తగదు'

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరామిరెడ్డి నీటి పథకంలో కార్మికులుగా పనిచేస్తున్న వారిని గుత్తేదారులు బెదిరింపులకు గురిచేయడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న రిలేదీక్ష మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. వేతనంలో రూ.6 వేలు కోత విధించడం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవలే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని హెచ్చరించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఏవోకు అందజేశారు. కార్మిక సంఘం నాయకులు రాము, అశోక్, రంగనాథ్, మురళీ, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవం

కంబదూరు, బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార వారోత్సవాల్లో భాగంగా ఆ సంఘం అధ్యక్షుడు బాబయ్య ఆధ్వర్యంలో మంగళవారం జెండాను ఎగరవేశారు. సహకార సంఘం సభ్యులు రామాంజనేయులు, ఆదినారాయణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సీఈవో ముత్యాలప్ప పాల్గొన్నారు. ● ఉద్దేహాళ్‌లో 72వ సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి పవన్‌కుమార్, సీఈఓ హనుమంతు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై రాజీలేని పోరాటం

కణేకల్లు: పంటలకు మద్దతు ధర కల్పించేలా రాజీలేని పోరాటం చేస్తామని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు జయచంద్రా రెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకులు నాగరాజు పేర్కొన్నారు. ఈనెల 27, 28 తేదీలలో గార్లదిన్నె మండలంలో జరగనున్న మహాసభల పోస్టర్లు విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. రైతు సంఘం నాయకుల రామాంజి, హరినాథరెడ్డి, శర్మాస్, దాదాపీర్ అక్బర్ పాల్గొన్నారు.

కలవరపెడుతున్న ప్రమాదాలు

న్యూస్‌టుడే, ఉరవకొండ

వరుసగా జరుగుతున్న ఆటో ప్రమాదాలు ప్రయాణికులను కలవర పెడుతున్నాయి. వ్యవసాయాధారిత ప్రాంతమైన ఉరవకొండ నియోజకవర్గంలో హెచ్చెల్సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువల కింద పంటలు గణనీయస్థాయిలో సాగయ్యాయి. చేలల్లో పనులు చేయడానికి కూలీలు ఇతర ప్రాంతాల నుంచి విడపనకల్లు, ఉరవకొండ మండలాలకు ఆటోల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు పలు గ్రామాలకు బస్సు సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తుంటారు.

అధిక లోడ్... అజాగ్రత్తలే కారణం

నిబంధనలు అతిక్రమించి ఒక్కో ఆటోలో కనీసం 15 మందిని ఎక్కించుకుంటున్నారు. దీనివల్ల డ్రైవర్ కనీసం స్టీరింగును తిప్పేందుకు, బ్రేకులు వేయడానికి కూడా అవకాశం ఉండదు. ప్రయాణ సమయంలో డ్రైవర్లు మాటలు, చరవాణులపై దృష్టి పెట్టడం, అతివేగంతో నడపడం తదితరాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

చిన్న ముష్టూరులో ఇటీవల జరిగిన ఓ ప్రమాదం

● కిందటి నెల 28న ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు వద్ద కారు, కూలీల ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 11 మంది కూలీలు గాయపడ్డారు. ● ఈనెల 13న వజ్రకరూరు మండలం చాబాల వద్ద ఆటో బోల్తాపడగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. ● ఈనెల 15న విడపనకల్లు మండలం హావళిగి వద్ద కూలీల ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 13 మంది గాయపడ్డారు. వారిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

● తాజాగా సోమవారం వజ్రకరూరు మండలం గడే హోతూరు వద్ద ప్రయాణికుల ఆటో బోల్తాపడి 10 మందికి గాయాలవగా.. ఒకరు మృతి చెందారు.

అధిక లోడ్, అజాగ్రత్తలే కారణం

నియంత్రణ చర్యలు నామమాత్రమే

ఆటోలు, ఇతర వాహనాల్లో అధిక లోడ్‌ను నియంత్రించడంలో రవాణా, పోలీసులు అధికారులు చేపడుతున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. ప్రమాదాలు చోటుచేసుకున్న సమయాల్లో మాత్రమే హడావుడిగా తనిఖీలు చేపట్టి మమ అనిపిస్తున్నారు. దీనిపై సీఐ మహానంది 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆటోల్లో అధిక లోడ్‌ను నియంత్రించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించుటపై సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం కొనసాగింది. బ్రహ్మసముద్రం డీఎల్‌పీవో నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ● కుందుర్పి ఇన్‌ఛార్జి ఎంపీడీఓ లక్ష్మీశంకర్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. ● ఉరవకొండ ఉరవకొండ, కూడేరు ఎంపీడీవో కార్యాలయాల్లో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవోలు రవిప్రసాద్, కుళ్లాయి స్వామి పాల్గొన్నారు. ● వజ్రకరూరు స్త్రీశక్తి కార్యాలయంలో శిక్షణ కొనసాగింది. ఎంపీడీఓ శివాజిరెడ్డి, ఉప ఎంపీడీఓ దామోదర్‌రెడ్డి, ఎంపీపీ దేవిబాయి పాల్గొన్నారు. ● కళ్యాణదుర్గం ఓఎంపీడీవో ధనుంజయజనాథ్ ఎంపీపీ మారుతమ్మ, ఈవోఆర్‌డీ రంగనాయకులుతో కలిసి సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న బొమ్మనహాళ్ ఎంపీడీవో విజయ్ భాస్కర్

● బొమ్మనహాళ్ ఎంపీడీవో విజయ భాస్కర్ శిక్షణ ఇచ్చారు.
● డి.హీరేహాళ్ ఎంపీడీవో దాసనాయక్, డిప్యూటీ ఎంపీడీవో యోగానంద, ఏఓ బలరాం లక్ష్మి తదితరులు శిక్షణలో పాల్గొన్నారు.
● కణేకల్లు ఎంపీడీఓ విజయసింహారెడ్డి, డీఎంపీడీఓ చంద్రమౌళి, డీపీఆర్సీ రిసోర్సు పర్సన్ అఫ్జల్‌బాషా శిక్షణ ఇచ్చారు.

-న్యూస్‌టుడే బృందం.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షిదారురాలైన విజయలక్ష్మి భర్త: లక్ష్మీనారాయణ, పొన్నసముద్ర, వై.ఎన్.హోస్కోట, హోబ్లీ పావగడ రూరల్, తుమకూరు జిల్లా, కర్ణాటక రాష్ట్రం అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై సర్వ హక్కులు కలిగి ఉన్నారు అయితే తన భర్త అయిన అంకెలు దాసరి లక్ష్మీనారాయణ తండ్రి: నారాయణప్ప, సిద్ధప్ప వంక వీధి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి టెంపుల్ ప్రక్కన, కళ్యాణదుర్గం గారు మా కక్షిదారురాలుకి తెలియకుండా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా భర్త అయిన అంకెలు దాసరి లక్ష్మీనారాయణ గారు చెక్క వికాస్ తండ్రి సి.సత్యనారాయణ, సూగేపల్లి గ్రామము మరియు పోస్ట్, బ్రహ్మసముద్రం మండలం గారికి అమ్ముటకు ప్రయత్నము చేయుచున్నాడు అని నా కక్షిదారూరాలికి రూడీగా తెలిసినది కాబట్టి ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు కానీ ఏ ఇతరత్రా జరిపిన అవి చట్టరీత్యా చెల్లనేరవు. ఒకవేళ ఎవరైన అతిక్రమించినచో అటువంటి వారిపైన మా కక్షిదారురాలు తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెల్పడమైనది.

షెడ్యూలు

అనంతపురం రి.డి, కళ్యాణదుర్గం సబ్.డి కి చేరిన కళ్యాణదుర్గం గ్రామ పొలం మరియు మున్సిపాలిటీ ఏరియాలోని ఆస్తి వివరం.
బాబు : స॥ కుష్కి, **స.నెం :** 499-1సి, **ఎ.సి :** 1.82, **ఖాతా నెం :** 2057. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, కళ్యాణదుర్గం పొలం, శ్యామల నగర్, వెంకటేశ్వర స్వామి టెంపుల్ పక్కన.

B.Anand Kumar, Advocate,
Anantapuramu. Cell : 9441180868

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

దాడులపై నిరసన

గుత్తి: దళితులు, బలహీన వర్గాలు, మైనార్టీపై జరుగుతున్న దాడుల పట్ల మంగళవారం సీపీఐ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీపై దాడులు అధికం కావడంతో వారు గుత్తిలోని రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి గ్రామాలకు చెందిన కార్యకర్తలు రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. ఉప తహసీల్దారు సూర్యనారాయణకు వినతిపత్రమిచ్చారు. నాయకులు రామదాసు, రాజు, వెంకట్రాముడు, డానియేలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గార్లదిన్నె గ్రామీణం: గార్లదిన్నె గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గార్లదిన్నె ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. గ్రంథాలయాల విశిష్టతను విద్యార్థులకు వివరించినట్లు గ్రంథాలయాధికారిణి శిరీష చెప్పారు.

సందడిగా కార్తిక వనభోజనాలు

వనభోజనాలు చేస్తున్న భావసార క్షత్రియ సమాజ్ కుటుంబ సభ్యులు

పామిడి: పామిడిలోని భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు మంగళవారం పట్టణ పురవీధుల గుండా దిండి భజనలు చేస్తూ ఆలయాల వద్ద పాటలు పాడారు. అనంతరం కల్లూరు గ్రామ పరిధిలోని పెన్నానది ఒడ్డున ఉన్న క్షేత్రపాల సింగరప్ప కొండపై భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు కార్తిక వనభోజన కార్యక్రమం చేపట్టారు. ఆలయంలోని శివుడు, చెన్నకేశవ స్వాములకు ప్రత్యేక పూజలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. ఆయా కార్యక్రమాల్లో క్షత్రియ సమాజ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యాడికిలో చౌకబియ్యం దందా

యాడికి, న్యూస్‌టుడే: యాడికి మండలంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం యథేచ్ఛగా నడుస్తూనే ఉంది. కొందరు అధికారుల కళ్లుగప్పి బియ్యం రవాణాను గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారు. రెండు నెలల కిందట యాడికి సమీపంలోని ఓ రైస్ మిల్లులో రీసైక్లింగ్ చేసి నాణ్యమైన బియ్యంలా మార్చి అధిక ధరలకు విక్రయించేందుకు నిల్వ ఉంచిన బియ్యంతో పాటు రేషన్ బియ్యాన్ని వందల టన్నులను పోలీసులు పట్టుకోవడం, కేసులు నమోదు చేయడం విదితమే. అయితే ఈ ఘటన ఇంకా మరవక ముందే యాడికిలో కొందరు వీధివీధినా తిరుగుతూ కిలో రూ.18 నుంచి రూ.20 వరకు కొనుగోలుచేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఓ చోట నిల్వచేసి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో రాత్రిళ్లు తరలిస్తున్నారు. ఈ బియ్యాన్ని నంద్యాల జిల్లాలోని సరిహద్దులో ఉన్న రంగాపురంలో ఓ వ్యాపారికి చేరవేస్తున్నట్లు సమాచారం.

కొరవడిన నిఘా..

ప్రత్యేక పోలీసులు, విజిలెన్స్ అధికారులు పట్టుకుంటే తప్పా రేషన్ అక్రమ వ్యవహారాలు బయటపడటంలేదు. స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి అక్రమ వ్యాపారం, బియ్యం తరలింపుపై చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో యాడికి మండలం రేషన్ బియ్యానికి అడ్డాగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సీఎస్ డీటీ మల్లేశ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు రేషన్ బియ్యం, స్మార్ట్ కార్డుల పంపిణీ పర్యవేక్షణలో ఉన్నాం. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ సిబ్బందితో క్షేత్రస్థాయిలో నిఘా ఉంచామన్నారు.

పల్లెదారులు అధ్వానం..

➤ రాకపోకలకు తప్పని పాట్లు ➤ వైకాపా ప్రభుత్వ పాలకుల పాపమిది

ఎవరికీ పట్టని వైనం!

కంకరతేలిన పూలకుంట రోడ్డు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని పలు గ్రామాలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మట్టిరోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రోడ్ల పునరుద్ధరణ, నిర్మాణాలను ఏమాత్రం పట్టించుకోలేదు. అప్పటి పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది.

క్షేత్రస్థాయిలో దారుణ పరిస్థితి

✦ తొండపాడు నుంచి గొందిపల్లికి రోడ్డు మంజూరు కాగా ఇప్పటికీ అసంపూర్తిగా ఉంది. జక్కలచెరువు-గొందిపల్లి మార్గం కూడా అంతంత మాత్రంగానే ఉంది.

✦ ఎన్టీపీసీ వద్ద ఉన్నపాతహైవే నుంచి ధర్మాపురం దారి శిథిలమైంది. దీంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డు గోతులమయం కావడంతో చెట్నేపల్లి మీదుగా రాకపోకలను సాగిస్తున్నారు.

> బేతాపల్లిలో సోలార్‌ప్లాంటు నిర్మాణానికి భారీ యంత్రాలు, వాహనాలు తిరుగుతుండటంతో రోడ్డు గోతులమయం అయింది.

✦ చెట్నేపల్లి నుంచి ఉన్న తారురోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లే ప్రజలకు ముళ్లపొదలు రాసుకుంటున్నాయి. ముళ్లపొదలు రోడ్డును కప్పేశాయి.

✦ నాగసముద్రం రోడ్డు నుంచి పూలకుంట అప్రోచ్ రోడ్డు దారుణంగా ఉంది. పదేళ్ల కిందట డబ్ల్యూ బీఎం రోడ్డు వేయగా అది కంకర తేలింది. ఈమార్గంలో రాకపోకలను అతికష్టంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

> అబ్బేదొడ్డి-మాముడూరు రోడ్డు దారుణంగా ఉంది. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రభుత్వం గ్రామానికి రూ.10 లక్షలతో రోడ్డు మంజూరు కాగా గుత్తేదారుల మధ్య పోటీతో పనులు జరగలేదు.

✦ ధర్మాపురం-బేతాపల్లి రోడ్డు అసంపూర్తిగా ఉంది. ఐదేళ్ల నుంచి పనులు ముందుకు సాగడం లేదు. గుత్తి-ఊటకల్లు తారురోడ్డు శిథిలమైంది.

✦ గుత్తి హైవే నుంచి మాముడూరుకు ఉన్న మూడు కిలోమీటర్ల తారురోడ్డు పూర్తిగా దెబ్బతినింది. ఐదేళ్ల కిందట ప్రభుత్వం మరమ్మతులకు రూ.15లక్షలు కేటాయించి పనులకు టెండర్లను నిర్వహించింది. ప్రభుత్వం మారిపోవడంతో జరగలేదు.

✦ బసినేపల్లితండాకు అప్రోచ్ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈవిషయమై మండల ఇంజినీర్ మల్లేశ్‌నాయక్ మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులు, కొత్త నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు వస్తాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులోని తిలక్ నగర్ మదీన్ లైన్‌లో వేకువ జామున 5గంటలకు తాగునీరు వదలుతున్నారు. ఇబ్బందిగా ఉంది. 6 గంటలకు వదిలాలి. - **దేవేంద్ర**

సమాధానం: అన్ని కాలనీలకు తాగునీరు వదలాలంటే వేకువ జాము నుంచి వదలాల్సి ఉంటుంది. - **హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం.**

సమస్య: పాత గుత్తిరోడ్డులో కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం దగ్గర చెత్తను రోడ్డుపై వేస్తున్నారు. - **శంకర్**

సమాధానం: చెత్తను వేయకూడదని స్థానికులకు సూచిస్తాం. - **వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్. గుంతకల్లు పురపాలక సంఘం**

– న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్యకు పరిష్కారం

స్పందనకు వందనం

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని తాతగారిపల్లి గ్రామంలో రహదారి పక్కనే ఉన్న తాగునీటి ట్యాంకు చుట్టూ మురుగు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ నెల 18న 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' కింద ఇవ్వడంతో అధికారులు స్పందించారు. మంగళవారం ట్యాంకు చుట్టూ ఉన్న మురుగును తొలగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

ప్రతిభా పాటవ పోటీలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఏఐపై చక్కగా వివరించారు. పోటీల్లో మొదటి, రెండు, మూడో బహుమతులు సాధించిన సురాజిత్ సాహూ, గౌసియా, విజయ్‌కుమార్‌లకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ దీప, పలువురు అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

బుగ్గరామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పెన్నానది తీరాన ఉన్న బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీకమాస పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి లక్ష బిల్వార్చన చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

పూజలందుకున్న బుగ్గరామలింగేశ్వరుడు

'సాగు భూమి హక్కులు తొలగించారయ్యా'

నార్పల, న్యూస్‌టుడే: నార్పల మేజర్ పంచాయతీలో నివాసం ఉంటున్నాం.. మా వ్యవసాయ భూమిని కొందరు ఆక్రమించడానికి యత్నిస్తున్నారని, న్యాయం చేయాలని కృష్ణారెడ్డి దంపతులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. నార్పలలో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ సేవ చేస్తున్నామన్నారు. ప్రజాసేవను గుర్తించిన ప్రభుత్వం 2012లో పులసలనూతల గ్రామ శివారులో సర్వేనంబరు 781-1లో 3 ఎకరాల వ్యవసాయ భూమి మంజూరు చేసిందన్నారు. భూమిలో పంట సాగుచేస్తూ, బ్యాంకులో పంట రుణం కూడా తీసుకున్నామన్నారు. అయితే ఇటీవల రెవెన్యూ అధికారులు భూమిని ఆన్‌లైన్‌లో తొలగించి మిగులు భూమిగా చూపారన్నారు. పులసలనూతల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులతో రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కై భూమి విషయంలో ఇబ్బందులు గురిచేస్తున్నారని వాపోయారు. తహసీల్దారు అరుణకుమారి సమస్యను పరిష్కరించకపోగా ఆర్డీవోను కలవాలని చెప్పి తమకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణమని వాపోయారు.

సీపీఐ నాయకుల నిరసన

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజాసమస్యలపై తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. మహిళలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి, కల్లూరులో పూడ్చిన కాలువలను పూడ్చిన రియల్ ఎస్టేట్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్‌చౌదరితోపాటు సీపీఐ నాయకులు నారాయణస్వామి, మండల కార్యదర్శి రాముడు వన్నూరుఖాన్, తదితరులు డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు.

ఆందోళనలో పాల్గొన్న సీపీఐ నాయకులు

యువకుడికి తీవ్ర గాయాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: చెన్నంపల్లి క్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశవ తీవ్రంగా గాయపడ్డాడు. రేకులకుంట గ్రామానికి చెందిన కేశవ మంగళవారం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో నార్పలకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా చెన్నంపల్లి క్రాస్ దగ్గర ముందు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయడానికి యత్నించి అదుపుతప్పి కిందపడ్డాడు. ఈఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో పోలీసులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉచిత గర్భకోశ చికిత్స వైద్య శిబిరం

పామిడి: రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏపీఎల్‌డీఏ) ఆధ్వర్యంలో మంగళవారం పాళ్యం గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. జేడీ ప్రేమ్‌చంద్, డాక్టర్ రమేశ్ రెడ్డి, డీఎల్‌డీఏ వెంకటేశ్, ఏడీ పద్మనాభం, డాక్టర్ కమలమ్మ, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉషా, డాక్టర్ శ్రీకాంత్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల ప్రాధాన్యం గుర్తించాలి

యల్లనూరు(పుట్లూరు): గ్రంథాలయాలతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను విద్యార్థి దశ నుంచే గుర్తించాలని యల్లనూరు మండల గ్రంథాలయాధికారి జయరాములు పేర్కొన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా యల్లనూరులోని ఉన్నత పాఠశాల్లో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, క్రీడలు, చిత్రలేఖనం, తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి కనిపించని తీరు

గుత్తి-గుంతకల్లు 67వ జాతీయ రహదారి మధ్యలో ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి రజాపురం గ్రామంలో వెళ్లే దగ్గర ఇలాంటి పరిస్థితి ఉంది. ఇప్పటికే చాలా మంది ప్రమాదాల బారిన పడ్డారు. అధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

మురుగు కాలువ శిథిలం

గుత్తిలోని కోట వీధికి వెళ్లే రహదారి పక్కన ఉన్న మురుగుకాలువ శిథిలావస్థకు చేరుకుంది. మురుగు వర్షకాలంలో రోడ్డుపై ప్రవహిస్తుంది. కాలువ పూడికతో పేరుకు పోయింది. పైగా కాలువ సైడు రాళ్ల పడిపోయింది. ఇప్పటికైనా కాలువకు మరమ్మతులు చేయించేందుకు పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గుత్తి

పడిపోతేనే స్పందిస్తారా?

తాడిపత్రి మండలంలోని ఆలూరుకోనకు వెళ్లే రహదారి పక్కనే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్తు స్తంభం దెబ్బతిని రోడ్డువైపునకు వాలింది. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు భయాందోళన వ్యక్తం చేశారు. దీనిపై విద్యుత్తు ఏడీ ప్రభాకర్‌రావును వివరణ కోరగా వెంటనే అక్కడ సిబ్బందితో పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, తాడిపత్రి

నిండా వ్యర్థాలు

యాడికిలో పలు చోట్ల మురుగు ముందుకు కదలక పోవడంతో దుర్వాసనను ప్రజలు భరించలేకున్నారు. ఎక్కడ చూసిన మురికి కాలువల్లో అధిక శాతం వ్యర్థాలు పేరుకు పోయాయి. దీంతో ఎక్కడి మురుగు అక్కడ నిల్వ ఉంటోంది. దీనికి తోడు ఇటీవల పందులు సంచరిస్తున్నాయి. పంచాయతీ అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, యాడికి

ప్రొఫెసర్‌పై వరకట్నం కేసు

గుత్తి, న్యూస్‌టుడే: అనంతపురానికి చెందిన సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ధనుంజయపై మంగళవారం గుత్తి పోలీసులు వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. గుత్తికి చెందిన వైద్యురాలు ప్రియాంక అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న పీహెచ్‌సీలో పని చేస్తున్నారు. ధనుంజయతో ఆమెకు 2022 డిసెంబర్ 3న పెళ్లి జరిగింది. అప్పట్లో ఆయన కట్నం తీసుకోలేదు. ఇప్పుడు తనకు కట్నం కావాలని భార్యను వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రియాంక ఫిర్యాదుతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేశామన్నారు.

కులగణన చేపట్టాలి

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేపట్టాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని హరేరామ ఆశ్రమం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఉప తహసీల్దారు శ్వేతకు వినతి సమర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి పురుషోత్తం, రామకృష్ణ, రంగా తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటారు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రత్యేకతను చాటుకునే వారికి చాలా ప్రయోజనాలున్నాయని తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, సైక్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ సత్యనారాయణ అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే వారికి గుంతకల్లులో మంగళవారం జిల్లా సైక్లింగ్ సంఘం తోడ్పాటుతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా సైక్లింగ్ బాలబాలికల పోటీలు జరిగాయి. తిమ్మాపురం వద్ద పోటీలను ప్రారంభించారు. మండల విద్యాశాఖాధికారి సుబ్బరాయుడు, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు రామప్ప, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున, ఎల్ఐసి సంఘం కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైంది వీరే!

బాలురు అండర్-14లో మనోజ్, శివశంకర్, దినేశ్‌సాయి, లిఖిత్‌నాయక్, అండర్-17లో రాహుల్, శివ, శ్రీధర్, శ్రావణ్, బాలికలు అండర్-14లో ఖాజాబీ, షబీనా, నిత్యశ్రీ, జయశ్రీ, అండర్-17లో సంజన, ప్రణతి, అపూర్వ, షణ్ముఖప్రియ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

చెరువులకు సకాలంలో నీరందించాలి

పుట్లూరు : మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి చెరువులకు అందాల్సిన నీరు సకాలంలో అందేలా చూడాలని హెచ్చెల్సీ డీఈ సూర్యనారాయణ పేర్కొన్నారు. సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువుకు 19.3 కి.మీ.ల మేరకు కాలువ దూరం ఉన్నట్లు తెలిపారు. ఇందులో మంగళవారం 9 కి.మీ.ల వరకు నీరు సరఫరా జరుగుతోందని చెప్పారు. మిగతా కాలువలో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కాలువలు సరిగా ఉంటే నీరు త్వరగా చెరువులకు చేరుతుందన్నారు. ప్రస్తుతం సాగర్ నుంచి 90 క్యూసెక్కుల నీరు సరఫరా జరుగుతోందన్నారు. కాలువ పనులను క్వాలిటీ కంట్రోలు జేఈ రమణారెడ్డి, హెచ్చెల్సీ జేఈ శ్రీనివాసులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆసుపత్రిని పరిశీలించిన డీఆర్ఎం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని రైల్వే డివిజనల్ ఆసుపత్రిని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మంగళవారం పరిశీలించారు. రోగులకోసం కొత్తగా నిర్మించిన భవనాలను ఆయన తనిఖీ చేశారు. అక్కడ అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. సౌకర్యాల గురించి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే వారికి సకాలంలో వైద్యమందిస్తున్నామన్నారు. కో-ఆర్డినేషన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'సేవాలాల్ ఆలయం అద్భుతం'

గుత్తి గ్రామీణం: సేవాలాల్ ఆలయం అద్భుతంగా ఉందని వ్యవసాయశాఖలో పని చేసిన విశ్రాంత ఉద్యోగులు పేర్కొన్నారు. గుత్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామ పరిధిలో ఉన్న సేవాఘడ్‌లో వెలిసిన సేవాలాల్ మహరాజ్‌ను కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మారుతీ ప్రసాద్ విశ్రాంత ఉద్యోగులకు ఆలయ చరిత్ర గురించి వివరించారు. అనంతరం ఆలయ ఆవరణలో కార్తిక వనభోజనాలు నిర్వహించారు.

మాటలకందని మంచితనము, జన్మజన్మలకు మరపురాని వ్యక్తిత్వంతో మా అందరి హృదయాలలో ముద్రవేసి మీరు ఆకస్మికంగా మమ్ములను వీడి దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ. మీ స్నేహితులు

డి.రామచంద్ర	కె.చలపతి	బి.చిదంబరప్ప
లాయరు ప్రతాప్	లాయరు చెన్నకేశవులు	అనంతశేనరెడ్డి
మారుతి రెడ్డి	ఎద్దుల శంకర్	డాక్టరు కళ్యాణ్
శివరాం (P.C)	రమేష్‌రెడ్డి	విజయరెడ్డి
పురుషోత్తం	కె.రంగస్వామి	కె.తిమ్మప్ప
ప్రవీన్	సూర్యచంద్రారెడ్డి	ప్రదీప్
ఎ.గోపాల్	లక్ష్మికాంత్	రాజశేఖర్

బాల్యవివాహాలతో అనర్థాలు

శింగనమల (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: గ్రామాల్లో బాల్యవివాహాలను నిర్మూలించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. మంగళవారం శింగనమల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో బాలికలపై దాడులు, అత్యాచారాలు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాచారాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సీఐ కౌలుట్లయ్యకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు బాలికల సంరక్షణ పట్ల పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ శ్రీనివాసులు, సింగిల్‌విండో ఛైర్మన్ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

భవనానికి మరమ్మతులు చేయించరూ..

యాడికి, న్యూస్‌టుడే: ఎందరో విద్యార్థులకు విద్యనందించిన యాడికి జడ్పీ ఉన్నత పాఠశాల భవనం నేడు పాడవుతోంది. కొద్దిపాటి మరమ్మతులు చేయిస్తే ఇంకొన్నేళ్లు విద్యార్థులకు సేవలందించే అవకాశం ఉందని స్థానికులు కోరుతున్నారు. 1908లో ఆంగ్లేయులు భవనం నిర్మించి జైలుగా ఏర్పాటు చేశారు. కాలక్రమంలో ఈ భవనం ప్రాథమిక, 1950లో ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి ఐదేళ్ల క్రితం వరకు ఆ భవనంలోని గదులను వినియోగిస్తూ విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఇప్పటికీ గోడలు దృఢంగా ఉన్నా, సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం పైకప్పులు శిథిలావస్థకు చేరాయి. దీని పక్కనే నిర్మించిన కొత్త గదులను తరగతులకు ఉపయోగిస్తుండటంతో భవనాన్ని పూర్తిగా విస్మరించారు. పది గదుల వరకున్న వీటికి అధికారులు మరమ్మతులు చేయించి భవిష్యత్తు తరాలకు జ్ఞాపకంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శం తీసుకోవాలి

గుంతకల్లు, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం కోసం నడుంబిగించి ఆంగ్లేయులతో పోరాటాలు చేసి జీవితాన్ని త్యాగం చేసిన ఝాన్సీలక్ష్మీబాయి మహిళలందరికీ ఆదర్శంగా నిలిచారని ఆంధ్రా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీ, తెదేపా డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షురాలు హిమబిందు అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ జరిగింది. భారత్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి, సంఘం జిల్లా కార్యదర్శి వాసిమ్‌ఖాన్, రాష్ట్ర సభ్యుడు రవీంద్ర పాల్గొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో లక్ష్మీబాయి జయంతి కార్యక్రమం జరిగింది. ఆమె గురించి పరిషత్ జిల్లా కన్వీనర్ శివరాజ్, నాయకులు బాలేసు, మంజునాథ్ విద్యార్థులకు చక్కగా వివరించారు.

ఆంధ్రా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

వక్తృత్వ పోటీలతో భావ వ్యక్తీకరణ వికాసం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాంటిస్సోరి పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్ రమాదేవి

వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: వక్తృత్వ పోటీలతో విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ వికాసం పెంపొందుతుందని మాంటిస్సోరి పాఠశాల కార్యదర్శి మాధవి పేర్కొన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో మంగళవారం గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. విద్యార్థుల జీవితాలపై 'సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8వ తరగతి విద్యార్థినులు రుత్విక ప్రథమ, రక్షిత ద్వితీయ, 9వ తరగతి విద్యార్థి షాహిద్ తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్ రమాదేవి విజేతలకు బహుమతులు అందజేశారు.

సహకార బ్యాంకులతో ప్రతి రైతుకూ ఉపయోగం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సహకార బ్యాంకుల ద్వారా ప్రతి రైతుకీ ఉపయోగం కలుగుతోందని పి.యాలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కృష్ణమోహన్ చౌదరి పేర్కొన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరులో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులు వ్యవసాయ రుణాలు పొంది పంటలు సాగు చేసుకుంటున్నారని అన్నారు. ఏ రైతు ఇబ్బంది పడకుండా కూటమి ప్రభుత్వం నేడు రుణాలు మంజూరు చేసేలా చొరవ తీసుకుందని వివరించారు. అనంతరం కార్యాలయంపై జెండాను ఎగర వేసి ప్రతిజ్ఞ చేశారు. సీఈవో హనుమంతరెడ్డి, మేనేజర్ స్టీవెన్ కుమార్, సిబ్బంది సుధీర్, బొమ్మయ్య పాల్గొన్నారు.

55 ఏళ్లనాటి భవనం



పాతూరు జోయవీధిలో 1970లో ఎలక్ట్రిసిటీ వర్క్‌షాప్ భవనం ప్రారంభించారు. నిర్మాణం చేపట్టి 55 సంవత్సరాలు దాటిపోయింది. 15 ఏళ్లుగా వినియోగంలో లేక శిథిలం అయింది. పైకప్పు కూలి గోడలు మాత్రమే మిగిలాయి. ఓసారి కారు మీద సన్‌షేడ్ స్లాబ్ విరిగి పడింది. ఈ భవనం మీదుగానే సుభాష్ రోడ్డులోకి వెళ్లాల్సి ఉండటంతో ఎప్పుడు కూలుతుందో అన్న భయం పొంచి ఉంది. పాడుబడిన భవనం కావడంతో ఇందులో విష పురుగులు తిరుగుతున్నాయని భయపడుతున్నారు.

అతికించి వదిలేసి!

నగరంలోని రెండో రోడ్డులో ఉన్న భవనం పూర్తిగా శిథిలమైంది. చుట్టుపక్కల నివాసాల వారు ఎప్పుడు కూలుతుందో అని నిత్యం భయపడుతున్నారు. గతంలోనే ఫిర్యాదు చేయడంతో నగరపాలక పట్టణ ప్రణాళిక 26 జూన్ 2023లో ఇంటి తలుపుకు తాఖీదులు అతికించి చేతులు దులుపుకొన్నారు. పక్కనే టిఫిన్ కేంద్రం వద్ద రద్దీగా ఉంటారు. అప్రమత్తచర్యలు చేపట్టాల్సి ఉంది.

తాఖీదులిచ్చాం.. కూలితే మాకేం సంబంధం!

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పాత భవనాలు శిథిలమవుతున్నాయి. వంతెనలు కూలేందుకు సిద్ధంగా ఉన్నా ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో అన్న భయం వెంటాడుతున్నా అధికార యంత్రాంగం నిద్ర వీడటం లేదు. నిత్యం వేలాది వాహనాలు వెళ్లే వంతెనలపై ప్రమాదకర పరిస్థితి ఉన్నా పట్టించుకోలేదు.

✦ ప్రజలు నివసించే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భవనాలను సైతం కూల్చకుండా తాఖీదులు ఇచ్చేశాం.. మా పని తీరిపోయిందన్న ధోరణిలో ఉంటున్నారు. అవి ఎప్పుడైనా కూలేంతగా పరిస్థితి ఉంది.

✦ పురపాలక చట్టం 1955 సెక్షన్ 456 ప్రకారం నగరపాలక తాఖీదులు ఇచ్చి కూల్చి వేయడానికి అధికారం ఉన్నా తాఖీదులతో సరిపెడుతున్నారు.

నగరంలోని పలు ప్రాంతాల్లో పరిశీలన చేయగా అధికారుల నిర్లక్ష్య ధోరణి కనిపించింది.

వంతెన వద్ద దారుణంగా..

వేణుగోపాల్ ప్రధాన రోడ్డులో మరువ వంక మీద ఉన్న వంతెన ఎప్పుడు కూలుతుందో అన్న దయనీయ పరిస్థితి ఉంది. రోడ్డుపై భాగం నుంచి అంతర్భాగం వరకు దెబ్బతింది. దీనిపై వాహనాలు వెళితే కాలువలోకి పడే ప్రమాదం ఉంది. రాళ్లు, విభాగినులు అడ్డంగా ఉంచారు. కూలితేనే కళ్లు తెరుస్తారా అని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్: 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య: ఆదర్శనగర్‌లో చెత్త వాహనాలు సక్రమంగా రాకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో చెత్త పడేస్తున్నారు. -మనోహర్

సమాధానం: వాహనాలు రోజూ వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం. ఖాళీ ప్రదేశాల్లో చెత్తను తొలగిస్తాం.

సమస్య: అరవిందనగర్ ప్రధాన రహదారిలో రోడ్డు గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - వెంకటనారాయణ

సమాధానం: మరమ్మతులు చేసి ఇబ్బంది తొలగిస్తాం.

సమస్య: నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో రోడ్డు గుంతలు పడటంతో ఇబ్బందిగా ఉంది. - సూర్యనారాయణ

సమాధానం: పరిశీలించి తగు చర్యలు చేపడతాం.

- పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ షాకీర్, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఓ నరసింహా సమాధానాలు ఇచ్చారు.

- న్యూస్‌టుడే, అశోక్‌నగర్, శారదానగర్

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: గంగ : **సంతాన ప్రాప్తిరస్తు,** గౌరి : **కాంత,** గాయత్రి : **మాస్ జాతర,** గౌతమి : **కె ర్యాంప్,** త్రివేణి : **శివ,** తరంగిణి : **లవ్ ఓటీపీ,** తేజస్విని : **గోపి గాళ్ళ గోవా ట్రిప్, జిగ్రిస్,** నీలిమ : **మిరాయ్,** శాంతి : **ది గర్ల్ ఫ్రెండ్,** సుధా : **సీమంతం.**

వీరశైవ లింగాయత్‌లకు గుర్తింపు: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్‌ను సన్మానిస్తున్న రాజేంద్రస్వామి, స్వప్న, తదితరులు

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : వీరశైవ లింగాయత్‌లకు కూటమి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చి అండగా నిలిచిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ తుల్జాపూర్ స్వప్న ఆధ్వర్యంలో వీరశైవ లింగాయత్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ. . వీరశైవ లింగాయత్‌లకు ఏనాడు, ఏపార్టీ ఇవ్వని గౌరవం కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అది జిల్లాలోని అనంతపురం అర్బన్‌కు చెందిన స్వప్నకు ఛైర్మన్ పదవి ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. వచ్చే నగరపాలక సంస్థ ఎన్నికల్లో వీరశైవ లింగాయత్‌లంతా ఏకమై పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. ఛైర్మన్ స్వప్న మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌లను గుర్తించి, కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు ప్రభుత్వానికి రుణపడి ఉన్నామన్నారు.

రెగ్యులర్ ప్రాతిపదికన ప్రిన్సిపాళ్లను నియమించాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలకు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన డిమాండ్ చేశారు. రెగ్యులర్ ప్రిన్సిపాళ్ల నియామకం కోరుతూ ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్కేయూలో కరపత్రాలు విడుదల చేశారు. కాంట్రాక్టు పద్ధతిలోనేవ వీరిని కొనసాగిస్తున్నారని, ఈ విధానానికి స్వస్తిపలికి, ఆచార్యులకు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలన్నారు. విద్యార్థి సంఘం నాయకులు బాలకృష్ణ, భీమేష్, జయచంద్ర, ఖాశీం, వినోద్, మనోజ్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని సాయినగర్ మూడో క్రాస్‌కు చెందిన పిన్ని బాలాజీ అదృశ్యమయ్యాడు. అతడు ఈనెల 17న ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఇతనికి మతిస్థిమితం సరిగా లేదు. ఇతని ఆచూకీ తెలిసిన వారు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీకాంత్ కోరారు.

మిట్స్‌లోని అధ్యాపకుని పరిశోధన

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్‌టుబి విశ్వవిద్యాలయంలో సహాయాచార్యునిగా పనిచేస్తున్న మారుతిప్రసాద్ 'యాన్ ఇంటెలిజెంట్ మల్టీ మోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐఓటీ' అనే అంశంపై పరిశోధన చేశారు. చెన్నైలోని సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యాసంస్థలో ఆచార్యురాలు భారతి పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు సత్యభామ డీమ్డ్ విశ్వవిద్యాలయం మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది.

దశల వారీగా శిల్పారామం సుందరీకరణ

సిబ్బందితో చర్చిస్తున్న శిల్పారామం సీఈవో స్వామినాయుడు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం శిల్పారామంలో అభివృద్ధి పనులు దశల వారీగా చేపట్టడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు ఏపీ శిల్పారామం సీఈఓ స్వామినాయుడు తెలిపారు. శాశ్వత సుందరీకరణ పనులు చేపట్టడానికి అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం అనంతపురం విచ్చేసిన ఆయన శిల్పారామాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై చర్చించారు. రెండు నెలల్లోగా శిల్పారామంలో చేనేత ఉత్పత్తుల ప్రదర్శనశాల, అమ్మకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఫొటోషూట్ కోసం మరిన్ని అంబియన్స్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్తు కాంతులు మెరుగు పరిచి పిల్లల వినోద ఆటల కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. శిల్పారామంలో సంగీతం వినిపించడానికి స్పీకర్లు ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామన్నారు.

అవీ.. ఇవీ..

వారసత్వ సంపదను పరిరక్షిద్దాం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: వారసత్వంగా వచ్చిన సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కమిషనరు బాలస్వామి సూచించారు. ఈనెల 19 నుంచి 25 వరకు జరిగే వారసత్వ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఉన్న పాత కారాగారం పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. నగరపాలక ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. పిచ్చి మొక్కలు తొలగించారు. గోడలకు, ఇతరత్రా ప్రాంతాల్లో రంగులు వేసే పనులను పరిశీలించారు. డిప్యూటీ కమిషనరు పావని, ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

'కూటమి పాలనలో సీమకు అన్యాయం'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి పాలనలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాయలసీమకు చంద్రబాబు పాలనలో చేసిందేం లేదన్నారు. రాయలసీమ అనే పేరు ప్రతిపాదించి 93 ఏళ్లు అవుతున్నా ఇంకా అన్యాయమే కళ్లజూస్తున్నామన్నారు.

ఆర్థిక సహాయం

రుద్రంపేట, న్యూస్‌టుడే: రుద్రంపేటలో నిర్మిస్తున్న ముత్యాలమ్మ దేవాలయం నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మహబూబ్ బీ ఎంఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. రుద్రంపేట పంచాయతీ పరిధిలో ప్రజలు ఎటువంటి శుభ కార్యక్రమాలు జరిపినా తనవంతు సహాయం అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షుడు, స్థానిక వైకాపా పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర నాయకులు సాధిక్ వలి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జన, కుల గణన చేపట్టాలి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి జన, కుల గణన చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి శివ పేర్కొన్నారు. సీపీఐ నాయకులు తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు గురువారం వినతి పత్రాన్ని అందించారు. గతంలో చేపట్టిన జనగణనకు ఆధారంగా కేంద్రం బడ్జెట్‌ని అందిస్తోందని నేడు అది సరిపోవడం లేదన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో 32 వేల మంది జనాభా ఉన్నట్టు చెబుతున్నారు కానీ 60 వేలకు పైగా ఉందన్నారు. కుల గణన చేపట్టి దళిత, గిరిజన కులాలకు న్యాయం చేయాలని కోరారు.

దళితులు, మైనార్టీలపై దాడులు అరికట్టాలి

• సీపీఐ డిమాండ్

గడియార స్తంభం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: దేశంలో మహిళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ అనంతపురం నగరంలో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సమీపంలోని గాంధీ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ పాల్గొని ప్రసంగించారు. భాజపా పాలనలో అన్ని అణగారిన వర్గాలపై దాడులు అధికమయ్యాయన్నారు. సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని సీపీఐ జాతీయ సమితి నిర్ణయించిందన్నారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ కనుసన్నల్లో భారత రాజ్యాంగ లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారన్నారు. రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల సామాజిక న్యాయం, సమానత్వానికి పాతరేస్తున్నారని మండిపడ్డారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో- 2023 నివేదిక ప్రకారం ఎస్సీలపై జరిగిన నేరాలకు 57,789, ఎస్టీలపై జరిగిన నేరాలకు 12,960 నమోదవగా.. దేశంలో మహిళలపై 4.48 లక్షల నేరాలు నమోదవడం విచారకరమన్నారు. మన రాష్ట్రంలో 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాలను తగ్గించడం వల్ల ఆయా వర్గాలు పదవులు కోల్పోయారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, నాయకులు లింగమయ్య, రమణ, రాజేశ్ పాల్గొన్నారు.

లలిత కళాపరిషత్‌లో కోటి దీపోత్సవం

కల్యాణాన్ని జరిపిస్తున్న స్వామీజీలు

అనంత సాంస్కృతికం: వేదాలు మనిషిని పవిత్రంగా ఉంచుతూ లోకాన్ని పాలిస్తున్నాయని విజయవాడ అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్ రామానుజ జీయర్ స్వామీజీ పేర్కొన్నారు. అనంత కోటి దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి లలిత కళాపరిషత్‌లో కోటి దీపోత్సవం, శ్రీనివాస కల్యాణం, శివ పార్వతుల కల్యాణోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ ధార్మిక కార్యక్రమాలకు సంపత్‌కుమార్ స్వామీజీతోపాటు త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామీజీ విశిష్ట అతిథులుగా పాల్గొని నిర్వహించారు. దీపారాధనతో ఉత్సవాలను, గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామీజీలు అనుగ్రహణభాషణ చేశారు. ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ముఖ్య సలహాదారుడు ఏఎల్ఎన్ శాస్త్రి తగిన సూచనలిచ్చారు. నగరంలోని పలు ఆలయాల ట్రస్టీలు తాళంకి వెంకటేశ్ గుప్త, బొగ్గరపు సందీప్‌గుప్త, డా. విజయ సాయికుమార్, అంబటి వేణుగోపాల్, అంబటి రాజు, ముడియం రమణ పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలంలోని తలుపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయినట్లు పీడీ జగదీష్ తెలిపారు. అనంతపురంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో లిఖిత రెడ్డి ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం, 100మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, బిందు అనే విద్యార్థిని 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని విద్యార్థినిలను అభినందించారు.

నేత్రదానానికి ఐదుగురు అంగీకారం

అనంత సాంస్కృతికం: నగరంలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలో మంగళవారం ధన్వంతరీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్ఎస్ఎస్‌లోని ఓ విభాగమైన ఆరోగ్య భారతి రజతోత్సవం పురస్కరించుకుని ఉమ్మడి అనంత జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో ధన్వంతరీ హోమం, పూజ కార్యక్రమాలు ఆలయ నిర్వాహకుడు విజయకుమార్ సహకారంతో జరిగాయి. వైద్యులు నాగేశ్వరావు, వరప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ కుళ్లాయప్పలు నేత్ర దానం పట్ల అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో పాల్గొన్న వారిలో ఐదుగురు తమ మరణానంతరం కళ్లు దానం చేసేందుకు అప్పటికప్పుడు అంగీకారపత్రం అందించారు. వైద్యులు ప్రశాంతి, మల్లికార్జున, కోశాధికారి రంజిత్, ఆలయ నిర్వాహకుడు విజయకుమార్ పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

మారుతీనగర్ పరిధి శిర్డీసాయి దేవాలయం సమీపాన విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన వీధి దీపం చుట్టూ తీగ జాతి మొక్కలు అల్లుకోవడంతో రాత్రిళ్లు చీకటిగా ఉంటోంది. రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి తీగజాతి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

కవచం బాగుంటేనే మొక్కకు రక్షణ



లక్ష్మీనగర్‌లో మొక్కకు ఏర్పాటు చేసిన రక్షణ కవచం వాలింది. తరచు పశువులు వస్తున్నందున రక్షణగా నగరపాలిక అధికారులు కవచాలు ఏర్పాటు చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో రక్షణ అవి.. కిందపడ్డాయి. పశువులు, వాహనదారుల కారణంగా కవచం వాలి కిందపడుతున్నాయి. కవచాలు సక్రమంగా ఏర్పాటు చేస్తే మొక్కలు ఏపుగా పెరిగేందుకు వీలుంటుంది. **- న్యూస్‌టుడే, కమలానగర్**

బస్‌స్టాప్‌లో శుభ్రత ఏదీ?

లక్షలు ఖర్చు పెట్టి ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్‌స్టాప్‌లు నిరుపయోగంగా మారాయి. చుట్టు పిచ్చిమొక్కలు పెరిగి అక్కడికి వెళ్లలేని విధంగా పరిస్థితి ఉంది. రోడ్డుపై ఎండకు నిలబడి బస్సులు, ఆటోలు ఎక్కుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. నగర శివారు బెంగళూరు జాతీయ రహదారి టీవీ టవర్ సమీపంలో పిచ్చి మొక్కలతో నిండి బస్‌స్టాప్ దర్శనమిస్తోంది. విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, కమలానగర్**

చెట్టు.. ఆకట్టుకునేట్టు

కొంతమంది ప్రకృతి ప్రియులు ఇళ్ల ముందు రకరకాల మొక్కలు, చెట్లను నాటుకోవడం చూస్తుంటాం. పూలతో, రంగుల ఆకులతోను, ఆశ్చర్యంగా కనిపించేలా చిన్న మొక్కల రూపంలో కుండీల్లో చెట్లను.. ఇలా అనేకం చూస్తుంటాం. టీవీ టవర్ సమీపాన ఓ వ్యక్తి చెట్టును ఇలా కత్తిరించి.. ఇంటి ముందు ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. **- న్యూస్‌టుడే, కమలానగర్**

అనంతేశ్వరుడికి గంగాభిషేకం

అనంత సాంస్కృతికం: శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలోని అనంతేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో గంగాభిషేకం జరిగింది. మహాగణపతి పూజ అనంతరం అనంతేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, నవధాన్యాలతో ప్రత్యేక అభిషేకం, తైలాభిషేకం, అర్చన, అష్టోత్తరం నిర్వహించారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సౌరశక్తితో పనిచేసే పిచికారీ యంత్రాన్ని తయారు చేసిన విద్యార్థినులు ప్రవళిక, కల్యాణి, షబానాలను జిల్లా కలెక్టర్ ఆనంద్ అభినందించారు. పాఠశాల ఇన్నోవేషన్ మారథాన్-2025లో పెద్దపప్పూరు మండలం, చీమలవాగుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రవళిక, కల్యాణి, షబానా కలసి తయారు చేసిన సౌరశక్తి పిచికారీ యంత్రం జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రాజెక్టు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఓటీపీఆర్ఐ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ అనుబంధ తైలసాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రేకులకుంట గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఓటీపీఆర్ఐ సంచాలకులు సుబ్బారెడ్డి ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. వారం పాటు ఈ శిబిరం నిర్వహించనున్నారు. మొదటి రోజులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వారం రోజులు పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రిన్సిపల్ గోపీనాథ్, గ్రామ సర్పంచ్ నరసమ్మ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

అనంత సాంస్కృతికం: నగరంలోని మూడో రోడ్డు శిర్డీ సాయి మందిరంలో మంగళవారం రాత్రి కార్తిక దీపోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. మాస శివరాత్రి, కృష్ణా అంగారక చతుర్దశి పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి పాల్గొన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

అనంత నేరవార్తలు: సాయినగర్‌లో జనరేటర్‌లోకి దూరి మృతి చెందిన వ్యక్తి పొట్టి శ్రీరాములు కాలనీకి చెందిన గొల్ల బాలకృష్ణగా గుర్తించారు. అతనికి గత నెల 30న ఓ ప్రమాదంలో కాలు విరిగింది. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 3న కుమార్తె ఆసుపత్రికి వచ్చిన సందర్భంగా అక్కడ నుంచి తప్పిపోయాడు. ఆచూకీ లభించలేదు. ఐదు రోజులపాటు నగరంలో సంచరిస్తూ ఉండేవాడు. ఈనెల 8న జనరేటర్‌లోకి దూరి తలుపు వేసుకున్నాడు. గత సోమవారం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు తెలపడంతో, కేసు నమోదు చేసిన రెండో పట్టణ పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా పరిగణించారు. చివరికి మృతుని ఆచూకీ లభించింది.

పారిశ్రామిక పార్కును సందర్శించిన కలెక్టర్

రాప్తాడు: రాప్తాడు మండలం ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కును మంగళవారం జిల్లాకలెక్టర్ సందర్శించారు. మౌలిక సదుపాయాలను, అరటి రకాల మొక్కలను పెంచే సాంకేతికతను పరిశీలించారు.

ప్రమాద ఘంటిక.. నిర్లక్ష్యం వీడాలిక!

హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వరస్వామి ఆలయ ఆర్చ్ ఎదురుగా కూడలి మలుపులో కాల్వపై సిమెంట్ పలకలు లేక భయానక పరిస్థితి నెలకొని ఉంది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ఈ మార్గంలో ఎక్కువగా వెళ్తుంటాయి. చిన్నపిల్లలు ఎక్కువగా తిరిగే ప్రదేశం కూడా.. కాల్వలు శుభ్రం చేసేందుకు పలకలు తెరిచి అలాగే వదిలేశారు. వాహన చోదకులు ఏమరుపాటుగా పూర్తిగా గుంతలోకి పడేంతగా పరిస్థితి ఉన్నా అధికారులు ఏమాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉంది. తగు రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, శారదానగర్**

(c) eenadu

ఈనాడు అన్నమయ్య
బుధవారం నవంబరు 19, 2025

4 ఏళ్లు.. ఆగని కన్నీళ్లు

ఒంటిమిట్ట, రాజంపేట, గ్రామీణ: జిల్లాలోని అన్నమయ్య జలాశయం సృష్టించిన వరద బీభత్సానికి బుధవారంతో నాలుగేళ్లు. మానవ తప్పిదంతో జరిగిన ఈ ఘోరకలికి 38 మంది బలయ్యారు. ఇప్పటికీ మానని గాయం ఆయా గ్రామాలను వెంటాడుతూనే ఉంది. బాధితుల్లో పుట్టెడు దుఃఖం అలుముకుంది. పేదల కలల గూడు కన్నీటి పాలైంది. ఆశల సౌధం శిథిలమైంది. జల రాకాసి ఎన్నో జీవితాలను చిదిమేసింది. ప్రకృతి పగబట్టి పచ్చని పంటలను ముంచేసింది. నది ఒడ్డున కరకట్టలు కొట్టుకుపోయాయి. రహదారులు కోతకు గురయ్యాయి. ఆర్థికంగా ఆసరా నిలిచిన పాడి పశువులు, కాడెద్దులు, కోళ్లు జల సమాధి అయ్యాయి. పసిడి నేలల్లో ఇసుక మేటలు వేశాయి.

తేదీ: 2021 నవంబరు 19న
38 మంది జలసమాధయ్యారు

పేకమేడల్లా కూలిన ఇళ్లు : నది చెంతనే ఉన్న పల్లెల్లో 453 గృహాలు పూర్తిగా, మరో 601 పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. పూర్తిగా కూలిపోయిన ఇంటికి కేవలం రూ.95,100 మాత్రమే పరిహారం చెల్లించారు. ఒక్కో కుటుంబానికి అయిదు సెంట్లు స్థలం కేటాయించి అరు నెలల్లో ఇల్లు నిర్మించి యజమాని చేతికి తాళాలు ఇస్తామని నాటి సీఎం జగన్ హామీ ఇచ్చారు.

● **ఏడు గ్రామాలు :** రాజంపేట మండలం పులపుత్తూరు, ఎగువ, దిగువ మందపల్లి, పాపరాజుపల్లె, శేషమాంబపురం, గుండ్లూరు, తొగ్గూరుపేట, రామచంద్రాపురం, సాలిపేట, నందలూరు మండలంలోని నారాయణనెల్లూరు, పాటూరు, గొల్లపల్లితోపాటు మరికొన్ని గ్రామాల్లో ఎక్కువ నష్టం జరిగింది. ● రామాపురం వద్ద రాజంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నీటిలో మునిగి అరుగురి ఊపిరి ఆగిపోయింది. పాలేశ్వరస్వామికి కార్తిక పూజలు చేయడానికి వెళ్లిన ఓ అర్చకుడి కుటుంబ సభ్యులు, సమీప బంధువులు తొమ్మిది మంది మృత్యుఒడిలోకి చేరుకున్నారు.

శాశ్వత కరకట్టకు పడని అడుగులు

అన్నమయ్య జలాశయం దిగువ ప్రాంతంలో చెయ్యేరు నది ప్రవాహక ప్రాంతంలో రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలు ఉన్నాయి. జగతి కట్టలు 38 కి.మీ మేర పూర్తయ్యాయి నుంచి ఉండేవి. ఎడమ వైపున సుమారు 41 కి.మీ దూరం వరకు ఉండేది.

పులపుత్తూరులో నాలుగేళ్లుగా పైకప్పు పడని పక్కాగృహాలు

పునరావాస కాలనీలో అధ్వానంగా రహదారి

ఇంటి పనులు అసంపూర్తిగా వదిలేశారు

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి సర్వస్వం కోల్పోయాం. ప్రభుత్వం ఆరు నెలల్లో ఇంటిని నిర్మించి ఇస్తామని అప్పట్లో ప్రకటించింది. గుత్తేదారుకు అప్పగించారు. పనులన్నీ అసంపూర్తిగా వదిలేశారు. పూతలు వేయలేదు. నాలుగేళ్లు అవుతున్నా పూర్తి చేయలేదు. చాలా బాధగా ఉంది. వరదను తలుచుకుంటే కన్నీరు ఆగడం లేదు. **- ఈటమాపురం లక్ష్మీదేవి, పులపుత్తూరు**

పొలం బాగుకు రూ.2 లక్షలు ఖర్చు

మా రెండెకరాల భూమి వరద బీభత్సంతో ఇసుక మేటలు వేసింది. సాగుకు అనువుగా మార్చుకోవడానికి రూ.2 లక్షలు అప్పు చేశా. బిందు పరికరాలు కొట్టుకుపోయాయి. 70 బస్తాల వడ్లు నీటి పాలయ్యాయి. శాశ్వత కరకట్ట నిర్మిస్తామని అప్పట్లో సీఎం జగన్‌రెడ్డి మాటిచ్చారు. పునరావాస కాలనీలో రోడ్లు వేయాలని మొరపెట్టుకున్నా దిక్కు లేదు. **- ముత్యాల వెంకట్రామయ్య, తొగూరుపేట**

కార్తికం.. శివోహం

రాజంపేట పట్టణంలో మంగళవారం శివలింగం, త్రిశూలం ఆకారంలో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, రాజంపేట**

తాగునీరు.. ఇక తాగగలరు

● విద్యాలయాల్లో సురక్షిత జలం
● ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో పరీక్షలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు **2,139**
వసతి గృహాలు **101**

పీలేరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి పోషణ (ఎండీఎం) కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంక్షేమ వసతి గృహాల్లో అందిస్తున్న తాగునీరు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆరోగ్యం విషయంలో విద్యార్థులకు పోషక విలువలున్న ఆహారంతో పాటు శుద్ధజలం అవసరమన్న విషయాన్ని గుర్తించి ప్రస్తుతం విద్యా సంస్థలు, వసతి గృహాల్లో అందుబాటులో ఉన్న తాగునీరు నాణ్యత ప్రమాణాలకు తగ్గట్టుగా ఉందా? లేదా? అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల అధికారులకు ఆదేశాలు వచ్చాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినా నిర్వహణ లేక ప్రారంభానికి ముందే అవి మూలకు చేరాయి.

● **15 రోజులకు ఒకసారి పరిశీలన :** ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సహాయ ప్రాజెక్టు అధికారులు (ఏపీసీ) బాధ్యత వహించి ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉన్న తాగునీటిని తమ పరిధిలోని గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగాల ఆధ్వర్యంలోని పరీక్ష కేంద్రాలకు అందజేయాలి. నీటిని పరిశీలించి విద్యాసంస్థల వారీగా వివరాలను డీఈవోకు పంపాలి.

● **ఏమేం చేస్తారంటే :** ● ప్రస్తుతం అందిస్తున్న నీటి నాణ్యతపై అధికారులు సమీక్షించి తగు చర్యలు తీసుకోనున్నారు. ● ఇప్పటికే ప్రభుత్వం కొన్ని విద్యాసంస్థలకు తాగునీటి శుద్ధజల యూనిట్లు మంజూరు చేసింది. ఇందులో చాలా వరకు మరమ్మతులకు గురై నెలల తరబడి మూలకు చేరాయి. ● కొన్ని చోట్ల విద్యార్థులు ఇళ్ల నుంచి సీసాల్లో తాగునీరు వెంట తీసుకు వస్తున్నారు.

● **జిల్లాలో ఐదు నీటి పరీక్షా కేంద్రాలు :** జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల్లో నీటి నమూనాల పరిశీలన కేంద్రాలు నడుస్తున్నాయి. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు మదనపల్లెలో ఉండగా మిగతా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నడుస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు కూడా నీటి పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షల కిట్లు ఇచ్చారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పరిధిలోని పెండ్లిమర్రి మండలంలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఏపీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ మన్జీర్ సమూన్ జిలాన్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించారు. సీఎం చంద్రబాబు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడంతో పాటు రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపిక చేసిన భైరవగుట్ట, చిన్నదాసరపల్లె గ్రామాల్లో పంటల పరిశీలన, వెల్లటూరులో జడ్పీ ఉన్నత పాఠశాలలో హెలిప్యాడ్, మన గ్రోమోర్ సెంటర్, కార్యకర్తల సమావేశ స్థలాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీసు అధికారులు, సీఎంవో భద్రతాధికారులతో మంత్రి చర్చించారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్, తెదేపా నాయకులు

యువతే దేశ భవిత

యువజనోత్సవంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

రామాపురం, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే అత్యధిక యువజనం కలిగిన దేశం మనదనీ, యువత వికసిత్ భారత్-2047 దిశగా నడిపించే శక్తి అని రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బండపల్లె పంచాయతీలోని బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్టెప్ కార్యనిర్వాహక కార్యదర్శి విజయకుమార్, బిట్స్ కళాశాల ఛైర్మన్ మన్నూరు భాస్కర్, ప్రిన్సిపల్ ఏసీ. రెడ్డి, నాగేంద్ర, జలజ పాల్గొన్నారు.

అన్నదాతల ఖాతాలకు నగదు జమ నేడు

● 1,88,408 మంది రైతులకు రూ.126.60 కోట్ల లబ్ధి

రాయచోటి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను బుధవారం విడుదల చేయనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలో నిర్వహించే కార్యక్రమంలో రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.5 వేలు, పీఎం కిసాన్-21 పథకం కింద రూ.2 వేలు చొప్పున కలిసి రూ.7 వేలు డబ్బులు జమ కానున్నాయి. జిల్లాలోని 30 మండలాల్లో 1,88,408 మంది రైతులు ఈ పథకం కింద అర్హత సాధించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.94.20 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.32.40 కోట్లు చొప్పున రైతుల ఖాతాలకు జమ అవుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివన్నారాయణ తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గాలివీడు మండల ఎంపీడీవో కార్యాలయంలో జరిగే అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని రైతులకు మెగా చెక్కు అందజేస్తారని వారు తెలిపారు.

రాయచోటి ఆసుపత్రికి జిల్లా స్థాయి కల్పిస్తాం

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రసూతి కేంద్రం, అయిదు డయాలసిస్ యూనిట్లను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 50 పడకల నుంచి వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే 50 పడకల ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు రూ.23 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు ప్రారంభం కావడంతో త్వరలోనే ట్రామాకేర్ రోగులకు అందుబాటులోకి వస్తుందన్నారు. కిడ్నీ రోగులకు అవసరమైన డయాలసిస్ చేసేందుకు 19 యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం కిడ్నీ బాధితులకు నెలకు రూ.10 వేలు పింఛను అందించి ఆదుకుంటోందన్నారు. రాయచోటిలో మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటామని ఆయన తెలిపారు. ప్రసూతి కేంద్రంలోని వివిధ విభాగాలను ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి ఆవరణంలోని ఆక్సిజన్ ప్లాంట్‌ను త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామని తెలియజేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టరు లక్ష్మీప్రసాద్, కమిటీ సభ్యులు మహమ్మద్, ఖాదర్‌బాషా, లక్ష్మీదేవి, గాజుల ఖాదర్‌బాషా, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రసూతి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పొగ మంచు.. జాగ్రత్తగా గమనించు

● **ప్రమాదాలు ఇలా.. :** ● ఇటీవల రాజంపేట మండలం ఊటుకూరు, గుండ్లూరు ప్రాంతాల్లో వేకువజామున ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు.

● మంగంపేట వద్ద పొగ మంచు కారణంగా రహదారి కనపడక ఏడుగురు కూలీలతో వెళ్తున్న ఆటో రోడ్డు పక్కకు దిగి బోల్తా కొట్టింది. పొలం పనులకు వెళుతున్న కూలీలు గాయపడ్డారు.

● నాలుగేళ్ల క్రితం కుక్కలదొడ్డి వద్ద వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ - జీపు ఢీకొని హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు ప్రయాణికులు చనిపోగా, నలుగురు గాయపడ్డారు.

● రైల్వేకోడూరులో గత జనవరిలో మంచు కారణంగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను గుర్తించలేక తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు చోదకుడు బస్సును దాని పైకి ఎక్కించేశారు.

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: వర్షాలతో కూడిన చలికాలం ప్రారంభమైంది.. వర్షం లేని రోజుల్లో వేకువజామున పొగమంచు దట్టంగా వ్యాపిస్తోంది. ఇలాంటి వాతావరణం ఆహ్లాదంతో పాటు అపాయాలను కూడా కలిగిస్తుంది. కడప - చెన్నై, కడప - చిత్తూరు, అనంతపురం - తిరుపతి, కడప - కర్నూలు, కడప - అనంతపురం జాతీయ రహదారులపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి, తిరుపతిలోని ఆసుపత్రులకు వెళ్లే ప్రయాణికులు వస్తుంటారు. చెన్నై, హైదరాబాద్ నగరాలకు వివిధ రకాల సరకులను చేరవేసే భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ సందర్భంగా వచ్చే రెండు, మూడు నెలలు వాహనదారులు జాగ్రత్తలు వహిస్తే మంచిది. అప్రమత్తంగా ఉండడమే శ్రీరామ రక్ష.

రైల్వేకోడూరు - ముష్టేరు వద్ద మంచుతో లైట్లు వేసుకుని వాహనాల ప్రయాణం

గతేడాది పొగమంచు కారణంగా చోటుచేసుకున్న ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

● **అప్రమత్తతే ప్రధానం :** ● అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి ఉంది. అక్కడికి వెళ్లడానికి ప్రజలు, అధికారులు, సిబ్బంది నిత్యం ప్రయాణిస్తుంటారు. రాయచోటికి వెళ్లే గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ● చిట్వేలి నుంచి రాపూరు, నెల్లూరు, పెంచలకోన ప్రాంతాలకు వెళ్లే ఘాట్ రోడ్డుతో అధిక మలుపులతో కూడి ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ప్రయాణించే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ● పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువు నుంచి - రైల్వేకోడూరు మండలం కుక్కలదొడ్డి వరకు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయి.

● **ఇలా వెళ్తే మంచిది :** ● రాయచోటి, రాపూరు ఘాట్ రోడ్లపై అవగాహన లేని కొత్త ప్రయాణికులు నెమ్మదిగా వెళ్లడం మంచిది. ● మంచులో ప్రయాణించాల్సి వస్తే వాహనాల హెడ్‌లైట్లతో పాటు, సిగ్నల్ లైట్లను కూడా ఆన్ చేసుకోవడం శ్రేయస్కరం. ● మలుపుల్లో విధిగా హారన్ మోగించాలి ● ఫాగ్ ల్యాంప్‌లను ఆన్ చేసుకుంటే అవి పసుపు వర్ణంలో వెలగడం వల్ల ఉపయోగకరంగా ఉంటుంది. ● దారి కనిపించని సమయంలో ఓవర్‌టేక్ చేయరాదు.

అవ్వా, తాతలకు ఆరోగ్య నేస్తాలు

వయో భారం మీద పడిన వృద్ధులు అనేక రకాలైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేక, ఆసుపత్రులు దూరంగా ఉండడం వల్ల అపాయం పెద్దదిగా మారవచ్చు. జిల్లాలో 87,153 మంది వృద్ధులు ఉన్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి ఆసుపత్రులకు వెళ్లకుండా వైద్యపరమైన సలహాలు, సూచనలు అందించేందుకు ఎన్నో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.
- న్యూస్‌టుడే, లక్కిరెడ్డిపల్లె

మెడిసేఫ్ : సకాలంలో మాత్రలను తీసుకోవడాన్ని ఈ యాప్ గుర్తు చేస్తుంది. మరచిపోతే సంరక్షకులను అలర్ట్ చేసి సందేశం పంపుతుంది. వృద్ధుల ఆరోగ్యానికి ఇది ఎంతో ఉపయుక్తం.

బ్లడ్ ప్రెజర్ : రక్తపోటును ట్రాక్ చేస్తుంది. బరువు, ఇతర ముఖ్యమైన గణాంకాలను ట్రాక్ చేస్తుంది. అవసరాన్ని బట్టి వైద్యుల ద్వారా త్వరగా చికిత్స పొందవచ్చు.

స్నార్ ల్యాబ్ : నిద్రలో గురక పెడితే రికార్డు చేస్తుంది. ఎంత సేపు ఎంత గాఢంగా గురక పెట్టామో తెలుపుతుంది. తీవ్రత ఆధారంగా స్కోర్‌ను లెక్కిస్తుంది.

మందుల కోసం.. : దైనందిన జీవితంలో అవసరమైన మందులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయవచ్చు. వైద్యుల ప్రిస్క్రిప్షన్లను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. టాటా-1, ఎంజీ, అపోలో, నెట్‌మెడ్స్ వంటి యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

హెడ్ స్పేస్..: ఒత్తిడి, ఆందోళన నియంత్రణ విధానాలు తెలుపుతుంది. శ్వాస నియంత్రణతో ప్రశాంతత నేర్పుతుంది. యోగా గురించి తెలిపేందుకు ఏఐ ఆధారిత సహచరుడూ తోడుంటాడు.

స్మార్ట్ కార్డు తీసుకొన్నారా!

● ఈ నెలాఖరు వరకే అవకాశం

చిన్నమండెం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంది. ఇందులో భాగంగా జిల్లాలో స్మార్ట్ రేషను కార్డుల పంపిణీకి సెప్టెంబరు 18 నుంచి శ్రీకారం చుట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు డీలర్ల ద్వారా పంపిణీ చేపట్టారు. రెండు నెలలైనా జిల్లాలో 93.48 శాతం పంపిణీ అయ్యాయి. ఈ నెల 15 వరకు చూస్తే 31,762 కార్డులు పంపిణీ కాలేదు. స్మార్టు కార్డుల పంపిణీ ఈ నెలాఖరు వరకే ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు.



జిల్లా సమాచారం ఇలా..

మొత్తం మండలాలు	30
చౌక దుకాణాలు	1,123
జిల్లాకు వచ్చిన స్మార్ట్ కార్డులు	4,87,246
పంపిణీ అయిన కార్డులు	4,55,484
పంపిణీ కాని కార్డులు	31,762

ఎందుకు కాలేదంటే.. : లబ్ధిదారులు జీవనోపాధికి వలస వెళ్లడం వంటి కారణాలతో ఆగిపోయినట్లు చెబుతున్నారు. కార్డులోని సభ్యుల్లో ఒక్కరు వచ్చి బయోమెట్రిక్ వేసి, ఓటీపీ చెప్పి తీసుకోవాలని కోరుతున్నారు. ఇలా చేయడం వల్ల బోగస్ కార్డులకు చెక్ పడనుంది. పంపిణీ కాని కార్డులకోసం లబ్ధిదారులు అందుబాటులో ఉన్నారా? మృతి చెందారా? వలస వెళ్లారా? తదితర వివరాలను సమగ్రంగా విచారించి మండల రెవెన్యూ కార్యాలయాల నుంచి జిల్లా కార్యాలయానికి సమాచారం పంపాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా తీసుకోకపోతే కార్డులు వెనక్కు వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

తీసుకోకుంటే వెనక్కే..

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్మార్ట్ కార్డులను తీసుకొనేందుకు ఈ నెలాఖరు వరకే గడువుంది. ఆ లోగా తీసుకోకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెనక్కు పంపే అవకాశాలున్నాయి. కార్డులు పంపిణీ చేస్తున్న డీలర్లు, సచివాలయాల సిబ్బంది పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలి.
- సుమతి, ఇన్‌ఛార్జి డీఎస్‌వో, అన్నమయ్య జిల్లా

జ్ఞాపకాల మదిలో...

జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

స్మృతి, వర్ధంతి, జయంతి ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప : 99899 97626
మదనపల్లి : 80080 01768

ఐదవ వర్ధంతి

కీ॥శే॥ డి.కె.ఆదికేశవులు గారు



జననం: 21-09-1951
మరణం: 19-11-2020

శ్రీమతి డి.కె.సత్యప్రభ గారు
(W/o లేట్ డి.కె.ఆదికేశవులు గారు)

మాజీ ఎమ్మెల్యే, చిత్తూరు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, చిత్తూరు

మమతానురాగాలకు ప్రతీకగా అందరికీ తాను ఆదరాభిమానాలను, ఆప్యాయతలను పంచి మా ఉన్నతికై అహర్నిలు పరితపించిన మీరు భౌతికంగా మాకు దూరమై నేటికి ఐదు సంవత్సరాలు గడిచినను మీ జ్ఞాపకాలు మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ.. శోకతప్త హృదయాలతో.. ఐదవ వర్ధంతి సందర్భంగా అంజలి ఘటిస్తూ..

కుమారుడు: - కోడలు:
డి.ఎ.శ్రీనివాస్ - డి.ఎ.రూప

కుమార్తెలు: అల్లుళ్లు:
డి.ఎ.తేజేశ్వరి - శ్రీనివాసమూర్తి
డి.ఎ.కల్పజ - ప్రేమ్‌చందర్

మనుమలు, మనుమరాండ్రు, మునిమనమళ్లు:
చైతన్య- Dr. రాజేష్‌నాయుడు, హిమవద్, నెయలక్ష్మి, విష్ణు - ప్రణిత్, ఆదినారాయణ, ఆరుద్ర - హిరన్, సియోన్, వైదేహి, అచింత్య, సాయిచక్ర
మరియు కుటుంబ సభ్యులు

వైదేహి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ - బెంగళూరు, శ్రీనివాస ట్రస్టు - చిత్తూరు
శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & మేనేజ్‌మెంట్ స్టడీస్ - చిత్తూరు
ఆర్.కె.విద్యాలయ - చిత్తూరు, ఆర్.కె.జూనియర్ కాలేజ్ - చిత్తూరు, శ్రీని ఫుడ్ పార్క్ - మొగిలి
KBD Sugars & Distilleries Pvt. Ltd., Sankey Road, Bangalore.

(c) eenadu

దేవరచెరువు వద్ద జలహారతులిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చెరువులను నీటితో నింపుతాం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల్లోని అన్ని చెరువులకు వెలిగల్లు ప్రాజెక్టు నీటితో నింపుతామని రాష్ట్ర రవాణా క్రీడా యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె మండల పరిధిలోని రాయచోటి-వేంపల్లె రహదారిలోని దేవరచెరువు వద్ద పూజలు చేసి జలహారతులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాలు కురిసినా చెరువులు నిండలేదన్నారు. వెలిగల్లు ప్రాజెక్టులోని నీటిని ఆగస్టు 3వ తేదీన మూడు మండలాలకు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా చెరువులకు నీరు వదిలామన్నారు. దీంతో ఇప్పటి వరకు మూడు మండలాల్లో 69 చెరువులు నిండాయన్నారు. ఇప్పటి వరకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేశామన్నారు. 2, 3 నెలల్లో అన్ని చెరువులను నీటితో నింపుతామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 15 లక్షలతో సిమెంటురోడ్డు, ప్రహరీగోడ నిర్మాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ భరత్‌కుమార్‌రెడ్డి, డీఈ రమణయ్య, జేఈ మహబూబ్‌బాషా, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డెయ్య యాదవ్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ షఫీనాయక్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాల ఆవరణలోని మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలు బుధవారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు డాక్టర్ ఎన్.బాబు, నరస, నాగరాజు, యుగంధర్‌బాబు తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు, మేనేజర్లు, కోచ్‌లు పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో విజేతలైన జట్టు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

నిలకడగా టమాట ధరలు

ములకలచెరువు : ములకలచెరువు టమాట మార్కెట్ యార్డులో టమాట ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. గత మూడు రోజుల క్రితం మొదటి రకం బాక్సు ధర రూ.1100లు పలకగా మంగళవారం రూ.1000లు పలికింది. గత 20 రోజుల క్రితం ములకలచెరువు ఉత్పత్తులు టమాటాలు వచ్చేవి. ప్రస్తుతం 10 వేల నుంచి 12 వేల క్రేట్లు మాత్రమే మార్కెట్‌కు కాయలు వస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా ఉన్న టమాట తోటలు తెగుళ్ల బారిన పడి కాయలు మచ్చలు రావడంతో పాడవుతున్నాయి. ములకలచెరువు మార్కెట్ నుంచి కోల్‌కత్తా, తమిళనాడు, వర్ధమాన్ తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నట్లు మార్కెట్ సిబ్బంది తెలిపారు.

పీటీఎం ఎస్ఐ కారు ఢీకొన్న ఘటనపై కేసు నమోదు

● పది రోజుల తర్వాత స్పందన

ములకలచెరువు, న్యూస్‌టుడే : పీటీఎం ఎస్ఐ హరిహరప్రసాద్ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనపై సోమవారం రాత్రి ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 7న ములకలచెరువు మండలం, పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై మదనపల్లె నుంచి ములకలచెరువుకు వస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెద్దతిప్పసముద్ర ఎస్ఐ హరిహరప్రసాద్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా, మహ్మదాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుల్తాన్ (26) తీవ్రంగా గాయపడటంతో ఘటన స్థలంలో ఉన్న పోలీసులు వాహనంలో ఆసుపత్రికి తరలించకుండా 108 వాహనంలో ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. బాధితుడు సుల్తాన్ కుటుంబ సభ్యులు కేసు నమోదు చేయాలని గత వారం రోజుల క్రితం ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కేసు నమోదు చేయడంతో సీఎంవో, హోంమంత్రి, జిల్లా ఎస్పీకి మెయిల్, ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు సోమవారం గ్రీవెన్స్‌లో కూడా ప్రమాద విషయాన్ని ఎస్పీ ధీరజ్ దృష్టికి తీసుకెళ్లారు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేయమంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎట్టకేలకు ములకలచెరువు పోలీసులు పీటీఎం ఎస్ఐ కారు డ్రైవర్ మౌలాలి (కానిస్టేబుల్)పై కేసు నమోదు చేశారు.

ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితుడి కుటుంబ సభ్యులు

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నది మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆7382114647

K K Enterprises Kadapa. Telecaller (Male & Female) Salary: 10000 + Incentives. Contact : 8639923418

ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ డీలర్షిప్ లో పని చేయుటకు స్పేర్స్ ఇన్‌ఛార్జి కావలెను. హనుమాన్ మోటార్స్, M.G.Auto Nager, Proddatur 9390032810.

TO LET

COMMERCIAL

కడప మారుతీనగర్ (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగు బాడుగకు గాని లేక అమ్మబడును. Cell : 7702936190.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారుల సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బులు వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

రాష్ట్ర స్థాయి పోటీలకు మదనపల్లె విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి హాకీ, ఫుట్‌బాల్, యోగా పోటీలకు మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి తెలిపారు. ఇటీవల చంద్రగిరిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల విభాగంలో కె.సందీప్, సి.చైతన్య, కె.కౌసర్, ఎం.భాగ్యశ్రీలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. అలాగే చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తంబకుప్పం జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన యోగా పోటీల్లో పాఠశాల విద్యార్థులు కె.చరణ్‌తేజ్, ఆర్.లక్ష్మీప్రసన్న జిల్లా జట్టులో స్థానం సాధించారు. ఈ నెల 22, 23 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. మదనపల్లెలో జరిగిన అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పి.గాయత్రి, యూసఫ్‌లను జిల్లా జట్టులో స్థానం పొందారు. బుధవారం నుంచి మదనపల్లెలోని గ్రీన్ వ్యాలీ పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, వారిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు దేవకమ్మ, జలజ, అన్సర్‌బాషా, సుధాకర్‌లను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీవేద పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ఉపేంద్రరెడ్డి, పీడీ మహేంద్ర

★ మదనపల్లెలోని శ్రీవేద పాఠశాల విద్యార్థులు వరుణ్‌కుమార్, నేహారెడ్డి, మోక్షరెడ్డి, వీణప్రియ, జోషిత్‌లు బుధవారం నుంచి మదనపల్లెలోని గ్రీన్‌వ్యాలీ పాఠశాల ఆవరణలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున పాల్గొంటారని కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ఉపేంద్రరెడ్డి, పీడీ మహేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

చేతులు కలిపారు.. రోడ్డు నిర్మించుకున్నారు

రాజంపేట, న్యూస్‌టుడే: సార్.. మా వీధిలో రహదారి బాగలేదు.. కాలువలోని మురుగునీరు రోడ్డుపై పారుతోంది.. చినుకుపడితే చాలా ఇబ్బందిగా ఉంది.. నడవలేని పరిస్థితి నెలకొందని పురపాలక అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యం. ఫలితంగా చేయి చేయి కలిపి స్థానికులు సిమెంటు రోడ్డు వేసుకున్న సంఘటన రాజంపేట పట్టణం లక్ష్మీనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని 21వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన ఓ వీధి ప్రజలు మురుగునీరు, రహదారి సమస్యలను పురపాలక అధికారులకు దృష్టికి తెచ్చారు. పలుమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో ఆ వీధిలో నివాసం ఉంటున్న వారే కొంత డబ్బు వేసుకుని సుమారు 50 మీటర్ల మేర సిమెంటు రహదారిని మంగళవారం నిర్మించుకున్నారు.

లక్ష్మీనగర్‌లో ప్రజలు వేసుకున్న సిమెంటు రహదారి

ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై కేసు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రెండో పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. పట్టణంలోని బండమీదకమ్మపల్లెలో ఉన్న సర్వే నం:280లోని ప్రభుత్వ భూమికి నకిలీ పత్రాలు తయారు చేసి ఆక్రమించుకునేందుకు యత్నించారని మదనపల్లె తహసీల్దారు కిశోర్‌కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివాజీనగర్‌కు చెందిన గంగిరెడ్డి శివారెడ్డి, ఎన్.రాధారాణి, గుర్రంకొండ మండలం చెరువుమొరవపల్లెకు చెందిన సి.నరసమ్మ, మదనపల్లె పట్టణంలోని అప్పారావుతోటకు చెందిన షేక్ అర్షద్‌లపై మంగళవారం కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించినా, నకిలీ పత్రాలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

జంబోరికి సంబేపల్లె బాలలు

సంబేపల్లె, న్యూస్‌టుడే: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో లక్నోలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జంబోరి కార్యక్రమంలో పాల్గొనడానికి సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మంగళవారం ఇద్దరు విద్యార్థులు వెళ్లారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 19వ జాతీయ జంబోరి కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఆయన, సిబ్బంది అభినందించారు.

జాతీయ స్థాయి జంబోరి కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

జాతీయ స్థాయికి ఎంపికైన తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ శివాజీ

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్‌వీకే స్పోర్ట్స్ అకాడమీకి చెందిన తైక్వాండోలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ శివాజీ మంగళవారం తెలిపారు. ఈనెల 15, 16వ తేదీలలో కాకినాడలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. 39వ సబ్ జూనియర్, 8వ క్యాడెట్, 41వ సీనియర్స్ విభాగాలలో ఈ పోటీలు జరిగాయి. అందులో అకాడమీకి చెందిన విద్యార్థులు సీనియర్స్ విభాగంలో ఎం. చైతన్యప్రసాద్, జే. నాగమణి, సబ్ జూనియర్స్ విభాగంలో పి. నాగచరణ్, జి. అభిరామ్, సాయివర్ధన్, క్యాడెట్ విభాగంలో శ్రీరామ్, ఎ. రామ్‌చరణ్, పి. హర్షిత, కే. నిహారిక బంగారు పతకాలు సాధించారు. వరుణ్‌కుమార్, వర్షశ్రీ, సుమయ అనే వారు వెండి పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు పంజాబ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని కోచ్ వివరించారు.

★ ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో అదే కళాశాలకు చెందిన జి. చైతన్యకుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ యశోదర మంగళవారం తెలిపారు. త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో అతను పాల్గొంటారని వివరించారు.

చైతన్యకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యశోదర, అధ్యాపకులు

రెవెన్యూ సేవల్లో లోపాలు తగదు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : నిత్యం తహసీల్దారు కార్యాలయానికి వచ్చే ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలను చేరువ అయ్యేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని మధుసూదన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సమస్యలపై స్థానిక రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న 2002 ఓటర్ల జాబితాతో 2025 ఓటరు జాబితా మ్యాపింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 2వ, 3వ భూముల రీసర్వే పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పామిలేటి, డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, ఆర్ఐ సుగుణ, సర్వేయర్ పూర్ణచంద్ర, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు

కుటుంబ సమస్యలతో కార్పెంటర్ ఆత్మహత్య

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కుటుంబ సమస్యలతో కార్పెంటర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక గౌతమినగర్‌కు చెందిన మహబూబ్ బాషా (32)కు భార్య చోటీజాన్, ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం రాత్రి దంపతులు ఇద్దరూ కుటుంబ విషయమై గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఉరికి వేలాడుతున్న అతన్ని కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించారు. రెండో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

దాడి చేసి పురుగుమందు తాపించారు

● ఆసుపత్రిలో చేరిన బాధితురాలి ఆరోపణ

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంజుల

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : తనపై అత్తింటి వారు దాడి చేసి బలవంతంగా పురుగు మందు తాపించి చంపేందుకు యత్నించారని నిమ్మనపల్లె మండలం పిట్టావాండ్లపల్లెకు చెందిన మల్లికార్జున భార్య మంజుల (30) ఆరోపిస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. రామసముద్రం మండలం ఉండేవారిపల్లెకు చెందిన మంజులకు పది సంవత్సరాల క్రితం పిట్టావాండ్లపల్లెకు చెందిన మల్లికార్జునతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మల్లికార్జున పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు. సోమవారం రాత్రి మంజులపై మల్లికార్జున కుటుంబ సభ్యులు దాడిచేసి బలవంతంగా పురుగు మందు తాపించారని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం ఆమె మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి అవుట్‌పోస్టు సిబ్బంది సమాచారాన్ని నిమ్మనపల్లె పోలీసులకు తెలియజేశారు.

అంకితభావంతో ఉత్తమ ఫలితాలు సాధిద్దాం

గుర్రంకొండ, న్యూస్‌టుడే : స్థానిక మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను కడప ఆర్‌జేడీ శామ్యూల్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. కండ్రిక జడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేయాలని పేర్కొన్నారు. మౌలిక వసతులు, పచ్చదనం, పరిశుభ్రతను విధిగా పాటించాలన్నారు. ఎస్ఏ.1, ఎస్ఏ.2 మార్కులను నమోదు చేశారా..? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు గోపాల్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకడ : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని కడప ఆర్‌జేడీ శామ్యూల్ అన్నారు. మంగళవారం మండలంలోని కదిరాయచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందివ్వాలన్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సుబ్బిరెడ్డిగారిపల్లె పాఠశాలలో పరిశీలిస్తున్న ఆర్‌జేడీ శామ్యూల్

20న ములకలచెరువులో విద్యుత్తు అదాలత్

మాట్లాడుతున్న విద్యుత్తు శాఖ ఈఈ గంగాధరం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : ములకలచెరువులోని పాత విద్యుత్తు సెక్షన్ కార్యాలయ ఆవరణంలో సమస్యల పరిష్కారం కోసం డివిజన్ స్థాయిలో ఈ నెల 20న విద్యుత్తు అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్తు శాఖ మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.గంగాధరం తెలిపారు. విద్యుత్తు సమస్యలపై అదాలత్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. మదనపల్లె పట్టణం, మదనపల్లె రూరల్, తంబళ్లపల్లె, ములకలచెరువు సబ్ డివిజన్లకు చెందిన ప్రజలు తమ సమస్యలు అర్జీ రూపంలో తెలపవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ ఛైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి వి.ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు జి.మధుకుమార్, సాంకేతిక సభ్యులు ఎ.శ్రీనివాసబాబు, స్వతంత్ర్య సభ్యులు డబ్ల్యు. విజయలక్ష్మి పాల్గొంటారని తెలిపారు.

నిందితులకు కఠిన కారాగార శిక్ష

నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

రాయచోటి, పెద్దమండెం, న్యూస్‌టుడే: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నాగన్నగుట్టపాలెంకు చెందిన చంద్రశేఖర్ నాయుడు, ఆయన కుమారుడు రెడ్డిశేఖర్‌నాయడులు కలిసి పెద్దమండెం మండలం పాపేపల్లి క్రాస్ సమీపంలో 2015లో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తుండగా అప్పట్లో పోలీసులకు పట్టుపడ్డారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం నిందితులకు అక్రమ రవాణా నేరం కింద ఒక ఏడాది కఠిన కారాగార శిక్ష, ఐపీసీ-379 కింద రెండేళ్ల కఠిన కారాగార శిక్ష(ఏక కాలంలో అమలు)తో పాటు ఒక్కొక్కరికి రూ.20 వేలు జరిమానా విధించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : హంద్రీ - నీవా కాలువకు సంబంధించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఆర్ఐ సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. మండలంలోని బసినికొండ రెవెన్యూ పంచాయతీ సర్వే నం: 718లో భూ సేకరణ చేపట్టి హంద్రీ - నీవా కాలువకు కేటాయించారు. కాలువ నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కాలువకు సంబంధించిన స్థలంలో స్థానికంగా నివాసముంటున్న ఓ వ్యక్తి దాదాపు నాలుగు సెంట్లకుపైగా చదునుచేసి పిలర్లు వేసి పునాదులు నిర్మించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు రావడంతో ఆర్ఐతోపాటు జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, రెవెన్యూ దస్త్రాలు పరిశీలించి ఆక్రమణగా గుర్తించారు. దీంతో పొక్లెయిన్‌తో పునాదులు, నిర్మాణాలు తొలగించారు. ఈ స్థలం దాదాపు రూ.80 లక్షలకుపైగా విలువ చేస్తుందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

పునాదులను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

అయ్యపునేని చెరువులో చేపల మృత్యువాత

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు పట్టణంలోని అయ్యపునేని చెరువులో రెండ్రోజులుగా చేపలు మృత్యువాత పడుతున్నాయి. నీటి సంఘాల ప్రతినిధులు చెరువులో పరిశీలించారు. మృతి చెందుతున్న చేపలు 100 గ్రాముల నుంచి 2 కిలోల బరువు ఉన్నాయని, ఆక్సిజన్ సరిగ్గా అందకపోవడంతో చేపలు ఇలా మృత్యువాత పడుతున్నాయని నిర్వాహకులు చెపుతున్నారు.

చెరువులో మృతి చెందిన చేపలు

సైబర్ నేరగాళ్ల గుట్టురట్టు

● ఇద్దరు అంతర్‌రాష్ట్ర కేటుగాళ్ల అరెస్ట్

● సీబీఐ అధికారులంటూ బెదిరించి..

● వృద్ధురాలి వద్ద రూ.36 లక్షలు కొట్టేసిన వైనం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సీబీఐ అధికారులమంటూ ప్రజలను మోసం చేసి డబ్బు కాజేస్తున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను మంళవారం అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు.. మదనపల్లె పట్టణానికి చెందిన కృష్ణవేణమ్మ (72) ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయిని. ఈ ఏడాది ఆగస్టు 28వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఆమెకు ఫోన్ చేసి తాము బెంగళూరుకు చెందిన సీబీఐ అధికారులమని పరిచయం చేసుకున్నారు. బెంగళూరులో మానవ అక్రమ రవాణా చేస్తున్న వారిపై దాడి చేశామని, ఆ ప్రదేశంలో కృష్ణవేణమ్మ ఆధార్ కార్డు దొరికిందని చెప్పారు. మరుసటి రోజు నుంచి ఆమెకు ఫోన్ చేసి మానవ అక్రమ రవాణాలో మీ పాత్ర ఉందని, డబ్బు ఇవ్వకుంటే మీతో పాటు కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో బయపడిన ఆమె పలుమార్లు సైబర్ నేరగాళ్లకు మొత్తం రూ.36 లక్షలు బ్యాంకు ఖాతా ద్వారా పంపారు. ఈ విషయాన్ని తమ బంధువైన కిరణ్‌కు కృష్ణవేణమ్మ చెప్పడంతో ఆయన సైబర్ మోసం చేసినట్లు గుర్తించారు. ఆమె ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మహేంద్ర వివరించారు.

ఖాతాల్లోన్ని రూ.97 లక్షలు ఫ్రీజ్

ఈ కేసులో సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహిముల్లాలతో రెండు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. నిందితులు హైదరాబాద్‌లో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో ఈ కేసులో నిందితులైన తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని మయూరినగర్‌కు చెందిన స్థిరాస్తి వ్యాపారి చంద్రశేఖర్ వెంకటేశ్ (35), జేపీనగర్‌కు చెందిన ఎలిగిపల్లి వినోద్‌యాదవ్ (45)లను అరెస్టు చేశారు. వినోద్‌యాదవ్ సూచన మేరకు వెంకటేశ్ దిల్లీకి వెళ్లి అక్కడున్న సైబర్ నేరగాళ్లు సాహు, దీపక్, జాక్ అనే వారితో కలిసి సైబర్ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలినట్లు డీఎస్పీ వివరించారు. చంద్రశేఖర్ వెంకటేశ్, ఎలిగిపల్లి వినోద్‌యాదవ్‌లను అరెస్టు చేసి వారిద్దరి బ్యాంకు ఖాతాల్లో రూ.97 లక్షలు ఫ్రీజ్ చేయించినట్లు తెలిపారు. ఫ్రీజ్ చేసిన ఖాతా నుంచి బాధితులకు కోర్టు ఉత్తర్వు ద్వారా డబ్బు ఇప్పిస్తామన్నారు. అలాగే నిందితులు ఇద్దరిపై ఇది వరకే తిరుపతి జిల్లాలోని గూడూరు, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులు ఉన్నాయన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. ఈ కేసులో నిందితులను పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించడంతో పాటు వారికి రివార్డు అందజేశారు. ప్రజలు ఎవరూ ఇలాంటి మోసపూరిత కాల్స్‌కు స్పందించవద్దని అలా ఎవరైనా డబ్బు అడిగితే నం:1930కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న డీఎస్పీ మహేంద్ర, సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహిముల్లా

జన గణనతో పాటు కుల గణన చేయాలి : సీపీఐ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీ డిమాండు చేశారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగాన్ని అమలు చేయాలని, దేశ పౌరులకు కావలసింది మత గణన కాదని, కులగణన కావాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాస్తున్నారని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించడం కాదని, సంపదలో పంపకాలు జరగాలన్నారు. అతి తక్కువ జనాభా కలిగిన కులాల చేతుల్లోనే రాజకీయ ఆధిపత్యం సాగుతోందని, పాలకులు విభజించి పాలన చేస్తున్నారని విమర్శించారు. ఐక్య పోరాటాల ద్వారానే అణగారిన వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, సీపీఐ నియోజకవర్గ, మండల కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు రెడ్డి, తిరుమల, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి సాయికిరణ్ నాయకులు గంగాధర్, హరి, నరసింహులు, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

(c) eenadu

మదనపల్లె
•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

సైనికుడి సేవలు అభినందనీయం

బీఎస్ఎఫ్ జవాన్ ఫిరోజ్‌ను సన్మానిస్తున్న హీరో సప్తగిరి

కలికిరి: సైనికుడు వేంపల్లి ఫిరోజ్ దేశానికి అందించిన సేవలు అభినందనీయమని హీరో సప్తగిరి అన్నారు. మంగళవారం తిరుపతి కెవెస్ ఈవెంట్స్ అధినేత సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కలికిరి పట్టణానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ ఫిరోజ్‌కు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిరోజ్ 2016 నుంచి 2022 వరకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందంలో సభ్యుడిగా ఉన్నారు. భారతదేశం పాకిస్థాన్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో కూడా పాల్గొని ఎంతో గుర్తింపు పొందారని, ఆయన ధైర్య సాహసాలను సినీ హీరో సప్తగిరి కొనియాడారు. అతను అన్నమయ్య జిల్లా కలికిరి వాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు.

రోడ్డు సమస్యపై గ్రామస్థుల ఆందోళన

తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : రోడ్డు సమస్య పరిష్కరించాలని ఎగువ కొనకుంట్లవారిపల్లె గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వేంపల్లె పంచాయతీ ఎగువ కొనకుంట్లవారిపల్లెలో దారి స్థలంపై వివాదం నెలకొంది. ప్రైవేటు స్థలంగా పేర్కొంటూ కొందరు గ్రామానికి వెళ్లే మార్గంలో మట్టి దిబ్బలు వేశారు. దీంతో గత కొన్ని వారాలుగా దారి స్థలం విషయమై వివాదం నడుస్తోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హంద్రీనీవా కాలువ కింద చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘం, మండల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. పట్టణంలోని బెంగళూరు బస్టాండులో ప్రధాన కాలువపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ పనులు పరిశీలించారు. ఈ పనుల గురించి కమిషనర్ ప్రమీలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం ఎమ్మెల్యే ఇంటి వద్దకు వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూవివాదాలు, సీసీ రోడ్లు, దేవాలయాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యేకు విన్నవించారు. బసినికొండ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. కాలువను చెరువులకు అనుసంధానం చేసి కృష్ణా జలాలతో నింపడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలువ కింద నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తొలగించాలని సూచించారు. తక్షణమే అధికారులు పొక్లెయిన్ తీసుకొచ్చి పునాదులు తొలగించారు.

చీకటిలో పీలేరు.. ఎవరూ పట్టించుకోరు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : విద్య వ్యాపార రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణంలోని ప్రధాన వీధులు రాత్రి వేళల్లో అంధకారం రాజ్యమేలుతోంది. చెన్నై - హైదరాబాదు, బళ్లారి - నాయుడుపేటకు వెళ్లే జాతీయ రహదారులు పీలేరు మీదుగా వెళ్తున్నాయి. ఇదే మార్గాల్లో వాణిజ్య, ఇతర ట్రావెల్ వాహనాల రద్దీ ఉంటోంది. ఇంత ప్రాధాన్యం సంతరించుకున్న పీలేరు పట్టణంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో చీకటి అలుముకుంటోంది. రాత్రి వేళ దుకాణాలు మూసేసిన అనంతరం వీధుల్లో అంధకారం నెలకొంటోంది. ఈ సమయాల్లో బయటికి రావాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అంధకారంతో సమస్యలు: పీలేరు మేజర్ పంచాయతీ ప్రధాన వీధుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లో ఎవరు ఎటు వస్తున్నారో.. పోతున్నారో... తెలియని పరిస్థితి నెలకొంటోంది. ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. చోరీలు సులువుగా చేసుకునే అవకాశం ఉంది. రోడ్డుపై వచ్చే పాదచారులకు కుక్కల బెడద ఎక్కువగా ఉంటోంది.

పీలేరులో వెలగని వీధి దీపాలు

పీలేరు మేజర్ పంచాయతీ వివరాలు

మొత్తం జనాభా	60 వేలు
పంచాయతీ వార్డులు	20
ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్స్	65
పని చేస్తున్నవి	20
వెలగని దీపాలు	45

పట్టించుకోని అధికార పాలక వర్గాలు: పీలేరు నియోజకవర్గ కేంద్రమైన పీలేరులో ఏడాదన్నర కాలంగా వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలగడంలేదు. ప్రజలు అంధకారంలోనే ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అధికార పాలక వర్గాలు మాకెందుకులే అనుకుంటూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇదే సమస్యపై కడప మార్గంలోని ప్రజలు పలుమార్లు పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

మరమ్మతులకు చర్యలు

పీలేరు ఈవోగా కొత్తగా వచ్చాను. సమస్య ఉన్న ప్రాంతంలో పరిశీలించి పూర్తి స్థాయిలో వీధి దీపాలు మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం - బ్రహ్మారెడ్డి, ఈవో, పీలేరు పంచాయతీ

ఆడ పిల్లలపై చిన్నచూపు తగదు

సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యమ్మ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : ఆడ పిల్లలను చిన్నచూపు చూడకుండా అబ్బాయిలతో సమానంగా అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని బి.కొత్తకోట సీడీపీఓ కె.భాగ్యమ్మ కోరారు. బి.కొత్తకోట కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం 'బేటీ పడావో.. బేటీ బచావో' కార్యక్రమంలో భాగంగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను బాలికలు సద్వినియోగం చేసుకుని ఎదగాలన్నారు. బాలికలు ఎదుగుతున్న ప్రస్తుత తరుణంలో పౌష్టికాహారాన్ని అందివ్వాలని సూచించారు. బాలికలు ప్రలోభాలకు లొంగకుండా చైతన్యవంతులు కావాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారిణి విశ్వలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి పాల్గొన్నారు.

ఉపన్యాసంతో మెరిశారు.. బహుమతులతో మురిశారు

విజేతలతో శ్రీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్స్ వెంకటరెడ్డి, రమణారెడ్డి, ఏవో హేమంత్

విద్యార్థులతో కృష్ణారెడ్డి సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, తదితరులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస (స్పీచ్) పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎస్.వాష్మిన్ (రెండో సంవత్సరం), వై.నందిని (రెండో సంవత్సరం), టి.షణ్ముకప్రియ (మొదటి సంవత్సరం) విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్స్ వెంకటరెడ్డి, రమణారెడ్డి, ఏవో హేమంత్‌లు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

● మదనపల్లెలోని కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రెండో సంవత్సరానికి చెందిన ఎం.మనీషా, కె.స్రవంతి, కె.యువరాజ్ విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులతో శ్రీ సాయిచైతన్య జూనియర్ కళాశాల సీఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ధనుంజయ్‌రెడ్డి

● మదనపల్లెలోని శ్రీ సాయి చైతన్య జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో ఇంటర్ విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎస్.నదీరా (మొదటి సంవత్సరం), డి.నవ్యశ్రీ (రెండో సంవత్సరం), జి.సంజన (మొదటి సంవత్సరం)లు విజేతలుగా నిలిచారు. వీరికి కళాశాల సీఈఓ రాజేశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్ నిర్మల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ ధనుంజయ్‌రెడ్డి, ఏఓ ఆనంద్‌రెడ్డిలు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

శ్రీరెడ్డెమ్మ ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలో శ్రీరెడ్డెమ్మదేవత ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రెండు నెలలుకుగాను నగదు రూ.4,64,466, బంగారు 65 గ్రాములు, వెండి 192 గ్రాముల కానుకలు వచ్చినట్లు ఈవో మంజుల మంగళవారం తెలిపారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ లంకిపల్లె రాజన్ననాయుడు, దేవాదయశాఖ జిల్లా కార్యాలయ సిబ్బంది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో 38,490 మంది రైతులకు లబ్ధి

పీలేరు: పీలేరు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవలో రూ.ఐదు వేలు, పీఎం కిసాన్‌లో రూ.రెండు వేల వంతున 38,490 మంది రైతులకు రూ.25.95 కోట్లు మంజూరు అయింది. మండలాల వారీగా పీలేరు 6,201 మందికి రూ.4.22 కోట్లు, కంభంవారిపల్లెలో 8,386 మందికి రూ.5.58 కోట్లు, వాల్మీకిపురం 6,507 మందికి రూ.4.50 కోట్లు, కలకడలో 5,787 మందికి రూ.3.85 కోట్లు, కలికిరిలో 5,064 మందికి రూ.3.38 కోట్లు, గుర్రంకొండలో 6,545 మందికి రూ.4.42 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు బుధవారం రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు.

వైభవంగా శివుడికి రుద్రాభిషేకం

శివుడికి రుద్రాభిషేకం చేస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : స్థానిక ప్రాచీన శ్రీలక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం పునః ప్రారంభమై 24 సంవత్సరాలు పూర్తి కావడంతో మంగళవారం ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మహన్యాస పూర్వక ఏకాదశ వార అభిషేకం, మహా గణపతి హోమం, రుద్ర, దుర్గా సూక్త, నవగ్రహ దేవతల మూల మంత్రములతో యాగం నిర్వహించారు. స్వామి వారికి చేసిన విశేషాలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

ఆలయ నూతన కమిటీ నియామకం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : దేవళంవీధికి చెందిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయానికి నూతన కమిటీని నియమిస్తూ మంగళవారం దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆలయనూతన కమిటీ ఛైర్మన్‌గా గంగారపు నవీన్‌చౌదరి, సభ్యులుగా వి.అజయ్ పండిట్, డి.భాస్కర్, కె.మల్లిక, కె.శ్రీరాములు, టి.మంజునాథ్, వి.మారుతి, ఎస్.నాగమణి, కె.రాజేష్, బి.బుజ్జమ్మ, ఎం.ఉషా, ఎ.ఆర్.గోవర్ధన్‌భట్టర్ నియమితులయ్యారు. వీరందరి చేత ప్రమాణ స్వీకారం చేయించాలని ఆలయ ఈఓ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లకు కమిషనర్ ఆదేశించారు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రెండేళ్ల పాటు కొనసాగుతారని దేవదాయశాఖ కమిషనరు తెలిపారు.

In the Court of the Principal Senior Civil Judge, Madanapalle
O.E.P. No.62/16 / OS No. 282/13

బి.శంకరనారాయణ - Decree Holder
ఎస్.ఖాదర్ హుస్సేన్ (died) & Others - Judgement Debtors

వేలము ప్రకటన

క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని డిక్రీ హోల్డర్ తనకు రావలసిన E.P. పైకమునకు గాను వేలమునకు తెచ్చి ఉన్నారు. సదరు వేలము పై తెలిపిన కోర్టు నందు **26-11-2025**వ తారీఖున ఉదయం 10.30 గం॥ మొదలు 5 గం॥ లోపల వేలము వేయబడును. సదరు వేలమునకు షరతులు వేలము ప్రారంభమునకు ముందు నిర్ణయించబడును. సదరు వేలము నందు ఎవరైనా పాల్గొనవచ్చును. సదరు వేలము 28-9-12 తేదీన గల మార్టిగేజ్‌కు లోబడి జరుగును.

షెడ్యూలు : చిత్తూరు జిల్లా - ప్రస్తుతము అన్నమయ్య జిల్లా, మదనపల్లె (Sub-District-Mandal) కొత్తపల్లె పంచాయతీ, ఈశ్వరమ్మ ఇండ్లు - గోపాలపురం Building bearing Door. No. 6/85 is situated in S.No.75-1, with in the boundaries and Measurements bounded on - East by the house sold to others by Sri Ramachandra, West by the Road, North by the house of others constructed in the vaccant site sold by B.Gangulaiah, South by the house of Nagaraja with in the above boundaries measuring East to West on Northern side 49 ft. or 14.9352 mtrs, East to west on Southern Side 49 ft. or 14.9352 mtrs, North to South on Eastern side 14.6 ft or 4.4196 mtrs, North to South on Western side 13ft. or 3.9624 mtrs. R.C.C. roofed building bearing Door. No. 6/85 in S.No.75-1 is situated with in the above boundaries and measurements with all doors, door frames, windows, electrical fittings and easementary rights etc., including electric service connection, Panchayat water tap connection etc., with half Joint rights in the wall Situate on Northern side and exclusive rights in the remaining walls etc., D.H.R. Value Rs. 8,00,000/-, Court Ameen value is Rs.14,00,000/-, J.D.R. Value Not furnished upset value fixed by the court is Rs. 10,00,000/-. Mortgage deed amount is Rs. 4,00,000/- to Baskara Hare Ramaiah dt. 28-9-12 bearing document No. 6893/2012 of SRO Madanapalle.

Surabhi Rama Gopal Rao, B.A., LL.B., Advocate, Madanapalle

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, న్యూస్‌టుడే : తెదేపా నాయకుడు, శెట్టివారిపల్లె ఎంపీటీసీ మాజీ సభ్యుడు వాసుదేవయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతున్న వాసుదేవయ్య సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి మంగళవారం ఆయన స్వగ్రామం శెట్టివారిపల్లెలో అంత్యక్రియలు జరిగాయి. ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించి సంతాపం తెలిపారు. తరిగొండలో తెదేపా కార్యకర్త నరసింహులు మృతదేహానికి నివాళులర్పించారు. తెదేపా నాయకుడు మహబూబ్‌బాషా తల్లి తహేరాబీ మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు నాయిని జగదీష్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నౌషాద్, నాయకులు ప్రదీప్‌రెడ్డి, చంద్రబాబు, చలమారెడ్డి, జయసూరి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం..క్రైం..క్రైం..

హత్యకేసు దర్యాప్తు ముమ్మరం

మదనపల్లె నేరవార్తలు: మదనపల్లె మండలం సీటీఎం సమీపంలోని సచివాలయం వెనుక ప్రాంతంలో ఆదివారం రాత్రి జరిగిన సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. సాంకేతిక పరంగా కూడా విచారణ మొదలు పెట్టినట్లు తెలిపారు. నిందితులను సాధ్యమైనంత త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

మారణాయుధాలతో దాడి

రామసముద్రం: మారణాయుధాలతో దాడి చేసి తన తండ్రిని గాయపరిచారని సీతప్ప స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామసముద్రం మండలం బలిజపల్లెకు చెందిన వెంకటరమణ, సోదరుడు కృష్ణప్పల భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం వెంకటరమణపై ప్రత్యర్థులు కృష్ణప్ప, భార్య నాగలక్ష్మమ్మ, కుమార్తెలు మంజుల, సావిత్రి, లక్ష్మీదేవి, అల్లుళ్లు సుకుమార్, చైతన్య మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. బాధితుడి కుమారుడు సీతప్ప ఫిర్యాదు మేరకు దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు.

తహసీల్దారు తీరుపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సమాచార హక్కు చట్టం గురించి అడిగేందుకు తహసీల్దారు కార్యాలయానికి వెళితే తమపై దౌర్జన్యం చేశారని మదనపల్లె తహసీల్దారు కిశోర్‌కుమార్‌రెడ్డిపై మంగళవారం బహుజన యువసేన అధ్యక్షుడు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయకుమార్ అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకుంటే సమాచారం ఇవ్వడం లేదని తహసీల్దారు దగ్గరికి వెళ్లామన్నారు. అయితే తహసీల్దారు దురుసుగా మాట్లాడటంతో పాటు కార్యాలయం నుంచి బయటకు వెళ్లి పోవాలన్నారన్నారు. ప్రజలపై అమర్యాదగా వ్యవహరించిన తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఒకటోపట్టణ ఎస్ఐ అన్సర్ బాషా మాట్లాడుతూ ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు ముందుకెళ్తామన్నారు.

ఇరవై బోర్ల వద్ద కేబుల్ చోరీ

నిమ్మనపల్లె: నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లె వ్యవసాయ పొలాల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి మోటార్ల కేబుల్ చోరీకి పాల్పడ్డారు. పంట కోతలు చేతికి వస్తున్న తరుణంలో బోర్ల వద్ద కేబుల్ చోరీ కావడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తుతోందని అన్నదాతలు ఆరోపించారు. గ్రామానికి చెందిన రవి, మనోహర్‌రెడ్డి, ఆదిరెడ్డి, సత్యారెడ్డి, లక్ష్మీదేవమ్మ, భాస్కర్‌రెడ్డి, రత్నమ్మ, హరితోపాటు మరి కొంతమంది రైతుల బోర్లకు చెందిన కేబుల్ చోరీ అయింది. బాధితులు నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేబుల్ విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పులికల్లు పంచాయతీ చినవెంకటాయగారిపల్లెలో ఇల్లు కట్టడానికి అడ్డుపడుతున్నారని పేర్కొంటూ లలితమ్మ, ఆమె కుమార్తె సుకీర్తనపై సోమవారం తిరుమల రవి దాడికి పాల్పడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

ట్రాక్టర్ మడకలు తగిలి తల్లీకుమార్తెకు గాయాలు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : ట్రాక్టరు మడకలు తగిలిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ ఘటన మండలంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జింకల మిట్టకు సమీపంలో బెంగళూరుకు చెందిన గణేశ్ అగ్రహారంలోని అత్తగారింటికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నాడు. పీటీఎంలోని ఎస్బీఐలో భార్య పేరిట ఖాతా ప్రారంభించడానికి మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. గొల్లపల్లె నుంచి కందుకూరు వైపు వెళ్తున్న మడకలతో కూడిన ట్రాక్టరు తగిలింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సుమలత (39), వంశిక (6) గాయపడ్డారు. గాయపడ్డ బాధితులను ములకలచెరువులోని ఓ ప్రైవేటు వాహనంలో తరలించినట్లు తెలిపారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

తెదేపా నాయకులతో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

రామసముద్రం, న్యూస్‌టుడే : మదనపల్లె నియోజకవర్గంలో తెదేపా కార్యకర్తల జోలికొస్తే వదిలిపెట్టేది లేదని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ హెచ్చరికలు చేశారు. మంగళవారం రామసముద్రం మండలంలో ఆయన పర్యటించి తెదేపా నాయకులతో సమావేశమయ్యారు. బలిజపల్లెలో రెండు రోజుల కిందట భూవివాదంలో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా కోశాధికారి, పుంగనూరు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు సీతప్ప తండ్రి వెంకటరమణపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడి వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రమేశ్‌బాబును కలిసి ఘటనకు సంబంధించిన వీడియోలను చూపించారు. నిందితులపై కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, సీనియర్ నాయకులు సీఆర్.నారాయణరెడ్డి, చిన్నాస్వామి, ప్రశాంత్‌రెడ్డి, వేణుగోపాల్, బాలాజీ, ఎల్.శివ, బందిలి శివప్ప, ఎంవి.రమణ, జయకుమార్, లోకేశ్, చాను, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవైజీ సర్వేకు సహకరించండి

మాట్లాడుతున్న గృహనిర్మాణశాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి రమేశ్‌రెడ్డి

రామసముద్రం, న్యూస్‌టుడే : పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి రమేశ్‌రెడ్డి కోరారు. మంగళవారం రామసముద్రం మండలంలో ఆయన పర్యటించారు. గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారుల సర్వేపై గ్రామ సచివాలయ ఉద్యోగులు, రాజకీయ నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అర్హుల జాబితాలో లబ్ధిదారుల వివరాలు తప్పనిసరిగా పీఎంఏవైజీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. సర్వే జాబితాలో లేని లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేసే అవకాశం ఉండదన్నారు. లబ్ధిదారుల వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేసే అవకాశం ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఉందన్నారు. గ్రామాల్లో అధికారులు చేపట్టే సర్వేకు సహకరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటికి 42 వేల మంది లబ్ధిదారుల వివరాలు నమోదయ్యాయన్నారు. 14 వేల మంది లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకంలోని జాబ్‌కార్డు తప్పనిసరన్నారు. కార్యక్రమంలో డీఈఈ దీనదయాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

మారుతీప్రసాద్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిషన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మారుతీప్రసాద్‌కు తమిళనాడు రాష్ట్రంలో చెన్నైకు చెందిన సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు వీసీ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఆయన 'యాన్ ఇంటెలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐఓటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను పీహెచ్‌డీ పట్టా వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీసీతోపాటు ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

నిమ్మనపల్లె మండలంలోని నిమ్మనపల్లె - వాల్మీకిపురం రహదారిలో గుడ్రెడ్డిగారిపల్లె, వలసపల్లె వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనబడకపోవడంతో వాహన చోదకులు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. వంపులు తిరిగిన మలుపుల వద్ద పలువురు మృత్యువు పాలయ్యారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని రహదారి మలుపులను సరిచేయాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, నిమ్మనపల్లె**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పీలేరు బజారు శాఖ (బ్రాంచ్ కోడ్ 16428)

బంగారు నగల వేలము ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకొన్న రుణములు గడువు తీరినను తిరిగి చెల్లించలేదు. సదరు వ్యక్తులకు అనేక పర్యాయములు నోటీసులు పంపివున్నారు. సదరు నోటీసులను పంపినప్పటికి ఖాతరుచేయనందున వారి బకాయిలు రాబట్టుకొనుటకు బ్యాంకు నిబంధనలను అనుసరించి **25.11.2025(మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకు** బ్యాంకు ఆవరణలో బహిరంగముగా వేలము వేయుటకు నిర్ణయించడమైనది. వేలములో పాల్గొన దలచిన వారు ఇతర నియమ,నిబంధనలు కొరకు బ్రాంచ్ నందు సంప్రదించగలరు.

వ.నెం	అకౌంట్ నెంబరు	అప్పుదారుని పేరు, చిరునామా	రుణము	నగల బరువు (గ్రా॥ల లో) గ్రాస్	నెట్
1	42378852748	కొండేటి రెడ్డప్ప, S/o వెంకటప్ప కుమ్మరపల్లి, ముడుపులవేముల(పో) పీలేరు	రూ. 154000/-	36.00	30.00

బ్రాంచ్ మేనేజర్, SBI, పీలేరు బజారు శాఖ

శ్రద్ధాంజలి
కీ॥శే॥ రంగప్పగారి లక్ష్మమ్మ గారు
18-11-2025వ తేదీన స్వర్గస్తులైనారు.
అంత్యక్రియలు: 19.11.2025 బుధవారము, ఉ॥ 10.00 గం॥లకు
స్థలం: రెడ్డివారిపల్లి
నిండు నూరేళ్ళు (100 సం॥లు) జీవించి
మంచికి మారుపేరుగా జీవించి మా నుండి భౌతికంగా దూరమైన మిమ్ములను మేము మరువలేము. మీ జ్ఞాపకాలు మమ్ము వీడలేదు.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా భగవంతున్ని ప్రార్థిస్తున్నాము.
ఇట్లు: కుమారులు, కోడళ్ళు, కుమార్తెలు, అల్లుళ్ళు, మనవళ్లు, మనవరాళ్లు
కుటుంబ సభ్యులు & బంధుమిత్రులు
మనవడు పాల్ బాలాజి YSRCP లీడర్ సెల్: 9441393710

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

మహిళకు సామగ్రిని అందజేస్తున్న జిల్లా ఉపాధి అధికారి సురేష్, ట్రస్టు అధ్యక్షుడు పార్థసారథి

మహిళల ఉపాధికి ఉన్నతి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మహిళలు ఉత్పత్తి రంగంలో రాణించాలని జిల్లా ఉపాధి అధికారి కె.సురేష్ అన్నారు. పట్టణంలోని గ్లోబల్ సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు టైలరింగ్ శిక్షణ, ఉపాధి అవకాశాలు, బ్యాంకు రుణాల వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు పార్థసారథి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఉపాధి అధికారి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఉన్న అవకాశాలను వివరించారు. అనంతరం వారికి టైలరింగ్ సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

రైతులతో మాట్లాడుతున్న జేడీ శివనారాయణ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పంటల మార్పిడితో భూమి సారవంతం అవుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని దిన్నెపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంట మార్పిడితో ఏ పంట సాగు చేసిన వ్యాధులు ఆశించవన్నారు. దీంతో దిగుబడి పెరగడంతో పాటూ నాణ్యత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో రాజకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ స్థలం ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా దేవాదాయ అధికారి విశ్వనాథం

సుండుపల్లి, న్యూస్‌టుడే: జిల్లా దేవాదాయ అధికారి విశ్వనాథం మంగళవారం సుండుపల్లి విరూపాక్ష, చెన్నకేశవ ఆలయాన్ని సందర్శించారు. సోమగ్రాజుగారిపల్లెకు చెందిన రెడ్డెయ్య రాజు పీజీఆర్ఎస్‌లో ఆలయ అభివృద్ధి పేరుతో తన స్థలంలో అక్రమంగా శౌచాలయాలు నిర్మించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఆ స్థలాన్ని పరిశీలించి స్థలాన్ని కొలిచి, హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దారు మహబూబ్ చాంద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండారెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు.. క్రీడల్లో దిట్టలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: వారంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు. పూర్తి స్థాయి క్రీడా వసతులు లేకున్నా.. పట్టుదలతో చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ప్రతి పోటీల్లోను పాల్గొంటూ పతకాల పంట పండిస్తున్న హస్తవరం చెర్లోపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే.

ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

ఆటలంటే ఇష్టం: నా పేరు పి. దీక్షిత. నేను రాజంపేట మండలం హస్తవరం చెర్లోపల్లి, జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నాకు క్రీడలంటే ప్రాణం. మా పాఠశాలలో క్రీడల్లో శిక్షణ తీసుకోవడానికి సరైన సదుపాయాలు లేవు. అయినప్పటికి మా గురువు ఈశ్వర్ నాయక్ సహకారంతో ఖోఖో, పరుగు పందెంలో రాణిస్తున్నాను. నేను మండల స్థాయి 400, 600 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి, జిల్లా స్థాయిలో మూడవ బహుమతి సాధించినాను. ఎవరైనా దాతలు ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణిస్తాను.

బంగారు పతకం సాధిస్తా: నా పేరు **మానస.** నేను హస్తవరం చెర్లోపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదోవ తరగతి చదువుతున్నాను. మా అమ్మ, నాన్నలు చదువుకోలేదు. వ్యవసాయ కూలీగా పని చేస్తున్నారు. నేను బాగా చదువుకొని, క్రీడల్లో రాణించాలన్నదే నా లక్ష్యం. రాష్ట్ర స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలలో బంగారు పతకం సాధిస్తాను. డివిజన్ స్థాయిలో జరిగిన ఖోఖో, 100, 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి, 400, 600 మీటర్ల పరుగు పందెంలో రెండోవ బహుమతి సొంతం చేసుకున్నాను. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధిస్తాను.

పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తా: నా పేరు **మధుప్రియ.** నేను మండలం, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాం. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన రాణించి మా పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకొస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

?: పట్టణంలోని లక్ష్మీపురానికి చెత్త సేకరణ వాహనాలు రావడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది. **- గోవిందు, స్థానికుడు**

✓: సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపి చెత్త నిల్వలు తొలగింపజేస్తాము. **- రవి, రాయచోటి పురపాలక కమిషనర్**

?: పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో చెత్తను సమయానికి తరలించడం లేదు. దీంతో చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- రాము, స్థానికుడు.**

✓: వెంటనే సిబ్బందిని పంపి చెత్త నిల్వలను తొలగింపజేస్తాము. స్థానికులకు ఇబ్బంది లేకుండ చూస్తాము. **-రవి, రాయచోటి పురపాలక కమిషనర్ - న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ**

?: గంగిరెడ్డిగారిపల్లి పడమర వీధిలో పలు వీధిదీపాలు వెలగడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. **- స్థానికులు, గంగిరెడ్డిగారిపల్లి**

✓: మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకొంటాం. **- మురళి, పంచాయతీ కార్యదర్శి, భాగంపల్లి.**

?: చిన్నబిడికి- పెద్దబిడికి మార్గంలో ఇరువైపులా చెట్లు మొలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు పెద్దబిడికి**

✓: పంచాయతీ అధికారులకు తెలిపి కొమ్మలు తొలగిస్తాం. **- సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో, సుండుపల్లి - న్యూస్‌టుడే, సుండుపల్లి**

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నాయకులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండలంలో వై.కోట, మంగంపేట, ఓబులవారిపల్లె, గోవిందంపల్లె పంచాయతీలోని 12 మంది బాధితులకు సహాయ నిధి కింద మంజూరైన రూ.5.97 లక్షల విలువగల చెక్కులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం తమదన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఇప్పటికే రూ.3 కోట్ల వరకు సీఎం సహాయ నిధి నుంచి బాధితులకు ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకే ఇంటింటి సర్వే

సర్వేను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో డాక్టరు రాధిక

ఎస్ఎన్‌కాలనీ(రాయచోటి), న్యూస్‌టుడే: జిల్లాలో కొనసాగుతున్న కుష్ఠు సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టరు కె.రాధిక తెలిపారు. పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో మంగళవారం నిర్వహించిన కుష్ఠు సర్వేని ఆమె తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది రోగుల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి స్పర్శలేని మచ్చలు కలిగిన వ్యక్తులను గుర్తించాలన్నారు. గుర్తించిన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బోడిరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విని పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారం వద్దకు వచ్చే భూ సమస్యలను రెవెన్యూ అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.

రోగులకు దుప్పట్ల పంపిణీ

రాయచోటి: రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి వంద దుప్పట్లను తెదేపా నాయకుడు శ్రీనివాసులురెడ్డి వితరణ చేశారు. మంగళవారం రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. లయన్స్ క్లబ్ తరఫున ఐదు నెబ్యులైజర్లను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు మహమ్మద్ వితరణ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కల్పించడంపై వారిని మంత్రి అభినందించారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రతిభలు చూపి... బహుమతులు సాధించి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని ఎస్.వి విద్యామందిర్ హైస్కూల్‌లో ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు (ఉపన్యాసం) నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో మోహన్ ఆదిత్య (పదోతరగతి), వెంకట జగదీష్(తొమ్మిదో తరగతి), ఈషాన్ (ఎనిమిదో తరగతి)లు విజేతలుగా నిలిచారు. వీరికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడె రెడ్డెప్పరెడ్డి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిత్ర, రామాంజులు రెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : పట్టణంలోని గురుదేవ వశిష్ఠ జూనియర్ కళాశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రకృతి అందాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన ఈ పోటీలకు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 52 మంది పాల్గొన్నారు. వారిలో మొదటి సంవత్సరానికి చెందిన పి. తేజస్విని, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్. హుసేన్, ఎన్.విష్ణు విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపల్ రమేష్ వారికి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.వి విద్యామందిర్ హైస్కూల్‌లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న రెడ్డెప్పరెడ్డి

వశిష్ఠ జూనియర్ కళాశాల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు

రాష్ట్ర స్థాయి షాట్‌ఫుట్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నందలూరు,న్యూస్‌టుడే: మండలంలోని జ్ఞానదీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని **గుగ్గిళ్ల నాగస్వాతి** అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి షాట్‌ఫుట్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరెస్పాండెంట్ అద్దంకి జానకీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం కడప స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో ఉత్తమ ప్రదర్శన చూపి ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 22న బాపట్ల జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆయన వివరించారు.

నవోదయ హాల్ టికెట్లు విడుదల

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: జవహర్ నవోదయ విద్యాలయం 6వ తరగతి ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న నిర్వహించేదుకు, హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ గంగాధరన్ మంగళవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఇచ్చిన లింక్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మోడపోతుల రాము

నందలూరు, న్యూస్‌టుడే: మదనపల్లె పట్టణంలో నిర్వహించిన మాల మహానాడు రాష్ట్ర మహాసభల కార్యక్రమంలో మండలంలోని నందలూరు గ్రామానికి చెందిన మోడపోతుల రాముని మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలల సమస్యల కోసం పోరడతానని తెలిపారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకానికి మహర్దశ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని త్వరలో విలీనం చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏకశిలానగరి చెరువు, కోటపాడు వద్ద ఏర్పాటు చేసిన పంపుహౌస్‌ను తితిదే సీఈ టీవీ సత్యనారాయణ, ఎస్ఈ మనోహరం ఆదేశాల మేరకు సివిల్ విభాగం ఈఈ సి.సుమతి, డీఈ ఎం.నాగరాజు, ఏఈ కె.అమరనాథ్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ సాయికిశోర్, సాగునీటి సంఘం ఛైర్మన్ పాటూరు గంగిరెడ్డి మంగళవారం పరిశీలించారు.

సోమశిల వెనుక జలాలను పరిశీలిస్తున్న తితిదే, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు

భక్తులు మురిసేలా వసతులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శన భాగ్యం కోసం వస్తున్న భక్తుల మది మురిసేలా మెరుగైన వసతులు కల్పించడానికి సమగ్ర ప్రణాళికను రూపొందించి తితిదే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తానని విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి తెలిపారు. రామయ్య క్షేత్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సివిల్ విభాగం ఈఈ సి.సుమతి, డీఈ ఎం.నాగరాజు, ఏఈ కె.అమరనాథ్‌రెడ్డితో పలు అంశాలపై చర్చించారు. ఈ ఆలయాన్ని తితిదేలో విలీనం చేసిన తర్వాత చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని సదుపాయాలు పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కొత్త సేవలు కూడా పరిచయం చేయాల్సిన అవసరం ఉందని ప్రస్తావనకు వచ్చినట్లు ఇంజినీర్లు చెప్పారు.

గాండ్లపల్లె హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి నివేదిక

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు మండలం గాండ్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి జిల్లా విద్యాశాఖాధికారికి నివేదించామని ఎంఈవో-1 పిల్లి నాగరాజు తెలిపారు. 'ఈనాడు'లో మంగళవారం 'ప్రహరీ కావాలి.. ముళ్ల పొదలు తొలగాలి' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విద్యాశాఖాధికారులు ఆ పాఠశాల హెచ్‌ఎంతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో మంజూరైన నిధులతో హైస్కూల్‌కు ప్రహరీ నిర్మాణ పనులు కొంత మేర చేసి అసంపూర్తిగా నిలిపివేశారన్నారు. పాఠశాల వెనక ఉన్న చెరువు వంక, ముళ్ల పొదలతో ఇబ్బందిగా ఉందన్నారు. అసంపూర్తి పనులకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గ్యాస్‌పై వంట.. కళ్లకు తప్పిన మంట

స్పందనకు వందనం

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం నిర్వాహకులు గ్యాస్‌పై వంట చేశారు. 'ఈనాడు'లో ఈ నెల 13న 'కట్టెలతో వంట.. కళ్లు మంట' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంఈవో-2 వేల్పుల శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 480 మంది చదువుతున్న పాఠశాలలో గ్యాస్ వినియోగించాలని హెచ్చరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.జాఫర్ వెంటనే తగిన చర్యలు తీసుకోవడంతో గ్యాస్ బండలు, పొయ్యి సమకూరాయి. దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

గ్యాస్‌పై వంట చేస్తున్న నిర్వాహకురాలు

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన

రాయచోటి గ్రామీణ,న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి సురేంద్రబాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పీటీఎం పల్లెలో సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 15వ ఆర్థిక సంఘం నిధులను కార్మికుల వేతనాలను చెల్లించడానికి వినియోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కరపత్రాలు చూపుతున్న కార్మిక సంఘం నాయకులు

టీచ్ టూల్‌తో బోధనలో మెరుగైన నైపుణ్యాలు

పుల్లంపేట, చిట్వేలి, న్యూస్‌టుడే: శిక్షణలో పొందిన నైపుణ్యాలను తరగతి గది పరిశీలనలో వినియోగించాలని ఎంఈవో-2 నాగతిరుమల రావు అన్నారు. మంగళవారం పుల్లంపేట ప్రధాన పాఠశాలలో జరుగుతున్న టీచ్‌టూల్ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు సాధించిన నైపుణ్యాలను తరగతి గదిలో బోధన సమయంలో ఉపాధ్యాయులు వినియోగించాలన్నారు.

పుల్లంపేటలో శిక్షణకు హాజరైన ఆర్పీలు

కుల గణన చేయాలని ధర్నా

కోడూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: జన గణనలో కుల గణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక సీట్లు కేటాయించాలంటూ సీపీఐ నాయకులు మంగళవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. మండల పార్టీ కార్యదర్శి దార్ల రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పందుగోల మణి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. దళిత, గిరిజన, మైనారిటీ, క్రైస్తవులపై జరగుతున్న దాడులను అరికట్టాలన్నారు.

రాయచోటి గ్రామీణ: దేశంలో త్వరలో జరగబోయే జనగణనతో పాటు కులగణన కూడ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్ డిమాండ్ చేశారు. దేశంలో అణగారిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని నివారించాలంటూ మంగళవారం పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన తెలిపారు.

రాజంపేట: జనగణనతో పాటు కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక బైపాస్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని ఆపార్టీ నాయకులు, ఇతర సంఘాల నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి సికిందర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయని కారణంగా దిగువస్థాయి ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు.

ఓబులవారిపల్లె: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడుకుందామని సీపీఐ నాయకులు అన్నారు. మంగళవారం ఓబులవారిపల్లె మండల పరిధిలోని కొర్లకుంట గ్రామంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కలిసి నడిచారు... పరిష్కారం చూపారు

ఈనాడు మీతోడు

★ పట్టణంలోని బస్టాండు ప్రాంతంలో కమిషనర్ పర్యటించి పుట్‌పాత్‌ను ఆక్రమించుకుని దుకాణాలు, తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకున్న వారిని ఖాళీ చేయించారు. పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణ పరిధిలోని 4వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పురపాలక కమిషనర్ రవి దృష్టికి తీసుకెళ్లారు. ఈనాడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'వాక్‌విత్ కమిషనర్' కార్యక్రమంలో ఆయన 4వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు మురుగు, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్ల వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

★ వార్డులో మరుగు కాలువలు చిన్నవిగా ఉండటం, కొన్ని చోట్ల దెబ్బతినడంతో వర్షాలు పడినప్పుడు కాలువలు పొంగి ఇళ్లలోకి నీరు చేరుతోందని స్థానికురాలు మాబ్‌జాన్ కమిషనర్‌కు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సిబ్బందిని పిలిచి కాలువలు శుభ్రం చేయాలని ఆదేశించారు. పురపాలక పరిధిలో డ్రెయిన్ల నిర్మాణాలకు రూ.10 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపామని అనుమతులు రాగానే నిర్మాణం చేపడతామన్నారు.

★ వార్డులో చాలా ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని స్థానికుడు సులేమాన్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే చెత్త సేకరణ వాహనాలు సమయానికి నివాసాల నుంచి చెత్తను సేకరించడం లేదంటూ ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వెంటనే చెత్త సేకరణ వాహనాన్ని రప్పించి నివాసాల నుంచి చెత్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాడు. పురపాలకలో దెబ్బతిన్న, నూతన సీసీరోడ్ల నిర్మాణాలకు రూ.2.5 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ రవి

★ సుండుపల్లె రోడ్డు మార్గంలో ప్రధాన రహదారిపై పశువులు సంచరిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారులు స్పందించి పశువులను వేరే చోటికి తరలించాలంటూ మన్సూర్ అలీఖాన్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డులో వీధి కుక్కల సంతతి విపరీతంగా పెరిగి చిన్నరులపై దాడి చేస్తున్నాయంటూ స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులను గుర్తించి ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. అలాగే వీధి కుక్కల సంతతి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ఉప్పెన ఉరిమి.. కోమలిని మింగి..

మహా విషాదానికి నేటితో 48 ఏళ్లు

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్

ఆ రోజు (1977 నవంబరు 19) రాత్రి గుర్తుకు వస్తే పిట్టలవానిపాలెం మండలం కోమలి గ్రామస్థుల వెన్నులో వణుకు పుడుతుంది. గ్రామాన్ని కకావికలం చేసిన భయంకర తుపాను (దివిసీమ ఉప్పెన) అది. చర్చిలో తలదాచుకున్న వంద మంది ప్రాణాల్ని మింగేసింది. మృత్యువు కరాళనృత్యం చేసింది. ప్రచండగాలులు, భారీవర్షంతో భీతావహ వాతావరణం ఏర్పడింది. పూరిళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. మట్టి గోడలు విరిగిపడ్డాయి. అప్పట్లో పక్కా భవనాలు లేవు. ఎస్సీ కాలనీ వాసులు స్థానిక చర్చిలో తలదాచుకున్నారు. పెను ఉప్పెన ధాటికి చర్చి ఒక్కసారిగా కుప్ప కూలింది. శిథిలాల కింద వంద మంది సజీవ సమాధి అయ్యారు. చర్చి కూలిపోతున్నప్పుడు కొందరు బయటకు పరుగులు తీసే క్రమంలో తీవ్రంగా గాయపడి కాళ్లు, చేతులు పోగొట్టుకుని జీవచ్ఛవాలుగా మిగిలారు. ప్రళయానికి పోగుపడిన శవాల కుప్పలను చూసి కోమలి గ్రామం తీవ్ర విషాదంలో మునిగింది. తొలుత ఎంత మంది మృత్యువాత పడ్డారో, కుటుంబంలో ఎవరు మిగిలి ఉన్నారో తెలియదు. భర్త, పిల్లలు, తల్లిదండ్రులు చనిపోయి ఎంతోమంది అనాథలు అయ్యారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. కోమలి మారుమూల గ్రామం కావడంతో విషాదం గురించి మరుసటి రోజు అంటే నవంబరు 20న బయట ప్రపంచానికి తెలిసింది. సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు.

పెనుతుపాను మృతుల స్మారకార్థం కోమలిలో స్తూపాన్ని నిర్మించారు. 1977 తర్వాత గ్రామంలో నిర్మించిన తుపాను రక్షిత భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల వచ్చిన 'మొంథా'కు కోమలివాసులు భయంతో వణికిపోయారు. తుపాను సమయంలో పునరావాస కేంద్రాలకు వెళ్లి తలదాచుకున్నారు. పాత తుపాను రక్షిత భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామంలో మృతుల స్మారక స్తూపం

కళ్ల ముందే తనువు చాలించారు

అప్పట్లో రేడియో ద్వారా తుపాను హెచ్చరికలు జారీ చేసినా చాలామందికి ప్రళయం విరుచుకుపడుతుందని తెలియదు. ఆకాశానికి చిల్లు పడినట్లు కుంభవృష్టి కురుస్తూ హోరుగాలి వీస్తుండటంతో చర్చిలో అందరం తలదాచుకున్నాం. ప్రచండ గాలుల తీవ్రతకు చర్చి గోడలు ఊగిపోయాయి. బయటకు పరుగులు తీయడంతో నాతోపాటు కొందరం ప్రాణాలతో బయటపడ్డాం. కళ్లెదుటే చర్చి కూలిపోయి హాహాకారాలు చేస్తూ వంద మంది సమాధి అయ్యారు. కొన్నేళ్ల పాటు ఆ ఘోర ఘటన పదే పదే గుర్తుకు వచ్చి తీవ్రంగా భయపెట్టింది. తుపాను వస్తుందంటే ఇప్పటికి కలవరపాటుకు గురవుతున్నాం. - వెంకటేశ్వర్లు, కోమలి వాసి

పీజీ మెడికల్ యాజమాన్య సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేటు, మైనారిటీ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు 23న మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

1,60,441 మంది రైతులు.. రూ.107.21 కోట్లు

న్యూస్‌టుడే, బాపట్ల

అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద రైతులకు రెండో విడత సాయం పంపిణీకి రంగం సిద్ధమైంది. రైతుల బ్యాంకు ఖాతాల్లో సుఖీభవ రూ. 5 వేలు, పీఎం కిసాన్ రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేల చొప్పున బుధవారం జమ కానుంది. జిల్లాలో 1,60,441 మంది రైతులకు రూ.107.21 కోట్ల సాయం అందనుంది.

నేడు అన్నదాత సుఖీభవ జమ

❖ పథకం లబ్ధిదారుల జాబితాలను గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించారు. 3,800 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్, వేలిముద్రలు సరిపోక పోవడంతో లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేకుండాపోయాయి. ఒక్కో రైతుకు రూ.7 వేలు అందుతుండటంతో రబీ పంటల సాగుకు పెట్టుబడిగా ఉపయోగపడనుంది. ఆరు నియోజక వర్గాల్లోని 326 రైతు సేవా కేంద్రాల్లో కర్షకులకు సాయం అందించడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాస్థాయి కార్యక్రమం బాపట్ల మండలం నందిరాజుతోట ఆర్ఎస్‌కేలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

నియోజక వర్గం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
అద్దంకి	40,228	27.30
బాపట్ల	18,385	12.13
చీరాల	7,368	4.60
పర్చూరు	37,861	25.83
రేపల్లె	28,634	18.81
వేమూరు	27,965	18.54

జ్యోతి వెలిగిస్తున్న కృష్ణ స్వామీజీ, భక్తుల దీపారాధన

కార్తికం.. దేదీప్యం

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి వ్యక్తి భగవంతుడిని ధ్యానించాలని లక్కవరం కాశీ విశ్వేశ్వర స్వామి ఆశ్రమం పీఠాధిపతి కృష్ణ స్వామీజీ అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ స్వామీజీ మాట్లాడుతూ వచ్చే ఏడాది లక్ష్మీనరసింహస్వామి కొండపై నెయ్యితో దీపోత్సవం నిర్వహించాలని సూచించారు. వేద పండితుడు వంగల హరిశంకరావధాని మాట్లాడుతూ విశిష్టమైన రోజు కోటి దీపోత్సవం నిర్వహించడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కృష్ణ స్వామీజీ జ్యోతి వెలిగించగా, ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, పాలక మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సభ్యులు, వారి కుటుంబసభ్యులు వేదికపై దీపాలు వెలిగించారు. అనంతరం రెండు వేల మంది మహిళా భక్తులు మిగిలిన దీపాలను వెలిగించారు.

మహాజ్యోతి దర్శనం.. పులకించిన భక్తజనం

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు సమీపంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కర్పూర జ్యోతి ప్రజ్వలన భక్తులను ఆకట్టుకుంది. మూడున్నర క్వింటాళ్ల కర్పూరంతో ఆలయ ప్రాంగణంలో మహాజ్యోతిని శాస్త్రోక్తంగా వెలిగించారు. ధ్వజస్తంభాల మధ్య కాగడామల్లెలు, బంతి, చామంతి అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దిన మహాశివలింగాకారం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇందుకు అవసరమైన పూలను బెంగళూరు నుంచి తీసుకొచ్చారు. మార్టూరు, యద్దనపూడి, చిలకలూరిపేట, బల్లికురవ, పంగులూరు, పర్చూరు ప్రాంతాల నుంచి వేలాది మంది మహాజ్యోతి దర్శనాన్ని వీక్షించేందుకు తరలివచ్చారు. ఆలయ కమిటీ నేతృత్వంలో అన్నప్రసాద వితరణ, స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, కనమూరి రాంప్రసాద్, వేణు, వాసు పర్యవేక్షించారు.

మల్లేశ్వరస్వామి

కొల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, జేసీ భావన

పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దు

కొల్లూరు, వేమూరు, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దని ఎమ్మెల్యే ఆనందబాబు చెప్పారు. కొల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ భావనతో కలసి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునే పరిస్థితి లేదన్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లపై నిత్యం పర్యవేక్షించాలన్నారు. జేసీ భావన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. అనివార్య కారణాల వల్ల గత ఏడాది 90వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనడం జరిగిందని, దీనివల్ల చాలామంది రైతులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. జిల్లాలో 110 చోట్ల బుధవారం నుంచి ధాన్యం కొనుగోలు జరుగుతుందని వివరించారు. గోతాలు, పంట రవాణా విషయంలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్లాణం హరిబాబు, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, ఏడీఏ లక్ష్మి, వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.పూర్ణకుమారి, తదితరులున్నారు.

పల్నాటి చరితం.. వీరుల రాజసం

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే

ఉత్సవాల వివరాలు	
1వ రోజు	రాచగావు
2 "	రాయభారం
3 "	మందపోరు
4 "	కోడిపోరు
5 "	కల్లిపాడు

పల్నాటి యుద్ధానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. క్రీ.శ.1138లో అనుగురాజు మహాదేవిచర్ల(నేటి మాచర్ల)ను రాజధానిగా చేసుకుని పాలన ప్రారంభించారు. ఆయన మృతితో సవతిపుత్రుల మధ్య విభేదాలు తలెత్తాయి. మలిదేవాదులు మాచర్లను రాజధానిగా చేసుకుని మంత్రి బ్రహ్మనాయుడు (బ్రహ్మన్న) సారథ్యంలో పాలన ప్రారంభించారు. గురజాలను రాజధానిగా చేసుకుని నాగమ్మ మంత్రిత్వంలో నలగాముడు పాలన చేపట్టారు. ఈ క్రమంలో సరదాగా సాగిన కోడిపందేలు ఇరు రాజ్యాల మధ్య ఉన్న వైషమ్యాలు బట్టబయలు చేశాయి. పట్టుదలకు పోయిన ఇద్దరు రాజులు క్రీ.శ. 1173లో రాజ్యాలను పందేలుగా పెట్టి కోడిపోరుకు దిగారు. నాగమ్మ కుయుక్తితో గురజాల రాజ్యాన్ని గెలిపించి, మాచర్ల రాజైన మలిదేవాదులు, ఆయన మంత్రి బ్రహ్మన్న పరివారాన్ని అరణ్యవాసం పంపించారు. ఏడేళ్ల అరణ్య, ఏడాదిపాటు అజ్ఞాత వాసం అనంతరం తిరిగి రాజ్యాన్ని కోరేందుకు అలరాజు ద్వారా జరిపిన సంధి విఫలమైంది. క్రీ.శ.1181లో పల్నాటి యుద్ధం అనివార్యమైంది. ఈ యుద్ధంలో 66 మంది వీరనాయకులు, వందల సంఖ్యలో సైనికులు అసువులు బాశారు. వీరులను గుర్తు చేసుకుంటూ ఈ నెల 19 నుంచి ఐదు రోజుల పాటు ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు.

కొణతాల మధ్య ఆచారం నిర్వహిస్తూ.. (పాత చిత్రం)

మెలకువలు తెలుసుకో... అదనంగా వాడుకో!

న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

❖ సత్యనారాయణ తన ఇంటికి పీఎం సూర్యఘర్ పథకంలో సౌర విద్యుత్తు పెట్టించుకున్నారు. సెప్టెంబర్లో 520 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి కాగా పూర్తిగా వాడుకున్నారు. బిల్లు జీరో వచ్చింది.

❖ రవీంద్ర కూడా సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు చేయించుకున్నారు. 500 యూనిట్లు ఉత్పత్తి అయితే 250 మాత్రమే వినియోగించుకున్నారు. బిల్లు జీరో కాగా.. అతనికి 182 యూనిట్లు మిగులు వచ్చిందని.. యూనిట్‌కు రూ.2.09 చెల్లిస్తామని అధికారులు వెల్లడించారు. ఇక్కడ సత్యనారాయణ బిల్లు విషయంలో ఒకలా.. రవీంద్రకు వచ్చేసరికి మరోలా నమోదైంది. తప్పు లెక్కించారా అంటే కాదు.. అదెలాగో తెలుసుకుందాం.

అధికారులు చెప్పేది నిజమే కానీ..

రవీంద్ర విషయంలో అధికారులు చెప్పేది నిజమే. మనం సౌర విద్యుత్తు కనెక్షన్ 3 కిలోవాట్లకు తీసుకుంటాం. కిలోవాట్‌కు 144 యూనిట్లే ఉత్పత్తి అవుతుందని ఏపీఈఆర్‌సీ చెబుతోంది. అంటే మూడు కిలోవాట్లకు 432 యూనిట్లు వస్తుంది. దానినే అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. సౌర పలకలు ఒక్కోదాని నుంచి 540 వాట్లు ఉత్పత్తి అవగా 6 పలకలకు 3.24 కిలో వాట్లు ఉత్పత్తి అవుతుంది. సౌర పలకలు కొన్ని 570 వాట్లు ఉంటాయి. అలాంటి 6 పలకల నుంచి 3.42 కిలోవాట్ల వరకు ఉత్పత్తి ఉంటుంది. దానిని లెక్కించడం లేదు. అందుకే 500 యూనిట్లు ఉత్పత్తి వచ్చినా 432 యూనిట్లే లెక్కించారు. ఇతనికి 68 యూనిట్లు వృథా అయినట్లే. ఇలా అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును వినియోగించుకుంటే వృథా ఉండదని అధికారులు చెబుతున్నారు.

పగటి పూట వినియోగం పెంచితే మేలు

సౌర విద్యుత్తు వినియోగంపై నిపుణుల సూచనలు

పగలు ఎండ ఉన్నంతసేపు సౌర విద్యుత్తు ఉత్పత్తి అయి గ్రిడ్‌కు వెళ్లిపోతూ ఉంటుంది. అలాకాకుండా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో కొంత వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం వేళ కొన్ని రకాల విద్యుత్తు ఉపకరణాలు వాడాలని సూచిస్తున్నారు. వాషింగ్‌మెషిన్, గ్రైండర్లు, మిక్సీలు వాడాలి. నీళ్ల ట్యాంకులు నింపడం, ఎలక్ట్రిక్ కార్లు, బైకల ఛార్జింగ్, దుస్తుల ఇస్త్రీ, ఏసీలు వంటివి వినియోగిస్తే వృథా అయ్యే యూనిట్లు మనమే వాడుకోవచ్చు. నష్టపోయే అవకాశం ఉండదు.

వెలుగులోకి రెడ్డిరాజుల శాసనాలు

బాపట్ల జిల్లా పొన్నపల్లిలో భద్రం

చెరుకుపల్లి గ్రామీణ, యడ్లపాడు, న్యూస్‌టుడే

శిలా శాసనాల పరిరక్షణ, అధ్యయనం, ప్రాముఖ్యంపై భారత పురావస్తు సర్వేక్షణ శాఖ (ఏఎస్ఐ) ప్రజల్లో అవగాహన కల్పించడం సత్ఫలితాలనిస్తోంది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారానికి చెందిన పొన్నపల్లి విద్యాభాస్కర్‌కు పూర్వీకుల నుంచి వచ్చిన రాగి శాసనాలు ఇటీవల వెలుగుచూశాయి. కొండవీడు కేంద్రంగా పాలించిన రెడ్డిరాజుల కాలంలో దాదాపు శక సంవత్సరం 1330లో ఇతని పూర్వీకులు వేద పండితులుగా పనిచేశారు. ఆ సమయంలో ఏర్పడిన సూర్యగ్రహణం (క్రీ.శ 1408, అక్టోబరు 19, శుక్రవారం) సందర్భంగా అప్పటి రాజు పెద్దవేమారెడ్డి తన భార్యతో కలిసి బ్రాహ్మణులకు దానాలు చేశారు. ఆ సందర్భంగా తన ఆస్థానంలో వేదం, సర్పశాస్త్రం, వేదాంగం, అష్టాంగ ఆయుర్వేదంలో నిపుణులైన సింగనార్య(ఇతడి తండ్రి వీరయార్య, తాత భాస్కరార్యుడు)కు చిన్న గ్రామంగా ఉన్న పొన్నపల్లిని అగ్రహారంగా చేసుకుని వేదపారాయణంతో ధర్మాన్ని వికసింపజేయాలని కోరుతూ దానం చేశారు. దానపత్రాలను సంస్కృత, తెలుగు లిపిలో శ్రీనాథ కవిసార్వభౌముడితో రాగి రేగులపై రాయించి అందించారు.

తామ్ర పత్రాలు

రెడ్డిరాజులు అందించిన ఈ పొన్నపల్లి అప్పట్లో కుగ్రామం. శాసనాల ప్రకారం ఇది కృష్ణా నదికి ఆవల దివిసీమ ప్రాంతం, ఈవల వెలనాడు అంటే నేటి భట్టిప్రోలు ప్రాంతానికి దగ్గర్లో ఉన్నట్లు రాసి ఉంది. దానంగా వచ్చిన అగ్రహారం కింద సింగనార్యకు దాదాపు 1700 ఎకరాల భూమిని రాజు అందించారు. ఈ నేలపైనే నేటి పొన్నపల్లి గ్రామం విస్తరించింది. ఈ ఏడాది జనవరిలో పొన్నపల్లి శివాలయం వద్ద శాసన గ్రహీతల్లో 22వ తరానికి చెందిన పొన్నపల్లి విద్యాభాస్కర్ తమ ఇంటి పూజ గదిలో భద్రపరిచిన ఈ రాగి శాసనాలను తొలిసారి ప్రపంచానికి చూపారు. త్వరలో వీటిని అధ్యయనానికి భారత పురావస్తు శాఖకు అందించనున్నామన్నారు.

అధ్యయనం చేస్తాం

విద్యాభాస్కర్ తమను ఆన్‌లైన్ ద్వారా సంప్రదించగా శాసనాలను పరిశీలించాం. ఈ నెలాఖరుకు హైదరాబాద్ వచ్చి ఆయన నివాసంలో ఉన్న రాగి శాసనాలను పరిశీలించి అధ్యయనం కోసం వాటిని తీసుకెళతామని కర్ణాటక రాష్ట్రం మైసూరులోని ఏఎస్ఐ డైరెక్టర్ కె.మునిరత్నంరెడ్డి తెలిపారు. శాసనాల్లో లిపి ఆధారంగా కొంత సమాచారాన్ని ఇప్పటికే అతనికి తెలిపాం. పూర్తిగా పరిశోధించి డీకోడ్ చేసిన తరువాత అందులో ఏముందో తెలియజేస్తామన్నారు. ఏవైనా శాసనాల గురించి ప్రజలకు ఎలాంటి సమాచారం ఉన్నా మైసూరులోని పురావస్తు సర్వేక్షణ శాఖ (ఏఎస్ఐ) కార్యాలయానికి తెలియజేయాలన్నారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

పంట కుంటలతో సాగునీరు

బాపట్ల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు తమ భూముల్లో సేద్యపు కుంటలు తవ్వించుకుని పంటలు సాగు చేయాలని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో డీబీఆర్సీ ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాబ్ కార్డులు లేని వారుంటే దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే జారీ చేస్తామన్నారు. సామాజిక అడవుల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా సూక్ష్మ సాగునీటి పథకం పీడీ వెంకటరమణ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యానికి రాయితీపై పరికరాలు అందిస్తామని చెప్పారు. ఏపీఎం సురేష్, డీబీఆర్సీ సమన్వయకర్తలు శ్రీలత, భగవాన్‌వాస్, ఏపీవో బాబు పాల్గొన్నారు.

దేశ సేవకు అగ్నిపథ్ సదవకాశం

గోరంట్ల, న్యూస్‌టుడే: దేశ సేవ చేయాలనుకున్న యువతకు అగ్నిపథ్ సదవకాశమని 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ అలీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్లో భారత వైమానిక దళంలో అవకాశాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. వింగ్ కమాండర్ యాకుబ్ అలీ మాట్లాడుతూ భారత వైమానిక దళంలోని ఉద్యోగ అవకాశాలను వివరించారు. దేశ సేవ కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అగ్నిపథ్ పథకం, దాని ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి దుర్గాబాయి, డీఈవో రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. కాలువలోకే..

కొరిశపాడు మండలం పి.గుడిపాడులోని పమిడిపాడు మేజర్ కాలువ గట్టుపై నిర్మించిన రిటైనింగ్ వాల్, రహదారి కొంతభాగం కాలువలోకి జారిపోయి వాహన చోదకులు ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది. రైతులు, కూరగాయలు తరలించే ఆటోవాలాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. మరమ్మతులు చేయించాలని రైతులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ చర్యలు శూన్యం. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పి.గుడిపాడు (మేదరమెట్ల)

పాఠశాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రామ్‌కమల్, ఇతర అధికారులు

ఆటిజం కేంద్రాలతో ఎన్నో ప్రయోజనాలు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రత్యేకావసరాల పిల్లలకు ఆటిజం కేంద్రాలతో ప్రయోజనాలు కలగనున్నాయని రాష్ట్ర ప్రత్యేకాధికారి రామ్ కమల్ అన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో త్వరలో కేంద్రాన్ని నెలకొల్పనున్న సందర్భంగా ఆయనతో పాటు రాష్ట్ర, జిల్లా అధికారులు పరిశీలించారు. పాఠశాలలో నాడు-నేడు కింద నిర్మించిన రెండు గదులను ఆటిజం కేంద్రం కేటాయించారు. ఈ సందర్భంగా రామ్‌కమల్ మాట్లాడుతూ కేంద్రంలో రూ. 25 లక్షల విలువైన పలు ఉపకరణాలు అందుబాటులో ఉంచుతారన్నారు. ప్రత్యేకంగా ఒక వైద్యుడితో పాటు సిబ్బందిని నియమిస్తారని తెలిపారు. వారి వెంట ఈఈ నాగజ్యోతి, రాష్ట్ర సహాయ సమన్వయకర్త మల్లికార్జున, జిల్లా అధికారి జ్యోత్స్న, ఎంఈవో 2 సుధారాణి, ప్రధానోపాధ్యాయిని హనోరా ఉన్నారు.

డీఏపీ.. డిమాండ్ చూపి..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో రబీ సీజన్‌లో శనగ, మొక్కజొన్న సాగు ఊపందుకోవడంతో డీఏపీ ఎరువుకు డిమాండ్ పెరిగింది. డీఏపీ బస్తా గరిష్ఠ చిల్లర ధర రూ.1350 కాగా.. ప్రైవేటు వ్యాపారులు రూ.1400 నుంచి రూ.1420కు విక్రయిస్తున్నారు. మిగిలిన కాంప్లెక్స్ ఎరువులతో పోల్చితే డీఏపీ ధర తక్కువగా ఉండటం, దుక్కుల్లో వేయడానికి అనుకూలంగా ఉండటంతో దీనికి డిమాండ్ ఏర్పడింది.

ఈనాడు – అమరావతి

బాపట్ల జిల్లా కారంచేడు మండలంలో రబీలో వరి సాగుచేస్తున్న క్రమంలో అక్కడి రైతులు డీఏపీ కొనుగోలు చేస్తున్నారు. మొంథా తుపానుతో దెబ్బతిన్న పంటలు కోలుకోవడానికి కొన్ని ప్రాంతాల్లో డీఏపీ చల్లుతున్నారు. దీనికితోడు 70 శాతం ఎరువులను మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేసి, 30 శాతం మాత్రమే ప్రైవేటు డీలర్లకు సరఫరా చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో లభ్యత తక్కువగా ఉంది. ఇదే అదనుగా వ్యాపారులు లింకు ఉత్పత్తులు కొనుగోలు చేయాలని చెప్పడం, లేకుంటే బస్తాకు ప్రాంతాన్ని బట్టి రూ.50 నుంచి రూ.70 అదనంగా వసూలు చేస్తున్నారు. అప్పుగా కొనుగోలు చేసేవారికి రూ.100 వరకు అదనంగా వేస్తున్నారు.

మార్క్‌ఫెడ్ వద్ద సరిపడా నిల్వలు

డెల్టా ప్రాంతంలో వరి కోతల తర్వాత జొన్న, మొక్కజొన్న సాగు చేస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అవసరం లేకపోయినా ఇప్పుడే నిల్వ చేసుకోవడంతో కృత్రిమ కొరత ఏర్పడుతోంది. గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించి సరఫరా చేయడానికి మార్క్‌ఫెడ్ వద్ద అవసరమైన నిల్వలున్నాయి. డిసెంబరు, జనవరి నెలల్లో వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయడానికి మార్క్‌ఫెడ్, వ్యవసాయాధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తున్నారు.

ధర పెంచి విక్రయిస్తున్న వ్యాపారులు

బాపట్ల జిల్లాలో నిల్వలు తక్కువగా ఉండటం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో కొరత ఏర్పడింది. అక్కడ శనగ సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండటం కూడా కారణమైంది. దీనిని దృష్టిలో పెట్టుకుని మార్క్‌ఫెడ్ అధికారులు రైతుసేవాకేంద్రాలు, డీసీఎంఎస్, సొసైటీలకు డీఏపీ సరఫరా చేస్తున్నారు. ఒక్కసారిగా డిమాండ్ రావడంతో ఆయా కేంద్రాల్లో నిల్వలు తరిగిపోవడంతో ఆందోళన నెలకొంది. మరోవైపు కంపెనీలు కూడా కేటాయింపుల మేరకు సరఫరాలో జాప్యం చేస్తుండటం, ప్రైవేటులో లభ్యత తగ్గడం వంటి కారణాలతో నల్లబజారులో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, విజిలెన్స్ విభాగాలు క్షేత్రస్థాయిలో అమ్మకాలపై దృష్టి సారించి అధిక ధరకు అమ్ముకుండా అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

గుంటూరు జిల్లాలో నెల వారీగా డీఏపీ అవసరాలు (టన్నుల్లో) నెల	డీఏపీ
డిసెంబరు	685
జనవరి	8455
ఫిబ్రవరి	6489
మార్చి	550

MARGADARSI CHIT FUND PVT LTD.
Chit Groups are available at our CHIRALA Branch

Chit Group	Duration In Months	Monthly Installment	Chit Value
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
FT V	40	1,00,000	40,00,000
FT B	40	5,000	2,00,000
TT T	30	10,000	3,00,000

Please Contact Branch Manager Mr. G. SARABAIAH, for further details.
Mobile Nos. 80087-62666, 70360-14501 Landline: 08594-237707, 230509

(c) eenadu

ప్లాస్టిక్ స్వాధీనం విషయంలో వివాదం

వ్యాపారులు.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల మధ్య తోపులాట

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని గడియార స్తంభం కూడలి సమీపంలోని ఓ దుకాణంలో పురపాలక అధికారులు తనిఖీలు చేసి రూ.లక్షన్నర ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకునే క్రమంలో వ్యాపారి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వ్యాపారి శిరీష, ఆమె బంధువుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. తమను లక్ష్యంగా చేసుకుని అధికారులు దాడులు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ మహిళా వ్యాపారి శిరీష ఒంటిపై పెట్రోలు పోసుకుని ప్లాస్టిక్ తరలిస్తున్న ట్రాక్టర్ కింద పడుకుంది. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. పురపాలక కార్యాలయంలో మంగళవారం రాత్రి విలేకరుల సమావేశంలో కమిషనర్ రఘునాథరెడ్డి వ్యాపారి చేసిన ఆరోపణలను ఖండించారు. ప్లాస్టిక్ నిషేధం పై పలుమార్లు సమావేశాలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించరాదని వ్యాపారులకు అవగాహన కల్పించామన్నారు. తర్వాత దాడులు చేసి జరిమానాలు విధిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ విక్రయించరాదని వ్యాపారికి పలుమార్లు చెప్పినా పెడచెవిన పెట్టి విక్రయాలు చేస్తున్నారని తెలిపారు. పురపాలక అధికారులు, సిబ్బంది విధులను అడ్డుకుని దౌర్జన్యం చేసిన వ్యాపారిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పెట్రోలు పోసుకుని ఆందోళన చేస్తున్న వ్యాపారి శిరీష

శనగ రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలి

వేలూరు (చిలకలూరిపేట (గ్రామీణ)), న్యూస్‌టుడే: శనగ రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త టి.వి.సత్యగోపాల్ సూచించారు. చిలకలూరిపేట మండలం వేలూరు, కప్పలవారిపాలెం గ్రామాల్లో శనగ పంట వేసే రైతులకు విత్తనశుద్ధిపై మంగళవారం అవగాహన కల్పించారు. 2.5 గ్రాముల కార్బన్‌డిజం అనే శిలీంద్ర నాశినితో తర్వాత ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసుకుంటే వేరుకుళ్లు, వెండి తెగుళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. మొక్కల మధ్య నాలుగు అంగుళాల దూరంలో విత్తుకున్నట్లయితే ఎకరాకు 30 నుంచి 35 కిలోల విత్తనాలు సరిపోతాయన్నారు. చివరి దుక్కిలో 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేసుకుంటే మొక్కకు కావాల్సిన గంధకం కూడా అందుతుందన్నారు. మొక్కజొన్నకు లోతు దుక్కులు దున్నితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకుడు కె.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేస్తున్నందున రైతులు సంబంధిత పత్రాలతో రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఏవో సీహెచ్ సరిత తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాట్ సెంటర్ శాస్త్రవేత్త సత్యగోపాల్, పక్కన ఏవో సరిత

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఎడ్ల పోటీలను మంగళవారం ఆర్డీవో మురళీకృష్ణ ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆరుసళ్ల విభాగంలో పోటీలు నిర్వహించగా.. దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన రామకోటయ్య ఎడ్లజత 3538.7 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన మాధవరెడ్డి ఎడ్లజత 3260 అడుగులతో ద్వితీయ, కృష్ణా జిల్లా యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య శ్రీమధుల ఎడ్లజత 3250 అడుగులతో తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, వైద్యులు లక్ష్మీనారాయణ, అమరయ్య, రాముడు, శ్రీనివాసరావు, శేషగిరిరావు, హనుమంతరావు, శ్రీను, బాలకృష్ణ, రాఘవ, కొండ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

నక్కపాయ గండి.. పనులు జరగవండి

వరదల వేళ ముంపునకు గురవుతున్న పొలాలు, ఇటుక బట్టీలు

న్యూస్‌టుడే, కొల్లూరు, భట్టిప్రోలు

ఏటా కృష్ణానదికి వరదల సమయంలో వేలాది ఎకరాల పంట పొలాలు ముంపునకు గురై, ఇటుక బట్టీలు జలదిగ్బంధంలో చిక్కుకుని రైతులు, ఇటుక వ్యాపారులు రూ.కోట్లు నష్టపోతున్నారు. పెసర్లంక సమీపంలోని నక్కపాయ గండికి అడ్డుకట్ట నిర్మించకపోవడంతో సమస్య జటిలమవుతోంది. కృష్ణానది నుంచి బీటే నక్కపాయగండి సహజసిద్ధంగా ఏర్పడింది. కృష్ణానదిలోకి సాధారణ స్థాయిలో వరద నీరు చేరినా నదికన్నా పల్లంగా ఉన్న కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని 15 గ్రామాలు, వీటి పరిధిలోని 5,200 ఎకరాల విస్తీర్ణంలోని పంట పొలాలు, ఇటుక కల్లాలు ముంపునకు గురవుతున్నాయి. పెసర్లంక పరిసర గ్రామాలకు వారు సుమారు 20 ఏళ్ల కిందట ఈ గండికి వరద నీరు ప్రవేశించకుండా రూ.లక్షలు వెచ్చించి అడ్డుగా మట్టితో కట్ట నిర్మించారు. దీంతో 7 లక్షల క్యూసెక్కుల వరదనీటిని కట్ట తట్టుకుని నిలబడినా వరద నీటి ప్రవాహం అంతకు మించితే కట్ట తెగిపోయి ప్రవాహంలో కొట్టుకుపోతుంది. దీని వల్ల గండి అందులు కోతకు గురై ఈ మట్టికట్టలో పంట పంట పొలాలు సైతం నదిలో కలిసిపోతున్నాయి. నాలుగైదేళ్లకోసారి ఈ మట్టికట్ట కొట్టుకు పోవడంతో స్థానికులు తిరిగి తాత్కాలికంగా నిర్మిస్తున్నారు. మట్టి కట్ట నిర్మించక ముందు ఈ గండి వెడల్పు సుమారు పది మీటర్లు కాగా కోతవల్ల వంద మీటర్లకు చేరింది.

నక్కపాయ గండి నుంచి నీటి ప్రవాహం

హామీలకే పరిమితమైన అడ్డుకట్ట నిర్మాణం

గత ఐదేళ్లుగా వరుసగా కృష్ణానదికి వరదలు సంభవిస్తుండటంతో ముంపు తప్పడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం, మంత్రులు, ప్రజాప్రతినిధులు నక్కపాయ గండికి శాశ్వత ప్రాతిపదికన అడ్డుకట్ట నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు నదీపరిరక్షణశాఖ (ఆర్‌సీ) రూ. 8 కోట్లతో అంచనాలు రూపొందించినా అడుగు ముందుకు పడలేదు. గతేడాది కలెక్టర్ ఆదేశాల మేరకు మట్టి కట్ట నిర్మించినా వరద నీరు 11.46 లక్షల క్యూసెక్కులు రావడంతో కొట్టుకు పోయింది. దీంతో రూ.11 కోట్లతో అంచనాలు రూపొందించిన ఆర్‌సీ అధికారులు వరదలు సంభవించక ముందే నెల రోజుల్లో యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పినా పనులు జరగలేదు. పలితంగా ఈ ఏడు సాధారణ స్థాయిలో వరదల సంభవించినా అడ్డుకట్ట నిర్మాణానికి నోచుకోకపోవడంతో ముంపు తప్పలేదు. వరద తగ్గి వారాలు దాటుతున్నా వరద నీరు పూర్తిగా నదిలోకి తిరిగి వెళ్లే అవకాశం లేక ఇప్పటికీ సుమారు 3 వేల ఎకరాల్లోని పంట పొలాలు, ఇటుక బట్టీలు ముంపులోనే ఉండిపోయాయి. దీంతో ఈ నీరు ఆవిరైతే తప్ప ముంపు నుంచి ఇవి బయట పడే అవకాశం లేదు. ఈ విషయమై ఆర్‌సీ జేఈ విజయరాజు మాట్లాడుతూ నక్కపాయ గండి అడ్డుకట్టకు అవసరమైన అంచనాలను గత మే నెలలో ప్రభుత్వానికి సమర్పించాం. అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

తుపానుకు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న వాడరేవు - రామాపురం-కఠారిపాలెం పంచాయతీరాజ్ రహదారి, వంతెనలకు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆయన మంగళవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమంచి మాట్లాడుతూ తుపాను వచ్చి 20 రోజులు అవుతున్నా తాత్కాలిక మరమ్మతులు చేయటంలో జాప్యం తగదన్నారు. రహదారి కోతకు గురై కల్వర్టులు కూలడం వల్ల రామాపురం, వేటపాలెం తీర ప్రాంతంలో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచి మత్స్యకారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. దేశాయిపేట పంచాయతీలోని సిలోన్‌కాలనీలో పేదలకు కేటాయించిన స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు తమదని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చీరాల, వేటపాలెం జడ్పీటీసీ సభ్యులు ఆకురాతి పద్మిని, బండ్ల తిరుమలాదేవి పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల ఆరోగ్యం మెరుగు

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల మానసిక ఆరోగ్యం మెరుగుకు క్రీడా పోటీలు నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తు సమాజ నిర్మాణం తరగతి గదుల్లోనే ప్రారంభం అవుతుందన్నారు. విద్యా సంస్థల్లో 6.7 శాతం విద్యార్థుల బలవన్మరణాల కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. మానసిక వికాస నిపుణులను నియమించి కౌన్సెలింగ్ ఇప్పించాలన్నారు. మానసిక ఆరోగ్యంపై కేంద్రం రూపొందించిన చట్టాలు, పాటించాల్సిన నిబంధనలపై ప్రతి విద్యాసంస్థకు ప్రతులు పంపించాలన్నారు. ఫిర్యాదుల పెట్టె విధిగా ఉంచాలని పేర్కొన్నారు. ప్రతినెలలో రెండు, నాలుగో సోమవారాలు అధికారులు వాటిని తెరిచి చూడాలన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబరు 14416ను ఏర్పాటు చేసిందన్నారు. డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలల నోటీసు బోర్డుల్లో నంబరును ప్రదర్శించాలన్నారు. డిసెంబరులో మెగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించటానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, జిల్లా ఇంటర్ విద్యాధికారి జుబేర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఇసుకరేవులకు పర్యావరణ అనుమతులు తీసుకుంటాం

బాపట్ల, న్యూస్‌టుడే: పర్యావరణ అనుమతులు, వాల్టా చట్టం ఆధారంగా ఇసుక రేవులు అనుమతించాల్సి ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం రేవులో 14,960 హెక్టార్లలో ఇసుక లభ్యత ఉందన్నారు. స్థానికుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఇసుక తవ్వకాలకు అనుమతి లభిస్తుందని, ఓటరు రేవులో ఇసుక తవ్వకాలకు ముందస్తు పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. కొల్లూరు మండలం గాజుల్లంక, చిలుమూరులో మూడు రేవులను గుర్తించామన్నారు. రేవుల్లో 9.8 హెక్టార్లలో ఇసుక లభ్యత ఉందని తెలిపారు. భూగర్భజలాల సమతుల్యత పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇసుక రేవులు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జేసీ భావన, గనుల శాఖ ఏడీ రామచంద్రయ్య, డీటీవో పరంధామరెడ్డి, డీపీవో ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయోటిక్స్ అధిక వినియోగంతో ముప్పు

బాపట్ల, న్యూస్‌టుడే: యాంటీ బయోటిక్స్ అధిక వినియోగం వల్ల ముప్పు ఉంటుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలను కలెక్టరేట్‌లో మంగళవారం ప్రారంభించారు. యాంటీ బయోటిక్స్ అధిక వినియోగ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతానికి ఆదేశం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవాస్ ప్లస్ సర్వేలో పక్కా గృహాలు లేని ప్రజలు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. గృహ నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయాన్ని పొందాలని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిబంధనలతో పూర్తి చేయాలని చెప్పారు. లబ్ధిదారుల చిత్రాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో వంద శాతం స్వచ్ఛత కనిపించాలన్నారు. వెనుకబడి ఉన్న గ్రామ పంచాయతీల పరిధిలోని ఎంపీడీవోలకు షోకాజు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి రోజూ చెత్త సేకరణ జరగాలన్నారు. తాగునీటి సరఫరాలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ జరగాలని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో కుక్కలు, పందుల సమస్య పరిష్కరించాలన్నారు. పీడీ వెంకటేశ్వర్లు, ఎస్ఈ అనంతరాజు, డీపీవో ప్రభాకర్, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయకర్త యశ్వంత్, సీపీవో పాలెంరాజు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ సాయం పంపిణీకి ఏర్పాట్లు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సాయం నిధులు రైతులకు బుధవారం పంపిణీ చేయటానికి ఆర్ఎస్‌కేల వద్ద అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డీఏవో అన్నపూర్ణ, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

బాపట్ల, న్యూస్‌టుడే: అమృతలూరు మండలం మూల్పూరు పంచాయతీ కార్యదర్శి సాంబశివరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు గ్రామస్థుడు మూల్పూరు మాణిక్యరావు ఫిర్యాదు చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ విధి నిర్వహణలో కార్యదర్శి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. రోడ్డు నిర్మాణానికి ఎంపీ కృష్ణప్రసాద్ రూ.15 లక్షలు మంజూరు చేసినా కార్యదర్శి నిర్మాణ పనులు ప్రారంభించటానికి సహకరించటం లేదన్నారు.

13 పాఠశాలలకు రూ.33 లక్షల సామగ్రి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: మంగళగిరి మండలంలోని 13 పాఠశాలలకు టొయోటా కిర్లోస్కర్ మోటార్స్ సంస్థ సీఎస్ఆర్ కింద రూ.33 లక్షల విలువైన సామగ్రిని వితరణగా అందించారు. వాటిని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సంస్థ సమావేశం నిర్వహించారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి పాఠశాలలకు అవసరమైన పర్నిచర్‌తో పాటు క్రీడా, విద్యా సామగ్రి అందించిన టయోటా కిర్లోస్కర్ మోటార్స్ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. సొంతం పవతి గృహాల్లో కనీస మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో డీఈవో సి.వి.రేణుక, సంస్థ ప్రతినిధి బి.నిఖిల్, సీనియర్ మేనేజర్ ఈశ్వరరావు, పృథ్వి టయోటా ఎండీ పృథ్వి మలెంపాటి పాల్గొన్నారు. శారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ప్రతినిధులతో మంగళవారం

వితరణ వివరాలను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎందరున్నారు.. ఏం చేస్తున్నారు?

మత్స్యకారుల స్థితిగతులపై సమగ్ర సర్వే

న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

బాపట్ల జిల్లాలో 74 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. 47 మత్స్యకార గ్రామాలున్నాయి. వీటికి చేపల వేటే జీవనాధారం. మత్స్యకారుల స్థితిగతులు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసేలా సర్వే జరుగుతోంది. మెరైన్ ఫిషరీస్ సెన్సస్-2025 పేరుతో చేపట్టిన సర్వేలో రేపల్లె మండలం నుంచి నిజాంపట్నం వరకు ఉన్న గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల 3న సర్వే ప్రారంభమైంది. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ), ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మత్స్యకారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. మత్స్యకార గ్రామాలపై అవగాహన ఉన్న ఇంటర్ ఉత్తీర్ణులైన స్థానిక యువతతో సర్వేను వినియోగిస్తున్నారు. ఒక్కొక్కరు 500 ఇళ్లకు పైగా వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ఒక్కో కుటుంబం వివరాలు సేకరించినందుకు రూ.50 చొప్పున చెల్లిస్తారు.

కృష్ణానది ఒడ్డున నిలిపిన పడవలు

జిల్లాలో ఇలా..	
మత్స్యకారుల జనాభా:	68 వేలు
మత్స్యకారులు ఉండే మండలాలు:	6 (రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం)
నాటు పడవలు:	250
మోటారు బోట్లు:	2431

ఉయోజనలు... ఆయిదేళ్లకోసారి.. కేంద్ర మత్స్య శాఖ అయిదేళ్లకోసారి మత్స్యకారుల వివరాలు సేకరిస్తోంది. సర్వే ఆధారంగా వారి స్థితిగతులు తెలుసుకుంటోంది. గ్రామంలో మత్స్యకార కుటుంబాలు, అక్షరాస్యత, ఎంత మంది చేపల వేట సాగిస్తున్నారు. వేటపై ఆధారపడినవారు, పడవలు, బోట్లు, వలలు, ఇతర సామగ్రి, ఇతర వృత్తుల్లో ఎందరున్నారనే వివరాలు నమోదు చేస్తున్నారు. ఎంత మందికి సంక్షేమ పథకాలు అందుతున్నాయనే వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే 120 రోజులపాటు జరుగుతుంది. ఈ వివరాల ఆధారంగా మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తారని మత్స్యశాఖ బాపట్ల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గాలిదేముడు తెలిపారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

మాట్లాడుతున్న సీఈవో శేఖర్‌బాబు

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు మంచి పుస్తకాలు కొని చదివితే మనో వికాసానికి దోహదపడుతాయని ఏపీ ఆహార శుద్ధి పరిశ్రమల విభాగ సీఈవో శేఖర్‌బాబు అన్నారు. ఏజీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహిస్తున్న దీక్షారంభ్ కార్యక్రమంలో ఆయన మంగళవారం ప్రసంగించారు. ఏజీ బీఎస్సీతో ఆగిపోకుండా ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులు చేయాలన్నారు. అధ్యాపకులు, ఆచార్యుల చెప్పే అంశాలు శ్రద్ధగా విని విద్యార్థులు కష్టపడి చదివి జ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత సివిల్స్ పరీక్షలు రాసి విజయం సాధించాలని పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

బాపట్ల, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల సమీపంలోని దుకాణాల్లో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గుట్కాలు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలల్లో శక్తి బృందాల ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు.

కొత్తపేటలో సీబీఐ అధికారుల తనిఖీలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని కొత్తపేట ఓంకారేశ్వరాలయం సమీపంలోని చెన్నైకు చెందిన సీబీఐ అధికారులు మంగళవారం తనిఖీలు చేస్తున్నట్లు తెలిసింది. వీరు అబ్బద్ద అను బి.హైమావతి అనే మహిళ ఇంటిలో బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పలు పత్రాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సర్వేను నిరంతరం పర్యవేక్షించాల్సిందే

గుంటూరు: ప్రభుత్వ పథకాలకు సంబంధించి జిల్లాలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి ప్రభుత్వ పథకాల పై అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వెంగళాయపాలెం చెరువు తరహా అభివృద్ధికి ఇతర గ్రామాల్లో అవసరమైన చెరువులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పీఎంఏవై (గ్రామీణ)కు డిమాండ్ సర్వే వేగవంతానికి సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహించాలన్నారు. అర్బన్ హౌసింగ్ లేఅవుట్ల లో మౌలిక సౌకర్యాల కల్పన ప్రతిపాదనలు మున్సిపల్ కమిషనర్లు సోమవారం నాటికి అందించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించి ఆటో డిస్పోజ్ సేవలో, తల్లికి వందనం నగదు జమ పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. సర్వేల్లో నిర్లక్ష్యం వహించే సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేను అధికారులు పర్యవేక్షించాలని, మ్యుటేషన్లను డీజిటల్ అధికారులు పరిశీలించాలని పేర్కొన్నారు. సరిహద్దు వివాదాలు, అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత ఆర్‌వోఆర్ ముసాయిదా మరోసారి తనిఖీ చేయాలని సూచించారు. సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఏపీఏపీఆర్‌లో రైతుల ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ అర్జీల పరిష్కారం ముఖ్యంగా పౌర సరఫరాలకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలను తూచాతప్పకుండా, సర్వేయర్లు కచ్చితంగా పాటించాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

చురుగ్గా క్రీడా మైదానం చదును పనులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వినుకొండ వేదిక కానుంది. ఈ నెల 24, 25 తేదీల్లో 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు ఆయోలా పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం రెండు ట్రాక్టర్లతో క్రీడా మైదానాన్ని చదును చేసే ఆటలకు అనుకూలంగా శుభ్రం చేయించే పనులకు శ్రీకారం చుట్టారు. ఆయోలా పాఠశాలలో ఆటల పోటీల నిర్వహణకు అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. రెండ్రోజుల్లో పనులు పూర్తి చేసి మైదానం సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాదర్ అవినాష్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి యనమదల చిరంజీవిరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కొండలు, మహేష్, ప్రసాద్, రాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/ లైవ్ రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, లెగోర్ ధర - 140, లైవ్ విత్‌స్కిన్ - 203, లైవ్ స్కిన్‌లెస్ - 231.

కృష్ణా జిల్లాలో: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 లెగోర్ ధర 138 లైవ్ విత్ స్కిన్ - 200, లైవ్ స్కిన్‌లెస్ - 228.

ఆమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 లైవ్ విత్ స్కిన్ - 240 లైవ్ స్కిన్‌లెస్ - 250.

నెక్ నూతంచిన కోళ్లురుడు ధర: ఆరోగ్య సేతు విజయవాడ ఎన్ఈసీసీ బోర్డు ధరలు... (కోడి గుడ్డు ధరల వివరాలు)

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నను విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులములు వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT. వృద్ధులకు, పేషెంట్స్ సేవలు, ఇంటిపనులకు, జేబీజేబీకు వర్కర్లకు భాగలకుంట వంపగలను. ✆ 9154085588, 9154935588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000 S.ft. విల్లా అమ్మబడును. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

TO LET

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No: 6-11-39, 1st Floor Backside Office/ Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

గుంటూరు, గుంటూరు వారి తోట 1వ లైన్, డి.నెం: 13-2-17, గ్రౌండ్ ఫ్లోర్, 1500 S.Ft., హిస్పిటల్, ల్యాబ్స్, ఫార్మసీకి అనుకూలం. 97032 22607.

JOBS

Wanted Export Company Staff 1. Accountant, 2. Supervisor (10th Pass), 3. Security Guard. Contact: 73864 82800, 99082 14472.

Sonal Group Wanted for vacancies cotton Industry All Andhra Pradesh District &Villages Repeshed, Experienced in cotton Field, (Position) sampling, Inspection &Testing, volume of vacancies 100no.s & above, Qlf: Inter&above, Experienced/Freshers, Salary 15000/-PM&Petrol, Please Call and collect Address in Guntur, interview on 19-11-25 to 20-11-25& timing 9am to 6pm, Send CV & bio data can send to WhatsApp/Contact: Mr.K.S Rao: 9374731234, Email id: office@sonalgroup.in

DSA ఏజెన్సీ గుంటూరు నందు పనిచేయుటకు టెలి కాలింగ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Ph: 99489 35789, 80081 00872.

గుంటూరు జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వయస్సు 50 సం|| లోపు. ఆకర్షణీయమైన జీతము. 90100 42973, 82478 14976.

కన్సల్టర్ అర్బన్ డెవలప్‌మెంట్ కోసం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. 81251 10304 గుడివాడ, నెల్లూరు, గుంటూరు, కృష్ణ, విజయవాడ, సూళ్లూరుపేట.

గుంటూరులో గల కాలేజ్ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు 35 సంవత్సరాల వయస్సు లేడీ వార్డెన్ మరియు బస్సు డ్రైవర్ కావలెను. ఫోన్ నెంబర్: 81224 61124.

విజన్ ఎలక్ట్రానిక్స్ కావలెను. క్వాలిఫికేషన్ 3 సం|| మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం|| లోపు వయస్సు. kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరులోని ప్రముఖ హాస్పటల్ నందు పని చేయుటకు 1) Pharmacist, 2) Receptionist కావలెను. 85199 39945.

తుళ్ళూరు మం, అనంతవరం గ్రామం లోని 2-3 సం|| అనుభవమున్న క్రషర్ మెయింటెనెన్స్ చేయుటకు సూపర్‌వైజర్ మరియు క్రషర్ ఆపరేటర్ సూపర్‌వైజర్ కావలెను. 80082 95361.

తాడికొండ X రోడ్‌లో క్రొత్తగా ప్రారంభిస్తున్న హోటల్ రూమ్స్ & రెస్టారెంట్ హాల్ నందు సూపర్‌వైజర్స్, లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. Ph: 98492 14413.

స్వయంముఖి పెట్రోలియం (బోయపాలెం) నందు పంపు బాయ్స్ కావలెను. (24x7). Cont: 90001 75999, 90001 02177.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులను సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసే కుంటున్న క్లెయిములకు ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు లేదా వారి సేవల విషయంలో తప్పు చేసినట్లు లేదా ఏదైనా నష్టం వాటిల్లినా దానికి పత్రిక బాధ్యత వహించదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం. పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9FM Vijayawada ఈటీవీ ఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఈ-పోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - ఉ. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

పిచ్చిచెట్లతో తాగునీటి చెరువు

సమ్మెటవారిపలెం (బాపట్లటౌన్), న్యూస్‌టుడే: కర్లపాలెం మండలం సమ్మెటవారి పాలెం తాగునీటి చెరువులో జమ్ము, నాచు, పిచ్చిచెట్లు మొలిచి అధ్వానంగా ఉంది. ఏళ్ల తరబడి జమ్ము తొలగించటం లేదని గ్రామస్థులు తెలిపారు. పంచాయతీ నీరు తాగేందుకు పనికిరావని, నీరు రంగుమారి వస్తోందని వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది చెరువుకు మరమ్మతులు నిర్వహించి ప్రతిరోజూ వేళకు తాగునీరు ఇవ్వాలని కోరుతున్నారు.

అమృతలూరు, న్యూస్‌టుడే: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే వాహనాల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో భరత్‌కుమార్ సూచించారు. మంగళవారం ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. సుఖీభవ, పీఎం కిసాన్ పథకంపై ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశాలను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రసారం చేస్తారని చెప్పారు. వరిలో మానిపండు తెగులు కనిపిస్తే నివారణకు ప్రొపికాజోల్ 200మి.లీ. మందును వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు.

ధాన్యం తరలించే వాహన వివరాలు ఇవ్వండి

రైతులతో మాట్లాడుతున్న ఏవో భరత్‌కుమార్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? మండలంలోని ఖాజీపాలెం శివాలయం వెనుక వీధిలో సీసీ రహదారిపై మురుగు నిలుస్తోంది. -నాగరాజు, ఖాజీపాలెం ✔ పరిశీలించి మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. -శివకుమార్, కార్యదర్శి, ఖాజీపాలెం - పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే

? రేపల్లె మండలం పెనుమూడి ప్రధాన రహదారి పక్కన వీధి దీపాలు వెలగడం లేదు. -వెంకటేశ్వరరావు, స్థానికుడు ✔ వెలగని దీపాలను గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. -అబీద్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి -రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

చేతిపంపులకు మరమ్మతులు

స్పందనకు వందనం

రేపల్లె అర్బన్: రేపల్లె మండలం పెనుమూడి వంతెన వద్ద మూడు చేతిపంపులు పనిచేయడం లేదు. ఈనెల 18న మేమున్నాం..మీకుతోడుగా శీర్షికన సమస్యను ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి అబీద్‌హుస్సేన్ మంగళవారం కార్మికులను పంపి మూడు చేతిపంపులకు మరమ్మతులు చేయించారు.

వీధి దీపాలు కొత్తవి ఏర్పాటు

భట్టిప్రోలు: టీఎంరావు ఉన్నత పాఠశాల సమీపంలో వీధిలైట్లు వెలగడం లేదని సోమవారం మేమున్నాం.. మీకు తోడుగ శీర్షికతో సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. రెండుచోట్ల కొత్త దీపాలు ఏర్పాటు చేశారు.

కాలనీల్లే.. వసతులు లేక తిప్పలే

న్యూస్‌టుడే, ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల (బాపట్ల)

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి మౌలిక వసతుల కల్పనలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అంతర్గత రహదారులు, మురుగుకాలువలు నిర్మించలేదు. అప్పులు చేసి గృహాలు నిర్మించుకుని కాలనీల్లో నివసిస్తున్న వారు వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నీరునిలిచి చిత్తడిగా మారి రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి సత్వరమే రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

❖ పట్టణంలో ప్యాడిసన్‌పేట, బేతనీకాలనీ, మూలపాలెం, మూర్తిరక్షణనగర్ లేఔట్లలో 3500 మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు 2020-21 మధ్య పంపిణీ చేశారు. గృహ నిర్మాణానికి కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే మంజూరు చేశారు. వ్యవసాయ భూముల్లో లేఔట్లు వేసిన గత ప్రభుత్వం మెరకలు వేయకుండానే ప్లాట్లు ఇచ్చింది. పునాది, మెరకలు వేయటానికి ఇచ్చిన సాయం సరిపోలేదు. పేదలు రూ.4 నుంచి 8 లక్షల వరకు అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్నారు. గృహ ప్రవేశాలు చేశారు. వైకాపా పాలకులు మూడు కాలనీల్లో కనీసం ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదు. మురుగుకాలువల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు.

ప్యాడిసన్‌పేట కాలనీలో రోడ్డుపైనే నీరు

❖ కాలనీల్లో మట్టి, ఇసుక రోడ్లు వాన నీటికి బురదగా మారి రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. తాగునీటి సరఫరాకు వెళ్తున్న నీటిట్యాంకర్లు సైతం బోల్తా పడుతున్నాయి. ద్విచక్ర వాహనాల్లో వెళ్లలేని దుస్థితి నెలకొంది. గృహాల్లో వ్యర్థాల సేకరణకు పురపాలక సంఘ పారిశుద్ధ్య వాహనాలు రావటం లేదు. కాలువలు లేకపోవటంతో మురుగంతా ఇళ్ల ముందే నిలుస్తోంది. గృహాల చుట్టూ నీరు నిలిచి అవస్థలు పడుతున్నారు. కనీసం ప్రధాన అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడితేనే రాకపోకల సమస్య కొంతమేరైనా పరిష్కారమవుతుంది. సమస్యను పురపాలక డీఈ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కొత్త కాలనీల్లో అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు చేయగానే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నీరు నిలిచి దుర్వాసన

ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కష్టపడి పక్కా గృహం నిర్మించుకున్నాం. అంతర్గత కాలువలు లేకపోవటంతో మోకాలిలోతు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. రోడ్డు లేదని పురపాలక సంఘం నుంచి వ్యర్థాలు సేకరించే వాహనాలు రావటం లేదు. తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టి మా కష్టాలు తొలగించాలి – పద్మ, బేతనీకాలనీ

కొనలేం.. తినలేం

నగరం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏ కూరగాయ చూసిన అధిక ధర పలుకుతోందని సామాన్యులు వాపోతున్నారు.

నగరం సంతలో కూరగాయల విక్రయం

నగరం ప్రాంతంలో పెద్ద చిక్కుడు రూ.160, చిన్న చిక్కుడు రూ.120, వంకాయ రూ.100కు పైగా పలుకుతోంది. బెండకాయలు రూ.80, మిర్చి రూ.100, దొండకాయలు రూ.100, బీర, బంగాళదుంపలు కిలో రూ.60 వరకు ధర ఉంది. రూ.500 పెట్టినా సంచి నిండటం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బ తినడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పది రోజుల్లో కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉందంటున్నారు.

తాగునీటి వృథా అరికట్టరూ..!

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: పంచాయతీ పరిధిలో అద్దేపల్లి లోని కొంతభాగానికి పోలీసు స్టేషన్ వద్ద ఉన్న మోటారు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఉదయం 7 నుంచి రెండు గంటలపాటు నీరందిస్తే అక్కడి వాసులకు సరిపోతుంది. పంచాయతీ సిబ్బంది అలసత్వంతో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నీరు విడుదల కావడంతో వృథా అవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి నాయక్ మాట్లాడుతూ సంబంధిత సిబ్బందితో మాట్లాడి సమయానుకూలంగా మంచినీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వృథాగా పోతున్న నీటి వద్ద ఇలా..

ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులకు మోక్షం

ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల (బాపట్ల), న్యూస్‌టుడే: పట్టణ శివారున ప్యాడిసన్‌పేట లేఔట్ పరిధిలో పట్టణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులకు మూడేళ్ల తర్వాత మోక్షం లభించింది. 2021లో నాలుగో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారు. రూ.1.20 కోట్ల నిధులు కేటాయించారు. పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టిన గుత్తేదారు 2022లో అసంపూర్తిగా పనులు నిలిపేశాడు. అసంపూర్తి నిర్మాణాన్ని ఈనాడులో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎమ్మెల్యే నరేంద్రవర్మ స్పందించి పనులు తిరిగి ప్రారంభించేలా చొరవ తీసుకున్నారు. ఇటీవల భవన శ్లాబ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. నాలుగు నెలల్లో భవనాన్ని పూర్తి చేసి ప్రారంభించేలా పురపాలక అధికారులు భావిస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్ర భవనం

గోవాడలో కార్తిక పూజలు

అర్ధనారీశ్వరి అలంకరణలో శ్రీబాలకోటేశ్వరుడు

చినపరిమిలో శ్రీరామలింగేశ్వర స్వామి అలంకరణ

గోవాడ (అమృతలూరు), మండూరు, న్యూస్‌టుడే: గోవాడ శైవక్షేత్రంలో కార్తిక పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. బుధవారం ఆలయంలో కోటి కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మండూరు మండలం చినపరిమిలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. అన్నదానం చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కొల్లూరు, భట్టిప్రోలు, అమృతలూరు, నగరం, వేమూరు: వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి రాంబాబు తెలిపారు. భట్టిప్రోలు గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభావంతులకు బహుమతులు అందిస్తామని గ్రంథాలయ శాఖ అధికారి సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఇంటూరు, అమృతలూరు, కూచిపూడి గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సీనియర్లకు 'నేటి సమాజం డిజిటల్ గ్రంథాలయాల పాత్ర', జూనియర్లకు గ్రంథాలయాల ఉపయోగాలపై వ్యాసరచన, సీనియర్లకు 'మీకు ఇష్టమైన పండగ', జూనియర్లకు 'ప్రకృతి' అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నగరం మండలం మంత్రిపాలెం గ్రంథాలయ అధికారి బ్రహ్మేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వారోత్సవాల్లో విద్యార్థులకు వేర్వేరు అంశాల్లో పోటీలు నిర్వహించామని చెప్పారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

కొల్లూరు: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వేమూరు: వ్యాసరచన చిత్రలేఖనం పోటీల్లో..

పిట్టలవానిపాలెం: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మున్నం చిన్నసుబ్బారెడ్డి అన్నారు. పిట్టలవానిపాలెంలో మంగళవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. యువత చరవాణి మోజులోపడి గ్రంథాలయ ప్రాధాన్యం విస్మరిస్తుందన్నారు. విద్యార్థులకు ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

నగరంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డ్వాక్రా మహిళలకు శిక్షణ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు మహిళలు, ఈసీలకు మూడురోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. మూడు బృందాలుగా విభజించి పలుఅంశాలు వివరించారు. ఏపీఎం శివనారాయణ మాట్లాడుతూ ఆదర్శ గ్రామాల్లో సంపద సృష్టించడం, మౌలిక వసతులు వంటి వాటిపై సర్వే ఉంటుందని తెలిపారు. బ్యాంకులు ద్వారా తీసుకొన్న రుణాలు, వాటిని సద్వినియోగం చేసుకొనే తీరును అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీలు నరేంద్ర, హనోక్, రజనికుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి క్రైస్తవ పుస్తక ప్రదర్శన

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: బాపట్లలోని టౌన్‌హాల్ ప్రాంగణంలో ఈనెల 19 నుంచి 25 వరకు ఎల్.ఇ.ఎఫ్. సంస్థ ఆధ్వర్యంలో క్రైస్తవ పుస్తక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. క్రైస్తవ ఆధ్యాత్మిక పుస్తకాలతో పాటు బైబిల్, పాటల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు.

21న ప్రజాసమస్యల పరిష్కార వేదిక

భట్టిప్రోలు: మార్కెట్ యార్డు ఆవరణలో ఈనెల 21న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మండల స్థాయి అధికారులందరు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రయాణికుల గోడు పట్టేదెవరికి!

పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరులో దాత కొమ్మూరి కాశయ్య తన తండ్రి నరసయ్య పేరు మీద పదేళ్ల క్రితం సొంత ఖర్చులతో బస్‌షెల్టరు నిర్మించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం పక్కనే ఉన్న బస్‌షెల్టరును రెండేళ్ల నుంచి పంచాయతీ వారు పట్టించుకోక పోవటంతో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో ప్రయాణికులు బస్‌షెల్టరు అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే సిమెంటు రాళ్లతో బస్‌షెల్టరును మూసేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే బస్‌షెల్టరు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

సిమెంటు రాళ్లతో మూసివేసిన బస్‌షెల్టరు

పాడవుతున్నా.. పట్టించుకోరా!

వేమూరు మండల ప్రజలకు సేవలందించే 104 వాహనం రెండేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. అధికారులు దానిని పట్టించుకోకపోవడంతో స్థానిక సామాజిక వైద్యశాల సమీపంలో రోడ్డు పక్కన ఉంచారు. ప్రస్తుతం వాహనం ఎండకు ఎండుతూ వానకు తడుస్తోంది. ప్రస్తుతం వేరే 104 వాహనం గ్రామాల్లో తిరుగుతోంది. పాడైన వాహనానికి మరమ్మతులు చేయించడం లేదు. – న్యూస్‌టుడే, వేమూరు

నిరుపయోగంగా 104 వాహనం

అధ్వాన రహదారులతో అగచాట్లు

మండల కేంద్రం చెరుకుపల్లి నుంచి తెనాలి వెళ్లేందుకు గోవాడ మీదుగా ఒక దారి, ఇంటూరు నుంచి మరో దారి ఉన్నాయి. వీటిలో గోవాడ మీదుగా వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది చెరుకుపల్లి, పరిసర గ్రామాల వారు ఇంటూరు మీదుగా తెనాలి ప్రయాణిస్తున్నారు. ఈ మార్గం కూడా అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. తురిమెళ్ల సమీపం నుంచి ఊరి చివర వరకు మొత్తం కి.మీ మేరకు రోడ్డు గుంతలు పడి కొన్నిచోట్ల ఎత్తుపల్లాలుగా మారింది. పెదపూడి నుంచి మండూరు వరకు రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, చెరుకుపల్లి గ్రామీణ

ఇంటూరు నుంచి తెనాలి వెళ్లే దారి ఇలా..

రూ.లక్షలు వెచ్చించి.. నిరుపయోగంగా ఉంచి..

మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెంలో వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం నిరుపయోగంగా మారింది. జి.ఎన్. పాలెం దివాన్‌తోట, మన్నెం వారిపాలెం గ్రామాల్లో సుమారు 7వేల మంది నివసిస్తున్నారు. వీరికి అనారోగ్య సమస్యలు తలెత్తితే పిట్టలవానిపాలెం, బాపట్ల ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తే ప్రజలకు వ్యయప్రయాసలు తప్పుతాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించి స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - జి.ఎన్.పాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

జి.ఎన్.పాలెంలోని ఆరోగ్య కేంద్రం

గిరిజన కాలనీల సందర్శన

కావూరు (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: దుర్భర జీవనం సాగిస్తున్న గిరిజనులను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు కొమరగిరి వెంకటప్రసాద్ మంగళవారం కలిశారు. వారుండే కాలనీలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. వారి కష్టాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మేలు చేసేలా కృషి చేస్తానన్నారు. గిరిజన యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చౌటూరి రమేష్, ప్రధాన కార్యదర్శి గందళ్ల నరేష్ తదితరులు ఉన్నారు.

25న దివ్యాంగుల సమావేశం

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: దివ్యాంగుల సమస్యపై ఈనెల 25న బాపట్లలోని ఎన్‌జీవో గృహంలో సమావేశం జరుగుతుందని దివ్యాంగుల నేత గోగన ఆదిశేషు తెలిపారు. మంగళవారం జిల్లెళమూడి గ్రామంలో సమావేశ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం దివ్యాంగుల సమస్యలపై చర్చ జరిగింది.

22న ఉద్యోగ మేళా

బాపట్ల, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్టూరు శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మాధవి తెలిపారు. మేళాలో 900కు పైగా ఖాళీలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కోర్సు చదివిన విద్యార్థులు ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: గ్రామంలో యువత చెడు దారి పట్టకుండా గ్రామస్థులు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విక్రయాలపై నిఘా ఉంచాలని చందోలు ఎస్సై శివకుమార్ అన్నారు. మంగళవారం చందోలులో నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చరవాణిల మూలంగా సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, సైబర్ నేరాలపై అందరూ దృష్టి సారించాలని ప్రజలకు సూచించారు. ఏఎస్సై రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బహుజనుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

బాపట్ల, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్డీవో గ్లోరియా అన్నారు. డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ బడుగులపై అఘాయిత్యాలు, సామాజిక వివక్ష రూపుమాపటానికి అందరూ కృషి చేయాలన్నారు. డీఎస్పీ రామాంజనేయులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

లక్ష్మణానంద సరస్వతి స్ఫూర్తితో ముందుకు నడుద్దాం

కుంచాలవారిపాలెం (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: గిరిజనులు, కొండజాతి ప్రజలకు ధర్మం బోధించి వారిని ఉన్నత స్థితి వైపు నడిపించిన శ్రీలక్ష్మణానంద సరస్వతి స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. లక్ష్మణానంద సరస్వతి బలిదానోత్సవాలు మంగళవారం కుంచాలవారిపాలెం శ్రీరామమందిరం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేతలు మురళీకృష్ణ, జోగేంద్రరెడ్డి, నాగేంద్రరెడ్డి తదితరులున్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు అలవాటైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని సీడీపీవో సుచిత్ర అన్నారు. రేపల్లె ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిషా ముక్త్ భారత్‌లో భాగంగా మత్తు అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి పాటించాల్సిన అంశాలు విశదీకరించి ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ హిమబిందు, ఉపాధ్యాయిని మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని ఈఎస్ వెంకటేశ్వర్లు అన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో నషా విముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులు, ఆచార్యులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మంగళవారం ప్రతిజ్ఞ చేయించారు. విభిన్న ప్రతిభావంతుల విభాగం ఏడీ సువార్త, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, గ్రామీణ సీఐ శ్రీనివాసరావు, కళాశాల డీన్ నిరంజన్ పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవ సందడి

ఇసుకపల్లి (రేపల్లె అర్బన్): రేపల్లె 17వ వార్డులోని శ్రీభ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం లక్ష దీపోత్సవం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించారు. అర్చకులు పవన్‌కుమార్, శివరాంప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెదేపా నేతలు అనగాని శివప్రసాద్, గుర్రం మురహరిరావు, అగస్త్య, ఈవో వెంకట అప్పలాచార్యులు పాల్గొన్నారు.

ఇసుకపల్లిలో లక్ష దీపోత్సవం

ఐక్యతకు ప్రతీక వన సమారాధనలు

అంకమ్మచెట్టు(రేపల్లె అర్బన్): కార్తిక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీక అని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె అంకమ్మచెట్టు సమీపంలోని కోటలో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు కార్తిక వన సమారాధన నిర్వహించారు. తెదేపానేత అనగాని శివప్రసాద్, ఛైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ ఛైర్మన్ విశ్వనాథగుప్తా, కమిషనర్ సాంబశివరావు, తదితరులు హాజరయ్యారు.

విద్యార్థినిపై చేయిచేసుకున్నారని ప్రిన్సిపల్‌పై ఆగ్రహం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినిపై తెలుగు ఉపాధ్యాయుడు చేయిచేసుకున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని తల్లిదండ్రులకు ఎందుకు చెప్పావని విద్యార్థినిని ప్రిన్సిపల్ రాణి బెదిరిస్తున్నారని తండ్రి ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, విద్యార్థిని తండ్రి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. సరిగా చదవకపోవటం వల్లే విద్యార్థినిని ఉపాధ్యాయులు మందలించారని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

కుక్కను ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడి మృతి

కర్లపాలెం: ద్విచక్ర వాహనదారుడు కుక్కను ఢీకొట్టి మృతి చెందిన ఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరం మండలం మీసాలవారిపాలేనికి చెందిన సుబ్బారావు(45) తన భార్య అనారోగ్య సమస్యలతో కర్లపాలెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అయ్యప్ప ఆలయం సమీపంలో జాతీయ రహదారిపై కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీంద్ర తెలిపారు.

బాపట్లను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దిన ముప్పలనేని

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యా కేంద్రంగా బాపట్లను ముప్పలనేని శేషగిరిరావు తీర్చిదిద్దారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు వర్ధంతి సందర్భంగా పడమర బాపట్లలోని స్మృతివనంలో ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, తెదేపా, జనసేన, భాజపా నేతలు పూలమాలలు వేసి మంగళవారం నివాళి అర్పించారు. ముప్పలనేని ఆశయాల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. నేతలు సోమయ్య, భాస్కరరావు, శివ, శ్రీనివాసరావు, సుబ్బారావు, శేష సుమంత్, వాసు తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నేతలు

అవుట్‌డోర్ స్టేడియం నిర్మాణంతో అదనపు వసతులు

న్యూస్‌టుడే, రైలుపేట (బాపట్లటౌన్)

ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కేంద్రమైన బాపట్లలో అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో ప్రభుత్వం 7.55 ఎకరాలు కేటాయించింది. దీని నిర్మాణానికి రెవెన్యూ కార్యాలయం నుంచి త్వరలో అనుమతులు రానున్నాయి. జిల్లాలో ఎక్కడా అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణాలు లేకపోవటంతో క్రీడాకారులకు సరైన వసతులు లేవు. బాపట్ల పరిధిలో అవుట్‌డోర్ స్టేడియం నిర్మాణంతో వందల సంఖ్యలో క్రీడాకారులకు మేలు జరుగుతుంది. ఇందులో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌లను అధునాతనంగా ఏర్పాటు చేయనున్నారు. క్రీడాకారులకు వసతిగృహం అందుబాటులోకి వస్తోంది. ప్రస్తుతం ఇండోర్ స్టేడియాల్లో కొన్ని ఆటలు మాత్రమే క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. బాపట్ల జిల్లాలో కబడ్డీ, వాలీబాల్, బీచ్ వాలీబాల్, ఖోఖో ఆటల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరిచే క్రీడాకారుల సంఖ్య అధికం.

ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో అవుట్‌డోర్ స్టేడియానికి కేటాయించిన స్థలం

జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేస్తాం: బాపట్లలో అవుట్‌డోర్ క్రీడా మైదానం నిర్మాణంతో ఈ ప్రాంత క్రీడాకారులకు మేలు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులకు శిక్షణ ఇస్తాం. ప్రభుత్వం అవుట్‌డోర్ క్రీడా ప్రాంగణ నిర్మాణానికి సానుకూలంగా ఉంది. - ఎస్.శ్రీనివాసరావు, డీఎస్‌డీవో

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? ఇంకొల్లు పశు వైద్యశాల వద్ద నియంత్రిక పక్కన విద్యుత్తు స్తంభాన్ని ఆసరా చేసుకున్న తిప్పతీగ పైగి ఎగబాకి తీగలకు అల్లుకు పోయింది. - **శ్రీనివాసరావు, పశుపోషకుడు, ఇంకొల్లు**

✔ సిబ్బందిని పంపి తీగలపై అల్లుకున్న తిప్ప తీగలను తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **-రామకృష్ణ, ఏఈ ఇంకొల్లు** –న్యూస్‌టుడే, ఇంకొల్లు

నేటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

అద్దంకి, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడు, కలవకూరు, మోదేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఏవో వెంకటకృష్ణ తెలిపారు. గ్రేడ్-ఏ రకం క్వింటాకు రూ. 2,389, గ్రేడ్-బీ రకం రూ. 2,369 అందిస్తున్నారని తెలిపారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

బల్లికురవ, న్యూస్‌టుడే: బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలోని దుకాణాలను ఎస్సై నాగరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో ఉన్న దుకాణాల్లో పొగాకు సంబంధిత ఉత్పత్తులు ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. నిషేధించిన వాటిని దుకాణదారులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సముద్ర స్నానాలకు అనుమతి

చీరాల అర్బన్: కలెక్టరు ఆదేశాల మేరకు చీరాల, వేటపాలెం మండలంలో సముద్ర స్నానాలకు అనుమతి ఇచ్చినట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. జాగ్రత్తగా స్నానాలు చేయాలని భక్తులకు సూచించారు. వాడరేవు, రామాపురం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం ప్రాంతంలో తీరం వెంట ఉన్న రహదారి మొంథా తుపాను ప్రభావంతో గండ్లు పడడంతో ప్రజలు దీన్ని గమనించి తీరానికి చేరుకోవాలని సూచించారు. తుపాను ప్రభావంతో మూడు వారాలుగా సముద్ర స్నానాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే.

విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే సైకిళ్ల పంపిణీ: గొట్టిపాటి

సైకిళ్లు అందుకున్న విద్యార్థులతో మంత్రి గొట్టిపాటి

జె.పంగులూరు, న్యూస్‌టుడే: పాఠశాలలకు రవాణా సౌకర్యం లేదని విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరంలోని శ్రీ పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 110 మంది విద్యార్థులకు మంగళవారం ఆయన ఉచితంగా సైకిళ్లు అందజేశారు. వీటిని ఇటలీకి చెందిన ఐఎస్‌పీ, నెట్ కేఫ్ సమకూర్చగా అస్సిస్ట్ సమన్వయంతో వీటిని సమకుర్చారు. మంత్రి మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,100 సైకిళ్లు పంపిణీ చేశామని తెలిపారు. 10 వేల సైకిళ్లు పంపిణీ చేయడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా బీకేవీ ఎక్స్‌ప్రెస్ హైవే పై ముప్పవరం శ్రీ పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, కోటేలు డొంక నుంచి రైతులు పొలాలకు వెళ్లడానికి అండర్ పాసు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులు సమస్యను మంత్రి గొట్టిపాటికి వివరించారు. తక్షణం స్పందించిన మంత్రి అండర్‌పాస్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్లు విష్ణుప్రియ, జయకృష్ణ హరీష్, రామారావు, పాఠశాల హెచ్ఎం పుచ్చకాయల ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిఘా మసకబారి.. భద్రత కొరవడి

❖ చీరాలలో పలుచోట్ల పనిచేయని సీసీ కెమెరాలు

పట్టణంలో ఏర్పాటు చేసిన మ్యాట్రిక్స్ కెమెరా

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: నేర పరిశోధనకు నిఘా కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటిని పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నిరంతరం వీటిని పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ ఎటువంటి ఘటన జరిగినా నిందితులను గుర్తించేందుకు ఇవి దోహదపడుతున్నాయి. దేవాలయాలు, సొంత భవనాలు ఉన్న యజమానులు చాలా వరకు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే చిన ముంబయిగా పేరుగాంచిన చీరాల వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి. పట్టణ జనాభా దాదాపు లక్ష. నిత్యం ఇతర ప్రాంతాలకు చెందిన సుమారు 30 వేల మంది పట్టణానికి వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఇక్కడ పోలీసులు, దాతల సాయంతో బిగించిన నిఘా కెమెరాలు కేవలం 226 మాత్రమే ఉన్నాయి. వీటిలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు దాదాపు 50 వరకు పనిచేయని స్థితి నెలకొంది. ఇవి కాకుండా అమరావతి కమాండ్ కంట్రోలుకు అనుసంధానం చేస్తూ మొదటి పట్టణ, రెండో పట్టణ పోలీసు స్టేషను పరిధిలో 130 మ్యాట్రిక్స్ కెమెరాలు ఉన్నాయి. ఇవి చాలా వరకు పనిచేస్తున్నాయి. ఎప్పుడైనా సమస్య ఏర్పడితే రాజధాని అమరావతి కమాండ్ కంట్రోల్‌కు సమాచారం ఇస్తే వారు వచ్చి బాగు చేస్తున్నారు. ఇక స్థానికంగా మరమ్మతులకు గురైన వాటిని బాగుచేయడంతో పాటు దాతల సాయంతో మరిన్ని ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వెంటనే బాగు చేయిస్తాం

మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం. దుకాణాల, ఆర్థిక స్థితిమంతులు తమ నివాస గృహాల ముందు ఏర్పాటు చేసుకునే కెమెరాలు వారి ఇంటి వైపునకు కాకుండా రహదారులు కనపడేలా బిగించుకుంటే ఉపయోగంగా ఉంటోంది. ఆ ప్రాంతంలో ఏదైనా నేరం జరిగితే సీసీ కెమెరాలోని ఫుటేజీ ఆధారంగా నేరస్థులను త్వరగా పట్టుకోవడానికి అవకాశం కలుగుతోంది. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు తమ నివాస, వ్యాపార దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు.
– సూరేపల్లి సుబ్బారావు, ఒకటో పట్టణ సీఐ, చీరాల

22న మెగా ఉద్యోగ మేళా

మార్టూరు, న్యూస్‌టుడే : మార్టూరు శ్రీహర్షిణి విద్యాసంస్థల ప్రాంగణంలో ఈనెల 22న శనివారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారిణి మాధవి తెలిపారు. దీనికి వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు హాజరై విద్యార్హత ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, పీజీ అభ్యసించిన నిరుద్యోగ యువతీ యువకులు సంబంధిత పత్రాలతో హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంట నుంచి ప్రారంభవుతుందని వెల్లడించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

పెదగంజాం (చినగంజాం): ప్రభుత్వ రాయితీ పథకాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి అన్నారు. పెదగంజాంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎం ఎఫ్ఎంఈ పథకం కింద డ్వాక్రా మహిళ జొన్నలగడ్డ శ్యామల అనే మహిళకు రాయితీ కింద రూ.1.50 లక్షలతో కారం మిల్లు, పిండి మిల్లులను మంజూరు చేశారు. రెండు మిల్లులను మంగళవారం తెదేపా నాయకుడు సుబ్బారెడ్డి, ఉప్పుగుండూరు యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ శ్యాముల అందజేశారు.

మెరుగైన విద్యాబోధన సాగించండి

మార్టూరు, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన అందించాలని ఎంఈవో వస్రాం నాయక్ కోరారు. మార్టూరు హెచ్ఈ పాఠశాలను మంగళవారం మండల అకడమిక్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సబ్జెక్టు నిపుణులతో విద్యార్థుల సామర్థ్యాలను, దస్త్రాలను పరిశీలించారు.

రైతులకు సూచనలిస్తున్న పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ సీతారామయ్య

సహకార వ్యవస్థ పటిష్ఠతకు కృషి చేయాలి

వెల్లలచెరువు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: సహకార వ్యవస్థ పటిష్ఠతకు రైతులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్య అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలను వెల్లలచెరువు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సహకార వ్యవస్థలో అందుబాటులో ఉన్న పథకాలపై ఛైర్మన్ వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జెల్లకొండ ఏడుకొండలు, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లింపుపై అవగాహన

క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ఇంటి పన్ను చెల్లించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి కోరారు. మండలంలోని ముప్పవరం సచివాలయం వద్ద ఇంటి పన్ను చెల్లింపునకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఎంపీడీవో మంగళవారం విడుదల చేశారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీ సుమంత్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ట్రస్ట్ ధర్మకర్తగా పెదవీరయ్య



తిమ్మసముద్రం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: తిమ్మసముద్రంలోని గోరంట్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ వంశపారంపర్య ధర్మకర్తగా గోరంట్ల పెదవీరయ్య నియమితులయ్యారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో తిమ్మసముద్రంలో ఓరియంటల్ కళాశాల, ఆయుర్వేద వైద్యశాల ఒంగోలులో పలు సంస్థలు నడుస్తున్నాయి. గతంలో వీరయ్య తాత, తండ్రి ధర్మకర్తలుగా వ్యవహరించారు. కొన్నేళ్లు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పాలన సాగింది. ప్రస్తుతం వీరయ్యను ధర్మకర్తగా నియమిస్తూ దేవాదాయ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

పోటీల్లో పాల్గొని.. బహుమతులు గెలుచుకుని

విజేతలకు బహుమతులు అందజేస్తున్న వక్తలు

చక్రాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే : మనిషితో పెన వేసుకున్న వస్తువుల్లో చరవాణి ప్రథమస్థానంలో ఉందని ఎంఈవో కేవీ శ్రీనివాసరావు అన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో చక్రాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల సమన్వయకర్త పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ చరవాణి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విద్యార్థి దశలో దీని అవసరం లేదని, దీన్ని గ్రహించాలని సూచించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎం.సుభాష్, ఎస్.అఖిల్, షేక్ నదియా నిలిచారు అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎంపిక

వేటపాలెం, న్యూస్‌టుడే: మండల టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానికంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాంద్ బాషా, ఉపాధ్యక్షుడిగా నాయుడు సుబ్బారెడ్డి, కార్యదర్శిగా షేక్ మస్తాన్ వలి, సంయుక్త కార్యదర్శి పఠాన్ అజీస్ ఖాన్, కోశాధికారిగా షేక్ ఇలియాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మొంథా దెబ్బ.. వీడని వరద నీరు

మొంథా తుపాను ప్రభావం వల్ల చీరాల రొంపేరు కుడి కాల్వ పరిధిలో నేటికీ వరద నీరు తగ్గ ముఖం పట్టకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. రొంపేరు సమీపంలో లోతట్టు ప్రాంతంలో నిర్మించిన ప్రభుత్వ గృహాల సముదాయం పరిస్థితి ఇలాగే మారింది. నీరు తొలగకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. చీరాల నగర్ 2 లేఔట్ డ్రెయిన్ 2 చెంతనే ఉండటంతో వరద బెడద అధికంగా ఉంది. అధికారులు నీటిని రొంపేరులోకి పంపేందుకు చర్యలు తీసుకున్నా అవి ఫలించడం లేదు. పాత చీరాల వద్ద రెండు గేట్లు ఉండగా.. ఒకటే తెరుచుకోలేదు. రైతులు ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో నీరు నెమ్మదిగా సాగుతోంది. చీరాల నగర్ 1 లేఔట్‌పై కూడా వరద ప్రభావం ఉంది. 300 పైగా గృహాలు పూర్తైనా వసతులు లేక ప్రస్తుతం 11 కుటుంబాలే అక్కడ ఉంటున్నాయి. పల్లంగా ఉన్న రెండో లేఔట్‌ను గతంలో ఇసుకతో మెరక చేసినప్పటికీ వరదనీరు భారీగా చేరడంతో లబ్ధిదారులతో పాటు భవన నిర్మాణ కార్మికులు అటు వైపు వెళ్లడం లేదు. –న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

రోడ్డే డంపింగ్ యార్డ్

ఈపూరుపాలెం గ్రామ పంచాయతీలోని రోడ్డు చెత్త కుప్పలు పేరుకుని అధ్వానంగా ఉన్నాయి. కొంత కాలంగా కార్మికులు వేతనాలు రాని కారణంగా విధులకు గైర్హాజరు కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. 20 వార్డులు, పలు కాలనీలతో కూడిన మేజర్ పంచాయతీపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంది. పారిశుద్ధ్య కార్మికులు 20 మంది కాగా.. ప్రస్తుతం ఏడుగురే వస్తున్నారు. ఉన్న సిబ్బందితో పంచాయతీ అధికారులు తీయిస్తున్నా. .సాయంత్రానికే వీధులు చెత్తతో నిండిపోతున్నాయి. దీంతో దుర్వాసన, దోమలు వ్యాపిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే..వ్యాధులు ప్రబలుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, ఈపూరుపాలెం (చీరాల గ్రామీణం)**

లగేజీ క్యారియర్లు లేని పల్లెవెలుగు బస్సులు

అద్దంకి, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సులకు లగేజీ క్యారియర్లు లేని పల్లెవెలుగు బస్సులు అద్దంకి డిపోలో ఇంకా కనిపిస్తున్నాయి. మొత్తం 64 సర్వీసులు ఉండగా గ్రామీణ ప్రాంతాలకు తిరిగే బస్సులకు మాత్రమే లగేజీ క్యారియర్లు లేకపోవటం విశేషం. పొలాలకు ఎరువులు తరలించేందుకు గతంలో రైతులు ఆర్టీసీ బస్సులు ఉపయోగించేవారు. లగేజీ క్యారియర్‌లు లేని బస్సుల కారణంగా అదనపు రుసుము చెల్లిస్తూ సరకులు, ఎరువులు ఆటోల్లో తరలించాల్సి వస్తుందని వాపోతున్నారు. క్యారియర్ల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

SRI VENKATA GURU SAI EDUCATIONAL AND DEVELOPMENT SOCIETY
(Registration No. 74/2015, Govt. of Andhra Pradesh)
HAI COLLEGE OF EDUCATION (B.Ed.)
Affiliated to: ANDHRA KESARI UNIVERSITY, Govt. of A.P.

PUBLIC NOTICE TO GENERAL PUBLIC

I, B. Srinivasulu, Secretary & Correspondent of **SRI VENKATA GURU SAI EDUCATIONAL AND DEVELOPMENT SOCIETY** (Registry No. 74/2015), hereby inform that HAI College of Education has not conducted or authorized any B.Ed. admissions for the year 2025-2027. Any admissions taken in the name of our college are unauthorized and the management will not be held responsible for any such admissions. **Students may please note this. For clarification, contact 7989779632.**

Place : Addanki B. SRINIVASULU, Secretary & Correspondent
Date : 17-11-2025 Contact Us Cell:7989779632

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ

అద్దంకి, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన పలు కుటుంబాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల వివాహం చేసుకున్న నూతన వధూవరులను అభినందించారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎంజే స్టాలిన్ సతీమణి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, 2వ వార్డుకు చెందిన పాపారావు సతీమణి మృతి చెందారు. ఆ కుటుంబాలను మంత్రి పరామర్శించారు. పట్టణ తెదేపా ఉపాధ్యక్షుడు దొప్పలపూడి వెంకట దుర్గాప్రసాద్ కుమార్తె వివాహం ఈనెల 15వ తేదీన జరిగింది. నూతన వధూవరులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు.

27న రోటరీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు ఈ నెల 27న కొటపాడు జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తామని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల వీరనారాయణ, రాయిని రామారావు తెలిపారు. ఈ పోటీల్లో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

కారంచేడు, న్యూస్‌టుడే : ప్రజలు కుష్ఠు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు ప్రదీప్‌కుమార్ కోరారు. మంగళవారం కారంచేడులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లక్షణాలను వివరించారు.

అవీ ఇవీ

ఉల్లాస్‌ను విజయవంతం చేయండి

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ఉల్లాస్ పథకం ద్వారా వయోజనులకు విద్య అందించి నూరు శాతం అక్షరాస్యత సాధించేందుకు వాలంటీర్లు కృషి చేయాలని వయోజన విద్య పర్యవేక్షకులు కె.మనోరంజన్‌బాబు అన్నారు. పంగులూరులోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ పోస్టర్‌ను అధికారులు మంగళవారం విడుదల చేశారు. సీసీలు, వీవోఏలు, వాలంటీర్లకు ఉల్లాస్‌పై ఏపీఎం సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన మండల స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మండలంలో 2,460 మంది చదువు రాని వారు ఉన్నారని, 246 మంది వాలంటీర్ల ద్వారా వయోజన విద్య నేర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.స్వరూపరాణి, ఎంఈవో వీరాంజనేయులు, సీడీపీవో ఎలిజిబెత్ రాణి పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ ఇస్తున్న వెలుగు శాఖ సిబ్బంది

పేదల ఉన్నతికి ఎంసీఎల్ఎఫ్

కొరిశపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: పేదల ఉన్నతి కోసమే మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెలుగు శాఖ డీపీఎం కె.రవి అన్నారు. కొరిశపాడులోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా వీవోఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని మహిళల జీవనోపాధులు పెంచడమే శిక్షణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మాణిక్యరావు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన

చినగంజాం, న్యూస్‌టుడే: కార్తికమాసంలోని మాసశివరాత్రి సందర్భంగా చినగంజాం గంగా పార్వతీ సమేత చితంబేశ్వరస్వామి ఆలయంలో స్వామికి లక్ష బిల్వార్చన మంగళవారం పూజలు నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేక పూజలు చేశారు. మాజేటి వెంకటసుబ్బారావు, గర్నెపూడి చంద్రశేఖరరావు, వేదాల ఫణి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

విశ్వహిందూ పరిషత్ కార్తిక వనసమారాధన

వేటపాలెం, న్యూస్‌టుడే: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం దత్తక్షేత్రంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పరిషత్ ప్రతినిధులు గొల్లపూడి సీతారాం, ఇరపని సాంబశివరావు, కరణం మురళీకృష్ణ, క్షేత్రం కన్వీనరు కరణం ప్రమీలాదేవి, అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు, నున్నా శివప్రసాద్, శ్రీమన్నారాయణ, దివాకర్ పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి ప్రత్యేక పూజలు

రుద్రాక్షలతో అలంకరించిన ప్రసన్నాంజనేయస్వామి

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద స్వామిని రుద్రాక్షలతో అలంకరించారు. ఉభయ దేవేరులకు ప్రీతిపాత్రమైన కార్తికమాసం చివరి మంగళవారం కావడంతో ఉదయం అభిషేకం నుంచి సాయంత్రం ప్రదోష కాలార్చన వరకు క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. కోటి దీపోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో స్వామిని రుద్రాక్షలతో అలంకరించి పూజలు చేశారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేముల గ్రామానికి చెందిన 'లేడీ టైగర్స్' బృందం కోలాటం ప్రదర్శించారు. సాయంత్రం జరగాల్సిన కోటి దీపోత్సవం కారణంగా పల్లకీసేవ రద్దు చేశారు. పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, ట్రస్టీలు నూతి ప్రసాద్, ధూళిపాళ్ల వెంకటరత్నం, బత్తుల చంద్రశేఖర్, సురేష్, అర్చకులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో కర్పూర హారతి

హారతి ఇస్తున్న భక్తులు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: స్థానిక గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కర్పూర హారతి నిర్వహించారు. ఇంకొల్లు మండల అయ్యప్ప భక్తుల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పూజలు చేసి అనంతరం ఆలయ ప్రధాన ద్వారం వద్ద 4 కిలోల కర్పూరంతో స్వామికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కారంచేడు: పరుగు పందెంలో బాలలు

విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనాలి

చినగంజాం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభా సామర్థ్యాలను పెంపొందించుకొని అభివృద్ధి చెందాలని చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, గ్రంథపాలకుడు మోహనలక్ష్మీ నరసింహాచార్యులు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల అయిదో రోజైన మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం, తెలుగు పద్య పోటీలను నిర్వహించారు.

అద్దంకి: విద్యార్థులకు మాతృభాష ఎంతో అవసరమని హోమియో వైద్యులు డాక్టర్ కావూరి రఘుచంద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా అద్దంకి శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

కారంచేడు, మార్టూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఆటల పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. వైఎన్ హైస్కూలులో వాలీబాల్, పరుగు వంటి వివిధ పోటీలను నిర్వహించారు. మార్టూరు గ్రంథాలయంలో విజ్ఞానం పెంపొందించేందుకు అభ్యసన దోహదపడుతుందని గ్రంథపాలకురాలు శంకుతల చెప్పారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పర్చూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా మెలగాలని, మంచి నడవడికతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర కోరారు. మంగళవారం పర్చూరులోని పాఠశాలలో నిషా ముక్తాభారత్ అభియాన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించి క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

అన్నప్రసాదాల వితరణ

నాగరాజుపల్లి, వలపర్ల(మార్టూరు), న్యూస్‌టుడే : కార్తికమాసం పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణను భారీ ఎత్తున చేపట్టారు. మండలంలోని నాగరాజుపల్లి నాగలింగేశ్వర స్వామి, వలపర్ల రాజమల్లేశ్వర స్వామి ఆలయాల్లో మంగళవారం రాత్రి స్వామివార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహించారు.

లక్ష్మీ నరసింహస్వామి మాస కల్యాణం

అలంకరణలో స్వామి

శింగరకొండ (అద్దంకి): శింగరకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం సందర్భంగా మాస కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఆరుగురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ✦ అద్దంకి పట్టణంలోని ధన్వంతరి దత్తపాదుకాక్షేత్రం, వేయిస్తంభాల గుడి వద్ద మంగళవారం కోటి దీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై దీపాలు వెలిగించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

అద్దంకి, న్యూస్‌టుడే : పట్టణంలోని పోతురాజుగండి వద్ద సోమవారం జరిగిన ప్రమాద ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్సై నాగేశ్వరరావు అందించిన సమాచారం మేరకు.. శంఖవరప్పాడుకు చెందిన పి.నాగేశ్వరరావు తన ద్విచక్ర వాహనంపై పట్టణంలోకి వస్తున్నారు. వెనుకగా వస్తున్న లారీ ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో కిందపడి గాయపడ్డాడు. తొలుత అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

దూషించారంటూ..

అసభ్యపదజాలంతో దూషిస్తూ, చంపేస్తానని తనను బెదిరించారంటూ శ్రీనగర్‌కు చెందిన మహిళ మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శిక్షణ ఎస్సై వెంకటేశ్వరరెడ్డి వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన ఎం.వీరాంజనేయులు, బాధితురాలు సంయుక్తంగా స్థిరాస్తి వ్యాపారం నిర్వహించారు. కొంతకాలంగా తనకు రావాల్సిన బాకీ డబ్బు ఇవ్వాలని, ఇవ్వకపోతే చంపేస్తానంటూ వీరాంజనేయులు బెదిరిస్తూ, దుర్భాషలాడుతున్నాడని బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శిక్షణ ఎస్సై వెల్లడించారు.

(c) eenadu

దివ్యాంగుడు.. గానంలో గంధర్వుడు



ఆయన అంధత్వంతో బాధపడుతున్న దివ్యాంగుడు. అయితేనేం అది తన గాత్రానికి కాదని నిరూపించారు.. చౌడేపల్లెకు చెందిన బ్రహ్మాచారి, చంద్రకళమ్మ దంపతుల కుమారుడు రెడ్డెప్పాచారి పుట్టుకతోనే అంధుడు. తిరుచానూరులోని నవజీవన్ అంధుల పాఠశాలలో చదివారు. గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంలా తానూ రాణించాలి పాటతో అలరించాలనే ఆకాంక్షతో నిత్యం సాధన చేశారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఓ కార్యక్రమంలో మొదటిసారి పాడి తన ప్రతిభ చాటారు. తర్వాత ఈటీవీ పాడుతా తీయగా కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్నారు. తితిదే నుంచి పలు పురస్కారాలు పొందారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సంగీత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే): తిరుమలలో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. మంచు కమ్మేసింది. చలి తీవ్రత పెరిగింది. సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం శ్రీవారిని 71,208 మంది దర్శించుకున్నారు. రూ.3.84 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

16 వేల టోకెన్లు జారీ

తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద మంగళవారం 16 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం వేకువజామున 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం ఉంటుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు ఇచ్చారు.

రైతుకు.. రూ.136.46 కోట్లు

నేడు జమచేయనున్న ప్రభుత్వాలు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు బుధవారం జమకానున్నాయి. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా జిల్లాలోని 1,67,900 మందికి రూ.2 వేల చొప్పున రూ.33.58 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవలో భాగంగా 2,05,753 మంది ఖాతాల్లో రూ.5 వేల చొప్పున రూ.102.88 కోట్లు.. మొత్తం రూ.136.46 కోట్లు జమచేయనున్నాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జేడీఏ మురళీకృష్ణ తెలిపారు.

విశేష విహారి.. వీణాధారి

పెద్దశేష వాహనసేవలో..

హంస వాహనంపై అమ్మవారు

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతి కార్తిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి అమ్మవారు హంస వాహనంపై వీణను ధరించి చదువులతల్లి సరస్వతిదేవిగా భక్తులకు సాక్షాత్కరించారు. జోరువానలోనూ వాహనసేవ కొనసాగింది. ఉదయం ఏడు తలలు కలిగిన పెద్దశేష వాహనంపై పరమపద వైకుంఠనాథుని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు..

బుధవారం ఉదయం 8 గంటలకు ముత్యపు పందిరి వాహనం, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవలు జరుగనున్నాయి.

చలిజ్వరం... చలించని వైద్యగణం

మొక్కుబడిగా మారిన ఆరోగ్య కేంద్రాలు | ప్రజలకు తప్పని ఆర్థిక భారం

చిత్తూరు, తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వరుస తుపాన్లు, వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు.. జలుబు, దగ్గు, జ్వరాలతో వణికిపోతున్నారు. పారిశుద్ధ్య లోపం.. ఇతర కారణాలతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఇంటా కాలానుగుణ జ్వరాలు వెలుగుచూడటంతో.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మలేరియా, డయేరియా, డెంగీ, గన్యా జ్వరాలు గత ఏడాదిలా భయపెట్టకపోయినా.. సాధారణ జ్వరాలు కలవరపెడుతున్నాయి.



15న ఫీవర్ సర్వే ఇలా..

- తిరుపతి జిల్లా వ్యాప్తంగా 732 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు.
- అందులో ఏడుగురికి మాత్రమే వారంలోపు జ్వరం తగ్గింది.
- మిగిలిన అందరూ ఏడు రోజులకు పైగా జ్వరంతో అల్లాడిపోయారు.
- నలుగురిలో టైఫాయిడ్ గుర్తించారు.

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో కేసుల నమోదు

డెంగీ - **210** మలేరియా - **2** డయేరియా - **100**
గన్యా - **35** సాధారణ జ్వరాలు - **4,500**

దోచుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులు

■ ఓపీకి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ■ లక్షణాలు బట్టి చికిత్స చేయకుండా జ్వరం అనగానే అన్నిరకాల వైద్య పరీక్షలు రాస్తున్నారు. ■ జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే రూ.1,500-2000 వరకు ఖర్చవుతోంది.

అరకొర సేవలు

చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రజలు పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లకుండా ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండటం లేదని, 63 రకాల పరీక్షల్లో కొన్నే చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. మందులు ఉన్నాయని చెబుతున్నా రెండుమూడు రకాలు మాత్రమే ఇస్తున్నారు. కొన్నింట్లో కనీసం సెలైన్ పెట్టే పరిస్థితి లేదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

■ జ్వర లక్షణాలు ఉంటే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలి. ■ ఆర్ఎంపీలను ఆశ్రయించి అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ తీసుకోవడంతో ఇతర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ■ అత్యవసరం ఉంటేనే చలి వాతావరణంలో బయట తిరగాలి. ■ కాచి చల్లార్చిన నీటిని, వేడివేడిగా ఆహారం తీసుకోవాలి. ■ దోమకాటుకు గురికాకుండా తెరలు వాడాలి

ఉమ్మడి జిల్లాలో ఆస్పత్రుల వివరాలు

పీహెచ్‌సీలు	106
సీహెచ్‌సీలు	13
యూహెచ్‌సీలు	42
ఏరియా ఆసుపత్రులు	6
గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు	903

ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉన్నాం

వర్షాలు కురుస్తుండటంతో అప్రమత్తంగా ఉన్నాం. జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆసుపత్రులకు వస్తున్న రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి వాటి ఆధారంగా వైద్యసేవలు అందించేలా వైద్యాధికారులకు సూచనలు చేశాం. ప్రజలు సైతం జాగ్రత్తలు పాటించాలి. రోజులతరబడి సొంత వైద్యం, ఆర్ఎంపీలపై ఆధారపడకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలి. **- సుధారాణి, డీఎంహెచ్‌వో, చిత్తూరు**

సక్ష్యం.. సమస్యలే సాక్ష్యం

- పనిచేయని తాగునీటి శుద్ధి యంత్రాలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో కొరవడిన నిర్వహణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులకు రక్షిత జలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నీటి శుద్ధి యంత్రాలు అందించింది. వీటిలో కొన్ని పనిచేయకపోవడంతో ఆయా కేంద్రాల్లో గర్భిణులు, పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,420 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో మొదటిదశలో 814 కేంద్రాలను సక్ష్యం కేంద్రాలుగా ఎంపిక చేసి, వాటిలో మౌలిక వసతులు కల్పించారు. ఇందులో భాగంగా వాటన్నింటికీ నీటిశుద్ధి యంత్రాలు ఇచ్చారు.

- జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు: **2,420**
- సక్ష్యం కేంద్రాలు: **814**, కొత్తగా ప్రతిపాదనలు: **520**
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు: **97,087**
- గర్భిణులు: **11,275**, బాలింతలు: **8,736**

లోటుపాట్లు ఇలా..

- నీటి ట్యాంకులు లేకపోవడం, ఉన్నా పైపులైన్లు సరిగ్గా లేక, నీటి సరఫరా చేయక 250 యంత్రాలకు పైగా పనిచేయడం లేదని గుర్తించారు.
- సరఫరా ఉన్న వాటిలోనూ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఒక్కొక్కటిగా పనిచేయడం మానేస్తున్నాయని, పలు చోట్ల వాటిలో నీటిని నింపి పిల్లలు, గర్భిణులకు ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి.
- ఇప్పుడున్న సక్ష్యం కేంద్రాలను మినహాయిస్తే జిల్లాలో మరో 1,606 కేంద్రాల్లో రక్షిత నీరు పిల్లలు, గర్భిణులకు అందడం లేదు.
- ఉన్నవాటిని సరిచేసి అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మిగిలిన అన్ని కేంద్రాల్లోనూ ఈ యంత్రాలు ఏర్పాటు చేయాలని పిల్లల తల్లిదండ్రులు, కార్యకర్తలు కోరుతున్నారు.
- సక్ష్యం కేంద్రాల్లో కొన్ని పనిచేయడం లేదని తెలిసిందని, కొత్తగా మరో 520 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపినట్లు ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు.

నిర్మాణం చకచకా.. పెంచాలి పర్యవేక్షణ

75% పూర్తయిన శ్రీపాదం, అచ్యుతం సముదాయాలు

తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలోని నూతన సముదాయం

- పనుల ప్రారంభం: మార్చి, 2024
- ఒప్పందం గడువు: ఏప్రిల్, 2026
- మొత్తం నిధులు: రూ.600 కోట్లు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి భక్తుల వసతి కష్టాలు త్వరలో తీరనున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో చేపట్టిన శ్రీపాదం, అచ్యుతం సముదాయాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 75% పనులు పూర్తి కావచ్చాయి. ప్రధాన భవనం, గదుల నిర్మాణం పూర్తికాగా వాటిలోపల అంతర్గత ఏర్పాట్లు, మౌలిక వసతుల ఏర్పాటు వంటి పనులు చేయాల్సి ఉంది. కీలకమైన ఈ దశలో టెండరు నిబంధనలకు అనుగుణంగా పరికరాల కొనుగోళ్లు, బిగింపుపై ప్రస్తుతం తితిదే అధికారులు పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని, లేకుంటే మరమ్మతులకు భవిష్యత్తులో తరచూ తితిదే నిధులు వృథా అయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సదుపాయాలు ఇలా.. ■ ఒక్కో భవనంలో తొమ్మిది అంతస్తులు, గదులు 532 చొప్పున 1,064 గదులు. ■ దాదాపు పదివేల మంది భక్తులకు వసతి. ■ రెండో అంతస్తులో రిసెప్షన్, అన్నదానం, వసతి కేంద్రాలు. ■ మూడు, నాలుగు అంతస్తుల్లో 48 డార్మెటరీలు. ■ దాదాపు 7,000 మందికి సరిపడా లాకర్ల ఏర్పాటు.

ధర పెరిగింది.. పట్టు జారింది

పట్టుదారం

సరకు కొనలేక నేతన్నల అవస్థలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టు ధరలు పెరగడంతో చేనేత కళాకారులకు కష్టాలు మొదలయ్యాయి. మగ్గాలపై ఆధారపడిన కార్మికులు, మాస్టర్ వీవర్లకు సరికొత్త సమస్య ఎదురైంది. మూడునెలల్లో ధరలు రూ.వేలల్లో పెరగడంతో చేనేతలు అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో చేనేత మగ్గాలకు అవసరమైన ముడిసరకు సక్రమంగా ఉత్పత్తి కావడం లేదు. దీంతో అత్యధికంగా చేనేతలున్న వెంకటగిరిలో కళాకారులకు పనులు లేకుండాపోయాయి. గతంలో బెంగళూరు నుంచి పట్టుదారం ఎక్కువ మొత్తంలో వ్యాపారులు దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం కర్ణాటకలో ధరలు పెరిగాయి. చీరలకు వినియోగించే వార్పు ధర ఏకంగా రెండు నెలల్లోనే రూ.2,100 పెరిగింది. పంట ఉత్పత్తి తగ్గడంతో సమస్య ఏర్పడినట్లు చేనేతలు చెబుతున్నారు. ధరలు తగ్గేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేతకు దూరంగా కళాకారులు

- జిల్లాలోని చేనేత కుటుంబాలు **3,320**
- మగ్గం ఉన్న కళాకారులు **4,250**
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి **15,475** మంది

ధరల తేడా (కిలో.. రూ.ల్లో)

సరకు	ప్రస్తుతం	మూడు నెలల క్రితం
పట్టు	8,000	5,600
జరీ మార్కు	800	630
వార్పు	6,500	4,400

చీరకు కావాల్సిన పట్టు: **500** గ్రాములు, అవసరమైన జరీ: **3** మార్కులు

చెరువులకు రూ.6.40 కోట్లు

చిత్తూరు (మిట్టూరు): జిల్లాలో గండ్లుపడిన 226 చెరువుల తాత్కాలిక మరమ్మతులకు రూ.6.40 కోట్లు మంజూరు చేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదం తెలిపినట్లు జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరాజు తెలిపారు.

ఆమెకు అండగా జీఆర్‌సీ

మండల స్థాయిలో నియామకం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్‌సీ) ఏర్పాటు చేయనున్నారు.. తొలి విడతగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద త్వరలో కొన్ని మండలాలు ఎంపిక చేయనున్నారు.

డిగ్రీ చదివిన సభ్యులు.. స్వయం సహాయక మహిళా సంఘాల్లోని సభ్యులే ఈ కేంద్రాల ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేసి జీఆర్‌సీలుగా నియమిస్తారు. వీరికి విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ఏం చేస్తారంటే.. ఈ కేంద్రాలకు వచ్చే మహిళలకు లైంగిక, వరకట్న వేధింపులు, ఇతర సమస్యలపై కౌన్సెలింగ్ ఇస్తారు. అత్యవసర సమయాల్లో ఎవరిని సంప్రదించాలో వారికి సూచిస్తారు.

ఏర్పాటు ఇలా..

ప్రతి సమాఖ్య నుంచి ఇద్దరు చొప్పున సభ్యులను ఎంపిక చేసి గ్రామ కమిటీలు నియమిస్తారు. ఈ కమిటీల ద్వారా ముగ్గురు నుంచి ఐదుగురు సభ్యులతో మండల కమిటీ ఎంపిక చేస్తారు. వీరే జీఆర్‌సీల ప్రతినిధులుగా కొనసాగుతారు. మండల కమిటీ వారానికి ఒకసారి సమావేశమై గ్రామ కమిటీల ద్వారా గుర్తించిన ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తుంది. ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షలు చొప్పున కేటాయిస్తారు.

63 పంచాయతీలు.. 300 చ.కి.మీ.

గ్రేటర్ తిరుపతిలో విలీనానికి ఏకగ్రీవ తీర్మానం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలకు తొలి అడుగు పడింది. ప్రస్తుత ఉన్న 30.17 చ.కి.మీ. పరిధిని 300 చ.కి.మీ.లకు విస్తరించే ప్రతిపాదనకు కౌన్సిల్ ఆమోదం లభించింది. గత నెల 24న తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని 53 పంచాయతీలను విలీనం చేసేందుకు కౌన్సిల్ ఆమోదం పొందిన అధికారులు తాజాగా మంగళవారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించి మరో పది గ్రామ పంచాయతీలను విలీనం చేసేందుకు రూపొందించిన అజెండాను ఆమోదించారు. నగర మేయర్ డా.శిరీష అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ ఎన్.మౌర్య విలీన ప్రతిపాదన చేయగా కార్పొరేటర్ల నుంచి ఏకగ్రీవ ఆమోదం లభించింది.

- ప్రస్తుత నగరపాలక పరిధి: **30.17** చ.కి.మీ.
- జనాభా: **4.52** లక్షలు
- వార్షిక ఆదాయం: రూ.**149** కోట్లు
- విలీన ప్రతిపాదిత పంచాయతీలు: **63**
- పరిధి **300** చ.కి.మీ.
- జనాభా: **3.35** లక్షలు
- వార్షిక ఆదాయం: రూ.**43** కోట్లు

ప్రేమ పదిలం

వృద్ధురాలు కట్టుకున్న సమాధి

భర్త అంటే ఆ వృద్ధురాలికి అమిత ప్రేమ. అందుకే కాబోలు ఆయన చనిపోయిన వెంటనే తానూ మృతి చెందినట్లు భావించి భర్త సమాధి పక్కనే తన సమాధి ఏర్పాటు చేసుకుంది. పులిచెర్ల మండలం కమ్మపల్లె పంచాయతీ దిన్నె ఎస్సీకాలనీకి చెందిన శ్రీపు నారాయణ 1997లో మరణించారు. ఆయన భార్య చెంగమ్మ ఆరోజే తానూ మరణించినట్లు భావించి భర్తతో కలిపి తనకు కర్మక్రియలు నిర్వహించుకున్నారు. కష్టపడి సంపాదించిన నగదుతో ఇల్లు కట్టుకోకుండా భర్తతో కలిపి తనకు సమాధి నిర్మించుకున్నారు. భర్త సమాధి పక్కన ఓ వైపు ఖాళీ స్థలం ఉంచుకుని.. చనిపోయిన తర్వాత అందులో పూడ్చాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. అంతవరకు ఇటుకలతో మూతవేసి ఉంచారు. పదేళ్ల కిందట చెంగమ్మ మృతి చెందారు. ఇప్పటికీ వారి ప్రేమను ఆ గ్రామస్థులు గుర్తుచేసుకుంటారు. **- న్యూస్‌టుడే, కల్లూరు**

(c) eenadu

టైం.. బాలేదు గురూ..!

రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పలమనేరులోని టవర్ క్లాక్ పని చేయడం లేదు. కొన్ని నెలల కిందట గడియారం ఓ వైపున మరమ్మతుకు గురికావడంతో దాన్ని తొలగించారు. ఈ క్రమంలోనే మిగతా దిక్కున ఉన్న గడియారాలు పని చేయడం లేదు. బస్టాండు ప్రధాన ముఖద్వారంలో ఉన్న ఈ టవర్ క్లాక్‌ను మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని వినియోగంలోకి తేవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పలమనేరు

వందేళ్లపైబడి..!

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల అంటే తెలియని వారుండరు. ఎందుకంటే దాదాపు వందేళ్లకు పైబడిన పాఠశాలగా ఎంతో గుర్తింపు చాటుకుంది.



ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత బాలుర పాఠశాల విహంగ వీక్షణం

చరిత్రాత్మకం..

పానగల్ సంస్థానాధీశులైన పానుగంటి బంగారమ్మ, సీతారామానాయనం 1902లో ఇక్కడి స్థలాన్ని పాఠశాలకు వితరణగా ఇవ్వడంతో పాటు పాఠశాలను నిర్మించారు. పట్టణం నడిబొడ్డున సువిశాలమైన స్థలాన్ని పాఠశాలకు వితరణగా ఇవ్వడంతో ఇప్పటికీ ఈ విద్యాలయాన్ని రాజా పానుగంటి బంగారమ్మ సీతారామానాయింగారి(ఆర్‌పీబీఎస్) జడ్పీ ఉన్నత పాఠశాలగా పిలుస్తున్నారు.

చదువులమ్మ ఒడిగా..

ఈ పచ్చదనపు పొదరిళ్ల మధ్య ఏర్పాటైన విద్యాలయం ఎందరికో చదువులమ్మ ఒడిగా మారింది. మాజీ మంత్రి, తెదేపా సీనియర్ నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అద్దూరు బలరామిరెడ్డి, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇక్కడి విద్యార్థులే. అంతేకాకుండా ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో విదేశాల్లో ఉపాధి పొందుతున్నారు.

ప్రగతికి చేయూత

ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ తగ్గుతున్నా.. 123 ఏళ్ల ప్రస్థానం కలిగిన ఇక్కడి విద్యాలయంలో 15 విభాగాలు, 28 మంది ఉపాధ్యాయులు, 780 మంది విద్యార్థులు అభ్యసిస్తుండటం విశేషం. ఇక్కడ చదువుకున్న పలువురు విద్యార్థులు వాళ్ల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల బృందాలు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తూనే ఉన్నారు. దీంతో ఈ పాఠశాల వసతుల పరంగా దినదినప్రవర్ధమానం చెందుతోంది.

నేడు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం

తిరుమల, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని నడకమార్గంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఉదయం 10 గంటలకు ప్రత్యేక అభిషేకం జరుగనుంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

శ్రీవారిని మంగళవారం ఉదయం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, నిర్మాత నాగవంశీ దర్శించుకున్నారు.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు (వ్యవసాయం): అల్పపీడనం ప్రభావంతో సోమవారం రాత్రి జిల్లాలోని 25 మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. నింద్రలో 74.2, కార్వేటినగరం- 55.2, వెదురుకుప్పం- 39.4, నగరి- 39.8, పెనుమూరు- 28.2, ఎస్‌ఆర్‌పురం- 25.2, పూతలపట్టు- 24.2, ఐరాల- 15.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కట్టు.. బొట్టు.. ఆకట్టుకునేట్టు

రష్యాకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వాయులింగేశ్వరుడిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దర్శనార్థం వచ్చిన 45 మంది భక్తులు మంగళవారం మన సంప్రదాయానికి తగ్గట్టు కట్టు బొట్టుతో సందడి చేశారు. తొలుత రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక్కడి శిల్పకళను చూసి ఆనందంతో పాటు ఆశ్చర్యభరితులయ్యారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు కల్పించారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ఆటల్లో ఆణిముత్యాలు..!

● రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి అందరి దృష్టి ఆకర్షిస్తున్నారు. పట్టుదల, ఏకాగ్రతతో సాధన చేసి డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. పుంగనూరు, పెద్దపంజాణి, చౌడేపల్లె మండలాలకు చెందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 బాలబాలికలు పలు విభాగాల్లో సత్తా చాటుతున్నారు.

ఆర్మీలో చేరి సేవలందిస్తా..

మాది చౌడేపల్లె మండలం కాటిపేరి గ్రామం. అమ్మా నాన్న అంజలి, సంజీవయ్య. రెండేళ్లుగా పరుగు పందెంపై దృష్టి సారించి సాధన చేశా. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయి పరుగు పందెంలో గుర్తింపు తెచ్చుకున్నా. ఈ నెల 8న శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయిలో 400, 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచా. ఆర్మీలో చేరి దేశానికి సేవలందిస్తా. - సీడీ.సిద్ధార్థ, 9వ తరగతి, కాటిపేరి జడ్పీ ఉన్నత పాఠశాల, చౌడేపల్లె

జాతీయ స్థాయిలో గుర్తింపే లక్ష్యం..

మాది పెద్దపంజాణి మండలం కత్తార్లపల్లె. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో ఎక్కడా రాజీ పడకుండా ముందుకు సాగుతున్నా. జిల్లాస్థాయిలో 600 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, హైజంప్‌లో ద్వితీయ, డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానంలో నిలిచాను. డివిజన్ స్థాయిలో 2 వ్యక్తిగత ఛాంపియన్‌లు సాధించా. జాతీయస్థాయిలో గుర్తింపే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాను. - కె.చరణ్, 9వ తరగతి, రాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, (పెద్దపంజాణి)

అండర్-14లో ప్రథమం

మాది పెద్దపంజాణి మండల చింతలపల్లె. ఇటీవల జిల్లా స్థాయి డిస్కస్‌త్రో లో ద్వితీయ స్థానం సాధించాను. డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాను. చిత్తూరు, తిరుపతిలో జరిగిన అండర్-14 క్రీడా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటా. రాష్ట్రస్థాయి పోటీల్లో పేరు తీసుకురావడమే ధ్యేయంగా సాధన చేస్తున్నా. - ఆర్.ముఖేష్, 9వ తరగతి, రాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, (పెద్దపంజాణి)

రాష్ట్రస్థాయిలో సత్తా చాటుతా..

ట్రిపుల్ జంప్‌లో మూడేళ్లుగా సాధన చేశా. అమ్మానాన్నలు రత్నమ్మ, కదిరప్ప. వ్యవసాయ కూలీలు. చదువుతో పాటు ఆటల్లో రాణించాలనేది నా లక్ష్యం. ట్రిపుల్ జంప్‌లో పుంగనూరు, అన్నమయ్య జిల్లా మదనపల్లె డివిజన్ స్థాయిలో పతకం సాధించా. అండ్-17 జోనల్ గేమ్స్ తిరుపతి ఎస్వీ క్రీడా మైదానంలో జరిగిన ట్రిపుల్ జంప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి పతకం సాధించాను. ఈ నెల 22న పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతా. - పి.కార్తిక్, 9వ తరగతి, కాటిపేరి జడ్పీ ఉన్నత పాఠశాల, చౌడేపల్లె

దివ్యాంగులు ఎవరికీ తక్కువ కాదు

పిల్లలకు వినికిడి యంత్రాలు ఇస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: దివ్యాంగులు ఎవరికీ తక్కువ కాదని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు జ్యోతి బాపులే భవనంలో దీన్‌దయాళ్ శ్రావణ్ ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్‌పీపీసీడీ, ఎన్‌సీడీ సంయుక్త ఆధ్వర్యంలో వినికిడి లోపం ఉన్న పిల్లలకు పరికరాలు అందజేశారు. మంగళవారం నుంచి ఈనెల 26 వరకు జిల్లా వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతుల కోసం 8 శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారికి అవసరమైన పరికరాల కోసం గుర్తిస్తామన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జీజేఎం సేవా సంస్థ నిర్వాహకుడు జి.చెన్నకేశవులు నాయుడు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా

❖ ప్రభుత్వ భూమిపై వైకాపా నేతల కన్ను

❖ ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ శాఖ

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కబ్జారాయుళ్లు పేట్రేగిపోతున్నారు.. కూటమి ప్రభుత్వ హయాంలోనూ కొందరు వైకాపా నాయకులు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుండటం గమనార్హం.. మండలంలోని కేబీఆర్‌పురంలో కళ్లెదుటే ఈ ఆక్రమణ జరుగుతున్నా పట్టించుకున్న నాథుడే లేడంటే ఆశ్చర్యం కలగక మానదు.

పుత్తూరు మండలం కేబీఆర్‌పురంలో సర్వే నంబరు 60లో మూడెకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని గతంలో జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి కేటాయించారు. ఆ భూమిలో రాళ్లు ఉండటంతో పాఠశాల యాజమాన్యం అలానే వదిలేసింది. ఈ నేపథ్యంలో 2014-19లో తెదేపా హయాంలో ఆ భూమిలో సంపద సృష్టి కేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ భూమి జగనన్న కాలనీకి కేటాయించారు. అక్కడే వెల్‌నెస్ కేంద్రం నిర్మించారు. ఇంకా 50 సెంట్లు ఉంది. పక్కనే ఉన్న రైతు కన్ను ఆ భూమిపై పడింది. మూడు, నాలుగు రోజులుగా భూమిని చదును చేసి తన భూమిలో కలిపేసుకుంటున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికే కొందరు వైకాపా నాయకులు గుంట పోరంబోకును ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారని, దాన్ని రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వదిలేశారని చెబుతున్నారు. తాజాగా రోడ్డు పక్కనే రైతు ముసుగులో మరో వైకాపా నాయకుడు ఈ స్థలాన్ని కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

సర్వే చేసి తొలగిస్తాం..

కేబీఆర్‌పురంలో ప్రభుత్వ భూమి కబ్జా అవుతున్నట్లు ఎలాంటి సమాచారం లేదు. సర్వే చేయించి ఆక్రమించి ఉంటే తొలగిస్తాం. ప్రభుత్వ భూముల్లోకి ఎవరు ప్రవేశించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అందులో ఎలాంటి పక్షపాతం లేదు.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్

సర్వే నంబరు 60లో చదును చేసిన ప్రభుత్వ భూమి

నేటి నుంచి కుప్పంలో నారా భువనేశ్వరి పర్యటన

కుప్పం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ భువనేశ్వరి బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నాలుగు మండలాల పర్యటనలో.. 'హంద్రీ-నీవా' కృష్ణా జలాలకు జలహారతి, విద్యార్థులు, మహిళలతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారు. బుధవారం గుడుపల్లె, గురువారం కుప్పం మున్సిపాలిటీలో పర్యటిస్తారు. శుక్రవారం శాంతిపురం, రామకుప్పం, శనివారం కుప్పం మండలంలో పర్యటించి ప్రజలతో మమేకమవుతారు.

కాణిపాకంలో అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు

కాణిపాకం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక ఆలయం వద్ద ఏసీ, నాన్ ఏసీ కల్యాణ మండపాలు, అతిథిగృహం నిర్మాణాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ.25 కోట్ల తితిదే నిధులు మంజూరు చేస్తూ మంగళవారం జీవో జారీ అయ్యింది. గత నెల 28న జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో కాణిపాకంలో అభివృద్ధి పనులకు తీర్మానిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

పోటు కార్మికుల పోస్టుకు పాచకగా నామకరణం

తిరుమల: శ్రీవారి ఆలయ పోటు సూపర్‌వైజర్లు, కార్మికులకు నూతనంగా నామకరణం చేస్తూ తితిదే బోర్డులో మంగళవారం తీర్మానం చేశారు. పోటు సూపర్‌వైజర్ పోస్టును 'ముఖ్యపాచక', వర్కర్ పోస్టును పాచకగా మారుస్తూ నామకరణం చేశారు.

ఒక్కొక్కరిది.. ఒక్కో బాధ

● చెరువు నీటి నిల్వలపై ఫిర్యాదులు

చెరువు కలుజు వద్ద మ్యాపు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పుత్తూరు, వడమాలపేట, న్యూస్‌టుడే: వడమాలపేట మండలంలోని గూళూరు చెరువులో నీటి మట్టం తగ్గించి న్యాయం చేయాలని, పంటలు పండించుకోలేకపోతున్నామని ఎస్‌బీఆర్‌పురం రైతులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ వద్ద ఆవేదన చెందారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో మంగళవారం చెరువు కలుజు, ఎస్‌బీఆర్‌పురం గ్రామాన్ని సందర్శించారు. కానీ తూము తీసి నీరు విడుదల చేస్తే తాము ఒప్పుకోమని ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు చెంగల్రాయుడు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, రైతులు పేర్కొన్నారు. చెరువు నీటితో 20 గ్రామాల్లో పంటలు పండుతున్నాయన్నారు. అనంతరం కలెక్టర్, ఈఈ వెంకటేశ్వరప్రసాద్ ఎస్‌బీఆర్‌పురం వెళ్లి గ్రామస్థులతో మాట్లాడారు. తూము పూడికతో వర్షం నీరు నిల్వ చేరి 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్థులు చెప్పారు. ఐదు నెలల్లో నీటి మట్టం తగ్గిన తర్వాత చర్యలు చేపడతామని కలెక్టర్ వారికి చెప్పారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, డీఈఈ శ్రీనివాసులు, ఏఈలు పరశురాంనాయక్, మురళి, ఆర్‌ఐ జానీ బాషా, శేషాద్రి, రైతులు ఉన్నారు.

రెండింతల ఆనందం

● అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ సాయం

పుంగనూరు, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు ఆర్థికంగా అక్కరకొచ్చేలా కూటమి ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో బుధవారం నగదు జమ చేస్తోంది. అన్నదాత సుఖీభవ-కిసాన్ పథకం ఒకేసారి అమలు చేయడంతో ఒక్కో రైతన్న ఖాతాలో రూ.7వేలు జమ కానుండటంతో రైతన్నలు హర్షిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీ మేరకు ఏటా ఒక్కో రైతుకు రూ.20వేలు ఈ పథకాల ద్వారా అందిస్తూ హామీ అమలు చేస్తోంది.

ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏడాదికి రూ.14వేలు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా అందిస్తామని దానికి అన్నదాత సుఖీభవ పథకంగా నామకరణం చేశారు. దీంతో కేంద్రం పీఎం కిసాన్‌తో కలిపి ఏడాదికి రైతులకు మూడు విడతలుగా రూ.20 వేలు చేతికి అందనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రెండో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాలకు చేరనున్నాయి. జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం, పూతలపట్టు, చిత్తూరు, నగరి, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లోని 2,05,753 మంది రైతులకు రూ.136.46 కోట్లు మంజూరు చేశారు.

జిల్లాలోని అర్హులు, జమకానున్న నగదు (రూ.కోట్లలో)..

నియోజకవర్గం	రైతులు	రూ.కోట్లలో
చిత్తూరు	11,321	7.46
పూతలపట్టు	33,881	22.66
పలమనేరు	38,368	25.55
కుప్పం	36,473	23.46
పుంగనూరు	37,191	24.96
నగరి	12,472	8.32
జీడీనెల్లూరు	36,047	24.05

ఆలయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ మునిరత్నం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం గ్రామదేవత శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఆలయంలో నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ బీఎంకే రవిచంద్రబాబు, పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా ఛైర్మన్ డా.సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్, పుర ఛైర్మన్ సెల్వరాజ్ పాల్గొన్నారు.

తప్పుడు సాక్ష్యం చెప్పిన 14 మందికి నోటీసులు

చిత్తూరు (న్యాయవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరు నగర మేయరు దంపతులు కఠారి అనురాధ, మోహన్ హత్య కేసు విచారణ సమయంలో 14 మంది న్యాయస్థానంలో తప్పుడు సాక్ష్యం ఇచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి వీరందరినీ ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఒకటో పట్టణ సీఐను అదేరోజు ఆదేశించారు. కోర్టు ఆదేశాలతో 12 మంది నగరపాలక సంస్థ ఉద్యోగులు సీహెచ్.సురేష్‌కుమార్, జి.మల్లికార్జున, ఆర్.బాలకృష్ణ, ఆర్.పరంధామచెట్టి, డి.ఆదాము, ఆర్.ఆనందనాయుడు, ఎస్.మునిరత్నం, డి.ముద్దుకృష్ణయాదవ్, ఎస్.దొరైరాజ్, ఎంకే త్యాగరాజన్, జి.గోపినాథ్, పి.ధనంజయ, కఠారి అనుచరులు కె.కిరణ్‌కుమార్, జీకే వాసుబాబుకు ఒకటో పట్టణ పోలీసులు నోటీసులు జారీ చేశారు. డిసెంబరు 1న కోర్టు ఎదుట హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు కార్యాచరణ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: డ్రగ్స్ నియంత్రణకు 120 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఎస్పీ తుషార్ డూడితో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తుషార్ డూడి సూచించారు.

● ఎన్టీఆర్ వైద్య సేవల కింద నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోగుల నుంచి నగదు వసూలు చేసినా, ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులపై వచ్చిన 31 ఫిర్యాదులపై జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశంలో సమీక్షించారు.

మిద్దెపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

పుంగనూరు గ్రామీణ: మిద్దెపై నుంచి వ్యక్తి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి పట్టణంలోని చింతలవీధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు. . చింతలవీధికి చెందిన కె.నాగరాజు(60) తాపీ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మిద్దెపై ఆరేసిన దుస్తులు తీసుకొచ్చేందుకు వెళ్లి కిందికి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు.

కల్తీ అని తెలిసినా.. ఎందుకు అనుమతించారు?

రెండో రోజూ చిన్న అప్పన్నకు సిట్ ప్రశ్నలు

ఈనాడు - తిరుపతి, తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ వ్యక్తిగత కార్యదర్శి చిన్న అప్పన్నను సిట్ అధికారులు రెండోరోజూ ప్రశ్నించారు. తిరుపతి తూర్పు పీఎస్ కస్టడీలో ఉన్న చిన్న అప్పన్నను భూదేవి కాంప్లెక్స్‌లోని సిట్ కార్యాలయానికి తీసుకొచ్చి రెండోరోజు మంగళవారం విచారించారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థతో ఆయనకున్న పరిచయాలు, రూ.50 లక్షల లంచంపై లోతైన సమాచారం రాబట్టేలా ప్రశ్నలు సంధించారు. 'మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్‌లో చేసిన పరీక్షల్లో కల్తీ నెయ్యిగా నిర్ధారణ అయినప్పటికీ.. మీ ఒత్తిడివల్లే ట్యాంకర్లలో కల్తీనెయ్యి తిరుమలకు వచ్చినట్లు విచారణలో తేలింది. అందులో తితిదే పెద్దలు, అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా?' అని ప్రశ్నించగా మౌనం వహించారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ నుంచి ఇంకెప్పుడైనా లంచాలు ముట్టాయా? మరేదైనా సంస్థతో సంప్రదింపులు జరిపారా? అని ఆరాతీయగా లేదని బదులిచ్చారు. విచారణ అనంతరం చిన్న అప్పన్నను తిరుపతి తూర్పు పీఎస్‌కు తరలించారు.

వైవీ విచారణకు బృందం

తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కల్తీనెయ్యి కేసులో విచారించేందుకు సిట్ బుధవారం హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు సమాచారం. గురువారం ఆయన్ను విచారించే అవకాశం ఉంది. చిన్న అప్పన్న ఇచ్చిన సమాధానాలు ఆధారంగా వైవీ సుబ్బారెడ్డికి ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. వైవీ సుబ్బారెడ్డికి కల్తీ నెయ్యి గురించి తెలిసినా తిరుమలకు అనుమతించినట్లు సిట్ అధికారుల విచారణలో తేలింది. భోలేబాబా డెయిరీ ఒప్పందం 2022 అక్టోబరు వరకు, ప్రీమియర్ అగ్రిఫుడ్స్, శ్రీవైష్ణవీ డెయిరీలకు 2024 వరకు ఆయన హయాంలోనే గడువు పొడిగించారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ నుంచి చిన్న అప్పన్న రెండు విడతల్లో రూ.50 లక్షలు తీసుకున్నారని నిర్ధారణ కాగా.. అదే సమయంలో వైవీ సుబ్బారెడ్డి దంపతులకు సంబంధించిన లావాదేవీల వివరాలు ఇవ్వాలని యాక్సిస్ బ్యాంకు అధికారులను అడిగారు. ఈ సమాచారం తెలిస్తేనే కేసు దర్యాప్తు కొలిక్కి వస్తుందని హైకోర్టులో ఇటీవల జరిగిన వాదనల సందర్భంగా నివేదించారు. ఈ కేసులో ఆయన పాత్ర అనుమానాస్పదంగా ఉందని సిట్ తరఫున వాదనలు వినిపించారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో రాయిపడి..

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

గాయపడిన లోకేశ్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల ఘాట్‌రోడ్డులో రాయిపడి ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. తిరుమలలోని తితిదే లగేజీ కౌంటర్‌లో పనిచేసే లోకేశ్ మంగళవారం ద్విచక్ర వాహనంపై తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరాడు. రెండో ఘాట్‌రోడ్డులోని హరిణి వద్దకు చేరుకోగానే కొండ మీద నుంచి చిన్న రాయి జారి అతనిపై పడింది. రక్తం కారుతున్నా అలాగే కొద్దిదూరం ప్రయాణించి స్పృహతప్పి రోడ్డుపై పడిపోయాడు. గుర్తించిన వాహనదారులు ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. వారు అంబులెన్స్‌లో తితిదే అశ్విని ఆసుపత్రికి అక్కడి నుంచి తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. ● రెండో ఘాట్‌రోడ్డు ఆరో కి.మీ వద్ద ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం నుంచి భక్తులు సురక్షితంగా బయటపడ్డారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda చిత్తూరు శాఖ

3-32/4, లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఎదురుగా, సి.బి. రోడ్డు, చిత్తూరు - 517002

సంక్షిప్త పద్ధతిన వాహనం ఇ-వేలం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు/ హామీదారులకు తెలియజేయునది ఏమనగా పార్టీలు అమలు చేసిన తనఖా / ఋణ ఒప్పందం కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, క్రింద పేర్కొన్న తనఖాలో ఉన్న మోటారు వాహనాన్ని బ్యాంక్ తిరిగి స్వాధీనం చేసుకున్న / జప్తు చేయబడిన మరియు క్రింద పేర్కొన్న ఖాతా/ఖాతాలలో బకాయిలను వసూలు చేయడానికి వాహనం "ఎక్కడ ఉందో అలాగే", "ఎక్కడ ఉందో అలాగే" మరియు "ఏది ఉందో అలాగే" ప్రాతిపదికన విక్రయించబడునని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/లు/హామీదారు	1. శ్రీ సురేష్ ముండ్లపాటి, తండ్రి: యం. చెంగళరాయులు, 22-55, వేణుగోపాలపురం, వెదురుకుప్పం, చిత్తూరు-517569. 2. శ్రీమతి పోతల అనంతలక్ష్మి, భర్త: పి.సుబ్రమణ్యం, డి.నెం.18-55-161, సప్తగిరి నగర్, 18వ వార్డు, తిరుపతి - 517501 (హామీదారు)
మొత్తం బకాయిలు	రూ.12,37,947.65/-
వాహనం వివరాలు	REGD NO. AP39RT1116 MOTOR CAR MARUTI PVT LTD G VITARA SMART HYBRID ALPHA TYPE OF BODY: SRIGID (PASSENGER CAR) COLOUR: PRME SPLENDID SILVER CHASSIS NO.: MBJTYKL1SNJ101740 ENGINE NO.: K15CN7021083
ఇ-వేలం తేది ఇ-వేలం సమయం బిడ్ సమర్పించుటకు చివరి తేది & సమయం	తేది:22-12-2025, ఉదయం గం.11.00 నుండి సాయంత్రం గం.04.00 వరకు 21-12-2025 సాయంత్రం 04:00 వరకు
రిజర్వు ధర : ధరావతు (ఇఎమ్‌డి) : బిడ్ పెంపుదల మొత్తం :	రూ.11,90,000/- రూ.1,19,000/- రూ.10,000/-
బయానా (ఇఎమ్‌డి) డిపాజిట్ చేయవలసిన ఖాతా నెం. : బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ :	3232001581869 IFSC Code: BARB0CHITAP బ్యాంక్ ఆఫ్ బరోడా, చిత్తూరు శాఖ
వాహనం / చరాస్తి తనిఖీ తేది & సమయం	తేది.19-11-2025 నుండి తేది.21-12-2025 ఉదయం గం.10.30 ని.ల నుండి సాయంత్రం గం.05.00 గం.ల వరకు
వాహనం / చరాస్తి పార్కింగ్ స్థలం:	పార్క్ చేయబడిన పార్కింగ్ యార్డ్: బ్రైట్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్, ప్లాట్ నెం.480, రోడ్ నెం.5ఏ, గోపాల్ నగర్, కూకట్ పల్లి, హైదరాబాద్-500072, ఫోన్: 9989894455.

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి వెబ్‌సైట్ లింక్ https://baanknet.com నందు సందర్శించగలరు. ఆసక్తి గల బిడ్డర్లు బ్రాంచ్ మేనేజర్ గారిని ఫోన్: 08572222900 & మొబైల్ నెం.9154285298 నందు సంప్రదించవచ్చును.

తేది: 18-11-2025 ప్రదేశం: చిత్తూరు

సం/- అధీకృత అధికారి బ్యాంక్ ఆఫ్ బరోడా

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

క్యాష్ బ్యాక్ వెంచర్ 25 అం||లు స్పాట్ రిజిస్ట్రేషన్ చేస్తున్నవారికి బంపర్ ఆఫర్ (కొన్ని ప్లాట్లు మాత్రమే కలవు). Ph: 80086 15946

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

Gkey IT సొల్యూషన్ PVT Ltdలో పనిచేయుటకు Tele callers: 2No's కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీ బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్. లీలామహల్ సర్కిల్, తిరుపతి ✆ 99638 30776

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

మామిడి బకాయిలపై స్పష్టత ఇవ్వాలి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: తోతాపురి మామిడి బకాయిల చెల్లింపులపై జిల్లా అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని మామిడి రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునీశ్వర్‌రెడ్డి, బి.మురళి కోరారు. కిలోకు రూ.4 చెల్లించాలని ప్రభుత్వం చర్యలు జరపడం శుభపరిణామన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్తు అదాలత్

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ఐరాల మండలం పైపల్లెలో బుధవారం ప్రత్యేక విద్యుత్తు అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు టౌన్, బంగారుపాళ్యం, రెడ్డిగుంట, పైపల్లె వినియోగదారులు మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు సమస్యలు తెలియజేయాలన్నారు. విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి పాల్గొంటారన్నారు.

చిన్న పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

పూతలపట్టు: చిన్నతరహా పరిశ్రమలతో ప్రాంతీయ అసమానతలు తొలగుతాయని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. పూతలపట్టులో ఏర్పాటు చేసిన ఆర్‌వీ పరిశ్రమను మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత పరిశ్రమలను స్థాపించి ఆర్థికంగా ఎదగాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమ అధినేత ముత్తు, బాజపా మండలాధ్యక్షుడు ప్రసాద్, కూటమి నాయకులు మురళి, పూర్ణ, సుబ్బరాజు, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమను ప్రారంభిస్తున్న ఎంపీ ప్రసాదరావు

ప్రతిభకు పట్టం

పోటీ పరీక్షలతో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని లిటిల్‌రోజ్ పాఠశాల డైరెక్టర్ లోహిత్‌కుమార్ పేర్కొన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని లిటిల్‌రోజ్ పాఠశాలలో మంగళవారం 'విద్యార్థుల జీవితాల్లో చరవాణి ప్రభావం' అంశంపై ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ఉన్నాసాలు చేశారు. ఎస్. జాహ్నవి, సి.లతిశ్రీ, కె.ప్రసన్నలక్ష్మి విజేతలుగా నిలవగా డైరెక్టర్, హెచ్‌ఎం దుర్గశ్రీ, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ● నగరంలోని సంసిద్ధ క్యాంఫర్డ్ పాఠశాలలో జరిగిన పోటీల్లో కె.డింపుల్ రాయల్, ఎం.ఫాతిమా నౌషీబా, ఎస్ఎం.రోషన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. హెచ్‌ఎం అరుణకుమార్ బహుమతులు అందజేసి అభినందించారు. – న్యూస్‌టుడే, చిత్తూరు విద్య

లిటిల్‌రోజ్ పాఠశాల డైరెక్టర్ లోహిత్‌కుమార్, హెచ్‌ఎం దుర్గశ్రీతో విద్యార్థులు

సంసిద్ధ పాఠశాలలో బహుమతులు ఇస్తున్న హెచ్‌ఎం అరుణ్‌కుమార్

ఎదురుచూపులకు.. 17 ఏళ్లు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరగడంతో గొల్లపల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. పరిసర గ్రామాల రోగులకు అటు మళ్లించేందుకు 2009లో పీహెచ్‌సీ మంజూరు చేశారు. నిర్మాణం పూర్తయ్యే వరకు గొల్లపల్లిలోని ఓ అద్దె భవనంలో హడావుడిగా సేవలు ప్రారంభించారు. కానీ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో 12 ఏళ్లుగా అద్దె భవనంలోనే సేవలు అందించారు.

రూ.18 లక్షలతో చేపట్టినా..

2021లో అద్దె భవనం పైకప్పు ఊడి పడటంతో తాత్కాలికంగా సచివాలయంలోకి మార్చారు. పీహెచ్‌సీ నిర్మాణానికి దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు పదేళ్ల క్రితమే రూ.53 లక్షలు మంజూరు చేయించారు. అవసరమైన స్థలాన్ని మాజీ ఎంపీపీ మాధవయ్య కొనుగోలు చేసి ఇచ్చారు. 2018లో మాజీ ఎమ్మెల్యే సరస్వతమ్మ భూమిపూజ చేశారు. టెండర్లు నిర్వహించి రూ.18 లక్షలతో ప్రహరీ, పునాదులు నిర్మించారు. కానీ గుత్తేదారుకు బిల్లులు రాకపోవడం, వైకాపా వర్గాల పనులు దక్కించుకున్న గుత్తేదారు చేయకపోవడంతో సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

తప్పిన పెను ప్రమాదం..

గతంలో అద్దె భవనంలో పీహెచ్‌సీ సేవలు అందించగా.. పైకప్పు కూలిపోయింది. ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అప్పటి డీఎంహెచ్‌వో శ్రీహరి భవనాన్ని పరిశీలించి సచివాలయంలోకి మార్చేలా ఆదేశాలిచ్చారు. పీహెచ్‌సీ నిర్మాణం చేపడతామన్నారు. మూడేళ్లు అవుతున్నా పనులు ముందుకు సాగలేదు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ విషయం తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. కానీ అధికారులు నివేదికలు సిద్ధం చేయకపోవడంతో సమస్య ఏర్పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రహరీకే పరిమితమైన నిర్మాణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

? గుడిపాల మండలంలోని కనకనేరి కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- సుందరేష్** ● వీధి దీపాలు బాగు చేస్తాం. **- శిరీష, ఎంపీడీవో – గుడిపాల**

? కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బోరు పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. **- సురేష్** ● పరిసరాలు శుభ్రం చేస్తాం. **- ధనంజయవర్మ, సర్పంచి** – న్యూస్‌టుడే, కార్వేటినగరం

? తిరుమలకొండయ్యగారి పల్లెలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. **- స్థానికులు** ● త్వరలో సమస్య పరిష్కరిస్తాం. **- జరీనాతాజ్, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, పూతలపట్టు

వీధి దీపాల ఏర్పాటుకు విన్నపం

పుత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని తడుకు నుంచి శిరుగురాజుపాళెం వరకు రింగు రోడ్డు నిర్మించి, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయలేదని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య వినతిపత్రం అందజేశారు. 5 కిలోమీటర్ల మేర దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. **నేడు పర్యటన.. విజయపురం:** కోసలనగరంలో బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పర్యటిస్తారని తహసీల్దారు కిరణ్ తెలిపారు. ఏపీఐఐసీ అధికారులు, రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుదన్నారు. మండలంలో రూ.67 లక్షల విలువైన 9 సిమెంటు రోడ్ల నిర్మాణాలను ప్రారంభిస్తారని చెప్పారు.

ఎంపీ మాధవరావుకు జ్ఞాపిక ఇస్తున్న ఏఈవో

గణనాథుడి సేవలో రాజ్యసభ సభ్యుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని మహారాష్ట్రకు చెందిన రాజ్యసభ సభ్యుడు అజీత్ మాధవరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శనానంతరం శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

సీఎంకండ్రిగలో వైద్య శిబిరం

పాలసముద్రం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అందజేస్తున్న 104 వాహనాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండలాధ్యక్షుడు టి.శివయ్య సూచించారు. సీఎంకండ్రిగలో వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పుత్తూరు, న్యూస్‌టుడే: వార్డు సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని పుత్తూరు పుర కమిషనర్ నాగేశ్వరరావు సూచించారు. పుర పరిధిలోని ఆర్టీసీ కాలనీ, కల్యాణపురం, ఆరేటమ్మ కాలనీ సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. ప్రజలకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 'వృత్తే దైవం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని లాస్య రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించినట్లు సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదనం తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్వీఆర్ఎస్ఎస్ శర్మ అన్నారు. పుత్తూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అధికారిణి మీనాకుమారి, హెచ్‌ఎం భువనేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామాల్లో వ్యాధులపై అవగాహన

తవణంపల్లె, న్యూస్‌టుడే: అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో వెంగంపల్లెలో జాతీయ సేవా పథకం కింద వారం రోజులు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి తెలిపారు. మంగళవారం శిబిరం ప్రారంభించారు. గుండెపోటు వస్తే ప్రాణాలు కాపాడేందుకు చేపట్టే సీపీఆర్ గురించి వివరించారు. ప్రోగ్రాం అధికారిణి శోభారాణి పాల్గొన్నారు.

తవణంపల్లె, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆదేశించారు. తవణంపల్లె, కె.పట్నం సచివాలయాలను మంగళవారం పరిశీలించారు. సిబ్బంది హాజరు, పనితీరు, పరిసరాల శుభ్రత, ప్రజా సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలన్నారు. మత్యం గ్రామంలోని అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, తెదేపా మండలాధ్యక్షుడు

సచివాలయ సేవలపై అసంతృప్తి

దస్త్రాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వెంకటేశ్వరచౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రవీణ్, అధికారులు, తెదేపా నాయకులు ఉన్నారు.

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: రైతులకు పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు సహకార సంఘాలు పని చేస్తున్నాయని పీఏసీఎస్ అధ్యక్షుడు మోహన్‌నాయుడు అన్నారు. మంగళవారం సహకార వారోత్సవాల సందర్భంగా రైతులు, డైరెక్టర్లతో కలిసి పతాకం ఆవిష్కరించారు. వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువ వడ్డీతో చిన్న, సన్నకారు రైతులకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకొని సకాలంలో

రైతులకు అండగా సహకార సంఘాలు

జెండా వందనం చేస్తున్న మోహన్‌నాయుడు, రైతులు

చెల్లించాలన్నారు. సహకార విద్యాధికారి సుధాకర్, సీఈవో విజయ్‌కుమార్‌రెడ్డి, మేనేజరు గోమతి, పర్యవేక్షకులు, డైరెక్టర్లు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మాయిపల్లెకు చెందిన కిడ్నీ బాధితుడు దేవరాజులు, ఏడాది క్రితం గాయాలపాలై మంచానికే పరిమితమైన అండారెడ్డి పల్లెకు చెందిన లోకేశ్‌కు రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం ఇస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టరు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి యుగంధర్ చెప్పారు. బుధవారం వారు కలెక్టర్‌ను కలిసి బాధిత కుటుంబాల దీనస్థితి గురించి వివరించారు. జనసేన నాయకులు దేవరాజులుకు రూ.14 వేలు, లోకేశ్‌కు రూ.5 వేలు వారు ఇచ్చారు. శాంతమూర్తి, మహేశ్, పవన్‌కుమార్, కిరణ్‌కుమార్ ఉన్నారు

విద్యుత్తు కేంద్రాలకు కొత్త నంబర్లు

పాలసముద్రం, న్యూస్‌టుడే: వినియోగదారులకు సేవలు చేరువ చేసేందుకు మండలంలోని మూడు విద్యుత్తు ఉపకేంద్రాలకు కొత్త ఫోన్ నంబర్లు తీసుకొచ్చినట్లు ఏఈ లోకేశ్‌రెడ్డి తెలిపారు. శ్రీకావేరిరాజుపురం- 87124 80434, శ్రీబొమ్మరాజుపురం- 87124 80435, వెంగళరాజుకుప్పం- 87124 80436కు ఆయా పరిధిలో వినియోగదారులు ఫోన్ చేసి సమస్యలు చెప్పుకొనే అవకాశం ఉందన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పాలసముద్రం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బలిజకండ్రిగ కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం వాహనాల చోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. ఇటీవల ప్రమాదాల సంఖ్య పెరిగిన నేపథ్యంలో నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నట్లు చెప్పారు.

IN THE COURT OF PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION) -CUM- JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
EP.No. 63/2022
O.S.No. 84 /2020

BETWEEN:
T.R.Ramesh @ T.M. Ramesh,
S/o T.Muthuswamy, Hindu, aged about 49 years, Tailor, residing at Door No.15-115A, Kavamma Gudi back side, Puttur town and post, Puttur Mandal,Chittoor Dist.
..... Decree Holder.

AND:-
D.Murali,S/o Late. Doraswamy Naidu, Hindu, aged about 56 years, Driver,Residing at Nandhi Mangalam village and Post,Puttur Mandal, Chittoor Dist.
...Judgment debtor.

వేలం ప్రకటన

పై డిగ్రీలో డిగ్రీ హోల్డరు అయిన టి. ఆర్. రమేష్ @ టి.ఎం. రమేష్ గారికి రావలసిన ఎక్సిక్యూషన్ పిటిషన్ కనిన సొమ్ము రాబట్టుటగాను క్రింద కనబరిచిన షెడ్యూలు దాఖలా సొత్తున పై కనబరిచిన గౌరవ కోర్టు నందు 08/12/2025 వ తేదిన ఉదయం 10-30 గం॥ల నుండి సాయంత్రం 5-00 గంటలు లోపు వేలం వేయుదురు. కావున సదరు వేలంలో పాల్గొని వేలం పాడుటకు ఈ దినం అనగా 08/12/2025 వ తేదిన ఉదయం హాజరై వేలంలో పాల్గొని క్రింద కనిన షెడ్యూలు ఆస్తిని వేలం ద్వారా పొందవచ్చును.
// ఇది కోర్టు వారి ఉత్తర్వు //

SCHEDULE

Chittoor Dist. - Sri Balaji Registration Dist-Tirupathi Puttur Sub-District - Puttur Mandal,- Nananimangalam village accounts Ward No.38 Old D.No. 38/2-34 New Door No.224 Asst.No.1119002590- following:
R.C.C. building, bounded on the **East** : House of Ramu S/o Chandrarah. **West:** House of Gangaiah S/o Papaiah. **North:** Road.**South:** House of Kumari W/o Late.Munikrishna.Within the above said boundaries the R.C.C. building **Measuring: East-West:**17 feet; **North - South:** 30 feet.
D.Hr Value Rs.1,00,000/-
S.R.O. Puttur Value Rs.11,54,000/-
Encumbrances: Nil.
Filed Assistant value Rs.11,00,000/-
N.MURUGESHAN REDDY, B.A., B.L
ADVOCATE FOR DECREE HOLDER
Cell No.9346628144.

ఎలా కూర్చుంటారో చూస్తా!

చిత్తూరు నగరంలోని పలు కూడళ్లలో ప్రయాణికుల కోసం బస్టాప్‌లు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లేకపోవడంతో పరికరాలు పాడవుతున్నాయి. దర్గా కూడలిలోని బస్టాప్‌లో కొత్తగా వేసిన బల్లల మెస్‌లు చిరిగిపోయాయి. మరికొన్ని బల్లలు ఊడిపోయి.. ఎలా కూర్చుంటారో చూస్తామనేలా దిమ్మెలు ఎదురు చూస్తున్నాయి. దీంతో ప్రయాణికులు నిల్చొని నిరీక్షిస్తున్నారు. కొందరు రోడ్డుపై కూర్చుంటున్నారు.
– ఈనాడు, చిత్తూరు

తారు పోయింది.. దారి మారింది

చిత్రం చూసి తారు వేయడానికి సిద్ధం చేసిన రహదారి అనుకుంటే పొరబడినట్లే. వర్షాలు, భారీ వాహనాల రాకపోకలతో జీడీనెల్లూరు- కాళేపల్లె మలుపు వరకు రోడ్డుపై తారు కొట్టుకుపోయింది. దీంతో రాళ్లు మాత్రమే మిగిలాయి. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అదుపుతప్పి పడిపోతున్నారు. రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

రోడ్డంతా మురుగు.. వేసేదెలా అడుగు?

పెరుమాళ్లపెంటలో మురుగు వెళ్లే దారిలేక వీధిలోనే నిలిచింది. చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి నుంచి పెరుమాళ్లపెంట, నల్లబోతులూరు, లగడపాటూరు, భూమిరెడ్డిపల్లి, అనంతపురం గ్రామాల ప్రజలు వెళ్లాలి. మూడడుగుల మేర మురుగు చేరడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. – న్యూస్‌టుడే, యాదమరి

తెలుగు భాష అభ్యున్నతికి కృషి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ప్రాచీనమైన తెలుగు భాష అభ్యున్నతికి రచయితలు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపాధికారి గజేంద్ర బాబు అన్నారు. వారోత్సవాల్లో భాగంగా చిత్తూరులోని సీఆర్ రెడ్డి కేంద్ర గ్రంథాలయంలో సాహిత్య సదస్సు నిర్వహించారు. తెలుగు సాహిత్య విశిష్టతపై న్యాయవాది నాగిరెడ్డి, పద్య సాహిత్య ప్రాధాన్యంపై రాధాకృష్ణరెడ్డి, కథ, కథానిక, నవలల ప్రక్రియపై చంద్రశేఖర్, స్వామి వివేకానంద జీవితంపై శరత్ చంద్రశేఖర్ ఉపన్యసించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. శ్రీనివాసాచారి, మునీంద్ర, పూర్ణిమ, సుల్తానాభాను, సరస్వతి, దేవీబాల పాల్గొన్నారు.

సన్మానం పొందిన సాహితీవేత్తలు

దేశమ్మకు వెండి కిరీటం

నగరి దేశమ్మకు అక్షర పాఠశాల నిర్వాహకులు వెండి కిరీటం మంగళవారం వితరణగా అందించారు. 168 గ్రాముల వెండి కిరీటం మొక్కుగా చెల్లించినట్లు ట్రస్టుబోర్డు ఛైర్మన్ కె.ఆర్.మణి, మోహనకృష్ణ, నీలకంఠం తెలిపారు.
– న్యూస్‌టుడే, నగరి

స్పందించారు.. పరిష్కరించారు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల ప్రజలు 'ఈనాడు' 'మేమున్నాం. మీకు తోడుగా'కు సమస్యలు తెలియజేశారు. వార్తలు ప్రచురితమవగా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి పరిష్కారాలు చూపించారు. ● గిరింపేట బౌండు వీధి, దుర్గానగర్‌కాలనీలోని నాగాలమ్మ ఆలయం వీధి, సంతపేట బొజ్జయ్యనాయుడు వీధుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదని పలువురు చెప్పగా పారిశుద్ధ్య అధికారులు శుభ్రత పనులు చేపట్టారు. ఇంద్రానగర్‌లో ఇళ్ల మధ్య పేడ దిబ్బలు, వ్యర్థాలతో అవస్థలు పడుతున్నామని చెప్పగా చర్యలు చేపట్టారు. ● మసీదు మిట్టలో వీధి శునకాల బెడద ఉందని ఫిర్యాదులు రాగా ప్రజారోగ్య అధికారులు ఏఆర్‌వీ టీకాలు వేయించారు. ● దొడ్డిపల్లిలో ఇళ్ల ముందు వ్యర్థాలతో దోమల, దుర్వాసన విజృంభిస్తున్నాయని చెప్పగా పరిష్కరించారు.

నాగాలమ్మ ఆలయం వీధిలో పూడికతీత

నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

జన, కుల గణనలు ఒకేసారి చేపట్టాలి

చిత్తూరు గ్రామీణం, పుత్తూరు న్యూస్‌టుడే: వెనుకబడిన వర్గాలపై దాడులు అరికట్టి, న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ అన్నారు. మంగళవారం చిత్తూరు, పుత్తూరులో సీపీఐ నాయకులు కార్యకర్తలు నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా ఏదో ఒకచోట వెనుకబడిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. జన, కుల గణనలు ఒకేసారి చేపట్టాలన్నారు. నాయకులు మహేశ్, గోపినాథ్, మణి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ చిత్తూరు సాధ్యం

చిత్తూరు నగరం, బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ చిత్తూరు సాధ్యమవుతుందని సహాయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. వార్డు సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఘన వ్యర్థాల నిర్వహణ, తడి పొడి చెత్త నిర్వహణ గురించి వివరించారు. * బంగారుపాళ్యంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు ఎంపీడీవో మహేశ్ పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమం జరిగింది.

'అభివృద్ధి చూడలేక వైకాపా దుష్ప్రచారం'

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులను ఉద్దేశించి సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను వైకాపా నాయకులు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నట్లు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే వైకాపా ఓర్వలేక పోతోందన్నారు. వారు తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. నాయకులు మోహన్‌రాజ్, కుమార్, యువరాజులు, ధరణి పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త సభ్యులు

నిండ్ర, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొత్తఆరూరులో ఏపీఎన్జీవో నగరి కమిటీ ఎన్నికలు మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా ప్రభాకర్‌వర్మ, సహాధ్యక్షుడిగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా సురేంద్రకుమార్, విజయ్‌కుమార్, తులసీజలంధర్, ఉపాధ్యక్షురాలు దివ్య, కార్యదర్శి వెంకటేశులు, సంయుక్త కార్యదర్శులు సతీష్, రఘు, ధనవేలు, సునీత, కోశాధికారి భానుచందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సంఘ జిల్లా అధ్యక్షుడు రాఘవులు తెలిపారు. అనంతరం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ప్రసాద్ బాబు, రమేష్, రెడ్డియప్పన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

అమ్మవార్లకు దివ్వెల ఊరేగింపు

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై వెలసిన పుంగమ్మ, రంగమ్మ అమ్మవార్లకు చింతలవీధి ప్రజలు మంగళవారం దివ్వెలు చెల్లించారు. ఏటా పంటలు బాగా పండాలని, ప్రజలు, మూగజీవాలు వృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు తెలిపారు.

ఎన్నాళ్లీ అవస్థలు..!

- అంగన్‌వాడీ కేంద్రాలకు భవన వసతి కరవు
- చిన్నారులు, సిబ్బందికి తప్పని ఇబ్బందులు

శాంతిపురం మండలం రేగడదిన్నేపల్లెలో 13 ఏళ్ల కిందట అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటైంది. స్థానిక గ్రామ పంచాయతీ భవనంలోని ఓ చిన్నపాటి గదిలో అంగన్‌వాడీ నిర్వహణతో చిన్నారులతోపాటు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. గది ఇరుకుగా ఉండటంతో చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామ సమీపంలో నిర్మించిన నిర్మాణం గోడల దశలో ఆగిపోయింది.

శాంతిపురం మండలం చెంగుబళ్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొన్నేళ్ల పాటు పంచాయతీ భవనంలో.. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనంలో చిన్నారులకు కష్టాలు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రాజెక్టుల వారీగా వివరాలు..

	శాంతిపురం	కుప్పం
అంగన్‌వాడీలు	191	237
భవన వసతి	121	109
అద్దె భవనాల్లో	20	66
ప్రభుత్వ భవనాల్లో	50	62
చిన్నారులు	8,663	13,118
గర్భిణులు, బాలింతలు	1,633	2,531

ఏళ్ల తరబడి సమకూరని నిర్మాణాలు..

కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వందలాది అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవన వసతి లేదు. 20 ఏళ్ల కిందట ప్రారంభించిన వాటికీ శాశ్వత భవనాలు సమకూరలేదు. కుప్పం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కుప్పం, గుడుపల్లె మండలాల్లో 237 కేంద్రాలు, శాంతిపురం ప్రాజెక్టు పరిధిలోని రామకుప్పం, శాంతిపురం మండలాల్లో 191 కేంద్రాలు ఉండగా.. 46 శాతం కేంద్రాలకు సొంత భవనాలు లేవు.

దుస్థితికి చేరుకున్న పాఠశాల భవనాల్లో..

దుస్థితికి చేరుకున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బందితో పాటు చిన్నారులకు కష్టాలు తప్పడంలేదు. వర్షాలకు భవనాలు ఉరుస్తుండటంతో ఏ క్షణంలో కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది. పలు కేంద్రాలకు రక్షణ గోడలు లేకపోవడంతో విషసర్పాల బెడద తప్పడంలేదు. - న్యూస్‌టుడే, శాంతిపురం

సమస్యల్లో గ్రామీణులు..!

- ✦ పడకేసిన పారిశుద్ధ్యం
- ✦ వెలగని వీధిదీపాలు

గుడుపల్లె, న్యూస్‌టుడే: గుడుపల్లె మండల పరిధిలో పలు గ్రామాలు, కాలనీల్లో కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పంచాయతీ పాలకులు, నాయకుల మధ్య సమన్వయం లోపించిన ఫలితంగా ప్రజలు పడే అవస్థలు వర్ణనాతీతం. గత ప్రభుత్వ పాలనలో ఏర్పాటైన బీసీ, ఎస్సీ కాలనీల్లో కనీస వసతులైన విద్యుత్తు లైన్ల విస్తరణ, తాగునీటి సౌకర్యం, రోడ్లు లేకపోవడం గమనార్హం.

గత ప్రభుత్వ పాలనలో ఆదర్శ జగనన్న కాలనీలో ఓ ఇంటి కల నెరవేరుతోందని ఆశపడి నిర్మించుకున్నా.. కనీస వసతులైన నీరు, విద్యుత్తు, వీధుల అభివృద్ధి జరగకపోవడంతో పేదల ఆశలు అడియాశలుగానే మిగిలాయి.

చీకట్లో కాలనీలు

మండల పరిధిలో 18 పంచాయతీలుండగా ఒకటి, రెండు పంచాయతీలు మినహా అధిక గ్రామాల్లో వీధిదీపాలు లేవు. కుప్పిగానిపల్లె పంచాయతీ ఒంటిపల్లె ఆర్.ఎస్ కూడలి నుంచి బిసానత్తం మార్గంలో వెలగని దీపాల కారణంగా చీకటి పడితే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

నిత్యం దోమల బెడద..

గుడుపల్లె పంచాయతీ మిట్టూరులోని వీధుల్లో చెత్తాచెదారాలు, మురుగు కాల్వల అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

పరిష్కారంపై చర్యలు

మండల పరిధిలోని గ్రామాలు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్యం పనులు, వీధిదీపాల ఏర్పాటు, మంచినీటి పైపుల లీకేజీ సమస్యలను గుర్తించి వెంటనే క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారాలకు చర్యలు తీసుకుంటాం. - **ఎంపీడీవో, రాధాకృష్ణ**

నేడు ప్రత్యేక విద్యుత్తు అదాలత్

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు శాఖ ఈఈ కార్యాలయం ఆవరణలో ఈ నెల 19న ప్రత్యేక విద్యుత్తు అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

రంగాపురం వీధిలో శుభ్రత పనులు

పలమనేరు: పట్టణంలోని రంగాపురం వీధిలో మున్సిపల్ కార్మికులు కాలువలు శుభ్రం చేశారు. అపరిశుభ్ర పరిసరాలపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త రావడంతో అధికారులు ఆమేరకు స్పందించారు.

స్పందనకు వందనం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణం కృష్ణగిరి వెళ్లే మార్గం రాజీవ్ కాలనీలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. - మహేష్, కుప్పం

సమాధానం: పారిశుద్ధ్య పనులు చేపడతాం. - శ్రీనివాసరావు, కమిషనర్

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని గాంధీనగర్‌లో కాలువలు మురుగుతో పేరుకుపోయాయి. - కుమార్, పలమనేరు

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. - ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

సోమల, న్యూస్‌టుడే: సమస్య: సోమల పోలీస్‌స్టేషన్ ప్రహరీకి ఆనుకొని ఉన్న శుద్ధజల కేంద్రం సమీపంలో పైప్ లైన్ లీకై నీరు వృథాగా పోతోంది. - స్థానికులు

సమాధానం: మరమ్మతు చేసేందుకు చొరవ తీసుకుంటాం. - లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ

పూర్వ విద్యార్థుల చేయూత

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రార్థన, సమావేశ మందిరం కోసం 1964-65 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు చేయూత నిచ్చారు. రూ.6.50 లక్షల వ్యయంతో ప్రార్థన, సమావేశ మందిరాన్ని నిర్మించారు. సమావేశ మందిరాన్ని పాఠశాల వ్యవస్థాపకులు మాజీ ఎంపీపీ వారణాసి మధుసూదన్‌రెడ్డి సతీమణి సామినిరెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయిని లక్ష్మీదేవి తెలిపారు.

నేడు మహా పార్థివ లింగపూజ

పుంగనూరు: స్థానిక కల్యాణ వెంకటరమణస్వామి ఆలయ పుష్కరిణిలో బుధవారం మధ్యాహ్నం మహాపార్థివ లింగపూజ నిర్వహిస్తున్నట్లు అర్చకులు బాలసుబ్రహ్మణ్యం, రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ

కిట్లు పంపిణీ చేస్తున్న పీడీ వాసు

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు రైతు సేవా కేంద్రంలో నవధాన్యాల కిట్లను జిల్లా ప్రకృతి సేద్యం ప్రాజెక్టు మేనేజరు వాసు మంగళవారం పంపిణీ చేశారు. నవధాన్యాల కిట్లను కల్లూరు రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో తయారు చేశామని.. ఒక్కో కిట్టు ధర రూ.650 అని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నవధాన్యాల సాగుకు అనుకూలం అన్నారు.

సదుంలో ప్రత్యేక శిబిరం

సదుం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 23న దివ్యాంగులు, వృద్ధుల సహాయక పరికరాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాధారాణి మంగళవారం తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

యోగేశ్వర్

సదుం, న్యూస్‌టుడే: సదుం మహాత్మ జ్యోతిబాపులే గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.యోగేశ్వర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పుదిపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 కబడ్డీ పోటీల్లో సత్తా చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్ అభినందించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అర్హులైన పేదలను గుర్తించండి

పలమనేరు, న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలోని ఇంటి స్థలాల పంపిణీకి అర్హులైన పేద లబ్ధిదారులను గుర్తించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి టౌన్‌హాల్, డ్రైనేజీ, చెరువు అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన అర్జీలు పారదర్శకంగా పరిశీలించి నిజమైన అర్హులకు అందేలా చూడాలన్నారు. తహసీల్దారు ఇన్బనాథన్, కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, డీఈ సురేష్, ఏఈ స్నేహప్రియ పాల్గొన్నారు.

విజయాలు చాటి చెప్పాలి

శాంతిపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ విజయాలు చాటి చెబుతూ తెదేపా ప్రతిష్ఠను పెంచాలని మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి కోరారు. కెనమాకులపల్లె, అనికెర, రేగడదిన్నేపల్లె పంచాయతీల్లో మంగళవారం జరిగిన తెదేపా సమన్వయ కమిటీ సమావేశాల్లో వారు ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిందిగా సూచించారు. కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ విశ్వనాథనాయుడు, నాయకులు జయరామిరెడ్డి, గోపాల్, మంజునాథ్ పాల్గొన్నారు.

యూరియా అందక అవస్థలు

పుంగనూరులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు వేచి ఉన్నా యూరియా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ గిడ్డంగి వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా యూరియా ఇవ్వకపోవడంతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఏవో రాధను వివరణ కోరగా.. ఆయా పంచాయతీల్లోని ఆర్‌ఎస్కేల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో స్టాక్ వస్తుందని వచ్చిన వెంటనే సరఫరా చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

కొండ చిలువ కలకలం

రామకుప్పం మండలం గాంధీనగర్ గ్రామ సమీప పొలాల్లో మంగళవారం కొండచిలువ కలకలం రేపింది. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన కొండచిలువను స్థానిక రైతులు గుర్తించి చాకచక్యంగా పట్టుకుని సమీప అడవిలో వదిలి పెట్టారు. - న్యూస్‌టుడే, రామకుప్పం

వైకాపా నాయకులకు నోటీసులు

పలమనేరు, న్యూస్‌టుడే: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడతో పాటు 11 మంది వైకాపా నాయకులకు పోలీసులు 41ఎ నోటీసులు ఇచ్చారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యేతో పాటు వారు పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో నోటీసులను తీసుకున్నారు. గత నెల 21న ఓ నిర్మాణానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే పోలీసులతో దురుసుగా ప్రవర్తించారని కేసు నమోదు చేసిన సంగతి విదితమే. దానిపై వైకాపా నాయకులు హైకోర్టును ఆశ్రయిస్తే ముందస్తు బెయిలు మంజూరైంది. ఆ కేసుకు సంబంధించి స్టేషన్‌లో వారు నోటీసులు తీసుకుని బెయిలుపై సంతకాలు చేసి వెనుతిరిగారు.

రూ.10 లక్షల భవనం.. నిరుపయోగం

ఇది పలమనేరు పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మీసేవా భవనం. నిర్మించిన తర్వాత కొన్నాళ్లు మున్సిపల్ ఉద్యోగుల సమావేశాలకు ఉపయోగించారు. కానీ ఆరు నెలలుగా నిరుపయోగంగా మారింది. దీంతో ఆ ప్రాంతం ఆటో స్టాండుగా మారిపోయింది. మందుబాబులు అక్కడే తాగుతున్నారు. రూ.10 లక్షల విలువైన భవనాన్ని వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పలమనేరు

కుళాయిలు లేక అవస్థలు

పుంగనూరు మండలంలోని కల్లుపల్లె ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి ఇది. విద్యార్థులకు తాగునీరు, భోజనాల సమయంలో ప్లేట్లు కడిగేందుకు గాను ఏర్పాటు చేసిన కుళాయిలు పాడయ్యాయి. దీంతో వారంతా అవస్థలు పడుతున్నారు. బాగు చేయాలని కోరుతున్నారు. విషయం ఎంఈవో నటరాజరెడ్డి వద్ద ప్రస్తావించగా.. కుళాయిలు కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

కాస్త అనుసంధానించరూ..!

పుంగనూరు పురపాలిక పరిధిలోని నాగపాళ్యంలో సీసీ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. చివర వరకు పనులు చేపట్టి అనుసంధానం చేయాల్సిన భాగంలో పనులు పూర్తి చేయలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గోకుల్ వీధి, రహ్మత్‌నగర్, పోలీస్ లైన్ ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు

సోలార్ దీపాలకు చీకట్లు

సోమల మండలంలోని నంజంపేట ఈడ్లో, సూరయ్యగారిపల్లె గంగమ్మ గుడి వద్ద రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సోలార్ దీపాలు నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వం వాటర్ షెడ్ పథకంలో భాగంగా రాయితీపై అందజేసింది. ఏడాది పాటు వెలిగి తర్వాత పాడయ్యాయి. వాటిని మరమ్మతులు చేయించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. విషయం వాటర్ షెడ్ పీవో శోభారాణి వద్ద ప్రస్తావించగా.. కంపెనీ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - న్యూస్‌టుడే, సోమల

పుస్తకాలు చదవడం అవసరం

పుంగనూరు, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం నిర్వహించే పరీక్షల్లో నెగ్గాలంటే పుస్తకాలు చదవడం అవసరమని లినార్డ్ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బులకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

శాంతిపురం: కడపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిఖిల్, పదో తరగతి

సాగర్, తొమ్మిదో తరగతి

వినయ్, తొమ్మిదో తరగతి

రాజుపల్లె విద్యార్థుల ప్రతిభ

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17, అండర్-14 బాలుర విభాగంలో సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి, పీడీ అన్నాదొరై తెలిపారు. చిత్తూరు పీవీకేఎన్ కళాశాల మైదానంలో జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్-17బాలుర విభాగంలో పదోతరగతి చదువుతున్న నిఖిల్, అండర్-14 బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న సాగర్, వినయ్‌లు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

కుప్పం పట్టణం: రైతుల అభ్యున్నతే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఏఎంసీ ఛైర్మన్ జీఎం రాజు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రిజిస్టర్ చేయకండి

పుంగనూరు: పట్టణంలోని రాతి మసీదుకు చెందిన భూములను ఇతరులకు రిజిస్టర్ చేయొద్దని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టరు రియాజ్ స్థానిక సబ్ రిజిస్ట్రారు సర్వేశ్వర్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. రాతి మసీదు భూములు రిజిస్టర్ చేసుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని రాతిమసీదు కమిటీ సభ్యులు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రతిభ చూపి.. బహుమతులు సాధించి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. కృత్రిమ మేధ, విద్యార్థులపై చరవాణి ప్రభావం అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తేజస్విని(8వ తరగతి), ఎం.నితేష్(9వ తరగతి), బి.మధు(8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు బహుమతులు అందించారు.

వాగులో పడిన కంటైనర్ లారీ

పుంగనూరు గ్రామీణం: ఈడిగపల్లె సమీపంలోని ఓ దాబా వద్ద సోమవారం రాత్రి తమిళనాడుకు చెందిన కంటైనర్ లారీని డ్రైవర్ రోడ్డు పక్కన ఆపి భోజనం చేస్తుండగా లారీ పల్లంలోకి వెళ్లి వాగులో పడిందని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

కేబుల్ వైరు చోరీ

చౌడేపల్లె, న్యూస్‌టుడే: వ్యవసాయ బోరు మోటారుకు అమర్చిన కేబుల్ వైరు చోరీకి గురికావడంతో పెద్దయల్లకుంట్లకు చెందిన రెడ్డెప్ప పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు మహాసభలకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పైనేని తులసినాథంనాయుడుకు ఆహ్వానం అందింది. జనవరి 3, 4, 5 తేదీల్లో గుంటూరులో చేపట్టనున్న సభలకు రావాలని నిర్వాహకులు గజల్ శ్రీనివాస్ తనకు ఆహ్వాన పత్రం పంపినట్లు మంగళవారం తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

పలమనేరు, న్యూస్‌టుడే: బైరెడ్డిపల్లె మండలం వెంగంవారిపల్లె దళితుల ఇళ్లను కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలమనేరు రెవెన్యూ డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డిమాండు చేశారు. మంగళవారం ఆర్డీవో భవానికి వినతిపత్రం సమర్పించారు.

ఎంసీఎల్‌ఎఫ్‌కు ఎంపిక

పెద్దపంజాణి: మోడల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్(ఎంసీఎల్‌ఎఫ్)కు పెద్దపంజాణి మండలం ఎంపికైందని వెలుగు ఏపీఎం సిరజ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై తరగతులు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ-పచ్చదనాన్ని పెంచేందుకు చొరవ తీసుకోవాలని ఎంపీడీవో బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ-పచ్చదనం పెంపొందించడం అనే అంశంపై సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు..!

✦ సద్వినియోగం చేసుకుంటున్న యువత

పలమనేరు, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అనే నానుడి నిజం చేస్తున్నారు నేటి యువత. ఇక్కడ చదివి ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల కాలంలో అన్నివర్గాల ప్రజలు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా న్యూస్‌టుడే కథనం.

పలమనేరులోని గ్రంథాలయం

వారోత్సవాల ఉద్దేశం..

- ❖ పఠనాసక్తిని ప్రోత్సహించడం
- ❖ గ్రంథాలయాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలపడం
- ❖ సమాజ వికాసం కోసం విద్యతో పాటు జ్ఞాన వ్యాప్తి చేయడం
- ❖ గ్రంథాలయాల ఉద్యమ నేతలకు వాళులు అర్పించడం
- ❖ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ తదితర పరీక్షలు నిర్వహించి విద్యా నైపుణ్యాలు మెరుగుపరచడం.

60వ ర్యాంకుతో ఉద్యోగం

నా పేరు బాలసుందర్, నేను ఎంఏ, బీఈడీ చదివాడు. పలమనేరు గ్రంథాలయంలో చదువుకోవడానికి అనుకూల వాతావరణం, అన్నీ రకాలు పుస్తకాలు ఉన్నాయి. ఇటీవల డీఎస్సీలో 60వ ర్యాంకుతో ఉద్యోగం సాధించా. ప్రస్తుతం వి.కోట మండలం నడమంతరంలో ప్రభుత్వ ఉన్న పాఠశాలలో సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాను.

మరింత అభివృద్ధి చేస్తాం

ప్రభుత్వానికి గ్రంథాలయాల డిజిటలైజేషన్ ప్రతిపాదనలు పంపాం. త్వరలో అన్ని కార్యక్రమాలను పూర్తి చేయడానికి యత్నిస్తున్నాం. పాఠకులకు అన్ని వసతులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- ఆర్‌వీఆర్‌ఎస్‌ఎస్ శర్మ, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, చిత్తూరు

పార్టీని మరింత బలోపేతం చేస్తాం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ స్థాయి నుంచి తెదేపాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లు చెక్కునత్తం మణి, వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎంపిక కావడం పట్ల నాయకులు, కార్యకర్తలు మంగళవారం వారిని సత్కరించారు. మాజీ ఎంపీపీ సాంబశివం, నాయకులు రాజగోపాల్, సంతోష్, వెడి, వెంకటేష్ పాల్గొన్నారు.

మణిని సత్కరిస్తున్న నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు

ధ్రువీకరణ పత్రాలు చూపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో 124 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక కడా కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ అంగన్‌వాడీల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి సాధించిన వారికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

❖ నారా భువనేశ్వరి నాలుగు రోజుల పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

రామకుప్పం, కల్లూరు, న్యూస్‌టుడే: జంట ఏనుగుల వరుస దాడులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పదిరోజుల నుంచి ననియాల, రామాపురం తండా, జీడిమాకులపల్లి, నారాయణపురం తండా, పీఎంకే, పీఎం తండాల్లోని పలువురి రైతులకు చెందిన వరి, టమాటా, బీన్స్ పంటలను మంగళవారం రాత్రి ఏనుగులు నాశనం చేశాయి. ✦ పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లెలోని పంటలపై సోమవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసింది.

తప్పిన ప్రమాదం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయ ఆవరణలో చెట్టు కొమ్మ మంగళవారం విరిగి పడింది. ఆ సమయంలో చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

(c) eenadu

మత్తును చిత్తు చేద్దాం

అంగర, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు ఛిద్రమవుతాయని.. వాటికి దూరంగా ఉందామని విద్యార్థులు ప్రతినబూనారు. అంగర కూడలిలో మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాలను వినియోగించవద్దని కోరుతూ నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీసిద్ధార్థ కళాశాల విద్యార్థులు డ్రగ్స్‌తో ఎదురయ్యే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాలు, వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

నేడు ఆక్వా రైతులకు అవగాహన

ముమ్మిడివరం: అమలాపురంలోని కొంకాపల్లి వద్ద ఓ హోటల్‌లో ఈ నెల 19(బుధవారం) ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నైకు చెందిన శాస్త్రవేత్తల బృందం ఆక్వా సాగులో ఎదురవుతున్న సవాళ్లు, తెగుళ్లపై తగిన సూచనలు ఇస్తారన్నారు. ఉప్పునీటిలో చేపలు, రొయ్యల పెంపకంపై అవగాహన కల్పిస్తారన్నారు.

పర్యాటకాభివృద్ధి కేంద్రంగా ఆది బౌద్ధ స్తూపం

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఆదుర్రు ఆది బౌద్ధ స్తూపాన్ని పర్యాటకాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేస్తానని ఎంపీ హరీష్‌మాథుర్ తెలిపారు. ఈ స్తూపాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి మంగళవారం సందర్శించారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. పాశర్లపూడి వారధి నుంచి వైనతేయ నదిలో హౌస్‌బోట్లపై జలవిహారం చేసేందుకు దృష్టి పెట్టామన్నారు. రిసార్ట్‌లను ఆధునికీకరిస్తామన్నారు. తీర భూముల రక్షణకు అవసరమైన రాతికట్టు, గ్రోయిన్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. సర్పంచి బళ్ల శ్రీనివాసరావు, బుద్ధవిహార్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, నగరం ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరాజా పాల్గొన్నారు.

ఆది బౌద్ధ స్థూపాన్ని సందర్శిస్తున్న ఎంపీ హరీశ్ మాథుర్, ఎమ్మెల్యే సత్యనారాయణ తదితరులు

అమ్మినోళ్లకు రూ.కోట్లు.. కొన్నోళ్లకు పాట్లు

అముడా పరిధిలో అక్రమ లేఔట్ల గుర్తింపు

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పరిశీలన

న్యూస్‌టుడే, ముమ్మిడివరం, అమలాపురం పట్టణం

అక్రమ లేఔట్లు వేసి రియల్టర్లు రూ.కోట్లు కొల్లగొడుతుంటే వాటిని కొనుగోలు చేసిన వారికి మాత్రం పాట్లు తప్పడం లేదు. జిల్లాలో 216 జాతీయ రహదారిని ఆనుకుని పెద్దఎత్తున వెలుస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు. పంటబోదెలు, మురుగు కాలువలు సైతం లేఔట్లలో కలిపేసి ప్లాట్లుగా విక్రయించేస్తున్నారు. సామాన్యుడు నిండా మునిగిపోతున్నాడు.

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలో అనుమతులు లేకుండా వేస్తున్న లేఔట్ ఇది. ఏవిధమైన అనుమతులు తీసుకోకుండా గ్రావెల్ కప్పేస్తున్నారు. ఇక్కడ పంటబోదె ఉంది. ఈ ప్రాంతంలో ఆయకట్టు రైతుల పొలాలకు నీరు వెళ్లడానికి అవకాశం లేకుండా దాన్ని పూడ్చేసి మరీ లేఔట్‌కు మట్టిని తరలిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ లేఔట్లపై ప్రత్యేక దృష్టిసారించింది. దీంతో అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అముడా) పరిధిలో 280కు పైగా గుర్తించారు. వీటిలో నిబంధన ప్రకారం రహదారులు నిర్మాణం లేకపోవడం, డ్రెయిన్లు ఏర్పాటు చేయకుండా ప్లాట్లుగా మార్చి విక్రయాలు జరిపినట్లు గుర్తించారు. 10 శాతం స్థానిక సంస్థలకు భూమి దఖలు చేయాల్సి ఉన్నా 80 శాతం మేర అది జరగలేదు.

అమలాపురం: పాలగుమ్మిలో అనధికార లేఔట్

30 శాతమే ఎల్ఆర్ఎస్‌కు..

అముడా పరిధిలో గుర్తించిన అక్రమ లేఔట్లలో 30 శాతం ప్లాట్లకు మాత్రమే క్రమబద్ధీకరణకు దరఖాస్తులు వచ్చాయి. సుమారు 3000కు పైగా ప్లాట్లు ఉంటే ఇప్పటివరకు 615 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 10 ప్లాట్లను నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించారు.

280	జిల్లాలో గుర్తించిన అక్రమ లేఔట్లు
3000	వాటిలో ఇళ్ల స్థలాలు
615	ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులు
10	అనుమతులు పొందినవి

పట్టించుకోని అధికారులు

అక్రమంగా వెలిసిన లేఔట్లలో స్థలాలు కొనుగోలు చేసినవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది. గడువులోగా ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకోని లేఔట్లు, ప్లాట్ల విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అముడా ప్రణాళిక అధికారి ఎ.సత్యమూర్తి తెలిపారు.

సుమలింగం

కార్తిక మాస పూజల్లో భాగంగా కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలోని పార్వతీ సమేత కుండలేశ్వరాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి దర్శనం అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పూలతో తయారు చేసిన శివలింగం ఆకట్టుకుంది. పలువురు దర్శించుకున్నారు. కొందరు చరవాణి కెమెరాల్లో ఫొటోలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

అన్నదాతా సుఖీభవ

రైతుల ఖాతాల్లో రూ.90.59 కోట్లు జమ

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో రెండో విడత నిధులు ఈ నెల 19(బుధవారం)న విడుదల కానున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారికంగా ప్రారంభించనున్నారు. జిల్లావ్యాప్తంగా రూ. 90.59 కోట్లు జమ కానున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎస్‌కే నుంచి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యక్ష ప్రసారానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

జిల్లావ్యాప్తంగా..

పీఎం కిసాన్ పథకంలో గత ఆగస్టులో 1,19,418 మందికి రూ. 2 వేలు వంతున డబ్బులు జమకాగా. . ప్రస్తుతం 1,68,852కు తగ్గారు. 2566 మందికి ఈ-కేవైసీ, మ్యూటేషన్ తదితర కారణాలతో జాబితాలోకి చేరలేదు. వీరికి మళ్లీ వివరాలతో అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

వివరాలు ఇలా.. (కోట్లలో)

పథకం	రైతులు	నిధులు
అన్నదాత-సుఖీభవ	1,34,439	67.22
పీఎం కిసాన్	1,16,852	23.37

కౌలు రైతులకు మొండిచేయి

జిల్లాలో సీసీఆర్ కార్డులు కలిగిన కౌలురైతులు 75 వేల మంది ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోని అర్హులకు గతంలో రైతుభరోసాలో రూ. 15 వేలు జమయ్యేవి. అన్నదాత సుఖీభవలో అర్హులకు రూ. 20 వేలు వంతున రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందని హామీ ఇచ్చారు. 6 వేల మంది అర్హులు ఉన్నారు. రెండో విడతలోనూ వీరికి అవకాశం దక్కలేదు.

రూ.7 వేలు

పీఎం కిసాన్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, అన్నదాత సుఖీభవలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు వెరసి ఒక్కొక్క రైతు ఖాతాలో రూ.7 వేలు జమ కానున్నాయి.

మహాప్రాణ దీపం.. శివం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తిక బహుళ త్రయోదశి, మాస శివరాత్రి సందర్భంగా ఆలయంలోని అనివేటి మండపంలో శివలింగాకారంలో భక్తులు దీపాలు వెలిగించారు. దేవస్థానంలో మంగళవారం భక్తుల రద్దీ తగ్గింది. కేవలం 3,237 వ్రతాలు జరిగాయి.

- న్యూస్‌టుడే, అన్నవరం

సహజ అందాల నెలవు

పర్యాటకులు కూర్చోవడానికి ఇలా..

అందమైన ఈత కొలను

సహజ వనరులతో అలరారే కోనసీమలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పర్యాటక అతిథి గృహాలు, రిసార్ట్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో దిండి వశిష్ఠ గోదావరి ఒడ్డున హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్స్ ఏర్పడింది. అనంతరం దాని సమీపాన ప్రైవేటు రంగంలో రిసార్ట్స్ అందుబాటులోకి వచ్చింది. పైకప్పునకు తాటి వాసాలు, వెదురు తడికలను వినియోగించగా స్తంభాలకు కొబ్బరి పగ్గాలను చుట్టారు. ఆవరణలో చెరువులు, కొబ్బరి తోటలు, చిన్నచిన్న గుడిసెలు ఆకట్టుకుంటున్నాయి.

- న్యూస్‌టుడే, మలికిపురం

విదేశాలకు రెక్కలు ఎగిరేనా!

గోదావరి నుంచి అంతర్జాతీయ విమానాలపై ఆశలు

ఈ దేశాలకు డిమాండ్.. ☛ కువైట్ ☛ దుబాయ్ ☛ మస్కట్

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఉన్న ఏకైక విమానాశ్రయం రాజమహేంద్రవరం సమీప 'మధురపూడి'. ఇక్కడి నుంచి అంతర్జాతీయ సర్వీసులకు ఎప్పుడు అడుగులు పడతాయోనని అంతా ఎదురుచూస్తున్నారు. ఈ అంశం కేంద్ర పౌరవిమానయాన శాఖ దృష్టిలో ఉంది. అంతర్జాతీయ గగనయానానికి దోహదపడేలా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. టెర్మినల్ భవన విస్తీర్ణం 5 రెట్లు, ప్రయాణికుల సామర్థ్యం 10 రెట్లు పెరగనుంది.

రాజమహేంద్రవరం విమానాశ్రయం

ఉభయ గోదావరి జిల్లాలకు ఇదే కీలక విమానాశ్రయం. ప్రధానంగా కోనసీమ.. పశ్చిమంలోని నరసాపురం, ఆచంట, పాలకొల్లుకు చెందిన కార్మికులు, ఉద్యోగులు గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఉన్నారు. వారంతా హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. మధురపూడి నుంచి సర్వీసులు ఉండాల్సిన ఆవశ్యకతపై స్థానిక నేతలు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈ దిశగా ప్రయత్నిస్తున్నారు.

న్యూస్‌టుడే, కోరుకొండ

ఏ పనులు జరుగుతున్నాయంటే..

➜ అంతర్జాతీయ ప్రమాణాలతో రూ. 350 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నారు. ➜ గంటకు 2,100 మంది ప్రయాణికులు ఒకేసారి రాకపోకలు సాగించేలా సామర్థ్యం పెంచుతున్నారు. ➜ తనిఖీ కౌంటర్ల సంఖ్య 28, కార్ల పార్కింగ్ సామర్థ్యం 700కు పెరగనుంది. ➜ ఒకేసారి 11 విమానాలు పార్కింగ్ చేసేలా ఆప్రాన్ సిద్ధమవుతోంది.

దేశంలో ఏ నగరాలకు ఎన్ని సర్వీసులు వెళ్తున్నాయంటే..

- హైదరాబాద్-6
- దిల్లీ-1
- చెన్నై-1
- బెంగళూరు-1
- తిరుపతి-1

దృష్టిపెట్టాల్సిన అంశాలు..

➠ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులొస్తే అంతర్జాతీయ విమాన కేంద్రం సాకారమవుతుంది. ➠ పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి. ➠ ప్రతికూల వాతావరణంలో ఉపయుక్తమయ్యేలా ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎం) ఉండాలి. ➠ విదేశీ ప్రయాణికులకు ప్రత్యేక టెర్మినల్, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, తనిఖీ విభాగాలు అవసరం

ధాటికి తట్టుకుని.. ఠీవిగా నిలిచి

ఆదుర్రు-మోరిపోలం మధ్య తీరంలో నిలిచి ఉన్న ఏకైక కొబ్బరి చెట్టు

వైనతేయ నదీ తీరంలోని మామిడికుదురు మండలం ఆదుర్రు-మోరిపోలం మధ్య నదీ పాతం ఏళ్లకాలంగా గట్టును దెబ్బతీస్తోంది. అటు కోత, ఇటు బలమైన గాలులకు ఒడ్డున ఉన్న అనేక కొబ్బరి చెట్లు నదీ గర్భంలో క్రమేణా కలిసిపోయాయి. ఆ ప్రదేశంలో నిలిచిన ఒక్క కొబ్బరిచెట్టు మాత్రం అన్నింటినీ తట్టుకుని ఠీవిగా నిలబడటం విశేషం.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

విలువైన స్థలం.. ఊరికి విరాళం

ఉచ్చిలి (ఆత్రేయపురం): ఉచ్చిలి గ్రామంలో ప్రభుత్వం నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మాణం నిమిత్తం మంగళవారం గ్రామానికి చెందిన నంబూరి ఎర్ర తాతరాజు, సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఎంవీఎస్ఎస్ఎన్ రాజు (దొరమాస్టారు), ఎన్వీ సుబ్బరాజు(శ్రీను), నంబూరి అప్పలరాజు (చిన్నదొర) రూ. 25 లక్షల విలువైన ఐదున్నర సెంట్ల భూమి వితరణ చేశారు. గ్రామ పెద్దలు తోటకూర సుబ్బరాజు, ఉర్రింకల త్రిమూర్తులు సమక్షంలో స్థలానికి సంబంధించిన పత్రాలను ఎంపీడీవో వెంకటరామన్‌కు అందజేశారు. దాతలను పలువురు అభినందించారు.

స్థలం పత్రాలను ఎంపీడీవో వెంకటరామన్‌కు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు తదితరులు

ఎందుకిలా చేశావ్ నాన్నా!

■ పిల్లలను గోదావరిలోకి తోసి.. ఆపై తానూ ఆత్మహత్య

■ ఇరువురి మృతదేహాలు లభ్యం.. కానరాని బాలిక ఆచూకీ

మలికిపురం, మామిడికుదురు, యలమంచిలి: 'రండమ్మా.. ఆధార్ అప్‌డేట్ చేసుకుని వద్దాం' అంటూ నాన్న పిలవగానే ఆ పిల్లలిద్దరూ ఉత్సాహంగా బయలుదేరారు. 'అమ్మా.. వెంటనే వచ్చేస్తామమ్మా' అంటూ వీడ్కోలు చెప్పారు. ఇక ఎప్పటికీ వెనక్కిరామని ఆ చిట్టి హృదయాలకు తెలియదు. తీసుకువెళ్లిన తండ్రి గోదావరిలోకి తోసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసి ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

మలికిపురం మండలం లక్కవరంలో ఫైనాన్స్ వ్యాపారి శిరిగినీడి దుర్గాప్రసాద్ (37) భార్య నాగవేణి, కుమారుడు మోహిత్ (13), కుమార్తె జాహ్నవి (9)తో కలిసి నివసిస్తున్నారు. వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని నాగవేణి కన్నవారి ఇంటి వద్ద వీరున్నారు. ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ సోమవారం సాయంత్రం పిల్లలిద్దరినీ తీసుకొని దుర్గాప్రసాద్ బైకుపై బయలుదేరాడు. రాత్రి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి స్టేషన్ పరిధి చించినాడ వశిష్ఠ వారధిపై ఈ వాహనం, పాదరక్షలు, చరవాణి నంబర్లతో కూడిన కాగితం కనిపించాయి. మంగళవారం గోదావరిలో గాలించగా దుర్గాప్రసాద్, మోహిత్ మృతదేహాలు కనిపించాయి.

దుర్గాప్రసాద్, మోహిత్ (పాతచిత్రాలు).. ఆచూకీ తెలియని జాహ్నవి

జాహ్నవి ఆచూకీ కానరాలేదు. బుధవారం మళ్లీ అన్వేషిస్తామని మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు. దుర్గాప్రసాద్ పిల్లలను నదిలోకి తోసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.

సరదాకు అనుకున్నాం..

ఇద్దరు పిల్లలతో వంతెన మీదకు వచ్చిన దుర్గాప్రసాద్ తొలుత కుమార్తెను నదిలోకి తోసినట్లు భావిస్తున్నారు. ఇది చూసిన కుమారుడు హడలిపోయి పరుగు తీయగా అతడిని తండ్రి వెంబడించినట్లు అటుగా వెళ్లిన ఆటో డ్రైవర్ చెప్పారని.. ప్రసాద్ స్నేహితులు చెబుతున్నారు. సరదాగా పరుగెడుతున్నారనుకున్నామని.. ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఊహించలేదని డ్రైవర్ తెలిపారన్నారు.

ఏం కష్టమొచ్చిందో..

ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందోనని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కుటుంబ కలహాలా.. ఆర్థిక సమస్యలా.. ఇంకేమైనా కారణాలా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కువైట్ వెళ్లి వచ్చి..

దుర్గాప్రసాద్, నాగవేణిలది ప్రేమ వివాహం. ప్రసాద్ ఉపాధి రీత్యా కువైట్ వెళ్లి వచ్చాడు. పిల్లలిద్దరినీ విశ్వేశ్వరాయపురంలో చదివిస్తున్నాడు. నాగవేణి తండ్రి రేకపల్లి వెంకటేశ్వరరావు గల్ఫ్ నుంచి రావడంతో వారం క్రితం వీరంతా ఆ ఊరు వెళ్లారు. తన భర్త, పిల్లలు ఎక్కడున్నారంటూ నాగవేణి రోదిస్తుండడం కలచివేసింది.

విరులు ఒదిగి.. అందాలు పొదిగి

ఇక్కడ కనిపిస్తున్నవి కాగితపు పూల మొక్కగా పిలిచే బోగన్‌విల్లా. వివిధ రంగుల్లో పూయడం వీటి ప్రత్యేకత. వీటిని గొడుగు ఆకృతిలో మార్చేందుకు కడియపులంకలోని ఓ నర్సరీ నిర్వాహకులు ఇనుప జాలీ ఏర్పాటు చేశారు. మొక్క పెరిగే కొద్ది గొడుగు ఆకారంలో రెమ్మలను కత్తిరిస్తారు.

- ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కడియం

ఉలిక్కిపడిన మన్యం

■ ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో చర్చ

■ కాకినాడలో మహిళా మావోయిస్టుల పట్టివేత

ఈనాడు, రాజమహేంద్రవరం, కాకినాడ; న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం: ప్రశాంత వాతావరణం.. నిండా పచ్చదనంతో తొణికిసలాడే రంపచోడవరం-మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఒక్కసారిగా అలజడి.. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతో సహా ఆరుగురు మృతిచెందారు. మరో 19 మంది తప్పించుకున్నట్లు తెలుస్తోంది. వీరి కోసం గ్రేహౌండ్స్ దళాలు జల్లెడపడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకప్పుడు అంతర్భాగంగా ఉన్న మన్యంలో తాజా ఎదురుకాల్పుల అంశం కలకలం రేపింది. అదే సమయంలో ఇద్దరు మహిళా మావోయిస్టులు కాకినాడలో చిక్కడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు.

వరుస ఘటనలతో..

◆ ఫిబ్రవరిలో వై.రామవరం వద్ద ఎదురుకాల్పుల్లో ముగ్గురు.. జూన్ 18న రంపచోడవరం కింటుకూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.

పోలీసుల అప్రమత్తం..

కాకినాడ సమీపంలో పట్టుబడిన మహిళా మావోయిస్టుల నుంచి కొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సామర్లకోట స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఏజెన్సీ సరిహద్దుల్లో కొత్త వ్యక్తుల కదలికలపై ఆరా తీస్తున్నారు.

కాకినాడలోనూ ఉనికి

జిల్లా కేంద్రం కాకినాడకు కూతవేటు దూరంలో సామర్లకోట మండలం కొప్పవరంలోని రొయ్యల కంపెనీ సమీపంలో మంగళవారం ఇద్దరు మహిళా మావోయిస్టులు పట్టుబడ్డారు. వారి వివరాలేవీ వెల్లడించకుండా గోప్యత పాటించారు. వీరు నగరానికి ఎప్పుడు వచ్చారు..? ఎవరైనా ఇక్కడ ఆశ్రయం కల్పించారా..? ఎక్కడైనా రెక్కీలు నిర్వహించారా? ఇంకా ఎవరెవరు వచ్చారు? అనే విషయాలపై విచారణ చేపడుతున్నారు.

కొత్త భవనాలు.. సరికొత్త వసతులు

ప్రారంభానికి సిద్ధమైన ఇంజినీరింగ్ కళాశాల భవనం

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు తరగతి గదుల సమస్య తీరనుంది. నన్నయ ప్రాంగణంలో పలు విభాగాలకు చెందిన భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో మంత్రి లోకేశ్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. భవనాల కొరతతో ఇప్పటివరకు షిఫ్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం వరకు ఎంబీఏ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. దాదాపు రూ. 45 కోట్లతో పూర్తిచేసిన ఈ భవనాలు పూర్తవ్వడంతో ఈ సమస్య తీరినట్లే.

కూటమి ప్రభుత్వం చొరవతో..

గత తెదేపా హయాంలో పలు భవనాల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై దృష్టి పెట్టింది.

సిద్ధమైన భవనాలు..

■ రూ. 20.05 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల భవనం, రూ. 8.25 కోట్లతో పరీక్షల భవనం, రూ. 5.50 కోట్ల వ్యయంతో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనం పూర్తి చేశారు. ■ బాలుర వసతిగృహ భవనం పూర్తవ్వగా, దీనికోసం రూ. 11.10 కోట్లు ఖర్చు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

రుద్రా.. రక్షమాం

కిర్లంపూడిలో మాసశివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో మహాశివుడికి లక్ష రుద్రాక్షలతో మంగళవారం రాత్రి అభిషేకం నిర్వహించారు. రుద్రాక్ష దండల శివలింగానికి పట్టువస్త్రాలతో అలంకరించి దశమహా, కుంభ హారతి ఇచ్చారు. 24 మంది అర్చకస్వాములు అద్భుతం భక్తిపారవశ్యంతో క్రతువు నిర్వహించారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

దర్శన భాగ్యం

మండపల్లిలోని మండేశ్వరస్వామికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్తిక మాసం పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజాము నుంచే లక్షపత్రి, కుంకుమ పూజలు చేశారు. జలం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పాహిమాం, రక్షమాం అంటూ వేడుకున్నారు. అనంతరం స్వామి వారిని భక్తులు వరుసల్లో నిల్చుని దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపేట



అభిషేక ప్రియం

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి మంగళవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ప్రత్యేక పుష్పాలంకరణ సేవ, విశిష్ట హారతులు క్రతువులు నిర్వహించారు. ఎండు ఫలాలు, తేనె, చెరకు రసం, వట్టివేళ్లు, విభూదితో అభిషేకం చేశారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

అనంతేశ్వరం

కడియపులంక పంచాయతీ మహాక్షేత్రంలో కొలువైన శ్రీఉమా సమేత అనంతేశ్వరస్వామికి ఇలా అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధనను మంగళవారం ఉదయం నిర్వహించారు. అర్చకులు పూజలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. - న్యూస్‌టుడే, కడియం

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సంస్థ ప్రతినిధులు

ఉద్యోగ మేళాలో 36 మంది ఎంపిక

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 36 మంది బంగారు ఆభరణాలు అమ్మే జాయ్ అలుకాస్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. వీరికి జేసీ నిశాంతి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అధికారుల సమక్షంలో సీపీఆర్ గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తూ..

ఆపద వేళ.. ఆదుకునే దళం

ఎన్డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్

పి.గన్నవరం, న్యూస్‌టుడే: అక్కడ నిజంగానే నదిలో జనం మునిగిపోతుంటే ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు రక్షించినట్టు కళ్లకు కట్టినట్టు చూపించారు. నదిలో ప్రమాదవశాత్తూ బోటు బోల్తాకొట్టి గల్లంతైన వ్యక్తిని రక్షించడం... పెద్దగాయం తగిలి రక్తం పోతుంటే ఎలా అరికట్టాలి, గుండె కొట్టుకునే విధంగా సీపీఆర్ ఎలా చేయాలి ఇలా పలు అంశాలపై ఎన్డీఆర్ఎఫ్ (జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం) బృందం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించింది. విజయవాడకు చెందిన 30 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం మంగళవారం వైనతేయ గోదావరి నదిలో లంకలగన్నవరంవద్ద మాక్ డ్రిల్ చేసింది. ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ గిం శెట్టి నాగలక్ష్మి, సర్పంచి గనిశెట్టి గంగాభవాని, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ మనోహర్‌సింగ్, ఎస్సై బి.శివకృష్ణ, కొత్తపేట అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వరదలు, ఇతర విపత్తుల సమయంలో ప్రజలు స్వీయరక్షణ చర్యలు ఏవిధంగా చేపట్టాలో ప్రజలకు మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు దిల్‌బాగ్‌సింగ్ విలేకరులకు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం నుంచి పలు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తామన్నారు.

గోదావరి నదిలో మునిగిపోయిన వ్యక్తిని రక్షిస్తున్న సిబ్బంది

ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణకు విజయవాడలో మంగళవారం వినతి పత్రం అందించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నల్లా వెంకటసతీష్‌కుమార్ జిల్లా అధ్యక్షుడు జి.సత్యనారాయణ తెలిపారు. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను వివరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నూకల శ్రీనివాస్, అడబాల వెంకన్ననాయుడు, కోలా నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా హాయ్ అను.. వారొచ్చి ధాన్యం కొను..

అరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునేందుకు రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతికత వారికి ప్రస్తుతం అండగా నిలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ప్రభుత్వం వాట్సాప్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. - న్యూస్‌టుడే, అల్లవరం

సందేశం పంపితే స్పందిస్తారు..

మీ కోసం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలనుకునే అన్నదాతల కోసం ఖరీఫ్ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పౌరులు కేటాయించిన చరవాణి నంబరుకు 'హాయ్' అని సందేశం పెట్టగానే పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందిస్తారు. రైతుల వద్ద ఎన్ని బస్తాలున్నాయి, పంట రకం, ఎప్పటికి సిద్ధమవుతాయనే పూర్తి సమాచారాన్ని చరవాణిలో వారిచ్చిన వాట్సాప్ నంబరుకు పంపించాలి. వారి పరిధి కేంద్రంలో ఏరోజు ఎలాంటి రకం ధాన్యం, ఎన్ని బస్తాలు అమ్ముతారనే వివరాలతో స్లాట్ బుక్ అవుతుంది. ఈ విధానం వల్ల రైతులకు పంట ఎక్కడ అమ్ముకోవాలి. ఏ మిల్లుకు తరలించాలన్న ఆందోళన తొలగిపోతుంది. సమయం ఆదా అవుతుంది.

అల్లవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వివరాలు ఇవీ..

- మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలు: 204
- కొనుగోలు చేసిన ధాన్యం: 37,644 మెట్రిక్ టన్నులు
- దీని విలువ: రూ.89.18 కోట్లు
- రైతులకు చెల్లించింది: రూ.81.06 కోట్లు
- 24 గంటల్లో జమైంది: రూ.69.77 కోట్లు
- 48 గంటల్లో జమైంది: రూ.11.29 కోట్లు

రైతులు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 73373 59375

అవగాహన కల్పిస్తున్నాం

రైతులకు వాట్సాప్ సేవలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 146 మంది సేవలను వినియోగించుకున్నారు. వాట్సాప్ ద్వారా 1100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. - శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

రాజోలు: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా అన్నారు. రాజోలు మండలం తాటిపాకలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంద రోజుల విద్యా ప్రణాళిక ప్రగతిని పరిశీలించారు. మూల్యాంకనం, అసెస్మెంట్ పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాపరంగా ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నూరు శాతం ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంఈవోలు నల్లి మనోహరం, ప్రసాదరావు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

దీపకాంతులు వెలిగె..

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 62వ కార్తిక దీపారాధన మహోత్సవం కాంతులీనింది. మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ అర్చకుడు జుత్తిక చిన్న స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, లక్ష తులసి పూజ జరిపించారు. కార్యక్రమంలో 200 మంది దంపతుల పాల్గొని తులసీదళాలు అర్పించారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామిని ఉష్ట్ర వాహనంపై ఊరేగించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, వైకాపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఊరేగింపులో బ్యాండు మేళాలు, కోలాటనృత్యాలతో స్వామివారిని ద్రాక్షారామ సూర్యవీధి, చంద్రావీధి, వెలంపాలెంలో ఊరేగించారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం దీపస్తంభం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జ్యోతి వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం దీపాలు వెలిగించేందుకు మహిళలు పోటెత్తారు. దీపస్తంభంపై ప్రమిదల్లో జ్యోతులు కనులపండువగా కాంతులీనాయి. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోణం శ్రీను ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు, కమిటీ అధ్యక్షుడు బోణం శ్రీను

స్వామివారి ఊరేగింపులో కోలాట ప్రదర్శన

విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

పామర్రు, న్యూస్‌టుడే: విద్యార్థులకు భవిష్యత్తులో విద్యాపరమైన ఇబ్బందులు ఎదురవకుండా ఇటీవల అపార్ సంఖ్యను కేటాయిస్తున్నారు. ప్రస్తుతం ఆధార్ నంబర్ దేశవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా అందరికీ ఉపయోగపడుతున్నట్లే విద్యార్థులకు దేశవ్యాప్తంగా భావి విద్యాభ్యాసంలో ఎలాంటి సమస్యలు ఎదురవకుండా అపార్ సంఖ్య ఉపయోగపడుతుంది. దీని కోసం విద్యార్థి ఆధార్‌కార్డులో వివరాలు ఎలా ఉన్నాయో అలాగే పేరు, పుట్టినతేదీ, తండ్రి, తల్లి వివరాలు నమోదు చేస్తేనే అపార్ సంఖ్య వస్తుంది. ఎక్కడ తేడా వచ్చినా అక్కడితో ఆగిపోయినట్లే. ఈ కారణంగా విద్యార్థులకు అపార్ సంఖ్య కేటాయించేందుకు విద్యాలయాల్లో ప్రత్యేకంగా ఆధార్ నమోదు, నవీకరణ శిబిరాలు ఏర్పాటుచేశారు. పామర్రు జూనియర్ కళాశాలలో మంగళవారం శిబిరాన్ని ప్రిన్సిపల్ చంద్రశేఖర్ ప్రారంభించారు. అధ్యాపకులు వై.ఈశ్వరుడు, గుమ్మడి వెంకటరమణ, సలాది శ్రీరామచంద్రమూర్తి, దుర్గాదేవి, సీఆర్పీ నాతి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు. కేంద్రం నిర్వాహకుడు ప్రసాద్ మాట్లాడుతూ 30 మంది విద్యార్థులు నమోదు, వివరాల నవీకరణ చేయించుకున్నారని చెప్పారు. పాణింగిపల్లిలోని సచివాలయంలో రోజూ ప్రత్యేక నమోదు కేంద్రం పనిచేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పామర్రు జూనియర్ కళాశాలలో విద్యార్థి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

సేంద్రియ పంటల వినియోగంతో ఆరోగ్యం

అంకంపాలెం (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: సేంద్రియ పంటలే ఆరోగ్యానికి పునాది అని, ఇవి సమాజ వికాసానికి దోహదపడతాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం అంకంపాలెంలోని కల్యాణకృష్ణ గో విజ్ఞాన క్షేత్రం వద్ద ప్రకృతి వ్యవసాయ సలహాదారు బొప్పన సీతారామదాసు అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సదస్సులో వారు మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సేంద్రియ ఉత్పత్తుల రిటైల్ దుకాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఏర్పాటు చేసిన గోఆధారిత సేంద్రియ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రాచుర్యం కల్పిస్తున్న ఆదర్శ రైతు కుదప కృష్ణమూర్తిని సత్కరించారు. నియోజకవర్గస్థాయి కమిటీ ఛైర్మన్‌గా ఆయనను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ శావల దేవదత్తు, వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ వెంకటరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, సర్పంచి రాజు, ఏపీసీఎన్ఎఫ్ పీఎంలు కొత్తపల్లి శ్రీనివాస్, బొర్రా తాతారావు, జె.ఎలియాజరు, కృషీవల కోకోనట్ ఫార్మ్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



ఆదర్శ రైతు కుదప కృష్ణమూర్తికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

మర్రి వృక్షం.. ఊడల విన్యాసం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు బౌద్ధ స్థూపం ప్రాంగణంలోని ఓ మర్రిమాను మధ్యలో కొమ్మలు గుండ్రంగా చుట్టుకుని ఆకర్షిస్తోంది. చుట్టూ బలమైన కొమ్మలతో విస్తరించిన చెట్టు మధ్యలో గుండ్రని వంపులతో స్ప్రింగ్ ఆకారంలో ఉండి పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఊడల మధ్యలో ఏదైనా అడ్డు తగిలితే ఇలా చుట్టుకుంటాయని కడలి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సీహెచ్ హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా రేపు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్.సునీల్‌కుమార్ తెలిపారు. 50 ఖాళీలకు ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, డిప్లొమా చదివిన వారు అర్హులన్నారు. గురువారం ఉదయం 9.30కు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు రాజమహేంద్రవరం, ఏలూరు, అమలాపురం, కాకినాడ, భీమవరం పరిసర ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తుందన్నారు. నెలకు రూ.18వేల వేతనం లభిస్తుందన్నారు.

ఆవేదనలోనూ ఆదర్శంగా నిలిచారు..

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లిలంక గ్రామానికి చెందిన **చిట్టూరి అచ్చుతరామన్నచౌదరి**(45) ఈ నెల 4న అనారోగ్యంతో మృతి చెందగా అతని పార్థివదేహాన్ని తల్లి చిట్టూరి సీతారత్నం అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి దానం చేశారు. తన కుమారుడి పార్థివదేహం వైద్య విద్యకు ఉపయోగపడాలనే ఆకాంక్షతో ఆసుపత్రికి ఇచ్చామన్నారు. బాధలోనూ సీతారత్నం నిర్ణయం ఆదర్శనీయమని కిమ్స్ అటానమస్ విభాగాధిపతి నారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు.

20న సాగర తీరంలో మహా కుంభాభిషేకం

గాంధీనగర్, కాకినాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాస ముగింపు సందర్భంగా ఈ నెల 20వ తేది గురువారం కాకినాడ సాగర తీరంలో లోకకల్యాణార్థం శ్రీమంగళాంబికా సమేత ఆది కుంభేశ్వరస్వామి వారి ఆలయం వద్ద మహా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భారత యజ్ఞ పీఠం కమిటీ సభ్యులు తెలిపారు. కరపత్రాలను మంగళవారం ఆలయంలో ఆవిష్కరించారు వారు మాట్లాడుతూ గోపూజతో ప్రారంభించి 1.08 కోట్ల శివలింగాలకు, పాదరస శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకించే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. 101 మంది కన్యలతో కలశాల ఊరేగింపు ఉంటుందని, మహా దేవుడి అభిషేక ద్రవ్యాలను సాగరంలో నిమజ్జనం చేస్తామని వివరించారు. ఆలయ అభివృద్ధి, శాశ్వతంగా శివలింగాల ఏర్పాటుకు రూ.10 లక్షల విరాళం అందజేయనున్నట్లు కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షులు(బాబి) ప్రకటించారు. కమిటీ సభ్యులు చిట్నీడి శ్రీనివాసు, బోగిరెడ్డి తాతారావు, గంగిరెడ్డి అరుణ, బూర్ల సత్యనారాయణమ్మ, ప్రసన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20న కాకినాడ సాగర తీరంలో జరిగే 50వ మహా కుంభాభిషేక కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భారత యజ్ఞపీఠం కమిటీ సభ్యులు

ఆ తండ్రి పసికందును చూడనేలేదు..

స్కూల్ బస్సు ఢీకొని ఇటుకబట్టీ నిర్వాహకుడి మృతి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెళ్లయిన రెండేళ్లకు జన్మించిన పుత్రికను చూడాలనే ఆత్రుత.. అంతలోనే తాత లోకం వదిలి వెళ్లారనే వార్త తెలిసి ఆ యువకుడు ఉక్కిరిబిక్కిరయ్యాడు. మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ యువకుడు ఈ లోకాన్ని వీడారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివీ.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన మొదలవలస సాయి(27) మామిడాడలో ఎనిమిదేళ్లుగా కుటుంబ సభ్యులతో ఉంటూ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఏలేశ్వరం మండలం అప్పనపాలెంలో ఇటుకబట్టీ వద్దకు చిన్నాన్నతో కలిసి వేర్వేరు మోటారు సైకిళ్లపై వెళుతున్నారు. మామిడాడ శివారు కల్యాణ్ చెరువు వద్దకు వచ్చేసరికి సాయి వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ప్రైవేటు స్కూలు బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయి (పాత చిత్రం)

పనులన్నీ చూసుకుని వస్తానని..

తిరుగుడుమెట్టకు చెందిన సాయికి హైమవతితో రెండేళ్ల కిందట పెళ్లైంది. ఆమె ప్రసవానికి పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 14న శుక్రవారం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో ఉన్న భార్య, చిట్టితల్లిని చూసేందుకు సాయి బయల్దేరగా ఇంతలోనే తాత ఆనందరావు(65) తీవ్ర అనారోగ్యానికి గురై ఈ నెల 15న శనివారం మృతిచెందారని తెలిసింది. దీంతో తాత అంత్యక్రియలు పూర్తిచేయగా ఈ నెల 25న దశదినకర్మ చేయాల్సిఉంది. భార్యకు చరవాణి ద్వారా విషయాన్ని తెలియజేసి అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక వచ్చి కుమార్తెను చూస్తానని చెప్పారు. మంగళవారం ఉదయం వ్యాపార లావాదేవీల నిమిత్తం అప్పనపాలెం వెళుతుండగా మృత్యువు పాఠశాల బస్సు రూపంలో కబళించింది. భార్యను, కూతుర్ని చూడకుండానే సాయి మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

'చేతిలోనే పోస్టాఫీసు'

అందుబాటులోకి 'డాక్ సేవా యాప్'

తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు 2.0లో భాగంగా కొత్తగా 'డాక్‌సేవా యాప్'ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లలోని గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుంటే దేశంలోని 23 భాషల్లో సేవలు అందుబాటులోకి వస్తాయి. పాత 'పోస్టు ఇన్ఫో' యాప్ స్థానంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పోస్టల్ టెక్నాలజీ డాక్ సేవా యాప్‌ను రూపొందించింది.

మీకు తెలుసా?

సత్వరమే ఈ-సేవలు

యాప్ ద్వారా 8 రకాల సేవలు వేగంగా పొందే అవకాశం ఉంది. పార్సిల్ ట్రాకింగ్, పోస్టేజీ లెక్కలు, ఫిర్యాదులు, బీమా ప్రీమియం చెల్లింపు వంటి అనేక సేవలు పొందవచ్చు. డిపాజిట్లు, మనీఆర్డర్ వివరాలు పరిశీలించవచ్చు. వీటితోపాటు దేశీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఛార్జీలు ఎంత ఉంటాయని తెలుసుకునే వీలుంది. కార్పొరేట్ ఖాతాదారులకు తమ వ్యాపార లావాదేవీలకు ప్రత్యేక సేవలు కూడా ఉన్నాయి. దీంతో అనేక మంది ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ప్రతి దానికీ తపాలా కార్యాలయానికి వెళ్లకుండా సద్వినియోగం చేసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, తుని

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	111-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-30 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

Year	Model	Reg. No
2022	Leyland/Dost	AP39UC8382
2023	Leyland/Bada Dost	AP39VD1277
2023	Maruti/Alto	AP39SC3090
2023	Maruti/Swift	AP39UT6663
2025	Tata/Punch Adventure	AP40FC6204

SUNDARAM FINANCE Ltd., TUNI CONT: 85001 58018

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్. తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయిన విడిపించి ఆ రోజు మార్కెట్ రేటుకి కొనబడును, స్పాట్‌క్యాష్. ✆ 94933 38823.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

EENADU for Advertisement Contact: 8008597607

REAL ESTATE

FLAT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

3 BHK Flat అమ్మకం. రాజమండ్రి, మోరంపూడి జంక్షన్ వద్ద, హైవే ప్రక్కన 3 BHK Flat అమ్మకమునకు కలదు. Contact Cell: 98480 56558.

HOUSE FOR SALE

KAKINADA RURAL

కాకినాడ రూరల్, గంగనాపల్లి, సత్యదేవ గార్డెన్స్, సత్తెమ్మతాడి దగ్గర 243 చ॥గ॥ల స్థలంలో గల గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ నార్త్ ఫేసింగ్ ఇల్లు అమ్మకము. ✆ 98494 20475.

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

266 చ॥గ॥ స్థలం అమ్మకమునకు కలదు. 'ఆదిత్య గ్రీన్‌సిటీ' పెద్దాపురం, పాత పెద్దాపురం రోడ్, ప్లాట్‌నెం.159, E/F, 60 అడుగుల రోడ్ ఫ్రంట్, ఆసక్తి ఉన్నవారు సంప్ర: 99666 98999.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గణనీయ అధిక ఆదాయం. త్వరపడండి. Contact: 99490 00033.

JOBS

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్ మేన్ కావలెను. సంప్రదించవలసిన టైం: 9 am to 6 pm. Contact Cell: 95507 32122.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్), తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

రాజమండ్రిలోని శ్రీ గిరిధారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నందు పనిచేయుటకు CC Roadsలో అనుభవం కలిగిన వారు కావలెను. Contact Cell: 80991 91919.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

సఖినేటిపల్లిలో పోలీసులు, విద్యార్థుల ప్రదర్శన

మాదకద్రవ్యాలపై యుద్ధం చేద్దాం

సఖినేటిపల్లి: మాదకద్రవ్యాల వాడకంపై యుద్ధం చేద్దామని సఖినేటిపల్లి ఎస్సై దుర్గా శ్రీనివాస్ అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో పోలీసులు, విద్యార్థులు, స్థానికులతో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. డ్రగ్స్ వాడొద్దని, వాడితే కలిగే నష్టాల గురించి ఎస్సై వివరించారు. మూడుతూముల కూడలిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

కొత్తపేట డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

కొత్తపేట, న్యూస్‌టుడే: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి సింగిల్ మేజర్ ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.పి.రాజు తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీలలో ఖాళీ ఉన్న సీట్లకు 17 నుంచి 20 వరకు ప్రవేశాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 97043 02775, 94901 86830 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

తాగునీటి ట్యాంకు శుభ్రం

రావులపాలెం గ్రామీణం: రావులపాలెం మండలం దేవరపల్లిలో మంచినీటి ట్యాంకు ద్వారా సరఫరా అవుతున్న నీటిలో మలినాలు రావడంతో ప్రజలు నీటిని వినియోగించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ట్యాంకును శుభ్రం చేయించి మలినాలు రాకుండా చర్యలు తీసుకున్నారు.

కుళాయికి మరమ్మతులు

రావులపాలెం పట్టణం: రావులపాలెంలోని కొత్తకాలనీలో మంచినీటి కుళాయిలు పాడైపోవడంతో నీరు వృథాగా పోతుంది. సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

పొదలు తొలగించారు

ఈనాడు కథనానికి స్పందన

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిలో విద్యుత్తు స్తంభానికి పచ్చని పొదలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈ నెల 14న 'ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం' శీర్షికన చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన ఆ శాఖ అధికారులు స్తంభానికి అల్లుకున్న పొదలు తొలగించారు.

కాలం చెల్లినా.. కొనసాగింపేనా?

శిథిలావస్థలో స్లూయిస్‌లు

న్యూస్‌టుడే, మామిడికుదురు

సాధారణ సమయాల్లో నీరు సజావుగా సాగేలా, భారీ వర్షాలు, పోటు తాకిడి సమయాల్లో ఉపరితలం మీదుగా ప్రవహించేలా దాదాపు ఏడు దశాబ్దాల క్రితం డ్రెయిన్లపై నిర్మించిన కాజ్‌వేలు పూర్తిగా శిథిలస్థితికి చేరాయి. వాటి స్లాబులు పెచ్చులూడి, నెర్రెలు తీసి, మధ్యలో కుంగిపోయి, రక్షణ కమ్మీలు విరిగి ప్రమాదకరంగా మారాయి. వీటి వద్ద నీటి పారుదల స్తంభించిపోతుండడంతో సమీపంలోని తోటలు, చేలు, ఇళ్లు ముంపు బారిన పడుతున్నాయి.

పాశర్లపూడిలంక మీడియం డ్రెయిన్‌పై శిథిల స్థితిలో కాజ్‌వే

కుంగి.. ప్రమాదకరంగా మారి

పాశర్లపూడిలంక వెళ్లే మార్గంలో వాడబోది మీడియం డ్రెయిన్‌పై ఉన్న కాజ్‌వే కింది భాగంలో తూరలు పూర్తిగా ఛిద్రమై కుంగిపోయింది. ఓఎన్జీసీ వాహనాల రాకపోకలకు గతంలో దీనిపైనే తూరలు పెట్టి స్లాబు వేశారు. క్రమేణా అవి కూడా నిరుపయోగంగా మారాయి. రెండువైపులా ఉన్న రక్షణ కమ్మీలు విరిగి ఊచలు బయటకు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడి ముంపుతోపాటు సముద్రం పోటు నీరు చేరి వ్యవసాయ భూములు చవుడు బారిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువ పాటురేవు మధ్యలో ఉన్న కాజ్‌వే కుంగిపోయి అంచులు విరిగి పడిపోతున్నాయి. ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం, రహదారి ఏర్పాటుకు సీఆర్ఐఎఫ్ నుంచి రూ. 14.50 కోట్లు మంజూరయ్యాయి. పనులు వేగవంతంగా చేపట్టాలని స్థానికులు విన్నవిస్తున్నారు. ఈదరాడ-నడిమిలంక మధ్య హళ్లికోడు డ్రెయిన్‌పై ఉన్న కాజ్‌వేసహా మోరిపొలం, లూటుకుర్రు, ముత్యాలపాలెంలో డ్రెయిన్ల మధ్యలోని కాజ్‌వేలు రక్షణ గోడలు విరిగి రంధ్రాలు పడడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

నిధులు మంజూరైన వెంటనే పనులు

వాడబోది మీడియం డ్రెయిన్‌పై పాశర్లపూడిలంక వద్ద శిథిల కాజ్‌వే పునర్నిర్మాణానికి రూ. 1.50 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసి ఆమోదానికి పంపించాం. మిగతా డ్రెయిన్లపై కూడా శిథిల కట్టడాల స్థానే కొత్త నిర్మాణాలకు ప్రతిపాదనలు చేసి పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. ప్రస్తుతం వీటి వల్ల ఎక్కడా మురుగునీటి పారుదలకు అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటాం. - ఆనంద్‌కిరణ్, ఏఈఈ, డ్రెయిన్స్, రాజోలు

విగ్రహాన్ని ఆవిష్కరించిన నాయకులు

కాటన్ విగ్రహావిష్కరణ

ఆలమూరు: సంధిపూడిలో దివంగత దొడ్డా వెంకయ్య, భూలోకం దంపతులజ్ఞాపకార్థం వారి కుమారుడు దొడ్డా సత్తిపండు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాన్ని, పార్కును పారిశ్రామికవేత్త అడపా భాస్కరరామ్మూర్తి మంగళవారం ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని భాస్కరరామ్మూర్తి కోరారు. గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

సొసైటీ వద్ద సహకార ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: సహకార సంఘాలను బలోపేతం చేసి అన్నదాతలకు మేలు జరిగేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట సొసైటీ అధ్యక్షుడు అరిగెల సూరిబాబు అధ్యక్షతన మంగళవారం మహాజన సభ జరిగింది. తొలుత ఎమ్మెల్యే సత్యనారాయణ ఆధ్వర్యంలో సహకార పతాకాన్ని ఎగురవేసి ప్రతిజ్ఞ చేయించారు. తెదేపా నేతలు మోకా ఆనంద్‌సాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, సహకార వారోత్సవాల జిల్లా ఇన్‌ఛార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు, జిల్లా ఆడిట్ అధికారి విజయలక్ష్మి, సహకార కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● చిరుతపూడి సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు రంపం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు.

మహిళా నాయకులకు గుర్తింపు

పి.గన్నవరం: కూటమి ప్రభుత్వంలో మహిళా నాయకులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదవులు కేటాయించి గుర్తింపు ఇస్తున్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన అంబటి భూలక్ష్మిని మంగళవారం పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆయన సత్కరించారు. ● ముంగండలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అంబటి భూలక్ష్మిని సంఘ ప్రతినిధులు సత్కరించారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రైతు బజార్ల ఏర్పాటుకు సహకరించాలి

మలికిపురం: మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల్లో రైతు బజార్ల ఏర్పాటుకు అధికారులు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు బజార్ల ఏర్పాటుపై కసరత్తు చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. మలికిపురంలో ఆదివారం మార్కెట్ ప్రాంతం, సఖినేటిపల్లిలో మార్కెట్ గోదాములు అందుబాటులో ఉన్నాయని గుబ్బల మురళీకృష్ణ, ముప్పర్తి నాని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తహసీల్దార్లు టి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, భాస్కర్, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఏఎస్‌వో శరత్, జిల్లా అగ్రికల్చర్ (ట్రేడర్స్) మార్కెటింగ్ అధికారి విశాలాక్షి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రావులపాలెం పట్టణం: అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన ములగలేటి వెంకన్నకు రావులపాలేనికి చెందిన అక్షయ సేవా సంస్థ సభ్యులు రూ.55 వేలు, 110 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను మంగళవారం అందించారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలకు ఎంపీ పూజలు

అయినవిల్లి: అమలాపురం ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అయినవిల్లిలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. మడుపల్లిలో జరిగిన వనసమారాధనలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్తిక దీపోత్సవం

కొత్తపేట, న్యూస్‌టుడే: మందపల్లిలోని మందేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని గోవింద నామం, శివలింగాలు, త్రిశూలాలు వంటి ఆకృతులలో దీపాలు వెలిగించారు.

రజకులు అభివృద్ధి సాధించాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: రజకులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని తెదేపా నాయకురాలు సుజాత అన్నారు. గంగలకుర్రు జేకనగర్‌లోని కోదండరామాలయం వద్ద గ్రామసంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన మంగళవారం నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు అధికారపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె పాల్గొన్నారు. అమలాపురం తాలూకా రజక సంఘం అధ్యక్షుడు పేట ఏడుకొండలు, మండల సంఘం అధ్యక్షుడు నేదునూరి కల్యాణ్, నాయకులు పాల్గొన్నారు.

బాధితులు నష్టపోకుండా చూస్తాం

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిని ఆనుకుని నిర్మిస్తున్న సర్వీస్ రహదారి వల్ల ఎవరికీ నష్టం జరగకుండా చూస్తామని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ హామీ ఇచ్చారు. మడికి నుంచి చొప్పెల్ల లాకుల వరకు నిర్మిస్తున్న సర్వీస్ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మడికి కూరగాయల మార్కెట్ వద్ద ప్రారంభించిన డ్రెయినేజీ పనులను, చెముడులంకలో తొలగించాల్సిన ఇళ్లు, దుకాణాలను పరిశీలించారు. నష్టపరిహారం ఇవ్వకుండా ఇళ్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ, నేషనల్ హైవే రికార్డుల ప్రకారం మార్కింగ్ ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు. మార్కింగ్ ఆధారంగా ఆక్రమణలు ఉంటే తొలగించాలని, లేకపోతే భూసేకరణ చేపడతామన్నారు. తహసీల్దార్ కేజే ప్రకాశ్‌బాబు, ఎంపీడీవో రాజు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీకర్

ఆర్టీసీ బస్టాండుకు స్థల పరిశీలన

ఆత్రేయపురం: వాడపల్లిలో ఆర్టీసీ బస్టాండు నిర్మాణం నిమిత్తం కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ మంగళవారం 80 సెంట్ల దేవస్థానం స్థలాన్ని పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవనం, ఇతర నిర్మాణ పనుల్ని చూశారు. ఈవో నల్లం సూర్యచక్రధరరావు, తహసీల్దారు టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఆర్టీసీ డీఎం వైవీవీ నాగకుమార్ పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింట్లు 1. పెన్మెత్స లేటు గోపాల కృష్ణంరాజు గారి భార్య సూర్యకాంతం, విశాఖపట్నం అను వారు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి మా క్లయింటు తండ్రి గారైన సత్యనారాయణరాజు గారికి చెందిన ఆస్తి అయి యున్నది. సదరు ఆస్తిపై నా క్లయింటుకు 1/3వ వంతు వాటా కలిగి యున్నారని, అందు నిమిత్తము ఆమె సోదరుడైన అల్లూరి వెంకట సత్యనారాయణరాజు అనే పండు మాస్టారు, సఖినేటిపల్లి అనువారు మా క్లయింటుకు వాటా పెట్టకుండా షెడ్యూలు దాఖలా ఆస్తి కాజేయాలనే దురుద్దేశ్యముతో సదరు భూమి ఇతరులకు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నము చేయుచున్నట్లుగా మా క్లయింటుకు తెలియవచ్చినది.

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా షెడ్యూలు దాఖలా ఆస్తిపై మా క్లయింటుకు 3వ వంతు వాటా గలదని ఆమె సోదరుడు కొన్ని తప్పుడు కాగితములు సృష్టించి విక్రయించుటకు ప్రయత్నం చేయుచున్నట్లుగా తెలియవచ్చినది. కావున మా క్లయింటు సోదరుని ప్రలోభములకు లోబడి ఎవరైనా ఏవిధమైన దస్తావేజులు ఇతరుల వద్ద నుండి పొందినా, అవి చెల్లనేరవని యావన్మందికి తెలియజేయుటమయినది.

షెడ్యూలు

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పూర్వపు తూర్పుగోదావరి జిల్లా, సఖినేటిపల్లి మండలం, సఖినేటిపల్లి గ్రామం తాలూకు
1. రి.స.నెం.307/1Bలో య.2-47 సెంట్లు
2. రి.స.నెం.309/8Aలో య.1-11 సెంట్లు

పి.వి.కృష్ణంరాజు, అడ్వకేట్, రాజోలు.

ప్రకటన

సరెళ్ళ చంద్రయ్య, S/o వెంకయ్య, డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, మగటపల్లి గ్రామ కాపురస్థులు సరెళ్ళ సుబ్బలక్ష్మి ఇచ్చిన ప్రకటన. నా భర్త గారైన సరెళ్ళ చంద్రయ్య గారు ది. 24-08-1998న మామిడికుదురు మండలం, మగటపల్లి గ్రామంలో అనారోగ్య కారణంగా మృతిచెందినారు. నా భర్త గారి మరణం గ్రామ పంచాయతీ రికార్డుల్లో నమోదు కాలేదు. దానిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలో తెలియజేయగలరు.

సరెళ్ళ సుబ్బలక్ష్మి W/o చంద్రయ్య
మగటపల్లి, మామిడికుదురు మండలం
డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా

విద్యాలయం చెంత.. తుప్పలతో చింత

అంబాజీపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ చెంతన పిచ్చిమొక్కల తుప్పలు బాగా పెరిగిపోయాయి. ఆవరణ, తాగునీటి ట్యాంకు సమీపంలో డొంకలను తొలగించి పువ్వులు, పండ్ల మొక్కలను నాటితే ప్రయోజనం ఉంటుందని గ్రామస్థులు సూచిస్తున్నారు. పాఠశాల వద్ద తుప్పలు పెరిగిపోవడంపై ఎంఈవో మోకా ప్రకాష్‌ను వివరణ కోరగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎం, ఏఎస్ఎంసీతో చర్చించి అవకాశం ఉన్నంత మేర సమస్యను చక్కదిద్దుతామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

అసంపూర్తి నిర్మాణం.. కానరాని ప్రయోజనం

మామిడికుదురు శివారులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనానికి నిధులు చాలక పోవడంతో గత రెండున్నరేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. దీనిని పూర్తి చేయడానికి రూ.5 లక్షల వరకు వ్యయమవుతుందని అంచనా వేసినా నిధుల జాడ కనిపించడం లేదు. నిధులు మంజూరైన వెంటనే పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకువస్తామని సంబంధిత ఏఈ ఆనంద్ తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

ఒరిగిన ప్రహరీతో ముప్పు..

స్థానిక బాలాత్రిపురసుందరి సమేత గరుడేశ్వరస్వామి ఆలయం వద్ద పడమరవైపు ప్రహరీ కొంతభాగం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. ప్రదక్షిణ చేసే భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఈవో ఎన్ వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు వద్ద ప్రస్తావించగా ఆలయ అభివృద్ధికి పుష్కర నిధుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. మూడువైపులా ప్రహరీని తొలగించి కొత్తది నిర్మిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ డీఎం వైవీవీఎస్ కుమార్ తెలిపారు. బొబ్బర్లంక రూటులో ఆర్టీసీ బస్సుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు వేలాడుతూ యాతన పడుతున్న వైనంపై 'పట్టుతప్పితే ప్రమాదమే' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి డీఎం స్పందించారు. ఆత్రేయపురం బస్టాండుకు వచ్చి వెళ్లే బస్సులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఉదయం వేళ మురమళ్ల బస్సు ఆత్రేయపురం మీదుగా నడుపుతున్నట్లు చెప్పారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకుల పంపిణీ

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా మోరి గ్రామంలో ఇబ్బంది పడుతున్న 320 కుటుంబాలకు మాజీ ఎంపీపీ పప్పుల లక్ష్మీసరస్వతి దంపతులు 10 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు చొప్పున అందించారు. వీవీమెరక పీఏసీఎస్ అధ్యక్షులు వీరా రామారావు, తెదేపా మండల కార్యదర్శి తాడి సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షులు సుధాకర్, బాబురావు, చింతా వీరభద్రేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరకులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ లక్ష్మీసరస్వతి

సినీనటి హేమకు మాతృవియోగం

రాజోలు, న్యూస్‌టుడే: సినీనటి హేమకు మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి కోళ్ల లక్ష్మి(80) రాజోలులోని నివాసంలో సోమవారం రాత్రి మృతిచెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లో ఉన్న హేమ మంగళవారం ఇక్కడికి చేరుకుని తల్లి మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. సోంపల్లిలోని కైలాస భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఓఎస్డీ వెంకటకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న ఒప్పంద ఉద్యోగులు

ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు వినతి

అంబాజీపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పంచాయతీల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా వెంకటసతీష్‌కుమార్, కార్యదర్శి కె. రామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. అమరావతిలో మంగళవారం పంచాయతీరాజ్‌శాఖ ఓఎస్డీ వెంకటకృష్ణ, కమిషనర్ వైవీడీ ప్రసాద్, మంగళగిరిలో జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దీనిపై దృష్టి సారించి ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.

మామిడికుదురు: సమగ్ర శిక్షాలో ఒప్పంద, పొరుగు సేవల్లో పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి భద్రత కల్పించాలని ఉద్యోగులు కోరారు. మామిడికుదురు మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోలు ఎస్.లక్ష్మీనారాయణ, ఎం. వెంకన్నబాబుకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 24న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపడతామన్నారు. బత్తుల శ్రీనివాసరావు, వై.మధు, మెహదీ, మణికుమార్, బి. సరస్వతి, కె.కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

చరవాణి పేలి గృహోపకరణ వస్తువుల ధ్వంసం

అంబాజీపేట: మాచవరం శివారు పోతాయిలంకలో మంగళవారం మట్టపర్తి ఏసునాగేశ్వరరావు ఇంట్లో ఛార్జింగ్‌కు పెట్టిన చరవాణి పేలి పక్కనే ఉన్న పరుపుపై పడటంతో మంటలు రేగాయి. సమీపంలో ఉన్న దుస్తులకు అంటుకోవటంతో మంటలు వ్యాపించి ఏసీ కూడా కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపుచేశారు.

కాలువలో మృతదేహం గుర్తింపు

కొత్తపేట: గోగువారిపేట వంతెన వద్ద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 40-45 సంవత్సరాల వయసు గల వ్యక్తి కుడిచేతిపై అనంతపవన్ కుమార్ అని పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో శవాన్ని భద్రపరిచామని, ఆచూకీ తెలిసినవారు 94409 04842, 94407 96527 చరవాణి నంబర్లలో సంప్రదించవలసినదిగా ఎస్సై సురేంద్ర కోరారు.

పల్లెల్లో స్వచ్ఛత.. పచ్చదనం

ఆదర్శ పంచాయతీలుగా కార్యాచరణ

న్యూస్‌టుడే, ఆలమూరు

పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ పేరుతో నెలరోజుల పాటు ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు జిల్లాలో 22 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల(మండలానికి ఒకరు)కు జడ్పీ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు.

నమూనాగా ఎంచుకుని...

శిక్షణ తీసుకున్న మండలస్థాయి అధికారులు తమ పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంచుకుని పచ్చదనం, పరిశుభ్రత, ఇతర అంశాల్లో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతారు. దాన్ని మోడల్‌గా చూపి మిగిలిన గ్రామాలను తీర్చిదిద్దాలి. కార్యాచరణకు పంచాయతీల నుంచి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అవసరమైన పంచాయతీల్లో తాత్కాలిక పద్ధతిపై పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి, పచ్చదనం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రతి మండల స్థాయి అధికారి వారి పరిధిలో వారంలో ఒక గ్రామానికి పర్యవేక్షణకు వెళ్లాలని ఉన్నతాధికారులు సూచించారు.

కొత్తపేట నియోజకవర్గంలో ఎంపిక చేసిన గ్రామాలు	
మండలం	గ్రామం
ఆలమూరు	నవాబుపేట
ఆత్రేయపురం	లొల్ల
రావులపాలెం	రావులపాడు
కొత్తపేట	అవిడి

21న గ్రామాల్లో..

జిల్లాలోని 365 పంచాయతీల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 21న మండలంలోని హరిత రాయబారులంతా ఎంపిక చేసిన గ్రామానికి చేరుకుని ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తారు. సిబ్బందికి చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇస్తారు. క్రమేణా అన్ని గ్రామాలకు దీనిని వర్తింపజేస్తారు. - ఎ.రాజు, ఎంపీడీవో, ఆలమూరు

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం

వాడపల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా.

బహిరంగ వేలం/ సీల్డ్ టెండరు/ ఇ-టెండరు ప్రకటన

డా. బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామం, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానము నందు గుమ్మటాలు వేసుకునే హక్కునకు, గృహ సంకల్పం హక్కుకు, ఆలయంలో అవసరం అయినప్పుడు ప్రతి శనివారం దేవస్థానం చెప్పిన విధముగా చేయుటకు సెక్యూరిటీ సిబ్బందిని సరఫరా చేయు హక్కుకు మరియు దిగువ తెలిపిన ఐటెంలకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు 1 సంవత్సర కాలపరిమితికి ది.11-12-2025 గురువారం నిర్వహించుటకు బహిరంగ వేలం, బాక్స్ టెండరు E-టెండరు కోరడమైనది. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చేసుకొను ది.21-11-2025 నుండి www.apeprocurement.gov.in ద్వారా లాగిన్ అయి విధముగా పొందవలెను.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు	పాట వివరములు
1	గుమ్మటాలు వేసుకునే హక్కునకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	50,000/-	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బహిరంగ వేలం: ది.11-12-2025 గం.11.00లకు బాక్స్ టెండరు తెరుచు సమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
2	(గృహ సంకల్పం) గృహ సంకల్పం పేరిట ఇటుకలు అమ్ముకునే హక్కుకు & గృహ సంకల్పం పేరిట వచ్చిన ఇటుకులను పోగుచేసుకుని తీసుకుని వెళ్ళు హక్కునకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	20,00,000/-	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బహిరంగ వేలం: ది.11-12-2025 గం.11.00 లకు బాక్స్ టెండరు తెరుచు సమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45 E - టెండర్: ది.21-11-2025 నుండి ప్రారంభం E - టెండర్: ఆఖరి తేది:10-12-2025 ఉదయం 10:00 లకు E - టెండర్ బిడ్ తెరుచుట: ది.11-12-2025 మధ్యాహ్నం 2.00 లకు
3	శ్రీ స్వామివారి ఆలయంలో అవసరం అయినప్పుడు ప్రతి శనివారం దేవస్థానం చెప్పిన విధముగా చేయుటకు సెక్యూరిటీ డ్యూటీ సమయం 9 గంటలు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	10,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
4	పూజలకు అరటిపళ్ళు కొబ్బరికాయలు, తమలపాకులు మొదలైనవి సరఫరా చేయుటకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	5,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
5	షామియానాలు ఏర్పాటు చేసే హక్కునకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	20,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
6	పచ్చి గో-గ్రాసము అమ్ముకొను హక్కునకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	25,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
7	పాత న్యూస్ పేపర్స్ మాత్రమే తీసుకుని పోవు హక్కుకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	1,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
8	పాత ఇనుప సామాన్లు మాత్రమే తీసుకొని పోవు హక్కుకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	2,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
9	గోశాల వద్ద గోమయం (పాచి పెంట) మాత్రమే తీసుకొని పోవు హక్కునకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	10,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
10	కాళీ నెయ్యి మరియు నూనె డబ్బాలు మాత్రమే తీసుకొని పోవు హక్కునకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	5,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
11	సి.సి. కెమెరాలు రిపేర్లు, చేయుటకు (CC Cameras, Computer, Hardware and Software Maintenance) ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	10,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45
12	గోశాల యందు గోవులకు ఎండు గడ్డి సరఫరా చేయు హక్కునకు ది.01-01-2026 నుండి ది.31-12-2026 వరకు	5,000	బాక్స్ టెండరు దాఖలు: ది.11-12-2025 ఉదయం గం.10.00లకు బాక్స్ టెండరు తెరుచుసమయం: ది.11-12-2025 ఉదయం గం.11.45

మిగిలిన వివరములు కొరకు https://tender.eprocurement.gov.in లో చూడవచ్చును.

ముఖ్య షరతులు:
1) ధరావతును Tendar Deposit, The Executive Officer, Sri Venkateswara Swamy Temple, Vadapalli పేరున ఏదైన జాతీయ బ్యాంకు నుండి D.D. తీసి జతపర్చవలెను. మిగతా వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం: 08855-271 888, Whatsapp: +91-9491000085.
2) టెండరు షెడ్యూలు ది.21-11-2025 నుండి ది.10-12-2025 సా.5.00 వరకు మాత్రమే ఆఫీసు పని చేయు వేళలో దేవస్థానం ఆఫీసు నందు రూ: 500/- రుసుము చెల్లించి పొందగలరు.
3) పూర్తి షరతులు కార్యాలయము నందు పొందవలెను.
4) E-టెండర్ నందు పాల్గొనే టెండరుదారులు దరఖాస్తు ధర రూ: 500/- మరియు ధరావత్తు Online ద్వారా చెల్లించవచ్చును. ఇట్టి టెండరుదారులు సదరు రశీదుతో బహిరంగ వేలం నందు పాల్గొనవచ్చును.

తేది: 18-11-2025,
వాడపల్లి.

నల్లం సూర్యచక్రధరరావు
Deputy Commissioner & Executive Officer

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

మురుగునీటి శుద్ధి కేంద్రానికి స్థల పరిశీలన

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని డ్రెయినేజీ వ్యవస్థ ద్వారా వచ్చే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు గుర్తించిన స్థలాన్ని అమలాపురం ఆర్డీఓ కె. మాధవి మంగళవారం పరిశీలించారు. చింతలమెరకలో రెండు ఎకరాల స్థలాన్ని ప్రతిపాదించారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో సీడీఎంఏ ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇక్కడ మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి నీటిని కాలువల ద్వారా పొలాలకు రైతులు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ టి.సుభాష్, కమిషనర్ పి.రవివర్మ, డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలో రూ.లలో)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాటా: 37, వంగ(నలుపు/తెలుపు): 70/50, బెండ: 58, పచ్చిమిర్చి: 52, కాకర: 42, బీర: 58, క్యాలీఫ్లవర్: 28, క్యాబేజీ: 38, క్యారెట్: 60, దొండ: 60, బంగాళదుంప: 25, ఉల్లి: 25, గోరుచిక్కుళ్లు: 45, దోస: 35, చిక్కుడు: 100, చామదుంప: 43, కంద: 55, బీట్‌రూట్: 54, కీరదోస: 39, అల్లం: 82, క్యాప్సికం: 90, చిలకడదుంప: 50, గుమ్మడి: 30, ముల్లంగి: 45, ఉసిరి: 80, నిమ్మ: 30, ఆనప: 30, పొట్ల: 25, అరటి(ఒకటి): 6, మునగ: 12.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

పూడిక తీశారు

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి బాలయోగి కాలనీలో డ్రెయిన్లు పూడిపోయి నీరు సాగక ఇబ్బందులు పడుతున్నాం.
- పి.నాగేశ్వరరావు, స్థానికుడు

సమస్య: పల్లిపాలెం డ్రెయిన్‌లో చెత్తాచెదారం పడి పూడిపోయి దుర్వాసన వస్తోంది. - ఎంవీవీ సత్యనారాయణ, స్థానికుడు

పరిష్కారం: బాలయోగికాలనీ, పల్లిపాలెం ప్రాంతాల్లో డ్రెయిన్ల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పరిష్కరించారు.
– న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

భవిత కేంద్రం.. చిన్నారులకు వరం

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

అడుగు తీసి అడుగు వేయలేరు.. కనీసం సరిగా మాట్లాడలేరు.. తమ పనులు తాము చేసుకోలేరు.. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన వారి పరిస్థితి దయనీయం. ఇలాంటి చిన్నారులకు విద్యతో పాటు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఎదుగుదలకు అవసరమైన సేవలు అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా సాధారణ స్థాయికి వచ్చేలా మార్పును తీసుకొస్తున్నాయి. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో భవిత కేంద్రాల ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నారు. కొందరు వీటిని అందిపుచ్చుకోలేకపోతున్నారు.

బండారులంకలో స్పీచ్‌థెరపీ

మండలానికి ఒకటి..

అమలాపురం నియోజకవర్గంలోని బండారులంక, ఉప్పలగుప్తం, గోడిలంక, ముమ్మిడివరం నియోజకవర్గంలోని చెయ్యేరు, ముమ్మిడివరం, టి.కొత్తపల్లిలో భవిత కేంద్రాలు ఉన్నాయి. ఒక్కోచోట ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు ఒక ఫిజియోథెరపిస్టు, ఒక స్పీచ్‌థెరపిస్టు సేవలు అందిస్తారు. ఈ కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ. 700, బాలురకు రూ.500 రవాణా ఖర్చుల కింద నెలకు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది.

రెండు నియోజకవర్గాల వివరాలు..

కేంద్రం	చిన్నారుల సంఖ్య	ప్రత్యేకావసరాల పిల్లలు
బండారులంక	20	250
గోడిలంక	25	164
ఉప్పలగుప్తం	18	110
ముమ్మిడివరం	50	146
చెయ్యేరు	27	113
టి.కొత్తపల్లి	20	139

సద్వినియోగం చేసుకోవాలి

భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. కొందరికి అవగాహన కొరవడుతుంది. దీంతో సేవలను అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఇక్కడికి తీసుకొచ్చే చిన్నారులకు రవాణా భత్యం కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది.
- ఎం.శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీ, బండారులంక

అసిస్టెంట్ పోస్టుల పరీక్ష ఫలితాలు విడుదల

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి పాలనా సంస్కరణల విభాగం వివిధ శాఖల్లో 2018 నుంచి యూడీసీలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు నిర్వహించిన శాఖాపరమైన ఉద్యోగోన్నతి పరీక్ష ఫలితాల్ని మంగళవారం విడుదల చేసింది. 200 మందికి పైగా పాల్గొనగా యానాం నుంచి అంగాడి శివప్రసాద్, మాదా సుబ్రహ్మణ్యం, మోకా లీలావతికి ఉద్యోగోన్నతి లభించింది. వీరు పరిపాలనాధికారి అంకితీశ్ మార్క్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

సమస్యలపై వినతిపత్రాలు అందజేత

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పంచాయతీల్లో 20 ఏళ్ల పైబడి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ అమరావతిలో డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణను మంగళవారం కలిసి వినతిపత్రం అందించామని జిల్లా కార్యదర్శి సత్యవతి దాసరి లోవరాజు తెలిపారు. జనవాణి, పంచాయతీరాజ్ కమిషనర్లకు సైతం వినతిపత్రాలు అందజేశామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామని వారు హామీ ఇచ్చారన్నారు.

రైతులకు బాసటగా ప్రభుత్వం: ఎంపీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం రైతులకు బాసటగా నిలుస్తోందని ఎంపీ హరీష్‌మాధుర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం

అమలాపురం పట్టణం, కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, సమాజంలో చెడు అలవాట్లను నిర్మూలించడానికి కృషి చేయాలని ఎస్పీ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. అమలాపురంలోని తన కార్యాలయంలో 'మాదకద్రవ్యాల రహిత భారతదేశం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో అవగాహన ర్యాలీ

● ప్రతిఒక్కరూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కాట్రేనికోన ఎస్సై అవినాష్ అన్నారు. మత్తుపదార్థాల వాడకం- అనర్థాలు అనే అంశంపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో కాట్రేనికోన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారం ఇప్పించాలని ధర్నా

యానాం, న్యూస్‌టుడే: దరియాలతిప్ప వద్ద ఓఎన్జీసీ సంస్థ వేసిన గ్యాస్ పైప్ లైన్ వల్ల ఎలాంటి ఉత్పాతాలు జరగకుండా భద్రత కల్పించడంతో పాటు పైప్‌లైన్ పేలుడు నష్టానికి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్లతో నాలుగు గ్రామాల ప్రజలు మంగళవారం పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దరియాలతిప్ప, సీతారాంనగర్, దొమ్మేటిపేట, బాలయోగినగర్ ప్రాంతాల ప్రజలు రెండు గంటల పైగా బైఠాయించారు. 35 రోజులుగా ఆందోళన చేస్తున్నా ఓఎన్జీసీ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని, ఇదే తీరు కొనసాగిస్తే ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని గిడ్డ చంద్రరావు, తిరుకోటి నాగేశ్వరరావు, చింతకుల రామకృష్ణ స్పష్టం చేశారు. రెండు రోజుల్లో చర్యలు తీసుకునేలా చూడాలని పరిపాలనాధికారి అంకితీశ్ మార్క్‌కు వినతిపత్రం అందజేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్సై వరదరాజన్, ఎస్సై పునీత్‌రాజ్ బృందం పర్యవేక్షించారు.

పరిపాలనాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఆందోళనకారులు

వైభవంగా లక్ష రుద్రాక్ష పూజ

అమలాపురం పట్టణం, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణం రవణంవీధిలోని సర్వరామ లింగేశ్వరస్వామి ఆలయంలో ఛైర్మన్ మాచిరాజు రవికుమార్ ఆధ్వర్యంలో 25వ మహా విశిష్ట లక్ష రుద్రాక్ష పూజా మహోత్సవం మంగళవారం నిర్వహించారు. రూ. 40 లక్షలతో నిర్మించబోయే రాజగోపురానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ కొబ్బరికాయ కొట్టారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గండం పల్లంరాజు, భాజపా నాయకులు నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రవణంవీధి సర్వరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి సుభాష్

మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో..

విలసవిల్లిలో..

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి 115 అర్జీలను స్వీకరించారు. అమలాపురం పట్టణం, మండలం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్ల స్థలాలు, కరెంటు సమస్యలు, రోడ్లు, మురుగు కాలువలు, శ్మశానవాటికలు, పింఛన్లు, అభివృద్ధి పనులు తదితర వాటిపై వినతులిచ్చారు.

మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

పశుదాణా పంపిణీ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఉప్పలగుప్తంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రం వద్ద పీపీసీఎస్ అధ్యక్షుడు చిక్కం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం పాడిరైతులకు రాయితీపై పశుదాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ నాగేశ్వరరావు, వైద్యాధికారులు రమేష్, నిరోషా, చిక్కం కాసు, రవణం మధు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

కొత్తపేట, న్యూస్‌టుడే: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి సింగిల్ మేజర్ ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.పి.రాజు తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీలో ఖాళీ ఉన్న సీట్లకు 17 నుంచి 20 వరకు ప్రవేశాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 97043 02775, 94901 86830 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పునాదులు పూర్తయ్యేదెన్నడు..?

కాట్రేనికోన మండలం చెయ్యేరు అగ్రహారంలో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. మూడేళ్ల క్రితం చేపట్టిన ఈ నిర్మాణం పునాది దశ దాటలేదు. తుప్పలు పెరిగి అది సైతం కనిపించడం లేదు. ఈ కేంద్రాన్ని ప్రస్తుతం అద్దె పెంకుటింటిలో నిర్వహిస్తున్నారు. అది శిథిలావస్థలో ఉండటంతో పైన బరకం వేశారు. అధికారులు స్పందించి ఈ భవనం నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, కాట్రేనికోన

అందుబాటులోకి వచ్చేనా..

గత ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా భవన నిర్మాణాలను మంజూరు చేసి పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి. గేదెల్లంకలో రూ. 30 లక్షలతో నిర్మాణం చేపట్టిన ఆర్‌ఎస్‌కే భవనం 90 శాతం పనులు పూర్తై రెండేళ్లు గడుస్తోంది. మిగిలిన పనులను నిధులు విడుదల చేసి అందుబాటులోకి తెస్తే సేవలకు ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు.
- న్యూస్‌టుడే, ముమ్మిడివరం

భవనం బాగుచేస్తే మేలు..

ఎస్.యానాం తీరంలో పర్యాటకుల సౌకర్యార్థం రూ. 50 లక్షలలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన విశ్రాంత భవనం రేకులు ఊడిపోయి అధ్వానంగా మారింది. గత ఐదేళ్లుగా నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం మొత్తం రూపుకోల్పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఈ భవనానికి మరమ్మతులు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ప్రయాణం.. ప్రమాదభరితం

అమలాపురం పట్టణంలోని యర్రమిల్లివారి వీధిలో రూ.8 లక్షలతో రోడ్డు నిర్మించారు. ఇక్కడి నుంచి గొల్లగూడెం బైపాస్ రోడ్డుకు వెళ్లే దారిని అలాగే వదిలేశారు. నిత్యం అటుగా వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ద్విచక్ర వాహనాలు, కార్లు గుంతలో పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఆటపాటలతో సందడి

అమలాపురం పట్టణంలోని కొంకాపల్లి గ్రామస్థుల ఆత్మీయ సమ్మేళనం, కార్తిక వనసమారాధన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున జనం తరలివచ్చారు. అధిక సంఖ్యలో కుటుంబాలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. యువత, పిల్లలు, మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.
- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతే తెదేపా లక్ష్యం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: అగ్నికుల క్షత్రియుల సంక్షేమం, అభ్యున్నతే తెదేపా లక్ష్యమని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు అన్నారు. తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ పరిధి పెదవలసలలో 343 మంది అగ్నికుల క్షత్రియులకు ఓఎన్జీసీ పరిహారం విడుదల కావడంపై అభినందన సభ మంగళవారం నిర్వహించారు. లంకె నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాడ్రేవు వీరబాబు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మందాల గంగసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పెసింగి ఈశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్ పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కృషి ఫలితంగా ఒక్కొక్కరికీ రూ. 63,250 చొప్పున రూ. 2.16 కోట్లు విడుదలైందన్నారు. సంగాడి కామేశ్వరరావు, బొడ్డు వీరబాబు, బొడ్డు శ్రీను, కామాడి మాతరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీసీసెల్ అధ్యక్షుడు వీరబాబు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

ఉప్పలగుప్తం: కాకినాడలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన ఉప్పలగుప్తం మండలం మునిపల్లి పాఠశాల విద్యార్థులు సీహెచ్ హెప్సిబా, ఎం.కావ్యశ్రీ, ఎం.పావని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నూకల సీతాపతి మంగళవారం తెలిపారు. ఈ నెల 22న నెల్లూరులో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను విద్యాకమిటీ ఛైర్మన్ యాళ్ల కిరణ్, సర్పంచి యర్రంశెట్టి రామచంద్రరావు, ప్రధానోపాధ్యాయుడు మంచికంటి వెంకటసుబ్బారావు అభినందించారు.

పంచాయతీల అభివృద్ధికి శిక్షణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కాట్రేనికోన మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటాచలం, డిప్యూటీ ఎంపీడీవో శంకరనారాయణ, శిక్షకుడు జగడం కిరణ్ హాజరై స్వచ్ఛ సంకల్పం సహా పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

కార్తిక వనసమారాధన

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం దుడ్డివారిఅగ్రహారం ఆఫీసర్స్ క్లబ్‌లో దేవతిలకుల కార్తిక వనసమారాధన మంగళవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సంఘీయులు తరలివచ్చారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలను సత్కరించారు. స్థానిక చంద్రబాబు ఉద్యానంలో గుత్తేదారుడు అల్లాడ వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళలు ఉసిరిచెట్టుకు పూజలు చేశారు.

చిన్నారులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పారిశుద్ధ్య పనుల పరిశీలన

అమలాపురం గ్రామీణం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతలక్ష్మి ఆదేశించారు. రెడ్డిపల్లిలో మంగళవారం ఆమె పర్యటించారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను చేపట్టాలని, సంపద కేంద్రాల ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచి కరాటం ప్రసన్న పాల్గొన్నారు.

సంయుక్త కార్యదర్శిగా కనకదుర్గ

అల్లవరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా బీవీసీ సంస్థల ఛైర్‌పర్సన్ బోనం కనకదుర్గ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. మంగళవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన కనకదుర్గకు బోనం కనకయ్య, సతీష్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

సమయానికి రావడం లేదంటూ ఆరోపణలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పల్లంకుర్రు 1, 2, 3 గ్రామ సచివాలయాల సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావడం లేదంటూ ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో చిత్రాలు పెట్టడంతో స్థానికంగా వైరల్ అయ్యింది. దీనిపై ఎంపీడీవో వెంకటాచలంను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా సమయానికి రాకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

యానాం, న్యూస్‌టుడే: పీఎంశ్రీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా 47 మంది 10వ తరగతి విద్యార్థులు రాకెట్ కంట్రోలింగ్ సిస్టం, లాంచింగ్ పాడ్-1(గోల్డ్), అత్యాధునిక లాంచ్‌పాడ్-2, గగన్‌యాన్, రాకెట్ తయారీ విభాగాలను చూసినట్లు సర్వశిక్షాభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతరిక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రొటోకాల్ పాటించడం లేదు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు తమకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన కాట్రేనికోన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. మండల స్థాయి అధికారులు రాకుండా సిబ్బందిని పంపిస్తే వారికి సమాచారం ఏం తెలుస్తుందని, గత సమావేశాల్లో రాని వారిపై ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు. చెయ్యేరులో ఆక్వా చెరువుల విషయమై కోర్టు ఆదేశాలు తెచ్చుకున్నవారికి త్వరితగతిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయాలని సర్పంచి చెల్లి సురేష్ కోరారు. కాట్రేనికోన సహా పలుచోట్ల డ్రెయిన్లు, పంటకాలువలు ఆక్రమణకు గురవుతున్నాయని, గ్రామాల్లో 65 ఏళ్లు పైబడిన వారికి రేషన్ డీలర్లు ఇంటికి వెళ్లి సరకులు ఇవ్వడం లేదని, పల్లంకుర్రులో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయని, గెద్దనపల్లి పశువుల ఆసుపత్రి ప్రారంభం కాకపోవడంతో పాడిరైతులు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు విన్నవించారు. చెయ్యేరులో ఆధార్ మార్పు సహా వివిధ ధ్రువపత్రాల నిమిత్తం పశువైద్యాధికారి వద్దకు వెళ్తుంటే వారు సంతకం పెట్టకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని సర్పంచి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గచ్చకాయలపోరలో ఉపాధిహామీ పనులు చేపట్టం లేదని ఎంపీటీసీ సభ్యుడు మునీంద్ర వివరించారు. తహసీల్దార్ రవికిరణ్, ఎంపీడీవో వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న చెయ్యేరు సర్పంచి సురేష్

యానాంలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

యానాం: ప్రపంచ మత్స్య దినోత్సవం పురస్కరించుకుని యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతెయ్య పర్యవేక్షణలో మంగళవారం వివిధ రకాల ఆటల పోటీలు జరిగాయి. స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలోని ఈత కొలనులో విద్యార్థులకు ఈత పోటీలు, విద్యార్థినులకు లెమన్ స్పూన్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయులు పాము సత్యనారాయణ, పాలికి ప్రకాష్, కొప్పనాతి భాస్కర్, వెంకన్న తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

విద్యార్థినుల లెమన్ స్పూన్ ఆట

(c) eenadu

మండపేట

• మండపేట • రామచంద్రపురం

రూ.12.42 కోట్ల చెక్కుల పంపిణీ నేడు

రాయవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఆర్థిక భరోసా కల్పించే 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం' రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమం బుధవారం జరుగుతుందని వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ చెప్పారు. నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం మండలాల రైతులకు రాయవరంలో సమావేశం నిర్వహించి చెక్కులు అందిస్తున్నారు. ప్రధాని మోదీ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య రైతులు వీక్షించేలా సీతారాం కల్యాణ మండపంలో ఏర్పాట్లు చేశామన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా 18,229 మంది అన్నదాతలకు రూ.12.42 కోట్ల విలువైన చెక్కులను అందజేస్తారని పేర్కొన్నారు. మండపేట మండలంలో 5,694 మంది, రాయవరం మండలంలో 5,090, కపిలేశ్వరపురం మండలంలో 7,445 మంది రైతులకు ఈ పథకంలో లబ్ధి చేకూరుతుందన్నారు.

ఉపాధిహామీ గ్రామసభ

అంగర, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి శ్రామికులకు వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా పనులు గుర్తిస్తున్నట్లు ఏపీవో రంజిత్‌సింగ్ అన్నారు. కపిలేశ్వరపురం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభలో ఆయన మాట్లాడారు. సంవత్సరంలో చేపట్టడానికి గుర్తించిన పనుల వివరాలను చదివి వినిపించి, రైతులకు అవసరమైన పనులను నమోదు చేసుకున్నారు. గ్రామంలో పంటబోదెలు, చెరువుల్లో పూడికతీత తదితర 47 పనులను గుర్తించినట్లు ఏపీవో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సాకా శ్రీనివాస్, ఉప సర్పంచి బి.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శివచక్రవర్తి, ఉపాధి శ్రామికులు, మేట్లు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ 10 - మ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191
కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228
ద్రాక్షారామం: 80085 74192 ద్వారపూడి: 91543 96553

మురుగు పారుదలకు చర్యలు

సమస్య: మండపేట మండలం మెర్నిపాడు మెయిన్‌రోడ్డు డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడంలేదు. దుర్వాసనతో పాటు దోమల తీవ్రతతో ఇబ్బందిగా ఉంది.
- శ్రీరామమూర్తి, మెర్నిపాడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి కె.హరేరామిరెడ్డికి తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి మురుగు పారుదలకు చర్యలు తీసుకున్నారు.
- న్యూస్‌టుడే, మండపేట

విలువైన యంత్రాలు.. మరమ్మతులు కరవు

పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అడ్డంకులు

న్యూస్‌టుడే, రామచంద్రపురం

పట్టణంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం విలువైన యంత్రాలను ఏప్రిల్‌లో పురపాలక సంఘానికి కేటాయించింది. రూ.కోట్ల విలువైన పరికరాలను మున్సిపాలిటీ వారీగా కేటాయించగా 2024 వరకు అంటే సుమారు ఆరేళ్ల పాటు వాటిని మూలనపెట్టి వృథాగా వదిలేశారు. అనంతరం రూ.2.5 లక్షల ఖర్చుతో మరమ్మతులు చేయించి గత ఏడాదిలో వినియోగంలోకి తీసుకొచ్చారు. మళ్లీ తిరిగి ఇప్పుడు సక్రమంగా ఉపయోగించక మూలనపెడుతున్నారని సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

రామచంద్రపురం పట్టణంలో ప్రత్యేకమైన చిన్న పొక్లెయిన్, బాబ్‌కార్ట్, బ్రూమర్ యంత్రాలను ఆయా పనులకు ఉపయోగిస్తున్నారు. చిన్న కాలువల్లో సైతం వీటితో పూడిక తొలగించడానికి తీసుకురాగా పురపాలక సంఘం అధికారులు దాదాపు ఆరేళ్లుగా సక్రమంగా ఉపయోగించలేదు. గతంలో రూ.40 లక్షలతో కాలువలు శుభ్రంచేసినా యంత్రాలను ఉపయోగించి ఖర్చు తగ్గించాలనే ఆలోచన అధికారులకు రాలేదు.

గతంలో బాగుచేసిన తర్వాత ఉపయోగంలోకి తెచ్చిన బ్రూమర్

అవసరాన్ని బట్టి..

కాలువ వెడల్పు ఆధారంగా మూడు రకాల సైజుల్లో యంత్రం ముందుభాగాలు మార్చుకోవచ్చు. చిన్నపాటి నుంచి పెద్దకాలువల్లో అడ్డంపడే వ్యర్థాలను సులభంగా తొలగించవచ్చు. అయితే సరైన డ్రైవర్లు లేక తరచూ అవి మరమ్మతులకు గురవుతున్నాయి. చిన్న మరమ్మతు వచ్చినా సరిచేసే వారు లేకుండా పక్కన పెట్టేస్తున్నారు. గత ఏడాదిలో బ్రూమర్‌కు రూ.70 వేలు, బాబ్‌కార్ట్ మరమ్మతులకు రూ.1.80 లక్షలు వెచ్చించి పాడవుతున్న పరికరాలను మార్చి మళ్లీ నిర్వహణలోకి తెచ్చారు. అప్పటి నుంచి సక్రమంగా వినియోగించకుండా వదిలేశారని, ప్రస్తుతం బాబ్‌కార్ట్‌ను చిన్న మరమ్మతులతో మళ్లీ పక్కన పెట్టారని సిబ్బందే చెబుతున్నారు.

ఉపయోగంలోకి తెచ్చాం..

పొక్లెయిన్‌తో పాటు ఆయా యంత్రాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెచ్చాం. అయితే సరైన శిక్షణ లేని కారణంగా పూర్తిస్థాయిలో నిర్వహించే సాంకేతిక నిపుణులు అందుబాటులో లేరు. ఈ కారణంగా తరచూ అవి మొరాయిస్తున్నాయి. వీటికి శిక్షణ పొందిన డ్రైవర్లను నియమించాల్సి ఉంది. బాబ్‌కార్ట్‌కు చిన్న మరమ్మతులు రావడంతో సరిచేయాలని సంబంధిత గుత్తేదారుకు పని అప్పగించాం.
- దేవిడ్‌రాజు, శానిటరీ తనిఖీదారు, రామచంద్రపురం

మండపేట పట్టణంలో..

మండపేట: పురపాలక సంఘానికి పారిశుద్ధ్య పనుల నిర్వహణకు అందించిన యంత్రాలు, పరికరాలు మరమ్మతులకు గురైనా వాటిని సరిచేసి వినియోగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు తెలిపారు. ... బాబ్‌కార్ట్‌లు, బ్రష్ యంత్రాలతో పాటు మినీ జేసీబీ (హీమెన్) ప్రస్తుతం గొల్లపుంత ప్రాంతంలోని పూడికల తొలగించే పనుల్లో ఉన్నాయని వివరించారు. చిన్న, పెద్ద కాంపాక్టర్లు ప్రస్తుతం పనిచేస్తున్నా తరచుగా హైడ్రాలిక్ పరికరం మరమ్మతులకు గురవుతోందని, ఈ విషయాన్ని సంబంధిత గుత్తేదారు దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.

సంగమేశ్వరస్వామికి అభిషేకం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఏడిద శ్రీస్వయంవర పార్వతీ సమేత సంగమేశ్వరస్వామికి కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు హోతాశాస్త్రి మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు జరిపించారు. రాత్రి నందీశ్వరస్వామికి వివిధ పుష్పాలు, జలాలతో అభిషేకం నిర్వహించారు.

ఏకామ్రేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మండపేట: కార్తీక మాసశివరాత్రి సందర్భంగా టౌన్‌హాల్ సమీపంలోని శ్రీకామాక్షీ ఏకామ్రేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. అంతకుముందు వివిధ ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. కార్యక్రమంలో కోన సత్యనారాయణ, గంపల సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటేలో ప్రతిభ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కాకినాడలో ఈనెల 16న నిర్వహించిన కరాటే జాతీయస్థాయి పోటీల్లో బ్లాక్‌బెల్ట్ సాధించిన పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థి కారుమూరి లేఖ నిహారికను మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ సత్యం మంగళవారం అభినందించారు. తాను సాధించిన పతకాలు, ట్రోఫీలు పట్టుకుని తల్లి దేవీప్రియతో కలిసి ఆమె మంత్రి సుభాష్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ పోటీల్లో ప్రథమ స్థానంతో పాటు కిక్ బాక్సింగ్, శాస్త్రీయ నృత్య పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో గతంలో బంగారు పతకాలు గెలుచుకున్నట్లు మంత్రికి వివరించారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు రూ.1.3 లక్షల ఆర్థిక సాయం అందించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నిహారికను, కోచ్ బి.కె.రత్నాన్ని ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, కూటమి నాయకులు కంచుమర్తి బాబూరావు, కృష్ణారావు తదితరులు ఈ సందర్భంగా అభినందించారు.

నిహారికను అభినందిస్తున్న మంత్రి సుభాష్

గృహాల పురోగతిపై సమీక్ష

మండపేట: టిడ్కో రెండో విడత పెండింగ్ పనుల పురోగతిపై మంగళవారం మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేజ్-2లోని 13 బ్లాకుల్లో అంతర్గత పరిశుభ్రత పనులు పూర్తికాగా 20 బ్లాకుల్లో చెట్లు, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించినట్లు టిడ్కో ఏఈ వివేక్ వివరించారు. మిగిలిన పనులను వారం రోజుల్లో పూర్తిచేయాలని కమిషనర్ ఆదేశించారు. డీఈ కె.శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక అధికారి శ్రీరమ్య, టిడ్కో సీఎల్‌టీసీ బిందుమాధవి, సీఎంఎం పెండ్యాల సుజాత పాల్గొన్నారు.

టిడ్కో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలు గ్రామాల నుంచి వచ్చినవారి నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాను అందుబాటులో లేని సమయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కూటమి నేతలు, ఆయా మండల పార్టీ అధ్యక్షులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సత్యం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, ఏఎంసీ ఛైర్మన్ రిష్వంత్‌రాయ్, వైస్ ఛైర్మన్ దడాల నాగార్జున, కవల నానాజీ, కంచుమర్తి బాబూరావు, కూటమి పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో మంత్రి సుభాష్, సత్యం తదితరులు

ఎన్జీజీవో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఎన్జీజీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా చిక్కాల సూర్యారావు, సహాధ్యక్షుడిగా వి.గౌరీశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డా.ఎస్.ప్రవీణ్, ఎ.సద్గురుమూర్తి, ఇమామ్‌షరీఫ్, పి.రాజారావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా పి.ఎస్.వరలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నయనాల శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా ఎ.శ్రీనివాస్, జి.అశోక్, ఎ.వెంకట్రావు, కె.ఈశ్వరి ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా మహిళా విభాగం నుంచి వి.రోజామణి, కోశాధికారిగా ఎం.కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక సభ్యుడిగా ఎం.వి.సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా మండపేట తాలూకా యూనిట్ అధ్యక్షుడు జుత్తుగ మల్లికార్జునరావు, సహాయ అధికారిగా కార్యదర్శి ఆర్.మోహన్, పరిశీలకులుగా జిల్లా ఫైనాన్స్ అసిస్టెంట్ జి.సుందర్‌సింగ్ వ్యవహరించారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో నాయకులు

దీపోత్సవం.. సాంస్కృతిక పరిమళం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామలో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన సినీ సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రసన్నాంజనేయ స్వామి కార్తిక దీపారాధన మహోత్సవంలో భాగంగా ఏర్పాటుచేసిన సంగీత విభావరిలో విజయవాడ, హైదరాబాద్ నుంచి వచ్చిన గాయకులు పలు పాటలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఉదయం నుంచి పలు కార్యక్రమాలు, సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సినీ సంగీత విభావరి కొనసాగింది. గాయకులు శ్రీకీర్తి, నజీరుద్దీన్ షేక్, ఓంకార్, రసూల్ సాయిశిల్ప పాటలు అలరించాయి. వ్యాఖ్యాతగా సోనా వ్యవహరించారు. కార్యక్రమాల అనంతరం సాయిదుర్గా ఫైర్ వర్క్ అధినేత నరాల సత్తిబాబు ఆధ్వర్యంలో భారీ బాణసంచా కాల్చారు. అనంతరం తెల్లావారుజాము వరకు పౌరాణిక నాటకాల ప్రదర్శన సాగింది.

సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకురాలు శ్రీకీర్తి

దీపస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అభివృద్ధి సాకు.. చెట్టుపై వేటు..

అభివృద్ధి పేరుతో చేపట్టే పనులు కొన్ని సందర్భాల్లో పర్యావరణానికి చేటు కలిగిస్తున్నాయి. పట్టణంలోని కృష్ణామహాల్ ఎదురుగా డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఉందని ఓ భారీ వృక్షంపై వేటు వేసి గంటల వ్యవధిలోనే నేలకూల్చడాన్ని పర్యావరణ ప్రేమికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావును వివరణ కోరగా కాలువ విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉందని నిద్రగన్నేరు వృక్షాన్ని అటవీ శాఖ అధికారుల అనుమతి తీసుకున్న తర్వాతే తొలగించామని చెప్పారు.
- న్యూస్‌టుడే, మండపేట

ఇంటింటా విజ్ఞప్తి.. సందేశం వ్యాప్తి

ఆస్తి పన్ను నూరు శాతం వసూలుకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించినా, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగినా ఫలితం అంతంతమాత్రంగానే ఉండడంతో అధికారులు వినూత్న మార్గం ఎంచుకున్నారు. రోజూ ఉదయం ఇంటింటా చెత్త సేకరించే పారిశుద్ధ్య ట్రాక్టర్‌పై మైక్ ద్వారా ప్రజలకు విజ్ఞప్తులు చేస్తున్నారు. స్వచ్ఛాంధ్ర ప్రచారంతో పాటు సకాలంలో పన్నులు చెల్లించండి.. పట్టణాభివృద్ధికి సహకరించండి.. ఎల్ఆర్ఎస్‌తో అనధికార లేఔట్‌లను సక్రమం చేసుకోండి.. అంటూ ప్రచారం చేయడం ద్వారా కొందరు పన్ను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారని అధికారులు చెబుతున్నారు.
- న్యూస్‌టుడే, మండపేట

అటైనా.. ఇటైనా ప్రమాదమే..

నరసాపురపుపేట-బిక్కవోలు మార్గంలోని నరసాపురపుపేట శివారు మురుగుకాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రెయిలింగ్ ప్రమాదకరంగా మారింది. ఒకవైపు పూర్తిగా పడిపోగా మరోవైపు అక్కడక్కడా విరిగిపోయి ఖాళీలు ఏర్పాడ్డాయి. ఈ రహదారిలో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనపై ఓ మలుపు కూడా ఉంది. వేగంగా వచ్చే వాహనాలు ఇక్కడే అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిపై ర.భ.శాఖ రామచంద్రపురం డీఈ సూర్యనారాయణను వివరణ కోరగా రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- న్యూస్‌టుడే, ద్రాక్షారామ

రన్ ఫర్ యూనిటీని ప్రారంభిస్తున్న వాసంశెట్టి సత్యం

సమైక్య స్ఫూర్తి చాటిన పరుగు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మోడరన్ విద్యా సంస్థలు మంగళవారం రన్ ఫర్ యూనిటీ పేరిట నిర్వహించిన పరుగు సమైక్య స్ఫూర్తిని చాటింది. పట్టణ వీధుల్లో జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం.. అంటూ ముక్త కంఠంతో నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత, కూటమి నేత వాసంశెట్టి సత్యం జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు విద్యా సంస్థల ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ, భాజపా అనకాపల్లి ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, హసనబాద సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు, మోడరన్ విద్యా సంస్థల అధినేత జి.వి.రావు తదితరులు సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పి.ఎస్.ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్.శ్రీనివాస్, మండల తెదేపా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనకే గ్రంథాలయాలు

కాజులూరు, న్యూస్‌టుడే: ప్రజల్లో జ్ఞానం, చైతన్యం సృజనాత్మకత పెరగాలంటే గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా సాధ్యమవుతుందని జిల్లా పరిషత్తు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం చింతా నారాయణమూర్తి అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, యువత ప్రతిభను వెలికితీసేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు క్విజ్ పోటీ..

అంగర: కపిలేశ్వరపురం శాఖ గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సర్పంచి సాకా శ్రీనివాస్ ప్రారంభించగా చిత్రలేఖన ఉపాధ్యాయుడు అబ్బులు పర్యవేక్షించారు. సుమారు 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా చిత్రాలు వేశారని గ్రంథాలయాధికారి డి.శివకుమారి తెలిపారు.

డ్రగ్స్ వద్దు బ్రో..

విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం, న్యూస్‌టుడే: ఆకర్షించే వ్యసనాలకు లోనైతే జీవితమంతా అంధకారమేనని రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు అన్నారు. మంగళవారం సాయితేజా విద్యానికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. బాలికలు, యువతులు వేధింపుల సమస్యలు ఎదురైతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ముందుగా డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ భానురేఖ, ఏఎస్సై రాంబాబు, పీసీ శ్రీను, పీఆర్వో పి.జేమ్స్ శ్యామ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతతోనే ఆరోగ్య గ్రామాలు

రాయవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతను పాటిస్తేనే ఆరోగ్యాభివృద్ధి సాధ్యమని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన అధ్యక్షతన జరిగిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ అవగాహన' కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. ఎంపీడీవో మాట్లాడుతూ డ్రెయినేజీ, పారిశుద్ధ్య పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. అపరిశుభ్రతతోనే కాలానుగుణ వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్న అంశాలను ఇంటింటా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో అపరిశుభ్రతకు తావులేకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉపమండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాజులూరు: ఆధునిక సమాజంలో అభివృద్ధి దిశగా సాగేందుకు పచ్చదనం, పరిశుభ్రత అత్యంత ముఖ్యమైన అంశాలుగా నిలుస్తాయని డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పచ్చదనం పరిశుభ్రతపై మంగళవారం ప్రారంభించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఆరోగ్య జీవన విధానం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పరిశుభ్రతపై సూచనలు చేశారు. శిక్షకులు కె.సూరిబాబు, బత్తిన హేమాదేవి ఆయా అంశాలను వివరించారు.

పరిశ్రమ ధరకే మిశ్రమ దాణా

పామర్రు, న్యూస్‌టుడే: దళారుల ప్రమేయం, పన్నుల భారం లేకుండా పరిశ్రమ నిర్ణయించిన ధరకే మిశ్రమ దాణా పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్ అన్నారు. కె.గంగవరం మండలం సత్యవాడలో సుమారు 150 మంది పాడిరైతులకు ఆయన దాణా అందిచారు. ఈ కార్యక్రమాన్ని తొలిసారి సత్యవాడలో ప్రారంభించామని ఆయన వివరించారు. పశు వైద్యురాలు శ్రావణి మాట్లాడుతూ 50 కేజీల బస్తా ధర రూ.1020 చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు సలాది సీతారాము, ఉప సర్పంచి సలాది వెంకన్న కూటమి నాయకులు, సహాయకులు వీరబాబు, సింధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 96 మందికి ఉద్యోగాలు

రామచంద్రపురం: పట్టణంలోని వి.ఎస్.ఎం. కళాశాలలో మంగళవారం టీవీఎస్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు, ఇతర కళాశాల విద్యార్థులు మొత్తంగా 96 మంది ఉద్యోగాలు పొందారని విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఎంపికలకు 220 మంది హాజరవగా 21 మంది ఇంజినీరింగ్, అయిదుగురు డిప్లమా, 70 మంది డిగ్రీ విద్యార్థులు అసోసియేట్ ట్రైనీ పోస్టులకు ఎంపికయ్యారన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ అర్హత కల్గినవారు రూ.2.6 లక్షల వరకు ప్యాకేజీ పొందుతారని చెప్పారు. టీవీఎస్ హెచ్ఆర్, ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డా.కె.బాలాజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.అన్సారీ, ప్లేస్మెంట్ అధికారులు వి.రవీంద్ర, ఎ.నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందినవారితో ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది

కమ్యూనిస్టు నేత లక్ష్మణస్వామి మృతి

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, శతాధిక వృద్ధుడు బండారు లక్ష్మణస్వామి (102) మంగళవారం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్నతనం నుంచే ఎర్రజెండా పట్టుకుని ఉద్యమాల బాటలో సాగారని, పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించడంలో ఎంతో కృషిచేశారని స్థానికులు పేర్కొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోండి

పామర్రు, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని పామర్రు పాఠశాల సముదాయ ఛైర్మన్ యర్రా ఈశ్వరుడు అన్నారు. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని దంగేరు, పామర్రు, కోటిపల్లి, పేకేరు, కె.గంగవరం, అద్దంపల్లి సముదాయ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించి విజేతలకు ఆయా చోట్ల బహుమతులు అందించారు. సముదాయ విజేతలకు ఈనెల 26న మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయులు జిల్లెళ్ల ప్రేమ్‌కుమార్, పులిదిండి శ్రీనివాస్, ఓదూరి వెంకటరమణ, పలివెల గుణవంతుడు తెలిపారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఈశ్వరుడు తదితరులు

వ్యర్థాల నిర్మూలనతోనే పరిశుభ్రత

మండపేట: వ్యర్థాల నిర్మూలనతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు పేర్కొన్నారు. మంగళవారం 23వ వార్డు సైదిలుపేటలో తడి, పొడి చెత్త వేరు చేయడంపై మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయడం వల్ల మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. సిటీ మిషన్ మేనేజ్‌మెంట్ పెండ్యాల సుజాత, ఆర్పీలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ పూర్వము తూర్పుగోదావరి జిల్లా మరియు ప్రస్తుతం డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, ద్వారపూడి గ్రామమునకు చెందిన చేకూరి భాస్కరరాజు గారి భార్య గారైన చేకూరి సుజాత అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై ఈ బహిరంగ ప్రకటన పూర్వకముగా యావన్మందికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ మండపేట మండలం, ద్వారపూడి గ్రామ పంచాయతీలో చేరిన వేములపల్లి గ్రామము తాలూకు జిరాయితీ పల్లం భూమి ప్రస్తుత సబ్ డివిజనల్ సర్వే నెంబర్ 159-1హెచ్ లోని పూరా ఎ॥ 1-51 1/2 సెంట్లు పూర్వపు సర్వే నెంబర్ 159-1లో పూరా 72-12 సెంట్లు భూమిలోని ఆస్తిని 28-03-2018వ తేదీగల క్రియ దస్తావేజును మండపేట పట్టణ కాపురస్తులైన మాసిన వీర్రాజు గారి కుమారుడు మాసిన సత్యన్నారాయణ గారి వద్ద నుండి దస్తావేజు నెంబర్ 883/2018 గా గల అనపర్తి SRO లో రిజిస్ట్రేషన్ కాబడిన ఆస్తిని కొనుగోలు చేసియున్నారు. కాగా సదరు మాసిన సత్యన్నారాయణ గారు ఆ ఆస్తిని మండపేట పట్టణ కాపురస్తులైన పెనుమర్తి చంద్రరావు గారి వద్ద నుండి 07-05-2013వ తేదీ గల దస్తావేజు నెంబర్ 1330/2013, SRO, రామచంద్రపురం ద్వారా కొనుగోలు చేసియున్నారు. కాగా సదరు పెనుమర్తి చంద్రరావు గారు ఆ ఆస్తిని Z.మేడపాడు గ్రామ కాపురస్తులు అయిన "గంధం సూర్యసుబ్రహ్మణ్యం వగైరాల వద్ద నుండి ది.వి.28-08-1993వ తేదీ గల దస్తావేజు నెంబరు 1954/1993, SRO, మండపేట ద్వారా కొనుగోలు చేసియున్నారు.
" కాగా నా క్లయింట్ ఇటీవల అనగా ది.వి.15-11-2025వ తేదీన సదరు పైన పేర్కొనిన అన్ని దస్తావేజులను తీసుకొని ఉదయం సుమారు 10.00 గంటల సమయములో ద్వారపూడిలోని నా క్లయింట్ ఇంటి వద్ద నుండి బయలుదేరి E.Cలు తీయించు నిమిత్తం అనపర్తి గ్రామము వచ్చుచుండగా సదరు పైన తెలిపిన దస్తావేజులలోని లింకు దస్తావేజు అయిన ది.28-08-1993వ తేదీ గల దస్తావేజు నెంబర్ 1954/1993 of SRO మండపేట అయిన క్రియ దస్తావేజు" ద్వారపూడి గ్రామ మార్గమధ్యములో పడిపోయినది. సదరు దస్తావేజు నిమిత్తం నా క్లయింట్ ఎంత వెతికినను కనిపించియుండనందున నా క్లయింట్ ఈ బహిరంగ ప్రకటన పూర్వకముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, సదరు దస్తావేజు ఎవరికైనను కనిపించిన యెడల ఈ దిగువ తెలిపిన నా క్లయింట్ చిరునామాకు అందజేయగల వారనియు మరియు సదరు దస్తావేజు ద్వారా ఎవరైనను ఎటువంటి అక్రమ లావాదేవీలను నా క్లయింట్ హక్కులకు భిన్నముగా వ్యవహరించుటకు ప్రయత్నించే యెడల అవి చట్టరీత్యా చెల్లనేరవని అనియు మరియు అట్టి చర్యలు నా క్లయింట్‌ను బైండు చేయవనియు ఈ బహిరంగ ప్రకటన పూర్వకముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

నా క్లయింట్ చిరునామా
శ్రీమతి చేకూరి సుజాత, W/o భాస్కరరాజు, CBR అపార్ట్‌మెంట్స్, రైల్వేస్టేషన్ దగ్గర, ద్వారపూడి-533341, Mobile: 9666888899

కొప్పూరి శ్రీనివాసరెడ్డి, బి.ఎ.బి.ఎల్., అడ్వకేట్, D.No.6-153, శేషగిరిరావు పేట, అనపర్తి-533342, Mobile: 98490 78396

అనపర్తి,
ది. 18-11-2025

(c) eenadu

అభిషేకాలు.. విశేష అలంకరణలు

మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం సారంగధరేశ్వర ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. -న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

మహాప్రాణదీపం.. శివం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

కార్తీక బహుళ త్రయోదశి, మాస శివరాత్రి సందర్భంగా ఆలయంలోని అనివేటి మండపంలో శివలింగాకారంలో భక్తులు దీపాలు వెలిగించారు. దేవస్థానంలో మంగళవారం భక్తుల రద్దీ తగ్గింది. కేవలం 3,237 వ్రతాలు జరిగాయి. - న్యూస్‌టుడే, అన్నవరం

విరులు ఒదిగి.. అందాలు పొదిగి

కడియం నర్సరీలు మొక్కలకు పెట్టింది పేరు. దేశ, విదేశాలకు చెందిన ప్రత్యేకమైన, వైవిధ్యమైన మొక్కలను ఇక్కడ చూడొచ్చు. వివిధ ఆకృతుల్లో కనువిందు చేస్తాయి. ఆ ఆకారాల్లో కనిపించేందుకు చాలానే కసరత్తు చేయాలి. ఇక్కడ కనిపిస్తున్నవి కాగితపు పూల మొక్కగా పిలిచే బోగన్‌విల్లా మొక్కలు. ఒకే మొక్కలో వివిధ రంగుల్లో పూయడం వీటి ప్రత్యేకత. వీటిని గొడుగు ఆకృతిలో మార్చేందుకు కడియపులంకలోని ఓ నర్సరీ నిర్వాహకులు గొడుగు ఆకారంలో ఉండే ఇనుప జాలీని ఏర్పాటు చేశారు. మొక్క పెరిగే కొద్దీ గొడుగు ఆకారంలో రెమ్మలను కత్తిరిస్తారు. ఇలా చేసేందుకు మొక్క ఖరీదుతో పాటు రూ.3వేలు ఖర్చు అవుతుందని, ఒక్కో మొక్కను రూ.4 వేలు వరకు విక్రయిస్తామని సదరు నర్సరీ నిర్వాహకులు తెలిపారు.

- ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కడియం

విదేశాలకు రెక్కలు ఎగిరేనా!

గోదావరి నుంచి అంతర్జాతీయ విమానాలపై ఆశలు

కోరుకొండ, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఉన్న ఏకైక విమానాశ్రయం రాజమహేంద్రవరం సమీప 'మధురపూడి'. ఇక్కడి నుంచి అంతర్జాతీయ సర్వీసులకు ఎప్పుడు అడుగులు పడతాయోనని అంతా ఎదురుచూస్తున్నారు. ఈ అంశం కేంద్ర పౌరవిమానయాన శాఖ దృష్టిలో ఉంది. అంతర్జాతీయ గగనయానానికి దోహదపడేలా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. టెర్మినల్ భవన విస్తీర్ణం 5 రెట్లు, ప్రయాణికుల సామర్థ్యం 10 రెట్లు పెరగనుంది.

ప్రస్తుతం ఏ పనులు జరుగుతున్నాయంటే..

● అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.350 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నారు. ● గంటకు 2,100 మంది ప్రయాణికులు ఒకే సారి రాకపోకలు సాగించేలా సామర్థ్యం పెంచుతున్నారు. ● 17,029 చదరపు మీటర్లకు పెంచుతూ టెర్మినల్ భవన నిర్మాణం సాగుతోంది ● తనిఖీ కౌంటర్ల సంఖ్య 28, కార్ల పార్కింగ్ సామర్థ్యం 700కు పెరగనుంది. ● ఒకేసారి 11 విమానాలు పార్కింగ్ చేసేలా ఆప్రాన్ సిద్ధమవుతోంది.

దేశంలో ఏ నగరాలకు సర్వీసులు వెళ్తున్నాయంటే

హైదరాబాద్	6
దిల్లీ	1
చెన్నై	1
బెంగళూరు	1
తిరుపతి	1

ఈ గల్ఫ్ దేశాలకు డిమాండ్..
- కువైట్
- దుబాయ్
- మస్కట్

(ఉభయ గోదావరి జిల్లాలకు ఇదే కీలక విమానాశ్రయం. ప్రధానంగా కోనసీమ.. పశ్చిమంలోని నరసాపురం, ఆచంట, పాలకొల్లుకు చెందిన కార్మికులు, ఉద్యోగులు గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఉన్నారు. వారంతా హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. మధురపూడి నుంచి సర్వీసులు ఉండాల్సిన ఆవశ్యకతపై స్థానిక నేతలు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈ దిశగా ప్రయత్నిస్తున్నారు.)

రాజమహేంద్రవరం విమానాశ్రయం

దృష్టి పెట్టాల్సిన అంశాలు..
- సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులొస్తే అంతర్జాతీయ విమాన కేంద్రం సాకారమవుతుంది.
- పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి.
- ప్రతికూల వాతావరణంలో ఉపయుక్తమయ్యేలా ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్(ఐఎల్ఎం) ఉండాలి.
- విదేశీ ప్రయాణికులకు ప్రత్యేక టెర్మినల్, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, తనిఖీ విభాగాలు అవసరం

మత్తు వ్యసనంపై ఉక్కు శపథం

ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, అధికారులు, విద్యార్థులు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ సూచించారు. జిల్లా వృద్ధులు, వికలాంగులు ట్రాన్స్‌జెండర్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. వీసీ జెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. వీసీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యం వంటివాటికి బానిస కావొద్దన్నారు. ఉన్నత లక్ష్యాలతో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అడిషనల్ ఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ మాదకద్రవ్యరహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. యువతను చైతన్యం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఎన్.ఉదయ్‌భాస్కర్, పీసీసీ డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ వైద్యులు సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

ఇళ్ల స్థలాలపై ఆరా..!

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులందరికీ స్థలాలు కేటాయించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హౌసింగ్ కాలనీల్లో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ లేఔట్లు గుర్తించాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. మండలాల వారీగా రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలాలను గుర్తించారు. వీటితో పాటు మరికొంత భూమిని సేకరించి కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయనున్నారు.

కాపవరం సమీపంలో సేకరించిన స్థలం

9,963 మంది దరఖాస్తులు

రాజమహేంద్రవరం డివిజన్‌లో 8,397, కొవ్వూరు డివిజన్‌లో 1,566 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున కేటాయించడానికి ఎన్ని ఎకరాలు అవసరం? ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, ఖాళీగా ఉన్న లేఔట్లను కలిపితే ఇంకెంత సేకరించాల్సి ఉంటుందనే దానిపై కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో వివరాలు పరిశీలిస్తే

ప్రభుత్వ హౌసింగ్ లేఔట్లు	413
మొత్తం ఇళ్ల స్థలాలు	66,358
పట్టాల జారీ చేసినవి	62,092
కేటాయించని స్థలాలు	4,266
ఖాళీగా ఉన్న లేఔట్లు	85

కొత్త భవనాలు.. సరికొత్త వసతులు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు తరగతి గదుల సమస్య తీరనుంది. నన్నయ ప్రాంగణంలో పలు విభాగాలకు చెందిన భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో మంత్రి లోకేశ్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు చెబుతున్నారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, ఆ తర్వాత నుంచి సాయంత్రం వరకు ఎంబీఏ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. దాదాపు రూ.45 కోట్లతో పూర్తిచేసిన ఈ భవనాలు పూర్తవ్వడంతో ఈ సమస్య తీరినట్లే.

కూటమి ప్రభుత్వం చొరవతో..

గత తెదేపా హయాంలో పలు భవన నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై దృష్టి పెట్టింది. అసంపూర్తి భవనాలు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంది.

ప్రారంభానికి సిద్ధమైన ఇంజినీరింగ్ కళాశాల భవనం

సిద్ధమైన భవనాలు..

● రూ.20.05 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల భవనం పూర్తి చేశారు. ● రూ.8.25 కోట్లతో పరీక్షల భవనం నిర్మించి, మంజీర అని నామకరణం చేశారు. ● రూ.5.50 కోట్ల వ్యయంతో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనం పూర్తి చేశారు. బాలుర వసతిగృహ భవనం పూర్తవ్వగా, రూ.11.10 కోట్లు ఖర్చు చేశారు.

మిగిలినవి అందుబాటులోకి వస్తే..

ప్రస్తుతానికి బాలికల వసతి గృహం, విద్యా కళాశాల భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అవి కూడా అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మరింత మేలు జరుగనుంది. ఈ సమస్య కారణంగా విద్యార్థుల సంఖ్య పరిమితంగా ఉన్నట్లు విశ్వవిద్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ప్రధానంగా వసతి గృహ నిర్మాణం పూర్తయితే యూనివర్సిటీలో చేరే విద్యార్థుల సంఖ్య పెరగనుంది.

ఉలిక్కిపడిన మన్యం

■ ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో చర్చ
■ కాకినాడలో మహిళా మావోయిస్టుల పట్టివేత

ఈనాడు, రాజమహేంద్రవరం, కాకినాడ; న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం: ప్రశాంత వాతావరణం.. నిండా పచ్చదనంతో తొణికిసలాడే రంపచోడవరం-మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఒక్కసారిగా అలజడి. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతో సహా ఆరుగురు మృతిచెందారు. మరో 19 మంది తప్పించుకున్నట్లు తెలుస్తోంది. వీరి కోసం గ్రేహౌండ్స్ దళాలు జల్లెడపడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకప్పుడు అంతర్భాగంగా ఉన్న మన్యంలో తాజా ఎదురుకాల్పుల అంశం కలకలం రేపింది. అదే సమయంలో ఇద్దరు మహిళా మావోయిస్టులు కాకినాడలో చిక్కడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు.

వరుస ఘటనలతో..

◆ ఈ ఏడాది జూన్ 18న రంపచోడవరం-దేవీపట్నం సరిహద్దుల్లోని కింటుకూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రావి వెంకట చైతన్య, సౌత్ జోన్ కమిటీ సభ్యురాలు [illegible] అరుణ వారిలో ఉన్నారు. ◆ ఫిబ్రవరిలో వై. రామవరం ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ◆ ఈ ఏడాది మొత్తంగా మూడు దఫాలు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.

కాకినాడలోనూ ఉనికి

జిల్లా కేంద్రం కాకినాడకు కూతవేటు దూరంలో సామర్లకోట మండలం కొప్పవరంలోని రొయ్యల కంపెనీ సమీపంలో మంగళవారం ఇద్దరు మహిళా మావోయిస్టులు పట్టుబడ్డారు. వారి వివరాలు వెల్లడించకుండా గోప్యత పాటించారు. వీరు నగరానికి ఎప్పుడు వచ్చారు..? ఎవరైనా ఇక్కడ ఆశ్రయం కల్పించారా..? ఎక్కడైనా రెక్కీలు నిర్వహించారా? ఇంకా ఎవరెవరు వచ్చారు? అనే విషయాలపై విచారణ చేపడుతున్నారు.

పోలీసుల అప్రమత్తం..

జిల్లాలు విడిపోయినా మన్యంతో బంధం కొనసాగుతూనే ఉంది. జిల్లాల పునర్విభజన సమయంలో విలీన మండలాల సభ్యులు మస్తుంటారు. ముఖ్యమైన పనులు, ఆసుపత్రులకు మన్యం ప్రజలు రాజమహేంద్రవరం, కాకినాడ తలుపుతడుతుంటారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం మండలాల పరిధిలో అటవీ ప్రాంతం మన్యం సరిహద్దుతో ఉన్నాయి. కాకినాడ సమీపంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టుల నుంచి కొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏజెన్సీ సరిహద్దుల్లో కొత్త వ్యక్తుల కదలికలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

చేతులా.. యంత్రాలా..!

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న యంత్రాలను బాగు చేయడం లేదు. నిత్యం 1,800 వరకు ఓపీ, 400-500 మంది వరకు ఇన్‌పేషంట్లు, పదుల సంఖ్యలో శస్త్రచికిత్సలు జరిగే పెద్దాసుపత్రిలో దుస్తులు ఉతికే యంత్రం (వాషింగ్ మెషీన్) ఏడాదిగా మూలకు చేరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో సుమారు రూ.16 లక్షల విలువైన యంత్రాన్ని కొనుగోలు చేశారు. సాంకేతిక సమస్య కారణంగా మరమ్మతుకు గురైంది. శస్త్రచికిత్స చేసే సమయంలో వైద్యులు వేసుకునే దుస్తులు, గౌన్లు, తదితరవన్నీ చేతులతో ఉతికి ఆరేస్తున్న పరిస్థితి.

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పనిచేయని దుస్తులు ఉతికే యంత్రం

అత్యంత ప్రమాదకరం..

ఆపరేషన్ థియేటర్లో ఉపయోగించే దుస్తులు అత్యంత జాగ్రత్తగా ఉతకాల్సి ఉంటుంది. వీటిని సరిగ్గా ఉతక్కపోతే వైద్యులు, సిబ్బందికి ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదముంది.

చేతులతో ఉతికి ఆరేసిన ఓటీ దుస్తులు

ఇద్దరే విధులు..

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సుమారు రోజుకు వందకు పైగా బెడ్‌షీట్లు, 200 వరకు ఆపరేషన్ థియేటర్ దుస్తులు అందించాల్సి ఉంది. యంత్రంలో గంటకు సుమారు 20 జతలు ఉతికి మరో అరగంటలో వాటిని అరబెట్టే అవకాశం ఉంటుంది. అలా ఒక పూటలోనే మొత్తం దుస్తులన్నీ శుభ్రంగా ఉతికి ఆరబెట్టే వీలుండేది. ప్రస్తుతం వాటన్నింటినీ ఇద్దరు దోబీలే ఉతకాల్సిన పరిస్థితి. ప్రత్యేకంగా ఉతికేవారు లేకపోవడంతో సెక్యూరిటీ, అవుట్‌సోర్సింగ్ విభాగాల్లో పని చేస్తున్న ఇద్దరికి ఈ బాధ్యతలు అప్పగించారు.

పంటలకు సంజీవని

నీటి కుంటలతో సత్ఫలితాలు

న్యూస్‌టుడే, తాళ్లపూడి

గత వేసవికి ముందు ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ క్షేత్రాల్లో నీటికుంటల ఏర్పాటుకు రైతులను ప్రోత్సహించారు. ప్రస్తుతం అవి వాన నీటితో కళకళ్లాడుతున్నాయి. భూగర్భ జలమట్టం వృద్ధి చెందడటంతోపాటు సాగునీటి అవసరాలు.. రహదారుల పక్కనున్నవి బాటసారులు, కూలీల దాహార్తి తీరుస్తున్నాయి.

తాళ్లపూడి: నీటికుంటలో చేరిన వర్షం నీరు

76	ఎంపిక చేసిన పంచాయతీలు
1500	నీటి కుంటల ఏర్పాటు
1328	అనుమతి ఇచ్చింది
772	ఇప్పటి వరకు పూర్తి చేసింది
రూ.50 వేలు	ఒక్కోనీటికుంటకు మంజూరయ్యే నిధులు

ఎక్కడెక్కడ అంటే

నీటి ఎద్దడి ఎదురయ్యే గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, గోకవరం, రాజానగరం, రంగంపేట, కోరుకొండ మండలాల్లో అత్యధికంగా, డెల్టా ప్రాంతాలైన తాళ్లపూడి, సీతానగరం, చాగల్లు, కొవ్వూరు, ఉండ్రాజవరం మండలాల్లో తక్కువగా లక్ష్యం నిర్దేశించారు. నీరు సమృద్ధిగా ఉన్న మిగతా మండలాల్లో వీటికి ప్రాధాన్యం ఇవ్వలేదు. గోపాలపురం, సీతానగరంలలో లక్ష్యానికి మించి తవ్వకానికి అనుమతులు ఇచ్చారు. రానున్న సీజన్‌లో అనుకున్న లక్ష్యం, మంజూరు పూర్తి చేసి, కొత్త నీటి కుంటల తవ్వకానికి చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ ఏపీడీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

ప్రయోజనం ఇలా..

● వర్షాకాలంలో గట్ల మీద నుంచి పారే నీరును కుంటలోకి చేరి తర్వాత కాలంలో పంటలకు ఉపయోగపడుతోంది. ● వేసవిలో రైతులు, కూలీల దాహార్తి తీరుస్తుంది. ● పరిసరాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ● కుంటల కోసం తవ్విన మట్టితో పొలం గట్లు, చేను చదును చేసుకోవచ్చు.

కూడలి.. సాంకేతిక సవ్వడి..!

రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించిన యంత్రాంగం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ జంక్షన్లు విస్తరించడానికి నగరపాలక సంస్థ కార్యాచరణ అమలు చేస్తోంది. రానున్న పుష్కరాల నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ రద్దీ, నియంత్రణలో భాగంగా ఇప్పటి నుంచే ముందస్తు పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. పుణ్యస్నానాల కోసం గోదావరికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. దీనిలో ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణపైనే అంతా ఆధారపడి ఉంటుంది. నలువైపుల నుంచి వచ్చే వాహనాలను నిరోధించడంతోపాటు, ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండాలనే ఉద్దేశంతో పోలీసులు, నగరపాలక సంస్థ యంత్రాంగం కలిసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరంలో అంతర్గత రహదారులు, జంక్షన్‌లు కూడా విస్తరించనున్నారు. భక్తులు నగరానికి చేరుకునే సందర్భంలో ఇవి కీలకంగా మారనున్నాయి.

కంబాలచెరువు ఆనుకొని ఏర్పాటు చేసిన మినీపార్కు

ప్రధాన కూడలిలు
- నందం గనిరాజు జంక్షన్
- తాడితోట
- కోటిపల్లి బస్టాండ్
- ఆజాద్ చౌక్
- వై-జంక్షన్
- జాంపేట
- బైపాస్ రోడ్డు
- క్వారీ
- గోకవరం బస్టాండ్ (అంబేడ్కర్ విగ్రహం)
- ఏవీఏ రోడ్డు (రామాలయం సెంటర్)

ఆధునిక సాంకేతికత వినియోగించి..

అర్బన్ రోడ్లకు ఆనుకొని శివారు ప్రాంతాలతో సహా మొత్తం 24 జంక్షన్‌లు గుర్తించారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించి, పూర్తి స్థాయిలో విస్తరిస్తారు. విదేశీ విధానంలో స్మార్ట్ జంక్షన్‌ల పేరుతో అన్ని ఏర్పాట్లు చేస్తారు.

ప్రత్యేకతలు ఇవే

● సాధారణంగా జంక్షన్‌లలో ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా లైన్సు మాత్రమే వేస్తారు. అయితే స్మార్ట్ జంక్షన్‌లలో సిగ్నల్ లైట్లతోపాటు మధ్యలో థీమ్ పార్కు విధానంలో ఆధునికత జోడిస్తారు.

● నాలుగు వైపులా రోడ్డు వెడల్పు చేసి , మధ్యలో విభాజకాలు ఏర్పాటు చేసి, మొక్కలు పెంచుతారు.

● జంక్షన్ మధ్యలో మొక్కలను ఆనుకొని కూర్చొనే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

● ఆయా కూడలిల్లో నగర రోడ్డు మ్యాప్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు తెలిపే విధంగా డిజిటల్ బోర్డులు కూడా ఏర్పాటు చేస్తారు. ఇందు కోసం ఇప్పటికే రూ 2 కోట్లు నిధులు కేటాయించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

ఎందుకిలా చేశావ్ నాన్నా!

■ పిల్లలను గోదావరిలోకి తోసి.. ఆపై తానూ ఆత్మహత్య

మలికిపురం, మామిడికుదురు, యలమంచిలి: 'రండమ్మా.. ఆధార్ అప్‌డేట్ చేసుకుని వద్దాం' అంటూ నాన్న పిలవగానే ఆ పిల్లలిద్దరూ ఉత్సాహంగా బయలుదేరారు. 'అమ్మా..వెంటనే వచ్చేస్తామమ్మా' అంటూ వీడ్కోలు చెప్పారు. ఇక ఎప్పటికీ వెనక్కిరామని ఆ చిట్టి హృదయాలకు తెలియదు. తీసుకువెళ్లిన తండ్రి గోదావరిలోకి తోసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసి ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మలికిపురం మండలం లక్కవరంలో ఫైనాన్స్ వ్యాపారి శిరిగినీడి దుర్గాప్రసాద్ (37) భార్య నాగవేణి, కుమారుడు మోహిత్ (13), కుమార్తె జాహ్నవి (9)తో కలిసి నివసిస్తున్నారు. వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని నాగవేణి కన్నవారి ఇంటి వద్ద వీరున్నారు. ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ సోమవారం పిల్లలిద్దరినీ తీసుకొని దుర్గాప్రసాద్ బైకుపై బయలుదేరాడు. రాత్రి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి స్టేషన్ పరిధి చించినాడ వశిష్ఠ వారధిపై ఈ వాహనం, పాదరక్షలు, చరవాణి నంబర్లతో కూడిన కాగితం కనిపించాయి. మంగళవారం గోదావరిలో గాలించగా దుర్గాప్రసాద్, మోహిత్ మృతదేహాలు కనిపించాయి. జాహ్నవి ఆచూకీ కానరాలేదు. బుధవారం మళ్లీ అన్వేషిస్తామని మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు.

ఏం కష్టమొచ్చిందో..

ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందోనని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కుటుంబ కలహాలా.. ఆర్థిక సమస్యలా..ఇంకేమైనా కారణాలా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కువైట్ వెళ్లి వచ్చి..

దుర్గాప్రసాద్, నాగవేణిలది ప్రేమ వివాహం. ప్రసాద్ ఉపాధి రీత్యా కువైట్ వెళ్లి వచ్చాడు. పిల్లలిద్దరినీ విశ్వేశ్వరాయపురంలో చదివిస్తున్నాడు. నాగవేణి తండ్రి రేకపల్లి వెంకటేశ్వరరావు గల్ఫ్ నుంచి రావడంతో వారం క్రితం వీరంతా ఆ ఊరు వెళ్లారు.

సరదాకు అనుకున్నాం..

ఇద్దరు పిల్లలతో వంతెన మీదకు వచ్చిన దుర్గాప్రసాద్ తొలుత కుమార్తెను నదిలోకి తోసినట్లు భావిస్తున్నారు. ఇది చూసిన కుమారుడు హడలిపోయి పరుగు తీయగా అతడిని తండ్రి వెంబడించినట్లు అటుగా వెళ్లిన ఆటో డ్రైవర్ చెప్పారని.. ప్రసాద్ స్నేహితులు చెబుతున్నారు. సరదాగా పరుగెడుతున్నారనుకున్నామని.. ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఊహించలేదని డ్రైవర్ తెలిపారన్నారు.

దుర్గాప్రసాద్, మోహిత్ (పాతచిత్రాలు).. ఆచూకీ తెలియని జాహ్నవి

(c) eenadu

రుద్రా.. రక్షమాం

కిర్లంపూడిలో మాసశివ రాత్రి కమిటీ ఆధ్వర్యంలో మహాశివుడికి లక్ష రుద్రాక్షలతో మంగళవారం రాత్రి అభిషేకం నిర్వహించారు. రుద్రాక్ష దండల శివలింగానికి పట్టువస్త్రాలతో అలంకరించి దశమహా, కుంభ హారతి ఇచ్చారు. 24 మంది అర్చక స్వాములు ఆద్యంతం భక్తిపారవశ్యంతో క్రతువు నిర్వహించారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు. **– న్యూస్‌టుడే, కిర్లంపూడి**



దర్శన భాగ్యం

మండపల్లిలోని మందేశ్వరస్వామికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్తిక మాసం పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజాము నుంచే లక్షపత్రి, కుంకుమ పూజలు చేశారు. జలం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పాహిమాం.. రక్షమాం అంటూ వేడుకున్నారు. అనంతరం స్వామి వారిని భక్తులు వరుసల్లో నిల్చుని దర్శించుకున్నారు. **– న్యూస్‌టుడే, కొత్తపేట**

అభిషేక ప్రియం

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి మంగళవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పుష్పాలంకరణ సేవ, విశేష హారతి క్రతువులు నిర్వహించారు. ఎండు ఫలాలు, తేనె, చెరకురసం, వట్టివేళ్ల, విభూదితో అభిషేకం చేశారు. **– న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

అనంతేశ్వరం

కడియపులంక పంచాయతన మహాక్షేత్రంలో కొలువైన శ్రీఅపర్ణా సమేత అనంతేశ్వర స్వామికి ఇలా అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధనను మంగళవారం ఉదయం నిర్వహించారు. అర్చకులు పూజలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **– న్యూస్‌టుడే, కడియం**

23 ఏళ్లు.. ఎన్నెన్నో జ్ఞాపకాలు

బడి గుడిలో కలిసి చదువుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. 23 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. బాల్యపు ఊసులను, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను నెమరువేసుకున్నారు. ఆత్మీయ కరచాలనాలు, పాతజ్ఞాపకాల అల్లర్లతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. అనపర్తి శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో 2001-02లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా మంగళవారం దుప్పలపూడిలోని వెంకటరెడ్డితోటలో కలుసుకున్నారు. కార్తిక మాస వన సమారాధన ఏర్పాటు చేసుకున్నారు. ఉల్లాసభరిత వాతావరణంలో ఆడిపాడుతూ, కబుర్లతో కాలాన్ని మరచిపోయారు. **– న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం**

సింగవరం వద్ద ఎర్రకాలువ గేట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రకాలువ గట్ల పటిష్టానికి చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

నిడదవోలు, న్యూస్‌టుడే: ఎర్రకాలువ గట్లు పటిష్టానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ కాలువ ఉద్ధృతి కారణంగా ఏటా ఎదురవుతున్న ఇబ్బందులపై పలు సందర్భాల్లో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించి, మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ. 1.80 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులతో మరమ్మతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎర్రకాలువ వెంబడి సింగవరం తదితర ప్రాంతాల్లో అధికారులు మంగళవారం పర్యటించారు. 2 షట్టర్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే కొలతలు సేకరించారు. దీనివల్ల భారీ వర్షాలు, వరదల సమయంలో సుమారు 5 వేల ఎకరాల్లో ముంపు సమస్యకు పరిష్కారం లభించనుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మిక క్షేత్రం.. అభివృద్ధి మంత్రం

కల.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్నికలప్పుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్ సిటీగా, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఆలయాల అభివృద్ధికి రూ.100 కోట్లు వెచ్చిస్తామన్నారు.

సౌకర్యంగా మారనున్న పాదగయ పుష్కరిణి

కళ.. పిఠాపురం నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేశారు. దేవాదాయ శాఖ, ఇతర నిధులతో ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రముఖ ఆలయాలతోపాటు జీర్ణావస్థకు చేరినవాటిని గుర్తించి ఉద్ధరించేందుకు నిధులు సమకూరుస్తున్నారు. చిన్న ఆలయాలను ధూపదీప నైవేద్యం పథకం పరిధిలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం పాడా అధికారులు, దేవాదాయశాఖ సిబ్బందితో మంగళగిరిలో పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. **– న్యూస్‌టుడే, పిఠాపురం**

తాజాగా 19 ఆలయాలకు రూ.20 కోట్లు

ఈ నెల 14న పిఠాపురంలోని 19 ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్ల మంజూరుకు దేవాదాయశాఖ కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) ఆమోదించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. కుక్కుటేశ్వరస్వామి(పాదగయ)ఆలయానికి రూ.6 కోట్లు, శ్రీపాద శ్రీవల్లభస్వామి ఆలయాభివృద్ధికి రూ.2 కోట్లతోపాటు ఇతర ఆలయాలకూ నిధులు మంజూరయ్యాయి. పురుహూతిక అమ్మవారి ఆలయ ప్రగతికి డీపీఆర్ సిద్ధమవుతోంది.

శ్రీపాద వల్లభ మహాసంస్థానం

ఇప్పటికే చేపట్టిన పనులు..

రూ.కోటితో పిఠాపురంలో సకలేశ్వరస్వామి ఆలయం, రూ.1.8 కోట్లతో గొల్లప్రోలు, చేబ్రోలులోని రామాలయాల వద్ద మండపాల నిర్మాణం జరుగుతోంది. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో తిత్తిదే కల్యాణ మండప నిర్మాణం జరుగుతోంది. రూ.80 లక్షలతో పిఠాపురంలోని మండపానికి మరమ్మతులు చేపట్టారు. మాడ వీధుల అభివృద్ధికి రూ.20 లక్షలు ఇచ్చారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలి

మంత్రి దుర్గేష్‌ను సన్మానిస్తున్న వీసీ మునిరత్నం నాయుడు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు పరిధిలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఉపకులపతి డి.మునిరత్నం నాయుడు మంగళవారం మంత్రి దుర్గేష్‌ను హుకుంపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుర్గేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, పలు అంశాలపై మాట్లాడారు. వర్సిటీ విషయాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు భాష పరిరక్షణకు పాటుపడాలన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మంచి కోర్సులు అందించాలని మంత్రి సూచించారు.

ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా రేపు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్.సునీల్‌కుమార్ తెలిపారు. 50 ఖాళీలకు ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, డిప్లొమా చదివిన వారు అర్హులన్నారు. గురువారం ఉదయం 9.30కు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు రాజమహేంద్రవరం, ఏలూరు, అమలాపురం, కాకినాడ, భీమవరం పరిసర ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తుందన్నారు. నెలకు రూ.18వేల వేతనం లభిస్తుందన్నారు.

ఆవేదన దిగమింగి ఆదర్శంగా నిలిచారు..

అయినవిల్లి: అయినవిల్లిలంక గ్రామానికి చెందిన చిట్టూరి అచ్చుతరామన్న చౌదరి(45) ఈ నెల 4న అనారోగ్యంతో మృతి చెందగా అతని పార్థివదేహాన్ని తల్లి చిట్టూరి సీతారత్నం అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి దానం చేశారు. తన కుమారుడి పార్థివదేహం వైద్య విద్యకు ఉపయోగపడాలనే ఆకాంక్షతో ఆసుపత్రికి ఇచ్చారు. సీతారత్నం నిర్ణయం ఆదర్శనీయమని కిమ్స్ అటానమస్ విభాగాధిపతి నారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు.

20న సాగర తీరంలో మహా కుంభాభిషేకం

గాంధీనగర్, కాకినాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాస ముగింపు సందర్భంగా ఈ నెల 20వతేదీ గురువారం కాకినాడ సాగర తీరంలో లోకకల్యాణార్థం శ్రీమంగళాంబికా సమేత ఆది కుంభేశ్వరస్వామి వారి ఆలయం వద్ద మహా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భారత యజ్ఞపీఠం కమిటీ సభ్యులు తెలిపారు. కరపత్రాలను మంగళవారం ఆలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గోపూజతో ప్రారంభించి 1.08 కోట్ల శివలింగాలకు, పాదరస శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకించే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. 101 మంది కన్యలతో కలశాల ఊరేగింపు ఉంటుందని, మహా దేవుడి అభిషేక ద్రవ్యాలను సాగరంలో నిమజ్జనం చేస్తామని వివరించారు. ఆలయ అభివృద్ధి, శాశ్వతంగా శివలింగాల ఏర్పాటుకు రూ.10 లక్షల విరాళం అందజేయనున్నట్లు కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షులు(బాబి) ప్రకటించారు. కమిటీ సభ్యులు చిట్నీడి శ్రీనివాసు, బోగిరెడ్డి తాతారావు, గంగిరెడ్డి అరుణ, బూర్ల సత్యనారాయణమ్మ, ప్రసన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై వామపక్షాల అసత్య ప్రచారం : సోము వీర్రాజు

దేవీచౌక్, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తావించిన అంశాలపై వైకాపా, వామపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను పూర్తిగా సమర్థిస్తున్నానని తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని భాజపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌కు రూ. 11,430 కోట్లు సాయమందించామని, విద్యుత్తు బకాయిలు సైతం మాఫీ చేయడం జరిగిందన్నారు. కమ్యూనిస్టుల మాటలు దేశాన్ని నష్టపరిచేవిగా ఉన్నాయని ఆరోపించారు. బిహార్ ప్రజలు అభివృద్ధిని చూసి ఓటువేశారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఓట్ చోర్ ప్రచారం అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. పకడ్బందీగా ఎన్నికల వ్యవస్థ ఉన్నప్పుడు ఓట్ చోర్‌కు అవకాశం ఎక్కడుంటుందని ప్రశ్నించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, కార్యదర్శి బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వీర్రాజు, నాగేంద్ర తదితరులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ

జిల్లా కార్యాలయము, ఎస్‌పిసి బిల్డింగ్, కలెక్టరేట్ కాంపౌండ్, తూర్పుగోదావరి జిల్లా

షార్ట్ టెండరు ప్రకటన

No: Mktg.A8/Proc-Tarpaulins/KMS 2025-26 Short tender Dated:18-11-2025

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా, అకాల వర్షాల వలన ధాన్యం తడవకుండా ఉంచుటకు గాను అవసరమయ్యే 2300 టార్పాలిన్లు (GSM: 250 Sizes: 24'x18'). ప్రతి టార్పాలిన్ IS 7903 : 2017 స్పెసిఫికేషన్‌తో CM/L నెంబర్ మార్క్ చేయబడి ఉన్న టార్పాలిన్లు 24-11-2025 లోపు సరఫరా చేయగలిగిన సప్లయర్స్ నుండి కొనుగోలు కొరకు షార్ట్ టెండర్లు కోరబడుచున్నవి.

ఆసక్తిగల టెండరుదారులు https://eastgodavari.ap.gov.in/ వెబ్‌సైట్ నందు టెండర్ సెక్షన్ నుండి సందర్శించి టెండర్ పత్రాలను ఉచితంగా వీక్షించవచ్చు మరియు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

టెండర్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు తమ సీల్డ్ టెండర్లను సమర్పించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా కార్యాలయం, **ఎస్‌పిసి బిల్డింగ్, కలెక్టరేట్ కాంపౌండ్, బొమ్మూరు–533124.** చివరి తేది 22-11-2025 మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఉంటుంది.

టెండరు షెడ్యూలు

01	టెండరు ఫారము డౌన్లోడ్ ప్రారంభ తేది	తేదీ: 19.11.2025 నుండి
02	టెండరు ఫారము డౌన్లోడ్ చివరి తేదీ/ సమయము	తేదీ: 21.11.2025 సాయంత్రం 5.00 వరకు
03	టెండర్ తెరుచు తేది	తేదీ: 22.11.2025

సం/- **వై. మేఘా స్వరూప్,** ఐ.ఎ.ఎస్, సంయుక్త కలెక్టరు మరియు వృత్తిరీత్యా కార్యనిర్వహణాధికారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, తూర్పుగోదావరి జిల్లా.

ఆర్ట్స్ కళాశాల సందర్శన

విదేశీ విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను కలెక్టర్ కీర్తి చేకూరి సందర్శించారు. కళాశాల అకడమిక్ ప్రగతి, పరిశోధన వాతావరణం, విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంక్యుబేషన్ సెంటర్, విద్యార్థులు అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు, స్టార్టప్ ఆలోచనలు, ఇన్నోవేటివ్ నమూనాలు, పరిశోధన కేంద్రాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. విదేశీ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న అరకు కాఫీ సెంటర్‌లో కాఫీతాగి స్కానర్ ద్వారా బిల్లు చెల్లించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ సంజీవ్, డాక్టర్ ఈసూబ్ బాషా, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రాజేశ్వరి, రవితేజ, డాక్టర్ సురేష్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

ఆ తండ్రి పసికందును చూడనేలేదు..

స్కూల్ బస్సు ఢీకొని ఇటుకబట్టీ నిర్వాహకుడి మృతి

సాయి (పాత చిత్రం)

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెళ్లయిన రెండేళ్లకు జన్మించిన పుత్రికను చూడాలనే ఆత్రుత.. అంతలోనే తాత లోకం వదిలి వెళ్లారనే వార్త తెలిసి ఆ యువకుడు ఉక్కిరిబిక్కిరయ్యాడు. మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ యువకుడు ఈ లోకాన్ని వీడారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివీ.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన మొదలవలస సాయి(27) మామిడాడలో ఎనిమిదేళ్లుగా కుటుంబ సభ్యులతో ఉంటూ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఏలేశ్వరం మండలం అప్పనపాలెంలో ఇటుకబట్టీ వద్దకు చిన్నాన్నతో కలిసి వేర్వేరు మోటారు సైకిళ్లపై వెళుతున్నారు. మామిడాడ శివారు కల్యాణ్ చెరువు వద్దకు వచ్చేసరికి సాయి వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ప్రైవేటు స్కూలు బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనులన్నీ చూసుకుని వస్తానని..

తిరుగుడుమెట్టకు చెందిన సాయికి హైమవతితో రెండేళ్ల కిందట పెళ్లైంది. ఆమె ప్రసవానికి పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 14న శుక్రవారం ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో ఉన్న భార్య, చిట్టితల్లిని చూసేందుకు సాయి బయల్దేరగా ఇంతలోనే తాత ఆనందరావు(65) తీవ్ర అనారోగ్యానికి గురై ఈ నెల 15న శనివారం మృతిచెందారని తెలిసింది. దీంతో తాత అంత్యక్రియలు పూర్తిచేయగా ఈ నెల 25న దశదినకర్మ చేయాల్సిఉంది. భార్యకు చరవాణి ద్వారా విషయాన్ని తెలియజేసి అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక వచ్చి కుమార్తెను చూస్తానని చెప్పారు. మంగళవారం ఉదయం వ్యాపార లావాదేవీల నిమిత్తం అప్పనపాలెం వెళుతుండగా మృత్యువు పాఠశాల బస్సు రూపంలో కబళించింది. భార్యను, కూతుర్ని చూడకుండానే సాయి మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

Year	Model	Reg. No
2022	Leyland/Dost	AP39UC8382
2023	Leyland/Bada Dost	AP39VD1277
2023	Maruti/Alto	AP39SC3090
2023	Maruti/Swift	AP39UT6663
2025	Tata/Punch Adventure	AP40FC6204

SUNDARAM FINANCE Ltd., TUNI CONT: 85001 58018

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్. తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయిన విడిపించి ఆ రోజు మార్కెట్ రేటుకి కొనబడును, స్పాట్‌క్యాష్. ✆ 94933 38823.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

EENADU for Advertisement Contact: 8008597607

REAL ESTATE

FLAT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

3 BHK Flat అమ్మకం. రాజమండ్రి, మోరంపూడి జంక్షన్ వద్ద, హైవే ప్రక్కన 3 BHK Flat అమ్మకమునకు కలదు. Contact Cell: 98480 56558.

HOUSE FOR SALE

KAKINADA RURAL

కాకినాడ రూరల్, గంగనాపల్లి, సత్యదేవ గార్డెన్స్, సత్తెమ్మతాడి దగ్గర 243 చ॥గ॥ స్థలంలో గల గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ నార్త్ ఫేసింగ్ ఇల్లు అమ్మకము. ✆ 98494 20475.

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

266 చ॥గ॥ స్థలం అమ్మకమునకు కలదు. 'ఆదిత్య గ్రీన్‌సిటీ' పెద్దాపురం, పాత పెద్దాపురం రోడ్, ప్లాట్‌నెం.159, E/F, 60 అడుగుల రోడ్ ఫ్రంట్, ఆసక్తి ఉన్నవారు సంప్ర: 99666 98999.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. Contact: 99490 00033.

JOBS

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్ మేన్ కావలెను. సంప్రదించవలసిన టైం: 9 am to 6 pm. Contact Cell: 95507 32122.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్), తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

రాజమండ్రిలోని శ్రీ గిరిధారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నందు పనిచేయుటకు CC Roadsలో అనుభవం కలిగిన వారు కావలెను. Contact Cell: 80991 91919.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-30 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	111-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

పనులకు వెళ్లొస్తూ..

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం, మరొకరికి గాయాలు

లీలా సుభాష్ (పాతచిత్రం)

గోపాలపురం, దేవరపల్లి, న్యూస్‌టుడే: పనులకు వెళ్లి తిరిగొచ్చే క్రమంలో జాతీయ రహదారిపై అపసవ్య దిశగా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. దేవరపల్లి మండలం కొత్తగూడెంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గోపాలపురం మండలం వాదాలకుంటకు చెందిన కొడమంచిలి లీలా సుభాష్(19), వెదుళ్లకుంటకు పులిదిండి మణికుమార్ తాపీ పనులకు ద్విచక్రవాహనంపై మంగళవారం కొత్తగూడెం వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో అపసవ్య దిశలో జాతీయ రహదారిపైకి చేరుకుంటుండగా నల్లజర్ల వైపు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపైనున్న ఇద్దరు యువకులకు బలమైన గాయాలయ్యాయి. కొన ఊపిరితో ఉన్న సుభాష్‌ను 108 వాహనంలోను, తీవ్రంగా గాయపడిన మణికుమార్‌ను హైవే అంబులెన్స్‌లో గోపాలపురం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. సుభాష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మణికుమార్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో రాజమహేంద్రవరం తరలించారు. మృతుడి తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

రెండు కుటుంబాలకు వారసుడు..

సుభాష్ తండ్రి కృష్ణ వ్యవసాయ కూలి పనులు చేస్తుంటారు. తల్లి కుటుంబ పోషణ నిమిత్తం మూడేళ్ల కిందట విదేశాలకు వెళ్లారు. చెల్లి చదువుకుంటోంది. సుభాష్ తాపీ పని చేస్తూ కుటుంబాన్ని చూసుకుంటున్నాడు. మృతుడి పెదనాన్నకు ఇద్దరు కుమార్తెలు. రెండు కుటుంబాలకు సుభాష్ వారసుడు. ఆయన మృతితో ఇరు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం : కాకినాడ.

ప్లాట్ నెం.2, ఐడిఎ, రమణయ్యపేట, కాకినాడ - 533 005.

పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

పర్యావరణము, అడవులు మరియు వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం వారిచే జారీచేయబడిన ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నోటిఫికేషన్ తేది.14.09.2006 మరియు వాటి సవరణలకు అనుగుణంగా ప్రకటించునది ఏమనగా **తూర్పు గోదావరి జిల్లా, తాళ్ళపూడి మండలం, ప్రక్కిలంక లంకలు గ్రామము సర్వే నెం. 146, 134-2 & 134-3 లోని 6.78 హెక్టర్ల ప్రాంతంలోని సాధారణ ఇసుక మైనింగ్ కొరకు ప్రక్కిలంక లంకలు బ్లాక్ - 15 పట్టా భూముల నుండి ఇసుక డీ-కాస్టింగ్** ప్రతిపాదన గురించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరుపబడును. ప్రతిపాదిత ప్రాజెక్ట్ కార్యకలాపాలకు కంపెనీ వారు ఇచ్చిన వివరములు ఈ క్రింద పొందుపరచబడినవి.

1. **ప్రాజెక్టు ఆఫీస్ పేరు మరియు చిరునామా:** 6.78 హెక్టార్లు, ప్రక్కిలంక లంకలు బ్లాక్ - 15 పట్టాభూముల నుండి ఇసుక డీ-కాస్టింగ్ సర్వే నెం. 146, 134-2 &134-3, ప్రక్కిలంక లంకలు గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534341.
2. **ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతం మరియు విస్తీర్ణం:** సర్వే నెం. 146, 134-2 & 134-3, ప్రక్కిలంక లంకలు గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లా. **విస్తీర్ణం : 6.78 హెక్టర్లు**
3. **సంప్రదించవలసిన అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెం.:** శ్రీ డి.ఫణిభూషణ్ రెడ్డి, మొబైల్ నెం.: 9100688824 **చిరునామా :** జిల్లా మైన్స్ & జియాలజి అధికారి, జిల్లా మైన్స్ & జియాలజి కార్యాలయం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
4. **ప్రతిపాదిత ప్రాజెక్టు యొక్క వ్యయం : రూ.30.0 లక్షలు** (అక్షరాల ముప్పై లక్షలు రూపాయలు మాత్రమే)
5. **ప్రతిపాదిత ప్రాజెక్ట్ యొక్క వ్యాపార స్వభావం ఉత్పత్తి సామర్థ్యం :** సాధారణ ఇసుక మైనింగ్: సంవత్సరానికి 2,03,400 క్యూబిక్ మీటర్లు.
6. **ప్రజాభిప్రాయ సేకరణ : తేది, సమయం మరియు ప్రదేశం :**
   తేది : 19.12.2025
   సమయం : సాయంత్రం 4:00 గం॥లకు
   ప్రదేశం : ప్రక్కిలంక లంకలు గ్రామ పంచాయితీ ఆఫీస్, ప్రక్కిలంకలు గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లా.
7. **ప్రాజెక్టుకు సంబంధించిన తెలుగు మరియు ఇంగ్లీష్ నందు గల కార్య నిర్వాహక సారాంశము మరియు డ్రాఫ్ట్ ఇ.ఐ.ఎ. రిపోర్టు యొక్క ప్రతులు ప్రజల పరిశీలనార్థం లభ్యమగు ప్రదేశము(లు):**
   a) కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
   b) ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, కాకినాడ.
   c) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
   d) ది డిప్యూటీ డైరెక్టర్ వారి కార్యాలయం, యం౦ఓఇఎఫ్ &సిసి,జిఓఐ, ఇంటిగ్రేటెడ్ ప్రాంతీయ్య కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్ రెడ్డి రోడ్, విజయవాడ.
   e) ది జాయింట్ ఛీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ ఆఫీస్, మాధవధార, ఉడా కాలని, మాధవధార మెయిన్ రోడ్డు, విశాఖపట్నం-18.
   f) జిల్లా మైన్స్ & జియాలజి వారి కార్యాలయం, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
   g) తహసీల్దార్ వారి కార్యాలయం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా.
   h) మండల పరిషత్ డెవలప్‌మెంట్ వారి కార్యాలయం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా.
   i) పంచాయతి సెక్రటరి వారి కార్యాలయం, ప్రక్కిలంక లంకలు గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లా.
   j) ఎన్విరాన్‌మెంటల్ జాయింట్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, రీజనల్ ఆఫీస్, ప్లాట్ నెం.2, ఐడిఎ, రమణయ్య పేట, కాకినాడ.

సంబంధిత ప్రజలు వారి సలహాలు, అభిప్రాయాలు, వ్యాఖ్యలు మరియు అభ్యంతరములు ఏమైనా ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురించబడిన 30 రోజుల లోపు తెలుప వలసినదిగా కోరడమైనది. పైన పేర్కొనబడిన విధముగా సంబంధిత ప్రజలు ఎవరైనా తమ వ్రాతపూర్వకమైన సలహాలను, అభిప్రాయాలను ఈ దిగువ సంతకం చేయబడిన అధికారి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణమండలి వారికి పంపవచ్చును. సంబంధితులందరూ పైన తెలుపబడిన తేదీ, ప్రదేశమున బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలుపవచ్చును.

ప్రదేశం : కాకినాడ
తేది : 18-11-2025

సం/- పర్యావరణ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కాకినాడ.

(c) eenadu

రాజమహేంద్రవరం

అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపాధ్యాయులకు కార్యశాల

శ్యామలాసెంటర్: అటల్ టింకరింగ్ ల్యాబ్లున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఈ నెల 19 నుంచి 21 వరకు భవనేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యశాల నిర్వహిస్తున్నట్లు సైన్స్ అధికారి జీవీఎస్ సుధాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ నైపుణ్యం, ప్రయోగాత్మక అభ్యాసం, సమస్య పరిష్కార శక్తితో పాటు ప్రధానోపాధ్యాయులకు ల్యాబ్, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై నైపుణ్యాల శిక్షణ ఇస్తారన్నారు.

నేడు 1,14,991 మంది రైతులకు లబ్ధి

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలోని 1,14,991 మంది రైతులకు రూ.76.99 కోట్ల మేర ప్రభుత్వం లబ్ధి చేకూర్చనున్నట్లు మంగళవారం కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైతుల ఖాతాలకు నేరుగా నిధులు జమ అవుతాయన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని బుధవారం నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1 83282 39927, 80089 02897

సమస్య: తిలక్‌రోడ్డు మాదవి నర్సింగ్ హోమ్ ఎదుటి వీధిలో రెండు నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ అంధకారంగా ఉంటుంది. - కుసుమకుమారి, స్థానికురాలు

సమాధానం: సిబ్బందిని పంపించి వీధిదీపాలు మరమ్మతులు చేయిస్తాం - విమల, ఎలక్ట్రికల్ ఏఈ

సమస్య: స్థానిక తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆవ వాంబే కాలనీలో చాలారోజులుగా డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు విజృంభిస్తున్నాయి. - గౌరంమల్లేశ్వర, స్థానికురాలు

సమస్య: శ్యామలనగర్ పాత సోమాలమ్మ గుడి ఏరియాలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. - ఆదిత్య

సమస్య: లాలాచెరువు చౌడేశ్వరీనగర్‌లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. - ప్రకాశ్

సమాధానం: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - వినూత్న, ఎంహెచ్‌వో

-న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

రైతులు లేని బజారు..!

పండించేవారు తక్కువ.. అమ్మేవారు ఎక్కువ

ఇదీ పరిస్థితి | పరిశీలన

దేవీచౌక్, న్యూస్‌టుడే: రైతుకు గిట్టుబాటు ధర.. వినియోగదారులకు తక్కువ ధరకు తాజా కూరగాయలు అందించాలన్న లక్ష్యంతో కొన్నేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రైతుబజార్లను తెరపైకి తెచ్చింది. కానీ ప్రస్తుతం ఆయా బజార్లలో పండించేవారు తక్కువ.. అమ్మేవారు ఎక్కువగా కనిపిస్తున్నారు. దీని వల్ల నాణ్యత తగ్గి ధరల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. రైతు బజార్లలో ఉన్న కొంత మంది రైతులు కూడా టోకు మార్కెట్‌పైనే ఆధారపడుతున్నారు. ఒకవేళ ఒకటి రెండు రకాలు పండించినా మిగతావి టోకు మార్కెట్లోనే అమ్ముతున్నారు. దీంతో ధరలు దళారుల చేతుల్లో ఉంటున్నాయి. రైతుబజార్లలో పండించే రైతులు 30 శాతం కూడా లేరు.

బజారు పేరు	రైతులు
క్వారీ	42
వై జంక్షన్	52
గణేష్‌చౌక్	42
నటరాజ్	26
శంభునగర్	23
వీఎల్ పురం	39

- నగరంలో ఆల్కాట్‌తోట, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో ఉన్న రైతు బజార్లలో మినహా మిగతా చోట్ల 25 నుంచి 40 మంది వరకు రైతులుగా నమోదై ఉన్నారు.
- వీరిలో చాలా మంది ఎటువంటి పంటలు పండించకపోయినా రాజకీయనాయకులు, అధికారుల సిఫార్సుల ద్వారా, కౌలు రైతులుగా కూరగాయలు పండిస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకుని రైతు బజార్లలో దుకాణాలు సంపాదించారు.
- రైతులు పండించే పంటను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి. కానీ ఈ ప్రక్రియ పకడ్బందీగా చేస్తున్న దాఖలాలు లేవు.

రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

కూరగాయలు పండించే రైతులు తగ్గిపోవడంతో పొరుగు జిల్లాలు, రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల సంభవించిన తుపానుతోపాటు కార్తిక మాసం నేపథ్యంలో కూరగాయలకు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం కొద్ది మొత్తంలో ఆనప, పొట్లకాయలు మినహా మిగతా స్థానిక పంటల దిగుబడి లేదు. చాలా వరకు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నవే. ఉల్లి, బంగాళదుంపలు మినహా ఒక్కో రైతుబజారుకు రోజుకు 150 క్వింటాళ్ల నుంచి 200 క్వింటాళ్ల వరకు కూరగాయలు అవసరమవుతాయి. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండే పరిస్థితి లేదు. ప్రకాశం, అనంతపురం, ఉమ్మడి విశాఖ, చిత్తూరు జిల్లాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, పశ్చిమబెంగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి టోకు వర్తకులు దిగుమతి చేసుకుంటున్నారు. ఈ నెలాఖరుకు స్థానిక పంటలు అందుబాటులోకి వస్తాయని, అప్పుడు ధరలు తగ్గుముఖం పడతాయని రైతులు పేర్కొంటున్నారు.

వ్యాపారులకు అనుకూలంగా ధరలు..!

రైతుబజార్లలోని వ్యాపారులతో ఎస్టేట్ అధికారులు కుమ్మక్కై వారికి అనుకూలంగా ధరలు నిర్ణయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉల్లి ధరలు బహిరంగ మార్కెట్లో కేజీ రూ.16 ఉండగా రెండు రోజుల నుంచి రైతుబజార్లలో రూ.20గా నిర్ణయించారు. వీధుల్లోకి వచ్చే చిరువ్యాపారులు ఏడు కేజీలు వందరూపాయలకు విక్రయిస్తున్నారు. రైతుబజార్ల కంటే బహిరంగ మార్కెట్‌లోనే నాణ్యమైన ఉల్లి లభిస్తోంది. టోకు మార్కెట్లో నాణ్యత బట్టి పది కేజీలు రూ.120 నుంచి రూ.140 ఉండగా రైతుబజార్లలోని డ్వాక్రా సభ్యులు రూ.8 వరకు మార్జిన్ వేసుకుని రూ.20 విక్రయిస్తున్నారు. 16వ తేదీ వరకు కేజీ రూ.18 నిర్ణయించగా ప్రస్తుతం రూ.2 పెంచడం గమనార్హం.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో బంగారు పతకం

బంగారు పతకం సాధించిన మహిళల జట్టు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహిళల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టు బంగారు పతకం సాధించిందని జిల్లా సంఘ కార్యదర్శి వీటీవీ సుబ్బారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జట్టులోని చార్వి ఫాల్గున్, జి.సిరి పావని, పి.శ్రీలక్ష్మి, కె.శరణ్య జట్టు ప్రత్యర్థులను చిత్తు చేసి జిల్లాకు బంగారు పతకం తీసుకొచ్చారన్నారు. విజేతలకు ఎల్ఐసీ సీనియర్ డీఎం శారదాప్రసాద్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి : జేసీ

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): ప్రజాఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని, పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని జేసీ మేఘాస్వరూప్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్' నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్న నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లో, ఆర్ఎస్‌కేలో కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్)లో అర్హుల గుర్తింపు, స్వామిత్వ సర్వేల పురోగతిపై సమీక్షించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలను సందర్శించి మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భోజనం నాణ్యత పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు.

115 మంది ఉద్యోగాలకు ఎంపిక

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : నవంబరు 1న కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 259 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 115 మందికి ఉద్యోగాలు లభించాయని ప్రిన్సిపల్ రాఘవ కుమారి తెలిపారు. వీటికి సంబంధించి ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలను సంబంధిత కంపెనీ ప్రతినిధులు వెల్లడించారన్నారు.

నగరానికి జలశక్తి అవార్డు

దిల్లీలో స్వీకరించిన కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు - 2024లో జల్ సంచాయ్ - జన్ భాగీదారీ విభాగం కింద జాతీయ స్థాయిలో నగరం నాలుగో ర్యాంకును సొంతం చేసుకొంది. న్యూ దిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ చేతుల మీదుగా కమిషనర్ రాహుల్ మీనా పురస్కారం అందుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వంగా ఉందని కమిషనర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద నగరపాలక సంస్థకు మొత్తం 13,298 నీటి సంరక్షణ పనులు పూర్తి చేసి ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. ఈ క్యాటగిరీ కింద లభించిన అవార్డుకు రూ 2 కోట్లు నగదు పురస్కారం లభించిందన్నారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపునీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాల పెంపు వంటి మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ విజయం సాధ్యమైందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ ఎంవీకే మాధవి, ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో సత్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కోటంశెట్టి రాజేంద్రప్రసాద్, భవాని దంపతులు వాటిని సమకూర్చారు. రవి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో బొప్పన సావిత్రమ్మ జడ్పీ స్కూలు యాజమాన్యం ● పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉపన్యాస పోటీలతో నాయకత్వ లక్షణాలు

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఉపన్యాస పోటీలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బీఎన్‌వీఎస్ మూర్తి మాట్లాడుతూ ఉపన్యాస పోటీల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పొంపొందించవచ్చన్నారు. టి.జాహ్నవి నాగ దుర్గ (10వ తరగతి), ఎం.సిద్దేశ్వర్ (7వ తరగతి), పి.స్నేహాంజలి (9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఈనాడు సమకూర్చిన బహుమతులను ప్రధానోపాధ్యాయుడు మూర్తి, స్టాఫ్ సెక్రటరీ పీవీ రమణ అందజేశారు. ఎన్.రోశెట్టి, ఎస్.రామ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

భాష్యం పాఠశాలలో.. బాబానగర్‌లోని బాష్యం ఆంగ్ల పాఠశాలలో ఉపన్యాసం పోటీలు మంగళవారం నిర్వహించారు. కె.అక్షయ (10వ తరగతి), పి.కావ్య (9వ తరగతి), టి.తన్మయి (7వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ కేవీవీ సత్యనారాయణ, జోనల్ విభాగాధిపతి వి.ఆంజనేయులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతగా కె.చంద్రశేఖర్ వ్యవహరించారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో భాష్యం పాఠశాల యాజమాన్యం ● పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభ

శ్యామలా సెంటర్, న్యూస్ టుడే: దిల్లీలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే ఇన్‌క్లూజివ్ యునైటెడ్ నేషన్స్ ప్రోగామ్‌లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి మహ్మద్ అర్షద్, కొత్తపేట మండలం పలివెల జడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థి పాకా అక్షయ్ పాల్గొననున్నారని ఏపీ సమన్వయకర్త టి.మార్టిన్ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 150మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు.

ప్రసాద్‌కు సత్కారం

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన అడ్వకేటు రాచపల్లి ప్రసాద్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ నాయకులు సత్కరించారు. ఈ మేరకు ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువా కప్పి , పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, నక్క వెంకటరత్నం, దారా యేసురత్నం, కుమార్‌బాబు, తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రైవేటు ఫ్లెక్సీలు

ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో ఎటువంటి ప్రైవేటు వ్యాపార ప్రచార ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకూడదు. అనుమతి లేకుండా బయట వ్యక్తులు ఎవరైనా వీటిని ఏర్పాటు చేస్తే అధికారులు చర్యలు తీసుకోవాలి. కానీ కలెక్టరేట్ ప్రాంగణంలోనే పలుచోట్ల రియల్ ఎస్టేట్ సంస్థలకు చెందిన వ్యాపార ప్రచార ఫ్లెక్సీలు దర్శమిస్తున్నా పట్టించుకోవడం లేదు. రెండు రోజులుగా ప్రైవేటు ఫ్లెక్సీలు కనిపిస్తున్నా తొలగించకపోవడం గమనార్హం. –న్యూస్‌టుడే, కలెక్టరేట్

కళావిహీనంగా పుష్కర ప్రతీక

గత పుష్కరాలకు ప్రతీకగా ఏర్పాటు చేసిన కలశం వాటర్ ఫౌంటేన్ ప్రస్తుతం కళావిహీనంగా మారింది. పుష్కరఘాట్‌కు ఎదురుగా దీని నిర్మాణం చేపట్టారు. కలశంపై నుంచి నీటి ప్రవాహం కింద పడే విధంగా ప్రత్యేకంగా రూపొందించారు. నగరంలో పుష్కరఘాట్ నుంచి గోదావరి గట్టు మీదుగా వెళ్లే వారికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే గత కొంత కాలంగా మరమ్మతులకు గురైంది. రానున్న పుష్కరాల నేపథ్యంలో దీనికి మరమ్మతు చేయాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

ప్రమాదకరంగా ఫ్యూజ్‌బాక్స్

రాజమహేంద్రవరం నగరంలోని సీతంపేట రత్నా హాస్పటల్ వెనుక రోడ్డులో విద్యుత్తు ఫ్యూజ్ బాక్స్ మూత లేకుండా ప్రమాదకరంగా ఉంది. పక్కనే చెత్త వేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ఫ్యూజ్ బాక్స్‌కు మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోటగుమ్మం

మార్గం..గుంతలమయం

రాజమహేంద్రవరం నగరంలోని గో రక్షణ పేట నుంచి కిమ్స్ హాస్పటల్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో దుమ్మూ ధూళి లేచి అధ్వానంగా మారింది. నిత్యం వేలాది మంది ఈ మార్గంపై ప్రయాణిస్తుంటారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారికి మరమ్మతులు చేయించాలని చోదకులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోటగుమ్మం

రహదారి ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన రాజమహేంద్రవరంలోని ఆనంద్‌రీజెన్సీ సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం. . నగరంలోని శేషగిరిరావునగర్‌కు చెందిన తలే చంద్రరావు(56) ఓ హోటల్‌లో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 17న మధ్యాహ్నం రోడ్డుపై నడిచి వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. గాయపడిన అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి..

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి ఒక వ్యక్తి మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున స్థానిక రోడ్డు కం రైలు వంతెన శివారులో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు రాజమహేంద్రవరం జీఆర్పీ హెచ్‌సీ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉంటుందని, అతడి జేబులో ధర్మవీర్ సింగ్ పేరుతో పాన్‌కార్డు ఉందని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 0883-2442821, 99597 63463 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యం కేసుల నమోదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: నగరంలోని శేషయ్యమెట్టకు చెందిన ఓ యువతి(19) ఈ నెల 17 అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లాలాచెరువు పరిధిలో.. లాలాచెరువు పరిధిలోని ఓ యువతి (24) ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని ఆమె సోదరుడు ప్రకాశంనగర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదైంది.

యువకుడు కనిపించడం లేదని.. లాలాచెరువు పరిధిలోని ఓ యువకుడు (21) ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని అతని సోదరి ప్రకాశంనగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం

శివాలయాల్లో మాసశివరాత్రి పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : శ్రీవివేకానంద సనాతన ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో శ్రీఅన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి. తొయ్యేటి సీతారామశర్మ దంపతులు నిర్వహణలో గోదావరికి హారతి, గణపతి పూజ, నదీపూజ, మహారుద్రాభిషేకం నిర్వహించారు. ✦ సారంగధరేశ్వర ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ✦ మార్కండేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ✦ కార్తిక మాసం ముగింపు సందర్భంగా సీతంపేట మాతృరూపిణి మందిరంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

12 నుంచి ఎస్ఎఫ్ఐ మహాసభలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలు తిరుపతి నగరంలో డిసెంబరు 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నామని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, ఎన్.రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రాలను ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ మహాసభలకు విద్యార్థులు తరలి రావాలని కోరారు. నాగచైతన్య, జ్యోతి, కార్తీక్, సౌమ్య, లహరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం నగరంలోని పలు గ్రంథాలయాల్లో వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ■ మంగళవారం గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో విద్యార్థులకు మన గ్రంథాలయం - గ్రంథాలయాల ఆవశ్యకత అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యురాలు పద్మజ హాజరై తాళపత్ర గ్రంథాలు, శాసనాలు పరిశీలించారు. ■ ఇన్నీస్‌పేట గ్రంథాలయంలో తెలుగు భాష ప్రాధాన్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ■ సీతంపేట గ్రంథాలయంలో చిత్రలేఖనం, ఆల్కాట్ గార్డెన్స్ గ్రంథాలయంలో వక్తృత్వం, వ్యాసరచన పోటీలు జరిగాయి.

సీతంపేట గ్రంథాలయం : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అకౌంట్ టెస్ట్‌కు దరఖాస్తు చేయండి

శ్యామలా సెంటర్: ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు జరిగే అకౌంట్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24 ఆఖరుతేదీ అని డీఎస్ఈవో కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ.60తో ఈ నెల 30వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

'ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన మోదీ'

నినాదాలు చేస్తున్న నాయకులు

టి.నగర్, న్యూస్‌టుడే: దళిత బహుజన గిరిజనులందరూ మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సామాజిక ఆత్మగౌరవం, జనగణనలో కుల గణన చేపట్టాలని కోరుతూ పార్టీ శ్రేణులు ఆందోళనలో పాల్గొన్నారు. రాంబాబు, కొండలరావు, రమణ, త్రిమూర్తులు, సునీల్, కొండావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల సందర్శన

మాట్లాడుతున్న విద్యాశాఖ డైరెక్టర్ భరత్ నారాయణ గుప్త

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను మంగళవారం కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ భరత్ నారాయణ గుప్త సందర్శించారు. నూతనంగా నిర్మించిన కళాశాల ముఖ ద్వారం, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ హబ్ పరిశీలించారు. దీనికి ఆర్థిక సహకారం అందించిన హన్సా సొల్యూషన్ ఛైర్మన్ రాంప్రసాద్‌ను అభినందించారు. అనంతరం అరకు కాఫీ సెంటర్, విదేశీ విద్యార్థుల కోసం నిర్మించిన ఇంటర్నేషనల్ రీసెర్చ్ సెంటర్‌లను పరిశీలించి, విదేశీ విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు, కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పీవీ కృష్ణాజీ, సహాయ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డీవీఎన్ శ్రీరామ్మూర్తి, వివిధ విభాగాల అధిపతులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో అంగన్‌వాడీ కేంద్రాల విలీనం

165 : నగరంలో అంగన్‌వాడీ కేంద్రాలు

40 : పాఠశాలల్లో విలీనం అయ్యేవి

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు దూరంగా ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. జాతీయ విద్యావిధానం 2020కు అనుగుణంగా విద్యార్థుల్లో పునాది అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ పాఠశాలల్లో గదులు కేటాయించాలని వారిపై ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలని సూచించింది. రాజమహేంద్రవరం నగరంలో పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేసేందుకు నగర పాఠశాలల తనిఖీ అధికారి డి.దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో బృందం పలు పాఠశాలలను పరిశీలించింది.

ప్రయోజనాలు ఏమిటంటే..

- ప్రాథమిక పాఠశాలలు 1 నుంచి ప్రారంభమవుతుండగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయనున్నాయి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన విద్యార్థులు ఒకటో తరగతి అదే పాఠశాలలో ప్రవేశం పొందడానికి అవకాశం ఏర్పడుతుంది.
- విద్యార్థుల నమోదు శాతం కూడా పెరుగుతుంది.

ప్రకటన

మా క్లయింటు కాకినాడ జిల్లా, సామర్లకోట కాపురస్తులు విప్పెర్ల వెంకటరావు గారి కుమారుడు విప్పెర్ల రాజు గారు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయదేమనగా,

దిగువ షెడ్యూల్ ఆస్తి ప్రకాష్ నగర్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటి వారు వ్రాయించి రిజిస్టర్ చేయించిన ది.26/06/1997 (నెం.3058/1997) క్రియ దస్తావేజు రీత్యా అత్తిలి రామారావు గారికి దఖలు పడి వారు వ్రాయించి రిజిస్టర్ చేయించిన ది.22/03/2011 (నెం.1634/2011) క్రియ దస్తావేజు రీత్యా ముక్కవిల్లి నాగ వెంకట చంద్రశేఖర్ గారికి దఖలు పడి వారు వ్రాయించి రిజిస్టర్ చేయించిన ది.18/05/2019 (నెం.4305/2019) క్రియ దస్తావేజు రీత్యా వేజెండ్ల పూర్ణచంద్రరావు గారికి దఖలు పడి వారి తదనంతరం వారు వ్రాయించిన రిజిస్టర్ వీలునామా ది.10/03/2021(నెం.100/బుక్3/2021) రీత్యా వారి కుమార్తె అయిన శ్రీమతి డా.వాసిరెడ్డి బిందు శ్రీదేవి గారికి దఖలు పడి వారి సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో కలదని, నిర్వివాద నిష్పేచి ఆస్తి అని మా క్లయింటుకు తెలియజేసి సదరు ఆస్తిని మా క్లయింటుకు క్రియపర్చుటకు అంగీకరించి అగ్రిమెంట్ అయ్యి ఉన్నారు.

కావున దిగువ షెడ్యూల్ ఆస్తి గూర్చి ఎవరికైనను ఏవిధమైన క్లైములు/అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలో లిఖిత పూర్వకముగా తగిన ఆధారములతో మాకు తెలియపరచవలెను. లేని యెడల ఏ విధమైన క్లైములు/అభ్యంతరాలు లేవని భావింపబడును. 15 రోజుల తర్వాత వచ్చిన క్లైములు మా క్లయింటుని బైండు చేయవు.

షెడ్యూల్: తూర్పు గోదావరి జిల్లా, ప్రకాష్ నగర్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వారిచే L.P.No.184/87 రీత్యా లేఅవుట్ కాబడిన శ్రీ వెంకటేశ్వర నగర్ 201/2A1A లోకి రాబడిన ప్లాటు నెం.LPI/A-334రు దాఖలా చ.గ.497.77ల స్థలమునకు హద్దులు: **తూర్పు:** ప్లాటు నెం.335-80' **దక్షిణం:** 40' లేఅవుట్ రోడ్ 56' **పడమర:** ఇతరుల భూమి-80' **ఉత్తరం:** ఇతరుల భూమి - 56' ఈ హద్దుల మధ్య చ.గ.497-77ల స్థలము

మద్దూరి సాయి భాస్కర్ శంకర్
అడ్వకేట్, దానవాయిపేట
రాజమహేంద్రవరం, 18/11/2025. రాజమహేంద్రవరము, 98482 57690

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: నేడు 33/11 కేవీ ధవళేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ బీఎస్‌ఆర్ ఫీడర్, 11కేవీ బ్రిడ్జి ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అగ్రహారం, క్వారీరోడ్, బత్తిన సుబ్బారావు కాలనీ, సాయి ప్రియాంక, కాటన్ పేట, ఎర్రకొండ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

అనపర్తి గ్రామీణం : పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువత ఎదగాలని జిల్లా పారిశ్రామిక అధికారి వాణిధర్‌రామన్ సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఆర్‌ఏఎంపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనపర్తిలోని సాయిమాధవి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఆర్‌ఏఎంపీ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. శిక్షణలో నూతనంగా చేరిన యువతకు కిట్లను అందజేశారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎలా ఎదగాలో వివరించారు. వ్యాపారాలకు రుణాలు ఎలా పొందాలి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు వివరించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ అహ్మద్ ఉన్నిషా తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వనసమారాధనలు

ఆర్యవైశ్య వనసమారాధనలో ఎమ్మెల్యే బత్తులకు సత్కారం

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని తోటల్లో మంగళవారం జరిగిన కార్తిక వనసమారాధనలు ఆకట్టుకున్నాయి. కోరుకొండలో జరిగిన ఆర్యవైశ్య, పద్మశాలీల సమారాధనల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పెద్దఎత్తున పాల్గొని సందడి చేశారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇక్కడ.. కార్డు ఎక్కడ..!

పూర్తికాని స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ

కాకినాడకు చెందిన ఓ కుటుంబం ఏడేళ్ల క్రితం బొమ్మూరుకు వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రకరకాల మ్యాపింగ్, నమోదు ప్రక్రియలో ఇక్కడి చిరునామానే ఇచ్చారు. పింఛను, రేషన్ ఇక్కడే తీసుకుంటున్నారు. స్మార్ట్‌రేషన్ కార్డు మాత్రం రాలేదు. చౌకదుకాణం, సచివాలయం, తహసీల్దారు కార్యాలయాలు తిరిగారు. వారి సూచనతో కాకినాడకు వెళ్లగా అక్కడ ఉంది.

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టిందనే విమర్శలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. దీనికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో స్మార్ట్ కార్డు విధానాన్ని తీసుకొచ్చింది. రెండు నెలలు క్రితం పంపిణీ ప్రారంభించగా, ఇప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదు. రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల పరిధిలో సుమారు 16,135 కార్డులు ఇంకా పంపిణీ జరగాల్సి ఉంది. చౌక దుకాణంలో సరకులు తీసుకునేందుకు భవిష్యత్తుల్లో స్మార్ట్‌రేషన్ కార్డు తప్పనిసరి చేస్తారనే వాదన వినిపిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటివరకు తీసుకోని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

స్మార్ట్‌కార్డు పంపిణీ ఇలా.. (సుమారుగా)

మండలం	ఇచ్చినవి	పెండింగ్
రా.గ్రామీణం	46,578	3,598
అనపర్తి	20,803	1,482
రంగంపేట	18,354	1,252
కోరుకొండ	25,496	1,270
గోకవరం	21,286	1,114
సీతానగరం	23,054	752
రాజానగరం	32,717	3,144
బిక్కవోలు	21,248	1,062

మ్యాపింగ్ సరిగా జరగక..

గత ప్రభుత్వ హయాంలో గృహాల మ్యాపింగ్ ప్రక్రియ సక్రమంగా జరగలేదు. ఒక ప్రాంతంలోని వారికి మరో ప్రాంతంలోని చౌకదుకాణాల్లో కార్డులు ఉండడంతో పంపిణీ గందరగోళంగా మారింది. చాలామంది లబ్ధిదారులకు తమ కార్డులు ఎక్కడ ఇస్తారో తెలియక చౌకదుకాణాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు లబ్ధిదారుల వివరాలు తెలియక చాలా కార్డులు డీలర్ల వద్దే ఉన్నాయి. ఒక్కో డీలరు వద్ద వందల సంఖ్యలో పేరుకుపోయాయి. దీంతో ఎదురుచూపులు తప్పటం లేదు. పాత రేషన్‌కార్డుల్లో చిరునామా ఆధారంగా పరిశీలన చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పూర్తికాని ఈకేవైసీ..

ఈకేవైసీ ప్రక్రియ పూర్తవకపోవడంతో కార్డుల్లో మృతుల వివరాలు, పెళ్లయి అత్తవారింటికి వెళ్లిన మహిళల పేర్లు అలాగే కొనసాగుతున్నాయి. వాటిని తొలగించని కారణంగా ప్రతి నెలా వందల టన్నుల బియ్యం పక్కదారి పడుతోంది. ఇప్పటికీ వేలమంది ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. ఫలితంగా బియ్యం పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడట్లేదు.

నూతన భవనాల పరిశీలన

పరిశీలిస్తున్న కలక్టర్ కీర్తి, వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మాణం పూర్తయ్యి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పలు భవనాలను కలెక్టర్ కీర్తి చేకూరి, వీసీ ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం పరిశీలించారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి వీసీ స్వాగతం పలికారు. కళా, సంస్కృతి విభాగంలో ఇటీవల రామోజీ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న వీసీ ప్రసన్నశ్రీని కలెక్టర్ అభినందించారు. అనంతరం నూతనంగా నిర్మించిన విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల భవనం, ఎగ్జామినేషన్స్ భవనం, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనం, బాలుర వసతిగృహ భవనాలను పరిశీలించారు. వర్సిటీ ప్రగతి, అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637
ఉ॥ 10 - మ॥ 1

కొళాయికి మరమ్మతులు

బొమ్మూరు కాజలి వద్ద వీధి కొళాయి విరిగిపోవడంతో నీరు సరఫరా అవ్వట్లేదు. ఈ సమస్యను కార్యదర్శి కాశీ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించి, కొళాయి ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం అవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
– న్యూస్‌టుడే, బొమ్మూరు

అధ్వానంగా రోడ్డు

సమస్య: బొమ్మూరు జీవీఆర్ రోడ్డుకు వెళ్లే మార్గంలో దారి గుంతలు పడి దారుణంగా ఉంది. రాత్రుళ్లు వీధి దీపాలు వెలగని ప్రాంతంలో రాకపోకలకు కష్టంగా ఉంటోంది. - జీవన్, స్థానికుడు
సమాధానం: రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపడతాం. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - కాశీ, గ్రామకార్యదర్శి
– న్యూస్‌టుడే, బొమ్మూరు

విశ్వేశ్వరస్వామి కల్యాణం

బిక్కవోలు: బలభద్రపురంలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. కర్తలుగా కొవ్వూరి అనిల్ కుమార్ రెడ్డి, అనూష దంపతులు వ్యవహరించారు. కార్తికం, మాస శివరాత్రి కావడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

రంగంపేట: మర్రిపూడిలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భక్తుల సహకారంతో శివాలయ నిర్మాణ స్థలంలో శుద్ధి పూజలు చేశారు. సుభద్రంపేటలో లక్షపత్రి పూజలు జరిగాయి.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

బిక్కవోలు, న్యూస్‌టుడే: పచ్చదనం-పరిశుభ్రతపై మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌జీఎస్‌ఏ కార్యక్రమం కింద కార్యాచరణ ప్రణాళిక చేపట్టేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

గోకవరం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీ వద్ద పోలవరం నిర్వాసితులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ.. దేవీపట్నం పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, కోర్టులో ఉన్న తొమ్మిది ఎకరాల సమస్యను పరిష్కరించాలని, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గేదెల పెదసుబ్బారావు, దొడ్డ సింహాద్రి, నాని తదితరులు పాల్గొన్నారు.

నిత్య కృషీవలురు 'రామోజీరావు'

రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రామస్థులు

రంగంపేట, న్యూస్‌టుడే: 'రామోజీ' సంస్థల అధినేత రామోజీరావు అవిశ్రాంత శ్రామికుడని, ఆయన తెలుగు వ్యక్తిగా పుట్టడం మన అదృష్టమని సినీ విశ్లేషకుడు అడబాల మరిడియ్యకాపు పేర్కొన్నారు. రామోజీరావు జయంతి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రంగంపేట సామిల్లులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక సమస్యలను ఈనాడు-ఈటీవీ ద్వారా వెలుగులోకి తీసుకొచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేశారన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

చిత్రం.. సందేశం

ఫార్మసీ వారోత్సవాలు పురస్కరించుకుని 2వ రోజు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం బ్రాంచి, స్కూల్ ఆఫ్ ఫార్మసీ సంయుక్తంగా గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఫార్మసీ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. ఫార్మాసిస్టులు టీకాకు మద్దతుదారులు అనే అంశంపై బృందచర్చలు నిర్వహించారు. మొత్తం 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను ఎంపిక చేశారు. – న్యూస్‌టుడే, రాజానగరం

హరహర మహాదేవ.. శంభోశంకర..

ఉమారామలింగేశ్వరస్వామి

సుబ్రహ్మణ్యస్వామి

బిక్కవోలు: బలభద్రపురంలోని ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమ పూజ, బిల్వార్చన జరిగాయి. ● శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 386 కాలసర్పదోష నివారణా పూజలు జరిగాయి. కార్తిక మాసం కావటంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

రాజానగరం: దివాన్‌చెరువులో శ్రీలక్ష్మీగణపతి ఆలయం, ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయ ప్రాంగణంలో లక్షదీపోత్సవం నిర్వహించారు. సూర్యుడు, శివలింగం, స్వస్తిక్, ఓంకారం, అక్షరమాల, శంఖు చక్రాలు, నాగసర్పం, శ్రీఆకారాల్లో దీపాలను మంగిన వరప్రసాద్ తీర్చిదిద్దారు.

కడియం: కడియపులంకలోని మహాక్షేత్రంలో అనంతేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్, రాజమహేంద్రవరం దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిశోర్ విస్తృత ఏర్పాట్లు చేశారు. సుమారు 50 వేలమంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. డీఎస్పీ భవ్యకిశోర్‌ను జ్ఞాపికతో కమిటీ సభ్యులు సత్కరించారు. మాజీ ఛైర్మన్ పల్ల సత్తిబాబు, శ్రీఅభయాంజనేయస్వామి ఆలయకమిటీ ఛైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం, మార్గాని ఏడుకొండలు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై నాగదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించరేం..?

హుకుంపేట ఉన్నత పాఠశాల ఎదురుగా వ్యర్థాలు పడేస్తున్నారు. కాలువ నుంచి తీసిన పూడికలు అక్కడే పడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనికితోడు చెత్త రిక్షా అక్కడే ఉండటంతో దుర్వాసన వస్తోందని అంటున్నారు. పాఠశాలకు వెళ్లే దారిలో ఇబ్బందిగా ఉంటుంది. పంచాయతీ సిబ్బందిని సంప్రదించగా దూరప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – హుకుంపేట, న్యూస్‌టుడే

మట్టిరోడ్డుతో అవస్థలు

కొంతమూరు అగ్రహారం నుంచి భవానీనగర్‌కు వెళ్లే రహదారి మట్టి రోడ్డు కావడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు కుంగి, గుంతలు పడ్డాయి. రాత్రిపూట వెళ్లాలంటే ప్రహసనంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, నాయకులకు విన్నవించినా ప్రయోజనం లేదని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

పాఠశాల పక్కనే వ్యర్థాలు

కొంతమూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఎదురుగా వ్యర్థాలు పేరుకుపోయాయి. కుక్కలు, పందులు వాటిని రోడ్డుపైకి లాగడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. విద్యార్థులపై దాడులకు దిగుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్త ఎప్పటికప్పుడు తొలగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

పుస్తక పఠనం.. విజ్ఞాన వికాసం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కవి సమ్మేళనంపై అవగాహన కల్పించారు. డాక్టర్ నీలకంఠరావు మాస్టారు పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఉపసర్పంచి వెలుగుబంటి రఘురామ్, గ్రంథాలయ నిర్వాహకుడు ఎం.వీరలింగం తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కడియం

20న ఉచిత నేత్ర శిబిరం

పెదపూడి: పెదపూడి సత్యసాయి సేవాకేంద్రంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవా కేంద్రం కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు మంగళవారం తెలిపారు. శిబిరంలో కంప్యూటర్ ద్వారా పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన బాలిక విషయంలో ఒక యువకుడిపై పోక్సో కేసు నమోదు అయిందని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉత్తర మండల డీఎస్పీ వై.శ్రీకాంత్ కేసు నమోదులో భాగంగా దర్యాప్తు చేశారన్నారు. ఈ కేసులో జి.నాగ వెంకటేశ్(23) అనే యువకుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

9 మంది జూదరులు..

గోకవరం: తంటికొండ శివారు తోటలో మంగళవారం వన సమారాధన నిర్వహిస్తున్నారు. అక్కడ జూదం ఆడుతున్నారనే సమాచారంతో కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఇన్‌ఛార్జి ఎస్సై సత్యనారాయణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.73,525 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులు

కొవ్వూరు పట్టణం: అదనపు కట్నం కోసం భర్త వేధింపులు భరించలేక తన కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసిందని ఓ తల్లి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. వివరాల ప్రకారం కొంతమూరుకు చెందిన అరుణకు కొవ్వూరుకు చెందిన ఎలుబండి వెంకట సత్యనారాయణతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. ఇంకా కట్నం తేవాలని భర్త వేధింపులకు గురిచేస్తుండడంతో ఈనెల 4న అరుణ ఆత్మహత్యాయత్నం చేసింది. దీనిపై ఆమె తల్లి మాగాపు పుల్లారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపాధ్యాయులకు కార్యశాల

శ్యామలాసెంటర్: అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఈ నెల 19 నుంచి 21 వరకు ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యశాల నిర్వహిస్తున్నట్లు సైన్స్ అధికారి జీవీఎన్ఎస్ నెహ్రూ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులకు ల్యాబ్, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారన్నారు.

గురుకులానికి రూ.7లక్షల పురస్కారం

కొంతమూరు : కొంతమూరులోని శ్రీదత్తాత్రేయ వేద విద్య గురుకులానికి రూ.7లక్షల పురస్కారం లభించింది. ఈ మేరకు గురుకులం వ్యవస్థాపకులు వేదాంత చూడామణి గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనాపాటి మంగళవారం వివరాలు తెలిపారు. సింఘాల్ ఫౌండేషన్ తమది ఉత్తమ గురుకులంగా గుర్తించిందన్నారు. పూణేలో జరిగిన కార్యక్రమంలో గుళ్లపల్లి లక్ష్మీనారాయణ దత్తాత్రేయ, పైడిమర్రి చంద్రశేఖర ఘనాపాటిలు హాజరై పురస్కారం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారన్నారు. గతంలో భారతాత్మ పురస్కారం అవార్డు లభించిందన్నారు. శ్రీశృంగేరి శంకర మఠం ధర్మాధికారి వేలూరి బాలాజీ, జయంతి శర్మ, తెన్నేటి కామేశం, వేదవతి దంపతులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీతారామచంద్ర ఘనాపాటి

తల్లికి వందనం.. తొలగిన అడ్డంకి

కేడర్‌తో ఎమ్మెల్యే నల్లమిల్లి కార్యక్రమంతో పరిష్కారం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ విద్యార్థికి తల్లికి వందనం అందలేదు. కేడర్‌తో ఎమ్మెల్యే నల్లమిల్లి కార్యక్రమంతో సమస్య పరిష్కారమైంది. వివరాల్లోకి వెళ్తే.. అనపర్తి మండలం కొప్పవరానికి చెందిన బలగం షణ్ముక గాయత్రి తల్లిదండ్రులు లేకపోవడంతో తాత, అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. ఆమెకు తల్లికి వందనం నగదు జమ కాలేదు. ఇటీవల కేడర్‌తో ఎమ్మెల్యే నల్లమిల్లి కార్యక్రమంలో వివరించారు. వారి పేరుపై రెండు విద్యుత్తు సర్వీసు మీటర్లు ఉండటంతో జమ కాలేదని అధికారులు చెప్పారు. అందులో ఒకటి తమది కాదని గుర్తించారు. దీనిపై మాజీ సర్పంచి కర్రి వెంకటరామారెడ్డి విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడారు. ఆ మేరకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ మీటర్‌ను తక్షణమే బదిలీ చేసి కనెక్షన్ తొలగించాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆదేశించారు. బాలిక తాతయ్య ఆర్.శ్రీనివాసరావు రెండింట్లో ఓ మీటర్ కనెక్షన్‌ను మంగళవారం అధికారులకు స్వాధీనం చేశారు. సమస్యకు పరిష్కారం లభించడంతో ఇకపై జమ అవుతుందని భరోసా ఇచ్చారు.

నేడే అన్నదాత సుఖీభవ సొమ్ము

అర్హులైన రైతులు (రూ.లక్షల్లో)

మండలం	పీఎం కిసాన్		అన్నదాత సుఖీభవ	
	అర్హులు	సొమ్ము	అర్హులు	సొమ్ము
అనపర్తి	3,289	65.78	3,342	167.10
బిక్కవోలు	5,218	104.36	5,932	296.60
రంగంపేట	6,714	134.28	8,321	416.05
రాజానగరం	8,353	167.06	9,959	497.95
కోరుకొండ	7,893	157.86	9,420	471.00
సీతానగరం	6,113	122.26	6,848	342.40
గోకవరం	5,485	109.70	7,705	385.25
కడియం	3,846	76.92	4,392	219.60
రా.గ్రామీణం	1,456	29.12	1,338	66.90

బిక్కవోలు, బొమ్మూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోంది. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ రెండో విడత రైతులకు అందించనుంది. దీనిపై నియోజకవర్గస్థాయిల్లో కార్యక్రమాలు జరగనున్నాయి. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లో రూ.3.83 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ కానున్నాయి. రాజమహేంద్రవరం గ్రామీణంకు సంబంధించి తొర్రేడు సొసైటీలో బుధవారం మధ్యాహ్నం కార్యక్రమం జరుగుతుందని సహాయ వ్యవసాయ సంచాలకుడు కాశిన సూర్య రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరవుతారన్నారు. అనపర్తికి సంబంధించి పందలపాకలో జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పంచాయతీ కార్యాలయంలో ప్రారంభిస్తారన్నారు.

నాటుపడవ ప్రయాణం.. కేసు నమోదు

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: సీతానగరం మండలం వంగలపూడి నుంచి పట్టిసీమకు నాటుపడవపై తీసుకువెళ్లడంపై బైండోవరు కేసు నమోదు అయిందని సీతానగరం ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వంగలపూడికి చెందిన ఎస్.స్వామి అనే వ్యక్తి తన నాటుపడవపై 28 మంది భక్తులను ఎక్కించుకుని పట్టిసీమకు తీసుకువెళ్లాడు. అక్కడ పోలీసులు ఆ నాటుపడవను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిని తమకు అప్పగించారన్నారు. తహసీల్దారు శ్రీనివాసరావు ముందు హాజరుపరచగా రూ.2 లక్షల పూచీకత్తుపై బైండోవరు చేశారన్నారు. ఎటువంటి అనుమతులు, రక్షణ లేకుండా నాటు పడవలపై భక్తులను తీసుకువెళితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

వృద్ధురాలి మృతిపై విచారణ

గోకవరం: వైద్యం సక్రమంగా అందకే తన తల్లి మరణించారని కొత్తపల్లి గ్రామానికి చెందిన చల్లా రాజ్యలక్ష్మి అందించిన ఫిర్యాదుపై వైద్యశాఖ అధికారులు విచారణ నిర్వహించారు. వివరాలివీ.. కొత్తపల్లి గ్రామానికి చెందిన కె.నూకరత్నం (62) అనారోగ్యానికి గురికావడంతో ఎంపీపీ కార్యాలయం సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి ఏప్రిల్ 17న తీసుకువచ్చారు. మరుసటి రోజే ఆమె మృతి చెందారు. వైద్యం సక్రమంగా అందకే తన తల్లి మృతి చెందిందని దీనిపై విచారణ నిర్వహించాలంటూ రాజ్యలక్ష్మి రాజమహేంద్రవరంలో పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యశాఖకు చెందిన ఇద్దరు వైద్యులు మంగళవారం ఆసుపత్రి వద్ద విచారణ నిర్వహించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

రంగంపేట, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతి కోసం పోరాటాలు చేసి అమరులైన వీరుల త్యాగాలు మరువలేనివని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. మంగళవారం రంగంపేట మండలం సింగంపల్లిలో ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతి శీల మహిళ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ ర్యాలీ, సభ జరిగాయి. అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. నాయకులు కుంచె అంజిబాబు, రాజబాబు, మడికి సత్యం పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు తాము పనిచేసిన పాత పాఠశాలకు రెండు ఇనుప షెల్ఫులు ఇచ్చారు. అనపర్తి పాతవూరులోని కేపీఆర్ జడ్పీ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు ఇటీవల వేరే పాఠశాలలకు బదిలీ అయ్యారు. వారంతా కలిసి రూ.15వేలు విలువైన ఈ సామగ్రిని మంగళవారం అందజేశారు. వై.రాంబాబు, పి.శ్రీనివాసరెడ్డి, వైబిఎస్ ఆచార్యులు, యు.లచ్చయ్య, కే.రవికిషోర్‌కుమార్, జి.నానాజీ, వి.చైతన్య వీటిని సమకూర్చారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కోటంశెట్టి రాజేంద్రప్రసాద్, భవాని దంపతులు వాటిని సమకూర్చారు. రవి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు.. విద్యార్థులకు పోటీలు

గోకవరం: గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 20న నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందిస్తామని లైబ్రేరియన్ రమేష్ తెలిపారు. హెచ్ఎం సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్తు సౌకర్యానికి వినతి

రాజానగరం: కొత్త తుంగపాడులో ఎస్సీ, బీసీల శ్మశాన వాటికకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాళ్ల మాచరయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు సంపతనగరం విద్యుత్తు ఉప కేంద్రం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాచరయ్య మాట్లాడుతూ శ్మశాన వాటికకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని, అందుకోసం వెంటనే స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎప్పటి నుంచో కోరుతున్నా పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

CHANGE OF NAME
I, BADDEM SAI RAM, S/O Suribabu, D.No :54-7-1, Gopal Nagar Punta, Rajahmundry, E.G.Dt., A.P. – 533101. I have changed my name from **BADDEM SAI** (Old name) to **BADDEM SAI RAM,** (New name) hence forth I am being called **BADDEM SAI RAM,** S/O Suribabu,, for all purposes.

(c) eenadu

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి దుర్గేష్

కోటసత్తెమ్మను దర్శించుకున్న మంత్రి

నిడదవోలు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మను మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిడదవోలులోని నందిన సుబ్బారావు, లీలావతి శాఖా గ్రంథాలయంలో జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

నేడు గౌరీపట్నంలో 'అన్నదాత సుఖీభవ'

గోపాలపురం: అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత ప్రారంభ కార్యక్రమం నియోజకవర్గస్థాయిలో దేవరపల్లి మండలం గౌరీపట్నంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరవుతారని, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నూతన వరి వంగడాలతో అధిక దిగుబడి

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ నూతన వరి వంగడాలు వినియోగించి అధిక దిగుబడులు పొందాలని రైతులకు సూచించారు. వచ్చే రబీకి వినియోగించే విత్తనాలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం రైతులకు రాయితీపై విత్తనాలు అందించారు.

ప్రదర్శనలో వైద్యుడు, సిబ్బంది

విచ్చలవిడిగా మందులు వాడొద్దు

ఉండ్రాజవరం: వివిధ రోగాలకు సంబంధించి వైద్యులను సంప్రదించకుండా విచ్చలవిడిగా మందులు వాడరాదని మండల వైద్యాధికారి బి.దుర్గామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వారోత్సవాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉండ్రాజవరంలో ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో మైలవరపు సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: పల్లెల్లో మురుగు సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు, కొవ్వూరు మండలంలోని దేచర్లలో పీఎంఏజీవై కింద రూ.40 లక్షలతో మురుగు కాలువల నిర్మాణానికి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఇటీవల వేగేశ్వరపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మాజీ సర్పంచి కాకర్ల శ్రీనివాసు, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసురావు సమకూర్చిన రూ.30 వేలను ఎమ్మెల్యే అందజేశారు. బల్లిపాడు, తిరుగుడుమెట్టకు చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 2.50 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండలశాఖ అధ్యక్షుడు పరమేశ్వరరావు, నాయకులు సిద్దా దుర్గారావు, అన్నమరెడ్డి సత్తిబాబు, రమణ, దత్తుడు, తిగిరిపల్లి గోపి పాల్గొన్నారు.

బల్లిపాడులో మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి

కార్తిక సమారాధన ఐక్యతకు దర్పణం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నందమూరు రోడ్డులోని సూరపనేని గార్డెన్స్‌లో తొలుత కార్తిక దామోదరుడు, వన, గోపూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆహ్లాదకర పోటీలు కొనసాగాయి. సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు, తెదేపా పక్ష నాయకుడు సూరపనేని చిన్ని పూజల్లో పాల్గొని పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సేవా గుణానికి ఆర్యవైశ్యులు చిరునామాగా నిలుస్తారని అతిథులు కొనియాడారు. సమారాధన కమిటీ ఛైర్మన్ కోట్రంకి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు మట్టే ప్రసాద్, మద్దుల నాని, సంఘ కార్యదర్శి కాకి అనిల్, కోశాధికారి కంకటాల రాంబాబు, వాసవి, మహిళా, వజ్రవనిత వాసవిక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్తిక దామోదర పూజ చేస్తున్న దంపతులు

నేడు 1,14,991 మంది రైతులకు లబ్ధి

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలోని 1,14,991 మంది రైతులకు రూ.76.99 కోట్ల మేర ప్రభుత్వం లబ్ధి చేకూర్చనున్నట్లు మంగళవారం కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైతుల ఖాతాలకు నేరుగా నిధులు జమ అవుతాయన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని బుధవారం నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెరుపులు మొక్కలూ లేవు

అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు, పోషణ వాటికల పేరిట నిధులు స్వాహా

పరిశీలన

న్యూస్‌టుడే, నిడదవోలు

గత ప్రభుత్వం గాలికొదిలేసిన అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను మార్చి జనసత్వాలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పలు కార్యకలాపాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా భవనాలకు రంగులు వేయడంతోపాటు ఆట వస్తువులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కొత్తగా కిచెన్ గార్డెన్లు (పోషణ వాటికలు)కు నిధులు కేటాయించింది. తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రాజెక్టు పరిధిలో ఇలా...

మండలం	రంగులేసిన భవనాలు	పోషణ వాటికలు
నిడదవోలు	23	59
పెరవలి	3	39
ఉండ్రాజవరం	18	33

కానరాని ఆనవాళ్లు.. అసంపూర్తిగా బొమ్మలు..

చిన్నారులను ఆకట్టుకునే విధంగా అంగన్‌వాడీ భవనాలకు రంగులు, గోడలపై బొమ్మలు వేయాల్సి ఉంది. ఇందుకు ఒక్కో కేంద్రానికి రూ.9,900 చొప్పున పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 44 కేంద్రాలకు రూ. 4.35 లక్షలు కేటాయించారు. ఈ నిధులను ఐసీడీఎస్ ద్వారా అందించగా, పంచాయతీల ఆధ్వర్యంలో రంగులు వేయించారు. నిడదవోలు మండలంలో కూటమి నాయకుడొకరు రంగులు వేసే కాంట్రాక్టులను దక్కించుకుని మొక్కుబడిగా పనులు చేశారు. రంగులు సరిగా వేయడం లేదని ఆయనను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు తెలిసింది. రంగులు వేసిన భవనాలు కొన్ని అప్పుడే పెచ్చులుగా ఊడిపడి వెలవెలబోతున్నాయి. కోరుమామిడిలోని ఓ కేంద్రంలో బొమ్మలు పూర్తిగా వేయలేదు. దీంతో వాటిని చూపించి చిన్నారులకు వివరించడానికి కూడా వీలులేకుండా ఉందని అంగన్‌వాడీ కార్యకర్త ఒకరు వాపోయారు. కోరుమామిడి 136 అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని చూస్తే రంగులు వేసిన ఆనవాళ్లే కనిపించడం లేదు. తాడిమళ్ల, కాటకోటేశ్వరం తదితర గ్రామాల్లో రంగులు వేశామని చెబుతున్నా గోడలు నాచు పట్టి కనిపిస్తున్నాయి. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. చాలా వరకు భవనాలది ఇదే పరిస్థితి.

కోరుమామిడి 136వ నంబరు అంగన్‌వాడీ కేంద్రానికి వేసిన రంగు పెచ్చులూడుతూ..

పిచ్చి మొక్కలతో పోషణ వాటికలు..

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు పోషణ వాటికల ఏర్పాటుకు రూ.10 వేలు చొప్పున 131 కేంద్రాలకు రూ. 13.10 లక్షలు అందించారు. ఈ నిధులను అంగన్‌వాడీ కార్యకర్తల ఖాతాలకే నేరుగా జమ చేశారు. అప్పట్లో పలు కేంద్రాల వద్ద వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలు వేశారు. తర్వాత నిర్వహణ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలు పెరిగి కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల కూరగాయలు, ఆకు కూరల మొక్కలు కనిపించడం లేదు.

సమిశ్రగూడెంలో ఏర్పాటుచేసిన పోషణ వాటికలో పెరిగిన పిచ్చిమొక్కలు

అక్కడక్కడ నిర్వహణ లోపాలు..

పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో పోషణ వాటికలు బాగానే ఉన్నాయి. నిడదవోలు మండలంలో అక్కడక్కడ నిర్వహణ సక్రమంగా లేదు. వాటిని పరిశీలించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. భవనాలకు రంగులు వేసేందుకు నిధులు మా శాఖ ద్వారానే అందించినా పనులు పంచాయతీల పరిధిలో చేపట్టారు. వాటిని కూడా పరిశీలిస్తాం.

- ఆశారోహిణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి, పెరవలి

మెట్ల మార్గాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి

గోపాలపురం, దేవరపల్లి: గ్రామీణ ప్రాంతంలో డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాలకు ఆయన విచ్చేశారు. గ్రంథాలయంలో పాఠకులకు వీలుగా ఏర్పాటు చేసిన ఐరన్ మెట్ల మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నేటి తరానికి పఠనాసక్తి పెంపొందించేందుకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. ఇందుకు తనవంతు సాయంగా రూ.10 వేలు గ్రంథాలయాధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండలశాఖ అధ్యక్షుడు ఆంద్రు అనిల్, నాయకులు బొల్లిన భాస్కరరావు, గద్దె శ్రీనివాస్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, జనార్దనరావు, రామచంద్రరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బి.ప్రతాప్ కుమార్, గ్రంథాలయ పాలకురాలు అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు

అభ్యాస కళాశాలలో ఉపన్యసిస్తున్న విద్యార్థి

విజేతలతో కరస్పాండెంట్ పి.వెంకటరమణ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కొవ్వూరు శ్రీ అభ్యాస జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇంటరు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకునే రీతిలో ఉపన్యసించారు. జి. లేఖశ్రీ దుర్గ (ద్వితీయ ఎంపీసీ), టి.నిస్సిరాజ్, కె. సూర్యప్రణీత్ (ప్రథమ ఎంపీసీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ పి.వెంకటరమణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ● 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలోని అభ్యాస పాఠశాలలో మంగళవారం 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ఆకట్టుకునే రీతిలో ప్రసంగించారు. డి. సుదీప్ విన్సెంట్, ఇ.జ్యోల్ (8వ తరగతి), వై.సాయి సమీక్ష (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.వెంకటరమణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

అభ్యాస పాఠశాలలో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

విజేతలైన చిన్నారులతో వెంకటరమణ

పుంతదారి.. ఇరుకుగా మారి



పెరవలి మండలం ఖండవల్లిలో కాలువగట్టును ఆనుకుని ఉన్న పుంత రోడ్డిది. ఇరువైపులా తుప్పలు పెరిగి కుంచించుకుపోతోంది. విషపురుగులు సంచరిస్తుండడంతో రాత్రి, తెల్లవారుజాము వేళల్లో పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ఇరుకుగా మారడంతో ట్రాక్టర్లపై వ్యవసాయోత్పత్తుల తరలింపునకు అవస్థలు తప్పడం లేదు. తుప్పలు తొలగించి రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని జలవనరులశాఖ ఏఈ ఎన్.బాలమురళి దృష్టికి తీసుకు వెళ్లగా సమస్య పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పెరవలి**

నిర్మించి.. నిరుపయోగంగా వదిలేసి

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పెరవలి ఎస్సీ ప్రాంతంలో రూ. 3 లక్షలతో సామాజిక పారిశుద్ధ్య సముదాయాన్ని నిర్మించారు. దానిని ఇప్పటికీ వినియోగంలోకి తేలేదు. పట్టించుకున్న వారు లేక చుట్టూ పిచిమొక్కలు పెరిగి సమీపంలోకి వెళ్లడానికీ వీలులేని విధంగా ఉంది. ఈ పరిస్థితిని సచివాలయ కార్యదర్శి లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకు వెళ్లగా శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పెరవలి**

హడలెత్తిస్తున్న శునకాలు

కొవ్వూరు పట్టణంలో కుక్కలు హడలెత్తిస్తున్నాయి. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ కనిపించిన వారిపై దాడులకు దిగుతున్నాయి. వాహనాల వెంటపడుతున్నాయి. వీధి దీపాలు వెలగని ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో కాసుకొని సమీపం నుంచి వెళ్లే జనం, వాహనాలపై ఉరుకుతున్నాయి. ఈ సమస్యను కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా కుక్కలకు శస్త్ర చికిత్స చేయించే విషయమై చర్చిస్తున్నామని, వీటి నియంత్రణపై శ్రద్ధ చూపుతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం**

యోగాతో ఆరోగ్యకర జీవితం

మానవాళికి ఆరోగ్యకర జీవితాన్ని అందించేందుకు యోగా దోహదపడుతుందని జాతీయ సేవా శిబిరం (ఎన్ఎస్ఎస్) కార్యదర్శి సి.పి.విజ్జి పేర్కొన్నారు. ఉద్యాన వర్సిటీ (వెంకట్రామన్నగూడెం) ఆధ్వర్యంలో పోతవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు యోగా, ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విజ్జి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని టి.హిమబిందు, యు.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, నల్లజర్ల**

వర్సిటీ అభివృద్ధిపై చర్చ

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పలు భవనాలను కలెక్టర్ కీర్తి చేకూరి, వీసీ ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం పరిశీలించారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి వీసీ స్వాగతం పలికారు. కళా, సంస్కృతి విభాగంలో ఇటీవల రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్న వీసీ ప్రసన్నశ్రీని కలెక్టర్ అభినందించారు. అనంతరం నూతనంగా నిర్మించిన విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల, ఎగ్జామినేషన్స్, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, బాలుర వసతి గృహ భవనాలను పరిశీలించారు. వర్సిటీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి, వీసీ ప్రసన్నశ్రీ

మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి

పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ

కొవ్వూరు పట్టణం: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రతినిధులు కొవ్వూరు పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కెపాసిటీ బిల్డింగ్ కోఆర్డినేటర్ జి.సీతారామాంజనేయరాజు, ఐఈసీ కోఆర్డినేటర్ వి.ప్రదీప్, శిక్షకుడు రామారావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలు, క్షేత్ర స్థాయిలో పని చేసే విధానం, తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాల సేకరణ, తరలింపు ప్రక్రియ, భద్రత చర్యలపై వివరించారు. సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి హాజరై మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ తీరు ఆధారంగానే పట్టణానికి గుర్తింపు వస్తుందన్నారు. ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి రవి, ఆ విభాగం కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు కార్యశాల

శ్యామలాసెంటర్: అటల్ టింకరింగ్ ల్యాబ్‌లున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఈ నెల 19 నుంచి 21 వరకు ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యశాల నిర్వహిస్తున్నట్లు సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ నైపుణ్యం, ప్రయోగాత్మక అభ్యాసం, సమస్య పరిష్కార శక్తితో పాటు ప్రధానోపాధ్యాయులకు ల్యాబ్, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారన్నారు.

అధిక కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు పట్టణం: అధిక కట్నం కోసం భర్త వేధింపులు భరించలేక తన కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసిందని ఓ తల్లి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. వివరాల ప్రకారం కొంతమూరుకు చెందిన అరుణకు కొవ్వూరుకు చెందిన ఎలుబండి వెంకట సత్యనారాయణతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. ఇంకా కట్నం తేవాలని భర్త వేధింపులకు గురి చేస్తుండడంతో ఈనెల 4న అరుణ ఆత్మహత్యాయత్నం చేసింది. దీనిపై ఆమె తల్లి మాగాపు పుల్లారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, లక్షపత్రి పూజ, అభిషేకాలు మంగళవారం నిర్వహించారు. అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వెలగదుర్రులో విశ్వేశ్వర, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో లక్షపత్రి పూజ, ఏకాహం చేపట్టారు.

సోమేశ్వరస్వామికి పూజలు..

నిడదవోలు : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నిడదవోలు పట్టణంలోని బాలాత్రిపుర సుందరిదేవి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రుద్రాభిషేకాలు, సామూహిక పూజలు, అభిషేకాలు, లక్ష బిల్వార్చన, అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొని పూజలు చేశారు. సత్యసాయిబాబా ఆలయం వద్ద నిర్వహించిన బాబా శత జయంతి ఉత్సవాల్లో శేషారావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.

వనసమారాధనలో పూజలో పాల్గొన్న శేషారావు

వైభవంగా బంగారుపాపమ్మ ఉత్సవాలు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో బంగారుపాపమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బబర్దస్త్ డ్యాన్స్ హంగామా కార్యక్రమాన్ని రైజింగ్ రాజు, దొరబాబు, హరిత ప్రదర్శించారు. ఎస్సై రామకృష్ణ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాలంగిలో రామలింగేశ్వరస్వామి

నిడదవోలులో సోమేశ్వరస్వామి

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

న్యూస్‌టుడే బృందం : సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాలో మంగళవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ● కొవ్వూరు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీలు జరిగాయి. ● చాగల్లు మండలం చంద్రవరంలో వివిధ అంశాలపై వక్తృత్వ పోటీలు, చర్చాగోష్ఠి నిర్వహించారు. ● నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు గొట్టిపాటి శ్రీరామచంద్రమూర్తి, లైబ్రేరియన్ ఎ.వి.రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి : జేసీ

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజాఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని, పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని జేసీ మేఘాస్వరూప్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్' నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్న నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లో, ఆర్ఎస్‌కేలో కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్)లో అర్హుల గుర్తింపు, స్వామిత్వ సర్వేల పురోగతిపై సమీక్షించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలను సందర్శించి మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భోజనం నాణ్యత పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

గోపాలపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దె చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవరపల్లి మండలం రామన్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఎంపిక పోటీలు జరిగాయన్నారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఎం.ప్రియదర్శిని, ఎస్.కె. లతీఫా, పి.సురేఖ, ఎం.లోహితశ్రీ, పి.హాస్య, బాలుర విభాగంలో జి. బాబి, వై.ఈశ్వర్, జి.చిన్నబాబు, కె.ఆకాష్ ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 21, 22 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక పోటీలను వ్యాయామోపాధ్యాయులు సరస్వతి, చిన్నరామారావు తదితరులు పర్యవేక్షించారు.

ఎంపికైన విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయులు

ఫుట్‌బాల్‌లో చాగల్లు విద్యార్థులు..

చాగల్లు : గత నెలలో దేవరపల్లిలో నిర్వహించిన అండర్-14 జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో చాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.మోహిని, ఆర్.ప్రవల్లిక, ఎస్.పావని, డి.జయదుర్గ, కె.దీపిక, కె.అన్నపూర్ణ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈనెల 19 నుంచి చిత్తూరు జిల్లాలో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ప్రధానోపాధ్యాయిని వి.వాసవి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

(c) eenadu

ఏలూరులో మావోలు నివసమున్న భవనం ఇదే

వనంలోకి బలగాలు.. జనంలోకి మావోలు

- ఏలూరులో మావోయిస్టుల అలజడి
- 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నగర శివారు.. ప్రశాంతమైన ప్రాంతం.. అక్కడ ఏం జరుగుతుందో.. ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో కూడా తెలియదు.. అలాంటి చోటుకు.. సరిగ్గా మంగళవారం మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట మధ్య.. ఏం జరుగుతుందో తెలిసేలోపే.. ఒక దాని వెనుక ఒకటి పోలీసుల వాహనాలు.. రయ్‌మంటూ దూసుకొచ్చాయి.. మఫ్టీలో ఉన్న 70 నుంచి 80 మంది పోలీసులు.. వారంతా గ్రీన్‌సిటీలో ఉన్న ఓ రెండంతస్తుల భవనాన్ని చుట్టుముట్టారు.. అక్కడ ఏం జరుగుతుందో స్థానికులకు అర్థం కాలేదు.. చూస్తుండగానే పోలీసులు నాలుగువైపులా భవనాన్ని చుట్టుముట్టారు.. లొంగిపోవాలని లోపల ఉన్నవారిని హెచ్చరించారు. అప్ప గోడలు దూకి లోపలికి వెళ్లి దొరికిన వారిని దొరికినట్లుగా పట్టుకున్నారు. కాస్త సమయం ఇచ్చినా.. ఆపరేషన్ అటూ ఇటూ అయినా ఏం జరిగేదో తెలియదు. ఎందుకంటే పట్టుబడిన వారి వద్ద ఆయుధాలు ఉన్నాయి.

ఏలూరు నేరవార్తలు, కుక్కునూరు, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆపరేషన్ కగార్ అమలు చేశారు పోలీసులు. సినీ పక్కీలో మెరుపు దాడి చేసి మావోలను అదుపులోకి తీసుకున్నారు. ఊహించని రీతిలో పోలీసులు ప్రత్యక్షం కావడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న మావోలు ఎలాంటి ప్రతిఘటన లేకుండానే లొంగిపోయారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఈ ఆపరేషన్‌ను స్వయంగా పాల్గొని ముందుండి నడిపించారు.

పోలీసులు ఉండే ఏరియాలో.. ఏలూరులో 15 మంది మావోలను పట్టుకున్నారని తెలియగానే నగరంలో కలకలం చోటుచేసుకుంది. గతంలో వారి జాడ లేదు. ఇప్పుడు నెల రోజులుగా గ్రీన్ సిటీలోని ఇంటిని షెల్టర్ జోన్‌గా చేసుకుని ఉండటంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పైగా ఆ ఏరియాలో ఎక్కువ మంది పోలీసులు నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతాన్ని వాళ్లు ఎందుకు ఎంచుకున్నారంటే.. మినీ బైపాస్ పక్కనే ఉండటం.. నిర్మానుష్య ప్రాంతం కావటం, పెద్దగా జన సంచారం లేకపోవడమే. అవసరమైతే 10 నిమిషాల్లో జాతీయ రహదారికి చేరుకోవచ్చు.

ఉలిక్కిపడిన ఉమ్మడి జిల్లా
పర్యవేక్షిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఆపరేషన్ కగార్ పేరుతో మావో ఉద్యమంపై కేంద్రం ఉక్కుపాదం మోపడంతో.. వారంతా వేర్వేరు మార్గాల్లో తలదాచుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఏలూరులోని ఓ భవనంలో ఉన్న 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉమ్మడి జిల్లా ఉలిక్కిపడింది. పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పశ్చిమలో ఎక్కడా వారి జాడ లేదని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ఏలూరు నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిఘా పెంచారు. ముఖ్య కూడళ్లల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

20 ఏళ్ల క్రితం క్యారేజీ బాంబు పేలుడు..

నగర శివారు గుండుగొలనులో 2005లో స్వారం ఏర్పాటు చేసుకున్న అప్పటి పీపుల్స్‌వార్‌కు చెందిన ఇద్దరు రాత్రి 10 గంటల సమయంలో ల్యాండ్‌మైన్‌ను క్యారేజీలో పెట్టుకుని విశాఖ వెళ్లే రైలు ఎక్కేందుకు ఏలూరు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ప్లాట్‌ఫాంపై ఉండగా ప్రమాదవశాత్తూ అది పేలిపోయింది. దీంతో దాన్ని తరలిస్తున్న కర్నూలు జిల్లా క్యాడర్‌కు చెందిన పీపుల్స్‌వార్ నాయకుడు విజయభాస్కర్, అతని అనుచరుడు ఘటనా స్థలంలోనే చనిపోయారు. వారి శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.. ఆ పక్కనే ఉన్న మరో ప్రయాణికుడు చనిపోగా కొందరికి గాయాలయ్యాయి.. ఈ ప్రమాదంతో రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం అంతా భీతావహంగా మారిపోయింది. ఈ విషయం తెలుసుకున్న గుండుగొలనులో ఉన్న నక్సలైట్లు కూడా షెల్టర్ వదిలి పరారయ్యారు.

అదుపులోకి తీసుకున్న వారిని తీసుకువెళుతున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో ఛాయలు

☛ పాలకోడేరు మండలంలోని ఓ గ్రామంలో కొంత కాలం తలదాచుకున్న ఒక మావోయిస్టును కొన్నేళ్ల కిందట కృష్ణా జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అత నితో సన్నిహితంగా ఉన్న కొంద రిని అదుపులోకి తీసుకున్నారు.

☛ విశాఖ, ఒడిశా ప్రాంతాల్లో పట్టుబడిన మావోల జాబితాలో భీమవరానికి చెందిన స్వరూప అనే మహిళా మావోయిస్టు పేరు ఉండటంపై అప్పట్లో పట్టణంలో జోరుగా చర్చ జరిగింది.

☛ తణుకులో ఓ ఇంట్లో మావోలు నిల్వ ఉంచిన పేలుడు సామగ్రిని తెలంగాణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

☛ ఒడిశా నుంచి తప్పించుకున్న ఓ మావోయిస్టు ఏడాదిన్నర కిందట భీమవరంలో కొన్ని నెలల పాటు తలదాచుకున్నారు. ఒడిశా పరిసర రాష్ట్రాల నుంచి వచ్చిన భవన నిర్మాణ కార్మికుల్లో ఒకరిగా ఉన్నాడని తెలిసి చాకచక్యంగా పట్టుకున్నారు.

కుక్కునూరు మండలం కొత్త నెమలిపేటలో ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసుల తనిఖీలు

విలీన మండలాల్లో అప్రమత్తం

గతంలో ఖమ్మం జిల్లాలో ఉన్నప్పుడు ప్రస్తుతం జిల్లాలో ఉన్న విలీన మండలాలు కుక్కునూరు, వేలేరుపాడులో మావోల కార్యకలాపాలు ఉండేవి. తర్వాత వారి ఉనికి లేకుండా పోయింది. తాజా ఘటనతో కుక్కునూరు, వేలేరుపాడు పోలీసు స్టేషన్లలో రెండు ఏపీఎస్పీ బెటాలియన్ల క్యాంపులు ఏర్పాటు చేశారు. గతంలో మావోల కార్యకలాపాలు ఉన్న సమయంలో ఇక్కడ ఆ బెటాలియన్లు ఉండేవి. తర్వాత వారి కార్యకలాపాలు తగ్గిపోవడంతో వాటిని ఎత్తేశారు. అబుజ్‌మడ్ ప్రాంతంలో మావోల ఏరివేతతో వారు షెల్టర్‌జోన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు పోలీసులు పసిగట్టారు. అబుజ్‌మడ్ ప్రాంతానికి చేరువగా ఉన్న విలీన మండలాల మీదుగా జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు ఉంటాయని ఊహించిన అధికారులు, ఇక్కడ రెండు క్యాంపులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. పోలీసులు అనుమానించినట్లే.. మావోలు ఏలూరులో షెల్టర్ కోసం ప్రయత్నించి, మంగళవారం పోలీసులకు చిక్కారు. దీంతో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన విలీన మండలాల్లోని ఆదివాసీ గ్రామాల్లోకి మంగళవారం సాయంత్రం పోలీసు బలగాలు వెళ్లాయి. కొత్తగా అక్కడికి వచ్చిన వ్యక్తుల వివరాలు తెలుసుకోవడం, అనుమానిత వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. కొత్త వ్యక్తులు తారసపడితే వారి ఆధార్ కార్డులు తనిఖీ చేస్తున్నారు.

కట్టని ఇళ్లకు సామగ్రి కొనేశారు..!

వైకాపా హయాంలో ఇష్టారాజ్యం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విద్యుత్తు వైరింగ్ పైపులు, శానిటరీ గొట్టాలు జంగారెడ్డిగూడెం గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో దాదాపు రెండేళ్లుగా వృథాగా ఉన్నాయి. ఇవి వైకాపా హయాంలో పీఎంఏవై 1లో వచ్చిన లేఅవుట్ కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారుల కోసం కొనుగోలు చేసిన సామగ్రి. విషయం ఏమంటే కట్టని ఇళ్లకు రూ.వందల కోట్లలో సామగ్రిని గృహ నిర్మాణ సంస్థ కొనుగోలు చేసేసింది. ఇనుము, సిమెంట్, రంగులు, వల్లీ ఆర్ట్స్ (వైకాపా మూడు రంగుల పట్టీలు), విద్యుత్తు, శానిటరీ సామగ్రి, డోర్ ఫ్రేమ్స్ తదితరాలు పెద్దఎత్తున కొన్నారు. చాలా ఇళ్లు పునాదుల్లోనే ఆగిపోయాయి. వైకాపా పాలన ముగిసింది. అప్పట్లో కొన్న సామగ్రి ప్రస్తుతం ఎక్కడికక్కడ గృహ నిర్మాణ సంస్థ కార్యాలయాల వద్ద నిరుపయోగంగా ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఇదే పరిస్థితి.

తుప్పు.. ఏళ్ల తరబడి ఇనుము వినియోగించకపోవడంతో చాలా చోట్ల తుప్పు పడుతోంది. మరి కొన్ని చోట్ల సిమెంట్ బస్తాలు, రంగులు గడ్డకట్టాయి. అయితే ఉపయోగించే అవకాశం ఉన్న సామగ్రిని ప్రస్తుతం ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2026 మార్చిలోగా ఇళ్లు కట్టుకునేందుకు గడువు ఉండటం వల్ల కొందరు ఈ సామగ్రి తీసుకెళ్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని తాము కూడా సరఫరా చేస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ వర్గాలు చెబుతున్నాయి.

వైభవోపేతం.. అంజనీసుతుని తెప్పోత్సవం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్ది ఆంజనేయ స్వామికి కార్తిక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి తెప్పోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో హంస వాహనంపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సువర్చలా హనుమద్‌లకు అర్చకులు ప్రత్యేక హారతులు అందించారు. భక్తులు భారీగా పాల్గొని ఈ వేడుకను వీక్షించారు. ఈవో ఆర్వీ చందన పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ

రూ.106.23 కోట్లు నేడు జమ

నూజివీడు రూరల్, ఉంగుటూరు, న్యూస్‌టుడే: రైతులకు చేయూత అందించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి. ఇందులో భాగంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రైతులకు చేయూత అందిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవను రెండో విడత జమ చేస్తుంది. పీఎం కిసాన్ 21వ ఇన్‌స్టాల్‌మెంట్ రైతుల ఖాతాల్లో జమ కానుంది. ఏలూరు జిల్లా పరిధిలో 1,60,968 మంది రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా రూ.80.48 కోట్లు, పీఎం కిసాన్ నుంచి రూ.25.75 కోట్లు కలిపి రూ.106.23 కోట్లు జమకానున్నాయి.

ప్రత్యక్ష ప్రసారాలు.. అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లాలోని 374 రైతు సేవా కేంద్రాల్లో రైతులు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కర్షకుల ఖాతాల్లోకి నిధులు మాత్రమే కాకుండా వ్యవసాయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు కూడా అందులో వివరించేలా ప్రసారం చేయనున్నారు.

లబ్ధిపొందే రైతుల సంఖ్య	
నూజివీడు	35,529
చింతలపూడి	36,818
పోలవరం	34,037
దెందులూరు	19,950
ఉంగుటూరు	13,910
కైకలూరు	8,911
ద్వారకాతిరుమల	9,651
ఏలూరు	2,162

నేర్చుకుంటేనే.. గెలిచేది.. నిలిచేది..!

న్యూస్‌టుడే, ఏలూరు విద్యా విభాగం: కొంత కాలంగా ఐటీ రంగంలో సంక్షోభం.. మరో వైపు ఆర్థిక మాంద్యం.. వాటికి మించి కృత్రిమ మేధ ప్రభావం.. వెరసి ప్రాంగణ ఎంపికల్లో సాంకేతిక విద్యార్థులు ఆశించిన స్థాయిలో అర్హత సాధించడం లేదు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారికి కెరీర్ గ్యాప్ వస్తోంది. ఈ సమయంలో వారు నైపుణ్యాలు నవీకరించుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

3,500	ఏటా ఇంజినీరింగ్‌లో చేరేవారు
1,800	కొలువులు సాధించేవారు

మార్కెట్‌ను విశ్లేషించుకోవాలి.. ప్రస్తుతం మార్కెట్ ఎలా ఉందనే అంశాన్ని విద్యార్థులు పరిశీలించాలి. ఏ కోర్సుకు గిరాకీ ఉందో తెలుసుకోవాలి. ఆసక్తి ఉన్న రంగంలోనే కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలి. దీర్ఘకాలం నిలబడటానికి ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వాస్తవ అనుభవం కోసం ప్రాక్టికల్ ప్రాజెక్టులు, ఉచిత శిక్షణలు లేదా సాధన చేయడం వంటివి చేయాలని సూచిస్తున్నారు. పూర్తి చేసిన ప్రాజెక్టులను నెలకు ఓ సారైనా ఆన్‌లైన్ పోర్టుఫోలియోలో లేదా ప్రాజెక్టు సైట్‌లో అప్‌లోడ్ చేయాలంటున్నారు.

తాజా నైపుణ్యాలు నేర్చుకోవాలి.. కెరీర్ గ్యాప్ ఉన్నవారు వారికి ఆసక్తి గల, ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న తాజా కోర్సులు నేర్చుకోవాలి. ప్రాజెక్టులు, సర్టిఫికేషన్ కోర్సులు తప్పనిసరిగా చేయాలి. వాటిపై పట్టు సాధించాలి. ఉద్యోగం ఇచ్చే సంస్థలకు తాజాగా నైపుణ్యం పొందిన వృత్తి నిపుణుడు అనిపించాలి. అప్పుడే నియామక అధికారులు చురుకైన, నిజాయతీ కలిగిన అభ్యర్థిగా గుర్తిస్తారు. **- సాయిరాం, కోడ్‌జ్ఞాన్ సొల్యూషన్స్ ఛైర్మన్**

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

పని చేస్తేనే.. దశ.. దిశ మారేది..!

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:

ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో అనేక ప్రభుత్వ విభాగాల్లో పనులు నత్తనడకన సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ చిత్రంలో రోషన్‌కుమార్, చంటి, వెట్రిసెల్వి, అభిషేక్‌గౌడ

ఈనాడు కథనాలపై చర్చ..

'ఈనాడు' పత్రికలో ఈ నెల 18న అంటారంతే.. అడుగుతారేంటి, తిన్నోళ్లకు సహకారం శీర్షికలతో ప్రచురితమైన కథనాలపై సమావేశంలో చర్చ జరిగింది. 12 ఆర్వోబీలకు అవసరమైన భూసర్వేకు ఆదేశించినా యంత్రాంగం చొరవ చూపకపోవడం, ప్రధాన రహదారులపైన, సొసైటీల్లో అవినీతిపై చర్చించారు.

ఆయన మాటల్లోనే..

➤ జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలి. కైకలూరు - భీమవరం, కైకలూరు - గుడివాడ రోడ్ల పనులకు సంబంధించి కాంట్రాక్టు సమయం పూర్తయినా పనులు పూర్తకాలేదు.

➤ జంగారెడ్డిగూడెం-ఏలూరు మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చేందుకు ప్రతిపాదనలు చేయండి.

➤ జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు చేసి, జనవరిలోగా సమస్య పరిష్కరించాలి. గుత్తేదారులు సకాలంలో చేయకపోతే వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి.

➤ జిల్లాలో 12 ఆర్వోబీలకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చినా పనులు మొదలు పెట్టలేదు. భూసేకరణ పూర్తిచేసి 2026 మార్చికి పనులు ప్రారంభించాలి.

➤ కొల్లేరు సమస్య పరిష్కారానికి అటవీశాఖ అధికారులు మానవతా దృక్పథంతో రైతులకు సహకరించాలి.

➤ జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సామాజిక బాధ్యత కింద నిధులు ఇవ్వాలి.

ఎంపీ మహేశ్‌కుమార్

ఆసుపత్రి సిబ్బంది పనితీరుపై.. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని, వైద్యులు, సిబ్బందిలో జవాబుదారీతనం లేదని సూపరింటెండెంట్‌పై ఎంపీ, ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఓ రోగి బంధువుతో మాట్లాడించారు. ఆసుపత్రిలో రోగులకు మందులు ఇచ్చినట్లు కేస్ షీటులో నమోదు చేసి.. ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో ఎంపీ మాట్లాడుతూ మందుల విషయంలో గోల్‌మాల్ చేస్తున్నారని, ఏ ఒక్కరినీ విడిచి పెట్టమని హెచ్చరించారు.

ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలు.. ఏలూరు శాంతినగర్‌లో నిర్మించిన సిమెంటు రోడ్డును ఇంకా 70 మీటర్లు వదిలేశారు. అది పూర్తి చేయాలి. ఏలూరు మార్కెట్ యార్డు వద్ద ఆర్వోబీ నిర్మించాలి. **- బడేటి చంటి, ఏలూరు ఎమ్మెల్యే**

☛ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలపై ఫిర్యాదు నమోదుకు ప్రత్యేక యాప్ రూపొందించాం. నియోజకవర్గంలో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. **- రోషన్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే**

సీతంపేట ఆర్వోబీ అలైన్మెంట్ మార్చాలి. గుండుగొలను - హనుమాన్ జంక్షన్ మధ్య జాతీయ రహదారి నిర్మాణంలో లోపాల కారణంగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. **- చింతమనేని, దెందులూరు ఎమ్మెల్యే**

కొల్లేరులో డి.ఫారాం పట్టా భూముల్లో సంప్రదాయ వ్యవసాయం చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలి. **- గన్ని, ఆప్కాబ్ ఛైర్మన్**

చికుబుక్.. కాలేదండి!

నిరీక్షణ జాబితా చాంతాడంత

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజలు ఎక్కడున్నా.. సంక్రాంతికి సొంతూరు రావడం.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను పలకరించడం పరిపాటి. రాబోయే తెలుగింటి పెద్ద పండగకు భాగ్యనగరం నుంచి స్వగ్రామాలకు చేరుకునేందుకు రైళ్లలో రిజర్వేషన్లు చేసుకుందామంటే.. ఎక్కడా ఖాళీల్లేవు. గౌతమి, గోదావరి, గరీబ్‌రథ్, ఫలక్‌నుమా, ఈస్ట్‌కోస్ట్, విశాఖ, కోణార్క్, జన్మభూమి, ఎల్‌టీటీ తదితర రైళ్లలో రిజర్వేషన్లు రిగ్రెట్ చూపుతున్నాయి. వారాంతాలు, ప్రత్యేక రోజుల్లో నడిచే రైళ్లలోనూ నిరీక్షణ జాబితా చాంతాడంత చూపుతోంది.

రెండు నెలల ముందుగానే.. రైలు ప్రయాణానికి 60 రోజులు ముందుగా మాత్రమే రిజర్వేషన్లు చేసుకునేందుకు ఆ శాఖ అనుమతినిస్తోంది. హైదరాబాద్ నుంచి ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని నూజివీడు, ఏలూరు, భీమడోలు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం మీదుగా ప్రయాణిస్తున్న రైళ్లలో రిజర్వేషన్ హాట్ కేక్‌ల్లా బుక్కయ్యాయి.

ఏలూరులోనే అధికం.. ఏలూరు ప్రధాన రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 80కు పైగా రైళ్లు ప్రయాణిస్తున్నాయి. ఇక్కణ్నుంచి సుమారు 9 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. సంక్రాంతి వేళల్లో రద్దీ, రిజర్వేషన్లు స్థితికి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు అందుబాటులోని తెస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు.

రైతేరాజు వక్క.. ఆదాయం ఎంచక్కా! 8లో

ప్రధానోపాధ్యాయిని సస్పెన్షన్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథకం అమల్లో అవకతవకలకు పాల్పడిన ప్రధానోపాధ్యాయినిని సస్పెండ్ చేశారు. ఏలూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.పార్వతీదేవి ఆ పథకం బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు విచారణాధికారులు నివేదించారు. దీంతో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి ప్రధానోపాధ్యాయినిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

ఔరా 66 మంది

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన 66 మంది బాలికలు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలను దక్కించుకున్నట్లు మంగళవారం డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో 50 మంది సీఎస్ఈ విభాగం నుంచి, 9 మంది ఈసీఈ నుంచి, ఈఈఈ నుంచి ఏడుగురు ఉన్నారన్నారు.

భయం వద్దు.. దారుంది.. మీకు..

పది, ఇంటర్ ధ్రువపత్రాలు పొందే అవకాశం

చింతలపూడి, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండలం తెడ్లం గ్రామానికి చెందిన చెవటపల్లి రేణు ఇటీవల ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళ్తుండగా దారిలో పదో తరగతి ధ్రువపత్రం ఎక్కడో పడిపోయింది. ఏం చేయాలో తెలియక చదువుకున్న పాఠశాలకు వెళ్లగా వారు చెప్పిన సలహాతో దరఖాస్తు చేసుకోని సర్టిఫికెట్ తిరిగి పొందారు.

పది, ఇంటర్ ధ్రువపత్రాలు జీవితంలో ఎంతో ముఖ్యమైనవి. అవి ఎక్కడైనా పోయినా, చిరిగినా భయపడుతుంటారు. అయితే ఇప్పుడు ఆ భయాందోళనలు లేకుండా నకలు పొందే మార్గాలున్నాయి.

పది ధ్రువపత్రం కోసం.. పది ధ్రువ పత్రానికి 'బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో డూప్లికేట్ ఎస్ఎస్‌సీ దరఖాస్తు ఆప్షన్‌పై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. ప్రింట్ తీసి వివరాలు నింపాలి. దరఖాస్తుకు ఫొటో అతికించి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునితో సంతకం, లేఖ, రూ.50 అఫిడవిట్.. ఎస్సై, డిప్యూటీ తహసీల్దారు, ఇచ్చిన నాట్ ట్రేసింగ్, పోయిన ధ్రువపత్రం జిరాక్స్‌లు జత చేయాలి.

● రూ.250 విలువైన చలానా తీసి, ఇవన్నీ కలిపి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ వారికి పోస్టు పంపాలి. నెలలో పాఠశాలకు నకలు ధ్రువపత్రం వస్తుంది.

ఇంటర్.. బీఐఈఏపీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో స్టూడెంట్ సర్వీసెస్‌లోకి వెళ్లి డూప్లికేట్ లేదా ట్రిప్లికేట్ ఐకాన్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్ ఓపెన్ అవుతుంది. (మొదటి సారి పోతే డూప్లికేట్.. రెండో సారైతే ట్రిప్లికేట్) హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ, మెయిల్ నమోదు చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి చరవాణి సంఖ్యను ఎంటర్ చేశాక.. సర్టిఫికెట్ పోయిందా, చిరిగిందా అనే ఆప్షన్స్‌పై సెలెక్ట్ చేయాలి. పోతే పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ, చిరిగితే ఆ కాపీ అప్లోడ్ చేయాలి. ఎఫ్ఐఆర్ కాపీ కోసం దగ్గరలోని మీసేవలో దరఖాస్తు చేయాలి.

● తర్వాత అఫిడవిట్, ప్రిన్సిపల్‌తో సంతకం చేసిన దరఖాస్తు ఫారం అప్లోడ్ చేయాలి. చలానా తీసి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేస్తే అప్లికేషన్ నంబరు ఓపెన్ అవుతుంది. దాని ద్వారా దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చు. అప్లోడ్ చేసిన ఒక సెట్ పత్రాలు సంబంధిత కళాశాలలో ఇవ్వాలి. అనంతరం డూప్లికేట్ సర్టిఫికేట్ కళాశాలకు వస్తుంది.

మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రై.లి.
ఫార్మర్లీ క్యాడ్‌బరీ ఇండియా లిమిటెడ్
Job Location: తడ, శ్రీసిటీ, తిరుపతి జిల్లా
Mondelēz International | SEEDAP | TVS Training & Services
SEEDAP వారి ఆధ్వర్యంలో
WALK - IN INTERVIEW
Date: 22-11-2025 ELURU
అర్హత: ✔ టీమ్ మెంబర్ ట్రైనీ ✔ ఇంటర్, ITI, డిప్లమో, మొదటి ప్రయత్నంలో 50% కనీస మార్కులు
✔ కంపార్ట్‌మెంటల్, బి.టెక్, యం.బి.ఎ, పి.జి, డిగ్రీ చేసిన వారు అర్హులు కారు
✔ Manufacturing work నందు 1-2 సం॥ అనుభవం గల వారు అర్హులు
వయస్సు: 18-21 సం॥లు, ✔ స్త్రీలకు మాత్రమే
✔ సంవత్సరానికి రూ॥ 2,34,000/- CTC మరియు All Statutory benifits
✔ నెలకు 15,300/- జీతం (అన్ని కటింగ్స్ మినహాయించి)
✔ ఇంటర్వ్యూకు ఉ॥ 9.00 గం॥లకు అన్ని సర్టిఫికేట్స్‌తో రావలెను.
ఇంటర్వ్యూ జరుగు స్థలము:
SHRI BHAVITHA WELFARE SOCIETY - SKILL COLLEGE
Opp: Sri Venkata Satyanarayana Rice Mill, Nallajarla Road, Koyyalagudem, ELURU (DT)
ఆపరేషన్ నైట్ షిఫ్ట్‌తో సహా 3 షిఫ్ట్‌లు,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివసించే వారికే అర్హత,
గత 3 నెలల్లో ఇప్పటికే హాజరైన అభ్యర్థులు నియామక ప్రక్రియకు అర్హులు కాదు.
Required Documents: SSC, INTER, Aadhar Card, Pancard
సంప్రదించవలసినవారు: శ్రీకాంత్: 93848 43268

(c) eenadu

ముందే వచ్చినా.. బేళ్ల చూపులు

వర్జీనియా పొగాకు కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయి. రెండు రోజులుగా అధిక సంఖ్యలో బేళ్లను కొయ్యలగూడెం వేలం కేంద్రానికి రైతులు తీసుకొస్తున్నారు. అమ్మకానికి సంబంధించిన బేళ్లను ముందు రోజే తీసుకొస్తుండటంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. వేలం కేంద్రంలోకి వెళ్లే దారి లేక మంగళవారం వేలం కేంద్రానికి ఇరువైపులా కిలోమీటరు పైగా జాతీయ రహదారి పొడవునా.. బేళ్లతో ఉన్న ట్రాక్టర్లు నిలిపివేశారు. - న్యూస్‌టుడే, కొయ్యలగూడెం

పవనసుత.. రామదూత

జనసంద్రమైన మద్ది క్షేత్రం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది క్షేత్రం జన సంద్రమైంది. కార్తిక మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది. సుమారు 40 వేల మంది స్వామిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం వరకు అన్నదానానికి 16 వేల మంది వరకు పాల్గొన్నారు. స్వామికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు చేశారు. భక్తులు అన్నప్రాసనలు, వాహన పూజలు నిర్వహించారు.

ఆలయం ముందు భక్తుల రద్దీ

సమస్య ఉంటే ఫోన్ చేయండి

✦ రోగులకు విజిటింగ్ కార్డులిచ్చిన ఎంపీ ✦ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

రోగులతో మాట్లాడుతున్న మహేశ్ కుమార్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో అర్ధరాత్రి అందిస్తున్న వైద్య సేవలు, రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ స్థానిక సర్వజన ఆసుపత్రిని సోమవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి తదితర విభాగాలతోపాటు వార్డుల్లో రిజిస్టర్లు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా రాజీ పడకుండా మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. రాత్రి సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని.. అత్యవసర సేవలు సకాలంలో అందించకుంటే సహించేదిలేదన్నారు. రోగులకు ఆయన విజిటింగ్ కార్డులు అందజేసి సమస్య ఉంటే స్వయంగా సంప్రదించాలని చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి సిబ్బంది కొరత సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఐక్య పోరాటాలతో డిమాండ్ల సాధన

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు కార్మికుల ట్రేడ్ యూనియన్‌లో జిల్లా విద్యుత్తు కార్మికుల సంఘాన్ని విలీనం చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ప్రకటించారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, విద్యుత్తు కార్మికుల డిమాండ్ల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి రాజారామ్మోహన్‌రావు, నూజివీడు అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వక్క.. ఆదాయం ఎంచక్కా!

ఐదేళ్లు సంరక్షిస్తే.. నిరంతర రాబడి

మడకశిర, న్యూస్‌టుడే: వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తోంది. మొక్కలు నాటి ఐదేళ్ల పాటు సంరక్షిస్తే చాలు రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. చెట్లకు అవసరమైన నీరు, పేడ, మట్టి అందిస్తే చాలు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

నేల ఎంపిక

వక్క అన్ని నేలల్లో పండుతుంది. 35 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత సాగుకు అనుకూలం. నీరు నిలవని భూముల్లో మొక్క త్వరితగతిన పెరుగుతుంది. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగుల దూరం పాటించాలి. ఇలా ఎకరాకు 450- 500 మొక్కలు నాటుకోవచ్చు. కొత్త మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం అవిసె మొక్కలు పెంచుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు అందిస్తూ ఏడాదికోసారి సేంద్రియ ఎరువులు వేస్తారు.

నారు పోసే విధానం

40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్కల నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనె సంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. వీటిని మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది.

ఎకరాకు రూ.4 లక్షల వరకు..

అయిదేళ్లకు దిగుబడి ప్రారంభమై ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కిలోల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి.. ఉడకబెట్టి అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8- 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోను రూ.4 లక్షలు నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూల మొక్కలు, సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

అగ్రస్థానంలో అమరాపురం

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గ పరిధిలోని అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలో తొలి స్థానంలో ఉంది. ఈ మండలంలో 3,100 ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. ఇక్కడి రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండటం గమనార్హం.

రైతేరాజు

చేపల్లో పేను నివారణ



నరసాపురం, న్యూస్‌టుడే: శీతాకాలంలో చలిగాలులు, అత్యల్ప ఉష్ణోగ్రతల ప్రభావంతో ఆక్వా సాగు చెరువుల్లో చేపలు పేను బారిన పడుతుంటాయి. దీనిని సకాలంలో నివారించకుంటే చేపలు మృత్యువాత పడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆక్వా నిపుణులు అడబాల గోపాలరావు తెలిపారు.

ఇది చేపల మొప్పలు, శరీర భాగాలపై వ్యాపించి వాటి రక్తాన్ని పీల్చుతుంది. పేను ప్రభావంతో శరీర భాగాలు దెబ్బతినడంతోపాటు ఇతర వైరస్, ఫంగస్ వ్యాధులు సోకి అవి మృత్యువాత పడుతుంటాయి.

ముందు జాగ్రత్తలు..

రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. చేప పిల్లలను సాగు చెరువుల్లోకి తీసుకొచ్చే ముందే నిర్ధారణ పరీక్షలు చేయించాలి. పేను సోకినట్లు గుర్తిస్తే నివారణ చర్యలు చేపట్టిన తర్వాత పెద్ద చెరువుల్లో వదలాలి. శుద్ధి చేసిన నీటినే నింపాలి. గట్లపై గడ్డి, ఇతర మొక్కలు పెరగకుండా చూడాలి.

మందుల వినియోగంతో

ప్రభుత్వ అనుమతి పొందిన పురుగు మందులు, ఐవర్‌మెక్టిన్, డిఫ్లుబెంజురాన్ వంటి పరాన్నజీవులను హతమార్చే మందులు చెరువు నీటిలో చల్లాలి. మేతలతో కలిపి ఔషధాలు అందించడం ద్వారా నివారించవచ్చు.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: మిరపలో నల్ల తామర పురుగును ఎలా అరికట్టాలి?

- దశరథ రామయ్య, లింగపాలెం

సమాధానం: మిరప పంట పూత, పిందె దశలో నల్లతామర పురుగు ఆశిస్తుంది. ఇది రసం పీల్చడంతో పూత రాలడంతో పాటు పిందెలు ఎదగవు. వీటి నియంత్రణకు వేపనూనె 1500 పీపీఎం లీటరుకి 60 మి.లీ.స్పినోసాడ్ లేదా 200 మి.లీ. ఫ్లక్సామెటమైడ్ మిశ్రమాన్ని ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నీలి, తెలుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 15-20 వరకు ఏర్పాటు చేయాలి.



డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

పాడి పశువులపై చలి ప్రభావం

యాజమాన్య పద్ధతులతో నష్ట నివారణ



మొగల్తూరు, న్యూస్‌టుడే: అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే శీతాకాలంలో పశు పోషణలో తగు యాజమాన్య పద్ధతులు పాటించాలని పశు వైద్యుడు కర్పూరం విజయకుమార్ తెలిపారు. లేగదూడలను చలిలో ఆరుబయట వదిలి వేస్తే వాటి శరీర ఉష్ణోగ్రతలు తగ్గి మృత్యువాత పడే ప్రమాదం ఉందని.. పాడి పశువుల్లో దిగుబడి గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు.

ఇవి పాటించండి..

రాత్రి వేళ చలి, పొగ మంచు ప్రభావం పశువులపై పడకుండా వాటిని పాకల్లో ఉంచాలి. దోమలు కుట్టకుండా మెస్‌లు, తెరలు ఏర్పాటు చేయాలి. శీతాకాలంలో రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఉదయం పాలలో వెన్నశాతం తగ్గుతుంది. దీనిని నివారించేందుకు రోజులో సమానంగా ఉండేలా ఉదయం, సాయంత్రం పాలు పితికే వేళలను నిర్దేశించుకోవాలి.

● వేసవిలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో పశువులు చూడి కట్టవు. శీతాకాలంలో పశువులు చూడి కట్టేందుకు అనువైన సమయం. అవి ఎదకు వచ్చేలా వైద్యం, పోషకాలు ఉన్న గ్రాసం అందించాలి.

గ్రాసం చూసుకోవాలి..

శీతాకాలంలో పచ్చగడ్డి ఎదుగుదల ఉండదు. అందుకే సార్వా వరి కోతల సమయంలో ఎండుగడ్డిని కట్టలుగా కట్టి భద్రపరుచుకోవాలి. పచ్చగడ్డి అందుబాటులో ఉన్న సమయంలో పాతర గడ్డి తయారు చేసుకోవాలి. గ్రాసంతో పాటు దాణా కూడా అందిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని.. పాల దిగుబడి సాధారణంగా ఉంటుందని విజయకుమార్ తెలిపారు.

ఎందుకిలా చేశావ్.. నాన్నా!

➯ పిల్లలను గోదావరిలోకి తోసి.. ఆపై తానూ ఆత్మహత్య
➯ దొరికిన ఇరువురి మృతదేహాలు.. కానరాని బాలిక ఆచూకీ



దుర్గాప్రసాద్, మోహిత్, గల్లంతైన జాహ్నవి (పాతచిత్రాలు)

యలమంచిలి, మలికిపురం, మామిడికుదురు, న్యూస్‌టుడే: 'రండమ్మా.. ఆధార్ అప్‌డేట్ చేసుకుని వద్దాం' అంటూ నాన్న పిలవగానే ఆ పిల్లలిద్దరూ ఉత్సాహంగా వెంట బయలుదేరారు. 'అమ్మా..వెంటనే వచ్చేస్తామమ్మా' అంటూ వీడ్కోలు చెప్పారు. కానీ ఇక ఎప్పటికీ వెనక్కిరామని ఆ చిట్టి హృదయాలకు తెలియదు. తీసుకువెళ్లిన తండ్రి గోదావరిలోకి తోసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసి ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరంలో పెను విషాదం నెలకొంది. ఫైనాన్స్ వ్యాపారి శిరిగినీడి దుర్గాప్రసాద్ (37) భార్య నాగవేణి, కుమారుడు మోహిత్ (13), కుమార్తె జాహ్నవి (9)తో కలిసి ఇక్కడ నివసిస్తున్నారు. వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని నాగవేణి కన్నవారి ఇంటి వద్దే వీరంతా ఉంటున్నారు. ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ సోమవారం సాయంత్రం పిల్లలిద్దరినీ తీసుకొని దుర్గాప్రసాద్ ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి స్టేషన్ పరిధి చించినాడ వశిష్ఠ వారధిపై ఈ వాహనం, పాదరక్షలు, కొన్ని చరవాణి నంబర్లతో కూడిన కాగితం కనిపించాయి. మంగళవారం ఉదయం నుంచి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రానికి దుర్గాప్రసాద్, మోహిత్ మృతదేహాలు కనిపించాయి. జాహ్నవి ఆచూకీ కానరాలేదు. బుధవారం మళ్లీ అన్వేషిస్తామని మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు. దుర్గాప్రసాద్ పిల్లలను నదిలోకి తోసి తానూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. యలమంచిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏం కష్టమొచ్చిందో..

ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందోనని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కుటుంబ కలహాలా.. ఆర్థిక సమస్యలా.. ఇంకేమైనా కారణాలా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కువైట్ వెళ్లి వచ్చి..

దుర్గాప్రసాద్, నాగవేణిలది ప్రేమ వివాహం. ప్రసాద్ గతంలో ఉపాధి రీత్యా కువైట్ వెళ్లి వచ్చాడు. వడ్డీ వ్యాపారం చేస్తూ పిల్లలిద్దరినీ విశ్వేశ్వరాయపురంలో చదివిస్తున్నారు. నాగవేణి తండ్రి రేకపల్లి వెంకటేశ్వరరావు గల్ఫ్ నుంచి రావడంతో వారం క్రితం వీరంతా ఆ ఊరు వెళ్లారు. తన భర్త, పిల్లలు ఎక్కడున్నారంటూ నాగవేణి రోదిస్తుండడం స్థానికులను కలచివేసింది.

పరుగెడుతుంటే సరదాకు అనుకున్నాం.. ఇద్దరు పిల్లలతో వంతెన మీదకు వచ్చిన దుర్గాప్రసాద్ తొలుత కుమార్తెను నదిలోకి తోసినట్లు భావిస్తున్నారు. ఇది చూసిన కుమారుడు హడలిపోయి పరుగు తీయగా అతడిని తండ్రి వెంబడించినట్లు అటుగా వెళ్లిన ఆటో డ్రైవర్ చెప్పారని.. ప్రసాద్ స్నేహితులు చెబుతున్నారు. సరదాగా పరుగెడుతున్నారనుకున్నామని.. ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఊహించలేదని డ్రైవర్ తెలిపారన్నారు.

1న తాడేపల్లిగూడెంలో హిందూసమ్మేళనం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాష్ట్ర వ్యాచారణి సభ్యుడు ఓలేటి సత్యనారాయణ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబరు 1న తాడేపల్లిగూడెంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ సమాజానికి, దేశానికి సేవ చేసే విధంగా వ్యక్తి నిర్మాణం చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహసంఘ చాలక్ సుంకవల్లి రామకృష్ణ, భాజపా నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ టి.భోగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది మాకా శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కర్రి ప్రభాకర్ బాలాజీ, నాయకులు గట్టిం మాణిక్యాలరావు, రాంబాబు, దువ్వా శ్రీనివాస్ పాల్గొన్నారు.

చరవాణుల దొంగ అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ రామకృష్ణ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మద్యం, ఇతర వ్యసనాలకు లోనైన యువకుడు మొబైల్ ఫోన్ల దొంగగా మారాడు. షాపుల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్న ముంగి సాగర్‌ను అరెస్టు చేసినట్లు మంగళవారం నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ పాత్రికేయులకు తెలిపారు. చాట్రాయి సెంటరులో షాప్ తాళం, తలుపు పగులకొట్టి మొబైల్ ఫోన్‌లు చోరీ చేశాడన్నారు. ఇతని వద్ద నుంచి 25 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందన్నారు. సీసీ కెమెరాలు, టెక్నాలజీ ఆధారంగా రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో చాట్రాయి ఎస్.ఐ. డి.రామకృష్ణ ఇతర సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు ముద్దాయిని పోలవరం రోడ్డులోని కొత్త ఆంజనేయస్వామి గుడి వద్ద అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులతో పాటు హెచ్‌సీ జి.శ్రీనివాసరావు, పీసీలు బాలాజీ, మునీంద్రరావు, శ్రీనివాసులు, ప్రదీప్‌లను అభినందించారు. షాపుల యజమానులు విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఉషారాణి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: కుష్ఠు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, బాధితులను గుర్తించేందుకు ఈ నెల 30 వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు కుష్ఠు వ్యాధి, ఎయిడ్స్, టీబీ నియంత్రణ విభాగ అడిషినల్ డైరెక్టర్ ఉషారాణి, జిల్లా కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. సర్వే పరిశీలనలో భాగంగా మంగళవారం ఆగిరిపల్లి పీహెచ్‌సీని పరిశీలించారు. ఇక్కడ నిర్వహిస్తున్న సర్వే తీరు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జె.జగన్మోహనరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మందుల దుకాణాలపై సైబర్ వల

పోలవరం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు గత కొన్ని రోజులుగా పోలవరం మండలంలోని మందుల దుకాణాలపై కన్నేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ.. యజమానులకు ఫోన్ చేస్తున్నారు. దుకాణం పేరు, పూర్తి వివరాలు అడిగి.. 'మీ లైసెన్స్ గడువు ముగిసింది. వెంటనే రెన్యువల్ చేసుకోకపోతే ఇబ్బంది పడతారు. కొంత మొత్తం వెంటనే జమ చేయండి.' అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇదే తరహాలో మండలంలో ఒక మందుల దుకాణ యజమానికి ఫోన్ చేసి వెంటనే రూ.30 వేలు చెల్లించాలని హెచ్చరించారు.. అంత నగదు లేదని రూ.వెయ్యి మాత్రమే ఉందని చెప్పడంతో ఆ మొత్తం వారి ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. తరువాత మోసపోయిన విషయాన్ని తెలుసుకుని ఆయన మిన్నకుండిపోయారు. మరో రెండు మందుల దుకాణాలకు ఫోన్ చేసినా.. వారు స్పందించకపోగా.. అనుమానం వచ్చి వివరాలు తెలుసుకునే యత్నం చేసేలోగా ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది.

ఇండియన్ రౌండ్‌కు ఆర్చరీ విద్యార్థులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఏపీ ఆర్చరీ అసోసియేషన్, ఉమ్మడి కృష్ణా జిల్లా ఆర్చరీ అసోసియేషన్, చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీ జూనియర్, సీనియర్ అంతర్ జిల్లాల ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం నూజివీడులో ఘనంగా జరిగాయి. సారథి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఇండియన్ రౌండ్‌కు పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. 13 జిల్లాల నుంచి 66 మంది పురుషులు, 54 మంది మహిళలు పాల్గొన్నారన్నారు. సీనియర్ మహిళల విభాగంలో కె.సాయి సుజయ, వై.డి.చంద్రిక, కె.సాయి మనస్వి, కె.శరధిని, జూనియర్ విభాగంలో ఎం.అంజన, కె.తన్వి సాయి అశ్విని, సీనియర్ పురుషుల విభాగంలో ఎస్.సాంబశివ, జి.వెంకట లోకేశ్, సి.మోహిత్ సాయి, ఎస్.దేశయ్య, జూనియర్ విభాగంలో షేక్ మహ్మద్ సోహెల్ ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ఏపీఏఏ వైస్ ప్రెసిడెంట్ గొట్టిపాటి ప్రేమ్‌కుమార్, సారథి కళాశాల ఏవో రామచంద్రరావు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.



ఇండియన్ రౌండ్‌కు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు, అతిథులు

సుజల్ గ్రామ సంవాద్‌పై సమగ్ర చర్చ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : గ్రామీణ నీటి భద్రత, తాగునీటి ప్రాధాన్యత, సమాజం ఆధారిత నీటి వనరుల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు కేంద్ర మంత్రిత్వశాఖ జల శక్తి, జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం సుజల్ గ్రామ సంవాద్ వర్చువల్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్లు, జిల్లా విభాగాధిపతులు, నీటి నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, వీడబ్ల్యూఎస్‌సీ గ్రామస్థాయి కమిటీ సభ్యులు పాల్గొని గ్రామస్థాయి నీటి సమస్యలు, పరిష్కారాలు, ఉత్తమ పద్ధతులపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూజివీడు మండలం యనమదల గ్రామాన్ని హర్ ఘర్ జల్ గ్రామంగా ప్రకటించినట్లు వెల్లడించారు.

సొసైటీ మాజీ ఛైర్మన్ నాగేంద్ర వరప్రసాద్‌కు రిమాండు

దెందులూరు, న్యూస్‌టుడే: సొసైటీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన పోతునూరు సొసైటీ మాజీ ఛైర్మన్ ధూళిపాల నాగేంద్ర వరప్రసాద్ అలియాస్ పోతునూరు బజ్జీకి భీమడోలు న్యాయస్థానం రిమాండు విధించింది. పోలీసులు నిందితుడిని మంగళవారం ఏలూరులోని జిల్లా జైలుకు తరలించారు. నిధులు దుర్వినియోగానికి సంబంధించి పోలీసులు బజ్జీని అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచారు. అర్ధరాత్రి దాటాక రెండు గంటల వరకు ఉభయ పక్షాలు వాదనలు వినిపించాయి. నిధులు దుర్వినియోగానికి సంబంధించి నేరం రుజువు కావడంతో న్యాయస్థానం బజ్జీకి రిమాండు విధించింది.

అశ్లీల నృత్యాలు.. పది మందిపై కేసు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం మంగిశెట్టిగూడెంలో సోమవారం రాత్రి గొంతేలమ్మ పండగ సందర్భంగా హిజ్రాలతో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన పది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.వీరప్రసాద్ తెలిపారు. ఇద్దరు హిజ్రాలతో పాటు డీజే నిర్వాహకుడు, ఆర్గనైజర్‌లపై కేసులు పెట్టామన్నారు. వీరిని తహసీల్దారు వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆడిట్‌శాఖ పూర్వ ఆర్‌డీడీపై విచారణ

ఈనాడు-ఏలూరు: స్టేట్ ఆడిట్ విభాగం ఏలూరు ప్రాంతీయ ఉపసంచాలకులుగా(ఆర్‌డీడీ) చిన్నపరెడ్డి పనిచేసిన హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఫిర్యాదుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈమేరకు శాఖ సంయుక్త సంచాలకులు వెంకటేశ్వరావును విచారణాధికారిగా నియమించారు. ఆయన మంగళవారం ఏలూరు ఆర్డీ కార్యాలయానికి వచ్చి చిన్నపరెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై దస్త్రాలను పరిశీలించారు. ఆయనకు అవసరమైన సమాచారాన్ని ప్రస్తుత ఉపసంచాలకులు క్రాంతికుమారి అందజేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్నపరెడ్డి విచారణకు హాజరుకాలేదు. ఆయన హయాంలో ఆడిట్ నివేదికలు సరిగా అనుమతి పొందలేదని, పదోన్నతుల కల్పనలో అవినీతి, ఆరోపణలకు పాల్పడ్డారని వల్లూరి సురేష్ చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ జరిగింది. ఇంకా విచారించాల్సి ఉందని తెలిసింది. అప్పట్లో జిల్లాలో పనిచేసిన ఓ ఆడిట్ అధికారి చిన్నపరెడ్డి అక్రమాలకు సహకరించారని ఆయన్ని విచారించాలని సురేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థులను ఒత్తిడికి గురి చేయొద్దు : ఆర్జేడీ

ఇరగవరం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులను ఒత్తిడికి గురి చేయకుండా ఒక ప్రణాళిక మేరకు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి అన్నారు. ఇరగవరం, గోటేరు ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డిసెంబర్ 5 నాటికి సిలబస్ పూర్తి చేయాలన్నారు. 6వ తేదీ నుంచి 100 రోజుల ప్రణాళిక అమలు చేసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, హోమ్ వర్క్ పుస్తకాలను పరిశీలించి సూచనలు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

తణుకు పురపాలక సంఘ కార్యాలయము

ఆర్.ఒ.సి.నెంబర్: 140/2024/G1 ది. 18–11–2025.

పత్రికా ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనధికార భవనముల క్రమబద్ధీకరణ కొరకు G.O.Ms. No.14, MA & UD dept., Dt. 04-01-2019న జారీచేయుట జరిగినది. దానిని 31-08-2025 వరకు గల అనధికార నిర్మాణాలను మరియు ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన భవనములను క్రమబద్ధీకరణ పొడిగించుచూ G.O.Ms. No. 225 MA & UD dept., Dt. 12-11-2025 తేదీన ప్రభుత్వం వారు ఆదేశాలు జారీచేసియున్నారు.

కావున తణుకు పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మీ యొక్క భవనములను ది. 31-08-2025నకు ముందు అనుమతి పొంది ప్లానుకు విరుద్ధముగా నిర్మించిన, ప్లాను అనుమతి పొందకుండా నిర్మించిన యెడల మీ యొక్క భవనములను క్రమబద్ధీకరించవలసినదిగా తెలియజేయటమైనది. మీ యొక్క దరఖాస్తును ఆన్లైన్ (bps.ap.gov.in) ద్వారా లైసెన్సు టెక్నికల్ పర్సన్స్ ద్వారా పొందుపరిచి క్రమబద్ధీకరించుకొనవలసినదిగా తెలియజేయుటమైనది. లేని పక్షంలో మీ యొక్క భవనములపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని తెలియజేయుటమైనది. మరియు 31-08-2025 తరువాత ప్లాన్ లేకుండా మరియు ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనములను ఎప్పటికప్పుడు తొలగించుట జరుగుతున్నది. కావున భవన యజమానులు అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే నిర్మాణములు జరుపవలసినదిగా తెలియజేయుట జరిగినది. ప్రస్తుతము పట్టణములో ది. 31-08-2025న తరువాత నిర్మిస్తున్న అనధికార నిర్మాణములను తీసివేయుట జరుగుచున్నదని పురప్రజలకు తెలియజేయడమైనది.

సం/- **కమిషనరు,** తణుకు పురపాలక సంఘం

మావోయిస్టు నాయకుడు దేవ్‌జీని న్యాయస్థానంలో హాజరుపర్చాలి

కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ)ని తక్షణమే న్యాయస్థానంలో హాజరుపర్చాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు కోరారు. విప్లవకారులకు సంఘీభావంగా మంగళవారం రాత్రి ఏలూరులో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవ్‌జీతోపాటు మరో 50 మందికిపైగా ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. తిప్పిరి తిరుపతితో సహా వారందరికీ ప్రాణ నష్టం ఉన్నందున రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తక్షణమే స్పందించి ఈ అరెస్టులను సుమోటోగా తీసుకొని వారిని న్యాయస్థానంలో హాజరుపరచాల్సిందిగా పోలీసులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కు సంఘాలు దీనిపై వెంటనే స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఎర్రా శ్రీనివాసరావు, పల్లి గంగరాజు, వెంకటేశ్వరరావు, గోవిందు వెంకటరమణ, నాని, గురుమూర్తి, బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

ప్రముఖ బ్యాంకింగ్ అనుబంధ సంస్థ యందు పనిచేయుటకు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ ఉద్యోగస్తులు కావలెను. Q: 10th- PG., 25-65Y. ✆ 90001 43296.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

FOR SALE

ఏలూరు నడిబొడ్డులో బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, మెయిన్‌బజార్ దగ్గర్లో GNT రోడ్. పవర్‌పేట నందు అక్షయ లాడ్జి అమ్మకమునకు కలదు. Cont: 98483 55649.

Civil Engineer అనుభవం ఉన్నవారు పశ్చిమ గోదావరి జిల్లానందు పనిచేయుటకు కావలెను. Cont: 8977493338.

REAL ESTATE

PLOT FOR SALE

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033.

JOBS

ఏలూరు నగరంలో ప్రముఖ HP పెట్రోలు బంక్‌లో పార్ట్‌టైమ్ మార్నింగ్ / నైట్‌షిఫ్ట్ వర్క్ చేయుటకు యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 93921 80560

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.30 పైౖ॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

●ఏలూరు ●దెందులూరు ●ఉంగుటూరు

రక్తదాన శిబిరం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరులోని సోనోవిజన్ షో రూమ్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. షోరూమ్ సిబ్బంది రక్తదానం చేశారు. షోరూమ్ మేనేజర్ జగదీష్, సిబ్బందికి రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఎంబీవీ ఎస్‌వీ ప్రసాద్ అభినందించారు.

3 రోజులు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు మండలం చాటపర్రు విద్యుత్తు సెక్షన్ గుడివాకలంక ఉప కేంద్రం పరిధిలో కొత్తగా 11 కేవీ లైన్ల ఏర్పాటు కోసం బుధవారం నుంచి వరుసగా 3 రోజులపాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తామని ఆ శాఖ ఏలూరు డీఈఈ అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్తికోళ్లలంక, పెదయాగరమెల్లి, కోమిటిలంక ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : శాంతినగర్‌లో జ్యోతిరాజు ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన ట్రినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాస్టర్ జ్యోతిరాజు ప్రారంభించారు. మధుమేహం, గుండె, ఎముకలు, వెన్నెముక, ఊపిరితిత్తులు, సాధారణ, పిల్లలకు, దంత, నేత్ర సంబంధించిన వ్యాధులు, స్త్రీలకు సంబంధించి అన్ని రకాల వ్యాధులకు ప్రముఖ వైద్య నిపుణుల బృందంతో 1,500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాస్టర్ జ్యోతిరాజు మాట్లాడుతూ ఏలూరు, పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు. మన్నా చర్చి బిషప్ ఎం.ఎలీషా, వైద్యులు సుహాస్ మాసిలామణి, మణిమాధురి, ప్రదీప్‌కుమార్, ఆలిస్ వినతి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? స్థానిక బీడీ కాలనీ చెరువు గట్టు శివారున వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. బయటకు రావడానికి జనం భయపడుతున్నారు. - రంగారావు, బీడీకాలనీ

✔ వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగిస్తాం. - పవన్, విద్యుత్తు ఏఈ, ఏలూరు నగరపాలక సంస్థ

విద్యార్థులూ ఆధార్ నవీకరించుకోండి

ఉంగుటూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉచితంగా ఆధార్ నవీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. సోమవారం నుంచి పది రోజుల పాటు శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థిగా గుర్తింపు సంఖ్య (అపార్) పొందడంతో పాటు ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు, ఉపకార వేతనాలు అందుకునేందుకు ఆధార్ తప్పనిసరి.

ఎక్కడ.. ఎప్పుడంటే..

● **ఉంగుటూరు:** 17 నుంచి 19 వరకు నారాయణపురం, 20-22 ఉంగుటూరు, 24-26 కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలు

● **భీమడోలు:** 17-22 ప్రజ్ఞ ప్రాథమికోన్నత (పూళ్ల), మానస పాఠశాల (భీమడోలు), 24-26 శ్రీ విద్యాలయ (గుండుగొలను), 24న శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల (భీమడోలు), 25, 26 తేదీల్లో సెయింట్ మేరీస్ పాఠశాల (ఆగడాలలంక)

● **నిడమర్రు:** 17, 18 తేదీల్లో తోకలపల్లి, 19, 20 పెదనిండ్రకొలను, 21, 22 నిడమర్రు, 24, 25 అడవికొలను, 26న బావాయిపాలెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలు

● **గణపవరం:** 17న జగన్నాథపురం, చిన్నరామచంద్రపురం, గాంధీనగరంలోని ప్రాథమిక పాఠశాలలు, సెయింట్ ఆన్స్ ఇండియన్ ఉన్నత పాఠశాల (సరిపల్లి), 17, 18న జడ్పీ ఉన్నత (సీహెచ్ అగ్రహారం), జడ్పీ ఉన్నత, నం.1, 2 ప్రాథమిక పాఠశాలలు (కాశిపాడు), 18, 19న నం.1 ప్రాథమిక, 1,6,10,11 వార్డుల్లోని ప్రాథమిక పాఠశాలలు, 18న నం.1, 2 ప్రాథమిక పాఠశాలలు (సరిపల్లి), 19న విద్యా జ్యోతి ప్రాథమిక, మెరిట్ పాఠశాలలు, 19,20న పిప్పరలోని 4,5 వార్డుల్లోని ప్రాథమిక, బాలికల ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, పిప్పర విద్యా సంస్థలు, శ్రీ భారతి, మాంటిస్సోరి పాఠశాల, 20న జడ్పీ ఉన్నత (జల్లికొమ్మర), ప్రాథమిక పాఠశాల (వెలగపల్లి), కిడ్స్ కాస్టల్, విద్యా జ్యోతి పాఠశాలలు, చాణక్య జూనియర్ కళాశాల (గణపవరం), 21న ప్రాథమిక (వరదరాజపురం), నం.2 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు (కొత్తపల్లి), 21,22న బాలబాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలు (గణపవరం), నం.1,2 ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలు (అర్ధవరం), 24న మారియా మాంటిస్సోరి విద్యా సంస్థలు, నం.1,2 ఎంపీపీ (జల్లికాకినాడ), అపన్నపేట, మల్లపురాజుపేటలోని ప్రాథమిక పాఠశాలలు, 24,25న ప్రాథమిక (ఎస్.కొండేపాడు), నం.2 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల (ముప్పర్తిపాడు), ప్రాథమిక (వెంకట్రాజపురం), నం.2 ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాల (మొయ్యేరు), 25న ప్రాథమిక (అగ్రహారగోపవరం), నం.1 ప్రాథమిక (ముగ్గుళ్ల), ప్రాథమిక (కేశవరం), గురజాడ విద్యాసంస్థలు, 26న ప్రభుత్వ జూనియర్ కళాశాల (గణపవరం), నం.2 ప్రాథమిక, ప్రాథమికోన్నత (వల్లూరు), నం.2 ప్రాథమిక (వీరేశ్వరపురం), ప్రాథమికోన్నత (వాకపల్లి), ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాల (డి.కుముదవల్లి), నం.1,2 ప్రాథమిక పాఠశాలలు (కోమర్రు)

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

భీమడోలు: చదరంగంలో తలపడుతున్న చిన్నారులు

భీమడోలు, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాలు భీమడోలు, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఉత్సాహంగా జరిగాయి. భీమడోలులో విద్యార్థులకు వ్యాసరచన, చదరంగం పోటీలు నిర్వహించారు. పూళ్లలోని తోట వెంకట్రామయ్య మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు జరిగాయి. గ్రంథపాలకులు శ్రీనివాసు, అమరనాథ్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సుధాకర్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి న్యూస్‌టుడే : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదవేగి గ్రంథాలయంలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. జడ్పీహెచ్‌ఎస్ హెచ్.ఎం. రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్, 100, 200 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు.

ఏలూరు గ్రామీణ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షతవహించగా ఏపీ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఎం. పద్మజ పర్యవేక్షించారు.

చిత్రలేఖనంపై శిక్షణ

గీసిన చిత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరులోని బాలల గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనం బోధకుడు జె.సుజయ్‌కృష్ణ మెలకువలు నేర్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి శోభ పర్యవేక్షించారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే

ప్రారంభిస్తున్న పత్సమట్ల, గన్ని వీరాంజనేయులు

భీమడోలు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు కూడలి నుంచి సంత మార్కెట్ వరకు (ద్వారకాతిరుమల రోడ్డు) ర.భ.శాఖ రూ.2 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి పొక్లెయిన్ నడిపి ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచులు, క్లాప్ మిత్రాలకు మూడ్రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయకుమారి మంగళవారం తెలిపారు. బుధవారం సర్పంచి, ఉప సర్పంచి, కార్యదర్శులకు, గురువారం ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వీవోలకు, శుక్రవారం క్లాప్ మిత్రాలకు శిక్షణ జరుగుతుందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెదవేగి న్యూస్‌టుడే: ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచనల మేరకు పెదవేగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించామని సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన 24 గంటలలోపు రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పెదపాడు, పెదవేగి, న్యూస్‌టుడే : పెదపాడు, పెదవేగి శాఖ గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకులు డి.జాన్‌బాబు, గంగాధరరావు తెలిపారు. సెయింట్ అగస్టీన్ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు, పెదపాడు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు.

స్వామిత్వతో నివాస రుణార్హత సాధ్యం

మాట్లాడుతున్న రామ్‌నాథ్ రెడ్డి

గణపవరం, న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వేతో యాజమాన్య హక్కులు, నివాస రుణార్హత సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి రామ్‌నాథ్ రెడ్డి అన్నారు. పంచాయతీ విస్తరణాధికారి సత్యనారాయణ అధ్యక్షతన వెంకట్రాజపురంలో స్వామిత్వ గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వామిత్వ ఫేజ్ 0, 1లో 58 గ్రామాల సర్వే పూర్తి కాగా, ఫేజ్ 2లో 197 ఎంపికయ్యాయన్నారు. గ్రామకంఠంలో అనాధిగా నివాసాలుంటున్నా.. హక్కు పత్రాలు, యాజమాన్య హక్కులు లేక బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న వారికి ఈ సర్వే మంచి ఉపశమనమన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సొంత ఇళ్లు లేని వారు పీఎంఏవై కింద ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. నూతన గృహాలు నిర్మించుకోవాలనుకునే వారు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

ప్రజలంతా ఐక్యతతో మెలగాలి : జేసీ

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అభిషేక్ గౌడ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని, ప్రజలంతా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలని జేసీ ఎం.జె.అభిషేక్ గౌడ పేర్కొన్నారు. ఉక్కు మనిషి పటేల్ జయంతి మాసోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో 500 మంది యువత, విద్యార్థులతో చేపట్టిన ఐక్యతా ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యువతలో ఐక్యత, దేశభక్తి భావం పెంపొందించే విధంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లాగా ఏలూరును నిలుపుతామని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ దౌత్య నైపుణ్యంతో 565 సంస్థానాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చిన గొప్ప యోధుడని అన్నారు. కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమ అధికారి సుంకర రాము, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

ప్రదర్శనలో విద్యార్థులు

4,218 మందికి 13.75 కిలో వాట్ల సోలార్ ప్లాంట్లు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో 4,218 మంది వినియోగదారులకు 13.75 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారని ఈపీడీసీఎల్ ఎస్‌ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే వారికి ఈఎంఐ పద్ధతిలో చెల్లించేందుకు అతి తక్కువ వడ్డీకి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయన్నారు. ఒకసారి పెట్టుబడి పెడితే 20 ఏళ్ల వరకు ఇంటికి సరిపడా విద్యుత్తు వినియోగించుకోవడంతోపాటు మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు పంపించి ఆదాయం పొందే అవకాశాలుండడంతో దీనిపై ఆదరణ పెరుగుతోందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జ్ఞాపకార్థ కూడిక

నువ్వు లేవంటే నమ్మలేక పోతున్నాము..
ఇక రావని తెలిసి తల్లడిల్లుతున్నాము..
కుమారీ!
నువ్వు పంచిన ప్రేమాభిమానాలు
నువ్వు చూపించిన ఆప్యాయతానురాగాలు
మాకెప్పుడూ మధురస్మృతులే!
మీ పవిత్ర ఆత్మకు శాంతి
కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..
అశ్రునయనాలతో..
శ్రీమతి కొండా లక్ష్మీకుమారి గారు
స్టెనో & టైపిస్ట్ DLSC, ఏలూరు
జననం: 09-01-1979 మరణం: 15-11-2025
భర్త: డా॥ కొండా రవి (లెక్చరర్ Govt. డిగ్రీ కాలేజ్, నారాయణపురం)
కుమార్తె: కొండా సంజనరాజన్
అత్తయ్య: కొండా వజ్రమ్మ మామయ్య: కొండా రాజన్న (లేటు)
తల్లి: ఏలిపే మేరీరత్నం తండ్రి: వరప్రసాదరావు
అన్నయ్యలు: డా॥ ఏలిపే రత్నప్రసాద్ వదినలు: శిరోజా
ఏలిపే ఆనంద్‌కుమార్ నాగజ్యోతి
జ్ఞాపకార్థ కూడిక: 19-11-2025 బుధవారం ఉదయం 10 గంటలకు ఏలూరులో గిరిజన భవన్ నందు జరుపబడును. కావున తెలియజేయడమైనది.

శాకంబరి అలంకరణలో స్వామివార్ల మండపం

అన్నదాన ప్రభువే.. శరణమయ్యప్ప

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: అయ్యప్ప, సర్వ మాలధారణ స్వాములకు భిక్షా కార్యక్రమాల్లో భాగంగా 36వ రోజు మంగళవారం అన్నపూర్ణసహిత హరిహర పుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో స్థానిక అగ్రహారం రామకోటి ప్రాంగణంలో అయ్యప్ప, స్వామివార్లను నేత్రపర్వంగా శాకంబరీ అలంకరణ చేశారు. కొట్టు సత్యనారాయణ కుటుంబ సభ్యులు, కూనపరెడ్డి మురళీకృష్ణ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నాయకులు ఎంఆర్‌డీ బలరాం ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివార్లకు పూజలు చేశారు.

నేత్రపర్వం.. కార్తిక దీపోత్సవం

దెందులూరు, న్యూస్‌టుడే: రామదండు ఆధ్వర్యంలో మంగళవారం 4 వేల దీపాలతో కార్తిక దీపోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. శివలింగం, ఓంకారం, స్వస్తిక్, నక్షత్ర ఆకారాల్లో భక్తులు దీపాలు వెలిగించారు. తొలుత విఘ్నేశ్వరస్వామికి, శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. శివ పంచాక్షరి పఠించారు.

పెదపాడు, న్యూస్‌టుడే : పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన కోటి దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జ్యోతిర్లింగాకారంలో దీపాలు వెలిగించారు.

శివలింగాకారంలో దీపాలు

సందడిగా వనసమారాధన

కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అధ్యాపక బృందం

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో కార్తిక వన సమారాధన మంగళవారం సందడిగా సాగింది. ముందుగా సీఆర్‌ఆర్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు వీవీ బాలకృష్ణారావు ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. పాలక మండలి సభ్యులు, అధ్యాపక బృందం ఆటపాటలతో సందడి చేశారు. సహాయ కార్యదర్శి శ్రీకృష్ణ, కోశాధికారి బీవీవీ ప్రసాద్, బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గుత్తా కాశీబాబు, పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘు, కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి జాంగ్రీలతో ప్రత్యేకాలంకరణ

అలంకరణలో అంజనీపుత్రుడు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఏలూరు ఎన్ఆర్ పేటలోని కొత్త బస్టాండ్ సమీప దాసాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అంజనీ పుత్రుడు విశిష్ట అలంకరణలో దర్శమిచ్చారు. సిందూర వర్ణ మిఠాయిలు, తమలపాకులే ఆభరణాలుగా స్వామిని నేత్రపర్వంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకున్నారు.

మా తోటి బిల్డర్స్‌కు బిల్డర్స్‌డే శుభాకాంక్షలు
అత్యాధునిక టెక్నాలజీతో అపార్ట్‌మెంట్స్, ఇండిపెండెంట్ హౌసెస్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు డవలప్‌మెంట్ & కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్మించి ఇచ్చుట మా ప్రత్యేకత.
బిల్డర్, కాంట్రాక్టర్ & ల్యాండ్ డవలపర్
Quality is First - Cost is Next
ఏలూరు, Cell: 92466 67234
Ln. వాసు
TRUSTED BUILDER

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
ఏలూరు పరిసర ప్రాంత బిల్డర్స్‌కు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.
ఏలూరు టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు సిబ్బంది

బిల్డర్స్ డే శుభాకాంక్షలతో..
సాయిశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ
ఏలూరు సెల్: 91824 97791, 99126 26418
BPT, డిప్లమా కోర్సుల ఉచిత విద్యకై ప్రతిభా పరీక్ష
2025-2026 విద్యా సంవత్సరమునకు ఉచిత విద్యకై మధ్యతరగతి విద్యార్థుల నుండి అప్లికేషన్స్ కోరుచున్నాము.
07-12-2025న నిర్వహించు పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 3 గురికి BPT, 5 గురికి డిప్లమో కోర్సులయందు ఉచితంగా విద్యను అందించబడును.
ఇంటర్ ఉత్తీర్ణత గలవారు సంప్రదించండి

దాడులు ఆపాలని నిరసన

ధర్నా చేస్తున్న నాయకులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మైనార్టీలు, గిరిజనులపై కొనసాగుతున్న దాడులు ఆపాలని, కుల వివక్షత అణచివేత నిర్మూలించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కోరారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పాతబస్టాండ్ కూడలిలో మంగళవారం 'సామాజిక న్యాయం - ఆత్మగౌరవం' నినాదంతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, ముస్లింలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వెంకటాపురంలోని శ్రీరామ్‌నగర్ ఎంపీయూపీ పాఠశాలలోని విద్యార్థులకు రక్షిత తాగునీటిని అందించేందుకు దాతలు యు.వి. సత్యనారాయణ దంపతులు రూ.13,500 ఆర్థిక సాయం అందించారు. ప్రధానోపాధ్యాయుడు గోపి కిశోర్, ఉపాధ్యాయులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలల హక్కుల రక్షణకు కృషి

మాట్లాడుతున్న స్టీవెన్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) రాష్ట్ర సహాధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్ కాలనీలో మంగళవారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు దిడ్ల ఏంజిలో పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: బాలలు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతిగృహంలో మంగళవారం బాలకార్మిక నిర్మూలనపై అవగాహన కల్పించారు.

ఏపూరు (పెదపాడు), న్యూస్‌టుడే : విద్యార్థులు విద్యా హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీబీఆర్సీ ఏరియా కో ఆర్డినేటర్ గోసాల ఝాన్సీరాణి కోరారు. పెదపాడు మండలం ఏపూరులోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం డీబీఆర్సీ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు.

దాగురేకు నివాళి

కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఏలూరు ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లైఓవర్ వంతెన వద్ద ఉన్న డాగురె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రఫీ రంగానికి చెందిన తంగేటి మనోహర్ ఏలూరు టౌన్ తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా సంఘం సభ్యులు సన్మానించారు. గౌరవాధ్యక్షులు ఉప్పాల జగదీష్‌బాబు, ఉప్పలపాటి ప్రసాద్, అధ్యక్షుడు రవిశంకర్‌బాబు, కార్యదర్శి నాగదుర్గాప్రసాద్, కోశాధికారి ఉజ్వలకుమార్ పాల్గొన్నారు.

భీమడోలు, న్యూస్‌టుడే: ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు సీహెచ్. ప్రభు చౌదరి, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడి దుర్మరణం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైలు నుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. దెందులూరు రైల్వేగేటు సమీపంలో మంగళవారం సుమారు 35 సంవత్సరాల వయసు గల వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ జారి కిందపడి మృతి చెందాడు. అతడి వివరాలు తెలియరాలేదు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రైల్వే ఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని నూకరాజు మృతి

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలుకు చెందిన ప్రముఖ సామాజిక సేవకురాలు, మానవతావాది, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుల్ల నూకరాజు(75) అనారోగ్య సమస్యలతో మంగళవారం తెల్లవారుజామున మరణించారు. మానవత స్వచ్ఛంద సంస్థలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఈమె మంచి గుర్తింపు పొందారు. ఉపాధ్యాయురాలిగా ఉత్తమ సేవలందించడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. భర్త గుల్ల అప్పారావు కూడా ఉపాధ్యాయుడిగా పని చేశారు. నూకరాజు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆదర్శమూర్తికి అశ్రుతాంజలి



దివ్యశ్రీ మోతే అంజనాగ రాజమోహన్ గారు
ఛైర్మన్: రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్
ఏలూరు - జంగారెడ్డిగూడెం
జననం: 10-10-1950 మరణం: 08-11-2025
మంచికి మారుపేరుగా, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి, మాకు ప్రేమానురాగాలు పంచిన అమృతమూర్తి, మా అభివృద్ధికి బంగారు బాటలు వేసిన ఆదర్శమూర్తి,
దివ్యశ్రీ మోతే అంజనాగ రాజమోహన్ గారి
అకాల మరణం మా అందరికీ తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో అంజలి ఘటిస్తూ...
భార్య: మోతే రమాసుందరిరాణి
కుమారుడు: మోతే రాజ్‌కిరణ్ కోడలు: మోతే అనుపమ
మనుమడు: మోతే అక్షజ్
కుమార్తె: చవల హరిత అల్లుడు: చవల శ్రావణ్‌కుమార్
తమ్ముళ్ళు: ఆలపాటి వెంకట కుటుంబరావు (లేటు), మోతే నాగసుందరఅయ్యన్న
మరదళ్ళు: ఆలపాటి లీలాకుమారి, మోతే జయలక్ష్మి
చెల్లెళ్ళు: దండు సోమలక్ష్మి తాయారమ్మ, రాచపూడి లక్ష్మీ నిర్మల
బావమరుదులు: దండు శ్రీనివాసు (లేటు), రాచపూడి కృష్ణమోహన్
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
ది. 19-11-2025 బుధవారం నాడు ఉ॥ 10.30 మాసికం, ఆశీర్వచనము ఏలూరు అగ్రహారంలో మా స్వగృహమునందు జరుగును. కావున తెలియపరచుచున్నాము. సెల్: 98481 19225
ROYAL ENFIELD రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ స్టాఫ్
ఏలూరు - జంగారెడ్డిగూడెం

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సోమరౌతు రాజు దంపతులు స్వామికి రూ.25వేల విలువైన వెండి తమలపాకులు అందజేశారు. గూటాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని పంచామృతాభిషేకం జరిపారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెం, అప్పలరాజుగూడెం, అల్లంచర్లరాజుపాలెం, తిరుమలదేవిపేట, వెంకటాపురం, కృష్ణాపురం వంటి గ్రామాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం పలు ఆలయాలు వద్ద అన్న సమారాధన జరిగింది.

వైభవంగా సిందూరార్చన

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: జీలుగుమిల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామికి సిందూరార్చన వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ అర్చకుడు కస్తూరి నాగపార్థచిరంజీవి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెంలోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి పంచ హారతులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: స్వాతి నక్షత్రం సందర్భంగా ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుదర్శన నృసింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిపి, పంచ హారతులు ఇచ్చారు.

మీనాక్షీసుందరేశ్వరుడికి లక్షపత్రి పూజ

అంకాలగూడెం: భోగలింగేశ్వరుడు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలోని వాసవీ మాత ఆలయంలో మీనాక్షీసుందరేశ్వరుడికి మంగళవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. తెల్లవారుజామున అభిషేకాల అనంతరం చేపట్టిన పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంకాలగూడెం ఉమా సమేత భోగలింగేశ్వర స్వామిని బాదం పప్పులతో అలంకరించారు.

పూడ్చేసి.. పంటేసి..

☛ ఆక్రమణల్లో చెరువులు ☛ పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మండలంలో సాగు నీరు అందించాల్సిన చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. కొంత మంది అక్రమార్కులు చెరువులను ఆక్రమించుకుని వరి, ఆయిల్‌పామ్ వంటి పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఆయకట్టు రైతులు సాగుకు సక్రమంగా నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్రమణలను తొలగించి చెరువులను అభివృద్ధి చేసి సంరక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలోని పంచాయతీరాజ్, జలవనరుల శాఖలకు సంబంధించి మొత్తం 77 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు దాదాపు 40 శాతం ఆక్రమణలకు గురయ్యాయని అధికారులే చెబుతున్నారు.

● గుణ్ణంపల్లి పంచాయతీ శివారు తక్కెళ్లపాడులో లక్ష్మీపురం చెరువు 49 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని కింద 160 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ చెరువు ప్రస్తుతం 19 ఎకరాలు ఆక్రమణకు గురైంది. కొంత మంది ఇందులో పక్కా గృహాలు కూడా నిర్మించుకున్నారు.

● సత్తాల గ్రామంలో పెద్ద చెరువు 33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని కింద 199.89 ఎకరాలు ఆయకట్టు ఉంది. సుమారు 16 ఎకరాలు ఆక్రమణకు గురైంది.

తక్కెళ్లపాడులో ఆక్రమణకు గురైన లక్ష్మీపురం చెరువు

తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

పంటలకు సాగు నీరు అందించాలన్నా.. భూగర్భ జలాలు పెరగాలన్నా చెరువులు అవసరం. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆక్రమణలకు గురై వాటి విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోతుంది. ఫలితంగా చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే పరిస్థితి నెలకొంది.

సర్వే చేసినా.. జలవనరుల శాఖకు సంబంధించి మండలంలోని కొన్ని చెరువులను గతంలో సర్వే చేసి ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. కానీ వాటిని తొలగించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆక్రమణదారులకు రాజకీయ నాయకుల మద్దతు ఉండటంతో ఎవరినీ కదపలేకున్నామని అధికారులు చెబుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చెరువులను సర్వే చేసి హద్దులు నిర్ణయించేది రెవెన్యూ అధికారులైతే.. ఆక్రమణలు తొలగించే బాధ్యత పంచాయతీరాజ్ శాఖాధికారులదని జలవనరుల శాఖ ఏఈ వెంకటసతీశ్ తెలిపారు. జలవనరుల శాఖ చెరువులకు సంబంధించి పూర్తి బాధ్యత ఆ శాఖ అధికారులదేనని, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

34,037 మందికి పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం నుంచి 34,037 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్రం 21వ విడతగా అందించే రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5 వేలు మొత్తం రూ.7 వేలు బుధవారం నుంచి రైతుల ఖాతాల్లో జమవుతుందని కేఆర్‌పురం ఏడీఏ పి.జి.బుజ్జిబాబు తెలిపారు. కొయ్యలగూడెం మండలంలో 8304 మంది రైతులకు రూ.5.52 కోట్లు, పోలవరం 5002 (రూ.3.30కోట్లు), బుట్టాయగూడెం 6096 (రూ.4.14 కోట్లు), జీలుగుమిల్లి 3284 (రూ.2.02కోట్లు), టి.నరసాపురం 9114 (రూ.6.04కోట్లు), కుక్కునూరు 1669(1.14 కోట్లు), వేలేరుపాడు మండలంలో 568 మంది రైతులకు రూ.0.44కోట్లు రైతులకు ప్రయోజనం కలగనుంది.

సీఆర్పీలకు శిక్షణ

మాట్లాడుతున్న డీఎల్పీవో సుందరి

చింతలపూడి, న్యూస్‌టుడే: గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా కమ్యూనిటీ రీసోర్సు పర్సన్లు(సీఆర్పీ)లు సక్రమంగా పనిచేయాలని డీఎల్పీవో సుందరి అన్నారు. డివిజన్ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం మండలాల్లోని ఆయా పంచాయతీల్లో నూతనంగా నియమించిన సీఆర్పీలకు చెత్త సేకరణపై మండలంలోని యర్రంపల్లిలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సీఆర్పీలకు ఆమె పలు సూచనలు చేశారు. డ్వాక్రా మహిళలను సీఆర్పీలుగా నియమించామన్నారు. సీఆర్పీలకు కేటాయించిన ఆయా పంచాయతీల పరిధిలో రోజుకి 40 గృహాలకు వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించాలన్నారు.

యాంటీబయోటిక్స్ వాడకంపై అవగాహన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోన్న యాంటీబయోటిక్స్ మందుల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బయ్యనగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఎంఆర్‌బి) వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. వైద్యుల సలహా లేకుండా సాధారణ రోగానికి కూడా మందుల దుకాణాల నుంచి యాంటీబయోటిక్స్ తెచ్చుకుని వాడటం పరిపాటిగా మారిందన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

తడికలపూడి: దీపార్చన చేస్తున్న భక్తులు

వేలేరుపాడు గ్రామీణ, కామవరపుకోట, న్యూస్‌టుడే: పలు ఆలయాల్లో మంగళవారం కార్తికమాసం సందర్భంగా శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భూదేవిపేటలోని గౌతమేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం వైభవంగా జరిగింది.

☛ తడికలపూడి గంగా పార్వతి సమేత గాంగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతులకు కల్యాణ క్రతువు నిర్వహించారు.

మల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన భ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన వంటి పూజా కార్యక్రమాలను జరిపారు.

మద్ది ఆదాయం రూ.9.95 లక్షలు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: మద్ది క్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల వరకు మంగళవారం ఒక్క రోజే ఆదాయం రూ.9,95,438 వచ్చిందని ఆలయ ఈవో ఆర్వీ చందన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ సేవల రూపంలో ఈ ఆదాయం లభించిందన్నారు.

వనసమారాధనలతో బలంగా బంధాలు: ఎమ్మెల్యే

మద్దిపాటిని సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: బంధుమిత్రులతో కలిసి సరదాగా ఆటలు, పాటలతో సంతోషంగా గడపడంతో సామాజిక బంధాలు బలపడతాయని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ద్వారకాతిరుమలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్తిక వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ... సరదాగా గడిపారు. అనంతరం సంఘ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి ఏడాదిలో చేరేవారికి బుధవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయని ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్‌బాబు తెలిపారు. తమ కళాశాలలో భర్తీ కాగా మిగిలిన సీట్లలో విద్యార్థులు చేరవచ్చన్నారు. ఇందుకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

దళారులను నమ్మొద్దు: బొరగం

కేంద్రం ప్రారంభించిన శ్రీనివాసులు

పోలవరం, న్యూస్‌టుడే: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. పోలవరం-1 రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వరి క్వింటాకు మద్దతు ధర గ్రేడ్ ఏ రకం రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369గా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని, ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు సత్వరం పరిష్కరించాలన్నారు.

కేజీబీవీల్లో 'విజయపథం'

అభ్యసనా సామగ్రి అందజేస్తున్న జీసీడీవో నవీన

కుక్కునూరు, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు(కేజీబీవీ)లో విజయపథం కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులతో ప్రేమ, అనురాగాలతో మెలగడం, వారికి విద్యపై ఆసక్తి కనబరచడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రధాన ఉద్దేశం. మంగళవారం జిల్లా బాలికల అభివృద్ధి అధికారి (జీసీడీవో) నవీన కుక్కునూరు కేజీబీవీలో ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థినులకు అభ్యసనా సామగ్రి పంపిణీ చేశారు. అధ్యాపక సిబ్బందితో సమావేశమై, బోధనలో తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు.

అన్నదాతలకు పరీక్ష

మూతపడిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం ఏఎంసీ ఆవరణలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ కార్యాలయం మూడు నెలలుగా మూతపడింది. వైకాపా హయాంలో రూ.63 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ భవనాన్ని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత, పశువ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణకు వినియోగిస్తామని అప్పటి పాలకులు ఊదరగొట్టారు. ఆ దిశగా సిబ్బంది నియామకాలు చేపట్టకుండానే కాలం గడిపేశారు. దాదాపు రెండున్నరేళ్ల కాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వీటిలో ఏ ఒక్కటీ పరీక్షించింది లేదు. దీనికి సంబంధించిన పరికరాలు, రసాయనాలు వృథా అయ్యాయి. కొన్నాళ్లు హబ్ మేనేజరుగా పని చేసిన వ్యవసాయాధికారి ల్యాబ్‌ను పర్యవేక్షించారు. ఆ తర్వాత అగ్రిల్యాబ్ నిర్వహణ కోసం నియమించిన వ్యవసాయాధికారిని కేఆర్‌పురం సబ్‌డివిజన్ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా డిప్యూటేషన్‌పై పంపించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి పశువుల రోగ నిర్ధారణ కోసం రక్తం, పేడ నమూనాలను పరీక్షించడం కోసం పొరుగు సేవల విధానంలో నియమించిన ఉద్యోగిని ప్రసూతి సెలవుపై వెళ్లడంతో ఆ విభాగం కూడా ఖాళీ అయింది. ప్రత్యామ్నాయంగా ఎవరినీ నియమించక పోవడం గమనార్హం. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రత్యేక దళాల కూంబింగ్

పోలవరం, న్యూస్‌టుడే: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలవరం పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మంగళవారం స్పెషల్ పార్టీ పోలీసులు చేరుకుని కూంబింగ్ ప్రారంభించినట్లు డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసులు జల్లెడపడుతున్నారన్నారు. మరో బృందం పోలవరం ప్రాజెక్టు చుట్టు పక్కల కొండల్లో కూంబింగ్ కోసం రానున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికుల ఆధార్‌కార్డుల వివరాలు పరిశీలిస్తామని, ఈ మధ్యకాలంలో ఒడిశా నుంచి ఎవరైనా వచ్చి పనిచేస్తున్నారా అన్నదానిపైనా.. దృష్టి సారించామన్నారు. ప్రాజెక్టులో బందోబస్తు విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఆదేశించినట్లు డీఎస్పీ చెప్పారు. ఎస్సై పవన్‌కుమార్‌ను వెంటబెట్టుకుని డీఎస్పీ ఉదయం ప్రాజెక్టులో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు ముగియనున్న పొగాకు కొనుగోళ్లు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు 19వ తేదీతో ముగియనున్నాయని వేలం కేంద్రం సూపరింటెండెంట్ గ్రేస్‌మార్గరెట్ మంగళవారం తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న పొగాకును అమ్మకానికి వేలం కేంద్రానికి తీసుకురావాలని కోరారు. పొగాకు అమ్మకాలు పూర్తైన రెండు రోజులు విరామం అనంతరం చూర(స్క్రాప్)ను కొనుగోలు చేస్తారన్నారు.

నారు పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పొగాకు నారు పెంపకంలో ప్రతి రైతు తగిన జాగ్రత్తలు పాటించాలని బోర్డు రాజమహేంద్రవరం ఆర్‌ఎం జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. జంగారెడ్డిగూడెం గ్రామీణ మండలంలోని చిన్నంవారిగూడెంలో కొందరు రైతులు పెంచుతున్న పొగాకు నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంను స్థానిక రైతులు సత్కరించారు. రెండో వేలం కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఆవశ్యకత గుర్తించాలి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని నూజివీడు డివిజనల్ సహకార అధికారి ఎం.రవికుమార్ అన్నారు. 72వ సహకార వారోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నపువారిగూడెం, మల్లుకుంట సహకార సంఘాల వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎరువులు, పెట్రోలు బంకులు, శుద్ధినీరు ఇలా రైతులు, ప్రజలకు ఉపయోగపడే వ్యాపారాలు చేసి సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని రామవరం ప్రాథమికోన్నత పాఠశాలను ఇన్‌ఛార్జి ఎంఈవో శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు.

దాడులు ఖండిస్తూ నిరసన

బుట్టాయగూడెం: ఆందోళన చేస్తున్న నాయకులు

చింతలపూడి పట్టణం, వేలేరుపాడు గ్రామీణ, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కామవరపుకోట, న్యూస్‌టుడే: దళిత, గిరిజన, మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖండించాలంటూ సీపీఐ నాయకులు చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ● చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకుడు గురవయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ● వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీపీఐ సీనియర్ నాయకుడు ఎండీ మునీర్ మాట్లాడారు. ● కుక్కునూరులో తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ● జంగారెడ్డిగూడెంలో తహసీల్దారు స్లీవజోజికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు తదితరులు పాల్గొన్నారు. ● బుట్టాయగూడెంలో నెహ్రూ బొమ్మ కూడలి నుంచి ప్రధాన రహదారుల మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు చోడెం దుర్గ, బేతి కిశోర్ నాయకత్వం వహించారు. ● కామవరపుకోట మండల కన్వీనర్ టీవీఎస్ రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాదిలో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన పలు కేంద్రాలను అసిస్టెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఏసీఈ) ఆర్.ఆశ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని జడ్పీ, బాలికల ఉన్నత పాఠశాల, పలు ప్రైవేటు పాఠశాలలు, శ్రీనివాసపురం ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో పరీక్షల నిర్వహణకు ఉన్న ఏర్పాట్లు పరిశీలించారు. డీవైఈవో రామన్నదొర, ఎంఈవోలు రాములు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడులు

రైతులకు సూచనలు ఇస్తున్న గంగాధరం

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: రైతులు పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులను పాటించి మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి గంగాధరం సూచించారు. దర్భగూడెం, స్వర్ణవారిగూడెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు ఈ నెల 19న ఒకేసారి రైతుల ఖాతాల్లో జమవుతాయని లింగపాలెం మండల ఏవో ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని కలరాయనగూడెం, సింగగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

కామవరపుకోట పంచాయతీ కొత్తూరులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల మురుగు రోడ్లపై పారుతోంది. నివాసాల మధ్య నిలిచి దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. దోమల బెడదతో నరకం అనుభవిస్తున్నారు. డ్రెయిన్లు నిర్మించి.. ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కామవరపుకోట

జన, కుల గణన వెంటనే చేపట్టాలి: సీపీఐ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జన, కుల గణనను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి టి.ఆంజనేయరాజు డిమాండ్ చేశారు. పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొయ్యలగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వర్గాలకు చెందిన వారిపై దాడులు అధికమవుతున్నాయని పేర్కొంటూ గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

బీపీఎస్ దరఖాస్తుకు మార్చి 11 వరకు అవకాశం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: బిల్డింగ్ పీనలైజేషన్ పథకానికి దరఖాస్తు చేసుకోదలచిన వారికి వచ్చే ఏడాది మార్చి 11లోపు గడువు ఉందని, అప్పటిలోపు ఆన్‌లైన్‌లో ప్రక్రియ పూర్తి చేయాలని పురపాలక కమిషనర్ కేవీ రమణ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31లోపు కట్టిన భవన నిర్మాణాలకు బీపీఎస్ వర్తిస్తుందన్నారు. బీపీఎస్‌లో క్రమబద్ధీకరణ చేయని కట్టడాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ రత్నం, మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల బాబూరావు అన్నారు. మంగళవారం ముసునూరు మండలం చింతలవల్లి, అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, సూరేపల్లి తదితర గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించి, పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులు ఉన్న ఫౌండేషన్ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలని, లేకపోతే ప్రాథమిక విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
All Municipal Plans & Approvals.
BPS Plans & LRS Plans
All Gramapanchayath Plans
(EUDA, RUDA) Estimations, Construction plans
బిల్డర్స్‌కు, సాంకేతిక నిపుణులకు, అధికారులకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.
Er. Ajay Kandipalli
B.Tech (Civil)
80748 52637, Licensed Engineer
AJAY ASSOCIATES
Near New Municipal Office, Front Road, Jangareddygudem

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
All Municipal Plans & Approvals Grampanchayath Plans, Construction Plans & Elevations, Estimations, Surveyars, Architects.
కాసర సుబ్బారెడ్డి, Licensed Engineer
K.S.R. అసోసియేట్స్
85009 14869
సుబ్బారెడ్డి కాలనీ, కంటి ఆసుపత్రి ఎదురుగా, జంగారెడ్డిగూడెం

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
జంగారెడ్డిగూడెం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు అన్ని విధములైన నిర్మాణములకు అత్యున్నత ప్రమాణములతో ప్లానింగ్, డిజైన్, ఎస్టిమేట్ వేసి ఇవ్వబడును. నా తోటి బిల్డర్స్‌కు, అధికారులకు గృహ కొనుగోలుదారులకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు..
రఘు బిల్డింగ్ కన్సల్టెన్సీ
92471 09404
ముత్యాల వీరరాఘవనాయుడు (రఘు)
జంగా ఫంక్షన్ హాల్, జంగారెడ్డిగూడెం

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
జంగారెడ్డిగూడెం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు మీకు కావలసిన మున్సిపల్ ప్లాన్ అప్రూవల్స్, పంచాయతీ ప్లాన్ అప్రూవల్స్, కన్సల్టెన్సీ మరియు 3D ఎలివేషన్స్ చేయబడును. గృహ వినియోగదారులకు, అధికారులకు శ్రేయోభిలాషులందరికీ బిల్డర్స్‌డే శుభాకాంక్షలు.
SVS Building Planners
శిరిగినీడి సాయి ప్రసన్న కుమార్
B.E., Civil, Authorised Licensed Engineer
గవర్నమెంట్ హాస్పటల్ ప్రక్కన, జంగారెడ్డిగూడెం, 94903 92987

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
మా Office ప్రత్యేకతలు:
★ Buildingకు Structural desings చేసి ఇవ్వబడును.
★ బిల్డింగ్స్ ఇంటీరియర్స్ చేసి ఇవ్వబడును.
★ బిల్డింగ్స్ సరసమైన ధరలకు (పూర్తి మెటీరియల్స్) మీకు నచ్చిన విధంగా కట్టించి ఇవ్వబడును.
★ Layouts ప్లాట్స్ సరసమైన ధరకు అమ్మబడును.
L.విజయ్‌కుమార్ M.Tech., MIE, MRICS, CCP, FIV
సివిల్ చార్టెడ్ ఇంజనీర్. 70329 96353
R.K.CONSTRUCTIONS
షాప్ నెం.1, సిటీ కేబుల్ ఆఫీస్ బిల్డింగ్, జంగారెడ్డిగూడెం

SITI PROPERTIES
(SITI INFRA PVT LTD)
P.SRINIVAS CIVIL ENGINEER
బిల్డర్స్‌డే శుభాకాంక్షలతో
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో స్థలం & బిల్డింగ్ తో
2BHK SIMPLEX HOME 40 లక్షలు నుండి ప్రారంభం
3BHK DUPLEX HOME 60 లక్షలు నుండి ప్రారంభం
8988678222
పట్టణం లోని, DTCP & RERA అప్రూవ్డ్ స్థలాలలో మాత్రమే ఇంటి నిర్మాణం.
స్థలం లీగాలిటీ చెకింగ్ చేసి, అన్ని అనుమతులు & సత్వర బ్యాంక్ లోన్ ఏర్పాటు.
అనుభవజ్ఞులైన సివిల్ ఇంజనీర్స్ లతో డిజైన్ మరియు బిల్డింగ్ పర్యవేక్షణ.
కనీసం 15 సం॥లు మెయిన్ బిల్డింగ్ నకు క్రాక్స్, లీకేజ్, సీపేజ్ వారంటీ.
మీకు తగిన బడ్జెట్లో, నచ్చిన ప్లాన్ & ఎలివేషన్లతో, నచ్చిన ప్రాంతంలో పూర్తి వాస్తుతో ఇంటి నిర్మాణం.
నిర్మాణంలో వాడే ప్రతి మెటీరియల్ లిస్టులను మరియు వాగ్దానం చేసిన పనుల వివరాలను ముందుగానే అందిస్తాం.
CC కెమెరాల సహాయం తో మేమిచ్చే మొబైల్ యాప్ ద్వారా మీ ఇంటి నిర్మాణాన్ని ఎప్పటి కప్పుడు వీక్షించే సదుపాయం.
స్థల వైశాల్యాన్ని బట్టి, బిల్డింగ్ సైజును బట్టి, పట్టణం లోని ప్రాంతాన్ని బట్టి బిల్డింగ్ రేట్లు ఉంటాయి.

బిల్డర్స్ డే శుభాకాంక్షలతో..
సాయిశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ
ఏలూరు, సెల్: 91824 97791, 99126 26418
BPT, డిప్లమా కోర్సుల ఉచిత విద్యకై ప్రతిభా పరీక్ష
2025-2026 విద్యా సంవత్సరమునకు ఉచిత విద్యకై మధ్యతరగతి విద్యార్థుల నుండి అప్లికేషన్స్ కోరుచున్నాము.
07-12-2025న నిర్వహించు పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 3 గురికి BPT, 5 గురికి డిప్లమో కోర్సులయందు ఉచితంగా విద్యను అందించబడును.
ఇంటర్ ఉత్తీర్ణత గలవారు సంప్రదించండి

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

చిన్నారుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలి: ఎంఈవో

ముసునూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి విద్య అందించడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని వడ్డించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. మంగళవారం ముసునూరు మండలం చింతలవల్లి మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ-1 పరీక్షల నిర్వహణను, రికార్డులు పరిశీలించడంతో పాటు బోధన, అభ్యసన విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్థాయిని గుర్తించి సరళమైన పద్ధతుల్లో ఉపాధ్యాయులు బోధించాలన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న సుబ్బారావు

వన సమారాధనలతో ఆహ్లాదం: సబ్ కలెక్టరు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వన సమారాధనలు ఆహ్లాదాన్ని పంచుతాయని నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న తెలిపారు. మంగళవారం నూజివీడు మండలంలోని బత్తులవారిగూడెంలో సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో వన సమారాధన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వన సమారాధన ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో సీహెచ్ సూర్యనారాయణ, మండల అటవీశాఖ రేంజర్ జి.సత్యనారాయణ అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉసిరి చెట్టు వద్ద పూజలో వినూత్న

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	80085 74698	ఆగిరిపల్లి	9121229090
ముసునూరు	93983 81268	చాట్రాయి	8008574700
కైకలూరు	73060 88555	మండవల్లి	8106099008
కలిదిండి	90594 84862	ముదినేపల్లి	8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు చిన్నారిగారి కాలనీకి వెళ్లే మార్గంలో డ్రైనేజీ నీరు రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికుడు కృష్ణచంద 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై. ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచి సమస్యను పరిష్కరించారు.

● కైకలూరు సివిల్ కోర్టు సమీపంలోని కుండీలో వ్యర్థాలను కొన్ని రోజులుగా సేకరించడం లేదని స్థానికుడు రహమాన్ 'ఈనాడు' 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై. ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన చెత్త, వ్యర్థాలను తొలగింపజేశారు.

పనిచేయని ప్లాంట్లు.. విద్యార్థులకు పాట్లు..

మూలనపడ్డ నీటి శుద్ధి యంత్రాలు

ముదినేపల్లి, ముసునూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల్లో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల్లో చాలా చోట్ల సమస్య తీవ్రంగా ఉంది. తాగు నీరు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. సురక్షిత నీరు చాలా చోట్ల విద్యార్థులకు అందడం లేదు. చాలాచోట్ల పాఠశాలలకు నీటి కనెక్షన్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొన్ని నెలలుగా మరమ్మతులకు గురైనా వాటిని బాగు చేసేందుకు చొరవ చూపడం లేదు.

మూల బజారులోని చేతి పంపు వద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థులు

అధికారుల పర్యవేక్షణ లేక.. కైకలూరు నియోజకవర్గంలో 258, నూజివీడులో 268 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో దాదాపు 33 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 'నాడు-నేడు' పనుల్లో భాగంగా దాదాపు 70 శాతం పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటిలో దాదాపు 40 నుంచి 60 శాతం పని చేయడం లేదు. కొన్నిటికి పంచాయతీ కుళాయి కనెక్షన్లు లేవు. మరమ్మతులకు గురైతే నిర్వహణ ఏజెన్సీ ప్రతినిధులు సకాలంలో స్పందించడం లేదు. పలు పాఠశాలల్లో ప్లాస్టిక్ డబ్బాలతో ఆర్వో ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేస్తున్నారు, మిగిలిన చోట్ల ఇంటి నుంచి సీసాలతో నీరు తెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితికి మండల, జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.. ఆర్వో ప్లాంట్ల నిర్వహణ చూసే గుత్తేదారు కాల పరిమితి పూర్తయింది. దీంతో వారు మరమ్మతు చేయడానికి రాకపోవడంతో అవి పనిచేయడం లేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో వాటికి మరమ్మతులు జరిగేలా చర్యలు చేపడతాం. - సుధాకర్, ఉప విద్యాశాఖాధికారి, నూజివీడు

పచ్చదనం.. పల్లె శుభ్రతే లక్ష్యం

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: పచ్చదనం పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా గ్రామ సర్పంచులు, పాలకవర్గ సభ్యులు పనిచేయాలని ఎంపీడీవో ఏవీ కృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రాజబాబు అధ్యక్షతన సర్పంచులు, ఉప సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం శరత్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో మాట్లాడుతున్న కృష్ణ

● మండవల్లిలో ఎంపీడీవో రమణబాబు అధ్యక్షతన పచ్చదనం-పరిశుభ్రతపై సర్పంచులు, ఉప సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పల్లెల్లో పచ్చదనం.. పరిశుభ్రతే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో బి.శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు, ఏవో అబ్దుల్ సలామ్ పాల్గొన్నారు.

మురుగు కాల్వల పరిస్థితిపై కమిషనర్ ఆరా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని 19, 20 వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నూజివీడు మున్సిపల్ కమిషనర్ వి. రమ్య మంగళవారం పరిశీలించారు. నెహ్రూపేట, అజయ్యపేటలో పర్యటించి మురుగు కాల్వల పరిస్థితిపై ఆరా తీశారు. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉంటోందని, పలు చోట్ల డ్రైయిన్లు ధ్వంసమయ్యాయని స్థానికులు వివరించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పురుగుల నివారణ

ముసునూరు, న్యూస్‌టుడే: పొగాకు పైరులో రసం పీల్చే పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో చాముండేశ్వరి అన్నారు. మంగళవారం ముసునూరు మండలం కొర్లగుంట, ముసునూరు గ్రామాల్లో పొలం పిలుపు కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, పొగాకు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. కేజీ మొక్క జొన్న విత్తనాలకు థయోమిథాక్సామ్ 10 గ్రాములు కలిపి విత్తుకుంటే తెగుళ్లు రాకుండా నివారించుకోవచ్చని తెలిపారు. మండలంలో 8,205 మంది రైతులకు అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు రూ.5.48 కోట్లు జమయ్యాయని తెలిపారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవాలకు ఏర్పాట్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ షష్ఠి మహోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 25న ప్రారంభం కానున్న షష్ఠి ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించే పనులు పంచాయతీ అధికారులు చేపట్టారు.

గ్రామాల్లో తాగు నీరు, పారిశుద్ధ్య పర్యవేక్షణకు కమిటీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల్లో నీరు, పారిశుద్ధ్య కమిటీలు ఏర్పాటు చేసి, అవి నిత్యం తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం దిల్లీ నుంచి సుజల గ్రామ సంవాద్ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూనిసెఫ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా 2028 నాటికి ఇంటింటికి రక్షిత నీరు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్లు, డీఆర్‌డీఏ స్వయం సహాయక సంఘాలు తదితరులను అనుసంధానం చేశామన్నారు. ప్రతి 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. 13 నెలలుగా వాటర్ క్లోరినేషన్‌కు సంబంధించి వాటర్ కిట్ల వినియోగం ఎలా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, ప్రభుత్వ సంస్థల తదితరులను పరిశీలిస్తున్నామన్నారు. క్లోరినేషన్, చేతుల పరిశుభ్రత తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి

కార్యక్రమం వీక్షిస్తున్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

రూ.1.20 కోట్లు మంజూరు.. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్. బాలాజీ రెడ్డి మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. రూ.92 లక్షల విలువైన పని పూర్తయినట్లు వివరించారు. డీఈ సురేశ్‌బాబు, కార్యదర్శి షహనాజ్ బేగం, సర్పంచి వరికూటి వెంకటేశ్వరరావు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాఠశాల విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సభ్యులు పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. దేశంలో 12 ప్రధాన గ్రామ పంచాయతీలను జల్‌జీవన్ మిషన్ గ్రామ సంవాద్‌కు ఎంపిక చేయగా అందులో నూజివీడు మండలం యనమదల ఉండటం గమనార్హం. ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలా.. లేదా, క్లోరినేటెడ్ వాటర్ అందుతుందా లేదా.. ఇంటింటికి ట్యాప్ కనెక్షన్ ఉందా.. లేదా తదితర విషయాలపై సర్వే చేశారు. నేషనల్ జల్ జీవన్ మిషన్ టీమ్ ఏపీ ఇన్‌ఛార్జి విద్యాసాగర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విద్యాలయ అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం అవసరం: కామినేని

కలిదిండి, న్యూస్‌టుడే: పాఠశాల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. చినతాడేపల్లి జడ్పీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులను ప్రేరణ కలిగించేలా సందేశమిచ్చిన ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల స్థల దాతలు చినరామయ్య, పెదరాములను సన్మానించారు. విశ్రాంత ఉద్యోగుల అభ్యర్థన లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థం ఆమె కోడలు సువర్ణవాణి రూ.10 వేల విరాళం అందించారు. హెచ్.ఎం. పి.దామోదరరావు, సర్పంచి గండికోట ఏసుబాబు, ఎస్ఎంసీ ఛైర్ పర్సన్ కొల్లాటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి..

కైకలూరు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఈ నెల 20న కైకలూరు (ట్రావెల్స్) బంగ్లాలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 13 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని సుమారు 1000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదివిన 18 నుంచి 30 ఏళ్ల లోపు యువకులు అర్హులని వివరించారు. మరింత సమాచారం కోసం 6281119575, 9676140814 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు నూతన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని డీపీఈవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీఎస్ రామాంజనేయులు, మహిళా కార్యదర్శి లక్ష్మీకాంతం అన్నారు. ఈమేరకు మంగళవారం చింతపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడుగురు నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్‌లను హెచ్‌ఎం భాగ్యలక్ష్మి చేతుల మీదుగా అందించారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి పరిచేందుకు డీపీఈవో ట్రీయూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తోందన్నారు.

చెత్త రహిత ముదినేపల్లిగా తీర్చిదిద్దుదాం: ఎంపీపీ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనిచేసి చెత్తరహిత ముదినేపల్లిగా తీర్చిదిద్దాలని కృషి చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజీల ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ కార్యదర్శులు రోడ్డు పక్కన చెత్త వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పంచాయతీలోను ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో అశోక్, ఏవో రమణారావు, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

మైనార్టీ, గిరిజన, దళితులపై దాడులు అరికట్టాలి:సీపీఐ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మైనార్టీ, గిరిజన, దళితులపై దాడులు అరికట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బలసాని రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం నూజివీడులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మోదీ అధికారం చేపట్టిన 12 ఏళ్ల కాలంలో దాడులు అధికమయ్యాయన్నారు. సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం ఉద్యమించాలని ఆయన పిలుపు ఇచ్చారు. పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, కార్మిక సంఘం నాయకులు రాంబాబు, దుర్గాప్రసాద్, కృష్ణ, అప్పలనాయుడు, శ్రీను పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రామారావు

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	----
సత్యనారాయణ మినీ	జిగ్రీస్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	శివ
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	కాంత
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	----
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	తెలుసు కదా
కైకలూరు: విజయలక్ష్మి జీ3	ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్
మాగంటి సినిమాస్	కాంత
శ్రీవెంకటరమణ సినిమాస్	శివ
ముదినేపల్లి: పూర్ణిమ	కాంత

ఆదమరిస్తే అంతే..!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూజివీడు-విజయవాడ ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి స్టేట్‌బ్యాంక్ కూడలి దగ్గర రహదారి పక్కనే ఉన్న పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఇటీవల విజయవాడ వైపు వెళుతున్న ఓ కారు ఆ గుంతలో పడింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని, రాత్రి వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు తెలిపారు.

నీటి కోసం ఆందోళన

చాట్రాయి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరా నిలిచి పదిహేను రోజులు గడిచినా పట్టించుకోవడం లేదని మహిళలు మంగళవారం చనుబండ రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. చిన్న చెరువు సమీపంలో బోరు పని చేయడం లేదని, గతంలో ఇది పలుమార్లు మొరాయించి తాగు నీటి సమస్యను ఎదుర్కొన్నామని వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా కనీసం పరిశీలించలేదని వారు ఆరోపించారు. ఇదే విషయంపై సర్పంచి విస్సంపల్లి జ్యోతిని వివరణ కోరగా.. చెరువులో మోటారు చెడిపోయిందని, యంత్రంతో బయటకు తీశామని, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

చనుబండలో రోడ్డుపై మహిళల నిరసన

కోటపాడులో ఇక్కట్లు.. కోటపాడు గ్రామ పరిధిలోని బ్యాంకు బజారులో వారం రోజులుగా నీటి సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడకు తమ్మిలేరు సమీపంలో మోటారు ద్వారా నీటిని అందిస్తున్నారు. పైపులు సక్రమంగా లేక ఇటీవల పగిలి పోయి నీటి సరఫరా నిలిచింది. ప్రత్యామ్నాయంగా మరో మోటారు పైపునకు అనుసంధానం చేసే అవకాశమున్నా నిర్లక్ష్యం చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇదే విషయంపై కార్యదర్శి నాగరాజును వివరణ కోరగా రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

శిథిలావస్థలో బస్సు షెల్టర్లు

ముసునూరు, న్యూస్‌టుడే: పల్లె బస్టాండ్ల గోడు ఎవరికీ పట్టడం లేదు. ప్రయాణికుల సౌలభ్యం కోసం నిర్మించిన బస్సు షెల్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ముసునూరు మండలం సూరేపల్లి అడ్డరోడ్డు వద్ద, గుడిపాడు అడ్డ రోడ్డు, కొర్లగుంట సెంటర్ సమీపం, వేల్పుచర్ల అడ్డ రోడ్డు వద్ద దాతలు ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్లు పూర్తిగా పాడయ్యాయి. నిత్యం అనేకమంది ప్రయాణికులు బస్సు, ఆటోల కోసం ఇక్కడ వేచిచూస్తుంటారు. షెల్టర్ల పిల్లర్లు బీటలు వారి ప్రమాదకరంగా మారాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న వాటిలో వేచి ఉండటానికి ఆందోళన చెందుతున్నారు. కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు.

వైభవంగా.. అయ్యప్ప పడి పూజ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం మల్లిబోయినపల్లిలో నక్కనబోయిన శ్రీమన్నారాయణ(పండు) స్వామి ఆధ్వర్యంలో మొగదాటి మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు నిర్వహించిన పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామం మార్మోగింది. 18 మెట్లు వెలిగించి స్వాములు ఉత్సాహంగా పేటతుల్లి ఆడారు. గురుస్వామి ఆర్వీఎన్ రాజశేఖర్, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నిర్మాణాలు ప్రారంభించి లబ్ధి పొందండి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్థలాలు పొందిన వారు వెంటనే నిర్మాణాలు ప్రారంభించి పథకం లబ్ధి పొందాలని తహసీల్దారు లతీఫ్ పాషా సూచించారు. ముదినేపల్లి సచివాలయంలో మంగళవారం ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వెంటనే పునాది వేసుకోవాలని సూచించారు. అయితే నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేదని, ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని పలువురు కోరారు. ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో హనుమంతరావు, ఉప సర్పంచి ఈడే సుధాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భార్య పుట్టింటి నుంచి రావడం లేదని మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం ఉదయం మృతి చెందిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుదుర్రుకు చెందిన వాసుపల్లి శ్రీరామ్(26), సిరివల్లి ప్రేమించి పెళ్లి చేసుకోగా వారికి ఒక పాప పుట్టింది. శ్రీరామ్‌పై సిరివల్లికి అనుమానం ఉండటంతో తరచూ గొడవపడుతూ ఆమె పుట్టింటికి వెళ్లిపోయి.. పెద్దల్లో మాట్లాడి తిరిగి వచ్చేది. అలాగే నాలుగు నెలల క్రితం గొడవపడి పుట్టింటికి వెళ్లిన సిరివల్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీరామ్ ఈ నెల 14న ఇంటివద్ద గడ్డి మందు తాగాడు. స్థానికులు గుడివాడ ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందగా అతని తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కె.శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

వ్యాసరచన పోటీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్వాతంత్రోద్యమంలో మహిళల పాత్ర అనే అంశంపై మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. నూజివీడు గ్రంథాలయంలో జరిగిన ఈ పోటీల్లో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: నిత్య విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాస్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కైకలూరు, మండవల్లి గ్రంథాలయ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర, విద్యార్థులు చిన్నతనం నుంచి సాధించాల్సిన నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కలిదిండి, న్యూస్‌టుడే: స్థానిక గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సీనియర్ విభాగంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి జె.రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు సరిత, సన్నీబాబు పాల్గొన్నారు.

బలివే రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన

ముసునూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం మాస శివరాత్రి సందర్భంగా ముసునూరు మండలం బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య, ఛైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు సమక్షంలో మంగళవారం ఏలూరు ఆర్య వైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేశారు. మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, తమలపాకులతో లక్ష బిల్వార్చన, రుద్ర హోమం, జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్య వైశ్య వర్తక సంఘం వారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మల్లేశ్వరుడికి.. మండవల్లి, న్యూస్‌టుడే: కార్తిక మహోత్సవాల్లో భాగంగా మండవల్లిలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి లక్ష బిల్వార్చన పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో పలు రకాల అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పాతాళ భోగేశ్వరుడికి.. కలిదిండి, న్యూస్‌టుడే: కార్తిక మాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఐలూరి పున్నయ్య శాస్త్రి ఆధ్వర్యంలో మంగళవారం రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. నేతి బుజ్జి, గొర్తి వెంకటరమణ, అడవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు దీపోత్సవం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గురజలోని గంగానమ్మ ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా మంగళవారం దీపోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు శ్రీచక్రం వేసి దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. దీప కాంతుల్లో ఆలయం దేదీప్యమానంగా దర్శనమిచ్చింది.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో కార్తిక మాసం మంగళవారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత, ఫలామృత అభిషేకాలను ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి వైభవంగా నిర్వహించారు. ఆకాశ దీపం, శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు.

కనులపండువగా శాంతి కల్యాణం

కైకలూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకుని కైకలూరు శ్యామలాంబ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో కొలువుదీరిన పార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వర స్వామి వార్లకు మంగళవారం శాంతి కల్యాణం నిర్వహించారు. వేద పండితుల మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారు, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. నాలుగు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆది దంపతులను దర్శించుకున్నారు. ఈవో వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వంశ పారంపర్య ధర్మకర్తలు ఉప్పలూరి ముత్తంరాజు శర్మ, రాజశేఖర్ దంపతుల సహకారంతో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత

నగదు అందిస్తున్న దుర్గాప్రసాద్

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం లోకుమూడిలో ఇటీవల ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని దెయ్యంపాడుకు చెందిన గంధం భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో భాస్కర్ చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న పలువురు కూటమి నాయకులు తెదేపా సీనియర్ నేత చాపరాల దుర్గాప్రసాద్‌కు విషయాన్ని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన నివాసానికి బాధితుడి కుటుంబ సభ్యులను పిలిపించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఇందులో రాష్ట్ర సగర వేల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టరు గజ్జల గణేశ్, కూటమి నేతలు సంపత్‌రాజు, వంగలపాటి ఉషారాణి, మోరు రంగారావు, ఆనంద్ పాల్గొన్నారు.

చెక్కపల్లిలో ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయినులు

ఘనంగా పురుషుల దినోత్సవం

ముసునూరు, న్యూస్‌టుడే: సమాజానికి, కుటుంబానికి పురుషులు చేసే అమూల్యమైన సేవలను గుర్తిస్తూ అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని ప్రధానోపాధ్యాయుడు అల్లా భక్షు అన్నారు. మంగళవారం ముసునూరు మండలం చెక్కపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉపాధ్యాయినులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు మాట్లాడుతూ.. కుటుంబంలో యజమానిగా, తండ్రిగా, అన్నగా పురుషుడు నిర్వహించే బాధ్యతలు గొప్పవని అభివర్ణించారు. గుడిమెళ్ల రాంబాబు, పద్మ కిశోర్, మురళీ కృష్ణ, మాధవి, యోగిత, ప్రియాంక పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా తోడ్పాటు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధికి కులమతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలు తోడ్పడాలని మండల తెదేపా నాయకుడు చవటపల్లి విక్టర్‌బాబు తెలిపారు. శోభనాచల టైలర్స్ అసోసియేషన్ వారి కార్తిక వన సమారాధన మంగళవారం ఆగిరిపల్లి సమీపంలోని మామిడి తోటల్లో సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బి.రాము, కార్యదర్శి ఎ.శ్రీను, ఎస్.కె.జిలానీ, పి.రంగారావు, ఎన్.రాజేశ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ రత్నం, మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల బాబూరావు అన్నారు. మంగళవారం ముసునూరు మండలం చింతలవల్లి, అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, సూరేపల్లి తదితర గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించి, పీఆర్సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఒకటి నుంచి ఐదు తరగతులు ఉన్న ఫౌండేషన్ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలని, లేకపోతే ప్రాథమిక విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

అక్కిరెడ్డిగూడెంలో సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

(c) eenadu

శ్రీరామం.. విశ్వరూపం

కార్తికమాసం సందర్భంగా కాకినాడ మెయిన్‌రోడ్డు రామాలయంలో చిన్న రజత దశావతార అలంకరణ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం స్వామిని విశ్వరూప సందర్శనావతారంలో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

– న్యూస్‌టుడే, గాంధీనగర్

మహాప్రాణదీపం.. శివం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తిక బహుళ త్రయోదశి, మాస శివరాత్రి సందర్భంగా ఆలయంలోని అనివేటి మండపంలో శివలింగాకారంలో భక్తులు దీపాలు వెలిగించారు. దేవస్థానంలో మంగళవారం భక్తుల రద్దీ తగ్గింది. కేవలం 3,237 వ్రతాలు జరిగాయి.

– న్యూస్‌టుడే, అన్నవరం

విరులు ఒదిగి.. అందాలు పొదిగి

కడియం నర్సరీలు మొక్కలకు పెట్టింది పేరు. దేశ, విదేశాలకు చెందిన ప్రత్యేకమైన, వైవిధ్యమైన మొక్కలను ఇక్కడ చూడొచ్చు. వివిధ ఆకృతుల్లో కనువిందు చేస్తాయి. ఆ ఆకారాల్లో కనిపించేందుకు చాలానే కసరత్తు చేయాలి. ఇక్కడ కనిపిస్తున్నవి కాగితపు పూల మొక్కగా పిలిచే బోగాన్ విల్లా మొక్కలు. ఒకే మొక్కలో వివిధ రంగుల్లో ఉండే పూయడం వీటి ప్రత్యేకత. వీటిని గొడుగు ఆకృతిలో మార్చేందుకు కడియపులంకలోని ఓ నర్సరీ నిర్వాహకులు గొడుగు ఆకారంలో ఉండే ఇనుప జాలీని ఏర్పాటు చేశారు. మొక్క పెరిగే కొద్దీ గొడుగు ఆకారంలో రెమ్మలను కత్తిరిస్తారు. ఇలా చేసేందుకు మొక్క ఖరీదుతో పాటు రూ.3వేలు ఖర్చు అవుతుందని, ఒక్కో మొక్కను రూ.4 వేలు వరకు విక్రయిస్తామని సదరు నర్సరీ నిర్వాహకులు తెలిపారు.

– ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కడియం

నేడు బాలల హక్కులపై ప్రదర్శన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రపంచ బాలల వేధింపుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి బాలాజీచెరువు వరకు సాగే ప్రదర్శనలో విద్యార్థులు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉలిక్కిపడిన.. మన్యం

- ఎన్‌కౌంటర్ ఘటనతో ఉమ్మడి జిల్లాలో చర్చ
- కాకినాడలో మహిళా మావోయిస్టుల పట్టివేత

ప్రశాంత వాతావరణం.. నిండా పచ్చదనంతో తొణికిసలాడే రంపచోడవరం-మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఒక్కసారిగా అలజడి.. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతో సహా ఆరుగురు మృతిచెందారు. మరో 19 మంది తప్పించుకున్నట్లు తెలుస్తోంది. వీరి కోసం గ్రేహౌండ్స్ దళాలు జల్లెడపడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒకప్పుడు అంతర్భాగంగా ఉన్న మన్యంలో తాజా ఎదురుకాల్పుల అంశం కలకలం రేపింది. అదే సమయంలో ఇద్దరు మహిళా మావోయిస్టులు కాకినాడలో చిక్కడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు.

ఈనాడు, రాజమహేంద్రవరం, కాకినాడ
న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి మార్చురీ వద్ద ఆయుధాలతో పోలీస్ బలగాలు

జిల్లాలోనూ ఉనికి

కాకినాడకు కూతవేటు దూరంలో సామర్లకోట మండలం కొప్పవరంలోని రొయ్యల కంపెనీ సమీపంలో మంగళవారం ఇద్దరు మహిళా మావోయిస్టులు పట్టుబడ్డారు. వారి వివరాలేవీ వెల్లడించకుండా గోప్యత పాటించారు. వీరు నగరానికి ఎప్పుడు వచ్చారు.? ఎక్కడైనా రెక్కీలు నిర్వహించారా? ఇంకా ఎవరెవరు వచ్చారు? అనే విషయాలపై విచారణ చేపడుతున్నారు.

వరుస ఘటనలతో..

- ఈ ఏడాది జూన్ 18న రంపచోడవరం-దేవీపట్నం సరిహద్దులోని కింటుకూరు అటవీ ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు రావి వెంకట్ చైతన్య, సౌత్ జోన్ కమిటీ సభ్యుడు చలపతి భార్య అరుణ వారిలో ఉన్నారు.
- ఈ ఏడాది మొత్తంగా మూడు దఫాలు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.
- ఫిబ్రవరిలో వై.రామవరం ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.

పోలీసుల అప్రమత్తం..

జిల్లాలు విడిపోయినా మన్యంతో బంధం కొనసాగుతూనే ఉంది. జడ్పీ సర్వసభ్య సమావేశాలకు విలీన మండలాల సభ్యులు వస్తుంటారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం మండలాల పరిధిలో అటవీ ప్రాంతం మన్యం సరిహద్దుతో ఉన్నాయి. కాకినాడ సమీపంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టుల నుంచి కొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు.

పర్యటకాభివృద్ధి కేంద్రంగా ఆది బౌద్ధ స్తూపం

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఆదుర్రు ఆది బౌద్ధ స్తూపాన్ని పర్యటకాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేస్తానని ఎంపీ హరీష్‌మాథుర్ తెలిపారు. ఈ స్తూపాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి మంగళవారం సందర్శించారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. పాశర్లపూడి వారధి నుంచి వైనతేయ నదిలో హౌస్‌బోట్లపై జలవిహారం చేసేందుకు దృష్టి పెట్టామన్నారు. రిసార్ట్‌లను ఆధునికీకరిస్తామన్నారు. తీర భూముల రక్షణకు అవసరమైన రాతికట్లు, గ్రోయిన్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. సర్పంచి బళ్ల శ్రీనివాసరావు, బుద్ధవిహార్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, నగరం ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరాజా పాల్గొన్నారు.

అదిగదిగో.. ఆర్టీజీఎస్
సాంకేతికతతో పాలనకు అడుగులు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్టీజీఎస్).. రాష్ట్ర సచివాలయంలోని ఈ కేంద్రం ప్రభుత్వ పాలనకు గుండెకాయ లాంటిది. సీఎం చంద్రబాబు ఆలోచనల నుంచి పుట్టిన సాంకేతిక వ్యవస్థ. రాష్ట్రానికి సంబంధించిన సమస్త సమాచారం ఇక్కడ అందుబాటులో ఉంటుంది. విపత్తులు ఎదురైనప్పుడు అందరినీ అప్రమత్తం చేయడం, పథకాల అమలు.. అన్నింటినీ పర్యవేక్షిస్తారు. ఇలాంటి కేంద్రాలు జిల్లాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడలో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

కేంద్రంలో విద్యుత్తు పనులు

విపత్తుల్లో వెంటనే సన్నద్ధం

ప్రస్తుతం విపత్తులు, సంక్షేమ పథకాల విషయంలో రాష్ట్రస్థాయి ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వచ్చే సమాచారం ఆధారంగా ముందుకు వెళుతున్నారు. మొంథా తుపాను సమయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం లేకపోవడంతో ఎక్కడికక్కడ నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే వెంటనే సన్నద్ధమవ్వొచ్చు.

అన్నింటికీ అనుసంధానం..

జిల్లాలో పోలీసుశాఖకు 500 వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటన్నింటిని ఆర్టీజీఎస్ కేంద్రానికి అనుసంధానం చేస్తారు. ఇక్కడ నుంచి వీటి ద్వారా శాంతిభద్రత పర్యవేక్షణకు వీలుంటుంది. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంను ఆర్టీజీఎస్‌కు అనుసంధాం చేస్తారు. జిల్లాలో 89 వరకు ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. వీటన్నింటి సమాచారాన్ని ఇక్కడ భద్రపరుస్తారు. అన్నింటిపై కలెక్టర్ నేరుగా పర్యవేక్షించి, లోటుపాట్లను సవరించి, ప్రజలకు మెరుగైన సేవలందిస్తారు.

ఇక్కడ ఏం ఉంటాయి...
- కమాండ్ కంట్రోల్ సెంటర్
- జిల్లా రియల్‌టైమ్ గవర్నెన్స్
- సీసీటీవీ డేటా సెంటర్
- ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించి జిల్లాస్థాయి నెట్‌వర్కు సెంటర్
- కలెక్టర్, ఎస్పీలు సమీక్షించేందుకు సమావేశ మందిరం

24 గంటల్లో ధాన్యం సొమ్ము జమ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని 15 మండలాల పరిధిలో ధాన్యం సేకరణ వేగవంతంగా జరుగుతోందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్ మంగళవారం తెలిపారు. ఇప్పటికి 2,187 మంది రైతుల నుంచి రూ.34.96 కోట్ల విలువైన 14,755 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.34కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్ములు జమ చేస్తున్నట్లు చెప్పారు. రైతులు వాట్సాప్ సేవలను, రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఎంతధాన్యానైనా కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

1.50 లక్షల మంది రైతులు.. రూ.99 కోట్లు
పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ సాయం జమ నేడే

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్రం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేల చొప్పున విడుదల చేస్తాయి. జిల్లాలో 21 మండలాలకు సంబంధించి 1,50,475 మంది రైతులకు మొత్తం రూ.99.88 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటిలో అన్నదాత సుఖీభవ కింద రూ.75.24 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.24.64 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించటం ఇది రెండో సారి. ఈ ఏడాది ఆగస్టులో 1.48 లక్షల మంది రైతులకు రూ.98.80 కోట్లు ఇచ్చారు.

నియోజకవర్గం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
కాకినాడ గ్రామీణం	10,076	6.83
కాకినాడ అర్బన్	111	0.08
పిఠాపురం	23,105	15.02
తుని	27,617	18.09
ప్రత్తిపాడు	31,634	20.84
పెద్దాపురం	14921	10.02
జగ్గంపేట	23,115	15.55
ముమ్మిడివరం(తాళ్లరేవు)	4,036	2.73
అనపర్తి(పెదపూడి)	6,996	4.74
రామచంద్రాపురం(కాజులూరు)	8,864	5.98

ఎందుకిలా చేశావ్ నాన్నా!

- పిల్లలను గోదావరిలోకి తోసి.. ఆపై తానూ ఆత్మహత్య
- ఇరువురి మృతదేహాలు లభ్యం.. కానరాని బాలిక ఆచూకీ

మలికిపురం, మామిడికుదురు, యలమంచిలి, న్యూస్‌టుడే: 'రండమ్మా.. ఆధార్ అప్‌డేట్ చేసుకుని వద్దాం' అంటూ నాన్న పిలవగానే ఆ పిల్లలిద్దరూ ఉత్సాహంగా వెంట బయలుదేరారు. 'అమ్మా..వెంటనే వచ్చేస్తామమ్మా' అంటూ వీడ్కోలు చెప్పారు. కానీ ఇక ఎప్పటికీ వెనక్కిరామని ఆ చిట్టి హృదయాలకు తెలియదు. తీసుకువెళ్లిన తండ్రి గోదావరిలోకి తోసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసి ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

మలికిపురం మండలం లక్కవరంలో పెను విషాదం నెలకొంది. ఫైనాన్స్ వ్యాపారి శిరిగినీడి దుర్గాప్రసాద్ (37) భార్య నాగవేణి, కుమారుడు మోహిత్ (13), కుమార్తె జాహ్నవి (9)తో కలిసి ఇక్కడ నివసిస్తున్నారు. వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని నాగవేణి కన్నవారి ఇంటి వద్దే వీరంతా ఉంటున్నారు. ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ సోమవారం సాయంత్రం పిల్లలిద్దరినీ తీసుకొని దుర్గాప్రసాద్ ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రాత్రి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి స్టేషన్ పరిధి చించినాడ వశిష్ఠ వారధిపై ఈ వాహనం, పాదరక్షలు, కొన్ని చరవాణి నంబర్లతో కూడిన కాగితం కనిపించాయి. మంగళవారం ఉదయం నుంచి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రానికి దుర్గాప్రసాద్, మోహిత్ మృతదేహాలు కనిపించాయి. జాహ్నవి ఆచూకీ కానరాలేదు. బుధవారం మళ్లీ అన్వేషిస్తామని మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు. దుర్గాప్రసాద్ పిల్లలను నదిలోకి తోసి తానూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. యలమంచిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గాప్రసాద్ మోహిత్ ఆచూకీ కానరాని జాహ్నవి (పాతచిత్రాలు)

ఏం కష్టమొచ్చిందో..

ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందోనని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కుటుంబ కలహాలా..ఆర్థిక సమస్యలా..ఇంకేమైనా కారణాలా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కువైట్ వెళ్లి వచ్చి..

దుర్గాప్రసాద్, నాగవేణిలది ప్రేమ వివాహం. ప్రసాద్ గతంలో ఉపాధి రీత్యా కువైట్ వెళ్లి వచ్చాడు. వడ్డీ వ్యాపారం చేస్తూ పిల్లలిద్దరినీ విశ్వేశ్వరాయపురంలో చదివిస్తున్నారు. నాగవేణి తండ్రి రేకపల్లి వెంకటేశ్వరరావు గల్ఫ్ నుంచి రావడంతో వారం క్రితం వీరంతా ఆ ఊరు వెళ్లారు. తన భర్త, పిల్లలు ఎక్కడున్నారంటూ నాగవేణి రోదిస్తుండడం స్థానికులను కలచివేసింది.

పరుగెడుతుంటే సరదాకు అనుకున్నాం..

ఇద్దరు పిల్లలతో వంతెన మీదకు వచ్చిన దుర్గాప్రసాద్ తొలుత కుమార్తెను నదిలోకి తోసినట్లు భావిస్తున్నారు. ఇది చూసిన కుమారుడు హడలిపోయి పరుగు తీయగా అతడిని తండ్రి వెంబడించినట్లు అటుగా వెళ్లిన ఆటో డ్రైవర్ చెప్పారని.. ప్రసాద్ స్నేహితులు చెబుతున్నారు. సరదాగా పరుగెడుతున్నారనుకున్నామని.. ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఊహించలేదని డ్రైవర్ తెలిపారన్నారు.

విదేశాలకు రెక్కలు ఎగిరేనా!
గోదావరి నుంచి అంతర్జాతీయ విమానాలపై ఆశలు

కోరుకొండ, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఉన్న ఏకైక విమానాశ్రయం రాజమహేంద్రవరం సమీప 'మధురపూడి'. ఇక్కడి నుంచి అంతర్జాతీయ సర్వీసులకు ఎప్పుడు అడుగులు పడతాయోనని అంతా ఎదురుచూస్తున్నారు. ఈ అంశం కేంద్ర పౌరవిమానయాన శాఖ దృష్టిలో ఉంది. అంతర్జాతీయ గగనయానానికి దోహదపడేలా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. టెర్మినల్ భవన విస్తీర్ణం 5 రెట్లు, ప్రయాణికుల సామర్థ్యం 10 రెట్లు పెరగనుంది.



ఈ గల్ఫ్ దేశాలకు డిమాండ్..
- కువైట్
- దుబాయ్
- మస్కట్

(ఉభయ గోదావరి జిల్లాలకు ఇదే కీలక విమానాశ్రయం. ప్రధానంగా కోనసీమ.. పశ్చిమంలోని నరసాపురం, ఆచంట, పాలకొల్లుకు చెందిన కార్మికులు, ఉద్యోగులు గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఉన్నారు. వారంతా హైదరాబాద్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. మధురపూడి నుంచి సర్వీసులు ఉండాల్సిన ఆవశ్యకతపై స్థానిక నేతలు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈ దిశగా ప్రయత్నిస్తున్నారు.)

దేశంలో ఏ నగరాలకు సర్వీసులు వెళ్తున్నాయంటే

హైదరాబాద్	6
దిల్లీ	1
చెన్నై	1
బెంగళూరు	1
తిరుపతి	1

ప్రస్తుతం ఏ పనులు జరుగుతున్నాయంటే..

- అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.350 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నారు.
- గంటకు 2,100 మంది ప్రయాణికులు ఒకేసారి రాకపోకలు సాగించేలా సామర్థ్యం పెంచుతున్నారు.
- 17,029 చదరపు మీటర్లకు పెంచుతూ టెర్మినల్ భవన నిర్మాణం సాగుతోంది
- తనిఖీ కౌంటర్ల సంఖ్య 28, కార్ల పార్కింగ్ సామర్థ్యం 700కు పెరగనుంది.
- ఒకేసారి 11 విమానాలు పార్కింగ్ చేసేలా ఆప్రాన్ సిద్ధమవుతోంది.

రాజమహేంద్రవరం విమానాశ్రయం



దృష్టి పెట్టాల్సిన అంశాలు..
- సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులొస్తే అంతర్జాతీయ విమాన కేంద్రం సాకారమవుతుంది.
- పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి.
- ప్రతికూల వాతావరణంలో ఉపయుక్తమయ్యేలా ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్‌ఎం) ఉండాలి.
- విదేశీ ప్రయాణికులకు ప్రత్యేక టెర్మినల్, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, తనిఖీ విభాగాలు అవసరం

ఓటరు జాబితాకు సమాయత్తం సర్..

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్-సర్)కు యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ఓటర్ల జాబితా తనిఖీ, స్వచ్ఛీకరణకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో త్వరలో చేపట్టనున్నారు. 2002లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్లను ప్రస్తుతం ఉన్న జాబితాతో సరిపోల్చనున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారీగా అప్పటి ఓటర్ల డేటాను బూత్‌స్థాయి అధికారి(బీఎల్వో) యాప్‌కు పంపించారు. 2025 ఓటర్ల జాబితాతో ఈ డేటాను అనుసంధానం చేయగా, మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టారు. దీనిలో 44.89 శాతం ఓటర్లు అందుబాటులో లేనట్లు గుర్తించారు. త్వరలో ఎస్ఐఆర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి విచారణ చేపడతారు. అప్పటికీ వీరు అందుబాటులో లేకపోతే జాబితా నుంచి తొలగింపునకు చర్యలు తీసుకుంటారు.

- 2002లో 18 ఏళ్లు నిండి ఓటర్లు ఉన్నవారి వివరాలు తీసుకున్నారు. 2025కి వీరి వయసు 40 ఏళ్లు పైబడుతుంది. ఇప్పటి జాబితాలో 40 ఏళ్లు పైబడిన వారి వివరాలు, 2002లో 18 ఏళ్లు నిండి ఓటు హక్కు పొందిన వారితో సరిపోల్చారు.

మ్యాపింగ్ ఎలా జరిగిందంటే..

- 2002 జాబితాలో ఓటరుగా ఉన్నా.. ఫొటో ఉందా..? లేదా..? అనే అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.
- 2002లో 18 ఏళ్లు నిండినా ఓటు నమోదు చేసుకోనివారి పేర్లు ప్రస్తుత జాబితాలో నమోదై ఉంటే. దీనికి కారణాలేంటి?, అప్పట్లో వీరి కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయా..? అనే కోణంలో మ్యాపింగ్ చేశారు.
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2002లో 19 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, పునర్విభజన తర్వాత కాకినాడ జిల్లాలోని సంపర నియోజకవర్గం కాకినాడ గ్రామీణంగా రూపాంతరం చెందింది.
- 2002–2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ చేసిన క్రమంలో 5,17,521 మంది ప్రస్తుత ఓటర్ల జాబితాలో లేనట్లు గుర్తించారు.
- 2002 నాటికి కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,86,460 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య 16,42,788కు చేరింది.

పల్లెదారికి సాస్కీతో రూపం..

న్యూస్‌టుడే, బాలాజీచెరువు

జిల్లాలో గ్రామాలను అనుసంధానం చేసే పంచాయతీ రాజ్‌శాఖకు చెందిన ప్రధాన రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వైకాపా పాలనలో వీటిపై కనీసం గుంతలూ పూడ్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. కేంద్ర పథకాలతో కొన్ని రహదారుల అభివృద్ధికి ఇప్పటికే జిల్లాలో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఇంకా మిగిలిపోయిన గ్రామీణ రహదారుల ప్రగతికి చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర మూలధన పెట్టుబడులపై సహాయం(సాస్కీ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.2 వేల కోట్లు సమకూర్చింది. వీటిలో గ్రామాల్లోని బీటీ, సీసీ, గ్రావెల్, డబ్ల్యూబీఎం రోడ్ల అభివృద్ధితో పాటు కొత్తవి నిర్మించనున్నారు.

పిఠాపురం నియోజకవర్గంలోని పి.రాయవరం నుంచి పి.దొంతమూరు వెళ్లే రహదారి పరిస్థితి ఇదీ

వంతెనలు
- జగ్గంపేట నియోజకవర్గంలో శృంగరాయునిపాలెం-కృష్ణవరం మధ్య ఏలేరు వాగుపై
- తుని నియోజకవర్గంలోని బొద్దవరం- కోటనందూరు మధ్య
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏలేశ్వరం-అప్పనపాలెం వద్ద
- తాళ్లరేవు మండలం కోరంగి సమీపంలో..

నియోజకవర్గం	రహదారులు	కి.మీ.
తుని	2	3.64
జగ్గంపేట	2	7.37
కాకినాడ గ్రామీణం	3	7.24
పెద్దాపురం	4	14.49
ప్రత్తిపాడు	2	7.99

జిల్లాలో ఇలా..
- 81 రహదారులను 150.35 కి.మీ మేర అభివృద్ధికి రూ.108.22 కోట్లతో అంచనాలు రూపొందించి నివేదించారు.
- నాలుగు చోట్ల హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.67.20కోట్ల మేర ప్రతిపాదనలు చేసి పంపించారు.
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్‌శాఖ ద్వారా కాకినాడ జిల్లాకు ప్రతిపాదించిన పనులన్నీ మంజూరు చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోనే 110 కి.మీ, మేర 64 రహదారుల అభివృద్ధికి రూ.79.72 కోట్లతో అంచనాలు రూపొందించారు.

MARGADARSI CHIT FUND PVT LTD.
Chit Groups are available at our KAKINADA Branch

Chit Group	Duration In Months	Monthly Installment	Chit Value
LT V	50	1,00,000	50,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
FT B	40	5,000	2,00,000
ST VV	25	2,00,000	50,00,000

Please Contact Branch Manager **Mr. N. VITHAL KUMAR,** for further details.
Mobile Nos. 96187-55599, 9492776760 Landline: 0884-2378220/ 2366065

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

రుద్రా.. రక్షమాం

కిర్లంపూడిలో మానసిక ప్రశాంతి కమిటీ ఆధ్వర్యంలో మహేశ్వరుడికి లక్ష రుద్రాక్షలతో మంగళవారం రాత్రి అభిషేకం నిర్వహించారు. రుద్రాక్ష దండల శివలింగానికి పట్టువస్త్రాలతో అలంకరించి దశమహా, కుంభ హారతి ఇచ్చారు. 24 మంది అర్చక స్వాములు ఆధ్వర్యంలో భక్తిపారవశ్యంతో క్రతువు నిర్వహించారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

దర్శన భాగ్యం

మండపల్లిలోని మందేశ్వరస్వామికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్తిక మాసం పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజాము నుంచే అర్చకులు, కుంభం పూజలు చేశారు. జలం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పాహిమాం.. రక్షమాం అంటూ వేడుకున్నారు. అనంతరం స్వామి వారిని భక్తులు వరుసల్లో నిలుచుని దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, కొత్తపేట

అభిషేక ప్రియం

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి విభిన్న ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి మంగళవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ప్రత్యేక పుష్పాలంకరణ సేవ, విశేష హారతులు క్రతువులు నిర్వహించారు. ఎండు ఫలాలు, తేనె, చెరకు రసం, వక్క ఆకులు, విభూదితో అభిషేకం చేశారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

అనంతేశ్వరం

కడియపులంక పంచాయతీ తన మహాక్షేత్రంలో కొలువైన శ్రీఅపర్ణ సమేత అనంతేశ్వర స్వామికి ఇలా అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధనను మంగళవారం ఉదయం నిర్వహించారు. అర్చకులు పూజలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. - న్యూస్‌టుడే, కడియం

వేదికపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అతిథులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం

గాంధీనగర్, న్యూస్‌టుడే: యువతలో ఒత్తిడి, ఆందోళన, మానసిక భారం పెరిగే సందర్భాల్లో మత్తు పదార్థాల బానిసత్వం ప్రారంభమవుతుందని, ఇది ఆ వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీస్తాయని వక్తలు పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూకే అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యూసీఈకే ప్రిన్సిపల్ మోహనరావు, జిల్లా ఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, డబ్ల్యూపీ, టీజీ, ఎస్పీ అసిస్టెంట్ డైరెక్టర్ ఏవీ శ్రీనివాస తదితరులు మాట్లాడుతూ క్షణికానందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, సామాజిక అలోచనల ద్వారా యువత మత్తు ప్రభావం నుంచి దూరంగా ఉండొచ్చని చెప్పారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, ఎన్‌ఎంబీఏ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి. విజయకుమార్, ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.వి.జి.వర్మ, డాక్టర్ కాటన్, ఈగల్ టీం ఎస్‌ఐ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రం.. అభివృద్ధి మంత్రం

కల.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్నికలప్పుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్ సిటీగా, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఆలయాల అభివృద్ధికి రూ.100 కోట్లు వెచ్చిస్తామన్నారు.

సౌకర్యంగా మారనున్న పాదగయ పుష్కరిణి

కళ.. పిఠాపురం నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేశారు. దేవాదాయ శాఖ, ఇతర నిధులతో ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రముఖ ఆలయాలతోపాటు జీర్ణావస్థకు చేరినవాటిని గుర్తించి ఉద్ధరించేందుకు నిధులు సమకూరుస్తున్నారు. చిన్న ఆలయాలను ధూపదీప నైవేద్యం పథకం పరిధిలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం పాడా అధికారులు, దేవాదాయశాఖ సిబ్బందితో మంగళగిరిలో పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

తాజాగా 19 ఆలయాలకు రూ.20 కోట్లు

ఈ నెల 14న పిఠాపురంలోని 19 ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్ల మంజూరుకు దేవాదాయశాఖ కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) ఆమోదించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. కుక్కుటేశ్వరస్వామి(పాదగయ)ఆలయానికి రూ.6 కోట్లు, శ్రీపాద శ్రీవల్లభస్వామి ఆలయాభివృద్ధికి రూ.2 కోట్లతోపాటు ఇతర ఆలయాలకూ నిధులు మంజూరయ్యాయి. పురుహూతిక అమ్మవారి ఆలయ ప్రగతికి డీపీఆర్ సిద్ధమవుతోంది.

శ్రీపాద వల్లభ మహాసంస్థానం

ఇప్పటికే చేపట్టిన పనులు..

రూ.కోటితో పిఠాపురంలో సకలేశ్వరస్వామి ఆలయం, రూ.1.8 కోట్లతో గొల్లప్రోలు, చేబ్రోలులో రామాలయాల వద్ద మండపాల నిర్మాణం జరుగుతోంది. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో తితిదే కల్యాణ మండప నిర్మాణం జరుగుతోంది. రూ.80 లక్షలతో పిఠాపురంలోని మండపానికి మరమ్మతులు చేపట్టారు. మాడ వీధుల అభివృద్ధికి రూ.20 లక్షలు ఇచ్చారు.

ఆవేదనలోనూ ఆదర్శంగా నిలిచారు..

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లిలంక గ్రామానికి చెందిన చిట్టూరి అచ్యుతరావు చౌదరి(45) ఈ నెల 4న అనారోగ్యంతో మృతి చెందగా ఆతని పార్థివదేహాన్ని తల్లి చిట్టూరి సీతారత్నం అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి దానం చేశారు. తన కుమారుడి పార్థివదేహం వైద్య విద్యకు ఉపయోగపడాలనే ఆకాంక్షతో ఆసుపత్రికి ఇచ్చామన్నారు. బాధలోనూ సీతారత్నం నిర్ణయం ఆదర్శనీయమని కిమ్స్ అటానమస్ విభాగాధిపతి నారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలి

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు పరిధిలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఉపకులపతి డి. మునిరత్నం నాయుడు మంగళవారం మంత్రి దుర్గేష్‌ను హుకుంపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుర్గేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, పలు అంశాలపై మాట్లాడారు. వర్సిటీ విషయాలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు భాష పరిరక్షణకు పాటుపడాలన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మంచి కోర్సులు అందించాలని మంత్రి సూచించారు.

మంత్రి దుర్గేష్‌ను సన్మానిస్తున్న వీసీ మునిరత్నం నాయుడు

ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లపై ఆకస్మిక దాడులు

తుని పట్టణం, న్యూస్‌టుడే: పలు ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లపై డీఎంఅండ్‌హెచ్‌వో కె.నరసింహనాయక్, సిబ్బంది మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. పట్టణంలోని సురేష్ హాస్పిటల్స్, లీలా నర్సింగ్ హోమ్, దుర్గాప్రసాద్ డయాబెటిక్ మెడికల్ సెంటర్, అంకారెడ్డి డెంటల్ హాస్పిటల్, శ్రీలక్ష్మి జనరల్ హాస్పిటల్, రవితేజ డయాబెటిక్ తదితర వాటిని పరిశీలించారు. ఆయా ఆసుపత్రులు తమ లైసెన్సులు రెన్యువల్ చేయించుకోకుండా కాలయాపన చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ జరగాలని లేకుంటే అపరాధ రుసుము విధించడంతోపాటు తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించి నోటీసులు జారీ చేశారు. ఆసుపత్రుల్లో అందించే సేవలు, వాటి ఛార్జీలు, వైద్యుల వివరాలు తప్పనిసరిగా వెల్లడిస్తూ బోర్డులు పెట్టాలన్నారు. ప్రైవేటు ల్యాబ్‌లు యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. అనుమతి లేకుండా నడుపుతున్న జ్యోతి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను సీజ్ చేశారు.

తునిలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

సోమసుందర్ రచనలు నేటి తరానికి స్ఫూర్తి

శ్రీకంఠస్ఫూర్తి విజయకనకదుర్గ దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

పిఠాపురం, న్యూస్‌టుడే: కళారత్న, వజ్రాయుధకవి డా. ఆవంత్స సోమసుందర్ కథారచనలు నేటి తరం రచయితలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రముఖ రచయిత శ్రీకంఠస్ఫూర్తి తెలిపారు. మంగళవారం పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆవంత్స జయంతి సదస్సు సోమసుందర్ లిటరరీ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యతిథిగా హాజరైన శ్రీకంఠస్ఫూర్తి మాట్లాడారు. సోమసుందర్ కథలు, రచనలు గురించి వివరించారు. శ్రీకంఠస్ఫూర్తి విజయకనకదుర్గ దంపతులను సత్కరించారు. కాకినాడ సాహిత్య అకాడమీ, ట్రస్టు సభ్యులు అద్దేపల్లి జ్యోతి, మేకా మన్మథరావు, గట్టి శ్రీకృష్ణదేవరాయులు, చిన్నారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సహకార సంఘాల బాధ్యత

గాంధీనగర్, న్యూస్‌టుడే: రైతులకు అండగా ఉంటూ, వారి సంక్షేమం కోసం పనిచేయడమే సహకార సంఘాల బాధ్యతని డీసీసీబీ ఛైర్‌పర్సన్ తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. డీసీసీబీ కార్యాలయంలో ఆప్కాబ్, డీసీసీబీ ఆధ్వర్యంలో జిల్లాలోని సొసైటీల పర్సన్ ఇన్‌చార్జిలకు నిర్వహించిన రెండురోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. రామస్వామి మాట్లాడుతూ రైతుకు సమయానుకూలంగా స్వల్పకాలిక రుణ సౌకర్యాన్ని వినియోగించుకునేలా చూడడంతో పాటు, వాటి వసూళ్లలోనూ కీలకంగా వ్యవహరించాలన్నారు. సొసైటీలు లాభాల బాట పట్టేలా చూడాలని, బ్యాంకు లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. డీసీసీబీ సీఈవో ప్రదీప్‌కుమార్, ఆప్కాబ్ అధికారి రమణారావు, సీనియర్ సత్యనారాయణరావు, బాపూజీ, డీసీసీబీ డీజీఎం శ్రీధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్‌పర్సన్ తుమ్మల రామస్వామి

పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన యాత్రలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం విజ్ఞాన, విహార యాత్రలకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సమగ్ర శిక్షా ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.500 వంతున నిధులు కేటాయించారు. జిల్లాలోని 21 మండలాల్లో 31 పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల నుంచి 1896 మంది విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలు చేసేందుకు రూ.9.48 లక్షలు కేటాయింపులు చేశారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో 8 శాతం మందికి అవకాశం కల్పిస్తారు. 6 నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు చదివే విద్యార్థులు విజ్ఞాన యాత్రకు వెళ్లేందుకు అనుమతినిచ్చారు. ఈనెల 20తో ఎస్ఏ 1 పరీక్షలు ముగిసిన అనంతరం విజ్ఞాన యాత్రలకు వెళ్లవచ్చని, నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. పాఠశాలలవారీగా నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని, గొల్లప్రోలు మండలంలోని రెండు పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల విజ్ఞాన యాత్రకు రూ.68 వేలు కేటాయించినట్లు ఎంఈవో శ్రీనివాసరావు, ఎంఈవో 2 శివప్రసాద్ తెలిపారు.

గురుకులంలో రాత్రివేళ అగ్నిప్రమాదం

భయాందోళనతో పరుగులుతీసిన విద్యార్థులు

కరప, న్యూస్‌టుడే: కరపలోని మహాత్మాజ్యోతిబా పులే బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. విద్యార్థులు భయాందోళనలతో బయటకు పరుగులు తీయడంతో పెనుప్రమాదం తప్పింది. గురుకుల బాలుర సంక్షేమ వసతి గృహంలో అయిదు నుంచి పదో తరగతి వరకు 213 మంది ఉంటున్నారు. ఇక్కడ ఎనిమిది పెద్ద హాళ్లతో ఉన్న భవనంలోని గదుల్లోనే విద్యార్థులు పెట్టెలు, పుస్తకాలు, దుస్తులు దాచుకొని నిద్రకు పాఠశాలలోని తరగతి గదులను వినియోగిస్తున్నారు. మెట్ల వద్ద ఉన్న లిఫ్ట్ ఖాళీ స్థలంలో పాత ఫర్నీచర్, వివిధ వృథా పరికరాలు వేస్తున్నారు. సోమవారం రాత్రి పాత ఫర్నీచర్‌కు అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. అప్పటికే నిద్రిస్తున్న విద్యార్థులు మంటలను గమనించి ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సునీతతోపాటు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చి మంటలను అదుపుచేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. వంట గది తరగతి గదికి దూరంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

భవనం లోపల అలుముకుంటున్న మంటలు

‘చేతిలోనే పోస్టాఫీసు’

అందుబాటులోకి ‘డాక్ సేవా యాప్’

తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు 2.0లో భాగంగా కొత్తగా ‘డాక్‌సేవా యాప్’ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లలోని గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుంటే దేశంలోని 23 భాషల్లో సేవలు అందుబాటులోకి వస్తాయి. పాత ‘పోస్టు ఇన్ఫో’ యాప్ స్థానంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పోస్టల్ టెక్నాలజీ డాక్ సేవా యాప్‌ను రూపొందించింది.

మీకు? తెలుసా

సత్వరమే ఈ-సేవలు

యాప్ ద్వారా 8 రకాల సేవలు వేగంగా పొందే అవకాశం ఉంది. పార్సిల్ ట్రాకింగ్, పోస్టేజీ లెక్కలు, ఫిర్యాదులు, బీమా ప్రీమియం చెల్లింపు వంటి అనేక సేవలు పొందవచ్చు. డిపాజిట్లు, మనీఆర్డర్ వివరాలు పరిశీలించవచ్చు. వీటితోపాటు దేశీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఛార్జీలు ఎంత ఉంటాయని తెలుసుకునే వీలుంది. కార్పొరేట్ ఖాతాదారులకు తమ వ్యాపార లావాదేవీలకు ప్రత్యేక సేవలు కూడా ఉన్నాయి. దీంతో అనేక మంది ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ప్రతి దానికీ తపాలా కార్యాలయానికి వెళ్లకుండా సద్వినియోగం చేసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, తుని

ఉద్యోగ మేళా రేపు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్.సునీల్‌కుమార్ తెలిపారు. 50 ఖాళీలకు ముఖాముఖి నిర్వహిస్తున్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, డిప్లొమా చదివిన వారు అర్హులన్నారు. గురువారం ఉదయం 9.30కు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు రాజమహేంద్రవరం, ఏలూరు, అమలాపురం, కాకినాడ, భీమవరం పరిసర ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తుందన్నారు. నెలకు రూ.18వేల వేతనం లభిస్తుందన్నారు.

36 మందికి కొలువులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 36 మంది బంగారు ఆభరణాలు అమ్మే జాయ్ అలుకాస్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. వీరికి జేసీ నిశాంతి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

EENADU eClassifieds

AUTO

VEHICLES FOR SALE

Year	Model	Reg. No
2022	Leyland/Dost	AP39UC8382
2023	Leyland/Bada Dost	AP39VD1277
2023	Maruti/Alto	AP39SC3090
2023	Maruti/Swift	AP39UT6663
2025	Tata/Punch Adventure	AP40FC6204

SUNDARAM FINANCE Ltd., TUNI
CONT: 85001 58018

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

శ్రీ సాయి గోల్డ్. తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయిన విడిపించి ఆ రోజు మార్కెట్ రేటుకి కొనబడును, స్పాట్‌క్యాష్. ✆ 94933 38823.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 73862 01191.

EENADU for Advertisement Contact: 8008597607

REAL ESTATE

FLAT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

3 BHK Flat అమ్మకం. రాజమండ్రి, మోరంపూడి జంక్షన్ వద్ద, హైవే ప్రక్కన 3 BHK Flat అమ్మకమునకు కలదు. Contact Cell: 98480 56558.

HOUSE FOR SALE

KAKINADA RURAL

కాకినాడ రూరల్, గంగనాపల్లి, సత్యదేవ గార్డెన్స్, సత్తెమ్మతాడి దగ్గర 243 చ||గ||ల స్థలంలో గల గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ నార్త్ ఫేసింగ్ ఇల్లు అమ్మకము. ✆ 98494 20475.

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ||ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

GENERAL

266 చ||గ|| స్థలం అమ్మకమునకు కలదు. ‘ఆదిత్య గ్రీన్‌సిటీ’ పెద్దాపురం, పాత పెద్దాపురం రోడ్, ప్లాట్‌నెం.159, E/F, 60 అడుగుల రోడ్ ఫ్రంట్, ఆసక్తి ఉన్నవారు సంప్ర: 99666 98999.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. Contact: 99490 00033.

JOBS

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్ మేన్ కావలెను. సంప్రదించవలసిన టైం: 9 am to 6 pm. Contact Cell: 95507 32122.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్), తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

రాజమండ్రిలోని శ్రీ గిరిధారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నందు పనిచేయుటకు CC Roadsలో అనుభవం కలిగిన వారు కావలెను. Contact Cell: 80991 91919.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-30 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గాంధీనగర్, కాకినాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాస ముగింపు సందర్భంగా ఈ నెల 20వ తేదీ గురువారం కాకినాడ సాగర తీరంలో లోక కల్యాణార్థం శ్రీమంగళాంబికా సమేత ఆది కుంభేశ్వరస్వామి వారి ఆలయం వద్ద మహా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భారత యజ్ఞపీఠం కమిటీ సభ్యులు తెలిపారు. కరపత్రాలను మంగళవారం ఆలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గోపూజతో ప్రారంభించి 1.08 కోట్ల శివలింగాలకు, పాదరస శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకించే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. 101 మంది కన్యలతో కలశాల ఊరేగింపు ఉంటుందని, మహా దేవుడి అభిషేక ద్రవ్యాలను సాగరంలో నిమజ్జనం చేస్తామని వివరించారు. ఆలయ అభివృద్ధి, శాశ్వతంగా శివలింగాల ఏర్పాటుకు రూ.10 లక్షల విరాళం అందజేయనున్నట్లు కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షులు(బాబి) ప్రకటించారు. కమిటీ సభ్యులు చిట్నీడి శ్రీనివాసు, బోగిరెడ్డి తాతారావు, గంగిరెడ్డి అరుణ, బూర్ల సత్యనారాయణమ్మ, ప్రసన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

20న సాగర తీరంలో మహా కుంభాభిషేకం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భారత యజ్ఞపీఠం కమిటీ సభ్యులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	19,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	111-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ఆ తండ్రి పసికందును చూడనేలేదు..

పాఠశాల బస్సు ఢీకొని ఇటుకబట్టీ నిర్వాహకుడి మృతి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెళ్లయిన రెండేళ్లకు జన్మించిన పుత్రికను చూడాలనే ఆత్రుత.. అంతలోనే తాత లోకం వదిలి వెళ్లారనే వార్త తెలిసి ఆ యువకుడు ఉక్కిరిబిక్కిరయ్యాడు. మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ యువకుడు ఈ లోకాన్ని వీడారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివీ.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన మొదలవలస సాయి(27) మామిడాడలో ఎనిమిదేళ్లుగా కుటుంబ సభ్యులతో ఉంటూ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఏలేశ్వరం మండలం అప్పనపాలెంలో ఇటుకబట్టీ వద్దకు చిన్నాన్నతో కలిసి వేర్వేరు మోటారు సైకిళ్లపై వెళుతున్నారు. మామిడాడ శివారు కల్యాణ్ చెరువు వద్దకు వచ్చేసరికి సాయి వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ప్రైవేటు స్కూలు బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయి (పాత చిత్రం)

పనులన్నీ చూసుకుని వస్తానని..

తిరుగుడుమెట్టకు చెందిన సాయికి హైమవతితో రెండేళ్ల కిందట పెళ్లైంది. ఆమె ప్రసవానికి పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 14న శుక్రవారం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో ఉన్న భార్య, చిట్టితల్లిని చూసేందుకు సాయి బయల్దేరగా ఇంతలోనే తాత ఆనందరావు(65) తీవ్ర అనారోగ్యానికి గురై ఈ నెల 15న శనివారం మృతిచెందారని తెలిసింది. దీంతో తాత అంత్యక్రియలు పూర్తిచేయగా ఈ నెల 25న దశదినకర్మ చేయాల్సిఉంది. భార్యకు చరవాణి ద్వారా విషయాన్ని తెలియజేసి అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక వచ్చి కుమార్తెను చూస్తానని చెప్పారు. మంగళవారం ఉదయం వ్యాపార లావాదేవీల నిమిత్తం అప్పనపాలెం వెళుతుండగా మృత్యువు పాఠశాల బస్సు రూపంలో కబళించింది. భార్యను, కూతుర్ని చూడకుండానే సాయి మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
డిస్ట్రిక్ట్ కలెక్టరేట్ బ్రాంచి (14401)-కాకినాడ
కాకినాడ-533004. ఫోన్: 0884-2348337

SARFAESI ACT, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

టు: తేది: 01-11-2025

(1) ఋణగ్రహీత: శ్రీ దెయ్యాల దుర్గా ప్రసాద్, తండ్రి: నల్లయ్య, డి.నెం. 3-10, సాయిబాబా గుడి దగ్గర, మాధవపట్నం, సామర్లకోట, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533005.
(2) సహ-హామీదారు (హౌసింగ్ లోన్): శ్రీమతి పొలప్రగడ వివి యస్‌యస్‌యల్ పద్మావతి, భర్త: రమణమూర్తి (లేటు), డి.నెం. 11-2-4, రామారావుపేట, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533003.
(3) కో-అప్లికెంట్ (టర్మ్‌లోన్ ఆస్తి): శ్రీమతి పొలప్రగడ వివి యస్‌యస్‌యల్ పద్మావతి, భర్త: రమణమూర్తి (లేటు), డి.నెం. 11-2-4, రామారావుపేట, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533003.
అమ్మా/అయ్యా,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(3)తో చదవబడే సెక్షన్ 13(2) క్రింద నోటీసు.
మా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వము ఆంధ్రాబ్యాంక్), డిస్ట్రిక్ట్ కలెక్టరేట్ శాఖ, కాకినాడ నుండి దిగువ రుణసదుపాయాలను మీలోని నెం.1 చిరునామాదారు మరియు మీలోని నెం.2 చిరునామాదారు అయిన ఋణగ్రహీత మరియు / లేదా సహహామీదారు / కో-అప్లికెంట్ అయిన మీరు వినియోగించుకున్నారు మరియు బకాయి / వాయిదా / వడ్డీ తిరిగి చెల్లించుటలో విఫలమైనందున / సదరు ఖాతాలు సంతృప్తికరంగా నిర్వహించ నందున ఇన్‌కమ్ రికగ్నిషన్ అండ్ ప్రుడెన్షియల్ అకౌంటింగ్ షరతుల ప్రకారం RBI మార్గదర్శకాల ననుసరించి మీ ఖాతా/లు 28-09-2025 నాటికి నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినవి. 31-10-2025 నాటికి మొత్తం రూ.19,75,100/- (అక్షరాల పంతొమ్మిది లక్షల డెబ్బై ఐదు వేల ఒక వంద రూపాయలు మాత్రమే) మీ ఖాతాలో బకాయిగా ఉన్నది. పైన పేర్కొన్న ఖాతా/లకు సంబంధించి మీరు బ్యాంకుకు చెల్లించాల్సిన మొత్తం వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

లిమిట్ యొక్క స్వభావం	లిమిట్ మొత్తం (రూ.లలో)	వర్తించే వడ్డీ రేటు (%p.a.)	బకాయి మొత్తము (రూ.లలో)
HOUSING LOAN 144030100014897	రూ.9,00,000/-	10.65%	రూ.8,93,137/-
PROPERTY TERM LOAN 144030100029668	రూ.11,00,000/-	11.45%	రూ.10,81,963/-
మొత్తము బకాయి:	రూ.20,00,000/-		రూ.19,75,100/

బ్యాంకుకు చెల్లించాల్సిన డబ్బు లేదా చెల్లించాల్సిన డబ్బును తిరిగి చెల్లించడానికి, మీరు బ్యాంకుకు అనుకూలంగా పత్రాలను రూపొందించారు మరియు క్రింద వివరించిన స్థిరాస్తుల తనఖా ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను సృష్టించారు:

ఆస్తి యొక్క వివరములు

తనఖాదారు యొక్క పేరు: శ్రీ దెయ్యాల దుర్గా ప్రసాద్, తండ్రి: నల్లయ్య.
పూర్వము తూర్పు గోదావరి, ప్రస్తుతము కాకినాడ జిల్లా, పూర్వము కాకినాడ యస్ఆర్‌ఓ, ప్రస్తుతము సర్పవరం యస్ఆర్‌ఓ, సామర్లకోట మండలం, మాధవపట్నం గ్రామము మరియు పంచాయతీ, జిరాయితీ స్థలము, సర్వే యస్.నెం.62/1 నందు 190.49 చ॥గ॥ విస్తీర్ణము మరియు అందులో డి.నెం. 3-10 కలిగిన ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. ఈ దిగువ హద్దులలో: తూర్పు: 37.2 అ॥ లేదా 11.32 మీ॥, దెయ్యాల అబ్బాయి యొక్క ఆస్తి; పడమర: 37.2 అ॥ లేదా 11.32 మీ॥, పంచాయతీ సిమెంట్ రోడ్డు; దక్షిణం: 45.6 అ॥ లేదా 13.87 మీ॥, ధండి పెంటయ్యకు చెందిన పెంకుటిల్లు; ఉత్తరం: 46.9 అ॥ లేదా 14.24 మీ॥, 6 అ॥ వెడల్పుగల ఉమ్మడి నడక మార్గము. ఈ పై హద్దుల మధ్యలోని అనుషంగిక, కస్టమరీ, సాధారణ మార్గాలు మరియు నీటి మార్గాలతో సహా.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) ననుసరించి ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా మీచే అమలు చేయబడిన లోన్ డాక్యుమెంట్లలో నియమ నిబంధనల ప్రకారం కాంట్రాక్చువల్ రేటుపంతున తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి మొత్తం రూ.19,75,100/- (అక్షరాల పంతొమ్మిది లక్షల డెబ్బై ఐదు వేల ఒక వంద రూపాయలు మాత్రమే) మొత్తాన్ని చెల్లించాల్సిందిగా మరియు మీ బకాయిలను పూర్తిగా చెల్లించాల్సిందిగా ఇందుమూలంగా మిమ్మల్ని కోరడమైనది. లేనిచో సదరు చట్టం క్రింద ఇవ్వబడిన ఏదైనా లేదా అన్ని హక్కులను వినియోగించుకొని పై సదరు సెక్యూరిటీలను స్వాధీనం చేసుకొనుట మాకు తప్పనిసరి అవుతుంది. చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, ఈ నోటీసు అందిన తర్వాత మీరు బ్యాంకు అనుమతి లేకుండా పై సెక్యూరిటీలను అమ్మకుండా లేదా వాటితో వ్యవహరించకుండా నిరోధించబడ్డారు / నియంత్రించబడ్డారు. మీ తరపున జారీ చేయబడిన మరియు స్థాపించబడిన బకాయి బిల్లులు, బ్యాంక్ గ్యారెంటీలు మరియు లెటర్ ఆఫ్ క్రెడిట్ క్రింద ఉత్పన్నమయ్యే బాధ్యతలను తిరిగి చెల్లించమని మిమ్మల్ని పిలవడానికి బ్యాంక్ తన హక్కులను కలిగి ఉంది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించు కొనుటకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI లోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను మీరు గమనించాలని కోరడమైనది.

తేది: 01.11.2025 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
ప్రదేశము: కాకినాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని రైతుబజార్లలో మంగళవారం నాటి ధరలిలా ఉన్నాయి.. టమాట- 27, వంకాయలు- 58, 66, 70, 80, బెండకాయలు- 66, పచ్చిమిర్చి- 45, 48, 54, కాకరకాయ- 50, బీర- 64, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 38, క్యారెట్- 66, దొండకాయలు- 66, బంగాళాదుంపలు- 23, 27, ఉల్లి- 22, 28, గోరుచిక్కుడు- 36, దోసకాయలు- 38, చిక్కుడు- 96, 110, చేమదుంపలు- 30, 36, బీట్‌రూట్- 50, కీరదోస- 40, బీన్స్‌కాయలు- 50, అల్లం- 70, క్యాప్సికం- 86, బొబ్బర్లు- 60,

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్- కాంత, ప్రిడేటర్, బాహుబలి ది ఎపిక్, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్- కాంత, ఆర్యన్, మాస్ జాతర, లక్ష్మి- శివ, సత్యగౌరి- గోపీ గాళ్ల గోవా ట్రిప్, తిరుమల- సంతాన ప్రాప్తిరస్తు, సిలంద్స్1- జటాధర, సిలంద్స్ 2- జిగ్రిస్, శ్రీప్రియ- మాస్ జాతర, పద్మప్రియ- ది గర్ల్‌ఫ్రెండ్, సూర్య1(వాకలపూడి)- మాస్ జాతర, సూర్య 2- జటాధర.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 - మ. 1 కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వీధి దీపం వెలగడం లేదు..

సమస్య: కాకినాడ శాంతినగర్‌లోని సంజీవ్‌రావు నగర్‌లో మూడు రోడ్ల కూడలి వద్ద వీధి దీపం వెలగడం లేదు. రాత్రి చీకటి కారణంగా మలుపులో వచ్చే వాహనాలు కనబడక ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు శాంతినగర్

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - అర్జున్, ఏఈ

కాలువ శుభ్రం చేయడం లేదు..

9వ డివిజన్ పరిధిలోని పళ్లంరాజునగర్ 5వ వీధిలో కాలువలు సరిగా శుభ్రం చేయడం లేదు. కాలువల్లో పిచ్చిమొక్కలతోపాటు చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇనుప స్తంభం తొలగించండి..

కాకినాడ గాంధీనగర్ ఇమిడి వారి వీధిలో శ్రీలక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదురుగా విద్యుత్ శాఖకు సంబంధించి ఇనుప స్తంభం నిరుపయోగంగా ఉంది. దీనిని ఆనుకుని మరొక స్తంభం ఉండడంతో చెట్ల కొమ్మల ద్వారా విద్యుత్తు తీగలు తగులుకునే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని తొలగించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అక్షరం.. వికాసం.. విజ్ఞానం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇందులో భాగంగా నగర వీధుల్లో పుస్తక పఠనంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులకు పోస్టర్ ప్రజంటేషన్‌తోపాటు వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. అరుదైన వాటితో పాటు మొత్తం 400 పుస్తకాలకు పైగా ఇక్కడ ఉన్నాయి. వాటిని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చి తిలకించి, వాటిలో విశేషాలను తెలుసుకుంటున్నారు.

ప్రదర్శనలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఎంతో బాగుంది

పుస్తక పఠనంతో ఎంతో విజ్ఞానం పెంపొందుతోంది. ఐదో తరగతి నుంచి గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకున్నాను. కేవలం పాఠశాలలో చదివే పుస్తకాలే కాకుండా ఇతర వాటిని చదివితే ఎంతో నేర్చుకోవచ్చు. ఏఎస్‌డీ కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన బాగుంది. - పి.భవ్య కారుణ్య, ఎనిమిదో తరగతి

ఎంతో నేర్చుకోవచ్చు..

పుస్తక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కళాశాలలో పాఠ్యాంశాలతో పాటు ఇతర పుస్తకాలు చదవడం ద్వారా చదువు విలువ తెలుస్తుంది. గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందుతుంది. మాలాంటి వారికి ఇలాంటి పుస్తక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయి. - కె.ప్రణతి, తొమ్మిదో తరగతి

ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

పుస్తకాలు చదివితే ఆలోచన శక్తి పెరుగుతుంది. ఏ సమస్య వచ్చినా సత్వరమే పరిష్కరించగలం. జ్ఞానం, తెలివి తేటలు పెరగడంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. ఇక్కడ అతి విలువైన, ముఖ్యమైన వాటిని అందుబాటులో ఉంచారు. పుస్తకాలతో పాటు, ప్రతిరోజు పత్రికలు చదవడం దినచర్యలో భాగం చేసుకున్నా. - ఓలేటి దేవి నూకాంబ, తొమ్మిదో తరగతి

భవిష్యత్తుకు పునాది

పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకున్నా. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పుస్తకాలు రాబోయే పరీక్షలకు, పోటీ పరీక్షలకు ఉపయోగపడతాయి. చిన్నతనం నుంచే అందరూ గ్రంథాలయాలకు వెళితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భవిష్యత్తుకు మంచి పునాది పడుతుంది. -కె.సాయి ధన జోహిత, తొమ్మిదో తరగతి

సైన్స్ సెంటర్‌పై కలెక్టర్ సమీక్ష

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ నిధులతో చేపట్టిన సైన్స్ సెంటర్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. 80 శాతం పనులు పూర్తయినా, మిగతా నిధులు విడుదల కాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలపై అన్వేషిస్తున్నారు. స్మార్ట్‌సిటీ, విద్యాశాఖ అధికారులు, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లతో మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్ సమీక్షించారు. సీఎస్ఆర్, ఇతర నిధులతో సైన్స్‌సెంటర్ పనులు పూర్తి చేయాలా..? పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలా..? అనే కోణంలో చర్చించారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఖజానాలో ఒక్కరూపాయి నిధులు లేవు. అప్పు చేసే అవకాశం లేదని భావిస్తున్నారు.

సమాజ సేవకు ప్రాధాన్యం

కాకినాడ నగరం: సమాజ సేవకు నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ప్రాధాన్యం ఇస్తోందని ఆ సంస్థ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పులి పద్మ కుమారి అన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి జన్మదినం సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బు, బత్తుల సూర్యప్రకాష్, అడపా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

కాకినాడ కలెక్టరేట్: స్థానిక 43వ డివిజన్‌లో మంగళవారం వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా నాయకుడు, మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, కోకా గిరి, కర్రి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

23న ఆలూరి విజయలక్ష్మి రచనలపై సాహితీ సమాలోచన

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత్రి, సామాజికవేత్త డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి రచనలపై ఈ నెల 23న ఆదివారం దంటు కళాక్షేత్రంలో సాహితీ సమాలోచన నిర్వహించనున్నట్లు మార్పు జానకిరామ్ చౌదరి, సిడ్ నిర్వాహకులు పద్మజావాణి తెలిపారు. జిల్లాలోని సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

'పంతం' సేవలు చిరస్మరణీయం

కాకినాడ కలెక్టరేట్: మాజీ మంత్రి పంతం పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పలు రాజకీయ పార్టీల నేతలు కొనియాడారు. మంగళవారం స్థానిక కల్పనకూడలిలోని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీమోహన్, జనసేన నాయకుడు ఆకుల వెంకటరమణ, తెదేపా నేత నులకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

విజేతలను అభినందిస్తున్న ఎంఈవో సుబ్బారావు తదితరులు

కరాటేతో ఆత్మరక్షణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఆత్మ రక్షణకు కరాటే విద్య అవసరమని అర్బన్ ఎంఈవో తాడి సుబ్బారావు అన్నారు. ఇంద్రపాలెంలో ఇటీవల నిర్వహించిన జాతీయ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక గాంధీనగర్ నగరపాలక సంస్థ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి టి.జశ్వంత్, 8వ తరగతి విద్యార్థి ఎన్.రేవంత్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వారిని ప్రధానోపాధ్యాయుడు ఎన్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు..

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రతిభా పోటీలతో మేధస్సుకు పదును పెరుగుతుందని విద్యాంజలి పాఠశాల కార్యదర్శి వి.సంధ్య, అకడమిక్ డైరెక్టర్ ఎం.జయ బాబు అన్నారు. కాకినాడ శశికాంత్‌నగర్‌లోని విద్యాంజలి స్కూల్‌లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై నిర్వహించిన ఉపన్యాసం(స్పీచ్) పోటీల్లో 7 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో బి.మేధ(8వ తరగతి) ప్రథమ, ఎ.ధర్మసాయి తేజ(10వ తరగతి) ద్వితీయ, ఎం.వైష్ణవి(9వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. ప్రిన్సిపల్ పి.ఫణీశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలతో పాఠశాల కార్యదర్శి సంధ్య

అన్న క్యాంటీన్ పరిశీలన

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ కేటీ సుధాకర్ మంగళవారం సంతచెరువులోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. పర్యటనలో భాగంగా పలు వార్డులు సందర్శించారు. అనంతరం క్యాంటీన్ వద్ద పరిశుభ్రత, తాగునీరు, ఇతర వసతులను పరిశీలించారు. అక్కడ అల్పాహారం తింటున్న వారితో మాట్లాడి రుచి, నాణ్యత, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఇక్కడ ఎటువంటి లోపాలు, సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జగన్నాథపురం, ఎంఎస్ఎస్ ఛారిటీస్ ప్రాంతానికి చెందిన కె.ఏసుబాబు(41) స్థానిక వెలిశెట్టివారివీధిలోని చెరువులో పడి ఉండగా స్థానికులు గుర్తించారు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని చికిత్సనిమిత్తం బంధువులు మంగళవారం ఉదయం జీజీహెచ్‌లో చేర్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సహకరించాలి

కాకినాడ నగరం: నగరంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్, నగర నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేటీ సుధాకర్ కోరారు. స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం రాజకీయ పార్టీ నాయకులు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితాల రూపకల్పన తదితర ప్రక్రియలకు సహకరించాలని కోరారు. అర్బన్ తహసీల్దారు జితేంద్ర, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఉప తహసీల్దారు కృష్ణకుమారి, పార్టీల నాయకులు తుమ్మల రమేష్, రావూరి వెంకటేశ్వరరావు, ఈవీవీ సత్యనారాయణ, సబ్బవరపు అప్పారావు, పి.శ్రీనివాసు, తోకల వరద రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాయకులు, అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ సుధాకర్

వసతిగృహం తనిఖీ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: గాంధీనగర్ మల్లయ్య అగ్రహారంలో సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహం-2ను మంగళవారం వసతి గృహ ప్రత్యేకాధికారి, జిల్లా మైక్రో ఇరిగేషన్ (ఏపీఎంఐపీ) అధికారి జీవీవీ ప్రసాదరావు మంగళవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో వసతుల తీరు, భోజన పదార్థాల నాణ్యతను ఆయన పరిశీలించారు. భోజనాన్ని రుచి చేశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాగునీరు.. రోడ్డుపాలు

కాకినాడ వెంకట్‌నగర్ ప్రధాన రహదారిలో కేకేఆర్ గౌతమ్ పాఠశాల వద్ద తాగునీరు వృథాగా పోతోంది. భూగర్భంలోని పైపులైన్ల లీకులతో గత కొద్దిరోజులుగా ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పడిపోతున్నా.. పట్టించుకోరా?

నగరపాలక సంస్థ పరిధిలోని 48వ డివిజన్ మధురానగర్ శివారు జనచైతన్య వంతెనకు సమీపంలోని ప్రజా విద్యాలయం రోడ్డులో విద్యుత్తు నియంత్రిక కూలిపోయే స్థితికి చేరింది. కాలువ గట్టుకు ఆనుకుని దీనిని ఏర్పాటు చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గట్టు కోతకు గురై ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిని వెంటనే సరిచేయకుంటే పెనుప్రమాదం తప్పదు. విద్యుత్తుశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. - న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

మధ్యలో గుంత.. తప్పని చింత

నగరం నడిబొడ్డున రామారావు పేట, నాగేశ్వరరావు వీధిలోని ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంత ప్రమాదభరితంగా మారింది. పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి కొండయ్యపాలెం పైవంతెనకు వెళ్లే ఈ మార్గంలో రాత్రిపూట గుంత కనపడక వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బాలాజీచెరువు

ప్రమాదకర ప్రయాణం

ఇటీవల అనేక ప్రమాదాలు జరుగుతున్నా ఇటు ఆటోడ్రైవర్లలో, అటు ప్రయాణికుల్లో ఎటువంటి మార్పు రావడం లేదు. ఓ ఆటో వెలుపల, వెనుక వైపు అధిక సంఖ్యలో మహిళలు కూర్చుని ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

పేరుకుపోయిన చెత్త

కాకినాడ వైఎస్ఆర్ వంతెన కింద రైలు పట్టాలకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఆ మార్గం గుండా నిత్యం ఎంతో మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దాంతో దుర్వాసన వెదజల్లుతోందని, కళ్లలో దుమ్ము పడుతుందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

శ్రీబాల వెంకటేశ్వరస్వామి ఆలయ స్థలానికి మోక్షం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ డెయిరీఫారం కూడలి సమీపంలో గల బాలవెంకటనగర్‌లోని ఓం శ్రీ బాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన స్థలానికి నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. వివరాలను ఆలయ ట్రస్టీ శ్రీరామ బాలవెంకటేశ్వర స్వామి మంగళవారం వెల్లడించారు. 1962లో బాలవెంకటేశ్వర స్వామి, శివాలయం, రామాలయాలను పితాని సూరయమ్మ కుటుంబసభ్యులు నిర్మించారని చెప్పారు. అవి శిథిలావస్థకు చేరుకోవడంతో 2018లో అప్పటి ఎమ్మెల్యే కొండబాబు నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అనంతరం వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కొండబాబు చొరవ తీసుకుని స్థలాన్ని ఆలయానికి తిరిగి అప్పగించారని తెలిపారు. ఈ స్థలంలో రామాలయం, వెంకటేశ్వరస్వామి, యాగశాల, నవగ్రహాలు తదితర ఆలయాలను నిర్మిస్తామని పేర్కొనానరు. సమావేశంలో వెంకట నాగేశ్వరీ, మంగ లక్ష్మి, త్రిలోక సత్యనారాయణ, దుర్గా జయంతి, జి.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. దీపోత్సవం

గాంధీనగర్, న్యూస్‌టుడే: మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దుగ్గిరాల వారి వీధిలో కొలువైన శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శివలింగాకారంలో దీపాలు అలంకరించి, దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు బెజవాడ బాబ్జి, నల్లూరి శ్రీనివాసు, వెంకన్నబాబు, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ జగన్నాథపురం 17వ డివిజన్‌లో కోటి స్తంభంపేటలోని ధనమ్మతల్లి గుడి వద్ద సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటి దీప మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి బడే వెంకటకృష్ణ, ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పినిశెట్టి సురేష్, ఫౌండేషన్ సభ్యులు పిడకా శేషు, రామశేషు, సురేష్, సతీష్, సత్తిబాబు, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తలాటం హరీష్

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఏ మైదానంలో అండర్-14, 17 ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, అండర్-14 వాలీబాల్ బాలబాలికల ఎంపికలు మంగళవారం జరిగాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసరావు, పి.సుధారాణి తెలిపారు. మొత్తం 1500 మంది బాలబాలికలు హాజరయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, పీడీలు లంకా జార్జి, వి.రవిరాజు, బంగారాజు, పట్టాభిరామం, శ్రీనివాసరావు, గిరి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

గాంధీనగర్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగంలో జరిగిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత టీచర్ సత్యనారాయణ, మెహర్ గంగాధర్ వ్యవహరించారు. ఉప గ్రంథాలయాధికారి కిషోర్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. గాంధీనగర్, రామకృష్ణారావు పేట, జగన్నాథపురం గ్రంథాలయాల్లోనూ పోటీలు జరిగాయి.

పోటీల్లో ప్రసంగిస్తున్న విద్యార్థిని

కాకినాడ నగరం: పుస్తక పఠనం మంచి లక్షణమని జిల్లా ఇన్‌ఛార్జి ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రపాలెం ఐడియల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం 'గ్రంథాలయాల ప్రాముఖ్యం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. కిషోర్ మాట్లాడుతూ పత్రికలు, పుస్తకాలు చదవటం ద్వారా ఎవరూ దోచుకోలేని విజ్ఞానం సొంతమవుతుందన్నారు. ప్రిన్సిపల్ డా.టి.సత్యనారాయణ, కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్, అకడమిక్ డైరెక్టర్ రంజిత్, ఎస్.సాయి సత్యనారాయణ, ఎస్.దుర్గారావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: పరీక్షలంటే భయం వద్దని వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎండీ అబ్దుల్ అజీజ్ సూచించారు. ఇష్టంతో చేసే ప్రతి పని కష్టంగా ఉండదని పేర్కొన్నారు. స్థానిక ఆనందభారతి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీజే సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు అజీజ్ హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తలపెట్టిన పనిని సాధిస్తామనే ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయిని సుబ్బలక్ష్మి, విద్యా కమిటీ ఛైర్మన్ స్వాతి, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ఎండీ హలీమ్, కార్యదర్శి ఉస్మాన్‌షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SINGANAMALLI NAGA RAJESWARI Wife of VOLETI DHARMA RAJU Resident of Door. No. 38-4-25/1, Tilak Street, Kakinada Urban, Kakinada District, Andhra Pradesh. I have changed my Name from NAGA RAJESHWARI VOLETI (Old Name) to SINGANAMALLI NAGA RAJESWARI (New Name) Hence I am being called SINGANAMALLI NAGA RAJESWARI (New Name) W/o VOLETI DHARMA RAJU for all Purposes.

ఆత్మాభిమానం నిలిచేదెలా..?

ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో నిరుపయోగంగా మరుగుదొడ్లు

కాకినాడలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వీటితోపాటు ఆర్టీవో కార్యాలయం, గొడారిగుంట ప్రధాన రహదారి, పాతబస్టాండ్ కూడలి, జీజీహెచ్ ఎదుట తదితర ప్రాంతాల్లో రహదారుల పక్కన ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల పరిస్థితి ఇలానేఉంది. నిర్వహణ కొరవడటం, శుభ్రం చేయకపోవడం, కుళాయి మూతలు పనిచేయకపోవడం, ట్యాంకుల్లో నీరు ఉంచకపోవడంతో అవి అధ్వానంగా కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం కాకినాడకు వేలాదిగా వచ్చేవారంతా యాతనపడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాల్సిఉంది. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్(కాకినాడ)

జనగణనలో కులగణన చేపట్టాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేశంలో చేపట్టే జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరం నినాదంతో ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తోకల ప్రసాద్, పెద్దిరెడ్డి సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, ఎ.భవానీ, కేవీ రామయ్య, ఎన్.అనిల్‌కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీపీఐ కార్యకర్తలు

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు, ట్రాఫిక్-1 సీఐ రమేష్ తెలిపారు. మంగళవారం కాకినాడ కొండయ్యపాలెంలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమంలో ఉన్న అంధులకు, వికలాంగులకు, వృద్ధులకు నషాముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఉచిత వినికిడి మరియు మాట సంబంధిత సమస్యలకు
అనుభవజ్ఞులైన డాక్టర్లచే పరీక్షలు
డా॥ కనుమూరి బాలకిరణ్, M.S. (ENT)
తమిళనాడు గోల్డ్ మెడలిస్ట్
ది.20-11-2025 నుండి 22-11-2025 వరకు
టైమింగ్స్: ఉ॥ 9 గం॥ల నుండి 1 వరకు మరియు సా॥ 5 గం॥ల నుండి 8 గం॥ల వరకు
ముందుగా పేరు నమోదు చేసుకోవలెను
- వినికిడి సంబంధిత సమస్యలకు డా॥ బాల కిరణ్ గారిచే ఉచిత కన్సల్టేషన్
- ఉచితంగా వినికిడి పరీక్షలు చేసి వినికిడి మిషన్ల ట్రయిల్స్ ఇవ్వబడును
- మాట మరియు స్వర సంబంధిత సమస్యలకు స్పీచ్ పాథాలజిస్ట్‌చే సలహాలు, సూచనలు
- మీరు ఉపయోగిస్తున్న పాత వినికిడి మిషన్లు ప్రోగ్రామింగ్ చేయబడును
శ్రీ బాల చెవి, ముక్కు, గొంతు హాస్పటల్
సెలెక్టెడ్ వినికిడి పరికరాల మోడల్స్‌పై 30-40% డిస్కౌంట్
చందన బ్రదర్స్ వెనుక, దంటు వారి వీధి, కాకినాడ. ఫోన్: 0884-2385499, 95733 36399

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన

కాజులూరు, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో అభివృద్ధి దిశగా సాగేందుకు పచ్చదనం, పరిశుభ్రత అత్యంత ముఖ్యమైన అంశాలుగా నిలుస్తాయని డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణి రావు తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పచ్చదనం పరిశుభ్రతపై మంగళవారం ప్రారంభించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఆరోగ్య జీవన విధానం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పరిశుభ్రతపై సూచనలు చేశారు. శిక్షకులు కె.సూరిబాబు, బత్తిన హేమాదేవి ఆయా అంశాలను వివరించారు.

జ్ఞాన సముపార్జనకే గ్రంథాలయాలు

కాజులూరు, న్యూస్‌టుడే: ప్రజల్లో జ్ఞానం, చైతన్యం సృజనాత్మకత పెరగాలంటే గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా సాధ్యమవుతుందని జిల్లా పరిషత్తు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం చింతా నారాయణమూర్తి అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, యువత ప్రతిభను వెలికితీసేందుకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సమస్యల వలయంలో జగనన్న కాలనీలు

పరిశీలన

పెద్దాపురం, సామర్లకోట న్యూస్‌టుడే: గత వైసీపీ ప్రభుత్వం ఆదరా బాదరాగా ఇళ్ల పట్టాలు మంజూరుచేసి నిర్మాణాలు చేపట్టింది. మౌలిక వసతి కల్పనపై ఏ మాత్రం దృష్టిసారించకపోవడంతో జగనన్నకాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న పెద్దాపురం నియోజకవర్గంలోని పెద్దాపురం మండలం, సామర్లకోట పట్టణంలోని కాలనీవాసులు మురుగు, రహదారుల సమస్యలతో సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

✦ సామర్లకోట పట్టణ పరిధి జి.రాగంపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన జగనన్నకాలనీలో 2,440 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 1400 పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కాలనీలో రహదారులు, మురుగు నీటి వసతి సౌకర్యాలు కల్పించకపోవడంతో కాలనీలోని రహదారులపై, ఖాళీ స్థలాల్లో మురుగు నీరంతా చేరిపోతోంది. దీంతో దోమలు పెరిగిపోయి అనారోగ్యం బారిన పడుతున్నారు.

✦ పెద్దాపురం నుంచి సామర్లకోట రహదారిలో జి.రాగంపేట గ్రామానికి చెందిన లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేశారు. 206 ప్లాట్లకుగాను 104 మంజూరు చేశారు. ఇందులో 78 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి రూఫ్, బేస్‌మెంట్ నిర్మాణంలో ఉన్నాయి. రహదారులు, మురుగు నీటి సౌకర్యాలు లేకపోవడంతో ఇళ్ల ముందు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగు నీటిని నిల్వ ఉంచుకోవాల్సిన దుస్థితి పట్టింది.

సామర్లకోట పట్టణ పరిధిలోని జగనన్నకాలనీలో రహదారిపై మురుగు నీరు

సమస్యల పరిష్కారానికి చర్యలు

కాలనీల్లోని సమస్యలను తీర్చడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మౌలిక వసతులు కల్పనకై చర్యలు చేపడతాం.

- శ్రీవిద్య, కమిషనర్, సామర్లకోట, సూర్యనారాయణ, ఎంపీడీవో, పెద్దాపురం

డిగ్రీ ప్రవేశాలకు అవకాశం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ప్రభుత్వం మరోక అవకాశం కల్పించిందని ప్రిన్సిపల్ డా.పి.సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వరకు స్పాట్లు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, కెమిస్ట్రీ, జువాలజీ, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ ఎకనామిక్స్‌లో సీట్లు ఉన్నట్లు చెప్పారు.

20న నేత్ర శిబిరం

పెదపూడి: పెదపూడి సత్యసాయి సేవాకేంద్రంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవా కేంద్రం కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు మంగళవారం తెలిపారు. శిబిరంలో కంప్యూటర్ ద్వారా పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు.

'పదో' తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

గొల్లప్రోలు: పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన పాఠశాలలను విద్యాశాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గొల్లప్రోలులోని జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, మాధురీ విద్యాలయ, చేబ్రోలు, తాటిపర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంఈవో శ్రీనివాసరావు, ఎంఈవో 2 శివప్రసాద్ పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి వసతి వంటి వాటిని పరిశీలించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయంలో భక్తులు అందజేస్తున్న నిత్యాన్నదానానికి ఓ దాత విరాళం అందజేశారు. మంగళవారం కాకినాడకు చెందిన కొరిపిళ్ల కాశీవిశ్వనాథం దంపతులు ఆలయానికి వచ్చి ఈవో నీలకంఠానికి రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఆలయ ఈవో వారికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రెండో రోజు గొల్లప్రోలులో మంగళవారం ఉదయం పర్యటించి వార్డులవారీగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ పాల్గొన్నారు.

✦ గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్ పై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సలాట్ రాజు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

కాపుల అభ్యున్నతికి కృషి

పిఠాపురం, న్యూస్‌టుడే: కాపుల ఆర్థిక ఉన్నతికి రుణాలు అందించేలా, ఉద్యోగాల కోసం శ్రమించే యువతకు అండగా నిలుస్తానని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి తెలిపారు. మంగళవారం పిఠాపురం జనసేన నాయకులు ఆమెను కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. కాపులు ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించారు. లక్ష్మి మాట్లాడుతూ..తొలిసారి కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పిఠాపురానికి చెందిన మహిళకు అవకాశం కల్పించిన పవన్ కల్యాణ్‌కు రుణపడి ఉంటానన్నారు. బాలిపల్లి రాంబాబు, రెడ్డెం జనార్దన్, జ్యోతుల సతీష్, జవ్వాది జోగేశ్వరరావు, కరెడ్ల తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మిని సత్కరిస్తున్న జనసేన నాయకులు

అగ్నికుల క్షత్రియుల అభినందన సభ

తాళ్లరేవు: అగ్నికుల క్షత్రియుల సంక్షేమం, అభ్యున్నతే తెదేపా లక్ష్యమని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు అన్నారు. తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ పరిధి పెదవలసలలో 343 మంది అగ్నికుల క్షత్రియులకు ఓఎన్జీసీ పరిహారం విడుదల కావడంపై అభినందన సభ మంగళవారం నిర్వహించారు. లంకే నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాడ్రేవు వీరబాబు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మందాల గంగసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పెసింగి ఈశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్ పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కృషి ఫలితంగా ఒక్కొక్కరికీ రూ.63,250 చొప్పున రూ.2.16 కోట్లు విడుదలైందన్నారు. ఎస్. కామేశ్వరరావు, బి.వీరబాబు, బి.శ్రీను పాల్గొన్నారు.

పెదవలసలో మాట్లాడుతున్న బీసీసెల్ అధ్యక్షుడు వీరబాబు

వ్యాపార అభివృద్ధిపై అవగాహన

సామర్లకోట: ప్రతి ఇంటి నుంచి వ్యాపారవేత్తలు తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ఎస్ గణపతి అన్నారు. మంగళవారం సామర్లకోట టీటీడీసీలో వ్యాపార అభివృద్ధి సర్వీస్ ప్రొవైడర్స్ ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యాపార పథకాలు, సాంకేతిక, ఆర్థిక, బ్యాంకు రుణాలు, సబ్సిడీ వంటి వాటిని వివరిస్తూ వ్యాపార అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఐఎల్‌వో మాస్టర్ ట్రైనీ చరణ్‌సంజీవ్, ఎస్బీఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ ఎ.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం వైపు గురిపెట్టాలి

పెద్దాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యం వైపు గురిపెట్టి విజయం సాధించాలని పెద్దాపురం సీఐ విజయ శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక సాగర్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిమ్మల్ని బాగా చదివించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని మీ తల్లిదండ్రులు కలలు కంటారని, వారి కలలను సాకారం చేయడానికి మీరంతా బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు. మీపట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే మా దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఎస్సై మౌనిక పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ విజయ శంకర్

రైతు సంక్షేమానికి పెద్దపీట

కరప: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే నానాజీ పేర్కొన్నారు. కరపలో మంగళవారం ఆయన యాంత్రీకరణ పథకంలో భాగంగా కొరిపల్లి, గొర్రిపూడి, కరప గ్రామాలకు చెందిన గ్రూపు రైతులకు రూ.39.20 లక్షల విలువ చేసే 4 డ్రోన్లను పంపిణీ చేశారు. అనంతరం కూరాడలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఏడీఏ బాబూరావు, ఏవో సత్య తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట గ్రామీణం: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ తుమ్మల పద్మజ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉండూరు రైతు సేవా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌కు చెందిన ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతుకు 48 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు.

కరపలో డ్రోన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

ఉండూరులో రైతులతో మాట్లాడుతున్న డైరెక్టర్ పద్మజ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెదపూడి: సంపర జడ్పీ పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థి సిరిశెట్టి సూర్యనారాయణ లాంగ్ జంప్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎస్.ఎన్ మూర్తి మంగళవారం తెలిపారు. అండర్-17 విభాగంలో జిల్లాస్థాయిలో 5.54 మీటర్లు లాంగ్‌జంప్ చేయడం ద్వారా ఎంపికైనట్లు వివరించారు.

చంద్రంపాలెం విద్యార్థి..

సామర్లకోట గ్రామీణం: చంద్రంపాలెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దేవిశెట్టి వెంకట దుర్గా రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. అండర్-17 పరుగుపందెంలో 100, 200 మీటర్ల దూరాల్లో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించడం వల్ల ఎంపికైనట్లు పీఈటీ వీరబాబు, హెచ్ఎం భాస్కర్ తెలిపారు.

విద్యుత్తు వినియోగదారుల సదస్సు రేపు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం విద్యుత్తు ఉప కేంద్రం వద్ద గురువారం వినియోగదారుల సదస్సు జరుగుతుందని డీఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్తు సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

దస్తావేజులు పడిపోయినవి

[illegible]

Cell: 81216 28225

ఆ'గండి'.. బాగుచేయండి

పిఠాపురం-గొల్లప్రోలు సరిహద్దు పిడిందొడ్డి వద్ద ఇటీవల వరదలకు గట్టు కోతకు గురైంది. నీరు అధికగా ప్రవహించడంతో ఎదురుగా జాతీయ రహదారి సైతం దెబ్బతింది. గండి పూడ్చకుంటే ఏలేరు నీరు ఉద్ధృతికి గట్టు పూర్తిగా తెగిపోయే ప్రమాదం ఉంది. జలవనరులశాఖ ఏఈ ప్రసన్నకుమార్ గండ్లు పూడ్చివేతకు అవసరమైన నిధులు ప్రతిపాదనలు పంపామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

ఛిద్రమైన కల్వర్టు గోడలు

పట్టణంలో వివిధ ప్రాంతాల్లో కల్వర్టు గోడలు ఛిద్రమై ప్రమాదకరంగా ఉన్నాయి. రామారావుపేట, వరహాలయ్యపేట, నువ్వులగుంటవీధి, కబడ్డీ వీధి ప్రాంతాల్లో నిర్మించిన గోడలు శిథిలావస్థదశకు చేరుకున్నాయి. అదుపుతప్పితే కాలువలోకి దూసుకుపోయే ప్రమాదం నెలకొందని వాహనదారులు చెబుతున్నారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మరమ్మతులు చేయిస్తామన్నారు. –న్యూస్‌టుడే, పెద్దాపురం

కోతకు గురైన రోడ్డుతో ప్రమాదాలు

గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట శివారు రహదారి మలుపులో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. తాటిపర్తి నుంచి చినజగ్గంపేట మీదుగా దొంతమూరు, ధర్మవరం గ్రామాలకు వెళ్లే రహదారిలో రోడ్డు కోతకు గురవ్వడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పరిశీలించి చర్యలు చేపడతామని ఏఈ లోవరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ట్యాంకులు శుభ్రం చేసేదెన్నడు..?

సిరిపురంలో మంచినీటి ట్యాంకు వద్ద శుభ్రపరిచే వేళల వివరాలు నమోదు చేయకపోవడంపై గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ప్రతి నెలా సక్రమంగా ట్యాంకును శుభ్రం చేయకుండా గాలికొదిలేస్తున్నారని వాపోతున్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావుకు తెలుపగా కార్యదర్శులతో మాట్లాడి వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన లారీలు

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట బ్రౌన్‌పేట సెంటర్‌లో గ్యాస్ సిలిండర్లను తీసుకెళ్తున్న మోటారు సైకిల్‌ను రెండు లారీలు ఢీ కొట్టిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం గ్యాస్ సిలిండర్లు డెలివరీ ఇచ్చేందుకు సాయినగర్‌కు చెందిన శివ మోటారు సైకిల్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణంలో పిఠాపురం నుంచి వస్తున్న లారీ అతడిని ఢీ కొట్టింది. అదే సమయంలో పిఠాపురం వైపు వెళుతున్న మరో లారీ అదే మోటారు సైకిల్ ఢీ కొట్టడంతో నుజ్జునుజ్జయ్యింది. శివ ద్విచక్రవాహనంపై నుంచి పక్కకి పడిపోవడంతో గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో నుజ్జయిన మోటారు సైకిల్

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పార్టీ నాయకులు, జనసైనికులను కలుపుకొని జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని సమన్వయ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నివాసంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడిగా ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కమిటీ సభ్యులుగా ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుతోపాటు కిషోర్ కొనసాగుతారు.

బాధ్యతలు చేపడుతున్న కిషోర్

అయిదుగురి కమిటీలో బీసీలను చేర్చాలి

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నియమించిన ఫైవ్‌మెన్ కమిటీలో ఒకే సామాజిక వర్గానికి చెందినవారినే కాకుండా బీసీలను కూడా చేర్చాలని ఆ పార్టీ నాయకుడు కండెల్లి నూకరాజు ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం నుంచి పవన్‌కల్యాణ్ గెలిపించేందుకు అన్ని సామాజిక వర్గాలు ఎంతో కృషి చేశాయన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కరప: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మెర్ల వీరయ్యచౌదరి, డా. వెంకన్నరావు సూచించారు. వేళంగిలో మంగళవారం లయన్స్‌క్లబ్ వేళంగి అధ్యక్షుడు పాతూరి శ్రీహరిచౌదరి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి పలువురికి మందులు పంపిణీ చేశారు. సీతారామప్రసాద్, ఆదేశ్, భాస్కర్‌రామన్, రంగారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పిఠాపురం పురపాలక కార్యాలయంలో సంఘ ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్స్ అగర్వాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉద్యోగులతో పాటు సంఘ కమిషనర్ రాజు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది త్రినాథ్, హేమంత్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'అలా మొదలైంది' చిత్ర బృందం పూజలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం చేబ్రోలు, దుర్గాడ శివాలయాల్లో 'అలా మొదలైంది' చిత్ర బృందం మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించింది. సినిమా దర్శకుడు మహేష్‌చంద్ర, నిర్మాత ఆకుల సురేష్ పటేల్, మురళీకృష్ణ, శ్రీరామ్, జనసేన నాయకుడు డాక్టర్ బి.ఎన్.రాజు, వెంకటరమణ, చిత్రబృందం పాలొన్నారు.

చేబ్రోలు శివాలయంలో దర్శకుడు, నిర్మాత, తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 — మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325, పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కరప మండలం కూరాడ శివారు చినమామిడాడ బీసీపేటలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. - సత్యం

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు. – న్యూస్‌టుడే, కరప

సమస్య: కాకినాడ అర్బన్ రమణయ్యపేట బోటుక్లబ్ వీధిలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. - సత్యనారాయణ

పరిష్కారం: పారిశుద్ధ్య బాధ్యుడు జగన్‌కు చెప్పగా కార్మికులతో వెంటనే పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, రమణయ్యపేట

సమస్య: కొత్తపల్లి ముత్యాలమ్మ గుడి వీధిలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపి చెత్త తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: గొల్లప్రోలు దేవీనగర్‌లో వ్యర్థాలతో కాలువ నిండి మురుగు నీరు ప్రవహించడంలేదు. -స్థానికులు

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పిఠాపురం పల్లపువీధి రామాలయం నుంచి ఉప్పాడ సెంటర్‌కు వెళ్లే మార్గంలో డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. -రాంబాబు

పరిష్కారం: ఏఈ అభిలాష్‌కు చెప్పగా డ్రెయినేజీలపై కల్వర్టులకు బాగుకు చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామి

పెదపూడి సోమేశ్వరస్వామి

సర్పవరం, పెదపూడి: కాకినాడ అర్బన్ ఆర్టీసీకాలనీ ఆలయ సముదాయంలోని పార్వతీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయం మంగళవారం రాత్రి భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు నందిబాబు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ✦ పెదపూడి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో మంగళవారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

కొత్తపల్లి: కొత్తపల్లి పంచాయతీ రవీంద్రపురం శివాలయంలో కార్తిక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ఏకాదశ ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా డ్రైఫ్రూట్స్, తేనె, చెరకురసం, వట్టివేళ్లు, విభూధి వంటివాటితో అభిషేకం చేశారు.

కాకినాడ అర్బన్ ఆర్టీసీకాలనీ త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉచిత వినికిడి మరియు మాట సంబంధిత సమస్యలకు
అనుభవజ్ఞులైన డాక్టర్లచే పరీక్షలు
డా॥ కనుమూరి బాలకిరణ్, M.S. (ENT)
తమిళనాడు గోల్డ్ మెడలిస్ట్
ది.20-11-2025 నుండి 22-11-2025 వరకు
ముందుగా పేరు నమోదు చేసుకోవలెను
[illegible]
శ్రీ బాల చెవి, ముక్కు, గొంతు హాస్పిటల్
సెలెక్టెడ్ వినికిడి పరికరముల మోడల్స్ పై 30-40% డిస్కౌంట్
[illegible] కాకినాడ. ఫోన్: 0884-2385499, 95733 36399

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — డిస్ట్రిక్ట్ కలెక్టరేట్ బ్రాంచి (14401)-కాకినాడ, కాకినాడ-533004, ఫోన్: 0884-2348337

SARFAESI ACT, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీస్

తేది: 01-11-2025

[illegible]

లిమిట్ యొక్క స్వభావం	లిమిట్ మొత్తం (రూ.లలో)	వర్తించే వడ్డీ రేటు (%p.a.)	బకాయి మొత్తము (రూ.లలో)
HOUSING LOAN 144030100031098	రూ.10,50,000/-	8.7%	రూ.10,28,922/-

బ్యాంకుకు చెల్లించాల్సిన డబ్బు లేదా చెల్లించాల్సిన డబ్బును తిరిగి చెల్లించడానికి, మీరు బ్యాంకుకు అనుకూలంగా పత్రాలను రూపొందించారు మరియు క్రింద వివరించిన స్థిరాస్తుల తనఖా ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను సృష్టించారు:

ఆస్తి యొక్క వివరములు

తనఖాదారు యొక్క పేరు: శ్రీమతి చత్ర శిరోమణి, భర్త: చత్ర ఇమ్మానుయేల్.

తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా), తాళ్ళరేవు యస్ఆర్ఓ, కరప మండలం, వేములవాడ మాదుపూల గ్రామము, పలసపాకల గ్రామము, టి.యస్.నెం.160/1 నందు 240.60 చ॥గ॥ విస్తీర్ణము మరియు అందులో డి.నెం. 2-27 కలిగిన ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. ఈ దిగువ హద్దులలో: తూర్పు: 38 అ॥, చత్ర వీరన్నకు చెందిన స్థలము; పడమర: 38 అ॥, మెయిన్ రోడ్డు; దక్షిణం: 57 అ॥, చత్ర కృష్ణమూర్తికి చెందిన స్థలము; ఉత్తరం: 57 అ॥, మెయిన్ రోడ్డు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) ననుసరించి ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా మీచే అమలు చేయబడిన లోన్ డాక్యుమెంట్లలో నియమ నిబంధనల ప్రకారం కాంట్రాక్చువల్ రేటుపంతున తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి మొత్తం రూ.10,28,922/- (అక్షరాల పది లక్షల ఇరవై ఎనిమిది వేల తొమ్మిది వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే) మొత్తాన్ని చెల్లించాల్సిందిగా మరియు మీ బకాయిలను పూర్తిగా చెల్లించాల్సిందిగా ఇందుమూలంగా మిమ్మల్ని కోరడమైనది. లేనిచో సదరు చట్టం క్రింద ఇవ్వబడిన ఏవైనా లేదా అన్ని హక్కులను వినియోగించుకొని పై సదరు సెక్యూరిటీలను స్వాధీనం చేసుకొనుట మాకు తప్పనిసరి అవుతుంది. చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, ఈ నోటీసు అందిన తర్వాత మీరు బ్యాంకు అనుమతి లేకుండా పై సెక్యూరిటీలను అమ్మకుండా లేదా వాటితో వ్యవహరించకుండా నిరోధించబడ్డారు / నియంత్రించబడ్డారు. మీ తరపున జారీ చేయబడిన మరియు స్థాపించబడిన బకాయి బిల్లులు, బ్యాంక్ గ్యారెంటీలు మరియు లెటర్ ఆఫ్ క్రెడిట్ క్రింద ఉత్పన్నమయ్యే బాధ్యతలను తిరిగి చెల్లించమని మిమ్మల్ని పిలవడానికి బ్యాంక్ తన హక్కులను కలిగి ఉంది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించు కొనుటకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI లోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను మీరు గమనించాలని కోరడమైనది.

తేది: 01.11.2025 ప్రదేశము: కాకినాడ — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేడు అన్నదాత సుఖీభవ సాయం

తొండంగి: అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా పీఎం కిసాన్ రైతుల ఖాతాల్లో బుధవారం రెండో విడత నగదు జమ చేయనున్నట్లు ఏవో పద్మశ్రీ మంగళవారం తెలిపారు. మండలంలో 27,617 మంది రైతులకు రూ.18.66 కోట్లు జమ చేస్తారన్నారు. మొదటి విడత రెండో విడత కలిపి రైతులకు రూ.36.75 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు

శంఖవరం, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి గాంధీ అన్నారు. మండలంలోని వేళంగి, ధారమల్లాపురం గ్రామాల్లో మంగళవారం రైతులకు ఆయన అవగాహన కల్పించారు. రాగి, వరి, కంది, ప్రత్తి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రూ.11 కోట్ల రుణాలు

తుని గ్రామీణం: పీఏసీఎస్‌ల ద్వారా నియోజకవర్గంలో రూ.11 కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు జిల్లా సహకార సొసైటీ అనుమతులు ఇచ్చినట్లు ఎస్.అన్నవరం సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు తెలిపారు. ఎస్.అన్నవరం, ఎస్‌ఏ పట్నం(తేటగుంట), కోటనందూరు సొసైటీల ద్వారా రైతులకు రుణాలు అందించేందుకు ఎమ్మెల్యే దివ్య ప్రోత్సాహంతో రుణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు.

ఏలేశ్వరంలో వ్యాసరచన పోటీలు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు పోటీలు దోహదం చేస్తాయని గ్రంథాలయాధికారి కె.సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలో శ్రీ సత్యనారాయణ పబ్లిక్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, గురుకులాలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

బస్‌షెల్టర్‌ను శుభ్రం చేయించరూ..!

సమస్య: మండలంలోని యర్రవరం హైవే కూడలిలో నిర్మించిన బస్ షెల్టర్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. శుభ్రం చేయించాలి. – వీరబాబు, యర్రవరం.

సమాధానం: ప్రయాణికులు కూర్చొనేందుకు అనువుగా నిత్యం సిబ్బంది శుభ్రం చేయిస్తాం. సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిస్తాను. – వీర్రాజు అప్పలరాజు, సర్పంచి, యర్రవరం. న్యూస్‌టుడే, ఏలేశ్వరం

సీసీ రహదారులు నిర్మించాలి

సమస్య: సీతంపేట గ్రామంలో కాలనీ వద్ద సరైన రోడ్డు లేక ఇబ్బందిగా ఉంది. సీసీ రహదారులు నిర్మించాలి. – రమణ, స్థానికుడు.

సమాధానం: గ్రామంలో ఇప్పటికే చాలాచోట్ల సీసీ రహదారులు నిర్మించాం. త్వరలోనే మిగిలినవి పూర్తి చేస్తాం. – చాందిని, కార్యదర్శి, సీతంపేట. న్యూస్‌టుడే, శంఖవరం

ఆక్రమణలతో బక్కచిక్కుతున్న రోడ్లు

జగ్గంపేటలో ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గ్రామ కంఠాలు, విలువైన స్థలాలను కబ్జాచేసి యథేచ్ఛగా దుకాణాలు నిర్మిస్తున్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్ నుంచి గోకవరం ప్రధాన రహదారిని అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న రోడ్డు ఆక్రమణలతో బక్కచిక్కుతుంది. ఇప్పటికే ఈ రోడ్డుకు రెండువైపులా పక్కా డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. దుకాణాలు నిర్మించిన చోట వక్రత జరిపి కాలువ నిర్మిస్తున్నారు. ఆక్రమణలు తొలగించకుండా రోడ్డు నిర్మాణం చేపడితే భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బంది తప్పదని పలువురు పేర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ సమయంలో రెండువైపులా మార్కింగ్‌లు ఇచ్చినా దుకాణ యజమానులు నాయకుల అండదండలతో నిమ్మకున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి ఈ రోడ్డు నిర్మాణ విషయంలో ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

హెల్పింగ్ యూత్ సభ్యుల సాయం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరానికి చెందిన హెల్పింగ్ యూత్ సభ్యులు మంగళవారం ఔదార్యాన్ని చాటుకున్నారు. ఏలేశ్వరం పట్టణానికి చెందిన పంతం సత్యనారాయణ గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. ఆయన తల్లి అనారోగ్యానికి గురయ్యారు. హెల్పింగ్ యూత్ సభ్యులు మంగళవారం బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు, రూ.వెయ్యి నగదు, పండ్లు ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో షేక్ ఆలీషా, రాంలాల్, మద్దుల స్వరూప్, పర్వత శివ, షేక్ ఆలీ తదితర యూత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. యువకులను స్థానికులు అభినందించారు.

క్వారీల్లో నిబంధనలు బేఖాతరు..!

రోడ్లు ఛిద్రం.. గ్రామస్థులకు భయం

రౌతులపూడి, న్యూస్‌టుడే: క్వారీలు, క్రషర్ల నుంచి భారీ వాహనాలు రోడ్లపైకి దూసుకొస్తున్నాయి. వాటితో రోజూ మండలవాసులకు నరకయాతనే. మండల కేంద్రం నుంచి కత్తిపూడి, తేటగుంట వైపుగా వెళ్లే రోడ్లు ధ్వంసమయ్యాయి. ఓ పక్క కొండలు గుల్లవుతుండగా.. మరో పక్క రోడ్లు ధ్వంసమవుతున్నాయి.

రాయిని తరలిస్తున్న లారీ

క్వారీ తనిఖీలో అధికారులు (పాత చిత్రం)

కేసులంటే లెక్కలేనితనం

ములగపూడి, ఎస్.పైడిపాల, తిరుపతమ్మపేట, ఉప్పంపాలెం, మాతయ్యపేట గ్రామాల్లో నల్లరాయి క్వారీల నిర్వహణ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్వారీల నిర్వహణపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించారు. రోజూ క్వారీలను పర్యవేక్షిస్తూ.. నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ములగపూడి, ఎస్.పైడిపాల గ్రామాలకు చెందిన అక్రమ మైనింగ్‌ను గుర్తించిన అధికారులు జేసీబీలు, లారీలు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి వచ్చిన లారీలపై కత్తిపూడి ఎంవీఐ పలు కేసులు నమోదు చేశారు. ఓ పక్క కేసులు నమోదవుతున్నా..నిర్వాహకులు ఏదో రూపంలో నిబంధనలు ఉల్లంఘిస్తూనే ఉన్నారు.

అనుమతులు ఉన్న క్వారీలు ఇవీ..

క్వారీ రకం	మొత్తం క్వారీలు	తవ్వకాలు జరుగుతున్నవి	తవ్వకాలు నిలిచినవి
నల్లరాయి	26	11	15
నల్లరాయి, బౌల్డర్(బండరాళ్లు)	02	02	00
గ్రానైట్	01	00	01

అనుమతులు తప్పనిసరి

మండలంలోని 1, 15, 44, 90, 135, 261 సర్వే నంబర్లలో క్వారీయింగ్ సాగుతోంది. 29 నల్లరాయి, గ్రానైట్, బౌల్డర్ (బండరాళ్లు) క్వారీలకు అనుమతులు ఉండగా 13 చోట్ల మాత్రమే తవ్వకాలు సాగుతున్నాయని, 16 చోట్ల తవ్వకాలు నిలిచాయని అధికారులు పేర్కొన్నారు. గనుల నిర్వహణ ప్రణాళిక, గ్రాంట్ ఆర్డర్, వర్క్ ఆర్డర్, పర్యావరణ అనుమతులు, సీఎఫ్‌ఈ నిర్వహణ, సీఎఫ్‌ఓ ఆపరేషన్ వంటి పూర్తిస్థాయి అనుమతులు ఉంటేనే క్వారీయింగ్ చేయాలి. అధికారులు విస్తృత తనిఖీలు చేపడుతున్నా.. కేసులు నమోదు చేస్తున్నా అక్రమం, నిబంధనల ఉల్లంఘన ఏదో రూపంలో సాగుతుండడం గమనార్హం. గతంలో క్వారీల నిర్వహణలో మృతులు, గాయపడ్డవారు ఉన్నారు. రవాణా చేస్తున్న వాహనాల వల్ల ప్రమాదాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇరుకు దారులు, ఆపై మలుపులతో గోతులమయంగా ఉన్న దారుల్లో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి. లారీలు తిరిగేందుకు ప్రత్యేక మార్గం ఏర్పాటు, ఉన్న రోడ్ల విస్తరణ చేపట్టాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది.

సత్ఫలితాలనిస్తున్న పోషణ వాటికలు

కూరగాయలు కోస్తున్న సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు

తొండంగి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.13 వేల నిధులిచ్చి పోషణ వాటికలు ఏర్పాటు చేయించింది. ప్రస్తుతం అవి సత్ఫలితాలను ఇస్తున్నాయి. తొండంగి 1, 2, 3, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన కూరగాయల మొక్కలు ఫలాలనిస్తున్నాయి. మంగళవారం తుని సెక్టార్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ అరుణకుమారి ఆయా కేంద్రాలను సందర్శించారు. దగ్గరుండి పరిశీలించడంతో పాటు పోషణవాటికలను పరిశీలించారు. కార్యకర్తలు రాణి,కుమారి, వీరమణి ఉన్నారు.

విద్యార్థిని ప్రతిభ

ప్రియాంక

తుని: బెంగళూరులోని పద్మశ్రీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న తుని విద్యార్థిని ఉల్లి లక్ష్మీప్రియాంక ప్రతిభ చాటారు. ఎమ్మెస్సీ క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ విభాగంలో 5వ ర్యాంకు సాధించారు. విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బంగారు పతకం, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గంపేట పాత పోలీసుస్టేషన్ ఆవరణలో డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భూపతి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన భోజనాన్ని జనసైనికులు అందించారు.

తొండంగి: వారాహిమాతను దర్శించుకుంటున్న భక్తులు

ఎరకంపాలెంలో మల్లికార్జునస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

భ్రమరాంబ మల్లికార్జునులకు రుద్రాభిషేకం

ప్రత్తిపాడు, తొండంగి న్యూస్‌టుడే: ఎరకంపాలెంలో ప్రసిద్ధి చెందిన భ్రమరాంబ మల్లికార్జునులకు మంగళవారం రుద్రాభిషేకం జరిగింది. వేద పండితుడు కొక్కిరిగడ్డ సత్తిబాబు, బ్రహ్మచారి లక్ష్మణానంద స్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ● గోపాలపట్నం యడ్ల కోటీశ్వరరావు స్థలంలో మూడు రోజుల పాటు జరిగే వారాహి మాత పూజలు పీఠం పవనానందస్వామి పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. గోపూజ, కలశ స్థాపన, మండపారాధన, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. నాయకులు యడ్ల సూరిబాబు, బుజ్జి, గోపాలపట్నం పాల్గొన్నారు.

వనసమారాధన సందడి

తొండంగి: పీఈచిన్నాయిపాలెంలో వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఆత్మ కమిటీ ఛైర్మన్ నరహరశెట్టి సూర్యప్రకాష్, నాయకులు వడ్డి రాంబాబు, కామేశ్వరరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి

ప్రత్తిపాడు: మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రత్తిపాడులో మంగళవారం ప్రకటన విడుదల చేస్తూ మావోయిస్టుల ఎన్‌కౌంటర్ ఘటనపై న్యాయమూర్తితో విచారణ చేయించాలన్నారు. సామర్లకోట సమీపాన ఇద్దరు మావోయిస్టులను అదుపులో తీసుకున్నారని సమాచారం వచ్చిందని, అదే రోజు మారేడుమిల్లిలో ఆరుగురు మావోయిస్టులను హతమార్చడం పలు అనుమానాలకు తావిస్తోందని బంగార్రావు అన్నారు. సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉందన్నారు.

ఉపన్యసించి.. మెప్పు పొంది

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

తుని, న్యూస్‌టుడే: 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో పట్టణంలోని గాయత్రి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు మంగళవారం జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఎంతో అవగాహనతో అనేక మంది పిల్లలు ఉపన్యసించారు. ఈ పోటీలకు స్కూలు ఉపాధ్యాయులే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. పక్కుర్తి సిద్ధు మురళి (మొదటి), మేడిశెట్టి మౌనిక (ద్వితీయ), పి.బిందుశ్రీ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.సునీత, ఎం.శివ శంకర్, ఎస్‌కె శైలజ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలు

సూచికలు.. పనిచేయవసలు

హైవే నిర్వహణలోపం వాహనదారులకు శాపంగా మారింది. తుని- బెండపూడి వరకు 22కి.మీ.మేర ఉన్న హైవేపై నాలుగు రహదారులను కలిపే 10 కూడళ్లల్లో వేగ నియంత్రణ పరికరాలు, సోలార్ బల్బులతో ఏర్పాటు చేసిన సూచికలు పని చేయక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుత్తేదారులే ప్రమాదాలకు బాధ్యులుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం నిర్ణయించినప్పటికి చర్యల్లేవు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

రోడ్డు మధ్యన స్తంభం

అసలే ఇరుకు రోడ్డు, అందులోనూ రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభం ఉండడంతో స్థానికులకు రోజూ ఇబ్బందిగా ఉంటోంది. జగ్గంపేట ఎస్సీ కాలనీలో ఉన్న విద్యుత్తు స్తంభం ప్రమాదాన్ని తలపిస్తుంది. ఈ మార్గంలో వాహనదారులు వెళ్లాలంటే కష్టాలు తప్పడంలేదు. అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే జగ్గంపేట గ్రామీణం

నీటి వృథా అరికట్టరూ..!

జగ్గంపేట ఎస్సీ కాలనీలో పైపులైనుకు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. ప్రభుత్వ పాఠశాల సమీపంలో, మంచినీటి చెరువుగట్టుకు వెళ్లే వీధిలో తాగునీరు వృథాగా పోతూ రోడ్లపై పారుతుంది. పలుచోట్ల డ్రైనేజీల్లో తాగునీటి పైపులైన్లు ప్రమాదకర పరిస్థితిలో దర్శనమిస్తున్నాయి. కొన్నిరోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికుల ఆరోపణ. ఉన్నతాధికారులు దృష్టిసారించి తాగునీటి పైపులకు ఏర్పడిన లీకులను అరికట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

పొంచి ఉన్న ప్రమాదం

సాధారణంగా చెట్లకు కాయలు కాస్తుంటాయి. కానీ జగ్గంపేట నెహ్రూ కాలనీలో కరెంటు స్తంభాలకు వేలాడుతూ బూడిద గుమ్మడికాయలు చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. గృహాలకు విద్యుత్తు సరఫరా చేసేందుకు అమర్చిన విద్యుత్తు స్తంభాలు, తీగలపై పాదులు అల్లుకుంటున్నాయి. రోజూ జనసంచారం ఉండే ఈ వీధిలో పరిస్థితిని ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

వెదురు కర్రలే...వాహకాలై..!

వెదురు కర్రలే విద్యుత్తు స్తంభాలుగా ఏర్పాటు చేసుకొని ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. కుమ్మరిలోవ పోలవరం నిర్వాసితులు 470 మంది కోసం కేటాయించిన లేఅవుట్‌లో రెండు రోడ్లకు మాత్రమే స్తంభాలు వేశారు. మిగిలిన 4 రహదారుల నిర్వాసితులు విద్యుత్తు తీగలను వెదురు కర్రలు సాయంతో ఏర్పాటు చేసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

వీరవరంలో మెగా నేత్ర శిబిరం

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కిర్లంపూడి: వీరవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కాకినాడకు చెందిన వాసన్ ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మను బస్వా వీరబాబు, తోట నారాయణరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీపీ తోట రవి, సొసైటీ ఛైర్మన్ గాంధీ ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో 350 మందికి పరీక్షలు చేశారు.

మత ప్రచారంపై ఇరువర్గాలపై కేసులు

తుని గ్రామీణం: మత ప్రచారం విషయమై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. తేటగుంట, తిమ్మాపురం గ్రామాల్లో ఓం శాంతి తుని శాఖకు సంబంధించిన బీకే మాధవీలత ఆయా గ్రామాల్లో బ్రహ్మకుమారికి చెందిన సభ్యులు రథంతో ప్రచారం నిమిత్తం వెళ్లగా స్థానికులు అడ్డుకొని తమ వ్యక్తులపై దాడి చేశారని ఫిర్యాదు చేశారన్నారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన రెగడమిల్లి ప్రదీప్ శర్మ వివిధ మతాలకు చెందిన చిహ్నాలతో గ్రామంలో మత ప్రచారం చేస్తున్నారని దీన్ని నివారించాలని సూచించడంతో వారు దాడికి పాల్పడినట్లు పేర్కొంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గోడలు శిథిలమై ఉన్న పాత పాఠశాల భవనం

శంఖవరం: పాతకొత్తూరులో పాత పాఠశాల భవనం ఆక్రమణకు గురైందంటూ గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో కిశోర్, పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్ మంగళవారం ఆ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. పాఠశాల గోడలు పడిపోయాయని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కోతుల బెడదతో ఆందోళన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రాత్రి, పగలు తేడా లేకుండా కోతులతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రత్తిపాడు ఊరచెరువు గట్టుని ఆనుకుని ఉన్న కాలనీవాసులు వాపోతున్నారు. వానరాలు గుంపులుగా వచ్చి నాశనం చేస్తున్నాయన్నారు. అటవీ శాఖ, పంచాయతీ అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గండేపల్లి:, న్యూస్‌టుడే : అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రత్తిపాడు ఎంపీడీవో కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీవిశ్వనాధం సూచించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్, గ్రీన్‌పై శిక్షణ శిబిరం మంగళవారం జరిగింది. శరభవరం కార్యదర్శి కె. నాగార్జున కార్యక్రమ లక్ష్యాన్ని వివరించారు. సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ● గ్రామంలోని ప్రతి వీధిని శుభ్రంగా ఉంచుదామని డిప్యూటీ ఎంపీడీవో రామరాజు వర్మ సూచించారు. ఎంపీడీవో రవికుమార్ వర్మ ఆధ్వర్యంలో ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పచ్చదనం, పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ● గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అని ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, ఉప్పసర్పంచులు, పంచాయతీ అభివృద్ధి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు జాస్తి వసంత్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో వర్మ

వివాదాలకు నిలయం.. సామాజిక ఆరోగ్య కేంద్రం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వివాదాలకు నిలయంగా మారింది. సీహెచ్‌సీలో రోజూ ఏదో ఒక అంశంపై వాగ్వాదం జరుగుతూనే ఉంది. గతంలో డీసీహెచ్‌సీగా పనిచేసిన స్వప్న, ప్రస్తుతం ప్రత్తిపాడు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సౌమ్య మధ్య ఘర్షణ వాతావరణం తెలిసిందే. వీరిరువురు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్న నేపథ్యంలో ఇటీవలే ఏలూరు, అమరావతి నుంచి వైద్యశాఖ ఉన్నతాధికారులు వచ్చి విచారణ చేపట్టి వెళ్లారు. సూపరింటెండెంట్ సౌమ్య వ్యవహార శైలితో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తూ ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది మంగళవారం కాకినాడ వెళ్లి కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం గమనార్హం. ఆసుపత్రిలో పనిచేసే హెడ్ నర్స్, సూపరింటెండెంట్ సౌమ్య మధ్య గది విషయమై సోమవారం వాగ్వాదం జరిగిన విషయం విదితమే. రోజుకో తీరులో ఆసుపత్రిలో ఈ తరహా వివాదాలు వెలుగుజూస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రికి వచ్చిన రోగులకు మేలైన సేవలు అందించాల్సినవారే ఇలా పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం, వాదనలకు దిగడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజూ సీహెచ్‌సీకి వందల మంది రోగులు వస్తుంటారు. పరిస్థితి ఇలానే ఉంటే ప్రజారోగ్యానికి భరోసా ఏది అని విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి ఆసుపత్రి వ్యవహారాలను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల చుట్టూ అపరిశుభ్రం

చర్యలు చేపట్టని యంత్రాంగం

తాళ్లూరు జడ్పీ పాఠశాల వద్ద మురుగు, తుప్పలు

గండేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా విద్యనభ్యసించాలని కూటమి ప్రభుత్వం ఉన్నత ప్రమాణాలతో కూడిన సదుపాయాలు కల్పిస్తోంది. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే కదా వాటిని సద్వినియోగం చేసుకునే వీలుంటుంది. బడుల వద్ద అపరిశుభ్ర వాతావరణం, మురుగు కాలువలు శుభ్రత లేక విషపూరిత దోమలే కాకుండా తరచూ జ్వరాలు, మలేరియా, డెంగీ బారిన పడుతున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. పంచాయతీ, వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా నిర్వహించాల్సి ఉన్నా అవి ఆచరణలో లేదు.

ప్రభుత్వ పాఠశాలల వివరాలివీ

మండలం	బడులు	విద్యార్థులు
గండేపల్లి	41	3,359
జగ్గంపేట	47	6,780
కిర్లంపూడి	41	4,747
రౌతులపూడి	46	3,480
తొండంగి	64	5,857

సమస్యలు ఎక్కడంటే..

గండేపల్లి మండలం తాళ్లూరు జడ్పీ, ప్రాథమిక పాఠశాల బయట మురుగు కాలువ అధ్వానంగా ఉంది. రామయ్యపాలెం గ్రామంలోని పాఠశాల చుట్టూ గ్రామస్థులు చెత్తాచెదారం వేస్తున్నారు. మల్లేపల్లి జడ్పీ పాఠశాల పక్కన పెద్ద కాలువ ఉంది. ప్రతి మంగళవారం సంత నిర్వహించడం, రోజువారీ మాంసం దుకాణాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటోంది. జగ్గంపేట మండలం జగ్గంపేట ఉన్నత పాఠశాల వెనుక చెరువు ఉంది. రామవరం ప్రాథమిక పాఠశాల బయట మురుగు కాలువల నిర్వహణ అధ్వానంగా ఉంటోంది.

వ్యాధులు ప్రబలుతాయి

అపరిశుభ్ర వాతావరణం వలన మలేరియా, డెంగీ త్వరగా వ్యాపిస్తుంది. కలుషిత నీటితో డయేరియా వచ్చే అవకాశమెక్కువ. మురుగు కాలువల్లో దోమల లార్వాలు ఉంటే పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శిదే.

– నరేష్, వైద్య అధికారి గండేపల్లి

ప్రేమించి మోసం చేసిన వ్యక్తి అరెస్టు

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి గ్రామానికి చెందిన గెద్దం లోవ ప్రసాద్ అనే వ్యక్తి ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేశాడని అదే గ్రామానికి 25 ఏళ్ల యువతి చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడేళ్లుగా ఆ వ్యక్తి ప్రేమ, పెళ్లి అంటూ మోసం చేసి సాన్నిహిత్యంగా మెలిగాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యక్తి పెళ్లి చేసుకోకపోవడంతో యువతి ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. లోవ ప్రసాద్‌ను అరెస్టు చేశామని బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

దుర్గాడ రైల్వేగేటు వద్ద గుర్తుతెలియని మృతదేహం

అన్నవరం, న్యూస్‌టుడే: తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గాడ రైల్వే గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 55 వయస్సు) మృతదేహం గుర్తించామని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్ తెలిపారు. దీనిపై ఎస్సై శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారని, మృతదేహాన్ని తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీలో ఉంచామన్నారు. * జీఆర్పీ పరిధిలో యలమంచిలి - నర్సింగపల్లి స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి పశ్చిమ్ బెంగ వాసి మృతి చెందారని ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డుతో ఫిరోజ్ ఓరన్ (23)గా గుర్తించామన్నారు. మృతుడు రైల్లో కూలి పనుల నిమిత్తం కేరళకు వెళుతుండగా మార్గమధ్యలో రైలు నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామన్నారు.

(c) eenadu

గుంతలపాడు రోడ్డు

కర్నూలు నుంచి నిడ్జూరు, ఆర్.కొంతలపాడు మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతింది. దీనికితోడు గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ప్రమాదాలబారిన పడ్డారు. పెద్దఎత్తున లారీలు తిరుగుతుండటంతో దుమ్ము పెద్దఎత్తున లేస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు విన్నవిస్తున్నారు. – ఈనాడు, కర్నూలు

అక్షర ఒడి.. మాటకు కట్టుబడి

విరాళాలతో నిర్మించిన షెడ్డు

ఆలూరు మండలం హుళేబీడులోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఉన్న రెండు గదుల పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం కురిస్తే.. గదులు కారుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీవాసులు బడి బాగు కోసం నడుం బిగించారు. అందరూ ఒకచోట సమావేశమై తాత్కాలికంగా షెడ్డు నిర్మించాలని తీర్మానించారు. సుమారు 50 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కొక్కరు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు తమవంతుగా సాయం అందించారు. కాలనీ వాసులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు షెడ్డు నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ఇలా అందరి సహకారంతో సుమారు రూ.2.50 లక్షలు పోగు చేశారు. మూడు తరగతుల విద్యార్థులు కూర్చునేలా షెడ్డు నిర్మాణం చేపట్టారు. షెడ్డులో ఫ్యాన్లు, బల్బులు వంటివి ఏర్పాటు చేశారు. విద్యార్థులు సైతం అక్షరాలు దిద్దుతూ.. లక్ష్యం వైపు అడుగులేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఆలూరు

మారింది తీరు.. మారంది వారు

స్లాట్ బుకింగ్ వచ్చినా తప్పని తిప్పలు ● రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారిదే హవా

పారదర్శకత.. అవినీతి రహిత.. మెరుగైన వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇది అంతంతమాత్రంగానే అమలవుతోంది. ఇప్పటికీ ఆయా కార్యాలయాల్లో దస్తావేజులేఖర్ల ద్వారానే అన్ని కార్యకలాపాలు సాగుతున్నాయి. కార్యాలయ అధికారులు, సిబ్బంది పరోక్షంగా వీరినే ప్రోత్సహిస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, కర్నూలు గాయత్రీ ఎస్టేట్, ఎమ్మిగనూరు

కానరాని అవగాహన

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త విధానంపై అవగాహన కల్పించేలా ఎక్కడా బ్యానర్లు కానీ.. బోర్డులు ఏర్పాటు చేయలేదు. హెల్ప్‌డెస్క్‌ల ఆచూకీ కానరావడం లేదు. స్లాట్ విధానంపై కనీస సమాచారం ఉండటం లేదు. అడిగినా చెప్పేవారు కరవయ్యారు.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మధ్యవర్తుల రాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆశాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ స్థానాలు ఖాళీగా ఉండటంతో పర్యవేక్షణ కరవైంది.

ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో దస్తావేజులేఖర్ల ద్వారానే లావాదేవీలు

పది నిమిషాల్లో పూర్తి కావాలి

● నంద్యాల జిల్లాలో 13, కర్నూలులో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రెండు జిల్లా కేంద్రాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీ నుంచి స్లాట్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. సత్ఫలితాలు ఇవ్వడంతో జూన్ నుంచి అన్ని కార్యాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

● జిల్లా కేంద్రాల్లోని ఒక్కో కార్యాలయంలో నిత్యం 78, మిగిలిన ప్రాంతాల్లోని కార్యాలయాల్లో నిత్యం 39 స్లాట్లు అందుబాటులో ఉంచారు. 10 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. పేరుకు స్లాట్ బుకింగ్ అవుతున్నా అంతా దస్తావేజులేఖర్లే చేస్తుండటం గమనార్హం.

దగ్గరుండి నడిపిస్తారు

● సమయం ఆదా కోసం ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చినా నిర్ణీత సమయంలోగా ఎక్కడా లావాదేవీలు పూర్తవడం లేదు. ప్రత్యేకించి ఎక్కువ దస్తావేజులు వచ్చే కల్లూరు, నంద్యాల, కర్నూలు, ఆదోనిలలో సమస్య ఎక్కువగా ఉంది. దస్తావేజులను డాక్యుమెంట్ రైటర్లే తీసుకొచ్చి కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. వేలిముద్రలు వేయించడం నుంచి ఐరిస్ తీయడం వరకు అన్నివారే చేస్తున్నారు. స్లాట్‌లనూ వారే బుక్ చేస్తుండటం గమనార్హం.

● రూ.లక్షలు, రూ.కోట్లు విలువ చేసే పొలాలు, ఇళ్ల స్థలాలు కావడం.. అవగాహన, అనుభవం లేని విధానం వైపు మొగ్గు చూపడం ఎందుకన్న ఉద్దేశంతో చాలామంది దస్తావేజులేఖర్లనే ఆశ్రయిస్తున్నారు. జనం బలహీనతను మధ్యవర్తులు అవకాశంగా చేసుకుని అదనంగా వసూలు చేస్తున్నారు.

● దస్తావేజులేఖరుల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని వెళ్తేనే సకాలంలో సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. లేకుంటే పలు లోపాలు చూపి ఇబ్బందులు పెడుతున్నారు.

అధనం ఇస్తేనే..

● ఇప్పటి వరకు మధ్యవర్తులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేందుకు డబ్బులు తీసుకుని సబ్ రిజిస్ట్రార్లు, కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ముట్టజెప్పేవారు. మధ్యవర్తులు కొంత తీసుకునేవారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించేందుకు మధ్యవర్తులు అదనంగా రూ.1,000 తీసుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ప్రజల అమాయకత్వాన్ని అవకాశంగా చేసుకుని ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు.

స్లాట్‌పై అవగాహన లేదు

– మూకన్న, ఎమ్మిగనూరు

ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టాం. ఆ తర్వాత విడిపించుకునేందుకు వచ్చాం. బ్యాంకు పేరుతో ఉన్న రిజిస్ట్రేషన్‌ను మా పేరుతో మార్చుకునేందుకు రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాం. స్లాట్ బుకింగ్ గురించి తెలియదు. డాక్యుమెంటు రైటర్ల వద్దకు వెళ్లి నమోదు చేసుకున్నా. అదనంగా సొమ్ము చెల్లించాం.

ఆంధ్రా కింగ్ సందడి

వేదికపై భాగ్యశ్రీ, రామ్ పోతినేని

నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమాకు సంబంధించి ప్రీ రిలీజ్ కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ, డైరెక్టర్ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. కళాకారుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. 600 డ్రోన్లతో ఇచ్చిన ప్రదర్శన అందరినీ కట్టిపడేసింది. – ఈనాడు, కర్నూలు

అభిమానుల కేరింతలు

నవోదయ హాల్‌టికెట్లు విడుదల

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హాల్‌టికెట్లు విడుదల చేసినట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి మంగళవారం తెలిపారు. 13.12.2025న పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్లను ఈనెల 19వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే 085212-29454 నంబరును సంప్రదించాలన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళలకు టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ తెలిపారు. ఈనెల 24 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు బి.తాండ్రపాడు టీటీడీసీ భవనం సమీపంలోని సంస్థ కార్యాలయంలో లేదా 08518-273710, 9000710508, 630449 1236ను సంప్రదించాలన్నారు.

కునుకులేని కళ్లు

● ఆసుపత్రి ఆవరణలో వణుకుతున్న రోగులు

కుమార్తె పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో తోడుగా ఉండేందుకు వచ్చిన తల్లి.. తండ్రి కాలుకు శస్త్ర చికిత్స చేయడంతో చూడడానికి వచ్చిన కుమారుడు.. ఏడేళ్ల కుమారుడు జ్వరంతో బాధపడుతుంటే ఆసుపత్రికొచ్చిన తండ్రి.. ఇలా సర్వ'జనం' చలికి వణుకుతోంది.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు 'వసతి' లేకపోవడంతో ఆరుబయటే నిద్రిస్తున్నారు. దోమలు కుడుతున్నా.. పక్కనే పందులు తిరుగుతున్నా.. శునకాలు భౌ..భౌమంటూ బెదిరిస్తున్నా చలిలో నిరీక్షించాల్సిందే. – న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల, ఆదోని వైద్యాలయం

కర్నూలు ఆస్పత్రి ఆవరణలో నిద్రిస్తున్న సహాయకులు | ఆరుబయట చలికి వణుకుతూ..

ఆదోనిలో అధోగతి

◆ ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 350 పడకలు ఉన్నాయి. 38 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. ఎలాంటి వసతి లేకపోవడంతో సహాయకులు ఆరుబయట చలిలో ఉండాల్సిన పరిస్థితి.

◆ ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో 50 పడకలు ఉన్నాయి. 12 మంది ప్రసవాల నిమిత్తం చేరారు. సాధారణ కాన్పు అయితే మూడు రోజులు, శస్త్రచికిత్స అయితే వారం రోజుల పాటు ఆస్పత్రిలో ఉంటారు. ఇలాంటి పరిస్థితులో బాధితుల సహాయకులు రాత్రివేళలో బయట చలిలో వణుకుతూ ఉండాల్సిన పరిస్థితి. రోగుల సహాయకుల కోసం భవనం నిర్మించాలని గతంలో భావించినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

● కర్నూలు సర్వజన వైద్యశాలలో వివిధ విభాగాల్లో 1,345 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరంతా ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు. వీరిలో ఎక్కువ మంది గైనిక్, పీడియాట్రిక్, అత్యవసర విభాగం, కార్డియాలజీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో ఉన్నారు. వీరితోపాటు జనరల్ మెడిసిన్, సర్జరీ, ఏఎంసీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో మరికొందరు చికిత్స పొందుతున్నారు.

● గర్భిణులు, బాలింతల సహాయకులే వెయ్యి మంది ఉన్నారు. కార్డియాలజీ, జనరల్ సర్జరీ తదితర విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులకు సేవ చేసేందుకు పెద్దసంఖ్యలో సహాయకులుంటారు. వీరంతా ఆరుబయటే ఉంటున్నారు.

● గైనిక్, పీడియాట్రిక్ ప్రాంతంలో షెడ్లు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో సహాయకులు ఉండటంతో సరిపోవడం లేదు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పాత 24 ల్యాబ్ వద్దనున్న రెండు షెడ్లలో తలదాచుకుంటున్నారు. సూపర్ స్పెషాలిటీ, శుశ్రుత భవన్ పక్కన రోగుల సహాయకులు ఉంటున్నారు. అత్యవసర విభాగం, ఏఎంసీ విభాగాలలో ఉన్నవారి సహాయకులకు షెడ్లు లేవు. అందరూ ఆరుబయట, వార్డు బయట కూర్చొని నిరీక్షించాల్సిందే.

బట్టమేకకు ఊపిరి

అంతరించి పోయే ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్న పక్షిజాతుల్లో బట్టమేక పిట్ట ఒకటి.. దీన్ని సంరక్షణకు అటవీ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రంలో 1998లో సుమారు 25 వరకు ఉండేవి.. రోళ్లపాడు ప్రాంతంలో ఇవి ఎక్కువగా కనిపించేవి. ఈ నేపథ్యంలో మిడుతూరు మండలం రోళ్లపాడులో 9.37 చ.కి.మీ విస్తీర్ణంలో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐదారేళ్ల కిందట బట్టమేక పక్షి వచ్చి గుడ్డు పెట్టి వెళ్లినట్లు గుర్తించారు. మళ్లీ రావడం లేదు. దీంతో ఈ పక్షి జాతిని కాపాడుకునేందుకు సొసైటీ ఫర్ బస్టర్డు రికవరీ ప్రోగ్రామ్ పేరుతో ప్రణాళిక సిద్ధం చేశారు. రాజస్థాన్ ప్రాంతంలో వందల వరకు పక్షులున్నాయి. అక్కడ పక్షుల గుడ్లు ఇంక్యుబేటరులో ఉంచి సంతతిని ఉత్పత్తి చేస్తున్నారు. వాటిలో కొన్నింటిని ఇక్కడికి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించారు. "బాంబే నేచురాలిటీ హిస్టరీ సొసైటీ ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుంటూ బట్టమేక పక్షుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లనున్నట్లు" కార్యక్రమ నిర్వహణ అధ్యక్షుడు మాండ్ర లింగారెడ్డి తెలిపారు.
– ఈనాడు, కర్నూలు, న్యూస్‌టుడే, నందికొట్కూరు, మిడుతూరు

డాడ్జ్‌బాల్.. గోల్

ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న బి.వెంకట్ డాడ్జ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డాడ్జ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, ఆదోని ఆర్ట్స్ కళాశాల నిర్వాహకుల ప్రోత్సాహంతో మూడేళ్లుగా సత్తా చాటుతూ జిల్లా.. రాష్ట్ర.. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం ఉడుపి సమీపంలో జరిగిన జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ జట్టులో స్థానం సంపాదించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మలేసియా దేశంలోని కౌలాలంపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు జాతీయ జట్టు వెంట కౌలాలంపూర్‌కు బయల్దేరారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో కర్ణాటక రాష్ట్రం హసన్, బెంగళూరు, మహారాష్ట్ర, హరియాణా ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి పతకాలు సొంతం చేసుకున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

పార్సిల్ డెలివరీ

● గోదాముల్లో పేరుకుపోతున్న వైనం
● ఇంటింటి సేవలకు గ్రహణం

1 కర్నూలులో నివాసముంటున్న విజయ్ ఈ నెల ఒకటో తేదీన హైదరాబాద్ నుంచి డోర్ డెలివరీ పేరుతో పార్సిల్ చేశారు. 15 రోజులైనా రాకపోవడంతో బస్టాండులోని కార్గో కేంద్రానికి వెళ్లారు. అక్కడి గోదాములో రెండు గంటలు వెతకాల్సి వచ్చింది.



ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ)లో లాజిస్టిక్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకొచ్చిన డోర్ పికప్- డోర్ డెలివరీ ప్రక్రియకు కాంట్రాక్టు సంస్థ మంగళం పాడింది. తమ వస్తువులను ఇంటి వద్దకే తెచ్చి ఇవ్వాలని వినియోగదారులు ఆన్‌లైన్లో నమోదు చేసుకొంటున్నారు. నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సంస్థ ప్రతినిధులు ఇళ్ల వద్దకు చేర్చడం లేదు. 48 గంటలు గడిచిపోవడంతో ప్రతి గంటకు రూ.5 చొప్పున జరిమానా చెల్లించి పార్సిల్ తీసుకోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు, నంద్యాల రైతునగరం

సిబ్బంది లేక ఇబ్బంది

కార్గో పార్సిల్ సేవలకు మంచి ఆదరణ లభించడంతో రెండేళ్ల కిందట డోర్ డెలివరీ విధానానికి శ్రీకారం చుట్టారు. వినియోగదారులు డోర్ పికప్ ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆ చిరునామాకు సిబ్బంది వచ్చి పార్సిళ్లను తీసుకెళ్లాలి.. కానీ ఎవరూ రావడం లేదు. చేసేది లేక వినియోగదారులు బస్టాండ్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రతి డిపో పరిధిలో డోర్ డెలివరీ చేసేందుకు ఒక్కరే ఉండటంతో క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీనికితోడు సాంకేతిక సమస్యలు ఏర్పడుతుండటం.. వినియోగదారుడికి సరైన సమాచారం లేకపోవడంతో బాగా ఆలస్యమవుతోంది.

ప్రజాదరణ చూరగొన్నా..

ప్రైవేటుతో పోల్చితే తక్కువ ధర.. వేగవంతమైన సేవలు. ఇంటి వద్దకే పార్సిల్ డెలివరీ.. బీమా సదుపాయం. ఇలా అనేక ప్రకటనలతో ఆర్టీసీ కార్గో సేవలు అనతి కాలంలోనే ప్రజాదరణ చూరగొన్నాయి. మొదట్లో కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని బస్సు డిపోల పరిధిలో మాత్రమే కార్గో పార్సిల్ సేవలు అందుబాటులో ఉండేవి. ప్రజల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిగిలిన 9 డిపోలకు సేవలు విస్తరించారు. ఆయా కేంద్రాల నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో పార్సిళ్లు నమోదు అవుతుంటాయి. జిల్లాకే పరిమితం కాకుండా మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు పార్సిళ్లు పంపుతున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

■ జాతీయ రహదారిపై ప్రమాదం ■ లారీ ఢీకొని ముగ్గురి దుర్మరణం

ఘటనా స్థలం

లక్ష్మీనారాయణ

శ్రీనివాసులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-44పై వేగం ముగ్గురిని బలితీసుకొంది. కల్లూరు మహావీర్‌నగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఎన్.వెంకటరామిరెడ్డి (55), లక్ష్మీనారాయణ (50), వడ్డె శ్రీనివాసులు (52)లు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎ.గోకులపాడుకు చెందిన శ్రీనివాసులు లారీ యజమాని. కల్లూరుకు చెందిన వెంకటరామిరెడ్డి క్లీనర్‌గా, వెల్దుర్తి మండలం రత్నపల్లికి చెందిన లక్ష్మీనారాయణ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల వీరు ఇంతియాజ్ వద్ద టైర్లు కొనుగోలు చేశారు. అవి త్వరగా అరిగిపోవడంతో ఎందుకిలా జరిగిందో అడిగేందుకు సంతోష్‌నగర్ వైపు నుంచి కల్లూరు వైపు లారీలో వెళ్తున్నారు. మహావీర్‌నగర్ ఎదుట హైవే ఉపరితల వంతెన దిగే చోట ఆపారు. అప్పటికే శ్రీనివాసులు టైర్ల దుకాణం యజమాని ఇంతియాజ్‌ను తీసుకుని ఉపరితల వంతెన వద్దకు వచ్చారు. నలుగురు లారీ చక్రాలను పరిశీలిస్తున్నారు. సంతోష్‌నగర్ వైపు నుంచి వస్తున్న మరో లారీ వేగంగా హైవే ఉపరితల వంతెన దిగుతూ వీరిని ఢీకొట్టింది. నలుగురిపైకి దూసుకెళ్లడంతో ఎన్.వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణలు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాసులు చికిత్స పొందుతూ మృతి చెందారు. డీఎస్పీ బాబూప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఉపాధి సృష్టి.. ఆరోగ్యం పుష్టి

నష్టాలొచ్చినా నిరుత్సాహపడలేదు.. కొవిడ్ దెబ్బకొట్టినా కుంగిపోలేదు.. పట్టుదలతో నిలిచి పలువురికి ఉపాధి చూపుతూ ఏడాదికి అరకోటి వరకు టర్నోవర్‌తో ముందుకు దూసుకెళ్తున్నారు నంద్యాల పట్టణానికి చెందిన గృహిణి మానస. ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకున్న ఆమె 2017లో నంద్యాల సాయిబాబానగర్‌లో జూట్ బ్యాగుల వ్యాపారం మొదలు పెట్టారు. నెలకు రూ.4 లక్షల వరకు టర్నోవర్ జరుగుతున్న సమయంలో కరోనా కారణంగా వ్యాపారం ఆపేయాల్సి వచ్చింది. 2021లో బ్యాంకు నుంచి రుణం తీసుకొని నంద్యాల పద్మావతీ నగర్‌లో చిరు ధాన్యాలు (మిల్లెట్స్) దుకాణం ఏర్పాటు చేశారు. రూ.25 లక్షలతో సరకు తీసుకొచ్చి దుకాణంలో ఉంచగా.. అనుకోకుండా కురిసిన భారీ వర్షానికి స్టాక్ పూర్తిగా తడిసి నష్టం వచ్చింది. అయినా కుంగిపోకుండా మళ్లీ 2022లో బ్యాంకు నుంచి రూ.5 లక్షల రుణం తీసుకొని కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 12 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. కేంద్రంలో రాగి సంగటి, రాగి ఇడ్లీ, కొర్ర ఇడ్లీ, మల్టీ గ్రైన్ రోటీ, మిల్లెట్ బాత్ వంటివి తయారు చేస్తున్నారు. ఉదయం టిఫిన్స్‌లో 25 రకాలు, భోజనంలో 6 రకాల మిల్లెట్ ఫుడ్స్ అందుబాటులో ఉంటున్నాయి. ఆమె కృషిని గుర్తించిన ప్రభుత్వం బెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డుతో సత్కరించింది.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

సరిదిద్దని చేతులు

■ 'అన్నదాత సుఖీభవ' సాయానికి కొందరు దూరం

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: అధికారుల అలసత్వం అన్నదాతలకు శాపంగా మారింది. వివరాలు సరిదిద్దకపోవడంతో పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం అర్హుల సంఖ్యకు కోత పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6.27 లక్షల కుటుంబాలు ఉండగా పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతలో 4,79,298 మంది రైతులు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున నగదు జమైంది. బుధవారం జమకానున్న రెండో విడతలో 489 మందికి కోత పడింది. 4.78 లక్షల మంది రైతులకు రూ.321.07 కోట్ల పెట్టుబడి సాయం అందనుంది.

కర్నూలు (రూ.కోట్లు)	లబ్ధిదారులు	నంద్యాల (రూ.కోట్లు)
136.38	అన్నదాత సుఖీభవ	103.03
45.12	పీఎం కిసాన్	36.68

కానరాని అవగాహన

● మనుగడలో లేని ఖాతాలు పునరుద్ధరించుకునేలా రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది విఫలమయ్యారు. మ్యాపింగ్ జరగని ఖాతాలను మ్యాపింగ్ చేయించడంలోనూ జాప్యం జరిగింది. అటు వ్యవసాయ శాఖ, ఇటు బ్యాంకు అధికారుల మధ్య సమన్వయ లోపంతో వేలాది మంది రైతులకు అన్యాయం జరుగుతోంది.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4.09 లక్షల మంది రైతులకు రూ.81.80 కోట్లను పీఎం కిసాన్ పెట్టుబడి సాయం అందనుంది. అదే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 4,78,820 మంది అన్నదాతలకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించనుంది.

61.359 మందికి రానట్లే..

● కర్నూలు జిల్లాలో 4,189, నంద్యాల జిల్లాలో 14,477 కలిపి మొత్తం 18,666 మంది రైతులకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో ఆధార్, చరవాణి నంబర్లు తప్పుగా నమోదవడం.. పేర్లలో తప్పులు రావడంతో పథకానికి దూరమయ్యారు.

● అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యుటేషన్ చేయాలి. దీనిపై దృష్టి పెట్టకపోవడంతో మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలో 27,170 మందికి ఆర్థిక సాయం అందలేదు. రెండో విడతలోనూ వీరు సాయానికి దూరమయ్యారు.

● ఈకేవైసీ, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం.. ఖాతాలు వాడుకలో లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో 15,034 మంది రైతులకు సాయం అందలేదు.

● ప్రస్తుతం మొదటి విడతతో పోలిస్తే రెండో విడతలో మరో 480 మందికి పథకం వర్తించలేదు. మొత్తంగా వివిధ కారణాలతో 61.359 మంది రైతులకు పెట్టుబడి సాయం దూరమైంది.

ప్రత్యేక ఉపకరణాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా సమగ్ర శిక్షా, అలింకో సంస్థ సంయుక్తంగా ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. నంద్యాలలో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు.. కర్నూలు జిల్లాలో డిసెంబరు 1వ తేదీ నుంచి ఎనిమిది వరకు జరగనున్నాయి. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుంది. విద్యార్థులు ఎక్కడికి రావాల్సి ఉంటుందో సమీపంలోని భవిత కేంద్రానికి వెళ్తే సమాచారం ఇస్తారని అధికారులు ప్రకటించారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం



రవాణా ఛార్జీలు ఇస్తారు

శిబిరాలకొచ్చే విద్యార్థితోపాటు తల్లి, తండ్రి, సంరక్షకుడు ఎవరైనా ఒకరు హాజరు కావాలి. ఇందుకు విద్యార్థితోపాటు ఒకరికి రవాణా ఖర్చులతోపాటు మధ్యాహ్న భోజన ఖర్చులు అందజేస్తారు.

నిర్ధారణ చేసి

6 నుంచి 18 ఏళ్ల వయస్సు ఉండి.. మానసిక వైకల్యం (ఐడీ), శారీరక వైకల్యం (ఎల్ఎం), సెరిబ్రల్ పాల్సీ (సీపీ), బహుళ వైకల్యం (ఎండీ), వినికిడి లోపం (హెచ్ఐ)తో బాధపడేవారు శిబిరాలకు రావొచ్చు. పరీక్షలు చేసి ఏ పరికరం అవసరమో గుర్తించి ఇస్తారు.

కావాల్సిన ధ్రువపత్రాలు

● ఏడీఐపీ ఫాం, సదరం పత్రం నకలు, మండల వైద్యాధికారి ఇచ్చే ధ్రువపత్రం (పీహెచ్‌సీ), బియ్యం కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు నకళ్లు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, యూనిక్ డిజబిలిటీ గుర్తింపు కార్డు తీసుకురావాలి.

● ఎన్‌రోల్‌మెంట్ రసీదు నకలు లేనివారికి క్యాంపు వద్ద దరఖాస్తు చేసి ఇస్తారు. ఇందుకు ఆధార్ కార్డు, సదరం నకలు, విద్యార్థి సంతకం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో అవసరం ఉంటుంది. వీటిని స్కాన్ చేసి సాఫ్ట్ కాపీని శిబిరం వద్ద వాట్సప్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్‌కు లింకై ఉన్న ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ నంబరు చెప్పాల్సి ఉంటుంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

చెట్టుతో చేటు

కోడుమూరు సబ్ డివిజన్ పరిధిలోని తుంగభద్ర నది దిగువ కాలువ వంతెనకు చెట్టు పెరుగుతుండటంతో ప్రమాదకరంగా మారింది. పుట్టపాశం కాలువ వంతెనకు మొక్కలు పెరగడంతో గోడలకు బీటలు ఏర్పడ్డాయి. వాటిని తొలగించక పోతే వంతెన శిథిలమై రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సిబ్బందితో వాటిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

అల్లారుదిన్నె వంతెన.. కళ్లార్పితే చింతేనా

బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన.. దశాబ్దాలుగా సేవలందిస్తోంది. ఆస్పరి నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారిలో హంద్రీ వాగు పైన నిర్మించిన వంతెనపై సాధారణంగా 15 నుంచి 20 టన్నుల లోడు వాహనాలు మాత్రం వెళ్లే అవకాశం ఉంది. కానీ నిబంధనలు పక్కనబెట్టి ప్రస్తుతం 50నుంచి 80 టన్నుల లోడుతో ఉన్న లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనకు ఓ వైపు రక్షణ గోడ కూలింది. ఎదురుగా ఒక వాహనం వస్తే.. మరోటి వెళ్లే వీల్లేని పరిస్థితి. ఏమాత్రం తేడావచ్చినా.. ప్రమాదానికి గురికాక తప్పదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆస్పరి

దుమ్ము రేగుతోంది

నంద్యాల నుంచి ఓంకార పుణ్యక్షేత్రానికి నిత్యం వందల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల స్థానికంగా పంట కోతలు ఎక్కువ కావడంతో ఈ రద్దీ మరింత పెరిగింది. దీంతో బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో దారిపై దుమ్ము పేరుకుపోతోంది. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇళ్లలోని ప్రజలు సైతం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మొక్కవోని ప్రయత్నం

మొక్కజొన్న పంటకు పచ్చపురుగు బెడద ఎక్కువైంది. మొలకలు పెరుగుతున్న సమయంలోనే వ్యాపిస్తోంది. పొలమంతా పిచికారీ చేసినా ఫలితం లేకపోతోంది. చివరికి పురుగు మందును కలిపి సీసాల్లో నింపి దానికి రంధ్రం పెట్టి నేరుగా ప్రతి మొక్కపై పడేలా రైతులు ప్రయత్నిస్తున్నారు. సి.బెళగల్ మండలం కొత్తకోట వద్ద ఓ రైతు కూలీలను నియమించుకుని మొక్కలకు పురుగు మందు చల్లిస్తున్నారు. - ఈనాడు, కర్నూలు

ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం స్థానిక సంకల్‌బాగ్‌లోని విశ్వర్ గార్డెన్స్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుజరాత్ కమ్యూనిటీ వారు బాల దంత సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. వీటి ద్వారా మంచి విషయాలు అందరికీ తెలుస్తాయని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో వ్యాయామానికి చాలా ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. సోమిశెట్టి శ్రీకాంత్, నభూషా, డాక్టర్ శ్వేత, డా.సునీత, డా.దివ్య, రజిత, విభ, ఫర్జానా, తదితరులు పాల్గొన్నారు.

పంటకు చలి తంటా

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగి ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలి అధికం కారణంగా పంటలపై ప్రభావం చూపుతోంది. దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. మొక్కల వృద్ధి మందగిస్తుంది. వేళ్ల అభివృద్ధి తగ్గి మొక్కలు పోషకాలను సరిగా తీసుకోక పంట ఉత్పత్తులపై ప్రభావం చూపుతుంది.

రెండు వారాల నుంచి అధికం..

జిల్లాలో రబీలో శనగ 1.45 లక్షల ఎకరాలు, మినుము 30 వేలు, వేరుసెనగ 33వేలు, మొక్కజొన్న 23వేల ఎకరాల్లో వేశారు. సాధారణంగా డిసెంబరులో చలి ప్రభావం, మంచు అధికంగా ఉంటుంది. ఈసారి నవంబరు రెండో వారం నుంచి చలి తీవ్రత పెరిగింది. దీంతో పంటల దిగుబడులపై ప్రభావం చూపి దిగుబడులు తగ్గనున్నాయి.

● శనగ: మొక్కల వృద్ధి మందగించి పూత రాలిపోతుంది. పంగస్ తెగులు పెరుగుతుంది. ఆకుల పచ్చదనం పెరుగుతుంది. నివారణకు 13.0.45 లీటరు నీటికి 5గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి. సూక్ష్మ పోషకాల జింక్ సల్ఫేట్ లీటరు నీటికి 5గ్రాములు లేదా బోరాన్, మెగ్నీషియం వంటివి 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● వేరుసెనగ: పొలంలో ఎక్కువగా నీరు నిల్వకుండా తేలికపాటి తడి అందించాలి. ఆకు మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉంది. నివారణకు కార్బండిజమ్+మ్యాంకోజెబ్ 2గ్రాములు లేదా ట్రైకోడెర్మావిరిడి 5గ్రాములు+సూడోమోనస్ 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

దిగుబడులు తగ్గే అవకాశం

● మిరప: మిరపలో ఆంత్రాక్నోస్ ఆశిస్తుంది. పండు కాయలపై చిన్న గోధుమ లేదా నల్ల రంగు మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలు క్రమంగా పెరిగి వృత్తాకారంలోకి మారుతాయి. మచ్చల మధ్యలో గులాబీ లేదా నారింజ రంగులో పంగస్ కనిపిస్తోంది. తీవ్రస్థాయిలో పండు కాయలు కుళ్లిపోయి మార్కెట్లో ధర పలకవు. ఆకుల మధ్య చిన్న మచ్చలు ఏర్పడి ఎండిపోతాయి. విత్తనాలను నాటే ముందు కిలో విత్తనానికి 4గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి. పంట మార్పిడి, పొలంలో నీరు నిల్వకుండా చూసుకోవాలి. తెగులు బారినపడిన మొక్కలను తొలగించి నాశనం చేయాలి. పండు కాయ దశలో కార్బండిజమ్ 0.1శాతం లేదా మ్యాంకోజెబ్ 0.25శాతం, లేదా అజోక్సిస్ట్రోబిన్ 23శాతం 1మి.లీ. లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. 10-15రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారీ చేయాలి. పండుకాయలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

పెరిగిన చలి తీవ్రత - డాక్టర్ రాఘవేంద్రచౌదరి
సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి

జిల్లాలో వారం రోజుల వ్యవధిలో రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23డిగ్రీలు నుంచి 17నుంచి 18డిగ్రీలకు పడిపోతుంది. ఐదారు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గి చలి ప్రభావం పెరిగింది. రైతులు పంట దిగుబడులు తగ్గకుండా తేలికపాటి నీటి తడులు, మందులు పిచికారీ చేసుకోవాలి.

నష్టపోయాం.. అన్నివిధాలా ఆదుకోండి

◆ కేంద్ర బృందానికి రైతుల వినతి

రైతు మునెప్పతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

గోనెగండ్ల, కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉల్లి సాగుపై వాస్తవ అంచనా నివేదికలను రూపొందించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు కేంద్ర ఉద్యానశాఖ డిప్యూటీ కమిషనర్ డా.బీజే బ్రహ్మ పేర్కొన్నారు. కోడుమూరు, గోనెగండ్ల మండలాల్లోని ప్యాలకుర్తి, గాజులదిన్నె, గోనెగండ్ల గ్రామాల్లో ఉల్లి పంటలను కేంద్ర ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టరు, కేంద్రం బృందం సభ్యులు కె.మనోజ్, రాజీవ్‌కుమార్, హేమంగాభార్గవ్, శరవణన్ మంగళవారం పర్యటించారు. విత్తన రకం, ఖర్చులు, తెగుళ్ల ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాలతో పంట దెబ్బతిందని. . మరోవైపు మద్దతు ధర లేక గొర్రెలకు మేతగా వదిలేశామని వాపోయారు. నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు రాజ్యకృష్ణారెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏపీడీ ఫిరోజ్ హుస్సేన్, డీడీహెచ్ జమదగ్ని, ఏడీఏ మహ్మద్‌ఖాద్రి, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు.. సిరినవ్వులు

హాయ్.. పిల్లలూ. ఏం తిన్నారు? ఇక్కడ భోజనం పెడుతున్నారా? గుడ్డు ఇస్తున్నారా.. అంటూ కలెక్టర్ సిరి నవ్వుతూ చిన్నారులతో ముచ్చటించారు. దేవనకొండలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను పరిశీలించారు. తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి సంతృప్తిగా లేదన్నారు. పలు పార్టీల నాయకులు, ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. - న్యూస్‌టుడే, దేవనకొండ

'ఆలూరులో తెదేపా జెండా ఎగరేద్దాం'

చిప్పగిరిలో మాట్లాడుతున్న తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఆలూరులో తెదేపా జెండా ఎగరేద్దాం.. పార్టీకి పూర్వ వైభవం తెద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి కార్యకర్తలు తరలివచ్చారు. ఆలూరు నుంచి చిప్పగిరికి ర్యాలీగా తరలివచ్చారు. తెదేపా సీనియర్ నాయకుడు, కేడీసీసీ మాజీ ఛైర్మన్ వైకుంఠం శ్రీరాములు, శకుంతలమ్మ దంపతుల 19వ వర్ధంతి సందర్భంగా వారి సమాధులకు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం సభకు ర్యాలీగా బయల్దేరారు. స్థానికసంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు కైవసం చేసుకొని, సత్తా చాటుదామన్నారు. వైకుంఠం శ్రీరామ్, వైకుంఠం సాయిదినేష్, వెంకటేష్, ఆలూరు రహిమాన్, చికెన్ రామాంజనేయులు, ఖాజీపురం ఓబయ్య, కుందనగుర్తి సర్పంచులు పురుషోత్తం, నీలకంఠ, వన్నాల ఆంజనేయులు, రామదుర్గం తిమ్మయ్య పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కరించండి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ఆదేశించారు. మంగళవారం స్థానిక న్యాయసేవా సదన్‌లో ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశమై మాట్లాడారు. కోర్టు మానిటరింగ్ పోలీసులు ఇందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకట శేషాద్రి, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజేంద్రబాబు, న్యాయమూర్తులు అనిల్‌కుమార్, అపర్ణ, అనూష, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌కుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు కలిసిరావాలి



శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధన కోసం ఆదోని , ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి రావాలని.. మనందరి వాణి ప్రభుత్వానికి వినిపించాలని ఆదోని తెదేపా బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు అన్నారు. ఆదోని కోట్ల కూడలి వద్ద పెద్దహరివాణం మండలంగా ప్రకటించాలని డిమాండు చేస్తూ.. చేపట్టిన రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉమాపతినాయుడు, రామస్వామి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పత్తి రైతులపై చట్టాలు మోపడం సరికాదు

మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులపై దుర్మార్గమైన చట్టాలు తెస్తోందని, ఇది మంచిదికాదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, అధ్యక్షుడు రాజన్‌క్షీరసాగర్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. ఆదోని పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర పత్తి రైతుల సమ్మేళనం జరిగింది. వారు మాట్లాడుతూ.. పత్తి సాగు చేసిన రైతులకు మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పత్తి పంట సాగు చేసిన రైతులు దిగుబడులు రాక.. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీసీఐ 11 క్వింటాళ్లు కొంటామని మాట ఇచ్చి.. కేవలం ఏడు క్వింటాళ్లే కొనుగోలు చేయడం దారుణమన్నారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర, బోనస్ కోసం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విడతల వారీగా ఆందోళనలు చేపడుతామని, నవంబరు 21 నుంచి 24వ తేదీ వరకు సంతాకల సేకరణ, 24న సచివాలయంలో వినతి పత్రాలు, డిసెంబరు 1న కలెక్టర్లకు వినతి పత్రాలు, డిసెంబరు 8న గుంటూరులోని సీసీ కేంద్రం ముందు ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడు, సీపీఐ జిల్లా నాయకులు మునెప్ప, ఉదర్శన్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి టి.వీరేశ్, నాయకులు కాటమయ్య, జమ్ములయ్య, గంగాభవానీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న పొట్లూరి రవి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: దేవరగట్టు బన్ని ఉత్సవం తొక్కిసలాటలో మృతి చెందిన ఆదోని పట్టణానికి చెందిన చిన్న ఆంజనేయ కుటుంబానికి తానా బోర్డు ఆఫ్ డైరెక్టర్ పొట్లూరి రవి మంగళవారం కర్నూలు నగరంలో ఆర్థిక సాయం అందించారు. మృతుడు చిన్న ఆంజనేయ భార్య ఈరమ్మ, కుమారుడు రామాంజికి ఎన్ఆర్ఐలు పొట్లూరి రవి, వెంకట సుంకర, వేణు కోడే, సుబ్రహ్మణ్యం, ఒసూరు తదితరులు రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు.

మద్యం ప్రయాణం.. జైలే గమ్యస్థానం

■ చోదకులకు 30 రోజుల శిక్ష

■ రహదారి ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

◗ ఇటీవల జరిగిన బస్సు దగ్ధం దుర్ఘటనలో 19 మంది మృతిచెందారు. అంతకు ముందు మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన యువకుడు రహదారి ప్రమాదానికి గురయ్యాడు. ఆ వాహనాన్ని ఈడ్చుకుంటూ బస్సువ వెళ్లడంతో అమాయక ప్రయాణికులు మృత్యుఒడికి చేరుకున్నారు.

◗ ఆదోని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 15 మంది వాహన చోదకులకు ఒక్కొక్కరికి 30 రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ ఆదోని న్యాయస్థానం తీర్పు చెప్పింది. మద్యం తాగి వాహనాలు నడిపే వాహన చోదకుల్లో భయం పుట్టుకుంది.

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: తరుచూ జరుగుతున్న ప్రమాదాలు ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నాయి. దీంతో పోలీసు, రవాణా శాఖ అధికారులు రహదారి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాయి. వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించి జిల్లా వ్యాప్తంగా వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేశారు.

ఆదోనిలో వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ అబ్దుల్ గౌస్

పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఏటా 500లకు పైగానే రహదారి ప్రమాదాలు జరుగుతుండగా.. 250 మందికి పైగా మృతిచెందుతున్నారు. 600 మంది క్షతగాత్రులవుతున్నారు. ఈ ప్రమాదాలను పరిశీలిస్తే.. అధిక శాతం మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రహదారి ప్రమాదాల నివారణపై పోలీసు శాఖ, రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేసింది. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1225 నమోదు చేయగా.. ఈ ఏడాది 2025 జనవరి నుంచి నవంబరు 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 8,051 నమోదు చేశారు.

హద్దుమీరితే కఠిన చర్యలు

మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడితే.. 185 ఎం.వి. యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. వారికి జైలు శిక్ష తప్పదని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. రెండోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడంతో పాటు రెండేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. దీంతో యువత భవిష్యత్తు చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది.

మార్పే లక్ష్యంగా.. ముందుకు

- మల్రిపాటి హేమలత, డీఎస్పీ, ఆదోని

ఆదోని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో రహదారి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రధానంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేశాం. రోజూ 10 కేసులు నమోదు చేస్తున్నాం. దీంతో పాటు ఆటోల్లో సామర్థ్యం మించి ప్రయాణికులను ఎక్కించుకెళ్తున్నారు. వాటిపై కేసులు నమోదు చేస్తున్నాం. మార్పు రాకపోతే ఆటోలను జప్తు చేస్తాం. ఏడుగురు కూర్చునే ఆటోలో 20 మందికి పైగా ప్రయాణిస్తున్నారు. ఇలా వెళ్తే ప్రమాదాలకు గురైతే ఆ కుటుంబాలు రోడ్డున పడతాయి. ప్రయాణికులు సైతం ప్రమాదకర ప్రయాణాలకు దూరంగా ఉండాలి.

ఆర్డీవో కార్యాలయ ఫర్నిచర్ వేలానికి కోర్టు ఆదేశం

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలు ఆర్డీఓ కార్యాలయం ఫర్నిచర్ వేలం వేయాలని ఆరో అదనపు జిల్లా జడ్జి పి.వాసు ఆదేశాలు జారీ చేశారు. 2015లో కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు వద్ద రైల్వే కోచ్ నిర్మాణం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం 46 మంది రైతుల నుంచి భూమిని సేకరించింది. భూములకు విలువ కట్టి నష్టపరిహారం నిర్ణయించింది. తక్కువ విలువ కట్టారని రైతులు అనడంతో.. రెవెన్యూ అధికారులు నష్టపరిహారం నిర్ణయించేందుకు కోర్టుకు నివేదించారు. కోర్టు నష్టపరిహారం పెంచుతూ తీర్పు ఇచ్చింది. తీర్పుపై రాష్ట్రప్రభుత్వం 2021లో హైకోర్టును ఆశ్రయించింది. మొత్తం 50శాతం.. 8 వారాల్లో కింది కోర్టులో డిపాజిట్ చేయాలని హైకోర్టు ఆదేశించింది. కానీ ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం సదరు మొత్తాన్ని డిపాజిట్ చేయలేదు. దీంతో రైతులు ఆర్డీవో కార్యాలయం ఫర్నిచర్ వేలం వేసి తమ నష్టపరిహారం ఇప్పించాలని కోర్టును కోరారు. 46 మంది రైతుల నష్టపరిహారం మొత్తం రూ.53,22,27,315 చెల్లించేందుకు రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. కానీ నష్టపరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేయకపోవటంతో బాధితుల తరపున న్యాయవాదులు కె.కపిలేశ్వరయ్య, పి.సుంకన్నలు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆస్తుల వేలంకు ఆదేశాలు జారీ చేస్తూ డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేశారు. ఈలోపు నష్టపరిహారాన్ని డిపాజిట్ చేయాలని న్యాయమూర్తి ఆదేశించించారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజినల్ బిజినెస్, ఎన్.ఆర్.పేట, కర్నూలు

SBI కోడుమూరు బ్రాంచ్ (కర్నూలు జిల్లా) కొరకు నూతన / ప్రత్యామ్నాయ ఆవరణ (2500-3000 చ.అ) నిమిత్తం దరఖాస్తులను కోరుతున్నవి. ఆసక్తి గల పార్టీలు, టెక్నికల్ మరియు ప్రైస్ బిడ్స్‌ను SBI వెబ్‌సైట్ https://bank.sbi/web/sbi-in-the-news/procurement-news నుండి డౌన్‌లోడ్ చేసుకొని, వేర్వేరు సీల్డు కవర్లలో ఉంచి, 28-11-2025 మ॥ 3-00 గం॥లోపు రీజినల్ ఆఫీసులో దాఖలు చేయవలెను. తదుపరి వివరాలకు 7093704843 పై సంప్రదించండి.

కన్నబిడ్డలను చంపిన తండ్రికి జీవితఖైదు

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: కన్నబిడ్డలను కర్కశంగా చంపిన కేసులో నిందితుడైన నంద్యాల జిల్లా జూపాడుబంగ్లాలోని యన్ఎస్సీ కాలనీకి చెందిన మరాఠీ సింధ్ ధనోజీరావు(39)కు జీవితఖైదు, రూ.2వేల జరిమానా విధిస్తూ ఏడో అదనపు జిల్లా జడ్జి లక్ష్మీరాజ్యం మంగళవారం తీర్పు ఇచ్చారు. కర్నూలులోని గణేష్‌నగర్‌కు చెందిన ధనోజీరావు బతుకు తెరువు కోసం జూపాడుబంగ్లా వెళ్లి 2014 జ్యోతిని వివాహం చేసుకున్నాడు. సింధ్ నికిత(7), సింధ్ మధుచరణ్(4) సంతానం. భార్యపై అనుమానంతో నిందితుడు తరచూ గొడవపడేవాడు. ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదని పిల్లలను చంపి తాను చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. 2022 మార్చిలో మొదట కుమార్తెను బ్లేడుతో గొంతు కోయగా ఆమె చనిపోలేదు. తర్వాత కుమార్తెను, కుమారుడిని నీటికుంటలో ముంచి ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. తర్వాత ఇతడు కరెంటు వైరుతో ఉరేసుకొనేందుకు యత్నించగా కిందపడిపోయి బతికిపోయాడు. అతని అత్త అంజమ్మ ఫిర్యాదు మేరకు జూపాడు బంగ్లా పోలీసుస్టేషన్ పోలీసులు అతనిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి దర్యాప్తు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావటంతో మరాఠీసింధ్ ధనోజీరావుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సరళాదేవి వాదించారు.

మామను హత్య చేసిన అల్లుడు

గోవిందయ్య (పాతచిత్రం)

కోసిగి, న్యూస్‌టుడే: తనను అవమానపరిచాడని తన మామనే గొంతు నులిమి హత్య చేసిన ఘటన కోసిగి మండలంలోని దుద్ది గ్రామంలో ఈ నెల 17వ తేదీన రాత్రి చోటు చేసుకుంది. కోసిగి సర్కిల్ సీఐ మంజూనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన గోవిందయ్య(45), తిప్పమ్మ దంపతుల పెద్ద కుమార్తె వీరేశమ్మకు, చిన్న భూంపల్లి గ్రామానికి చెందిన కొలిమి నరసింహులుతో వివాహం జరిగింది. వారు ఈనెల 15వ తేదీన కోల్మాన్‌పేటలో బంధువుల పెళ్లికి వచ్చారు. 17వ తేదీన గోవిందయ్య తన అల్లుడితో కలిసి ఇంట్లోనే మందు తాగారు. పెళ్లి ఇంటి దగ్గర ఉన్న భార్య వద్దకు వెళ్తానని అల్లుడు నరసింహులు అన్నారు. మామ గోవిందయ్య అల్లుడిపై అనుమానం వ్యక్తం చేశారు. నన్ను అవమానపరిచేలా మాట్లాడుతావా అంటూ.. మంచం పైనున్న మామను కిందకు తోశారు అల్లుడు. ఆ తర్వాత అతనిపై దాడి చేసి గొంతు నులిమి హత్య చేశారు. సంఘటన స్థలానికి ఫోరెన్సిక్ సిబ్బంది చేరుకొని మృతుడి గొంతుపై చేతి గోర్లలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. మృతదేహన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంజూనాథ్ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కల్లూరు మండలం దూపాడు సమీపంలో రైలు కిందపడి ఓ గుర్తుతెలియని యువకుడు(20) ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం సాయంత్రం 4-30 గంటల సమయంలో ఎక్స్‌రైలు వెళ్తుండగా మృతుడు పట్టాలపై చేరాడు. రైలు పై నుంచి వెళ్లటంతో అతని దేహం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు నేరవిభాగం, సి.బెళగల్, న్యూస్‌టుడే: చోరీకి పాల్పడిన సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డికి చెందిన గిర్నివెంకటేష్‌ను(45) కోడుమూరు పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్సై వేణుగోపాల్‌తో కలిసి నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబరు 25వ తేదీన తిమ్మందొడ్డికి చెందిన చిన్నారెడ్డి ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. పెళ్లి నిమిత్తం ఈయన కుటుంబ సభ్యులతో కలిసి మరో ప్రాంతానికి వెళ్లటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుని ఫిర్యాదు మేరకు సి.బెళగల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు గ్రామంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి గిర్ని వెంకటేష్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి రూ.9.25 లక్షల విలువ చేసే 9 తులాల బంగారు ఆభరణాలు, 55 తులాల వెండి, రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి బలవన్మరణం

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కొలిమిగుండ్లకు చెందిన సీతారామయ్య(62) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు సీఐ రమేష్‌బాబు మంగళవారం చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

కస్టమర్ అడ్రస్ వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావాలి. 81251 10304 గూడూరు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, సూళ్లూరుపేట.

TO LET

For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

JOBS

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్ / మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:7659988728

రాయలసీమ స్కూల్, కర్నూలు నందు 3rd to 7th వరకు ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్, సోషల్ బోధించుటకు టీచర్స్ కావలెను. ✆ 9949804648, 9398252467.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు ఎంఈవోను కోరారు. ఆదోని మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ మడల అధ్యక్షుడిగా కె.లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శిగా సి.రామకృష్ణ, కోశాధికారిగా పి.షేక్షావలితో పాటు జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయండి

గజ్జహళ్లి (హొళగుంద), న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేస్తే వెనుకబడిన మండలాలు అభివృద్ధి చెందుతాయని గజ్జహళ్లి గ్రామ యువకులు, భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రామలింగ అన్నారు. మంగళవారం ఆదోని భీమాస్ వృత్తంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. గజ్జహళ్లి గ్రామ యువకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండలంలోని నంచెర్ల నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో పైపులైన్ లీకవుతూ.. తాగునీరు వృథా అవుతోంది. వృథాను అరికట్టాలి. – నంచెర్ల గ్రామస్థులు

✔: తాగునీటి పైపులైన్ పరిశీలించి, వృథా కాకుండా మరమ్మతులు చేపడతాం. – సర్పంచి, నంచెర్ల

హొళగుంద, న్యూస్‌టుడే: ?: స్థానిక ఈబీసీ కాలనీలో మురుగు కాల్వలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు వ్యాపించి కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. – అమరేష్, హొళగుంద

✔: పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించి దోమల వ్యాప్తిని అరికడతాం. – రంగమ్మ, సర్పంచి, హొళగుంద

అగ్రహారం, (మద్దికెర), న్యూస్‌టుడే: ?: అగ్రహారం వనకుంట వద్ద పశువుల కోసం నిర్మించిన తొట్టి నీరు లేక నిరుపయోగంగా ఉంది. – శంకర్, అగ్రహారం

✔: పరిశీలించి నీరు అందేలా చర్యలు చేపడతాం. – విజయ్, పంచాయతీ కార్యదర్శి, అగ్రహారం

చిన్నారులను కళల్లో ప్రోత్సహించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: చిన్నారులను వివిధ కళల్లో ప్రోత్సహించాలని డాక్టరు సతీశ్, కరస్పాండెంట్ ఫాదర్ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయుడు కేశవయ్య అన్నారు. ఆదోని పట్టణంలోని సెయింట్ ఆంథోనీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. చిన్నారులకు ఆటపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫాదర్ విన్సెంట్, ఉపాధ్యాయులు నిర్మలా మేరి, నరసన్న, నాగనాథ్, శాంతి, మహాదేవి, మారెమ్మ పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దాడులు అరికట్టాలని నిరసన

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దళిత, గిరిజన, మైనారిటీలపై జరుగుతున్న దాడులు నిరసిస్తూ.. మంగళవారం ఆదోని పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక భీమాస్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తదితరులు మాట్లాడుతూ జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు టి.వీరేశ్, కల్లుబావి రాజు, జిల్లా నాయకులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు

పంచాయతీ గదుల్లో అద్దె వ్యాపారం

☛ వేలం నిర్వహణ పట్టించుకోని అధికారులు

పత్తికొండ, మద్దికెర, న్యూస్‌టుడే: సంవత్సరాల తరబడి వారు దుకాణాలు ఖాళీ చేయరు.. అద్దె చెల్లించరు.. పంచాయతీకి రావాల్సిన ఆదాయం పొరుగువారి జేబులోకి చేరుతోంది. దీంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీ అధికారులు అద్దెలు చెల్లించాలని తాఖీదులు ఇవ్వడంతో పాటు గదులకు తాళాలు వేసినా.. ఫలితం లేకుండా పోతోంది. ఇలాంటి వారి నుంచి అద్దె వసూలు చేయలేక పోగా, వాటికి వేలం నిర్వహించి మరొకరికి ఇచ్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో పనిచేస్తున్న పారిశుద్ధ్య, స్వచ్ఛ భారత్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించలేని దయనీయ పరిస్థితి నెలకొంది. మద్దికెర మేజరు పంచాయతీ పరిధిలోని 70 వ్యాపార గదులకు సంబంధించి రూ.5లక్షల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. నెల వారీగా చెల్లించాల్సిన అద్దెల బకాయిలతో అవస్థలు తప్పడం లేదు.

మొండి బకాయిలు

మద్దికెర మేజర్ పంచాయతీ పరిధిలోని వ్యాపార గదులకు నెల వారీగా చెల్లించాల్సిన అద్దెలను వ్యాపారులు సకాలంలో చెల్లించడం లేదు. మరి కొందరు ఏళ్ల తరబడి మొండికేశారు. వారి బకాయిలు భారీగా పెరిగిపోయాయి. చెల్లించని వారి గదులకు తాళాలు వేస్తే రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి తెప్పించి మళ్లీ తెరుకొని యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇలాంటి వారి నుంచి అద్దెలు వసూలు చేయలేక సిబ్బంది, అధికారులు నలిగిపోతున్నారు. రూ.5 లక్షలకు పైగా బకాయిలు ఉన్నా.. వారి నుంచి సొమ్ము రికవరీ చేసేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఇలాంటి వారిని ఖాళీ చేయించి ఆ గదులకు వేలం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

మద్దికెర పంచాయతీ కార్యాలయం అద్దె గదులు

పోలీసులకు ఫిర్యాదు చేశాం

పంచాయతీ వ్యాపార గదులను అద్దె ప్రాతిపదికన తీసుకుని పలువురు అద్దెలు చెల్లించడం లేదు. ఇలాంటి వారి నుంచి ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశాం. అద్దె రూ.లక్షల్లో బకాయి ఉన్నమాట వాస్తవమే. అందువల్లే కార్మికులకు సకాలంలో వేతనాలు అందించలేని దుస్థితి నెలకొంది.

- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

భక్తిశ్రద్ధలతో చండీయాగం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం మహా చండీ యాగం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త సమాచారం

హొళగుంద, న్యూస్‌టుడే: బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా మండల పరిధి వందవాగిలి గ్రామం ఉన్నత పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఆస్పరి ,న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను ఎంపీడీవో గీతావాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన వంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ ఎంఎల్ కార్యదర్శి మునిస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల గోడపత్రికలు విడుదల చేశారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కేడీసీసీ మాజీ ఛైర్మన్ వైకుంఠం శ్రీరాములు విశేషంగా కృషి చేశారని వైకుంఠం మల్లికార్జున చౌదరి మంగళవారం పేర్కొన్నారు. చిప్పగిరిలోని వైకుంఠం దంపతుల సమాధులకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చిప్పగిరి మాజీ ఎంపీపీ భీమలింగప్ప చౌదరి, మైనార్టీ నాయకుడు సర్వర్ ఖాన్, బుసినే శ్రీరాములు, చంద్రశేఖర్, యల్లంకి అమరేష్, బాల, కొక్కు నాగరాజు, కాయ పెద్దన్న, నంచెర్ల శివలింగ తదితరులు పాల్గొన్నారు.

బసినేపల్లి (మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని పెరవలి, బసినేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కంది, శనగ పంటల సాగు అనంతరం తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలపై వ్యవసాయ అధికారి రవి, వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ఎక్సైజు పోలీసు స్టేషన్ పరిధిలోని గోనెగండ్ల మండలం బోదెపాడు గ్రామంలోని ఓ పొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సువర్ణలత తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.సుధీర్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం సహాయ సూపరిండెంట్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు.

జొన్నగిరి (తుగ్గలి), న్యూస్‌టుడే: జొన్నగిరి ఎస్సీ వసతి గృహాన్ని ఎస్సీ సంక్షేమ మరియు సాధికారిక జిల్లా అధికారిణి రాధిక మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహం సంక్షేమాధికారి రమేష్‌కు పలు సూచనలు చేశారు.

శిథిల గదుల్లో తరగతులు నిర్వహించొద్దు

మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్‌పాల్

ఆలూరు, న్యూస్‌టుడే: శిథిలావస్థకు చేరిన గదుల్లో తరగతులు నిర్వహించరాదని జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్ ఆదేశించారు. ఆలూరు ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఆరు మండలాల విద్యాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన గదులను గుర్తించామని, దాతల సాయంతో వాటి మరమ్మతుకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో ఆదోని, కర్నూలు ఉప విద్యాధికారులు వెంకటరమణారెడ్డి, రాజేంద్రప్రసాద్, సమగ్ర శిక్ష డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలూరు మండల విద్యాధికారి కోమలదేవి పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలి

ఆలూరు, న్యూస్‌టుడే: రానున్న పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని చేపడుతున్న వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఆలూరు ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 7 నుంచి అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక ప్రారంభిస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం జిల్లాలో 32 వేల మంది పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించినట్లు తెలిపారు.

పీపీపీ విధానం రద్దు చేయాలి

తెర్నేకల్, నల్లచెలిమల(దేవనకొండ), న్యూస్‌టుడే: పీపీపీ విధానం రద్దు చేయాలని ఎమ్మెల్యే విరూపాక్షి డిమాండ్ చేశారు. మండలంలోని తెర్నేకల్, నల్లచెలిమల గ్రామాల్లో మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పేదలు వైద్య సేవలు పొందాలంటే వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేటీకరణ ఆపాలన్నారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు జుబేర్, సర్పంచి ఆంజి, ఎంపీటీసీ సభ్యుడు నాగమల శ్రీనివాసులు, మల్లికార్జున, అంజి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలను పంచుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

డిజిటల్ ఎక్స్‌రేతో మెరుగైన సేవలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌తో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ సీహెచ్‌సీ కేంద్రంలో కొత్తగా మంజూరైన డిజిటల్ ఎక్స్‌రే యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆదోని, కర్నూలు లాంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఉచితంగా సమస్యను నిర్ధారించవచ్చన్నారు. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిణి లక్ష్మి మాట్లాడుతూ.. రోగులు అత్యవసర సమయాల్లో ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ అధ్యక్షుడు కె.సాంబశివారెడ్డి, కమిటీ సభ్యుడు బత్తిన లోక్‌నాథ్, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌కుమార్, తెదేపా నాయకులు తిమ్మయ్యచౌదరి, వెంకటేశ్వర్లు, సుధాకర్, శ్రీధర్‌రెడ్డి వైద్యులు హారిక, మణిధీర్, ఆసుపత్రి సిబ్బంది సౌమ్య, హిమబిందు, దేవయ్య, భూషయ్య, రామాంజనేయులు, ఆనంద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌రే ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలి

తెర్నేకల్ (దేవనకొండ), న్యూస్‌టుడే: హంద్రీనీవా ద్వారా 46 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని, తెర్నేకల్-కరివేముల-కప్పట్రాళ్ల పరిధిలో పెండింగ్ పనులు పూర్తిచేయాలని సీపీఎం జిల్లా నాయకులు గోవిందు, వీరశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం బైక్ యాత్ర ప్రారంభించారు.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE : ANANTHAPURAMU
O.S.No: 74/2025
Between:
B.K. Raghavendra Rao ... Plaintiff
AND
Begari Bhaskar Narasappa & 2 Others ... Defendants
NOTICE TO DEFENDANT NO:1
To,
Begari Bhaskar Narasappa, S/o Begari Narasappa, aged 49 years, Hindu, R/o D.No: 1-541-21-C-5, N.G.O. Colony, Adoni Town, Kurnool District.
[illegible] ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షమునందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
V. Bharadwaja Padmanabha Teja
Advocate, Ananthapuramu
Cell No: 9700713342

పత్తి రైతులను వెనక్కి పంపొద్దు

- కలెక్టర్ డాక్టర్ సిరి

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: సీసీఐ కేంద్రాలకు పత్తి దిగుబడులతో వస్తున్న రైతులను నిబంధనల పేరుతో ఇబ్బందికి గురి చేసి వెనక్కి పంపొద్దని కలెక్టర్ డాక్టరు సిరి అన్నారు. ఆదోని పట్టణంలోని ఎన్‌డీబీఎల్, విఘ్నేశ్వర జిన్నింగ్ మిల్లులోని సీసీ పత్తి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టరు పరిశీలించారు. రైతులతో ఆమె మాట్లాడారు. సాంకేతిక సమస్యలను అధిగమించేలా చొరవ చూస్తామన్నారు. కేంద్రాల వద్ద సీసీఐ కొనుగోలు చేయని పత్తిని మిల్లర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. వెంట ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, తహసీల్దారు రమేశ్, యార్డు కార్యదర్శి గోవిందు, సీసీఐ మేనేజరు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని బసాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో జరుగుతున్న తాత్కాలిక పనులను కలెక్టర్ సిరి మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, తహసీల్దారు రమేశ్, పురపాలక ఇన్‌ఛార్జి కమిషనరు నాసిర్‌హుసేన్, డీఈలు వెంకటచలపతి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదని పట్టణంలోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన వారికి కొంతసేపు ఆహారం వడ్డించారు.

రైతులకు అవగాహన కల్పించండి

మదిరె(ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: మిరప పంటకు సోకిన కాయమచ్చ తెగుళ్లు, కాయ కుళ్లు వంటి వాటిని నివారించేందుకు రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.సిరి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఆదోని మండలం మదిరె గ్రామంలో సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, తహసీల్దారు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

ఆస్పరి, న్యూస్‌టుడే: విద్యార్థినుల కోసం వండిన సాంబారులో కందిపప్పు తగ్గిందని, అది కూడా పల్చగా ఉందని కలెక్టర్ డాక్టర్ సిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ఆస్పరిలోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. వంట గది, వినియోగించే కూరగాయలను, పాఠశాల ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న గదులను పరిశీలించారు.

● అనంతరం స్థానిక గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. మీ వద్ద ఉన్న ఫేస్‌యాప్‌ను చూపించాలని, అడిగి పరిశీలించారు. ఉద్యోగులు సమయ పాలన లేకుండా విధులకు హాజరు కావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం బయట ఉన్న గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల సహయ కార్యదర్శి రమేష్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్‌పాల్, సర్పంచి రాధమ్మ, ఎంపీడీవో గీతవాణీ, తహసీల్దారు రామేశ్వరెడ్డి, ఉప తహసీల్దార్ భీమేష్, కార్యదర్శి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
केनरा बैंक Canara Bank కెనరా బ్యాంక్ P.N. Road, ఆదోని బ్రాంచ్
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న కెనరా బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీ రాజేష్ రాజామోహన్ గారికి, బ్రాంచ్ మేనేజర్ శ్రీ కె.సురేంద్రబాబు గారికి మరియు బ్యాంక్ సిబ్బందికి ఇవే మా శుభాకాంక్షలు.
M.లింగన్న గౌడ్
శ్రీ కరస్థల నాగలింగేశ్వర ఆగ్రో కెమికల్స్
గజహాళి గ్రామం, హొళగుంద (మం.)

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
केनरा बैंक Canara Bank కెనరా బ్యాంక్ బ్రాంచ్-2 P.N.రోడ్, ఆదోని
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న కెనరా బ్యాంక్ ప్రారంభించి 120 వసంతాలు నిండిన సందర్భముగా బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీ రాజేష్ రాజమోహన్ గారికి, బ్యాంకు మేనేజర్ శ్రీ కె. సురేంద్రబాబుగారికి మరియు బ్యాంకు సిబ్బందికి ఇవే మా శుభాకాంక్షలు
CH. శ్రీనివాసరావు & బ్రదర్స్ Cell: 94402 65167
వస్త్రసాగర్ టెక్స్‌టైల్స్ & రెడీమేడ్స్
బాంబే సేల్స్
V.S. ఫ్యాషన్స్ టెక్స్‌టైల్స్ & రెడీమేడ్స్
V.S. రెడీమేడ్ గార్మెంట్స్
టెక్స్‌టైల్స్ & రెడీమేడ్స్ కెనరా బ్యాంకు-2 ఎదురుగా P.N.రోడ్, ఆదోని

వేదవతి.. మారని తీరిది

■ చెదిరిన పైపులు ■ దృష్టిసారిస్తే.. రైతులకు సాగునీరు

ఆలూరు, హాలహర్వి, న్యూస్‌టుడే: కంటి ముందు నీరు పారుతున్నా.. పొలాలు తడుపలేని పరిస్థితి. సాగుకు నీరు అందించాలన్న ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామంలో రూ.61 లక్షలతో ఎత్తిపోతుల పథకం నిర్మించారు. ఈ పథకం కింద 115 మంది రైతులకు గాను 312 ఎకరాలకు సాగు నీరు అందించేలా రూపొందించారు. ప్రారంభించిన మొదటి ఏడాది మాత్రం సాగు నీరు పారింది. మరుసటి సంవత్సరం నుంచి పైపులు ధ్వంసం కావడంతో వీటి స్థానంలో కొత్త పైపులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో పథకం నిరుపయోగంగా మారింది. నిర్మాణంలో పీవీసీ పైపులకు బదులుగా సిమెంట్ పైపులు ఏర్పాటు చేయడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.

వేదవతి నదిలో శిథిలమైన పైపులు

కొరవడిన పర్యవేక్షణ

సిద్ధాపురం గ్రామం మీదుగా దిగువ కాల్వ ప్రవహిస్తోంది. దీంతో ఎత్తిపోతుల పథకంపై రైతుల పర్యవేక్షణ కొరవడటంతో నిరుపయోగంగా మారింది. పొలాల సాగు పెరగడంతో దిగువ కాల్వ నీటి తడులు సరిపోవడం లేదు. పొలాలకు సాగు నీరు పారాలంటే ఎత్తిపోతుల పథకం వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. దీనిపై పాలకులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

● సాగు నీరు పారాలంటే నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించి మరమ్మతులు చేపడితే.. 115 ఎకరాల ఆయకట్టుతో పాటు మరో 50 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు సాధ్యమవుతుంది. దీనిపై పాలకులు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తెదేపా నాయకుడు కుమార్‌స్వామి మృతికి నివాళి

నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

దేవనకొండ, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, మండల మాజీ ఉపాధ్యాక్షుడు ఈడిగ కుమారస్వామి(74) మంగళవారం అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. మండలంలోని నేలతలమర్రి గ్రామానికి చెందిన ఈడిగ కుమారస్వామి మండల కన్వీనర్‌గా, మండల ఉపాధ్యాక్షుడిగా, ఎంపీటీసీ సభ్యుడిగా సేవలు అందించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొజ్జమ్మ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, కోట్ల రాఘవేంద్రరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెదేపా కన్వీనర్ విజయ్‌భాస్కర్‌ను, ఆయన కుటుంబ సభ్యులు ప్రముఖులు పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి ఉచ్చీరప్ప, రామచంద్రనాయుడు, బండ్లయ్య, సుభాన్, రంగన్న, రాజశేఖర్, మల్లికార్జున, మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరుకు వీధుల్లో.. సరకు దాటేదెలా

ఆదోని పట్టణంలో అసలే ఇరుకుదారులు.. ఆపై వాహనాలు అస్తవ్యస్తంగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు తప్పడం లేదు. ఓ ఆటోలో భారీ సైజు ఉన్న నీటి పైపులు అడ్డదిడ్డంగా వేసుకొని పట్టణ రహదారిపై ప్రయాణించారు. అసలు ఇరుకు దారులు.. ఆపై నీటిగొట్టాలతో ఆటో వెళ్లేందుకు ఇబ్బందులు పడక తప్పలేదు. దారి కనిపించక, ముందుకు సాగలేక వాహనదారులు అవస్థలు పడ్డారు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదానికి గురి కావాల్సిందే. – న్యూస్‌టుడే, ఆదోని పాత పట్టణం

భారీ వాహనాలు.. చెదురుతున్న దారులు

ఆస్పరి మీదుగా ఆదోని నుంచి గుత్తి వెళ్లే రహదారిలో నిత్యం భారీ వాహనాలు వేల సంఖ్యలో తిరుగుతుంటాయి. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు పోతున్నాయి. ఈ బీటీ రహదారిలో సామర్థ్యానికి మించి అధిక లోడుతో వాహనాలు తిరుగుతున్నాయి. సాధారణంగా 15నుంచి 20 టన్నుల లారీలు తిరగాల్సిన దారిలో ఏకంగా 60నుంచి 80 టన్నుల లోడుతో తిరుగుతున్నాయి. దీంతో రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. కంకర తేలి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ దారిలో భారీ వాహనాలు తిరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చిన్న వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

Second Anniversary Greetings
of our New Unit
Gold Plating Factory
Panjara Poul, Near Goshala, Aluru Road, Adoni.
Traditional Works....
24 kt. Gold Coating Services
and Making of
Vimanam Gopuram
Dwajasthambam
Chariot
Kalasam
Kavacham
Prabhavali
Panchaloha Idols
Pooja Room
RANGANNACHARI METAL WORKS
In the Business of GOLDEN TEMPLE Architecture
Brand New
NTGD World Class Technology
Form London Long Lasting Guarantee
Manufacturing 24Kt. Gold Coated products
and 24Kt. Gold Coated Services
K. RANGANNACHARI SONS
METAL WORKS
Office Address :
D.No. 12/300 Opp Sree Jagadguru press
Kanchigari Street, Adoni - 518 301.
Kurnool (Dist) ANDRA PRADESH.
K. Srinivasachari 94405 88731, 82476 96986
K. Gundachari 94405 14104, 91822 97914

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.5.41 కోట్లు

మంత్రాలయ, న్యూస్‌టుడే: శ్రీమఠానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం సమకూరినట్లు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్ వెంకటేశ్ జోషి, సురేశ్ కోణాపూర్, ఎస్కే శ్రీనివాసరావులు తెలిపారు. అక్టోబరు 15 నుంచి నవంబరు 17 వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించగా.. రూ.5.41 కోట్లు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. వారు మాట్లాడుతూ..ఈ లెక్కింపును శ్రీమఠం రాజ్యాంగణ భవనంలో మంగళవారం ఉదయం ప్రారంభించి సాయంత్రానికి పూర్తి చేశామన్నారు. నగదు మొత్తం రూ.5,41,47,228, 80 గ్రాముల బంగారు నగలు, 1610 గ్రాముల వెండి ఆభరణాలు భక్తులు సమర్పించారన్నారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేశామన్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్యన భక్తులు హుండీని లెక్కించారు.

వేరుసెనగ గరిష్ఠ ధర రూ.6,710

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,710, మధ్యస్థ రూ.5,670, కనిష్ఠ రూ.3,066 వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,770 మధ్యస్థ రూ.5,690, కనిష్ఠ రూ.5,280 వ్యాపారులు కొనుగోలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794 కోసిగి 9550434095

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: జీఎం పెట్రోల్ బంకు వెనుక ఉన్న విద్యుత్తు స్తంభాలకు కొత్త వీధి దీపాలు అమర్చండి. - ప్రసాద్, కాలనీవాసి

✔: నూతన వీధి దీపాలు త్వరలో అమర్చుతాం. - నీరజా డీఈ

?: సాయిగణేశ్ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రహదారికి నిధులు మంజూరు చేయండి. - గోపాల్

✔: ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం

-గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

చరవాణిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో కుర్ని కల్యాణ మండపంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకి వినతులు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెవెన్యూ, ఇతర సమస్యలపై దాదాపు 200 పైగానే దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని ఆయా శాఖలకు పంపి పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక పథకాలు రూపొందించినట్లు తెలిపారు. విద్యుత్తు సమస్యలను పరిష్కరించేందుకు కొత్తగా విద్యుత్తు సబ్ స్టేషన్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కేటీ వెంకటేశు, రాజేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారిణి షఫియాబేగంతో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో మహిళలకు డెలివరీ సదుపాయం ఉన్నప్పటికీ వారి సంఖ్య తక్కువగా ఉండటంపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ హాజరు కాకపోయినా రికార్డుల్లో హాజరైనట్లు సంతకం చేసి నెల నెల జీతాలు తీసుకుంటున్న విషయంపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కలిసి నడిచారు.. సమస్యలు పరిష్కరించారు

◆ ఈనాడు ఆధ్వర్యంలో వాక్ విత్ కమిషనర్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చేనేతపురిలో నెలకొన్న సమస్యలపై 'ఈనాడు' ఆధ్వర్యంలో వాక్ విత్ కమిషనర్‌తో పలు సమస్యలు పరిష్కారం అయ్యాయి. పట్టణంలోని నాలుగో వార్డులో సోగనూరు రోడ్డు వీధుల్లో కమిషనర్ గంగిరెడ్డి కాలనీ వాసులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా నీటి సమస్య, మురుగు కాల్వల శుభ్రత, అక్రమ కట్టడాలు, సకాలంలో నీరు రాక పడుతున్న ఇబ్బందులు, కాల్వల మురుగు దుస్థితిపై ప్రజలు విన్నపాలు తెలిపారు. వాటిపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సమాధానం ఇచ్చారు.

?: కాలనీలో నీటి ట్యాంకు శుభ్రం చేయడం లేదు. -వీరేశ్, కాలనీవాసి

✔: రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం.

నాలుగో వార్డులో ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్ గంగిరెడ్డి

?: నాలుగో వార్డు రెండో వీధిలో కుళాయి నీరు సక్రమంగా రావడం లేదు.

-మహదేవప్ప,కాలనీవాసి

✔: పైపులైన్‌ను పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

?: మురుగు కాల్వలో పూడిక నిండి దుర్వాసన వస్తోంది. - సోమేష్

✔: సిబ్బందితో తక్షణమే పూడిక తొలగిస్తాం.

?: పైపులైన్లు లీకేజీతో నీరు వృథా అవుతోంది.

- బాషా, కాలనీవాసి

✔: సాయంత్రంలోపు పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తాం.

?: కాలనీలో ఐదు, దర్గా లైన్లకు తాగునీరు రావడం లేదు. - హనీఫ్, భీమన్న

✔: సమస్యను పరిశీలించి నీరు సరఫరా అయ్యేలా చూస్తాం.

?: కాలనీలో కుక్కల బెడద అధికమైంది.

- రంగన్న, కాలనీవాసి

✔: కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

?: ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో అపరిశుభ్రంగా ఉండడంతో రాత్రి వేళ పాములు సంచరిస్తున్నాయి.

- లక్ష్మన్న

✔: ఇంటి యజమానికి నోటీసులు పంపించి శుభ్రం చేయిస్తాం.

?: ఇంటింటా చెత్త సేకరణకు రావడం లేదు. - ఈరన్న

✔: రోజూ చెత్త సేకరణ జరిగేలా చూస్తాం.

?: విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. గాలివస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉంది.

- సోమేష్

✔: విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

?: ఎన్టీఆర్ కాలనీలోని ఖాళీ స్థలంలో పార్కులను ఏర్పాటు చేయండి.

- రంగన్న, కాలనీవాసి

✔: నూతన పార్కు ఏర్పాటుకు పరిశీలిస్తాం.

రైతుల సంక్షేమమే లక్ష్యం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే సహకార వ్యవస్థల లక్ష్యమని జిల్లా సహకార అధికారి టి.వెంకటకృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద మంగళవారం గూడూరు పీఏసీ ఛైర్మన్ దానమయ్య ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. సహకార సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ఆత్మ నిర్భర భారత్ లక్ష్యాలు సాధించవచ్చని పోలకల్ పీఏసీ ఛైర్మన్ జయాకర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారులు చెన్నమ్మ, నాగరమణయ్య, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ యూనిటీ, సి.బెళగల్ పీఏసీ ఛైర్మన్ చిన్న తిమ్మప్ప, సొసైటీ సీఈవోలు శివకుమార్ రెడ్డి, ఖాజహుస్సేన్, లక్ష్మన్న, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

బోధన పద్ధతులపై శిక్షణ

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులలో బోధనా సామర్థ్యాలు పెంపొందించడానికి జీవీఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులకు బోధన పద్ధతులపై రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ వసంతలక్ష్మి, ఆజారయ్య బాబు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రామచంద్రుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు తొలగక.. సమస్య తీరక

పట్టణంలోని పుండుకూర కట్ట దగ్గర రహదారిపై మురుగు పారుతోంది. రహదారి పక్కనే కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయాయి. సిబ్బంది మురుగు తొలగించడం లేదు. దాంతో మురుగు నిరంతరం రోడ్డుపైకి చేరి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అదే మార్గంలో తేరుబజార్, పెద్ద బోయ, గొల్ల వీధులు, బీసీ కాలనీలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమస్యతో నెలలో రెండు, మూడు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మురుగు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

బండరాయే బోరు బావికి రక్షణ

ఎమ్మిగనూరు పట్టణంలోని ముగతి పేటలో చేతిపంపు పూర్తిగా పాడైపోయింది. దాంతో అందులోని పైపులు తొలగించారు. ఫలితంగా అది బోరు బావిగా ఏర్పడింది. అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానికులు దానిపై తాత్కాలికంగా బండరాయిని పెట్టి వదిలేశారు. రక్షణలేని బోరు బావితో పిల్లలకు ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పెను ప్రమాదం జరగక ముందే అప్రమత్తమై బోరు బావికి శాశ్వతంగా మూత ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

కుంట బడి.. కంపు ముడి

మండలంలోని చనుగొండ్ల గ్రామంలో బస్టాండు వెనుక ఉన్న కుంట ఇది. చుట్టు పక్కల నుంచి వచ్చే నీటితో నిండింది. కుంట నిండా గుర్రపుడెక్క పెరిగి పాచి పేరుకుపోయింది. స్థానికులు వ్యర్థాలు అందులోనే వేస్తున్నారు. దాంతో గుర్రపు డెక్క కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. కుంట పక్కనే ప్రాథమిక పాఠశాల ఉంది. ఫలితంగా దానికి ప్రజలు కుంట బడిగా పిలుస్తారు. అపరిశుభ్రమైన నీటి వల్ల దోమలు బెడద అధికమైంది. పాములు విషపురుగుల సంచారం పెరిగిందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. - న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సుశీలాంబమహేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం సహస్ర పుష్పార్చన చేశారు. శివుడికి మహా మంగళహారతి, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న భక్తులు

మారందొడ్డి, ఈర్లదిన్నె (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని మారందొడ్డి, ఈర్లదిన్నె గ్రామాల్లో వెలసిన ఎల్లమ్మ ఆలయాల్లో మంగళవారం పురోహితులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకం అందిస్తామని ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ హరికృష్ణ తెలిపారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: పుస్తక పఠనం తోనే జ్ఞానాభివృద్ధి అని ఎంఈవో రాఘన్న అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయంలో ప్రతిరోజూ పుస్తక పఠనం చేయాలన్నారు. నీతి కథలు, చరిత్ర తెలియజేసే పుస్తకాలు చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వసంత లక్ష్మి, ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నేటి సమాజంలో విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి కవితబాయి అన్నారు. పట్టణంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అమ్మ ప్రేమ, గ్రంథాలయాల ఉపయోగం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 20వ తేదీ బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కవితబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

సి.బెళగల్, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, గ్రామ పంచాయతీ సర్పంచి పాండురంగన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం కర్నూలులోని హోటల్ కేశవ గ్రాండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార సంఘం అధ్యక్షులు హరిఫ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి కర్నూలు డీసీసీబీ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా సహకార సంఘం అధ్యక్షులు, తదితరులు శిబిరంలో పాల్గొనాలన్నారు.

పంట కాల్వలకు నీటి విడుదల 21న

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని గాజులదిన్నె జలాశయం నుంచి పంట కాల్వలకు నీటిని ఈనెల 21న విడుదల చేస్తున్నట్లు జలాశయం ప్రాజెక్టు డీఈ సుబ్బరాయుడు, సాగునీటి సంఘం ఛైర్మన్ మల్లికార్జునగౌడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును ఆహ్వానించినట్లు తెలిపారు. సాగునీటి సంఘం సభ్యులు రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఏఈ చిన్నఅలీ, సంఘం సభ్యులు రామనరసప్పగౌడు, కౌలుట్ల తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

విద్యుత్తు శాఖ ఇంజినీరును నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో కొత్తగా త్రీఫేజ్ విద్యుత్తు స్తంభాలు ఏర్పాటుకు గుంతలు ఇష్టానుసారంగా తవ్వడంతో తాగునీటి పైపులు ధ్వంసమై తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు సంబంధిత ఇంజినీరును నిలదీశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండలాధ్యక్షుడు కేశన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈవోఆర్డీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న అపరిశుభ్రత పరిష్కారానికి కార్యదర్శులు సర్పంచులను సమన్వయం చేసుకోవాలన్నారు. వలసలు అధికంగా ఉన్న గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని కోరితే చర్యలు తీసుకుంటామని ఏపీవో విజయ్‌మోహన్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో బంగారమ్మ, గృహనిర్మాణ శాఖ డీఈఈ ప్రసాద్, ఏవో శివశంకర్, ఏఈ జయన్న సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రం పరిశీలన

మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

పలుకుదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్తు సీఈవో నాసరరెడ్డి పర్యటించారు. చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం నిరుపయోగంగా ఉండటంపై గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కాలువల్లో వ్యర్థాలు తొలగించాలని హరిత రాయబారులను ఆదేశించారు. అనంతరం ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, సచివాలయం సిబ్బంది, సంగాల సర్పంచి హనుమంతు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సి.బెళగల్‌లో ఎంపీడీవో, సచివాలయం-2 కార్యాలయాల్లో దస్త్రాలు పరిశీలించారు. తర్వాత పోలకల్ ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంబదహల్ (సి.బెళగల్,న్యూస్‌టుడే): రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు కంబదహల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. గత నెలలో కర్నూలులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి పుట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని సత్తాచాటారన్నారు. అండర్ 17 విభాగంలో ఎం.డేనియల్, సి.పుష్పావతి, అండర్- 14 విభాగంలో బి.ఇందు ఎంపికైయ్యారన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు అక్బరు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబరచి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప డిమాండు చేశారు. పురపాలక సంఘం కార్యాలయం సమీపంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి రెండోరోజుకు చేరుకుంది. మునెప్ప మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో దాదాపు 13 మంది కార్మికుల చనిపోయారన్నారు. ఏళ్ల తరబడి కార్మిక కుటుంబాల విషయంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాజు, ప్రసాద్, ఏఐటీయూసీ తిమ్మగురుడు, విజయేంద్ర, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నారాయణ, విజయ్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

పోలకల్ (సి.బెళగల్), న్యూస్‌టుడే: శనగ పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో మల్లేషకుమార్ పేర్కొన్నారు. మండలంలోని పోలకల్ గ్రామంలో మంగళవారం రైతు సేవాకేంద్రంలో ఏఈవో హిమబిందు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విత్తనం నాటేటప్పుడు కచ్చితంగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు శిరీష, హిమబిందు వీఏఏ లలితా, శశికాంత్ ఎంపీఈవో వెంకటేశ్వర్లు, భాస్కర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ జఫరుల్లా పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం తనిఖీ చేసి బాలింత వార్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అత్యవసర కేసులు పట్ల మరింత జాగ్రత్తగా వైద్య సేవలు అందించాలన్నారు. మాతాశిశు మరణాల వంటివి జరగకుండా చూడాలన్నారు. వెంట సూపరింటెండెంట్ ఆదినాగేష్, వైద్యులు సుజిత, ఫాతిమా, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ జఫరుల్లా

శక్తి యాప్‌పై అవగాహన సదస్సు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జూలకల్లు ఆదర్శ పాఠశాలలో మంగళవారం శక్తి బృందం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ ఎస్ఎం బాషా, బి.చిన్నరాజు శక్తియాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆపదలో శక్తి యాప్ ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించి, డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ దిల్షాద్ మాట్లాడుతూ.. శక్తి వాట్సాప్ నెంబరు-7993485111, డయల్-112, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, ఉమెన్ హెల్ప్‌లైన్-181, సైబర్ క్రైం 1930 సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గూడూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చిరుత పులులపై దాడులకు పాల్పడొద్దు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: గ్రామస్థులు చిరుత పులులపై దాడులకు పాల్పడవద్దని ఆదోని అటవీశాఖ సెక్షన్ అధికారి భాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని మేకడోన గ్రామంలో మంగళవారం చిరుత పులుల సంచారంపై, ఆ సందర్భంలో గ్రామస్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో ఎక్కడైనా చిరుతలు సంచరిస్తే వాటికి దూరంగా ఉండాలన్నారు. అవి సంచరిస్తున్న కొండ ప్రాంతాల్లో ప్రవేశించొద్దన్నారు. రాళ్లు, కర్రలతో దాడులు, ఉచ్చులు వంటి వేయవద్దన్నారు. కార్యక్రమంలో కుప్పగల్ అటవీ శాఖాధికారి సమీఉల్లా, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విశ్రాంత జీవనంలో నెలకొన్న సమస్యలు ఐక్యతతో పరిష్కరించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బనవాసి ఫారంలో వనంలో మంగళవారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే సంఘం దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు అబ్దుల్ కరీంసాబ్, అధ్యక్షుడు ఏపీవీరన్న, సభ్యులు జగదీష్, సుందరీబాయి తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో ఉపాధి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకంతో ఉపాధి, ఆదాయంతో పాటు పంటల ఉత్పాదక పెంపునకు దోహదపడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి పేర్కొన్నారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఎన్‌బీహెచ్‌ఎం ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రీయ తేనెటీగల శిక్షణపై వారం రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.మౌనిక, డా.శ్రీచందన, డా. నిరంజన్‌రెడ్డి, మాస్టర్ శిక్షకుడు రమేశ్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాఘవేంద్రచౌదరి

సంక్షిప్త సమాచారం

గూడూరు గ్రామీణం: పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో గురువారం పార్వతి పరమేశ్వర కల్యాణం, కార్తిక కడసేవ, అగ్నిగుండ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కోసిగి: కోసిగి మండలాన్ని మహిళ అక్షరాస్యతగా తీర్చిదిద్దాలని వయోజన విద్య పర్యవేక్షులు జాకీర్ ఉస్సేన్ పేర్కొన్నారు. కోసిగిలోని స్త్రీ శక్తి భవన్ పొదుపు మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు.

కోసిగి: మండలంలోని దుద్ది, కోల్మాన్ పేట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలపై ఏవో వరప్రసాద్ అవగాహన కల్పించారు.

ఎమ్మిగనూరు: కళాశాలలో చేరేందుకు విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు మహాయోగిలక్ష్మమ్మ అవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా మంగళవారం తెలిపారు.

సి.బెళగల్: కార్తికమాసం పురస్కరించుకొని ఉరుకుందకు కర్నూలు మండలం రేమట గ్రామస్థులు మంగళవారం తెల్లవారుజాము నుంచి పాదయాత్రగా బయలుదేరారు.

కోడుమూరు గ్రామీణం: ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ తరగతులు ఉంటాయని తాత్కాలిక ఎంపీడీవో కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించే కార్యక్రమానికి అందరూ హాజరు కావాలన్నారు.

ఎమ్మిగనూరు: ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేసిన కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి ఆశయ సాధన కోసం ఉద్యమాలు చేద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధ్యక్షులు రాజు పిలుపునిచ్చారు.

పేదింటి బిడ్డలు.. పోటీల్లో మెరికలు

✦ రాష్ట్రస్థాయిలో రాణిస్తూ..

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ఈ నేస్తాలు నీరు పేద కుటుంబానికి చెందిన విద్యార్థులు. చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిస్తూ.. పతకాల పంట పండిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలుస్తున్నారు. క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. గోనెగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు. వీరందరూ ఒకే తరగతికి చెందిన వారే. నిత్యం పాఠశాల మైదానంలో ఉదయం, సాయంత్రం ఆరు గంటలు సాధన చేస్తున్నారు.

తండ్రి ప్రోత్సహంతో ..

గోనెగండ్లకు చెందిన **చరణ్ సిదార్థ** 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు సరస్వతి, మునిస్వామి వ్యవసాయ కూలీ పనులు చేస్తున్నారు. తండ్రి చిన్నప్పటి నుంచే దివ్యాంగుడు ఆయనే కుమారుడిని ఆటల్లో ప్రోత్సాహిస్తున్నారు. ఈ నేస్తానికి క్రీడలపై ఆసక్తితో ఉంది. పరుగు పందెం పోటీపై శిక్షణ పొందారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పరుగు పందెం పోటీల్లో ద్వితీయ, నాలుగో స్థానాల్లో నిలిచారు. అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపాలనేదే లక్ష్యమట.

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..

గోనెగండ్లకు చెందిన **దావుద్** 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఉస్మాన్, సలీమా వ్యవసాయ చేస్తారు. వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహమే.. క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. శిక్షణ పొంది జిల్లాస్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపించారు. ఆయనే దగ్గరే శిక్షణ తీసుకుంటున్నాడు. ఈనెల డోన్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆ పోటీల్లో పాల్గొనడానికి నిత్యం సాధన చేస్తున్నాడు ఆ నేస్తాం. క్రీడల కోటాలో ఉద్యోగమే దావుద్ లక్ష్యమట.

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని..

గోనెగండ్ల **మధు** 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తారు. వ్యాయామ ఉపాధ్యాయుడి దగ్గర శిక్షణ తీసుకున్నాడు. నిత్యం మైదానంలో సాధన చేసి జిల్లా స్థాయిలో ప్రతిభ చూపాడు. దాంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం దక్కింది. జాతీయ స్థాయిలో రాణించాలని పట్టుదలతో పెరిగింది. క్రీడల్లో రాణించి.. ఉద్యోగం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాడు.

పత్తిని వందశాతం విక్రయించుకోవచ్చు

మంత్రాలయం, న్యూస్‌టుడే: సడలించిన నిబంధనల ప్రకారం పత్తి దిగుబడులను వందశాతం విక్రయించుకోవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త సుజాతమ్మ తెలిపారు. మండలంలోని చెట్నిహళ్లిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ..సీఎం యాప్‌లో పంటను రిజిస్టర్ చేసుకుని, స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఛైర్మన్‌గా గ్రామ సర్పంచిని ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ప్రస్తుత రబీ సీజన్‌లో మొక్కజొన్న విత్తనాలను సకాలంలో విత్తుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సుచరిత సూచించారు. మండలంలోని కల్లుకుంటలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తిని మద్దతు ధరకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ కోరారు. సర్పంచి వరలక్ష్మి అధ్యక్షతన అమడగుంట్లలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

మందు బాబులకు జైలు శిక్ష

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఇద్దరు యువకులకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు గోనెగండ్ల ఇన్‌ఛార్జి సీఐ చిరంజీవి మంగళవారం వెల్లడించారు. నిందితులు మురళి, అన్వర్ బాషాను పత్తికొండ కోర్టులో హాజరుపరచగా పత్తికొండ న్యాయమూర్తి రూ.10 వేలు జరిమానా, వారం రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ ఎస్సై అనీల్‌కుమార్, పోలీసులు కుమారస్వామి, వీరేష్, రామకృష్ణ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని బోదెపాడు గ్రామంలో మంగళవారం బోయ మహేష్ ఇంటిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు జరపగా 2014 కర్ణాటక మద్యం ప్యాకెట్లు దొరికినట్లు పత్తికొండ ఆబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408 ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ: ?: ముజఫర్‌నగర్, పంది పాడులలో మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలి. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **స్థానికులు**

?: బళ్లారిచౌరస్తా సమీపంలో రహదారి అధ్వానంగా మారింది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మరమ్మతులు చేయాలి. - **వీరేష్**

✔: సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. - **నగరపాలక అధికారులు**

ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నవంబర్ 19 నుంచి 21వ తేదీ వరకు చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 పోటీలకు బి.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సంపత్‌కుమార్ ఎంపికయ్యారు. త్వరలో జరిగే అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు పదో తరగతి విద్యార్థి జహీర్‌ను ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయుడు శంకర్ అభినందించారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

మాదకద్రవ్య రహిత సమాజంగా తీర్చిదిద్దుదాం

మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: మాదకద్రవ్య రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొండారెడ్డి బురుజు వద్ద నగరపాలక ఉద్యోగులు, సిబ్బందితో ఆయన మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యాధికారి నాగశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపు ఆలోచన సరికాదు

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీలు పెంచే ఆలోచనను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు డిమాండ్ చేశారు. మంగళవారం దిన్నెదేవరపాడు సమీపంలోని ఏపీఈఆర్‌సీ కార్యాలయం ముందు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మరో రూ.12,717కోట్లు విద్యుత్తు భారం వేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అభ్యంతరాలను ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా తెలిపినట్లు చెప్పారు. అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచమని, స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయమని చెప్పి ప్రస్తుతం అన్ని పనులు చేస్తున్నారన్నారు. నాయకులు రాధాకృష్ణ, రామకృష్ణ, ఆంజిబాబు, నారాయణ, రాజశేఖర్, రాముడు, నగేష్ పాల్గొన్నారు.

శివారులు సమస్యల నిలయాలు

★ అభివృద్ధికి నోచుకోని పలు కాలనీలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కల్లూరు అర్బన్ పరిధి శరవేగంగా విస్తరిస్తోంది. శివారులో కాలనీలు వెలుస్తున్నాయి. కాలనీలలో కనీస మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించడంలో నగరపాలక యంత్రాంగం వివక్ష చూపుతోంది. మట్టి రోడ్లలో, వర్షాలొస్తే బురదదారుల్లో రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొంది. కాలనీల మధ్యలో మురుగు కుంటలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువలు, సీసీ రహదారులు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ మురుగునీరు, వర్షపునీరు నిలిచిపోయి కుంటలను తలపిస్తున్నాయి. దోమలు వ్యాప్తి చెంది కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

● నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీలో కొన్ని వీధుల్లో మురుగునీరు ఇళ్ల మధ్యలో ప్రవహిస్తోంది. చెత్తచెదారం పెరిగిపోయింది. సీసీ రహదారులు, మురుగు కాలువలు నిర్మించడం లేదు. మురుగుమయమైన ప్రాంతంలో ముక్కుమూసుకుని జీవనం సాగించే దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. దశాబ్దాలుగా మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి కాలనీలో నివాసముంటున్నా.. ఏటా రూ.లక్షల పన్నులు చెల్లిస్తున్నా.. కనీసం సీసీ రహదారులు నిర్మించడం లేదు. శివారు కాలనీలపై ఎందుకు వివక్ష చూపిస్తున్నారని కాలనీవాసి జగదీష్ ప్రశ్నిస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు

వీధి దీపాలు వెలిగితే ఆరిపోవు.. ఆరిపోతే వెలగవు. రాత్రివేళల్లో చిమ్మచీకట్లలో నివాసముండే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా వీధి దీపాలకు మరమ్మతులు చేయించని పరిస్థితి నెలకొంది. తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయి. శివారు ప్రాంతాలకు అరకొరగా తాగునీరు సరఫరా అవుతోంది. కల్లూరు ప్రాంతంలో శివారు కాలనీల పట్ల నగరపాలక యంత్రాంగం వివక్ష చూపుతోందని.. కాలనీలు సమస్యలకు నిలయాలుగా మారాయి. జనావాసాలు నివాసముండే ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కనీస సదుపాయాలు కల్పించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఎల్కూరు ఎస్టేట్ పెట్రోల్ బంక్ సమీపంలో వానొస్తే కాలనీ రహదారులు బురదమయంగా మారుతున్నాయి. జనవాసాలు నివాసముండే ప్రాంతాల్లో దట్టమైన ముళ్ల పొదలున్నాయి. విషపురుగులు సంచరిస్తున్నాయి. కాలనీలు అపరిశుభ్రతకు ఆవాసాలుగా మారాయని.. నగరపాలక యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని సీసీ రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు చేపట్టాలని కాలనీవాసి రామిరెడ్డి కోరారు.

● ఎఫ్‌సీఐ కాలనీ-2లో భార్గవ్ హోమ్స్, శ్రీశైలం ఎంప్లాయిస్ కాలనీ, ఉమా నగర్, స్కంద ఉన్నతి విల్లాస్, రవిరెడ్డి హోమ్స్ తదితర ప్రాంతాల్లోని రహదారులు బురదమయంగా ఉన్నాయి. వానొస్తే కాలనీవాసుల తిప్పలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల తరబడి కాలనీలో నివాసముంటున్నా.. నేటికీ మట్టి రోడ్లపై రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొంది. శివారు కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించడంలో నగరపాలక యంత్రాంగం పూర్తిగా విఫలమైందని కాలనీవాసులు నవీన్‌కుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవమ్మ వాపోయారు. నగరపాలక యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని కాలనీలో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టాలని వారు కోరారు.

మోసం ఘటనపై విచారణ జరపాలి

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు గిరిజన యువతిని నమ్మించి మోసం చేసిన ఘటనపై విచారణ జరపాలని ఎస్టీ సంఘాల నాయకులు అక్కులప్పనాయక్, చంద్రప్ప ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోలా బుజ్జిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు విష్ణు నాయక్ తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి పెంపు

పాఠశాల విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ధైర్య సాహసాలు అలవడాలంటే ఎన్‌సీసీలో చేరాలని వన్ ఆంధ్రా మెడికల్ కమాండింగ్ అధికారి మేజర్ చైతన్యరెడ్డి అన్నారు. దామోదరం సంజీవయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరితే దేశభక్తి పెరుగుతుందన్నారు. హెచ్‌ఎం విజయనిర్మల, పాఠశాల ఎన్‌సీసీ అధికారి దాసరి సుధీర్ పాల్గొన్నారు.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
◆ ఇంటికొక మరుగుదొడ్డి నిర్మిద్దాం..
◆ నిర్మల భారతాన్ని సాధిద్దాం..
◆ పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత
◆ సంపూర్ణ పారిశుద్ధ్యం అందరి ఆరోగ్యానికి మూలం
టి.మేరీ థెరిసా గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారి
దిగువపాడు గ్రామం, కర్నూలు మండలం.

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
★ ప్రగతికి నిదర్శనం - మరుగుదొడ్డి నిర్మాణం
★ మరుగుదొడ్డి నిర్మించు - నిన్ను నీ కుటుంబాన్ని వ్యాధుల నుండి కాపాడు
★ బహిరంగ మలవిసర్జన మాను - భావితరాల ప్రగతికి తోడ్పడు.
★ సిరి సంపదలు ఉన్న మరుగుదొడ్డిలేని ఇంటికి మన అమ్మాయిని ఇవ్వనేవద్దు.
ఎన్.సువేద
దేవమాడ గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారిణి
దేవమాడ గ్రామం, కర్నూలు మం॥

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
➡ ప్రగతికి నిదర్శనం - మరుగుదొడ్డి నిర్మాణం.
➡ మరుగుదొడ్డి నిర్మించు - నిన్ను నీ కుటుంబాన్ని వ్యాధుల నుండి కాపాడు.
➡ బహిరంగ మల విసర్జన మాను - భావితరాల ప్రగతికి తోడ్పడు.
➡ సిరి సంపదలు ఉన్నా మరుగుదొడ్డి లేని ఇంటికి మన అమ్మాయిని ఇవ్వనేవద్దు.
ఆకేపోగు జయ్యన్న సర్పంచ్ | బి.గోపాల్ పంచాయతీ అభివృద్ధి అధికారి
బి.తాండ్రపాడు గ్రామం, కర్నూలు మం॥.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
◆ ప్రగతికి నిదర్శనం - మరుగుదొడ్డి నిర్మాణం
◆ మరుగు దొడ్డి నువ్వుకట్టుకో - నీ ప్రాంత పరువు నిలబెట్టుకో...
◆ ఇంటికొక మరుగు దొడ్డి నిర్మిద్దాం..
◆ నిర్మల భారతాన్ని సాధిద్దాం..
యస్.జాకీర్ హుశేన్, గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారి
దిన్నెదేవరపాడు గ్రామం, కర్నూలు మండలం.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
◆ ఇంటికొక మరుగుదొడ్డి నిర్మిద్దాం..
◆ నిర్మల భారతాన్ని సాధిద్దాం..
◆ పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత
◆ సంపూర్ణ పారిశుద్ధ్యం అందరి ఆరోగ్యానికి మూలం
బి.శీలమ్మ, సర్పంచ్ | వై.హేమంత్ కుమార్ రెడ్డి, గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారి,
పసుపల గ్రామం, కర్నూలు మండలం.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
◆ ఇంటికొక మరుగుదొడ్డి నిర్మిద్దాం..
◆ నిర్మల భారతాన్ని సాధిద్దాం..
◆ పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత
◆ సంపూర్ణ పారిశుద్ధ్యం అందరి ఆరోగ్యానికి మూలం
సి.అంకాలప్ప నాయుడు, గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారి
గొందిపర్ల గ్రామం, కర్నూలు మండలం.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
◆ ఇంటికొక మరుగుదొడ్డి నిర్మిద్దాం..
◆ నిర్మల భారతాన్ని సాధిద్దాం..
◆ పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత
◆ సంపూర్ణ పారిశుద్ధ్యం అందరి ఆరోగ్యానికి మూలం
D.ఓబులరెడ్డి, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి,
గార్గేయపురం గ్రామం, కర్నూలు మండలం.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
◆ ఇంటికొక మరుగుదొడ్డి నిర్మిద్దాం..
◆ నిర్మల భారతాన్ని సాధిద్దాం..
◆ పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత
◆ సంపూర్ణ పారిశుద్ధ్యం అందరి ఆరోగ్యానికి మూలం
యం.రాఘవేంద్ర రావు గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారి
నిడ్జూరు గ్రామం, కర్నూలు మండలం.

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం
◆ ఇంటికొక మరుగుదొడ్డి నిర్మిద్దాం..
◆ నిర్మల భారతాన్ని సాధిద్దాం..
◆ పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత
◆ సంపూర్ణ పారిశుద్ధ్యం అందరి ఆరోగ్యానికి మూలం
యం.నరసింహ గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారి
ఇ.తాండ్రపాడు గ్రామం, కర్నూలు మండలం.

యాంటి మైక్రోబియల్స్ అతిగా వాడితే అనర్థం

మాట్లాడుతున్న వైద్యకళాశాల ప్రిన్సిపల్ చిట్టినరసమ్మ, పాల్గొన్న ఆసుపత్రి పర్యవేక్షకుడు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: యాంటి మైక్రోబియల్స్ పరిధి దాటి ఉపయోగిస్తే మానవ, జంతువుల ఆరోగ్యంతో పాటు, పర్యావరణం కూడా దెబ్బతింటుందని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ తెలిపారు. మంగళవారం కర్నూలు వైద్యకళాశాలలో మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాంటి మైక్రోబెల్ రెసిస్టెన్స్ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. యాంటి మైక్రోబెల్ రిసిస్టెన్స్ అంటే మితిమీరిన మందులు వాడకం వల్ల బ్యాక్టీరియా, వైరస్, శిలీంద్రాలు, పరాన్నజీవులు స్పందించడం మానేస్తే అంటువ్యాధులు చికిత్స చేయడం కష్టతరమవుతుందని తెలిపారు. అవగాహన పెంచుకొని, అవసరం మేరకే వాడాలని కోరారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎ.యం.ఆర్ గురించి విస్తృత అవగాహన కలిగిస్తున్నారని. . మందుల వాడకం నిర్ణీత స్థాయిలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రేణుకాదేవి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడి డాక్టర్ సుధాకుమారి, గైనిక్ హెచ్‌వోడి డాక్టర్ సావిత్రి, ఫార్మా కళాశాల హెచ్‌వోడి డాక్టర్ రాజేష్, డాక్టర్ శివబాల, పీజీలు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ పనులను వేగవంతం చేయండి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వంతెన వరకు రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ తెలిపారు. నగరపాలక కార్యాలయంలో మంగళవారం ఆయన పట్టణ ప్రణాళిక, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారి విస్తరణలో ప్రభావితమవుతున్న 180 ఆస్తుల్లో ఇప్పటి వరకు 50 మంది యజమానులు ముందుకొచ్చి అవసరమైన పత్రాలు సమర్పించారని తెలిపారు. మిగిలిన యజమానులు త్వరగా సహకరిస్తే విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ప్రభావమయ్యే వారికి టీడీఆర్ బాండ్ల జారీ, భవన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ ఎంఈ సునీల్, డీఈ ఫణిరాం, డీసీపీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆర్థిక చేయూత

★ నేడు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు విడుదల

మండలాలు	అర్హులైన రైతులు	ఆర్థిక సాయం (రూ.కోట్లలో)
కర్నూలు అర్బన్	295	0.18
కర్నూలు రూరల్	8,789	5.71
కల్లూరు	10,669	7.09
ఓర్వకల్	9,618	6.27

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం "సూపర్ సిక్స్" కార్యక్రమంలో భాగంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించింది. మొదటి విడతను గత ఆగస్టు 2వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి కుటుంబానికి రూ.7 వేల చొప్పున జమ చేసింది. రెండో విడత నేడు(బుధవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కడప జిల్లా కమలాపురంలో విడుదల చేయనున్నారు. రెండో విడతలో కూడా రూ.7 వేల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేయనున్నారు.

కల్లూరులో అత్యధికంగా రూ.7.09 కోట్లు 10,669 మంది రైతుల ఖాతాల్లో జమకానుంది. అత్యల్పంగా కర్నూలు అర్బన్‌లో 295 మంది రైతుల ఖాతాలకు రూ.0.18 కోట్లు జమ కానుంది. పథకం కింద నిధులు విడుదల కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్‌ఎస్‌కె) ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. రైతుల ఖాతాల్లోకి నిధులు విడుదల చేయడంతోపాటు వ్యవసాయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు కూడా రైతులకు వివరించనున్నారు. అగ్రిటెక్, డిమాండ్ ఉన్న పంటల సాగు, మార్కెట్ సౌకర్యాల పెంపు, ప్రకృతి సేద్యం, భూసార పరీక్షలు, పంట ఉత్పత్తులకు ఆహారశుద్ధి ద్వారా అధిక ధర లభించేలా చేయడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

సమయపాలన పాటించని అధికారులు

ఖాళీ కుర్చీలతో తహసీల్దారు కార్యాలయం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఓర్వకల్లు తహసీల్దారు కార్యాలయంలో పని చేసే అధికారులు సమయపాలన పాటించక పోవటంతో పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. మంగళవారం ఉదయం 11.50 గంటల వరకు ఏ ఒక్క అధికారి రాకపోవటంతో అప్పటికే పలు సమస్యలపై వచ్చిన ప్రజలు నిరీక్షించారు. ఉదయం పది గంటలకు రావాల్సిన అధికారులు మధ్యాహ్నం 12.30 గంటలైనా రావటంలేదని పలు గ్రామాల ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులను సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వాపోతున్నారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించండి

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారిణి ప్రసూనను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చలిలో దుప్పట్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు కోడివెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్ ఉన్నారు.

విద్యాభివృద్ధిలో దాతల సహకారం అవసరం

ఓర్వకల్లు న్యూస్‌టుడే: విద్యాభివృద్ధిలో దాతల సహకారం మరవలేనిదని ప్రధానోపాధ్యాయులు జయన్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన రమేష్ రెడ్డి కుటుంబ సభ్యులు కంప్యూటర్‌ను అందజేశారు.

గణపతి ఆలయంలో ధన్వంతరీ హోమం

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ధన్వంతరీ జయంతి పురస్కరించుకుని స్థానిక గణేష్‌నగర్ విజయ గణపతి ఆలయంలో ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో మంగళవారం హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి రామారావు, డా.మోక్షేశ్వరుడు, డా.వెంకటరమణ, ఆరోగ్యభారతి రాష్ట్ర కార్యదర్శి డా.డీవీఎస్ రామశర్మ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మన ఆహారం-మన ఆరోగ్యంపై వైద్యులు సూచనలు చేశారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు స్థానిక నెహ్రూ నగర్‌లోని మందిరంలో ప్రారంభమయ్యాయి. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ వార్డుల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సేవాసమితి కన్వీనర్ మాకా అశోక్ కుమార్, సేవాదల్ సందీప్, మహిళాసేవాదల్ సంధ్య, సరోజ, శారద తదితరులు పాల్గొన్నారు. సత్యసాయి కళాక్షేత్రంలో బాలవికాస్ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయండి

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: హిందూ ప్రచార సాధకుల కులానికి రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం బుధవారిపేటలో బేడ బుడగ జంగం కులం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనం నిర్వహించారు. మనోహర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రిజర్వేషన్ల ప్రక్రియ పెండింగ్‌లో ఉందని, దీనివల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దూపం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: అనంతపురంలో మంగళవారం నియోజకవర్గ తెదేపా క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఉమ్మడి అనంతపురం జిల్లా తెదేపా పరిశీలకులు కోవెలమూడి రవీంద్ర, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 19వ తేదీ నుంచి అధికారులకు, ప్రజాప్రతినిధులకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగఅనసూయ మంగళవారం తెలిపారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం మాజీ అధ్యక్షులు నాగన్న మృతి తీరని లోటు అని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకె రంగస్వామి పేర్కొన్నారు. కల్లూరు ఎస్టేట్‌లోని నాగన్న భౌతికకాయానికి వారు నివాళి అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి సందర్భంగా ప్రధాని, రాష్ట్రపతి వస్తున్న నేపథ్యంలో అక్కడ పారిశుద్ధ్య సేవల కోసం కర్నూలు నగరపాలకసంస్థ నుంచి 46 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఇద్దరు శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మంగళవారం వెళ్లారు.

తడకనపల్లె (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి తడకనపల్లె గ్రామంలోని సచివాలయాన్ని ఎంపీడీవో జీఎన్‌ఎస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్, కర్నూలు జిల్లా సహకార కేంద్రం బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యూనియన్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అడుగుపెట్టాలన్నా కష్టమే

మార్కెట్‌లో మురుగునీరు

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే: కర్నూలులోని కూరగాయల మార్కెట్ అపరిశుభ్రతకు చిరునామాగా మారింది. నిత్యం ఎటు చూసినా బురదనే కనిపిస్తుంది. వర్షం లేనప్పుడు కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. బురదలోనే కూరగాయల విక్రయాలు చేస్తుంటారు. కొనేందుకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఏడీఎం కార్యాలయం నుంచి డ్రైనేజీ కాలువ మార్కెట్ మీదుగా వెళ్తుంది. ఈ మురుగు కాలువ పొంగిపొర్లడంతో కూరగాయల మార్కెట్ బురద నీటిమయంగా మారుతోంది.

మురుగులోనే నడక సాగిస్తూ..

నగరంలోని వివిధ కాలనీ వాసులు కూరగాయలు కొనేందుకు, చిరువ్యాపారులు అమ్మకానికి మార్కెట్‌కు వస్తుంటారు. మురుగు మార్కెట్లో ప్రధాన రోడ్లపై ప్రవహిస్తోంది. కూరగాయల మార్కెట్ మొత్తం ఆవరించింది. మురుగునీటిలో నడక సాగిస్తూ.. బురదదారుల్లో కాలు కదుపుతూ కూరగాయలు కొనుగోలు చేసే దుస్థితి నెలకొందని వెంకటరమణ కాలనీకి చెందిన రామిరెడ్డి అనే వినియోగదారుడు ఆగ్రహించారు. వర్షం లేదు. మురుగు ఇంత పెద్దఎత్తున ప్రవహిస్తుంటే మార్కెట్ కమిటీ అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు.

పదేళ్లుగా ఇదే పరిస్థితి

బురదలోనే కూర్చొని వ్యాపారులు కూరగాయలను విక్రయిస్తుండగా.. వినియోగదారులు సైతం బురదలో కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. రోజుకు కనీసం 800-1000 వెయ్యి మందికి పైగా మార్కెట్‌ను సందర్శిస్తుంటారు. బురదలోనే క్రయ విక్రయాలు జరుగుతున్నాయని చిరువ్యాపారి రాజేష్ వాపోయారు. నెలనెలా రూ.లక్షల ఆదాయం వస్తున్నా.. పదేళ్లకు పైగా ఈ కూరగాయల మార్కెట్ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారిందని ఆయన మండిపడ్డారు. రోజు వారీ కనీసం చెత్త చెదారాన్ని శుభ్రం చేయరు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టితో మార్కెట్ నిండిపోయి ఉంటుందన్నారు. జిల్లా పాలనాధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కూరగాయల మార్కెట్‌లో మురుగునీటి వ్యవస్థను మెరుగుపరచాలని నగరవాసులు, వ్యాపారులు కోరుతున్నారు.

బిల్డర్స్ డే శుభాకాంక్షలు

అపూర్వ అక్షర్‌థామ్ సమీపంలో అయోధ్య నగర్
@ నందికొట్కూరు రోడ్, కర్నూలు.
రూ.48.99 లక్షలు
(1) కేవలం రూ. 2 లక్షలు మాత్రమే చెల్లించండి ఇల్లు సొంతం చేసుకోండి. (2) బ్యాంకు లోన్ సౌకర్యం కలదు.
9966986866 9963254517

केनरा बैंक भारत सरकार का उपक्रम Syndicate
Founder's day 19th November-2025
120 Years of Trust
Canara Bank Branches Kurnool Region

Shri Ammembal Subba Rao Pai 1852-1909 our Beloved Founder
As we celebrate our 120th Founder's Day, we gratefully remember our beloved founder and visionary leader Shri Ammembal Subbarao Pai on his 173rd birth anniversary. We are immensely grateful to our valued customers, stake holders and well-wishers, we look forward for your continued support and patronage. Thank you!
Branch Incharge & Staff Canara Bank.
Kurnool Main Branch | Budhawarpet Branch
NR Peta Branch | Ramallakota Branch
Kurnool Housing Board Colony, Branch | Kurnool Chennamma Circle Branch
Pasupula Branch | Varkur Branch
Pyalakurthy Branch | Kalugotla Branch
Mamidalapad Branch | Dhone Branch

(c) eenadu

బావితరాలకు స్ఫూర్తి

బేతంచెర్ల పట్టణంలోని బైటిపేట కాలనీలో పురాతన బావి వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా మారింది. చెత్తాచెదారాలు వేయడంతోపాటు ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయి అధ్వానంగా మారింది. దీనిపై 'బావిలో తొలగని వ్యర్థాలు' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైంది. స్పందించిన కాలనీ యువకులు, బేతంచెర్ల వైబ్ ఛానల్ సభ్యులు, నగర పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది కలిసి వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. – న్యూస్‌టుడే, బేతంచెర్ల

పచ్చని గూడు

ఏదైనా నిర్మాణం చేస్తున్న సమయంలో చెట్టు అడ్డుగా ఉంటే నరికేస్తారు. వృక్ష ప్రాధాన్యాన్ని పెద్దగా పట్టించుకోరు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన శిల్పి దురుగడ్డ రవీంద్రాచారి ఈ ఏడాది ఫిబ్రవరిలో నంద్యాల రోడ్డులో ఇంటి నిర్మాణం ప్రారంభించారు. నిర్మాణ ప్రాంతంలో వేప చెట్టు ఉండేది. మేస్త్రీలు చెట్టు కొట్టేస్తే ఇంటి నిర్మాణం సులభంగా, అందంగా ఉంటుందన్నారు. రవీంద్రాచారి మాత్రం తనకు ఇల్లు ఎంత ముఖ్యమో.. చెట్టు కూడా అంతే అన్నారు. చెట్టుకు ఎలాంటి హాని కలిగించకుండా కాండం చుట్టూ స్లాబ్ వేసి రెండు అంతస్తుల ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందుకు అదనంగా రూ.50 వేలు ఖర్చు వచ్చిందని రవీంద్రాచారి తెలిపారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

మారింది తీరు.. మారంది వారు

స్లాట్ బుకింగ్ వచ్చినా తప్పని తిప్పలు ● రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారిదే హవా

పారదర్శకత.. అవినీతి రహిత.. మెరుగైన వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇది అంతంతమాత్రంగానే అమలవుతోంది. ఇప్పటికీ ఆయా కార్యాలయాల్లో దస్తావేజులేఖర్ల ద్వారానే అన్ని కార్యకలాపాలు సాగుతున్నాయి. కార్యాలయ అధికారులు, సిబ్బంది పరోక్షంగా వీరినే ప్రోత్సహిస్తున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, కర్నూలు గాయత్రీ ఎస్టేట్, ఎమ్మిగనూరు

కానరాని అవగాహన

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త విధానంపై అవగాహన కల్పించేలా ఎక్కడా బ్యానర్లు కానీ.. బోర్డులు ఏర్పాటు చేయలేదు. హెల్ప్‌డెస్క్‌ల ఆచూకీ కానరావడం లేదు. స్లాట్ విధానంపై కనీస సమాచారం ఉండటం లేదు. అడిగినా చెప్పేవారు కరవయ్యారు.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మధ్యవర్తుల రాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆశాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ స్థానాలు ఖాళీగా ఉండటంతో పర్యవేక్షణ కరవైంది.

కార్యాలయాలు 24
నిత్యం రిజిస్ట్రేషన్లు సుమారు 500
ఆరు నెలల్లో జరిగినవి 1,02,785
రోజువారీ ఆదాయం రూ. 1.50 కోట్లు

నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో దస్తావేజులేఖర్ల ద్వారానే లావాదేవీలు

పది నిమిషాల్లో పూర్తి కావాలి

● నంద్యాల జిల్లాలో 13, కర్నూలులో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రెండు జిల్లా కేంద్రాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీ నుంచి స్లాట్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. సత్ఫలితాలు ఇవ్వడంతో జూన్ నుంచి అన్ని కార్యాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

● జిల్లా కేంద్రాల్లోని ఒక్కో కార్యాలయంలో నిత్యం 78, మిగిలిన ప్రాంతాల్లోని కార్యాలయాల్లో నిత్యం 39 స్లాట్లు అందుబాటులో ఉంచారు. 10 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. పేరుకు స్లాట్ బుకింగ్ అవుతున్నా అంతా దస్తావేజు లేఖర్లే చేస్తుండటం గమనార్హం.

దగ్గరుండి నడిపిస్తారు

● సమయం ఆదా కోసం ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చినా నిర్ణీత సమయంలోగా ఎక్కడా లావాదేవీలు పూర్తవడం లేదు. ప్రత్యేకించి ఎక్కువ దస్తావేజులు వచ్చే కల్లూరు, నంద్యాల, కర్నూలు, ఆదోనిలలో సమస్య ఎక్కువగా ఉంది. దస్తావేజులను డాక్యుమెంట్ రైటర్లే తీసుకొచ్చి కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. వేలి ముద్రలు వేయించడం నుంచి ఐరిస్ తీయడం వరకు అన్నివారే చేస్తున్నారు. స్లాట్‌లనూ వారే బుక్ చేస్తుండటం గమనార్హం.

● రూ.లక్షలు, రూ.కోట్లు విలువ చేసే పొలాలు, ఇళ్ల స్థలాలు కావడం.. అవగాహన, అనుభవం లేని విధానం వైపు మొగ్గు చూపడం ఎందుకన్న ఉద్దేశంతో చాలామంది దస్తావేజులేఖర్లనే ఆశ్రయిస్తున్నారు. జనం బలహీనతను మధ్యవర్తులు అవకాశంగా చేసుకుని అదనంగా వసూలు చేస్తున్నారు.

● దస్తావేజులేఖరుల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని వెళ్తేనే సకాలంలో సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. లేకుంటే పలు లోపాలు చూపి ఇబ్బందులు పెడుతున్నారు.

అధనం ఇస్తేనే..

● ఇప్పటి వరకు మధ్యవర్తులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేందుకు డబ్బులు తీసుకుని సబ్ రిజిస్ట్రార్లు, కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ముట్టజెప్పేవారు. మధ్యవర్తులు కొంత తీసుకునేవారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించేందుకు మధ్యవర్తులు అదనంగా రూ.1,000 తీసుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ప్రజల అమాయకత్వాన్ని అవకాశంగా చేసుకుని ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు.

నిరీక్షణ తప్పడం లేదు

– ఖాదర్‌బాషా, నంద్యాల

నంద్యాలలోని నందమూరి నగర్‌లో రెండు సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్ కోసం మధ్యాహ్నం 12 గంటలకు స్లాట్ బుకింగ్ అయిందంటే వచ్చా. 1.30 దాటినా రిజిస్ట్రేషన్ పూర్తి కాలేదు. స్లాట్ బుకింగ్ కూడా డాక్యుమెంట్ రైటరే చేశారు. 10 నిమిషాల్లో అయిపోతుందని చెప్పినా చాలా సమయం పట్టింది.

వేదికపై భాగ్యశ్రీ, రామ్ పోతినేని

ఆంధ్రా కింగ్ సందడి

నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమాకు సంబంధించి ప్రీ రిలీజ్ కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ, డైరెక్టర్ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. కళాకారుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. 600 డ్రోన్లతో ఇచ్చిన ప్రదర్శన అందరినీ కట్టిపడేసింది. – ఈనాడు, కర్నూలు

అభిమానుల కేరింతలు

నవోదయ హాల్‌టికెట్లు విడుదల

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హాల్‌టికెట్లు విడుదల చేసినట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి మంగళవారం తెలిపారు. 13.12.2025న పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్లను ఈనెల 19వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుంటే 085212-29454 నంబరును సంప్రదించాలన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళలకు టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ తెలిపారు. ఈనెల 24 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు బి.తాండ్రపాడు టీటీడీసీ భవనం సమీపంలోని సంస్థ కార్యాలయంలో లేదా 08518-273710, 9000710508, 630449 1236ను సంప్రదించాలన్నారు.

వణుకు తగ్గదు.. కునుకు పట్టదు

● ఆసుపత్రిలో కానరాని వసతి

పరిశీలన

కుమార్తె పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో తోడుగా ఉండేందుకు వచ్చిన తల్లి.. తండ్రి కాలుకు శస్త్రచికిత్స చేయడంతో చూడడానికి వచ్చిన కుమారుడు.. ఏడేళ్ల కుమారుడు జ్వరంతో బాధపడుతుంటే ఆసుపత్రి కొచ్చిన తండ్రి.. ఇలా సర్వ'జనం' చలికి వణుకుతోంది.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు 'వసతి' లేకపోవడంతో ఆరుబయటే నిద్రిస్తున్నారు. దోమలు కుడుతున్నా.. పక్కనే పందులు తిరుగుతున్నా.. శునకాలు భౌ..భౌమంటూ బెదిరిస్తున్నా చలిలో నిరీక్షించాల్సిందే.
– న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల, ఆదోని వైద్యాలయం

నంద్యాల ఆస్పత్రిలో ఓపీ కేంద్రం వద్ద నిద్రిస్తున్న సహాయకులు

ఆరుబయట చలికి వణుకుతూ..

వెయ్యి మంది ఆరుబయటే

● నంద్యాల సర్వజన ఆసుపత్రిలో 490 పడకలున్నాయి. ప్రస్తుతం 388 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 94 మంది బాలింతలు, 40 మంది చిన్నారులు ఉన్నారు.

● ఒక రోగి తరఫున సహాయకులుగా ఇద్దరి నుంచి ముగ్గురు వరకు ఉంటున్నారు. నిత్యం సహాయకుల సంఖ్య వెయ్యికి పైగా ఉంటోంది. వీరు ఉండేందుకు ఆసుపత్రిలో ఎలాంటి 'వసతి' సౌకర్యం లేదు.

● ఒక రేకుల షెడ్డు మాత్రమే ఉంది.. 24 గంటల ఓపీకి ఈ రేకుల షెడ్డు నుంచే వెళ్లాల్సి వస్తోంది.. దీంతో అక్కడ 'వసతి' పొందే సౌకర్యం లేదు. చేసేది లేక రోడ్డు విభాగిని, ఆసుపత్రి ఆవరణలో చెట్ల కింద, ఆరుబయట నిద్రపోతున్నారు.

● కర్నూలు సర్వజన వైద్యశాలలో వివిధ విభాగాల్లో 1,345 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరంతా ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు. వీరిలో ఎక్కువ మంది గైనిక్, పీడియాట్రిక్, అత్యవసర విభాగం, కార్డియాలజీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో ఉన్నారు. వీరితోపాటు జనరల్ మెడిసిన్, సర్జరీ, ఏఎంసీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో మరికొందరు చికిత్స పొందుతున్నారు.

● గర్భిణులు, బాలింతల సహాయకులే వెయ్యి మంది ఉన్నారు. కార్డియాలజీ, జనరల్ సర్జరీ తదితర విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులకు సేవ చేసేందుకు పెద్దసంఖ్యలో సహాయకులుంటారు. వీరంతా ఆరుబయటే ఉంటున్నారు.

● గైనిక్, పీడియాట్రిక్ ప్రాంతంలో షెడ్లు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో సహాయకులు ఉండటంతో సరిపోవడం లేదు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పాత 24 ల్యాబ్ వద్దనున్న రెండు షెడ్లలో తలదాచుకుంటున్నారు. సూపర్ స్పెషాలిటీ, శుశ్రుత భవన్ పక్కన రోగుల సహాయకులు ఉంటున్నారు. అత్యవసర విభాగం, ఏఎంసీ విభాగాలలో ఉన్నవారి సహాయకులకు షెడ్లు లేవు. అందరూ ఆరుబయట, వార్డు బయట కూర్చొని నిరీక్షించాల్సిందే.

బట్టమేకకు ఊపిరి

అంతరించి పోయే ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్న పక్షిజాతుల్లో బట్టమేక పిట్ట ఒకటి.. దీన్ని సంరక్షణకు అటవీ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. రాష్ట్రంలో 1998లో సుమారు 25 వరకు ఉండేవి.. రోళ్లపాడు ప్రాంతంలో ఇవి ఎక్కువగా కనిపించేవి. ఈ నేపథ్యంలో మిడుతూరు మండలం రోళ్లపాడులో 9.37 చ.కి.మీ విస్తీర్ణంలో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐదారేళ్ల కిందట బట్టమేక పక్షి వచ్చి గుడ్డు పెట్టి వెళ్లినట్లు గుర్తించారు. మళ్లీ రావడం లేదు. దీంతో ఈ పక్షి జాతిని కాపాడుకునేందుకు సొసైటీ ఫర్ బస్టర్డు రికవరీ ప్రోగ్రామ్ పేరుతో ప్రణాళిక సిద్ధం చేశారు. రాజస్థాన్ ప్రాంతంలో వందల వరకు పక్షులున్నాయి. అక్కడ పక్షుల గుడ్లు ఇంక్యుబేటరులో ఉంచి సంతతిని ఉత్పత్తి చేస్తున్నారు. వాటిలో కొన్నింటిని ఇక్కడికి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించారు. "బాంబే నేచురాలిటీ హిస్టరీ సొసైటీ ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుంటూ బట్టమేక పక్షుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లనున్నట్లు" కార్యక్రమ నిర్వహణ అధ్యక్షుడు మాండ్ర లింగారెడ్డి తెలిపారు.
– ఈనాడు, కర్నూలు, న్యూస్‌టుడే, నందికొట్కూరు, మిడుతూరు

డాడ్జ్‌బాల్.. గోల్

ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న బి.వెంకట్ డాడ్జ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డాడ్జ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, ఆదోని ఆర్ట్స్ కళాశాల నిర్వాహకుల ప్రోత్సాహంతో మూడేళ్లుగా సత్తా చాటుతూ జిల్లా.. రాష్ట్ర.. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం ఉడుపి సమీపంలో జరిగిన జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ జట్టులో స్థానం సంపాదించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మలేసియా దేశంలోని కౌలాలంపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు జాతీయ జట్టు వెంట కౌలాలంపూర్‌కు బయల్దేరారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో కర్ణాటక రాష్ట్రం హసన్, బెంగళూరు, మహారాష్ట్ర, హరియాణా ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి పతకాలు సొంతం చేసుకున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

పార్సిల్ డెలివ్రీ

● గోదాముల్లో పేరుకుపోతున్న వైనం
● ఇంటింటి సేవలకు గ్రహణం

1 కర్నూలులో నివాసముంటున్న విజయ్ ఈ నెల ఒకటో తేదీన హైదరాబాద్ నుంచి డోర్ డెలివరీ పేరుతో పార్సిల్ చేశారు. 15 రోజులైనా రాకపోవడంతో బస్టాండులోని కార్గో కేంద్రానికి వెళ్లారు. అక్కడి గోదాములో రెండు గంటలు వెతకాల్సి వచ్చింది.

	నంద్యాల	కర్నూలు
పార్సిళ్లు	22,478	33,710
ఆదాయం (రూ.లలో)	38,95,215	53,64,000

నెల రోజుల్లో పేరుకుపోయిన పార్సిళ్లు

ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ)లో లాజిస్టిక్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకొచ్చిన డోర్ పికప్- డోర్ డెలివరీ ప్రక్రియకు కాంట్రాక్టు సంస్థ మంగళం పాడింది. తమ వస్తువులను ఇంటి వద్దకే తెచ్చి ఇవ్వాలని వినియోగదారులు ఆన్‌లైన్లో నమోదు చేసుకొంటున్నారు. నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సంస్థ ప్రతినిధులు ఇళ్ల వద్దకు చేర్చడం లేదు. 48 గంటలు గడిచిపోవడంతో ప్రతి గంటకు రూ.5 చొప్పున జరిమానా చెల్లించి పార్సిల్ తీసుకోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు, నంద్యాల రైతునగరం

ప్రజాదరణ చూరగొన్నా..

ప్రైవేటుతో పోల్చితే తక్కువ ధర.. వేగవంతమైన సేవలు. ఇంటి వద్దకే పార్సిల్ డెలివరీ.. బీమా సదుపాయం. ఇలా అనేక ప్రకటనలతో ఆర్టీసీ కార్గో సేవలు అనతి కాలంలోనే ప్రజాదరణ చూరగొన్నాయి. మొదట్లో కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని బస్సు డిపోల పరిధిలో మాత్రమే కార్గో పార్సిల్ సేవలు అందుబాటులో ఉండేవి. ప్రజల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిగిలిన 9 డిపోలకు సేవలు విస్తరించారు. ఆయా కేంద్రాల నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో పార్సిళ్లు నమోదు అవుతుంటాయి. జిల్లాకే పరిమితం కాకుండా మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు పార్సిళ్లు పంపుతున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

కార్గో పార్సిల్ సేవలకు మంచి ఆదరణ లభించడంతో రెండేళ్ల కిందట డోర్ డెలివరీ విధానానికి శ్రీకారం చుట్టారు. వినియోగదారులు డోర్ పికప్ ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆ చిరునామాకు సిబ్బంది వచ్చి పార్సిళ్లను తీసుకెళ్లాలి.. కానీ ఎవరూ రావడం లేదు. చేసేది లేక వినియోగదారులు బస్టాండ్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రతి డిపో పరిధిలో డోర్ డెలివరీ చేసేందుకు ఒక్కరే ఉండటంతో క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీనికితోడు సాంకేతిక సమస్యలు ఏర్పడుతుండటం.. వినియోగదారుడికి సరైన సమాచారం లేకపోవడంతో బాగా ఆలస్యమవుతోంది.

గుట్టకని మింగేస్తున్నారు

మామిళ్లపల్లి శివారు ప్రాంతంలోని ఎర్రమట్టి గుట్టను ఓ గుత్తేదారుడు గత రెండు రోజులుగా యథేచ్ఛగా తవ్వి తరలించేస్తున్నారు. మామిళ్లపల్లి నుంచి నల్లమేకలపల్లి వరకు 5.9 కి.మీ. మేర రోడ్డుకు గ్రావెల్ తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతి తీసుకోకనే తవ్వేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ప్యాపిలి

అలంకార ప్రియుడికి అన్నాభిషేకం

చాగలమర్రి పట్టణంలోని భీమలింగేశ్వరాలయంలో స్వామికి మంగళవారం అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నాభిషేక అలంకారం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యుడు శివనాగప్ప తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, చాగలమర్రి

సరిదిద్దని చేతులు

■ 'అన్నదాత సుఖీభవ' సాయానికి కొందరు దూరం

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : అధికారుల అలసత్వం అన్నదాతలకు శాపంగా మారింది. వివరాలు సరిదిద్దకపోవడంతో పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం అర్హుల సంఖ్యకు కోత పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 6.27 లక్షల కుటుంబాలు ఉండగా పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతలో 4,79,298 మంది రైతులు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున నగదు జమైంది. బుధవారం జమకానున్న రెండో విడతలో 489 మందికి కోత పడింది. 4.78 లక్షల మంది రైతులకు రూ.321.07 కోట్ల పెట్టుబడి సాయం అందనుంది.

లబ్ధిదారులు	కర్నూలు (రూ.కోట్లు)	నంద్యాల (రూ.కోట్లు)
అన్నదాత సుఖీభవ	136.38	103.03
పీఎం కిసాన్	45.12	36.68

కానరాని అవగాహన

● మనుగడలో లేని ఖాతాలు పునరుద్ధరించుకునేలా రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది విఫలమయ్యారు. మ్యాపింగ్ జరగని ఖాతాలను మ్యాపింగ్ చేయించడంలోనూ జాప్యం జరిగింది. అటు వ్యవసాయ శాఖ, ఇటు బ్యాంకు అధికారుల మధ్య సమన్వయ లోపంతో వేలాది మంది రైతులకు అన్యాయం జరుగుతోంది.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4.09 లక్షల మంది రైతులకు రూ.81.80 కోట్లను పీఎం కిసాన్ పెట్టుబడి సాయం అందనుంది. అదే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 4,78,820 మంది అన్నదాతలకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించనుంది.

61.359 మందికి రానట్లే..

● కర్నూలు జిల్లాలో 4,189, నంద్యాల జిల్లాలో 14,477 కలిపి మొత్తం 18,666 మంది రైతులకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో ఆధార్, చరవాణి నంబర్లు తప్పుగా నమోదవడం.. పేర్లలో తప్పులు రావడంతో పథకానికి దూరమయ్యారు.

● అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు డెత్ మ్యుటేషన్ చేయాలి. దీనిపై దృష్టి పెట్టకపోవడంతో మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలో 27,170 మందికి ఆర్థిక సాయం అందలేదు. రెండో విడతలోనూ వీరు సాయానికి దూరమయ్యారు.

● ఈకేవైసీ, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం.. ఖాతాలు వాడుకలో లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో 15,034 మంది రైతులకు సాయం అందలేదు.

● ప్రస్తుతం మొదటి విడతతో పోలిస్తే రెండో విడతలో మరో 480 మందికి పథకం వర్తించలేదు. మొత్తంగా వివిధ కారణాలతో 61.359 మంది రైతులకు పెట్టుబడి సాయం దూరమైంది.

ఉపాధి సృష్టి.. ఆరోగ్యం పుష్టి

నష్టాలొచ్చినా నిరుత్సాహపడలేదు.. కొవిడ్ దెబ్బకొట్టినా కుంగిపోలేదు.. పట్టుదలతో నిలిచి పలువురికి ఉపాధి చూపుతూ ఏడాదికి అరకోటి వరకు టర్నోవర్‌తో ముందుకు దూసుకెళ్తున్నారు నంద్యాల పట్టణానికి చెందిన గృహిణి మానస. ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకున్న ఆమె 2017లో నంద్యాల సాయిబాబానగర్‌లో జూట్ బ్యాగుల వ్యాపారం మొదలు పెట్టారు. నెలకు రూ.4 లక్షల వరకు టర్నోవర్ జరుగుతున్న సమయంలో కరోనా కారణంగా వ్యాపారం ఆపేయాల్సి వచ్చింది. 2021లో బ్యాంకు నుంచి రుణం తీసుకొని నంద్యాల పద్మావతీ నగర్‌లో చిరు ధాన్యాలు (మిల్లెట్స్) దుకాణం ఏర్పాటు చేశారు. రూ.25 లక్షలతో సరకు తీసుకొచ్చి దుకాణంలో ఉంచగా.. అనుకోకుండా కురిసిన భారీ వర్షానికి స్టాక్ పూర్తిగా తడిసి నష్టం వచ్చింది. అయినా కుంగిపోకుండా మళ్లీ 2022లో బ్యాంకు నుంచి రూ.5 లక్షల రుణం తీసుకొని కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 12 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. కేంద్రంలో రాగి సంగటి, రాగి ఇడ్లీ, కొర్ర ఇడ్లీ, మల్టీ గ్రైన్ రోటి, మిల్లెట్ బాత్ వంటివి తయారు చేస్తున్నారు. ఉదయం టిఫిన్స్‌లో 25 రకాలు, భోజనంలో 6 రకాల మిల్లెట్ ఫుడ్స్ అందుబాటులో ఉంటున్నాయి. ఆమె కృషిని గుర్తించిన ప్రభుత్వం బెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డుతో సత్కరించింది.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

ప్రత్యేక ఉపకరణాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా సమగ్ర శిక్షా, అలింకో సంస్థ సంయుక్తంగా ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. నంద్యాలలో ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు.. కర్నూలు జిల్లాలో డిసెంబరు 1వ తేదీ నుంచి ఎనిమిది వరకు జరగనున్నాయి. నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుంది. విద్యార్థులు ఎక్కడికి రావాల్సి ఉంటుందో సమీపంలోని భవిత కేంద్రానికి వెళ్తే సమాచారం ఇస్తారని అధికారులు ప్రకటించారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం



రవాణా ఛార్జీలు ఇస్తారు

శిబిరాలకొచ్చే విద్యార్థితోపాటు తల్లి, తండ్రి, సంరక్షకుడు ఎవరైనా ఒకరు హాజరు కావాలి. ఇందుకు విద్యార్థితోపాటు ఒకరికి రవాణా ఖర్చులతోపాటు మధ్యాహ్న భోజన ఖర్చులు అందజేస్తారు.

నిర్ధారణ చేసి

6 నుంచి 18 ఏళ్ల వయస్సు ఉండి.. మానసిక వైకల్యం (ఐడీ), శారీరక వైకల్యం (ఎల్ఎం), సెరిబ్రల్ పాల్సీ (సీపీ), బహుళ వైకల్యం (ఎండీ), వినికిడి లోపం (హెచ్ఐ)తో బాధపడేవారు శిబిరాలకు రావొచ్చు. పరీక్షలు చేసి ఏ పరికరం అవసరమో గుర్తించి ఇస్తారు.

కావాల్సిన ధ్రువపత్రాలు

● ఏడీఐపీ ఫాం, సదరం పత్రం నకలు, మండల వైద్యాధికారి ఇచ్చే ధ్రువపత్రం (పీహెచ్‌సీ), బియ్యం కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు నకళ్లు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, యూనిక్ డిజబిలిటీ గుర్తింపు కార్డు తీసుకురావాలి.

● ఎన్‌రోల్‌మెంట్ రసీదు నకలు లేనివారికి క్యాంపు వద్ద దరఖాస్తు చేసి ఇస్తారు. ఇందుకు ఆధార్ కార్డు, సదరం నకలు, విద్యార్థి సంతకం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో అవసరం ఉంటుంది. వీటిని స్కాన్ చేసి సాఫ్ట్ కాపీని శిబిరం వద్ద వాట్సప్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్‌కు లింకై ఉన్న ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ నంబరు చెప్పాల్సి ఉంటుంది.

(c) eenadu

చెట్టుతో చేటు

కోడుమూరు సబ్ డివిజన్ పరిధిలోని తుంగభద్ర నది దిగువ కాలువ వంతెనకు చెట్లు పెరుగుతుండటంతో ప్రమాదకరంగా మారింది. పుట్టపాశం కాలువ వంతెనకు మొక్కలు పెరగటంతో గోడలకు చీలికలు ఏర్పడ్డాయి. వాటిని తొలగించక పోతే వంతెన శిథిలమై రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సిబ్బందితో వాటిని తొలగించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

అల్లారుదిన్నె వంతెన.. కళ్లార్పితే చింతేనా

బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన.. దశాబ్దాలుగా సేవలందిస్తోంది. ఆస్పరి నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారిలో హంద్రీ వాగు పైన నిర్మించిన వంతెనపై ఈ వంతెనపై సాధారణంగా 15 నుంచి 20 టన్నుల లోడు వాహనాలు మాత్రం వెళ్లే అవకాశం ఉంది. కానీ నిబంధనలు పక్కనబెట్టి ప్రస్తుతం 50నుంచి 80 టన్నుల లోడుతో ఉన్న లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనకు ఓ వైపు రక్షణ గోడ కూలింది. ఎదురుగా ఒక వాహనం వస్తే.. మరోటి వెళ్లే వీల్లేని పరిస్థితి. ఏమాత్రం రెప్పవాల్చినా.. ప్రమాదానికి గురికాక తప్పదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆస్పరి

దుమ్ము రేగుతోంది

నంద్యాల నుంచి ఓంకార పుణ్యక్షేత్రానికి నిత్యం వందల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల స్థానికంగా పంట కోతలు ఎక్కువ కావడంతో ఈ రద్దీ మరింత పెరిగింది. దీంతో బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో దారిపై దుమ్ము పెద్దఎత్తున రేగుతోంది. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇళ్లలోని ప్రజలు సైతం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ప్రమాదం అంచున ప్రయాణం

బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరుగ్రామం నుంచి భీమవరానికి వెళ్లే దారిలో మద్దిలేరు వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన ఇది. గతనెలలో మొంథా తుపాను ప్రభావంతో వరద పారడంతో మొత్తం దెబ్బతింది. ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు కొట్టుకుపోయి, ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వరి కోతలు జరుగుతున్నాయి. ధాన్యాన్ని పొలాల నుంచి ట్రాక్టర్లపై ఇళ్లకు తీసుకెళ్లే రైతులు వంతెనపై ప్రయాణించాలంటే భయాందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల నేర విభాగం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ లాకప్ గదులు, రికార్డు రూమ్, డ్యూటీ రోస్టర్, నేరస్తుల రికార్డులు, ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌తోపాటు పలు కేసుల దస్త్రాలను పరిశీలించారు. పాత నేరస్తులు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచాలన్నారు.

వాము గరిష్ఠ ధర రూ.13,688

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు 50 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా.. క్వింటాల్ గరిష్ఠ ధర రూ. 12,801లు పలికింది. వాము క్వింటా గరిష్ఠ ధర రూ. 13,688, వేరుశనగకాయలు రూ. 5,479, ఆముదాలు రూ. 5,786లకు వ్యాపారులు కొన్నారు.

పంటకు చలి తంటా

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగి ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలి అధిక కారణంగా పంటలపై ప్రభావం చూపుతోంది. దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. మొక్కల పెరుగుదల మందగిస్తుంది. వేర్ల అభివృద్ధి తగ్గి మొక్కలు పోషకాలను సరిగా తీసుకోక పంట ఉత్పత్తులపై ప్రభావం చూపుతుంది.

రెండు వారాల నుంచి అధికం.

జిల్లాలో రబీలో శనగ 1.45 లక్షల ఎకరాలు, మిరప 30 వేలు, వేరుసెనగ 33వేలు, మొక్కజొన్న 23వేల ఎకరాల్లో వేశారు. సాధారణంగా డిసెంబరులో చలి ప్రభావం, మంచు అధికంగా ఉంటుంది. ఈసారి నవంబరు రెండో వారం నుంచి చలి తీవ్రత పెరిగింది. దీంతో పంటల దిగుబడులపై ప్రభావం చూపి దిగుబడులు తగ్గనున్నాయి.

☛ దిగుబడులు తగ్గే అవకాశం

● శనగ: మొక్కల వృద్ధి మందగించి పూత రాలిపోతుంది. ఫంగస్ తెగులు పెరుగుతుంది. ఆకుల పచ్చదనం పెరుగుతుంది. నివారణకు 13.0.45 లీటరు నీటికి 5గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి. సూక్ష్మ పోషకాలైన జింక్ సల్ఫేట్ లీటరు నీటికి 5గ్రాములు లేదా బోరాన్, మెగ్నీషియం వంటివి 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● వేరుసెనగ: పొలంలో ఎక్కువగా నీరు నిల్వకుండా తేలికపాటి తడి అందించాలి. ఆకు మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉంది. నివారణకు కార్బండిజమ్+మ్యాంకోజెబ్ 2గ్రాములు లేదా ట్రైకోడెర్మావిరిడి 5గ్రాములు+సూడోమోనాస్ 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● మిరప: మిరపలో ఆంత్రాక్నోస్ ఆశిస్తుంది. పండు కాయలపై చిన్న గోధుమ లేదా నల్ల రంగు మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలు క్రమంగా పెరిగి వృత్తాకారంలోకి మారుతాయి. మచ్చల మధ్యలో గులాబీ లేదా నారింజ రంగులో ఫంగస్ కనిపిస్తుంది. తీవ్రస్థాయిలో పండు కాయలు కుళ్లిపోయి మార్కెట్‌లో ధర పలకవు. ఆకుల మధ్య చిన్న మచ్చలు ఏర్పడి ఎండిపోతాయి. విత్తనాలను నాటే ముందు కిలో విత్తనానికి 4గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి. పంట మార్పిడి, పొలంలో నీరు నిల్వకుండా చూసుకోవాలి. తెగులు బారినపడిన మొక్కలను తొలగించి నాశనం చేయాలి. పండు కాయ దశలో కార్బండిజమ్ 0.1శాతం లేదా మ్యాంకోజెబ్ 0.25శాతం, లేదా అజోక్సిస్ట్రోబిన్ 23శాతం 1మి.లీ. లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. 10-15రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారీ చేయాలి. పండుకాయలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

పెరిగిన చలి తీవ్రత - డాక్టర్ రాఘవేంద్రచౌదరి
సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి

జిల్లాలో వారం రోజుల వ్యవధిలో రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23డిగ్రీలు నుంచి 17నుంచి 18డిగ్రీలకు పడిపోతుంది. ఐదారు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గి చలి ప్రభావం పెరిగింది. రైతులు పంట దిగుబడులు తగ్గకుండా తేలికపాటి నీటి తడులు, మందులు పిచికారీ చేసుకోవాలి.

మహానందిలో లక్ష బిల్వార్చన

పూజలో పాల్గొన్న పండితులు, భక్తులు

నంద్యాల పట్టణం, మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో కార్తిక మాసం సందర్భంగా మంగళవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. మహానందీశ్వర స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరెడ్డి, వేద పండిత, రుత్విక, అర్చక బృందాల ఆధ్వర్యంలో వేడుకగా ఈ క్రతువు సాగింది. మూలవరులకు ఆలయ ప్రధాన అర్చకుడు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేద పండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, శాంతరామ్ భట్ ఆధ్వర్యంలో 121 రుద్రాలతో విశేష ద్రవ్య, పంచామృతాభిషేకాలు, గోపూజలు చేశారు. 40 ఏళ్లుగా నంద్యాల రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డా. జి. రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతులు స్వామివారికి ఈ కార్యక్రమాలు చేస్తున్నారు.

స్వర్గధామంలో కార్తిక దీపోత్సవం

శివుని విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల హిందూ శ్మశానవాటికలోని స్వర్గధామంలో 20 అడుగుల శివుని విగ్రహం ఎదుట కార్తిక దీపోత్సవం నిర్వహించారు. ఉత్తరాధి మఠం స్వామి సుధీంద్ర ఆచార్యుల పర్యవేక్షణలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వందలాది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వర్గధామం అధ్యక్షులు డా.సి. మధుసూదనరావు, నెరవాటి సత్యనారాయణ, గెలివి రామకృష్ణ, శేషుబాబు, కొమ్మా హరి, చిత్తలూరు రామప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో లోక కల్యాణార్థం పూజలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం లోక కల్యాణార్థం విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామి(కుమార స్వామి)కి, శనగల బసవన్న నందీశ్వరునికి, క్షేత్ర పాలకుడు బయలువీరభద్రస్వామికి అర్చకులు పంచామృతాభిషేకం, పుష్పార్చనలు నిర్వహించారు. భక్తులు దేవతామూర్తుల దర్శనం చేసుకున్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయండి

బనగానపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పంచాయతీలో జరుగుతున్న సీసీ రోడ్లు, కూరగాయాల మార్కెట్ సమీపంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద దుకాణాల యజమానులు వెనక్కి జరగక పోవడంతో. . వారితో మాట్లాడి పనులకు సహకరించాలని కోరారు. భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి పనుల గురించి పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులుతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పట్టణంలో రూ. కోట్లు వెచ్చించి రోడ్లు, కాలువ పనులు చేస్తున్నామని చెప్పారు. వ్యాపారులు, ఇళ్ల యజమానులు పూర్తిగా సహకరించాలని కోరారు. మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మొదటి దశలో భూగర్భ డ్రైనేజి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని.. ఇందు కోసం సుమారు రూ. 28 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బురానుద్దీన్, కలాం పాల్గొన్నారు.

పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి బీసీ

రాష్ట్రంలో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు

బనగానపల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రంలో రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బనగానపల్లిలోని తన నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. యువనేత నారా లోకేష్ పట్టుదలతో దేశాలు తిరిగి పెట్టుబడులు సాధించారని కొనియాడారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సుతో దేశచరిత్రలో ఎప్పుడూ రాని పెట్టుబడులు వచ్చాయన్నారు. ఓర్వకల్లులో త్వరలోనే డ్రోన్ పరిశ్రమతోపాటు ఇతర పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఉత్తరాంధ్రలో ఆక్వా పరిశ్రమ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బురానుద్దీన్, మద్దిలేటిరెడ్డి, అత్తర్‌కలాం, అహమ్మద్ పాల్గొన్నారు.

యాగంటిలో కొనసాగిన భక్తుల సందడి

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల సందడి కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో విశేష పూజలు చేశారు. స్వామి వారి దర్శనానికి క్యూ లైన్లు నిండుకున్నాయి. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి కార్తికదీపాలు వెలిగించారు.

మద్యం ప్రయాణం.. జైలే గమ్యస్థానం

■ చోదకులకు 30 రోజుల శిక్ష
■ రహదారి ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

◗ ఇటీవల జరిగిన బస్సు దగ్ధం దుర్ఘటనలో 19 మంది మృతిచెందారు. అంతకు ముందు మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన యువకుడు రహదారి ప్రమాదానికి గురయ్యాడు. ఆ వాహనాన్ని ఈడ్చుకుంటూ బస్సువ వెళ్లడంతో అమాయక ప్రయాణికులు మృత్యుఒడికి చేరుకున్నారు.

◗ ఆదోని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 15 మంది వాహన చోదకులకు ఒక్కొక్కరికి 30 రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ ఆదోని న్యాయస్థానం తీర్పు చెప్పింది. మద్యం తాగి వాహనాలు నడిపే వాహన చోదకుల్లో భయం పుట్టుకుంది.

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: తరుచూ జరుగుతున్న ప్రమాదాలు ప్రాణాలను పొట్టనపెట్టుకుంటున్నాయి. దీంతో పోలీసు, రవాణా శాఖ అధికారులు రహదారి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాయి. వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించి జిల్లా వ్యాప్తంగా వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేశారు.

ఆదోనిలో వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ అబ్దుల్ గౌస్

పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఏటా 500లకు పైగానే రహదారి ప్రమాదాలు జరుగుతుండగా.. 250 మందికి పైగా మృతిచెందుతున్నారు. 600 మంది క్షతగాత్రులవుతున్నారు. ఈ ప్రమాదాలను పరిశీలిస్తే.. అధిక శాతం మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రహదారి ప్రమాదాల నివారణపై పోలీసు శాఖ, రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేసింది. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1225 నమోదు చేయగా.. ఈ ఏడాది 2025 జనవరి నుంచి నవంబరు 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 8,051 నమోదు చేశారు.

హద్దుమీరితే కఠిన చర్యలు

మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడితే.. 185 ఎం.వి. యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. వారికి జైలు శిక్ష తప్పదని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. రెండోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడంతో పాటు రెండేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. దీంతో యువత భవిష్యత్తు చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది.

ప్రమాదాల నివారణే లక్ష్యంగా..

- మర్రిపాటి హేమలత, డీఎస్పీ, ఆదోని

ఆదోని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో రహదారి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రధానంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేశాం. రోజూ 10 కేసులు నమోదు చేస్తున్నాం. దీంతో పాటు ఆటోల్లో సామర్థ్యం మించి ప్రయాణికులను ఎక్కించుకెళ్తున్నారు. వాటిపై కేసులు నమోదు చేస్తున్నాం. మార్పు రాకపోతే ఆటోలను జప్తు చేస్తాం. ఏడుగురు కూర్చునే ఆటోలో 20 మందికి పైగా ప్రయాణిస్తున్నారు. ఇలా వెళ్తే ప్రమాదాలకు గురైతే ఆ కుటుంబాలు రోడ్డున పడతాయి. ప్రయాణికులు సైతం ప్రమాదకర ప్రయాణాలకు దూరంగా ఉండాలి.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. పట్టణంలోని డ్వామా కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో గత త్రైమాసిక కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు 686 దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో 652 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారన్నారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులన్నింటినీ గడువులోగా పరిష్కరించాలని పర్యావరణ పరిరక్షణ ఫ్యాక్టరీస్ శాఖల అధికారులను ఆదేశించారు. చిన్న మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ పావలా వడ్డీ విద్యుత్తు సేల్ ట్యాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాల్లోని 4 యూనిట్లకు రూ. 11.14 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మహబూబ్ బాషా, ఎల్‌డీఎం రవీందర్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి, డీపీఓ లలితాబాయి, డ్వామా పీడీ శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

అర్హులకు ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త హౌసింగ్ పథకం గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి అర్హులకు ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలోని తహసీల్దార్లతో వివిధ రెవెన్యూ అంశాలపై ఆమె సమీక్షించారు. ప్రతి పేదవాడికి ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. పట్టణంలో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చే వినతులను ఆన్‌లైన్ చేసి రసీదు ఇవ్వాలన్నారు. మండల కేంద్రాల్లో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. పట్టా భూములను 22ఏలో చేర్చడానికి వీలు లేదన్నారు. దస్త్రాలన్నీ ఈ సైన్‌తో ఈ-ఆఫీసు ద్వారానే ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

NATIONAL DEGREE COLLEGE, NANDYAL
(Affiliated to Rayalaseema University, Kurnool)
Notification of Admission Category - B Seats
Applications from eligible Intermediate (+2) passouts are invited for spot Admissions Process between **17-11-2025 to 20-11-2025.**
Seats Available: 1) B.C.A. (81)
2) B.Sc. Computers (78) 3) B.Sc.-Botony (30)
4) B.Com. C.A.- (108) B.A. - Special Urdu (18)
Contact Administration Immediately
98856 19553, 94407 50980, 89196 00572
Sri D.Venugopal
Prinicipal
Management

జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులు

మహిళాభివృద్ధికి శ్రీశక్తి గీటురాయి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మహిళాభివృద్ధికి 'శ్రీశక్తి' గీటురాయని జిల్లా సహకార అధికారి ఎన్. రామాంజనేయులు పేర్కొన్నారు. 72వ సహకార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వైఎస్సార్‌నగర్‌లో కోవెలకుంట్ల కో-ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో మెప్మా సహకారంతో శ్రీశక్తి ప్రాధాన్యం, పొదుపు మహిళల అభివృద్ధి గురించి సమావేశం నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. డివిజనల్ సహకార అధికారిణి టి. రుక్సాన బేగం, కోవెలకుంట్ల కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈవో కృష్ణమూర్తి, మేనేజర్ నాగరాజు, మురళీకృష్ణ, ఫకృద్దీన్, సందాని బాషా తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల నిలిపివేతపై ఆగ్రహం

బ్యాంకులో సిబ్బందికి వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

అవుకు, న్యూస్‌టుడే: తమ బ్యాంకు ఖాతాలను నిలిపివేసి అధికారులు తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారంటూ మండలంలోని పలువురు బాధితులు వాపోయారు. మంగళవారం రామాపురంలోని ఆ బ్యాంకు సిబ్బందిని నిలదీశారు. అవుకు మండలంలోని రామాపురంలో ఏర్పాటు చేసిన బ్యాంకు శాఖలో ఏడేళ్ల క్రితం అక్రమాలు చోటు చేసుకున్నాయని.. అప్పట్లో కేసు నమోదు చేసినా, కనీస చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు వంత పాడుతూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బ్యాంకు సిబ్బంది బాధ్యతా రాహిత్యమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఖాతాలు నిలిపివేయడంతో తాము రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడిందని రామాపురం, శింగనపల్లె, సంగపట్నం గ్రామాలకు చెందిన ఖాతాదారులు వాపోయారు. ఏడేళ్ల క్రితం అప్పటి బ్యాంక్ శాఖలో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందినట్లు 16 మందిపై కేసులు నమోదయ్యాయి. బ్యాంకు అధికారి, సిబ్బంతో కలిసి చేతి వాటాన్ని ప్రదర్శించారని బాధితులు ఆరోపించారు. వాస్తవాలు తెలిసినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం బ్యాంకు మేనేజర్ సమావేశానికి వెళ్లారని.. ఆయన విధులకు వచ్చిన వెంటనే సమస్య వివరించాలని' బాధితులకు సిబ్బంది నచ్చజెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కొలిమిగుండ్లకు చెందిన సీతారామయ్య(62) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు సీఐ రమేష్‌బాబు మంగళవారం చెప్పారు. మృతుడు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు కళ్లు కనపడకపోవటంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతుని అన్న రామలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ముమ్మరంగా విచారణ

వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలో సోమవారం ఇద్దరు వివాహితుల మృతిపై మంగళవారం క్లూస్ టీమ్ బృందం, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఘటన స్థలంలో పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పంచనామా నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్షలు చేపట్టారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

■ భర్త వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ మృతి చెందింది. భర్త వేధింపులే కారణమని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పాపిల్లి మండలం డోన్ గ్రామానికి చెందిన వెంకటర్ కొమ్మలపాటి విజయ్‌కుమార్ పెద్ద కుమార్తె మణి(25)కి అదే రాష్ట్రం ప్రకాశం జిల్లా గిద్దలూరు బసవపల్లె గ్రామానికి చెందిన చిదర్ల ధన్‌రాజ్(28)తో 2022 మే 26న వివాహం జరిగింది. కట్నంగా రూ. 5 లక్షలు విలువైన గృహోపకరణాలు, 8 తులాలు బంగారం ఇచ్చారు. కొన్ని రోజులుగా మేడిపల్లి మండలం పర్వతాపూర్‌లో నివాసం ఉంటున్నారు. దంపతులకు మూడేళ్ల చిన్నారి ఉంది. ధన్‌రాజ్ రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని ఏఆర్ పోలీసు కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. చుట్టూ పక్కల వారితో మాట్లాడితే అనుమానంతో వేధించేవాడు. భార్య పేరుతో ఉన్న ఇంటి స్థలం తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి పెంచాడు. ఇదే విషయంపై తనపై చేయి చేసుకున్నాడని.. ఫోన్ చేసి తండ్రికి చెప్పింది. సోమవారం మధ్యాహ్నం మీ కుమార్తె రేకుల షెడ్ ఇనుప రాడ్‌కు చీరతో ఉరి వేసుకుందని, మేడిపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ధన్‌రాజ్.. భార్య తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు మంగళవారం మేడిపల్లిలోని ఆసుపత్రికి వచ్చారు. చికిత్స పొందుతూ ఉదయం 10:30 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త పెట్టే వేధింపులు భరించలేక కుమార్తె చనిపోయిందని, మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

కస్టమర్ అడ్రస్ వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావాలి. 81251 10304 గూడూరు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, సూళ్లూరుపేట.

TO LET
For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

JOBS
ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్ / మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్స్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:7659988728

రాయలసీమ స్కూల్, కర్నూలు నందు 3rd to 7th వరకు ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్, సోషల్ బోధించుటకు టీచర్స్ కావలెను. ✆ 9949804648, 9398252467.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వెలుగోడు, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జేడీ హీరానాయక్, ఆత్మకూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వంగాల కృష్ణారెడ్డి అన్నారు. వెలుగోడు జలాశయంలో 21.15 లక్షల చేప పిల్లలను ఎంపీడీవో మధుసుదన్‌రెడ్డి, ఉప తహసీల్దారు చంద్రశేఖర్ స్థానిక తెదేపా నాయకులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. మత్స్యశాఖ డీడీ ఆర్ బాబు, ఏడీ రవికుమార్, ఎఫ్‌డీవోలు భరత్‌లాల్ నాయక్, పామన్న, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, తెదేపా నాయకులు మండ్ల శంకర్‌రెడ్డి, ఖలీల్‌ఖాన్, రఘుస్వామిరెడ్డి, ఎల్లాల కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నంద్యాల పాతపట్టణం: విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణించాలని గురురాజ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో మంగళవారం ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. షేక్షావలిరెడ్డి, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ పోటీలను ప్రారంభించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని పద్మావతినగర్ నుంచి సుద్దులపేటలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- ఆనంద్, స్థానికుడు**

?: పట్టణంలోని బైరమల్ వీధిలో రహదార్లపైనే చెత్తను వేస్తున్నారు. **- పవన్, స్థానికుడు**

✔: కాల్వలు శుభ్రం చేయిస్తాం. చెత్తను తొలగించి వ్యాపారులకు అవగాహన కల్పించి చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: పాత బస్టాండు నుంచి అప్పలరావువీధికి వెళ్లే మార్గంలో కిరాణం దుకాణం ఎదురుగా లీకేజీ మరమ్మతుల కోసం గుంత తవ్వారు. పూడ్చకపోవటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. **- సత్యనారాయణ, వాహనదారుడు**

✔: కార్మికులతో గుంత పూడ్చివేయిస్తాం. **- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ.**

?: వడ్లరామాపురం మార్గంలో ఉన్న కల్వర్టు అడుగు భాగంలో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగు నీళ్లు నిల్వ ఉన్నాయి. **- గోపాల్, స్థానికుడు.**

✔: పూడిక తొలగిస్తాం. **- జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.**

మిడుతూరు: ?: మిడుతూరులోని చెన్నకేశవాలయం వెనుక భాగం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. వాటిని తొలగిస్తే.. సంత రోజున వ్యాపారులు తమ దుకాణాలను అక్కడ పెట్టుకుంటారు. తద్వారా వాహన రద్దీ తగ్గుతుంది. **- శ్రీనివాసులు, మిడుతూరు.**

✔: పిచ్చిమొక్కలు తొలగిస్తాం. సంత రోజున అక్కడ దుకాణాలు పెట్టుకోవడంపై సర్పంచితో మాట్లాడుతాం. **- కల్యాణ్ సింగ్, తాత్కాలిక కార్యదర్శి, మిడుతూరు.**

?: బైరాపురంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. చర్యలు తీసుకోగలరు. **- కుమార్, బైరాపురం.**

✔: వీధి దీపాలు వెగని చోట కొత్తవి ఏర్పాటు చేస్తాం. **- కేశవతి, గ్రామ కార్యదర్శి**

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

నందికొట్కూరు గ్రామీణం: సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని అధికారులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సూచించారు. కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ..సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవన్నారు. మండల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమెల్యే గిత్త జయసూర్య అన్నారు. కొత్తపల్లిలో తెదేపా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైల ఆలయ పరిధిలోకి చేర్చి అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. శివపురం ఎద్దులేరు వాగుపై వంతెన నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కొత్తపల్లి తెదేపా మండల కన్వీనర్ లింగస్వామిగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతికేళ్లు.. ఉండదు విద్యుత్తు బిల్లు

★ 'పీఎం సూర్య ఘర్ యోజన'తో ప్రోత్సాహం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: సౌర విద్యుత్తును అందిపుచ్చుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. పీఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ప్రజలకు పెద్దఎత్తున రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. ఒకసారి విద్యుత్తు పలకలు ఏర్పాటు చేసుకుంటే 25ఏళ్ల వరకు బిల్లుల నుంచి ఉపశమనం లభిస్తుందని విద్యుత్తు శాఖ అధికారులు పట్టణంతోపాటు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అవసరానికి మంచి ఎక్కువైన విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయించి ఆదాయం కూడా పొందవచ్చు.

ఇంటిపై సౌర ఫలకాలు అమర్చుకున్న వారితో అధికారులు

ఇప్పటి వరకు ఏర్పాటు చేసినవి..

నంద్యాల పట్టణంలో 86 వేల గృహ కనెక్షన్లు ఉండగా.. 3,900 రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటివరకు 356 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చారు. 2027 ఏడాది చివరి నాటికి 6 వేల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సౌర విద్యుత్తు ద్వారా పొదుపు చేసిన విద్యుత్తును ఇతర కుటుంబాల అవసరాలకు కూడా వినియోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

20 రోజుల్లో పొందొచ్చు

సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ప్రభుత్వం బ్యాంకుల నుంచి అతి తక్కువ వడ్డీకి రుణాలు 10 నుంచి 20 రోజుల్లోగా పొందే వెసులుబాటు కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీలు ఈ పథకాన్ని ఉచితంగా పొందవచ్చు.

దరఖాస్తు ఇలా..

వినియోగదారులు పీఎం సూర్య ఘర్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. అప్లై ఫర్ రూఫ్ టాప్ సోలార్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి. వినియోగదారుడి చరవాణికి ఓటీపీ వస్తుంది. వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలి. జిల్లాలోని పీఎం సూర్య ఘర్ కాంట్రాక్టర్ల జాబితా కనిపిస్తోంది. వినియోగదారుడికి నచ్చిన గుత్తేదారుడిని ఎంపిక చేసుకుంటే 20 రోజుల్లోగా బ్యాంకు రుణం మంజూరయ్యాక సోలార్ ఫలకాలు ఇంటిపై అమరుస్తారు.

కిలో వాట్	అయ్యే ఖర్చు	ఇస్తున్న రాయితీ
1	70 వేలు	30 వేలు
2	రూ.1.4 లక్షలు	60 వేలు
3	రూ.2 లక్షలు	78 వేలు

చూసుకోకుంటే.. గుంతలోకే..

నంద్యాల పట్టణం బొగ్గులైన్‌లో రోడ్డు మధ్యలో కాల్వపై సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు. వాటిలో రెండు దిమ్మెలను తొలగించారు. దీంతో రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో వీటిని గమనించకుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. తొలగించిన సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

కల్లాల్లేక.. ఇంటి ముందే ఆరబోత

బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో వరి కోతలు కొనసాగుతున్నాయి. ధాన్యాన్ని కోసిన తరువాత తేమశాతం ఉండడంతో ఆరబెట్టేందుకు కల్లాలు కరవైయ్యాయి. దీంతో పలువురు రైతులు ఖాళీ స్థలాలు, రోడ్డుపైనే వడ్లను ఆరబోసుకుంటున్నారు. కొందరికి ఖాళీ స్థలాలు, రోడ్లు కూడా లేకపోవడంతో ఇలా తమ ఇంటి వాకిట్లోనే ఆరబోసుకుంటున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

కట్ట పక్కనే ప్రమాదకర ప్రయాణం

బిల్లాలపురం నుంచి నంద్యాలకు వచ్చే ప్రజలు చిన్న చెరువు కట్ట పక్కనే ప్రధాన రహదారి ఉండడంతో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఇక్కడ చిన్న చెరువు నిండుకుండలా ఉంది. చెరువు కట్ట వెంట రెండు కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారులు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అధికారులు స్పందించి, రక్షణ గోడలు ఏర్పాటు చేసి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

రోడ్డు ఇలా... రాకపోకలు ఎలా..

నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కాలనీలోకి వాహనదారులు ఈ రహదారి గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభంలో రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఆ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రహదారుల అభివృద్ధి జరిగింది. దామగట్లలో మాత్రం ఈ రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి రహదారిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు

ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ఝాన్సీ లక్ష్మీబాయిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలో విద్యార్థులు, సంఘం నాయకులు

సంక్షిప్త సమాచారం

నంద్యాల రైతునగరం: నంద్యాల పట్టణంలో భవనాలకు అనుమతులు లేకుండా నిర్మిస్తూ, మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేరు చెప్పుకొంటూ నంద్యాల పురపాలక సంఘంలో పెత్తనం చెలాయిస్తున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు.

నందికొట్కూరు: జూపాడుబంగ్లా మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో నాసిరకంగా రహదారి నిర్మించిన గుత్తేదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ..తంగడంచ నుంచి పారుమంచాల వరకు రోడ్డు నాసిరకంగా వేశారని ఆరోపించారు.

ఆత్మకూరు: ప్రభుత్వం విద్యుత్తు అదనపు ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ అన్నారు. 2024 ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ట్రూ అప్, సర్ ఛార్జీలు రద్దు చేస్తామని.. అధికారంలోకి వచ్చినా కూటమి ప్రభుత్వం రద్దు చేయలేదని తెలిపారు.

నందికొట్కూరు: మంత్రి అచ్చెంనాయుడు వెంటనే తనపదవికి రాజీనామా చేయాలని నందికొట్కూరు సీపీఐ లిబరేషన్ నాయకుడు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు పట్టణం శివారులో మొక్కజొన్నలను నూర్పిడి చేసి ఆరబెట్టుకున్న రైతుల వద్దకు వెళ్లి వారితో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

నంద్యాల రైతునగరం: నంద్యాల పట్టణంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాయలసీమ నామకరణ దినోత్సవం నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం ఆర్వీఎఫ్, డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం, ఎన్టీఎఫ్ నాయకులు విద్యార్థులతో కలిసి కేకు కోశారు.

నందికొట్కూరు: నేడు కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నందికొట్కూరు బ్యాంకు మేనేజరు వెంకటరమణ పిలుపునిచ్చారు.

నందికొట్కూరు: దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం పట్టణ సమితి కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నందికొట్కూరు పట్టణం పటేల్ కూడలిలో సీపీఐ నాయకులు చేపట్టిన ఆందోళనలో జిల్లాకార్యవర్గం సభ్యుడు రఘురాంమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో భాజపా ప్రధానమంత్రి 11ఏళ్ల పాలనలో దళితులు, గిరిజనులపై దాడులు అధికమయ్యాయన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న పెట్రోల్ బంకు వద్ద మోసం చేస్తున్నారని బిజినవేముల గ్రామానికి చెందిన యాగంటి అనే యువకుడు ఆరోపించారు. తాను ద్విచక్ర వాహనానికి పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్తే.. ఖాళీ సీసాలో పక్కన రూ.30 పెట్రోల్ ఉంచి తరువాత తన వాహనానికి పట్టారంటూ తెలిపారు. సీసీ ఫుటేజీ చూపించాలంటూ వాదించడంతో సిబ్బంది పక్కకు వెళ్లారని తెలిపారు. ఇలా నాలుగుసార్లు తనకు ఇలాంటి అనుభవం ఎదురైందన్నారు. బంకులపై అధికారులు దాడులు నిర్వహించి వినియోగదారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలి

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని పురపాలక కమిషనర్ శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని నాలుగోవ వార్డు సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లు, జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వే పురోగతి గురించి ఆరా తీశారు. పురమిత్ర యాప్ గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలన్నారు.

సచివాలయంలో తనిఖీ చేస్తున్న పురపాలక కమిషనర్ శేషన్న

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెదేపా నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ పరిశీలించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ శేషన్నతో కలిసి పరిశీలించి, పాఠశాలలోని సమస్యలు తెలుసుకున్నారు. ఎంఈఓ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: జనగణనలో కులగణన చేపట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశారు. నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డు నుంచి అబుల్ కలాం ఆజాద్ సర్కిల్ వరకు మంగళవారం వామపక్ష పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ..దేశంలో దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. బాబాఫక్రుద్దీన్, సుంకయ్య, కలింగిరి రాముడు, ప్రసాద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో ర్యాలీ చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

పశువులకు టీకాలు వేయించాలి

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో పశువుల్లో గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జూపాడుబంగ్లా పశుసంవర్ధక శాఖ సంచాలకుడు రామాంజనేయులు నాయక్ పశువైద్యులకు సూచించారు. ఆ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గర్భకోశ వ్యాధి నివారణ టీకాలను పశువైద్యాధికారి విజయ్‌భాస్కర్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. రోజూ ఉదయమే గ్రామాలకు వచ్చి పశువులకు టీకాలు వేసే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ అనిమల్, వెటర్నరి డాక్టర్ సంధ్యారాణి రైతులు, సర్పంచి శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాయం చేయడం యువత బాధ్యత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో సాయం చేయడం యువత బాధ్యతని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాయుడు, వైద్యురాలు కవిత అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సీఆర్పీ, బీఎస్ఎల్‌లపై అవగాహన కల్పించారు. మన పరిసరాల్లో ఎవరైనా గుండెపోటుకు గురైతే.. అత్యవసర పరిస్థితుల్లో చేయాల్సిన సీఆర్పీ, బీఎస్ఎల్ ఎలా చేయాలనేది వివరించారు. అనంతరం విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ పద్మావతిబాయి, అధ్యాపకులు విద్యాసాగర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర చికిత్సను వివరిస్తున్న వైద్యులు కవిత, రాయుడు

పురపాలక కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పురపాలక సంఘంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండు చేశారు. పురపాలక కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24, 26 తేదీల్లో ఏఐటీయూసీ పురపాలక యూనియన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించనున్నట్లు తెలిపారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం తెలుగుపేటలో ఉన్న మద్దిలేటి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజామునే స్వామి వారికి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించారు.

ప్రత్యేక అలంకరణలో నృసింహస్వామి

పిల్లలు లేనివారు అనాథల్ని దత్తత తీసుకోవాలి

బండిఆత్మకూరు, మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో దత్తత మాసం నవంబరు 2025లో భాగంగా దత్తత ప్రక్రియపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఆత్మకూరు సీడీపీవో కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..పిల్లలు లేని వారు అనాథ పిల్లలను దత్తత తీసుకోవడం ద్వారా వారికి మంచి భవిష్యత్తు, కుటుంబాన్ని ఇచ్చిన వారవుతారని పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ, సంరక్షణ అధికారి సునంద, ఆత్మకూరు ప్రాజెక్టు పర్యవేక్షకురాలు కవిత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆగస్తీశ్వరస్వామి కల్యాణం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పాణ్యం సమీపంలోని ఆగస్తీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణ సమేత ఆగస్తీశ్వర స్వామి వారి కల్యాణం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కార్తిక వనభోజనం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి అన్నారు. ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్‌కుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సత్యప్రకాశ్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నశముక్త భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, ఆల్కహాల్ వంటి చెడు వ్యసనాలు జీవితాన్ని నాశనం చేస్తాయని సీఐ రాము తెలిపారు.

నందికొట్కూరు: పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై ఎన్ఎండీ జఫ్రుల్లా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై జగన్‌మోహన్ పాల్గొన్నారు.

నంద్యాల పట్టణం: రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, అధ్యాపకులు వెంకటరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంలో 30 బస్తాల దిగుబడులు

వెలుగోడు, న్యూస్‌టుడే: పంటకోత ప్రయోగంలో ఆర్ఎన్ఆర్ రకం ఎకరాకు 30 బస్తాల దిగుబడులు వచ్చినట్లు అంచనా వేశామని మండల వ్యవసాయాధికారిణి స్వాతి తెలిపారు. వెలుగోడులో మంగళవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో వరిపొలంలో 25 మీటర్ల వైశాల్యంలో కోత నిర్వహించి నూర్పిడి చేశామన్నారు. 14.250 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీల నిర్వహణ

బండిఆత్మకూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదర్శ, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అధికారి రవిరాజు ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

నందికొట్కూరు గ్రామీణం: పాములపాడు జడ్పీ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పొగాకు రైతుపై కంపెనీ భారం

★ గతేడాది ఉచితంగా టార్పాలిన్లు.. ఇప్పుడు రాయితీపై అందజేత

టార్పాలిన్‌తో వేసుకున్న షెడ్డు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పొగాకు పంటను సాగు చేస్తున్న అన్నదాతలపై కంపెనీలు భారం మోపుతున్నాయి. గతేడాది ఉచితంగా పంపిణీ చేసిన టార్పాలిన్లను.. ఈ ఏడాది 50శాతం రాయితీపై అందజేస్తున్నాయి. పొగాకు తోరణాలు వేసుకోవాలంటే నీడ కోసం టార్పాలిన్ గుడారాలు తప్పనిసరిగా వేసుకోవాలి. దీంతో కంపెనీల వద్ద 50శాతం రాయితీపై కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఈ ఏడాది నందికొట్కూరు నియోజకవర్గంలో సుమారు 12వేల హెక్టార్ల విస్తీర్ణంలో పొగాకు సాగవుతోంది. ప్రస్తుతం ఆకు కోత దశకు వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో తోరణాలు కడుతున్నారు.

రెండు వేల హెక్టార్లలో తగ్గిన విస్తీర్ణం

గతేడాది పంట సాగు చేసుకుంటే బేలు రూ.16వేలకు కొంటామని కంపెనీ ప్రతినిధులు అన్నదాతలను నమ్మించి సాగు చేయించారు. కొనుగోలు సమయంలో రూ.7,500 నుంచి 13,500లకు కొన్నారు. గతేడాది సుమారు 14వేల హెక్టార్ల విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారు. కంపెనీలు నమ్మించి మోసగించడం, గతేడాది ధరాఘాతం కారణంగా ఈ ఏడాది 2వేల హెక్టార్ల విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది కంపెనీలు ప్రారంభం నుంచి రైతులపై భారం మోపుతున్నాయి. ఇప్పటి వరకు ధర కూడా ప్రకటించలేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతినడంతో దిగుబడులు బాగా తగ్గనున్నాయి. ధర ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నారు.

ఒక్కోదానికి రూ.1,750 పడింది

- ఉసేనాలం, రైతు, తిమ్మాపురం



టార్పాలిన్‌కు డబ్బులు అడుగుతున్నారు. గతేడాది ఉచితంగా ఇచ్చిన కంపెనీలు.. ఈ ఏడాది 50శాతం రాయితీపై ఇచ్చారు. ఒక్కొక్కటి రూ.1750 చొప్పున మొత్తం ఐదు టార్పాలిన్లు తీసుకున్నాను. పంట విక్రయించిన సమయంలో టార్పాలిన్‌కు సంబంధించిన డబ్బులు ఇస్తామని చెప్పడంతో ఇచ్చారు. విస్తీర్ణం తగ్గడంతో ధర బాగుంటుందని ఆశిస్తున్నాను.

నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్యాయత్నం

నంద్యాల నేరవిభాగం: నిప్పంటించుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. డేనియాల్పురానికి చెందిన మేరి నర్సుగా, భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఓ వ్యక్తి వద్ద రూ.2.5లక్షలు వడ్డీకి తీసుకున్నారు. అధిక వడ్డీలు ఇవ్వాలని వేధింపులకు గురిచేస్తుండడంతో మనస్తాపం చెందిన మేరి మంగళవారం ఇంట్లో నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. వెంటనే స్థానికులు మంటలను అదుపు చేసి జీజీహెచ్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల రైల్వే పోలీస్ స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫాం వద్ద గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్ మంగళవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి 40 ఏళ్లు ఉంటాయన్నారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే రైల్వే పోలీసులకు, 94900 81633 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌లో ఉంచినట్లు తెలిపారు.

చామకాల్వలో దూకిన వ్యక్తి.. కాపాడిన పోలీసులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఇంట్లో గొడవ పడిన మంగళి వెంకన్న మంగళవారం చామకాల్వలో దూకాడు. స్థానికులు గుర్తించి 112కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని అతన్ని బయటకు తీశారు. చికిత్స కోసం స్థానిక జీజీహెచ్‌కు తరలించారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మధుసుదన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపురం గ్రామంలో జరుగుతున్న ఆధార్ శిబిరాన్ని మంగళవారం ఎంపీడీవో తనిఖీ చేశారు. చిన్నారులకు నూతన ఆధార్, ఆధార్ అప్డేట్, పేర్లు, చిరునామాలో మార్పులు, చేర్పులు వంటి సమస్యలను సరిచేసుకోవచ్చన్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన 25 మందికి ఆధార్ అప్డేట్ చేసినట్లు చెప్పారు.

వ్యవసాయ సాంకేతికతతో మేలైన దిగుబడులు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతతో పంటల్లో మేలైన దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దదేవళాపురం, సంతజూటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..నూతన వరి వంగడాలు, తెగుళ్లను తట్టుకునే ఎన్ఎల్ఆర్, ఎంటీయూ వరి రకాలతో అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు సూచించారు. వరి పంటల వద్దకు వెళ్లి దిగుబడులను పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది ఆయేషా, యాసీర్, అర్పుత్, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
అపూర్వ అక్షర్‌ధామ్ సమీపంలో
అయోధ్య నగర్
రూ.48.99 లక్షలు
@ నందికొట్కూరు రోడ్, కర్నూలు.
(1) కేవలం రూ. 2 లక్షలు మాత్రమే చెల్లించండి ఇల్లు సొంతం చేసుకోండి. (2) బ్యాంకు లోన్ సౌకర్యం కలదు.
9966986866 9963254517

(c) eenadu

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ప్రతిభా పోటీలతో సృజనాత్మకత వెలికితీత

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ సిస్టర్ సిసిలీ

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు ఉపయోగపడతాయని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సిసిలీ పేర్కొన్నారు. బేతంచెర్ల పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సిస్టర్ సిసిలీ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి వేదికలపై మాట్లాడగలిగితేనే భయం పోతుందన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మేరీ జ్యోత్స్న (10వ తరగతి), వి.శాంతిశ్రీ (10వ తరగతి), సాయిరాం యాదవ్ (9వ తరగతి)లకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, కిరణ్, సంజీవుడు, తేజస్వి, శ్రీదేవి, మిద్దె సునీత తదితరులు పాల్గొన్నారు.

నడకదారితో ఎంతో ఉపయోగకరం

పనులను పరిశీలిస్తున్న బీసీ ఇందిరారెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: వాకింగ్ ట్రాక్ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బనగానపల్లిలోని ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. నడిచేందుకు సరైన వాకింగ్ ట్రాక్ లేక పోవడంతో పట్టణ ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతూ వచ్చారన్నారు. ఈ విషయం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన సొంత నిధులు వెచ్చించి ట్రాక్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులు నాణ్యతగా, త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆమె సూచించారు.

నీరు చేరదు.. చెరువు నిండదు

■ పూర్తి స్థాయిలో చేరని జలాలు

డోన్, న్యూస్‌టుడే: వరస కరవులతో సీమలో నెర్రెలిచ్చిన చెరువులు చూశాం. వినాయక నిమజ్జనాలు చేస్తే సగం కూడా మునగకుండా తేలిన పరిస్థితులు చూశాం. ఇలాంటి కరవుకోరల నుంచి చెరువులకు నీటిని నింపే హంద్రీనీవా పథకం ద్వారా ఈసారైనా చెరువులు పూర్తి స్థాయిలో నిండుతాయన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. డోన్ నియోజకవర్గంలో 14 చెరువుల వరకు ఇంకా పూర్తిస్థాయిలో నీరు నిండని పరిస్థితి ఉండగా, మరికొన్నింటికి ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి.

వాగులు ఉప్పొంగి చెరువుకు వెళ్తున్న వర్షం నీరు

పర్యవేక్షణ కరవై..

నియోజకవర్గంలో హంద్రీనీవా పథకం కింద మొత్తం 36 చెరువులు, కుంటలకు నీరు అందించాల్సి ఉంది. ఇందులో 21 చెరువుల వరకు ఇప్పటివరకు 100 శాతం నీటితో నింపినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిసి వాగులు ఉప్పొంగినా పలు కారణాలతో పూర్తి స్థాయిలో చెరువులు నిండలేదు. పైపులైన్ ద్వారా దాదాపు 120 రోజుల పాటు ఈ చెరువులు నింపాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో కొన్ని చిన్నపాటి కుంటలు చాలా త్వరగా నిండిపోతుండటంతో నీటి సరఫరాను మధ్యమధ్యలో నిలిపివేస్తున్నారు. పైప్‌లైన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఈ సమస్య ఉండదు. అలాగే ఎక్కడైనా లీకేజీలకు గురైతే పర్యవేక్షించేందుకు వీలుంటుంది. కింద స్థాయి సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడంతోనూ కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

■ భూగర్భజలాలు పెరిగే అవకాశమేదీ?

ఒక్కటి నిండింది లేదు..

నియోజకవర్గంలోని వెంకటాపురం ట్యాంకు 95 శాతం మాత్రమే నిండగా, దేవరబండ కల్పనకుంట ట్యాంకు 80 శాతం మాత్రమే నిండింది, మెట్టుపల్లె కాకనాలచెరువు 80 శాతం, కొచ్చెర్వు ట్యాంకు 60 శాతం, ఊటకొండ ట్యాంకు 25 శాతం మాత్రమే నిండాయి. చంద్రపల్లె ట్యాంకుకు నీటితో నింపే పనులు సాగుతున్నాయి. వెంగళాంపల్లె ట్యాంకు 80 శాతం, పెద్దపోదిళ్ల ట్యాంకు 70 శాతం, ఓబులదేవరపల్లె బురుజు కుంట 50 శాతం, పెద్దపూదెళ్ల కొత్త కుంట 50 శాతం, ప్యాపిలి పీటీ ట్యాంకు 40 శాతం, వెంగళాంపల్లె పీటీ 40 శాతం, వెంకటయ్యచెరువు 80 శాతం, బొమ్మికుంట 20 శాతం మాత్రమే నింపారు. ఆయా చెరువులకు పూర్తి స్థాయిలో నింపుతున్నట్లు పథకం అధికారులు తెలిపారు.

నేడు పట్టణంలో విద్యుత్తు అంతరాయం

డోన్: డోన్‌లో బుధవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణ విద్యుత్తు ఉపకేంద్రంలో 1వ ఫీడర్ కింద డోన్, బేతంచెర్ల జాతీయ రహదారి పనులు జరుగుతున్నందున కొండపేట, శేగు టాకీస్, చిగురుమానుపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని యర్రగుంట్ల బస్టాప్ వద్ద సర్వీస్ రహదారిపై రెండు అడుగుల మేర గుంత ఏర్పడింది. - గురువయ్య

✔: మరమ్మతులపై సంబంధిత అధికారులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. - శ్రీనివాసశర్మ, డిప్యూటీ ఎంపీడీవో

చాగలమర్రి, న్యూస్‌టుడే: ?: పట్టణంలో కుక్కల బెడద అధికమైంది. చింతలచెరువు రహదారిలో కాలనీల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. - గైబూసా

✔: మేజర్ పంచాయతీ పరిధిలో కుక్కల బెడద నివారణకు చర్యలు చేపడతాం. - తారకేశ్వరి ఈవో

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: బిజనవేముల సచివాలయం వద్ద నున్న శౌచాలయాలకు తాళం వేయడంతో అక్కడకు వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. - లక్ష్మీదేవి, స్థానికురాలు

✔: శౌచాలయాలకు నీటి సరఫరా పనులు నిలిచిపోయాయి. త్వరలోనే పూర్తిచేయిస్తాం.
- సలీంబాషా, పంచాయతీ కార్యదర్శి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని చెర్లోకొత్తూరులో మురుగుకాల్వ నిండి అధ్వానంగా మారింది. - ఉశేనమ్మ, చెర్లోకొత్తూరు

✔: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- నాగరాజు, ఎంపీడీవో, బనగానపల్లి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలో నంద్యాల క్రాస్ రోడ్డు సమీపంలో వంతెన వద్ద వ్యర్థాలు నిలిచి మురుగు నీరు పారడం లేదు. - సోమశేఖర్, బేతంచెర్ల

✔: పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తాం. -మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: అయ్యలచెరువులో నుంచి పట్టణంలోకి వచ్చే పైపులైన్ వాల్వు వద్ద నీరు వృథాగా పోతున్నాయి. -వాహన చోదకులు

✔: తాగునీటి సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం.
- మధుతేజరెడ్డి, మున్సిపల్ ఏఈ

అద్దె పంచన ఎన్నాళ్లు చిన్నారుల చదువులు

మండల పరిధిలోని బిజనవేములలో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉంది. దీంతో కొన్నిరోజుల పాటు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పిల్లలకు కేంద్రం ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల పిల్లలకు గదుల కొరత రావడంతో మరోచోట అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవంతిని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల గ్రామీణం

పొగతో ఉక్కిరిబిక్కిరి

పట్టణంలోని కడప రహదారిలో చెత్త, హానికర వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో పొగ వ్యాపించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి కుంటల వద్ద రహదారి పక్కనే వ్యర్థాలను పడేస్తున్నారు. మంగళవారం చెత్త నుంచి వెలువడిన పొగ రోడ్డును కప్పేయడంతో వాహనదారుల రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పక్కన చెత్త వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – ఆళ్లగడ్డ గ్రామీణం, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే

నిధుల్లేక.. నిర్మాణం సాగక

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తికాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండేళ్ల క్రితం నాడు-నేడు పథకం కింద రూ.47 లక్షలు మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.27 లక్షలు మాత్రమే ఖాతాలో వచ్చి చేరాయి. రూ.20 లక్షలతో పనులు కొంతమేర పూర్తయ్యాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రుద్రవరం

మురికి కూపం.. నివాసానికి శాపం

ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామంలో మురికి కూపాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి సమీపంలో నివాసాల చెంత మురుగు నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉండటంతో కుంటను తలపిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగును తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం)

కార్యకర్తలకు అండగా తెదేపా

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందిస్తున్న భూమా విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెదేపా యువనేత భూమా విఖ్యాత్‌రెడ్డి అన్నారు. రహదారి ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త దుర్గేసి నాగేంద్రకు పార్టీ సభ్యత్వం ఉండటంతో బీమా మొత్తం రూ.5 లక్షల చెక్కును అందించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు చెక్కును నాగేంద్ర కుటుంబ సభ్యులకు అందించారు. కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలను పార్టీ మరిచిపోదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటారన్నారు.

హైవే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పోలీసులు, హైవే నిర్వాహకులకు సూచించారు. మంగళవారం పట్టణ శివార్లలో జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్ స్పాట్లను ఆమె పరిశీలించారు.

డీఎస్పీతో కలిసి హైవే పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శోభా ఘాట్ వద్ద సర్వీస్ రోడ్డు అధ్వానంగా ఉందని, ఒకే దారిలో ఎదురెదురుగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. టిడ్కో గృహాల వద్ద కూడా ఇదే సమస్య ఉందన్నారు. పట్టణ శివార్లలోని కూడళ్ల వద్ద అండర్ పాస్ వంతెనలు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు రూపొందించాలని స్పష్టం చేశారు. హైవేలపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచాలన్నారు. రహదారి నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఎస్పీ కె.ప్రమోద్ కుమార్, సీఐ యుగంధర్ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఆళ్లగడ్డకు చెందిన అఖిల్ ప్రకాష్ ఎంపికయ్యాడు. ఈ నెల 26 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగే 69వ నేషనల్ స్కూల్ గేమ్స్‌కు అర్హత సాధించడంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అతడిని అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ విజేతగా నిలిచి ఆళ్లగడ్డకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: విద్యార్థులకు మత్తుకు దూరంగా ఉండాలని పురపాలిక పారిశుద్ధ్య పర్యవేక్షకుడు బాలస్వామి సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మంగళవారం ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తుతో కలిగే నష్టాలను వివరించారు.

డోన్‌పట్టణం: అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్సై సోమశేఖర్‌రావు

డోన్‌పట్టణం, డోన్ నేరవిభాగం: విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి సూచించారు. పట్టణం సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మారక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి ఎక్సైజ్ ఎస్సై సోమశేఖర్‌రావు వివరించారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌ఛార్జి సీఐ సందీప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు

రుద్రవరం: రుద్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై మహమ్మద్‌రఫి విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యం ఏర్పరచుకుని కష్టపడితే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు.

ఆశల శనగ పండేనా.?

సాగైన శనగ పైరు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఈ ఏడాది శనగ సాగుపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గతేడాది సరైన దిగుబడులు లేక, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడ్డారు. ఈ సారైనా పంట పండి లాభాలు వస్తే కష్టాలు తీరుతాయని ఆశించగా.. రబీ ప్రారంభం నుంచి అధిక వర్షాలతో కర్షకులకు ఇబ్బందులు తప్పలేదు. విత్తుకు అదును దాటిపోవడంతో కొందరు సాహసించి విత్తుకోగా మరికొందరు వెనకడుగు వేశారు. ఈ ఏడాది పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది సాధారణం కంటే తక్కువే

కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల, కొలిమిగుండ్ల, అవుకు మండలాలు ఉన్నాయి. ఈ సబ్‌డివిజన్‌లో రైతులు ఏటా రబీలో శనగ పంటను అధికంగా సాగు చేస్తారు. సబ్ డివిజన్ పరిధిలో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 98,632 ఎకరాలు కాగా గతేడాది 6 మండలాలు కలుపుకొని 95,740 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

మరింతగా తగ్గనున్న సాగు విస్తీర్ణం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది శనగ పంట సాగు విస్తీర్ణం మరింత తగ్గనుంది. సబ్ డివిజన్‌లో సుమారు లక్ష ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం ఉంది. పొలాలను సేద్యం చేసుకొని విత్తుకునేందుకు సిద్ధం చేసుకున్న తరుణంలో అధిక వర్షాలతో విత్తుకు ఆటంకం కలిగింది. అడపాదడపా అక్కడక్కడా విత్తుకోగా.. మొలకలు దెబ్బతిన్నాయి. వీటిని తొలగించి రెండోసారి విత్తుకోవాల్సి వచ్చింది. ఇటీవల కురిసిన మొంథా తుపాను మరింత ఇబ్బంది కలిగించింది. పొలాల్లో తేమ తగ్గడంతో కొంతమంది విత్తుకున్నారు. ఈ నెల 15వ తేదీతో విత్తుకునే గడువు ముగియడంతో శనగ సాగు చేయాలనుకున్న రైతులు ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. కొంతమంది గడువు దాటినా గత్యంతరం లేక విత్తుతున్నారు. దిగుబడులు ఏమాత్రం వస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మల్లాలమ్మకు బోనాలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణ శివారులో ఉన్న మల్లాలమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనాలు సమర్పించారు. ఆళ్లగడ్డ మేదరి సంఘం ఆధ్వర్యంలో భక్తులు ఊరేగింపుతో బోనాలను ఎత్తుకుని అమ్మవారి చెంతకు చేరుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు వీరభరత్, ప్రసాదు, వినోద్, పవన్, సంజన్న, శివ పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి కల్యాణం

స్వామివారి కల్యాణంలో భక్తులు, అర్చకులు

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అనంతరం కల్యాణం గావించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని రామలింగేశ్వరాలయంలో మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు వీరం రెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, ఉభయదారులతో శివపార్వతుల కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చౌడేశ్వరి దేవి అమ్మవారికి పూజలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారికి మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి ఇచ్చారు. కార్తిక మాసం చివరి వారం కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ఉత్తర శబరిమలలో అన్నదానం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలోని వకులా నది తీరంలో ఉన్న ఉత్తర శబరిమల క్షేత్రంలో దాత శేషిరెడ్డి, పలువురు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దీక్షాపరులు భిక్షను స్వీకరించారు.

అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న దీక్షాపరులు

గ్రామీణ సంప్రదాయాలను మరవకండి

సంకలాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలైన బండలాగుడు పోటీలను ఎప్పటికీ మరవరాదని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని సంకలాపురంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాల్లో సందర్భంగా అంతర్ రాష్ట్ర స్థాయి బండలాగు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆయన, తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్యలు ప్రారంభించారు. హోరా హోరీగా జరిగిన ఈ పోటీల్లో ఆరు ఎడ్ల జతలు పాల్గొనగా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్ ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. వనపర్తికి చెందిన రవిచంద్రారెడ్డి ఎడ్లు ద్వితీయ స్థానంలో, సి.బెలగల్ మండలం యనగండ్లకు చెందిన విజయభాస్కర్ ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. వాటికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు నగదు బహుమతులను అందజేశారు.

పోటీలను ప్రారంభిస్తున్న కోట్ల రాఘవేంద్రారెడ్డి

ముగిసిన నయనాల్ప తిరుణాల

సంజామల, న్యూస్‌టుడే: కార్తిక మసోత్సవాల్లో భాగంగా మండలంలోని నయనాలప్ప క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గుర్కా వెంకటరామిరెడ్డి, ఈవో చంద్రుడు సమక్షంలో అర్చకులు ఓంకారేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. తాత్కాలిక హుండీ ఆదాయం రూ.63,560 ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు.

★ నయనాలప్ప క్షేత్రం తిరుణాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు నిర్వహించిన నాలుగు పండ్ల ఎడ్ల విభాగం బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఎడ్లలో వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరు గ్రామానికి చెందిన సాయికుమార్‌రెడ్డి ఎడ్ల జత ప్రథమస్థానంలో నిలిచి రూ.30 వేలు నగదు బహుమతి అందుకున్నాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి చెందిన అంజయ్యచౌదరి ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ.25 వేలు నగదు బహుమతి అందుకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంజామల: క్రేన్ ఢీ కొట్టడంతో గాయపడిన వ్యక్తి కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన మాదిగ ఓబులేసు (70) ఈ నెల 15న పని నిమిత్తం సంజామల మండలం పేరుసోములకు వచ్చాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా పేరుసోముల నుంచి తిమ్మానాయునిపేటకు వెళుతున్న క్రేన్ వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు క్రేన్ డ్రైవర్ బత్తుల ప్రతాప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి జైలు శిక్ష

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మద్యం తాగి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ఆటో డ్రైవరుకు ఏడు రోజులు జైలుశిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మంగళవారం పట్టణ సీఐ యుగంధర్ మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన ఆటో డ్రైవరును పవన్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు. న్యాయమూర్తి ఆయనకు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపినా, అల్లర్లు చేసినా, గొడవలకు కారణమైనా ఉపేక్షించేది లేదన్నారు.

యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వాతంత్ర్యోద్యమంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు జంగంశెట్టి, జక్కా నాగరాజు, సాయిరాం, సుబ్రహ్మణ్యం, శ్రావణ్, శరత్ బాబు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి రామదాసు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

మాట్లాడుతున్న టంగుటూరి శీనయ్య

చాగలమర్రి: చాగలమర్రిలోని భారతి విద్యామందిరం పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయ అధికారి రామచంద్రుడు ఆధ్వర్యంలో మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారి బాలతిమ్మారెడ్డి, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: స్థానిక గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఇంద్రావతి మంగళవారం తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీ నుంచి 24 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఇంటర్ విద్య ఉత్తీర్ణులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం కంప్యూటర్స్, జువాలజీ, హిస్టరీ, కెమిస్ట్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు పొందిన విద్యార్థులు వెంటనే తరగతులకు హాజరుకావాలన్నారు.

ముగిసిన సీఐటీయూ మహాసభలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కార్మికులు, కర్షకులు ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. బేతంచెర్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో రెండు రోజుల పాటు జరిగిన సీఐటీయూ జిల్లా మూడో మహాసభలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లాలో ఉన్న వేలాది మంది గని కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ కుమార్ అన్నారు. అనంతరం సీఐటీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, నంద్యాల జిల్లా అధ్యక్షునిగా యేసురత్నం, జిల్లా కోశాధికారిగా తిరుపతయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా వై.ఎల్లయ్య, శోభారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

21న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 21వ తేదీన అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోషియేషన్ సెక్రటరీ మహబూబ్‌బాషా తెలిపారు. స్థానిక జడ్పీ పాఠశాలలో మంగళవారం మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ నెలలో పిడుగురాళ్లలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయ్‌కుమార్, పీడీలు సురేష్, విజయమణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆళ్లగడ్డ: పుస్తకాలు విద్యార్థులకు నిత్య స్నేహితులని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధ్యాపకుడు డా.గంగన్న అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ. . విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

క్రిష్టిపాడు (దొర్నిపాడు), న్యూస్‌టుడే: దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులోని జడ్పీ పాఠశాలను జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ ఏడాది ఎంపీయూపీ పాఠశాల నుంచి జిల్లా పరిషత్తు పాఠశాలకు ప్రభుత్వం మార్చింది. ఈ క్రమంలో పాఠశాలలో వసతులను పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు.

టంగుటూరు(బనగానపల్లి గ్రామీణం): బనగానపల్లి మండలం టంగుటూరులోని పీహెచ్‌సీని ఎల్‌సీడీసీ నోడల్ అధికారి డా.శారదాబాయి మంగళవారం తనిఖీ చేశారు. దస్త్రానిలు పరిశీలించి.. గ్రామంలోని సర్వేను తనిఖీ చేశారు.

డోన్: సీఐటీయూ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షునిగా శివరాం ఎన్నికయ్యారు. డోన్‌కు చెందిన ఈయన రెండోసారి ఎన్నిక కావడంపై పలువురు సీఐటీయూ నాయకులు అభినందనలు తెలిపారు.

సంజామల: క్రీడలు మనిషికి మానసిక ఉల్లాసాన్ని ఇవ్వటంతో పాటు శారీరక దృఢత్వాన్ని కల్పిస్తాయని ప్రధానోపాధ్యాయులు టీసీ మద్దిలేటి అన్నారు. మండలంలోని గిద్దలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు.

ప్యాపిలి: అలేబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌లు పేర్కొన్నారు. భవనం శిథిలమైనందున వేరే భవనంలోకి మార్చాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు.

K.V.SUBBAREDDY DEGREE COLLEGE
Near: RTC Busstand, ALLAGADDA
Degree Admission: Last Date: 24.11.2025
Groups:- B.C.A., B.B.A., B.A., B.Com (CA), B.Sc (Computers, Botany, Zoology)
Contact the Prinicipal Phone No: 8555811671, 7989505253

(c) eenadu

ఈనాడు పల్నాడు
బుధవారం నవంబరు 19, 2025 7

కార్తికం.. దేదీప్యం

కార్తిక మాసం మాస శివరాత్రి పురస్కరించుకుని వినుకొండ బోసుబొమ్మ సెంటర్లోని శివసాయి మందిరంలో అర కోట్ల ఒత్తులు వెలిగించి భక్తులు శివలింగార్చన చేశారు. 70 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పున పూలతో శివలింగాకారం ఏర్పాటు చేశారు. అదే వేల ప్రమిదల్లో ఒత్తులు వెలిగించారు. ఆలయ పూజారి పోతురాజు శ్రీనివాసశర్మ, కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శులు బొగ్గి పద్మ ప్రసాదరావు, కె.సుబ్రహ్మణ్యం, ఆర్థిక కార్యదర్శి సనివెట్టి గురవయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, వినుకొండ

విద్యార్థులకు రవాణా భత్యం విడుదల

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: దూరప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చి చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం రవాణా భత్యంగా నెలకు రూ.1000 అందజేస్తోంది. జిల్లాలో 818 మంది విద్యార్థులకు రవాణా భత్యం అందించాల్సి ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా 612 మందికి రూ.3 వేల చొప్పున రూ.18.36 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే వారు 451 మంది.. ఉన్నత పాఠశాలలకు వెళ్లే 161 మందికి నిధులు జమ చేస్తారు. ఆధార్‌తో తప్పులు, బ్యాంకు ఖాతాల నంబర్లు ఇవ్వకపోవడంతో మిగిలిన విద్యార్థులకు రవాణా భత్యం ఆగిందని అధికారులు తెలిపారు. తప్పుల సవరణ పూర్తయ్యాక మిగిలిన వారికి సాయం అందుతుందని వివరించారు.

పల్నాటి చరితం.. వీరుల రాజసం

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే

పల్నాటి యుద్ధానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. రాజ్యకాంక్షతో కౌరవ, పాండవులు జరిపిన మహాభారత యుద్ధం తీరున సాగింది. క్రీ.శ.1138లో అనుగురాజు మహాదేవిచర్ల(నేటి మాచర్ల)ను రాజధానిగా చేసుకుని పాలన ప్రారంభించారు. ఆయన మృతితో సవతిపుత్రుల మధ్య విబేధాలు తలెత్తాయి. మలిదేవుడు మాచర్లను రాజధానిగా చేసుకుని మంత్రి బ్రహ్మనాయుడు (బ్రహ్మన్న) సారథ్యంలో పాలన ప్రారంభించారు. గురజాలను రాజధానిగా చేసుకుని నాగమ్మ మంత్రిత్వంలో నలగాముడు పాలన చేపట్టారు. ఈ క్రమంలో సరదాగా సాగిన కోడిపందేల జూదం రాజ్యాల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న వైషమ్యాలను బయలు చేశాయి. పల్నాడుకు ఇద్దరు రాజులు క్రీ.శ.1173లో రాజ్యాలను పందేలుగా పెట్టి కోడిపోరుకు దిగారు. నాగమ్మ కుయుక్తితో గురజాల రాజ్యాన్ని గెలిపించి, మాచర్ల రాజైన మలిదేవుడు, ఆయన మంత్రి బ్రహ్మన్న పరివారాన్ని అరణ్యవాసం పంపించారు. ఏడేళ్ల అరణ్య, ఏడాది అజ్ఞాత వాసం అనంతరం తిరిగి రాజ్యాన్ని కోరేందుకు అలరాజు ద్వారా జరిపిన సంధి విఫలమైంది. క్రీ.శ.1181లో పల్నాటి యుద్ధం అనివార్యమైంది. ఈ యుద్ధంలో 66 మంది వీరనాయకులు, వందల సంఖ్యలో సైనికులు అసువులు బాశారు. వీరులను గుర్తు చేసుకుంటూ ఏటా నవంబరులో ఐదు రోజుల పాటు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19 నుంచి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

కొణతాల మధ్య ఆచార నిర్వహిస్తూ.. (పాత చిత్రం)

వీరుల వంశీయుల కత్తిసేవ

1వ రోజు రాచగావు

తమ రాజ్యాల్లో వ్యాధులు ప్రబలినప్పుడు, పరాయి రాజ్యాలపై యుద్ధలకు వెళ్లే సమయాల్లో శక్తుల కోసం మేకపోతులను మేపను అప్పటి రాజులు నోటితో కొరికి బలిచ్చేవారు. అదే తీరున పల్నాటి యుద్ధం ప్రారంభం రోజున మేకపోతులను బలిచ్చి మాంసాన్ని గాలిలోకి విసిరి శక్తులకు ఆహారంగా అందించారు. అలానే మొదటిరోజు పీఠాధిపతి అన్నంలో కుంకుమ కలిపి రక్తపు ముద్దలుగా చేసి శక్తులకు రాచగావు నిర్వహిస్తారు.

2వ రోజు రాయబారం

కోడిపోరులో రాజ్యాన్ని కోల్పోయిన మలిదేవ, బ్రహ్మన్నల పరివారం అరణ్య, అజ్ఞాతవాసాలను ముగించుకొని మాచర్ల రాజ్యాన్ని తిరిగి ఇవ్వాలంటూ గురజాల రాజు నలగాముడి వద్దకు రాయబారం చేయిస్తారు. రాయబారిగా వస్తున్న అలరాజు దారి మధ్యలో హత్యకు గురికావడంలో పల్నాటి యుద్ధం అనివార్యమవుతుంది. ఈ తతంగాన్ని కథాగానం చేస్తుండగా వీరుల వంశీయులు కత్తి సేవ చేస్తారు.

3వ రోజు మందపోరు

మలిదేవ, బ్రహ్మన్న పరివారం అరణ్యవాస సమయంలో నల్లమల అటవీ ప్రాంతమైన మండాది ప్రాంతంలో ఆవులను మేపేవారు. వాటిని వధించేందుకు వచ్చిన నాగమ్మ వర్గీయులతో లంకన్న భీకర యుద్ధం చేసి మృత్యువాత పడతాడు. విషయం తెలిసి బ్రహ్మన్న పరివారంతో వచ్చి లంకన్నకు శంఖుతీర్థమిచ్చి ముక్తి ప్రసాదిస్తాడు. కులమతాలకు అతీతంగా బ్రహ్మనాయుడు హరిజన, గిరిజనులకు దేవాలయాల ప్రవేశాలను చేపట్టి సహపంక్తి భోజనాలు చేసిన విషయాన్ని కథాగానం చేస్తారు.

4వ రోజు కోడిపోరు

పల్నాటి యుద్ధంలో ప్రధాన ఘట్టమైన కోడిపోరు నిర్వహిస్తారు. బ్రహ్మనాయుడి సారథ్యంలో మాచర్ల రాజులు చిట్టిమల్లు కోడితో పోరుకు వస్తారు. నాగమ్మ నేతృత్వంలో గురజాల రాజు సివంగిడేగ పుంజుతో పోరుకు సిద్ధమవుతారు. నాగమ్మ కుయుక్తితో సివంగి డేగను గెలిపించుకొని మాచర్ల పరివారాన్ని అడవుల పాలు చేస్తుంది. దీన్ని తెలిపేలా కథాగానం చేస్తారు.

5వ రోజు కల్లిపాడు

పల్నాటి యుద్ధంలో ఉపయోగించిన వీరుల ఆయుధాలతో వీరాచార పీఠాధిపతి ద్వారా శంఖుతీర్థం తీసుకుని యుద్ధక్షేత్రం వైపు వెళ్లి, అక్కడి పోతురాజు శిల వద్ద ఉంచిన తంగెడ మండలపై వాలిపోయి యుద్ధంలో మృతి చెందినట్లుగా చూపుతారు. ఈ ఘట్టంతో ఆరాధనలు ముగుస్తాయి.

పుస్తక ఖజానా.. చదువరులకు నజరానా

పుస్తకాలు చూపుతున్న కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు

నరసరావుపేట అర్బన్: నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల గ్రంథాలయంలో పుస్తక ఖజానా పేరిట ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. 70 వేల ప్రామాణిక గ్రంథాలు, 50 రకాల జర్నల్స్, పలు సంస్థల నిఘంటువులు, మహాత్ముడి జీవిత చరిత్ర తెలిపే ఛాయాచిత్రాలు, ప్రముఖ శాస్త్రవేత్తల చిత్రాలు, తెలుగు కవుల చిత్రాలు ప్రదర్శనలో ఉంచారు. పుస్తక ప్రియులు, చదువరులు, విద్యార్థులకు విజ్ఞానదాయకంగా ఉండేలా దీనిని ఏర్పాటు చేశారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటైన ప్రదర్శనను కళాశాల అధ్యక్ష కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా ప్రారంభించారు. నెల రోజుల పాటు పట్టణ పరిసర ప్రాంత విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ సుధీర్, గ్రంథాలయ అధికారి రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

దేశ సేవకు అగ్నిపథ్ సదవకాశం

గుంటూరు: దేశ సేవ చేయాలనుకున్న యువతకు అగ్నిపథ్ సదవకాశమని 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ అలీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో భారత వైమానిక దళంలో అవకాశాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. వింగ్ కమాండర్ యాకుబ్ అలీ మాట్లాడుతూ భారత వైమానిక దళంలోని ఉద్యోగ అవకాశాలను వివరించారు. దేశ సేవ కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అగ్నిపథ్ పథకం, దాని ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

ముందస్తుగా ధాన్యం సేకరణ

నెలాఖరులో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు

నరసరావుపేట, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. ఏటా వీటి ఏర్పాటులో జాప్యం కారణంగా అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోంది. ఆ క్రమంలో ఈసారి ముందుగానే ధాన్యం సేకరణకు చర్యలు చేపట్టింది. తేమ శాతం నిర్ధారణలో ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 25కే ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ పౌరసరఫరాల సంస్థకు సమాచారం అందించడంతో ఈ నెలాఖరులో రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) వద్ద కొనుగోళ్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

❖ ధాన్యం తేమ శాతం నిర్ధారణలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రాలు, మిల్లర్ల వద్ద ఒకే తరహా మీటర్లు ఉన్నాయో లేవో సోమవారం నుంచి జిల్లా అంతటా పరిశీలన చేస్తున్నారు. తేమ కారణంగా రైతులు నష్టపోకుండా రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు.

❖ ధాన్యం గ్రేడ్-ఏ రకానికి మద్దతు ధర క్వింటాకు రూ. 2,389, 75 కేజీల బస్తాకు రూ. 1,792.. సాధారణ రకం(కామన్) క్వింటాకు రూ. 2,369, 75 కేజీల బస్తాకు రూ. 1,777గా నిర్ణయించారు.

జిల్లాలో సాగు

సాధారణ విస్తీర్ణం	38,599 హెక్టార్లు
ఈ ఏడాది సాగైంది	53,090 హెక్టార్లు
దిగుబడి అంచనా	4.30 లక్షల మె.ట.
కొనుగోళ్ల లక్ష్యం	40 వేల మె.ట.
గతేడాది కొన్నది	13,900 మె.ట.

తొలివిడత వంద ఆర్ఎస్‌కేల్లో..

జిల్లావ్యాప్తంగా తొలుత 286 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలనే ఆలోచన చేశారు. రైతులకు చేరువతోపాటు పెద్దఎత్తున కొనుగోలు చేయాలనే లక్ష్యంతో తొలివిడతలో 100 కేంద్రాల్ని ఎంపిక చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ నెలాఖరులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నారదముని తెలిపారు.

నేడు అన్నదాత సుఖీభవ జమ

నియోజకవర్గం	అర్హులు	నిధులు (రూ.కోట్లలో)
సత్తెనపల్లి	36,752	24.07
నరసరావుపేట	20,463	13.30
చిలకలూరిపేట	21,669	14.13
పెదకూరపాడు	41,149	27.03
గురజాల	35,676	23.26
వినుకొండ	45,898	31.04
మాచర్ల	38,923	26.08

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాల కింద రెండో విడత రూ.7 వేల నగదును రైతుల ఖాతాలకు బుధవారం జమ చేయనున్నారు. ఈసారి 2,40,530 మందికి రూ.158.91 కోట్ల సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సత్తెనపల్లి మండలం గుడిపూడి రైతు సేవా కేంద్రంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పథకాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు తెలిపారు. రొంపిచర్ల మార్కెట్ యార్డులో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొంటారని ఏవో శివలలిత వివరించారు.

నాడు బీరాలు.. నేడు బేరాలు!

సాగర్ కాలువ పనుల పేరుతో రూ.4.50 కోట్లు పక్కదారి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

మాచర్ల, గురజాల నియోజకవర్గాల పరిధిలోని సాగర్ కాలువల్లో పూడిక తీత పేరుతో వైకాపా నాయకులు రూ.4.50 కోట్లు స్వాహా చేశారు. అసలు పనులు చేయకుండానే ప్రభుత్వ సొమ్ము కాజేశారు. అవినీతి బాగోతం తెలిసినా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నీటి సంఘాలు, ప్రాజెక్టు కమిటీ సభ్యులు నోరెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో కాలువల్లో పూడిక తీసిన పాపాన పోలేదని.. పైగా మరమ్మతులు చేసినట్లు బిల్లులు పెట్టుకున్నారని, అధికారంలోకి వచ్చాక వారి బాగోతం బయటపెడతామని చెప్పిన వారంతా నేడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

2023లో పూడిక తీసినట్లు చెబుతున్న తంగెడ మేజర్ కాలువ.. అప్పట్లో తీసిన చిత్రమిది.

ఎక్కడెక్కడ పనులు చూపారంటే..

గురజాల మండలం గొట్టిముక్కల మైనర్, దైద మైనర్, పిడుగురాళ్ల మండలం ఆకురాజుపల్లి (ఏకేపీ) మేజర్, రెంటచింతల మండలం మల్లవరం మేజర్, రెంటచింతల మేజర్, పాల్వాయి మేజర్, మాచర్ల మండలం కంభంపాడు మేజర్, దాచేపల్లి మండలం తంగెడ మేజర్.

వైకాపా హయాంలోనే బిల్లుల్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేశారు. అంతేకాకుండా పనులు చేయలేదనడానికి నిరూపణ సాధ్యం కానివిధంగా పకడ్బందీగా ఎంబుక్కులు రాశారు. పైగా రెండుసార్లు కోర్టుకు వెళ్లడంతో బిల్లులు మంజూరయ్యాయని ఎన్నెస్పీ ఎస్ఈ పి.కృష్ణమోహన్ తెలిపారు.

దోపిడీ ఇలా..

మేజర్, మైనర్ కాలువల్లో పూడిక తీసినట్లు బిల్లుల్లో పేర్కొన్నారు. కొన్నిచోట అత్యవసరంగా మరమ్మతులు చేసినట్లు చూపారు. కంపచెట్ల తొలగించడమే కాకుండా.. కాలువ గట్లను పటిష్ఠం చేసినట్లు బిల్లులు పెట్టారు. పైగా ఈ పనులన్నీ 2022-23లోనే చేసినట్లు చూపించారు. ఈ అక్రమాలపై అప్పట్లోనే 'ఈనాడు'లో కథనాలొచ్చాయి. దీంతో గుత్తేదారులు అప్రమత్తమై పొక్లెయిన్లు తెప్పించి పైపైన పూడిక తీసినట్లు ఫొటోలు తీయించారు. బిల్లుల మంజూరు సమయానికి ఎన్నికలు రావడం, తర్వాత ప్రభుత్వం మారడంతో మరోసారి బిల్లుల డ్రాకు బ్రేక్ పడింది. అనంతరం గుత్తేదారులు కోర్టుకు వెళ్లడం.. డివిజన్ స్థాయి ఎన్నెస్పీ అధికారులు చెప్పినట్లు చేయడంతో ఎట్టకేలకు దొంగ బిల్లులకు మోక్షం కలిగింది. ఇందులో కృష్ణా జిల్లాకు చెందిన, మాచర్లలో పనిచేసిన విశ్రాంత ఏఈ కుమారుడి పేర పనులు చేసినట్లు బిల్లులు పెట్టారు. మొత్తం నలుగురు గత సెప్టెంబరులో రూ.4.50 కోట్లు కొల్లగొట్టారు. ఇందుకు ప్రతిగా ఎన్నెస్పీ డివిజన్‌స్థాయి అధికారులకు పర్సంటేజీ రూపంలో భారీగానే ముట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా తెలిసీ ప్రాజెక్టు కమిటీ సభ్యులు ఎందుకు గప్‌చుప్‌గా ఉన్నారన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పది పరీక్ష కేంద్రాల పెంపు!

విద్యా శాఖ ప్రతిపాదనలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యా శాఖ సన్నాహాలు ప్రారంభించింది. గత ఏడాది నిర్వహించిన పరీక్ష కేంద్రాల్లో కొన్ని మార్చేందుకు, కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు చేశారు. జిల్లాలో 14,920 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. వీరంతా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు.. వసతులు, రవాణా సదుపాయం తదితర అంశాల్ని పరిగణనలోకి తీసుకుని 131 కేంద్రాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. గత ఏడాది 125 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.

పత్రాలు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ, అధికారులు

ఇబ్బందుల గుర్తింపు .. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలకు సరైన రహదారి సౌకర్యం లేదు. విద్యార్థులు ఆయా కేంద్రాలకు సమయానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సదుపాయం అందుబాటులో లేదు. ఆటోల్ని ఆశ్రయించక తప్పడం లేదు. విద్యార్థుల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని కేంద్రాలను మార్చాలన్న నిర్ణయం తీసుకున్నారు. మార్చాలని భావించినవి నాలుగు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

పరిశీలన పూర్తి... 'జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అనువైన కేంద్రాల పరిశీలన పూర్తి చేశాం. విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది కొత్తగా ఆరు కేంద్రాల్ని గుర్తించాం. వాటిలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రతిపాదనలను విద్యా శాఖ కమిషనర్‌కు పంపుతున్నాం. ఆమోదం లభించగానే తదుపరి చర్యలు తీసుకుంటాం' అని డీఈవో చంద్రకళ తెలిపారు.

హరిత పల్నాడు సాధన దిశగా కార్యాచరణ

సమీక్ష చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో పచ్చదనాన్ని పెంచి హరిత పల్నాడు సాధించేందుకు కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అటవీశాఖ అధికారులతో సమీక్ష చేశారు. జిల్లాలో దట్టమైన అడవి 2 శాతం, అటవీ ప్రాంతం 7 శాతం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. 37 శాతం భూమిని పచ్చదనంగా మార్చేందుకు 1.16 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటి సంరక్షించాల్సి ఉంటుందని తెలిపారు. నల్లతుమ్మ చెట్లు త్వరగా పెరుగుతాయని వాటిని సంరక్షించడం సులువుగా ఉంటుందన్నారు. అలాగే పక్షి జాతులకు పాములు, ఇతర జంతువుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నరేగా, క్యాంప, ఎంపీ ల్యాడ్స్ ద్వారా ఖాళీ భూముల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. డీఎఫ్‌వో కృష్ణప్రియ, డీసీఎఫ్ అశోక్‌కుమార్, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇక ముఖం చాటేస్తే కుదరదు

★ ఎఫ్ఆర్ఎస్‌తో సీఎఫ్ఎంఎస్ ఐడీ అనుసంధానం

★ వైద్య ఉద్యోగుల హాజరు నమోదులో పారదర్శకత

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల హాజరులో పారదర్శకతకు పెద్దపీట వేసేలా ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదులో కచ్చితత్వం లేదని ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి తెచ్చారు. దానికి కూడా కొందరు మస్కా కొడుతున్నారు. చరవాణుల్లో ఆధార్, చరవాణి నంబర్లతో ఎఫ్ఆర్ఎస్ ఐడీ సృష్టించుకుని ఎక్కడి నుంచైనా హాజరు వేస్తున్నారు. కొన్నిసార్లు హాజరు వేయకుండానే వేతనాలు తీసుకుంటున్నారు. ✦ ఇకనుంచి వేతనాలు తీసుకునే సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఎఫ్ఆర్ఎస్ అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 20వ తేదీ లోపు అనుసంధానం చేసుకోకుంటే మరో అవకాశం ఉండదని హెచ్చరికలు చేశారు. దీంతో ఉద్యోగులందరూ తమ వివరాల్ని ఎఫ్ఆర్ఎస్‌తో అనుసంధానం చేసుకుంటున్నారు. ఇక విధులకు డుమ్మా కొడితే వేతనంలో కోత తప్పదని అంటున్నారు.

✦ జిల్లాలో 39 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 26 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెగ్యులర్ ఉద్యోగులు 1250 మంది, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు ఉద్యోగులు 629, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 59 మంది పని చేస్తున్నారు. మొత్తం 1,938 మంది ముఖ ఆధారిత హాజరు సక్రమంగా వేస్తేనే జీతం అందుతుంది. ప్రతినెలా 15వ తేదీ నుంచి వచ్చే నెల 16 వరకు హాజరును వేతనానికి పరిగణనలోకి తీసుకుంటారు. రోజుకు మూడుసార్లు ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఉదయం, సాయంత్రం తప్పనిసరి. రెండుసార్లు నమోదు చేయకుంటే ఆ రోజు ఉద్యోగానికి గైర్హాజరైనట్లుగా గుర్తిస్తారు.

ఒకే ప్రాంతంలో ఉద్యోగావకాశం

సచివాలయ ఉద్యోగులకు స్పౌజ్ కోటాలో బదిలీలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

భార్య ఒకచోట.. భర్త మరోచోట ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండటంతో పిల్లల పోషణ, వయోవృద్ధుల సంరక్షణ తదితరాలకు ఇబ్బందిగా ఉంటోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చాన్నాళ్లుగా ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు స్పౌజ్ కోటాలో అంతర్‌జిల్లా బదిలీలకు అనుమతి ఇచ్చింది. తద్వారా భార్యాభర్త ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేసే అవకాశం దక్కనుంది. ఈ నెల 30వ తేదీకే బదిలీల ప్రక్రియ పూర్తి కానుంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ 2019 సెప్టెంబరులో అమల్లోకి వచ్చింది. 2022 జులైలో ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టారు. అదే ఏడాది చివర్లో స్పౌజ్ కోటాలో బదిలీలు చేపట్టారు. అప్పట్లో పరస్పర అంగీకారం మేరకు బదిలీలు నిర్వహించడంతో చాలా మంది ఉన్నచోట నుంచి వేరే ప్రాంతానికి కదల్లేని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ స్పౌజ్ కోటాలో బదిలీలకు అవకాశం కల్పించలేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

జిల్లాలో గ్రామ సచివాలయాలు :	416
మొత్తం ఉద్యోగులు :	3,539
వార్డు సచివాలయాలు :	122
మొత్తం ఉద్యోగులు :	979

మత్తులో బరితెగిస్తున్నారు!

జనవరి నుంచి జులై వరకు నమోదైన గంజాయి కేసులు: 5
2024లో: 14 | 2023లో: 5

యథేచ్ఛగా గంజాయి వినియోగం

వినుకొండ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓబయ్య కాలనీలో రాంబాబు అనే యువకుడిపై అదే కాలనీకి చెందిన కొందరు యువకులు విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితుడిని గుంటూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రెండో రోజు చనిపోయాడు. దాడికి పాల్పడిన వారు గంజాయి మత్తులో ఉన్నారని కాలనీ మహిళలు చెబుతున్నారు.

వినుకొండ శివారు కాలనీలో రెండు నెలల కిందట వివాహిత హత్యకు గురైంది. ఒంటరిగా ఉందన్న విషయాన్ని గ్రహించి ఇంట్లోకి చొరబడి ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు అపహరించడమే కాకుండా పాశవికంగా హత్య చేసి పారిపోయారు. ఇది గంజాయి ముఠా పనేనని పోలీసులు అనుమానించినా.. ఇంతవరకు అదుపులోకి తీసుకోలేదు.

చిలకలూరిపేటలో కొంతమంది యువకులు బీరులో గంజాయి కలుపుకొని తాగుతున్నారు. ఇటీవల ఓ బార్ వద్ద జరిగిన గొడవలో ఒకరిపై దాడి చేశారు. పోలీసుల విచారణలో యువకులు బీరులో గంజాయి కలుపుకొని తాగుతున్నట్లు బయటపడింది.

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

జిల్లాలో గంజాయి రవాణా, వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది. గంజాయి ప్రియులు మత్తులో ఘోరాలకు తెగబడుతున్నారు. డబ్బుల కోసం దొంగతనాలు చేస్తూ ఎవరైనా అడ్డొస్తే దాడులకు దిగుతున్నారు. విషయం తెలిసినా పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడం లేదు.

అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు పల్నాడు జిల్లా యువకులను అక్కడి పోలీసులు కొద్ది రోజుల కిందట పట్టుకున్నారు. ఇటీవల ఈగల్ సిబ్బంది ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి చాక్లెట్లు పట్టుకున్నారు. నరసరావుపేట పట్టణ శివారు కాలనీలు, సమీప సుబాబుల్ తోటల్లో మత్తు పదార్థాల విక్రయం, వినియోగం జరుగుతోంది. పట్టణంలోని కోడెల స్టేడియంలోనూ ఉదయపు నడకకు వచ్చేవారికి మత్తు పదార్థాల వాడకానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తుండటం గమనార్హం. పోలీసులు పెద్దగా దృష్టి సారించనందున గంజాయి రవాణా, విక్రయాలు, వాడకానికి అడ్డుకట్ట పడటం లేదనే విమర్శ వినిపిస్తోంది.

'ఈగల్ బృందాలతో ఎక్కడికక్కడ తనిఖీలు చేయిస్తున్నాం. గంజాయి రవాణా, వినియోగం కట్టడికి చర్యలు చేపడతాం' అని ఎస్పీ కృష్ణారావు తెలిపారు.

జంట గ్రామాలకు జలసిరి

ఉబికి వస్తున్న నీరు

మండలంలోని జంట గ్రామాలు నర్శింగపాడు, త్రిపురాపురంలో పాతాళ గంగ పైపైకి వస్తోంది. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోర్ల నుంచి నీరు ఉప్పొంగుతోంది. దాదాపు 30 బోర్లకు సంబంధించి మోటారు ఆన్ చేయకుండానే నీరు వస్తుండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 7.50 మీటర్ల మేర భూగర్భజలాల మట్టం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. నర్శింగపాడు పరిసరాల్లోని భూమి పొరల్లో తేడాల కారణంగా నీరు ఉబికి వస్తోందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ప్రస్తుతం బోర్ల కింద వరి సాగు చేశారు. - న్యూస్‌టుడే, నకరికల్లు

(c) eenadu

శనగ రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలి

విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న డాట్ సెంటర్ శాస్త్రవేత్త సత్యగోపాల్, పక్కన ఏవో సరిత

వేలూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : శనగ రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త టి.వి.సత్యగోపాల్ సూచించారు. చిలకలూరిపేట మండలం వేలూరు, కుప్పపల్లివారిపాలెం గ్రామాల్లో శనగ పంట వేసే రైతులకు విత్తనశుద్ధిపై మంగళవారం అవగాహన కలిగించారు. 2.5 గ్రాముల కార్బన్‌డిజం అనే శిలీంధ్ర నాశినితో తర్వాత ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసుకుంటే వేరుకుళ్లు, వెండి తెగుళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. మొక్కల మధ్య నాలుగు అంగుళాల దూరంతో విత్తుకున్నట్లయితే ఎకరాకు 30 నుంచి 35 కిలోల విత్తనాలు సరిపోతాయన్నారు. చివరి దుక్కిలో 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేసుకుంటే మొక్కకు కావాల్సిన గంధకం కూడా అందుతుందన్నారు. మొక్కజొన్నకు లోతు దుక్కులు దున్నితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నరసరావుపేట డివిజన్ సహాయ సంచాలకుడు కె.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేస్తున్న నేపథ్యంలో అర్హత ఉండి ఇంకా లబ్ధిపొందని రైతులు సంబంధిత పత్రాలతో రైతుసేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఏవో సీహెచ్ సరిత తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం.. వంద మంది మిత్రులతో సమానం

విద్యార్థుల పుస్తక పఠనం

విజయపురి సౌత్, న్యూస్‌టుడే: ఒక పుస్తకం 100 మంది మిత్రులతో సమానమని ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్ నయాంభాను అన్నారు. స్థానిక ఏపీఆర్‌డీసీలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. తొలుత సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. 16,500పైగా పుస్తకాలతో ఉన్న గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి బాషా, డిప్యూటీ వార్డెన్ సతీష్‌బాబు, లైబ్రేరియన్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో రైతులకు నిజమైన భరోసా

నరసరావుపేట అర్బన్: వైకాపా పాలనలో మోసపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం నిజమైన భరోసా కల్పిస్తోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద రెండో విడత కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు కలిపి రాష్ట్రంలో 46.85లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.3174.43 కోట్లు నిధులు బుధవారం జమ చేస్తున్నట్లు తెలిపారు.

తదేక దీక్షతో విజయపథం

కస్తూర్బా విద్యాలయాల్లో నూరుశాతం ఫలితాల సాధనకు కృషి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

బాలికల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. గతేడాది 100 రోజుల ప్రణాళికలో భాగంగా అమలు చేసిన పంచతంత్రం కార్యక్రమం మంచి ఫలితాలిచ్చింది. దీంతో ఈ ఏడాది కూడా పదో తరగతితో పాటు ఇంటర్‌లో నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధనకు విజయపథం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

పక్కాగా పర్యవేక్షణ

జిల్లాలో చిలకలూరిపేట మండలంలోని పోతవరం, నాదెండ్ల, నరసరావుపేట ఇలా మొత్తం 24 ప్రాంతాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 6 నుంచి ఇంటర్ వరకు సుమారు 7వేల మంది బాలికలు చదువుకుంటున్నారు. ఇందులో పది, ఇంటర్‌లో 2వేలకు పైగా విద్యార్థినులు ఉన్నారు. విజయపథం ప్రణాళిక అమల్లో భాగంగా ఉదయం 6.30 నుంచి వీరిని సన్నద్ధం చేస్తున్నారు. రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక తరగతులతో పాటు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిని జిల్లా స్థాయిలో జీసీడీవో పర్యవేక్షిస్తున్నారు. ప్రతి సోమవారం చదువుకోవడానికి ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. వారంలో అయిదు రోజులు నిర్వహించిన రోజువారీ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన వారికి ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజు ఉదయం బాలికలు యోగా సాధన చేయిస్తుండటంతో వారిలో జ్ఞాపకశక్తి పెంపొందించడానికి దోహదపడుతుంది.

కార్యాచరణ ఇలా..

- నిత్యం ప్రత్యేక తరగతుల నిర్వహణ
- బోధించిన పాఠ్యాంశాలపై నిత్యం పరీక్షలు నిర్వహించడం
- అభ్యసన స్థాయిని పెంచేందుకు ప్రతి రోజూ ప్రత్యేక శిక్షణ
- అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించడంతో పాటు ఆయా పాఠ్యాంశాల్లో మెలకువలు నేర్పడం

యోగా చేస్తూ..

రాత్రి వేళ చదువుతున్న విద్యార్థినులు

గత ఏడాది ఒరవడి కొనసాగిస్తాం

జిల్లాలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుకుంటున్న పదోతరగతి, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. 2024-25 విద్యా సంవత్సరంలో పోతవరం కస్తూర్బా విద్యాలయంలో నూరుశాతం ఫలితాలు సాధించడంతో పాటు పదిలో 580 మార్కులు గరిష్ఠంగా సాధించాం. ఇక్కడ ఒక్కచోట నుంచే నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కలెక్టర్ చేతులమీదుగా షైనింగ్ స్టార్ అవార్డు కూడా ఓ విద్యార్థిని అందుకుంది. ఈ విద్యా సంవత్సరంలో కూడా అదే ఒరవడి కొనసాగిస్తామని ప్రిన్సిపల్ షేక్ అఫ్రపూన్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

(భారత ప్రభుత్వ షెడ్యూల్డ్ బ్యాంక్)
సాతులూరు బ్రాంచి, పల్నాడు జిల్లా.
ఫోన్: 6281003914, email: bm0719@apgb.bank.in

Lr No. 7999/RONRT/SARFAESI/2025-26/42 Date: 19-09-2025

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము **డిమాండ్ నోటీసు**

టు, ఋణగ్రహీత: 1) శ్రీమతి మామిళ్ళపల్లి కళ్యాణి, భర్త: పోతురాజు, డి.నెం.1-44, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549. **2) శ్రీ మామిళ్ళపల్లి పోతురాజు, తండ్రి: మస్తాన్,** డి.నెం.1-44, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549. **3) శ్రీ మామిళ్ళపల్లి మస్తాన్, తండ్రి: రామయ్య,** డి.నెం.1-44, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549. **చట్టబద్ధవారసులు: 3 (i) శ్రీ మామిళ్ళపల్లి పోతురాజు, తండ్రి: మస్తాన్,** డి.నెం.1-44, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549. **3) (ii) శ్రీ మామిళ్ళపల్లి శ్రీనివాసరావు, తండ్రి: మస్తాన్,** డి.నెం.1-44/1, పోస్ట్‌ఆఫీస్ రోడ్డు, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549. **3) (iii) శ్రీమతి తోకల రేణుక, భర్త: రామారావు,** డి.నెం.1-18-1, పంచాయతీ ఆఫీస్ రోడ్డు, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549. **సహ-పూచీదారు/హామీదారు: 4) శ్రీ సంగపు అబ్బాయ్య, తండ్రి: సుబ్బారావు,** R/o. డి.నెం.4-56, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549. **తనఖాదారు/లు: 1) శ్రీమతి మామిళ్ళపల్లి కళ్యాణి, భర్త: పోతురాజు,** డి.నెం.1-44, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా-522549.

అయ్యా / అమ్మా,

ఈ నోటీసులో ఉదహరించిన నెం.1, 2 & 3 పేర్కొనబడినవారు మా బ్యాంక్ యొక్క సాతులూరు బ్రాంచి నుండి కొత్త ఇంటి నిర్మాణము అవసరాలకు హౌసింగ్ లోన్ (HLPNI) A/C No 771930100011049 dated 14-05-2018 ప్రకారం రూ.14,00,000/- (అక్షరాల పద్నాలుగు లక్షల రూపాయలు మాత్రమే) ఋణసౌకర్యము పొందియున్నారు.

ఈ దిగువ ఆస్తిని తనఖావుంచడం ద్వారా:
రిజిస్టర్డ్ / ఈక్విటబుల్ తనఖావుంచిన స్థిరాస్తి యొక్క వివరములు ఈ దిగువ పేర్కొనబడినవి.

అస్తి యొక్క షెడ్యూలు

లొకేషన్ & ఆస్తి యొక్క వివరములు	ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనము, సంకురాత్రిపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా.
సర్వే నెం.	డి.నెం.356/1, డోర్ నెం.1-44
విస్తీర్ణము	230 చ॥గ॥ల స్థలము
యజమాని పేరు	శ్రీమతి మామిళ్ళపల్లి కళ్యాణి
హద్దులు	ఉత్తరం: ఆర్&బి రోడ్డు, తూర్పు: తోకల రామారావు దక్షిణం: సిరికొండ పుల్లయ్యా, పడమర: పంచాయతీ బజారు

పైన ఉదహరించబడిన మీలో నెం.1, 2 & 3 వారు ఋణమును/ సౌకర్యమును మరియు/ లేదా వాయిదాలలో/ వడ్డీని రెండింటిని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను **ది.06-09-2025** నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది. మరియు మీరందరూ ఉమ్మడిగా మరియు విడివిడిగా **ది.30.08.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.9,78,125.85 (అక్షరాల తొమ్మిది లక్షల డెబ్బై ఎనిమిది వేల నూట ఇరవై ఐదు రూపాయలు మరియు ఎనభై ఐదు పైసలు మాత్రమే)** మరియు అగ్రిమెంటు ప్రకారము తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలు చెల్లించవలసియున్నది. [illegible]

...కేటాయించుటకు ముందుగా గాని, అమ్మకమునకు ముందుగా గాని బ్యాంకు వారికి మీరు చెల్లించవలసిన బకాయిలు మరియు బ్యాంకు వారిచే చెల్లించబడిన అన్ని కాస్ట్‌లు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు కలుపుకొని చెల్లించినట్లయితే మీ ఆస్తులను విడిపించుకొను హక్కు కలదు. చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ 13 ప్రకారం ఈ నోటీసు అందిన తరువాత, మీరు బ్యాంకు ముందస్తు అనుమతి లేనిదే మామూలు వ్యవహారాలు మినహా పైన తెలిపిన సెక్యూరిటీలను విక్రయించుట లేదా మరే విధంగా లావాదేవీలు జరుపుటకు మీరు నిరోధించబడినారు. ఈ నోటీసు బ్యాంకు వారికి ప్రస్తుతము అమలు లోనున్న ఇతర చట్టబద్ధమైన హక్కులకు భంగమువాటిల్లకుండా జారీచేయబడినది.

ప్రదేశం : సాతులూరు
తేది : 19-09-2025
సం/- ఛీఫ్ మేనేజర్ కమ్ అధీకృత అధికారి
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

సామాన్యులకు వైకుంఠ ద్వార దర్శనం హర్షణీయం

వినుకొండ, న్యూస్‌టుడే: తిరుమలలో సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనానికి అవకాశం కల్పించడం అభినందనీయం అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది డిసెంబరు 30 నుంచి వచ్చే ఏడాది జనవరి 8 వరకు ఈ ప్రత్యేక దర్శనానికి అనుమతి ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. వీవీఐపీ, వీఐపీలకు లభించే వైకుంఠ ద్వార దర్శనం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తిరిగి పాలకమండలి సామాన్య భక్తులకు వర్తింపజేయడం హర్షణీయమన్నారు.

తాడువాయి రేవులో పడవ సీజ్

పడవను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, వీఆర్వో అదిలక్ష్మి తదితరులు

తాడువాయి (అచ్చంపేట), న్యూస్‌టుడే: మండలంలోని తాడువాయి నుంచి ఎన్టీఆర్ జిల్లా గుడిమెట్ల మధ్య కృష్ణానదిలో నడిపే ప్రయాణికుల పడవను సీజ్ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన రేవును సందర్శించారు. పడవకు లైసెన్సు, ఫిట్‌నెస్ లేకపోవడాన్ని గుర్తించి సీజ్ చేశారు. మాదిపాడు, గింజుపల్లి పడవలను కూడా సీజ్ చేస్తామన్నారు. వీఆర్వో అదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

చురుగ్గా క్రీడా మైదానం చదును పనులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు లయోలా పాఠశాల వేదిక కానుంది. ఈ నెల 24, 25 తేదీల్లో 69వ ఎస్జీఎఫ్ అండర్-17 బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు లయోలా పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి సురేష్ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం రెండు ట్రాక్టర్లతో క్రీడా మైదానాన్ని చదును చేసి ఆటలకు అనుకూలంగా శుభ్రం చేయించే పనులకు శ్రీకారం చుట్టారు. లయోలా పాఠశాలలో ఆటల పోటీల నిర్వహణకు అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. రెండ్రోజుల్లో పనులు పూర్తిచేసి మైదానం సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాదర్ అవినాష్, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి యనమదల చిరంజీవిరావు, వ్యాయమ ఉపాధ్యాయులు కొండలు, మహేష్, ప్రసాద్, రాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా వైద్యులకు షోకాజ్ నోటీసులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పలువురు మహిళా వైద్యులకు ఉన్నతాధికారుల నుంచి మంగళవారం షోకాజ్ నోటీసులు వచ్చాయి. గతంలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వైద్యశాలను తనిఖీ చేసిన సమయంలో ముగ్గురు మహిళా వైద్యులు ఆసుపత్రిలో లేరు. వారు హాజరు పట్టీలో సంతకాలు చేసి వెళ్లిపోయినట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వీటితో పాటు విధి నిర్వహణలో సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం విచారణలో అవి నిర్ధారణ కావడంతో షోకాజ్ నోటీసులు వచ్చినట్లు తెలిసింది. మహిళా వైద్యులు పర్యాయ మేరకు విచారణ అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాస రెడ్డిని సోమవారం సస్పెండ్ చేయగా మరో వైద్యుడు సుధాకర్‌కు షోకాజ్ నోటీసులు వచ్చాయి. ఇంతలోనే మరి కొందరికి షోకాజ్ నోటీసులు రావడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. దీనిపై డీసీహెచ్ఎస్ ప్రసూనను వివరణ అడగ్గా గుంటూరు డీసీహెచ్ఎస్ నుంచి నేరుగా నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల ఆరాధనోత్సవాల పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఎడ్ల పోటీలను మంగళవారం ఆర్డీవో మురళీకృష్ణ ప్రారంభించారు. తొలిరోజు ఆరుపళ్ల విభాగంలో పోటీలు నిర్వహించారు. దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3538.7 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన మాదలరెడ్డి ఎడ్ల జత 3260 అడుగులతో ద్వితీయ, కృష్ణా జిల్లా యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య శ్రీమదుల ఎడ్లజత 3250 అడుగులతో తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, వైద్యులు లక్ష్మీనాయక్, అమరయ్య, రాముడు, శ్రీనివాసరావు, శేషగిరిరావు, హనుమంతరావు, శ్రీను, బాలకృష్ణ, రాఘవ, కొండ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీకి ఎంపిక

శ్రావణి

జానకుమార్

నరసరావుపేట (క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలో వశిష్ఠ జూనియర్ కళాశాలకు చెందిన డి.శ్రావణి, జి.జానకుమార్ ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వినుకొండలో నిర్వహించిన అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన వీరు డిసెంబరులో హరియాణాలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన పీడీ సురేష్‌ను కళాశాల డైరెక్టర్లు నర్రా శేషగిరిరావు, నల్లపాటి శ్రీకాంత్, రావూరు, ప్రిన్సిపల్ శివనాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

పరుగులో కారుమంచి సైనికుడి ప్రతిభ

బంగారు పతకం సాధించిన అంకమ్మరావు

కారుమంచి (శావల్యాపురం), న్యూస్‌టుడే: పుణె సమీపంలోని తలేగావ్‌లో న్యూట్రి ఫ్రెష్ ఫామ్ అగ్రి కంపెనీ నిర్వహించిన 50 కి.మీ. పరుగు పందెంలో మండలంలోని కారుమంచికి చెందిన సైనికుడు పూల అంకమ్మరావు బంగారు పతకం సాధించారు. దీంతో పాటు రూ.25వేలు నగదు ప్రోత్సాహకాన్ని కంపెనీ తరపున అందచేశారని తెలిపాడు. ప్రస్తుతం ఆయన పుణెలోని ఆర్మీ ఆర్డినెన్స్ కోర్ విభాగంలో ఏపీఎఫ్ నాయక్ సుబేదారుగా విధులు నిర్వహిస్తున్నారు. డిసెంబరులో పుణె పోలీసు ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే పలు మారథాన్ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించారు. గ్రామానికి చెందిన సైనికుడు పతకం సాధించడంపై గ్రామ పెద్దలు సంతోషం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలిపారు.

వైకాపా పట్టణ అధ్యక్షుడి దౌర్జన్యంపై కేసు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా పట్టణ అధ్యక్షుడు దరియావలి నుంచి తనకు ప్రాణహాని ఉందని 24వ వార్డు తెదేపా అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్‌వలి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తన కార్యాలయంలో కూర్చుని ఉంటే దరియావలి తనపై దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చానని, పోలీసులు వచ్చి తన ప్రాణాలు కాపాడారన్నారు. అడ్డరోడ్డు సెంటర్ కేబీ రోడ్డులో ఇద్దరి కార్యాలయాలు పక్కపక్కనే ఉన్నాయి. దరియావలి తన కార్యాలయంలోని వ్యర్థాలను మస్తాన్‌వలి కార్యాలయం పక్కన వేస్తున్నాడు. దీంతో దుర్వాసన వస్తుండటంతో అలా వేయొద్దని సూచించగా దరియావలి తన కార్యాలయంపై దాడి చేసి అందులో వస్తువులను పగలగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వైకాపా పట్టణ అధ్యక్షుడు దరియావలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెలుగులోకి రెడ్డిరాజుల శాసనాలు

★ బాపట్ల జిల్లా పొన్నపల్లిలో భద్రం
★ అధ్యయనానికి అందించనున్న దాన గ్రహీతల కుటుంబ సభ్యులు

చెరుకుపల్లి గ్రామీణ, యడ్లపాడు, న్యూస్‌టుడే

శిలా శాసనాల పరిరక్షణ, అధ్యయనం, ప్రాముఖ్యంపై భారత పురావస్తు సర్వేక్షణ శాఖ (ఏఎస్ఐ) ప్రజల్లో అవగాహన కల్పించడం సత్ఫలితాలనిస్తోంది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారానికి చెందిన పొన్నపల్లి విద్యాభాస్కర్‌కు పూర్వీకుల నుంచి వచ్చిన రాగి శాసనాలు ఇటీవల వెలుగుచూశాయి. ప్రస్తుత పల్నాడు జిల్లా కొండవీడు కేంద్రంగా పాలించిన రెడ్డిరాజుల కాలంలో దాదాపు శక సంవత్సరం 1330లో ఇతని పూర్వీకులు వేదపండితులుగా పనిచేశారు. ఆ సమయంలో ఏర్పడిన సూర్యగ్రహణం (క్రీ.శ 1408, అక్టోబరు 19, శుక్రవారం) సందర్భంగా అప్పటి రాజు పెద్దవేమారెడ్డి తన భార్యతో కలిసి బ్రాహ్మణులకు దానాలు చేశారు. ఆ సందర్భంగా తన ఆస్థానంలో వేదం, సర్వ శాస్త్రం, వేదాంగం, అష్టాంగ ఆయుర్వేదంలో నిపుణులైన సింగనార్య(ఇతడి తండ్రి వీరయార్య, తాత భాస్కరార్యుడు)కు చిన్న గ్రామంగా ఉన్న పొన్నపల్లిని అగ్రహారంగా చేసుకుని వేదపారాయణంతో ధర్మాన్ని వికసింపజేయాలని కోరుతూ దానం చేశారు. ఈ మేరకు దానపత్రాలను సంస్కృత, తెలుగు లిపిలో అప్పటి తన ఆస్థాన విద్యా శాఖ మంత్రిగా పనిచేస్తున్న శ్రీనాథ కవిసార్వభౌముడితో రాగి రేగులపై రాయించి అందించారు.

నేటి పొన్నపల్లే.. రెడ్డిరాజులు అందించిన ఈ పొన్నపల్లి అప్పట్లో కుగ్రామం. శాసనాల ప్రకారం ఇది కృష్ణా నదికి ఆవల దివిసీమ ప్రాంతం, ఈవల వెలనాడు అంటే నేటి భట్టిప్రోలు ప్రాంతానికి దగ్గర్లో ఉన్నట్లు రాసి ఉంది. దానంగా వచ్చిన అగ్రహారం కింద సింగనార్యకు దాదాపు 1700 ఎకరాల భూమిని రాజు అందించారు. ఈ నేలపైనే నేటి పొన్నపల్లి గ్రామం విస్తరించింది. ఈ ఏడాది జనవరిలో పొన్నపల్లి శివాలయం వద్ద శాసన గ్రహీతల్లో 22వ తరానికి చెందిన పొన్నపల్లి విద్యాభాస్కర్ తమ ఇంటి పూజ గదిలో భద్రపరిచిన ఈ రాగి శాసనాలను తొలిసారి ప్రపంచానికి చూపారు. త్వరలో వీటిని అధ్యయనానికి భారత పురావస్తు శాఖకు అందించనున్నామన్నారు.

తామ్ర పత్రం

హైదరాబాద్‌కు వస్తున్నాం

విద్యాభాస్కర్ తమను ఆన్‌లైన్ ద్వారా సంప్రదించగా శాసనాలను పరిశీలించాం. ఈ నెలాఖరుకు హైదరాబాద్ వచ్చి ఆయన నివాసంలో ఉన్న రాగి శాసనాలను పరిశీలించి అధ్యయనం కోసం వాటిని తీసుకెళతామని కర్ణాటక రాష్ట్రం మైసూరులోని ఏఎస్ఐ డైరెక్టర్ కె.మునిరత్నంరెడ్డి తెలిపారు. శాసనాల్లో లిపి ఆధారంగా కొంత సమాచారాన్ని ఇప్పటికే అతనికి తెలిపాం. పూర్తిగా పరిశోధించి డీకోడ్ చేసిన తరువాత అందులో ఏముందో తెలియజేస్తామన్నారు. ఏవైనా శాసనాల గురించి ప్రజలకు ఎలాంటి సమాచారం ఉన్నా మైసూరులోని పురావస్తు సర్వేక్షణ శాఖ (ఏఎస్ఐ) కార్యాలయానికి తెలియజేయాలన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో |కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 650 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మట్టి అక్రమ తవ్వకాలపై దాడులు

తవ్వకాలు చేసిన ప్రాంతం

నరసరావుపేట వ్యవసాయం: ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై గనుల శాఖ అధికారులు దాడులు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. అన్నవరం రెవెన్యూ పరిధిలో గనుల శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ముందస్తు సమాచారం మేరకు మైనింగ్ ఏడీ నాగిని ఆదేశాలతో సిబ్బంది సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పొక్లెయిన్ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు తరలించిన మట్టికి అపరాధ రుసుం రూ.లక్ష వరకు విధిస్తామని అధికారులు తెలిపారు.

20న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

నరసరావుపేట సెంట్రల్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలుకు అడ్డుగా ఉన్న 1214 మెమోను రద్దు చేయాలని, సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 20న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పల్నాడు భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్‌మసూద్ అన్నారు. మంగళవారం పల్నాడు రోడ్డులో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

వాగులో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: క్రోసూరు మండలం బయ్యవరం చెందిన దుప్పల వెంకటేశ్వర్లు(20) మంగళవారం మధ్యాహ్నం ఎద్దువాగులో స్నానానికి దిగి మృతి చెందాడు. యువకుడు అయ్యప్పస్వామి మాల ధరించాడు. వాగులో స్నానానికి దిగి, ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. యువకుడి తండ్రి రమేష్ భవాని మాల ధరించాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

TO LET

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No: 6-11-39, 1st Floor Backside Office/ Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

గుంటూరు, గుంటూరు వారి తోట 1వ లైన్, డి.నెం: 13-2-17, గ్రౌండ్ ఫ్లోర్, 1500 S.Ft., హాస్పిటల్స్, క్లినిక్స్, ల్యాబ్స్, ఫార్మసీ అనుకూలం. 97032 22607.

JOBS

Wanted Export Company Staff 1. Accountant, 2. Supervisor (10th Pass), 3. Security Guard. Contact: 73864 82800, 99082 14472.

Sonal Group Wanted for vacancies cotton Industry All Andhra Pradesh District &Villages Reposhed, Experienced in cotton Field, (Position) sampling, Inspection &Testing, value of vacancies 100no,s & above, Qlf: Inter&above, Experienced/Freshers, Salary 15000/-PM&Petrol, Please Call and collect Address in Guntur, interview on 19-11-25 to 20-11-25& timing 9am to 6pm, Send CV & bio-data can send to WhatsApp/Contact: Mr.K.S Rao: 9374731234, Email id: office@sonalgroup.in

DSA ఏజెన్సీ గుంటూరు నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99489 35789, 80081 00872.

గుంటూరు జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వయసు 50 సం॥ లోపు. ఆకర్షణీయమైన జీతము. 90100 42973, 82478 14976.

కస్టమర్ అడ్రస్ వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావాలి. 81251 10304 గూడూరు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, సూళ్లూరుపేట.

గుంటూరులో గల కాలేజి హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు 35 సంవత్సరాల పైబడిన లేడి వార్డెన్స్ మరియు బస్సు డ్రైవర్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61124.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గుంటూరులోని ప్రముఖ హాస్పటల్ నందు పని చేయుటకు 1) Pharmacist, 2) Receptionist కావలెను. 85199 93945.

తుళ్లూరు మం, అనంతవరం గ్రామం లోని 2-3 సం॥ అనుభవమున్న క్రషర్ మెయింటెన్స్ చేయుటకు సూపర్‌వైజర్ మరియు క్రషర్ డిస్పాచ్ సూపర్‌వైజర్ కావలెను. 80082 95361.

తాడికొండ X రోడ్‌లో క్రొత్తగా ప్రారంభిస్తున్న హోటల్ రూమ్స్ & కన్వెన్షన్ హాల్ నందు సూపర్‌వైజర్స్, లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. 98492 14413.

స్వర్ణముఖి పెట్రోలియం (బోయపాలెం) నందు పంపు బాయ్స్ కావలెను. (24x7). Cont: 90001 75999, 90001 02177.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

62 మందికి కొలువులు

ఎంపికైన యువతతో అధికారులు, ప్రిన్సిపల్

మాచర్ల (కారంపూడి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నేతృత్వంలో మంగళవారం మాచర్లలోని ఎస్కేబీఆర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 62 మంది కొలువులు సాధించారు. 10 సంస్థల ప్రతినిధులు పాల్గొనగా, 172 మంది నిరుద్యోగులు మౌఖిక పరీక్షలకు హాజరయ్యారు. ఈ మేరకు జిల్లా అధికారి తమ్మాజి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి, రవీంద్రనాయక్, కిరణ్, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకొస్తేనే పేదరిక నిర్మూలన



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4ని ప్రతి ఒక్కరూ అనుసరించి పేదరికాన్ని పారదోలాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. అడిగొప్పల గ్రామానికి చెందిన విద్యార్థి భాస్కర్‌రావు చదువు నిమిత్తం అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ యాగంటి బాలకృష్ణ, తెదేపా యువ నాయకుడు యాగంటి నరేష్ దత్తత తీసుకున్నారు. వెల్దుర్తిలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థికి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? వైకుంఠపురం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. **- కాలనీ వాసులు** ✔ సిబ్బందిని పంపి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- సుధాకర్, కార్యదర్శి. - న్యూస్‌టుడే, అమరావతి**

? ముప్పాళ్ల ముస్లిం కాలనీ నుంచి తురకపాలెం వెళ్లే మార్గంలో ఉర్దూ పాఠశాల, వాటర్ ప్లాంట్‌ల మధ్య చెత్త, వ్యర్థాలు తొలగించాలి. రోడ్డుపై చెత్త వేయకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి. **- స్థానికులు** ✔ చెత్త, వ్యర్థాలు తొలగించి పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. **- శివాజి, కార్యదర్శి – న్యూస్‌టుడే, ముప్పాళ్ల**

కుస్తీ పడితే.. పతకం దక్కాల్సిందే

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల సత్తా

అచ్చంపేట (క్రోసూరు), న్యూస్‌టుడే

కుస్తీ పోటీల్లో అచ్చంపేట బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఈ విద్యాలయం నుంచి ఏటా కనీసం నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పతకాలు అందుకుంటున్నారు. వ్యాయామోపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గత పదేళ్లలో 100 మంది విద్యార్థులు కుస్తీ పోటీల్లో పతకాలు దక్కించుకున్నారు. తాజాగా నున్న గ్రామంలో జరిగిన రాష్ట్ర పోటీల్లోనూ పదిమంది వివిధ కేటగిరీల్లో ప్రతిభ చాటి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పూర్వవిద్యార్థులు రత్నరాజు వ్యాయామోపాధ్యాయుడిగా, ఆర్.పుల్లయ్య, జె.అజయ్ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు స్పోర్ట్సు కోటా నుంచి ఎంపికయ్యారు.

ఉద్యోగం సాధించాలని..

స్పోర్ట్సు కోటాలో ఉద్యోగం సాధించాలనే ధ్యేయంతో కుస్తీ ఆటపై మక్కువ పెంచుకున్నా. ఇంటర్ చదువుతున్నా. 8వ తరగతి నుంచే శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటివరకు ఏడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించా. **- వి.పృథ్వీ, ఇంటర్**

వ్యక్తిగత ప్రతిభకు అవకాశం

కుస్తీ పోటీల్లో పూర్తిగా వ్యక్తిగత ప్రతిభ కనబరచే అవకాశం ఉంది. ఎవరు ఎక్కువగా కష్టపడితే వారికి ఫలితం దక్కుతుంది. రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించా. గతేడాది జాతీయ పోటీలలో పాల్గొన్నా. ఇటీవల రాష్ట్ర పోటీల్లో 51 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించా. వచ్చే నెల ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా. **- కె.గోపయ్య, ఇంటర్.**

కోచ్‌ను నియమించాలి

గతంలో పాఠశాలకు కోచ్‌ను నియమించారు. మూడేళ్లుగా లేరు. కొత్తగా నియమించాలి. రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తున్నా. గ్రీకోరోమన్ అండర్-17 48 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించా. నవంబరు 27 నుంచి గోరఖ్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా. **- బి.అంజికుమార్‌నాయక్, 8వ తరగతి**

కఠోర సాధన చేస్తున్నా

జాతీయ పోటీల్లో పతకం సాధించేందుకు కఠోర సాధన చేస్తున్నా. ఇప్పటివరకు రెండు సార్లు రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించా. జాతీయ పోటీల్లోనూ పాల్గొన్నా. **-ఎస్.మోజస్‌కుమార్, పదో తరగతి**

నియోజకవర్గానికి రూ.27.03 కోట్ల లబ్ధి

అచ్చంపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని 5 మండలాల్లో 41,149 మంది రైతులకు రూ.27.03 కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు ఖాతాల్లో జమకానున్నట్లు ఏడీఏ మస్తానమ్మ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం గారపాడులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

మండలం	లబ్ధిదారులు	మొత్తం (కోట్లలో)
అమరావతి	9253	6.26
అచ్చంపేట	9225	6.14
బెల్లంకొండ	4836	3.27
క్రోసూరు	9969	6.16
పెదకూరపాడు	7866	5.20

కండ్లగుంటలో వైద్య శిబిరం

నకరికల్లు, న్యూస్‌టుడే: కండ్లగుంట గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 450 మంది హాజరు కాగా.. పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు.

చట్టాలపై అవగాహన

మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరావు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: చట్టాలపై అవగాహనతో నిర్భయంగా, స్వేచ్ఛగా వృద్ధులు జీవించాలని న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తాలుకా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలు, వారసులకు ఆస్తులు రాసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, తమ సంరక్షణ మరిస్తే ఎప్పుడైనా వాటిని వెనక్కు తీసుకునేలా దస్తావేజులు రాయించాలన్నారు. పారా లీగల్ వాలంటీర్ సుభాని, పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు లక్ష్మీనారాయణ, సైదులు, ప్రసాద్, పోతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు నిలుపుదల చేయరూ..

స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: నడికుడి రైల్వేజంక్షన్ అభివృద్ధి దిశగా పలు డిమాండ్లు చేస్తున్నారు. స్టేషన్ మాస్టర్‌ను కలిసి ఇంటర్ సిటీ, వందేభారత్ ఎక్స్‌ప్రెస్, డెల్టా నర్సాపురం రైళ్లకు నిలుపుదల కల్పించాలని విన్నవించారు. పల్నాడు జిల్లా ఏర్పాటైన తర్వాత మొదటి రైల్వే జంక్షన్‌గా గుర్తింపు పొందిన నడికుడికి మరింత రవాణా సదుపాయాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, శ్రీనివాసరావు, కౌన్సిలరు షరీఫ్, వెంకటేశ్వరరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కారంపూడిలో సాంబశివస్వామి

పిడుగురాళ్లలో కుంకుమార్చన

భక్తిశ్రద్ధలతో పూజలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: కార్తిక మాసం మాసశివరాత్రి సందర్భంగా పట్టణంలోని బోళాలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పార్వతిదేవికి మహిళలు లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం రుద్ర హోమం, చండీహోమం, పూర్ణాహుతి, జ్వాలా తోరణం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

పిడుగురాళ్ల: బోళా లింగేశ్వరస్వామి

మాచర్ల (కారంపూడి): మాచర్లలోని ఇష్టకామేశ్వరస్వామి, రామప్ప దేవాలయం, కారంపూడి మండలం ఒప్పిచర్ల ధనమల్లేశ్వరస్వామి, చింతపల్లిలోని దొడ్డ మల్లేశ్వరస్వామి, పెదకొదమగుండ్లలోని ఉత్తరేశ్వరస్వామి, కారంపూడిలోని సురేశ్వరస్వామి, సాంబశివస్వామి ఆలయాల్లో మాసశివరాత్రి పూజలు చేశారు.

దుర్గి, న్యూస్‌టుడే: అడిగొప్పల నిదానంపాటి అమ్మవారి సన్నిధిలో కార్తిక మాసం పురస్కరించుకుని మంగళవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

పేద కుటుంబాలకు వైద్య భరోసా

లబ్ధిదారులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స అందుకునేలా కూటమి ప్రభుత్వం వైద్య భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రఘురామ్‌నగర్‌లోని ప్రజావేదికలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద 29 మంది లబ్ధిదారులకు రూ.22.04 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ శోభారాణి పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తమవ్వాలి: వచ్చే ఏడాది జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సమాయత్తమవ్వాలని ఎమ్మెల్యే కన్నా తెలిపారు. పట్టణంలోని ఐదో వార్డులో నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, అంబికా, జానిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరుల ఆరాధనోత్సవాలకు తరలిరండి

మాచర్ల (కారంపూడి): ఈనెల 19 నుంచి 23 వరకు కారంపూడిలో జరిగే పల్నాటి వీరుల ఆరాధనోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. ఉత్సవాలకు ఆచారవంతులు, పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తారన్నారు. పల్నాటి యుద్ధ ఘట్టాలను వివరిస్తూ ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ క్రమంలోనే రైతు సంఘం ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బకాయిలు ఇవ్వాలని వినతి

డీఎంహెచ్‌వో రవితో మాట్లాడుతున్న ఏపీఎంసీఏ అధ్యక్షురాలు అనుపమ, సిబ్బంది

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వైద్యఆరోగ్యశాఖలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు పని ఆధారిత ప్రోత్సాహక బకాయిలు తక్షణం విడుదల చేయాలని ఏపీఎంసీఏ అధ్యక్షురాలు అనుపమ కోరారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వేతన బకాయిలతోపాటూ, సమ్మెకాలంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. పనిభారాన్ని తగ్గించి, రాత్రి 8 గంటలకు ముఖ ఆధారిత హాజరు నిబంధనను వెనక్కి తీసుకోవాలని కోరుతూ డీఎంహెచ్‌వో రవికి విన్నవించారు.

నేడు అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. రెండో విడత చెక్కుల పంపిణీని బుధవారం కారంపూడిలో నిర్వహించనున్నారు. స్థానిక బస్టాండు ప్రాంతంలో నియోజకవర్గంలోని 38,923 మంది రైతులకు రూ.26.08 కోట్లు ఖాతాల్లో జమ చేయనున్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి హాజరు కానున్నారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

రాజుపాలెం: ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా రత్తయ్య, ఆర్థిక కార్యదర్శిగా సంపత్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా నుహానుల్లా ఎన్నికయ్యారు.

అంకితభావంతో పనిచేయాలి

రెంటచింతల: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎస్టీయూ మండలాధ్యక్షురాలు బేబిరాణి కోరారు. కూటమి ప్రభుత్వంలో నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు దాత శేషుబాబు సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. సంఘం నేతలు శ్రీనివాసరావు, అమలబాబు, భీముడు నాయక్, అహమ్మద్, శ్రీను నాయక్, ఖద్దుస్, మంగ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీసెల్ అధ్యక్షుడి నియామకం

దుర్గి, న్యూస్‌టుడే: మాచర్ల నియోజకవర్గ తెదేపా ఎస్సీసెల్ అధ్యక్షుడిగా జంగమహేశ్వరపాడు గ్రామానికి చెందిన కందుల విజయ్‌ను ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామని, సమన్వయంలో ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

జూద కేంద్రంపై దాడి

అమరావతి, న్యూస్‌టుడే: మండెపూడి శివారులోని పొలాల్లో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్ఐ అమీర్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,750 స్వాధీనం చేసుకొన్నారు.

ఇక్కడ మురుగు కాలువ ఉండాలే..!

ఇక్కడ మురుగు కాలువ ఉండాలే.. ఎవరైనా ఆక్రమించారా.. అని మీరు భావిస్తే తప్పులో కాలేసినట్లే. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాలువలు కనిపించకుండా పోతున్నాయి. సత్తెనపల్లిలోని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని, వీధుల్లో చెత్త కనిపించకూడదని.. కాలువలు శుభ్రంగా ఉండాలని ఇటీవలే ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులకు సూచించారు. ఎమ్మెల్యే సమావేశం నిర్వహించిన నాగార్జున నగర్‌లోనే పరిస్థితి అధ్వానంగా ఉంది. కాలువల నిండా పిచ్చిచెట్లు పెరిగి, మురుగు నీరు ముందుకు కదలని దుస్థితి నెలకొంది. **- న్యూస్‌టుడే, నాగార్జున నగర్ (సత్తెనపల్లి)**

నీటిలో ప్రయాణం.. గ్రామీణులకు ప్రమాదం



భారీ వర్షాలతో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. శిరిగిరిపాడు చెరువు అలుగు నెల రోజులుగా పారుతూనే ఉంది. దీంతో ఆ దారి గుండా వెళ్లే పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన నిర్మించి, ఇబ్బందులు తొలగించాలని గ్రామీణులు కోరుతున్నారు. **- వెల్దుర్తి, న్యూస్‌టుడే**

45 మంది సజీవ దహనం బాధాకరం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మక్కా యాత్రకు వెళ్లిన 45 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనం కావడం బాధాకరమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవర్ చేసిన తప్పిదం వల్ల ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందారని, ఇది మాటలకు అందని విషాదమన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలెన్నో

స్టీలు వాటర్ బాటిళ్లతో అధికారులు, ఉద్యోగులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్, పాలిథిన్ వాడకంతో అనర్థాల్ని వివరించి, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆనందకుమార్ సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులకు సూచించారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో మంగళవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నిత్యం ప్లాస్టిక్ వస్తువులు వాడుతుండటంతో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అనంతరం ఉద్యోగులకు స్టీలు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. డీఈ మధుసూదనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, ఆర్వో రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస ప్యాకేజీ అందించండి

స్పెషల్ కలెక్టర్‌కు సిఫార్సు లేఖ అందజేస్తున్న నాయకులు

మాచవరం: పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం కారణంగా పాక్షికంగా ముంపునకు గురైన వేమవరం నిర్వాసితులకు వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పునరావాస ప్యాకేజీ అందించాలని కోరారు. విజయవాడలోని ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ కార్యాలయంలో స్పెషల్ కలెక్టర్‌ను కలిసి, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందించిన సిఫార్సు లేఖను అందజేశారు. 92 మందికి వన్‌టైం సెటిల్‌మెంట్, 74 ఎస్సీ కుటుంబాలకు ప్యాకేజీ అందించాలని అందులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పోటీలు

గురజాల: చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

న్యూస్‌టుడే, బృందం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం గ్రంథాలయాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే క్విజ్, ఖోఖో పోటీలను నిర్వహించారు.

పత్తి పంట పరిశీలన

పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని వన్నాయపాలెం, చంద్రాజుపాలెం గ్రామాల్లో పత్తి పంటను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, లాంఫామ్ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కాయ కుళ్లు తగ్గించడం, ఆకుమచ్చ తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మనోజ్ కుమార్, రాజేష్ చౌదరి, నాగజ్యోతి, సౌజన్య, వైష్ణవి, ఏవో అరుణ కుమారి పాల్గొన్నారు.

రాజుపాలెం, న్యూస్‌టుడే: పత్తిలో తేమ 12 శాతంలోపు ఉండాలని, అంతకన్నా ఎక్కువ తేమ ఉంటే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయరని ఏవో వెంకటనర్సయ్య తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం ఆకులగణపవరంలో కంది, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు మండలం ఎర్రబాలెంలో మంగళవారం లాంఫాం శాస్త్రవేత్తల బృందం పత్తి పొలాలను పరిశీలించింది. రైతులకు తగు సూచనలు చేసింది.

పాఠశాలకు బీరువా బహూకరణ

మాచర్ల (కారంపూడి): కస్తూర్బా గాంధీ పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల సభ్యులు రూ.15 వేల విలువ చేసే బీరువాను మంగళవారం బహూకరించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ జ్ఞాపకార్థం బీరువాను అధ్యక్షుడు సత్యప్రసాద్, రామకోటయ్య, కోటేశ్వరరావు, నాగూర్ వలి అందజేశారు.

సొసైటీల బలోపేతానికి కృషి

ప్రతిజ్ఞ చేస్తున్న ఛైర్మన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, డైరెక్టర్లు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సహకార సొసైటీల బలోపేతానికి కృషి చేస్తోందని క్రోసూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ శివనాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్‌లో అంతర్జాతీయ సహకార వారోత్సవాలు నిర్వహించారు. సహకార జెండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. సంఘ సీఈవో కె.నాగేశ్వరరావు, డైరెక్టర్లు వెంకట్రావు, పెదబ్రహ్మయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పరిమళ, బ్యాంకు మేనేజరు శైలజ తదితరులు మాట్లాడారు.

మాచర్ల (కారంపూడి): సహకార పరపతి సంఘం వారోత్సవాలను మాచర్లలోని కార్యాలయంలో నిర్వహించారు. ఆ సంఘం ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి జెండాను ఆవిష్కరించి, సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు.

రూ.3.35 కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు

రెంటచింతల, న్యూస్‌టుడే: మండలంలో విద్యుత్తు ఆధునికీకరణ (ఆర్డీఎస్ఎస్) పనులు రూ.3.35 కోట్ల వ్యయంతో చురుగ్గా సాగుతున్నాయని ఈఈ సింగయ్య తెలిపారు. పాలువాయి ఉపకేంద్రం పరిధిలో సుమారు రూ.48 లక్షలతో 8 కి.మీ. మేర 6 విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, 362 స్తంభాలు ఏర్పాటు చేశారు. పశర్లపాడులో రూ.1.2 కోట్లు, రెంటాలలో రూ.95 లక్షలు, మిట్టగుడిపాడుకు రూ.75 లక్షలు, రెంటచింతలకు రూ.44 లక్షల నిధులు మంజూరైనట్లు ఆయన వివరించారు. 2026 జనవరి ఆఖరుకు అన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.

శివాయ.. రుద్రాయ

నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో మంచు శివలింగం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో శివకల్యాణ కార్తికేయ శమీ వృక్ష పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అన్నదాన కోలాటం, కార్యక్రమం నిర్వహించారు.

బొడ్రాయికి జలాభిషేకం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని న్యూవెల్లంపల్లిలో బొడ్రాయి (సీతలాదేవి) ప్రతిష్ఠ పదహారు రోజుల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. వేద పండితులు పూర్ణాహుతి హోమం మంత్రోచ్ఛరణ మధ్య నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. దేవాదాయశాఖ విశ్రాంత ఈవో బండి నాగిరెడ్డి, శ్రీనివాసరావు, నాగరాజు, ముసలయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రెవెన్యూ అధికారుల వన సమారాధన

మాచవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ అధికారులు మంగళవారం వన సమారాధన నిర్వహించారు. మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో తహసీల్దారు నాగమల్లేశ్వరరావు, డీటీ స్రవంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు కలిసి సహపంక్తి భోజనం చేశారు.

మంజీరాలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొల్చారం, న్యూస్‌టుడే: మంజీరా నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ముప్పాళ్ల మండలం పలుదేవర్లపాడుకు చెందిన ఉప్పలమర్తి కోటేశ్వరరావు(27) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో టైల్స్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం తన స్నేహితులతో కలిసి మెదక్ జిల్లాలో ఏడుపాయల వనదుర్గ అమ్మవారి దర్శనానికి వచ్చారు. మార్గమధ్యలో మంజీరా నదిలో స్నానాలకు దిగారు. కోటేశ్వరరావు ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయాడు. పోలీసులు రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం అతడి మృతదేహం దొరికింది.

రోడ్లా.. పార్కింగ్ స్థలాలా?

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

పట్టణంలోని ప్రధాన రోడ్డుపై అడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలిపేస్తున్నారు. అది రోడ్డా.. పార్కింగ్ స్థలమా అన్న అనుమానం కల్గుతుంది. సినిమా హాలు సెంటర్ నుంచి రైల్వే పైవంతెన వరకు ఇదే పరిస్థితి. పెద్ద భవనాలు నిర్మించినా సెల్లార్లు లేకపోవడం, ఉన్నా వాటిని దుకాణాలుగా వినియోగించుకోవడంతో సమస్య తలెత్తుతోంది. దుకాణాలకు నిత్యం వందల మంది వినియోగదారులు వచ్చి వెళుతుంటారు. వారంతా తమ వాహనాలను రోడ్డుపై నిలిపేస్తున్నారు. హోటళ్ల వద్ద ఉదయం, సాయంత్రం రద్దీ ఉంటుంది. దారిలో 75 శాతం ఆక్రమించి వాహనాలను అడ్డదిడ్డంగా పెడుతున్నారు. దాంతోపాటు తోపుడు బండ్లు గంగమ్మ గుడి సమీపంలో, ఉన్నత పాఠశాల ఎదురు, రోడ్లు భవనాల అతిథిగృహం, గుర్రం జాషువా విగ్రహం సమీపంలో రోడ్డుపైనే ఉంచుతున్నారు. పోలీసులు, సచివాలయం ఉద్యోగులు వచ్చినప్పుడు కొంత వెనక్కి జరిపి, ఆతర్వాత షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రధాన రోడ్డుపై ద్విచక్ర వాహనాలు

ఐలాండ్ సెంటర్‌లో అడ్డంగా ఆటోలు

పట్టణంలో ప్రధాన కూడలి ఐలాండ్ సెంటరులో ఆటోలు అడ్డంగా నిలుపుతున్నారు. క్రమ పద్ధతిలో ఆటోలు ఏర్పాటు చేస్తే వచ్చిపోయే వాహనాలకు ఆటంకం ఉండదు. ఐలాండ్ సెంటర్‌లో ఆటోలు క్రమపద్ధతిలో ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పట్టణంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

స్టీల్ ప్లాంట్‌పై అసత్య ప్రచారం మానుకోండి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : అధికారంలో ఉన్నప్పుడు ఏకంగా స్టీల్ ప్లాంట్ ఆస్తులు, భూములు అమ్మకానికి పెట్టిన జగన్ నేడు నీతి వాక్యాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఉక్కు ఫ్యాక్టరీని పోస్కో సంస్థకు ధారాదత్తం చేయాలని చూసిన వారు నేడు అసత్య ప్రచారాలతో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారనే నిజం ప్రజలకు తెలుసన్నారు. విశాఖ ఉక్కు పేరెత్తే అర్హత జగన్‌కు, వైకాపా నాయకులకు లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, భాజపా నేతలు విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు కృషి చేశారన్నారు. వాజ్‌పేయీ హయాం నుంచి మోదీ పాలన వరకు విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో సుగాలీకాలనీలోని ప్రధాన కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్స్ తలుపు విరిగి ప్రమాదకరంగా మారింది. **- సుబ్బారావు**
✔ ఫ్యూజ్ బాక్స్ తలుపు ఏర్పాటు చేసి ప్రమాదం లేకుండా చూస్తాం. **- లావణ్య, ఏఈ, విద్యుత్తు శాఖ**
– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? పట్టణంలో కాకతీయ నగర్ మొదటి లైను నుండి రెడ్డినగర్‌కు వెళ్లే రహదారి పక్కనున్న డ్రెయినేజీ పూడిక తీయడం లేదు. దుర్వాసన వస్తోంది. **- సత్యనారాయణ, స్థానికుడు** ✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీ శుభ్రం చేయిస్తాం. **- రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి** – న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

అన్నక్యాంటీన్‌కు ఆర్వో ప్లాంట్ అందజేత

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో మార్కెట్ కూడలిలోని అన్నక్యాంటీన్‌కు స్థానిక వ్యాపారి కోట లక్ష్మణ ఆర్వో ప్లాంట్‌ను మంగళవారం అందజేశారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా తన తండ్రి కోట మురళీమోహన్‌రావు జ్ఞాపకార్థం రూ.లక్ష విలువైన ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. దీనిని ఎమ్మెల్యే అరవిందబాబు ప్రారంభించి దాతను అభినందించారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు

మూలకు చేరిన యంత్రాలు.. తగ్గేదేలే అనేలా దోమలు

శావల్యాపురం, న్యూస్‌టుడే

మండలంలోని పల్లెల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తున్నాయి. కాలువల్లో పూడిక చేరి ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోతోంది. 15 గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ మొక్కుబడిగా సాగుతోంది. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఫాగింగ్ యంత్రాలతో పాటు, కాలువలో పూడిక తీసే యంత్ర పరికరాలను అందించింది. ఏళ్ల గడుస్తున్నా వాటిని పంచాయతీలకు పంపిణీ చేయలేదు. శావల్యాపురం, కారుమంచి పంచాయతీల్లో నామమాత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులుపుకొంటున్నారు.

గుర్తొస్తే బ్లీచింగ్.. మండలం మొత్తం మీద 32 వేల మంది జనాభా ఉన్నారు. ప్రతి పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల్లో కొంత కేటాయించినా క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదు. పంచాయతీ సిబ్బందికి గుర్తు వచ్చినప్పుడు తూతూమంత్రంగా బ్లీచింగ్ చల్లిస్తున్నారు.

ఇవీ కారణాలు.. ఇంటింటి చెత్త సేకరణ పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం, ప్రజలు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడం వంటి కారణాలతో దోమలు పెరిగిపోతున్నాయి. వీటి నివారణకు నిరంతరం చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఫాగింగ్, పూడికతీత, గడ్డి కోసే యంత్ర పరికరాల వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది.



పంపిణీ చేయని పరికరాలు

పూడిక తొలగిస్తాం.. ప్రతి పంచాయతీలో కాలువల్లో పూడికలు తీయించి, దోమల లార్వాను చంపివేయడానికి కచ్చితంగా ఎబేట్ చల్లిస్తాం. అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ సక్రమంగా సాగేలా చర్యలు చేపడతాం. మరమ్మతులకు గురైన యంత్రాలను బాగు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు.

ప్రజలకు కనీస వసతుల కల్పన లక్ష్యం

శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: ప్రజలకు కనీస అవసరాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలో ఉప్పలపాడు సమీపంలో ఎన్టీఆర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి రూ.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదలకు ఇల్లు, స్థలం కేటాయించటమే కాదు వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించినప్పుడే సంతోషంగా ఉంటారన్నారు. గత ప్రభుత్వం ఆ ఆలోచన చేయకపోవటంతో కాలనీల్లో ప్రజలు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్టీఆర్‌నగర్ సమీపంలో 65 ఎకరాల్లో ఆటో నగర్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. చిలకలూరిపేటలో టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేశారని, నరసరావుపేటలో విడతల వారీగా అందజేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్‌నగర్‌లో ప్రజలకు అవసరమైన మంచినీరు, విద్యుత్తు దీపాలు, అంతర్గత రహదారులు వచ్చే మార్చికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, ఎంపీడీవో టి.వి.కృష్ణకుమారి, కూటమి నాయకులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, గంగుల పెద్దిరెడ్డి, ఆంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పాఠశాల విద్యకు మహర్దశ

పూజలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో పాఠశాల విద్యకు మహర్దశ పట్టిందని అధికారంలోకి రాగానే 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి చిత్తశుద్ధి చాటిందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలో ఎన్నెస్పీ కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను ఆయన మంగళవారం ప్రారంభించారు. తొలుత సంప్రదాయబద్ధంగా సరస్వతి దేవికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాలకు స్థలం అప్పగించడంలో ఉన్న సాంకేతిక సమస్యను పరిష్కరించడంతో పాటు, బాలికల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.శైలజాకుమారి, మండల విద్యాశాఖాధికారి జల్లెల్ల, మున్సిపల్ కౌన్సిలర్లు షకీల, రెడ్డి నాగయ్య, మాజీ కౌన్సిలర్ పీవీ సురేష్, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన సేవలే ధ్యేయం

మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మేనేజర్

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డి, జీడీసీసీ బ్యాంక్ చిలకలూరిపేట బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, కో-ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్లు రామిరెడ్డి, స్వరూప, రవికుమార్, నాదెండ్ల ఏవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ధ్యేయమన్నారు.

శివయ్యకు ప్రత్యేక పూజలు

గోగులపాడులో చంద్రమౌళీశ్వర స్వామి

విప్పర్ల వల్లభేశ్వరుడు

వినుకొండ: విఠంరాజుపల్లిలో శివుడికి అన్నాభిషేకం

రొంపిచర్ల, వినుకొండ రూరల్: కార్తిక మాస శివరాత్రి పురస్కరించుకొని శివాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రొంపిచర్ల మండలం గోగులపాడులో శ్రీకమలాంబికా సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో దంపతులు కార్తిక వ్రత పూజలో పాల్గొన్నారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాల అనంతరం శివయ్యకు చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. విప్పర్ల వల్లభేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప పడిపూజకు అరటిబోదెలతో ఏర్పాటు చేసిన మండపాలు ఆకట్టుకున్నాయి. వినుకొండ మండలం విఠంరాజుపల్లిలోని బాణలింగేశ్వర శివాలయంలో స్వామికి అర్చకుడు పరమేశ్వరరావు అన్నాభిషేకం చేశారు.

వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు గుర్తింపు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని ఏవో శివలలిత అన్నారు. వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ రెండు గ్లాసుల్లో నీటిని తీసుకొని పంటలో ఎండిపోయిన ఆకులను నీటిలో ఉంచి కొంత సమయం తరువాత పరిశీలిస్తే ఈ తెగులును సులభంగా గుర్తించవచ్చునని అన్నారు. దీని నివారణకు ప్లాంటోమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్ పిచికారీ చేసుకోవాలన్నారు. పాముపొడ తెగులు నివారణ కోసం కాంటాప్ లేదా కంటాఫ్ ప్లస్‌ను వినియోగించుకోవాలన్నారు.

కందిపైరులో మచ్చల పురుగును నివారించండిలా..

వినుకొండ రూరల్: కంది సాగు చేసిన రైతులు పైరును గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వరలక్ష్మి తెలిపారు. ఉప్పరపాలెం, చాట్రగడ్డపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కందిలో మారుకా మచ్చల పురుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణకు 5 శాతం వేప గింజల కషాయం లేదా 400 ఎంఎల్ వేపనూనె, క్లోరోపైరిఫాస్ 400 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు.

విద్యాలయాల్లో మౌలిక వసతులకు రూ.3.74 కోట్లు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాలలోని పాఠశాలల్లోని మొత్తం 22 పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.3.74 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం తెలిపారు. ప్రత్యేక విజ్ఞప్తిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. పలు పాఠశాలల్లో ప్రయోగశాలలు, ప్రహరీలు, మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణాలకు వీటిని వినియోగించనున్నట్లు తెలిపారు. పాఠశాలల వారీగా ఏయే పనులకు ఎంత మొత్తం వినియోగించాలో తగిన ప్రణాళిక ఉందని వివరించారు.

కుల గణన నిర్వహించాలి

వినుకొండ, చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: జనగణనతో పాటు కులగణన చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వినుకొండ స్తూపం సెంటర్లో మంగళవారం కొద్ది సేపు నినాదాలు చేశారు. కుల గణన నిర్వహించి బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ బాధ్యుడు బూదాల శ్రీనివాసరావు, వందనం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
చిలకలూరిపేట ఎన్నార్టీ కూడలి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు నేతృత్వంలో నిరసన తెలిపారు. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఎం.రాధాకృష్ణ, చెరుకుపల్లి నిర్మల, పేరుబోయిన వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, ముత్తయ్య, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటుకు అనారోగ్యం

నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని తిలక్ ఉన్నత పాఠశాలలో 650 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి తాగడానికి మంచినీరు లేక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు పేరిట ఫేజ్-1 కింద ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేసింది. అది ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో మున్సిపాలిటీ నీటిని ట్యాంకులో నింపినా సరిపోవడంలేదు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వి.రమణారావు మాట్లాడుతూ ఆర్వో ప్లాంటు తరచూ పాడవుతోందని, టెక్నీషియన్‌ను పిలిపించి మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ప్రకాష్ నగర్ (నరసరావుపేట)**

మొంథా ముంచేసింది.. మరమ్మతులు చేయరూ!

మండలంలో కావూరు - కమ్మవారిపాలెం మార్గంలో రహదారి 2 కి.మీ. దూరం ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పొలాలకు వెళ్లే మార్గం కావడంతో నిత్యం అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. సమస్యను పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా

రొంపిచర్ల, న్యూస్‌టుడే: రొంపిచర్ల - నరసరావుపేట మార్గంలో అన్నవరం సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీంతో రహదారి పక్కనే ఉన్న పంట కాలువలోకి ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నిరుపయోగంగా వదిలేస్తే ఎలా?

ఇస్సపాలెం(నరసరావుపేట సెంట్రల్), న్యూస్‌టుడే: మండలంలోని ఇస్సపాలెంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రం (పాలవెల్లువ) భవనం నిరుపయోగంగా మారింది. ఉపాధి హామీ కింద రూ.15 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. దీనిని ఉపయోగించిన దాఖలాలు లేవు. దీంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. ముందు చూపు లేకుండా గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. గ్రామంలో శాశ్వత భవనాలు లేక అంగన్‌వాడీ కేంద్రాలను ఇరుకు గదులు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో టి.వి.కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ కార్యక్రమాలకు ఆ భవనం ఉపయోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

లూథరన్ ఉన్నత పాఠశాల మూసివేత అడ్డుకుంటాం

మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జేసు రత్నకుమార్

యడ్లపాడు, న్యూస్‌టుడే: యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలను మూసివేయనివ్వబోమని, అందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఏఈఎల్‌సీ కార్యనిర్వహణ అధికారి, విశ్రాంత న్యాయమూర్తి జేసు రత్నకుమార్ అన్నారు. ఏఈఎల్‌సీ పశ్చిమ గుంటూరు పరిధిలోని లూథరన్ సంఘాల పాస్టర్లు, సంఘపెద్దలు, సంఘస్థులతో కలిసి పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పాఠశాల పక్కనే జడ్పీ స్కూల్ నిర్మించటం సరికాదన్నారు. పాఠశాల ఆస్తిపై అభివృద్ధి కమిటీకి హక్కు ఉందని భావిస్తే కోర్టుకు వెళ్లి తేల్చుకోవచ్చన్నారు. తొలుత పాఠశాల ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కార్యనిర్వహణ ప్రతినిధి శామ్యూల్ మోజెస్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

నరసరావుపేట అర్బన్, రొంపిచర్ల, చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నరసరావుపేట, చిలకలూరిపేట, రొంపిచర్ల మండలాల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, మ్యూజికల్ ఛైర్స్, పద్య పఠన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయాధికారులు పాల్గొన్నారు.

సంతగుడిపాడులో కుర్చీలాట

నరసరావుపేట: క్విజ్ పోటీలో విద్యార్థులు

క్రీడా దుస్తుల అందజేత

ఈపూరు, న్యూస్‌టుడే: దాతల సహకారం, ప్రోత్సాహంతో విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఎంఈవో దేవనబోయిన జ్యోతి అన్నారు. ఈపూరు ఆదర్శ పాఠశాలకు చెందిన పీజీటీ ఆంగ్ల ఉపాధ్యాయుడు వల్లెపు శ్రీను జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన 20మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు, ఎన్ఎంఎంఎస్ పరీక్షకు తయారవుతున్న 16మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సొంత ఖర్చులతో సమకూర్చారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 రామతులసి, ప్రిన్సిపల్ పుల్లా పద్మజ, వ్యాయామోపాధ్యాయుడు గోపి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

వినుకొండ, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు తెదేపా నూజండ్ల మండల అధ్యక్షులు గంగినేని బాబు, సీనియర్ నాయకులు కొమ్మా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరప్పయ్యతో పాటు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి, మాజీ డీసీ ఛైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

నూజండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో వెంకటరెడ్డి అన్నారు. నూజండ్ల, ఉప్పలపాడులో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఆధార్ సవరణలు, నవీకరణ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నూరుశాతం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలం కరుగుతోంది.. కళాశాల కదలనంటోంది

వెటర్నరీ పాలిటెక్నిక్ ఏర్పాటుకు చర్యలేవి?

సంతగుడిపాడు (రొంపిచర్ల) న్యూస్‌టుడే:

వెనుబడిన పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తామని వైకాపా ప్రభుత్వ హయాంలో నరసరావుపేట వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. విద్యా సంవత్సరాలు తరిగిపోయినా ఆయన ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు ఓ ప్రచారార్భాటమే తప్ప నిర్మాణంలో ఎలాంటి ముందడుగు లేదు.

స్థల సేకరణకు పరిమితం.. సంతగుడిపాడులో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు స్థానిక ఎన్నెస్పీ కాలనీలో స్థలం సేకరించారు. ఆ తరువాత అప్పటి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ డీన్, రిజిస్ట్రార్‌లతో కలిసి అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆ భూమిని పరిశీలించారు. 2023-24 విద్యా సంవత్సరంలో తరగతుల నిర్వహణకు, వసతి గృహానికి తాత్కాలిక భవనాల కింద జడ్పీ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను, కస్తూర్బాలో నిర్మిస్తున్న గదులను, గ్రామంలోని ఆయుర్వేద ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఇంతలో ఎన్నికలు రావటంతో కళాశాల ఏర్పాటు తెరమరుగైంది. కళాశాల ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై విద్యావేత్తలు, విద్యార్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సంతగుడిపాడులో కళాశాల ఏర్పాటుకు పరిశీలించిన స్థలం

కేంద్రీయ విద్యాలయంపైనా.. రొంపిచర్లలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ముందుకు కదలడం లేదు. రొంపిచర్ల మార్కెట్‌యార్డులో కేటాయించిన స్థలం నిర్మాణానికి అనువుగా లేదని మట్టి పరీక్ష ఫలితాల్లో తేలింది. దీంతో నరసరావుపేట మండలం కేసానుపల్లి సమీపంలో మరో స్థలం చూసినా అది ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయానికి దగ్గరగా ఉండడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇటీవల రొంపిచర్లకు వచ్చిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు స్థానిక తెదేపా నాయకులు పాత పీహెచ్‌సీ స్థలాన్ని చూపి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై నేటికీ స్పష్టత లేదు. ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని మండలానికి కేటాయించిన కేంద్రీయ విద్యాలయం, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని విద్యావేత్తలు, విద్యార్థులు, మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవపై సమీక్ష

శావల్యాపురం, బొల్లాపల్లి, న్యూస్‌టుడే : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతులకు బుధవారం నిధులు విడుదల చేయనున్నట్లు శావల్యాపురం, బొల్లాపల్లి ఏవోలు రామినేని రామారావు, అంకారావు మంగళవారం తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో మొత్తం 45898 మంది రైతులకు రూ.31.04 కోట్లు నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. దీనిపై ఆయా మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలవుతున్నాం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : సమీప రైస్‌మిల్లు నుంచి వచ్చే దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలవుతున్నామని పట్టణంలో సీఆర్ క్లబ్ రోడ్డులోని వెంకటకృష్ణ కల్యాణ మండపం వెనుక నివాసం ఉంటున్న పలువురు కమిషనర్ శ్రీహరిబాబును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సమస్యను అర్జీ ద్వారా అప్పటి కమిషనర్‌కు తెలుపగా జాగ్రత్తలు తీసుకోవాలని సదరు యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా ఫలితం లేదన్నారు. స్థానికులు ఎ.రామకృష్ణ, ఎం.శేషిరెడ్డి, టి.శ్రీనివాసరెడ్డి, కె.నాంచారయ్య, బి.మల్లేశ్వరి తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

బస్సు ఢీకొని విద్యార్థినికి గాయాలు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పట్టణంలో గడియార స్తంభం సమీపంలో ఓ కళాశాల బస్సు మున్సిపల్ పాఠశాలలో ఏడో తరగతి చదివే విద్యార్థినిని ఢీకొంది. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

లాడ్జిపై దాడి

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం మేరకు ఒకటో పట్టణ ఎస్సై అరుణ మంగళవారం దాడి నిర్వహించారు. అయిదుగురు విటులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి

ఈపూరు, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని నరసరావుపేట డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణరావు అన్నారు. ఈపూరులో పంచాయతీ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. మండలంలో ఈపూరు షెడ్‌ను మోడల్‌గా నిర్వహించడానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో రూ.36.48కోట్లు ఇంటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.34.31లక్షలు మాత్రమే వసూలు జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివరామకృష్ణ, ఈపూరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బొల్లా సుబ్బారావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రసాదు పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు
పార్వతీపురం మన్యం

బుధవారం నవంబరు 19, 2025 7

అన్నదాత ఖాతాలో..
నేడు సుఖీభవ నిధులు

– న్యూస్‌టుడే, పార్వతీపురం

రైతులకు 'అన్నదాత సుఖీభవ' నిధులు బుధవారం అందనున్నాయి. పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు జమచేయనున్నాయి. వెరసి రూ.7 వేలు వంతున రైతుకు లబ్ధి చేకూరుతుంది. మన్యం లో 1,22,260 మంది రైతుల ఖాతాల్లో రూ.83.87 లక్షలు జమకానున్నాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అన్నదాతలతో సమావేశాలు ఏర్పాటుచేసి, పండగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

లబ్ధి ఇలా..

నియోజకవర్గం	రైతుల సంఖ్య	లబ్ధి(రూ.లక్షల్లో)
పాలకొండ	33,107	22.75
కురుపాం	39,084	26.94
పార్వతీపురం	25,807	17.20
సాలూరు	24,262	16.98

కార్యక్రమం సాగేదిలా..

★ జిల్లా మంత్రి సంధ్యారాణి పాల్గొనే కార్యక్రమం సాలూరు నియోజకవర్గం పాచిపెంట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆవరణలో జరుగుతుంది. ★ పార్వతీపురం నియోజకవర్గం జమదాల, సూడిగాం గ్రామాల్లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయచంద్ర హాజరవుతారు. ★ కురుపాం నియోజకవర్గానికి సంబంధించి కురుపాం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ విప్ జగదీశ్వరి పాల్గొంటారు. ★ పాలకొండ పరిధిలో వీరఘట్టం ఏఎంసీ ఆవరణలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహిస్తారు. ఎమ్మెల్యే జయకృష్ణ హాజరవుతారు. ★ ఆయా సబ్‌డివిజన్ల ఏడీఏలు సమన్వయాధికారులుగా వ్యవహరిస్తారు. ★ కొన్ని కుటుంబాల్లో ఇద్దరికి, మరికొన్నిచోట్ల మైనర్లకు మొదటి విడతలో లబ్ధి అందిందని, వారిని మినహాయించి ఈసారి నిధులు విడుదల చేయడంతో కొంత మొత్తం తగ్గిందని జిల్లా వ్యవసాయాధికారిణి ఆర్.అన్నపూర్ణ చెప్పారు.

వెంగళరాయలో త్వరలో బోటు షికారు

చేప పిల్లలను నీటిలో విడిచిపెడుతున్న సంధ్యారాణి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం ముచ్చర్లవలస సమీప వెంగళరాయసాగర్‌లో వచ్చేనెల నుంచి బోటు షికారు ప్రారంభించాలని మంత్రి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. అయిదు బోట్లను ఏర్పాటు చేయాలన్నారు. మంగళవారం నాలుగు లక్షల చేప పిల్లలను సాగర్‌లోకి విడిచి పెట్టి, మాట్లాడారు. వీఆర్ఎస్ అంటే తన తండ్రి జన్ని ముత్యాలే గుర్తొస్తారని, అప్పట్లో ఎంతోమంది పోరాడి, గిరిజనుల సంక్షేమం కోసం ఈ ప్రాజెక్టును సాధించారన్నారు. ముత్యాలతోపాటు ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సబ్‌కలెక్టర్ వైశాలి, మత్స్యశాఖ ఏడీఈ సంతోష్‌కుమార్, ఎఫ్‌డీవో శ్రీదేవి, ప్రాజెక్టు ఛైర్మన్ బి.గోదావరి, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ ఉన్నారు.

మన పల్లెలు.. సినిమా లోగిళ్లు

సినిమా ఓ రంగుల ప్రపంచం.. అలాంటి దృశ్యకావ్యాల్లో మన ఊరు.. మన గుడి.. బడి.. కట్టడాలు కనిపిస్తే ఆ ఆనందమే వేరు. ఒకప్పుడు గోదావరి జిల్లాల్లోనో.. కర్నూలు బురుజు.. విజయవాడ బెంజ్ సర్కిల్ వద్దో చిత్రీకరణలు సాగేవి. ఇప్పుడు మన ప్రాంతాలకూ దర్శకులు వస్తున్నారు. మన్యం, మైదానం, అటవీ ప్రాంతాల్లో షూటింగ్‌లు చేస్తున్నారు. పర్యాటకానికి అవకాశం కల్పిస్తూ.. ప్రేక్షకులకు ఆనందం పంచుతున్నారు.

శోభన్‌బాబు నుంచి శ్రీవిష్ణు వరకు..

తాటిపూడిలో 35 ఏళ్ల క్రితం నుంచే చిత్రీకరణలు జరుగుతున్నాయి. శోభన్‌బాబు 'జీవితం', కమల్‌హాసన్ 'మరోచరిత్ర', చిరంజీవి 'చాణక్య శపథం', సుమన్ 'పరువు ప్రతిష్ఠ', బాలకృష్ణ 'బొబ్బిలి సింహం'లో కొన్ని సన్నివేశాల్ని ఇక్కడ తీశారు. అప్పట్లో కనీసం 15 రోజులపాటు బాలకృష్ణ, రమ్యకృష్ణ, మీనా, శరత్‌బాబు, కైకాల సత్యనారాయణ, జగ్గయ్య, శారద తదితరులు స్థానికులకు అందుబాటులో ఉండేవారు. 'సోలో' కోసం నారా రోహిత్, ప్రకాశ్‌రాజ్ వచ్చారు. అల్లరి నరేష్ 'మడతకాజా' చిత్రీకరణ జరిగింది. ఆర్.నారాయణమూర్తి సారథ్యంలో వచ్చిన మూడు చిత్రాలను ఇక్కడే తీశారు. గత నెలలో హీరో శ్రీవిష్ణు బృందం సందర్శించింది.

ఉమ్మడి జిల్లాలో అందమైన ప్రాంతాలివీ..

- తాటిపూడి జలాశయం
- ఎకో టూరిజం కేంద్రం
- చంపావతి, నాగావళి నదీ తీరాలు
- పారమ్మకొండ
- కొరియా గ్రామాలు
- ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్
- విజయనగరం గంటస్తంభం, పెద్దచెరువు
- రబ్బరు డ్యామ్
- ఆదలి వ్యూపాయింట్
- చింతపల్లి, ముక్కాం సముద్ర తీరం
- గోవిందపురం, సాయిబాబా స్తూపం, రామనారాయణం
- భోగాపురం, డెంకాడ, ఎస్.కోటలోని రిసార్టులు

గంట్యాడలోని గిరివినాయక ప్రాంతంలో సినిమా చిత్రీకరణ

పవన్‌కల్యాణ్ పిలుపుతో..

ఇటీవల మన్యానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. నటులంతా పార్వతీపురం రావాలని, ఇక్కడ కూడా చిత్రీకరించాలని కోరారు. దీంతో అప్పటి నుంచి 15 చిత్ర బృందాలు వచ్చాయి. ప్రముఖ యాంకర్ సుమ నటించిన 'జయమ్మ పంచాయతీ'లో కొంత భాగాన్ని పాలకొండ మండలం పెదకోటిపల్లి సమీపంలో తీశారు.

– న్యూస్‌టుడే, పాలకొండ, గంట్యాడ, విజయనగరం పట్టణం

నగరంలో సందడి..

విజయనగరం పట్టణంలోని అశోక్ బంగ్లా, రాజుల కోట, జాబిలి లాడ్జీ, గంటస్తంభం, జొన్నవలస రాజుల ఇల్లు, కోరుకొండ ప్రాంతాల్లో 'అనుగ్రహం', 'రెండు జెళ్ల సీత', 'సమర సింహారెడ్డి', 'నరసింహానాయుడు', 'శుభ సంకల్పం', 'గూండా' తదితర చిత్రాల్లోని సన్నివేశాల్ని తీశారు. గతంలో పెద్దవారి ఇంట్లో శ్యామ్ బెనగల్ బృందం సందడి చేసింది.

ఉపయోగాలివీ..
- పర్యాటకంగా అభివృద్ధి
- స్థానికులకు ఉపాధి
- వ్యాపారాలకు పునాది
- యువతకు సినీ అవకాశాలు

ఇరకాటం.. ప్రాణాలతో చెలగాటం

స్థలాభావంతో మంచాలపైనే పెట్టెలు, బకెట్లు, ఇతర సామగ్రి

వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం, రాత్రుల్లో బయటికి రాలేని పరిస్థితి. ఇటువంటి తరుణంలో కొమరాడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అసౌకర్యాలతో వణుకుతున్నారు. బడికి సొంత భవనం లేదు. 8 ఏళ్లుగా గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన డార్మిటరీ గదుల్లో నిర్వహిస్తున్నారు. 3వ తరగతి నుంచి 10 వరకు ఉన్న 242 మందికి కేవలం 4 గదులు, ఆరు మరుగుదొడ్లే దిక్కు. అవీ అపరిశుభ్రంగా ఉన్నాయి. గచ్చులు పగిలి, విద్యుత్తు తీగలు బయటికి వచ్చి ప్రమాదకరంగా మారాయి. కిటికీలు, మెష్‌లు, మంచాలకు దోమ తెరలు లేవు. సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపించే వాతావరణం ఉంది. స్థలాభావంతో వస్తువుల్ని మంచంపైనే ఉంచాల్సిన దుస్థితి.

పగిలిన గచ్చులు, బయటే విద్యుత్తు తీగలు

వంట గదికి చోటు లేక డార్మిటరీలో అడ్డుగా మంచాలు ఉంచి వినియోగిస్తున్నారు. రూ.7 కోట్లతో ప్రారంభించిన కొత్త భవన నిర్మాణం పునాదుల్లోనే ఆగింది. సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లామని కొమరాడ ఏటీడబ్ల్యూవో రజిని 'న్యూస్‌టుడే'తో అన్నారు. – న్యూస్‌టుడే, కొమరాడ

గుట్టుగా.. గుట్టలు మేయంగా!

అక్రమార్కుల స్వార్థానికి గుట్టలు, కొండలు కరిగిపోతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా పగలు, రాత్రి దర్జాగా కంకర, మట్టి దందా సాగిస్తున్నారు. వందల ట్రాక్టర్లలో తరలిస్తున్నా.. చర్యలు లేవని సమీప గ్రామస్థులు వాపోతున్నారు. దీనివల్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం, సీతానగరం

మంతినివలస సమీపంలో గుట్ట తవ్వకం

సీతానగరం మండలం ఇప్పలవలస పరిధి బోడికొండ ఇలా..

జోరుగా అక్రమ తవ్వకాలు

యథేచ్ఛగా తంతు..

కురుపాం మండలం మంతినివలస సమీపంలోని గుట్టల వద్ద మట్టిని తవ్వేస్తున్నారు. గతంలో ఇక్కడే గుట్ట, చెరువు పెద్ద ఎత్తున తవ్వేయడంతో ప్రమాదకర గోతులు ఏర్పడ్డాయి. అందులో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఈ గోతుల్లో దిగి పశువులు మృతిచెందిన ఘటనలున్నాయి. మంతినివలస సమీపంలోనే కురుపాం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, జ్యోతిరావు పులే పాఠశాల, బీసీ, ఎస్సీ వసతి గృహాలున్నాయి. అక్కడ చదువుకునే విద్యార్థులు ఈ ప్రాంతంవైపు వస్తుంటారు. గోతుల్లో దిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో శివ్వన్నపేటలోని సోమసాగరం, ఎర్రచెరువు, లంకెల చెరువులో తవ్వకాలు జరగ్గా గుంతలు ఏర్పడి ప్రమాదాలు సైతం జరిగాయి. మొండింకల్లు, కిచ్చాడ గ్రామాల పరిధి ప్రభుత్వ భూముల్లోనూ ఇదే పరిస్థితి.

ఫిర్యాదు చేసినా..?

సీతానగరం మండలం నిడగల్లు, ఇప్పలవలస, దయానిధిపురం, చిన అంకలాం, వెన్నెల బుచ్చింపేట రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములు, కొండలు రూపు కోల్పోతున్నాయి. జగనన్న లేవుట్ అభివృద్ధికి అప్పట్లో వైకాపా నాయకులు అక్రమ తవ్వకాలకు తెర తీశారు. ఆ తర్వాత తంతుకు తెరపడలేదు. ఇప్పుడు అన్ని పార్టీలవారు రాజకీయ బలంతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ఇటీవల కొందరి ఫిర్యాదుతో అధికారులు అయిదు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని అపరాధ రుసుము విధించారు. తర్వాత మళ్లీ మామూలే.

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు: అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకూ ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు.. అనుమతి ఇవ్వలేదు. గతంలో తవ్వకాలతో ఏర్పడ్డ ప్రమాదకర గోతుల వైపు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.
- కె.జయ, తహసీల్దార్, రవికుమార్, డీఈఈ నీటిపారుదలశాఖ, కురుపాం

కష్టాల వరి
కార్చిచ్చుతో ఆవిరి

రూ.2 లక్షల ధాన్యం ఆహుతి

వ్యవసాయంలో రెండేళ్లుగా నష్టాలే వచ్చినా..
రైతు కదా.. నేల తల్లినే నమ్ముకున్నాడు
ఈ ఏడాది ధరణి దయతలచింది..
వరుణుడు జల్లులు కురిపించాడు
పచ్చని పంటతో కళ్లనిండా వేడుక
సిరుల వరి కంకు చూసి
చిరునవ్వుతో మురిసిపోయాడు
ఆరు నెలల శ్రమఫలించి..
ఆదాయంగా చేతికొస్తుందనే ఆనందం
పాత అప్పులన్నీ తీరిపోతాయనే సంతోషం
కష్టాన్ని కుప్పలుగా పెట్టాడు
ఎక్కడ్నుంచి పుట్టిందో అగ్ని
అన్నదాత ఆశలన్నీ ఆహుతి చేసింది
కాలిన కుప్పలను చూసి
కర్షకుడి కంట నీరు ఆగలేదు

కాలిపోతున్న వరి కుప్పల వద్ద బాధిత రైతు సాంబయ్య

బలిజిపేట, న్యూస్‌టుడే: మూడు ఎకరాల 19 సెంట్ల కౌలు భూమి.. రూ.55 వేల పెట్టుబడి.. ఇదికాక రూ.22 వేల విలువైన 12 ధాన్యం బస్తాలు కౌలుగా ఇవ్వాలి. పది రోజుల కిందట పంట చేతికొచ్చింది. వరి పనలను కుప్పలుగా పొలంలోనే ఉంచాడు ఆ రైతు. పంట విక్రయిస్తే రూ.2 లక్షల వరకు రావచ్చు. ఖర్చులన్నీ పోనూ కాస్త మిగులుతుందని ఆశ పడితే మొత్తం అగ్నికి ఆహుతైంది. బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన బౌరోతు సాంబయ్యకు కన్నీరు మిగిల్చింది. గుడిబంద వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో 40 వరి కుప్పలు దగ్ధమయ్యాయి. రోడ్డు ప్రాంతానికి దూరంగా తాను కౌలు చేస్తున్న పొలం ఉండడంతో సకాలంలో యంత్రాలతో నూర్పులు చేసుకోలేక వరి పనలను కుప్పలుగా వేయాల్సి వచ్చిందని బాధిత రైతు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

'ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి ఈ ఏడాది వరి పంట పండించా. వంద బస్తాల దిగుబడి వస్తుందని భావించా. రెండేళ్లుగా చేసిన అప్పులు తీరిపోవాలని కుటుంబ సభ్యులమంతా(అయిదుగురు) దూరప్రాంతాల నుంచి సాగునీటిని పొలానికి తరలించి, రాత్రింబవళ్లు పొలాన్నే నమ్ముకొని వ్యవసాయం చేశాం. ఈ నష్టం ఊహించలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి' అని సాంబయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

దుకాణం కట్టేశారు!

12 ఏళ్లుగా తెరుచుకోని డీసీసీబీ సముదాయం తలుపులు

పార్వతీపురం జిల్లా కేంద్రమైన తర్వాత కార్పొరేట్ వ్యాపార సంస్థలు క్రమంగా తమ శాఖలను పట్టణంలో ప్రారంభిస్తున్నాయి. ప్రధాన రహదారిలో స్థలానికి అమాంతంగా విలువ పెరిగిపోయింది. ఇటీవల 1,200 గజాలు రూ.20 కోట్లకు పైగా చెల్లించి కొనుగోలు చేశారు. అంతటి డిమాండు ఉన్నచోట 12 దుకాణాలతో కూడిన సముదాయం ఉన్న సంస్థ ఎంత ధీమాగా ఉండాలి. వాటిని అద్దె ప్రాతిపదికన ఇచ్చినా ఒక్కోదానికి రూ.25 వేలు వస్తుంది. నెలకు రూ.3 లక్షలు ఇచ్చే సముదాయాన్ని గాలికి వదిలేశారు. ఇది సర్కారు అనుబంధ సంస్థ తీరు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం, పురపాలక

ఇదీ పరిస్థితి

విజయనగరం కేంద్ర సహకార బ్యాంకుకు అనుబంధంగా పార్వతీపురంలో బ్యాంకు శాఖ పని చేస్తోంది. 12 ఏళ్ల కిందట రూ.1.40 కోట్లతో డీసీసీబీకి కార్యాలయ సముదాయాన్ని నిర్మించింది. రెండంతస్తుల్లో భవనం. కింద సెల్లార్‌లో 12 దుకాణాలు. ఇప్పటివరకు దుకాణాలు వెలుగు చూడలేదు. కేవలం ఒకవైపు ఉన్న కొన్ని గదులను బ్యాంకు కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. జిల్లా సహకార అధికారి, డివిజినల్ సహకార అధికారి, జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయాలు నడుస్తున్నాయి.

పార్వతీపురంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు భవనం కింద దుకాణ సముదాయం

ఆ నిబంధనే అడ్డంకి అంటూ..

ఈ భవన నిర్మాణం ప్రారంభమయ్యే సరికీ డీసీసీబీకి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గుర్తింపు లేదు. డీసీసీబీ ప్రారంభమయ్యే సరికీ ఆర్బీఐ గుర్తింపు లభించింది. ఆర్బీఐ నిబంధనల ప్రకారం బ్యాంకు ఆవరణలో మరే ఇతర వ్యాపార సంస్థలు పనిచేయకూడదని చెబుతున్నారు. దీంతో పన్నెండు దుకాణాలు తెరవని పరిస్థితి నెలకొందట. ఇకనైనా ఉన్నతస్థాయిలో చర్చించి, నిబంధనలకు అనుగుణంగా ఎలా వినియోగించుకోవాలని ఆలోచించాల్సిన బాధ్యత కేంద్ర సహకార బ్యాంకు పాలకులకు ఉంది.

చుట్టూ వ్యాపార కేంద్రాలే!

సముదాయం చుట్టూ వ్యాపార కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. నేడో రేపో ఓ షాపింగ్‌మాల్ తెరుచుకోనుంది. మరో పది అడుగుల దూరంలో పెద్ద షాపింగ్ మాల్ ఏర్పాటవుతోంది. అయినా ఈ దుకాణాలను వినియోగించుకోవాలనే ఆలోచన అధికారుల్లో లేకపోవడం గమనార్హం. అద్దె కాకుండా అడ్వాన్సు రూపంలో మరో రూ.25 లక్షలు వరకు చేతిలో ఆడే వీలుంది.

28న ఉద్యోగుల గ్రీవెన్స్

పార్వతీపురం, న్యూస్‌టుడే : ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి చెప్పారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి పీజీఆర్ఎస్ మందిరంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు.

రైతేరాజు 8లో

పత్తి రైతు నెత్తిన నష్టాల మూట

– న్యూస్‌టుడే, భామిని

ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఒక పక్క తేమ శాతం మరోవైపు దళారులతో పత్తి రైతులు అవస్థలు పడుతున్నారు. తుపాను, వరుస వర్షాల కారణంగా పత్తి పంట నీటిలో తడిచిపోయింది. ఎండు తెగులు విస్తరిస్తోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో తీత పూర్తికాగానే పంటను తొలగించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఆరబెడితే 16 నుంచి 20 శాతం వరకు తేమ ఉంటోంది. 12 శాతానికి మించితే తిరస్కరిస్తామని సీసీఐ చెప్పినందున రైతులు దళారుల ఉచ్చులో పడి మరింత నష్టాలు చవిచూస్తున్నారు. వీరు క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6,500 వరకు చెల్లిస్తున్నారు.

భామినిలో ఎండిపోయిన పత్తి పంట

కూలీల కొరత

కూలీల కొరత కారణంగా తీత ఖర్చు పెరుగుతోంది. రైతులు కిలోకు రూ.15 చొప్పున కూలీలతో ఒప్పందం చేసుకుంటున్నారు. క్వింటా పత్తి తీయడానికి రూ.1,500 వరకు వెచ్చించాల్సి వస్తోంది. రవాణా ఖర్చు రూ.300 అవుతోంది.

సీసీఐ కనీస మద్దతు ధర రూ.8,100. కానీ నిబంధనలు కఠినంగా ఉండడంతో రైతులు ఇటువైపు రావడం లేదు. తేమ 18 శాతం వరకు అనుమతించాలని కోరుతున్నా సీసీఐ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలోని

కొనుగోళ్లు అంతంతమాత్రమే

కేంద్రాలు ప్రారంభించినా కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలవ్వ లేదని రైతులు వాపోతున్నారు. తమ దగ్గరున్న సరకును కేంద్రానికి తీసుకువెళితే నిబంధనల పేరుతో తిరస్కరించే అవకాశం ఉందని వాపోతున్నారు. గతేడాది భామిని మండలంలో సీసీఐ అధికారులు, కొందరు దళారులు ఒక్కటైపోయి చెప్పిందే ధరగా నిర్ణయించారని రైతులు చెబుతున్నారు. పురుగు మందుల దుకాణ యజమానులు రైతులకు పెట్టుబడులకు కొంత మొత్తం ఇచ్చి సరకుని వారు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో అన్నదాతలు మరింత దోపిడీకి గురవుతున్నారు.

చిట్టితల్లి.. చిక్కుకోకు

నేడు ప్రపంచ పిల్లల వేధింపుల నివారణ దినం

చిన్నారితో మాటలు కలుపుతారు.. తినుబండారాలు, వస్తువులు ఇచ్చి ఆశ చూపుతారు.. అవకాశం చిక్కగానే పైశాచికంగా ప్రవర్తించి పసి హృదయంపై మాయని గాయం చేస్తారు. ఉమ్మడి జిల్లాలో బాలికలపై వేధింపులు, అత్యాచారాలు ఆగడం లేదు. ఏటా 70కి పైగా పోక్సో కేసుల నమోదు తీవ్రతను చెబుతోంది. ఆయా ఘటనల్లో నిందితులు బంధువులు, బాగా తెలిసినవారే ఉంటున్నారు. తల్లిదండ్రులే ఎదుటి వ్యక్తి ప్రవర్తన, దాని అర్థం వివరించాల్సిన అవసరం ఉంది. బుధవారం ప్రపంచ పిల్లల వేధింపుల నివారణ దినం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనమిది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, విజయనగరం రింగురోడ్డు

ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షలకుపైగా బాలికలు, మహిళలు ఉన్నారు. తరచూ ఏదో ఒకచోట వేధింపుల ఘటనలు బయటపడుతున్నాయి. గ్రామం, ఇంటి గుమ్మం దాటనివి మరికొన్ని. పిల్లలకు బాగా తెలిసిన వారినుంచి ఏదైనా ఇబ్బందికర పరిస్థితి ఎదురైతే దానిని గుర్తించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. ఆపద సమయాన్ని గుర్తిస్తే.. త్వరగా బయటపడే అవకాశం ఉంటుంది.

ఆపదను గుర్తించేలా..

☛ **గుడ్ టచ్:** సురక్షితంగా, సౌకర్యంగా అనిపించేది గుడ్ టచ్. ఉదాహరణకు భుజం, వెన్ను తట్టడం, చేయి పట్టుకుని నడిపించడం, షేక్ హ్యాండ్.

☛ **బ్యాడ్ టచ్:** అసౌకర్యంగా అనిపించి భయం, ఆందోళన కలిగేది. గిల్లడం, బలవంతంగా కౌగిలించుకోవడం, ముద్దుపెట్టడం, పెట్టమని చెప్పడం.. ప్రైవేటు భాగాలను తాకడం, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరించడం.

అనుచితంగా ప్రవర్తిస్తే..

పిల్లలకు ఎవరి నుంచైనా అసౌకర్యం అనిపిస్తే వద్దు అని గట్టిగా చెప్పి, ఆ ప్రాంతం సురక్షితం కాదని పరుగెత్తాలి. అనుచితంగా ప్రవర్తిస్తే గట్టిగా అరవాలి. తక్షణం నమ్మకమైన పెద్దలకు విషయాన్ని చెప్పాలి.

- భారతి, అడల్ట్ కౌన్సిలర్

విస్తృత అవగాహన

శక్తి బృందాలతో కలిసి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇబ్బందికర ప్రదేశాల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలియజేస్తున్నాం.

- ఎల్.శ్రీనివాసరావు, ఏఎస్సై, శక్తి బృందం

ఉమ్మడి జిల్లాలో పోక్సో కేసులు



ప్రతి శనివారం ఆనందలహరి
పాఠశాలల్లో నిర్వహణకు కలెక్టర్ ఆదేశం

'ముస్తాబు' గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

పార్వతీపురం, పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలను ప్రోత్సహించాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి అన్నారు. జిల్లాలో 'ముస్తాబు' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలుచేసే చర్యల్లో భాగంగా అన్ని సంక్షేమ శాఖల పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం 'ఆనందలహరి' కార్యక్రమాన్ని పాఠశాలల్లో నిర్వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందించాలన్నారు. సమావేశంలో డీఈవో రాజ్‌కుమార్, గిరిజన సంక్షేమ డీడీ విజయశాంతి. సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శ్యామల, సమగ్రశిక్షా పీవో తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

ప్రేమానురాగాలకు మారుపేరైన మీరు మా నుండి దూరమైనారన్న నిజం నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ అకుల తవిటినాయుడు గారు
రిటైర్డ్ టీచర్, మక్కువ
జననం : 01-07-1947 మరణం : 08-11-2025

కుమారులు	-	కోడళ్లు
బాలకృష్ణ	-	ధనలక్ష్మి
శ్రీధర్	-	సూర్యకుమారి
కుమార్తె	-	అల్లుడు
వసంత	-	శ్రీనివాసరావు

మనుమలు మరియు మనుమరాండ్రు

పెద్దకర్మ : 19-11-25న మక్కువలో మా స్వగృహమందు జరుపబడును.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..

ప్రకటనలపై ఇప్పుడే 5% అదనం ఆదనం

నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ఈనాడు ప్రకటనల విభాగం
9000866020, 8008597609

ప్రమాదం వేలాడుతోంది!!



పాలకొండ ప్రధాన రహదారిలో ప్రమాదం పొంచి చూస్తోంది. స్థానిక గాయత్రీ దేవాలయం సమీపాన భారీ వృక్షానికి ఉన్న చెట్టుకొమ్మ విరిగి గత కొన్ని రోజుల నుంచి వేలాడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఈ దృశ్యం కళ్ల ముందే కనిపిస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. పరిశీలించి, వెంటనే కొమ్మను తొలగిస్తామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

నన్నిలా వదిలేస్తే ఊరుకుంటానా!!

రాజాం పట్టణంలోని పాలకొండ కూడలిలో శ్రీనివాస థియేటర్ రోడ్డులో రక్షిత తాగునీటి పథకం పైపులైను దెబ్బతినడంతో మరమ్మతులు కోసం తవ్వారు. ఈనెల 17న పనులు పూర్తిచేసినా.. ఇంకా గొయ్యిని పూడ్చకుండా వదిలేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఆలయాలు, ప్రధాన మార్కెట్‌కు వెళ్లే మార్గం కావడంతో నిత్యం అత్యంత రద్దీగా ఉంటోంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. చర్యలు తీసుకుంటామని ఏఈ వెంకటరామరాజు చెప్పారు. – న్యూస్‌టుడే, రాజాం

శిథిలం.. విధుల్లో భయం భయం



గంట్యాడ మండల కేంద్రంలో వివిధ గ్రామాల రైతులకు సేవలు అందిస్తున్న వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధమైంది. ఇక్కడకు నిత్యం రైతులు వస్తుంటారు. అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం ఇప్పటికే పెచ్చులూడుతోంది. మరోపక్క స్లాబ్ పట్టుకోల్పోతోంది. దీంతో కొన్ని రోజుల కిందట సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లిపోయారు. ఈ కార్యాలయంలో ఇంకా కొన్ని సేవలు అందుతుండడంతో ఎవరో ఒకరు వస్తున్నారు. అధికారులు స్పందించి, తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి శ్యామ్ కుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

బహుమతి సాధించిన విద్యార్థులు

జాతీయస్థాయిలో మెరిసిన మన చిత్రం

గరివిడి, న్యూస్‌టుడే: మహారాష్ట్ర యానిమల్ అండ్ ఫిషరీస్ సైన్స్ కళాశాల, భారత వైద్య పరిశోధన మండలి, వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈనెల 15న ఆన్‌లైన్‌లో జాతీయస్థాయిలో నిర్వహించిన 'వన్ హెల్త్ యూత్ కాంక్లేవ్- 2025'లో గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వేంకటేశ్వర విద్యాలయం తరపున పాల్గొని, లఘుచిత్రం(షార్ట్‌ఫిల్మ్) విభాగంలో మూడో బహుమతి సాధించారు. మానవ, జంతు, పర్యావరణ ఆరోగ్యం మూడూ ఒక్కటేనని.. ఒకదాని ఆరోగ్యం మిగతా రెండింటిపై ప్రభావం చూపుతుందనే అంశంతో సృజనాత్మకంగా లఘు చిత్రాన్ని చిత్రీకరించారు. విద్యార్థులు వరుణ్, సూర్యభరత్, సాయి సంపత్, మణికంఠ, తరుణ్, హెఫ్సీబా, మృదుల రాగిణి నటించారు. కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను అభినందించారు.

ఇళ్ల మంజూరులో ఏఐ సాంకేతికత

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) 2.0 పథకం కింద పేదల ఇళ్ల మంజూరుకు సంబంధించిన ప్రక్రియలో ఏఐ(కృత్రిమ మేధ) సాంకేతికతను నిక్షిప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాజకీయాలు, అధికారుల ప్రమేయం లేకుండా ప్రాధాన్యత వారీగా గృహాలు కేటాయించాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశం. అధికారుల ఇంటింటి సర్వే నివేదిక ఆధారంగా తొలుత పాకలు, తర్వాత పెంకిటిళ్లు(కచ్చా) ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అందుకనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఇటీవల నిర్వహించిన దూరదృశ్య సమావేశంలో రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ మేరకు సూచనలు చేశారు.

సర్వే చేస్తున్న గృహనిర్మాణశాఖ అధికారులు

పెద్దఎత్తున దరఖాస్తులు..

గ్రామీణంలో పేదలకు ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే దిశగా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. గత నెల 22న యాప్‌ను ప్రారంభించారు. ఒక్కరోజే పనిచేసి, సాంకేతిక కారణాలతో తర్వాత నిలిచిపోయింది. ఈనెల 8 నుంచి మళ్లీ అందుబాటులోకి రావడంతో సర్వేను పునరుద్ధరించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా గృహాల కోసం 36,711 దరఖాస్తులు వచ్చాయి. మళ్లీ పరిశీలించి, వివరాలను అప్‌డేట్ చేయనున్నారు. ఇప్పటివరకు 112 మందిని ఎంపిక చేశారు. ముందుగా సొంత స్థలంలో కట్టుకునేవారిని పరిగణనలోకి తీసుకుంటారు. మరోవైపు సచివాలయాల్లో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులతో పాటు కొత్తగా స్వీకరిస్తారు. ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించారు.

తప్పుగా నమోదు చేస్తే అంతే..

సర్వేలో ముందుగా సిబ్బంది ఫేషియల్ ఆధారంగా లాగిన్ అయి, తర్వాత లబ్ధిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. వారి ఫేషియల్, నివసిస్తున్న ఇల్లుతో పాటు కొత్తగా నిర్మించే స్థలాన్ని జియోట్యాగ్ చేసి అప్‌లోడ్ చేస్తారు. దీంతో తప్పులకు ఆస్కారం ఉండదని భావిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఒకరి బదులు మరొకరి నమోదు చేస్తే చర్యలు తీసుకోనున్నారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం ఏఈలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ సహాయకులు, సర్వేయర్లు తిరుగుతున్నారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న ఇతర సిబ్బందిని ఇందులో భాగస్వామ్యం చేసేందుకు కలెక్టర్ ద్వారా ఎంపీడీవోలను ఆదేశించినట్లు గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు.

అక్కడ ఆగింది.. అర్బన్ పరిధిలో గృహాల కేటాయింపు ప్రక్రియలో స్తబ్దత నెలకొంది. విజయనగరం నగరపాలక సంస్థ, బొబ్బిలి, రాజాం పురపాలక సంఘాలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో సొంత స్థలం ఉండి, కట్టుకునేందుకు 1801 మంది ముందుకొచ్చారు. వీరిలో 1009 మందికి ఇప్పటికే ఇళ్లు మంజూరు చేశారు. సుమారు 150 మంది వరకు నిర్మాణాలు ప్రారంభించారు. తాజాగా కేంద్రం ప్రాధాన్యత కేటగిరీలో జిల్లాను చేర్చడంతో వచ్చే ఆర్థిక ఏడాది వరకు కొత్తవి మంజూరు కావని గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.మురళీమోహన్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణంలో త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు.

ఐదేళ్లు సంరక్షణ.. నిరంతర ఆదాయం

అన్నదాతకు సిరులు కురిపించే వక్క సాగు

మడకశిర, న్యూస్‌టుడే: వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తోంది. అయిదేళ్ల పాటు సంరక్షణ చేపడితే అనంతరం రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. చెట్లకు అవసరమైన మేరకు నీరు, పేడ, మట్టిని అందిస్తే చాలు. ఈ పంట సాగులో పెద్దగా ఖర్చు చేయాల్సింది లేదు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

నేల ఎంపిక

సాధారణంగా వక్క అన్ని నేలల్లో పండుతుంది. 25 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే చల్లటి వాతావరణం సాగుకు అనుకూలంగా ఉంటుంది. నీరు నిలవకుండా ఉండే భూములు ఎంపిక చేసుకుంటే మొక్క త్వరితగతిన పెరిగేందుకు మంచి అవకాశం. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగులు దూరం పాటించాలి. ఇలా ఒక ఎకరాలో 450 నుంచి 500 మొక్కలు నాటుతారు. కొత్తగా నాటిన మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం నీడ ఇచ్చే అవిస మొక్కలను నాటుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు ఏడాదికి ఒకసారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. అనంతరం అయిదేళ్లకు వక్క పంట దిగుబడి ప్రారంభమవుతుంది.

నారు పోసే విధానం

సాగుకు ముందు 40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్క నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనెసంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. ఈ మొలకలను మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. ఇలా అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. నాటిన అయిదేళ్ల అనంతరం ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కేజీల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి.. ఉడకబెట్టి, అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల ఎండిన వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోనూ రూ.4 లక్షలు నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూలచెట్లు, చెక్క, ఇతర సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

రాష్ట్రంలోనే అమరాపురం అగ్రస్థానం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా, ఒక్క అమరాపురం మండలంలోనే 3,100 ఎకరాల్లో సాగులో ఉంది. అలాగే అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లోనూ ఈ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. అమరాపురం మండలంలో వక్క సాగు ద్వారా రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండడం గమనార్హం.

రైతేరాజు

వర్షమొస్తే.. వరిని కాపాడుకుందాం

కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు

కురుపాం గ్రామీణం: వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సూచనలు పాటిస్తే పంటను రక్షించుకోవచ్చని కురుపాం వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

రక్షణ చర్యలివే...: ● పంట కోసినప్పుడు వరి పనలు పలచగా వేసుకోవాలి. కొన్ని పనల కంకులు ఒకవైపుకు వచ్చినట్లు, మరికొన్ని కంకులు రెండోవైపునకు వచ్చేటట్లు వేస్తే కంకులు గడ్డితో కప్పినట్లు ఉండి మంచు నుంచి తేలికపాటి వర్షం నుంచి కొంత మేరకు రక్షణ కలుగుతుంది. ● పనలను చేలో బాగా ఆరనివ్వాలి. కంకులు నెమ్మదిగా ఎండితే బియ్యం దిగుబడి బాగుండడమే కాక నూక రావడం తగ్గుతుంది. ● పనలు ఆరక చేలోనే ఉండి వర్షం వస్తుందని భయం నెలకొన్నప్పుడు 20 కిలోల ఉప్పును వంద లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పనలపై చల్లితే వర్షం పడినా గింజ మొలకెత్తదు.

తెగులు సోకితే తీసేయాల్సిందే..

ప్రస్తుతం మిరప పంట శాఖీయ దశ నుంచి పూత దశలో ఉంది. ఎక్కువగా జెమిని వైరస్ (ఆకుముడత తెగులు) ఆశిస్తుంది. దీని నివారణకు వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. పొలంలో కలుపు నివారించాలి. పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 8-10 చొప్పున అమర్చాలి. నివారణకు పైరిప్రాక్సీపెన్ 1.5 మి.లీ. లేదా పైరిప్రాక్సీపెన్+ఫెన్ ప్రొప్రాతిన్ 1 మి.లీ. మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ప్రదీప్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్‌లో సాగవుతున్న పంటల్లో సస్యరక్షణ చర్యలు, రబీ పంటల్లో విత్తన ఎంపిక, విత్తనశుద్ధి వంటి సలహాలకు 94410 13693 నంబరును సంప్రదించాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.కె.లక్ష్మణ్ తెలిపారు.

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పంట సాగులో తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందొచ్చని విజయనగరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త **తేజేశ్వరరావు** తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

ప్రశ్న: రబీలో మొక్కజొన్న పంటను ఎప్పుడు విత్తుకోవాలి?
– ఎం.రామలక్ష్మి, చీడివలస, కొత్తవలస మండలం

సమాధానం: మొక్కజొన్నను రబీలో అక్టోబర్ నుంచి నవంబర్ లోగా విత్తితే ఉత్పత్తి బాగుంటుంది.

ప్రశ్న: మినుము విత్తి 20 రోజులైంది. కలుపు నివారణ తెలపండి? – కె.ప్రసాదరావు, రుద్రుపేట, పాలకొండ మండలం

సమాధానం: మినుము పంట 20-25 రోజులకు వెడల్పాకు, గడ్డిజాతి కలుపు నివారణకు కలుపు 2-4 ఆకుల దశలో 200 మి.లీ. ఇమాజితాఫిర్ 5 శాతంను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న: మిరపలో ఎరువుల యాజమాన్యం వివరించండి? -ఎం.గౌరినాయుడు, గుణానుపురం, కొమరాడ మండలం

సమాధానం: మిరపలో సేంద్రియ ఎరువులతోపాటు ఎకరాకు 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాష్‌ను వేయాలి. మొత్తం భాస్వరం ఎరువును ఆఖరి దుక్కిలో లేదా నాట్లు వేసే సమయంలో వేసుకోవాలి. యూరియా 65 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోల చొప్పున మొక్కలు నాటిన 30, 60, 90, 120 రోజుల వయసులో నాలుగు దఫాలుగా వేయాలి.

అవసరానికి మించి వాడితే అనర్థమే

మాట్లాడుతున్న సూపరింటెండెంటు పద్మజ

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: ఎన్నో ప్రాణాంతకమైన వ్యాధులను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించే యాంటీ బయోటిక్స్ మందులను అవసరానికి మించి వాడితే ముప్పు తప్పదని ప్రముఖ వైద్య నిపుణురాలు, విజయనగరంలోని మహారాజా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు అల్లు పద్మజ అన్నారు. యాంటీ బయోటిక్స్ అవగాహన దినం సందర్భంగా మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నచిన్న రోగాలకు ఔషధాలు వాడొద్దని కోరారు. వైద్యుల సూచన మేరకే ఉపయోగించాలని, ప్రతి విషయంలో ఆందోళన చెంది దుకాణాలకు వెళ్లి తీసుకోవడం సరికాదన్నారు. కొన్నింటికి టీకాలు అవసరమని, అలాంటివారు వీటిని వాడొద్దని సూచించారు. యాంటీ బయోటిక్స్ కారణంగా ఏటా లక్షల్లో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైక్రో బయాలజీ విభాగం హెచ్‌వోడీ అరుణశ్రీ, ప్రొఫెసర్లు రమణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	127	224	234

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ రాజుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతిలో ప్రైవేటు పాఠశాలలకు మించి ప్రభుత్వ బడుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆకాంక్షించారు. గతేడాది 87 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో ఏడో స్థానంలో ఉందని, ఈ ఏడాది మరింత ముందు కెళ్లాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో సూచనలు చేశారు. డిసెంబరు 5లోపు సిలబస్ పూర్తిచేసి, వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలన్నారు. వెనుకబడిన వారిని గుర్తించి, అదనపు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై దృష్టిపెట్టాలన్నారు.

ప్రశంసాపత్రాలు.. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన మాస్టర్లు, గైడ్ కెప్టెన్లను కలెక్టర్ అభినందించారు. జిల్లా కమిషనర్ బీపీఏ.రాజు, కె.సౌభాగ్య లక్ష్మి, కె.దుర్గానాగేశ్వరరావు, డి.ప్రవీణ్‌కుమార్, ఎ.కనకలక్ష్మి, పి.వి.శర్వాణి, వి.సూర్యనారాయణ, ఎన్.పుష్పలతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఈవో యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.రామారావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముస్సోరీకి మన అధికారి

వినోద్‌కుమార్

పార్వతీపురం పట్టణం: కుష్ఠు నిర్మూలన జిల్లా అధికారి ఎం.వినోద్‌కుమార్ ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ ఐఏఎస్‌లకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నారు. జిల్లాలో అమలు చేసిన ఆరోగ్య కార్యక్రమాలు, మాతా-శిశు మరణాల అదుపునకు తీసుకున్న చర్యలు, రక్తహీనత నియంత్రణ విధానాలు, సాధించిన ప్రగతిని వివరించనున్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

కానిస్టేబుల్ మూర్తిని సత్కరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

క్రీడా విభాగం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బీఎస్ఎన్.మూర్తి ఇటీవల కాకినాడలో జరిగిన 14వ రాష్ట్ర తైక్వాండో- 2025 పోటీల్లో స్వర్ణం గెల్చుకొని సత్తా చాటారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ దామోదర్ తన కార్యాలయంలో సత్కరించారు. ఆరోగ్యం కాపాడుకుంటూ రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు తేవాలని ఆకాంక్షించారు. ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్బీ సీఐ లీలారావు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై ఉప కలెక్టర్ విచారణ

కొత్తవలస, న్యూస్‌టుడే: భూ రికార్డుల్లో మార్పు కోసం కొత్తవలస తహసీల్దారు నగదు తీసుకుని పనిచేయడం లేదని మిందివలసకు చెందిన వై.సూరిబాబు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 'భూ రికార్డుల్లో పేర్ల మార్పునకు లంచమడిగారు?' శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన వార్తకు కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కేఆర్ఆర్‌సీ ఉప కలెక్టర్ మురళి మంగళవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుతో మాట్లాడారు. హెచ్‌డీటీ సునీత, ఎంఆర్ఐ షణ్ముఖరావు, సర్వేయరు పున్నయ్య, చీపురువలస వీఆర్వో సరోజినితో చర్చించి, రికార్డులు తనిఖీ చేశారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, సిబ్బంది బుధవారం కలెక్టరేట్‌కు రావాలన్నారు. ఫిర్యాదుదారు కుటుంబీకులు పలు రెవెన్యూల్లో వంద ఎకరాలకు మించి కొనుగోలు చేశారని, దీనిపైనా విచారణ చేయాలని ఉప కలెక్టర్‌ను కోరినట్లు తెలుస్తోంది.

ఎంఎస్ఎంఈ పార్కు పనుల అడ్డగింత

గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండలం కాకర్లవలస గిరిజన గ్రామం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు పనులను మంగళవారం గిరిజనులు అడ్డుకున్నారు. కొండ ప్రాంతంలో తమకు భూములు వద్దని, పార్కు వద్దే ఇవ్వాలని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు పనులు నిలిపివేశారు. డిప్యూటీ తహసీల్దారు గిరిధర్ చెప్పినా వినలేదు. సీఐ నారాయణరావు, ఎస్సై ప్రసాదరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం వద్ద అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో శాంతించారు.

EENADU Classifieds

HOME NEEDS

WATER PURIFIER

హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తుంటే జుట్టు రాలడం, చర్మం పొడిబారడం & బట్టలు, పాత్రలు కడిగిన, ఉతికిన తెల్లగా రాకపోవడం మీ సమస్య? ✆ 7675873377.

REAL ESTATE

HOUSE FOR SALE

తోటపాలెం (బాలాజీనగర్) ముత్యాలమ్మగుడి ఎదురు ఏరియాలో RTC బస్టాండ్, కాలేజ్, స్కూల్స్‌కి దగ్గరలో 96 చ.గ. ఇండిపెండెంట్ ఇల్లు అమ్మబడును. Direct పర్సన్ సంప్ర ✆ 99854 14306.

JOBS

కస్టమర్ అడ్రస్ వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావాలి. 8125110304 గూడూరు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, సూళ్లూరుపేట.

FACULTY/ TEACHERS

విజ్ఞాన భారతి హైస్కూల్ రావాడ భోగాపురం నర్సరీ, LKG, UKG బోధించుటకు D.Ed, B.Ed అర్హత గలవారు కావలెను. జీ:10 to 12K ✆ 9703711164

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పది రోజుల్లో ఉద్యోగ విరమణ.. అంతలోనే ఆగిన ప్రయాణం

వెంకటనాయుడు (పాత చిత్రం)

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఆయనో ఉపాధ్యాయుడు. కొడుకులిద్దరినీ బాగా చదివించారు. వారిద్దరూ వైద్య విద్య అభ్యసించారు. వైద్య సేవల కోసం ఇంటి ప్రాంగణంలోనే ఆస్పత్రిని సిద్ధం చేశారు. ఈ నెలాఖరుకు తానూ ఉద్యోగ విరమణ చేసి అందులోనే పిల్లలకు సాయంగా ఉందామని భావించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. బాధిత కుటుంబానికి తీరని వేదనను మిగిల్చింది. 'మా కోసం నాన్న ఎంతో చేశారు. కొద్ది రోజుల్లో ఆయన ఉద్యోగ విరమణ వేడుకలను ఘనంగా చేయాలని భావించాం. ఇలా అంతిమ సంస్కారాలు చేయాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు' అని కుమారులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గరుగుబిల్లి మండలం రావివలసకు చెందిన మరిశర్ల వెంకటనాయుడు(62) నర్సిపురం జడ్పీ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు. పార్వతీపురం పట్టణంలోని బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. మంగళవారం పాఠశాల తరగతులు ముగిశాక ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డుపై పడిపోయారు. చెవి, ముక్కు నుంచి రక్తం రావడంతో స్థానికులు ఆయన్ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందిస్తుండగా కన్నుమూశారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఉండవచ్చని, లేదా ఏదైనా అనారోగ్య సమస్యతో కింద పడిపోవడంతో దెబ్బ తగిలి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆయనకు భార్య లత, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు జిల్లా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న కుమారుడు ఎండీ పిడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీకి ప్రయత్నిస్తున్నాడు. ఆయన మృతిపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని రూరల్ ఎస్సై రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి మృత్యువాత

చంద్రశేఖరరావు (పాతచిత్రం)

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న ఆర్మీ విశ్రాంత ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన నగరపాలక సంస్థ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. విజయనగరం మండలం జమ్మునారాయణపురం గ్రామానికి చెందిన ఎన్.చంద్రశేఖరరావు(70) ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. మంగళవారం ధర్మపురిలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. బైక్‌పై తిరిగి వస్తుండగా రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో ఓ కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు స్పందించి, వెంటనే సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన భార్య అప్పలనరసమ్మ ఈ ఏడాది జనవరిలో మరణించారు. ముగ్గురు కుమార్తెలున్నారు. వారి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు.

కలలు కల్లలై

రోడ్డు ప్రమాదంలో యువ సైనికుడి దుర్మరణం

ప్రసాద్ (పాతచిత్రం)

మెరకముడిదాం, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల కష్టం గుర్తెరిగాడు.. ఉద్యోగం సాధిస్తే తప్ప తమ సమస్యలు తీరవని తెలుసుకున్నాడు.. దేశానికి సేవ చేయడంతో పాటు ఉపాధి దొరుకుతుందని సైనిక కొలువు కోసం కష్టపడ్డాడు. 19 ఏళ్లకే అస్సాం రైఫిల్స్‌లో ఉద్యోగం సాధించాడు.. చేరిన ఏడాదికే రోడ్డు ప్రమాదం ప్రాణాలను హరించింది. యువ సైనికుడి కలలను కల్లలుగా మిగిల్చింది. కుటుంబానికి దిక్కు లేకుండా చేసింది. ఈ విషాదకర ఘటన అసోంలో చోటుచేసుకుంది.

మెరకముడిదాం మండలం గొల్లలవలసకు చెందిన అడ్డూరి లక్ష్మి, పాపారావు దంపతులు వ్యవసాయ కూలీలు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు ప్రసాద్(20) కష్టపడి చదివి అస్సాం రైఫిల్స్‌లో కొలువు సాధించాడు. 2024 డిసెంబరు 14న విధుల్లో చేరాడు. మంగళవారం విధులు నిర్వర్తించడానికి ఇంకో జవానుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. డిఫెన్స్‌కు చెందిన వ్యాను వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. బుధవారం మధ్యాహ్నం మృతదేహం చీపురుపల్లి చేరుకుంటుందని స్థానికులు తెలిపారు.

రెండేళ్లుగా తిరుగుతున్నా.. దయచూపండి సారూ..

సామాలమ్మ

ఈ చిత్రంలో కనిస్తున్న మహిళ పేరు గుడారు సామాలమ్మ. నర్సిపలస పంచాయతీ పెద్దపలస గ్రామం. భర్త 2023 డిసెంబరులో మృతిచెందారు. అప్పటి నుంచి పింఛను మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం వర్షార విశంతు కేటగిరీ కింద లబ్ధిదారుగా నమోదు చేశారు. కానీ నగదు అందడం లేదు. మంగళవారం పెదపలస సచివాలయానికి వచ్చి, ఉద్యోగులకు ఫిర్యాదు చేశారు. దరఖాస్తును పరిశీలించి, న్యాయం చేస్తామని ఎంపీడీవో పార్వతి తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

వనమంత సందడి

సాలూరు గ్రామీణం, పాచిపెంట: బొడ్డవలస సమీపంలోని మామిడి తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవం జరిగింది. పలువురు కుటుంబ సభ్యులతో సందడి చేశారు. పాచిపెంట మండలంలోని నీలంపలస గ్రామ సమీపంలో ఉన్న జలపాతాన్ని డీఆర్డీఏ పీడీ సుధారాణి తదితరులు మంగళవారం సందర్శించారు. అనంతరం నీళ్లలో సందడి చేశారు. ఎంపీడీవో పాత్రో, డీపీఎం జయశ్రీ, ధర్మారావు, రాజ్యలక్ష్మి, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు. పి.కోనవలస గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో వన కార్యక్రమం జరిగింది. భోజనాల తరువాత విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు నృత్యాలు చేసి, అలరించారు.

జాతీయ పోటీల్లో సత్తా

పాచిపెంట, న్యూస్‌టుడే: ఒడిశాలో ఈనెల 11 నుంచి 15 వరకు జరిగిన నాలుగో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాచిపెంట మండలం కొటికిపెంట ఏకలవ్య పాఠశాల బాలికలు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో 29 మంది పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ దేవేంద్రసింగ్ మంగళవారం తెలిపారు.

పతకాలు, ప్రశంసా పత్రాలతో బాలికలు, అధ్యాపకులు

పాలకొండలో పొగపాట్లు

పాలకొండ- పార్వతీపురం ప్రధాన రహదారిలోని నవగాం కూడలిలో పొగ కాలుష్యం స్థానికులను మంగళవారం ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ కూడలిలో పాతసామాన్ల కొనుగోలు చేసే దుకాణాలు ఉన్నాయి. పాత టైర్లు కాల్చడంతో పొగ వ్యాపించింది స్థానికులు అవస్థలు పడ్డారు. పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా, అన్నవరం కూడలి, రాజాం రహదారిలో ఇటువంటి పరిస్థితే ఉంది. వాయు కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సంబంధిత దుకాణ యజమానులకు సూచిస్తామని ఎంపీడీవో రంగారావు తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మాదకద్రవ్యాలు ముట్టొద్దు..

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లి భవిత నాశనం చేసుకోవద్దని మంగళవారం ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పడి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశాభివృద్ధిలో భాగస్వామ్యులయ్యే యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సూచించారు. దివ్యాంగుల శాఖ ఏడీ లక్ష్మణరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శంకరకుమారి, ఈగల్ బృందం అధికారి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థుల మానవహారం

తెరపై ఈనాడు

★ శ్రీ సినిమా(ఏసీవీ): శివ, మాస్ జాతర
★ టీబీఆర్: కాంత, ది గర్ల్‌ఫ్రెండ్
- న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో మంగళవారం కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో..రూపాయల్లో).. ★టమాటా: 50, ★వంకాయలు: 50, ★బెండ: 48, బీర: ★47, ★దొండ: 80, ★చిక్కుడు: 47, ★పచ్చిమిర్చి: 40, ★కాకర: 36, ★క్యారెట్: 65, ★బీట్‌రూట్: 50, ★ఉల్లి: 23, ★బంగాళదుంపలు: 22, ★అల్లం: 85 ★వెల్లుల్లి: 70, ★క్యాప్సికమ్: 75, ★అరటి కాయ: 5, ★ఆనపకాయ: 12.

విహారిద్దాం.. విజ్ఞానం పొందుదాం

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

తరగతి గదిలో పాఠాలకే తోడు బయట చూసి తెలుసుకున్న అంశాలు విద్యార్థి భవితకు దోహదపడతాయి. ఈ ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదం అందించాలని నిర్ణయించింది. పీఎంశ్రీ పాఠశాలల్లోని బాలలకు అవగాహన పర్యటన కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందు కోసం నిధులు సైతం విడుదల చేసింది. ఇప్పటికే జిల్లాలో కొన్ని పాఠశాలల విద్యార్థులను విజ్ఞాన.. విహార యాత్రలకు తీసుకెళ్లారు. సమ్మెటివ్ 1 పరీక్షలు 20వ తేదీతో ముగిసిన వెంటనే యాత్రలు ప్రారంభించి నెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయి.


సీతంపేట: పర్యటనలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పీఎంశ్రీ పాఠశాలల బాలలకు 'అవగాహన పర్యటన'

20 పాఠశాలల్లో ఎంపిక

జిల్లాలో 1,447 ప్రభుత్వ పాఠశాలలుండగా ఇందులో పీఎంశ్రీ పాఠశాలలుగా 20 ఎంపికయ్యాయి. వీటిలో కొత్తగా ఎంపికైంది గరుగుబిల్లి గురుకులం. మరో రెండు ఎంపీపీ పాఠశాలలు కావడంతో ఈ మూడింటికి అవగాహన పర్యటనకు ఎంపిక చేయలేదు. మిగతా 17 పాఠశాలలకు నిధులు జమచేశారు. జిల్లాకు రూ.5.28 లక్షలు సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు అందించారు. 6 నుంచి 12 తరగతి వరకు విద్యార్థులను విజ్ఞాన... విహార యాత్రలకు తీసుకెళ్లాలని సూచించారు. ఒక్కో విద్యార్థికి రూ. 500 వెచ్చించాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను ఎంపిక చేసి యాత్రకు తీసుకెళ్తారు.

చక్కటి అవకాశం...

బయట ప్రపంచం గురించి విద్యార్థి తెలుసుకునేందుకు ఎక్స్‌పోజర్ విజిట్ ఎంతగానో దోహదపడుతుంది. ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పించింది. ఈనెలాఖరులోగా ఈ పర్యటనలు పూర్తికావాలని సూచించాం.
– రాజ్‌కుమార్, తేజేశ్వరరావు, డీఈవో, ఏపీసీ

మేమున్నాం... మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	-8008566244
పాలకొండ	-8008574299
సాలూరు	-8008786820
కురుపాం	-9849044696

ప్రధాన రహదారికి మరమ్మతులు

స్పందనకు వందనం

పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్లే ప్రధాన రహదారిలో బెలగాం, వైకేఎం నగర్ బస్టాప్ వద్ద మరమ్మతులు చేపట్టారు. ఈ మార్గంలో గుంతల కారణంగా జరుగుతున్న ప్రమాదాలపై గతనెల 20న 'గోతులేలా ఉంది వెళ్లేదెలా' శీర్షిక ప్రచురించిన కథనంపై డీఈఈ అప్పలనాయుడు స్పందించి పనులు చేయించారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం/పట్టణం

కాలువ నిర్మించాలి

?: మండలంలోని నర్సిపురం బీసీ కాలనీలో కాలువ లేక నీరు రోడ్డుపైకి వస్తోంది. రోడ్డు పక్కనగా కాలువ కడితే ఈ సమస్య తీరుతుంది. తక్షణం కాలువ నిర్మించాలి. - కుమార్, నర్సిపురం
★ పరిస్థితి పరిశీలించి, కొత్తది ప్రతిపాదనలు చేస్తాం. - పాపారావు, ఉప ఎంపీడీవో
- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: పాలకొండ సత్యసాయి మందిర కూడలి వద్ద విద్యుత్తుదీపం వెలగడం లేదు. -మహేష్, భక్తుడు
★ వీధి దీపం ఏర్పాటు చేయిస్తాం. - దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ
- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి స్తంభాలు వేసి సగంలో పనులు ఆపేశారు. దీంతో పశువులు వస్తున్నాయి. - ప్రదీప్
★ నిధుల కొరతతో పనులు ఆగాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయిస్తాం.
- చంద్రబాబు, ఏటీడబ్ల్యూవో
– కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే

గ్రంథాలయాల్లో పోటీలు

సీతంపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా సీతంపేట శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అనే అంశంపై వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు తెలిపారు.

బలిజిపేట: బలిజిపేట శాఖా గ్రంథాలయంలో మంగళవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయం నిర్వాహకుడు బొత్స రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలోని రామాడిగ్రీ కళాశాలలో మంగళవారం శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై ఝాన్సీభాయ్ యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆపద సమయాల్లో 112 నెంబర్‌కు సమాచారం అందించి తక్షణ సాయం పొందవచ్చన్నారు.

ప్రజా సహకారంతో స్వచ్ఛత

పార్వతీపురం గ్రామీణం: జిల్లాలో ప్రజల సహకారంతో పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి(డీజీపీవో) టి.కొండలరావు చెప్పారు. పెదమరికి పంచాయతీ, గ్రామాల్లో శుభ్రత పనితీరును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఇళ్లలో చెత్త వీధి కాలువల్లో వేయకుండా గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. పంచాయతీ కేంద్రం, శివారు గ్రామాల్లో రోజువారీ శుభ్రత, తనిఖీ ఉండాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచి గంగమ్మ, మండల గృహనిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, సచివాలయ కార్యదర్శి రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

19, 20న సైక్లింగ్ ఎంపికలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఈనెల 19, 20 తేదీల్లో ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శాప్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సైక్లింగ్ శిక్షకుడు కనకారావు 63011 77119ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు అభినందన

గుమ్మలక్ష్మీపురం: జాతీయస్థాయి మారథాన్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థులు ఎంపికవ్వడం అభినందనీయమని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానంద రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల అంకిత భావానికి విద్యార్థుల కృషి, పట్టుదల తోడైతే బాలికలు అన్ని రంగాల్లో సత్తాచాటగలరని నిరూపిస్తున్నారన్నారు.

నేడు సమావేశం

సీతంపేట: ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో అద్దె ప్రాతిపదికన ఫుడ్ స్టాల్ ఏర్పాటుకు, ఆటో నిర్వహణకు దరఖాస్తులు చేసుకున్న నిర్వాహకులు నేడు(బుధవారం) ఉదయం పది గంటలకు పార్కు వద్దకు హాజరు కావాలని పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు.

ఆటల్లో ప్రతిభతో అవకాశాలు

పోటీలు ప్రారంభిస్తున్న విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండు క్రీడా మైదానంలో మంగళవారం జిల్లాస్థాయి అండర్-14 విభాగం బాల, బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆటల్లో కనబర్చిన ప్రతిభతో మంచిగుర్తింపు, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఏఎంసీ ఛైర్మన్ కళావతి, తహసీల్దారు శేఖర్, ఎంపీడీవో లక్ష్మి, మండల కన్వీనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో అన్ని గ్రామాలకూ రహదారులు

సీతంపేట, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్లా కూటమి అభ్యర్థులు గెలవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని కె.గుమడలో మంగళవారం కూటమి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఏడాదిలోగా అన్ని గ్రామాలకు రోడ్లు వేయిస్తామన్నారు. ఏఎంసీ అధ్యక్షురాలు బి.సంధ్యారాణి, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త ఐ.పవన్, పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.తోటముఖలింగం, టీఏసీ సభ్యుడు ఎస్.మాలయ్య, జనసేన మండలాధ్యక్షుడు ఎం.విశ్వనాథం, బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్.రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

కె.గుమడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రైతు సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

పార్వతీపురం గ్రామీణం, సీతానగరం న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. నిడగల్లు, తాళ్లబురిడిలో మంగళవారం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలోని ప్రతీ రైతు సేవా కేంద్రం పరిధిలో కొనుగోళ్లు మొదలవుతాయన్నారు. తాళ్లబురిడిలో బంగారమ్మ తల్లి అన్న సమారాధనలో పాల్గొన్నారు. సీతానగరం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నిడగల్లులో కేంద్రాన్ని సబ్ కలెక్టర్ వైశాలితో కలిసి ప్రారంభించారు. సీఎస్‌డీటీ వర్జీనియా, రాష్ట్ర కొప్పలవెలమ సంఘ డైరెక్టరు జీవీ నాయుడు, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాళ్లబురిడి : కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే

కాలువ కప్పేయ్.. దుకాణం పెట్టేయ్! / పాలకొండలో ఇదీ ఆక్రమణల తీరు

పాలకొండ ఆక్రమణలకు అడ్డాగా మారింది. పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వీధి కాలువలపై దుకాణాలు వెలుస్తున్నాయి. ప్రధాన రహదారిలోని బల్లంకివీధి కూడలి నుంచి ఏలాం వరకు రోడ్డుకు రెండువైపులా పక్కా కాలువలను నిబంధనలకు విరుద్ధంగా కప్పివేస్తూ శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. స్టేట్‌బ్యాంకు ఎదురుగా, ఆర్టీసీ కాంప్లెక్సు పరిసరాలు, నాగవంశపువీధి కూడలి, కోటదుర్గ ఆలయ పరిసర ప్రాంతం, బల్లంకివీధి కూడళ్లలో అధికంగా ఈ పరిస్థితి నెలకొంది. దీనివల్ల నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కాలువలు శుభ్రం చేసేందుకు వీలు కావడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల పట్టణంలోని పలువురు వ్యాపారులకు నోటీసులు అందజేసినట్లు కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

స్టేట్‌బ్యాంకు ఎదురుగా కాలువపై దుకాణాలు

నీరు అనుకుని పురుగు మందు తాగేశాడు..

పార్వతీపురం పట్టణం, వీరఘట్టం, న్యూస్‌టుడే: నీటి సీసాలోని పురుగు మందును నీరు అనుకుని తాగిన వ్యక్తి అస్వస్థతకు గురైన ఘటన వీరఘట్టం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, ఆసుపత్రి వర్గాల వివరాల మేరకు.. మండలంలోని కంబర గ్రామానికి చెందిన పి.ప్రసాదరావు పొలంకి వెళ్లాడు. అక్కడ కనిపించిన బాటిల్‌లో నీరు అనుకుని ద్రావణాన్ని తాగాడు. అస్వస్థతకు గురికావడంతో బాధితుడిని పీహెచ్‌సీకి.. అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినిని శ్రీకాకుళం ఆసుపత్రికి తరలింపు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న జజ్జువకు చెందిన ఎస్.జయసుధ అనే గిరిజన విద్యార్థిని వాలీబాల్ ఆడుతున్న సమయంలో తలకు గాయం కావడంతో రెండు రోజులుగా ప్రాంతీయాసుపత్రిలో వైద్య సేవలు పొందింది. పూర్తిగా నయం కాకపోవడంతో సీటీ స్కానింగ్ నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి మంగళవారం ఐటీడీఏ అంబులెన్స్‌లో తరలించారు. విద్యార్థిని పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ స్కానింగ్ తీస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని ఆసుపత్రి పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు.

12 మందిపై బైండోవర్

సీతానగరం: సీతానగరం సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించిన 12 మందిని తహసీల్దారు ప్రసన్నకుమార్ వద్ద హాజరు పర్చి బైండోవర్ చేసినట్లు సీఐ పద్మావతి తెలిపారు.

మోతాదుకు మించితే అనర్థమే

పార్వతీపురం పట్టణం : యాంటీబయోటిక్స్ మందుల వినియోగం మోతాదుకు మించి వాడితే అనేక ఇతర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని డీఎంహెచ్‌వో భాస్కరరావు అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఐవో విజయ్ మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పార్వతి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు కృషి

సీతంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంత వ్యూహాత్మకంగా శ్రమిస్తున్నారో నిరూపణగా విశాఖలో జరిపిన సీఐఐ భాగస్వామ్య సదస్సు నిలిచిందని తెదేపా పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు.

ఘనంగా చండీయాగం

పాలకొండ గ్రామీణం: పాలకొండ సత్యసాయి నగర్‌లో మంగళవారం రాత్రి చండీయాగం నిర్వహించారు. వేదపండితులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో భక్తులు ఈ యాగంలో పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

పాలకొండ గ్రామీణం : రామా డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వాగతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

రైతుల ప్రభుత్వమిది

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: రైతుల ప్రయోజనాలను కష్టసుఖాలను ప్రభుత్వం గుర్తించి పలు సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మంగళవారం గరుగుబిల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం చేశారు. పీఏసీఎస్ అధ్యక్షులు పి.పూర్ణచంద్రరావు, మండల తెదేపా పార్టీ అధ్యక్షులు ఎం.స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో ముప్పు

సాలూరు: మాదక ద్రవ్యాలతో మానసిక రుగ్మతల బారిన పడతారని సాలూరు కమిషనర్ టీవీ రత్నకుమార్ అన్నారు. పుర కార్యాలయంలో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంచముఖేశ్వర స్వామికి మంత్రి పూజలు

సాలూరు, పాచిపెంట, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం పూజలు చేశారు. పాచిపెంటలోని నూకమాంబిక ఆలయంలో దీపోత్సవం జరిగింది.

జూట్ మిల్లు తెరవాలి

సాలూరు : కార్మిక చట్టాలకు కేంద్రం తూట్లు పొడుస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు అన్నారు. మంగళవారం సాలూరు పట్టణంలో ఆయన మాట్లాడుతూ జీగిరాం జూట్‌మిల్లు తెరిచి, కార్మిక ఇబ్బందులు తీర్చాలన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

పాలకొండ, కురుపాం: విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి మన్మథరావు పేర్కొన్నారు. మహాసభల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ సర్పంచుల సంఘం అధ్యక్షుడు గౌరీశంకరరావు మంగళవారం కలెక్టర్ ప్రభాకరరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. అధిక సామర్థ్యం కలిగిన ట్యాంకును మంజూరు చేయాలని కోరామన్నారు.

నాలుగు పాకలు దగ్ధం

దిబ్బగూడలో కాలిపోయిన వంట పాకలు

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని దిబ్బగూడలో సోమవారం రాత్రి విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా నాలుగు వంట పాకలు దగ్ధమయ్యాయి. ఎన్.సత్యం, జె.చిన్నమ్మి, ఎస్.బుడ్డు, ఎన్.పార్వతిలకు చెందిన బియ్యం, బట్టలు తదితర వస్తువులు కాలిపోయాయి. ఆస్తి నష్టం సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధిత కుటుంబాలు తెలిపాయి. సమాచారం అందుకున్న స్థానిక మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్ గణేష్, వీఆర్వో యర్నాకరం గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఒక్కో బాధిత కుటుంబానికి 20 కిలోల బియ్యం అందజేసినట్లు తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

పార్వతీపురం గ్రామీణం: చిరుధాన్యాల వినియోగంతో కుటుంబ ఆరోగ్యం కాపాడుకోవచ్చునని గృహవిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి చెప్పారు. మండలంలోని చినబొండపల్లిలో పెరటి తోటల పెంపకాన్ని మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ చిరుధాన్యాల వంటలతో జీర్ణ కోశవ్యాధులు సమస్య నుంచి ఇబ్బంది తొలగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మరాజులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న ఉమాజ్యోతి

నేటి నుంచి సత్యసాయి శతజయంతి వేడుకలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో సత్యసాయి జయంతి వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు మహిళా దినోత్సవం, 20న యువతతో సామాజిక సేవా కార్యక్రమాలు, 21న బాలవికాస్ చిన్నారులతో సాంస్కృతిక ప్రదర్శనలు, 22న దుస్తుల పంపిణీ, 23న బాబా శతవర్ష జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర ఐటీ విభాగ బాధ్యులు ఆర్.కిశోర్ తెలిపారు. స్థానిక సెగిడివీధిలోని శివం మందిరంలో 5 రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి.

బెలూన్ ఏర్పాటు చేస్తున్న భక్తులు

పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించండి

పాలకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో తెదేపా కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో నాయకులు పవర్ సబ్‌కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను కోరారు. మంగళవారం కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందించారు. తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గండి రామినాయుడు, అరకు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు వారాడ సుమంత్‌నాయుడు పాల్గొన్నారు.

వీఆర్వో అక్రమాలపై దర్యాప్తునకు డిమాండ్

జియ్యమ్మవలస: మండలంలో పెదబుడ్డిడి వీఆర్వో అక్రమాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై దర్యాప్తు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. గౌరమ్మ అనే మహిళ తన భర్త రెండేళ్ల క్రితం చనిపోతే తనపేరుమీద రెండు ఎకరాల భూమిని పోతీ కేసుపై మ్యుటేషన్ చేయడానికి డబ్బులు డిమాండ్ చేసినట్లు చెప్పారన్నారు. రేషన్ కార్డులో యాడింగ్, పట్టాదార్ పాసుపుస్తకాలు, పలు ధ్రువపత్రాలకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలువురు గ్రామస్థులు తెలియజేశారని అన్నారు. వీఆర్వోపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S SHRIRAM FINANCE LIMITED, BOBBILI Branch, Bobbili, I issue the following notice to general public. My client intends to grant loan to Mr. CHIKKALA ANIL, S/o. Late Ch. Gopi keeping the below mentioned schedule property of SMT. CHIKKALA NAGA MANI, W/o. Late Ch. Gopi as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Vizianagaram District, Bobbili Sub-District, Bobbili Mandalam, Komatipalli Gram panchayat and village accounts covered by S.No.25-4, Eastern side of road leading to Komatipalli to Kola Silarampuram village, **Plot Nos. 8&9** totaling 222.22 Sq.yards are measured and bounded by:

Plot No.8 Measuring East to West 20 feet or 6.10 meters and North to South 50 feet or 15.25 meters totaling 111.11 Sq. yards or 92.89 Sq. meters:

Plot No.9 Measuring East to West 20 feet or 6.10 meters and North to South 50 feet or 15.25 meters totaling 111.11 Sq. yards or 92.89 Sq. meters

Totaling 222.22 Sq. yards or 185.78 sq. meters into a single bit bounded by:

East	Plot No.10 site
South	Zeriothy dry land of Dalai Appala Naidu
West	Zeriothy dry land of Sunkalapalli Raghu Nadh Sai
North	30 feet wide road with drain.

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments,
Behind Rythu bazar,
Seethammadhara,
Visakhapatnam-13.
Visakhapatnam
Dt. 17.11.2025
Mobile No. 9885166648
Mail: sreenivaskoduri@gmail.com

PUBLIC NOTICE

Under the instructions of my client M/S SHRIRAM FINANCE LIMITED, BOBBILI Branch, Bobbili, I issue the following notice to general public. My client intends to grant loan to Mr. TENTU SAI ROHIT, S/o. T. Satyam Naidu by keeping the below mentioned schedule properties of Mr. TENTU SAI ROHIT S/o. T. Satyam Naidu, Mr. TENTU SAI DATH, S/o. Satyam Naidu & Mr. TENTU SATYAM NAIDU, S/o. Late Rami Naidu as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULES OF THE PROPERTY

Schedule No.01: (Property covered under document No.6366/2010 in the name of Mr. TENTU SAI ROHIT, S/o. T. Satyam Naidu)

Vizianagaram District, Bobbili Mandalam, Bobbili Sub-District, Bobbili Municipality, 1st ward, 5th block, Chikkavaram palace area, nearby D.No.5-1, Mallammapeta Village accounts covered by S.No.207 part, Plot Nos. 22,23, 24 total extents and Plot No.25 Northern part are measured and bounded by:

Item No.01: Plot No.22 measuring East to West 20 feet or 6.094 meters and North to South 60 feet or 18.288 meters totaling 133.33 sq. yards or 111.48 meters

Item No.02: Plot No.23 measuring East to West 20 feet or 6.094 meters and North to South 60 feet or 18.288 meters totaling 133.33 sq. yards or 111.48 meters

Item No.03: Plot No.24 measuring East to West 20 feet or 6.094 meters and north to South 60 feet or 18.288 meters totaling 133.33 sq. yards or 111.48 meters

Item No.04: Plot No.25 Northern part measuring East to West 60 feet or 18.288 meters and North to South 7 feet or 2.135 meters totaling 46.66 sq. yards or 39.01 meters: Item nos. 1 to 4 totaling 446.66 Sq.yards into a single bit bounded by:

East	40 feet wide road
South	Remaining part of Plot no.25 site
West	Plot Nos. 27 & 21 belongs to Penta Chinni Krishna and Ramba Lakshmum Naidu
North	40 feet wide road leading Raj Mahal

Schedule No.02: Property covered under document No.1263/201 inherited to Mr. TENTU SAI ROHIT, S/o. T. Satyam Naidu, Mr. TENTU SAI DATH, S/o. Satyam Naidu & Mr. TENTU SATYAM NAIDU, S/o. Late Rami Naidu)

Vizianagaram District, Bobbili Mandalam, Bobbili Sub-District, Bobbili Municipality, 1st ward, 5th block, Chikkavaram palace area, nearby D.No.5-1, Mallammapeta Village accounts covered by S.No.207 part, Plot No.25 Southern part an extent of 153.34 Sq. yards and Plot No.26 an extent of 200 Sq. yards totaling 353.34 Sq. yards or 295.43 Sq. yards together with RCC building consisting of ground floor with plinth area of 2404.87 SFT and first floor with plinth area of 2404.87 SFT bearing assessment No.1090011744 is bounded by:

East	40 feet wide road
South	30 feet wide road
West	Plot No.27 & 21 belongs to Penta Chinni Krishna and Ramba Lakshmum Naidu
North	Remaining part of plot No.25 belongs to T Sai Rohit

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments,
Behind Rythu bazar, Seethammadhara,
Visakhapatnam-13. Mobile No. 9885166648
Mail: sreenivaskoduri@gmail.com
Visakhapatnam
Dt. 17.11.2025

(c) eenadu

అసంపూర్తిగా బడి భవనం... అందులోనే పిల్లల భోజనం



ఒంగోలు నగరంలోని రాంనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు కింద ప్రారంభించిన భవన నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఇలా అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో వసతి లేక వీటి కిందే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
–ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

బీఎల్వోలకు సంజాయిషీ తాఖీదులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2002 నాటి ఓటర్ల జాబితాలో ప్రస్తుత జాబితాను పోల్చి అనర్హుల ఓట్లను తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా బీఎల్వోలు క్షేత్ర స్థాయిలో పునఃపరిశీలన కార్యక్రమం ద్వారా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అయితే కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన కొందరు బీఎల్వోల విధుల్లో నిర్లక్ష్య వైఖరి కారణంగా పురోగతిలో వెనుకబడి ఉంది. ఈ మేరకు నియోజకవర్గంలోని 120 మంది బీఎల్వోలకు సంజాయిషీ తాఖీదులు ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నేడో, రేపో కలెక్టర్ అనుమతితో జారీ చేయనున్నారు.

దివ్యాంగులైనా మామూలే.. ధ్రువపత్రాలకు మామూళ్లే!

కాళ్లు సరిగా లేక నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులపై ఎవరైనా దయ చూపుతారు. అలాంటిది వీరిపై రవాణాశాఖ అధికారులు మాత్రం కించిత్తు కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారు. డబ్బులిస్తేనే పని చేస్తాం.. అన్నట్లు వారిని పదే పదే కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారు. తాము నిర్ణయించిన రేటు ప్రకారం ముడుపులిస్తేనే పని అవుతుందనే ఖరాఖండిగా చెబుతున్నారు. రవాణాశాఖ అధికారులు, సిబ్బంది, దళారుల అక్రమ వసూళ్లపై విసిగిపోయిన దివ్యాంగులు ప్రజా సమస్యల పరిష్కారం వేదికకు వచ్చి జిల్లా ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు.
–ఈనాడు, ఒంగోలు

డబ్బులిస్తేనే డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు

రవాణాశాఖలో అడ్డగోలుగా అక్రమ వసూళ్లు

దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మూడు చక్రాల వాహనాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. నియోజకవర్గానికి 10 చొప్పున జిల్లాకు 80 వాహనాలు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తుతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ జత చేయాల్సి ఉంది. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు గడువు ముగియనుంది. దీంతో గత కొద్ది రోజులుగా దివ్యాంగులు రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దివ్యాంగులు నడవలేక ఆటోలు కిరాయికి పెట్టుకుని కార్యాలయానికి వస్తున్నా రవాణాశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ప్రతి పనికి రేటు నిర్ణయించి డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టు బడుతున్నారు.

ఇంత అమానుషమా.. ఒంగోలు నగరంలోని ఇస్లాంపేటలో ఒక కాలును కోల్పోయిన మహిళ డ్రైవింగ్ లైసెన్స్ మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆమె నాలుగు సార్లు రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లినా పని కాలేదు. సహాయకులు ఉంటేనే కదిలే ఆమె విషయంలోనూ లోపలికి వచ్చి వేలిముద్ర వేయాలని సిబ్బంది పట్టుబట్టడం గమనార్హం. వాస్తవానికి దివ్యాంగుల రాకపోకలకు ర్యాంపు సౌకర్యం ఉండాలి. లేకుంటే సంబంధిత ఉద్యోగి బయటకు వచ్చి వేలిముద్ర తీసుకోవాలని నిబంధన ఉంది. ఒక మహిళ, అందునా దివ్యాంగురాలైనా ఎలాంటి కనికరం చూపకుండా నిర్దయ వ్యవహరించడం గమనార్హం.

దళారుల నుంచి వస్తేనే.. రవాణాశాఖ కార్యాలయంలో ఏజెంట్లు ఉంటే వసూళ్లు భారీగా ఉంటున్నాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇక్కడ కూడా కొంత మంది కంప్యూటర్ సెంటర్ల నిర్వాహకులు దళారుల అవతారమెత్తారు. దళారుల వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అన్నీ ఆయనే చూసుకుంటారు. లేదంటే డ్రైవింగ్ లైసెన్స్ రావడం కష్టమవుతోంది. దళారులను ఆశ్రయించిన వారికి పనులు జరుగుతున్నాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని కలెక్టరేట్‌లో సోమవారం జేసీ గోపాలకృష్ణకు దివ్యాంగులు ఫిర్యాదు చేశారు. దరఖాస్తుకు సమయం తక్కువగా ఉన్నందున ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి లైసెన్స్‌లు మంజూరు చేయించాలని విన్నవించారు. దివ్యాంగులశాఖ వారు కోరితే ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని డీటీసీ సుశీల చెబుతున్నారు.

సంయుక్త కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు

ఆసుపత్రికొస్తే ఆరుబయటే

చిత్రంలో కనిపిస్తున్నవారు ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆరుబయట పడిగాపులు కాస్తున్న రోగుల కుటుంబ సభ్యులు, బంధువులు, సహాయకులు. జిల్లాకు గుండెకాయ లాంటి ఈ వైద్యశాలలో ఇన్‌పేషెంట్లు కోసం వచ్చిన వారికి ఇలా వరండాల్లో నేల పడకలు తప్పడంలేదు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో 400 ఇన్‌పేషంట్ పడకలుండగా, వీరికి సహాయకులుగా వచ్చిన వారు ఆరుబయట వరండాలో నిరీక్షించాల్సిందే. సహాయకులు ఉండడానికి ప్రత్యేకంగా గదిని నిర్మించాలని రూ.20 లక్షల అంచనాతో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ, ఇంతవరకు కార్యాచరణకు నోచుకోలేదు. –న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

22న ఉద్యోగ మేళా

అంజయ్య రోడ్డు (ఒంగోలు), న్యూస్‌టుడే: ఒంగోలులోని ఏకేవీకే డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 22వ తేదీన ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ తెలిపారు. ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9573798594, 7842004344 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

యువ నేస్తం... ఆపన్న హస్తం

ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ చేయూతనందిస్తున్నారు యువ నేస్తం ఫౌండేషన్ యువకులు. సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందు తున్నారు. టంగుటూరు, సింగరాయకొండ పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో ఇద్దరితో మొదలైన ఫౌండేషన్ నేడు 200 మందికిపైగా సభ్యులతో కొనసాగుతోంది. ఆకలితో అలమటించే అనాథలు, యాచకులు, వృద్ధులకు ప్రతి రోజూ భోజనం పెడుతూ ఆదుకుంటున్నారు. ప్రమాదాల బారిన పడినవారు, అనారోగ్యానికి గురైనవారు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వారికి రక్తదానం చేస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. ఇప్పటివరకు 1,248 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ప్రధానంగా మృతిచెందిన అనాథలు, యాచకులు, గుర్తుతెలియని వ్యక్తుల అంత్యక్రియలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. ఇప్పటివరకు 544 మందికి అంత్యక్రియలు నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహించడం, పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, మతిస్థిమితం లేని యాచకులకు సపర్యలు చేయడం, శ్మశానవాటికలు శుభ్రం చేయడం, పేదలకు నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేయడం, గర్భిణులకు పోషకాహారం అందించడం తదితర సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు.

ఇటీవల మొంథా తుపాను ధాటికి నిరాశ్రయులైన 2 వేల మంది ఎస్టీ, ఎస్సీలకు భోజన వసతి కల్పించారు. దాతలు, సభ్యుల సహకారంతో తాము సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంకిపల్లి బంగారు బాబు తెలిపారు.

–న్యూస్‌టుడే, టంగుటూరు, సింగరాయకొండ గ్రామీణం

జనం కన్నీళ్లకు చలించి.. జలం పరవళ్లు తొక్కించి!

జాతీయ జల పురస్కారం అందుకున్న రాజశేఖరరాజు

ప్రజలతో మమేకమై

బాల్యంలో తన గ్రామంలోని ప్రజలు తాగు, సాగునీటికి పడుతున్న కష్టాలు చూసి చలించిపోయారు. ప్రాణప్రదమైన జలం రోజురోజుకు అడుగంటిపోతుండడాన్ని గుర్తించి తట్టుకోలేకపోయారు. భూగర్భ జలవనరుల సంరక్షణకు నడుం బిగించి ఉద్యమిస్తున్నారు. నీటి పొదుపుపై గ్రామీణులకు అవగాహన కల్పించడంతోపాటు నీటి కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఈయన చేస్తున్న సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం 2024 జాతీయ జల పురస్కారానికి ఎంపిక చేసింది. ఆయనే దర్శి మండలం కొక్కెర కొండాయిపాలెంకు చెందిన పొదిలి రాజశేఖరరాజు. న్యూదిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

జల సంరక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న రాజశేఖరరాజు

గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరతను తగ్గించి వ్యవసాయాన్ని నిలబెట్టే లక్ష్యంతో రాజశేఖరరాజు చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర జలశక్తి, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీఆర్. పాటిల్ కొనియాడారు. –న్యూస్‌టుడే, దర్శి

వ్యవసాయ కుటుంబంలో జన్మించిన రాజు సోషల్ వర్క్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. 2005 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో జలవనరుల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 600 పైగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 105 వాటర్‌షెడ్ కార్యక్రమాల అమలులో భాగంగా 14 చెక్‌డ్యాంలు, 105 ఫారంపాండ్లు నిర్మించడంలో సాయమందించారు. తద్వారా భూగర్భ జలాల పెంపుదలకు శ్రమించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారు. ఈయన సేవలకు గుర్తింపుగా 2014లో జాతీయ గ్రీన్ టెక్ అవార్డు, 2018లో ఎకనామిక్ టుడే గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు, 2018లో జాతీయ అల్యుమనస్ అవార్డు, 2020లో వాటర్ హీరో, కొవిడ్ అవార్డులు, 2023లో ఇండియా రెస్పాన్సిబుల్ లీడర్ అవార్డులు దక్కాయి. తనకు దక్కిన పురస్కారాలు తన కృషికి కాదని, రైతుల కృషికి ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నట్లు రాజు చెబుతున్నారు. ప్రతి గ్రామం జలం స్వయంసమృద్ధికి నిదర్శనంగా మార్చడమే తన లక్ష్యమంటున్నారు.

ప్రజల నాడి పట్టారు

అదొక కుగ్రామం. మండల కేంద్రానికి శివారున ఉండే చిన్న పల్లెటూరు. కేవలం వంద కుటుంబాలు నివాసముంటున్నాయి. అయితేనేం సగం కుటుంబాల్లో వైద్యులుండడం విశేషం. ఆ గ్రామమే తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెం. కొన్ని దశాబ్దాల కిందట ఇక్కడవారు నాటు వైద్యం, ములలు, లూఠీల నివారణలో సిద్ధహస్తులు. కాలక్రమేణా తమ పిల్లలను వివిధ రకాల వైద్యవృత్తి కోర్సుల్లో చదివించడంతో వైద్యులుగా స్థిరపడ్డారు. ఇక్కడ ఎంబీబీఎస్ పట్టాలు పొందినవారు 27 మంది, ఎండీ పట్టాలున్నవారు ముగ్గురు, సర్జన్లు ముగ్గురు, బీడీఎస్ ముగ్గురు, బీహెచ్‌ఎంస్ అయిదుగురు మొత్తం 41 మంది వైద్యులుగా సేవలందిస్తున్నారు. వీరిలో ఇద్దరు విదేశాల్లో స్థిరపడగా, మిగిలినవారు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, బిహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, దిల్లీ ప్రాంతాల్లో వైద్యులుగా పనిచేస్తున్నారు.
–న్యూస్‌టుడే, తాళ్లూరు

ఎస్కలేటరు... చీకటి పడితే ఎక్కలేరు

చిత్రంలో కనిపిస్తోంది జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని రైలునిలయంలోని ఎస్కలేటరు. దీనిని ప్రయాణికుల సౌకర్యార్థం కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేయగా, రైల్వే అధికారులు పూర్తిస్థాయిలో వినియోగించడంలేదు. కేవలం పగటి వేళల్లో వినియోగిస్తూ రాత్రి వేళల్లో ఇలా నిలిపేస్తున్నారు. దీంతో ప్రయాణికులు చేసేది లేక ఆయాస పడుతూ మెట్లెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ లిఫ్ట్ సౌకర్యం ఉన్నప్పటికీ రద్దీ, అత్యవసర సమయాల్లో ఇక్కట్లు తప్పడంలేదు. 24 గంటలూ రైళ్లు తిరిగే ఈ మార్గంలో రాత్రి వేళల్లో ఎస్కలేటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, ఒంగోలు

వెలిగొండ సొరంగాల్లో డీవాటరింగ్ పూర్తి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల్లోని నీటిని బయటకు పంపి రెండో సొరంగంలో లైనింగ్ పనులు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సొరంగాల్లో నిలిచిన నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపే ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. రెండో సొరంగంలో అయిదు కిలోమీటర్ల మేర విద్యుత్తు అందించే పరికరాలను పరిశీలించారు. బుధవారం మరో అయిదు కిలోమీటర్లు పరిశీలించనున్నారు. గురువారం నుంచి లైనింగ్ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఈఈ కృష్ణారెడ్డి తెలిపారు.

లైనింగ్ పనుల కోసం సొరంగంలోకి వెళ్లేందుకు సిద్ధం చేసిన దారి

దేదీప్యమానంగా...

త్రిపురాంతకేశ్వరుని ఆలయంలో మంగళవారం రాత్రి కోటి దీపోత్సవం, కనుల పండువగా నిర్వహించారు. ఈవో అనిల్ కుమార్, ఆలయాల ఛైర్మన్ ఐవీ సుబ్బారావు, అర్చకులు ఆధ్వర్యంలో తూర్పు ద్వారం మెట్ల వద్ద నుంచి ఆలయం వరకు దీపాలు వెలిగించారు.
– న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

ఆపదలో ఆప్తమిత్రుడిలా...

చిత్రంలో కనిపిస్తోంది 16వ నంబరు జాతీయ రహదారి పక్కన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్ఓఎస్ బాక్సు. జాతీయ రహదారులపై అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీటిని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఏర్పాటు చేసింది. జిల్లాలో మద్దిపాడు, ఒంగోలు, టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మీదుగా వెళ్లే 16వ జాతీయ రహదారిపై 120 వరకు ఏర్పాటు చేశారు. వాహనదారులు ప్రమాదాలకు గురైనప్పుడు, వాహనాలు బ్రేక్‌డౌన్ అయినప్పుడు, ఇంధనం ఖాళీ అయినప్పుడు ఎస్ఓఎస్ బాక్సులను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. వీటిని అత్యవసర వేళల్లో వినియోగించుకునేలా బటన్, మైక్, స్పీకర్, జీపీఎస్ అమర్చి ఉంటాయి. వీటి పనితీరు సాధారణ చరవాణి కన్నా వేగంగా, భిన్నంగా, శరవేగంగా ఉంటుంది. సేవల నిమిత్తం బటన్ నొక్కిన వెంటనే టోల్‌ప్లాజా కంట్రోల్ రూంకు సమాచారం అందుతుంది. ఘటనకు సంబంధించి వివరాలు పోలీస్, హైవే పెట్రోలింగ్ వాహనాలు, హైవే అంబులెన్స్, అగ్నిమాపక దళాలకు శరవేగంగా అందుతాయి. వీటిపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతోంది. వీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. –న్యూస్‌టుడే, టంగుటూరు

విమానాశ్రయానికి రెక్కలు!

- డీపీఆర్ రూపకల్పనలో గుత్తేదారు సంస్థ
- టెండరు ప్రక్రియ పూర్తిచేసిన ఏపీఏడీసీఎల్

ఒంగోలు విమానాశ్రయం ఏర్పాటులో ఒక అడుగు ముందుకు పడింది. ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు ప్రైవేటు గుత్తేదారు సంస్థ రంగంలోకి దిగింది. సంస్థకు చెందిన సిబ్బంది విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతంలో సర్వే చేపట్టారు. డీపీఆర్ తయారైతే జిల్లా వాసుల గగనయానానికి వడివడిగా అడుగులు పడనున్నాయి.
–ఈనాడు, ఒంగోలు

కొత్తపట్నం మండలంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో దిల్లీ నుంచి వచ్చిన బృందం సానుకూలత వ్యక్తం చేసింది. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కేంద్ర బృందంతో చర్చలు జరిపారు. రన్‌వే ప్రతిపాదించినట్లుగా కాకుండా కొన్ని మార్పులు చేస్తే విమానాశ్రయం ఏర్పాటు సాధ్యమేనని సానుకూలత వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) రెండు నెలల కిందట డీపీఆర్ తయారీకి ప్రకటన వెలువరించింది.

కేంద్ర బృందంతో కలిసి విమానాశ్రయం పటం పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే జనార్దన్

మొదలైన సర్వే.. డీపీఆర్ రూపకల్పన పనులు టెండరులో దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ప్రతినిధులు గత వారం కొత్తపట్నం చేరుకుని జీపీఎస్ ఆధారిత సర్వే చేపట్టారు. భూముల విస్తీర్ణానికి సంబంధించిన సరిహద్దులు పరిశీలించారు. విమానాశ్రయానికి ప్రతిపాదించిన భూముల్లో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచిపోవడంతో మరోసారి సర్వే చేపట్టేందుకు రానున్నారు. వరదనీటి నిల్వల్లేని ప్రాంతాల్లో సర్వేను పూర్తి చేశారు. విమానాశ్రయం ఏర్పాటు ఎలాగనేది ఆ సంస్థ పూర్తి నివేదిక ప్రభుత్వానికి నివేదించనుంది.

తదుపరి భూసేకరణే.. విమానాశ్రయం ఏర్పాటుకు సుమారు 1,100 ఎకరాలు అవసరమని గుర్తించారు. ప్రస్తుతం 551 ఎకరాలు వాన్‌పిక్‌కు సంబంధించిన భూములున్నాయి. మిగిలింది కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరు, కొప్పోలు, పాదర్తి గ్రామాల్లో సేకరించాల్సి ఉంది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఎంత.. పట్టా భూమి ఎంత ఉందనేది రెవెన్యూ శాఖాధికారులు గుర్తించారు. ఈ మేరకు డీపీఆర్ తయారైతే తదుపరి భూసేకరణకు ప్రభుత్వం ప్రకటన వెలువరించనుంది. ఇప్పటికే గ్రామాల వారీగా ఎంత భూమి అవసరమన్నది గుర్తించి నందున పరిహారం లెక్కలు తేలిస్తే, భూసేకరణ సులువు కానుంది. భూమి అందుబాటులోకి వస్తే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

మహనీయులందరూ..

చీమకుర్తి ప్రధాన రహదారిలో పోలీసు ప్రాంగణం ముందు భాగం బొమ్మల సెంటర్‌గా పేరొందింది. జాతీయ స్థాయి నేతలతోపాటు మాజీ ప్రధానులు, ముఖ్యమంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల విగ్రహాలు కొలువు దీరడం ప్రత్యేకంగా నిలుస్తోంది. సుమారుగా 15 ఏళ్ల కిందట మొదటగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీల విగ్రహాలు కొలువు దీరాయి. ఆ తరువాత మాజీ ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిల విగ్రహాలు ఏర్పాటుచేశారు. మహాత్మగా పేరొందిన జ్యోతిరావుపులే, మాజీ ఉపప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్, విలువిద్యలో వాసికెక్కిన ఏకలవ్యుడు, కాపునేత వంగవీటి రంగా, మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి, గాన గంధర్వులుగా పేరొందిన ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, పౌరాణిక నాటక రంగంలో చీమకుర్తి ఖ్యాతిని ఇనుమడింప చేసిన చీమకుర్తి నాగేశ్వరరావు విగ్రహాలు కొలువు దీరాయి. జాతిపిత మహాత్మాగాంధీ, దేశ మొదటి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంల విగ్రహాలు ప్రారంభించాల్సి ఉంది. ఆయా నేతల జయంతులు, వర్ధంతుల సమయంలో నివాళులర్పించేందుకు వచ్చేవారితో ఈ ప్రాంతం సందడిగా ఉంటుంది.
–న్యూస్‌టుడే, చీమకుర్తి

స్టార్ హాస్పిటల్స్ వైద్యనిపుణులను ఇప్పుడు స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్, ఒంగోలులో సంప్రదించగలరు
STAR HOSPITALS Expertise • Excellence • Empathy Hyderabad
డా. విశ్వక్‌సేన రెడ్డి పి
MBBS, MS, MCh (Neurosurgery), Fellow in Neuroendoscopy, Trained in Minimally Invasive Brain & Spine Surgery
సీనియర్ కన్సల్టెంట్ - న్యూరో & స్పైన్ సర్జన్
మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
- వెన్నెముక సమస్యలు
- డిజెనరేటివ్ డిస్క్ సమస్యలు
- హెర్నియేటెడ్ డిస్క్
- లంబార్ స్పైనల్ స్టెనోసిస్
- పార్శ్వగూని వంటి వెన్నెముక వైకల్యాలు
- వెన్నెముక ఇన్ఫెక్షన్లు
- స్పాండిలోలిస్థెసిస్‌తో సహా వెన్నెముక అస్థిరత
- వెన్నుపూస కుదింపు పగుళ్లు
- వెన్నెముక కణితులు
డా. శ్రీనివాస రెడ్డి జి
MBBS, MD (Internal Med - Manipal), DM (Hepatology - ILBS, New Delhi), Fellow in Liver ICU & Transplant - King's Hospital, UK
కన్సల్టెంట్ - హెపటాలజీ & లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్
మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
- దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు
- కాలేయ క్యాన్సర్
- ఫ్యాటీ లివర్ డిసీజ్
- హెపటైటిస్ A,B,C,E
- ఆల్కహాల్ సంబంధిత కాలేయ వ్యాధి
- ఆటో ఇమ్యూన్ కాలేయ వ్యాధులు
- గాల్ బ్లాడర్ సంబంధిత వ్యాధులు
- లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్
20 నవంబర్, 2025 (ప్రతి నెల 3వ గురువారం అందుబాటులో కలరు)
ఉ॥ 10:00 - సా॥ 04:00
స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్
వేమూరి మెడికల్స్ వెనుక, సుందరయ్య భవన్ రోడ్, ఒంగోలు
అపాయింట్‌మెంట్స్ కొరకు, కాల్ చేయండి:
9063 443 707 | 9849 133 956
స్టార్ హాస్పిటల్స్: నానక్‌రామ్‌గూడ । బంజారాహిల్స్

(c) eenadu

డెయిరీలో పరికరాలను పరిశీలిస్తున్న ఫెడరేషన్ ఎండీ మురళీధర్, సిబ్బంది

జిల్లా పాల డెయిరీ పరిశీలన

పేర్నమిట్ట (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: ఏపీ డెయిరీ ఫెడరేషన్ అధికారులు జిల్లా పాల డెయిరీని పరిశీలించారు. ఫెడరేషన్ ఎండీ కె.మురళీధర్, డైరెక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్ జయచంద్ర, పలువురు సిబ్బంది డెయిరీని చూశారు. పాల ఉత్పత్తి, పాల ప్యాకెట్ల తయారీ, పాల శీతలీకరణం, పౌడర్ ప్లాంట్ బాయిలర్లు ఇలా అన్ని విభాగాలను తిరిగి పరిశీలించారు. వాటి స్థితిగతులపై అంచనా వేశారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎప్పటి నుంచి నిలిచింది, తిరిగి గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. ఇలా పలు అంశాలపై చర్చించారు. పరిశీలనలో డెయిరీ ఎండీ శ్రీనివాసరెడ్డి, సీఈవో రాజమోహన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేసు

వారం రోజుల్లో దరఖాస్తుల విచారణ పూర్తి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్ఐఆర్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న 6, 7, 8 దరఖాస్తుల విచారణ వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఆర్వో ఓబులేసు ఆదేశించారు. ఓటర్ల దరఖాస్తులపై ఒంగోలు నియోజకవర్గం బీఎల్వోలతో స్థానిక ప్రకాశం భవన్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో భాగంగా 2002 సంవత్సర ఓటర్ల జాబితాలోని పేర్లను 2025 జాబితాలోని ఓటర్లకు మ్యాపింగ్ ప్రక్రియ చేయాలని వివరించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా మృతులతోపాటు, డీలర్లుగా వలస వెళ్లిన వారిని గుర్తించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగోలు, కొత్తపట్నం తహసీల్దార్లు మధుసూదనరావు, శాంతి పాల్గొన్నారు.

మెప్మాలో చెక్కుల గోల్‌మాల్

- పోలీసులకు పీడీ ఫిర్యాదు

ఒంగోలు నేర విభాగం, న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో చెక్కుల గోల్‌మాల్ జరిగింది. ఒంగోలు అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా కార్యాలయంలో రూ.45 వేలకు సిద్ధం చేసిన చెక్కును చేజిక్కించుకున్న ఉద్యోగి ఒకరు దాన్ని రూ.4.50 లక్షలుగా మార్చి తన ఖాతాకు బదలాయించుకున్నట్లు గుర్తించారు. ఈ విషయమై ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి మంగళవారం స్థానిక ఒంగోలు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి కట్టా సునీల్ కుమార్ తన డాబాలోని డ్రాయర్‌లో ఉంచిన చెక్కులను అపహరించి వాటిని తన ఖాతాకు మళ్లించుకున్నట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పీడీ శ్రీహరి తమకు ఫిర్యాదు చేశారని, విచారణ జరుపుతున్నట్లు సీఐ వై.నాగరాజు తెలిపారు. ఈ ఉదంతంలో అధికారులు ఎదుర్కొంటున్న మెప్మా ఉద్యోగి సునీల్‌కుమార్ ఆరోపణలు చేస్తూ పీడీ శ్రీహరిపై ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిసింది.

స్నేహితుడికి తోడుగా వెళ్లి.. అనంతలోకాలకు..

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పెద్దదోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్డులోని తుమ్మలబైలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలవ్వగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరికి చెందిన స్వామి శివమాల తీసుకుని స్నేహితుడు బాజావలీతో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీశైలానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణమై శ్రీశైలం ఘాట్ రోడ్డులో వస్తూ తుమ్మలబైలు వద్ద మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న బాజావలీ అక్కడికక్కడే మృతి చెందగా, స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. కనిగిరిలోని ఓ పూల దుకాణంలో షేక్ బాజావలీ, స్వామి పనిచేస్తున్నారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు. మిత్రుడు స్వామి వెంట శ్రీశైలం వెళ్లివస్తూ మార్గమధ్యలో బాజావలీ ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. ఆతనికి భార్య ఉంది. ప్రమాదం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోగా, ఎస్సై మహేష్, సిబ్బంది వెళ్లి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బాజావలీ

చెరువుకట్ట సమీపంలో.. : పెద్దారవీడు : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పెద్దారవీడు చెరువుకట్ట సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..యడవల్లి గ్రామానికి చెందిన నల్లబోతుల శివ(23) మార్కాపురం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దారవీడు చెరువుకట్ట సమీపంలో ఎద్దులను ఢీకొట్టి రోడ్డుపై పడి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము, ప్రకాశం జిల్లా, ఒంగోలు
ఆర్.సి.నెం.పి5/53/2025 తేది.18.11.2025

షార్టు టెండరు ప్రకటన

ప్రకాశం జిల్లాలో గల యస్.సి., యస్.టి. మరియు బి.సి హాస్టల్స్ నందు, 2025-26 విద్యా సంవత్సరమునకు సంబంధించి 10వ తరగతి చదువుచున్న విద్యార్థినీ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులతో కూడిన స్టడీ మెటీరియల్ గల 2019 పుస్తకములు ప్రింటింగ్ చేయుటకుగాను (తెలుగు మీడియం 106 పుస్తకములను షుమారు 1000 పేజీలతో మరియు ఇంగ్లీషు మీడియం 1913 పుస్తకములను 1000 పేజీలతోను కవర్ పేజీలతో సహా) స్వంత ప్రింటింగ్ ప్రెస్ కలిగిన యాజమాన్యము వారి నుండి మరియు ఇతర స్టడీ మెటీరియల్ (Camlin Geometry boxes - 2019, Camlin Long Scales -2019, Rainbow Exam Pads - 2019, Aviva Sketch Pens Set- 2019, Pencils (@2 each) - 4038 and Cello Ballpoint Pens (Blue ink) (@2 each 4038) జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయమునకు నేరుగా స్వంత ఖర్చులతో బట్వాడా చేయుటకుగాను ఆసక్తి కలిగిన టెండరుదారుల నుండి షార్టు టెండర్లు దిగువ తెలిపిన ప్రకారము ఆహ్వానించడమైనది.

1. టెండరు షెడ్యూలు జారీ ప్రారంభపు తేది	:	19.11.2025
2. టెండరు షెడ్యూలు జారీకి ఆఖరు తేది	:	24.11.2025 సాయంత్రం గం.5.00 వరకు
3. టెండరు షెడ్యూలు దాఖలు చేయవలసిన తేది	:	25.11.2025 సాయంత్రం గం. 3.00 వరకు
4. టెండరు షెడ్యూలు తెరవబడు తేది	:	25.11.2025 సాయంత్రం గం. 4.00 లకు
5. టెండరు షెడ్యూలు ఖరీదు	:	రూ.10,000+1800 (జియస్‌టి 18%) =రూ.11800/-
6. స్టడీ మెటీరియల్‌నకు ఇ.యం.డి.	:	రూ.50,000/-

టెండరు షెడ్యూలు ఖరీదు మరియు ధరావత్తు (ఇ.యం.డి) చెల్లింపులకుగాను ఎవ్వరికినీ ఎలాంటి మినహాయింపులు లేవని తెలియజేయడమైనది మరియు టెండరుపై అంతిమ అధికారము ఈ క్రింద సంతకముదారునకు కలదు. అదనపు సమాచారము కొరకు కార్యాలయపు పని దినములలో సంప్రదించగలరు.

సం/- ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, ప్రకాశం జిల్లా, ఒంగోలు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9701112824
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008535779

న్యూస్‌టుడే, తాళ్లూరు

అక్కడ తలుపులు తెరవడమే గొప్ప!

- వారోత్సవాల వేళ సిబ్బంది లేక 25 గ్రంథాలయాల మూత

పాఠకులకు నిత్యం పుస్తక జ్ఞానాన్ని అందించాల్సిన గ్రంథాలయాలు సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. వారంలో కేవలం కొద్దిగా మాత్రమే సేవలందుతున్నాయి. మిగతా ఆరు రోజులు తెరవట్లేని పరిస్థితి ఉంది. కొందరు గ్రంథపాలకులు మూడు, మరి కొందరు రెండు చొప్పున లైబ్రరీల బాధ్యతలు నిర్వహించాల్సి వస్తున్నందున ఆ మేరకే తెరుస్తున్నారు. మిగతా రోజుల్లో మూత వేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.

అందుబాటులో ఉన్నచోటే..

చిన్నారుల్లో పుస్తక పఠనం పెంపొందించేందుకు.. వారు తరచూ గ్రంథాలయాలకు వచ్చేలా ఆసక్తి కలిగించేందుకు ఏటా నవంబరు 14 నుంచి 20 తేదీ వరకు వారం రోజులపాటు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం నిర్వహించే అదే రోజు నుంచి వారోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రంథాలయాలు 66 ఉన్నాయి. వీటిలో స్థాయిని బట్టి లైబ్రేరియన్‌తోపాటు అటెండర్, రికార్డు అసిస్టెంట్ తదితర సిబ్బంది 105 మంది వరకు ఉండాలి. రెగ్యులర్ లైబ్రేరియన్లు 30 మంది, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మరో పదకొండు కలిపి మొత్తం 41 మందే ఉన్నారు. దీంతో వారు

తాళ్లూరులో మూసి వేసి ఉన్న గ్రంథాలయం

అందుబాటులో ఉన్న 41 గ్రంథాలయాల్లోనే ప్రస్తుతం వారోత్సవాలు నిర్వహిస్తుండగా మిగిలిన 25 గ్రంథాలయాలు మూసి వేశారు. కనీసం వారోత్సవాలప్పుడైనా పుస్తక నిలయాలు మూత పడడం పట్ల ఆయా ప్రాంతాలకు చెందిన పాఠకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ.శివారెడ్డిని సంప్రదించగా.. సిబ్బంది అందుబాటులో ఉన్న గ్రంథాలయాల్లో వారోత్సవాలు చేస్తున్నామని, కొందరు ఐచ్ఛికంగా పని చేస్తున్నప్పటికీ ప్రధానమైన గ్రంథాలయాలను తెరిచి వారం రోజులపాటు ఒకటేలా నిర్వహించాలని సూచించామన్నారు. వచ్చే ఏడాది ప్రస్తుతం నిర్వహించిన చోట కాకుండా ఇతర చోట్ల నిర్వహించేలా చర్యలు చేపట్టి ప్రయోజనాలు కల్పిస్తామన్నారు.

స్వామిత్వ సర్వే నెలాఖరులోగా పూర్తి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నెలాఖరులోపు స్వామిత్వ సర్వే ఫేజ్-2 కింద 297 పంచాయతీల్లో గ్రామసభలు పూర్తి చేయాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఒంగోలు మండలం కరవది గ్రామంలో మంగళవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామిత్వ సర్వే ద్వారా గ్రామ కంఠంలో నివసిస్తున్న వారికి ఆస్తి యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో కొలతలు పూర్తయ్యాక యజమానుల నుంచి వచ్చే అభ్యంతరాల స్వీకరణ నిమిత్తం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రిజిస్టర్‌లో ప్రతి ఒక్క ఆస్తికి సంబంధించిన హద్దులు, వారి నివాసాలు, ఆధార్, చరవాణి నంబరు నమోదు చేస్తున్నారు. ఎక్కడైనా అభ్యంతరాలు వస్తే మరోసారి నోటీసు జారీ చేసి సర్వేయర్ ద్వారా కొలతలు వేయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, గ్రామ కార్యదర్శి పూర్ణచంద్రరావు, పంచాయతీ సర్పంచి డి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన రావాలి : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన రావాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. ఒంగోలు మండలం కొప్పోలు, కొత్తపల్లి గ్రామాల్లోని పారిశుద్ధ్య పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. జీవీఆర్ కాల్వ ద్వారా స్వచ్ఛతపై పర్యవేక్షణ సాగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి కుళాయిల వద్ద క్లోరినేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఇంటింటి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి అరుణ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అజయ్‌కుమార్

జన గణనలో.. కుల గణన చేపట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం దక్కాలంటే జనగణనలో కుల గణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని భాజపా ప్రభుత్వ హయాంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో భారత రాజ్యాంగం, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగుతోందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ మాట్లాడుతూ, కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని కోరారు. ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు, నల్లూరి మురళి, ఎం.అంజయ్య, సర్దార్, ఉప్పుటూరి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలోకి తగ్గిన సాగరు జల ప్రవాహం

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు బ్రాంచి కాలువ ద్వారా రామతీర్థం జలాశయంలోకి చేరుతున్న సాగరు జల ప్రవాహం తగ్గుతూ వస్తోంది. అదే సందర్భంలో దిగువకు నిరంతరాయంగా నీటిని విడుదల చేస్తుండటంతో రామతీర్థం నీటి మట్టం రోజు రోజుకు తగ్గుతోంది. ఈనెల పదో తేదీ ప్రాంతంలో రిజర్వాయర్‌లోకి 200 క్యూసెక్కులకు పైగా నీరు చేరింది. అప్పట్లో నీటి మట్టం 89.950 మీటర్లుగా ఉంది. మంగళవారం ఓబీసీ ద్వారా జలాశయంలోకి సుమారుగా 120 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చి చేరింది. దిగువకు 290 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా ప్రస్తుతం 83.450 మీటర్లుగా ఉంది. దిగువకు విడుదల చేసేందుకు 1.268 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది.

మున్సిపాలిటీకి డీఈ కావలెను!

జిల్లాలోనే రెండో ముఖ్య పట్టణం మార్కాపురం. దాదాపు లక్ష వరకు జనాభా ఉంది. పైగా డివిజన్ కేంద్రం. ఇలాంటి చోట మున్సిపాలిటీ కార్యాలయంలో 5 నెలలుగా డీఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో అధికారిక అనుమతులు జాప్యం ఏర్పడి అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. అదే విధంగా పట్టణంలో నీటి సరఫరా, నీటి నాణ్యత పర్యవేక్షణ వంటి కీలక పనులు చేయాల్సిన బాధ్యత ఆయనిదే. ఇలాంటి తరుణంలో ఇక్కడ పని చేస్తున్న డీఈ జూన్‌లో పదవీ విరమణ చేయగా..ఇంత వరకు కొత్త డీఈని నియమించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని డీఈని నియమించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

కార్యాలయంలో ఖాళీగా డీఈ కుర్చీ

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఈగల్ టీము అధికారి బి.రవిచంద్ర కోరారు. నషా ముక్త భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విద్యార్థులు, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆరోగ్యకర జీవనాన్ని సాగించేందుకు ప్రేరేపించే అంశాలతో ముద్రించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చేలో దాక్కున్నా.. దేహశుద్ధి తప్పలే..

- చోరీకి పాల్పడిన నిందితుడిని పట్టుకున్న గ్రామస్థులు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: పట్టపగలే ఇంటిలో చోరీకి పాల్పడిన వ్యక్తిని ముండ్లమూరు మండలం వేంపాడు వాసులు మంగళవారం పట్టుకొని దేహశుద్ధి చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్దిపాడు మండలం గడియాపూడికి చెందిన నవీన్ వేంపాడు ఎస్సీ కాలనీలోని ఓ ఇంటిలో చోరీకి పాల్పడ్డాడు. అక్కడ బీరువా పగలగొట్టడానికి ప్రయత్నించాడు. పర్సు దొరకడంతో బయటకు రావడాన్ని కాలనీ వాసులు గమనించి వెంబడించారు. గ్రామ సమీపంలో మొక్కజొన్న చేనులో దాక్కున్నాడు. గ్రామస్థులు వెతికి పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి నిందితుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- భర్త వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ మృతి చెందింది. భర్త వేధింపులే కారణమని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పాపిళ్లి మండలం డోణ గ్రామానికి చెందిన పెయింటర్ కొమ్మలపాటి విజయ్‌కుమార్ పెద్ద కుమార్తె మణి(25)కి అదే రాష్ట్రం ప్రకాశం జిల్లా గిద్దలూరు బసవపల్లె గ్రామానికి చెందిన చిదర్ల ధన్‌రాజ్(28)తో 2022 మే 26న వివాహం జరిగింది. కట్నంగా రూ.5 లక్షలు విలువైన గృహోపకరణాలు, 8 తులాలు బంగారం ఇచ్చారు. కొన్ని రోజులుగా మేడిపల్లి మండలం పర్వతాపూర్‌లో నివాసం ఉంటున్నారు. దంపతులకు మూడేళ్ల చిన్నారి ఉంది. ధన్‌రాజ్ రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని ఏఆర్ పోలీసు కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. చుట్టు పక్కల వారితో మాట్లాడితే అనుమానంతో వేధించేవాడు. భార్య పేరుతో ఉన్న ఇంటి స్థలం తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి పెంచాడు. ఇదే విషయంపై తనపై చేయి చేసుకున్నాడని.. ఫోన్ చేసి తండ్రికి చెప్పింది. సోమవారం మధ్యాహ్నం మీ కుమార్తె రేకుల షెడ్ ఇనుప రాడ్‌కు చీరతో ఉరి వేసుకుందని, మేడిపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ధన్‌రాజ్.. భార్య తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు మంగళవారం మేడిపల్లిలోని ఆసుపత్రికి వచ్చారు. చికిత్స పొందుతూ ఉదయం 10:30 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త పెట్టే వేధింపులు భరించలేక కుమార్తె చనిపోయిందని, మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: చిన్నారికట్ల విద్యుత్తు కేంద్రం సమీపంలోని ఎర్రవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. కొనకనమిట్ల ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలో ఓ మృతదేహం పడి ఉండగా..స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, పామూరు పట్టణం అంకాలమ్మ వీధికి చెందిన సోమిశెట్టి శ్రీరాములు (70)గా గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పొదిలి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో హోంగార్డు దుర్మరణం

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న **గరికె గాలెయ్య**(50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం ఉదయం విధులకు హాజరైన గాలెయ్య ఆరోగ్యం బాగోలేదని చెప్పి ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. డీఎస్పీ నాగరాజు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్వగ్రామమైన అర్ధవీడు మండలం వెలగలపాయలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రజా దర్బార్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

మార్కాపురం అర్బన్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మార్కాపురం పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక కంభం రోడ్డులో నివాసముంటున్న **దేవండ్ల సుజాత,** పాల వ్యాపారం చేసే జంకె కోటిరెడ్డికి సుమారు రూ.10 లక్షల విలువచేసే బంగారం, లక్ష నగదును విడతల వారీగా అప్పుగా ఇచ్చారు. నగదు తీసుకున్న తర్వాత కోటిరెడ్డి అదృశ్యమయ్యాడు. దీనిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఈ నేపథ్యంలో తన సమస్య చెప్పుకునేందుకు ఆమె మంగళవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ వద్దకు వచ్చారు. అక్కడ మనస్తాపానికి గురై తన వెంట తెచ్చుకున్న విష రసాయనం తాగారు. అక్కడున్న వారు హుటాహుటిన ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 650 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

నీటి నాణ్యత.. ఆరోగ్యానికి భద్రత

- జిల్లా పాఠశాలల నీటిలో ఫ్లోరైడ్ శాతం పరిశీలన

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఇటీవల జిల్లాలోని పాఠశాలల్లో ఉన్న నీటి వనరుల్లో ఫ్లోరైడ్ పరీక్షలు నిర్వహించి నివేదిక అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు జిల్లాలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో ఉన్న నీటి వనరుల వద్ద ఒక లీటరు నీటిని సీసాలతో తీసుకు వెళ్లి నియోజకవర్గం కేంద్రాల్లోని గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీటి నాణ్యత ప్రయోగశాలల్లో గత శనివారం నుంచి పరీక్షలు చేయిస్తున్నారు.

- న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

గిద్దలూరులోని ప్రయోగశాలలో నీటిని పరీక్షిస్తున్న సిబ్బంది

9పీపీఎం ఫ్లోరైడ్ ఉన్నట్లుగా గుర్తింపు

కలెక్టర గత గురువారం కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి కనిగిరి మండలంలోని కమ్మవారిపల్లె, ఎస్సీకాలనీ, దిరిశవంచ గ్రామాల్లో పర్యటించిన సమయంలో పాఠశాలల్లో వినియోగిస్తున్న నీటికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పరీక్షలు చేయించగా 9 పీపీఎం ఫ్లోరైడ్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లోని నీటి వనరుల్లో ఎంతమేర ఫ్లోరైడ్ ఉందో పరీక్షలు చేపట్టేందుకు నిర్ణయించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని పాఠశాలల్లోని నీటి వనరులను గిద్దలూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చారు. గిద్దలూరు మండలంలోని 54 పాఠశాలల్లోని నీటి వనరులను పరీక్షించగా బురుజుపల్లె తండా పాఠశాల సిబ్బంది అందజేసిన నీటిలో 2.07పీపీఎం, ఆదిమూర్తిపల్లె ఎంపీపీ పాఠశాలలోని నీటి వనరుల్లో 1.73 పీపీఎం, వేములపాడు పాఠశాలల్లోని నీటి వనరుల్లో 1.70 పీపీఎం, జె.పి.చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీటి వనరుల్లో 1.99పీపీఎం, పాలకవీడు ఎంపీపీ పాఠశాల నీటిలో 2.27 పీపీఎం ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. దీంతో ఆ నీటిని తాగునీటికి వినియోగించడం సురక్షితం కాదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రధానోపాధ్యాయులకు నివేదిక అందజేశారు. అంచనాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులకు శుద్ధ జలం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

వన్ సిట్టింగ్ డిగ్రీ, B.Tech, MBA, MCA, M.Sc, నర్సింగ్ కోర్సులకు గుజరాత్, సిక్కిం, అరుణాచల ప్రదేశ్‌లో ప్రముఖ యూనివర్సిటీల నుండి ఇప్పించబడును. ఒంగోలు 7093621555

PERSONAL CLASSIFIEDS

LOST

ప్రకాశంజిల్లా, నాగులుప్పలపాడు మండలం, హెచ్ నిడమానూరు గ్రామనివాసి ఆరి సుబ్బారావు గారి కుమారుడు ఆరి సింగయ్య, సెల్: 98480 69696, నా భార్య ఆరి అంజనీకుమారి గారి పేరున పెదగంజాంగ్రామంలో సర్వే నెం: 650/2, 49 1/2 సెంట్లుకు గాను విక్రయ దస్తావేజు 1179/1994 (అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు రిజిష్టరు కాబడినది). ది. 17-10-2025 వ తేదిన మా ఇంటి వద్దనుండి ఉప్పుగుండూరు గ్రామంకు బండిమీద వెళ్తుండగా మార్గమధ్యంలో నాబండి మీద ఉన్నసంచి జారి పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పైనతెలిపిన ఫోన్ నెంకు తెలియజేయగలరు.

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు కర్నూల్ రోడ్డు, మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ దగ్గర గుప్తాస్ అపార్ట్మెంట్ 2BHK 5వ అంతస్తు పడమర ఫేస్ 1250Sft అమ్మబడును. కార్‌పార్కింగ్ కలదు. నో బ్రోకర్స్. సెల్: 9247131337.

LAND FOR SALE

ఒంగోలు దగ్గరలోని పల్లూరు గ్రామంలో బెస్ట్ రెసిడెన్షియల్ ల్యాండ్ & అగ్రికల్చరల్ ల్యాండ్ అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 8074692009.

TO LET

COMMERCIAL

ఒంగోలు, ట్రంకురోడ్డులో 25వెడల్పుx30లోతు గల డూప్లెక్స్ A/c షోరూం (ఫర్నీచర్ కలదు) అద్దెకు ఇవ్వబడును. సెల్: 9247199009.

JOBS

Situation Vacant. 1) Ward Nurse (Male & Female) With Experience in Ward/ ICU/OT/Night Duties. 2) Pharmacist with Billing Exp. 3) Security Staff 9491666047, 9440942757.

ఒంగోలు, త్రోవగుంట ఆటోనగర్ ఎదురు హీరోస్పేర్ పార్ట్స్ డిస్ట్రిబ్యూటర్ ఆఫీసునందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్ ప్యాకింగ్ స్టాఫ్ కావలెను. . 9154882189, 9154882192.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్స్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:9703971968

DSA ఏజెన్సీ గుంటూరు నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99489 35789, 80081 00872.

నెల్లూరులోని ప్రముఖ మాల్‌లో క్రింది సిబ్బంది కావలెను. లాండ్రీ సూపర్‌వైజర్: ఆటోమేటిక్ వాషింగ్ మిషన్‌లో యూనిఫారమ్స్ వాషింగ్,ఇస్త్రీ చేయుటలో మంచి అనుభవము ఉండవలెను. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ :ఎత్తు 5'8 Ft (పురుషులు), 5.4 Ft. (స్త్రీలు) మంచి జీతం, PF, ESI, గ్రాట్యూటీ, వార్షిక బోనస్ ఇవ్వబడును. దూరప్రాంత అభ్యర్థులకు ఉచిత బ్యాచిలర్ వసతి, భోజనం కలదు. Cont: 79977 33000, 77949 99837

ఒంగోలులో గల కాలేజీ హాస్టల్ నందు ఉండి పనిచేయుటకు 50 సంవత్సరాల పైబడిన క్లీనర్, అటెండర్ & వాచ్‌మెన్‌లు కావలెను. భోజనము వసతి సదుపాయము కలదు. సంప్రదించవలసిన నెంబర్: 9440681862.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నిబంధనలు పాటించాలి

పొదిలి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని పొదిలి ఎస్సై వి. వేమన చెప్పారు. వీటివల్లే పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

త్రిపురాంతకం గ్రామీణం: త్రిపురాంతకం జడ్పీ పాఠశాలలో టీట్ టూల్ పరిశీలకులకు శిక్షణ తరగతులను కోర్సు డైరెక్టర్, ఎంఈవో కేటీ మల్లికార్జున నాయక్ మంగళవారం ప్రారంభించారు. బోధన విధానంలో కొత్త మార్పులతో పాటు అభ్యసన విధానాన్ని మెరుగుపర్చుకోవడానికి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనర్లు ఏ.శ్రీనివాసరావు, బీవీ నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

బయోమెట్రిక్ తప్పనిసరి

బేస్తవారపేట: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం మార్కాపురం డివిజనల్ అభివృద్ధి అధికారి బాలునాయక్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయ సిబ్బంది అందరూ తప్పకుండా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రంగనాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మార్కాపురం డివిజనల్ అభివృద్ధి అధికారి బాలూనాయక్

ఇదీ ఉద్యానవనం సొగసు !

మోక్షగుండం సమీపంలోని ముక్తీశ్వరాలయానికి వెళ్లే దారిలోని పల్లె పార్కు కళావిహీనంగా మారింది. గత తెదేపా హయాంలో రూ.లక్షలు ఖర్చు చేసి ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటుచేశారు. పలు రకాల మొక్కలు, బెంచీలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. వైకాపా పాలనలో నిర్వహణ విస్మరించడంతో ఇది కాస్తా చిల్లచెట్లకు నిలయంగా మారింది. వెంటనే మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

అలంకారప్రాయంగా జనరేటర్

పదిహేనేళ్ల క్రితం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినియోగించేందుకు ఏర్పాటుచేసిన జనరేటర్ అలంకారప్రాయంగా మిగిలింది. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేయగా, నిర్వహణ పట్టించుకోకుండా కార్యాలయం బయట ఉంచారు. దీంతో ఎండకు ఎండి వానకు తడిసి శిథిలమవుతోంది. అధికారులు వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బంది కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కొనకనమిట్ల

ఆదమరిస్తే అంతే సంగతులు

పొతూరులోని సాయిబాబా దేవాలయానికి వెళ్లే ప్రధాన మార్గంలో ముప్పు పొంచి ఉంది. ఆర్చి మలుపు వద్ద కల్వర్టుకు ఓ వైపు కన్నం పడింది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పిల్లలు అందులో పడే ప్రమాదముంది. అక్కడే మరోవైపు తాగునీటి పైపులైను లీకై నీరు వదిలినప్పుడల్లా వృథాగా రోడ్డు పాలవుతోంది. ఈ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే,పొదిలి

ఎమ్మెల్యే ముత్తుముల సమీక్ష

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకంపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మంగళవారం వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలోని 37,649 మంది లబ్ధిదారులకు, పీఎం కిసాన్ పథకం ద్వారా 32,762 మంది లబ్ధిదారులకు నిధులు జమ అవుతాయని వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు కె. రాజశ్రీ తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు భాస్కర్‌రెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రూ. 25 కోట్ల అన్నదాత నిధుల విడుదల

రాచర్ల, కంభం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు రూ. 25 కోట్లు విడుదలయ్యాయని, అవి లబ్ధిదారుల ఖాతాలకు జమ అవుతాయని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి అన్నారు. రాచర్ల, కంభం రైతుసేవా కార్యాలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కడప జిల్లాలో మంగళవారం నిర్వహించే కార్యక్రమంలో నిధులు విడుదల చేస్తారన్నారు. కంభం తహసీల్దార్ కిరణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంభం : అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బేస్తవారపేట, న్యూస్‌టుడే : బేస్తవారపేట, పాపాయిపల్లి గ్రామాల్లోని విద్యుత్తు పరివర్తకాలకు 11 కేవీ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయనున్న దృష్ట్యా బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ సన్యాసిరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రాళ్లే ఆధారం...జారితే ప్రమాదం

పెద్దారవీడు, న్యూస్‌టుడే: మండలంలోని గుండంచర్ల ఎస్సీ కాలనీలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన ఈ పరివర్తకం ఏళ్లుగా ప్రమాదకరంగా ఉంది. డ్రైనేజీ నిర్మాణంలో వినియోగించే రింగులు ఏర్పాటు చేసి దానిపై చిన్న రాళ్ల సాయంతో నిలబెట్టిన ఈ పెద్ద పరివర్తకం గ్రామ మొత్తానికి విద్యుత్తు సరఫరా చేస్తుంది. ప్రస్తుతం దుస్థితికి చేరి పడిపోయే పరిస్థితుల్లో ఉంది. ప్రమాదం జరగకముందే విద్యుత్తు అధికారులు స్పందించి దిమ్మె నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్తిగా ధ్వంసమై రాళ్ల సాయంతో దిమ్మెపై నిలబడి ఉన్న పరివర్తకం

నిర్వహణ దూరమై..చీకట్లు చేరువై..

❖ పురంలో విద్యుత్తు కష్టాలు

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం : మార్కాపురం పట్టణ, శివారు ప్రాంత వాసులను నిత్యం విద్యుత్తు సమస్యలు వేధిస్తున్నాయి. కొన్నిచోట్ల విద్యుత్తు దీపాలు లేవు. మరికొన్నిచోట్ల ఉన్నా వెలగవు. దీనికితోడు లో ఓల్టేజీ సమస్య కూడా వెంటాడుతోందని స్థానికులు వాపోతున్నారు.

తరచూ విద్యుత్తు సరఫరా నిలిచిపోతున్న పెద్దయాచవరం ప్రాంతం

తరచూ సరఫరా నిలిచిపోయి..

మార్కాపురం పట్టణ శివారు ప్రాంతాల్లో విద్యుత్తు సమస్య తీవ్రంగా ఉంది. రాజ్యలక్ష్మి కాలనీ, లింగారెడ్డి కాలనీ, కొండేపల్లి రోడ్డులోని వివిధ ప్రాంతాల్లో తరచూ సరఫరా నిలిచిపోతోంది. విద్యుత్తు తీగల చుట్టూ పిచ్చి మొక్కల తీగలు అలుముకున్నా జంగిల్ క్లియరెన్స్ చేయడం లేదు. మార్కాపురం చెరువు కట్టపై విద్యుత్తు స్తంభాలు వాలిపోయి..నేటికీ అధికారులు సరిదిద్దలేదు. జీసెం గుండక్కమ్మ వంతెన మీద ఉన్న విద్యుత్తు దీపాలు కూడా వెలగడం లేదు. సుందరయ్య కాలనీకి వెళ్లే దారిలోనూ ఇదే దుస్థితి నెలకొంది. విద్యుత్తు సరఫరా నిలిచిపోతుండటంతో పిల్లల చదువులపై ప్రభావం పడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇళ్ల వద్ద చిరు వ్యాపారాలు నిర్వహించే వారికి తీవ్ర అసౌకర్యంగా మారిందని వారంటున్నారు. సత్వరం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

పెద్దయాచవరంలోని ఎస్సీ కాలనీలో ఏడాది నుంచి విద్యుత్తు సమస్య తీవ్రంగా ఉంది. పరివర్తకంలో సాంకేతిక లోపాల కారణంగా తరచూ సరఫరా నిలిచిపోతోందని వారు చెబుతున్నారు. లోవోల్టేజీ వల్ల తరచూ విద్యుత్తు దీపాలు, ఫ్యాన్లు, టీవీలు దెబ్బతింటున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. దీనిపై విద్యుత్తు ఏఈ నాగేంద్రరెడ్డిని వివరణ కోరగా..పనులు చేపడుతుండటం వల్ల సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానన్నారు.

సర్పంచి తండ్రిపై చర్యలకు వినతి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: నాణ్యత లేని మధ్యాహ్న భోజనం అందిస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేస్తున్న బేస్తవారపేట సర్పంచి తండ్రి బుడ్డల ప్రేమానందంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు కార్మిక సంఘం కార్యదర్శి ఎం.మంజువాణి, అధ్యక్షులు డి.పాశ్చామియా ఆధ్వర్యంలో ఎంఈవో-2 రమణారెడ్డికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు.

PUBLIC NOTICE

Under the instructions of my client Shriram Finance Ltd., Rep by it's Branch Manager **Markapur** Branch, Prakasam District, I issue the following **PUBLIC NOTICE** to General public.

One **Lingala Krupadanam,** S/o Samuel, Door No. 1-350-L35, Sundaraiah Colony, **MARKAPUR** Town, Post and Mandal, Prakasam District **intends** to create Equitable Mortgage over the following schedule property of **him.** As such if any one have any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes etc should be informed by them to me within seven days from the date of this public notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE: Prakasam District Markapur Registration District, Podili Sub - District, Markapur Mandal, in Rayavaram Grama Panchayath, in Rayavarm Village, Vacant site bearing Plot No.3 measuring East to West: 57 feet, North to South: 18 feet, to the extent of 114 Sq.yrds with normal Easement rights of way out of the plots formed in Sy.No.7/1, Bounded by **East:** 20 feet width road, **South:** Vacant site bearing Plot No. 2 of Policherla Ananda Rao, **West:** Vacant site bearing Plot No. 6 of Darivemula Elijar, **North:** Vacant site bearing Plot No.4 of Yelakapati moses.

Sd/- **SHAIK YUSUF ALI**, B.Com., LL.B.,
Advcoate & Legal Adviser for
Shriram Finance Ltd.,
10th ward Markapur 533 316
Prakasam District. Cell No. 94405 65787

Markapur,
Dt:18.11.25

బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈవో బి.మస్తాన్‌నాయక్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రెండు రోజుల టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించేందుకు ప్రభుత్వం ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు రహమత్, బాలకృష్ణనాయక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client Shriram Finance Ltd., Rep by it's Branch Manager **Markapur** Branch, Prakasam District, I issue the following **PUBLIC NOTICE** to General Public.

One **Bapathu Chenna Reddy,** S/o Brahma Reddy, Door No. 2-17, Y.S.R.Nagar, Cheemakurthy Town, Post and Mandal, Prakasam District **intends** to create Equitable Mortgage over the following schedule property of **him.** As such if any one have any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes etc should be informed by them to me within seven days from the date of this public notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE: Prakasam District Cheemakurthy Sub - Registration Ilakha, Cheemakurthy Mandal, In Cheemakurthy Nagara Panchayath Area, In Cheemakurthy Village Sy.No. 248/1, Resurvey No. 248/1C, Vacant site to the extent of Ac. 0-17 cents or 0.068 Hectors or 822.8 Sq.Yrds, Bounded by **East:** Land of Sami Granites, **South:** Land of Shaik Gouse Saheb, **West:** Land of Shaik Daara Saheb, **North:** N.S.P. Canal Road and

Tin Sheet Shed measuring 102 feet x 30 feet to the extent of 3060 Sq.feet constructed and existing therein and RCC Slab Ground Floor for labour room constructed therein measuring 120 feet x 20 feet to the extent of 400 sq.feet and Tin sheets office room constructed thereon measuring 20 feet x 20 feet to the extent of 400 Sq.feet with Current Meter SC No. 4344106009 387.

Sd/- **SHAIK YUSUF ALI**, B.Com., LL.B.,
Advcoate & Legal Adviser for
Shriram Finance Ltd.,
10th ward Markapur 533 316
Prakasam District. Cell No. 94405 65787

Markapur,
Dt:18.11.25

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

పెద్దారవీడు, న్యూస్‌టుడే:

?: గ్రామంలోని చెత్తను రోడ్డు పక్కనే కుప్పలుగా పోస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే దుర్వాసన వస్తోంది. చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించాలి.
– పి.అనిల్‌కుమార్, సుంకేసుల

✓: సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. రోడ్డు పక్కన చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తాం.
– జాన్ సుందరం, ఎంపీడీవో, పెద్దారవీడు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని ప్రధాన జాతీయ రహదారి ఆంధ్రాబ్యాంకు ప్రాంతంలో వీధిలైట్లు వెలగడం లేదు, సమస్యను పరిష్కరించగలరు.
– మదార్, స్థానికుడు

✓: కొత్త విద్యుత్తు స్తంభాలు వేస్తున్నందున కనక్షన్ తీసేస్తున్నారు. తిరిగి ఏర్పాటు చేస్తాం.
– రామసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి

మోదీ హయాంలో బడుగులపై పెరిగిన దాడులు

మార్కాపురం అర్బన్: దేశంలో దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్న వర్గాలపై ఈ దాడులు మరింతగా పెరగడం ఆందోళన కలిగిస్తోందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేవీ. కృష్ణగౌడ్ అన్నారు. మణిపూర్, ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో మత ఘర్షణల వల్ల వేలాదిమంది అమాయక ప్రజలు మృత్యువాత పడ్డారన్నారు. నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు అందె నాసరయ్య, ఏలూరి వెంకటరెడ్డి, డాకాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

రైతుల అభ్యున్నతికి కృషి

రాచర్ల, న్యూస్‌టుడే : రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు కృషి చేయాలని మార్కాపురం డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి పి.రాజశేఖర్ అన్నారు. రామాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వారోత్సవాలను మంగళవారం మేడంవారిపల్లి గోదాం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆవిర్భావం, ప్రాముఖ్యత, సొసైటీ సూత్రాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. సంఘం ఛైర్‌పర్సన్ భవనం పుల్లారెడ్డి, డైరెక్టర్ బోగోలు నారాయణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి రాజశేఖర్

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఈ నెల 17న మార్కాపురంలో జరిగిన స్కూల్‌గేమ్ పోటీల్లో రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 బాలుర విభాగంలో అజయ్, అనిల్; అండర్ 14లో నోమన్, బాలికల విభాగంలో మల్లిక, శ్రావణి, దేవీబాయి, సుస్మిత ఎంపికయ్యారు. వారిని ఎంఈవో ఆంజనేయులు, హెచ్ఎం ఖాసీం అభినందించారు.

త్రిపురాంతకం గ్రామీణం: వెల్లంపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్.మౌనిక, డి.చందు అండర్-14 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గోప వనిత, పీడీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఖోఖో పోటీలకు గణపవరం జడ్పీ పాఠశాలకు చెందిన వి.రజని, ఎన్.వైష్ణవి, పి.కుమారి, బి.సునీత, టి.శాంతి, పి.స్వాతి, ఎల్.వెంకట రజిత, ఎస్.కృష్ణ సరిత, పి.పావని, వి.శివ వైష్ణవి, ఎల్.నాగమణి, వి.శివమణి, కె.వైష్ణవి లక్ష్మి తదితరులు ఎంపికైనట్లు హెచ్ఎం ఆనందరావు, పీడీ బాలరాజు తెలిపారు.

బేస్తవారపేట: మండలంలోని పూసలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సాల్వ పద్మప్రియ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని బొల్లా పద్మావతి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా సోమవారం మార్కాపురంలో నిర్వహించిన డివిజన్ స్థాయి కబడ్డీ అండర్-17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు పీడీ రాజశేఖర్‌ను ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

వినతి పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 103 అర్జీలు రాగా అందులో కొన్నింటికి అక్కడే పరిష్కారం చూపినట్లు ఎమ్మెల్యే వివరించారు. మరికొన్ని సమస్యలను వచ్చే 15రోజుల్లో పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

సొసైటీ అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

పెద్దదోర్నాల: భుజానికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న దోర్నాల సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డిని, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు మహేష్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

కంభం, న్యూస్‌టుడే : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంఈవో -1 అబ్దుల్ సత్తార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నషా ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పొగాకు, మత్తు పదార్థరహితంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురికి గాయాలు

పెద్దదోర్నాలలో క్షతగాత్రులకు చికిత్సలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ న్యూ ఆటోనగర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్న 20 మంది సిబ్బంది మంగళవారం ఉదయం మినీ లారీలో శ్రీశైలం మల్లన్న దర్శనానికి బయలుదేరారు. పెద్దదోర్నాల అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోకు దారిచ్చే క్రమంలో మినీ లారీ అదుపు తప్పి పడిపోయింది. ఈ సంఘటనలో భవానీ, నాగమణి, సుభానీ, ఆనంద్, భాగ్యలక్ష్మి, వనజ, ధనుష్, లోకేశ్, నీరజకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై మహేష్ ప్రమాదానికి గల కారణాలను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కంభం, న్యూస్‌టుడే : కంభం మండలం కందులాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. విజయవాడకు చెందిన కార్తిక్ ద్విచక్ర వాహనంపై కంభం వస్తూ..అదే మార్గంలో వెళుతున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి.

దరిమడుగు వద్ద..: మార్కాపురం అర్బన్ : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో వేములకోటకు చెందిన దూదేకుల తుమ్మల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పొదిలి: పొదిలి శాఖ గ్రంథపాలకుడు శ్యాంసన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'గ్రంథాలయాల ప్రాముఖ్యత' అన్న అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకుడు శ్యాంసన్ తెలిపారు. శ్రీవిద్య, షకీలా పర్యవేక్షించారు.

త్రిపురాంతకం: గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలుగా ఉపయోగపడతాయని గ్రంథపాలకుడు రామాంజి నాయక్ పేర్కొన్నారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా త్రిపురాంతకంలోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

23న సత్యసాయి జయంతి వేడుకలు

మార్కాపురం అర్బన్: భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న అధికారికంగా నిర్వహించడం ఆనందకరమని పట్టణంలోని శ్రీసత్యసాయి సేవా సమితి ట్రస్ట్ కన్వీనర్ శీలం రామకృష్ణారెడ్డి అన్నారు. ఆ రోజున స్థానిక ఎన్ఎస్ నగర్‌లోని జ్ఞానసదన్‌లో వివిధ ఆధ్యాత్మిక, వ్యాసరచన పోటీలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

విశ్వేశ్వరునిపై ఆదిత్య కాంతులు

రాచర్ల, న్యూస్‌టుడే : స్థానిక పంచాయతీలోని చెరువు కట్ట వద్ద ఉన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాన్ని మంగళవారం సూర్య కిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు పులకించారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి పూజలు చేశారు.

మార్కండేశ్వరునికి..: మార్కాపురం పట్టణం : మార్కండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వైభవంగా కల్యాణం : పొదిలి: పొదిలిలోని పార్వతీ సమేత నిర్మమహేశ్వరుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంగళవారం వేద పండితులు ఉభయదాతలతో కల్యాణం జరిపించారు. దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



పార్వతీ పరమేశ్వరులు

త్రిపురాంతకేశ్వరుని సన్నిధిలో ..

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు మంగళవారం త్రిపురాంతకం ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో అనిల్ కుమార్ ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. త్రిపురాంతకేశ్వరుని వద్ద అభిషేకాలు, బాలాత్రిపురసుందరీదేవి వద్ద కుంకుమార్చన పూజలు చేసిన తర్వాత అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు.

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

మాటలతో మెప్పించి.. బహుమతి సాధించి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తాయని సింగరాయకొండ స్మార్ట్ జెన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.గీతా రాణి తెలిపారు. ఈ కళాశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో షేక్ అంజూఫర్వీన్, షేక్ షఫియా, బి.పూజిత లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్‌తోపాటు, అధ్యాపకులు సాయి, రవిశంకర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్మార్ట్‌జెన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గీతారాణి, అధ్యాపకులు

బయోగ్యాస్ ప్లాంటుతో రైతులకు ఆదాయం

పీసీపల్లి: రైతుల ఆదాయం కోసమే రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామని, వారికి ఇష్టం ఉంటేనే ఆ సంస్థ ప్రభుత్వ, రైతుల భూములు కౌలుకు తీసుకుంటుందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నేరేడుపల్లి, గుంటుపల్లిలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల ఈ ప్లాంటు కోసం ప్రభుత్వ భూములను గుర్తించేందుకు రెవెన్యూ అధికారుల బృందం వెళ్లగా.. ఆయా గ్రామాల రైతులు అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఇస్తే తమ జీవనాధారమైన పాడి పశువులు మేపుకొనేందుకు ఇబ్బందులు పడతామని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కౌలుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న రైతుల నుంచి వివరాలు నమోదు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తహసీల్దార్ ఉష, తెదేపా మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, నాయకులు బాలసుబ్బయ్య, సర్పంచి మల్లికార్జున పాల్గొన్నారు.

నేరేడుపల్లిలో రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

తెదేపాలో చేరిన పీసీపల్లి సర్పంచి..

పీసీపల్లి సర్పంచి తాళ్లూరి మరియమ్మ వైకాపాను వీడి తెదేపాలో చేరారు. మంగళవారం కనిగిరి అమరావతి మైదానంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు కంచర్ల వెంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు మర్రిపూడిలో 'అన్నదాత సుఖీభవ' సభ

మర్రిపూడి, న్యూస్‌టుడే: పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బుధవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నాయి. మర్రిపూడిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, జిల్లా కలెక్టర్ రాజాబాబు పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సభ ఏర్పాటు చేస్తున్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.310

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో గరిష్ఠ ధర రూ.310 పలికింది. జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 898 బేళ్లను తీసుకురాగా.. 691 బేళ్లను కొనుగోలు చేశారు. 207 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.50, సరాసరి ధర రూ.143 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

● కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో మంగళవారం 1,081 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1,394 అమ్మకానికి తీసుకురాగా, అందులో 1081 కొన్నారు. మిగిలిన 313 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ. 310, కనిష్ఠ ధర రూ.50 పలికిందన్నారు.

మీ ప్రయాణం సుఖవంతమవుతుంది!

❑ సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం ❑ 'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో కనిగిరి ఆర్టీసీ డీఎం సయానాబేగం

ప్రయాణికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజరు మహమ్మద్ సయానాబేగం తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో డీఎంతో మంగళవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాల నుంచి 45 మందికి పైగా ప్రయాణికులు స్పందించి ఆర్టీసీ ప్రయాణంలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. వీటన్నింటినీ ఎంతో శ్రద్ధగా విన్న ఆమె వాటిని ఆర్టీసీ సిబ్బందితో వెంటనే నమోదు చేయించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చోట ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరిస్తామని ఆమె తెలిపారు.

-న్యూస్‌టుడే, కనిగిరి

?: సమస్య: పామూరు మండలం అయ్యన్నకోట, అయ్యవారిపల్లి, బోదవాడ వెళ్లే బస్సు సాయంత్రం ఆలస్యంగా వస్తుంది. బొట్లగూడూరు హైస్కూల్ వద్దకు వచ్చే సరికి 6 గంటలవుతుంది. దీంతో దూరం ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 5 గంటలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. – అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి

✓: డీఎం: మా కంట్రోలర్‌ను పంపించి అక్కడి పరిస్థితులు అధ్యయనం చేసి బస్సు వేళలు మార్పిస్తాం.

?: వెలిగండ్ల మండలం గుమ్మళ్లకర్ర గ్రామానికి ఇంత వరకు ఆర్టీసీ బస్సు నడపలేదు. దీంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. సీఎస్‌పురం మండలం వెంకటాయచెరువుకు బస్సు సౌకర్యం కల్పించాలి. - ముక్కు రామాంజనేయరెడ్డి, డి.చిన్నయ్య, వీరబ్రహ్మం, వెంకటేశ్వర్లు

✓: అక్కడకు వచ్చి పరిశీలించి అవసరమైతే బస్సు సర్వీసు నడుపుతాం.

?: సీఎస్‌పురం నుంచి కనిగిరి రావాలంటే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గాని బస్సులు లేవు. దీంతో ప్రయాణికులు, ఈ ప్రాంతంలోని పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాయంత్రం 4 గంటలకు బస్సును ఏర్పాటు చేయాలి. -సుప్రజ, ప్రసాద్

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి బస్సు సర్వీసు పునరుద్ధరిస్తాం.

?: వెలిగండ్ల మండలం బోదవారిపల్లెకి వచ్చే బస్సు కొటాలపల్లి వద్ద ఆపడం లేదు. కనిగిరి మండలం బాలవెంకటాపురం కొత్త కాలనీ వద్ద కూడా బస్సు నిలపడం లేదు. విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. -రూబేను, ప్రియాంక, కొండలరావు

✓: పరిశీలించి బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటాం.

?: కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్‌లో షెల్టర్ లేదు. రాత్రి 7 గంటల తరు

?: పామూరు మండలం అయ్యవారిపల్లికి బస్సు రావడం లేదు. సమీపంలో అచ్చమ్మపల్లి దర్గా వద్దకు వస్తుంది. అక్కడి నుంచి కిలోమీటరు మేర గ్రామంలోకి నడవాలి. -మార్నేని రమాకృష్ణ

✓: అక్కడి పరిస్థితులను పరిశీలించి అవకాశం ఉంటే అయ్యవారిపల్లి వరకు బస్సులు నడుపుతాం.

వాత పొదిలి నుంచి కనిగిరికి బస్సు లేదు. - సీహెచ్. సుబ్రహ్మణ్యం

✓: పామూరు బస్టాండ్‌లో బస్ షెల్టర్ ఉంది. విజయవాడ నుంచి వచ్చే ప్రతి బస్సు పొదిలిలో ఆగుతుంది. పొదిలి డిపో నుంచి ఆర్డినరీ సర్వీసులు నడుపుతున్నారు.

?: సీఎస్‌పురం మండలం పెదరాజుపాలెం గ్రామానికి పది సంవత్సరాలుగా బస్సు నడపడం లేదు. దీంతో ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. సీఎస్‌పురం-సీతారామాపురం బస్సు సర్వీసును నడపాలి. –నాగార్జున, నాగరాజు నాగూర్‌వలి

✓: వెంటనే మా సిబ్బందిని పంపించి బస్సు సర్వీసును పునరుద్ధరిస్తాం.

?: పామూరులోని బస్టాండ్ చుట్టుపక్కల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. సెప్టిక్ ట్యాంకు నిండిపోయి దుర్వాసన వస్తుంది. – శ్రీను, వీరస్వామి

✓: చుట్టు పక్కల ఉన్న స్థలం అభివృద్ధికి టెండర్లను పిలిచాం. సెప్టిక్ ట్యాంకును కూడా శుభ్రం చేయిస్తాం.

అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

దర్శి, న్యూస్‌టుడే: అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. పట్టణ పరిధిలోని శివరాజ్‌నగర్‌లో రూ.39 లక్షలు, సాయినగర్‌లో రూ.37 లక్షల వ్యయంతో సైడు కాలువల నిర్మాణానికి మంగళవారం ఆమె భూమి పూజ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను ప్రారంభించారు. దర్శి పట్టణాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేయగా, సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా మార్పు చేయడంతో పాటు అదే స్థాయిలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేష్, ఏఈ శ్రీరామమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు భూమిపూజలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు, లలిత్‌సాగర్ తదితరులు

రంగా విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ..

దర్శిలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద వంగవీటి రంగా, కనకం వెంకయ్య విగ్రహాల ఏర్పాటుకు గొట్టిపాటి లక్ష్మి భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే పాపారావు, నాయకులు లలిత్‌సాగర్ తదితరులు పాల్గొని రంగా సేవలను కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ నాగవేణి, పీఏసీఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కాపు నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

కనిగిరి: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. మండలంలోని కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలపై ఏ రకమైన వేధింపులు గమనించినా వెంటనే డయల్ 100, 112, 1098 ఛైల్డ్‌లైన్ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

సింగరాయకొండ గ్రామీణం: బాలురు ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని ఎస్సై మహేంద్ర హెచ్చరించారు. సింగరాయకొండలో మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒక బాలుడు వాహనం నడుపుతుండగా నిలుపుదల చేసి రూ.5 వేలు జరిమానా విధించారు.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం

మర్రిపూడి: జల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని ఏపీవో రాంబాబు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తింపునకు మండలంలోని పన్నూరులో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పుగంగవరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి మాసశివరాత్రిని పురస్కరించుకొని లక్ష దీపోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు వచ్చి దీపాలు వెలిగించారు. మండలంలోని మాధవరం గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. పార్వతి అమ్మవారిని గాజులు, పూలమాలలతో అలంకరించారు.

● ముండ్లమూరు: మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని మారెళ్ల హరిహర దత్తక్షేత్రంలో చెన్నమల్లేశ్వరస్వామికి వైభవంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆవరణలో సహస్ర దీపారాధన చేశారు. శివలింగాకారంలో మహిళలు దీపాలను వెలిగించారు.

● జరుగుమల్లి: బిట్రగుంటలోని పాలేరు నది ఒడ్డున గల గంగా రాజరాజేశ్వరి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లూరు: దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

మారెళ్ల శివాలయంలో..

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: దోసకాయలపాడు ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళ చీకటిలో రాకపోకలు సాగించాల్సి వస్తుంది. -వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓: వెంటనే కొత్త దీపాలు వేయించి సమస్యను పరిష్కరిస్తాం. -పి.అజిత, ఎంపీడీవో

?: కురిచేడు మండలం కల్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న కాలువలు నివాసాల్లో నుంచి వచ్చే మురుగుతో నిండిపోయి దుర్వాసన వస్తున్నాయి. - సురేష్, గ్రామస్థుడు

✓: రెండు రోజుల్లో కాలువల్లో మురుగును తొలగింపజేస్తాం. - బాషా, పంచాయతీ కార్యదర్శి

?: మర్రిపూడి పంచాయతీలోని నడిగడ్డ వీధిలో కాలువ మురుగునీటితో నిండిపోయింది. చినుకులు పడితే నీరు రోడ్డుపైనే చేరుతుంది. -రమేష్, స్థానికుడు

✓: పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలో పూడిక తీయిస్తాం. -నాయుడు, పంచాయతీ కార్యదర్శి

?: పాకల బకింగ్‌హాం కాలువ వద్ద నుంచి సింగరాయకొండ మార్గం పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. -ఏసురత్నం, పాకల

✓: త్వరలో గుంతలను పూడ్చిస్తాం. -సుభానీ, పంచాయతీ కార్యదర్శి

?: సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పరిధిలోని భీముడు రైసుమిల్లు ప్రాంతంలో నాలుగు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. -కల్యాణి, స్థానికురాలు

✓: భారీ వర్షాలకు కొన్ని వీధి దీపాలు కాలిపోవడంతో మరమ్మతులు చేపడుతున్నాం. త్వరలో అవసరమైన చోట కొత్తవి అమర్చుతాం. -హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, తాళ్లూరు, కురిచేడు, మర్రిపూడి, సింగరాయకొండ గ్రామీణం

లీకులు.. సరిగా అందని నీళ్లు

తాళ్లూరు మండలం తూర్పుగంగవరంలో మంచినీరు లీకవుతుంది. సచివాలయానికి సమీపాన ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వుల వద్ద లీకై బయటకు వస్తుంది. ఎక్కువగా నీరు రావడం కారణంగా మడుగులా తయారైంది. దీనివల్ల గ్రామంలోకి నీరు సరిగా రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మల్లీశ్వరిని సంప్రదించగా.. వెంటనే మరమ్మతులు చేయించి నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

అల్లుకున్న నిర్లక్ష్యం..!

మండల కేంద్రమైన జరుగుమల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్, తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. కొన్ని నెలలుగా దీని చుట్టూ శుభ్రపరిచే పనులు జరగకపోవడంతో కొమ్మలు పెరిగాయి. గత నెలలో కురిసిన వర్షాలకు ఈ మొక్కలు ఇంకా పెరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ని కమ్మేశాయి. ఈ ప్రాంతం నుంచే ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారని ప్రమాదం జరగకముందే విద్యుత్తు అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ హర్షిద్‌ని వివరణ కోరగా.. త్వరలో సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, జరుగుమల్లి

గుంతలు.. పూడ్చేదెవరు?

తాళ్లూరు-వెల్లంపల్లి ప్రధాన రహదారి గోతులమయమైంది. తెల్లబాడు, ఘడియాపూడి అడ్డరోడ్డు ప్రాంతంలో ఎక్కువగా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి వాహనాల వేగం అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ ఏఈ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. త్వరితగతిన రహదారికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

చెట్టు.. తొలగిస్తే ఒట్టు!

ఈ చిత్రంలోనిది దర్శి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంపై కూలిన చెట్టు. మొంథా తుపాను ధాటికి ఈ ఆవరణలో మొత్తం మూడు చెట్లు నేలకొరిగాయి. పూర్తిగా పడిన రెండు చెట్లను మొద్దులుగా కోసి ఇప్పటి వరకు తరలించలేదు. అవి ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతంలో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమావేశ మందిరంపై పడిన చెట్టును అసలు కదిలించలేదు. దీనిపై అధికారులను వివరణ కోరగా చెట్టు తొలగింపు, మొద్దుల తరలింపునకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. -న్యూస్‌టుడే, దర్శి

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన సింగరాయకొండ గ్రామానికి మన్నేరు నుంచి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులు ధ్వంసం కావడంతో మంగళవారం పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామంలో కొన్ని ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరు అందింది. 'సింగరాయకొండలో దాహం కేకలు' అనే శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు తక్షణమే పైపులకు మరమ్మతులు చేయించారు. ఇకపై తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని ఈవోపీఆర్డీ రమేష్ తెలిపారు.

పశువుల్లో వ్యాధుల నివారణపై అవగాహన

హనుమంతునిపాడు: మండలంలోని వెంగపల్లిలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి పశువుల సంరక్షణ, అధిక పాల దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వైద్యులు అవగాహన కల్పించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణ, ఇతర అంశాలను డాక్టర్ హజరత్తయ్య, మురళీకృష్ణలు వివరించారు. పాల ఉత్పత్తి పెంచేందుకు ఖనిజలవణాల మిశ్రమాన్ని పోషకులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎంపాడు సహాయ సంచాలకుడు నరేంద్రరెడ్డి, వైద్యులు రాజశేఖర్, ఆశ, శ్రీకాంత్‌రెడ్డి, హనుమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పశు పోషకులకు ఖనిజ లవణ మిశ్రమం పంపిణీ చేసిన అధికారులు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పామూరు, న్యూస్‌టుడే: ఆర్డీఎస్ఎస్ పనుల కారణంగా పామూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ షేక్ జిలానిబాషా తెలిపారు.

సమస్యలపై వెంటనే స్పందించండి

ముండ్లమూరు, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించాలని దర్శి ఈఈ శ్రీనివాసులు సూచించారు. ముండ్లమూరు విద్యుత్తు ఉప కేంద్రంలో సిబ్బందితో సమావేశం అయ్యారు. వినియోగదారుల నుంచి సమస్య వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. గ్రామాలకు సరఫరా అయ్యే స్తంభాలు, తీగలను పరిశీలించాలన్నారు. ఏఈ అంకబాబు, ఎల్ఐ సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలని నిరసన

కనిగిరి, న్యూస్‌టుడే: జనగణనలో కులగణను చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర సమితి నాయకుడు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే కుల గణన జరగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలహీన వర్గాలకు చేసింది శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వై.రవీంద్రబాబు, పోతుల ప్రభాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'సీఐ సతీష్‌ది ఆత్మహత్య కాదు'

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పత్తికొండకు చెందిన సీఐ సతీష్‌ది ఆత్మహత్య కాదని, హత్యేనని ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు యలవర్తి పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. మంగళవారం కొండపి కుమ్మరిపాలెంలో వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సతీష్ తితిదే విజిలెన్స్ విభాగంలో విధులు నిర్వహించారన్నారు. పరకామణిలో జరుగుతున్న అవినీతిపై ఫిర్యాదు చేశారని, దీంతో అప్పటి నాయకులు కక్ష సాధింపులకు గురిచేశారని తెలిపారు. ప్రస్తుతం కేసు ముగింపు దశకు రావడంతో ప్రధాన సాక్షిగా ఉన్న సతీష్‌ను రైలు ప్రమాదంలో మరణించినట్లు సృష్టించారని మండిపడ్డారు. సమగ్రమైన విచారణ చేపట్టి అతడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బుధవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం వద్ద చేపట్టే ర్యాలీలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సుబ్బయ్య, గంగాధర్, బ్రహ్మానందం, పెద్దకాశయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మినీ వ్యాన్ చోదకుడికి తీవ్ర గాయాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొని మినీ వ్యాన్ చోదకుడికి తీవ్ర గాయాలైన సంఘటన టంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో 16వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఎండీ అబ్దుల్, సాయి అనే యువకులు మినీ వ్యాన్‌లో జామాయిల్ కర్రల లోడుతో నెల్లూరు జిల్లా ఆత్మకూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో టంగుటూరు సమీపానికి వచ్చే సరికి ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో మినీ వ్యాన్ ముందు భాగం దెబ్బతినగా.. వాహనం నడుపుతున్న సాయి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ క్రమంలో అతడి తలకు తీవ్ర గాయం కాగా, అబ్దుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు వారిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కి తరలించారు.

దర్శిలో అదుపు తప్పిన కారు

దర్శి, న్యూస్‌టుడే: దర్శి-అద్దంకి రోడ్డులో కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొనడంతో అవి ధ్వంసమయ్యాయి. ఆ వాహనాలపై ఉన్న వారు అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. దర్శి నుంచి అద్దంకి వెళుతున్న కారు స్థానిక ఝాన్సీ వైద్యశాల వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వాహనాలపైకి దూసుకెళ్లింది. విషయం తెలుసుకుని పోలీసులు కారును స్టేషన్‌కు తరలించారు.

42,302 మంది రైతులు.. రూ.28.42 కోట్లు

☛ కనిగిరి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు
☛ నేడు ఖాతాల్లో రూ.7 వేల చొప్పున నగదు జమ

-న్యూస్‌టుడే, సి.ఎస్.పురం, పామూరు

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు ప్రకృతి విపత్తుల కారణంగా ఏటా నష్టాలు తప్పడం లేదు. అటువంటి పరిస్థితుల్లో వారికి అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. సూపర్ సిక్స్ అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రెండో విడతగా రూ.5 వేలు నగదును, పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు సాయంగా రైతులకు బుధవారం వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 42,302 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరికి మొత్తం రూ.28.42 కోట్లను అందించనున్నారు.

ప్రయోజనం ఇలా..

ఏడాదికి సాగు ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలన్నది కూటమి ప్రభుత్వ ఉద్దేశం. ఇందులో పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున మూడు విడతలుగా మొత్తం రూ.6 వేలు ఇవ్వనుంది. మిగతా రూ.14 వేలు సాయాన్ని రెండు విడతల్లో రూ.5 వేలు చొప్పున, మూడో విడతగా రూ.4 వేలు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమ చేయనుంది.

రేగులచెలకలో వరిపైరుకు ఎరువు వేస్తున్న రైతు

అర్హులందరికీ పథకం వర్తింపు..

అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకీ ప్రభుత్వం సాయం అందించనుంది. నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించాం. ఇప్పటికే ఈకేవైసీ పూర్తిచేశాం. ప్రభుత్వం అందించే నగదును రైతులు పంటల సాగుకు ఉపయోగించుకోవాలి.

–షేక్ జైనులబ్దీన్, ఏడీఏ, కనిగిరి

మహిళా సాధికారతపై సదస్సు

సి.ఎస్.పురం: కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం 2025 కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారతపై సదస్సు నిర్వహించారు. శీలంవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం దీనిపై అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ముందుకు సాగాలని, ప్రతి కుటుంబానికి పొదుపు చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్త రఫియా, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, మహిళలు

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

సంతనూతలపాడు: స్థానిక ఏపీ గురుకుల పాఠశాలలో కార్తిక మాస వనభోజనాలను నిర్వహించారు. డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు, ఎంఈవో వెంకారెడ్డిలు పాల్గొని విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ కోడెల అనంతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకులు కె.సత్యనారాయణ, సహాయ గ్రంథపాలకుడు డి.నాగేశ్వరరావులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ● నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథపాలకులు ధనమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఎస్.ఎన్.పాడులో విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలు

మదీనా మృతులకు ఘన నివాళి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మదీనా సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన 45 మంది సజీవ దహనమయ్యారు. వారి మృతికి నివాళులర్పిస్తూ సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు అబ్దుల్ సత్తార్‌నాయకులు సాజిద్, రహంతుల్లా, ఫయాజ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఫోన్ హ్యాక్

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి తహసీల్దారు ఆర్.బ్రహ్మయ్య ఫోన్ మంగళవారం హ్యాక్ అయింది. ప్రభుత్వ నంబరుతో ఉన్న ఫోన్ వాట్సాప్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆ లింక్ కొందరి ఫోన్లకు వెళ్లింది. ఎవరూ లింక్‌ను తెరవద్దంటూ తహసీల్దారు వేరే ఫోను ద్వారా సమాచారం పంపారు.

ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మైనంపాడులోని డైట్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంపై సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్ సామా సుబ్బారావు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

నాయుడుపాలెంలో వసతి గృహం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం పి.నాయుడుపాలెంలో సీజనల్ వసతి గృహం ఏర్పాటుకు జిల్లా కలెక్టరు అనుమతి ఇచ్చినట్లు మండల విద్యాశాఖాధికారి డి.వి.నరసింహారావు తెలిపారు.

సాగుకు సాయం.. రైతన్నకు అభయం

‘సూపర్ సిక్స్’ హామీల అమల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ‘అన్నదాత సుఖీభవ’ పథకం రెండో విడతకు సంబంధించి అర్హుల జాబితా సిద్ధమైంది. సొంత భూమి కలిగిన డీ పట్టాదారులు, అసైన్డ్, ఈనాం భూముల రైతులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలోనే అర్హులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తద్వారా గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో తప్పుల కారణంగా కొందరికి ఉపశమనం కలిగింది. - న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

మండువ వారిపాలెంలో పొలం దున్నుతున్న రైతు

గత ప్రభుత్వ తప్పిదంతో సమస్యలు

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వే సమయంలో అయిదు లేదా ఆరుగురు రైతులకు కలిపి ఒకే సంయుక్త ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) నంబరును కేటాయించి భూ హక్కు పత్రాలను అందజేశారు. తద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మంజూరుకు సాంకేతిక చిక్కులు వెంటాడుతున్నాయి. అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలకు తొలివిడతగా ఆగస్టు 2న అమలు చేయగా; రెండో విడత కింద బుధవారం రూ.7 వేలు చొప్పున నగదు జమ చేయనున్నారు.

పథకం అర్హుల వివరాలు ఇలా..

మండలం	రైతులు
ఒంగోలు అర్బన్	2,211
ఒంగోలు గ్రామీణ	2,212
కొత్తపట్నం	3,155
నాగులుప్పలపాడు	7,324
సంతనూతలపాడు	5,806
చీమకుర్తి	7,060
మద్దిపాడు	4,636

32,403 మందికి లబ్ధి

నియోజకవర్గాల వారీగా ఒంగోలులో 7,577; సంతనూతలపాడులో 24,826 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రెండు నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం పీఎం కిసాన్ పథకం కింద 34,883 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా కుటుంబంలో ఎంత మందికి భూమి ఉన్నా ‘అన్నదాత-సుఖీభవ’ పథకం లబ్ధి ఒకరికే వర్తించనుంది. రెండు నియోజకవర్గాల పరిధిలో వ్యవసాయ భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో 86,068 మంది పేర్లు నమోదయ్యాయి. అందులో కుటుంబం యూనిట్‌గా 32,403 మందికి లబ్ధి చేకూరనుంది.

ఉపన్యాసంతో మెప్పించారు.. విజేతలుగా నిలిచారు

● ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ‘ఈనాడు’ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం స్థానిక మంగమూరురోడ్డులోని శ్రీచైతన్య హైస్కూలులో ఉపన్యాస పోటీలు జరిపారు. ‘విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం’ అనే అంశంపై 7,8,9,10 తరగతుల విద్యార్థులకు పోటీ జరపగా 9వ తరగతి విద్యార్థి శ్రీరామ్ ఆశ్రిత ప్రథమ, ఏడో తరగతి విద్యార్థి మోక్షిత ద్వితీయ, 8వ తరగతి విద్యార్థి పూజిత తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఏజీఎం అనిల్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శేషయ్య, వైస్ ప్రిన్సిపల్ నాగమణి, డీన్ సాయిరాం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీచైతన్య హైస్కూలు ప్రతినిధులు

ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణకు సహకరించండి

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణకు అందరూ సహకరించాలని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.మాధురి సూచించారు. చీమకుర్తి తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆమె నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

రాయితీపై పాడి రైతులకు పశు దాణా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఒంగోలు మండలం కరవది గ్రామంలోని పాడి రైతులకు మంగళవారం 50 శాతం రాయితీపై పశు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరామయ్య మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాల్లోకి నీరు చేరిన నేపథ్యంలో ప్రభుత్వం అందజేస్తున్న పశుదాణా ఉపయుక్తం కానున్నట్లు తెలిపారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌కు రీజనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావుకు రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా సిబ్బంది, కార్పొరేషన్ తెదేపా కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, వర్డ్స్‌వర్త్, టి.రవితేజ, శ్రీనివాసరావు, తెదేపా నగర మాజీ అధ్యక్షుడు కొటారి నాగేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

మద్దిపాడు, న్యూస్‌టుడే: విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లను నివారించడానికి పొడి విత్తనాన్ని శుద్ధి చేయాలని మంగళవారం మండల వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. దొడ్డవరం, గార్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏఈవో శేషయ్య, మల్లవరం వీఏఏ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు గ్రామ కాపురస్తులు అయిన దుంపా వెంకటేశ్వరరెడ్డి తండ్రి సుబ్బారెడ్డిగారు నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థులను గురించి నా క్లయింటుగారు అయిన దుంపా వెంకటేశ్వరరెడ్డిగారు గౌరవ డెట్స్ రికవరి ట్రిబునల్ (డి.ఆర్.టి) నందు కెనరా బ్యాంకు వారిపై ఎస్.ఎ.నెం. 390/2022గా కేసు దఖలు పరిచి యున్నారు. కాగా సదరు కేసు పెండింగులో వున్నది. సదరు కేసు వివరాలను మభ్యపరిచి కొందరు దిగువ షెడ్యూలు ఆస్థిని అమ్మజూపుతున్నట్లు నా క్లయింటుకు తెలియవచ్చింది. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని నా క్లయిటు దఖలు పరిచిన దావా పెండింగులో వుండగా ఎవరు ఎటువంటి లావాదేవీలు జరిపిన అట్టి లావాదేవీలు మా క్లయింటుకు గల జాయింటు హక్కును బద్ధపరచ జాలవని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

షెడ్యూలు:- ఐటమ్‌నెం.1. ప్రకాశం జిల్లా ఒంగోలు సబ్ రిజిస్ట్రేషన్, ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని, ఒంగోలు రూరల్ గ్రామ సర్వే నెం. 270/2ఎ - పడమర వాటా ప్లాట్ నెం. 145లో 1242.5 చ. అడుగులు లేక 17 గదుల 18 అడుగుల 6 అంగుళాలు విస్తీర్ణమునకు స్థలమునకు హద్దులు. **తూర్పు:** వెంకటేశ్వరరెడ్డి గారికి చెందిన మిగిలిన భాగం ఆస్థి, **దక్షిణం:** టి.పాపా రంగయ్యగారి ఇల్లు మరియు దేవరపల్లి సుగుణ గారి ఇల్లు, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** తిరుమలశెట్టి మధుసూదనరావుగారి ఇల్లు.
ఈ హద్దులలోని 242.5 చ అడుగులు మాత్రమే.

ఐటమ్ నెం.2: ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ రిజిస్ట్రేషన్, ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని, ఒంగోలు రూరల్ గ్రామ సర్వే నెం. 270/2ఎ - పడమర వాటా ప్లాట్ నెం. 145లో 1242.5 చ. అడుగులు లేక 17 గదుల 18 అడుగుల 6 అంగుళాలు విస్తీర్ణమునకు స్థలమునకు హద్దులు. **తూర్పు:** కోటా వెంకటేశ్వర్లుగారి ప్లాట్ నెం. 144, **దక్షిణం:** శింగారెడ్డిగారికి చెందిన మిగిలిన భాగం ఆస్థి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** తిరుమలశెట్టి మధుసూదనరావుగారి ఇల్లు
ఈ హద్దులలోని 242.5 చ. అడుగులు మాత్రమే.

సం/- రామకృష్ణ అవినీడి, అడ్వకేట్, ఒంగోలు.
సెల్: 98486 24147

గ్రంథాలయానికి రండి.. పుస్తకాలు చదవండి

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రంథాలయంలో పలువురు విద్యార్థులతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా పోర్ట్ ట్రాఫ్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ ఛైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషా, బీజీఎంసీ ఏపీ ఉపాధ్యక్షురాలు షేక్ సిద్ధాంబి, జిల్లా అధ్యక్షులు పఠాన్ సాజిద్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో కంప్యూటర్ విద్యతో పాటు గ్రంథాలయాల్లో విజ్ఞానానికి సంబంధించిన అనేక రకాల పుస్తకాలు ఉంటాయని, విద్యార్థులు వారానికి ఒక రోజైనా గ్రంథాలయానికి వచ్చి అక్కడ ఉన్న పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి డిప్యూటీ లైబ్రేరియన్, సంపూర్ణ, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణం

చీమకుర్తి: ఎమ్మెన్నార్ ధరణి ప్రాంగణంలో ఘనంగా సాగిన అయ్యప్ప పడి పూజలు, పాల్గొన్న భక్తులు

ఒంగోలు గ్రామీణం: కొప్పోలులో విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో ‘ఈనాడు’ మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **చీమకుర్తి, న్యూస్‌టుడే:** చీమకుర్తి దిన్నేపురం మొదటి వీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు పాత ఇళ్ల గోడలు కూలి పోయి కాలువల్లో మట్టి చేరింది. దీని వల్ల నీటి ప్రవాహం నిలిచి పోతోంది. నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తోంది. దుర్వాసన వస్తోంది. రాక పోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంటోంది. వెంటనే కాలువలు బాగుచేయించాలి. **- మహి, దిన్నేపురం, చీమకుర్తి.**
✓: సిబ్బందిని పంపి పరిశీలిస్తాం. కాలువలు శుభ్రం చేయించి ఇబ్బంది రాకుండా చూస్తాం. **- వై.రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్, చీమకుర్తి.**

?: **ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:** లాయర్ పేట బ్యారన్ దగ్గరలోని వీధి దీపం 15 రోజులుగా వెలగటంలేదు. చీకటితో ఇబ్బందిగా ఉంటోంది. **- కాటా నాగేశ్వరరావు, ఒంగోలు.**
✓: సిబ్బందిని పంపి వీధి దీపం కొత్తది ఏర్పాటుచేయిస్తాం. ఇతర సమస్యలూ పరిష్కరిస్తాం. **- ఐసయ్య, మున్సిపల్ ఇంజనీర్**

?: కూరగాయల మార్కెట్ వైపు నుంచి అంజయ్యరోడ్డుకు వచ్చే వంటవారి కాలనీ రోడ్డు గుంటలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. సమస్య పరిష్కరించగలరు. **- సుబ్బరావమ్మ, అంజయ్య, అంజయ్యరోడ్డు**
✓: నగరంలో రోడ్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి. త్వరలో మీ రోడ్డులో గుంతలు పూడ్చివేసే విధంగా చూస్తాం. **- ఐసయ్య, మున్సిపల్ ఇంజనీర్, ఒంగోలు**

?: **నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే:** చీర్వానుప్పలపాడులో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో వీధులు అంధకారంలో ఉంటున్నాయి. రాకపోకలు సాగించడానికి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే దీపాలు వెలిగించే విధంగా చూడగలరు. **- వెంకటేశ్వర్లు, ఎన్.జి.పాడు.**
✓: సిబ్బందిని పంపించి సమస్య పరిశీలిస్తాం. దీపాలు అమర్చే విధంగా చర్యలు తీసుకుంటాం. **- రవికుమార్, ఎంపీడీవో**

?: **కొత్తపట్నం, న్యూస్‌టుడే:** కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామంలో ఎంతో కాలం నుంచి డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాలువల్లో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతోంది. వర్షం పడితే రోడ్డుపై పారి ఇబ్బంది కలుగుతోంది. అధికారులు స్పందించి కాలువలు పూడికలు తీసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. **- వెంకట్రావు, సునీత, కొత్తపట్నం**
✓: గ్రామంలో కార్మికుల కొరత ఉంది. దీంతో ఇబ్బందిగా ఉంటోంది. సమస్యను పరిష్కరించేందుకు సత్వరం చర్యలు తీసుకుంటాం. **- వేణుగోపాల కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో, కొత్తపట్నం.**

వైభవంగా మాస శివరాత్రి వేడుకలు

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు శివాలయంలో మాస శివరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. 1500 మందికి అన్నదానం చేశారు. ● ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఒంగోలు ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వనభోజన కార్యక్రమాన్ని కొత్తపట్నం వద్దగల అమరా గార్డెన్స్‌లో నిర్వహించారు. అధ్యక్షుడు దగ్గుపాటి వెంకట్రావు నేతృత్వం వహించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్స్‌ని సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి దొడ్డా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఉప్పుటూరి చంద్ర, బొజ్జా వెంకటేశ్వర్లు, రసూల్, భాస్కర్ పాల్గొన్నారు. ● సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడులో గంగా పార్వతీ సమేత మోహ రామలింగేశ్వరస్వామికి ఘనంగా కల్యాణ మహోత్సవాన్ని చేపట్టారు. వేద పండితులు వావిలాల సూర్యప్రకాశరావు, వి.వెంకట సుబ్రహ్మణ్యంలు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉభయ దాతలుగా మట్టా వెంకటమురళీకృష్ణ, వెంకట రాధాకుమారిలు వ్యవహరించారు. ● స్థానిక త్రిపురాంతకస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు ఎస్.బుచ్చిబాబు శర్మ త్రిపురాంతక స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ● పెద్దబజారులో సీతారామస్వామి దేవస్థానంలో అర్చకులు నేలభట్ల శ్రీనివాసశాస్త్రి, శ్రీధర్ రామ్మూర్తి శర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఉప్పుగుండూరు శివాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వేతనాలు సరే.. మరి సేవలో..!

● డిజిటల్ అసిస్టెంట్లు లేక గ్రామీణుల పాట్లు

న్యూస్‌టుడే, మద్దిపాడు

డివిజన్లోని పలు చోట్ల డిజిటల్ అసిస్టెంట్లు లేక ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. ఇందులో మద్దిపాడు మండలం ముందు వరుసలో నిలుస్తోంది.

రాజకీయ ప్రాబల్యం ఉపయోగించుకుని..

పలుచోట్ల డిజిటల్ అసిస్టెంట్‌లు ఉన్నప్పటికీ వారు వేతనాలు తీసుకునేది గ్రామ పంచాయతీల్లో.. సేవలు మాత్రం జిల్లా కార్యాలయాల్లో.. అన్నట్లుగా ఉంటోంది పరిస్థితి. రాజకీయ ప్రాబల్యం వినియోగించుకుని జిల్లా కేంద్రాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిదీ డిజిటల్ అసిస్టెంట్‌లతో ముడిపడి ఉండడంతో ప్రజలు గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. ● మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లాపల్లి, ఇనమనమెళ్లూరు తదితర ప్రాంతాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లు ఉన్నప్పటికీ వారు డిప్యూటేషన్‌పై మరో చోట విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పొలం ఆన్‌లైన్, 1బీ అడంగల్, భూములు సబ్ డివిజన్‌ల పనుల కోసం రైతులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు నానా రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. ● ఇనమనమెళ్లూరుకు గత జులై నెలలో నాగులుప్పలపాడు మండలం నుంచి బదిలీపై వచ్చిన డిజిటల్ అసిస్టెంట్ జాయిన్ అయ్యి జిల్లా కేంద్రానికి డిప్యూటేషన్ పై వెళ్లిపోయారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్ సేవలు దూరం చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. ● గుండ్లాపల్లి గ్రామానిదీ అదే పరిస్థితి. బదిలీపై గ్రామానికి వచ్చి బాధ్యతలు స్వీకరించి వెంటనే జిల్లా పంచాయతీ కార్యాలయానికి తిరుగు టపా కట్టాడు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి డిజిటల్ అసిస్టెంట్ సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 విభాగాల్లో బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ముందుగా శిబిరాన్ని డైట్ ప్రిన్సిపల్ సామా సుబ్బారావు ప్రారంభించారు. ఎంపికైన జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు డి.శ్రీనివాసరావు, పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎల్.నరసింహారావు, పీఏసీ ఛైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, చీమకుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 విభాగంలో ఎంపికైన విద్యార్థులు

అండర్-14 విభాగంలో విజేతలు

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు మండలం, పేర్నమిట్ట గ్రామం, డోరు నెం. 12-1150రు నివాసం, శ్రీ కండె పెదగురవయ్య గారి కుమారుడు రమణయ్య, అనువారు మాకు యిచ్చిన సమాచారము మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

క్రింది షెడ్యూలు దాఖలాస్థి, మరికొంత ఆస్థి శ్రీ చింతపల్లి వెంకట్రామయ్య గారి కుమారుడు లక్ష్మీనారాయణ గారికి వారి పూర్వీకుల ద్వారా సంక్రమించియుండి, దరిమిలా వారు తే.15.05.1973 దిన క్రింది షెడ్యూలు దాఖలా సర్వే నెం. 150/1రులో య. 6.68 సెంట్లు మరియు వారి తాలుకు యితర ఆస్థులను గురించి వీలునామా వ్రాయించి ఒంగోలు స.రి. వారి ఆఫీసులో ద.నెం. 28/1973రుగా రిజిష్టరు చేసి, సదరు వీలునామాను ఎటువంటి మార్పులు చేయకుండా మరణించిన దరిమిలా, సదరు వీలునామా దాఖల ఆస్థులు అన్ని వారి కుమార్తె అయిన శ్రీమతి గాదె సావిత్రిదేవి గారికి సంక్రమించి ఆమె స్వాధీనానుభవములో కలిగియుండి క్రింది షెడ్యూలు దాఖల సర్వే నెంబరులో కొంత ఆస్థిని ఆమె యితరులకు విక్రయించియున్నది. దరిమిలా ఆమె తాలుకు యావదాస్తులును గురించి తే.02.03.1984 దిన వీలునామా వ్రాయించి ఒంగోలు స.రి. వారి ఆఫీసులో దస్తావేజు నెం. 26/1984రుగా రిజిష్టరు చేసి, సదరు వీలునామాను ఎటువంటి మార్పులు చేయకండా మరణించియున్నది. సదరు వీలునామాలో పొందుపరచిన అంశముల ప్రకారం వీలునామా దాఖల షెడ్యూలు భూమి ఆమె కుమార్తె అయిన శ్రీమతి ఓగిరాల ఇందిరాదేవికి, మరియు శ్రీమతి సావిత్రిదేవి గారు మరణించునాటికి ఆమె పేరున గల స్థిర, చరాస్థులు, ధనం వగైరాలు (వీలునామా షెడ్యూలు ఆస్థి తప్ప) అన్నీ ఆమె కుమారుడు శ్రీ గాదె శ్రీనివాసరావుకు చెందులాగున పొందుపరచియున్నందున క్రింది షెడ్యూలు దాఖలాస్థి, మరికొంత ఆస్థి సదరు గాదె శ్రీనివాసరావుకు సర్వ సంపూర్ణ హక్కులతో సంక్రమించి వారి స్వాధీనానుభవములో కలిగి నిర్వివాదముగ అనుభవించుచు, క్రింది షెడ్యూలు దాఖలాస్థిని మా క్లయింటు మరియు వగైరాలుకు విక్రయించుటకు ఖరారుపడి యున్నారు. కనుక క్రింది షెడ్యూలు దాఖలాస్థిపై ఎవ్వరికైనను ఎటువంటి హక్కులుగాని, అభ్యంతరములుగాని, ఆక్షేపణలుగాని, అగ్రిమెంట్లుగాని, తాకట్లుగాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం (7) రోజులు లోపల వ్రాతపూర్వకమైన ఆధారములతో క్రింది అడ్రసుకు తెలియపరచవలెను. లేనియెడల సదరాస్థి నిర్వివాదమైన ఆస్థియని ధృవపరచుకొని మా క్లయింటు మరియు వగైరాలు వారి పేర్లుతోగాని, వారి స్థానీయుల పేరుతోగాని విక్రయపత్రం పొందగలరు. దరిమిలా సదరాస్థిపై ఎటువంటి ఆక్షేపణలు వచ్చిన యెడల అట్టివి చెల్లనేరవు మరియు మా క్లయింటు హక్కులను బద్ధపరచజాలవు అని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు:- ప్రకాశం జిల్లా - ఒంగోలు స.రి. యిలాకా - ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్ - **ఒంగోలు గ్రామ సర్వే నెం.150/1ఎ రులో య.1.17** సెంట్లు భూమికి హద్దులు. **తూర్పు:** ఓగిరాల ఇందిరాదేవి గారి భూమి, **దక్షిణం:** యితరుల భూమి, **పడమర:** యితరుల తాలుకు ప్లాట్లు, **ఉత్తరం:** డొంక (యానాది సంఘం)

స్థలం: ఒంగోలు
తేది:18.11.2025

సం/- బొడ్డు రామలింగం, బొడపాటి శ్రీనివాసరావు, అడ్వకేట్స్
బృందావననగర్, శ్రీసాయి ఎన్‌క్లేవ్, ఒంగోలు. ఫోన్: 98665 88599.

(c) eenadu

ఆర్టీసీ సమస్యలా?

జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారిణితో నేడు ఫోన్ ఇన్

ఈనాడు మీతోడు

నెల్లూరు(ఆర్టీసీ), న్యూస్‌టుడే: పల్లెలు, పట్టణాలకు సరిపడా బస్సులు నడపకపోవడం, వేళకు రాక నిరీక్షణ, బస్టాండ్లలో అరకొర వసతులు.. ఇలాంటి సమస్యలను పరిష్కరించుకోడానికి 'ఈనాడు- మీతోడు'గా నిలుస్తోంది. జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారిణితో ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది. నిర్దేశిత సమయంలో ఫోన్ చేసి.. అధికారుల దృష్టికి మీ సమస్యలు తీసుకువెళితే.. వారు సమాధానాలు ఇస్తారు. పరిష్కారాలు చూపుతారు.

తేదీ: 19-11-25, బుధవారం
సమయం: మధ్యాహ్నం
12 నుంచి 1 గంటల మధ్యలో
ఫోన్ చేసి సమస్య చెబితే చాలు.

జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారిణి
షేక్ షమీమ్ :
ఫోన్‌నం: 0861-232 5196

రోగాలు కొని తెచ్చుకుంటారంతే..

చినుకుపడితే చాలు.. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. మార్కెట్ ప్రవేశంలోనే వర్షం నీటితో మురుగు కలిసి పరిసరాలు అధ్వానంగా మారడంతో కొనుగోలుదారులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. లోపలా ఇంచుమించు అదే తీరు నెలకొంది. – న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

మిగల్చకొండ.. మేత!

పొదలకూరు : పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లి తిప్పను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వి గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణానికి కూతవేటు దూరంలోనే ఈ దోపిడీ జరుగుతున్నా యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది. పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని 707 సర్వే నంబరులో 21 ఎకరాల కొండను చదును చేసి.. 1500 మంది నిరుపేదలకు పక్కా గృహాల కోసం స్థలం కేటాయించారు. మరోవైపు 606 మందికి పక్కాగృహాలు నిర్మాణంలో ఉన్నాయి. అయినప్పటికీ అక్రమార్కులు కొండను కరిగించడంతో పాటు ఇంటి నిర్మాణాలకు వేసిన పునాదుల చుట్టూ కూడా యంత్రాలతో తవ్వి మట్టిని తరలించుకుపోతున్నారు. దాంతో భారీ గుంతలు ఏర్పడటంతో పాటు వర్షం పడితే వాటిలోకి నీరు చేరి కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే.. అక్కడ ఇళ్లు కట్టుకున్నా నివాసాలు ఉండలేమని లబ్ధిదారులు వాపోతున్నారు. గృహ నిర్మాణశాఖ ఏఈ మహేశ్ మాట్లాడుతూ.. గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

గ్రావెల్ తవ్వకంతో కరుగుతున్న కొండ

ఇసుక.. వినియోగదారుడి కినుక!

కోవూరు చక్కెర కర్మాగారంలో ఇసుక నిల్వ కేంద్రం

ప్రశ్నావళి ఇలా..	అవును	లేదు
మీకు అవసరమైనప్పుడు ఇసుక అందుబాటులో ఉందా? (శాతల్లో)	51.6	48.4
ఇప్పటి ఇసుక ధర పాత పాలసీ కంటే తక్కువగా ఉందా?	46.4	53.6
మీకు లభిస్తున్న ఇసుక నిర్మాణ పనులకు పనికొస్తోందా?	50.4	49.6

ఈనాడు, నెల్లూరు: సుదీర్ఘ పెన్నా తీరం.. నాలుగు ప్రాంతాల్లో డీసిల్టేషన్ పాయింట్లు.. నాలుగు ఓపెన్ రీచ్‌లు.. మాన్‌సూన్‌కు ముందే స్టాక్ పాయింట్లలో కావాల్సినంత అందుబాటులో... ఇకనేం.. జిల్లా ప్రజలకు ఇసుక విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవులే అనుకుంటున్నారా! మీరు పొరబడినట్లే.. ఇసుక ఉన్న మాట వాస్తవమే గానీ.. అవసరార్థులకు కావాల్సినంత అందడం లేదు. ఈ విషయం ఎవరో చెబుతున్నది కాదు. ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో తేటతెల్లమైన వాస్తవం.

"ఉచిత ఇసుకపై జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో రాష్ట్రస్థాయిలో సగటున 40 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేయగా.. జిల్లాలో అది 49.6 శాతంగా ఉండటం గమనార్హం."

రాష్ట్రంలోని 18 జిల్లాల్లో సర్వే చేయగా.. నెల్లూరు 17వ స్థానంలో నిలిచింది. దాంతో దీనిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి.. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు.

రీచ్‌లపై.. అధికార పెత్తనం

'కూటమి' అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానం అమల్లోకి తేవడంతో ప్రజల్లో మంచి పేరు వచ్చింది. తక్కువ ధరకు దొరకడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. కానీ, కొందరు అక్రమార్కుల జోక్యంతో కొద్ది రోజుల్లోనే పరిస్థితి మారింది. వాహనదారుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడటంతో.. వారు బయట అధిక ధరలకు విక్రయించడం మొదలైంది. ఉదాహరణకు కోవూరు

ఐవీఆర్ఎస్ సర్వేలో 49.6 శాతం మంది అసంతృప్తి

నియోజకవర్గం పల్లిపాడు, నిడుముసలి, ముదివర్తిపాలెం ప్రాంతాల నుంచి ఇసుక ట్రాక్టర్ల ద్వారా తీసుకువెళుతున్నారు. గతంలో ఇక్కడి నుంచి గంగపట్నానికి రూ.వెయ్యికే ట్రాక్టర్ తోలుతుండగా... ప్రస్తుతం రూ. 2వేలు అయింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు రీచ్‌లపై పెత్తనం చేయడం.. వసూళ్లకు పాల్పడటమే దీనికి కారణమన్నది బహిరంగ రహస్యం. అన్ని ప్రాంతాల్లోని పెన్నా రీచ్‌ల్లో ఇదే పరిస్థితి అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది కాస్త ప్రజల్లో వ్యతిరేకతకు కారణమవుతోంది. స్టాక్ పాయింట్లలోనూ అవకతవకలకు పాల్పడటం.. రూ. కోట్ల విలువైన ఇసుకను పక్కదారి పట్టించి జేబులు నింపుకొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● దీనిపై జిల్లా మైనింగ్ శాఖ అధికారి శ్రీనివాసరావు వివరణ కోరగా.. ఐవీఆర్ఎస్ సర్వేలో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేసిన మాట వాస్తవమేనన్నారు. దీనిపై కలెక్టర్ సమీక్షించారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకుంటామన్నారు. స్టాక్ పాయింట్లు, డీ సిల్టేషన్ పాయింట్లు రీచ్‌లను పరిశీలించి.. ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే.. తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అల తిరుమల మాదిరిగా..

కొండబిట్రగుంట ప్రసన్నుడి ఉత్సవాలు

బోగోలు మండలంలోని కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు తిరుమలలో మాదిరిగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అనుమతులు ఇచ్చింది. ఇప్పటివరకు ధ్వజారోహణ, అవరోహణ మధ్య ఐదు రోజుల వాహన సేవలు జరిగేవి. ఇకపై తొమ్మిది రోజుల నిర్వహించేలా మంగళవారం అనుమతులు వచ్చాయని ఆలయ కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ, ప్రధానార్చకులు వీపూరు సత్యనారాయణాచార్యులు 'న్యూస్‌టుడే'కి చెప్పారు. పౌర్ణమి నాడు జరిగే కల్యాణ మహోత్సవంలో మార్పు ఉండదన్నారు. అదేరోజు చక్రస్నానం జరుగుతుందని, మరుసటి రోజు రథోత్సవం చేస్తామన్నారు. కొత్తగా కొన్ని వాహన సేవలు రానున్నాయని వివరించారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్న ఫిజియోథెరపిస్టు

ఆటిజంపై.. ఆత్మీయ అస్త్రం

ఏడు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

న్యూస్‌టుడే, దుత్తలూరు: ఆటిజంతో బాధపడే చిన్నారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారికి తగిన చికిత్స, తర్ఫీదు అందించేందుకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, సైకాలజీ నిపుణులతో ప్రత్యేక బోధన ద్వారా వారిని మామూలు స్థితికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే జిల్లాలోని వింజమూరు, నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇస్కపల్లి(అల్లూరు), కందుకూరు, ఆత్మకూరు, కావలి మండలాల్లోని పీఎంశ్రీ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. భవిత కేంద్రాలకు సమాంతరంగా ఇవి కొనసాగనున్నాయి.

ఒక్కో దానికి రూ. 27 లక్షలు

ఒక్కో కేంద్రం నిర్వహణ, నిర్మాణానికి రూ. 27 లక్షల చొప్పున మంజూరు చేశారు. భవనాలు లేని చోట కొత్తవి నిర్మిస్తారు. ప్రస్తుతం నడుస్తున్న భవిత కేంద్రాల్లోని ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయుల(ఐఈఆర్‌టీ)తో పాటు సైకాలజిస్టు, ఫిజియో, స్పీచ్ థెరపిస్టులను నియమించనున్నారు. పిల్లలకు సేవలందించేందుకు ఆయాలనూ నియమిస్తారు.

● సహిత విద్య జిల్లా సమన్వయకర్త ప్రసాదరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఏడు ఆటిజం కేంద్రాలకు ప్రతిపాదనలు పంపగా.. మంజూరయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా కేంద్రాల్లో సిబ్బంది నియామకం పూర్తి చేసి. త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

"ఆటిజం పిల్లల అవసరాలను గుర్తించి.. ప్రత్యేక థెరపీ ద్వారా భావ వ్యక్తీకరణ, సామాజిక నైపుణ్యాలు పెంపొందిస్తారు. వారి తల్లిదండ్రులకు మార్గదర్శకత్వంతో పాటు కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పిస్తారు."

ఇదీ పరిస్థితి : భవిత కేంద్రాలు: 38 | విభిన్న ప్రతిభావంతులు: 3,367 | ఆటిజం బాధిత విద్యార్థులు: 69

చదరంగం.. శ్రీయ విజయ వేదిక

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఓ వైపు చదువులో రాణిస్తూనే.. మరో వైపు చదరంగంలో చక్కటి ఆట తీరుతో ఆకట్టుకుంటోంది నెల్లూరు నగరానికి చెందిన డింపుల్ శ్రీయ. జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నీల్లో సత్తా చాటుతూ.. ఇటీవల జాతీయ స్థాయికి ఎంపికైంది. తడికల బజార్ ప్రాంతానికి చెందిన ఆత్మకూరి సురేష్‌బాబు, పూర్ణిమ దంపతుల కుమార్తె శ్రీయ.. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నాలుగో తరగతి నుంచే చదరంగంపై దృష్టి పెట్టిన ఈ క్రీడాకారిణి.. శిక్షకుడు సుబ్రహ్మణ్యం వద్ద మెలకువలు నేర్చుకుంది. జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 11, 14, 19 పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి, ఫిడే చెస్ పోటీల్లో బహుమతులు గెలుచుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) 2025-26 పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. తాజాగా ఈ నెల 7 నుంచి 9 వరకు పార్వతిపురంలో జరిగిన అండర్-19 బాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి.. రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. డిసెంబరు 5న బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. గ్రాండ్ మాస్టర్ కావాలన్నదే తన లక్ష్యమని.. సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

– న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

అదనుపై గురి.. సాగుకు సిరి

నేడు రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సంగం, న్యూస్‌టుడే: రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలోనే ప్రభుత్వం నుంచి తీపి కబురు అందింది. బుధవారం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయనుంది. వైఎస్ఆర్ కడప జిల్లా కమలాపురంలో బుధవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఇదే రోజు కేంద్రం కూడా పీఎం కిసాన్ పథకం కింద నిధులు ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా రూ. 5వేలు, కేంద్రం 21వ విడతగా రూ. 2వేల చొప్పున మొత్తం రూ. ఏడువేలు జమ చేయనున్నాయి.

నియోజకవర్గం	లబ్ధిదారులు: అన్నదాత సుఖీభవ	లబ్ధిదారులు: పీఎం కిసాన్	జమయ్యే నగదు (రూ.కోట్లలో)
ఉదయగిరి	45,275	37751	30.18
ఆత్మకూరు	34,223	29,197	22.95
కావలి	18,305	13,901	11.93
కోవూరు	16,938	12,401	10.94
సర్వేపల్లి	27,958	23,056	18.59
నెల్లూరు	5,299	4,192	3.48
వెంకటగిరి	16,015	13,176	10.64
కందుకూరు	31,853	27,684	21.46
మొత్తం	1,95,866	1,61,358	130.20

● పరిశీలన అనంతరం పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య తగ్గినట్లు వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి తెలిపారు. తొలి విడతలో 1,68,350 మందికి రూ.33.67 కోట్ల సాయం అందగా.. రెండో విడతలో 1,61,358 మందికి రూ.32.27 కోట్ల సాయం లభించనుందన్నారు. ప్రస్తుతం 6,992 మంది సాయానికి దూరమయ్యారన్నారు.

అక్కడ పుస్తకం చదవాలంటే.. తలకు హెల్మెట్ పెట్టాలంతే!

టేబుల్‌పై పడిన స్లాబ్ పెచ్చులు

ఏఎస్‌పేట, న్యూస్‌టుడే: విజ్ఞాన భాండాగారం.. గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్న వేళ.. పాఠశాల విద్యార్థులను తీసుకొచ్చి పుస్తక పఠనం ప్రాధాన్యం అవగాహన కల్పిస్తున్నారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు వారికి ఇష్టమైన పుస్తకాలు ఇచ్చి చదివేలా ప్రోత్సహిస్తున్నారు. అంతా ఆ ప్రక్రియల్లో నిమగ్నమై ఉన్న వేళ... ఏఎస్‌పేట గ్రంథాలయంలో మంగళవారం ఒక్కసారిగా పైకప్పు పెచ్చులూడి టేబుల్, పేపర్లు, పుస్తకాలపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పగా.. వరండాలో ఉన్న వారు ఆందోళనకు గురయ్యారు. భవనం అయిదేళ్లుగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని.. రెండేళ్ల కిందట కూడా పైకప్పు పెచ్చులూడి పడిందని పాఠకులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య కొన్నేళ్లుగా ఉన్న మాట నిజమేనని, గతంలోనే జిల్లా అధికారులకు నివేదించామని లైబ్రేరియన్ శ్రీనివాసరాజు తెలిపారు.

ఆర్టీసీ అద్దె బస్సులో మంటలు

కానిస్టేబుల్ అప్రమత్తం చేయడంతో.. తప్పిన ముప్పు

ఆందోళనలతో కిందకు దిగిన ప్రయాణికులు

సంగం, న్యూస్‌టుడే: నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ప్రయాణిస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు కింది భాగంలో మంటలు రేగాయి. ఆ విషయాన్ని సంగంలో కొందరు గమనించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... ఆత్మకూరు డిపో బస్సు నెల్లూరు వెళుతోంది. ఆ క్రమంలో సంగం కొండ కూడలి దాటుతుండగా.. బస్సు దిగువన మంట వస్తుండటాన్ని కానిస్టేబుల్ నాగార్జున, ఆయన స్నేహితుడు గమనించి కేకలు వేశారు. డ్రైవరు మధు అప్రమత్తమై వాహనాన్ని నిలపడంతో మంటలు ఆగాయి. 45 మంది ప్రయాణికులు కిందకు దిగి.. ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. వారిని వేరే బస్సులో నెల్లూరుకు తరలించారు. డ్రైవరు మాట్లాడుతూ.. వైరింగ్‌లో సమస్య తలెత్తి, దీపాల వెలుగులో తేడా రావడంతో బస్సును నెమ్మదిగా నడుపుతున్నానని చెప్పారు. దిగువన వచ్చిన మంటలు గుర్తించలేదని, స్థానికులు కేకలు వేయడంతో ప్రమాదం తప్పిందన్నారు.

నయా ఇళ్లు.. ఇప్పటికే వర్ధిల్లు!



విశాఖపట్టణంలో జరిగిన భాగస్వామ్య సదస్సులో విజూల్ గ్రూపు సంస్థ చెక్కతో ముందే నిర్మించే ఇళ్ల తయారీపై ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం రామాయపట్నం వద్ద సుమారు 50 ఎకరాల్లో రూ. 300 కోట్ల వ్యయంతో అత్యాధునిక తయారీ కేంద్రం ఏర్పాటు చేయనుంది. జిల్లాకూ ఎంతో ప్రయోజనం కానుంది. సొంతింటి కల సాకారానికి ఉపయుక్తం కానుంది. కాగా.. కాంక్రీట్ నిర్మాణానికి ప్రత్యామ్నాయంగా వస్తున్న ఈ ఇళ్లు(ప్రీ ఫ్యాబ్రికేటెడ్) జిల్లాకు కొత్తేమీ కాదు. నాలుగేళ్ల కిందటే సంగం మండలం కోలగట్లలోని రొయ్యల చెరువుల వద్ద గోదావరి జిల్లాకు చెందిన వాసు అనే రైతు ఏర్పాటు చేయించారు. తనకు నచ్చిన ఆకృతిలో.. సౌకర్యాలతో హైదరాబాద్‌లో తయారు చేయించి..లారీలో తెచ్చి అమర్చారు. ఇప్పుడు ఇదే తరహా ఇళ్ల తయారీ పరిశ్రమ జిల్లాకు తరలిరావడం విశేషం. పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేల నుంచి 30వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. – న్యూస్‌టుడే, సంగం

కండలేరుకు విశ్వఖ్యాతి

సంగం, న్యూస్‌టుడే: కండలేరు జలాశయం.. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మానస పుత్రికగా పేరొందిన ఈ జలనిధి ఓ ఇంజినీరింగ్ అద్భుతంగా వినుతికెక్కింది. కేవలం మట్టి కట్ట ఆధారంగా 68.03 టీఎంసీలు నిల్వ చేసే అవకాశం ఉండటం ఇక్కడ మరో విశేషం.

తెలుగుగంగ పథకంలో భాగంగా...

చెన్నై తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలను తరలించేందుకు రాపూరు మండలంలో ఈ జలాశయం నిర్మించారు. 10.752 కి.మీ. పొడవు, 49 మీటర్ల ఎత్తు, ఉపరితలంలో ఆరు మీటర్ల వెడల్పుతో ఇక్కడ నిర్మించిన కట్టకు 1.62 కోట్ల ఘనపు మీటర్ల మట్టి వినియోగించారు. 1984లో ప్రారంభమైన ఈ పనులు 1996 వరకు కొనసాగాయి. 22 గ్రామాలను విలీనం చేసుకుని నిర్మించగా.. పరిహారం చెల్లింపుల సమస్యతో పూర్తిస్థాయిలో పూర్తి స్థాయిలో నిల్వ చేయలేదు. 2020 నవంబరులో మాత్రమే 61.165 టీఎంసీలు నిల్వ చేశారు. ప్రస్తుతం 58.06 టీఎంసీలతో తొణికిసలాడుతోంది.

ప్రవాహ వేగంతోనే..

జలాశయానికి 391 చదరపు కి.మీ. పరీవాహకం ఉన్నా.. గరిష్ఠంగా లభించేది మూడు టీఎంసీలే. మిగిలిన నీరు కృష్ణ, పెన్నా నదుల నుంచి వస్తుంది. ఇక్కడి నుంచి 178 కి.మీ. దూరంలోని పూండి(చెన్నై) జలాశయానికి 12 టీఎంసీలు తాగునీరుగా, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని మూడు లక్షల ఎకరాలకు సాగునీరుగా తరలిస్తున్నారు. ఇదంతా ప్రవాహ వేగంతోనే జరుగుతుండటం.. 2017 నుంచి ఓ ప్రైవేటు సంస్థ రెండు యూనిట్ల ద్వారా ఆరుమెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయడం.. 150 చదరపు కి.మీ. వైశాల్యంలో నీటి నిల్వలతో పర్యాటకులకు కనువిందు చేయడం ఇక్కడ చెప్పుకోదగ్గ విషయాలు. ఓఎస్డీ శ్రీరాం కృష్ణయ్య వంటి ఇంజినీరింగ్ నిపుణుల నైపుణ్యమే ఈ జలాశయం నిర్మాణంలో కీలకమని తెలుగుగంగ డీఈఈ విజయరామిరెడ్డి కొనియాడారు.

చెబితే వినక.. చేటు కనక!

కల్వర్టు కూలి రాపూరు, రాజంపేట మార్గాల్లో నిలిచిన రాకపోకలు

దేగపూడి-రాజుపాళెం సమీపంలో కూలిన కల్వర్టు

న్యూస్‌టుడే, పొదలకూరు, పొదలకూరు రూరల్: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే.. రాపూరు సమీపంలోని పెంచలకోన క్షేత్రానికి రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు తరలివచ్చే కీలక మార్గంలోని కల్వర్టు మంగళవారం సాయంత్రం కూలిపోయింది. పొదలకూరు నుంచి వెళ్లే మార్గంలోని దేగపూడి- రాజుపాళెం కల్వర్టుకు ఈ పరిస్థితి ఎదురవగా.. రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లూరు నుంచి పొదలకూరు, రాపూరు, రాజంపేట మార్గాల్లో తిరిగే బస్సులు, లారీలు, టిప్పర్లు బారులు తీరాయి. ఇటీవలి మొంథా తుపాను వర్షాలకే కల్వర్టు కొంత మేర కుంగింది. అయినా అధికారులు సత్వర చర్యలు చేపట్టలేదు. దగ్గర గ్రామాల ప్రయాణికులు కూలిపోయిన కల్వర్టును అతి కష్టం మీద దాటుకుని గ్రామాలకు వెళ్లగా.. దూర ప్రాంత ప్రయాణికులు కొంతసేపు అవస్థలు పడి వెనుదిరిగారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రూ. 28 లక్షలతో కొత్తది నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. డైవర్షన్ రోడ్డు వేసేందుకు రూ. 8 లక్షలు మంజూరయ్యాయన్నారు. తాత్కాలిక ఏర్పాటుకు కల్వర్టు వద్దకు పైపులు తెచ్చామని, రాకపోకలు పునరుద్ధరిస్తామని వివరించారు.

నాడే హెచ్చరించిన 'ఈనాడు'...

సుమారు 40 రోజుల కిందట ఈ కల్వర్టు వద్ద గుంత ఏర్పడగా.. అధికారులు చుట్టూ ముళ్లకంప ఏర్పాటు చేసి మమ అనిపించారు. అప్పటి నుంచి రాకపోకలు ఇరుకుగా మారడంతో పాటు.. ప్రమాదం పొంచి ఉంది. ఎదురెదురుగా వాహనాలు రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. దీనిపై అక్టోబరు 16న 'ఈ మార్గం.. జరభద్రం' శీర్షికన 'ఈనాడు' చిత్రసహిత కథనం ప్రచురించింది. దానికి స్పందనగా అధికారులు మళ్లింపు రోడ్డు వేసేందుకు సిమెంట్ తూములు తెచ్చినా.. పనులు చేపట్టలేదు. ఇంతలో కూలిపోయింది.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

నెల్లూరు(విద్య) : జాతీయ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా వెంకటేశ్వరపురంలోని బాలుర ఐటీఐ కళాశాలలో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ కె.శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు చక్రాల వాహనం సర్వీస్ టెక్నీషియన్, కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94944 56326 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నవోదయ హాల్ టికెట్లు.. పొందొచ్చు ఇలా..

మర్రిపాడు, న్యూస్‌టుడే : విద్యా సంవత్సరం 2026-27కు సంబంధించి డిసెంబరు 13న జరిగే జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లను నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.పార్వతి మంగళవారం తెలిపారు. విద్యార్థి రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీని ఉపయోగించి డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన సందేహాలుంటే 94935 14644, 89850 07588 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

(c) eenadu

కలెక్టరేట్‌లో విభాగాలను పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

గందరగోళంగా దస్త్రాలు.. జేసీ అసహనం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నెల్లూరు కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో ఫైళ్లు కుప్పలుతెప్పలుగా ఉండటాన్ని చూసి జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట భూ విభాగానికి వెళ్లి సంబంధిత తహసీల్దారును పిలిచి అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్న ఫైళ్ల గురించి అడిగారు. ఉద్యోగుల కుర్చీలు ఖాళీగా ఉండటాన్ని గమనించి ఎక్కడికెళ్లారని ప్రశ్నించారు. అనంతరం ఎ, బి, సి, డి సెక్షన్లను పరిశీలించి ఉద్యోగులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం డైనింగ్ హాలును పరిశీలించగా దస్త్రాలు గుట్టలుగా ఉండగా.. ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. వెంటనే తొలగించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. కార్యాలయంలో మార్పులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటు డీఆర్వో విజయకుమార్ ఉన్నారు.

సనాతనధర్మం కోసం జీవోలు మారుస్తాం

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు(జడ్పీ): రాష్ట్రంలో దేవాలయాల పవిత్రత, సనాతన ధర్మం కాపాడేందుకు అవసరమైతే పాత జీవోలను మార్చి సమర్థంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో ఆలయాల పవిత్రతను భ్రష్టుపట్టించారని, తిరుమల వంటి చోట్ల లడ్డూల్లో కల్తీనెయ్యి వినియోగించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక దేవాదాయ అధికారులంతా వారి పరిధిలో ఉన్న ప్రైవేట్ ఆలయాలు, ఆధ్యాత్మిక సంస్థల పూర్తి వివరాలతో అక్కడ జరిగే కార్యక్రమాలతో ప్రత్యేక నివేదికలు తయారు చేయాలి. ప్రైవేట్ ఆలయాలపైనా, సంస్థలపైనా ప్రభుత్వ పెత్తనం ఉండదు. కేవలం అక్కడ జరిగే కార్యక్రమాల పట్ల అవగాహన, సహకారం కోసమే ఈ నివేదికలు తయారు చేయిస్తున్నాం. పలాస, కాశీబుగ్గలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నాం' అని తెలిపారు. ముందుగా జరిగిన దేవాదాయశాఖ అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ అధికారులు, సిబ్బంది భయం, భక్తితో పని చేయాలని సూచించారు. ఆగమశాస్త్రం విషయంలో ఎక్కడా అధికారులుగానీ, ఆలయ కమిటీల జోక్యంగానీ ఉండకూడదని, కేవలం పండితులు, అర్చకులు సూచనలనే అనుసరించాలని తెలిపారు. 15 ఏళ్లలో 210 ఆలయాలకు రూ.234 కోట్లు మంజూరు చేస్తే.. కూటమి ప్రభుత్వ వచ్చిన 18నెలల కాలంలో 288 ఆలయాల పునర్ నిర్మాణానికి రూ.221కోట్లు కేటాయించామన్నారు.

తివాచీ అనుకొనేరు.. అడుగేస్తే మునకేస్తారు

ఇది పచ్చిక అనుకుంటున్నారా.. కాదండోయ్ మురుగు. ఇటీవల వర్షాలకు గ్రామంలోని బస్టాండ్ కూడలి సమీపంలోని వంతెన వద్ద నీరు ఇలా ఏర్పడింది. దోమలకు ఆవాసంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. మండల కార్యాలయాలు, గ్రామంలోకి ఈవంతెన పైనుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. – న్యూస్‌టుడే, సీతారామపురం

అయ్యప్ప ఆలయం.. దీప శోభితం

నగరంలోని వేదాయపాలెం అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం స్వామివారి ముందు తేజోవంతమైన దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. కేరళ సంప్రదాయం ప్రకారం పలు కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ముందుగా అయ్యప్పస్వామికి నిర్మల దర్శనంలో క్షీరాభిషేకం చేశారు. ఉభయకర్తలు, భక్తులు భారీగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (బారకాసు)

రూ.కోట్లు వెచ్చించారు.. పగుళ్లతో సరిపెట్టారు

రెండేళ్లు కూడా పూర్తి కాకముందే వైకాపా హయాంలో పొదలకూరులో వేసిన సిమెంట్ రోడ్లు పగుళ్లిస్తున్నాయి. రూ.20 కోట్లకు పైగా వెచ్చించారు.. అయితే వాటిలో సరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో చాలా చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేసిన గుత్తేదారుతో బాగు చేయించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పొదలకూరు

వసతి.. చన్నీరే గతి

హాస్టళ్లలో కనిపించని సోలార్ వాటర్ హీటర్లు, గీజర్లు

ప్రభుత్వ వసతి గృహాల్లో అరకొర వసతుల మధ్య విద్యార్థులు చదువుతున్నారు. కొన్నిరోజులుగా చలి తీవ్రత పెరిగింది. విద్యార్థులు స్నానానికి చన్నీళ్లే వాడుతున్నారు. సోలార్ వాటర్ హీటర్లు, గీజర్ల వసతి లేదు. వేడినీళ్లు లేక పలువురు విద్యార్థులు రోజుల తరబడి స్నానం చేయకుండా ఉండిపోతున్నారు. కొందరు అస్వస్థతకు గురవుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య), కావలి, కందుకూరు పట్టణం

కందుకూరు పట్టణం.. చన్నీటితో స్నానం చేస్తున్న ఎస్సీ వసతిగృహ విద్యార్థులు

జిల్లాలో ఎస్సీ వసతి గృహాలు: 71
ప్రీమెట్రిక్ వసతిగృహాలు (3 నుంచి 10వ తరగతి వరకు): 67, విద్యార్థులు: 4,242 మంది
పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు (ఇంటర్ నుంచి డిగ్రీ, పీజీ): 12, విద్యార్థులు: 1337 మంది
బీసీ వసతి గృహాలు: 59, విద్యార్థులు: 4,286 మంది
ప్రీమెట్రిక్ వసతి గృహాలు: 43, విద్యార్థులు: 3,086 మంది
పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు: 16, విద్యార్థులు: 1200 మంది

జలుబు, దగ్గుతో బాధలు

ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం: కందుకూరు పట్టణంలోని విక్కిరాలపేట రోడ్డులో ఉన్న ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో హీటర్లు, గీజర్లు లేక విద్యార్థులు చన్నీటితోనే స్నానం చేస్తున్నారు. ఉలవపాడులోని బీసీ, ఎస్సీ, కరేడులోని బీసీ, ఎస్టీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాల, కేజీబీవీలో ఇదే పరిస్థితి నెలకొంది. గుడ్లూరు మండలంలోని బీసీ, ఎస్సీ, కేజీబీవీ, ఆశ్రమ గురుకుల పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థులకు వేడినీటి వసతి లేదు. లింగసముద్రం మండలంలో బీసీ బాలిక, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులు చన్నీటితో స్నానాలు చేస్తూ తరచూ జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు.

సమావేశాల్లో ప్రస్తావన వచ్చినా..

కావలి పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న బీసీ వసతిగృహం - 1, 2లో జ్వరపీడితులైన విద్యార్థులు సైతం చన్నీటి స్నానం చేసిన సందర్భాల్లో మరింత అస్వస్థతకు గురవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు జరిగినప్పుడల్లా సమస్య ప్రస్తావనకు వస్తుంది. స్థానిక వసతిగృహ సంక్షేమాధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నా ప్రయోజనం లేదు.

అనారోగ్యానికి గురైతేనే..

సంగం, ఆత్మకూరు: సంగంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో 600 మంది బాలికలుండగా.. అనారోగ్యానికి గురైన వారికే వేడినీళ్లను సరఫరా చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో వివిధ వసతి గృహాల్లో 700 మంది విద్యార్థులకు వేడినీటి వసతి లేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

విద్యార్థుల చన్నీటి స్నానంపై జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి **వెంకట లక్ష్మమ్మ**ను వివరణ కోరగా.. వసతి గృహాల్లో వాటర్ హీటర్లు, గీజర్లకు వెసులుబాటు లేదన్నారు. వాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

బాటలు ఆక్రమించిన వారిపై చర్యలు

చేజర్ల, న్యూస్ టుడే: గ్రామాల మధ్య రహదారులు, పొలాలకు వెళ్లే బాటలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఆర్డీవో బి.పావని తెలిపారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై మంగళవారం ఆమె చేజర్ల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. తిరువతినాయుడుపల్లి ఎస్సీ కాలనీ వాసులను దారిలో వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యవహారంపై క్షేత్రస్థాయిలో విచారించారు. పేదల పొలాల్లో అక్రమంగా కొనుగోలు చేయడంతో పాటు, వారిని ఇబ్బందులకు గురి చేయడం నేరమన్నారు. రెవెన్యూ దస్త్రాల్లో ఉండే బాటలు ఆక్రమించి పొరుగువారికి ఇబ్బంది కలిగించొద్దని పలువురికి సూచించారు. కోటితీర్థంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన చేపల చెరువును తొలగించాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు సోమ్లానాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనే ధ్యేయం

ఇందుకూరుపేట : కుష్ఠు నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలి అన్నారు. రావూరు గిరిజనకాలనీలో జరుగుతున్న కుష్ఠు సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికెళ్లి ఆ లక్షణాలను ఉన్నవారిని గుర్తించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. కాలి వేళ్లను పూర్తిగా కోల్పోయిన ఒక బాధితుడి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని పింఛన్ మంజూరు చేయాలని ఎంపీడీవోకు సూచించారు. గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారి కిశోర్ కుమార్, సుధాకర్ రావు, పలువురు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలున్నారు.

పాఠశాలను తనిఖీ చేస్తున్న ఖాదర్‌వలి

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.11,705
(3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	
సవర ధర:	రూ.93,640
వెండి గ్రాము :	రూ.162.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	132
లేయర్	120
బ్రాయిలర్స్	238
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	204

ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

నెల్లూరు(విద్య) : జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల్ని మంగళవారం విద్యుత్తు శాఖ ఎస్ఈ కె.రామచేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలో రెండు స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఎక్కువ అవుతాయని.. వీటి ద్వారా పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషాద్రి బాలచంద్ర, శ్రీధర్, అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మహిళా సహకార డెయిరీ సంఘాల ఏర్పాటే లక్ష్యం

నెల్లూరు (పద్మావతిసెంటర్), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుతం 16 మహిళా డెయిరీ సహకార సంఘాలు ఉన్నాయని, వాటిని 100కు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ప్రత్యేకాధికారి కె.వి.రమణ పేర్కొన్నారు. నగరంలోని పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయంలో 16 మహిళా డెయిరీ సహకార సంఘాల సెక్రటరీలు, పశుసంవర్ధక సహాయకులకు సంఘాల ఆవశ్యకత గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటులో జిల్లా ముందుందని తెలిపారు. జిల్లాలో 49 గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల భవనాలు నిర్మించినట్లు వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్లు టి.సోమయ్య, ఎ.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణ

కనుల పండువగా కల్యాణం

బుచ్చిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని దామరమడుగు గ్రామంలో వెలసిఉన్న కామాక్షి తాయి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో స్థానికంగా ఉన్న భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

కల్యాణోత్సవంలో కామాక్షితాయి మల్లికార్జునస్వామి

విశాఖపట్నంలోని గౌరవనీయ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ వారి సమక్షంలో
(గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్, శ్రీ నారాయణ భవనం, సాయిబాబా స్ట్రీట్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం-530020.

Between O.A.1072/2025

బ్యాంక్ ఆఫ్ బరోడా, నెల్లూరు బ్రాంచి,
నెల్లూరు తరపున అధీకృత అధికారి ... అప్లికెంట్ బ్యాంక్
మరియు
శ్రీ చెన్నుపాటి బాలాజీ కుమార్ ...ప్రతివాది
శ్రీ చెన్నుపాటి బాలాజీ కుమార్, తండ్రి: సిహెచ్.వెంకటరత్నం నాయుడు,
వయస్సు: 33 సం॥లు, డి.నెం.7-93/A, వడ్డిపాలెం, దుత్తలూరు, నర్రవాడ,
యస్‌పియస్ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524222 (ఏకైక ప్రతివాది)

ఏకైక ప్రతివాదికి ప్రత్యామ్నాయంగా పత్రికా ప్రచురణ రూపంలో సమన్లు

1. పేర్కొన్న మొత్తాలను దానిపై ప్రస్తుత మరియు తదుపరి వడ్డీ & ఇతర రిలీఫ్స్‌తోపాటు రికవరీచేయుట కొరకు మీ పై రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ & ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్స్ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 19 క్రింద పై దరఖాస్తును దరఖాస్తుదారుకు ఇచ్చుట జరిగింది. మీరు సదరు క్లెయిమ్‌కు జవాబు ఇచ్చేందుకు **03-12-2025 న ఉ.10.30 గం.లకు** లేదా ట్రిబ్యునల్ సౌకర్యార్థం ఆ తర్వాత వచ్చే అట్టి సమయానికి ఈ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరై, వ్రాతపూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా మీకు సమన్ ఇవ్వడమైనది.
2. మీరు ఏవైనా డాక్యుమెంట్లను దాఖలు చేయదలిస్తే, మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంట్‌తో పాటు ఒక జాబితాతో దానిని దాఖలు చేయవచ్చును.
3. మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/ అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ నమోదిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.
4. ఇందులో ముందుగా తెలిపిన తేదీన మీరు హాజరగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్ మీ గైర్హాజరులో విచారించబడి, నిర్ధారించబడునని గమనించవలెను.

నాచే స్వయంగా ఈ ట్రిబ్యునల్ సీల్‌తో **18 నవంబర్, 2025న** ఇవ్వబడింది.
సం/- రిజిస్ట్రార్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

సంగం, న్యూస్‌టుడే: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, జిల్లాలో యూరియా పుష్కలంగా ఉందని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. సంగంలో మంగళవారం బెజవాడ పాపిరెడ్డికాలువ ద్వారా సాగునీటి సరఫరా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ రైతు సేవాకేంద్రాలు, సహకార సంఘాల ద్వారా యూరియా రూ.270కి బస్తా లభిస్తోందని, డీలర్లకు రవాణా వ్యయం ఉండడంతో వారిని రూ.300 వరకు విక్రయించేందుకు అనుమతించారన్నారు. బెజవాడ పాపిరెడ్డి కాలువ ద్వారా 92 చెరువులతో పాటు 77వేల ఎకరాలకు సాగు నీటి సరఫరా జరగాల్సి ఉండగా, అంతకు మించి 1.25 లక్షల ఎకరాలకు సరఫరా జరుగుతుండటం విశేషమని తెలిపారు. చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కావలి చెరువు వరకు 12 కి.మీ పొడవునా కాలువ తవ్వకం పనులు ప్రారంభించామన్నారు.

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ... కూటమి పాలనలో ఉదయగిరికి మంచి రోజులు రానున్నాయి. 149 చెరువులు, గండిపాళెం జలాశయం ఉన్న నియోజకవర్గంలో ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలు బాధ్యత చేపట్టడంతో వాటి నిర్వహణ బాగుపడిందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా సోమశిల జలాలు తాగునీటి రూపంలో తమ నియోజకవర్గానికి అందనున్నాయని, వాటి నిల్వకు అవసరమైన భారీ జలాశయం ఒకటి ఏర్పడితే ఎంతో సంతోషిస్తామన్నారు. సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు కేశవచౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు కె.మధుబాబు నాయుడు, తెదేపా నాయకులు రవీంద్రారెడ్డి, బి.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెజవాడపాపిరెడ్డి కాలువ రెగ్యులేటరు ద్వారా నీరు విడుదల చేస్తున్న కావలి, ఉదయగిరి శాసనసభ్యులు

ప్రసన్నుడి రథం తిరిగే మార్గంలో మురుగునీరు

ఆధ్యాత్మిక క్షేత్రం
కష్టాలకు నిలయం

బిట్రగుంట, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన బిలకూటక్షేత్రం ప్రసన్న వెంకటేశ్వరస్వామి కొలువైన బిట్రగుంట పంచాయతీలో సమస్యలు పాగా వేశాయి. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు నిత్యం నానాఇబ్బందులు పడుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాల్సిన పంచాయతీ అధ్వానంగా తయారవడం ప్రజలనే కాదు భక్తుల్ని కూడా బాధిస్తోంది. బిట్రగుంట పంచాయతీలో కొండ, పాత బిట్రగుంట గ్రామాలు ఉన్నాయి. 4500 మందికి పైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామాల్లో రథోత్సవం జరిగే కీలకమైన రోడ్డు సిమెంట్‌గా అభివృద్ధి చెందినా అనుబంధంగా కాలువలు లేక మురుగుకూపంగా మారింది. రెండేళ్ల కిందట బ్రహ్మోత్సవాల్లో రోడ్డు అంచులోకి దిగిన శ్రీవారి రథం పక్కకు వరిగి అపశ్రుతి చోటు చేసుకుంది. కొద్దిపాటి వర్షం పడినా కొండ, పాతబిట్రగుంటలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. సంక్షేమానికి కూడా ఆటంకాలు ఏర్పడ్డాయి. సీపీడబ్ల్యూ పథకం తాగునీరు రంగు మారి వస్తోంది. జాబితాలో బిట్రగుంట పంచాయతీ లేకపోవడం బాధాకరం. చేతి పంపులు కూడా మరమ్మతులకు గురై అలంకారప్రాయంగా మారాయి. ఇక అంతర్గత రోడ్లు, శ్మశానాలకు వెళ్లే బాటలు గుంతలతో అడుగు పెట్టేందుకు వీల్లేకుండా ఉన్నాయి. పాతబిట్రగుంట నడిబొడ్డులో ఉన్న పాఠశాల భవనం లోతట్టులో ఉంది. వర్షాకాలం మురుగు చేరుతుంది. సచివాలయానికి వెళ్లే మార్గం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

ఇలా చేస్తే ప్రయోజనం

కొండ, పాత బిట్రగుంట గ్రామాల్లో శ్రీవారి రథం తిరిగే రోడ్లను ఇరువైపులా ఆక్రమణలు తొలగించి కాలువలు ఏర్పాటుచేయాలి. దుస్థితిలో ఉన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చాలి. మంచినీటి సౌకర్యం కల్పించాలి. ప్రధాన రహదారుల వెంబడి పచ్చదనం పరిచేలా మొక్కలు నాటి పెంచాలి. ప్రసన్నుడి ఆలయంతో పాటు గ్రామాలను కూడా ఆహ్లాదకరంగా తీరిదిద్దితే పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతుంది. ఈ విషయాన్ని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత శాఖల అధికారులతో పాటు ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి తెలిపి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వివరించారు.

EENADU Classifieds

TO LET
నెల్లూరు రామ్మూర్తి నగర్‌లో 1వ ఫ్లోర్‌లో 3 బెడ్ రూం, 2 హాల్స్, పూజ రూం గల ఇల్లు (2200 Sft) అద్దెకు కలదు. అద్దె: 35000. సంప్ర: 94940 49324
నెల్లూరు మినీబైపాస్ రోడ్ దండి పక్కవద్ద హోటల్ పైన 2 BHK ఫ్లాట్ అద్దెకు కలదు. సంప్ర: 80082 30306

JOBS
వింజమూరు జి-డిజిటల్ షోరూమ్‌లో పని చేయుటకు Sales స్టాఫ్ కావలెను Male, Age 19-35 Yrs, Qly-Inter/డిగ్రీ, వింజమూరు, Ph-97058 26033
ఇట్లీ బోర్ వెల్స్ కావలెను, రెండుఫోకలర్ డ్రైవర్ మంత్లీ శాలరీ 30000 బాటాఫుడ్ మరియు ఫోన్ తెల్సి ఉండాలి. సంప్ర: 9963630238

బ్యాంక్ లోన్స్ ఫైనాన్స్ Back-end, టెలికాలర్, మేనేజర్ కావలెను. 30Y, మ్యారీడ్ స్త్రీలు, నో బ్యాక్లాగ్స్, 10K, 12K, 25K నెల్లూరు. 8885802000
భారత్‌భక్తాల గుప్త్రంపూజ్ 7 గ్రామాల్లో 200+ బ్రాంచీలతో 28 సం॥లుగా సమగ్రమైన MSCS (ఆర్ బ్యాంకింగ్) సంస్థలకు ఫీల్డ్ ఆఫీసర్ /యువకులు కావలెను. Contact 9182440586
Spices Company నందు సేల్స్ మార్కెటింగ్ కావలెను. అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు. Cell: 97049 48491
కుమార్ అడ్వర్ టైజ్‌మెంట్ కార్యాలయంలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. 8125110304 నెల్లూరు, గూడూరు, కావలి, సూళ్లూరుపేట.

TOURS AND TRAVELS
వేదవిద్యాసాధనా పరిషత్ వారిచే కాశీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ యాత్ర - 2026 జనవరి 1000/- మాత్రమే...

FACULTY/ TEACHERS
A Well Known Coaching Centre at B.V.Nagar Requires Teachers for Study Hour-1(Morning), Math-1 & Biology-1. ✆ 99599 22164

నెల్లూరు 80080 01790
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

ప్రేమ పేరుతో మోసం.. యువతి ఆత్మహత్యాయత్నం

కావలి, న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో యువకుడు మోసం చేయడంతో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉదంతమిది. ఈఘటనలో పట్టణంలోని విష్ణాలయం వీధికి చెందిన యువకుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఒకటో పట్టణ ఎస్సై ఎస్. సుమన్ కథనం ప్రకారం.. అయిదు నెలలుగా నిందితుడు ఆ యువతిని ప్రేమిస్తున్నానని చెప్పి నమ్మించాడు. పెళ్లి చేసుకోమంటే కులం పేరుతో దూషిస్తూ నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి మంగళవారం ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం.. కేసు నమోదు

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో తొమ్మిదో తరగతి చదివే బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు.. దుత్తలూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. హైదరాబాద్‌లో హోటల్ మేనేమెంట్ మూడో సంవత్సరం చదువుతున్న వింజమూరు పట్టణానికి చెందిన సాదిఖ్ అనే యువకుడితో ఆ బాలికకు ఏడు నెలలుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఈ క్రమంలో ఆమెను గ్రామం నుంచి ఆదివారం ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతానికి సాదిఖ్ తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తిరిగి ఆమె ఇంటి వద్ద వదిలేసి అదేరోజు రాత్రి హైదరాబాద్ వెళ్లిపోయాడు. బాలికకు రక్తస్రావమై అస్వస్థతకు గురవడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం సోమవారం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు అత్యాచారానికి గురైనట్లు గుర్తించి పోలీసులు సమాచారమందించారు. పోలీసులు వివరాలు సేకరించి దుత్తలూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపరాల పంట.. సిరులే ఇంట

నూతన రకం విత్తనాలపై పరిశోధనలు
'ఈనాడు- ఈటీవీ'తో ప్రధాన శాస్త్రవేత్త రాజేష్ ముఖాముఖి

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్), పొదలకూరు

వ్యవసాయాన్ని రైతులు లాభసాటిగా మార్చాలంటే.. వరికి ప్రత్యామ్నాయంగా అపరాల పంటలు సాగు పెంచాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పొదలకూరులోని పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు అధిక దిగుబడులిచ్చే మినుము, పెసర, కందులు వంటి అపరాల పంటల విత్తనాలపై పరిశోధనలు చేస్తున్నారు. తెగుళ్లను తట్టుకుని, ఎక్కువ దిగుబడులను ఇచ్చే రకాలు రైతుల ముంగిటకు తీసుకొస్తామని పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రసన్న రాజేష్ తెలిపారు. ఆయనతో 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖి..

అధిక దిగుబడులిచ్చే వంగడాలు

ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరపున అపరాలపై పరిశోధన స్థానం పొదలకూరులో స్థాపించారు. ఇక్కడ మినుము, పెసరలో అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల అభివృద్ధి, చీడపీడల యాజమాన్యం గురించి పరిశోధనలు చేస్తున్నాం. మినుము పంటకు వైఎంవీ అనే వైరస్ సమస్య వస్తుంది. వాటిని తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే రకాలు అభివృద్ధి చేయడమే లక్ష్యం. మినుములో మూడు, పెసరలో రెండు రకాలు విత్తనోత్పత్తి చేసి.. దిగుబడి సామర్థ్య పరీక్షల కోసం కేంద్రం, రాష్ట్ర పరిధిలోని ల్యాబ్‌లకు పంపుతున్నాం.

విద్యార్థులకు నేర్పుతున్నాం

పరిశోధన స్థానంలో పాలిటెక్నిక్ కళాశాల కూడా ఉండటంతో విద్యార్థులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాల్ని వివరిస్తున్నాం. వేరుసెనగలో కూడా కొన్ని రకాలు అభివృద్ధి చేస్తున్నాం. టీసీజీఎస్ 1694, విశిష్ట అనే రకాలు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ కేంద్రం నుంచి విడుదలయ్యాయి. దానికి సంబంధించిన విత్తనోత్పత్తి కూడా వంద క్వింటాళ్లు ఇచ్చారు. రైతులకు ఇచ్చి మళ్లీ మేమే కొనుగోలు చేసే అవకాశం ఉంది. మినుములో పీయూ 31, టీబీజీ104 రకాల విత్తనోత్పత్తి చేస్తున్నాం.

నాణ్యమైనవే తీసుకోవాలి

అపరాల్లో ఆశించినంత దిగుబడి రాకపోవడానికి కారణం నాణ్యమైన విత్తనం దొరకక పోవడమే. వ్యవసాయ పరిశోధన స్థానాలు, విత్తనోత్పత్తి సంస్థలు ఏపీ సీడ్స్, ఎన్ఎస్‌సీ వారి నుంచి విత్తనాలు తీసుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ వారి వద్ద నాణ్యమైన విత్తనం దొరుకుతుంది. రైతులు వారి దగ్గరే తీసుకుని సాగు చేయాలి. 25 ఏళ్ల కిందట పొదలకూరు మినుము-1, పెనుశిల అనే రెండు రకాలు తయారు చేశాం. ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా.. మరింత అభివృద్ధి చేయగా.. పది క్వింటాళ్ల వరకు వస్తోంది.

పుస్తక ప్రదర్శన పరిశీలిస్తున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు

అవకాశాలకు వేదికగా విశ్వవిద్యాలయం

వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థులు విశ్వవిద్యాలయాన్ని అవకాశాలకు వేదికగా మలచుకొని ముందుకు సాగాలని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు సూచించారు. నూతనంగా చేరిన విద్యార్థుల కోసం మంగళవారం నిర్వహించిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య కేవలం పాఠ్యాంశాలకు పరిమితం కాదని... వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక బాధ్యత ఇందులో అంతర్భాగమన్నారు. రిజిస్ట్రార్ సునీత, విద్యార్థి సంక్షేమ డీన్ ప్రభాకర్ పాల్గొన్నారు

● జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వీఎస్‌యూలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వీసీ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు.

రైలు నుంచి జారి నదిలోపడి మృతి

నెల్లూరు(నేర విభాగం) : రైలు నుంచి జారి పెన్నానదిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పెన్నారైల్వే బ్రిడ్జిపై మంగళవారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగి ఉండి తెలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, పచ్చ రంగు షాట్ ధరించి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

శిక్షణకు హాజరైన కార్యదర్శులు, సిబ్బంది

శిక్షణకు ప్రజాప్రతినిధుల డుమ్మా

మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్లీన్, గ్రీన్ శిక్షణ కార్యక్రమానికి తొలిరోజే ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. 24 పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు హాజరు కావాల్సి ఉంది. ఇద్దరు సర్పంచులు మాత్రమే హాజరవగా, ఉపసర్పంచులు ఎవరూ రాలేదు. దీంతో తూతూమంత్రంగా నిర్వహించి మమ అనిపించారు. -న్యూస్‌టుడే, వరికుంటపాడు

వ్యవసాయ కళాశాలలో దీక్షారంభం ప్రారంభం

ఉదయగిరి, న్యూస్‌టుడే : పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ వ్యవసాయ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమాన్ని మంగళవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ టి.గోపీకృష్ణ, లావణ్యకుమార్, కిషన్‌తేజ్, దుర్గాప్రసాద్, పరిపాలనాధికారి కమలప్రియ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: గడ్డపొన చెరువు పరిధిలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పొలాలకు నీరు సక్రమంగా రావడం లేదు. -వెంకటేశ్వర్లు, రైతు

సమాధానం: నీటి పారుదలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. - రమేష్‌, ఏఈ, జలవనరుల శాఖ - న్యూస్‌టుడే, కలిగిరి

? మా ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - డి.ఈశ్వరయ్య, ఉత్తర జనతాపేట

✓ కుక్కలను పంగోలుకు తీసుకెళ్లి అక్కడ సంతాన నియంత్రణ శస్త్రచికిత్స చేయిస్తున్నాం. - శ్రావణ్‌కుమార్, కమిషనర్ - న్యూస్‌టుడే, కావలి.

? గ్రామంలోని మిట్టపాలెం వెళ్లే మార్గంలో తాగునీటి పైపులు మరమ్మతుల కోసం తవ్వి పూడ్చలేదు. రాత్రి సమయంలో చీకట్లో వాహనదారులకు ఇబ్బందిగా ఉంది. -మణివరనాయుడు

✓ పరిశీలించి వెంటనే సరిచేస్తాం. -నరేష్‌, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, గుడ్లూరు

? మా గ్రామంలో దళిత కాలనీలో వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. - వెంకయ్య,కొండాపురం

✓ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - నాగరాజు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, దగదర్తి

? సండిపాడు కూడలి నుంచి గ్రామం వరకు పలు చోట్ల మలుపులు ఉన్నాయి. సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. - అశోక్‌, స్థానికుడు

✓ పరిశీలించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - హజరత్, ఏఈ, పీఆర్ - న్యూస్‌టుడే, దుత్తలూరు

ప్రతిభ చూపి.. బహుమతులు పట్టి

కావలి మినర్వ పాఠశాల విజేతలతో నిర్వాహకులు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థుల జీవితాలపై 'సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. రాజావారి వీధిలో ఉన్న మినర్వ మినర్వ పాఠశాలలో ప్రహర్షిణి, కుసుమ, గీతిక ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల డీజీఎం షేక్ రఫీ బహుమతులు అందజేశారు.

బహుమతులతో విజేతలు

● కందుకూరుపట్టణం: పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న జేజీవీ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ఎస్.వైష్ణవి, ఎం.భువనేశ్వరి, ఎస్.చైతన్యలక్ష్మి విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ఏవో వి.స్వాతి, ఉపాధ్యాయులు డి.శ్రీనివాసులు, కె.విజయలక్ష్మి, కె.లక్ష్మీజ్యోత్స్న బహుమతులు అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

● కావలి పట్టణంలోని మేధా కాన్సెప్ట్ పాఠశాలలో 'కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. వీటిలో ఆర్వీ ద్యుతిశ్రీ, కే లక్ష్మీకార్తిక, డి.పూజిత విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఎన్.లోకేశ్ బహుమతులు అందజేశారు.

చెత్తంతా చెరువులోకే..

తనువంతా విషమే!

న్యూస్‌టుడే, కావలి

చెరువులు ఒకనాడు ప్రాణ ప్రదంగా చూసుకునేవారు. తాగు, సాగునీటి అవసరాలు తీర్చేవి కావడంతో వీటి సంరక్షణకు ప్రాధాన్యమిచ్చేవారు. కాలం మారింది. వీటిలోకి వృథా నీరు వదులుతున్నారు. చెత్తంతా వేస్తున్నారు. కలుషిత కాసారాలుగా మారుతున్నాయి. ఈ నీరు వాడితే తనువంతా విషంగా మారుతోంది. రోగాలతో ఇబ్బందులు పడుతున్నారు. అందుకు నిదర్శనమే కావలిలోని చెరువులు.

పట్టణంలో రామ్మూర్తిపేట, పుల్లారెడ్డినగర్, బృందావన కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వృథా నీరు పాపిరెడ్డి చెరువులోకి నేరుగా మురుగుకాలువల ద్వారా కలుస్తోంది. గతంలో దీనికి అనుబంధంగా ఏర్పాటుచేసిన కాలువలన్నీ మురుగునీటి కాలువలుగా మారాయి. ఎగువ నుంచి నీరు వచ్చే వరద కాలువ ప్రవాహం అనపసుంత ప్రాంతం నుంచి వివిధ వాణిజ్య సముదాయాల మీదుగా పాపిరెడ్డి చెరువులో కలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో చెత్తాచెదారం సహా తుమ్మలపెంట బస్టాండ్ చేపల మార్కెట్‌లో వెలువడే వ్యర్థాలను కూడా ఈ కాలువలో వేస్తున్నారు. మందాటి చెరువుదీ ఇదే పరిస్థితి. శాంతినగర్, రాఘవేంద్ర కాలనీ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ఇందులోకే వస్తోంది. ముసునూరు ప్రాంతం నుంచి వచ్చే వృథా నీరు అక్కడి జలాశయంలోకి చేరుతోంది.

పాపిరెడ్డి చెరువులో కలుస్తున్న వ్యర్థాలు

రోగాలతో రైతన్నల సతమతం

చెత్త కుండీల మారుతున్న చెరువులతో ఆయకట్టు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. పంటలకు కలుషిత నీరు పెడుతున్నందున దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. ఈనీటి కారణంగా చర్మవ్యాధులు సోకుతున్నాయని వాపోతున్నారు. పంట ఉత్పత్తులు కూడా విషతుల్యంగా మారుతున్నాయి. పట్టణంలోని సంతలావాటిలో వారాలమండికి వ్యవసాయ భూములున్నా కొన్నాళ్లుగా సాగు చేయడం లేదు.

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో

కావలిలో రూ.29.3 కోట్ల అమృత్ నిధులతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణానికి ఎనిమిదేళ్ల క్రితం అడుగులు పడగా.. గత వైకాపా పాలనలో నిలిచిపోయాయి. అంతకుముందు తెదేపా హయాంలో పూర్తైన నిర్మాణంతో వ్యర్థాలు నియంత్రణ ఏర్పాటుచేయాల్సి ఉంది. దీనికి డిస్కంకు డిపాజిట్ చెల్లించాలని గుత్తేదారు కోరుతున్నారు. ఆదిశగా కార్యాచరణ పూర్తైతే మురుగు చెరువులో కలవకుండా అడ్డుకట్ట పడుతోంది.

వాస్తవమే

పట్టణంలోని మురుగునీరు పాపిరెడ్డి చెరువులో కలవడం వాస్తవమే. ఎస్టీపీ నిర్మాణం ఆగిపోయింది. అది పూర్తైతే ఈ సమస్యకు తావుండదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

- సాయిరాం, డీఈ, కావలి పురపాలకం

అయ్యప్ప బస్సుల్లో గ్యాస్ సిలిండర్లుంటే చర్యలు

కావలి, న్యూస్‌టుడే: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల బస్సుల్లో వంట గ్యాస్ సిలిండర్లుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి ప్రాంత రవాణాధికారి మురళీధర్, ఎంవీఐ ఆర్.సుందరరావు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులకు ఈ విషయమై అవగాహన కల్పించారు. శబరిమలకు వెళ్లే బస్సులన్నీ తనిఖీ చేస్తామన్నారు. ఈ నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి విరాళం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెమిడిపాడు బస్టాండు కూడలిలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి విగ్రహం కోసం గుడ్లూరుకు చెందిన అయితా శ్రీనివాసులు జ్ఞాపకార్థం ఆయన భార్య వసుంధర, కుటుంబసభ్యులు రూ.60 వేలు విరాళంగా అందజేశారు. ఈ నగదును మంగళవారం విగ్రహ నిర్మాణ బాధ్యులు హనుమంతరావుకు శ్రీనివాసులు కుటుంబసభ్యులు వంశీకృష్ణ, సౌజన్య, హితేశ్‌మాధవ్, కుందన ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడి పూజ

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకానగర్‌లో షిర్డీ శేషసాయి మందిరంలో మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడి పూజ, భజనలు జరిగాయి. గురుస్వాములు పుల్లా సూర్యనారాయణ, కోకోలు వెంకటరావు, మద్దులూరి మనోహర్, రవితేజ, గూగుల్ మధు, మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ సంప్రోక్షణ

ఉదయగిరి : మండలంలోని గంగిరెడ్డిపల్లిలో మన ఫౌండేషన్ ఛైర్మన్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి నివాసంలో అయ్యప్ప సేవా సమాజానికి అందించిన నూతన అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. వేద పండితులు, అయ్యప్ప గురుస్వాములు, అయ్యప్ప మాలధారణ భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఉదయగిరిలోని శివాలయానికి మన్నేటి శ్రీలక్ష్మి, వెంకటరెడ్డి దంపతులు ఊరేగింపుగా తీసుకెళ్లి అయ్యప్ప సమాజానికి అందజేశారు.

నాణ్యమైన విత్తనాల ఎంపికతో మేలు

ఉదయగిరి, న్యూస్‌టుడే : నాణ్యత గల విత్తనాలను ఎంపిక చేసుకుంటే దిగుబడులు బాగుంటాయని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని బిట్-2, వెంగళరావునగర్ రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి, మట్టి పరీక్షలు చేయించాలన్నారు.

బతుకుపోరాటం.. సాహస యానం

వీరు పేదలు. రోజువారీ కూలీలు. ప్రాణాలు పణంగా పెట్టి జామాయిల్ తోటల్లో వ్యర్థాలను పొట్టు చేసే పనులకు వెళుతున్నారు. నిత్యం ఆ యంత్రాలపైనే ప్రమాదకరంగా కూర్చుని రాకపోకలు సాగిస్తున్నారు. వీరిని చూసిన వారు ఆందోళన చెందుతున్నారు. ఈదృశ్యం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. - న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

విద్యాలయం.. కంపచెట్లతో భయం

గ్రామ పంచాయతీ పరిధిలో ఏస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద కంప చెట్లు పెరగడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విష పురుగుల సంచారం అధికంగా ఉంది. ఈ విషయమై ఎంఈవో వెంగయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, దుత్తలూరు

పశువుల సంచారం.. ప్రమాదాలకు ఆస్కారం

సీతారామపురం- కావలి 167బీజీ జాతీయరహదారిపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. అయ్యవారిపల్లి, పోలంగారిపల్లి, రంగనాయుడుపల్లి, బసినేనిపల్లి, సంజీవరెడ్డినగర్ కూడళ్లలో నిత్యం పదుల సంఖ్యలో వెళుతున్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. - న్యూస్‌టుడే, సీతారామపురం

పూడిక తీయరూ !

కావలి- తాళ్లపాలెం చెరువుల మధ్య నాలుగేళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్నా జలవనరుల శాఖ అధికారులకు పట్టడం లేదు. కావలి పెద్ద చెరువు నిండితే కాలువ ద్వారా తాళ్లపాలెం వైపు ప్రవాహం సాగుతోంది. నాలుగేళ్లుగా ఈకాలువలో పూడిక తీయలేదు. దీంతో నీరంతా పంట పొలాల్లోకి చేరుతోంది. ఈ విషయమై జలవనరుల శాఖ ఏఈ జంపాని కిరణ్ స్పందిస్తూ అంచనాలు పంపామని, నిధులు మంజూరైతే పనులు చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, కావలి

బాబోయ్ శునకాలు

ఎన్‌హెచ్ 167బీజీ కలిగిరి మెయిన్ రోడ్డుపై కుక్కలు గుంపులు తిరుగుతున్నాయి. వీటితో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై వెళ్లే వారిని వెంటపడి కాటేస్తున్నాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోనూ వీటి బెడద అధికంగా ఉంది. - న్యూస్‌టుడే, కలిగిరి

మహిళ నిజాయతీ.. బాధితురాలికి బంగారు గొలుసు అప్పగింత

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పోయిన బంగారు గొలుసు బాధితురాలికి అందజేసి మహిళ నిజాయతీ చాటుకున్న వైనమిది. మండలంలోని చెమిడిదిపాడుకు చెందిన జి.లక్ష్మీప్రసన్న సోమవారం కుటుంబ పనులపై కందుకూరు పట్టణానికి వచ్చింది. కొద్దిసేపటి తరువాత ఆమె మెడలో ఉన్న 1.5 సవర్ల బంగారు గొలుసు కనిపించలేదు. ఆయా ప్రాంతాల్లో వెదికినా దొరకపోవడంతో ఇంటికి వెళ్లింది. తపాలా శాఖ కూడలిలో బంగారు గొలుసు దొరికిందని అదే గ్రామానికి చెందిన గద్దె సువార్తమ్మ మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్ ఎస్ఐ శివనాగరాజుకు అందజేసింది. దీన్ని పోలీసులు వాట్సాప్ గ్రూపల్లో పెట్టారు. ఇది చూసిన లక్ష్మీప్రసన్న పోలీసుస్టేషన్‌కు రాగా పోలీసులు అందజేశారు. గొలుసు అప్పగించిన మహిళను అభినందించారు.

రైలు ఢీకొని యువతి దుర్మరణం

కావలి, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందిన ఉదంతమిది. కొండాపురం మండలంలోని సాయిపేటకు చెందిన పూండ్ల హవీలా షారన్ (19) పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతోంది. కొన్నాళ్లుగా ఇంటి దగ్గరే ఉంటుంది. రికార్డు పనుల నిమిత్తం కావలికి రాగా.. మంగళవారం ఉదయగిరి రహదారి వంతెన కింద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ రైల్వే పోలీసుస్టేషన్ ఎస్సై వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృతి

బిట్రగుంట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై చెన్నైలో చికిత్స పొందుతూ బోగోలు మసీదు వీధికి చెందిన షేక్ రసూల్ అలియాస్ రియాజ్ (61) సోమవారం రాత్రి మృతి చెందినట్లు బిట్రగుంట ఎస్సై నక్కా ప్రభాకర్ తెలిపారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న రసూల్ ఈ నెల 11న బోగోలులోని బ్రహ్మంగారి మఠం పరిసరాల్లో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ సరిచేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డారు. దీంతో అతన్ని చికిత్సకు కుటుంబసభ్యులు చెన్నైకి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

అత్యవసర బాధలకు విముక్తి

సచివాలయాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం

న్యూస్‌టుడే, దుత్తలూరు

సచివాలయాల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి పడుతున్న ఇబ్బందులు తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటిదగ్గర మరుగుదొడ్లు ఏర్పాటుచేయనుంది.

గత వైకాపా ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రూ.కోట్లు ఖర్చు చేసి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేసింది. వివిధ సమస్యలపై ఈ కార్యాలయాలకు వచ్చే వారు కాలకృత్యాలు తీర్చుకోవడానికి పడే బాధలు పట్టించుకోలేదు. సామాజిక మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ కావు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రతి సచివాలయం వద్ద వీటిని నిర్మించాలని ఆదేశించింది. ఉదయగిరి నియోజకవర్గంలో 143 పంచాయతీలుండగా వాటి పరిధిలో 95 సచివాలయాలు న్నాయి. గత వైకాపా ప్రభుత్వం భవనాలు నిర్మించిన ఏడాది తరువాత సచివాలయాల వద్ద మరుగుదొడ్లు నిర్మించే పనులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు అప్పగించింది. వీటిని దక్కించుకున్న గుత్తేదారులకు సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో అర్ధాంతరంగా నిలిపివేశారు. వైకాపా ప్రభుత్వం ఉన్నంత కాలం వాటి ఊసే ఎత్తలేదు. దీంతో ఇటు ఉద్యోగులతోపాటు అటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు పడిన అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

దుత్తలూరు: నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి

ఒక్కో యూనిట్‌కు రూ. 3 లక్షలు

సచివాలయాల వద్ద పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో సచివాలయం వద్ద వీటి నిర్మాణానికి రూ. 3 లక్షల వంతున మంజూరు చేసింది. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఈవిషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవీంద్రనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సచివాలయాల వద్ద సామాజిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నామన్నారు.

758 మందికి రూ.6.50 కోట్లు పంపిణీ: కృష్ణారెడ్డి

కావలి : నియోజకవర్గ పరిధిలో వివిధ అనారోగ్య కారణాలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. 41 మందికి వీటిని పంపిణీ చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 758 మందికి రూ.6.50 కోట్లు అందజేసినట్లు ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రకటించారు. తెదేపా కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు, దావులూరు దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే పరువు నష్టం దావా వేస్తా: ఇంటూరి

కందుకూరు పట్టణం : హైదరాబాద్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణాలు చేసినట్లు కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారిపై పరువు నష్టం దావా వేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులిచ్చిన తరువాతే లేఅవుట్లు వేశామన్నారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లేశ్వరరావు, కృష్ణారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు వినియోగించాలి

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెత్త సంపద కేంద్రాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని డీపీవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను వసూలు వేగవంతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

చురుగ్గా జలాశయం పనులు

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాలెం జలాశయం ఆయకట్టు పరిధిలో అభివృద్ధి పనులను ముమ్మరం చేసినట్లు ఉదయగిరి జలవనరుల శాఖ డీఈఈ చంద్రమౌళి, ప్రాజెక్టు ఛైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య మంగళవారం పేర్కొన్నారు. కాలువల్లో పూడికతీత, కంపచెట్ల తొలగింపు, కాలువలపై ట్రాక్‌కు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు తదితర పనులకు ప్రభుత్వం రూ. 74 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. వచ్చే నెల 5న నీరు విడుదల చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

కట్టపై పెరిగిన చెట్లను తొలగిస్తున్న యంత్రం

కులగణన చేయాలని సీపీఐ డిమాండ్

కావలి, న్యూస్‌టుడే: కుల గణన చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు దామా అంకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఈ విషయమై కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 143 వరకు బీసీ కులాలు ఉన్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరగాలంటే తప్పనిసరిగా కులగణన అవసరమన్నారు. ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు పట్టణం : దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం కులగణన చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌మోహన్, ఉప్పుటూరి మాధవ, దుర్గాప్రసాద్, హరిబాబు, బ్రహ్మాచారి, సుభాను, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా చర్యలు

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి శోభారాణి

సీతారామపురం, దుత్తలూరు న్యూస్‌టుడే : పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి కె.శోభారాణి సూచించారు. సీతారామపురం, దుత్తలూరు మండలంలోని నర్రవాడలో ఎస్సీ బాలుర వసతిగృహాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. చలికాలం అయినందున కాచి చల్లార్చిన నీరు అందించాలని సంక్షేమాధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉదయగిరి ఇన్‌ఛార్జి ఏఎస్‌డబ్ల్యూఓ రమణారెడ్డి, సంక్షేమాధికారులు గాయత్రి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు.. ఆటల్లో విజేతలు

పట్టణంలోని జడ్పీ బాలురు, బాలికోన్నత పాఠశాలల్లో సరైన వసతులు లేకున్నా ఆటల్లో బాలికలు రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందని పలువురు సూచిస్తున్నారు. ఆటల్లో రాణిస్తే ఉద్యోగాలు కూడా పొందవచ్చని.. ఈనేపథ్యంలో వీటిలో ప్రతిభ చూపాలని బాలికలు శ్రమిస్తున్నారు. - న్యూస్‌టుడే, వింజమూరు

సాధన చేస్తున్న బాలికలు

హసీమ.. పతకాల విజేత

పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని షేక్ హసీమ సెపక్‌తక్రాలో ప్రావీణ్యం సంపాదించింది. అనంతపురం జిల్లా ఉరవకొండలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-14 సెపక్‌తక్రా పోటీల్లో జిల్లా జట్టులో బరిలోకి దిగి ప్రతిభ చూపింది. అయిదుగురు సభ్యులున్న జిల్లా జట్టులో ఆడి సత్తా చాటింది. పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై గెలిచి బంగారు పతకం అందుకుంది.

తరుణశ్రీ.. బరిలోకి దిగితే విజయమే

జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎ.తరుణశ్రీ రోప్ స్కిప్పింగ్, షూటింగ్ బాల్ క్రీడల్లో ప్రతిభ చూపుతోంది. కావలి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అండర్ 17 విభాగం రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. చిత్తూరులో ఈ ఏడాది జూన్ 20న జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లోనూ బంగారు పతకం సాధించింది.

ఆఫ్రిన్ ఆడితే పతకమే

జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని షేక్ ఆఫ్రిన్ కావలి డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అండర్ 17 విభాగంలో రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. చిత్తూరులో ఈ ఏడాది జూన్ 20న జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో బంగారు పతకం అందుకుంది.

ఉషారాణి.. ఆటల్లో రారాణి

వింజమూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న డి.ఉషారాణి కావలి డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన అండర్ 17 విభాగం రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. చిత్తూరులో ఈ ఏడాది జూన్ 20న జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో బంగారు పతకం దక్కించుకుంది.

Tamilnad Mercantile Bank Ltd.,
Kavali Branch, Ground Floor, Door No: 11-29, Bit-II, 2nd Ward,
Ramamurthypet, GNT Road, Kavali, SPSR Nellore District, Andhra Pradesh - 524201, Ph: 08626 - 251222

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ కనపరచిన వ్యక్తులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకొన్న రుణము గడువు మీరిన తరువాత కూడా పలు నోటీసులు పంపినా అప్పు చెల్లించియుండలేదు. సదరు వ్యక్తులకు అనేక పర్యాయములు నోటీసులు పంపియున్నాము. సదరు నోటీసులు పంపినప్పటికి ఖాతరు చేయనందున నోటీసు వారికి చేరక వాపసు వచ్చినందున, నగలు విడిపించుకోలేక పోయినందున వారి బకాయిలు రాబట్టుకొనుటకు బ్యాంకు నిబంధనలననుసరించి **తేది: 02.12.2025 మంగళవారం** సా. 4 గంటలకు బ్యాంకు ఆవరణములో బహిరంగముగా వేలం ద్వారా సదరు నగలను విక్రయించి అప్పునకు జమచేయబడును.

షరతులు: 1. ఇదివరకు నోటీసు చేరని వారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. 2. ఈ ప్రకటన ఖర్చు అప్పుదారులే భరించవలెను. 3. వేలములో పాల్గొనదలచిన వారు రూ. 10,000/- ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 4. వేలము పొందినవారు మిగిలిన సొమ్ము వెంటనే చెల్లించి నగలు స్వాధీనము చేసుకోవలెను. లేనిచో ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. 5. ఎటువంటి కారణము తెలుపకనే వేలము వాయిదా వేయుటకు గాని, పూర్తి/ పాక్షికంగా రద్దు చేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు.

క్ర. నెం.	అకౌంట్ నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం గ్రా॥లలో
1.	387700300106641	Mr. SHAIK SULTAN BASHA No.15/2/106 Gurramvari Palem, Kandukur, Prakasam- 523105, Andhra Pradesh	10.200

సం॥ బ్రాంచ్ మేనేజర్, తమిళ్‌నాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్, కావలి శాఖ

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

సమాజ హితమే దేవాదాయశాఖ లక్ష్యం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సమాజహితమే దేవాదాయ శాఖ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో దేవాదాయశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో 58 ఆలయాలను రూ. 118 కోట్లతో పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాశీబుగ్గ తరహా సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రైవేట్ ఆలయాల నిర్వహణపై దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణ ఉండేలా చట్టం తెస్తామని వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 'అన్నదాత సుఖీభవ' కింద 34,223 మంది రైతులకు రూ. 22.95 కోట్ల ప్రభుత్వం సాయం అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిద్దాం

సంగం, న్యూస్‌టుడే: పల్లెలు, పట్టణాల పరిశుభ్రత పాటించడం పల్లె సీమలకు వరమని ఎంపీడీవో పోలెట్ మంగళవారం సంగంలో అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, ఉపసర్పంచులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజలను భాగస్వాములుగా మార్చితే గ్రామాలు సుందరంగా మారుతాయన్నారు. ప్రజాప్రతినిధులు ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. తొలుత మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు.

కూటమి పాలనలో అక్రమాలకు కళ్లెం

సైదాపురం, న్యూస్‌టుడే: మైనింగ్ లీజులు పొందిన వారు అనుమతులు ఇచ్చిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో అక్రమంగా ఖనిజాన్ని వెలికితీస్తే ఉపేక్షించేది లేదని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని పలు మైన్లను మంగళవారం గనులశాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. మైనింగ్ లీజులు పొందిన వారు వారికి అనుమతించిన ప్రదేశంలో కాకుండా ఖనిజ నిల్వలున్న ఇతర ప్రాంతాల్లో సమాచారం మేరకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. లీజులు పొందిన వారు అక్రమ మార్గాల్లో ఖనిజాలను కొల్లగొట్టాలని చూస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పలు మైన్లను ఆయన పరిశీలించారు. మైనింగ్ డీడీ శ్రీనివాసులు, తహసీల్దారు సుభద్ర, తెదేపా మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మైనింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

పొదుపు సంఘాల్లో ప్రతి ఒక్కరూ చేరాలి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల స్ఫూర్తికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు అని చైర్‌పర్సన్ సుప్రజ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం పురపాలక సంఘంలో మెప్మా ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు, మహిళా సాధికారత, సహకార సంస్థల బలోపేతం అనే అంశంపై సమావేశం మంగళవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొదుపులో చేరాలని, అవినీతి రహితంగా సంఘాలు ఉండేలా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, డీసీవో గుర్నప్ప, అంకయ్య, సీవో నర్మద, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

జలాశయానికి 6,505 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో మంగళవారానికి ఎగువ ప్రాంతాల నుంచి 6,505 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988 73.829 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 328.123 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నెల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 560, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 295 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు, వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని ముత్తుకూరు డిస్కం డీఈఈ రాము అన్నారు. తోటపల్లిగూడూరు, కోడూరు, ముత్తుకూరు, వెంకటాచలం సెక్షన్ల పరిధిలో విద్యుత్తు సమస్యలపై పిర్యాదులు వస్తే వెంటనే స్పందించి సమస్య పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. రొయ్యల రైతులకు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. అవసరమైన చోట విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది స్థానికులకు అందుబాటులో ఉన్నారని చెప్పారు. 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో జరిగిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి పలువురు తమ సమస్యలు తెలపగా నమోదు చేసుకొని పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ప్రశ్న: వెంకటాచలం మండలంలో ఉన్నవాటితో పాటు కొత్తగా విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని పలు మార్లు అధికారులకు విన్నవించాం. అయినా ఎలాంటి పురోగతి లేదు.? – **మహేశ్వరరావు, వెంకటాచలం**

డీఈఈ: ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం, వెంకటాచలం మండలం పూడిపర్తిలో విద్యుత్తు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదన ఉంది. త్వరలో ఏర్పాటు చేస్తాం.

✪ నరుకూరు కూడలితో పాటు గ్రామం పరిధిలో తరచుగా విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ప్రతి రోజూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – **మస్తానయ్య, నరుకూరు**

✓ సాంకేతిక సమస్యలుంటే తప్ప సరఫరాలో అంతరాయం ఉండదు. మరమ్మతులున్న సమయంలో సరఫరా నిలిపి పనిచేస్తారు. సమీక్షించి సమస్య లేకుండా చూస్తాం.

✪ సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారు. ప్రభుత్వ రాయితీతో ఏర్పాటు చేసుకునే అవకాశముందా? – **సుధాకర్‌రావు, తోటపల్లిగూడూరు**

✓ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఇతర వర్గాలకు రాయితీ లభిస్తుంది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తాం. డిస్కం పరిధిలో 80 చోట్ల సోలార్ ఏర్పాటు చేశాం. ఆసక్తి గలవారు స్థానిక విద్యుత్తు సిబ్బందిని సంప్రదించాలి.

✪ విద్యుత్తు బిల్లులు చెల్లింపు విషయంలో ఆన్‌లైన్ విధానంలో చెల్లింపులు ఎలా చేయాలి. కొన్ని సార్లు జమకావడం లేదు? – **చంద్రశేఖర్, ముత్తుకూరు**

✓ విద్యుత్తు బిల్లులు చెల్లింపులకు ఏపీఎస్పీడీసీఎల్ కొత్తగా ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టింది. ఫిర్యాదులు చేసే అవకాశముంది. యాప్‌లో నమోదు చేస్తే సిబ్బంది పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరిస్తారు.

✪ ముత్తుకూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చెట్ల మధ్యనే విద్యుత్తు తీగలు వెళుతున్నాయి. దీంతో తరచూ ట్రిప్ అయ్యి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.? – **శ్రీనివాసులు, ముత్తుకూరు**

✓ విద్యుత్తు తీగల మధ్య చెట్లు తొలగించేలా స్థానిక సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

✪ చేనేత మగ్గాలకు 200 యూనిట్లు విద్యుత్తు సరఫరా ఉచితంగా పొందాలంటే ఎవరిని సంప్రదించాలి? – **సీతారామయ్య, సర్వేపల్లి**

✓ హ్యాండ్‌లూం ఏర్పాటు చేసుకున్న ధ్రువపత్రంలతో పాటు ఆధార్, ఫొటోతో పాటు పూర్తి వివరాలతో పాటు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం.

✪ వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే మంజూరులో జాప్యం జరుగుతోంది. అడిగినా స్పందించడం లేదు? –**రమణయ్య, రావూరివారికండ్రిగ**

✓ దరఖాస్తు చేసుకున్న వారిని అర్హతను బట్టి కేటాయిస్తాం. ప్రాధాన్య క్రమంలో కనెక్షన్లు మంజూరు చేస్తాం. జాప్యం చేస్తే పరిశీలిస్తాం.

✪ తోటపల్లిగూడూరు, కోడూరు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో లోవోల్టేజి సమస్య తీవ్రంగా ఉంది.? – **రామ్మోహన్, కోడూరు**

✓ అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు, నియంత్రికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. లోవోల్టేజి సమస్యకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు: 79950 67034, సర్వేపల్లి: 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: పొదలకూరు రూరల్ పరిధిలోని ఇనుకుర్తిలో విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకుపోయాయి. సరఫరాలో అంతరాయం కలుగుతోంది. – ప్రదీప్

సమాధానం: సమస్య పరిశీలించి తొలగిస్తాం. – శ్రీనివాసులు, డిస్కం ఏఈ

? సంగంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారికి బెజవాడ పాపిరెడ్డి కాలువ గట్టుకు మధ్య ఏర్పడిన గోతులు రాకపోకలకు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని పూడ్చి మరమ్మతులు చేయాలి. –పెంచలయ్య, సంగం

✓ గ్రావెల్‌తో పూడ్చివేతకు చర్యలు తీసుకుంటాం. – పాపారావు, ఎన్‌హెచ్ విభాగం ఏఈ

? విడవలూరులోని కామాక్షి నగర్‌లో మురుగు కాలువలు పూడికతో నిండి మురుగు కదలడం లేదు. – స్థానికులు

✓ పరిశీలించి కాలువల్లో పూడిక తీయిస్తాం. – జగదీశ్, పంచాయతీ కార్యదర్శి

? కోవూరు మండలం చిన్న పడుగుపాడు కూడలి ఇందిరమ్మ విగ్రహం వద్ద వీధి లైట్ నెల రోజుల నుంచి వెలగడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – ప్రభాకర్, స్థానికుడు

✓ పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

? కోవూరు పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న కాలనీలో డాక్టర్ రవీంద్రబాబు ఇంటి సమీపంలో వీధి దీపం నెల రోజులుగా వెలగడం లేదు. – స్థానికులు

✓ పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

? పొదలకూరు మనుబోలు మార్గంలోని పోట్టేలువాగులో పూడిక, జమ్ము పేరుకుపోయింది. కండలేరు జలాశయం నుంచి ఈ వాగు గుండా నీటిని చెరువులకు వదులుతున్నారు. కాలువలో పూడిక నీటి ప్రవాహానికి అడ్డుపడి ఇబ్బంది కలుగుతోంది. – చంద్రయ్య, రైతు

✓ వాగులో పూడిక తీసేందుకు అంచనాలు రూపొందించి పంపాం. నిధులు మంజూరైన వెంటనే తొలగిస్తాం. –అనిల్‌కుమార్, ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెం కలుజు వద్ద కాలువలో గుర్రపుడెక్క నిండిపోయింది. నీరు సజావుగా వెళ్లకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – విజయ్‌కుమార్, స్థానికుడు

✓ చర్యలు తీసుకుంటాం. – అలీ, ఏఈ

? కోవూరు మండలం చిన్న పడుగుపాడు కూడలి ఇందిరమ్మ విగ్రహం వద్ద వీధి దీపం వెలగడం లేదు. అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. – స్థానికుడు

✓ ఏర్పాటు చేస్తాం. –శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

? ఏఎస్‌పేట దర్గా రెండో గేటు నుంచి ఆనకట్ట వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభం కింది వైపున శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. –యజ్దాని బాషా, స్థానికుడు

✓ సమస్య పరిశీలించి నూతన స్తంభం వేస్తాం. – నిరంజన్, డిస్కం ఏఈ.

నలంద పాఠశాలలో విజేతలతో ప్రధానోపాధ్యాయుడు బాబు.. రెయిన్‌బో పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసులు నాయుడు, హెచ్‌ఎం ప్రసన్న

ఉపన్యాసంలో విద్యార్థుల ప్రతిభ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణంలోని జగన్నాథరావుపేట నలంద ఉన్నతపాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. అభిరామ్(ప్రథమ), బాలయశ్వంత్ (ద్వితీయ), ఫర్హాన్(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి కరస్పాండెంట్ ఈగా భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ రత్నమ్మ, మహిత, ప్రధానోపాధ్యాయుడు బాబు, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాసులు విజేతలకు బహుమతులు అందజేశారు. ● రెయిన్‌బో ఉన్నతపాఠశాలలో జరిగిన పోటీల్లో గాయత్రీ(ప్రథమ), వన్సిక(ద్వితీయ), చరిష్మ(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి కరస్పాండెంట్ శ్రీనివాసులునాయుడు, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలు విజేతలకు బహుమతులు అందజేశారు.

కులగణన చేయాలని ధర్నా

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరులో సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దేశావ్యాప్త నిరసనలో బాగంగా సీపీఐ నాయకులు మధు మాట్లాడుతూ ఎన్‌డీఏ పాలనలో మైనార్టీలపై దాడులు పెరిగాయని విమర్శించారు. కులగణన చేసి అట్టడుగు వర్గాలకు స్థానిక సంస్థల్లో అవకాశాలు వచ్చేలా చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులగణన చేయాలని కోరుతున్నట్లు వివరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఫౌంటెయిన్ కాదు లీకేజీ..

సంగం, న్యూస్‌టుడే: తరుణవాయి గ్రామంలో తాగునీటి అవసరాల కోసం అమరపనాయుడి కండ్రిక నుంచి గొట్టాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఏర్పాటు సక్రమంగా లేక తాగునీటి వృథా అధికంగా ఉంది. వాటికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ మాట్లాడుతూ పరిశీలించి చేయిస్తామన్నారు.

చెత్త తొలగించరూ..

కోవూరు పట్టణంలోని పంచాయతీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఆంనేయస్వామి ఆలయం సమీపంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమల బెడదతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి చెత్త తొలగించాలని పలువురు కోరుతున్నారు.– **న్యూస్‌టుడే, కోవూరు**

చినుకుపడితే అవస్థలే

నిత్యం వందల సంఖ్యలో వాహనాల తిరిగే నరుకూరు-కోడూరు రోడ్డు నరుకూరు కూడలి వద్ద అధ్వానంగా మారింది. వర్షం కురవడంతో ప్రజలు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్డు నీటితో నిండిపోతుంది. ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని మండల ప్రజలు విన్నవిస్తున్నారు.– **న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు**

కంకర రాళ్లతో సతమతం

కోవూరు మండలం ఇనమడుగు కూడలి వద్ద రోడ్డుపై కంకర రాళ్లు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో కంకర, ఇసుక తరలించే క్రమంలో అవి రోడ్డుపై ఇలా పడడంతో వాహనదారులు అదుపుతప్పి పడుతున్నారు. అధికారులు పరిశీలించి కంకర రాళ్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.– **న్యూస్‌టుడే, కోవూరు**

మలుపు.. ప్రమాదాల పిలుపు

ముత్తుకూరు మండలం తాళ్లపూడి వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. సూచిక బోర్డు లేకపోవడంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదు. రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు**

శిథిలావస్థలో ట్యాంకు

ముత్తుకూరు మండలం తాళ్లపూడిలో నివాసాల మధ్య నిర్మించిన మంచి నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించగా పిల్లర్లు బలహీనమై పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. రెండు వందల కుటుంబాలకుపైగా నివాసమున్న గ్రామంలోని ప్రధాన బోర్ల నుంచి ట్యాంకు నింపి ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన ట్యాంకు నిర్మించాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు. – **న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్**

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

ముత్తుకూరు, న్యూస్‌టుడే: ముత్తుకూరు-నెల్లూరు ప్రధాన రహదారిపై మద్దెమాను సెంటర్ వద్ద సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... ఫొటో, వీడియో గ్రాఫర్లు పని చేసే నెల్లూరుకు చెందిన కుమార్, అజ్మతుల్లా ఇద్దరు సోమవారం సాయంత్రం మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామానికి వచ్చారు. రాత్రి అక్కడ జరిగిన కార్యక్రమంలో ఫోటోలు, వీడియోలు తీసి... అర్ధరాత్రి ద్విచక్రవాహనంలో తిరిగి నెల్లూరుకు వెళుతున్నారు. మద్దెమాను సెంటర్ వద్దకు రాగానే...వెనుక వేగంగా వచ్చిన టిప్పర్ వీరి వాహనాన్ని ఢీకొంది. కుమార్(32) రహదారిపై పడిపోగా... అతని తలపై నుంచి టిప్పర్ చక్రాలు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందగా, అజమతుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని కందలపాడు రోడ్డు వద్ద గుర్తుతెలియని వృద్ధురాలు(80) మృతి చెందడంతో స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతురాలిని కుటుంబ సభ్యులు అక్కడ వదిలి వెళ్లి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మరణాంతర పరీక్షల నిమిత్తం తరలించిన పోలీసులు వివరాలకోసం ఆరాతీస్తున్నారు.

మహనీయుల జీవితాలు విద్యార్థులకు ఆదర్శం

అనంతసాగరం, విడవలూరు, కలువాయి, ఏఎస్‌పేట, ముత్తుకూరు, ఆత్మకూరు, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొని తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులు అల్లా బక్షు అన్నారు. మంగళవారం అనంతసాగరంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అయిదోతరగతి విద్యార్థులతో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. విడవలూరులో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. సృజనాత్మకతను పెంచేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి నిరూప తెలిపారు. జడ్పీ హైస్కూల్, అక్షర స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆత్మకూరు గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కలువాయి జడ్పీ ప్లస్ పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ముత్తుకూరులో పిల్లలకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఏఎస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులతో సామూహిక పఠనం చేయించారు. కార్యక్రమంలో నాణేల సేకరణ కర్త వాయిజ్, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో విద్యార్థుల సామూహిక పుస్తక పఠనం

కాలువ నిర్మాణ పనులు ముమ్మరం

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు బజారు కూడలి సమీపంలో పీటర్ కాలువ వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రజలు నెల్లూరు, ఆత్మకూరు, బుచ్చి వైపు వెళ్లేవారు, వచ్చేవారు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. పలు చోట్ల వీధుల్లో ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా మారింది. బజారు కూడలి వద్ద సాయంత్రం సమయంలో పలు దుకాణాల ఎదుట ద్విచక్రవాహనాలు నిలిపేస్తున్నారు. రైల్వేఫీడర్స్ రోడ్డుకెళ్లేందుకు వాహనాలు మలుపు తిరగాలంటే అవస్థలు తప్పడం లేదు. ఒక్కసారిగా వివిధ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సులు రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. పోలీసులు సాయంత్రం నాలుగు నుంచి వాహనాలు క్రమపద్ధతిలో వెళ్లేలా పర్యవేక్షించాలి. ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు కోవూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో త్వరగా పనులు పూర్తి చేయాలన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశాలతో ముమ్మరంగా జరుగుతున్నాయి. వంతెన నిర్మాణ పనులు పూర్తయితే కోవూరు ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరేలా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

బజారు కూడలి సమీపంలో జరుగుతున్న వంతెన పనులు

కుష్ఠు సర్వేకు సహకరించండి

పొదలకూరు, ముత్తుకూరు, న్యూస్‌టుడే: పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న కుష్ఠు సర్వేకు సహకరించాలని వైద్యాధికారి నరసింహారావు అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని మరుపూరు గిరిజన కాలనీలో సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలాఖరు వరకు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ముత్తుకూరులో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూలీల కొరత తీరిందిలా..!

కొడవలూరు మండలం రామన్నపాలెం పంచాయతీ పొలం పనులు కూలీల కొరత కారణంగా గడ్డి కోసే యంత్రాలపై ఆధారపడుతున్నారు. గ్రామాల్లో కొంత మంది యంత్రాలను కొనుగోలు చేసి జీవనాధారంగా ఎంచుకున్నారు. రైతులకు కూలీల కొరత కారణంగా వ్యవసాయ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ప్రతి రైతు ఈ యంత్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ఈ యంత్రాలను రైతులకు అందించాలని కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, విడవలూరు, కొడవలూరు**

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మహిళల క్రీడా పోటీల్లో మండలంలోని అలెక్స్ కాలేజి ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థినులు సత్తా చాటారు. హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ మార్గరేట్, డైరెక్టర్ గిరీశ్, ప్రిన్సిపల్ విజయకళలు అభినందించారు.

జలమయం

విడవలూరు, న్యూస్‌టుడే: కొద్దిపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. విడవలూరు మండలం కంచరపాలెంలో మంగళవారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా గృహాలు ఎత్తుగా నిర్మాణాలు చేపట్టడంతో నీరు పోయే మార్గం లేక ఈ దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి నీరు తొలగించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వసతి అవస్థలు పట్టవా..!

న్యూస్‌టుడే, వెంకటాచలం

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల్లో వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, మనుబోలు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు తదితర మండలాల పరిధిలో కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు సమకూర్చి వసతులు సమకూర్చింది. స్థానిక వార్డెన్లకు విద్యార్థులు సమస్యలు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. చలికాలంలో తలుపులు లేక వణికిపోతున్నారు. నిత్యం పర్యవేక్షించాల్సి వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిధులు ఎలా వినియోగించుకుంటున్నారు, వారి సమస్యలు నేరుగా పరిశీలించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. గతంలో వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య నేడు గణనీయంగా తగ్గుతోంది. దీనిపై ఉన్నతాధికారులు కూడా సమీక్షలు నిర్వహించడం లేదు. ● వెంకటాచలంలో జాతీయ రహదారికి సమీపంలో 12 ఏళ్ల క్రితం బీసీ వసతిగృహానికి ప్రభుత్వం సొంత భవనం నిర్మించి. అన్ని సౌకర్యాలు కల్పించింది. పాఠశాలకు సమీపంలో ఉన్న వసతి గృహం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. కళాశాలల విద్యార్థులకు కూడా నాలుగేళ్లుగా ఇక్కడే వసతి కల్పిస్తున్నారు. దీంతో తీవ్ర అసౌకర్యంగా మారింది. పాఠశాల విద్యార్థులను సొంత భవనం నుంచి అద్దె భవనంలోకి మార్చారు.

● వెంకటాచలంలో బీసీ బాలుర వసతి గృహం అరాకొర వసతులున్న అద్దె గృహంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ మొత్తం 20 మంది విద్యార్థులున్నారు. వారుండే గదిలోనే మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఒక గదిలో తలుపులు లేవు. ఆ గదిలోనే చదువుకొని, నిద్రించే విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

పిల్లలు నిద్రించే గదిలో తలుపు లేని మరుగుదొడ్డి

● చెముడుగుంటలో చాలా కాలంగా బీసీ వసతిగృహం నిర్వహించారు. అద్దె రేకుల షెడ్డులో నిర్వహిస్తుండడం, అరకొర వసతులుండటంతో అక్కడ చేరే విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా తగ్గింది. గతేడాది ఎవరూ చేరకపోవడంతో వసతిగృహాన్ని తొలగించారు.

In The Court of The IIIrd Addl. Junior Civil Judge, Nellore
O.S. No. 312/2025
M/s. Canara Bank (e-Syndicate Bank) Rep. by its Branch Manager, Aditya Nagar Branch, Nellore City, SPSR Nellore Dist. - Plaintiff
Vs
Mogal Akbar Ali - Defendant
Notice to Defendant
Mogal Akbar Ali, S/o Mahammad Ali, R/o DNo. 27/1/458/1, Masjid Street, Balaji Nagar, Nellore City. SPSR Nellore Dist.
పై నెంబరు కేసులో వాది మీ మీద పై వారి కోర్టులో బ్యాంకు లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తేది. 10-12-2025న వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసింది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
P.చందన, B.Com., BL
M.ఉపేంద్ర, BA., BL
అడ్వకేట్సు, నెల్లూరు.

ALEXA COLLEGE OF PHYSICAL EDUCATION
VENKATACHALAM - SPSR NELLORE - 524320
B.P.Ed., SPOT ADMISSIONS
వెంకటాచలం : రేపటి నుండి Alexa College of Physical Education Collegeలో Spot Admissions నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సి.విజయకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు అడ్మిషన్లు నిర్వహించబడును.
Cont: 93981 60236 సం/- Dr. సి.విజయకళ, ప్రిన్సిపల్

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు

కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): తిరుపతికి చెందిన న్యాయవాది రాజశేఖర్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజు తోపాటు పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతిభతో మెరిసి.. బహుమతి సాధించి..

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని ఎస్వీఆర్ స్కూల్లో మంగళవారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ప్రతిభా పాటవ పోటీలు' నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం (స్పీచ్) పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. యు.వెంకట కార్తీక ప్రథమ, జి.మహేష్ ద్వితీయ, కె.రిషి తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు సాధించిన ఎస్వీఆర్ స్కూల్ విద్యార్థులు

ఆలయ సిబ్బంది నిజాయతీ..

ఆభరణాల అప్పగింత

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి దర్శనార్థం వచ్చి పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను ఆలయ సిబ్బంది భక్తులకు తిరిగి అప్పగించి నిజాయతీని చాటుకున్నారు. నెల్లూరుకు చెందిన శ్రీనివాసులు సోమవారం ముక్కంటి దర్శనార్థం ఇక్కడకు వచ్చారు. ఆలయానికి సమీపంలోని జ్ఞానప్రసూనాంబిక సదన్‌లో గదిని అద్దెకు తీసుకున్నారు. పూజలు, దర్శనం పూర్తయ్యాక గదిని ఖాళీ చేసి వెళ్లిపోయారు. గదిని శుభ్రం చేస్తుండగా మంగళవారం హౌస్ కీపింగ్ సిబ్బంది గున్నయ్యకు పరుపు కింద 15 గ్రాముల బరువున్న రెండు బంగారు ఉంగరాలు ఉండటాన్ని గమనించి ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత భక్తునికి ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేశారు. నెల్లూరు నుంచి వచ్చిన శ్రీనివాసులు సోదరునికి ఆలయ ఏఈవో మోహన్ సమక్షంలో పోలీసు ఔట్ పోస్టు కానిస్టేబుల్ నాగరాజునాయుడు, ఏపీఆర్వో రవి సమక్షంలో పోగొట్టుకున్న రూ.1.60 లక్షల విలువజేసే బంగారు ఉంగరాలను అప్పగించారు. నిజాయతీని చాటుకున్న గున్నయ్యను ఆలయ అధికారులు అభినందించారు.

ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

అందరి కృషితోనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుతామని నగర నార్త్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం 'ఈనాడు- మీతోడు'లో భాగంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలపై ఆయనతో ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. చెన్నైలో ఉంటున్న నగరవాసి పి.లక్ష్మీనారాయణ సైతం ఫోన్ చేసి సమస్యను పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఫోనులో సమాధానమిస్తున్న నార్త్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

సమస్య: జాతీయ రహదారి సమీపంలోని ప్రశాంతి నగర్ వద్ద గల టీ దుకాణాల ఎదుట వాహనాలు అడ్డంగా పెడుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. – నాగేంద్ర

సీఐ: ప్రతిరోజూ సాయంత్రం మొబైల్ పంపించి వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం.

స: రైల్వేస్టేషన్ వద్ద ఆటోలు ఎక్కువగా నిలిపి ట్రాఫిక్‌కు కారణమవుతున్నారు. రాత్రుల్లో సమస్యగా మారింది. ప్రీపెయిడ్ ఆటోలు, పాదచారులు వెళ్లేందుకు ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – పి.లక్ష్మీనారాయణ

సీఐ: రైల్వేస్టేషన్ వద్ద ఆటోలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. ప్రీ పెయిడ్ విషయం ఆర్టీవో అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

స: కనకమహల్ సెంటరు సర్కిల్ వద్ద నిత్యం వాహనాలు ఆగిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిబంధనలు పాటించడం లేదు. – సురేష్

సీఐ: స్థానికంగా సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలు ఆపకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

స: ఆత్మకూరు బస్టాండు వద్ద రోడ్డుపై అడ్డంగా కూర్చొని వ్యాపారాలు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. – శ్రీనివాసులు

సీఐ: రోడ్డు పునః ప్రారంభించిన తర్వాత వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకుంటాం.

'ఈనాడు' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

స: స్టోన్‌హౌస్ పేటలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా ఆటోలు రోడ్డుపైనే పార్కింగ్ చేసి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. – వెంకటేశ్వర్లు

సీఐ: ఇప్పటికే అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఆటో డ్రైవర్లతో సమావేశమై రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం.

స: ఆత్మకూరు ఫ్లైఓవరు మూసివేయడంతో నగరానికి వచ్చే ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారిపై మీదుగా వచ్చేలా చూడండి. – సునీల్ కృష్ణ

సీఐ: విషయాన్ని పరిశీలిస్తాం. ప్రైవేటు బస్సులను ఇప్పటికే జాతీయ రహదారి మీదుగా వచ్చేలా చేస్తున్నాం.

స: వెంకటేశ్వరపురం పెన్నాబ్రిడ్జిపై నిత్యం ఉదయం వేళల్లో వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – ఆరిఫుల్లా

సీఐ: వెంకటేశ్వరపురంలో నూతన బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. అందుకు వాహనాల మళ్లింపు జరిగింది. దాంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో బంగారు పతకాలు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నూజివీడులో జూనియర్, సీనియర్ రాష్ట్ర ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. పోటీల్లో జూనియర్ ఇండియన్ రౌండులో జి.వెంకట లోకేష్ బంగారు, వై.దీత్యా చండిక బంగారు, కె.తన్విసాయి అశ్విని కాంస్య పతకాలు సాధించారు. సీనియర్ ఇండియన్ రౌండు విభాగంలో జి.వెంకట లోకేష్ వెండి పతకం, వై.దీత్యా చండిక వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. జూనియర్లు డిసెంబరు 10 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లో, సీనియర్లు డిసెంబరు 22 నుంచి 30వ తేదీ వరకు రాయపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.

పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నవాబుపేట నాగేంద్రనగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఒంటరిగా బయటకు రావాలంటే భయమేస్తోంది. – జాహ్నవి, స్థానికురాలు

? బాలాజీనగర్ గౌడ హాస్టల్ కూడలి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డులో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. – ఉష

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, నగరపాలక సంస్థ వెటర్నరీ అధికారి

? కోటమిట్ట మెక్లిన్స్‌రోడ్డు బిలాల్ మసీదు వీధిలో దోమల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, వృద్ధులు వ్యాధుల బారిన పడుతున్నారు. – జహీరా, స్థానికురాలు

✓ దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

? నెల్లూరు కార్పొరేషన్ పరిధి 31వ డివిజన్ తెలుగుగంగ కార్యాలయం తరువాత కొత్తూరు నిర్మలానగర్‌లో నాలుగో వీధిలో వీధిదీపాలు వెలగడం లేదు. – ఎం.నరసింహరావు

✓ వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – ముజాహిద్దీన్, డీఈ

-న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ, నవాబుపేట)

విద్యార్థుల మాట.. గ్రంథాలయం బాట

గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు ఉన్నత స్థితికి చేరవచ్చని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా అన్నారు. వారోత్సవాల్లో భాగంగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, చెస్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఆర్ పాఠశాల ఉపాధ్యాయులు, ఉప గ్రంథపాలకులు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చర్యలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జనార్దన్‌రెడ్డికాలనీలో జరుగుతున్న రోడ్డు ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షించారు. సండేమార్కెట్ ప్రాంతంలో రోడ్డు ఆక్రమణల తొలగింపు, కలువల నిర్మాణ పనులను పరిశీలించి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్దేశించిన మార్కింగ్ పరిధి దాటి దుకాణాలను ఏర్పాటు చేయరాదని నిర్వాహకులను హెచ్చరించారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న తృప్తి క్యాంటీన్‌ను సందర్శించారు. టీ స్టాల్ వద్ద బహిరంగంగా ధూమపానం చేస్తున్న వ్యక్తులను గుర్తించి దుకాణ నిర్వాహకులను హెచ్చరించారు. దుకాణంలో విక్రయిస్తున్న పొగాకు ఉత్పత్తులను జప్తు చేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామమోహనరావు, ఈఈ రహంతుజాని తదితరులు పాల్గొన్నారు.

దుకాణ నిర్వాహకులను హెచ్చరిస్తున్న కమిషనర్ నందన్

కార్మికుల వినూత్న నిరసన

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 15రోజుల నుంచి నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నా.. అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడం దారుణమని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.వజ్రమ్మ, ఆర్ఎం సునీల్ తెలిపారు. మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో 15వ రోజు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సుధాకర్, సుజాతమ్మ, దేశమూర్తి, మాలకొండయ్య, కోటేశ్వరరావు, చిట్టెమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజావసరాలకే పోరాటాలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మాణం కోసం పోరాటాలు, నిరసనలు తెలుపుతుంటే మంత్రి నారాయణ కించపరిచేలా మాట్లాడటం తగదని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం నగరంలో అండర్ పాస్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం జనంతో కలిసి పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అండర్ పాస్ సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు, కట్టా సతీష్‌బాబు, రైతుసంఘం నాయకులు కోటిరెడ్డి, పమిడిమర్రి రమాకృష్ణ, బసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పెరిగిపోతున్న దాడులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక 11 ఏళ్ల కాలంలో దళితులు, గిరిజనులు, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. అనంతరం డీఆర్వో విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి రమణయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోజు రూ.కోటి పన్ను వసూలు చేయాలి : కమిషనర్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: రెండో అర్ధ సంవత్సరం ముగింపునకు వంద రోజులు మాత్రమే ఉందని, ప్రతి రోజూ రూ.కోటి రెవెన్యూ కలెక్షన్స్ వచ్చేలా చర్యలు చేపట్టాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌సెంటరులో రెవెన్యూ విభాగంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో వాసుబాబు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించండి

డీఎంహెచ్‌వో సుజాతకు వినతి పత్రం అందజేస్తున్న సీహెచ్‌వోలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కరించాలని ఏపీఎంసీఏ జిల్లా నాయకులు కోరారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో వి.సుజాతను కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీహెచ్‌వోలకు ఫిక్స్‌డ్ పే చేయాలన్నారు. వారికి రావాల్సిన భవన అద్దె, కరెంటు ఛార్జీలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు భాను మహేష్, ప్రధాన కార్యదర్శి రబేకా, హనుమా నాయక్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల్లో విద్యుద్దీపాలు

నగరంలోని వైఎస్సార్‌నగర్‌లో విద్యుద్దీపాలు వెలగడం లేదు. పలు స్తంభాల విద్యుద్దీపాలు చెట్ల కొమ్మల్లో ఉన్నాయి. కొన్ని కాలిపోయాయి. శివారు ప్రాంతం కావడంతో రాత్రివేళ అంధకారం నెలకొంటోంది. మట్టి రోడ్లలోస్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

రోజంతా వాన..

నెల్లూరు నగరంలో మంగళవారం ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురుస్తోంది. చలి తీవ్రత పెరిగింది. చిరు వ్యాపారులు అవస్థలు ఎదుర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షానికి తడుస్తూ రాకపోకలు సాగించారు. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే,

వృక్షాలపై వేటు

ప్రభుత్వం ఒకవైపు మొక్కలను పెంచాలని చెబుతుంటే నగరంలో పలు చోట్ల రోడ్డు పక్కనే ఉన్న చెట్లను నరికేస్తున్నారు. శ్రీహరి నగర్ 1వ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు పక్కనే ఉన్న రెండు చెట్లను నరికి వేయడంతోమొదళ్లే మిగిలాయి. అధికారులు స్పందించి వృక్షాలను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

మ్యాన్‌హోళ్లతో ప్రమాదం

నగరంలోని సుజాతమ్మ కాలనీ మొదటి వీధిలో ఏడు మ్యాన్‌హోళ్లతో సమస్యాత్మకంగా మారాయి. రోడ్డుకు సమాంతరంగా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన కుండా శేషారెడ్డి, తండ్రి గోపాల్‌రెడ్డి, హరనాథపురం, నెల్లూరు సిటీ అనువారు ఇచ్చిన అనుమతి మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పిరకాల వరుణ్‌కుమార్ రెడ్డి, తండ్రి సుధాకర్‌రెడ్డి, రాళ్ళగూడ గ్రామం, షంషాబాద్ మండలం, కె.వి.రంగారెడ్డి జిల్లా, తెలంగాణా అనువారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనినారు. సదరు వరుణ్‌కుమార్ రెడ్డి గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి చేజర్ల కొండారెడ్డి, తండ్రి నాగిరెడ్డి అనువారి వద్ద నుండి రిజిష్టర్డు సెటిల్‌మెంటు పత్రం తే:27-05-2022 డాక్యుమెంటు నెం.7413/2022 ద్వారా సంక్రమించినదని, సదరు కొండారెడ్డి గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని సన్నపరెడ్డి శైలజ వగైరాల జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందిన ఏజెంటు: సన్నపరెడ్డి విజయకుమార్ రెడ్డి, తండ్రి సంజీవ రెడ్డి (GPA తేది: 11-04-1986 డాక్యుమెంటు నెం.83/1986 of SRO, Nellore) అనువారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 21-08-1995 డాక్యుమెంటు నెం.6692/1995 ద్వారా కొనుగోలు చేసినారని, సదరు సన్నపరెడ్డి శైలజ వగైరాలు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని జమ్ముల మోహనరాయ్ వగైరాల వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 09-04-1986 డాక్యుమెంటు నెం.1762/1986 ద్వారా కొనుగోలు చేసినారని చెప్పుచున్నారు. మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, ఆడుమానములు, జప్తులు, అగ్రిమెంట్లు, లీజులు, క్లయిమ్స్, కోర్టు వ్యవహారములు లేవని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికైనను ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖిత పూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా, నెల్లూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరిన నెల్లూరు నగరంలోని పడారుపల్లి సర్వే నెం. 82/1రు ప్రస్తుతం సర్వేయర్ గారు సర్వేచేసి సదరు సర్వే రిపోర్టు ప్రకారం సర్వేనెం. 82-3రు పడారుపల్లిలో య.2-50 సెంట్లు భూమిని లేఅవుట్ చేయబడి లోగడ కొండాయపాళెం గ్రామ పంచాయతి వారి వల్ల తే:25-7-1973 దిన పి.ఆర్.నెం.6రుగా అప్రూవ్డ్ కాబడిన ప్లాను దాఖలా ప్లాట్లులో మున్సిపల్ వార్డు నెం.26-1రు, డోరు.నెం.1680రుకు సమీపమున నెం.29రు ప్లాటు విస్తీర్ణం 49 అంకణములా 12 చదరపు అడుగులున్నూ, నెం.30రు ప్లాటు విస్తీర్ణం 33 అంకణములా 24 చదరపు అడుగులున్నూ వెరశి 82 అంకణములా 36 చదరపు అడుగులు లేక 660 చదరపు గజములు స్థలమునకు **హద్దులు: తూర్పు:** నెం.31రు ప్లాటు స్థలం, **దక్షిణం:** పులగం రవీంద్ర రెడ్డి గారి భూమి తాలూకు ప్లాట్లు, **పడమర:** డొంక (రోడ్డు), **ఉత్తరం:** 30 అడుగులు వెడల్పు గల లేఅవుట్ రోడ్డు.

పెనుబాక గంగాధర రెడ్డి, B.Com., B.L.,
అడ్వకేట్, రమేష్ రెడ్డి నగర్, నెల్లూరు-3, Cell: 98493 49333

మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల నిషేధంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని జేసీ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సును నిర్వహించారు.

అన్నివర్గాలకు అన్యాయం

నెల్లూరు(టౌన్): రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేయడం చంద్రబాబు నాయుడుకు వెన్నెతో పెట్టిన విద్య అని, ఎన్నికల ముందు హామీలిచ్చి గెలిచిన తర్వాత పట్టించుకోలేదని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ 2024 జూన్ నుంచి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి.. తొలి ఏడాదే రైతుల పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టగా రెండో ఏడాది అరకొర సాయంతో ఏడు లక్షల మంది రైతులకు మొండి చేయి చూపించారని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

నెల్లూరు (రవాణా), న్యూస్‌టుడే: నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో మంగళవారం ఉద్యోగులకు మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జోనల్ ఛైర్మన్ సురేష్ రెడ్డి నేతృత్వంలో జరిగిన శిబిరాన్ని జేసీ ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మెడికవర్, జయభారత్, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, ఇ.ఎస్.ఐ. ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలోని 21 మంది వైద్యులు, 43 మంది జూనియర్ వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా చికిత్సలు అందించారు. 177 మంది ఆర్టీసీ ఉద్యోగులు, 137 మంది విశ్రాంత, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు. 104 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. 9 మందికి ఉచితంగా కంటి చికిత్సలు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జోనల్ ఈడీ నాగేంద్ర ప్రసాద్, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి షేక్ షమీమ్, డిప్యూటీ సీటీఎం రవికాంత్, రెండు డిపోల మేనేజర్లు జి.వెంకటేశ్వర్లు, షేక్ కరిమున్నీసా, అధికారులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జేసీ, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ తదితరులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై వేదాయపాలెం పోలీసులు దాడులు చేశారు. అయ్యప్ప గుడి ప్రాంతంలోని ఓ ఇంట్లో బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్థానిక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు సిబ్బందితో కలిసి ఇంటిపై దాడి చేసి మహిళ, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

రాయల్ కాప్స్‌లో నూతన నియామకాలు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: రాయల్ కాప్స్ కార్యవర్గంలో పలువురిని నియమిస్తున్నట్లు ఫౌండర్ దేవినాయుడు తెలిపారు. నెల్లూరు నగర కార్యదర్శిగా రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా దీప, ముత్తుకూరు మండల అధ్యక్షురాలిగా సుగుణను నియమించారు. నూతనంగా నియమితులైన వారిని మంగళవారం రాయల్ కాప్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, జిల్లా మహిళా అధ్యక్షురాలు శైలజ అభినందించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

UMFB (శ్రీనివాసం కాంప్లెక్స్ బ్రాంచ్) తిరుపతి,
తిరుమల బైపాస్ రోడ్, టీఎమ్ఆర్ కళ్యాణ మండపం ప్రక్కన, తిరుపతి, తిరుపతి జిల్లా, ఆం.ప్ర.-517521. ఫోన్ : 8369853860

స్వాధీనత ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (యాక్ట్ 54/2002 క్రింద) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ

ఋణగ్రహీత: మెస్సర్స్ వర్ధన్ మోటార్స్
మేనేజింగ్ పార్టనర్ మరియు హామీదారు: శ్రీమతి వంగిమట్ల యామిని మరియు శ్రీమతి వంగిమట్ల యామిని, భర్త : ధన్యాసి విష్ణువర్ధన్
పార్టనర్(లు) మరియు హామీదారు(లు): శ్రీమతి ధన్యాసి గౌరి, భర్త : ధన్యాసి వరప్రసాదరావు మరియు శ్రీ ధన్యాసి వరప్రసాదర్ రావు, తండ్రి: ధన్యాసి డేనియల్

వార్లను డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన బకాయి **తేది.31-07-2025 నాటికి రూ.1,02,56,054.07 పై. (అక్షరాల ఒక కోటి రెండు లక్షల యాభై ఆరు వేల యాభై నాలుగు రూపాయలు మరియు ఏడు పైసలు మాత్రమే)** చెల్లించవలని కోరుతూ **తేది.13.08.2025** న డిమాండ్ నోటీసును జారిచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు 2002 రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని **తేది.14.11.2025** న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించగలరు.

ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా, సదరు ఆస్తితో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తితో జరిపే ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం వడ్డీ & ఖర్చులతో సహా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి చార్జికి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు, నెల్లూరు బిట్-1 ఏరియా, మిలటరీ కాలనీ, నేతాజీనగర్, పొదలకూరు రోడ్డు, పద్మావతి సెంటర్ దగ్గర, సర్వే నెం.1934 & 1935 లలోని ప్లాటు నెం.106-ఎ & 106-బిలలోని 33 అంకణములు విస్తీర్ణం గల రెసిడెన్షియల్ భూమి మరియు డి.నెం.25-2-2095తో (క్రింది అంతస్థు + మొదటి అంతస్థు) గల భవనము ధన్యాసి వరప్రసదార రావు గారికి చెందినది.

హద్దులు : **తూర్పు** : ప్రస్తుతము ఉన్న భవనము, **పడమర** : ప్రస్తుతము ఉన్న ఇల్లు, **ఉత్తరం** : ప్రస్తుతము ఉన్న ఇల్లు, **దక్షిణం:** సిమెంట్ రోడ్డు.

తేది : 14.11.2025, ప్రదేశం : నెల్లూరు సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఎం.I సినిమాస్.: స్క్రీన్. 1 శివ (తెలుగు), నువ్వు వస్తానంటే నేనొద్దంటానా (తెలుగు) స్క్రీన్ .2.కాంత (తెలుగు) స్క్రీన్..3.ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), నువ్వు వస్తానంటే నేనొద్దంటానా (తెలుగు) **స్పైస్. సినిమాస్:** స్క్రీన్ 1..దేదే ప్యార్ దే 2 (హిందీ) స్క్రీన్ 2..ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), సీత ప్రయాణం కృష్ణతో, (తెలుగు), స్పైడర్ మా 2 (ఇంగ్లిష్) స్క్రీన్ 3..జిగ్రీస్ (తెలుగు), ది రన్నింగ్ మాన్ (ఇంగ్లిష్) స్క్రీన్.4..శివ (తెలుగు) స్క్రీన్.5 కాంత (తెలుగు) **రెయిన్ సినిమా:** స్క్రీన్..1. కాంత (తెలుగు) స్క్రీన్..2.. ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), ది రన్నింగ్ మ్యాన్ (ఇంగ్లిష్) స్క్రీన్..3.. శివ (తెలుగు), దేదే ప్యార్ దే 2 (హిందీ) స్క్రీన్..4..సంతాన ప్రాప్తిరస్తు (తెలుగు), దేదే ప్యార్ దే 2 (హిందీ), జిగ్రీస్ (తెలుగు)

తెరపై ఈనాడు

అమ్మో.. ఆకుకూరలు

ఆకాశాన్నంటుతున్న ధరలు

న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. కూరగాయలతోపాటు ఆకుకూరల ధరలు సైతం పెరిగి ఆకాశానంటున్నాయి. నెల్లూరు నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌కు రామతీర్థం, జువ్వలదిన్నె, ఇందుకూరు పేట, నెల్లూరు రూరల్ ప్రాంతాలతోపాటు సమీప గ్రామాల నుంచి ఎక్కువగా ఆకుకూరలు వస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తోటలు దెబ్బతినడంతో ఆకుకూరల ఉత్పత్తి తగ్గింది. జిల్లా పరిధిలో తక్కువగా వస్తుండటం, ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటుండటంతో ధరలు అమాంతం పెరిగాయి. రూ.20కు తోటాకు 3 కట్టలు, చిర్రాకు 3 కట్టలు, గోంగూర 3 కట్టలు, రూ.10కి మెంతాకు 4కట్టలు, పొన్నగంటాకు 2 కట్టలు, పాలకూర కట్ట ఇస్తున్నారు. వర్షాలకు ముందు వీటిని రెట్టింపు సంఖ్యలో ఇస్తుండగా ప్రస్తుతం సగానికి పైగా తగ్గించి అమ్ముతున్నారు.

కూరగాయలు కూడా..

టమాటా, వంకాయి, బెండకాయి, చిక్కుడుకాయల ధరలు కూడా పెరుగుతున్నాయి. టమాటా కిలో రూ.40 నుంచి రూ.50 వరకు అమ్ముతుండగా, వంకాయలు కిలో రూ.80 నుంచి రూ.100, బెండకాయలు కిలో రూ.50 నుంచి రూ.60 ధర పలుకుతోంది. ఇతర కూరగాయల ధరల్లోనూ పెరుగుదల ఉండటంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన మార్కెట్‌లోనే ఈ పరిస్థితి ఉండగా, బయట దుకాణాల్లో ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి.

పెరుగుతున్న ధరలతో పేద, మధ్య తరగతి వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కాగా వర్షాలను అడ్డుగా చూపి అధిక ధరలకు అమ్ముతున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

శివ దీక్ష స్వాముల ఊరేగింపు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: శివ దీక్ష పూర్తి చేసిన స్వాములు మంగళవారం ఊరేగింపు నిర్వహించారు. వందలాది మంది స్వాములు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం శివ మాల ధరించారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజలు చేశారు. కార్తీక మాసం పూర్తికావస్తుండటంతో దీక్ష విరమణ కార్యక్రమంలో భాగంగా శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఇరుముడులు కట్టించుకున్న స్వాములు ఊరేగింపులో పాల్గొన్నారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, శివాలయం ఈవో శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో సామూహిక వ్రతాలు

హాజరైన భక్తులు

వందేళ్ల పండగ.. కనువిందుగా!

సత్యసాయి నామస్మరణతో మార్మోగిన పుట్టపర్తి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయిబాబా నడయాడిన నేల ఉత్సవ శోభను సంతరించుకుంది. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో వందేళ్ల పండుగ సంబరాలు అట్టహాసంగా మొదలయ్యాయి. బాబా నామాన్ని స్మరించుకుంటూ దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు పరవశించిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బాబా శత జయంతి ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులతో పుట్టపర్తి కిటకిటలాడింది. సాయి చూపిన సేవామార్గాన్ని అనుసరిస్తూ చిన్న, పెద్ద, పేద, ధనిక తేడా లేకుండా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల వేదపఠనం అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం ఉదయం నిర్వహించిన బాబా రథోత్సవం భక్తుల్ని పరవశింపజేసింది. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి చిత్రావతి నదిలో సత్యసాయి తెప్పోత్సవం కనులపండువగా సాగింది.

తెప్పోత్సవం

పులకించిన భక్తజనం

రథోత్సవంలో భాగంగా ఉదయం 9 గంటలకు రథాన్ని ఉత్తరగోపురం వద్దకు తీసుకొచ్చారు. వేణుగోపాలస్వామి, సీతారాములు, హనుమాన్ ఉత్సవ విగ్రహాలతో పాటు సత్యసాయిబాబా బంగారు విగ్రహాన్ని మంగళవాయిద్యాల మధ్య గోపురం వద్దకు తీసుకొచ్చి రథంపై ప్రతిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతుండగా భక్తజనం పులకించిపోయింది. ఉదయం 11.30 గంటలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ రత్నాకర్ సతీమణి హిమవాహిని మంగళహారతి ఇచ్చారు.

★ పట్టణ పురవీధుల్లో ఏపీ, తెలంగాణకు చెందిన సత్యసాయి భక్తులు, బాలవికాస్ విద్యార్థులు భారతీయ, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ నృత్యం, కీలుగుర్రాలు, కోలాటాలు, గొరవయ్య నృత్యాలు.. ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

విశ్వశాంతికి సామూహిక వ్రతాలు

ప్రశాంతి నిలయంలో శత జయంతి ఉత్సవాల్లో భాగంగా లోకకల్యాణం కోరుతూ సామూహిక సత్యసాయి, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి, కలశపూజ అనంతరం సత్యసాయి, సత్యనారాయణస్వామిలను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు వ్రతాలు జరిపించారు.

సాయి కుల్వంత్ మందిరంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు స్వాగతం

పుట్టపర్తికి మంగళవారం చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం లభించింది. ఉదయం 8.45 గంటలకు శాంతిభవన్ అతిథి గృహం వద్ద ఆయనకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, మంత్రి సవిత, సత్యకుమార్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. 9.30 గంటలకు సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. 10 గంటలకు శ్రీసత్యసాయి రథోత్సవంలో పాల్గొన్నారు.

మహా సమాధిని దర్శించుకుంటున్న సినీనటి ఐశ్వర్యరాయ్

సత్యసాయి సన్నిధిలో జస్టిస్ ఎన్‌వీ రమణ

ప్రశాంతి నిలయంలోని మహాసమాధిని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ దర్శించుకున్నారు. మంగళవారం పుట్టపర్తి చేరుకున్న ఆయనకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఘనస్వాగతం పలికారు. బుధవారం హిల్‌వ్యూస్టేడియంలో జరిగే సత్యసాయి శత జయంతి వేడుకల్లో జస్టిస్ ఎన్‌వీ రమణ పాల్గొననున్నారు.

ఆకట్టుకున్న నృత్య సాధన

కదిరి, పెనుకొండ, బుక్కపట్నం, న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంత్యుత్సవంలో భాగంగా బుధవారం .జరగనున్న మహిళా దినోత్సవాన్ని ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న సాంస్కృతిక ప్రదర్శనలకు విద్యార్థినులు మంగళవారం హిల్‌వ్యూ స్టేడియంలో సాధన చేశారు. ప్రముఖ వాయిద్య కళాకారుడు శివమణి డ్రమ్స్ వాయిస్తూ వారిని ఉత్సాహపరిచారు. స్థానికులతో పాటు బాబా భక్తులు నృత్య సాధనను ఆసక్తిగా తిలకించారు.

డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

సాధన చేస్తున్న విద్యార్థినులు

కరవు సీమలో దానిమ్మ సిరులు

ధర్మవరం పట్టణం, బత్తలపల్లే: కరవు సీమలో ఉద్యాన పంట దానిమ్మ సిరులు కురిపిస్తోంది. ఈసారి సాగు చేసిన కర్షకులు ఊహించని లాభాలు గడిస్తున్నారు. కారణం ఎన్నడూ లేనివిధంగా దానిమ్మ ధర పలుకుతోంది. జులై నుంచి అక్టోబరు వరకు టన్ను రూ.60వేలు నుంచి రూ.90వేలు వరకు వ్యాపారం జరిగింది. నవంబరులో ఒక్కసారిగా రూ.1.20 లక్షల నుంచి రూ.1.50లక్షలకు చేరుకోవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాయలతో పాటు ఆకులు, వేర్లు, రసం ఆయుర్వేద ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. శ్రీసత్యసాయి జిల్లాలో 1800 హెక్టార్లలో పంట సాగు చేశారు.

మూడు సీజన్లలో పంట...

పంట మూడు సీజన్లుగా ఉంటుంది. సెప్టెంబరు నెలాఖరుకు పూత వదులుతారు. దీంతో కాయ పరిమాణం పెరగడంతో పాటు నాణ్యతగా ఉంటుంది. ఈ రకం కాయలకు మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం టన్ను రూ.1.20లక్షల నుంచి రూ.1.50 లక్షలు పలుకుతోంది.

మార్కెట్‌కు తరలించడానికి గ్రేడింగ్ చేస్తున్న రైతులు

30 టన్నులు.. రూ.35 లక్షలు

తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి గ్రామ రైతు కూచి మీనాక్షినాయుడు 7ఎకరాల్లో ఐదేళ్ల క్రితం 900 మొక్కలు, నాలుగేళ్ల కింద 1100 మొక్కలు మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చి నాటారు. ఈసారి రెండు తోటల్లో 30 టన్నులు కోయగా, ఇంకా 20 టన్నులున్నాయి. టన్ను రూ.1.20 లక్షలతో అమ్మగా రూ.36లక్షల వరకు వచ్చింది. ఇదే ధర ఉంటే మరో రూ.20లక్షలు రావొచ్చని రైతు చెబుతున్నారు.

నేడు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ సొమ్ము జమ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం కింద బుధవారం రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు చొప్పున మొత్తం కలిపి రూ.7 వేలు జమ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 5,40,682 మంది రైతులకు రూ.367.68 కోట్లు నిధులు మంజూరు చేశారు. బుధవారం ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు 814 రైతుసేవా కేంద్రాల్లో రైతులకు ప్రత్యేకంగా ఎల్‌ఈడీలు ఏర్పాటు చేసి, ప్రత్యక్ష ప్రసారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పీజీఆర్ఎస్ సమస్యలపై కలెక్టర్ ఆరా

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని వీరన్నపల్లి సమీపంలో నిర్మిస్తున్న పుల్లేటి వాగు వంతెన నిర్మాణంపై రైతులకు ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. వంతెన నిర్మాణ పనులు వల్ల పొలాలకు వెళ్లేందుకు దారి లేక అనేక అవస్థలకు గురవుతామని రైతులు గత వారంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా, క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కలెక్టర్ మంగళవారం వచ్చారు. అక్కడి పొలాలకు వెళ్లేందుకు రైతులు రెవెన్యూ అధికారులతో గ్రామసభలను ఏర్పాటు చేసుకుని సమస్యను పరిష్కారం చేసుకోవాలని రైతులకు సూచించారు. పత్తిపంట దిగుబడులు, ధరలపై ఆయన ఆరాతీశారు. ఆయన వెంట తహసీల్దారు ఈషారాణి, ఎంపీడీవో బాలసరోహిణీ, సర్పంచి ఆదినారాయణ, మండల సర్వేయర్ ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరు అంజినేయులు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు మధు, రామకృష్ణ పాల్గొన్నారు.

మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా సత్యశ్రీ

అనంతపురం(మూడోరోడ్డు): మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా సత్యశ్రీని నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పని చేస్తున్న సత్యశ్రీని అనంతపురం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ చేశారు. ప్రస్తుతం గత కొన్నేళ్లుగా అనంతపురం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పోస్టు ఖాళీగా ఉంది.

పతాక స్థాయికి రిద్ధి
పరుగు, బ్యాడ్మింటన్‌లో అసమాన ప్రతిభ

క్రీడాకారిణి ఎ.రిద్ధితో సంఘాల ప్రతినిధులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పరుగులో జాతీయ స్థాయిలో, షటిల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయికి చేరుకుని అసమాన ప్రతిభ చూపుతోంది. అనంతపురం నగరానికి చెందిన కృష్ణమూర్తి, నాగమణి దంపతుల కుమార్తె రిద్ధి తొలుత బ్యాడ్మింటన్‌లో ఆరంగేట్రం చేసింది. అనంతరం పరుగులోనూ సత్తాచాటుతోంది. ఇటీవల పలాసలో జరిగిన పాఠశాల క్రీడల రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్‌లో ఊహించని విధంగా రెండు పతకాలు కైవసం చేసుకుంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.

మూడేళ్ల క్రితం బ్యాడ్మింటన్ రాకెట్ చేతబట్టింది. ఫిట్‌నెస్ కోసమని కోచ్‌ల సూచనల మేరకు పరుగు కూడా సాధన చేసింది. పరుగులో ఆ బాలిక ప్రతిభను గుర్తించిన డీఎస్‌డీఏ ఎస్‌ఎం మంజుల ప్రోత్సహించారు. అనేక మెలకువలు నేర్పించి రోజుకు 3.30 గంటల సేపు సాధన చేయించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీలం సంజీవరెడ్డిలో సాధన చేసింది.

గత ఆగస్టులో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, జోన్ స్థాయిలో జరిగిన 400 మీ. పరుగులో ప్రథమ స్థానం సాధించింది. మరింత కఠినంగా సాధన చేసి రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల అండర్-14 అథ్లెటిక్స్‌లో పాల్గొంది. కష్టానికి తగ్గట్టుగా 400 మీ. పరుగులో రజతం, 600 మీ. పరుగులో కాంస్య పతకం సాధించింది. మధ్యప్రదేశ్‌లో డిసెంబరులో జరుగనున్న జాతీయ స్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించింది.

మరోవైపు విజయవాడలో జరుగనున్న అండర్-14 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు రిద్ధి ఎంపికైంది. ప్రస్తుతం నగరంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈ బాలిక అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యంగా పెట్టుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, డీఎస్‌ఏ శిక్షకుల సహకారంతో కలలు నెరవేర్చుకుంటానని అంటోంది. అథ్లెటిక్స్‌లో పరుగుల రాణిగా పేరు తెచ్చుకుంటానని ధీమాగా చెబుతోంది.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు (బుధవారం) ఉదయం ఆరు గంటలకు సాధారణ దర్శనం ఉంటుంది. 7 గంటలకు అభిషేకం, స్వర్ణకవచ సేవలు జరుగుతాయి. 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటలు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుంది.

జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికల ప్రకటన విడుదల

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికల సందడి మొదలైంది. ఈనెల 29న క్రికెట్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం ఏడు పదవులకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. మూడేళ్లకొకసారి ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఈ ఎన్నికలు ప్రతిసారి ఏకగ్రీవం అవుతున్నాయి. ఈసారి కార్యదర్శి పదవికి తీవ్ర పోటీ ఉన్నందున ఎన్నికలు అనివార్యమన్న చర్చ నడుస్తోంది. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, సంయుక్త కార్యదర్శి, ఒక జిల్లా అధికారిక ప్రతినిధిని ఎన్నుకుంటారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత ఆర్డీఓ టీటీ ఈశ్వర్‌ను నియమించారు. ఈ ఎన్నికల ప్రక్రియ అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తామని ఆ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఓటు ఉన్న సభ్యులంతా హాజరై ఎన్నికలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తెదేపాకు కార్యకర్తలే ఊపిరి, బలం
కోవెలమూడి రవీంద్ర

కొత్త కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కోవెలమూడి రవీంద్ర, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దగ్గుపాటిప్రసాద్, వెంకటశివుడు యాదవ్, తదితరులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: తెదేపాకు కార్యకర్తలే ఊపిరి, బలం.. గత ఎన్నికల్లో మీరు కష్టపడి పార్టీని గెలిపించారు. అదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు తెదేపా అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి జిల్లా తెదేపా పరిశీలకుడు కోవెలమూడి రవీంద్ర (నాని) పిలుపునిచ్చారు. మంగళవారం బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కల్యాణ మండపంలో అనంతపురం అర్బన్ నూతన క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం అర్బన్ పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ముందుగా తెదేపా జెండా ఎగరవేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. రవీంద్ర మాట్లాడుతూ.. పదవులు రాకపోయిన కార్యకర్తలెవరూ నిరుత్సాహపడొద్దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. పదవులు రాలేదని కొందరు సామాజిక మాధ్యమాల్లో పార్టీ గురించి ఇష్టానుసారంగా పెడుతున్నారని, అది బాగోదన్నారు. పార్టీలో పదవులు శాశ్వతం కాదని, కష్టపడి పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వచ్చే నగరపాలక సంస్థ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా తనకు టికెట్ ఇచ్చినపుడు అనంతపురంలో వైకాపా నాయకులు సంబరాలు చేసుకున్నారని, చంద్రబాబు ఆశీస్సులతో కార్యకర్తల కష్టంతో తాను గెలిచామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

సేవ చేయడం సామాజిక బాధ్యతగా స్వీకరించండి
ఘనంగా వైద్య విద్యార్థుల స్వాగతోత్సవం

యముడి వేషధారణలో వైద్యవిద్యార్థి

భరత నాట్యం చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం 2025 సంవత్సరం వైద్య విద్యార్థులకు ఆడిటోరియంలో స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని, క్రమశిక్షణతో చదువుకోవాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చి భవిష్యత్తులో ఉత్తమ వైద్యులుగా రాణించాలని తెలిపారు. ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దని, వైద్య వృత్తిలో వస్తున్న ఆధునిక మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటికి అనుగుణంగా అప్‌డేట్ కావాలన్నారు. పేదలకు సేవాభావంతో వైద్యసేవలు అందించటం సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. రోగులతో వైద్యులు మాట్లాడే తీరు వారిపై చాలా ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపల్ విజయశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులు సబ్జెక్టుపై పట్టుసాధిస్తే భవిష్యత్తులో సునాయసంగా ఉన్నత విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పలు అంశాలను వివరిస్తూ చేసిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పలు సినిమా పాటలకు చేసిన నృత్యాలతో సభా ప్రాంగణం అంతా కేరింతలతో మారుమోగింది. సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్‌సోనియా, శంషాద్‌బేగం, శంకర్ నాయక్, పద్మశ్రావణి, ఫోరెన్సిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాలేటి చంద్రశేఖర్‌తోపాటు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పురాతన శ్రీకృష్ణుడి విగ్రహం లభ్యం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: గాండ్లపెంట మండలం కటారుపల్లిలో రైతు వెంకటనారాయణరెడ్డికి చెందిన పొలంలో పురాతన శ్రీకృష్ణుడి రాతి విగ్రహం బయటపడింది. ఆయన తన పొలాన్ని కౌలుకు ఇచ్చారు. కౌలు రైతు ట్రాక్టర్‌తో ఐదు మడకలు దుక్కి చేస్తుండగా రాతిమూర్తి బయటపడింది. పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి ఏకాలం నాటిదో తేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫోర్జరీ కేసులో దోషికి జైలుశిక్ష

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టాదారు పాసుపుస్తకం ఫోర్జరీ, తహసీల్దారు విధులకు ఆటంకం కలిగించిన కేసులో దాసరి సాలమ్మ అనే మహిళను దోషిగా నిర్ధారించి 14 నెలల జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ మంగళవారం ధర్మవరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి పి.వెంకటహరీష్ తీర్పు ఇచ్చారు. ఒకటో పట్టణ ఇన్‌ఛార్జి సీఐ రెడ్డప్ప, కోర్టు పోలీసు రాము తెలిపిన మేరకు... 2017లో అప్పటి ధర్మవరం తహసీల్దారు మహబూబ్‌బాషా సాలమ్మకు చెందిన పట్టాదారు పాసుపుస్తకాన్ని పరిశీలించగా అది నకిలీదని తేలింది. దీనిపై సాలమ్మ తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆయనతో గొడవపడింది. తహసీల్దారు తన విధులకు ఆటంకం కలిగించిందని, నకిలీ పాసుపుస్తకం తయారు చేయించుకుందని ధర్మవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాటి ఎస్సై సురేష్ కేసు నమోదు చేశారు. కోర్టు వాయిదాలకు సాలమ్మ హాజరుకాకపోవడంతో ఈ ఏడాది జులైలో అరెస్టు చేసి కడప జైలుకు పంపారు. కేసు విచారణ కోర్టులో సాగింది. దోషిని పోలీసులు కడప మహిళా ప్రత్యేక జైలుకు తరలించారు.

'రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలి'

మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

రుద్రంపేట (అనంతపురం), న్యూస్‌టుడే: రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా లేదా కేంద్రపాలిత ప్రాంతంగా 2029 సం. లోపు ప్రకటించాలని ప్రధానమంత్రికి లేఖ పంపుతున్నట్లు రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలతో పాటు అఖిలపక్ష సమావేశం ఎప్పుడు జరిపినా.. అజెండాలో పెట్టి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంగా తీర్మానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి 12 జిల్లాలతో కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా రాయలసీమను ఏర్పాటు చేసి ఈ ప్రాంతం ప్రజల మనోభావాలను గౌరవించాలని కోరారు. శ్రీబాగ్ ఒప్పందం చెరిగిపోని జ్ఞాపకమని, రాయలసీమకు జరిగిన అన్యాయానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. రుతుపవనానికే కాదు, తరతరాలుగా పాలకులకు కూడా సీమవాసులు సవితి బిడ్డలయ్యారని, ఈ అన్యాయం ఇలాగనే కొనసాగితే సీమ భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు? అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ప్రత్యేక రాయలసీమను సాధించేందుకు కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. మైనార్టీ రాష్ట్ర నాయకులు సాధిక్ వలి, జిల్లా నాయకులు ముష్కిన్ పాల్గొన్నారు.

పాఠశాల క్రీడల జిల్లా ఖోఖో, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

ఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అండర్-17 ఖోఖో, అథ్లెటిక్స్ జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఖోఖో జట్లను రాప్తాడు జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో, అథ్లెటిక్స్ జట్లను కొత్తవూరు జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించి అందులో చేవ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జట్ల ఎంపిక జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు ప్రభాకర్, రమేష్, నిర్మల, శాంతలింగం, రాఘవేంద్ర, వెంకటేష్, జగదీష్‌ల పర్యవేక్షణలో జరిగింది.

ఎంపికైన వారి వివరాలు ఇలా..

ఖోఖో బాలుర జట్టు: ఆంజనేయులు, నాగరాజు, గణేష్, చరణ్, లోహిత్‌రాజు, మహేంద్ర, సిద్ధార్థ, ప్రతాప్, నవదీప్, సాయికుమార్, ధనుష్ కుమార్, నవదీప్ కుమార్

బాలికల జట్టు: చైతన్య, శాంతి, శరణ్య, భార్గవి, ఉదయ్, శ్రీచందన, యజ్ఞశ్రీ, జాషప్రియ, కావ్యశ్రీ, ప్రవళిక, వర్షిని, స్రవంతి.

అథ్లెటిక్స్ బాలురు: ఎ.అరవింద్, ఎస్.భరత్ కుమార్ (100 మీ. పరుగు), టి.రాజేష్, ఎ.అరవింద్ (200 మీ. పరుగు), రాజేష్, ఎ.మణికంఠ (400 మీ. పరుగు), సుశాంత్, వై.మణిదీప్ (800, 1500 మీ. పరుగు), ఈ.భరత్‌కుమార్, టి.హేమంత్‌బాబు (3వేల మీ. పరుగు), ఎ.భార్గవ్, ఎస్.జాన్ అబ్బాస్ (100 మీ. హర్డిల్స్), ఎ.మణికంఠ, ఎస్.చరణ్ (400 మీ. హర్డిల్స్), ఎం.భరత్, దివాకర్ (హైజంప్), పి.సులేమాన్, కె.సంతోష్ (లాంగ్‌జంప్), ఎ.అరవింద్, పి.సులేమాన్ (ట్రిపుల్ జంప్), వి.అభి, డి.ముర్తు జావలి (షాట్‌పుట్), కె.భరత్ కుమార్, కె.తేజస్ నాయక్ (డిస్కస్‌త్రో), కె.రాజశేఖర్, కె.వర్షిత్ (హ్యామర్‌త్రో), అరవాజ్ ఖాన్, రాజశేఖర్ (జావెలిన్‌త్రో), ఎస్.ఖాదర్, సెల్వానాథకుమార్ నాయక్ (5 కి.మీ నడక).

అయోధ్యకు సైకిల్ యాత్ర

బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన శ్రీరామ భక్తుడు జాంపుల శ్రీనివాసులు మంగళవారం ఉదయం రామాలయం నుంచి అయోధ్యకు సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. తొలుత రామాలయ ట్రస్టీ సభ్యులు, గ్రామస్థులు సైకిల్‌యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని పూజలు చేశారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో యాత్రికుడికి దాతలు సహాయ సహకారాలు అందించాలని రామాలయ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. **- న్యూస్‌టుడే, బత్తలపల్లి**

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

JOBS

Mypatta కంపెనీలో నైట్ షిఫ్ట్ (4.00 PM to 12.00 AM) కోసం అబ్బాయిలు కావాలి. అర్హత ఏదైనా డిగ్రీ చదువుతున్నవారు/ డిగ్రీ పూర్తిచేసినవారు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటే చాలు, ఆకర్షణీయమైన శాలరీ. Cell: 9000088636.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

వెంకటరెడ్డిని విచారించిన పోలీసులు

గుంతకల్లు, గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వంపైన, రైల్వే రిజర్వుడు సీఐ సతీశ్‌కుమార్ మృతిపైన అనుచితమైన వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా అధికార ప్రతినిధి, మదనపల్లికి చెందిన వెంకటరెడ్డిని పోలీసులు మంగళవారం రాత్రి మూడు గంటల పాటు విచారించారు. ఇతన్ని గుంతకల్లులో విచారించడానికి తాడిపత్రి పోలీసులు తీసుకొచ్చారు. తాడిపత్రిలో విచారిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనే ఉద్దేశంతోనే పోలీసు అధికారులు గుంతకల్లు డీఎస్పీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.15 వరకు విచారించారు. సమాచారం అందుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డితో పాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారు. పోలీసుల విచారణ పూర్తయ్యాక అతన్ని తాడిపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులకు వైకాపా నాయకులకు వాగ్వాదం జరిగింది. అనంతరం బందోబస్తు మధ్య తాడిపత్రికి తీసుకెళ్లారు.

రూ.5 కోట్ల విలువైన వక్కల స్వాధీనం
4 లారీల్లో తరలింపుపై విచారణ

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి ఈ-వేబిల్లు లేకుండా రూ.5 కోట్లు విలువ చేసే 4 లారీల వక్కలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి దిల్లీకి వక్కలను సరఫరా చేస్తున్నారని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ హేమ ఆదేశాల మేరకు అనంతపురం, కర్నూలు జిల్లాల అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని 4 లారీలను స్వాధీనం చేసుకున్నారు. రికార్డులు పరిశీలిస్తున్నారు. లారీలను స్వాధీనం చేసుకున్నపుడు రవాణాకు సంబంధించి ఈ-వేబిల్లు లేదని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ-వేబిల్లు డౌన్‌లోడ్ కావడంలో జాప్యం జరిగిందని సమాధానం ఇవ్వడంతో అధికారులు ఈ దిశగా పరిశీలిస్తున్నారు. వక్కల విలువ రూ.5 కోట్లు ఉంటుందని అంచనా వేశామన్నారు.

'దళితుల శ్మశానవాటికను ఆక్రమించారు'

దారి, వంకను ఆక్రమించారని చెబుతున్న దళితులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో దళితులకు చెందిన శ్మశానవాటికను, మరువ వంకను గ్రామానికే చెందిన కొందరు రాళ్లు, మట్టి వేసి పూడ్చి ఆక్రమించారని ఇందిరా గాంధీనగర్ దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ వందల ఏళ్లుగా చిక్కవడియార్ చెరువు మరువ వంక ఒడ్డున శ్మశాన వాటిక ఉందన్నారు. గ్రామానికే చెందిన కొందరు మరువ వంక, శ్మశానవాటిక స్థలాన్ని సుమారు 50 సెంట్లకు పైగా ఆక్రమించారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని దళితులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

సందీప్

హారిక

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం కమ్మూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రవిశంకర్ మంగళవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న సందీప్ బేస్‌బాల్, హారిక సాఫ్ట్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 16న జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో వారు ఉత్తమ ప్రతిభ చూపడంతో వారిని అధికారులు రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారన్నారు. త్వరలో జరుగనున్న పోటీల్లోనూ వీరు రాణించేలా తర్ఫీదు ఇస్తున్నట్లు హెచ్ఎం పేర్కొన్నారు.

రుణదాత దాడి.. మహిళ మృతి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలంటూ రుణదాత దాడికి పాల్పడటంతో శాంతమ్మబాయి(55) అనే మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగుబ్బలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న కాలనీలో నరసింహులునాయక్, శాంతమ్మబాయి దంపతులు కూల్ డ్రింక్, టెంకాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు రమేష్‌నాయక్ మూడేళ్ల క్రితం అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన ఎరికల రామకృష్ణ అనే వ్యక్తి దగ్గర రూ.30వేలు అప్పు తీసుకున్నాడు. కొంత చెల్లించి మిగిలింది ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రామకృష్ణ, అతడి భార్య, కుమారుడు, మరో ఇద్దరు కలిసి ముదిగుబ్బలోని రమేష్ ఇంటి వద్దకు వచ్చి వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో జరిగిన తోపులాటలో శాంతమ్మ కింద పడి అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె భర్తకూ గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఇస్మాయిల్ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి అశోక్‌నగర్‌లో గుజిరీ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన వడ్డే తిరుమలేశ్‌కు (41) శింగనమల మండల కేంద్రానికి చెందిన అరుణతో పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారులు కార్తిక్, అభిరామ్‌లు సంతానం. వీరు ఇంటింటా గుజిరీ వస్తువులను సేకరించి, వాటిని విక్రయించి జీవనం సాగించేవారు. అతడు కొంతకాలంగా మద్యానికి అలవాటు బానిసై, భార్యను మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. విసిగిపోయిన భార్య మూడేళ్ల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి చేరి, అక్కడే కూలి పనులకు వెళ్తుండేది. అప్పటినుంచి అతను అశోక్‌నగర్‌లో అద్దె గదిలో ఉంటూ గుజిరీ వ్యాపారం చేస్తూ, వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. భార్య, పిల్లలు దూరమై మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గదిలో ఉరి బిగించుకుని బలవన్మరణం చెందాడు. గుజిరి దుకాణం ఓనర్ చాంద్‌బాషా మంగళవారం మధ్యాహ్నం వెళ్లి చూడగా తలుపునకు గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం వన్‌టౌన్ పోలీసులకు తెలపడంతో.. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఘటనపై ఆరా తీసి కేసు నమోదు చేసుకున్నారు.

పురుగుమందు తాగి యువకుడి..

గోపి

పరిగి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాత్రగానిపల్లికి చెందిన గోపి(18) ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. వివరాలిలా.. గోపి బెంగళూరులోని యలహంక వద్ద ఓ పరిశ్రమలో పని చేసేవాడు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం స్వగ్రామానికి వచ్చాడు. గ్రామ సమీపంలో ఉన్న గొల్లపల్లి నేరేడు వంక వద్దకు వెళ్లి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని స్నేహితుడు రాజుకు ఫోన్‌లో మెసేజ్ పంపాడు. అతను మరికొందరి మిత్రులతో ఘటనా స్థలానికి వెళ్లేలోపే తన వెంట తెచ్చుకున్న పురుగుమందు తాగేశాడు. కొనఊపిరితో కొట్టు మిట్టాడుతున్న గోపిని వారు చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తూ కుటుంబ సభ్యులకు చెప్పారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడని, తన తండ్రి మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు..


లక్ష్మన్న

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పద్నాలుగు ఎకరాల భూమి సాగుకు 14 బోర్లు వేయించగా.. ఒక దానిలోనే అరకొరగా నీళ్లు పడగా. . దీంతో వ్యవసాయం అంతంత మాత్రంగానే సాగుతోంది. ఇంతలో కుమారుడికి చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు ఖర్చవడంతో అప్పులు పెరిగిపోయిన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కళ్యాణదుర్గం పట్టణ పరిధి ముదిగల్లుకు చెందిన లక్ష్మన్న(57)ది ఉమ్మడి కుటుంబం. వివాహాలైన ఇద్దరు కుమారులతో కలిసి సంతోషంగా ఉంటున్న ఆయనకు అప్పులు పెరిగిపోయాయి. వీటిని తీర్చేమార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం తెల్లవారుజామున ఇంటినుంచి వెళ్లిపోయి కంది చేనులో పురుగుమందు తాగి పడిపోయాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా కందిలో విగత జీవిగా పడి ఉండడాన్ని గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతిథుల రాక.. రహదారులు తళతళ

మెరుస్తున్న ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారి

ధర్మవరం పట్టణం, కొత్తచెరువు, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయి శత జయంత్యుత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటితోనే పట్టణానికి వచ్చే రహదారులను అందంగా తయారుచేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా ధర్మవరం-పుట్టపర్తి రోడ్డుపై గుంతలు పూడ్చి, తారు వేయడంతో కొత్తగా మెరుస్తోంది. వేడుకలకు ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ నజీర్ అహమ్మద్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రముఖులు హాజరవుతున్న విషయం తెలిసిందే. పుట్టపర్తిలో వారానికి ఒకసారైనా ఇలాంటి వేడుకలు జరిగితే ప్రగతి పరుగులు తీస్తుందని స్థానికులు అనుకోవడం వినిపించింది.

పురుగుమందు పిచికారీ చేసి అస్వస్థత
చికిత్స పొందుతూ యువరైతు మృతి

భూమ ప్రతాప్

విడపనకల్లు: విడపనకల్లు మండలం హావళిగిలో పంటకు పురుగుమందు పిచికారీ చేసిన రైతు అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... హావళిగికి చెందిన భూమ ప్రతాప్(24) సోమవారం పంటలకు క్రిమిసంహారక మందును పిచికారీ చేయడానికి వెళ్లి అస్వస్థతకు గురై మధ్యాహ్నానికే ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం బళ్లారి ఓపీడీ అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లావారుజామున భూమ ప్రతాప్ మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

'వంద రోజుల ప్రణాళికలో సెలవులు మినహాయించాలి'

గోరంట్ల, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల కోసం రాష్ట్ర విద్యాశాఖ డిసెంబరు ఒకటి నుంచి ప్రవేశపెట్టనున్న వంద రోజుల ప్రత్యేక ప్రణాళికలో రెండవ శని, ఆదివారాలు, సంక్రాంతి సెలవులు మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు యాదవ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు మంగళవారం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బోధనేతర పనులతో తీవ్రమానసిక ఒత్తిడిలో ఉన్న ఉపాధ్యాయులు సెలవు రోజుల్లో పని చేయడం తలకు మించిన భారమని పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రనాథ్, ఆశాఖా జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, మండల బాధ్యుడు విజయకుమార్ పాల్గొన్నారు.

బోధన పద్ధతుల మార్పు కోసమే శిక్షణ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు గోడల మధ్య విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయుల్లో బోధన పద్ధతుల మార్పు కోసమే శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో ఎ.హెచ్.గంగప్ప పేర్కొన్నారు. పట్టణంలోని అజీజియా ఉర్దూ మాధ్యమం మున్సిపల్ ఉన్నతపాఠశాలలో రెండు రోజులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. బోధన సమయంలో ఎలాంటి విధానాలు వాడుతారు, లీప్ యాప్‌ను ఎలా ఉపయోగించాలి, గత సంవత్సరం వివరాలను ఎలా పరిగణనలోకి తీసుకోవాలి, విద్యార్థులను ఎలా సంబోధిస్తారు మొదలగు విషయాలను ఆయన పరిశీలించారు. ఎంఈవో-2 ప్రసన్నలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం, ఆర్‌ఎస్‌పీలు రాజు, జగదీష్ పాల్గొన్నారు.

లేపాక్షి: ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని మెరుగు పరుచుకొనేందుకు టీచ్ టూల్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఎంఈవోలు నాగరాజునాయక్, కుల్లాయప్పలు తెలిపారు. స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు లక్ష్మీనారాయణ, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో నేరుగా ప్రవేశాలు

పెనుకొండ : పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేరుగా ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ జయప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హత పత్రాలతో కళాశాలకు వచ్చి ఈనెల 21లోపు సంప్రదించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కేఎన్‌పల్లి బీసీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. **-రామచంద్రప్ప**
సమాధానం: వెంటనే ఏర్పాటు చేస్తాం.
-లక్ష్మీదేవమ్మ, సర్పంచి, కేఎన్‌పల్లి

సమస్య: హుస్సేన్‌పురం రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. **-దాదాపీర్**
సమాధానం: కంపచెట్లు తొలగిస్తాం.
-నాగరాజునాయక్, డిప్యూటీ ఎంపీడీఓ

సమస్య: పరిగిలోని మడకశిర వెళ్లే రహదారిలో కాలువ పూడికతో నిండింది. **-వేణుగోపాల్‌రెడ్డి**
సమస్య: పరిగిలోని సీతారామపురం కాలనీలో మంచినీటి పథకం పనియచేడం లేదు. **-నాగమణి**
సమాధానం: పూడిక, కలుపు మొక్కలు తొలగిస్తాం. మొటారుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తా.
-నారాయణ, పంచాయతీ కార్యదర్శి, పరిగి.
–న్యూస్‌టుడే, గుడిబండ, పరిగి

దెబ్బతిన్న చెక్‌డ్యాములు.. ఇంకని జలాలు

నీరు నిల్వక పశుపక్షాదులకు అవస్థలు

సోమందేపల్లి: చౌడేశ్వరి కాలనీలో మరమ్మతుకు నోచుకోని చెక్‌డ్యామ్

సోమందేపల్లి, పెనుకొండ, మడకశిర, న్యూస్‌టుడే: వర్షాకాలంలో ప్రతి నీటిబొట్టును భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో కరవుకు నిలయమైన పెనుకొండ డివిజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులతో గతంలో వందలాది చెక్‌డ్యాములను నిర్మించింది. కొన్నేళ్లపాటు చెక్‌డ్యాముల్లో సమృద్ధిగా నీరు నిల్వ ఉండటం తో సత్ఫలితాలను ఇచ్చాయి. అటు ప్రజలు, పశు పక్షాదులు, అటవీ వన్యప్రాణుల తాగునీటికి.. ఇటు రైతుల బోరుబావుల్లో నీటిమట్టం పెరగడంతో రైతుల వ్యవసాయ పంటల సాగుకు తోడ్పాటును అందించాయి. ఏటేటా భారీ వర్షాల నీటి కోతకు గురికావడంతో పాటు నాసిరకం పనులు.. అధికారుల పర్యవేక్షణలోపం కారణం గా పెద్దఎత్తున చెక్‌డ్యాములు దెబ్బతిని కొట్టుకుపోయాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరుకొని నీటినిల్వ లేకుండా పోతున్నాయి.

వివిధ పథకాల కింద 1,607 నిర్మాణం

పెనుకొండ డివిజన్‌లోని హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాల్లోని అన్ని మండలాల్లో ప్రభుత్వాలు గతంలో ఇరిగేషన్, అటవీ శాఖ, డ్వామా వాటర్‌షెడ్- ఐడబ్ల్యూఎంపీ తదితర శాఖలు, ప్రభుత్వ సంస్థలు పలు పథకాలతో పాటు ఆర్డీటీ, మైరాడా ప్లాన్, సీఆర్ఎస్‌డీ, ఫోర్డ్ వంటి స్వచ్ఛంద సంస్థలు సైతం కలిపి మొత్తం 1,607 చెక్‌డ్యాములను నిర్మింపజేశారు. కరవు నివారణ పథకాల్లో భాగంగా విరివిగా వీటి నిర్మాణం చేపట్టడం వలన ప్రజలు, రైతులకు ఎంతో ఉపయోగంగా మారాయి.

మరమ్మతులకు నోచుకోక..

చెక్‌డ్యాములను నిర్మించాక.. వాటి పర్యవేక్షణను సంబంధిత అధికారులు గాలికొదిలేశారు. అన్ని మండలాల్లో ఇప్పటివరకు 490కి పైగా చెక్‌డ్యాములు దెబ్బతిన్నాయి. నీటినిల్వకు ఉపయోగం లేకుండా పోయాయి. చుక్కనీరు నిల్వ లేక భూగర్భ జలాల నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోతున్నా యి. దీంతో ప్రజలు, రైతులు, పాడి పశువులకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఈవిషయంపై వెంటనే స్పందించి, చెక్‌డ్యాముల మరమ్మతులకు తగు చర్యలు చేపట్టాలని పశువులు, గొర్రెలు, మేకల కాపరులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పెనుకొండ డివిజన్‌లో దెబ్బతిని ఉపయోగం లేకుండా ఉన్న చెక్‌డ్యాముల పరిస్థితిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వాటికి మరమ్మతులు చేపడితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వాటి మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను కోరనున్నాం.

- శివానంద నాయక్, ఏపీడీ, డ్వామా

అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరెద్దుల

రాజారెడ్డి

గోరంట్ల, న్యూస్‌టుడే: అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోరంట్లకు చెందిన నరెద్దుల రాజారెడ్డిని నియమించారు. ఆయన రచనా ప్రతిభను గుర్తించి నూతన కమిటీలో అవకాశం కల్పిస్తూ వేదిక జిల్లా సీఈవో ప్రతాప్ నుంచి నియామక పత్రాలు అందాయి. స్థానికులు రాజారెడ్డిని అభినందించారు.

'అన్నదాత సుఖీభవ' విజయవంతం చేయండి

గుడిబండ: పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గుడిబండ మండలం దేవరహట్టి చిత్రశేఖర్ తోటలో నిర్వహించనున్నట్లు మాజీ జడ్పీటీసీ సభ్యుడు డి.శ్రీనివాసమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్పలు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు హాజరవుతారని నాయకులు, రైతులు పాల్గొనాలని కోరారు.

నెర్రెలు చీలింది.. నీరు నిలిచేదెలా?



శ్రీ రంగరాజుపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టె నిర్వహణ లోపంతో నెర్రెలు చీలింది. బాగు చేయించడంలో సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఏపీఓ అప్పస్వామినాయుడును వివరణ కోరగా మరమ్మతు చేయిస్తానని తెలిపారు. –న్యూస్‌టుడే, పరిగి

ప్రాంగణం.. దిమ్మె శిథిలం

అలుకూరు కేజీబీవీ పాఠశాల సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన నిర్మించిన బస్‌షెల్టర్‌లో ఏర్పాటు చేసిన దిమ్మెను కొంతమంది ఆకతాయిలు పగలగొట్టారు. దీంతో ప్రయాణికులు కూర్చోవడానికి ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఎంపీడీవో రామారావును వివరణ కోరగా పంచాయతీరాజ్ ఇంజినీర్లతో మాట్లాడి మరమ్మతు చేయిస్తామన్నారు. –న్యూస్‌టుడే, అమరాపురం

అధ్వాన రహదారితో అవస్థలు

కొంకల్లు, దిన్నేహట్టి మధ్యన బీటీ రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారముంది. ఇప్పటికైనా మరమ్మతు చేయాలని చోదకులు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో నాగరాజునాయక్ మాట్లాడుతూ మరమ్మతుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, గుడిబండ

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తురకలాపట్నం విద్యార్థులతో..

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని కొండూరు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బేస్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్‌లు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 10వ తరగతికి చెందిన లోహిత్‌కుమార్, నౌషద్, లలితలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈనెల 27వతేదీ నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రొద్దం : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తురకలాపట్నం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ప్రణీత్, దీక్షిత్ ఎంపికయ్యారు. డిసెంబరు 2న పశ్చిమ గోదావరి జిల్లాలోని వీరవాసరంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ రామకృష్ణ తెలిపారు. హెచ్‌ఎం వెంగప్ప అభినందించారు.

మడకశిర గ్రామీణం : అండర్-17 అథ్లెటిక్స్‌లో 800 మీటర్ల పరుగు పందెంలో గుండుమల కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న ఆర్.దీక్షిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

గ్రంథాలయాలు భవితకు సోపానాలు

గోరంట్లలో విజేతలతో గ్రంథాలయ కమిటీ సభ్యులు

గోరంట్ల, రొళ్ల, చిలమత్తూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విద్యార్థుల భవితకు సోపానాలని ఇండియన్ రెడ్‌క్రాస్‌సొసైటీ జిల్లా ఛైర్మన్ జీఎం సురేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జిల్లాగ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గోరంట్ల, రొళ్ల, చిలమత్తూరు తదితర మండలాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈగ్రంథాలయంలో లభించే పుస్తకాలద్వారా ఎంతటి జ్ఞానాన్నైనా సంపాదించవచ్చన్నారు. పుస్తకాలను కొనలేని పేదవిద్యార్థులకు లైబ్రరీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, క్రీడలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమలుతు అందజేశారు. మరోవైపు ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, విశ్రాంత ఆర్డీవో విశ్వనాథ్, రొళ్ల గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు హెంజారప్ప, గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడిపై కేసు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏడేళ్ల బాలిక పట్ల అదేగ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు సోమవారం సాయంత్రం అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ సీఐ కరీం తెలిపారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వృద్ధుడిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

పైడేటి, (పరిగి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని పైడేటీ బీసీ కాలనీలో నివాసముంటున్న మహిళ మెడలో గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసును లాక్కొని వెళ్లాడని ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి చెందిన సుజాత మంగళవారం ఉదయం ఇంటి ముందు కల్లాపు చల్లుతుండగా గుర్తు తెలియని దుండగుడు ఒక్కసారిగా గొలుసు లాక్కెళ్లాడని, రూ.1.50లక్షలు విలువ చేస్తుందన్నారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సుబ్బరాయనపల్లిలో మేకల అపహరణ

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని సుబ్బరాయనపల్లిలో సోమవారం అర్ధరాత్రి దుండగులు కొట్టంలో ఉన్న 25 మేకలను అపహరించారని బాధితుడు పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పరిగి పోలీస్ స్టేషన్ ఏఎస్సై బాలరాజు తెలిపారు.

దక్షిణామూర్తికి రుద్రాభిషేకం

108 శంఖాలతో పూజలు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సూరప్పకుంట సమీపంలో ఉన్న దక్షిణామూర్తి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం స్వామి వారికి 108 శంఖాలతో రుద్రాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి శాత్విక్‌శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక లక్ష దీపోత్సవం

రాజరాజేశ్వరి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పులమతి రోడ్డులోని శ్రీమాతా రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాజకిశోర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆధ్యాత్మిక మార్గంలో ప్రజలు పయనిస్తే శాంతియుతమైన జీవనాన్ని సాగించవచ్చన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

అగళి, న్యూస్‌టుడే: రామాపురంలోని కొల్హాపురి మహాలక్ష్మి ఆలయంలో కార్తికమాసం మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మడకశిర మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ శివరామ్, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

పతాకావిష్కరణలో పీఏసీఎస్ ఛైర్మన్, రైతులు

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని వానవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. త్రిసభ్యకమిటీ ఛైర్మన్ వెంకటమరణ ఆధ్వర్యంలో మొదట పతాకావిష్కరణ అనంతరం సమావేశం కొనసాగించారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వాలు ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నా యన్నారు. పేదల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్నట్లు వివరించారు. సభ్యులు శ్రీనివాసులు, నాగేష్, సీఈవో కృష్ణారెడ్డి, బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

భోజనం వడ్డిస్తున్న వైద్యాధికారిణి ఆయేషా, ముస్లిం నాయకులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటూ అన్నిరకాల జాగ్రత్తలు పాటిస్తే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారిణి ఆయేషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆమె ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు మహమ్మద్, అన్సార్ బాషా, యూడీ కుల్లాయప్ప, షాషావలి, షేక్షావలి, బాబా తదితరులు గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.

ఆడబిడ్డల్ని బాగా చదివించండి

ప్లకార్డులతో అంగన్‌వాడీ, ఆర్డీటీ సిబ్బంది, అధికారులు

రొళ్ల, న్యూస్‌టుడే: ఆడపిల్లలు పుస్తకాలు మోస్తున్న వయసులో పుస్తెల బరువు మోయకుండా బాధ్యత తెలిసేవరకు చదువుకునేలా చూడాలని జిల్లా చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ కోఆర్డినేటర్ కొండప్ప, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం హొట్టేబెట్ట పంచాయతీలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. తొలత ఉన్నత పాఠశాల విద్యార్థులచేత ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాలు జరక్కుండా చూడాలి, లైంగిక వేధింపులు, బాలల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, ఏటీఎల్ ఓబుళేశు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, సిబ్బంది నాగలక్ష్మి, శివలత, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

గుంతల దారిలో అవస్థల ప్రయాణం

చాకర్లపల్లి శివారులో రహదారి దుస్థితి

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ పట్టణం నుంచి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిలో చాకర్లపల్లి, రేణుకానగర్ మధ్య ప్రధాన రహదారి అనేక చోట్ల గుంతలు పడిపోయింది. వాటిని తప్పించడానికి వాహనదారులు అపసవ్య దిశలో ప్రమాదకరంగా వాహనాలు నడుపుతున్నారు. ప్రధానంగా బస్సులు, లారీలు గుంతలు తప్పించే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు పడిన రోడ్డుపై ఇటీవల కంకరవేసి వదిలేశారు. తారువేయడం మరిచారు. ఈవిషయాన్ని ర.భ.శాఖ ఏఈ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా త్వరలో గుంతలు పూడ్చి తారువేయించి, సమస్యను పరిష్కరిస్తామన్నారు.

బహుజన చైతన్య వేదిక మండల కార్యవర్గం

నూతన కార్యవర్గంతో బీసీవీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తదితరులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: బహుజనుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలనే లక్ష్యంతో మండల నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం సోమందేపల్లిలో మండలంలోని బహుజన నాయకులు, యువకులు, ప్రజలు సమవేశమై ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, కార్యదర్శిగా మూర్తి, ఉపాధ్యక్షులుగా సంజీవరాయుడు, నరసింహమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా గోపి, కుమార్, బాబావలి, నరసింహులు, సమన్వయకర్త నాగేంద్ర, మీడియా ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శి తిప్పన్న, పలువురిని సభ్యులుగా ఎన్నుకొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షుడు నాగరాజు, గౌరవ సలహాదారులు బాబు, లక్ష్మీనారాయణ, నాయకులు రామాంజనప్ప, కదిరప్ప, నరేశ్, రామదాస్, బాపూజీ, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సమీపంలో ఉన్న కదిరి కొండ చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. పట్టణంలోని నరసింహస్వామి ఆలయంలో పూజలు చేసిన భక్తులు కాలినడకన స్తోత్రాది కొండ (కదిరి కొండ) వద్దకు చేరుకుని గిరి ప్రదక్షిణ అనంతరం కొండలో వెలిసిన కొండల నరసింహ స్వామిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. పరిసర ప్రాంతాలతో పాటు, కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.కొత్తపల్లి సమీపంలో అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మండల కేంద్రానికి చెందిన ఆసాది పవన్‌కుమార్, పూజ దంపతులు అయ్యప్ప భక్తులకు భిక్ష నిర్వహించారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు ఆంజనేయులునాయుడు పేర్కొన్నారు. 400 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు.

డిగ్రీలో నేరుగా ప్రవేశాలు

పెనుకొండ : పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేరుగా ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ జయప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హత పత్రాలతో కళాశాలకు వచ్చి ఈనెల 21లోపు సంప్రదించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: స్థానిక పాతమసీదు వీధిలో తాగు నీటి పైపైనకు పగుళ్లు వచ్చి లీకేజీ అవుతూ. నీరంతా వృథా అవుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
- బాబాజాన్, స్థానికుడు, ఓబులదేవరచెరువు

సమాధానం: ఈఓఆర్డీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

సమస్య: మండలంలోని రామిరెడ్డిపల్లి, నారప్పగారిపల్లిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలపై దాడి చేయడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు.
- అంజనేయులు రామిరెడ్డిపల్లి, రాజారెడ్డి నారప్పగారిపల్లి.

సమాధానం: కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటాం.
(పై రెండు ప్రశ్నలకు ఎంపీడీఓ శివరామ ప్రసాద్‌రెడ్డి సమాధానం ఇచ్చారు)
- న్యూస్‌టుడే, ఓబులదేవరచెరువు

సమస్య: చెన్నేకొత్తపల్లి నుంచి వెంకటంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో వంక ప్రదేశంలో గ్రామం నుంచి తరలించిన చెత్తాచెదారం వేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. **- రామాంజనేయులు, స్థానికుడు**

సమాధానం: చెత్తాచెదారం వంకకు చేరకుండా చేసేలా పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలిస్తాం. **- అశోక్‌నాయక్, ఈఓఆర్డీ**

సమస్య: బసంపల్లి ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు ఉన్న మట్టి దారిపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- వెంకటరాముడు, స్థానికుడు**

సమాధానం: నూతన రోడ్డు నిర్మాణ నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.
- అబ్దుల్ ఖాదర్, పీఆర్ ఇన్‌ఛార్జి ఏఈ
- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

సమస్య: కుంటిమద్ది తండాలో తాగు నీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రతం ఉంటోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
- నారాయణ నాయక్, స్థానికుడు.

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం.
- శ్రీనివాసులు, ఆరోగ్య పర్యవేక్షణాధికారి

సమస్య: పశువైద్య కేంద్రం నిరుపయోగంగా ఉండటంతో ఆకతాయిలు వినియోగిస్తున్నారు. **- సూర్యనారాయణ, స్థానికుడు.**

సమాధానం: పశు వైద్యకేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం. **- సునీల్, పశువైద్యాధికారి - న్యూస్‌టుడే, కనగానపల్లి**

సమస్య: కుంటిమద్దిలో ప్రధాన రహదారిపై మంచినీటి పైపులైన్ లీకేజీ అవుతోంది.
- లింగయ్య, కుంటిమద్ది

సమాధానం: పైపులైన్‌ను పరిశీలించి నీరు లీకేజీ కాకుండా చర్యలు చేపడతాం.
- చంద్రకాంత్, కుంటిమద్ది పంచాయతీ కార్యదర్శి.
- న్యూస్‌టుడే, రామగిరి

సత్యసాయి వైభవం చూద్దాం రారండి

ప్రత్యేకాలంకారంలో సత్యసాయి మహాసమాధి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జయంత్యుత్సవ వేళ పుట్టపర్తి మంగళవారం భక్తజన సాగరంగా మారింది. వేదపండితుల మంత్రోచ్ఛారణ, సాయి నామస్మరణ, కళాకారుల ఆటపాటలతో అద్భుతం ఆనందదాయకంగా కనిపించింది. ఉదయం జరిగిన సత్యసాయి రథోత్సవం రమణీయంగా సాగింది. దేశవిదేశాల నుంచి ప్రముఖులు, భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు పర్యవేక్షించి ఏర్పాట్లు చేశారు.

బాబా సన్నిధిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి: సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడానికి రాత్రి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రశాంతినిలయంలో ఘన స్వాగతం లభించింది. ఆయన బెంగుళూరు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో పుట్టపర్తి చేరుకున్నారు. శ్రీనివాస అతిథి గృహం వద్ద ఆయనకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి స్వాగతం పలికారు. బుధవారం హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొంటారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అందుబాటులో వైద్య శిబిరాలు: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటిని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజా బేగం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు వైద్యసేవలు అందించడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 19 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని చెప్పారు.

అలరించిన భక్త సురాంజలి: సత్యం, శివం, సుందరం... బ్రహ్మముఖిట్ట పరబ్రహ్మముఖిట్ట తదితర భక్తిరస గీతాలు భక్త కోటిని అలరించాయి. వేడుకల్లో భాగంగా సాయికుల్వంత్ మందిరంలో ప్రముఖ సంగీత విద్వాంసులు అబ్బీ, అంతరానంది బృందం ఆధ్వర్యంలో జరిగిన గాన కచేరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో దంపతులు

సీతారామ, హనుమాన్ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

అబ్బీ, అంతరానంది బృందం సంగీత కచేరి

వేదికలు, భక్తుల గ్యాలరీలతో సిద్ధమైన హిల్‌వ్యూ స్టేడియం

నృత్య సాధన చేస్తున్న విద్యార్థినులు

కార్యకర్త కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

ధర్మవరం, ముదిగుబ్బ, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్దనున్న తెదేపా కార్యాలయంలో మంగళవారం ముదిగుబ్బ మండలం మలకవేములకు చెందిన పార్టీ కార్యకర్త రూపేంద్ర కుటుంబ సభ్యులకు రూ.5లక్షల బీమా పత్రాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అందజేశారు. రూపేంద్ర ఇటీవల ప్రమాదంలో చనిపోయారు. ఆయనకు పార్టీ సభ్యత్వం ఉండటంతో రూ.5లక్షల బీమా మొత్తం మంజూరైనట్లు శ్రీరామ్ తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని గుర్తుచేశారు.

రూపేంద్ర కుటుంబ సభ్యులకు బీమా పత్రం ఇస్తున్న పరిటాల శ్రీరామ్

ఎల్లమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

రామగిరి, న్యూస్‌టుడే : కార్తీక మాసం చివరి మంగళవారం కావడంతో వెంకటాపురంలో కొలువుదీరిన ఎల్లమ్మ అమ్మవారికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. అంతకు ముందు పరిటాల ఘాట్ వద్ద నివాళి అర్పించారు. స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఉపన్యసించారు....బహుమతులు పట్టారు

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై పిల్లలు ఉపన్యసించారు. ఎస్. చరిత, జి. యశ్వంత్‌ఆచారి, కె. సుప్రజ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ భరద్వాజ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నరేంద్ర, నాగమణి, రాధ పాల్గొన్నారు.

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని వాల్మీకి పాఠశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితంపై చరవాణి ప్రభావం' అనే అంశంపై వకృత్త్వ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఆర్. విష్ణుప్రియ, కె. ఎస్. నేహ నిషాంత్ కె. ఎండీ. షరీఫ్ కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. వారిని ఉపాధ్యాయులు ధనుంజయ, బాబాఖాన్ అభినందించారు.

కదిరి: విజేతలతో కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ధర్మవరం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న భరద్వాజ్ తదితరులు

నేడు గొట్లూరులో 'అన్నదాత సుఖీభవ'

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని గొట్లూరు గ్రామంలో బుధవారం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమం జరగనుంది. రాష్ట్ర వైద్య మంత్రి సత్యకుమార్‌యాదవ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొననున్నారు. నియోజకవర్గంలోని రైతులు పాల్గొనాలని మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీశ్ నియోజకవర్గ తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేశ్ చౌదరి కోరారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: ఓడీసీ మండలానికి 500 క్వింటాళ్ల రాయితీ ఉలవలు కేటాయించినట్లు ఏఓ ఇలియాజ్ తెలిపారు. విత్తనాలు అవసరమైన కర్షకులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. పది కిలోల బస్తా రూ. 560 కాగా, 80 శాతం రాయితీ పోనూ రైతులు రూ. 112లు చెల్లిస్తే చాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: గ్రంథాలయం 58వ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారులు పోటీలు జరిపారు. గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజేతలకు ఈ నెల 20వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పెద్దన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తచెరువు : మండలంలోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి రమేష్ నాయక్ తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నంబులపూలకుంట, గాండ్లపెంట, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్త్వ పోటీలు గ్రంథాలయాధికారులు ఫరియాభాను, శాంతమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, వాహిదాలు నిర్వహించారు. విజేతలను ఎంపిక చేసి ఈ నెల 20న బహుమతులు అందజేస్తామన్నారు.

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెన్నేకొత్తపల్లి, మేడాపురం గ్రంథాలయాల అధికారులు జయరామ్, చెన్నకేశవులు పేర్కొన్నారు. 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని చెన్నేకొత్తపల్లి, మేడాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయాలను సందర్శించడం ద్వారా సామాజిక పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ ఆదినారాయణయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీతోపాటు, ఎంపీడీవో శకుంతల ఇతర శాఖాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్తు, రోడ్లు ఇతర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, కో- ఆప్షన్ సభ్యుడు బాలముని, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి పట్టివేత

తనకల్లు, న్యూస్‌టుడే: మండల పరిసర ప్రాంతాల్లో కొద్దిరోజులుగా వ్యవసాయ మోటార్ల వద్ద చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలానికి చెందిన అతడు రైతు శంకరకు చెందిన వ్యవసాయ మోటారు కేబుల్‌ను ఎత్తుకెళ్లాడు. మంగళవారం కేబుల్‌ను ఓ గుజిరీ దుకాణంలో విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నేతన్న సొమ్ము కాజేసిన సైబర్ నేరగాళ్లు

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని గొట్లూరుకు చెందిన చేనేత కార్మికుడు శ్రీరాములు సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు. దుండగులు అతడిని మోసగించి రూ. 8 వేలు నగదు కాజేశారు. బాధితుడి వివరాల మేరకు. . యూట్యూబర్ హర్షసాయి టీమ్ నుంచి మాట్లాడుతున్నామంటూ వివరాలు అడిగారు. శ్రీరాములు తన కష్టాలను వారికి చెప్పాడు. రూ. 56 వేల ఆర్థిక సాయాన్ని బ్యాంకు ఖాతాకు జమచేస్తామని ఆధార్‌కార్డు పంపాలని వారు అడిగారు. ఆధార్‌కార్డు పంపిన కొద్దిసేపటికే రూ. 56 వేలు పంపినట్లు రసీదు పంపించారు. రూ. 8 వేలు ఫోన్‌పే చేస్తే రూ. 56 వేలు మీ ఖాతాలో జమవుతాయని చెప్పారు. సదరు నగదు ఫోన్‌పే చేసినా డబ్బు జమ కాకపోవడంతో వారిని ప్రశ్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో అతడు ధర్మవరం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నానని శ్రీరాములు తెలిపాడు.

సౌదీలో బస్సు ప్రమాదం దురదృష్టకరం

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: సౌదీలో జరిగిన బస్సు ప్రమాదం దురదృష్టకరమని మండల భాజపా నాయకుడు, కదిరి మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ షేక్ షమీవుల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 46 మృతి చెందడం అందులో పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

దళిత, గిరిజనులపై దాడి హేయం

తనకల్లు, న్యూస్‌టుడే: దళిత, గిరిజనులపై ప్రస్తుతం ఎక్కడ చూసినా దాడులు తీవ్రమయ్యాయని వాటిని ఖండిస్తూ సీపీఐ నాయకులు మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీపీఐ మండల కన్వీనర్ రెడ్డెప్ప మాట్లాడుతూ 11 ఏళ్లుగా గిరిజన, దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. జనగణనలో కులగణన చేపట్టి జనాభా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నిరంజన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మద్దిమడుగు గ్రామానికి చెందిన మల్లికార్జున రెడ్డి తన స్థలం ఆక్రమణకు గురవుతోందని పోలీసులను ఆశ్రయించాడు. సర్వే నంబరు 61-2లో ఆయనకు చెందిన 99 సెంట్ల భూమిలో అదే గ్రామానికి చెందిన రామకృష్ణ అక్రమంగా ఇళ్లు నిర్మించుకోవడానికి పునాదులు తవ్విస్తున్నాడు. ప్రశ్నించగా దౌర్జన్యానికి దిగుతున్నాడని మంగళవారం బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అగ్రహారం విద్యార్థులకు దాతల చేయూత

కొత్త భోజనశాలలో పఠన సామగ్రితో విద్యార్థులు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అగ్రహారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన మధ్యాహ్న భోజనశాలను దాతలు తంగెళ్ల శ్రీనివాసులు, సుష్మ దంపతులు మంగళవారం ప్రారంభించారు. ఇందుకు గ్రామస్థులు తమవంతు రూ. 50 వేలు ఇస్తామని ముందుకొచ్చారు. అనంతరం విద్యార్థులకు పఠన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్, సర్పంచి తంగెం నాగేంద్రమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత..

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాష ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నాగిరెడ్డి కుమార్తె లిఖిత ప్రియాంక జన్మదినాన్ని పురస్కరించుకుని పేద విద్యార్థులకు చేయూతనిచ్చారు. మంగళవారం పాఠశాలలో 36 మంది అనాథ విద్యార్థులకు విద్యాసామగ్రిని దాతలు అందజేశారు. 500 మంది విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్, ప్రధానోపాధ్యాయుడు ఉమాపతి పాల్గొన్నారు.

నల్లమాడ ప్రభుత్వాసుపత్రికి కొత్త సర్జన్

నల్లమాడ, న్యూస్‌టుడే: నల్లమాడ మండల సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొత్త జనరల్ సర్జన్‌గా డాక్టర్ అజయ్ కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. సోమందేపల్లి మండలం చల్లపల్లికి చెందిన ఆయన వైద్యాధికారిగా ఎన్ఎస్ గేటు, లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేశారు. వెంగళమ్మ చెరువు పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేస్తూ పీజీ జనరల్ సర్జన్ పూర్తిచేశారు.

డాక్టర్ అజయ్‌కుమార్‌రెడ్డి

నీటి తొట్టె.. నిరుపయోగం

నల్లమాడ మండలంలోని దొన్నికోట పంచాయతీ పరిధిలోని బగ్గలపల్లి గ్రామంలో నీటి తొట్టె దయనీయ స్థితిలో ఉంది. పశువుల కోసం ప్రభుత్వం నిర్మించిన తొట్టె చుట్టూ మురుగు చేరి అపరిశుభ్రంగా తయారైంది. మురుగు తొలగించి దానిని వాడుకలోకి తీసుకొని వస్తే పశువులకు నీరు తాగడానికి, గ్రామానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కొంత మంది గ్రామస్థులు తెలిపారు. – న్యూస్‌టుడే, నల్లమాడ

లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలి

కనగానపల్లి: గృహ నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలని ఎంపీడీఓ వెంకటచలపతి పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరు సహాయకులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలనే దిశగా కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణాలకు ఆమోదం తెలిపిందన్నారు.

యువతి అదృశ్యం..కేసు నమోదు

రామగిరి, న్యూస్‌టుడే : మండలంలోని పేరూరుకు చెందిన ఓ యువతి (25) ఇటీవల టీటీసీ పూర్తిచేసి ఇంటి వద్ద ఉంటోంది. సోమవారం సాయంత్రం తల్లి గ్రామైక్య సంఘం సమావేశానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆమె కనిపించలేదు. యువతి తండ్రి బుధవారం రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడిపై...

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏడేళ్ల బాలిక పట్ల అదేగ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు సోమవారం సాయంత్రం అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ సీఐ కరీం తెలిపారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వృద్ధుడిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు.

కడ్డీలు తగిలితే.. ప్రాణాలు హరీ

పట్టణంలోని కదిరి రైల్వేగేట్ సమీపంలో ప్రధాన రహదారిలో సెంట్రింగ్ కడ్డీలు ప్రమాదకరంగా ఉన్నాయి. వంతెన నిర్మాణ పనుల కోసం దిమ్మెలను ఏర్పాటు చేశారు. వాటి పనులు ఆగిపోవడంతో గుత్తేదారులు సెంట్రింగ్ సామగ్రిని రోడ్డుపైనే వదిలేశారు. వాహన చోదకులు ఆదమరిస్తే ఇనుప చువ్వలు తలలకు గుచ్చుకునే ఆస్కారం ఉంది. ర.భ.శా డీఈ నాగపుల్లంరావును వివరణ కోరగా సిబ్బందితో మాట్లాడి వాటిని తొలగిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

అదుపు తప్పితే అంతే!

కొత్తచెరువు నుంచి బుక్కపట్నం వరకూ మూడు కిలోమీటర్ల దూరం ఎత్తైన చెరువు కట్టమీదే ప్రయాణించాలి. కట్ట రోడ్డుకిరువైపులా ఎలాంటి రక్షణ చర్యలు లేక ప్రమాదకరంగా మారింది. ఆయకట్టు వైపు, అటు చెరువు వైపు వంద అడుగులకు పైగా లోతు ఉంటుంది. అక్కమ్మగారి కొండ, నడిమికొండ దగ్గర ఇరుకైన రోడ్డుతో పాటు రోడ్డు మలుపుల్లో ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. అధికారులు రక్షణ చర్యలైనా చేపట్టాలి. పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కొత్తచెరువు



(c) eenadu

ఈనాడు
శ్రీకాకుళం
బుధవారం నవంబరు 19, 2025

2.79 లక్షల మందికి అన్నదాతా సుఖీభవ..!



నియోజకవర్గం	రైతులు	ఖాతాలో జమ చేయనున్న మొత్తం (రూ.కోట్లలో..)
ఇచ్ఛాపురం	30,634	19.72
పలాస	29,748	19.59
టెక్కలి	41,961	28.47
నరసన్నపేట	37,741	24.71
శ్రీకాకుళం	20,737	13.45
ఎచ్చెర్ల	48,103	31.57
పాతపట్నం	37,124	24.72
ఆమదాలవలస	33,052	21.95

నేడు రూ.184.19 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం

న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులకు పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ పథకం కింద చేయూత అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నిధులు విడుదల చేసింది. రెండో విడత (కేంద్ర సాయంతో కలిపి) సొమ్ము లబ్ధిదారుల ఖాతాలకు బుధవారం జమ చేయనుంది. జిల్లాలోనూ పండగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఏర్పాట్లు పూర్తి

అన్నదాతా సుఖీభవకు జిల్లాలో 2,79,100 మంది రైతులు అర్హులు. రాష్ట్ర ప్రభుత్వం రూ.139.55 కోట్లు, కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద రూ.44.65 కోట్లు సమకూర్చనున్నాయి. మొత్తంగా రూ.184.19 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయడానికి అధికారులు సన్నాహాలు చేశారు.

నియోజకవర్గ స్థాయిలో పంపిణీ

జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేల సమక్షంలో అన్నదాతా సుఖీభవ కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. నరసన్నపేట నియోజకవర్గంలో జరిగే కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా వ్యవసాయాధికారి మనోహర్ తెలిపారు.

రెండో విడత రూ.7 వేలు.. రైతులకు పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు ఖాతాలో జమ చేయనున్నారు. కేంద్రం రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు సమకూరుస్తున్నాయి. జులైలో తొలి విడత మంజూరు చేసింది. రెండో విడతలో కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేలు చొప్పున జమ చేయనున్నాయి.

నవోదయ హాల్ టికెట్లు సిద్ధం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ఆరో తరగతి ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లను సీబీఎస్ఈ విడుదల చేసిందని వెన్నలవలస జవహర్ నవోదయ విద్యాలయం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.బేతన సామి తెలిపారు. జిల్లాలో వచ్చే నెల 13న ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. http://cbseitms.rcl.gov.in/nvs నుంచి ప్రవేశ పత్రాలు పొందొచ్చని తెలిపారు.

దీప ప్రభ..భక్త శోభ!

కార్తిక మాస శివరాత్రి సందర్భంగా ఎచ్చెర్ల మండలం కుంచాల కుర్మయ్యపేటలోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో మంగళవారం పెద్దఎత్తున దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని శ్రీచక్రాలకు ప్రత్యేక పూజలు చేశారు.– ఎచ్చెర్ల, న్యూస్‌టుడే

నమ్మించి.. నట్టేట ముంచి..!

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నర్సు ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా నియమిస్తామని 10 మంది వద్ద ఓ సంస్థ ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసింది. నియామక పత్రాలిచ్చి ఉద్యోగాల్లో చేరాలని సూచించింది. విధుల్లో చేరడానికి వెళ్లిన అభ్యర్థుల వద్ద పత్రాలను చూసిన వైద్యాధికారులు అవి నకిలీవని ధ్రువీకరించడంతో మోసపోయామని తెలుసుకుని బోరుమన్నారు.

టెరిటోరియల్ ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కంచిలికి చెందిన ఓ వ్యక్తి టెక్కలికి చెందిన ముగ్గురు యువకుల వద్ద రూ.5 లక్షలు చొప్పున వసూలు చేశాడు. నకిలీ పత్రాలు చేతిలో పెట్టి ఉడాయించాడు.

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

‘ఎలాంటి రాత పరీక్ష అవసరం లేదు. మంచి ఉద్యోగం..నెలకు రూ.లక్షల్లో జీతం..కుటుంబ భద్రత కలిగిన ఉపాధి.. కొన్ని పోస్టులు మాత్రమే ఉన్నాయి.. కొంత మొత్తం ఇస్తే జాయినింగ్ ఆర్డర్లు వచ్చేస్తాయి. పది రోజుల్లో పనైపోతుంది’ అంటూ మాయమాటలు చెప్పి నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. రూ.లక్షలు కాజేసి ఉడాయించాక అసలు విషయం తెలుసుకుంటున్న బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

నమోదు కానివే ఎక్కువ

2023 నుంచి ఇప్పటివరకు 270 మోసం కేసులు నమోదు కాగా వాటిలో ఉద్యోగాల పేరిట 150 పైగా ఉంటాయి. ఆధారాలు సక్రమంగా లేనివి.. కేసులు నమోదు చేయనివి సుమారు 500 పైగానే ఉంటాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. మోసపోయిన వారిలో ఉన్నత విద్యావంతులూ ఉన్నారని సమాచారం.

పక్కా ప్రణాళికతో ఎర

- మొదట ఉపాధి అవసరాన్ని ఎరగా చేసుకుంటారు.
- ఆయా రంగాల్లో బాగా తెలిసిన వారున్నారని.. డబ్బులు ఇస్తే పనైపోతుందని నమ్మిస్తారు.
- సంబంధిత ప్రభుత్వ కార్యాలయానికి తీసుకెళ్లి అంతా మనదే అన్నట్లుగా వ్యవహరిస్తారు.
- డబ్బులు తీసుకుని సంతకాలు, వేలిముద్రలు, చిత్రాలు సేకరిస్తారు.
- నకిలీ ధ్రువపత్రాలు చేతిలో పెడతారు.
- రోజులు గడిచినా జాయినింగ్ ఆర్డర్లు రాకపోవడంతో డబ్బు అందజేసిన ప్రదేశానికి వెళ్తే అక్కడ ఎవరూ ఉండరు.
- మోసపోయినట్లు తెలుసుకుని ఆందోళన చెందుతున్నారు.
- కుటుంబ సభ్యుల సూచన మేరకు పోలీసు స్టేషన్ బాట పడుతున్నారు.

రికవరీ కష్టమే..

మోసపోతున్న వారిలో ఎక్కువగా యువతులు, కోచింగ్ సెంటర్లలో కోర్సులు నేర్చుకుంటున్న యువకులు ఉంటున్నారు. మధ్యవర్తులు ఒకరిని పూర్తిగా నమ్మించి వారి ద్వారా తెలిసిన స్నేహితులతో రూ.లక్షల్లో కట్టిస్తున్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులు దొరికినప్పటికీ రికవరీ చేయడం పోలీసులకు సాహసంగా మారుతోంది. చాలా వరకు కేసులు కట్టకుండానే వదిలేస్తున్న ఉదంతాలు ఉన్నాయి.



అప్రమత్తంగా ఉండాలి.. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసే వారిని నమ్మకండి. చాలా వరకు కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో మోసపోయిన బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి కేసులకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. నిందితులపై కఠిన చర్యలు ఉంటాయి. ఎవరినీ ఉపేక్షించబోం.
– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

కొత్తూరు ఆసుపత్రిలో రోగుల సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

కొత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం లేకుండా సేవలందించాలని సీతంపేట ఐటీడీఏ పీవో స్వప్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. స్థానిక సామాజిక ఆసుపత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. వార్డులు పరిశీలించి రోగుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల కొరత లేకుండా చూస్తామన్నారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాల జారీ విషయంలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఉప తహసీల్దారు భీమారావును ఆదేశించారు. కొత్తూరులోని ప్రైవేట్ క్లినిక్‌లను పరిశీలించారు. మోతాదుకు మించి యాంటీ బయాటిక్స్ వినియోగించడంపై ఆరా తీశారు. నిబంధనల మేరకు వైద్యం చేయాలని సూచించారు.

నెల్లిమెట్ట-సింగూరు గ్రామాల మధ్య లారీలకు ఇసుక లోడింగ్

తోడేస్తున్నారు.. తరలిస్తున్నారు

- వంశధారలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, పొందూరు

నాగావళి ఇసుక దొంగల వశమైపోతోంది. అడిగేవారు లేరని ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతూ.. నది ప్రవాహాన్ని మార్చేస్తున్నారు. ఆమదాలవలస మండలం బెలమాం, పొందూరు మండల సింగూరు, మొదలవలస బొడ్డిపల్లి గ్రామాల నదీ పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేపడుతున్నారు. అనుమతులు లేకపోయినా.. తవ్వేస్తున్నారు. బహిరంగంగానే నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకొచ్చి ఓ ప్రాంతంలో కుప్పలుగా పోసి అక్కడ నుంచి లారీలతో తరలిస్తున్నారు.

- నాగావళి సమీపంలోని తోటలు, ఇటుక బట్టీలు, రహదారికి ఇరువైపులా కుప్పలుగా పోసి రాత్రి వేళ లారీల ద్వారా గమ్యానికి చేరుస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- లారీలను శ్రీకాకుళం-ఆమదాలవలస, ఆమదాలవలస-సింగూరు, కింతలి-కనిమెట్ట రహదారి పక్కన రాత్రి 11 గంటల వరకు ఉంచి అప్పుడు తరలింపు మొదలు పెడుతున్నారు. పగలు తీసుకెళ్తే.. పైడిభీమవరం వద్ద ఉన్న ఇసుక తనిఖీ కేంద్రం వద్ద దొరికిపోతామని ఇలా చేస్తున్నారు.
- నదీ గర్భంలో తవ్వకాలు చేపడుతుండటంతో గోతులు ఏర్పడటంతోపాటు నది ప్రవాహం మారిపోతోంది. సమీపంలోని సాగు భూములకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.
- ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత గనుల శాఖ అధికారులపై ఉంది. అనుమతులు ఇచ్చేది వారే, మేం పట్టుకున్నా వారికే అప్పగించాలి’ అని ఆమదాలవలస, పొందూరు తహసీల్దార్లు రాంబాబు, వెంకటేశ్ స్పష్టం చేశారు.

ఆదమరిస్తే గెడ్డలోకే..

లావేరు మండలం జాతీయ రహదారి అదపాక కూడలి నుంచి జి.సిగడాం, పొందూరు మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే పెద్దగెడ్డపై ఉన్న కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. కాజ్‌వేకు ఇరువైపులా ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయం ఆర్అండ్‌బీ ఏఈఈ ఆంజనేయరాజు వద్ద ప్రస్తావించగా నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బ్యాంకర్ల పాత్ర కీలకం

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో అధికారులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బ్యాంకర్ల పాత్ర కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు త్వరితగతిన అందించి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని బ్యాంకర్లు ప్రోత్సహించాలన్నారు. రైతులకు ఇచ్చే డ్రోన్ల సంఖ్య పెంచి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలిచ్చి ప్రోత్సహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు వ్యాపార సంబంధ రుణాలిచ్చి వారి ఆదాయాభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రైవేటు బ్యాంకులు ప్రభుత్వ రంగ బ్యాంకులతో సమానంగా ప్రాథమిక రంగాలకు రుణాలు కేటాయించాలని కోరారు. ● మత్స్య శాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆక్వా కల్చర్‌కు వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కవిటి, సోంపేట, టెక్కలి, సంతబొమ్మాళి, పోలాకి, గార, ఎచ్చెర్ల మండలాలకు సంబంధించి గ్రామ సభల నిర్వహణపై చర్చించారు. మత్స్య శాఖ డీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డి.ఫార్మసీలో తక్షణ ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో 2025-26 విద్యా సంవత్సరానికి డి.ఫార్మసీలో మిగిలిన సీట్ల భర్తీకి బుధవారం తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డి.విక్టర్‌పాల్ తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, మూడు సెట్ల నకళ్లతో ఉదయం 9 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు. సీట్లు పొందిన వారికి వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థినులు రూ.6,300, ఎస్సీ, ఎస్టీలు రూ.5,700 ఫీజు చెల్లించాలని తెలిపారు.

ఆదిత్యాలయం.. అభివృద్ధి పథం!

- భూసేకరణపై కలెక్టర్‌కు నివేదించిన కమిటీ

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి అవసరమైన భూమిని ఆలయానికి ఆనుకుని ఉన్న ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అన్నదానం, ప్రసాదాల తయారీ భవనం, శాశ్వత మరుగుదొడ్లు, పూర్తి సౌకర్యాలతో కూడిన కేశఖండన శాల, వాణిజ్య సముదాయం నిర్మాణానికి స్థలాలు సేకరించనున్నారు.

మంత్రి ఆదేశాలతో కదలిక

- ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఆర్‌జేసీ, శ్రీకాకుళం ఆర్డీవో, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ, ఆదిత్యాలయ ఈవోతో కూడిన కమిటీని నియమించారు.
- ప్రైవేటు వ్యక్తుల స్థలాలు, భవనాలు ఆలయానికి స్వచ్ఛందంగా ఇస్తే వారికి ఆలయ భూములు ఎక్కడ ఎంత మేర ఇవ్వాలనే విషయమై ఈ కమిటీ నిర్ణయిస్తుంది.
- భూములిచ్చే వ్యక్తుల అంగీకార పత్రాలను కమిటీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదించింది. దేవాదాయ శాఖ అనుమతి రాగానే భూముల మార్పిడికి చర్యలు చేపట్టడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.
- ఈ ప్రక్రియ పూర్తికాగానే రూ.12 కోట్లతో పనులు పూర్తి చేయనున్నట్లు ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.

నేడు జిల్లాకు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 10 గంటలకు అంబేడ్కర్ ఆడిటోరియంకు చేరుకుంటారన్నారు.

హాయ్ చెప్పు ధాన్యం అమ్ము..!

వాట్సాప్ ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే, రణస్థలం, పాతశ్రీకాకుళం

గార మండలం బూరవెల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రం

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకుంటే రైతులు పడిన శ్రమ వృథా అవుతుంది. సకాలంలో విక్రయించుకోలేక.. ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియక చాలా మంది దళారులు అడిగిన ధరకు ఇచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. ఖరీఫ్‌లో వర్షాలు బాగా కురవడంతో జిల్లాలో వరి పెద్దఎత్తున సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికందే దశలో ఉంది. కొన్నిచోట్ల కోతలు ప్రారంభం కాగా.. మిగిలిన ప్రాంతాల్లో సన్నాహాలు చేసుకుంటున్నారు. పంటను విక్రయించుకోవడానికి పడే ఇబ్బందుల నుంచి గట్టెక్కించడానికి కర్షకులు సాంకేతికతను అందిపుచ్చుకునేలా వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

406 కేంద్రాల ఏర్పాటు

- జిల్లాలో 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 3.58 లక్షల మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి ఇవ్వనున్నారు.
- ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పని చేస్తాయి. సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- సాధారణ రకాలు క్వింటాల్‌కు రూ.2,369, సన్న రకాలు క్వింటాల్‌కు రూ.2,389లు చెల్లిస్తారు. జిల్లా వ్యాప్తంగా 406 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 39 ఏజెన్సీలకు అప్పగించారు.

తగ్గనున్న ఖర్చులు

- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతుల కోసం ఇటీవల వాట్సాప్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.
- హాయ్ అని మెసేజ్ పెట్టగానే పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. రైతు వద్ద ఎన్ని బస్తాలున్నాయి.. పంట రకం.. బస్తాలు ఎప్పటికి సిద్ధమవుతాయి.. వంటి వివరాలు ఆరా తీస్తారు.
- ఏ కేంద్రంలో ఏ రోజు, ఏ సమయానికి.. ఏ రకం ధాన్యం, ఎన్ని బస్తాలు అమ్ముతారో తదితర వివరాలతో స్లాట్ బుక్ అవుతుంది.
- ఈ విధానంతో రైతులు పంట ఎక్కడ అమ్ముకోవాలి.. ఏ మిల్లుకు తరలించాలన్న ఆందోళన ఉండదు. సమయం ఆదా అవడంతో పాటు ఖర్చులు తగ్గి ఇబ్బందులు తప్పుతాయి.

- రైతులు పంట విక్రయానికి ఇబ్బందులు ఎదురైతే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 1967కు, కంట్రోల్ రూం నంబరు 99634 79141 కు ఫోన్ చేయొచ్చు.

45 గంటల్లో సొమ్ము జమ
ధాన్యం విక్రయించిన 45 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది. ఈ-పంట నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తయిన వారి నుంచి మాత్రమే కొనుగోలు చేస్తాం.
– వేణుగోపాల్, మేనేజర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ, శ్రీకాకుళం

- రైతులు మెసేజ్ పెట్టాల్సిన నంబరు 73373 59375

ఒక్కరోజు ముచ్చటేనా..?

- పాఠశాలల్లో కానరాని తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: 2,014
ప్రాథమికోన్నత : 148
ఉన్నత : 450
విద్యార్థులు: 1,59,136

- జి.సిగడాం ఉన్నత పాఠశాలలో 310 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెండు నెలలకొకసారైనా తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించకపోవడంతో వారి ప్రగతి, బడిలో వసతుల లేమిపై సమాచారం తెలియడం లేదు.
- పొందూరు ఉన్నత పాఠశాలలో 700 మంది విద్యార్థులు చదువుతున్నారు. తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్, హెచ్‌ఎం సమావేశమై మమ అనిపిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం తెలియని పరిస్థితి నెలకొంది.

జి.సిగడాం మండలం సంతవురిటి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం

న్యూస్‌టుడే, జి.సిగడాం

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా..విద్యార్థుల ప్రగతి మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు ప్రతి నెలా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది బడులు తెరిచినప్పుడు మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇది పలుచోట్ల ఒక్కరోజు ముచ్చటగానే మారింది. పిల్లల ప్రవర్తన.. చదువు, తోటి విద్యార్థులతో ఎలా మెలుగుతున్నారనే విషయాలను ఉపాధ్యాయులు కమిటీ సమావేశాల్లో తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలి. క్షేత్రస్థాయిలో నిబంధనల ప్రకారం జరుగుతున్న దాఖలాలు లేవు.

మమ అనిపిస్తున్నారా..? పలు పాఠశాలల్లో రెండు, మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించినట్లు తెలిసింది. కమిటీ ఛైర్మన్, ఒకరిద్దరు సభ్యులు మాత్రమే హాజరై మమ అనిపించినట్లు సమాచారం. విద్యార్థుల ప్రగతి, పాఠశాలల్లో సౌకర్యాలపై చర్చ జరగలేదు. కొన్నిచోట్ల మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహిస్తున్నట్లే తెలియడం లేదు.

ఆదేశాలు బేఖాతరు

విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించడానికి సముఖత చూపడం లేదు. మరోవైపు తల్లిదండ్రులకు కనీస సమాచారం లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఆదేశాలు బేఖాతరు చేస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం.. పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశాం. విద్యార్థుల ప్రగతి, సౌకర్యాల కల్పనకు సమావేశాలు దోహదపడతాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – ఎ.రవిబాబు, డీఈవో

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

హరిపురం (మందస), న్యూస్‌టుడే: నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని..పోరాటాలతో భూములను రక్షించుకుంటామని కార్గో విమానాశ్రయ బాధిత రైతులు నినదించారు. మందస మండలం బిడిమిలో మంగళవారం రైతులు సమావేశం నిర్వహించారు. విమానాశ్రయం ఏర్పాటుకు ఒప్పందం కుదిరిందని ప్రకటించడం.. ఈ ప్రాంత భూములతో సంబంధం లేని వ్యక్తులు పలాస ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విమానాశ్రయం ఏర్పాటుకు వ్యతిరేకంగా పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలపకుండా పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానాశ్రయ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు కె.వాసు, జోగారావు, చిత్త గున్నయ్య, సర్పంచి పి.ధర్మారావు, డి.హరికృష్ణ, బి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న రైతులు



(c) eenadu

గొయ్యి తీశారు.. గెంతి వెళ్తున్నారు..!

శ్రీకాకుళం నగరంలోని వన్‌వే ట్రాఫిక్ రహదారి నుంచి డీసీసీబీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారికి మధ్యలోని కల్వర్టు పనులు నగరపాలక సంస్థ అధికారులు కొద్ది రోజుల కిందట ప్రారంభించారు. గుత్తేదారు గోతులు తవ్వి మిగతా పనులు చేపట్టలేదు. దీంతో ప్రజలు గెంతేసి వెళ్తున్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు వివరణ కోరగా పనులు తక్షణమే ప్రారంభించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

తగ్గిస్తున్నదెవరు.. తినేస్తున్నదెవరు..?

– న్యూస్‌టుడే, టెక్కలి

తెల్లకార్డు లబ్ధిదారులకు 5 కిలోల బియ్యం చొప్పున ప్రభుత్వం ప్రతినెల సరఫరా చేస్తోంది. అయితే సరఫరా విధానంలో లోపాలతో పూర్తిగా బియ్యం పక్కదారి పడుతున్నాయి.

నిబంధనల ప్రకారం 50 కిలోల బియ్యం బస్తా తరుగును లెక్కవేసి 50.500 కిలోలతో రేషన్ డిపోకు చేరాలి. పౌరసరఫరా గోదాంల నుంచి మండలస్థాయి నిల్వకేంద్రాలకు లారీలతో బియ్యం వస్తాయి. వాటిని వేయింగ్ బ్రిడ్జి వద్ద తూకం వేసి బరువును లెక్కించి పంపిస్తారు. పౌరసరఫరాల గోదాం నుంచి మండల నిల్వకేంద్రానికి చేరినప్పుడు, అక్కడినుంచి రేషన్‌డిపోకు వెళ్లినప్పుడు ఎక్కడా బియ్యం బస్తాలను తూకం వేయడంలేదు.

పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం

రేషన్ దుకాణం వద్ద 47.810 కిలోలుగా ఉన్న బియ్యం బస్తా బరువు

- జిల్లాలో రేషన్ డిపోలు : 1,603
- రేషన్ కార్డులు : 6,60,884
- మొత్తం యూనిట్లు : 19,51,094
- ప్రతినెల సరఫరా చేసే బియ్యం (సగటున) : 9,599.306 మెట్రిక్ టన్నులు

రేషన్ డిపోలకు చేరిన బియ్యం బస్తాలు తూకం వేస్తే ఏ ఒక్కటీ 50.500 కిలోలు ఉండటంలేదు. 45 కిలోల నుంచి 47 కిలోల వరకు మాత్రమే ఉంటున్నాయి. అనుభవం ఉన్న రేషన్‌డిపోల డీలర్లు తూకాల్లో వినియోగదారుల కళ్లుగప్పి నష్టాన్ని పూరించగలుగుతున్నారు. కొన్ని సార్లు బియ్యం అందించలేని పరిస్థితి. మండలస్థాయి నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జి డీటీ, తహసీల్దార్‌ను కానీ అడిగితే తమకేం సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు. ఇంకో అడుగు ముందుకేసి దీనికి బాధ్యుడు డీలరేనని కచ్చితంగా ఆ వ్యత్యాసాన్ని కొనుగోలు చేసైనా పంపిణీ చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. మండల స్థాయి నిల్వకేంద్రాల్లో బియ్యాన్ని తూకం వేయకుండా పంపిస్తున్న విధానానికి ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సెల్‌టవర్ ఎక్కి ఆటో డ్రైవర్ హల్‌చల్

సెల్ టవర్‌పై ఆటో డ్రైవర్ కల్యాణ్‌కుమార్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ... వర్ ఎక్కి గంటపాటు కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎస్సై-2 అప్పారావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో ఆటో చోదకుడు కిందకు దిగాడు.

సాహితీపరిమళాలు... వైజ్ఞానిక ప్రయోగాలు



'దక్షిణాన సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమకాలీన సామాజిక సమస్యలను ఎలుగెత్తి, సామాజిక స్పృహ, ప్రజలను జాగృతం కలిగించే సృజనాత్మక రచనలు చేయాలని పలువురు వక్తలు అన్నారు. నగరంలో ఏడు రోడ్ల కూడలి సమీపంలోని నగర పాలక సంస్థ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో మంగళవారం కళింగాంధ్ర చరిత్ర, వర్తమానం అన్న అంశంపై జరిగిన సదస్సులో పలువురు మాట్లాడారు. రచయిత గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సదస్సులో రచయిత కె.ఎస్.చలం మాట్లాడుతూ పూర్వచరిత్రలను నేటి తరం తెలుసుకోవాలన్నారు. రైతాంగ పోరాటంలో వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు ఎందరో ఉన్నారని అట్టాడ అప్పలనాయుడు తెలిపారు. రచయిత కంచరాన భుజంగరావు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో సిక్కోలు బుక్ ట్రస్ట్ దుప్పల రవి కుమార్ మాట్లాడుతూ కళింగాంధ్రులు దోపిడీకి గురయ్యారన్నారు.

అనిల్‌ను అభినందిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

- రచయిత కె.ఎస్.చలం దక్షిణాన సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.
- కవి బాల సుధాకరరావు రాసిన సందువ పుస్తకాన్ని రచయిత బాడాన శ్యామలరావు పరిచయం చేశారు.
- వైజ్ఞానిక సంబరాల్లో భాగంగా శ్రీకాకుళం గ్రామీణ మండలం ఇప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్.అనిల్ సోలార్ ఈజీ ఎసంబుల్డ్ మల్టీ పర్పస్ టూల్ ప్రాజెక్టు ప్రదర్శించారు.
- బొడ్డేపల్లి జనార్దన సమసమాజం మేలుకొండి... మహిళలకు రక్షణ కల్పించండి అంటూ ఏకపాత్రాభినయం చిలకపాలెంకు చెందిన కోడాడ రామారావు రైతు జానపద నృత్యరూపకం ఆకట్టుకుంది.
- బుధవారం పుస్తకమహోత్సవంలో పుస్తక, వైజ్ఞానిక ప్రదర్శనలు, జాతీయోద్యమంలో కళింగాంధ్ర సదస్సు, పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

మహాధర్నాకు అడ్డుపడిన పోలీసులు!

వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం కార్గో విమానాశ్రయం వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టేందుకు సిద్ధమైన మహాధర్నా కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డుపడ్డారు. భారీ బందోబస్తు నిర్వహించి పహారా కాశారు. పలువురిని అదుపులోకి తీసుకోగా.. మరికొందరిని గృహ నిర్బంధం చేశారు. పోరాట కమిటీ పిలుపు మేరకు వజ్రపుకొత్తూరు మండలానికి సంబంధించి ఒంకులూరు, అనకాపల్లి, కొండపల్లి, బ్రహ్మణిపేట, భవానీపేట వాసులు విమానాశ్రయం వ్యతిరేకానికి ఆయా ప్రాంత రైతులు గళం విప్పేందుకు బయలుదేరారు. అప్పటికే ఆ గ్రామాలను పోలీసులు, ప్రత్యేక బలగాలు చుట్టుముట్టాయి. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ రైతులు నినాదాలు చేశారు. కార్గో విమానాశ్రయ ఏర్పాటు గ్రామాల్లో జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైమ్) శ్రీనివాసరావు పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. కాశీబుగ్గ ఇన్‌ఛార్జి డీఎస్పీ లక్ష్మణరావు, గ్రామీణ సీఐ తిరుపతి, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు. ● పలాస మండలం మాకన్నపల్లిలో వామపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్గో విమానాశ్రయం ఏర్పాటుకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ధర్నాలో పాల్గొనేందుకు సీపీఎం జిల్లా కార్యదర్శి గోవింద్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వి.మాధవరావు తదితరులు మాకన్నపల్లి చేరుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకొని అక్కడ నుంచి సోంపేట పోలీస్ ఠాణాకు తరలించి, సాయంత్రం విడిచి పెట్టారు.

వామపక్ష నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

ఆసుపత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న కర్రెన్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: మెళియాపుట్టి మండలంలోని ఓ గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న జలక లింగుపురం గ్రామ వాసి రాణ కర్రెన్న సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండు చేశారు. భార్య తులసమ్మ, ఇద్దరు కుమారులతో కలిసి టెక్కలి జిల్లా ఆసుపత్రి వద్ద మంగళవారం బైఠాయించి నిరసన తెలిపారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుడు మృతి చెందాడని, అయినప్పటికీ వారిలో కనీస చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారంపై స్పష్టమైన హామీ ఇచ్చాకే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని పేర్కొన్నారు. పాతపట్నం సీఐ సన్యాసినాయుడు, మెళియాపుట్టి ఎస్సై రమేష్ బాబు ఆస్పత్రి వద్దకు చేరుకుని గ్రామపెద్దలు, నాయకులతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో రెండు రోజులుగా మృతదేహం టెక్కలి జిల్లా ఆసుపత్రిలోనే ఉండిపోయింది.

ఓం సాయి.. శ్రీ సాయి..!

శ్రీకాకుళం సాంస్కృతికం: న్యూకాలనీ సత్యసాయి మందిరంలో భక్తులు పూజలు

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సత్యసాయి మందిరాలు, భజనమండళ్లలో పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నామ సంకీర్తన ప్రముఖుల ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బృందం

ఎయిడ్స్ బాధిత చిన్నారులకు అండగా ఉంటాం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఎయిడ్స్ బాధిత చిన్నారులకు అండగా ఉంటామని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి హరిబాబు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో మంగళవారం జిల్లా ఎయిడ్స్ బాధిత, ప్రభావిత బాలల(సీపీబీపీ) అవసరాల అంచనా కార్యశాల నిర్వహించారు. పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బాధిత చిన్నారుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు న్యాయసాయం అందిస్తామన్నారు. అనంతరం 150 మంది పిల్లలకు పోషకాహార కిట్లను అందజేశారు. జీజీహెచ్ ప్రిన్సిపల్ డా. ఎస్. అప్పలనాయుడు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఎల్. ప్రసన్నకుమార్, డీఎంహెచ్‌వో డా. కె. అనిత, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి యు.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి హరిబాబు

నూతన కలెక్టరేట్‌లో 84 ప్రభుత్వ శాఖలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని గదులను 84 ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పాత కార్యాలయాల్లో పనికిరాని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేలం వేయించాలని ఆదేశించారు. కింద ఫ్లోర్ నుంచి మూడో అంతస్తు వరకు ఏఏ శాఖలకు గదులు కేటాయించారో కలెక్టర్ వివరించారు. డీపీఆర్‌వో కార్యాలయాన్ని నమూనాగా తీర్చిదిద్దామని అధికారులు దాన్ని పరిశీలించి కార్యాలయ అవసరాల మేరకు మార్పులు చేసుకోవచ్చన్నారు. కార్యాలయంలోని కరెంటు బిల్లులను ఆయా శాఖలు భరించుకోవాలన్నారు. మిగిలిన పనులను వీలైనంత త్వరగా ముగించుకోవాలన్నారు. ప్రతి శాఖ ఉద్యోగులు ఆయా శాఖలో ఖాళీలు, పోస్టులు, కేడర్ల వారీగా సిబ్బంది వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహాయ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ డీఆర్వో లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలు, లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పురపాలక సంఘల్లో అనధికారిక లేఅవుట్లు, ప్లాట్లు, ప్రణాళికకు విరుద్ధంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌ల ద్వారా అవకాశం కల్పించినందున నగరపాలక సంస్థ పరిధిలోని అలాంటి నిర్మాణాలు, లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు ఆదేశించారు. వాటి యజమానులకు నోటీసులు జారీ చేసి క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఏసీపీలు వెంకటేశ్వర్లు, జానకీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

నార్త్ జోన్ క్రికెట్ పోటీలకు నలుగురి ఎంపిక

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అండర్ 14 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులను ఎంపికచేస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మంగళవారం జాబితా విడుదల చేసింది. శిమ్మ సాత్విక్ (కెప్టెన్), పొలుమూరు మోక్షిత్ శ్రీ నైతిక్ (వికెట్ కీపర్), పిట్టా మెహర్‌తేజ్, సీహెచ్ యోజిత్‌లు నార్త్ జోన్‌కు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హసన్‌రజాలు అభినందించారు.

కులగణన చేపట్టాలి

అంబేడ్కర్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు టి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. నానాటికీ సామాజిక పరిస్థితులు ఘోరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో గుండెపోటుతో అధ్యాపకుడి మృతి

వెంకటరమణ మూర్తి (పాత చిత్రం)

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు వెంకట రమణమూర్తి గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. బీకాం మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠం బోధించిన ఆయన అనంతరం అధ్యాపకుల సమావేశానికి హాజరై కూర్చున్న కుర్చీలోనే ప్రాణాలు విడిచారు. సహచరులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించినా.. ఫలితం లేకపోయింది. పొందూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వెంకట రమణ ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ అందుకోవడంతోపాటు తెలుగులో నెట్, సెట్‌లో ఉత్తీర్ణత సాధించి అదే వర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టనున్న తరుణంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

రైతాంగానికి సహకార పరపతి సంఘాల అండ

సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రైతాంగానికి అండగా నిలుస్తున్న ప్రాథమిక సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ చౌదరి అవినాష్ పిలుపునిచ్చారు. సహకార వారోత్సవాల్లో భాగంగా డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం ఎదుట సహకార సంఘాల పతాకాన్ని ఎగురవేశారు. సంఘాల ఉద్యోగులు, పీఏసీఎస్ ఛైర్మన్లతో సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకార రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఆస్తుల పరిరక్షణలో భాగంగా గోదాంల నిర్మాణంతో పాటు వ్యాపారాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. అరసవల్లిలో ఫంక్షన్ హాల్, మినీ స్టేడియం నిర్మించి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

మన 'సారా' వదిలేశారు.. ఆసరా మరిచారు

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

నేల బొంతు గ్రామానికి చెందిన కోసంటి యోగేశ్వరరావు, సారా విక్రయించి జీవనం సాగిస్తున్నాడు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా విక్రయాలు చేయొద్దని ప్రత్యామ్నాయ ఉపాధి చూపిస్తామని ఆబ్కారీ అధికారులు హామీ ఇచ్చారు. దాంతో సారా వదిలేశాడు. ఇంత వరకు మరో ఉపాధి చూపించకపోవడంతో అవస్థలు పడుతున్నాడు. జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగానే ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు.

● సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 30 మండలాల పరిధిలో 110 ప్రభావిత గ్రామాలను ఆబ్కారీ అధికారులు గుర్తించారు. 1023 మంది సారా విక్రేతలను గుర్తించి రెవెన్యూ అధికారుల వద్ద బైండోవర్ చేయించారు. 110 కమిటీలు వేసి నిరంతరం వ్యాపారంపై నిఘా ఉంచారు. ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహించడంతోపాటు అవగాహన కల్పించారు. దీంతో మార్పు రావడంతో 200 మందికి పైగా సారా వ్యాపారం వదిలేసి ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నేలబొంతు గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆబ్కారీ అధికారులు

● పరివర్తన చెంది ఉపాధి కోసం ఎదురు చూసేవారికి ప్రత్యామ్నాయం కల్పిస్తేనే.. నవోదయం కార్యక్రమానికి సార్థకత చేకూరుతుంది. వ్యాపారం వదిలేసి వారికి ప్రత్యేక పథకాలు అందించాలని చేసిన ప్రతిపాదనలు డీఆర్‌డీఏకి పంపించినట్లు అధికారులు తెలిపారు. 'మరోసారి అధికారులతో మాట్లాడి ప్రక్రియ వేగవంతం చేస్తాం' అని ఆబ్కారీ ఈఎస్ తిరుపతి నాయుడు తెలిపారు.

మత్స్యకారుడి ఆయువు తీసిన అల

రాజారావు (పాత చిత్రం)

పోలాకి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గుప్పిడిపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు చెక్క రాజారావు (45) పడవ బోల్తా పడి మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సదరు వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇద్దరు మిత్రులతో కలిసి నాటు పడవపై చేపల ... కుపోయి ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన ఇద్దరూ క్షేమంగా ఒడ్డుకు చేరారు. సమాచారాన్ని స్థానికులకు తెలియజేయడంతో వారంతా కలిసి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. భార్య చెల్లమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు ...

చికిత్స పొందినా.. ప్రాణం నిలవలేదు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కుక్కకాటుతో 14 మందికి గాయాలు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ స్వాధీనత ప్రకటన

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032

జోనల్ కార్యాలయం : సరస్వతీ కాంప్లెక్స్ 1వ అంతస్తు, ఎస్.వి.సి.థియేటర్ ప్రక్కన, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం.

EENADU Classifieds

ఈనాడు Cell: 80085 97609 Cell: 80081 11237

పలాస

● పలాస ● ఇచ్ఛాపురం

ఘనంగా సామూహిక సహస్ర లింగార్చన

పలాస రైల్వేకాలనీ సీతారామాలయ ప్రాంగణంలో సామూహిక సహస్ర లింగార్చనలు ఘనంగా నిర్వహించారు. కార్తిక మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు క్రతువులు జరిగాయి. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టి.హరి, జి.జె.ఎస్.రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మకరాంపురం శిర్డి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త బెందాళం రమణస్వామి ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

రైతుల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఏటా ధాన్యం సేకరణ ఫిబ్రవరితో ముగుస్తుండగా.. రైతుల అభ్యర్థన మేరకు దాన్ని మార్చి వరకు పొడిగించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రెంటికోటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు 24 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని పేర్కొన్నారు. లొత్తూరు సమీపంలోని వరహాల గెడ్డ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామన్నారు. అనంతరం జగన్నాథ్ సాగర్‌కు సంబంధించిన దెబ్బతిన్న రక్షణ గోడను పరిశీలించారు. నూతన ప్రహరీ మంజూరు చేస్తామన్నారు. విఠల్, సంతోష్, కూర్మారావు, వ్యవసాయ శాఖ ఏడీ రామారావు, ఏవో పోలారావు, ఎంపీడీవో వసంతకుమార్, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి సీతారావు, ఆశ, మోహనరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: కిడిసింగిలో గురుస్వామి నర్సు దాలేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజలో ఎమ్మెల్యే శిరీష పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష

తెలంగాణ మంత్రికి సత్కారం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సత్కరించి ఆశీర్వదించినట్లు ఇచ్ఛాపురంలోని నైమిశారణ్య పీఠాధిపతి స్వామి బాలబ్రహ్మానంద సరస్వతి తెలిపారు. భాగ్యనగరంలో దేవాలయాలు పర్యటిస్తూ, మంత్రి నివాసంలో కొద్దిసేపు ఆతిథ్యం పొందారు. తెలంగాణలో వంద దేవాలయాల్లో ప్రవచనాలు చేయడంపై మంత్రి కృతజ్ఞతలు తెలిపినట్లు స్వామి తెలిపారు.

మంత్రి కొండా సురేఖను సత్కరిస్తున్న బాలబ్రహ్మానంద సరస్వతి

పక్క దారి పడుతున్న పట్టణ ప్రణాళిక

● ప్రధాన పోస్టుల ఖాళీతో సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులపై భారం

– న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం

పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో ఆదాయ వనరులు తెచ్చి పెట్టే శాఖల అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోజురోజుకు పట్టణ పరిధి పెరగడం, ఆక్రమణల పర్వంతోపాటు అక్రమ నిర్మాణాలు అధికమవుతున్న నేపథ్యంలో నియంత్రించే అధికార యంత్రాంగం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు పట్టణ ప్రణాళిక అధికారులు కీలకంగా వ్యవహరిస్తుంటారు. పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక పరిధిలో పట్టణ ప్రణాళిక అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో సచివాలయ ఉద్యోగులు, పొరుగు సేవల సిబ్బందితోనే ప్రక్రియ నడుస్తోంది. దీంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదు.

సస్పెన్షన్‌తో ఖాళీ...

విశాఖలో జరిగిన నిర్మాణ ఘటనతో పలాస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఇద్దరు పట్టణ ప్రణాళిక అధికారులను సస్పెండ్ చేశారు. దీంతో 5 నెలలుగా ఈ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు పర్యవేక్షణ అప్పగించడం, పొరుగు సేవల సిబ్బంది పెత్తనం చెలాయిస్తూ పనిచేస్తుండటంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసే వారే కరవయ్యారు.

ఇచ్ఛాపురంలో పట్టణ ప్రణాళిక విధులు నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులు

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో 31 వార్డుల పరిధిలో 16 సచివాలయాలుండగా, 9 మంది సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులున్నారు. పట్టణ ప్రణాళిక అధికారిగా రాజాం పురపాలక సంఘం నుంచి డిప్యుటేషన్‌పై వేసినా నేటి వరకు రాలేదు. తాజాగా ప్రభుత్వం ప్లానింగ్ కార్యదర్శులుగా పనిచేస్తున్న ముగ్గురిని టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీస్ (టీపీబీవో)లను ఇన్‌ఛార్జులుగా నియమించేందుకు సిద్ధమైనా.. పూర్తిస్థాయి ఉత్తర్వులు రాకపోవడంతో ప్లానింగ్, పొరుగు సేవల సిబ్బందితోనే పట్టణ ప్రణాళిక విభాగం నడిపించాల్సి వస్తోంది.

ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో 23 వార్డుల పరిధిలో 10 సచివాలయాలుండగా, ఆరుగురు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులున్నారు. వీరిలో ఇద్దరిని స్వచ్ఛ ఆంధ్రా ప్రాజెక్టుకు డిప్యుటేషన్‌పై పంపించారు. పుర కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీవో, టీపీఎస్‌లతోపాటు ఇద్దరు టీబీవోలు, ఒక ట్రేసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో వార్డు టౌన్ ప్లానింగ్ కార్యదర్శుల్లో ఒకరికి టీపీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పుర కమిషనర్ రమేష్ పర్యవేక్షిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

పట్టణ ప్రణాళిక విభాగంలో పోస్టుల ఖాళీపై విభాగాల వారీగా సమీక్షించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అక్రమ నిర్మాణాలకు ఎవరైనా సహకారం అందించినట్లు ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం.

– ఇ.శ్రీనివాసులు, ఎన్.రమేష్ పురకమిషనర్లు, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

?: బస్టాండు నుంచి గొల్లవీధి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. - కె.శంకర్, ఇచ్ఛాపురం

● ప్రతిపాదించి, సమస్యను పరిష్కరిస్తాం. - ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: కొజ్జిరియాలో వీధి దీపాలు నిత్యం వెలగడంలేదు. అవి పాడై కొన్ని వీధుల్లో అంధకారం అలుముకుంది. - గ్రామస్థులు

● స్విచ్‌బోర్డు ఏర్పాటు చేస్తాం, పాడైన దీపాల స్థానంలో కొత్తవి వేస్తాం. - బి.హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, కొజ్జిరియా

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పనులు ప్రారంభం

కొత్తపేట బీటీ రోడ్డు నుంచి దేవునల్తాడ మధ్య గ్రావెల్ వేసి వదిలేయడంతో ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈనెల 4న 'అధ్వానంగా ఆలుసా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు తారు పనులు వేగవంతం చేశారు. రెండు మూడు రోజుల్లో బీటీ పనులు పూర్తి చేసి ప్రజలకు ప్రయాణం మెరుగు పరుస్తామని డీఈఈ రవిబాబు చెప్పారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

పందులతో రైతులకు అవస్థలు

కపాసుకుద్ది, కుసుంపురం, కవిటి బీల ప్రాంతంలో అడవి పందులు రాత్రి సమయంలో పంటలు నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల చుట్టూ ఇనుప తీగలు, వలలతో కంచెను ఏర్పాటు చేసి గోనె సంచులను జెండాల మాదిరిగా పొలంలో ఏర్పాటు చేసినా పందుల బెడద తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కవిటి అటవీ శాఖాధికారి ఎ.రవికుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

చిన్న వర్షానికే చెరువవుతోంది..

బెనుగానిపేట సమీప జగనన్న కాలనీ చిన్నపాటి వర్షానికే చెరువులా మారుతోంది. ఏళ్లు కావస్తున్నా ఈ ప్రాంతంలో సౌకర్యాలు లేకపోవడంతో ఇళ్లు ఇంకా నిర్మాణదశలోనే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ విశ్వనాథంను వివరణ కోరగా అంచనాలు వేసి పంపించామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

గోడ కూలి.. ప్రమాదకరంగా మారి!

డోకుల పాడు తీర రహదారి కూడలి సమీప వంతెన రక్షణ కూలడంతో ప్రమాదకరంగా మారింది. వంతెన అడుగు భాగంలో పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడ లేని ప్రదేశంలో రేడియం స్టిక్కర్లతో ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని, రహదారి ఆభివృద్ధి పనుల్లో వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటామని రోడ్లు, భవనాల శాఖ జేఈ జగదీష్ తెలిపారు.– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

తవ్వారు.. వదిలేశారు

మూలిపాడులో సుజల స్రవంతి పథకంలో భాగంగా పైపులైను పనులు కొద్దిరోజులుగా చేపడుతున్నారు. ప్రధాన వీధిలో సీసీ రహదారి పక్కన పెద్ద గొయ్యి తవ్వారు. అక్కడ పైపులైను పనులు పూర్తయి వారమైనా గొయ్యిని మాత్రం పూడ్చలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల్లో గ్రామంలోని గొయ్యిలు పూడ్చివేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసన్న తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

పడిపోతోంది.. సరి చేయండి

డీజీపురంలో నీటి ట్యాంకు సమీపంలో విద్యుత్తు స్తంభం పూర్తిగా ఒక వైపు వాలిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఏ ప్రమాదం జరగకముందే స్పందించి స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు శాఖ ఏఈ గురవయ్య వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

సామాజిక, ఆర్థిక ప్రగతికి పునాది

పలాస పట్టణం, న్యూస్‌టుడే: సహకార సంఘాలు సామాజిక, ఆర్థిక ప్రగతికి పునాది అని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని 'సహకార సంఘాలతో మెరుగైన సమాజం' అంశంపై కళాశాలలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన చామంతి, అను, పావనికి జ్ఞాపిక, ధ్రువపత్రాలు, బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందించారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణ, జోనల్ మేనేజరు శ్రీనివాస్, స్థానిక బ్యాంకు మేనేజరు కనకమహాలక్ష్మి, కళాశాల వాణిజ్య, సైన్సు విభాగాల అధ్యక్షుడు వెంకటరమణ, శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో బ్యాంకు ప్రతినిధులు, ప్రిన్సిపల్

మరమ్మతులు చేపట్టండి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు కంబేపుట్టుగ రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడి పాడైందని, మరమ్మతులు చేపట్టాలని గ్రామానికి చెందిన కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ విప్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కంబేపుట్టుగ గ్రామస్థులు

సోంపేట, న్యూస్‌టుడే: కర్తలిపాలెం మాజీ సర్పంచి తామాడ పాపారావు ఇంట నిర్వహించిన అయ్యప్పస్వామి అంబులం, పడిపూజల్లో ప్రభుత్వ విప్ అశోక్ పాల్గొన్నారు. భాస్కర గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట

ఇచ్ఛాపురం: తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన ఇచ్ఛాపురం క్రీడాకారులను తైక్వాండో చీఫ్ కోచ్ చెన్నూరి దుర్గాప్రసాద్ అధ్యక్షతన మంగళవారం స్థానిక శిక్షణ కేంద్రంలో అభినందించారు. కాకినాడ సూర్య కళామందిర్‌లో శని, ఆదివారాల్లో జరిగిన పోటీల్లో 9 పతకాలు దక్కాయి. ఓవర్ 59 కిలోల విభాగంలో పి.వర్షిణి స్వర్ణం సాధించి పంజాబ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది. జూనియర్ విభాగంలో 32 కిలోల విభాగంలో బి.అశ్విత స్వర్ణం, 25 కిలోల విభాగంలో బి.మోక్షిత్, సీనియర్ విభాగంలో 73 కిలోల విభాగంలో అనపాన అను రజత పతకాలు అందుకున్నారు. బి.మోక్ష, జి.అభిరామ్, హేమసాగర్, అక్షజ్ రెడ్డి, 63 కిలోల విభాగంలో ఎస్.లక్ష్మణరావు కాంస్య పతకాలు సాధించారు. వీరిని క్రీడాభిమానులు విజయభాస్కర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ అభినందించారు. బెల్లుపడకాలనీ పుర ప్రాథమిక పాఠశాల విద్యార్థి మోక్షిత్ రజతం సాధించడంతో ఉపాధ్యాయులు, జ్ఞానభారతి విద్యార్థిని అశ్విత బంగారు పతకం సాధించడంతో సంస్థ కార్యదర్శి జోహార్‌ఖాన్, ప్రిన్సిపల్ ఐబీ పండా అభినందనలు తెలిపారు.

విజేతలను అభినందిస్తున్న క్రీడాభిమానులు

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం.. వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు అన్నారు. డోకులపాడు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం జత్తు జగన్న మెమోరియల్ ఛారిటబుల్ సంస్థ అన్ని పాఠ్యాంశాలకు సంబంధించి నమూనా పరీక్ష పత్రాల పుస్తకాలు వితరణగా అందజేశారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

పలాస పట్టణం, న్యూస్‌టుడే: నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో మంగళవారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. డిగ్రీ కళాశాలలో పుర కమిషనర్ శ్రీనివాసులు, డీఈ కనకరాజు, ఏఈ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ జె.వెంకటలక్ష్మి, అధ్యాపకులు, పుర సిబ్బంది పాల్గొన్నారు. జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నరసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వరహాల గెడ్డ రిజర్వాయర్ పరిశీలన

పలాస గ్రామీణం: లొత్తూరు సమీపంలోని వరహాల గెడ్డ రిజర్వాయర్‌ను జలవనరుల శాఖ ఏఈ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే శిరీష ఆదేశాలతో రిజర్వాయర్‌కు సంబంధించిన అంచనాలు తయారు చేస్తున్నామని ఏఈ తెలిపారు. జలవనరుల శాఖ సోంపేట డీఈఈ సత్యప్రసాద్, పలాస పీఏసీఎస్ ఛైర్మన్ కూర్మారావు, కృష్ణారావు, మోహనరావు పాల్గొన్నారు.

గ్యాస్ స్టవ్ పేలి మత్స్యకారుడికి తీవ్ర గాయాలు

కవిటి గ్రామీణం: బోటులో గ్యాస్ స్టవ్ పేలి ఓ మత్స్యకారుడు తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. కపాసుకుద్దికి చెందిన వంక చంద్రరావు పొట్ట కూటి కోసం గుజరాత్ వలస వెళ్లారు. మంగళవారం అక్కడ కొంతమంది మత్స్యకారులతో కలిసి బోటులో వేటకు వెళ్లగా అందులోని గ్యాస్ స్టవ్ పేలడంతో శరీరం అంతా కాలిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. తోటి మత్స్యకారుడు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బాధితుడికి సర్జరీ చేయాలని అందుకు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద మత్స్యకారుడు కావడంతో దాతల సాయం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.

సొంత స్థలముంటే ఇల్లు కట్టుకోండి

పలాస గ్రామీణం: పలాస మండల వెలుగు కార్యాలయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజనపై సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ మల్లేశ్వరరావు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ఆవాస్ ప్లస్‌పైనా అవగాహన కల్పించారు. సొంత స్థలం కలిగి ఉన్న వ్యక్తులు ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించి నవంబరు 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కట్టెల పొయ్యిలే దిక్కు

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. బడుల్లో చదువుకునే విద్యార్థులకు శ్వాసకోశ వ్యాధులు రాకుండా గతంలో గ్యాస్ బండలతో వంటలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాను రాను గ్యాస్ ధరలు పెరిగిపోవడంతో తమకు ఇచ్చే నగదు, వచ్చే కమీషన్ మొత్తం గ్యాస్ బండల కొనుగోలుకే సరిపోతోందని, బిల్లులు కూడా సకాలంలో రాకపోవడంతో సొంత డబ్బులు వెచ్చించి ఇబ్బందులు పడుతున్నామని వంట నిర్వాహకులు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో కట్టెల పొయ్యిలను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజపురం ఆదర్శ పాఠశాల వద్ద కట్టెల పొయ్యిపై వండుతున్న నిర్వాహకులు

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.. మా పాఠశాలలో సుమారు 520 మంది విద్యార్థులున్నారు. వీరికి మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం అందించిన గ్యాస్ బండ సరిపోదు. వారు ఇచ్చిన బండ 25 విద్యార్థులకు మాత్రమే సరిపోతోంది. దీనికి తోడు గ్యాస్ ధరలు పెరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– ఆనింగి పద్మావతి, వంట నిర్వాహకురాలు, రాజపురం ఆదర్శ పాఠశాల

చర్యలు తీసుకుంటాం.. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి కట్టెల పొయ్యిలు వాడకూడదు. దీనిపై ప్రధానోపాధ్యాయులకు సూచిస్తున్నాం. గ్యాస్‌పొయ్యిలపై వంటలు చేసేందుకు ఏజెన్సీలను ప్రోత్సహిస్తున్నాం. అందుకు తగ్గ చర్యలు తీసుకుంటున్నాం.

– ధనంజయ మజ్జి, ఎంఈవో, కవిటి

● ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 351 ఉన్నాయి. అందులో 310 చోట్ల కట్టెల పొయ్యిల మీదే మధ్యాహ్న భోజనం వండుతున్నారు. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఒక సిలిండర్ వారం రోజుల వరకు వస్తోంది. అదే పెద్ద పాఠశాలలైతే కనీసం నాలుగు రోజులు కూడా రావడం లేదు. అన్నంతోపాటు కూరలు, కోడిగుడ్లు ఉడకబెట్టడం, రాగిజావ తయారు చేయడం తదితర వాటికి సిలిండర్ త్వరగా అయిపోతుంది. దీంతో తలకు మించిన భారం మోయలేకపోతున్నామని, ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి రాయితీపై గ్యాస్ సిలిండర్లు అందజేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

తారు పనుల ప్రారంభం

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మత్స్యకార, ఉద్దానం ప్రాంత గ్రామాలను కలుపుతున్న మార్గం దశాబ్దాలుగా గ్రావెల్ రోడ్డుకే పరిమితమైంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే శిరీష కృషితో రూ.1.5 కోట్లతో రహదారి మంజూరైంది. మంగళవారం కూటమి నాయకులు తారు పనులను ప్రారంభించారు. సర్పంచి వరదరాజులు, నాయకులు షణ్ముఖరావు, పాపారావు, నారాయణ పాల్గొన్నారు.

పశు మాంస విక్రయాలు అడ్డుకోవాలి

కంచిలి: బంగ్లాదేశ్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మండల పరిధిలో దాబాలు నిర్వహిస్తూ పశుమాంస విక్రయాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ అయ్యప్ప భక్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం సమావేశం నిర్వహించారు. పలువురు కనీస గుర్తింపు కార్డులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు.

స్వామిత్వ సర్వేతో హక్కులు

సోంపేట: స్వామిత్వ సర్వేతో స్థలాలు, ఇతర ఆస్తులకు చట్టబద్ధమైన హక్కులు లభిస్తాయని ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని అధికారులు కోరారు. మంగళవారం పలాసపురం పంచాయతీలో స్వామిత్వ సర్వే కార్యక్రమం సర్పంచి జోగారావు అధ్యక్షతన జరిగింది. యజమానులకు హక్కు పత్రాలు అందజేశారు.

మృతికి సంతాపం

మందస: హరిపురానికి చెందిన గ్రేడ్-2 విశ్రాంత హెచ్‌ఎం వై.సోమేశ్వరరావు (68), డిమిరియాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు శీర గోపాలకృష్ణ (74) అనారోగ్యంతో మృతి చెందారు. వీరి మృతి పట్ల మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు త్రినాథరావు, నారాయణరావు సంతాపం తెలిపారు. సంఘ సభ్యులు కేశవరావు, రామారావు, యు.రాజారావు, కె.పాపారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మందస: మందస బృందావనంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో 104 మందికి కంటి పరీక్షలు చేసి 33 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ సభ్యులు టి.రామారావు, సత్యసాయిబాబా సేవా సమితి సమన్వయకర్త వి.ఈశ్వరరావు, బి.బైరాగి, వి.అప్పారావు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంలో ఆధునిక పద్ధతులు పాటించాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కోళ్ల పెంపకంలో ఆధునిక పద్ధతులు పాటించాలని ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడో సంవత్సరం చదువుతున్న బీఎస్సీ బోటని విద్యార్థులను క్షేత్ర పర్యటనకు రాజపురం పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లారు. అక్కడ కోళ్ల ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోళ్ల పెంపకం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు బోధించే పద్ధతులు గమనించారు. బోటనీ, జువాలజీ అధ్యాపకులు టి.బృందావనం, శాంత పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. మార్గదర్శకాలు

సోంపేట, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజేతలకు మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రాంబుడ్డి గణపతి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొర్లాం బాపూజీ గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ పోటీ పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు పి.చందు, గంగారావు, ఉమామహేశ్వరరావు, పి.రాజేష్ సంతోష్, నీలకంఠం, యాదగిరి పాల్గొన్నారు.

కొర్లాంలో పుస్తక ప్రదర్శన

బాలల హక్కులు పరిరక్షిద్దాం

బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దారు ఎన్.వెంకటరావు అన్నారు. అంతర్జాతీయ బాలల రక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఇచ్ఛాపురంలో చైతన్యప్రదర్శన నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు ఎన్.వెంకటరావు పాల్గొన్నారు. బాలికలను ఆరోగ్యకర సమాజంలో ఎదగనిద్దామని నినాదాలు చేశారు. అనంతరం బస్టాండు కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రతపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపకూడదని ఎంపీడీవో ఎల్.త్రినాథ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు గ్రామాభివృద్ధి, పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, ఏవో శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

కవిటి గ్రామీణం: బొరివంకకు చెందిన నిరుపేద ప్రసాద్ రౌళో కుటుంబానికి ఆ గ్రామానికి చెందిన ఉద్దానం యూత్‌క్లబ్ సభ్యులు కార్యదర్శి సాలిన వెంకటేశ్ ఆర్థిక సాయంతో అసిరి పోలమ్మ అమృత కలశం పేరిట రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు మంగళవారం అందించారు. క్లబ్ అధ్యక్షుడు ఎల్.దీనబంధ్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్ కుమార్, కేశవరావు, పూర్ణచంద్ర, తిరుపతి, నారాయణ, కాళిదాస్, ధర్మారావు, డొంబురు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s శ్రీరామ్ ఫైనాన్స్ Ltd., కె.టి.రోడ్, పలాస బ్రాంచ్ వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు.

శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలం, రెయ్యపాడు గ్రామం, మెయిన్ వీధి కాపురస్తుడైన గుర్తి మేనక D/o వాండ్రాసి భద్రాచలం, W/o గుర్తి లక్ష్మీనారాయణ నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు హామీగా అతని గుర్తి మేనక D/o వాండ్రాసి భద్రాచలం, W/o గుర్తి లక్ష్మీనారాయణ స్వాధీన, హక్కు అనుభవములోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై వేరెవ్వరికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు దినములలోగా వారి యొక్క ఆక్షేపణలను నాకు గాని నా క్లయింటుకు గాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తిపై గాని, దానిపై జరుపబోవు తాకట్టుపై గాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావింపబడునని యందు మూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలం, కాశీబుగ్గ సం॥, రెయ్యపాడు పంచాయతీ పరిధిలో గల మెయిన్ రోడ్ వీధిలో గల వార్డు అసెస్‌మెంట్ నెం. 85-2024, D.No: 1-61 రు. సర్వే నెం. 84 గల తూ॥ ప॥ లకు 10.5 అడుగులు, ఉ॥ ద॥లకు 68 అడుగులు మొత్తం 79.33 చ॥గలు గల హద్దులు.

తూర్పునకు: సైని రామారావు గారి ఇల్లు, దక్షిణానికి: రోడ్డు, పశ్చిమానికి: సంగారు గౌరమ్మ గారి ఇల్లు, ఉత్తరానికి: రోడ్డు.

YAVVARI HEMAKUMAR
Advocate, Palasa, Cell: 9440592204

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయం ఆవరణలో ఐదు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్యాంకు ఖాతాల్లో బుధవారం జమకానున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు ప్రతి రైతుకు అందేలా చూడాలని కోరారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

టెక్కలి పట్టణం, నందిగాం, పాతపట్నం, జలుమూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలని వక్తలు పేర్కొన్నారు. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. విద్యార్థులకు మంగళవారం ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించి, అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథ పాలకులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

నందిగాంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నాగేంద్ర హారాయ.. త్రిలోచనాయ

విశేష అలంకరణలో మహా మృత్యుంజయస్వామి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తపేట శివకేశవ ఆలయంలో మహా మృత్యుంజయస్వామికి భస్మాభిషేకం నిర్వహించారు. పురోహితులు భాగవతుల గౌరీశంకరశర్మ, బంకుపల్లి వెంకటపతిశర్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి, కొత్తపేట, సంతబొమ్మాళి, దండుగోపాలపురం ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా మల్లేశ్వర స్వామి ఊరేగింపు.. సారవకోట, న్యూస్‌టుడే: అవలింగి మల్లేశ్వరస్వామిని బుడితి, చీడిపూడి గ్రామాల్లో మంగళవారం మేళతాళాలతో ఊరేగించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని వీధివీధి చేపట్టినట్లు అర్చకుడు స్వామి తెలిపారు. పుష్పాలంకరణ ఆకట్టుకుంది. మూడు గ్రామాల ప్రజలు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పుష్పాలంకరణలో స్వామి వారు

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

పెద్దసీదిలో దస్త్రాలు పరిశీలిస్తున్న చంద్రభూషణ్

పాతపట్నం, మెళియాపుట్టి: పెద్దసీది, చాపర ఉన్నత పాఠశాలల్లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చంద్రభూషణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పరీక్షల నిర్వహణ, బుక్‌లెట్స్, విద్యార్థుల ప్రగతి కార్డుల గురించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యాశాఖాధికారులు దేవేంద్రరావు, పద్మనాభం, ప్రధానోపాధ్యాయులు బి.సింహాచలం, వ్యాసగీత పాల్గొన్నారు.

కట్టడి లేదు.. గుట్టుగా కలిపేద్దాం..!

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, సారవకోట, జలుమూరు

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు గ్రామీణ మార్గాలను రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిన పక్కన కొందరు తమ స్వలాభం కోసం రహదారికి ఆనుకొని నిర్మాణాలు చేపట్టడంతో కుచించుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు అలసత్వంతో ఆక్రమణలు మరింత పెచ్చుమీరుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

• నరసన్నపేట మండలంలో జలీవల అభివృద్ధి చేసిన కోమర్తి- బుద్ధి మార్గంలో ఉర్లాం వద్ద ముదుగు కాలువ పంటలపై వలువొట్టె ప్రహరీలు, ర్యాంపుల నిర్మాణాలు చేపట్టారు. ఉర్లాం మార్కెట్ కూడలిలో వ్యాపారులు ఇదే ధోరణిలో వ్యవహరిస్తుండటంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకునేందుకు వీలు లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. కుమ్మరిపేట, కొత్తపోలవలస, నరసింగరాయుడుపేట, పాలకొండపేట గ్రామాల్లో రోడ్లను ఆక్రమించి మరుగుదొడ్లు, స్నానపు గదులు, కిరాణా దుకాణాలు ఏర్పాటు చేయడంతో కుచించుకుపోతున్నాయి. ముద్దాడపేట, సాలిపేట, పాలకొండపేటలో రహదారి పక్కనే గడ్డి, పశువుల వ్యర్థాలు నిల్వ చేస్తున్నారు.

కొత్తపోలవలసలో రహదారిని ఆనుకుని నిర్మాణం

• సారవకోట మండల కేంద్రంతో పాటు బుడితి, అవలింగి గ్రామాల్లో రహదారులపై వ్యాపారాలు చేస్తున్నారు. అలుదు, బొంతు కూడలిలో కొంతమంది రోడ్లను ఆక్రమించి గృహ నిర్మాణాలు చేపట్టారు.

• జలుమూరు మండలం చల్లవానిపేట, జలుమూరు, కొమనాపల్లి, అల్లాడ గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

చర్యలు చేపడతాం

రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, వ్యాపారాలు సాగిస్తున్న విషయాలు మా దృష్టికి వచ్చాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. సమస్యలు ఉన్న చోట్ల సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసి అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు చర్యలు చేపడతాం.

– తిరుపతిరావు, డీఈఈ, ర.భ.శాఖ

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: తర్లికొండ నుంచి బమ్మిడిపేట వైపు కొత్తగా విద్యుత్తు స్తంభాలు వేస్తున్నారు. నారాయణపురం ఎత్తిపోతల పథకం కాలువ స్థలంలో ఒకటి ఏర్పాటుచేయడంతో సాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. - యుగంధర్, బమ్మిడిపేట, కోటబొమ్మాళి

• కన్‌స్ట్రక్షన్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. సమస్యను వారికి తెలియజేసి, పరిష్కారానికి కృషి చేస్తాం. - కోటేశ్వరరావు, ఏఈఈ, కోటబొమ్మాళి – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

?: నందిగాం మండలం పెద్దతామరాపల్లి పంచాయతీ మద్దిలి వానిపేట గ్రామంలో 5 వీధి దీపాలు వెలగడం లేదు. అందువల్ల రాత్రి సమయంలో రాకపోకలు చేయలేకపోతున్నాం. సంబంధిత అధికారులు స్పందించాలి. - కె.బాలకృష్ణ, స్థానికుడు

• క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. - లక్ష్మణరేఖ, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, నందిగాం

ఉచిత శిక్షణ తరగతులు.. పాతపట్నం, న్యూస్‌టుడే: స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ కేంద్రంలో సైబర్ సెక్యూరిటీ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ కె.చక్రపతి పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే తరగతులకు ఆసక్తి ఉన్న విద్యార్థులు హాజరు కావాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

గుండె చెరువవుతోంది..!

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని గోపీనాథపురం ప్రాంతానికి ఆధారమైన ఊర చెరువు దుస్థితి ఇది. పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో రేవుల్లో అడుగు పెట్టేందుకు సైతం స్థానికులు భయపడుతున్నారు. నీరు కలుషితమై వినియోగించేందుకు వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీ కార్యవర్గం దృష్టికి తీసుకెళ్తామని కార్యదర్శి వెంకటశ్రీనివాసరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

రూ.10 లక్షల ఖర్చు.. మారితే ఒట్టు

వైకాపా హయాంలో కోటబొమ్మాళి- బంజీరుపేట రహదారి గురించి పట్టించుకునే వారే లేకపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతూ రాకపోకలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాది క్రితం రూ.పది లక్షలతో మరమ్మతులు చేశారు. పనుల్లో నాణ్యతను గాలికొదిలేయడంతో గోతులమయంగా తయారైంది. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ర.భ.శాఖ ఏఈ హరనాథ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ప్రమాదం.. పట్టని యంత్రాంగం

హిరమండలం పరిధి వంశధార కుడి ప్రధాన కాలువ గట్టుపై విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. పక్కకు ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ మార్గంలో రాకపోకలు చేసే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని హిరమండలం విద్యుత్తు ఉప కేంద్రం ఇన్‌ఛార్జి ఏఈ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు .

– న్యూస్‌టుడే, హిరమండలం

మురుగు కానరాని మెరుగు

కొత్తూరు మండలం వసప ప్రాథమిక పాఠశాలకు సమీపంలో రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులతో పాటు స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే ఇబ్బందులు తీవ్రమవుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని మండల పరిషత్తు పాలనాధికారి బీవీఆర్ ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా.. సిబ్బందికి తెలియజేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ఏడేళ్లుగా.. దిష్టిబొమ్మలా..!

సారవకోట మండలం సవరశివరాంపురం గ్రామంలో 2017-18లో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గుత్తేదారు పనులు ప్రారంభించారు. శ్లాబ్ వరకు పూర్తి చేసి వదిలేశారు. నిర్మాణం నిలిచి ఏడేళ్లవుతున్నా కనీసం పట్టించుకునే వారే లేకుండా పోయారని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఐసీడీఎస్ పీవో వంశీప్రియ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

నందిగాం, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో హరికృష్ణ అన్నారు. నందిగాం మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో సర్పంచులకు, ఉప సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంతోష్‌కుమార్ ఉన్నారు. ★ పల్లెల పరిశుభ్రత పంచాయతీ పాలకుల బాధ్యతని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ అన్నారు. మెళియాపుట్టిలో జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన పలు సూచనలు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మెళియాపుట్టి: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కురుడు పాఠశాలలో 14 విగ్రహాల ఏర్పాటు

మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన డీఈవో రవిబాబు, ఇతర విద్యా శాఖాధికారులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కురుడు ఉన్నత పాఠశాలలో స్థలదాత రొక్కం రామ్మూర్తిదొర, శాసనసభ తొలి సభాపతి రొక్కం లక్ష్మీనరసింహదొర, 12 మంది జాతీయ నాయకుల విగ్రహాలను ఆవిష్కరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రధానోపాధ్యాయులు ఖగేశ్వరరావు, ఉపాధ్యాయులు కరిమి రాజేశ్వరరావు, నరసింగరావు, శ్రీనివాసరావు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయిని సుందరమ్మ వీటిని అందచేశారు. డీఈవో రవిబాబు, ఇతర విద్యా శాఖాధికారులు వీటిని ఆవిష్కరించారు. గ్రామ పెద్ద అచ్యుతరావు, నాళ్ల ఆదినారాయణ (చిన్ని), టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్, ఎంఈవో డబీరు గోవిందరావు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శీతాకాలం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ ఎమర్జెన్సీ విభాగం వైద్యుడు కోట బాలసూర్యప్రకాశ్ సూచించారు. టెక్కలిలో మంగళవారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులకు నిర్వహించిన వైద్యవిజ్ఞాన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలు, పెద్దలకు ఈ కాలంలో వచ్చే వ్యాధులు, అందించాల్సిన చికిత్స పద్ధతుల్ని వివరించారు. గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సత్తారు రాజశేఖర్, వైద్యులు సందీప్, నరేష్, శ్యాంప్రసాద్, వంశీ, మనోజ్‌కుమార్, రంగా, గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కొత్తూరు, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పార్టీ కొత్తూరు మండలాధ్యక్షుడు ఎ.మాధవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మాతల గాంధీ, క్లస్టర్ బాధ్యులు ఎ.అరుణ్‌కుమార్, నూలు వీరభద్రస్వామి, ఎ.శంకరరావు, బుజ్జి విశాఖలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తూరు మండలంలోని సమస్యలను, పార్టీ పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నాటుసారాతో ఇద్దరి అరెస్టు

కొత్తూరు: మెట్టూరు బిట్-1 పంచాయతీలో నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులను నాటుసారాతో అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కె.వెంకటేశ్ మంగళవారం పేర్కొన్నారు. డెప్పిగూడకు చెందిన ముఖలింగం, ధర్మారావులను అదుపులోకి తీసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తాం

జలుమూరు, న్యూస్‌టుడే: రైతు పండించే ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జలుమూరు మండలం చల్లవానిపేట పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. వ్యవసాయం లాభసాటి చేయాలన్నదే కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయమన్నారు. అపోహలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల తెదేపా అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, చల్లవానిపేట, అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షులు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు, వ్యవసాయశాఖ ఏడీ ఎల్.వి.మధు, ఏవో కె.రవికుమార్, తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో చిన్నమ్మడు పాల్గొన్నారు.

చల్లవానిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రమణమూర్తి

బాలల దత్తతపై అవగాహన అవసరం

నరసన్నపేట, న్యూస్‌టుడే: అనాథ బాలల దత్తతపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి శోభారాణి సూచించారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దత్తత స్వీకరణ తీరును వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం ప్రతినిధి ఎ.గీత, బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి జనార్దనరావు, అదనపు పీవో అనురాధ, పర్యవేక్షకులు రమణమ్మ, జయమ్మ, శ్రీదేవి, దుర్గమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో శోభారాణి

రెవెన్యూ సంఘం కార్యదర్శిగా నియామకం

శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది

నరసన్నపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం కార్యదర్శిగా పొదిలాపు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం తీర్మానించి ఆయన్ను ఎన్నుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శ్రీనివాసరావు ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన నియామయంపై తహసీల్దార్ సత్యనారాయణ, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఘనంగా సత్కరించారు.

మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయి

సారవకోట, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్ పేర్కొన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సారవకోట రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి ఎర్రజెండాలు పట్టుకొని నిరసన ప్రదర్శన చేపట్టారు. రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వానికి పాతరేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో మాదిరిగా రాష్ట్రంలో కులాల ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతిరావు, లవకుమార్, యశోద, వసంత్, భాస్కరరావు పాల్గొన్నారు.

సారవకోట రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కంటి వైద్య శిబిరానికి స్పందన

జలుమూరు, న్యూస్‌టుడే: చల్లవానిపేటలో శ్రీవిజయాంబిక యువజన సంఘం అధ్యక్షుడు ఆనందరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. విశాఖశంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పలువురు రోగులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు డి.దీపక్, సమన్వయకర్త అశ్వినికుమార్, పి.విజయ్, ఎస్.విశ్వేరరావు, పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యూనిట్ల అందజేత

హిరమండలం, న్యూస్‌టుడే: పీఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతి వృత్తిదారులకు మేలు కలుగుతుందని భాజపా మండలాధ్యక్షుడు రెళ్ల డిల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం హిరమండలం తపాలా కార్యాలయం వద్ద పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు మంజూరైన చేతి వృత్తుల కిట్లను భాజపా నాయకులు అందజేశారు. బి.ధర్మారావు, తిరుపతిరావు, నారాయణ పాల్గొన్నారు.

ఆస్తుల వివరాలు పరిశీలించుకోండి

హిరమండలం, న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వేలో గుర్తించిన ఆస్తుల వివరాలను పరిశీలించుకోవాలని టెక్కలి డివిజనల్ అధికారిణి అలివేలు మంగమ్మ అన్నారు. మంగళవారం కొమనాపల్లి పంచాయతీలో సర్పంచి పల్లి శారద అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు పాల్గొన్నారు.

పశు సంపద పెంచేందుకు కృషి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: పశువుల పెంపకంతో మంచి ఆదాయం వస్తుందని తద్వారా పల్లెల్లో పశుసంపద గణనీయంగా పెరుగుతుందని ప్రాంతీయ ఆసుపత్రి సహాయ సంచాలకుడు లోకనాథం పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సెర్ప్, పశు సంవర్ధక శాఖ సిబ్బందితో మంగళవారం సంయుక్త సమావేశం నిర్వహించారు. వైద్యులు కిరణ్‌కుమార్, ప్రజ్ఞచైతన్య, వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, మండల సమాఖ్య కార్యదర్శి అన్నపూర్ణ పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన

కొత్తూరు, న్యూస్‌టుడే: బాలికల హక్కులపై అవగాహన అవసరమని కొత్తూరు ఐసీడీఎస్ పీవో ఉమాజానకి అన్నారు. మండలంలోని వసప కేజీబీవీలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. పర్యవేక్షకురాలు గౌషియా బేగం పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో బాల్యవివాహాలను నివారించేందుకు బాల్య వివాహాల నివారణ కమిటీలకు అధిక ప్రాధాన్యమివ్వడం అవసరమని ఐసీడీఎస్ పీవో హైమవతి, బాలల రక్షణ విభాగం సమన్వయకర్త సీతారాములు సూచించారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ సుజాత ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

హిరమండలం, న్యూస్‌టుడే: గొట్టా బ్యారేజీ కూడలిలో మంగళవారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ఎం.ఎస్.రేజికుమార్ నంబూద్రి ఆధ్వర్యంలో హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల భక్తులు పూజలు చేశారు. సుడా అధ్యక్షుడు కొరికాన రవికుమార్, జనసేన నాయకురాలు కొరికాన భవానీ, జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వితరణ

నరసన్నపేట, న్యూస్‌టుడే: పంజాబ్‌లో జరగనున్న త్రైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఆటగాళ్లకు నరసన్నపేటకు చెందిన పలువురు క్రీడా దుస్తులు అందజేశారు. గిరీశ్, హర్ష, భవానీ ఉన్నారు.

ఆహ్లాదం.. ఆనందం

– న్యూస్‌టుడే, నందిగాం

చుట్టూ ప్రహరీ, మధ్యలో ఆటస్థలం. దానికి ఇరువైపులా పచ్చదనంతో కూడిన చెట్లు, వివిధ రకాల పూల మొక్కలు. లోపలికి ప్రవేశించగానే ఆహ్లాదకర వాతావరణం. ఇదీ నందిగాం మండలంలోని పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలలోని పరిస్థితి. ఇక్కడ 1 నుంచి అయిదో తరగతుల వరకు 74 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయిదుగురు ఉపాధ్యాయులు వారికి బోధన చేస్తున్నారు. నూతన ఒరవడితో ఈ విద్యాలయంలో ప్రైవేటుకు దీటుగా తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను 3 గ్రేడులుగా విభజించి సీ గ్రేడులో ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 3:30 నుంచి 4:30 వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమష్టి కృషి

మొక్కలను పెంచే బాధ్యత ఉపాధ్యాయులే తీసుకుంటారు. దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. సరస్వతీ దేవి, జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది అక్టోబరు 6న జిల్లాలో స్వచ్ఛ పాఠశాల అవార్డును ఈ విద్యాలయం దక్కించుకుంది. 'విద్యార్థుల తల్లిదండ్రులు సైతం క్రమం తప్పకుండా పిల్లల్ని పంపిస్తుండటం అభినందనీయం. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సమష్టి కృషితో ముందుకెళ్తున్నాం.' అని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.హైమావతి పేర్కొన్నారు.

పెద్దతామారాపల్లి పాఠశాలలో మొక్కలకు నీరు పెడుతున్న ఉపాధ్యాయుడు

మేము సైతం.. భజన చేస్తాం

– న్యూస్‌టుడే, సారవకోట, జలుమూరు, పోలాకి

ఒకప్పుడు పురుషులకే పరిమితమైన భజనల్లో మహిళలు సైతం పాల్గొని గుర్తింపు పొందుతున్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్వగ్రామంతో పాటు, ఆహ్వానం మేరకు ఇతర గ్రామాల్లో జరిగే వినాయక, నందెన్న ఉత్సవాలు, గృహ ప్రవేశాలు, ఆలయాల ప్రారంభం వంటి కార్యక్రమాల్లో తమ గాత్రంతో ఆకట్టుకుంటున్నారు. రాకపోకలకు ఏర్పాట్లు చేస్తే 10 నుంచి 20 మంది వరకు తబల, డోలక్, హార్మోనియం వంటి సంగీత పరికరాలతో ఉచితంగా పాటలు, సంకీర్తనలు ఆలపిస్తారు.

భక్తి పథంలో పయనం.. సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామానికి చెందిన కొందరు అతివలు ఏకరూప దుస్తులు ధరించి భజనల్లో పాల్గొంటారు. ఈ గ్రామంలో నిత్యం నగర సంకీర్తనలు నిర్వహిస్తారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అర్చకుడు కె.సిద్ధయ్యస్వామి ప్రోత్సాహంతో వీరు సాధన చేస్తుంటారు. బద్రి, బొమ్మికపేట గ్రామాలకు చెందిన మహిళలు భజనలు చేస్తూ పరిసర ప్రాంతాల ప్రజల మన్ననలు పొందుతున్నారు. ★ జలుమూరు మండలం ఎలమంచిలి, కొమనాపల్లి, అక్కురాడ, శ్రీముఖలింగం, పోలాకి మండలం తలసముద్రం, ఈదులవలస గ్రామాల మహిళలు భజనలు చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

భక్తి గీతాలు ఆలపిస్తున్న ఎలమంచిలికి చెందిన ఎండల కామేశ్వర స్వామి భజన బృందం

పునాదులకే పరిమితం..

పొందూరు మండలం బానాం గ్రామంలో ఆరోగ్యకేంద్రం భవనం దుస్థితి ఇది. వైకాపా హయంలో ఇక్కడ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఇలా పునాది దశలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం పనికిరాని మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

అన్నదాతను ఆదుకోండి

ఎచ్చెర్ల: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో మంగళవారం వారు మాట్లాడారు. దళారులు చేతిలో రైతులు నష్టపోకుండా అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

?: వేంకటేశ్వర ఆలయం వెనక వీధిలో రహదారిపై పశువులు కదుపుతున్నారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – రఘునామూర్తి, ఆమదాలవలస ● పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – జాస్పన్, పుర ఏఈ

?: రైల్వేస్టేషన్ ఆవరణ, వెంగళరావుకాలనీ, గేటు, ఐజీనాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కలు సంచారం ఎక్కువగా ఉంది. చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. – కిశోర్, ఆమదాలవలస ● కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. – టి.రవి, పుర కమిషనర్ – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

?: శ్రీకాకుళం నగరంలోని మండలవీధిలో సీసీ కాలువల్లో పూడిక వల్ల మురుగునీరు నిలిచిపోతోంది. – చిన్నంనాయుడు, మండలవీధి ● సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సమష్టి కృషితోనే విజయం సొంతం

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: కూటమి నాయకులు, కార్యకర్తలంతా సమష్టి కృషి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని ఓ కల్యాణ మండపంలో నియోజకవర్గ తెదేపా క్లస్టర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల దత్తత ప్రక్రియపై అవగాహన అవసరం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పిల్లల దత్తత తీసుకునే విషయంలో సరైన అవగాహన అవసరమని జిల్లా బాలల రక్షణ విభాగం అధికారి ఇప్పిలి లక్ష్మీనాయుడు అన్నారు. మంగళవారం ఎచ్చెర్ల మహిళా ప్రాంగణంలో ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అనాథ పిల్లల దత్తత ప్రక్రియపై మిషన్ వాత్సల్య- జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలని అనుకుంటే మిషన్ వాత్సల్య వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో డి.పావని, జిల్లా బాలల రక్షణ విభాగం అవుట్ రీచ్ వర్కర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆడుకోవడానికో మైదానం కావాలి

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు అధిక విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో పలు మైదానాలు పంట పొలాలను తలపిస్తున్నాయి. దీంతో పిల్లలు క్రీడలకు దూరమవుతున్నారు. ఆట స్థలాలు అభివృద్ధి చెందితే గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఆమదాలవలస: పచ్చగడ్డి పెరిగి పొలాన్ని తలపిస్తున్న వెదుళ్లవలస జడ్పీహెచ్ పాఠశాల క్రీడామైదానం

❖ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో ప్రాథమిక పాఠశాలకు 1.5 ఎకరాలు, ప్రాథమికోన్నత 2 ఎకరాలు, జడ్పీహెచ్‌ఎస్‌కు 4 ఎకరాల విస్తీర్ణంలో క్రీడా మైదానాలు ఉండాలి. ప్రస్తుతం ఎక్కడా పూర్తిస్థాయిలో మైదానాలు కనిపించడం లేదు. జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మైదానాలు ఉన్నప్పటికీ అవి అభివృద్ధికి నోచుకోకపోవడంతో పనికిరాని మొక్కలు, పచ్చగడ్డి పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

ఆమదాలవలస నియోజకవర్గం వివరాలు

మండలం	జడ్పీహెచ్ఎస్	ఆట స్థలాలు ఉన్నవి	లేనివి
ఆమదాలవలస	07	07	00
సరుబుజ్జిలి	07	04	03
బూర్జ	08	06	02
పొందూరు	08	03	05

ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు

❖ కొత్తకోట, సరుబుజ్జిలి, ఆమదాలవలసలో అన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించే మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఆసక్తిగా ఉన్నప్పటికీ శిక్షణ లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నారు.

❖ నియోజకవర్గంలో 30 జిల్లా ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 20 చోట్ల క్రీడా మైదానాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. మరికొన్ని బడుల్లో అసలు ఆటస్థలాలే లేవు. గోనెపాడు, చిన్నకాగితాపల్లిలో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు.

క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తాం..

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. తక్షణమే మండల విద్యాశాఖ అధికారులతో చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తాం. –కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని పలు పాఠశాలలను పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి జె.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం.. చూసుకుని వెళ్లండి

పొందూరు అంబేడ్కర్ కూడలి వద్ద వేగ నియంత్రికలు దాటుతుండగా టిప్పర్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ నుంచి రాళ్ల పిక్కలు రహదారిపై జారి పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పొందూరు-శ్రీకాకుళం ప్రధాన రహదారి కావడంతో పలు వాహనాలు రాకపోకలకు ఆటంకంగా ఉంది. రాత్రివేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో మోహన్‌రావు వద్ద ప్రస్తావించగా పిక్కలు తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

కొమ్మలు తగులుతున్నాయ్..

ఆమదాలవలస పట్టణంలోని వన్‌వే గాంధీ కూడలి రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయి. దీంతో వాటి మధ్య రాపిడికి నిప్పులు రాలుతున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆ సమీపంలోని విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకలు చేస్తుంటారు, అధికారులు స్పందించి కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు. ఈ సమస్యను విద్యుత్తు ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

రోడ్డును కమ్మేస్తున్నాయి..

లావేరు మండలం జాతీయ రహదారి బొంతుపేట కూడలి నుంచి 7.5 కి.మీ మేర రహదారిని ఇరువైపులా పనికిరాని మొక్కలు, ముళ్ల పొదలు కమ్మేస్తున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వెంకటరావుపేట, బుడతవలస, మెట్టవలస, గుమ్మడాం, సూర్యనారాయణపురం, రణస్థలం మండలం కృష్ణాపురం, రావాడ తదితర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయంలో రాకపోకలకు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పీఐయూ విభాగం ఏఈఈ పోలినాయుడు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

నాచుపట్టి నిరుపయోగం..

పొందూరు నుంచి జగనన్న కాలనీకు వెళ్లే దారిలో గల గెడ్డవాగు నీటిని మళ్లించేందుకు తెచ్చిన పైపులు పూర్తిగా నాచుపట్టి నిరుపయోగంగా ఉన్నాయి. ఇటీవల మొంథా తుపాన్ ప్రభావంతో గెడ్డవాగు ప్రవహించి కాలనీకి వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డామని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే పొందూరు గ్రామీణం

భవనం నిర్మించారు.. దారి మరిచారు

జి.సిగడాం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో రక్త, ఇతర వైద్య పరీక్షల నిర్వహణ చేయడం కోసం నూతనంగా భవనాన్ని నిర్మించారు. కానీ సరైన రహదారి లేకపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు బురదమయంగా మారి రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని వైద్యాధికారి యశ్వంత్ వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు గోవిందరావు, వ్యాయామోపాధ్యాయురాలు స్వాతిలు తెలిపారు. అండర్ 14 విభాగంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు ఈ నెల 9నుంచి 21 వరకు చిత్తూరు మదనపల్లిలో జరుగుతాయన్నారు.
– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

శ్రీకాకుళం గ్రామీణం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం లంకాం గ్రామ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీలకు ధాన్యం ఎత్తిన తర్వాత, అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగు నీరు, ఇతర సదుపాయాలు ఉండాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ మండల తెదేపా అధ్యక్షుడు మూకళ్ల శ్రీనివాసరావు, తహసీల్దారు శిర్ల గణపతిరావు తదితరులు పాల్గొన్నారు. ❖ ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసి కూటమి ప్రభుత్వం కర్షకులకు అండగా నిలుస్తుందని డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని చిన్నకాకితాపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, చిన్నకాకితాపల్లి నీటి సంఘం అధ్యక్షుడు వెలమల రమేష్, తహసీల్దార్ మధుసూదన, వ్యవసాయాధికారి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ఆఫీస్ సబార్డినేటర్లకు ఉద్యోగోన్నతి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ యాజమాన్యంలోని పలువురు ఆఫీసు సబార్డినేటర్లకు దస్త్రాల సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ వారిని పలు పాఠశాలలకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో యు.రమణబాబు, జి.సత్య నారాయణ, షేక్ దేవీబేగం, ఎస్.ఉమాకుమారి, పి.శశిధరబాబు, సీహెచ్.వెంకటలక్ష్మి, డి.రూపావతి, బి.కమలమ్మ, బి.కమలకుమారి, కె.పీతాంబరరావు, కె.వి.సన్యాసిరావు, పి.వి.గుప్త, ఎం.ఉషా, ఎం.మహాలక్ష్మి ఉన్నారు. జడ్పీ సీఈవో కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగులతో జడ్పీ అధ్యక్షురాలు విజయ

23న బాలికల అస్మిత అథ్లెటిక్స్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఈ నెల 23న అండర్ 14, 16 బాలికల అస్మిత్ అథ్లెటిక్ మీట్ నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి సాంబమూర్తిలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. అండర్ 14 బాలికల విభాగానికి 2011 డిసెంబరు 12, 2013 డిసెంబరు 20 మధ్య జన్మించిన బాలికలు అర్హులని, అండర్ 16 పోటీలకు 2009 డిసెంబరు 21, 2011 డిసెంబరు 20 మధ్య జన్మించిన వారు అర్హులని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనాలనుకున్న వారు 23న ఉదయం 8 గంటల సమయంలో ఆధార్ కార్డుతో కోడి రామ్మూర్తి స్టేడియంలో హాజరు కావాలన్నారు.

బీఆర్ఏయూలో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ

ఎచ్చెర్ల, ఆమదాలవలస పట్టణం, బూర్జ, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వశాఖ సూచనల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని సమష్టిగా ఎదుర్కొవాలనే నినాదంతో సంకల్ప అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, దివ్యాంగుల సంక్షేమశాఖ ఉప సంచాలకులు బి.శైలజా, వర్సిటీ ప్రిన్సిపల్ అనురాధ తదితరులు పాల్గొన్నారు. ❖ ఆమదాలవలసలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.శ్యాంసుందరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ❖ బూర్జ మండలంలోని ఓవీపేట ఆదర్శ పాఠశాలలో మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా వచ్చే సమస్యలను వివరించారు.

ఎచ్చెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కంప్యూటర్ సైన్స్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు

శ్రీకాకుళం గ్రామీణం న్యూస్‌టుడే: నిరంతరం మారుతున్న కంప్యూటర్ సైన్స్ రంగాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగ అసిస్టెంట్ రామకృష్ణ అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేట గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ విభాగం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఐదు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడారు. రానున్న కాలంలో కృత్రిమ మేధ ప్రభావం ఎక్కువని, ఆ దిశగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేవీవీ సత్యనారాయణ విభాగాధిపతి, బాలసుందర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వీర వసంతేశ్వరుని కల్యాణం

గార, సరుబుజ్జిలి, పొందూరు గ్రామీణం, ఆమదాలవలస గ్రామీణం, శ్రీకాకుళం నగరం, శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: గార మండలం శాలిహుండం శ్వేతగిరిపై ఉన్న వీర వసంతేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారి వార్షిక కల్యాణ క్రతువు కమనీయంగా జరిగింది. ఉదయం స్వామివారి దైనందిన కార్యక్రమాలు అనంతరం అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. ★ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. ★ సరుబుజ్జిలి మండలంలోని షళంత్రి గ్రామంలో ఉమానీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ★ ఆమదాలవలస పట్టణంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలోదీపారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల ప్రారంభించారు. ★ పొందూరులోని అయ్యప్ప స్వామి ఆలయంలో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామికి మాస శివరాత్రి సందర్భంగా లక్ష పుష్పాలతో పూజలు చేశారు.

గార: కల్యాణ ఘట్టంలో తలంబ్రాల క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

ఆమదాలవలస ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో దీపారాధన

నక్కవీధిలో ఉమాజఠలేశ్వరాలయంలో స్వామికి అన్నాభిషేకం

ప్రభుత్వ స్థలంలో ఆలయాన్ని నిర్మించాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కేంద్రంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని భాజపా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పైడి వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఇక్కడ విస్తరణ పనులు జరుగుతున్న కారణంగా ఆలయాన్ని ప్రభుత్వ స్థలంలో నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ప్రైవేటీకరణ తగదు

పొందూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మంగళవారం పొందూరు మండలం కేశవదాసుపురం, నందివాడ, బురిడికంచరాం, లోలుగు, కృష్ణాపురం, దల్లిపేట, బాణాం గ్రామాల్లో కోటి సంతకాల సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైకాపా మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ

భక్తుడికి అస్వస్థత

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి దర్శనానికి విజయనగరం నుంచి వచ్చిన ఓ భక్తుడు నిత్య అన్నదానం క్యూలో నిల్చుని అస్వస్థతకు గురయ్యాడు. ఆలయ సిబ్బంది స్థానిక ఆర్ఎంపీ మోహనరావును పిలిపించి వైద్యం అందించడంతో కోలుకున్నాడు.

జిల్లా వీఆర్వోల సంఘం అభినందన

గార, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన పొదిలాపు శ్రీనివాసరావుకు జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు డి.రాజేష్‌కుమార్ అభినందనలు తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులతో శ్రీనివాసరావుని జిల్లా కేంద్రంలో కలిసినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల అన్నారు. రొట్టవలసలో అనారోగ్యంతో బాధపడుతున్న బూర్ల లక్ష్మి రూ.23 వేలు, బెవర నారాయణమ్మకు రూ.68 వేలు సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం అందజేశారు. ★ ఆమదాలవలస మండలం సైలాడ పంచాయతీ కుమ్మరిపేటలో గొంటి రమేష్‌కు రూ.51 వేల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు.

హిందీ పండిట్‌కు సత్కారం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన హిందీ పండిట్ కనుగుల సత్యం హిందీ ప్రచారానికి చేస్తున్న కృషి అభినందనీయమని హిందీ ప్రచార సభ నాలుగు రాష్ట్రాల ప్రధానకార్యదర్శి ఎస్.గైబువల్లి, హిందీ మంచ్ వ్యవస్థాపకుడు కోనే శ్రీధర్‌లు పేర్కొన్నారు. 20 ఏళ్లుగా హిందీ భాషకు కృషి చేస్తున్నారన్నారు. మంగళవారం విశాఖలో జరిగిన హిందీ సదస్సులో సత్యంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు సీ.ఎల్.నాయుడు, హైకోర్టు న్యాయవాది జె.వి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యంను సత్కరిస్తున్న హిందీ ప్రచార సభ, హిందీ మంచ్ ప్రతినిధులు

మందుబాబుకు నెల రోజుల జైలు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని చిన్నబరాటం వీధిలో జొన్నా రవికుమార్ (44) సోమవారం రాత్రి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. సెకండ్‌క్లాస్ సెషన్స్ జడ్జి శివరామ కృష్ణ విచారించి నెలరోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

జూదరుల అరెస్టు

శ్రీకాకుళం నేరవార్త విభాగం, న్యూస్‌టుడే: నగరంలో కిమ్స్ రహదారిలో ఉన్న భూమాత రియల్ ఎస్టేట్ కార్యాలయం మేడపై మంగళవారం రాత్రి జూదం ఆడుతున్న ఎనిమిది మందిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. రూ.13,310లు, 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు రెండో పట్టణ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు తెలిపారు.

నీరు వృథా.. పట్టని వ్యథ

❖ మొంథా తుపాన్‌కు కొండల నుంచి అధిక నీరు జలాశయానికి చేరి ఊటనీటితో ప్రధాన షట్టరు పూర్తిగా తుప్పుపట్టింది. దీని స్థానంలో కొత్తది అమర్చితే వేసవిలో కూడా జలాశయం నిండుకుండను తలపించి పరిసర రైతులు పంటలను సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది.

❖ జలాశయం రెండు కొండల నడుమ ఆహ్లాదకరంగా, పర్యాటకానికి అనుకూలంగా ఉందని గతంలో అధికారులు గుర్తించారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం, అధికారులు అడుగులు వేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చేందే అవకాశాలున్నాయి.

– న్యూస్‌టుడే, బూర్జ

బూర్జ మండలంలో సాగు నీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ అవసరం మేరకు శివారు ఆయకట్టుకు నీరు అందని దుస్థితి. ప్రధానంగా బొమ్మిక గజ్జిలిగెడ్డ నుంచి వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1986-87లో అప్పటి ప్రభుత్వం జలాశయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీని నిర్మాణ సమయంలో పనుల్లో నాణ్యత లోపించడంతో వర్షాలకు కొండల నుంచి జాలువారిన ప్రతి నీటిబొట్టు ఊటలుగా బయటకు పోయే పరిస్థితి నెలకుంది.

❖ హుద్‌హుద్ తుపాను దాటికి ఆనకట్ట ఆప్రాన్ భాగంతో పాటు ప్రధాన గట్టు కోతకు గురైంది. 2017లో అప్పటి ప్రభుత్వ విప్ కూన రవికుమార్ రూ.9.44 కోట్లతో జలాశయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గుత్తేదారు అలసత్వంతో రెండేళ్ల పాటు పనులు నత్తనడకన సాగాయి. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం జలాశయం అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది.

పాలకుల నిర్లక్ష్యంతో గజ్జిలిగెడ్డ అభివృద్ధికి తూట్లు



పూర్తి స్థాయిలో నీటితో నిండిన బొమ్మిక గజ్జిలిగెడ్డ జలాశయం

గట్టు నుంచి లీకులు ద్వారా వృథాగాపోతున్న సాగునీరు

అభివృద్ధికి చర్యలు

ప్రధాన షట్టరు ఏర్పాటుకు నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక అందించాం. ఆయకట్టు భూములకు నీరందేలా కాలువలను అభివృద్ధి చేస్తాం. శివారు భూములకు సాగునీరందేలా చర్యలు చేపట్టడం తీసుకుంటాం. – దాలయ్య, నీటిపారుదలశాఖ జేఈ

గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

శ్రీకాకుళం సాంస్కృతికం, ఆమదాలవలస గ్రామీణం, బూర్జ, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వ్యక్తిత్వ వికాస దినోత్సవం, విద్యార్థులకు చరవాణి వినియోగం ప్రయోజనాలు, నష్టాలు అన్న అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో పోటీతత్వం ఉన్నప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ అధికారి ఎ.కోటేశ్వరరావు అన్నారు. ఆమదాలవలస మండలం బొడ్డేపల్లిపేట, బూర్జ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు వ్యాచరచన, క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న విద్యార్థిని

(c) eenadu

దివ్యాంగుడు.. గానంలో గంధర్వుడు



ఆయన అంధత్వంతో బాధపడుతున్న దివ్యాంగుడు. అయితేనేం అది తన గాత్రానికి కాదని నిరూపించారు.. చౌడేపల్లెకు చెందిన బ్రహ్మాచారి, చంద్రకళమ్మ దంపతుల కుమారుడు రెడ్డెప్పాచారి పుట్టుకతోనే అంధుడు. తిరుచానూరులోని నవజీవన్ అంధుల పాఠశాలలో చదివారు. గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంలా తానూ రాణించాలి పాటతో అలరించాలనే ఆకాంక్షతో నిత్యం సాధన చేశారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఓ కార్యక్రమంలో మొదటిసారి పాడి తన ప్రతిభ చాటారు. తర్వాత ఈటీవీ పాడుతా తీయగా కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్నారు. తితిదే నుంచి పలు పురస్కారాలు పొందారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సంగీత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే): తిరుమలలో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. మంచు కమ్మేసింది. చలి తీవ్రత పెరిగింది. నేరుగా వచ్చే భక్తుల సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం శ్రీవారిని 71,208 మంది దర్శించుకున్నారు. రూ. 3.84 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

అన్నదాతకు.. రూ.104 కోట్లు

నేడు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు జమ

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో 1,54,908 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సొమ్ము రూ. 104 కోట్లకు పైగా బుధవారం జమకానుంది. కేంద్రం రూ. 2 వేలు చొప్పున జమచేయనుండగా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 5వేలను రాష్ట్ర ప్రభుత్వం జమచేయనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో నగదు జమను ప్రారంభిస్తారు. కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేల సమక్షంలో లబ్ధిదారులు పాల్గొననున్నారు. ప్రభుత్వం అందించే పథకాల లబ్ధిని తెలిపేలా రైతులకు కరపత్రాలు ఇవ్వనున్నారు. జిల్లాలో యూరియా నిల్వల గురించి తెలియజెప్పనున్నారు. సొమ్ము జమకాని వారి కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు.

విశేష విహారి.. వీణాధారి

హంస వాహనంపై అమ్మవారు

పెద్దశేష వాహనసేవలో..

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతి కార్తిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి అమ్మవారు హంస వాహనంపై వీణను ధరించి చదువులతల్లి సరస్వతిదేవిగా భక్తులకు సాక్షాత్కరించారు. జోరువానలోనూ వాహనసేవ కొనసాగింది. ఉదయం ఏడు తలలు కలిగిన పెద్దశేష వాహనంపై పరమపద వైకుంఠనాథుని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు..

బుధవారం ఉదయం 8 గంటలకు ముత్యపు పందిరి వాహనం, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవలు జరగనున్నాయి.

చలిజ్వరం.. చలించని వైద్యగణం



చిత్తూరు, తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వరుస తుపాన్లు, వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు.. జలుబు, దగ్గు, జ్వరాలతో వణికిపోతున్నారు. పారిశుద్ధ్య లోపం.. ఇతర కారణాలతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఇంటా కాలానుగుణ జ్వరాలు వెలుగుచూడటంతో.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మలేరియా, డయేరియా, డెంగీ, గన్యా జ్వరాలు గత ఏడాదిలా భయపెట్టకపోయినా.. సాధారణ జ్వరాలు కలవరపెడుతున్నాయి.

15న ఫీవర్ సర్వే ఇలా..

- తిరుపతి జిల్లా వ్యాప్తంగా 732 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు.
- అందులో ఏడుగురికి మాత్రమే వారంలోపు జ్వరం తగ్గింది.
- మిగిలిన అందరూ ఏడు రోజులకు పైగా జ్వరంతో అల్లాడిపోయారు.
- నలుగురిలో టైఫాయిడ్ గుర్తించారు.

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో కేసులు

డెంగీ - 210 మలేరియా - 2 డయేరియా - 100
గన్యా - 35 సాధారణ జ్వరాలు - 4,500

మొక్కుబడిగా ఆరోగ్య కేంద్రాలు

ప్రజలకు తప్పని ఆర్థిక భారం

దోచుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులు

- ఓపీకి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు.
- లక్షణాలు బట్టి చికిత్స చేయకుండా జ్వరం అనగానే అన్నిరకాల వైద్య పరీక్షలు రాస్తున్నారు.
- జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే రూ. 1,500-2000 వరకు ఖర్చవుతోంది.

అరకొర సేవలు

చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రజలు పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లకుండా ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండటం లేదని, 63 రకాల పరీక్షల్లో కొన్నే చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. మందులు ఉన్నాయని చెబుతున్నా రెండుమూడు రకాలు మాత్రమే ఇస్తున్నారు. కొన్నింట్లో కనీసం సెలైన్ పెట్టే పరిస్థితి లేదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- జ్వర లక్షణాలు ఉంటే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలి.
- ఆర్ఎంపీలను ఆశ్రయించి అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ తీసుకోవడంతో ఇతర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.
- అత్యవసరం ఉంటేనే చలి వాతావరణంలో బయట తిరగాలి.
- కాచి చల్లార్చిన నీటిని, వేడివేడిగా ఆహారం తీసుకోవాలి.
- దోమకాటుకు గురికాకుండా తెరలు వాడాలి

ఉమ్మడి జిల్లాలో ఆస్పత్రుల వివరాలిలా

పీహెచ్‌సీలు	106
సీహెచ్‌సీలు	13
యూహెచ్‌సీలు	42
ఏరియా ఆసుపత్రులు	6
గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు	903

పరీక్షలు.. చికిత్స అందించకుంటే తొలగిస్తాం

ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేసి సకాలంలో చికిత్స అందించకుంటే వైద్యాధికారులను విధుల నుంచి తొలగిస్తాం. జ్వరం, వాంతులు, దగ్గు ప్రభావాలకు ఐదుగురు గురైతే అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాం. ఇంటింటి సర్వేతో జ్వరపీడితులను గుర్తిస్తున్నాం. ప్రైవేట్ ఆస్పత్రులు పరిధులు దాటితే కఠిన చర్యలు తప్పవు.

- డా.బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

సక్ష్యం.. సమస్యలే సాక్ష్యం

- పనిచేయని తాగునీటి శుద్ధి యంత్రాలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో కొరవడిన నిర్వహణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులకు రక్షిత జలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నీటి శుద్ధి యంత్రాలు అందించింది. వీటిలో కొన్ని పనిచేయకపోవడంతో ఆయా కేంద్రాల్లో గర్భిణులు, పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,420 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో మొదటిదశలో 814 కేంద్రాలను సక్ష్యం కేంద్రాలుగా ఎంపిక చేసి, వాటిలో మౌలిక వసతులు కల్పించారు. ఇందులో భాగంగా వాటన్నింటికీ నీటిశుద్ధి యంత్రాలు ఇచ్చారు.

నీటిశుద్ధి యంత్రం

- జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు: 2,420
- సక్ష్యం కేంద్రాలు: 814, కొత్తగా ప్రతిపాదనలు: 520
- అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు: 97,087
- గర్భిణులు: 11,275, బాలింతలు: 8,736

లోటుపాట్లు ఇలా..

- నీటి ట్యాంకులు లేకపోవడం, ఉన్నా పైపులైన్లు సరిగ్గా లేక, నీటి సరఫరా చేయక 250 యంత్రాలకు పైగా పనిచేయడం లేదని గుర్తించారు.
- సరఫరా ఉన్న వాటిలోనూ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఒక్కొక్కటిగా పనిచేయడం మానేస్తున్నాయని, పలు చోట్ల వాటిలో నీటిని నింపి పిల్లలు, గర్భిణులకు ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి.
- ఇప్పుడున్న సక్ష్యం కేంద్రాలను మినహాయిస్తే జిల్లాలో మరో 1,606 కేంద్రాల్లో రక్షిత నీరు పిల్లలు, గర్భిణులకు అందడం లేదు.
- ఉన్నవాటిని సరిచేసి అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మిగిలిన అన్ని కేంద్రాల్లోనూ ఈ యంత్రాలు ఏర్పాటు చేయాలని పిల్లల తల్లిదండ్రులు, కార్యకర్తలు కోరుతున్నారు.
- సక్ష్యం కేంద్రాల్లో కొన్ని పనిచేయడం లేదని తెలిసిందని, కొత్తగా మరో 520 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపినట్లు ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు.

నిర్మాణం చకచకా.. పెంచాలి పర్యవేక్షణ

75% పూర్తయిన శ్రీపాదం, అచ్యుతం సముదాయాలు

తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలోని నూతన నిర్మాణాలు

- పనుల ప్రారంభం: మార్చి, 2024
- ఒప్పందం గడువు: ఏప్రిల్, 2026
- మొత్తం నిధులు: రూ.600 కోట్లు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి భక్తుల వసతి కష్టాలు త్వరలో తీరనున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో చేపట్టిన శ్రీపాదం, అచ్యుతం సముదాయాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 75% పనులు పూర్తి కావచ్చాయి. ప్రధాన భవనం, గదుల నిర్మాణం పూర్తికాగా వాటిలోపల అంతర్గత ఏర్పాట్లు, మౌలిక వసతుల ఏర్పాటు వంటి పనులు చేయాల్సి ఉంది. కీలకమైన ఈ దశలో టెండరు నిబంధనలకు అనుగుణంగా పరికరాల కొనుగోళ్లు, బిగింపుపై ప్రస్తుతం తితిదే అధికారులు పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని, లేకుంటే మరమ్మతులకు భవిష్యత్తులో తరచూ తితిదే నిధులు వృథా అయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సదుపాయాలు ఇలా..

- ఒక్కో భవనంలో తొమ్మిది అంతస్తులు, గదులు 532 చొప్పున 1,064 గదులు.
- దాదాపు పదివేల మంది భక్తులకు వసతి.
- రెండో అంతస్తులో రిసెప్షన్, అన్నదానం, వసతి కేంద్రాలు.
- మూడు, నాలుగు అంతస్తుల్లో 48 డార్మెటరీలు.
- దాదాపు 7,000 మందికి సరిపడా లాకర్ల ఏర్పాటు.

ధర పెరిగింది.. పట్టు జారింది

పట్టుదారం

సరకు కొనలేక నేతన్నల అవస్థలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టు ధరలు పెరగడంతో చేనేత కళాకారులకు కష్టాలు మొదలయ్యాయి. మగ్గాలపై ఆధారపడిన కార్మికులు, మాస్టర్ వీవర్లకు సరికొత్త సమస్య ఎదురైంది. కేవలం మూడునెలల కాలంలో ధరలు రూ. వేలల్లో పెరగడంతో చేనేతలు అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో చేనేత మగ్గాలకు అవసరమైన ముడిసరకు సక్రమంగా ఉత్పత్తి కావడం లేదు. దీంతో అత్యధికంగా చేనేతలున్న వెంకటగిరిలో కళాకారులకు పనులు లేకుండాపోయాయి. గతంలో బెంగళూరు నుంచి పట్టుదారం ఎక్కువ మొత్తంలో వ్యాపారులు దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం కర్ణాటకలో ధరలు పెరిగాయి. చీరలకు వినియోగించే వార్పు ధర ఏకంగా రెండు నెలల్లోనే రూ. 2,100 పెరిగింది. పంట ఉత్పత్తి తగ్గడంతో సమస్య ఏర్పడినట్లు చేనేతలు చెబుతున్నారు. ధరలు తగ్గేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేతకు దూరంగా కళాకారులు

- జిల్లాలోని చేనేత కుటుంబాలు 3,320
- మగ్గం ఉన్న కళాకారులు 4,250
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి 15,475 మంది

ధరల తేడా (కిలో.. రూ.ల్లో)

సరకు	ప్రస్తుతం	మూడు నెలల క్రితం
పట్టు	8,000	5,600
జరీ మార్కు	800	630
వార్పు	6,500	4,400

చీరకు కావాల్సిన పట్టు: 500 గ్రాములు, అవసరమైన జరీ: 3 మార్కులు

16 వేల టోకెన్ల జారీ

తిరుపతి (తితిదే): శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద మంగళవారం 16 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం వేకువజాము నుంచి దర్శనం ఉంటుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు ఇచ్చారు.

ఆమెకు అండగా జీఆర్‌సీ

మండల స్థాయిలో నియామకం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్‌సీ) ఏర్పాటు చేయనున్నారు.. తొలి విడతగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద త్వరలో కొన్ని మండలాలు ఎంపిక చేయనున్నారు.

డిగ్రీ చదివిన సభ్యులు.. స్వయం సహాయక మహిళా సంఘాల్లోని సభ్యులే ఈ కేంద్రాల ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేసి జీఆర్‌సీలుగా నియమిస్తారు. వీరికి విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ఏం చేస్తారంటే.. ఈ కేంద్రాలకు వచ్చే మహిళలకు లైంగిక, వరకట్న వేధింపులు, ఇతర సమస్యలపై కౌన్సెలింగ్ ఇస్తారు. అత్యవసర సమయాల్లో ఎవరిని సంప్రదించాలో వారికి సూచిస్తారు.

ఏర్పాటు ఇలా..

ప్రతి సమాఖ్య నుంచి ఇద్దరు చొప్పున సభ్యులను ఎంపిక చేసి గ్రామ కమిటీలు నియమిస్తారు. ఈ కమిటీల ద్వారా ముగ్గురు నుంచి ఐదుగురు సభ్యులతో మండల కమిటీ ఎంపిక చేస్తారు. వీరే జీఆర్‌సీల ప్రతినిధులుగా కొనసాగుతారు. మండల కమిటీ వారానికి ఒకసారి సమావేశమై గ్రామ కమిటీల ద్వారా గుర్తించిన ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తుంది. ఒక్కో కేంద్రానికి రూ. 5 లక్షలు చొప్పున కేటాయిస్తారు.

63 పంచాయతీలు.. 300 చ.కి.మీ.

గ్రేటర్ తిరుపతిలో విలీనానికి ఏకగ్రీవ తీర్మానం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలకు తొలిఅడుగు పడింది. ప్రస్తుత ఉన్న 30.17 చ.కి.మీ. పరిధిని 300 చ.కి.మీ.లకు విస్తరించే ప్రతిపాదనకు కౌన్సిల్ ఆమోదం లభించింది. గతనెల 24న తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని 53 పంచాయతీలను విలీనం చేసేందుకు కౌన్సిల్ ఆమోదం పొందిన అధికారులు తాజాగా మంగళవారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించి మరో పది గ్రామ పంచాయతీలను విలీనం చేసేందుకు రూపొందించిన అజెండాను ఆమోదించారు. నగర మేయర్ డా. శిరీష అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ ఎన్. మౌర్య విలీన ప్రతిపాదన చేయగా కార్పొరేటర్ల నుంచి ఏకగ్రీవ ఆమోదం లభించింది.

- ప్రస్తుత నగరపాలక పరిధి: 30.17 చ.కి.మీ.
  - జనాభా: 4.52 లక్షలు
  - వార్షిక ఆదాయం: రూ.149 కోట్లు
- విలీన ప్రతిపాదిత పంచాయతీలు: 63
  - పరిధి 300 చ.కి.మీ.
  - జనాభా: 3.35 లక్షలు
  - వార్షిక ఆదాయం: రూ.43 కోట్లు

ప్రేమ పదిలం

వృద్ధురాలు నిర్మించుకున్న సమాధి

భర్త అంటే ఆ వృద్ధురాలికి అమిత ప్రేమ. అందుకే కాబోలు ఆయన చనిపోయిన వెంటనే తానూ మృతి చెందినట్లు భావించి భర్త సమాధి పక్కనే తన సమాధి ఏర్పాటు చేసుకుంది. పులిచెర్ల మండలం కమ్మపల్లె పంచాయతీ దిన్నె ఎస్సీకాలనీకి చెందిన శ్రీపు నారాయణ 1997లో మరణించారు. ఆయన భార్య చెంగమ్మ ఆరోజే తానూ మరణించినట్లు భావించి భర్తతో కలిపి తనకు కర్మక్రియలు నిర్వహించుకున్నారు. కష్టపడి సంపాదించిన నగదుతో ఇల్లు కట్టుకోకుండా భర్తతో కలిపి తనకు సమాధి నిర్మించుకున్నారు. భర్త సమాధి పక్కన ఓ వైపు ఖాళీ స్థలం ఉంచుకుని.. చనిపోయిన తర్వాత అందులో పూడ్చాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. అంతవరకు ఇటుకలతో మూతవేసి ఉంచారు. పదేళ్ల కిందట చెంగమ్మ మృతి చెందారు. ఇప్పటికీ వారి ప్రేమను ఆ గ్రామస్థులు గుర్తు చేసుకుంటారు. **- న్యూస్‌టుడే, కల్లూరు**



(c) eenadu

టైం.. బాలేదు గురూ..!

రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పలమనేరులోని టవర్ క్లాక్ పని చేయడం లేదు. కొన్ని నెలల కిందట గడియారం ఓ వైపున మరమ్మతులకు గురికావడంతో దాన్ని తొలగించారు. ఈ క్రమంలోనే మిగతా దిక్కున ఉన్న గడియారాలు పని చేయడం లేదు. బస్టాండు ప్రధాన ముఖద్వారంలో ఉన్న ఈ టవర్ క్లాక్‌ను మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని వినియోగంలోకి తేవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పలమనేరు

వందేళ్లపైబడి..!

ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత బాలుర పాఠశాల విహంగ వీక్షణం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల అంటే తెలియని వారుండరు. ఎందుకంటే దాదాపు వందేళ్లకు పైబడిన పాఠశాలగా ఎంతో గుర్తింపు చాటుకుంది.

చరిత్రాత్మకం..

పానగల్ సంస్థానాధీశులైన పానుగంటి బంగారమ్మ, సీతారామానాయనం 1902లో ఇక్కడి స్థలాన్ని పాఠశాలకు వితరణగా ఇవ్వడంతో పాటు పాఠశాలను నిర్మించారు. పట్టణం నడిబొడ్డున సువిశాలమైన స్థలాన్ని పాఠశాలకు వితరణగా ఇవ్వడంతో ఇప్పటికీ ఈ విద్యాలయాన్ని రాజా పానుగంటి బంగారమ్మ సీతారామా నాయింగారి(ఆర్‌పీబీఎస్) జడ్పీ ఉన్నత పాఠశాలగా పిలుస్తున్నారు.

చదువులమ్మ ఒడిగా..

ఈ పచ్చదనపు పొదరిళ్ల మధ్య ఏర్పాటైన విద్యాలయం ఎందరికో చదువులమ్మ ఒడిగా మారింది. మాజీ మంత్రి, తెదేపా సీనియర్ నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అద్దూరు బలరామిరెడ్డి, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇక్కడి విద్యార్థులే. అంతేకాకుండా ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో విదేశాల్లో ఉపాధి పొందుతున్నారు.

ప్రగతికి చేయూత

ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ తగ్గుతున్నా.. 123 ఏళ్ల ప్రస్థానం కలిగిన ఇక్కడి విద్యాలయంలో 15 విభాగాలు, 28 మంది ఉపాధ్యాయులు, 780 మంది విద్యార్థులు అభ్యసిస్తుండటం విశేషం. ఇక్కడ చదువుకున్న పలువురు విద్యార్థులు వాళ్ల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల బృందాలు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తూనే ఉన్నారు. దీంతో ఈ పాఠశాల వసతుల పరంగా దినదినప్రవర్ధమానం చెందుతోంది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని మంగళవారం ఉదయం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, నిర్మాత నాగవంశీ దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

పోటు కార్మికుల పోస్టుకు పాచకగా నామకరణం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయ పోటు సూపర్‌వైజర్లు, కార్మికులకు నూతనంగా నామకరణం చేస్తూ తితిదే పాలకమండలిలో మంగళవారం తీర్మానం చేశారు. పోటు సూపర్‌వైజర్ పోస్టును 'ముఖ్యపాచక', వర్కర్ పోస్టును పాచకగా మారుస్తూ నామకరణం చేశారు. గతంలో తితిదే ఛైర్మన్‌ను కలిసిన పోటు కార్మికులు తమ పోస్టుల నామకరణాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శ్రీవారి కైంకర్యాలు చేసే అర్చకుడు, స్వామివారి ప్రసాదాలు చేసే పోటు కార్మికుడిని పాచకగా నామకరణం చేశారు.

కట్టు.. బొట్టు.. ఆకట్టుకునేట్టు

రష్యాకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వాయులింగేశ్వరుడిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దర్శనార్థం వచ్చిన 45 మంది భక్తులు మంగళవారం మన సంప్రదాయానికి తగ్గట్టు కట్టు బొట్టుతో సందడి చేశారు. తొలుత రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక్కడి శిల్పకళను చూసి ఆనందంతో పాటు ఆశ్చర్యభరితులయ్యారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు కల్పించారు.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

నేడు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని నడకమార్గంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఉదయం 10 గంటలకు ప్రత్యేక అభిషేకం జరుగనుంది. కార్తిక మాసంలో స్వాతి తిరునక్షత్రం సందర్భంగా ఏటా ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ.

తితిదే క్యాలెండర్, డైరీలు తిరస్కరించిన ఛైర్మన్

భక్తుడిలా కొనుగోలు చేస్తానని వెల్లడి

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి తితిదే గౌరవార్థం ఏటా ఆనవాయితీగా, ఉచితంగా అందించే డైరీలు, క్యాలెండర్లను ఆయన సున్నితంగా తిరస్కరించారు. శ్రీవారి భక్తుడిగా స్వయంగా తనకు కావాల్సిన డైరీలు, క్యాలెండర్లను కొనుగోలు చేస్తానని ఆయన సంబంధిత అధికారులకు తెలిపారు.

దర్జాగా కబ్జా

❖ ప్రభుత్వ భూమిపై వైకాపా నేతల కన్ను
❖ ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ శాఖ

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కబ్జారాయుళ్లు పేట్రేగిపోతున్నారు.. కూటమి ప్రభుత్వ హయాంలోనూ కొందరు వైకాపా నాయకులు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుండటం గమనార్హం.. మండలంలోని కేబీఆర్‌పురంలో కళ్లెదుటే ఈ ఆక్రమణ జరుగుతున్నా పట్టించుకున్న నాథుడే లేడంటే ఆశ్చర్యం కలగక మానదు.

పుత్తూరు మండలం కేబీఆర్‌పురంలో సర్వే నంబరు 60లో మూడెకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని గతంలో జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి కేటాయించారు. ఆ భూమిలో రాళ్లు ఉండటంతో పాఠశాల యాజమాన్యం అలానే వదిలేసింది. ఈ నేపథ్యంలో 2014-19లో తెదేపా హయాంలో ఆ భూమిలో సంపద సృష్టి కేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ భూమి జగనన్న కాలనీకి కేటాయించారు. అక్కడే వెల్‌నెస్ కేంద్రం నిర్మించారు. ఇంకా 50 సెంట్లు ఉంది. పక్కనే ఉన్న రైతు కన్ను ఆ భూమిపై పడింది. మూడు, నాలుగు రోజులుగా భూమిని చదును చేసి తన భూమిలో కలిపేసుకుంటున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికే కొందరు వైకాపా నాయకులు గుంట పొరంబోకును ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారని, దాన్ని రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వదిలేశారని చెబుతున్నారు. తాజాగా రోడ్డు పక్కనే రైతు ముసుగులో మరో వైకాపా నాయకుడు ఈ స్థలాన్ని కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

సర్వే చేసి తొలగిస్తాం..

కేబీఆర్‌పురంలో ప్రభుత్వ భూమి కబ్జా అవుతున్నట్లు ఎలాంటి సమాచారం లేదు. సర్వే చేయించి ఆక్రమించి ఉంటే తొలగిస్తాం. ప్రభుత్వ భూముల్లోకి ఎవరు ప్రవేశించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అందులో ఎలాంటి పక్షపాతం లేదు.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్

సర్వే నంబరు 60లో చదును చేసిన ప్రభుత్వ భూమి

ఒక్కొక్కరిది.. ఒక్కో బాధ

చెరువు నీటి నిల్వలపై ఫిర్యాదులు

పుత్తూరు, వడమాలపేట, న్యూస్‌టుడే: వడమాలపేట మండలంలోని గూళూరు చెరువులో నీటి మట్టం తగ్గించి న్యాయం చేయాలని, పంటలు పండించుకోలేకపోతున్నామని ఎస్‌బీఆర్‌పురం రైతులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ వద్ద ఆవేదన చెందారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో మంగళవారం చెరువు కలుజు, ఎస్‌బీఆర్‌పురం గ్రామాన్ని సందర్శించారు. కానీ తూము తీసి నీరు విడుదల చేస్తే తాము ఒప్పుకోమని ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు చెంగల్రాయుడు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, రైతులు పేర్కొన్నారు. చెరువు నీటితో 20 గ్రామాల్లో పంటలు పండుతున్నాయన్నారు. అనంతరం కలెక్టర్, ఈఈ వెంకటేశ్వరప్రసాద్ ఎస్‌బీఆర్‌పురం వెళ్లి గ్రామస్థులతో మాట్లాడారు. తూము పూడికతో వర్షం నీరు నిల్వ చేరి 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్థులు చెప్పారు. అయిదు నెలల్లో నీటి మట్టం తగ్గిన తర్వాత చర్యలు చేపడతామని కలెక్టర్ వారికి చెప్పారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, డీఈఈ శ్రీనివాసులు, ఏఈలు పరశురాంనాయక్, మురళి, ఆర్‌ఐ జానీ బాషా, శేషాద్రి, రైతులు ఉన్నారు.

గూళూరు చెరువు కలుజు వద్ద మ్యాపు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

స్వర్ణమ్మ హారతులకు ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం అమావాస్యను పురస్కరించుకుని స్వర్ణముఖి నదీమతల్లికి నిర్వహించే హారతుల కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. కార్తిక అమావాస్యను పురస్కరించుకుని బుధవారం నిర్వహించే వేడుకలకు సన్నిధివీధిలోని జలవినాయక స్వామి ఆలయానికి సమీపంలో నదీ తీరంలో ప్రత్యేక పందిళ్లతో ఏర్పాట్లు సిద్ధం చేశారు. హారతులను వేదిక వద్ద ఉన్న భక్తులే కాకుండా చుట్టుపక్కల నుంచి, వంతెనపై నుంచి చూసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

వేడుకలు ఇలా..: కార్తిక మాసం ముగింపు సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉదయం శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత వాయులింగేశ్వరుడికి అష్టోత్తర కలశాభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఆలయాల వద్ద అన్నకూటోత్సవం (కుంభం) జరపనున్నారు. కోటి బిల్వ, కుంకుమార్చనలతో పాటు లక్ష బిల్వ, కుంకుమార్చనలతో సమకూరిన బిల్వం, కుంకుమలను నదీ జలాల్లో నిమజ్జనం చేయనున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్ల నందిసేవ మహోత్సవాన్ని చతుర్మాడ వీధుల్లో నిర్వహించనున్నారు.

దోషపూజలు మినహా అన్నీ రద్దు..: కార్తిక అమావాస్యను పురస్కరించుకుని బుధవారం రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు మినహాయించి అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు.

నదీ హారతులకు సిద్ధం చేసిన వేదిక

కల్తీ అని తెలిసినా.. అనుమతించడానికి కారణమేంటి?

రెండోరోజూ చిన్న అప్పన్నకు సిట్ ప్రశ్నలు

ఈనాడు - తిరుపతి, తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ వ్యక్తిగత కార్యదర్శి చిన్న అప్పన్నను సిట్ అధికారులు రెండోరోజూ ప్రశ్నించారు. తిరుపతి తూర్పు పీఎస్ కస్టడీలో ఉన్న చిన్న అప్పన్నను భూదేవి కాంప్లెక్స్‌లోని సిట్ కార్యాలయానికి తీసుకొచ్చి రెండో రోజు మంగళవారం విచారించారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థతో ఆయనకున్న పరిచయాలు, రూ.50 లక్షల లంచంపై లోతైన సమాచారం రాబట్టేలా ప్రశ్నలు సంధించారు. 'మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్‌లో చేసిన పరీక్షల్లో కల్తీ నెయ్యిగా నిర్ధారణ అయినప్పటికీ.. మీ ఒత్తిడివల్లే ట్యాంకర్లలో కల్తీనెయ్యి తిరుమలకు వచ్చినట్లు విచారణలో తేలింది. అందులో తితిదే పెద్దలు, అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా?' అని ప్రశ్నించగా మౌనం వహించారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ నుంచి ఇంకెప్పుడైనా లంచాలు ముట్టాయా? మరేదైనా సంస్థతో సంప్రదింపులు జరిపారా? అని ఆరా తీయగా లేదని బదులిచ్చారు. విచారణ అనంతరం చిన్న అప్పన్నను తిరుపతి తూర్పు పీఎస్‌కు తరలించారు.

వైవీ విచారణకు బృందం

తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కల్తీ నెయ్యి కేసులో విచారించేందుకు సిట్ బుధవారం హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు సమాచారం. గురువారం ఆయన్ను విచారించే అవకాశం ఉంది. చిన్న అప్పన్న ఇచ్చిన సమాధానాల ఆధారంగా ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. వైవీ సుబ్బారెడ్డికి కల్తీ నెయ్యి గురించి తెలిసినా తిరుమలకు అనుమతించినట్లు సిట్ అధికారుల విచారణలో తేలింది. భోలేబాబా డెయిరీ ఒప్పందం 2022 అక్టోబరు వరకు, ప్రీమియర్ అగ్రిఫుడ్స్, శ్రీవైష్ణవీ డెయిరీలకు 2024 వరకు ఆయన హయాంలోనే గడువు పొడిగించారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ నుంచి చిన్న అప్పన్న రెండు విడతల్లో రూ.50 లక్షలు తీసుకున్నారని నిర్ధారణ కాగా.. అదే సమయంలో వైవీ సుబ్బారెడ్డి దంపతులకు సంబంధించిన లావాదేవీల వివరాలు ఇవ్వాలని యాక్సిస్ బ్యాంకు అధికారులను అడిగారు. ఈ సమాచారం తెలిస్తేనే కేసు దర్యాప్తు కొలిక్కి వస్తుందని హైకోర్టులో ఇటీవల జరిగిన వాదనల సందర్భంగా నివేదించారు. ఈ కేసులో ఆయన పాత్ర అనుమానాస్పదంగా ఉందని సిట్ తరఫున వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో వైవీ సుబ్బారెడ్డిని విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

చిత్తూరు మేయరు దంపతులు కఠారి అనురాధ, మోహన్ హత్య కేసు విచారణలో తప్పుడు సాక్ష్యం ఇచ్చిన 14 మందిని ప్రాసిక్యూట్ చేయడానికి నోటీసులు ఇచ్చారు.

నిమ్మ ధరలు పులుపు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కొన్ని రోజుల నుంచి నిమ్మ ధరలు తగ్గుతూ వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా రాకపోవడంతో కూలి ఖర్చులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. దీంతో జిల్లాలో ప్రధానమైన గూడూరు మార్కెట్ వెలవెలబోతోంది.

పెట్టుబడులు ఎక్కువ..

గత ఏడాది ఇదే సీజన్‌లో మొదటి రకం రూ.40 నుంచి రూ.50 వరకు పలకగా బస్తా రూ.2000 పైనే అమ్ముడుపోయింది. ప్రస్తుతం దిగుబడులు బాగున్నా ధరలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూలీలు, ఆటో బాడుగకు బస్తాకు ఖర్చు రూ.500 నుంచి రూ.700 వరకు అవుతుండగా రూ.300 మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు.

గ్రేడింగ్‌కు సిద్ధమవుతున్న నిమ్మకాయలు

20 వేల మందిపై ప్రభావం..

నెల్లూరు జిల్లాలోని సైదాపురం, రాపూరు, పొదలకూరు, తిరుపతి జిల్లాలోని గూడూరు, బాలాయపల్లె, వెంకటగిరి, ఓజిలి, డక్కిలి మండలాల్లో ఎక్కువగా నిమ్మ సాగవుతోంది. సుమారు 20 వేల మంది వరకు రైతులు సాగు చేస్తున్నారు. 30 వేల నుంచి 40 వేల ఎకరాల్లో తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ధరలు తగ్గడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

గూడూరు మార్కెట్‌లో ధరలు..

మొదటి రకం..
కిలో: రూ.16 నుంచి రూ.25
50 కిలోల బస్తా: రూ.800 నుంచి రూ.1250

రెండో రకం..
కిలో: రూ.6 నుంచి రూ.15
50 కిలోల బస్తా: రూ.300 నుంచి రూ.750

బయట రాష్ట్రాల ప్రభావంతో..

గూడురు మార్కెట్ నుంచి దిల్లీ, పాట్నా, కోల్‌కతా, వారణాసి, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతులు ఎక్కువ. ప్రస్తుతం అక్కడ మంచు ప్రభావం అధికంగా ఉండడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో సాగు బాగుండటంతో స్థానికంగా ధరలు తగ్గాయని వ్యాపారులు భావిస్తున్నారు.

రోగి జీవన ప్రమాణాలు మెరుగు

ప్రసంగిస్తున్న మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త లలితకుమారి

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: దీర్ఘకాలిక, తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు శారీరక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మికపరమైన ఉపశమనం కలిగించడానికి అందించే ప్రత్యేక వైద్య సేవ పాలియేటివ్ కేర్ అని ఎస్వీ మెడికల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ బ్యూరో, ఎస్వీ ఆర్ ఆర్ ఆసుపత్రి పాలియేటివ్ కేర్ శిక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాలియేటివ్ కేర్ అనేది రోగి జీవన ప్రమాణాలను మెరుగుపడేలా చూసే సంరక్షణ విధానమని చెప్పారు. నొప్పి, శారీరక సమస్యలను తగ్గిస్తుందని, తద్వారా రోగి మనోధైర్యాన్ని పెంచవచ్చున్నారు. వ్యక్తిగత జీవితంలో పాలియేటివ్ కేర్ ప్రాముఖ్యాన్ని రుయా హాస్పిటల్ వైద్యులు రోజారమణి వివరించారు. రుయా ఆసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ భారతి, మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ బ్యూరో సమన్వయకర్త లలితకుమారి, రోటరీ క్లబ్ కోశాధికారి నాగేంద్ర తదితరులు ప్రసంగించారు.

రేపటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

తిరుచానూరు, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుచానూరు, తిరుమల పర్యటన నేపథ్యంలో ఈనెల 20 నుంచి రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్, సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. తిరుచానూరుకు వచ్చే వాహనదారులు పోలీసులు గుర్తించిన ప్రదేశాల్లోనే తమ వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.

అమల్లో ఉండే ప్రాంతాలు

✷ శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనాలు గాజుల మండ్యం కూడలి వద్ద నిలిపేసి రేణిగుంట మీదుగా వెళ్లాలి. ✷ తిరుపతి, రేణిగుంట నుంచి తిరుచానూరు వచ్చే వాహనాలను నారాయణాద్రి ఆసుపత్రి కూడలి వరకు మాత్రమే అనుమతించనున్నారు. ✷ పూడి కూడలి నుంచి తిరుచానూరు వైపు వచ్చే వాహనాలను ముండ్లపూడి మీదుగా దారి మళ్లించనున్నారు. ✷ తిరుచానూరు జాతీయ రహదారి నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే రంగనాథం వీధిలో వాహనాల రాకపోకలపై పూర్తిగా ఆంక్షలు విధించారు. ✷ అమ్మవారి ఆలయానికి చేరుకునే గేట్-2, 3, హైస్కూల్ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధించారు.

ట్రోఫీలు, జ్ఞాపికలతో క్రీడాకారులు, ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, పీడీ ముస్తాక్ అహ్మద్

ఓవరాల్ ఛాంపియన్‌గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల

తిరుపతి (క్రీడలు): ఎస్వీయూ వ్యాయామ విద్యావిభాగం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎస్వీయూ అంతర కళాశాలల క్రీడాపోటీల్లో తిరుపతిలోని తితిదే ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పురుషుల జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, జూడో, కరాటే, చదరంగం, తైక్వాండో తదితర పోటీల్లో 80 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. క్రీడా పోటీల్లో అగ్రస్థానానికి గానూ రూ.30వేలు, అథ్లెటిక్స్‌లో సంయుక్త ఛాంపియన్‌షిప్‌కి రూ.15వేలు, వ్యక్తిగత ఛాంపియన్‌గా అథ్లెట్ సుదర్శన్ రూ.1500 అందుకున్నారు. కళాశాలలో మంగళవారం జరిగిన సభలో ప్రిన్సిపల్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి, వ్యాయామ విభాగాధిపతి ఎస్.ముస్తాక్ అహ్మద్‌లు క్రీడాకారులను అభినందించారు.

పరకా'మణి' లావాదేవీలపై నిఘా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: పరకామణి చోరీ కేసులో నిందితుడు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితుల నుంచి ఇతరులకు జరిగిన నగదు, ఆస్తుల లావాదేవీలపై నిఘా పెట్టారు. సీఐడీ ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం దర్యాప్తు చేస్తోంది. ఇప్పటి వరకు నిందితుడితోపాటు తితిదే ఎస్టేట్ అధికారులు, పోలీసులను విచారించారు. వారి నుంచి సేకరించిన ఆధారాల ప్రకారం కొన్ని ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయి పర్యవేక్షణకు వెళ్లాయి. తమిళనాడు, హైదరాబాద్, తిరుపతిలో రవికుమార్‌కు సంబంధించిన ఆస్తుల పరిశీలన, వాటి రిజిస్ట్రేషన్ వివరాలను మంగళవారం పరిశీలించినట్లు సమాచారం. రవికుమార్ పరకామణి విధులు నిర్వహించే నాటి నుంచి అతను, కుటుంబ సభ్యులు, బంధువుల ఖాతాల లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే రవికుమార్ అన్నదమ్ముల ఆస్తులు, పంపకాల వివరాలను సేకరించారు. మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతి ఘటనపై సీఐడీ ఏడీజీ ఆధ్వర్యంలోని బృందాలు తిరుపతి రైల్వే స్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేసిన సిబ్బందిని విచారించాయి.

అందరికీ భద్రత: పరకామణి కేసులో నిందితుడితోపాటు సాక్షులకు భద్రత కల్పించాలని కోర్టు ఆదేశాల మేరకు త్వరలో రక్షణ ఇవ్వనున్నట్లు సమాచారం.

తిరుమల ఘాట్‌రోడ్డులో రాయిపడి..

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల ఘాట్‌రోడ్డులో రాయిపడి ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. తిరుమలలోని తితిదే లగేజీ కౌంటర్‌లో పనిచేసే లోకేశ్ మంగళవారం ద్విచక్ర వాహనంపై తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరాడు. రెండో ఘాట్‌రోడ్డులోని హరిణి వద్దకు చేరుకోగానే కొండ మీద నుంచి చిన్నరాయి జారి అతనిపై పడింది. రక్తం కారుతున్నా అలాగే కొద్దిదూరం ప్రయాణించి స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయాడు. గుర్తించిన వాహనదారులు ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. వారు అంబులెన్స్‌లో తితిదే అశ్విని ఆసుపత్రికి అక్కడి నుంచి తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన లోకేశ్

● రెండో ఘాట్‌రోడ్డు ఆరో కి.మీ వద్ద ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం నుంచి భక్తులు సురక్షితంగా బయటపడ్డారు.

అలల తీరంలో.. అలసిన బతుకులు

⏭ తూపిలిపాలెం బీచ్‌లో ప్రమాదాలు
⏭ గల్లంతవుతున్న పర్యాటకులు

తిరుపతికి చెందిన రాహుల్ ద్రావిడ్ (21), సోనియా (19), బి.సోనియా(20) మరికొందరు 2020 కొత్త సంవత్సర వేడుకల కోసం కారులో తూపిలిపాలెం వచ్చారు. రాత్రివేళ ఆనందంగా గడిపి ఉదయం సముద్రంలో దిగి గల్లంతయ్యారు. తర్వాత మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. ఆ తర్వాత కాలంలో ఏటా ఈ ప్రాంతంలో ఎవరో ఒకరు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు.

వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌లో పర్యాటకులు

గూడూరు గ్రామీణం, వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు మండలంలోని తూపిలిపాలెం బీచ్.. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు చిత్తూరు, తిరుపతి నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తారు. సెలవులు, పర్వదినాలు, పండగ వేళల్లో కళకళలాడుతూ కనిపిస్తుంది. కానీ ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో ఎక్కువగా యువతే ఉంటున్నారు.

ఏడేళ్లలో 19 మంది మృత్యువాత..

బయట ప్రాంతాల నుంచి వచ్చే యువతకు ఇక్కడ ప్రాంతాలపై అవగాహన లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీనికి తోడు కొందరు మద్యం తాగి సముద్రంలోకి దిగడం, అలల ధాటికి ఊపిరి ఆడక గల్లంతవుతూ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఏడేళ్లలో తూపిలిపాలెం తీరంలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



సంవత్సరం- మృతులు

పోలీసుల చర్యలు..

తూపిలిపాలెం తీరంలో అలల తాకిడి ఎక్కువ. కింద నుంచి నీరు లోపలికి చేరుతుంది. దీన్ని అండర్ టోగా పిలుస్తారు. కాళ్ల కిందనున్న ఇసుక కోతకు గురై అక్కడున్న వారిని లోపలికి లాగడంతో అదుపు తప్పి పలువురు సముద్రంలో పడిపోతున్నారు. మద్యం మత్తులో ఉన్నవారు, అవగాహన లేనివారు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏడాదిగా అటుగా ఎవరూ వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మెరైన్ పోలీసులు పహారా కాస్తున్నారని, పర్వదినాలు, సెలవు రోజుల్లో బందోబస్తు పెంచామని ఎస్సై నాగబాబు తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

క్యాష్ బ్యాక్ వెంచర్ 25 అం||లు స్పాట్ రిజిస్ట్రేషన్ చేస్తున్నవారికి బంపర్ ఆఫర్ (కొన్ని ప్లాట్లు మాత్రమే కలవు). Ph: 80086 15946

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

Gkey IT సొల్యూషన్ PVT Ltdలో పనిచేయుటకు Tele callers: 2No's కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీ బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్. లీలామహల్ సర్కిల్, తిరుపతి ✆99638 30776

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయానికి రూ.1.90 కోట్ల నిధులు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తలకోనలోని శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన పనులకు రూ.1.90 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి మంగళవారం తితిదే ఈవోకు ఉత్తర్వులు జారీ చేశారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పాకాల, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో నాణ్యమైన ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో బాబ్జీ పేర్కొన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో మంగళవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

కులవృత్తికి పేటెంట్ కల్పించాలి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: నాయీబ్రాహ్మణుల కులవృత్తికి రాష్ట్ర ప్రభుత్వం శాశ్వతంగా పేటెంట్ కల్పించాలని, రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ షెలూన్ షాపులను వెంటనే రద్దు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని రాయలసీమ నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. తిరుపతిలోని ప్రభుత్వ యువజన వసతి గృహంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ డిమాండ్‌ను తీర్మానం చేశారు. రాష్ట్ర మంగలి మహాసభ కన్వీనర్ హరిప్రసాద్, రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు యలమందరావు, రాష్ట్ర ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగభూషణం, రాయలసీమ కన్వీనర్ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద పట్టువస్త్రాలతో మహిళా అసోసియేషన్ సభ్యులు

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం తితిదే పద్మావతీ మహిళా అసోసియేషన్ సంఘం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారి వాహన మండపం నుంచి ఉద్యోగినులు పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా ఆలయంలోకి చేరుకుని వస్త్రాలను ఆలయ అధికారులకు అందజేశారు. ఆ సంఘం అధ్యక్షురాలు హేమలత, సభ్యులు లక్ష్మీదేవి, అనురాధా, జ్యోతి, గంగ, జమున, రజిని, లలిత, భవ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వైకాపా కార్పొరేటర్ల ఎత్తులు చిత్తు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: మంగళవారం జరిగిన నగరపాలిక కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ తిరుపతి గ్రామ పంచాయతీల విలీన సవరణ ప్రతిపాదనపై వైకాపా కార్పొరేటర్లు తమదైన మొండి వైఖరి ప్రదర్శించారు. నగరపాలిక అధికారులు ప్రతిపాదించిన 63 గ్రామ పంచాయతీలతో పాటు తూర్పున ఐతేపల్లి, పడమట కల్యాణి డ్యాం, దక్షిణాన రాయల్ చెరువు వరకు విస్తరించాలని మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఎంపీ గురుమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. వైకాపా బృందం ద్వంద వైఖరిని ఉప మేయర్ ఆర్.సి. మునికృష్ణ, కార్పొరేటర్లు నరసింహాచారి, ఎస్.కె. బాబు తీవ్రంగా వ్యతిరేకించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, పక్కన ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, ఎంపీ గురుమూర్తి

నిన్న వద్దని.. నేడు పరిధి పెంచాలని

నగరపాలక సంస్థలో విలీనం చేసే గ్రామాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలతో చర్చించి గ్రేటర్ ప్రతిపాదన పంపుదామని గత సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభ్యర్థన చేశారు. అయితే దీనిపై వైకాపా కార్పొరేటర్లు చాలా దారుణంగా ప్రవర్తించారు. ఇప్పుడు మళ్లీ పరిధి విస్తరించాలని వారే ఆందోళన చేయడంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 139 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి నగరం ఇప్పుడు మహానగరంగా మారే నిర్ణయం తీసుకునే అవకాశం మనకు కలిగిందని, ప్రస్తుత ప్రతిపాదించిన గ్రామ పంచాయతీల విలీనానికి ఆమోదం తెలపాలని, వైకాపా ప్రతిపాదనలు కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు విస్తరిస్తున్న నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

పోలీసు బందోబస్తు

గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో పోలీసు బందోబస్తు మధ్య కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే సమావేశానికి అనుమతించారు. అయినా పలువురు వైకాపా కార్పొరేటర్లు నిరసన ప్లకార్డులతో సమావేశానికి హాజరయ్యారు.

ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే నాని, అధికారులు

అర్జీదారులకు సత్వర పరిష్కారం

యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై రెవెన్యూ అధికారులు ఉంచి అర్జీదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపనున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. యర్రావారిపాలెం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీవో రామ్మోహన్ హాజరయ్యారు. సదస్సులో సుమారు 250 అర్జీలు వచ్చాయని, వాటికి వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని తహసీల్దారు పరమేశ్వరస్వామిని ఆయన ఆదేశించారు. తెదేపా మండల అధ్యక్షుడు రఘునాథ, మహేష్ నాయుడు, హరిశ్చంద్ర, మధు, వేణు, నిరంజన్, బాలు, గోపి, దేవి, చిన్నపరెడ్డి, సుదర్శన్‌నాయక్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. ❖ చిన్నగొట్టిగల్లు మండలం దిగువూరు పంచాయతీ మట్టివారిపల్లికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి మృతిచెందగా ఎమ్మెల్యే నాని మృతదేహానికి నివాళులు అర్పించారు.

బాలాజీ రైల్వే డివిజన్‌కు సహకారం

తిరుపతి(రైల్వే): తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి రెడ్డి, ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. తిరుమలలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని, తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపీ డాక్టర్ గురుమూర్తిని బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు కలిసి వినతిపత్రాలు సమర్పించారు. కన్వీనర్ కుప్పాల గిరిధర్ బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతను వివరించారు.

కపిలేశ్వరాలయంలో ముగిసిన రుద్రహోమం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం మంగళవారం ముగిసింది. రుద్ర హోమం ముగింపు సందర్భంగా లఘు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్ర జలాలను భక్తులకు అందజేశారు.

శివపార్వతుల కల్యాణం: సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ధర్మశాస్త్ర హోమం, నవంబర్ 20న శ్రీచండికేశ్వరస్వామి హోమం, త్రిశూల స్నానం, పంచమూర్తుల తిరువీధి ఉత్సవం జరుగనుంది. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, రవికుమార్, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

గంగమ్మకు మొక్కుల చెల్లింపు

చంద్రగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో నాలుగు వారాల గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో మంగళవారం పురస్కరించుకుని దిగువవీధి, ఆకుతోటవీధి, జమండ్లవీధి, దాసరవీధి నాలుగురోడ్ల కూడలిలోని నడివీధి గంగమ్మ ప్రాంతాల వద్ద అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు మేళతాళాలతో తరలివచ్చి అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నాగాలమ్మ మలుపులో గంగమ్మ తల్లికి మహాకుంభం నైవేద్యంగా సమర్పించారు. ద్వారకానగర్‌లోని శ్రీమిట్టగంగమ్మతల్లికి భక్తులు చక్కెర పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. శ్రీమూలస్థానమ్మ ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, జాతర నిర్వాహకులు సతీష్‌కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జమండ్ల వీధిలోని అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

విజేతలతో విశ్వం టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్లు విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ ❖ బహుమతులు పొందిన విద్యార్థులతో నలంద హైస్కూల్ ఉపాధ్యాయులు

ఉపన్యసించి.. బహుమతులు సాధించి

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: విద్యార్థులు తమ ఆలోచనా విధానంలో మార్పు రావాలంటే తరచూ పోటీ పరీక్షల్లో పాల్గొనాలని విశ్వం టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్ రెడ్డి, నలంద హైస్కూల్ హెచ్‌ఎం ఓ.వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ రెండు పాఠశాలల్లో 'ఈనాడు- ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు జరిగాయి. విశ్వం స్కూల్లో జి. శ్రీకర్(ప్రథమ), ఎస్.మౌలికేశ్వర్‌రెడ్డి(ద్వితీయ), టి. భావిక(తృతీయ), నలంద పాఠశాలలో కె.ఉషాంజలి(ప్రథమ), కె.మోక్షితా రెడ్డి(ద్వితీయ), ఎ.సోనాక్షి(తృతీయ) గెలుపొందారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆర్చి నుంచి టోల్‌గేట్ వరకు బారులుతీరిన వాహనాలు ❖ ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

వానొచ్చే.. అవస్థలు తెచ్చే

ఈనాడు, తిరుపతి: తిరునగరిలో తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. చలిగాలికి స్థానికులు, రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడ్డారు. చిరుజల్లుల వర్షంలోనే రోగులను వీల్‌ఛైర్‌లో బంధువులు పరీక్షల కోసం తీసుకెళ్తూ కన్పించారు. ఉదయం నగరంపై పొగమంచు కమ్ముకుంది. తిరుమలకు కనుమదారిలో వెళ్లే భక్తుల వాహనాలు ఆర్చి వరకు బారులు తీరాయి. లక్ష్మీపురం కూడలి నుంచి బైరాగిపట్టెడకు వెళ్లే మార్గంలో ఉన్న తితిదే శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మురుగునీరు తటాకాన్ని తలపించింది. విద్యార్థులు, సిబ్బంది, వాకర్స్ అవస్థలు పడ్డారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వాకర్స్ కోరుతున్నారు.

రైతులకు రూ.17.61 కోట్ల లబ్ధి

నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవకు 26,062 మంది అర్హులు

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా అన్నదాతను ఆదుకోవడానికి ఇచ్చిన హామీని క్రమం తప్పకుండా అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రెండో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా బుధవారం రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేయనుంది. రబీ సీజన్‌లో కూటమి ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో రైతులు పంట విత్తుకోవడానికి ఒకరి మీద ఆధారపడాల్సిన పనిలేదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రగిరి నియోజకవర్గంలో తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలు ఉన్నాయి. తిరుపతి గ్రామీణ మండలం మినహా ఇస్తే మిగిలిన ఐదు మండలాల్లో రైతులు ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఈ మండలాలు తిరుపతికి సమీపంలో ఉండడంతో రైతులు వరి, వేరుశనగ, చెరకు, కాయగూరలు, ఉద్యాన పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. వీటిని తీసుకొచ్చి నగరంలో విక్రయించుకుంటున్నారు. రైతులు పంటలు సాగు చేసేటప్పుడు దుక్కులు దున్నకం నుంచి, కూలీల వినియోగం వరకు ముందుగా పెట్టుబడి పెట్టాల్సి ఉంది. పెట్టుబడికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు వందకు రూ.3 నుంచి రూ.5వరకు వసూలు చేస్తున్నారు. తీసుకున్న మొత్తాన్ని రైతులు తిరిగి చెల్లించే నాటికి అసలు ఎంత ఉందో అంత వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పేరుతో ఒక్కొక్కరి ఖాతాలో రూ.7వేలు చొప్పున నియోజకవర్గంలోని 26,062 మంది రైతులకు రూ.17.61 కోట్లు వారి ఖాతాలో జమ చేయనుంది. దీనికి సంబంధించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు.

మండలం	లబ్ధిదారులు	జమ కానున్నది (రూ.కోట్లలో)
పాకాల	5029	3.47
చంద్రగిరి	4504	2.92
రామచంద్రాపురం	4307	2.91
తిరుపతి గ్రామీణం	2919	1.93
చిన్నగొట్టిగల్లు	4359	3.01
ఎర్రావారిపాళెం	4944	3.37

రాయలసీమ జిల్లాలను అభివృద్ధి చేయాలి

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభివృద్ధిని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని, పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం పోరాటం

తిరుపతి(నగరం): సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం సీపీఐ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సీపీఐ, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. నాయకులు విశ్వనాథం, బండి చలపతి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, ఎన్‌డీరవి, పద్మనాభరెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.

'దొంగే దొంగ అన్నట్లు భూమన వ్యవహారశైలి'

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసులో నిందితులు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. తితిదే మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మృతిపై తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. సతీష్‌కుమార్ మరణ వార్త తెలిసిన వెంటనే కరుణాకర్‌రెడ్డి గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు ఆత్మహత్య అని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది విన్నవారికి దొంగే.. దొంగ.. దొంగ అని అరిచినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. తిరుమలలో వైకాపా హయాంలో అవినీతి కార్యకలాపాలన్నీ భూమనకు తెలిసే జరిగాయని ఆరోపించారు. సతీష్‌కుమార్ మృతితో భూమనకు లింక్ ఉండే అవకాశం ఉందన్నారు.

హాజరు నమోదు తప్పనిసరి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సచివాలయాల సిబ్బంది హాజరు నమోదు తప్పనిసరి అని నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య స్పష్టం చేశారు. నగరంలోని కెనడీనగర్ 12, 13 వార్డు సచివాలయాలను, డి అడిక్షన్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. సచివాలయాల్లో సిబ్బంది హాజరు నమోదును పరిశీలించి, ప్రజల నుంచి ఎలాంటి వినతులు వస్తున్నాయని తెలుసుకున్నారు. వెంట ఉప కమిషనర్ అమరయ్య, వైద్యాధికారి యువ అన్వేష్, ఆర్‌ఐ నవీన్ ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

పాఠశాల వద్ద పోలీసుల గస్తీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో బాలికల జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఇటీవల గుర్తుతెలియని యువకులు బాలికల కళాశాల, పాఠశాలకు వెళ్లే మార్గంలో మద్యం మత్తులో గొడవ పడటం, దూషించుకున్న సంఘటనలు జరిగాయి. గంజాయి మత్తులో యువత వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో విద్యార్థులు వసతిగృహాలకు వెళ్లే మార్గాల్లో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. పట్టణ సరిహద్దుల్లోని పొలిమేరల్లో, రైల్వే స్టేషన్, బ్రహ్మంగారి గుడి, కోటమార్గం, రాయలపురం పొలిమేరల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

ఓ దుకాణానికి సీలు వేస్తున్న అధికారులు

ట్రస్టు ఆస్తుల స్వాధీనం

తిరుపతి (బైరాగిపట్టెడ): తిరుపతి తీర్థకట్టవీధిలో శ్రీ కందాల గోవిందాచార్యుల ట్రస్ట్‌కు చెందిన స్థిరచరాస్తుల్లో ఆక్రమణకు గురైన ఆస్తులను హైకోర్టు ఆదేశాలతో ఆ ట్రస్టు ఇన్‌ఛార్జి ఈవో, దేవాదాయ శాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. దుకాణాల్లోని వస్తువులను పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమక్షంలో పంచనామా నిర్వహించి సీళ్లు వేశారు. ఓ దుకాణదారు తాళాలు తీయకపోవడంతో సిబ్బంది తాళాలు పగులగొట్టారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో కంచె ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు అమర్చినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు.

వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో 'సద్గమయ'

తిరుమల, న్యూస్‌టుడే: వచ్చే వేసవిలో తెలుగు రాష్ట్రాలలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు 'సద్గమయ' అనే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. స్థానిక అన్నమయ్య భవనంలో తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌తో కలిసి హిందూ ధర్మప్రచార పరిషత్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. తిరుమలలోని అఖండనామ సంకీర్తనకు రిజిస్టర్ అయిన 7856 భజన బృందాల నైపుణ్యాన్ని పరిశీలించి జిల్లా స్థాయిలో భజన ప్రదర్శనలను ఏర్పాటు చేసి క్రమబద్ధీకరించేందుకు నిర్ణయించారు. స్విమ్స్‌లో పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు.

అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుమల కొండపై గతంలో కూల్చివేసిన అన్నమయ్య గృహాన్ని తిరిగి పునర్నిర్మించాలని కోరుతూ మంగళవారం తిరుపతిలో అన్నమయ్య పీఠం ఆధ్వర్యంలో వేమన విజ్ఞాన కేంద్రంలో స్వామీజీలు సమావేశం నిర్వహించారు. అనంతరం యశోదనగర్ నుంచి స్థానిక తితిదే పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య పీఠం అధిపతి విజయశంకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

తిరుపతి(లీగల్): అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితులు పెద్దమండ్యం మండలం గొల్లవానిగుంటకి చెందిన చంద్రశేఖర్‌నాయుడు, రెడ్డిశేఖర్‌నాయుడికి తిరుపతిలోని రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టు మంగళవారం రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించింది.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 23 మందికి జరిమానా

తిరుపతి(లీగల్): నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 23 మంది వాహన చోదకులు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున తిరుపతి మూడో అదనపు మున్సిఫ్ కోర్టు మంగళవారం జరిమానా విధించింది. ట్రాఫిక్ అంతరాయం కేసుల్లో 14 మందికి రూ.7 వేలు జరిమానా విధించింది. నగరంలో తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి పర్యవేక్షణలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

చినుకు పడితే చిత్తడే

చంద్రగిరి కొత్తపేటలోని ఒకే ప్రాంగణంలో రెవెన్యూ, నీటిపారుదల, ఉప ఖజానా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. సెలవు రోజులు మినహా నిత్యం ప్రజలతో ఆయా కార్యాలయాల కిటకిటలాడుతాయి. వర్షాలు వచ్చిన సమయంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు బురదతో రొచ్చుగా మారుతున్నాయి. వివిధ సమస్యలతో కార్యాలయాలకు వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు నిలువకుండా రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, చంద్రగిరి

రైతులు గజ గజ

చిన్నగొట్టిగల్లు మండలంలో ఏనుగుల దాడులు ఆగడం లేదు. సోమవారం రాత్రి మండలంలోని భాకరాపేట గ్రామం, వడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేంద్ర, చుక్కలింగం, శేషాద్రిలకు చెందిన వరి పంట, మల్లయ్యకు చెందిన మామిడి తోట, సుధాకర్‌కు చెందిన టమాటా తోటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు హడలిపోతున్నారు. తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు దూరంగా ఏనుగులను తరమాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, భాకరాపేట

దారంతా గుంతలే

కుప్పంబాదూరు నుంచి పరమాలకు వెళ్లే ప్రధాన రహదారిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు ప్రధాన రహదారి కోతకు గురై గుంతలు పడింది. ఈ మార్గంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో వాహన చోదకులు రాకపోకలు సాగిస్తే విద్యార్థుల దుస్తులపై బురద పడి దుస్తులు పాడవుతున్నాయి. వాహనదారులు కింద పడుతున్నారు. మరమ్మతులు చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

-న్యూస్‌టుడే, రామచంద్రాపురం

పాఠశాలకు వెళ్లాలంటే తిప్పలే

రాయలచెరువు, చిత్తూరు గ్రామాల నుంచి కుప్పంబాదూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే బస్సుల కోసం తిప్పలు పడాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో పాఠశాలకు వెళ్లే సమయానికి, పాఠశాల నుంచి సాయంత్రం ఇళ్లకు చేరుకోవడానికి బస్సులు ఆపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారుల స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, రామచంద్రాపురం

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

కన్నయ్యా.. కష్టాలు కానరావయ్యా..!

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో శ్రీకృష్ణ మందిరానికి వెళ్లేందుకు భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి ఆలయానికి ముందు వర్షపునీరు నిలుస్తోంది. చుట్టూ పొదల్లా పెరిగిన చెట్లు, ఆలయం వెనుక భాగంలో ఏళ్ల తరబడి ఉన్న రాళ్లు, ఆలయ ఆవరణలో విద్యుత్తు తీగలతో రోజువారి శ్రీకృష్ణుని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఇకనైనా భక్తులు ఇబ్బందులు లేకుండా సందర్శించుకునేందుకు వీలుగా అభివృద్ధి చేపట్టాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: రజానగరం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాకేష్‌వర్మ, చిత్ర, జీవలు సాఫ్ట్‌బాల్ అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వంశీరాజా తెలిపారు. ఎంపికైన విద్యార్థులతో పాటు పీడీ హేమాద్రిలను ఉపాధ్యాయులు, స్థానికులు మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మల్లెమడుగు రిజర్వాయర్

రక్షణ లేక.. ప్రాణాలు నిలపలేక

● నిత్యం ఘర్షణలు... తాగుబోతుల వీరంగాలు ● పట్టించుకోని అధికారులు

రేణిగుంట, న్యూస్‌టుడే: ఇటీవల కాలంలో పలు ప్రదేశాల్లో ఆహ్లాదం కాస్త విషాదంగా మారుతున్నాయి.. కనీసం పట్టించుకునే వారే లేకుండా పోవడంతో మరణాలు తప్పడం లేదు.. కాస్త చర్యలు తీసుకుంటే వీటిని కట్టడి చేయవచ్చు.. ఆ దిశగా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

నీరుచేరిన సమయంలో జాగ్రత్తలు

రేణిగుంట మండలంలోని మల్లెమడుగు రిజర్వాయర్ ఆహ్లాదంగా మానసికోల్లాసాన్నిస్తుంది. వర్షా కాలంలో ఇక్కడికి పెద్ద సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. చుట్టూ ఉన్న కొండల మధ్యలో ఈ రిజర్వాయర్‌కు ప్రశాంతమైన వాతావరణం సొంతం. ఏ పక్క చూసినా పచ్చని కొండలతో నిండుకుండలాంటి రిజర్వాయర్‌తో ఇట్టే ఆకట్టుకుంటుంది. అయితే ఇక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు మాత్రం అధికారులు పూర్తిగా వదిలేశారు. ఇటీవల తిరుపతికి చెందిన ఇద్దరు యువకులు మరణించడంతో పాటు గతంలోనూ పలువురు మృత్యువాత పడ్డారు. అలాంటప్పుడు నీరు వచ్చిన సమయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటుంది.

చేపల కోసం ఇబ్బందులు

ఇక్కడ చేపల వేటకు పెద్ద సంఖ్యలో యువత వస్తుంటారు. శేషాచల కొండల్లో నుంచి భారీగా ఇక్కడికి చేరుకున్న నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేయడంతో భారీగా చేపలు చేరుకుంటాయి. దీంతో చేపల వేటకు అదుపు లేకుండా పోయింది. మరో పక్క ఆదివారాలు, సెలవు దినాల్లో పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వచ్చిన వారిలో కొంతమంది కాసేపు ఉండి వెళ్లిపోయే వారు మరి కొందరు మాత్రం ఇక్కడ ఈత కొట్టేందుకు యత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కొందరు యువకులు మద్యం తాగి హద్దుమీరి ప్రవర్తిస్తుంటారు. పైగా సెల్ఫీల పేరుతో విన్యాసాలు చేస్తున్నారు.

కనిపించని అధికారులు

ఈ రిజర్వాయర్ ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్(గాలేరు-నగరి సుజల ప్రవంతి) ఆధీనంలో ఉంది. ఏడాదిలో అక్టోబర్ లేదా నవంబర్ మాసాల్లో వర్షాపు నీరు భారీగా చేరుకునే సమయంలో మాత్రమే వారు అందుబాటులో ఉంటారు. అనంతరం నాలుగైదు నెలలు ఈ నీరు ఇక్కడ నిల్వ ఉన్న సమయంలో అసలు ఏఒక్క అధికారి లేదా సిబ్బంది కనిపించరు. ఎప్పుడో ఒక రోజు చుట్టంచూపుగా వచ్చి వెళ్తుంటారే తప్ప ఉన్న దాఖలాలు లేవు.

అనుమతించవద్దని చెప్పాం

ఇక్కడ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఎక్కువ మంది వస్తున్నారు. దీంతో ఏమైనా ప్రమాదాలు జరగవచ్చని గతంలో ఇక్కడికి ఎవరినీ అనుమతించకండి అని జీఎన్ఎస్ఎస్ అధికారులకు లేఖ ఇచ్చాం. **- జయచంద్ర, సీఐ, రేణిగుంట పట్టణం**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

ఏర్పేడు, న్యూస్‌టుడే: సమస్య: ఏర్పేడులోని సంతప్రాంగణం చిన్నపాటి చినుకుపడినా బురదమయంగా మారుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.
- సరోజనమ్మ, చిరువ్యాపారి

సమాధానం: సంబంధిత అధికారులతో చర్చించి బురద లేకుండా తగు చర్యలు తీసుకుంటాం.
- రమణకుమార్, ఈవోపీఆర్డీ, ఏర్పేడు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

స్పందనకు వందనం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ప్రధాన రహదారుల పక్కన విచ్చలవిడిగా వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పల్లంపేటలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారిపై ఆటోలు నిలిపి ఉండటంతో రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఈనాడులో 'మేమున్నాం- మీకుతోడుగా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టారు.

కొట్టకాడులో భూముల రీసర్వే

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని కొట్టకాడులో భూముల రీసర్వే గ్రామసభను మంగళవారం నిర్వహించారు. సమావేశంలో స్థానిక రైతులు తమ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి వినతులను అధికారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచి ఏలుమలై, వీఆర్వో తస్లీమ్, సర్వేయర్ రాజ్‌కుమార్, నేతలు బాలకృష్ణ మొదలియార్, ఉదయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఇంగ్లీషు పదాలతో రాసిన బోర్డు

తెలుగు మరిచి.. ఇంగ్లీషు రాసి

సత్యవేడు, న్యూస్‌టుడే: రైతు మహిళా సంఘాల గ్రూపుల ఏర్పాటుకు గ్రామీణాభివృద్ధి సంస్థ శ్రీకారం చుట్టింది. ఎంపీడీవో కార్యాలయంలోని వెలుగు కార్యాలయ వెలుపల భాగంలో రైతు గ్రూపునకు సంబంధించి బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. మండల వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం లిమిటెడ్‌ను తెలుగులో రాయించాల్సిన ఏపీఎం డాంగే యాదవ్ సత్యవేడు మండల అగ్రికల్చర్ అండ్ అలైడ్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో రాయించడంతో మహిళలు అర్థం కాక తికమక పడుతున్నారు.

సంఘీభావాన్ని తెలుపుతున్న సహకార మండలి సభ్యులు

సహకార బ్యాంకుకు పూర్వ వైభవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణ సహకార బ్యాంకుకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు తమవంతు కృషిచేస్తామని ది శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఛైర్మన్ భారద్వాజ అన్నారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఆవరణలో సహకార పతాకాన్ని ఎగురవేసి వేడుకలు ఆరంభించారు. శ్రీకాళహస్తి సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ అధికారి విజయకుమార్‌రెడ్డి నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకమండలి సభ్యులు, బ్యాంకు సీఈవో ధనుంజయులు, అకౌంటెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు నగదు చెక్కు అందజేస్తున్న భక్తులు

గోసంరక్షణకు విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున నిర్వహిస్తున్న గోశాలలో గోవుల సంరక్షణార్థం పాగాల దిలీప్‌కుమార్ రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదు చెక్కును మంగళవారం ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఈవో బాపిరెడ్డిలకు అందజేశారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, పాగాలి రామకృష్ణ, నిర్మలాదేవి, చరిత, భువన్ తదితరులు పాల్గొన్నారు.

అరణియార్ జలాశయం

అరణియార్ నీటి విడుదల

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: అరణియార్ జలాశయ నీటి మట్టం మంగళవారం 30.3 అడుగులకు చేరినట్లు డీఈ శ్రీనివాసులు తెలిపారు. జలాశయంలో 31 అడుగుల నీటి మట్టంతో 1.853 క్యూసెక్కుల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని.. ప్రస్తుతం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా రావడంతో స్పిల్‌వే గేట్ల ఒక గేటును తెరిచి కొంతమేర నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వర్షాలు అధికమైతే అందుకనుగుణంగా నిర్దేశిత మోతాదులో నీటి విడుదలను పెంచుతామని తెలిపారు. త● కాళంగి రిజర్వాయర్ ఐదు గేట్లను ఎత్తి 1890 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలసదనంలో ఖాళీగా ఉన్న పోస్టులకు పొరుగు సేవకులు, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు ఆసక్తి కల్గిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఇద్దరు వంట మనుషులు, హెల్పర్, హౌస్‌కీపర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ ఉపాధ్యాయుడు, పీటీ కమ్ యోగా శిక్షకుడు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

చైతన్యంతోనే బాల్యవివాహాల నిర్మూలన

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన, చైతన్యంతోనే నిర్మూలించవచ్చని సీడీపీవో దేవకుమారి అన్నారు. మండలంలోని పాండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలతో బాలికలు తీసుకోవాల్సిన రక్షణాత్మక చర్యలు గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు మునిసుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు శిల్ప, అంగన్‌వాడీ కార్యకర్త లత పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

శ్రీకాళహస్తి: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి లావణ్య తెలిపారు. పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వ్యకృత్వ పోటీలు నిర్వహించినట్లు వివరించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు.

విజ్ఞాన భాండాగారం గ్రంథాలయం

నారాయణవనం, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మానసిక వికాసం, మేధోశక్తిని పెంచేందుకు దోహదపడుతుందని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శర్మ అన్నారు. మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో కోదండనాయుడు, ప్రధానోపాధ్యాయులు మనోహరి, సులోచన, గ్రంథాలయాధికారి జీవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులతో విద్యార్థులు

బాల్యం బాలల హక్కు

ఏర్పేడు, న్యూస్‌టుడే: బాల్యం బాలల హక్కుని ప్రగతి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త నారాయణ తెలిపారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మునగలపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ఉన్నత ఆలోచనలతో విద్యనభ్యసించడంతో సులభతరంగా విజయాలను సాధిస్తారని వివరించారు. అనంతరం బాలల హక్కులు, బాధ్యతలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శిరీషా, సుభాష్ చంద్ర, రాజేశ్వరి, సుమలత పాల్గొన్నారు.

కాలనీకి వెళ్లాలంటే దారుణం

మండల కేంద్రం నుంచి గోపాలరావుకాలనీకి వెళ్లే దారి అడుగడుగునా అధ్వానంగా మారింది. వరదయ్యపాళెం పంచాయతీ పరిధిలోని ఈ కాలనీలో సుమారు 200కుటుంబాలకు పైగా నివాసముంటున్నాయి. ఎన్నోఏళ్లుగా రహదారి అభివృద్ధికి నోచుకోక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కడూరు ఏరు నుంచి ఇసుక, మట్టి అక్రమ రవాణా చేసే మట్టిమాఫియా ఈ కాలనీ మీదుగా నిత్యం వందలాది ట్రాక్టర్లలో రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి మరీ అధ్వానంగా మారింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వరదయ్యపాళెం**

ఆటస్థలం లేకున్నా.. పతకాలకు కొదవలేదు

నాగలాపురం, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. పాఠశాలకు సరైన ఆటస్థలం లేకున్నా.. దాతల సహకారంతో చేకూరిన ఖాళీ స్థలంలో పీడీలు బాబు, సురేంద్రల శిక్షణలో రాటుదేలుతున్నారు. వరుస విజయాలతో పాఠశాలను ఉన్నత స్థానంలో నిలుపుతున్నారు.

రగ్బీలో లోకేశ్ ప్రతిభ

నాగలాపురంలో సెలూన్ నడుపుతున్న పురుషోత్తం, జయభారతిల కుమారుడు లోకేశ్. రగ్బీ ఆటలో ప్రతిభ చూపిస్తున్నాడు. శ్రీకాళహస్తిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించాడు. గుడివాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యాడు. చదువులోనూ మంచి మార్కులతో ఉపాధ్యాయుల మన్ననలను అందుకుంటున్నాడు. భవిష్యత్తులో పోలీసు అధికారి కావాలన్నదే తన ఆకాంక్షగా తెలిపాడు.

భీమేష్.. యోగాలో సిద్ధహస్తుడు

ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న జ్యోతి తన కుమారుడు భీమేష్‌ను అదే పాఠశాలలో చదివిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోనే మానసిక, శారీరక వికాసం సవ్యంగా ఉంటుందన్న భావనతో అంకిత భావంతో ఉన్న ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా భీమేష్ చదువుతో పాటు యోగాలోనూ ప్రతిభ చూపిస్తున్నాడు. బంగారుపాళెంలో జరిగిన యోగా జిల్లా స్థాయి పోటీల్లో రాణించి ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

కార్మికుడి కుమార్తె మీనాక్షి

ఎస్ఎస్‌పురానికి చెందిన నీలకంఠం, భారతిలు బేల్‌దారు పనులు చేస్తూ కుమార్తె మీనాక్షిని నాగలాపురంలో పదవ తరగతి చదివిస్తున్నారు. తండ్రి కష్టాన్ని చిన్ననాటి నుంచి చూస్తున్న మీనాక్షి చదువులో ప్రతిభ చాటడంతో పాటు రగ్బీలోనూ సాధన చేసింది. ఆరు నెలలుగా తీసుకున్న శిక్షణతో జిల్లా స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసి గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఐపీఎస్ అధికారిణిగా స్థిరపడాలన్నదే లక్ష్యమని తెలిపింది.

ఇంటిపట్టునే మౌనిక శిక్షణ

ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మౌనిక తండ్రి హరినారాయణ శ్రీసిటీలో పని చేస్తున్నాడు. ఇంటి బాధ్యతలు చూసుకుంటున్న తల్లి లీనాకు తోడుగా ఉంటూనే మౌనిక ఇంటిపట్టునే చిన్ననాటి నుంచి యోగా సాధన చేస్తోంది. పాఠశాలలో యోగా శిక్షణతో బంగారుపాళెంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనపరిచింది. బాపట్లలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మౌనిక ఉపాధ్యాయురాలిగా పని చేయాలన్నదే తన ఆకాంక్షగా తెలిపింది.

అటవీ భూములు స్వాధీనం చేసుకోండి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: బీఎన్‌కండ్రిగ మండలం అంజూరు అటవీ పరిధిలో కల్కిట్రస్టు ఆధీనంలోని 21 ఎకరాల అటవీ భూములను స్వాధీనం చేసుకుని, అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని జాతీయ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య విన్నవించారు. ఈ మేరకు మంగళవారం మంగళగిరిలోని అరణ్యభవన్‌లో అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటరు డా.పీవీ చలపతిరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ పత్రాలతో స్వాధీనమైన అటవీ భూముల్లో అటవీశాఖ చట్టానికి విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా స్థానిక రెవెన్యూ, అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి కార్యదర్శి కౌతారం ప్రసాద్, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

పీసీసీఎఫ్ డా.చలపతిరావుకు వినతి పత్రాన్ని అందిస్తున్న నార్నె వెంకటసుబ్బయ్య

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీనివాసులు, అధ్యక్షుడు



సూరిబాబు, ప్రధానకార్యదర్శి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర నాయకులు యువశ్రీ మురళి, పోలూరు జగన్నాథం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన సంఘ గౌరవాధ్యక్షుడిగా మల్లం మొహిద్దీన్, అధ్యక్షుడిగా పూడి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా పామంజి సూరిబాబులను ఎన్నుకున్నారు. ఆర్థిక కార్యదర్శిగా ముజీబ్, ఉపాధ్యక్షులుగా రంగనాథ్, చిన్నగురవయ్య, మోహన్‌రావు, సుబ్బరామయ్య, కార్యదర్శులుగా పరంధామయ్య, స్వామిదాసు, పల్లిపట్టు నాగరాజు, గోకులకృష్ణ, రవిబాబు, అప్పారావు, మనోజ్, ఆర్థిక కమిటీ సభ్యులుగా శ్రీనివాసరావు, లోకేష్, సుగుణ, శ్రీకర్, మహిళా కన్వీనరుగా వసంత, మహిళా సభ్యులుగా సురేఖ, సౌమ్య, సుమ, కౌన్సిలర్లుగా వెంపల్ల చిన్నయ్య, చెంగయ్య, శ్యాంసుందరం, మోతీలాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'పార్టీకి పనిచేసినవారికే పదవులు'

పిచ్చాటూరు: పార్టీ కోసం పనిచేసిన వారందరికీ పదవులు కేటాయిస్తామని పరిశీలకుడు సురేష్‌రాజు అన్నారు. పిచ్చాటూరులోని ప్రైవేటు కల్యాణ మండపంలో తెదేపా నియోజకవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ కార్యక్రమాల సమన్వయకర్త శంకర్‌రెడ్డి, పార్టీ పరిశీలకులు సురేష్‌రాజు, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అనుచరులు సమావేశ గదిని వీడాలంటూ కొందరు చేసిన సూచనతో కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితి నెలకొని తీవ్రవాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. వేదికపైన కూర్చున్న జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడిని కిందకు దించాలంటూ గోవర్ధనగిరి నేతలు గొడవకు దిగటంతో తోపులాటలు చోటు చేసుకున్నాయి. పార్టీ పదవులు ఆశించేవారి అభ్యర్థన పత్రాలు స్వీకరించారు. వాటిని పరిశీలించి ఏకాభిప్రాయంతో పదవులను కేటాయిస్తామని పరిశీలకులు తెలిపారు.

మాట్లాడుతున్న తెదేపా పరిశీలకులు సురేష్‌రాజు ←

గంధోత్సవంలో తెదేపా నేతలు

తొట్టంబేడు: స్థానిక ఈదులగుంటలోని అలీషా దర్గాలో మంగళవారం గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ తెదేపా మైనార్టీ నేతలతో పాటు పలువురు తెదేపా నేతలు గంధోత్సవంలో పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మైనార్టీ నేతలు షాకీర్ అలీ, షఫీ, జహీర్ అహ్మద్, మీర్జావలి, నయీమ్, నాగూర్‌బాష, దొరబాబు, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

సభ్యులందరికీ లెక్కలు తెలియాల్సిందే

నాగలాపురం, న్యూస్‌టుడే: వెలుగు స్వయం సహాయక సంఘాల్లోని మహిళ లందరికీ సంఘంలోని ఆర్థిక లెక్కలన్నీ తెలియాలని ఏపీఎం మమత పేర్కొన్నారు. మన డబ్బులు- మన లెక్కలు పేరిట నాగలాపురంలో వెలుగు సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డెయిరీ ఏపీఎం సుదర్శనరాజు, సీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

షెడ్యూలు

M/S.SLS DEVELOPERS ... 'ECO GREEN GARDENS'

సం/- బి.వి.సుబ్బయ్య, బి.ఏ.,బి.ఎల్., అడ్వకేట్,
డి.నెం.8/114/2, ... తిరుపతి.
సెల్ నెం: 94402 02564

బాపు.. పదిలం నీరూపు

ముక్కంటి ఆలయంలోని శివయ్య గోపురం వద్ద మహాత్మాగాంధీ వేషధారణతో ఉన్న బాలుడితో భక్తులు స్వీయ చిత్రాలు తీసుకునేందుకు ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు. పొట్టకూటి కోసం ఆ బాలుడు గాంధీ వేషాన్ని ధరించి ఉండటంతో పలువురు వాళ్ల చరవాణుల్లో అతని రూపాన్ని పదిలం చేసుకోవడం విశేషం.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

అలా కొనేశారు.. ఇలా వదిలేశారు

నాడు-నేడు పనులు పూర్తి చేసి పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామని పదే పదే డప్పు కొట్టుకుంది గత వైకాపా ప్రభుత్వం. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. నాడు-నేడులో భాగంగా తొట్టంబేడు మండలం బోనుపల్లి జడ్పీ పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ముందుగానే సామగ్రి కొనుగోలు చేశారు. గత ప్రభుత్వంలో అధికారులు తొందర పెట్టడంతో అవసరం లేకున్నా ఇనుము తదితరాలకు చెల్లింపులు చూపించి సరిపెట్టారు. ఉపయోగించక ప్రస్తుతం ఎండా, వానకు తుప్పుపడుతున్నాయి. దొంగల పాలవుతున్నాయి. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

బోర్డు తలపై పడేటట్టు

స్థానిక చెక్‌పోస్టు సమీపంలోని పెద్ద కూడలి నుంచి రామకృష్ణాపురం కూడలి వైపు వెళ్లే జాతీయ రహదారిపై ఏమార్గంలో ఎటువెళ్తే ఈ పట్టణం వస్తుందో బోర్డును గతంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డులో చివరి భాగం వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. దీనిని వెంటనే మరమ్మతు చేయకుంటే ఎవరి తలపైనైనా, వాహనంపైనైనా పడే ప్రమాదం ఉందని స్థానికులు భయబ్రాంతులకు గురవుతున్నారు.
- న్యూస్‌టుడే, రేణిగుంట



ఆభరణాల అప్పగింత

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నెల్లూరుకు చెందిన శ్రీనివాసులు సోమవారం ముక్కంటి దర్శనార్థం ఇక్కడకు వచ్చారు. ఆలయానికి సమీపంలోని జ్ఞానప్రసూనాంబిక సదన్‌లో దిగి గదిని ఖాళీ చేసి వెళ్లిపోయారు. గదిని శుభ్రం చేస్తుండగా మంగళవారం హౌస్ కీపింగ్ సిబ్బంది గున్నయ్యకు పరుపు కింద 15 గ్రాములు రెండు బంగారు ఉంగరాలు ఉండటాన్ని గమనించి ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శ్రీనివాసులు సోదరుడికి ఆలయ ఏఈవో మోహన్ సమక్షంలో పోలీసు ఔట్‌పోస్టు కానిస్టేబుల్ నాగరాజు నాయుడు, ఏపీఆర్‌వో రవి సమక్షంలో పోగొట్టుకున్న ఉంగరాలను అప్పగించారు.

SEVEN HILLS COLLEGE OF PHARMACY
[AUTONOMOUS]
Venkatramapuram, Ramachandrapuram (Mandal), Tirupati (Dist.), TIRUPATI - 517 561, A.P, INDIA
Admission Notification for Category "B" Seats in M.Pharmacy Courses
Applications are invited from eligible candidates for the academic year 2025-26 under category - B seats for admission into Pharmaceutics, Pharmaceutical Analysis & Pharmacology branches.
Admissions will be made as per the guidelines of APSCHE.
Contact : 7730084513, 7702484513 PRINCIPAL

SEVEN HILLS COLLEGE OF PHARMACY
[AUTONOMOUS]
Venkatramapuram, Ramachandrapuram (Mandal), Tirupati (Dist.), TIRUPATI - 517 561, A.P, INDIA
M.PHARMACY
SPOT ADMISSIONS – 2025-2026 AY
Eligible & Interested Candidates are advised to report at college on or before 17.11.2025 for M.Pharmacy (Pharmaceutics, Pharmaceutical Analysis, Pharmacology) Spot Admissions against vacant seats raised due to non-reporting of students of APPGECET – 2025 allotments. Admissions will be done as per guidelines of APSCHE.
For details Contact : 7730084513, 7702484513 PRINCIPAL

(c) eenadu

నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరులో నిమ్మ ధరలు
మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు
రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 20 వరకు

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్ (రైతు ధర)	132
లేయర్	120
బ్రాయిలర్స్	238
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	204

మేమున్నాం.. మీకు తోడుగా..
గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని చర్చి రోడ్డు ప్రాంతంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - చరణ్‌తేజ, గూడూరు
సమాధానం: చెత్తను సిబ్బందితో వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్వర్లు, కమిషనర్

మహిళలపై దాడులు హేయం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: భాజపా పాలనలో దేశంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలపై దాడులు పెరిగాయని సీపీఐ నాయకుడు ప్రభాకర్ తెలిపారు. మహిళలపై దాడులు చేయడం దారుణమని ఆయన అన్నారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. శశికుమార్, భాస్కర్‌గౌడ్, కుమార్, రాఘవులు, రమేష్, సునీల్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

చిల్లకూరు, న్యూస్‌టుడే: అడవులు అంతరించిపోకుండా సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ సుల్తాన్ అజీమ్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' లో భాగంగా ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్‌సీలు, గ్రీన్ అంబాసిడర్లకు మంగళవారం శిక్షణనిచ్చారు. ఎంపీడీవో గోపి పాల్గొన్నారు. **కోట:** థీమ్-5 పారిశుద్ధ్యం, పచ్చదనం గ్రామాలపై మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో దిలీప్‌కుమార్ పారిశుద్ధ్య లోపం, ప్లాస్టిక్ కారణంగా కలిగే అనర్థం వంటి వాటిపై అవగాహన కల్పించారు.

దుక్కి దున్నుతూ.. నాట్లు వేస్తూ

✦ రబీ సాగుకు కృషీవలుడు సిద్ధం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: రైతులు వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరింది. దీంతో రైతులు పొలాలను దుక్కి చేసి గట్లు శుభ్రం చేస్తూ వరినాట్లకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జిలకర మసూరి, కేఎన్ఎల్ రకాలను అన్నదాతలు నాట్లు వేశారు. ఇక మిగిలిన వరి రకాలు కొన్ని రోజులుగా నాట్లు వేస్తున్నారు.

నాట్లకు చెక్క తోలుతున్న రైతు

తగ్గిన కూలీల కొరత

సాధారణంగా వరినాట్లు వేసేందుకు కూలీల కొరత ఉండటంతో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి భారీగా చేరుకున్నారు. వీరి రాకతో పనులు జోరందుకున్నాయి. కూలీల కొరత తగ్గింది. పశ్చిమబెంగాల్, కృష్ణా జిల్లా కైకలూరు పరిసర ప్రాంతాల నుంచి కూలీలు నాయుడుపేట పరిసర గ్రామాలకు చేరుకొని పనుల్లో నిమగ్నమయ్యారు.

పెట్టుబడుల మోత

ఏటికేడు పంటల సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. పొలాల దుక్కి నుంచి నాట్లు వేసే వరకూ గతేడాది కంటే కొంత పెరగడంతో అదనపు భారం పడుతోంది. పైగా కాంప్లెక్సు ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని దుకాణదారులు మెలిక పెడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా వాడకంపై కొంత ఆంక్షలు విధించడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు అందజేసిన కార్డులపై సరిగా యూరియా పంపిణీ జరగడం లేదు.

నాయుడుపేట, సూళ్లూరుపేటలో వివరాలిలా..
సాగు విస్తీర్ణం : 1 లక్ష ఎకరాలు
యూరియా నిల్వలు :500 టన్నుల పైనే
రైతులు : 40 వేలు

మెట్ట ప్రాంతాల్లో ఎల్లిపైరు

రబీ సీజన్‌లో సాగుకు అనువుగా వర్షాలు కురవడం, తెలుగుగంగ జలాలు సాగునీటి చెరువులు, స్వర్ణముఖి నది, ఇతర కాలువల్లో ప్రవహించడంతో వరినాట్లు పెరగనున్నాయి. మెట్ట భూముల్లో వరి సాగుకు విత్తనాలు తీసుకెళ్లి నారు మడులు పోస్తున్నారు. ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో ఎల్లి పైర్లు సాగులో ఉన్నాయి. ఏడీఏ నాగార్జునసాగర్ న్యూస్‌టుడేతో మాట్లాడుతూ నాయుడుపేట సబ్‌డివిజన్ పరిధిలో 60వేల ఎకరాల్లో సాగు పడుతుందని, అలాంటిది ఈ ఏడాది 90వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డిపో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన డిపో అధ్యక్షుడు పూర్ణ, కార్యదర్శి కేవీరత్నం, గ్యారేజీ అధ్యక్షుడు రాజా, కార్యదర్శి కేవీఎల్‌రావును అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, జిల్లా అధ్యక్షుడు కుమార్, జిల్లా కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షుడు గుణశేఖర్, సహాయ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, డిపో గౌరవాధ్యక్షుడు ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణ యజమానుల నిరసన

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని మద్యం దుకాణ యజమానులు మంగళవారం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. దుకాణ యజమాని శివారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 14 శాతం ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. దీనికి తోడు పర్మిట్ రూములు పేరుతో ఒక్కొక్క దుకాణానికి రూ. 7.5 లక్షలు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. పర్మిట్ రూములు రద్దు చేయాలని కోరారు. ప్రస్తుతం లైసెన్సు ఫీజు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో దుకాణాలు మూసేసి తాళాలు ఎక్సైజ్ కార్యాలయంలో అందజేశారు. కోటేశ్వరరావు, మధుసూదన్‌రావు, చంద్రమౌళిరెడ్డి, శ్రీనివాసులు, బాబు, విజయ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దుకాణదారులు

కొండూరులో స్వామిత్వ గ్రామసభ

వాకాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొండూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. డీఎల్‌డీవో వాణిరెడ్డి మాట్లాడుతూ 181 మంది స్థల యజమానులకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఎంపీడీవో సాయిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, తెదేపా మండల అధ్యక్షుడు మధురెడ్డి, కార్యదర్శి శివకుమారి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న డీఎల్‌డీవో వాణిరెడ్డి, మధురెడ్డి

నేటి నుంచి ఆధార్ నమోదు

తడ, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం నుంచి 26 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శేఖర్ నాయక్ పేర్కొన్నారు. కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తడ జడ్పీ ఉన్నత పాఠశాల, 20న వాటంబేడు జడ్పీ ఉన్నత పాఠశాల, 21న అక్కంపేట ఆదర్శ పాఠశాల, 24న వేనాడు పాఠశాల, 25న బీవీపాళెం, 26న తడ జడ్పీ ఉన్నత పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటవుతాయన్నారు. 5- 15 ఏళ్ల లోపు వారికి ఆధార్ కార్డుల జారీ, సవరణలు, మార్పులు, చిరునామ నంబరు లింకు, అప్‌డేట్ తదితర సేవలు పొందే అవకాశం ఉందని ఎంపీడీవో తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ ఏడాది బీఏ, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, మైక్రోబయాలజీ కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ ప్రవీణ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా తమ వెంట ఇంటర్మీడియట్ మార్కుల పత్రం, టీసీ ధ్రువీకరణ, ఆధార్, బదిలీ ధ్రువీకరణ పత్రాలతో రావాలన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

ప్రసంగించారు.. ప్రతిభ కనబరిచారు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ బాలాజీ జూనియర్ కళాశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై మంగళవారం వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బి.వెంకట జశ్వంత్, కె.నవహర్షిత, ఎన్.శివసాయి గెలుపొందారు. కరస్పాండెంట్ కె.కోటేశ్వరరావు, అధ్యాపకులు భావన, దివ్య, రాజేశ్వరరావు, కల్యాణి, వాణి పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక పూజలు

చిల్లకూరు, న్యూస్‌టుడే: బల్లవోలులో అన్నపూర్ణ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం కార్తిక పూజలు ఘనంగా జరిగాయి. మాసశివరాత్రిని పురస్కరించుకొని దేవదేవుడు ప్రత్యేక అలంకరణలో కొలువుదీరారు. **చిట్టమూరు:** మండలంలోని మెట్టు శివాలయంలో సోమేశ్వర స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మీనాక్షిదేవి కి కుంకుమ పూజలు జరిగాయి. **దొరవారిసత్రం:** శ్రీ ధనమల్లిలో వెలసిన భవాని దేవి సమేత శ్రీధరేశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. **నాయుడుపేట:** తిమ్మాజీకండ్రిగ సమీపంలో స్వర్ణముఖి తీరంలో ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తికమాస దీపోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మ వార్లు పసిడి వస్త్రాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

చిల్లకూరులో సోమేశ్వరుడు,

నాయుడుపేటలో..

దొరవారిసత్రంలో..

అయ్యప్ప అఖండ జ్యోతి నేడు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి 16వ అఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భక్త బృందం తెలిపింది.

మండల సమాఖ్య సభ్యులకు శిక్షణ

కోట, న్యూస్‌టుడే: కోటను మోడల్ సమాఖ్యగా ఎంపిక చేయడంతో కార్యవర్గ సభ్యులకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఏపీఎం అనీలా మాట్లాడుతూ విద్య, వైద్య సామాజిక రంగాల్లో నైపుణ్యంపై వివరించారు. సమాఖ్య అధ్యక్షురాలు ముత్యాలమ్మ, నీనీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని మహాత్మాగాంధీ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వీరికి వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరచిన వారికి 20న బహుమతులు అందజేస్తామని గ్రంథాలయం సహాయకాధికారిణి లీలావతి తెలిపారు.

విశ్రాంత నిలయం.. మందుబాబుల ప్రాంగణం

మండలంలోని కొనేటిరాజుపాళెం గ్రామంలో రహదారి పక్కనే ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనం చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోంది. గతంలో వెంకటస్వామి తిరుపతి ఎంపీగా ఉన్న సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం విశ్రాంతి నిలయం నిర్మించారు. ప్రస్తుతం ఈ ప్రాంగణం చెత్తతో నిండి మందుబాబులకు అడ్డాగా మారింది.
- న్యూస్‌టుడే, నాయుడుపేట

గుంత.. చోదకుల చింత

మండలంలోని మన్నెముత్తూరు గ్రామం నుంచి సూళ్లూరుపేట వెళ్లే రహదారిలో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు అటు వైపు ప్రయాణించాలంటే జంకుతున్నారు. గతంలో చోదకులు ఇక్కడ ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ముళ్లకంపను ప్రమాద హెచ్చరికగా ఉంచారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

ముక్కుమూసుకొని పోవాలి మరి

సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని గాండ్లవీధి సచివాలయం సమీపంలో రోడ్డుపై వేసిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ దారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకొని పోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పురపాలక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా రిక్తహస్తాలే మిగిలాయని వారు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

విద్యుత్తు స్తంభం ఇలా.. వాహనాలు వెళ్లేదెలా?

సూళ్లూరుపేట మండలంలోని పెద్ద ఉలసాపడవ గ్రామంలో గతంలో విద్యుత్తు స్తంభం నడిరోడ్డుపై ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఆటోలు, ట్రాక్టర్లు వెళ్లలేవు. దీంతో స్థానికులు వ్యవసాయ పరికరాలను మోసుకుపోవాల్సిన పరిస్థితి. విద్యుత్తు శాఖ అధికారులు స్తంభాన్ని పక్కకు జరపాలని వారు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

అడుగేయాలంటే.. ఆలోచించాల్సిందే

పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో ఇక్కడ 80 ఎకరాల్లో గృహాలు మంజూరు చేసి, మౌలిక వసతులు కల్పన విస్మరించారు. మట్టి రోడ్డు వేసి మమ అనిపించారు. దీంతో వర్షం వస్తే రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. కనీసం నడవడానికి కూడా ఆస్కారం లేని పరిస్థితి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కింద పడిపోవాల్సిందే. అంతర్గత రహదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.
- న్యూస్‌టుడే, వెంకటగిరి

వాకాడులో శాంతియుత ర్యాలీ

వాకాడు, న్యూస్‌టుడే: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాదుకు చెందిన 45 మంది హజ్ యాత్రికులు మృతి చెందడంపై వాకాడులో ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులు పట్టుకొని శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఐక్య వేదిక మండల అధ్యక్షుడు ఖాజా రహంతుల్లా, ఉపాధ్యక్షులు మస్తాన్, ఫయాజ్, సంయుక్త కార్యదర్శులు కాలేషా, రహీమ్, అక్బర్ పాల్గొన్నారు.

ర్యాలీగా వస్తున్న ముస్లిం ఐక్య వేదిక సభ్యులు

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

వెంకటగిరి: రాణిపేటలోని బాలసదనంలో మంగళవారం రాత్రి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామ్మోహన్ మాట్లాడుతూ సత్యసాయిబాబా 100వ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

రేషన్ దుకాణం తనిఖీ

పెళ్లకూరు: పెన్నేపల్లి గ్రామంలో రేషన్ డీలరు దుకాణాన్ని మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచలంరాజు, తహసీల్దారు హరికృష్ణలు కలిసి తనిఖీ చేశారు. పంపిణీ రికార్డులు, సరకుల నిల్వలను పరిశీలించారు.

కాళంగి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

సూళ్లూరుపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంగళవారం కేవీబీ పురం వద్ద ఉన్న కాళంగి రిజర్వాయర్‌లో అయిదు గేట్లను మూడు అడుగుల మేర పైకి ఎత్తి 1,890 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కాళంగి పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలం పరిసర లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మెరుగైన నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్తు

దొరవారి సత్రం, న్యూస్‌టుడే: విద్యార్థులు మెరుగైన నైపుణ్యాభివృద్ధిని కలిగి ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.తిరుపతయ్య అన్నారు. స్థానిక పాఠశాలకు చెందిన 9, 10 వ తరగతి విద్యార్థులు ఐటీ, వ్యవసాయ కోర్సుల్లో మెరుగైన నైపుణ్యాలను పొంది జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని మొదటి స్థానం దక్కించుకున్నారని వెల్లడించారు. మొదటి స్థానం సాధించిన వినోద్, హరి, యశ్వంత్, భార్గవ్, చెంచు చరణ్, జాషువ, తనుష్, సుశాంత్‌లను మంగళవారం స్థానిక పాఠశాలలో అభినందించారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

చెదిరిన కోటవాసుల కల

▶ రూర్బన్ పంచాయతీగా ఎంపిక

గూడూరు గ్రామీణం-కోట, న్యూస్‌టుడే: అయిదేళ్ల కిందట కోట మేజర్ గ్రామ పంచాయతీని నగర పంచాయతీగా పురపాలక స్థాయిలో చేయాలని అప్పటి వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. చివరకు పాలకుల సమ్మతి లేకపోవడంతో ప్రతిపాదనల దశలోనే ఆగిపోయింది. ప్రస్తుతం పట్టణ వసతులతో కూడిన రూర్బన్ పంచాయతీగా ఎంపిక చేస్తూ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. నగర పంచాయతీ అయ్యేందుకు అన్ని అవకాశాలు ఉండి ఏర్పాటు చేయకపోవడంపై చర్చనీయాంశంగా మారింది.

అభివృద్ధి పనులివే

నగర పంచాయతీ ఏర్పాటు జరిగి ఉంటే పురపాలిక స్థాయిలో రోడ్లు, మురుగునీటి వ్యవస్థ, వీధి దీపాలు, రోడ్ల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగి ఉండేవి. రూర్బన్ పంచాయతీగా ఎంపిక చేయడంపై స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నియామకాలివే

మేజర్ పంచాయతీని రూర్బన్ పంచాయతీగా ఏర్పాటు చేస్తారు. ఇందులో పట్టణంలో ఉన్న మౌలిక వసతులు కల్పించేలా అధికారులు ప్రణాళికలు వేస్తారు. ప్రణాళిక విభాగం, పంచాయతీకి ఓ ప్రత్యేక అధికారి (డిప్యూటీ ఎంపీడీవో), ఇంజినీరింగ్ అధికారులు, అలాగే ప్రత్యేక కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బంది నియామకం వంటివి చేపడతారు. కార్యాలయం గ్రామ సచివాలయానికి సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంటుంది.

కోట పట్టణం

వివరాలిలా..
మేజర్ గ్రామ పంచాయతీ - కోట
జనాభా- 16 వేలు వార్డులు- 16
ఏటా రాబడి- రూ.కోటి(అన్నీ కలిపి)

గతంలోని ప్రతిపాదనలు

నగర పంచాయతీ పరిధిలో కోట పంచాయతీతో పాటుగా తిమ్మనాయుడుపాలెం, జరుగుమల్లి, కొత్తపాలెం, వెంకన్నపాలెం, చెందోడు, తిన్నెలపూడి, కొక్కుపాడు, వాకాడు పంచాయతీలను కోట నగర పంచాయతీలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను గతంలో ముందుకు తెచ్చారు. అన్నింటితో కలిపి నగర పంచాయతీగా ఏర్పాటు చేస్తే కోట, విద్యానగర్ మహా పట్టణాలుగా అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. ఈ విషయమై గూడూరు డీఎల్‌డీవో వాణిరెడ్డిని వివరణ కోరగా రూర్బన్ పంచాయతీగా ఎంపిక చేశారని ప్రతిపాదనలు పంపామన్నారు.

వివాహిత ఆత్మహత్య

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు పాత గిరిజన కాలనీకి చెందిన వివాహిత వెందోటి భవాని(32) సోమవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లోని నీటి తొట్టెలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగబాబు తెలిపారు. ఎస్సై కథనం మేరకు వాకాడులోని బండి పోలయ్య కుమార్తె భవానికి ఓజిలి మండలం చిల్లమానుచేనుకు చెందిన వెందోటి మహేష్‌తో 12 ఏళ్ల కిందట వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్య భర్తల మధ్య కలహాలు రావడంతో నాలుగు రోజుల కిందట కుమార్తెను తీసుకొని ఆమె పుట్టింటికి వచ్చేసింది. మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని వేముగుంటపాళానికి చెందిన బల్లి మల్లికార్జునకు నెల్లూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి సుమ మంగళవారం మూడేళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించారు. 2021లో మల్లికార్జున బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. తర్వాత చిత్రాలను నెట్‌లో పెడతానని, తన కోరిక తీర్చాలని బెదిరించడంతో అప్పటి ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

శిథిలావస్థలో తుపాను పునరావాస కేంద్రాలు

✦ కొరవడిన భవనాల నిర్వహణ

నాయుడుపేట, సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విపత్తుల సమయంలో తీర ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించేందుకు గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్లలో కేంద్ర విపత్తుల శాఖ తుపాను పునరావాస కేంద్ర భవనాలు నిర్మించింది. వీటి నిర్వహణపై పర్యవేక్షణ కొరవడటంతో సగం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విపత్తుల సమయంలో తలదాచుకునే అవకాశం లేకుండా పోతోంది. కేంద్రం 25 ఏళ్ల క్రితం తీరంలో తుపాను తాకిడి అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇక్కడ రెండు అంతస్తుల బహుళ ప్రయోజనాల భవనాలు నిర్మించింది. వాతావరణ శాఖ ప్రమాద హెచ్చరికలు జారీ చేయగానే అధికార యంత్రాంగం తీర ప్రాంత ప్రజలను ఇక్కడకు తరలించి భోజన వసతి కల్పిస్తారు.

కారజాతలో దుస్థితికి చేరిన తుపాను పునరావాస కేంద్ర భవనం

వివరాలిలా..
తీర ప్రాంత గ్రామాలు: 70
తుపాను ప్రభావిత గ్రామాలు: 58
పునరావాస భవనాలు: 54
శిథిలావస్థకు చేరినవి: 48

దెబ్బతిన్నవి ఎక్కడంటే

చిల్లకూరు మండలంలో అద్దెపల్లి, మోమిడి, మన్నేగుంట తమ్మినపట్నం, తూర్పుకనుపూరు, కొమరవారిపాళెం, పునుగుంటపాళెం, లింగవరం కోట మండలం దైవాలదెబ్బ, కర్లపూడి, శ్యామసుందరపురం, గొందపల్లి, వాకాడు మండలం తూపిలిపాళెం, అందలమాల, చెంబేటివారిపాళెం, చీమలపాడు, దొరవారిసత్రం మండలం కారికాడు, వేలికాడు, సూళ్లూరుపేట మండలం కుదిరి, కేసి.ఎన్‌గుంట, కొరడి కడపత్ర ఉలసపాడు, చిట్టమూరు మండలం పిట్టువానిపల్లె, జక్కలవానిగుంట, పల్లంపర్తి, బుదరగాలి కొత్తపాళెం గ్రామాల్లో తుపాను పునరావాస కేంద్రాలకు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విపత్తుల సమయంలో తీర ప్రాంత ప్రజలను పాఠశాలలు, సచివాలయ భవనాల్లోకి తరలిస్తున్నారు.

అంచనాలు సిద్ధం

తుపాను తాకిడి అధికంగా ఉన్న మండలాల్లో ఏటా అక్టోబరు నెలలో తహసీల్దారు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన మండల సైక్లోన్ కమిటీ సమావేశం నిర్వహించి వరద ప్రాంతాల్లో ఏర్పాట్లపై చర్చించి కలెక్టర్‌కు ప్రణాళికను పంపుతారు. దీని ఆధారంగా విపత్తులను ముందస్తుగా గుర్తించి ఎదుర్కొనేందుకు మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేస్తారు. దీనిపై పీఆర్ గూడూరు ఈఈ, రమణయ్య మాట్లాడుతూ తుపాను భవనాల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు

(c) eenadu

'అఖండ-2' సందడి

వేదికపై బాలకృష్ణ, బోయపాటి శ్రీను

విశాఖ నగరంలో 'అఖండ-2' చిత్ర బృందం సందడి చేసింది. ప్రముఖ కథానాయకుడు బాలకృష్ణ ఈ చిత్రంలో చేసిన పాత్రపై ఇప్పటికే అంచనాలు భారీగా పెరిగాయి. 'అఖండ' భారీ విజయం నేపథ్యంలో ఈ చిత్రం వీక్షించేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చిత్రంలో ఓ గీతాన్ని సాగర తీర నగరంలో మంగళవారం రాత్రి విడుదల చేశారు. అభిమానుల సమక్షంలో ఈ కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. హీరోయిన్ సంయుక్తామేనన్, దర్శకుడు బోయపాటి శ్రీను అభిమానులతో ముచ్చటించారు. -న్యూస్‌టుడే, జగదాంబకూడలి

మాట్లాడుతున్న సంయుక్తామేనన్

ఐటీ ఉద్యోగాల పేరిట మోసం | 8వ పేజీ

తెలుగు రాష్ట్రాల తరఫున ప్రాతినిధ్యం

సాగరనగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీలో బీ-ఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, ఎన్‌సీసీ క్యాడెట్ ఆకాంక్ష అఖిల భారతస్థాయిలో నిర్వహించిన ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో తెలుగు రాష్ట్రాల తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటింది. ★ దేశంలోని 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల నుంచి 400 మంది క్యాడెట్లు మేఘాలయ ఎన్‌సీసీ బెటాలియన్ నిర్వహించిన శిబిరంలో పాల్గొన్నారు. ఇందులో వివిధ రాష్ట్రాల సంస్కృతులపై అధ్యయనం చేయడంతో పాటు క్రీడా, చిత్రలేఖనం, బృందగాన పోటీల్లో ఆకాంక్ష సత్తా చాటింది. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంలో గీతం ఎన్‌సీసీ విభాగం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వీసీ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఆశీళ్ల వసూలుకు ఆశీస్సులు ఎవరివో?

వేలం పాటలు ఆగిపోతున్నాయ్:

జీవీఎంసీ ఆదాయానికి గండి

కుర్పుపాలెం(?), న్యూస్‌టుడే: టెండరులో లేని అంశాలకు కూడా గుత్తేదారు 'రోడ్డు మార్జిన్ ఆశీళ్లు' వసూలు చేస్తుంటే... సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్న వైనం జోన్-6 పరిధిలో చర్చనీయాంశమవుతోంది.

ఏం జరిగిందంటే: 2025-26 సంవత్సరానికి శ్రీ వెంకట గోవింద సత్య ఇంజినీరింగ్ సంస్థ జోన్-6 పరిధిలో రోడ్డు మార్జిన్ ఆశీళ్ల వసూలుకు 9 నెలల కాలానికిగాను రూ. 1,35,75,000లకు టెండరు దక్కించుకుంది. జీఎస్టీ, సెస్సు కలిపి రూ.1,64,41,875 జీవీఎంసీకి చెల్లించాలి.

ఏం చేశారంటే: రూ.45లక్షలు మాత్రమే చెల్లించారు. దీనికి తోడు ఆశీలు పాట మొత్తంలో 3/4వంతు బ్యాంకు గ్యారంటీ సమర్పించడంతో పాటు అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ నిమిత్తం బిడ్ మొత్తంపై 2 శాతం అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉండగా.. ఈ నిబంధన పాటించకుండానే ఆశీళ్ల వసూళ్లు మొదలెట్టేయడం.

చేతులెత్తేసిన అధికారులు: జీవీఎంసీ అక్టోబరు 15 నుంచి నవంబరు 5 వరకు మాత్రం ఆశీలు వసూలు చేసి తర్వాత చేతులెత్తేసింది. మళ్లీ పాత గుత్తేదారే రంగంలోకి దిగి వసూళ్లపర్వం కొనసాగించారు. ★ సుమారు 4 నెలలు గుత్తేదారు అనధికారికంగా ఆశీళ్లు వసూలు చేసి జీవీఎంసీ ఆదాయానికి గండికొట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నోటీసులిచ్చినా..: గుత్తేదారు నిబంధనలు పాటించని విషయమై ఆలస్యంగా గుర్తించిన జీవీఎంసీ రెవెన్యూ అధికారులు 30-08-25న నోటీసు జారీచేశారు. ఇవి అందిన 3 రోజుల్లో నిబంధన ప్రక్రియ పూర్తి చేయకపోతే టెండరు రద్దవుతుందన్నారు. అంటే సెప్టెంబరు 2తో టెండరు రద్దు కావాలి. అప్పటి నుంచి గుత్తేదారు సంస్థ చేస్తున్న ఆశీళ్ల వసూళ్లు ఆపేయాలి. కానీ అది జరగలేదు.

కొత్త గుత్తేదార్ల కోసం గతనెల 17, 22, ఈనెల 12 తేదీల్లో జరగాల్సిన టెండరు ప్రక్రియ వాయిదా పడింది. మళ్లీ ఈనెల 18న ముహూర్తం నిర్ణయించగా అది కూడా సాగలేదు. దీంతో ఇలా ఎందుకు వాయిదా పడుతుందనే ప్రశ్నలు తలెత్తున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' ఆర్.ఒ. రామనారాయణ వివరణ కోరగా.. ఇప్పటి సూపరింటెండెంట్, గుమస్తా చూసుకుంటారన్నారు. ★ గుమస్తా వద్ద టెండరు రద్దు విషయం ప్రస్తావించగా.. పై నుంచి ఆర్డరు తెచ్చుకున్నారన్నారు. ఆర్డరు ఎవరిచ్చారనగా సమాధానం చెప్పలేక పోయారు. దీంతో అంతటా అనుమానాలు రేగుతున్నాయి.

ఆపత్కాలంలో ఆత్మరక్షణగా..!

కర్రసాములో శిక్షణ పొందుతున్న చిన్నారులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: సమాజంలో అఘాయిత్యాలు పెరిగిపోవడంతో తమను తాము రక్షించుకునేందుకు ఆత్మరక్షణ విద్యపై ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా బాలికలు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఈ అంశాన్ని గుర్తించిన పీఎంపాలెం ప్రాంతానికి చెందిన యువతులు జె.పి.లీసా(?), లినియా(?) కర్రసాములో పలువురు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వీరు పీఎంపాలెం ఆరి బస్టాప్ సమీప షిప్‌యార్డు లేఅవుట్‌లోని యోగామీద(?) పార్కులో మెలకువలు నేర్పిస్తున్నారు. కవలలైన వీరిద్దరు పదేళ్ల వయసులోనే కర్రసాము, కరాటేలో శిక్షణ తీసుకున్నారు. ప్రాచీన సంప్రదాయ క్రీడగా గుర్తింపు కలిగిన కర్రసాము వల్ల శరీరానికి మంచి వ్యాయామం లభించడంతో పాటు కండరాలు బలపడతాయని, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ తదితర ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతున్నారు.

అలలపై అలా... గాలిలో తేలేలా

రుషికొండ తీరంలో పర్యాటకులకు ఎప్పటికప్పుడు సరికొత్త అనుభూతి కలిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న 'పారా మోటరింగ్' సందర్శకులను ఆకట్టుకుంటోంది. పచ్చని కొండల చెంతన... నీలి సాగర అలలపైన తేలియాడుతూ సందడి చేస్తున్నారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో 'అడ్వెంచర్ టూరిజం' సదుపాయాలు పెంచాలన్నది అధికారుల ప్రణాళిక. వాతావరణ పరిస్థితుల అనుకూలతనుబట్టి ప్రతి రోజు పారామోటరింగ్ నిర్వహిస్తున్నారు. –ఈనాడు, విశాఖపట్నం

నిషా తలకెక్కి.. వేగంతో రోడ్డెక్కి!

ఈనాడు-విశాఖపట్నం: నగరంలో సరాసరిన రోజుకు ఒకరు చొప్పున రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు. మద్యం మత్తులో అతివేగంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారే ఎక్కువగా ఉండటం కలవరపెడుతోంది. మద్యం తాగి స్పృహలేకుండా వాహనాలు నడిపి ఇతరులనూ ప్రమాదాల్లో పడేస్తున్నారు. వీరిని కట్టడిచేసేందుకు సాగాల్సిన తనిఖీలన్నీ నామమాత్రంగా జరుగుతున్నాయి.

మద్యం మత్తులో ప్రమాదాల బారిన	ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
	2022	1,353	358	1,273
	2023	1,180	324	1,224
	2024	1,094	335	1,125
	2025 (అక్టోబర్ వరకు)	1,045	274	564

నామమాత్రంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఇలా..

2022	2023	2024
9,667	21,376	33,707

2025 – సుమారు 21వేలకు పైగా (అక్టోబర్ వరకు)

మత్తే కారణం: ద్విచక్రవాహనాలు డివైడర్లను ఢీకొని పడిపోయినా... ఎదురెదురుగా వాహనాలు ఢీకొట్టుకున్నా... ఆగిన వాహనాలను వెనుక నుంచి బలంగా ఢీకొట్టినా... పాదచారులపైకి దూసుకెళ్లినా... ఇలా చాలా ప్రమాదాల్లో మద్యం మత్తు కారణమని పోలీసులు గుర్తిస్తున్నారు. నగరంలో రాత్రిళ్లు చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో 50 శాతంపైగా మద్యం మత్తులో జరుగుతున్నవే.

మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు లేని అక్కయ్యపాలెం కూడలి

అలాగేనా.. తనిఖీలు?: నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పెరుగుతున్నా అవి మొక్కుబడిగా సాగుతున్నాయి. కొందరు సిబ్బంది మద్యం తాగి బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయడంపైనా ఫిర్యాదులందుతున్నాయి. ఇంకొందరు తనిఖీల్లో కాసులవేట(?) సాగిస్తున్నారు. బార్లకు సమీప సర్వీసు రోడ్లలో తనిఖీల పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అక్కయ్యపాలెం సిగ్నల్ వద్ద రాత్రి సమయాల్లో కొందరు ట్రాఫిక్ పోలీసుల తీరు దారుణంగా ఉంది. తొలుత హెల్మెట్ తీయించి బ్రీత్ అనలైజర్ టెస్టులు చేయడం, మద్యం తాగలేదని తేలితే.. ఆ వెంటనే మరో కానిస్టేబుల్ హెల్మెట్ లేదంటూ ఫొటోలు తీసి హడావుడి చేస్తున్నారు. ఈ విషయంపైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.

యువతకు పిలుపు... అదిగో గెలుపు!

సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ

ఈనాడు, విశాఖపట్నం: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసు ప్రిలిమినరీ పరీక్ష-2026కు డా. బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు చేసిన వారికి ముందుగా పరీక్ష నిర్వహించి వంద మందిని ఎంపిక చేయనున్నారు. శిక్షణలో స్టడీ మెటీరియల్ అందజేస్తారు.

శిక్షణ సబ్జెక్టులు ★ జనరల్ స్టడీస్ పేపర్-1 ★ సీఎస్‌ఏటీ పేపర్-2

అర్హతలు ఇవి : జిల్లాకు కేటాయించిన సీట్లు : 100(ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ, జనరల్ కోటా ప్రకారం తీసుకుంటారు)

★ గిరిజన శాఖ ద్వారా 20 సీట్లు ప్రత్యేకంగా ఎస్టీలకు కేటాయిస్తారు.

★ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ★ కుటుంబ వార్షిక ఆదాయం రూ. 8 లక్షలకు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

★ ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

★ ఈ నెల 27 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి.

★ 30.11.25న విశాఖలో ఓఎంఆర్ బేస్డ్ స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. ★ డిసెంబరు 10 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తారు.

దరఖాస్తు ఇలా: apstudycircle.apcfss.inలో తగినధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి.

మహిళను కాపాడింది ఆ నోట్లే

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నగదు లావాదేవీల వ్యవహారంలో కిడ్నాప్‌కు గురైన పీఎంపాలేనికి చెందిన కె.ప్రమీల కేసులో ఆశ్చర్యకర విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులు ఆమెను పీఎంపాలెంలో కిడ్నాప్ చేసి గోపాలపట్నంలోని వారి ఇంటికి తీసుకెళ్లి చితకబాదడం, ఆ దెబ్బలు తట్టుకోలేక తిరిగి ఇంటికి తీసుకెళ్తే డబ్బులు ఇస్తానని చెప్పడం తెలిసిన విషయమే. ఈ క్రమంలో నిందితులంతా ఆదివారం రాత్రి 12 గంటలకు ఆమెను పీఎంపాలెంలోని నివాసానికి తీసుకొచ్చారు. దీంతో ఆమె గదిలోకి వెళ్లి పిల్లలు ఆడుకునే నగదు కట్టలు కొన్ని తెచ్చి వారికి అందించింది. వారు వాటిని లెక్క పెడుతున్న సమయంలో అక్కడి నుంచి తెలివిగా తప్పించుకుని సోమవారం ఉదయం పోలీసులను ఆశ్రయించింది. కిడ్నాప్ ఉదంతాన్ని వివరించడంతో పాటు తప్పించుకోవడానికి తాను ఇచ్చిన నోట్ల కట్టల వ్యవహారం తెలియజేసింది.

నిందితుల నుంచి తప్పించుకునేందుకు మహిళ ఇచ్చిన పిల్లలు ఆడుకునే నోట్లు

★ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంలో ప్రమీల ఇంట్లో నకిలీ నోట్లు ఉన్నాయని వాటిని చూపించి తమను మోసగించిందని చెప్పడంతో ....ఎస్సై డి.రాము, సిబ్బంది వెంటనే ఆమె ఇంటికి వెళ్లి నోట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అవి పిల్లలు ఆడుకునే నోట్ల కట్టలని తేలింది. నార్త్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎస్.అప్పలరాజు కేసు విచారిస్తున్నారు.

ఐటీ పార్క్‌లు.. డేటా సెంటర్లు!

విశాఖ కేంద్రంగా ప్రగతి పరుగులు

'నీతి ఆయోగ్' సారథ్యంలో ప్రణాళికలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్ర అభివృద్ధిలో విశాఖ కీలక పాత్ర పోషించనుంది. ఇటీవలి సీఐఐ భాగస్వామ్య సదస్సులో జరిగిన ఒప్పందాల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పెట్టుబడులకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. ఇదే సమయంలో 'విశాఖ ఎకనామిక్ రీజియన్' ముసాయిదాను 'నీతి ఆయోగ్' ప్రకటించి అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి నమోదయ్యేలా ప్రణాళికలు వివరించింది.

ఆలోచన ఇది: దేశంలో నగరాలు కేంద్రంగా సిటీ రీజియన్లను అభివృద్ధి చేస్తే అవి 'గ్రోత్ హబ్స్'గా మారి ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయాలను పెంచుతాయనేది 'నీతి ఆయోగ్' ఆలోచన. ప్రయోగాత్మకంగా ముంబయి, సూరత్, వారణాసి, విశాఖ నగరాలను ఇందుకు ఎంపిక చేశారు. విశాఖ కేంద్రంగా ఎనిమిది జిల్లాలను అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

ప్రధాన ప్రాజెక్టులు: నిర్దేశిత ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తే జిల్లా తలసరి ఆదాయం రెట్టింపు అవుతుంది. ప్రజల ఆదాయం, జీవనవ్యయం రెట్టింపు అవుతుందనేది ఆలోచన. ఇందులో భాగంగా విశాఖలో 500-1000 ఎకరాల్లో మల్టీ ప్రొడక్ట్ ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్. అలాగే అనకాపల్లి కేంద్రంగా స్టీల్, పెల్లెట్ యూనిట్ ఏర్పాటు చేస్తారు.

★ అనకాపల్లిలో రెండు వేల ఎకరాల్లో టెక్ హబ్.

★ 500 ఎకరాల్లో మెడ్‌టెక్ జోన్ అభివృద్ధి.

★ 500 ఎకరాల్లో ఆహార శుద్ధి పరిశ్రమ

★ 5 వేల ఎకరాల్లో అనకాపల్లిలో రక్షణరంగ ఉత్పత్తుల తయారీ యూనిట్.

విశాఖ ఐఐఎం సమీపంలో...

★ ఆనందపురం మండలం గంభీరం వద్దున్న ఐఐఎంకు సమీపంలో విద్యా-నైపుణ్యాల అభివృద్ధి, అంకురాల కేంద్రాన్ని 150 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. ★ ఆనందపురంలో 300 ఎకరాల్లో ఐటీ డేటా సెంటర్ హబ్. ★ విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్.

★ కాపులుప్పాడ వద్ద 500 ఎకరాల్లో ఐటీ, జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు) కేంద్రాల ఏర్పాటు.

★ మధురవాడ వద్ద భారీ విస్తీర్ణంలో ఐటీ పార్క్

వైజాగ్ బేసిటీ పేరుతో: పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేలా నగరాన్ని పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దనున్నారు. తొట్లకొండ, పావురాలకొండ బౌద్ధ సముదాయాలు, జల క్రీడలు, శిల్పారామం, కైలాసగిరి, తీర ప్రాంతం ఆధారంగా అభివృద్ధి చేయనున్నారు.

సీఈవో నియామకం తరువాత..: 'విశాఖ ఎకనామిక్ రీజియన్'తో జిల్లాతో పాటు మిగిలిన జిల్లాల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం. ఐటీ, పర్యాటక రంగాలతో జిల్లా దశ మారనుంది. ఇటీవల ముసాయిదా విడుదలయింది. ఎకనామిక్ రీజియన్ అథారిటీ ఏర్పాటుకానుంది. దానికి సీఈవోను నియమిస్తారు. అనంతరం ప్రాజెక్టుల అమలుపై దృష్టిసారిస్తారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ సమన్వయకర్తగా ఉంటారు' అని కలెక్టర్ **హరేంధిర ప్రసాద్** పేర్కొన్నారు.

నేడు అనంతుని దీపోత్సవం



సిద్ధమైన గిరి మెట్ల మార్గం

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువై ఉన్న అనంత పద్మనాభ స్వామివారి కొండ మెట్ల దీపోత్సవం బుధవారం జరగనుంది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నేతృత్వంలో ఈనెల 5న నిర్వహించిన సన్నాహక సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేయగా సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశారు. మధ్యాహ్నం 3.30గంటల తర్వాత స్వామి వారి ఉత్సవమూర్తులను తొలిపావంచా వద్దకు తోడ్కొని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు తొలి పావంచా వద్ద దీపాలు వెలిగించడంతో దీపోత్సవం ప్రారంభమవుతుంది.

'మా వద్ద రూ. 3కోట్లున్నాయి.. మీవే తీసుకోండి!'

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: సౌత్ ఈస్టర్న్, సౌత్ ఈస్ట్ సెంట్రల్, ఈస్ట్ కోస్ట్ రైల్వే కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్(అర్బన్ బ్యాంక్) ఖాతాదారుల్లో మరణించిన, క్లెయిమ్ చేయని డిపాజిట్లను తిరిగి పొందేందుకు తమ బ్రాంచ్‌లను సంప్రదించాలని సంస్థ వైస్ ఛైర్మన్ మంగా రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల తమ 12 బ్రాంచుల్లో ఆడిటింగ్ నిర్వహించిన అనంతరం 2002-2022 మధ్య క్లెయిమ్ చేయని సొమ్ము సుమారు రూ.3 కోట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని సంబంధిత ఖాతాదారుల కుటుంబ సభ్యులకు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అర్హులు సంబంధిత పత్రాలతో నేరుగా బ్రాంచ్‌లను సంప్రదిస్తే ఎవరి సొమ్ము వారికి అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మరిన్ని వివరాలకు తమ శాఖలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలను 'తొక్కేద్దాం'

మాదక ద్రవ్యాల అనర్థాలను వివరిస్తూ పోలీసు సిబ్బంది పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం పరవాడలోకి ప్రవేశించింది. సీఐ మల్లికార్జునరావు వారికి స్వాగతం పలికి ర్యాలీలో పాల్గొన్నారు. యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. మహిళలు కోలాటమాడి, పూలుజల్లి యాత్రకు స్వాగతం పలికారు. – న్యూస్‌టుడే, పెందుర్తి

అన్నదాతలకు ఆర్థిక భరోసా..!

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను బుధవారం ప్రభుత్వం విడుదల చేయనుందని వ్యవసాయ శాఖ జేడీ అప్పలస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పీఎం కిసాన్ కింద 16,769 మంది లబ్ధిదారులకు రూ. 3.35 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద 18,573 మందికి రూ.9.28 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. ఒక్కో లబ్ధిదారు ఖాతాకు రూ.7 వేల చొప్పున జమ అవుతాయన్నారు.

'ఒకటి'కి 'రెండు'సార్లు చూడాల్సిందే..!

నేడు 'వరల్డ్ టాయిలెట్స్ డే'

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖలో వివిధ పనుల నిమిత్తం, పర్యాటక ప్రాంతాల సందర్శనకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. వారితో పాటు, నగర ప్రజలకు బహిరంగ ప్రదేశాల్లో అవసరమైన మరుగుదొడ్లను సమకూర్చి, వాటిని రోజూ శుభ్రం చేయాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉంది. కానీ, శుభ్రత విషయంలో నిర్లక్ష్యధోరణి కనిపిస్తోంది. నేడు 'వరల్డ్ టాయిలెట్స్ డే' సందర్భంగా పరిస్థితిని పరిశీలించగా ఇలా ఉంది.

ఇదీ పరిస్థితి...!

- 2019లో కేంద్ర నిధులతో రెల్లివీధి, జాలారిపేట, అల్లిపురం, కొబ్బరితోట, ఆరిలోవ, సాగర్‌నగర్ తదితర కాలనీల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించారు.
- గాజువాక, పెందుర్తి, భీమిలి, మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో ఇంకా కొన్ని నిర్మించాల్సి ఉంది.

పెదగంట్యాడలో అరకొర శుభ్రతతో ఉన్న ప్రజా మరుగుదొడ్డి

అపరిశుభ్రతే అసౌకర్యం: జీవీఎంసీ నిర్మించిన మరుగుదొడ్లలో వృద్ధులు, దివ్యాంగుల వినియోగానికి వీలుగా ఏర్పాటు చేసినా.. వాటిల్లో చాలా చోట్ల శుభ్రత లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు.

★ నిర్వహణ బాధ్యతలు దక్కించుకున్న వారు నిత్యం వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారే గాని, శుభ్రతపై శ్రద్ధ చూపడం లేదనే ఫిర్యాదులొస్తున్నాయి.

నగరంలో:		
సామాజిక, ప్రజా మరుగుదొడ్లు: 216	2019 స్వచ్ఛభారత్ మిషన్‌లో నిర్మించినవి : 92	మురికివాడల్లో నిర్మించినవి: 60

సిబ్బందిని అప్రమత్తం చేస్తాం..: నగరంలో ప్రజా మరుగుదొడ్ల శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో నిత్యం శుభ్రత పనులు చేపట్టేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.

–డాక్టర్ నరేశ్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి, జీవీఎంసీ

ప్రజల చెంతకే 'పుర' సేవలు

'యాప్' వినియోగిస్తే ప్రయోజనాలెన్నో!

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో 'పురమిత్ర' యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మున్సిపల్ శాఖ సంచాలకుడు, కమిషనర్ నేరుగా యాప్‌ను పర్యవేక్షిస్తుండటంతో, అధికారులు పెండింగ్ సమస్యల్ని త్వరగా పరిష్కరించి, సంబంధిత సమాచారాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేయాల్సి ఉంటుంది.

★ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఇప్పటికే జీవీఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. ఫిర్యాదుల సమాచారమే కాకుండా, ఇతర సేవలు పొందే వీలు ఉండటంతో యాప్ వినియోగం పెరిగింది. యాప్‌లో వివరాలు నమోదు చేయగానే, జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందిస్తున్నారు.

డౌన్‌లోడ్ ఇలా: మొబైల్‌ఫోన్‌లో ప్లే స్టోర్‌లోకి వెళ్లి **pura mitra** యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ సమయంలో ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసి, వినియోగించుకోవచ్చు. ఫిర్యాదులకు కార్యాలయాలకు వెళ్లకుండా ఇందులోనే తెలియజేయొచ్చు.

సేవలు ఇలా: ఆస్తి పన్ను చెల్లింపు, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపు, నీటి ఛార్జీలు చెల్లింపు, యూజీడీ, నీటి సరఫరా కుళాయిల కనెక్షన్ దరఖాస్తు, వ్యాపార లైసెన్స్ దరఖాస్తు, ప్రకటనల పన్ను చెల్లింపు, వివాహ రిజిస్ట్రేషన్ వంటి సేవలు పొందవచ్చు.

ఫిర్యాదు చేయొచ్చు: ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక, యూసీడీ, పరిపాలన, ఇంజినీరింగ్, వీధి దీపాలు, ఖాళీ స్థలాల పన్ను, పాఠశాలల మరుగుదొడ్లు, అనధికారిక వధశాలలు, భవన నిర్మాణ వ్యర్థాలు, కాలువల్లో పూడికలు, బయో మెడికల్ వ్యర్థాలు, యూజీడీ, వీధి కుక్కలు, పారిశుద్ధ్య కార్మికుల గైర్హాజరు వంటి సమస్యలపై యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

అమ్మవారి దర్శన వేళల్లో మార్పులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు ఈవో కె.శోభారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ★ ఈనెల 27, డిసెంబరు 4, 11 తేదీల్లో... తెల్లవారుజాము 2.30 గంటల నుంచి ఉదయం 11 వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 వరకు, సాయంత్రం 7 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్మవారిని దర్శించుకోవచ్చు. ★ డిసెంబరు 18న తెల్లవారుజాము 2.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు, సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు దర్శనాలు ఉంటాయి. ★ మిగిలిన రోజుల్లో ఉదయం 6 నుంచి 8 వరకు, 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 12.45 నుంచి సాయంత్రం 5.30 వరకు, రాత్రి 7 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు దర్శనాలు ఉంటాయి. ★ ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు అష్టదళ పాదపద్మారాధన, సహస్ర తులసీ పూజ, ఆయుష్‌హోమం, లక్ష కుంకుమ, లక్ష పసుపు కొమ్ముల పూజలు నిలిపేస్తున్నట్లు తెలిపారు.

అనంతుని దీపోత్సవం ఏర్పాట్ల పరిశీలన

సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

పద్మనాభం, న్యూస్‌టుడే: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ శంఖబ్రత బాగ్చీ సిబ్బందికి ఆదేశించారు. బుధవారం జరగనున్న శ్రీ అనంత పద్మనాభ స్వామివారి కొండ మెట్ల దీపోత్సవ ఏర్పాట్లను ఆయన మంగళవారం రాత్రి పరిశీలించారు. పద్మనాభం జంక్షన్ రోడ్డు నుంచి తొలి పావంచా వరకు ఉన్న మార్గాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎవరికైనా భక్తులకు గుండె సంబంధ అనారోగ్య సమస్యలు వస్తే తక్షణమే వైద్య సహాయం అందించే కార్డియో వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని, కొండ మెట్ల మార్గంలో స్ట్రెచర్ అందుబాటులో ఉంచాలని మండల వైద్యాధికారి ఎ.లీలాప్రసాద్‌కు సూచించారు. విద్యుత్ తీగల వల్ల ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఏఈ జగన్మోహనరావుకు ఆదేశించారు. మెట్ల మార్గంలో చీకటి ఉన్న చోట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రధాన మెట్లకు అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ మణికంఠ, ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, స్థానిక నాయకులు కోరాడ్ల దామోదరరావు, కాళ్ల నగేష్‌కుమార్, కె.ఎర్రయ్యయుడు, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సురేష్, ఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత శిక్షణ

అల్లిపురం, న్యూస్‌టుడే: నగరంలోని దాబాగార్డెన్స్ సమీప అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 26వ తేదీ నుంచి ఉద్యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ట్రస్టు నిర్వాహకులు ఉప్పలపాటి పద్మనాభరాజు పేర్కొన్నారు. మంగళవారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రూప్-1, -2, రైల్వే, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఏపీ అన్ని పోలీసు ఉపాధ్యాయ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తామన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు జి.ఎస్.రాజేశ్వరరావు, కె.అభిమన్యు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ప్రభుత్వ న్యాయవాదిగా అప్పలనాయుడు నియామకం

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: విశాఖలోని జిల్లా సీనియర్ సివిల్ న్యాయస్థానాల ప్రభుత్వ న్యాయవాదిగా నగరానికి చెందిన కమ్మర అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయ, శాసన, వ్యవహారాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా న్యాయస్థానాల్లో దాఖలయ్యే అన్ని సివిల్ కేసుల్లో ఆయన ప్రభుత్వం తరఫున వాదిస్తారు. 16ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్న అప్పలనాయుడు పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు న్యాయసలహాదారునిగా సేవలు అందించారు. ఆయన నియామకంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్.పాల్పారేశ్వరుడు, తదితరులు హర్షం ప్రకటించారు.

భజన మందిరాలకు నిధులిస్తాం..!

దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ వెల్లడి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో భజన మందిరాల (బీఎం) ఏర్పాటుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయశాఖ విశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తిరుమల, తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు సమకూర్చుతామన్నారు. అర్హులైన వారు నెలాఖరులోగా నగరంలోని టర్నర్‌చౌల్ట్రీ ఆవరణలో ఉన్న దేవాదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ★ దరఖాస్తుల పరిశీలన నుంచి మందిరం నిర్మాణం పూర్తయ్యే వరకు దేవాదాయశాఖ కమిషనర్ పర్యవేక్షణ ఉంటుంది. ★ నిర్మాణ స్థలం లభ్యత, స్థల పరిస్థితుల ఆధారంగా భజన మందిరాలను మూడు రకాలుగా విభజించారు. టైప్-ఏ (రూ.10 లక్షలు), టైపు-బి (రూ.15 లక్షలు), టైపు-సీ (రూ.20 లక్షలు) చొప్పున నిధులు మంజూరు చేస్తారు.

విశాఖలో ఎన్నో సినిమాలు చేశా..!

సినీనటుడు నందమూరి బాలకృష్ణ


అప్పన్న ఆలయంలో కప్పస్తంభం వద్ద మొక్కుతున్న బాలకృష్ణ. చిత్రంలో దర్శకుడు బోయపాటి

జగదాంబకూడలి, సింహాచలం, ఎన్ఏడీ కూడలి, న్యూస్‌టుడే: విశాఖ వస్తే గొప్ప అనుభూతి కలుగుతుందని, ఇక్కడ ఎన్నో సినిమాలు చేశానని, నగరంతో విడదీయరాని బంధం ఉందని సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన నటించిన 'అఖండ-2' చిత్రంలోని ఓ పాటను మంగళవారం జగదాంబ థియేటర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... విశాఖ పర్యటనలో భాగంగా సింహాచలం నృసింహస్వామిని దర్శించుకున్నామన్నారు. సినిమాలో మొదటి పాటను దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో విడుదల చేయగా, రెండో పాటను రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖలో విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ సంయుక్తమేనన్, దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత గోపీ ఆచంట, గీత రచయిత శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో: బాలకృష్ణ మంగళవారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత రామ్ ఆచంటతో కలిసి ఆయన సింహగిరికి విచ్చేశారు. వారికి దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధ, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు సంప్రదాయ స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు. చిత్రబృందం సింహగిరిపై అతిథి గృహంలో మధ్యాహ్నం భోజనం చేసి వెళ్లారు.

అభిమానిపై ఆగ్రహం: విశాఖ విమానాశ్రయం నుంచి సింహాచలం వెళ్తుండగా ఓ అభిమాని మహిళలను తోసుకుంటూ రావడం, పెద్దగా కేకలు వేయడంతో బాలకృష్ణ అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానాశ్రయం లోపల కూడా బాలకృష్ణతో ఫొటో తీసేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా.. అతనిపై కూడా ఆగ్రహించినట్లు తెలిసింది.

అభిమానిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాలకృష్ణ

విశాఖ రేంజ్‌లోనూ అప్రమత్తం: డీఐజీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: విజయవాడ నగర శివారులోని కొత్త ఆటో నగర్‌లో ఓ భవనంలో మావోయిస్టులు పట్టుబడిన నేపథ్యంలో విశాఖ రేంజ్‌లోనూ అప్రమత్తంగా ఉన్నామని డీఐజీ గోపీనాథ్ జెట్టి చెప్పారు. నర్సీపట్నం డీఎస్పీ కార్యాలయం, మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా సహా ఆరుగురు మృతి చెందారన్నారు. అల్లూరి జిల్లాలో ఇటీవల కాలంలోనే రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయని గుర్తు చేశారు. మావోయిస్టుల కోసం రానున్న రోజుల్లోనూ కూంబింగ్ ఆపరేషన్లు కొనసాగుతాయని పేర్కొన్నారు. మావోయిస్టుల విముక్త ప్రాంతంలో అభివృద్ధికి ఇక ఆటంకాలు ఉండవని అభిప్రాయపడ్డారు. ఏవోబీలో గంజాయి సాగు, రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, డ్రోన్లతో నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో 2,500 మందిని అరెస్ట్ చేశామని, 65 మందిపై పీడీ చట్టం ప్రయోగించామన్నారు. ఆర్థిక సంబంధ నేరాలకు పాల్పడిన 14 మంది ఆస్తులను సీజ్ చేసినట్లు చెప్పారు.

మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఆస్ట్రేలియా బృందం షిప్‌యార్డు సందర్శన

షిప్‌యార్డు కవర్డ్ బిల్డింగ్ డాక్ వద్ద ఆస్ట్రేలియా, డిఫెన్స్, షిప్‌యార్డు అధికారులు

సింధియా, న్యూస్‌టుడే: హిందుస్థాన్ షిప్‌యార్డుని మంగళవారం దేశ రక్షణ వ్యూహాత్మక కౌన్సిల్, రక్షణ భద్రత సంస్థ, ఆస్ట్రేలియా వెస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధులు సందర్శించారు. నిర్మాణంలో ఉన్న 'డైవింగ్ సపోర్టు వెసల్' ప్రక్రియపై సంస్థ కార్పొరేట్ ప్లానింగ్ డైరెక్టర్ కమొడోర్ రాకేష్ ప్రసాద్ ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. భవిష్యత్తులో షిప్‌యార్డు విస్తరణ ప్రణాళికల్లో భాగంగా అండర్ వాటర్ టెక్నాలజీ, ఆధునిక మౌలిక వసతులపై దృష్టిసారిస్తున్నామని వారికి వివరించారు. వైస్ అడ్మిరల్ ఆధిర్ అరోరా (రిటైర్డ్), డాక్టర్ గౌరవ్ సైనీ, డాక్టర్ ట్రోయ్‌లీ బ్రౌన్, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని ఓర్వలేక... వైకాపా విమర్శలు'

మాట్లాడుతున్న గండిబాబ్జీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, వరదలా వస్తున్న పెట్టుబడులను చూసి వైకాపా ఓర్వలేక విమర్శలు చేస్తుందని విశాఖ లోక్‌సభ నియోజకవర్గం తెదేపా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. మంగళవారం ఆయన నగర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంపై విషం చిమ్ముతున్నారు. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఛీకొట్టినా.. ఆయనలో మార్పు రాలేదు. గూగుల్ ఏర్పాటుతో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని ప్రచారం చేస్తున్న వైకాపా నాయకులే.. ఆ సంస్థను తామే తీసుకొచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. కూటమిపై విమర్శలు చేస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, వైకాపా హయాంలో ఎన్ని పరిశ్రమలు తీసుకొచ్చారో చెప్పలేకపోతున్నారు. వైకాపా అసత్య ప్రచారాలను ప్రజలెవరూ నమ్మొద్దు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ కృషితో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు రాబోతున్నాయి.. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోంది' అని బాబ్జీ అన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న మరో టిప్పర్

సీటులో ఇరుక్కుపోయి ఏడు గంటలపాటు డ్రైవర్ నరకయాతన

ప్రమాద స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న టిప్పర్‌ను మరో టిప్పర్ బలంగా ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ సీటులో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఏడు గంటలపాటు శ్రమించి అతణ్ని సురక్షితంగా బయటకు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు కంకర లోడుతో వెళ్తున్న ఓ టిప్పర్ టైర్ పేలిపోవడంతో విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం రాంపురం వద్ద జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచారు. అదే సమయంలో ఫ్లైయాష్ లోడుతో వెళ్తున్న మరో టిప్పర్ అతి వేగంగా దాన్ని ఢీకొట్టింది. వెనకాల ఉన్న టిప్పర్ ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఆ వాహనంలో ఉన్న అనకాపల్లి జిల్లా వెంకన్నపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ డొక్కరి సాయికుమార్(30) ఎడమ కాలు సీటులో ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కట్టర్లతో టిప్పర్‌ను కత్తిరించడానికి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో పొక్లెయిన్‌ను తీసుకొచ్చి టిప్పర్లను వేరు చేయాలని చూశారు. ఎట్టకేలకు కొన్ని ప్రయత్నాల తర్వాత మధ్యాహ్నం 12.10 గంటలకు డ్రైవర్‌ను బయటకు తీసి అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్యం నిలకడగా ఉందని ట్రాఫిక్ ఎస్సై నరసింగరాజు తెలిపారు.

సీటులో ఇరుక్కుపోయి అవస్థలు పడుతున్న డ్రైవర్ సాయికుమార్

మహిళల భద్రతకు సమష్టిగా కృషి చేయాలి

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, చిత్రంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, వీసీ రాజశేఖర్ తదితరులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మహిళల భద్రత కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదని, వారి భద్రత కోసం అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ అన్నారు. 'సస్టైనింగ్ ఉమెన్ సేఫ్టీ-బెంచ్ మార్కింగ్ విశాఖపట్నం సక్సెస్ అండ్ ఫ్యూచర్ ప్రూఫింగ్ గవర్నెన్స్' అనే అంశంపై రాష్ట్ర మహిళా కమిషన్, ఏయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా ఏయూలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. మహిళా భద్రతపై జాతీయ స్థాయిలో నిర్వహించిన నారీ-2025 ఇండెక్స్‌లో జాతీయ స్థాయిలో విశాఖ నగరం ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విశాఖ నగరం మహిళా భద్రతకు ఎంతో సురక్షితమైన నగరంగా నిలవడం పట్ల ఆమె హర్షం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం విశాఖ ఎంతో 'సేఫ్ సిటీ' అని చెబుతుంటారని, ఈ నేపథ్యంలో మహిళల భద్రతకు ఇక్కడి విధానాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు.

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ విద్యతోనే ప్రతి మహిళకు పూర్తి స్థాయిలో భద్రత, భరోసా లభిస్తాయన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో మహిళల భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి కూడా మాట్లాడారు. ముందుగా వక్తలంతా దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులను నిర్వాహకులు జ్ఞాపికలతో సత్కరించారు. ఏయూ కళాశాలల పరిపాలనాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు బ్లాస్ట్ ఫర్నేస్‌లో తెగిపోయిన కన్వేయర్

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలోని బ్లాస్ట్ ఫర్నేస్-3కి ముడిసరకు సరఫరా చేసే కన్వేయర్ మంగళవారం తెగిపోయింది. దీంతో సుమారు మూడు రోజుల పాటు ఆ ఫర్నేస్‌లో ఉత్పత్తి నిలిచిపోనుంది. కర్మాగారంలో నిర్వహణ, క్లీనింగ్, పర్యవేక్షక సిబ్బంది లేకపోవడంతో ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ అన్నారు. దీని ప్రభావం ఎస్ఎంఎస్, కోకోవెన్, సింటర్ ప్లాంటు వంటి విభాగాలపై పడనుందన్నారు.

లక్ష్యాలతో జీతాలను ముడిపెట్టడంపై ఫిర్యాదు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తితో ముడిపెట్టి జీతాలు చెల్లిస్తాం అంటూ ఉక్కు యాజమాన్యం ఈనెల 15న విడుదల చేసిన ఉత్తర్వులు చట్ట విరుద్ధమని పేర్కొంటూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు ప్రాంతీయ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కార్మిక చట్టాల్లో ఎక్కడా లేని విధంగా ఇటువంటి ఉత్తర్వులు జారీచేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకునేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

గో మాంసం వ్యాపారంపై గంటా ఆరా

కోల్డ్ స్టోరేజీ వద్ద ఏసీపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, న్యూస్‌టుడే: కోల్డ్ స్టోరేజీలో ఆవు మాంసం నిల్వ పెట్టి వ్యాపారం సాగిస్తున్నవారు ఎంతటి వ్యక్తులైనా ప్రభుత్వం విడిచిపెట్టేది లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విశ్వ హిందూ పరిషత్తు సభ్యుల వ్యాఖ్యలతో మంగళవారం శొంఠ్యాంలోని శ్రీమిత్ర మైరైన్ కోల్డ్ స్టోరేజీని పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీ మిత్ర కోల్డ్ స్టోరేజీలో కొంతమేర మిష్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ఫరీద్, ఉమర్ అనే వ్యక్తులకు లీజుకు ఇచ్చారన్నారు. అయితే అందులో ఏమి నిల్వ పెడుతున్నారు, ఏమి జరుగుతుందో పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇంటెలిజెన్స్, విజిలెన్స్, పోలీసులు జాయింట్ యాక్షన్‌గా ఏర్పడి ఈ కేసును ఛేదించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కేసులో ఏ పార్టీకి చెందిన వ్యక్తులు ఉన్నా వదిలే ప్రసక్తి లేదన్నారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు కోల్డ్ స్టోరేజ్ యజమానికి పరిచయం ఉండటంతో వారిద్దరూ కలిసి ఉన్న ఫొటోలను వైరల్ చేస్తున్నారని, ఈ కేసుతో ఆ ఎమ్మెల్యేకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. స్థానిక కూటమి నాయకులు, మధురవాడ ఏసీపీ అప్పలరాజు, పోలీసులు పాల్గొన్నారు.

నేడు రోప్‌వేకు సెలవు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కైలాసగిరి రోప్‌వే కార్ల నిర్వహణ పనుల కారణంగా బుధవారం పర్యాటకులకు రోప్‌వే అందుబాటులో ఉండదని, గురువారం నుంచి యథావిధిగా పనిచేస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

శుద్ధమైన తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : గ్రామాల్లో, పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే తాగునీటికి నాణ్యత పరీక్షలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య కమిటీ సమావేశంలో మాట్లాడారు. నిత్యం తాగునీటి పరీక్షలతో పాటు ట్యాంకుల్ని శుభ్రం చేయాలని, క్లోరినేషన్ తప్పనిసరి అన్నారు. ప్రజా మరుగుదొడ్ల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడైన బోర్లకు మరమ్మతులు చేయించి, భూగర్భ జలాల స్థాయి పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ అధికారి శ్రీనివాస్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఏసీపీ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ఐటీ ఉద్యోగాల పేరిట మోసం

నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతంలోని ఓ ఐటీ సంస్థ ఉద్యోగాలు ఇస్తామని తమను నమ్మించి లక్షల్లో నగదు వసూలు చేసి మోసగించిందని పలువురు యువకులు మంగళవారం పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన పి.సాయికుమార్, జి.రమేష్, కె.చైతన్య గతేడాది డిసెంబర్‌లో సామాజిక మాధ్యమ లింక్ ద్వారా మధురవాడ మిధిలాపురి వుడాకాలనీలో ఉన్న 'వారుష్‌టెక్నాలజీస్' సంస్థ ఐటీ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆపై వారిని సంప్రదించడంతో విశాఖతో పాటు హైదరాబాద్, బెంగళూరుల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. మొదట మూడు నెలల శిక్షణా కాలంగా పరిగణించి నెలకు రూ.15 వేలు వేతనంగా అందిస్తామన్నారు. ఆపై వార్షిక వేతనాల ప్యాకేజీని వివరిస్తూ డిపాజిట్ రూపంలో రూ.2.4 లక్షలకు (రూ.75 వేలు), రూ.3 లక్షలకు (రూ.85 వేలు), రూ.3.8 లక్షలకు (రూ.లక్ష), రూ.4 లక్షలకు (రూ.1.50 లక్షలు), రూ.4.8 లక్షలకు (రూ.1.70 లక్షలు) చెల్లించాలన్నారు. దీంతో ముగ్గురు కలిసి ఒక్కొక్కరు రూ.3 లక్షల వరకు సంస్థ ఇచ్చిన బ్యాంకు ఖాతాలకు పంపించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఉద్యోగాలు కల్పించి వర్క్ ఫ్రంహోమ్ పేరుతో విధులు చేయించారు. మూడు నెలల పాటు ఉద్యోగం చేసినా ఒక్క నెల జీతం కూడా చెల్లించలేదన్నారు. దీంతో అనుమానంతో కంపెనీకి వచ్చి సీఈఓ వి.సాయికుమార్‌ను కలవగా బ్యాంకు ఖాతాల ఇబ్బందుల కారణంగా వేతనాల్లో జాప్యం జరిగిందని జవాబివ్వడంతో వారికి నమ్మకం కలగలేదు. ఈ క్రమంలో తాము కట్టిన డిపాజిట్ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో గడచిన మే నెలలో ఇస్తానని చెప్పినా ఇవ్వలేదు. మరోమారు గట్టిగా అడగడంతో సంతకం తప్పుగా రాసి చెక్ అందించాడు. చివరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సంబంధిత సంస్థపై గతంలోనూ పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సుమారు 135 మంది వరకు నిరుద్యోగులు ఈ సంస్థ బారిన పడినట్లు తెలుస్తోందన్నారు.

సంస్థల పేర్లు మార్చి వల..: వారుష్ టెక్నాలజీస్ సంస్థను నిర్వహిస్తున్న వి.సాయికుమార్ గతంలో 'వి టెక్నాలజీస్' పేరుతో కంపెనీ పెట్టి సుమారు 100 మందికి పైగా నిరుద్యోగులను మోసగించాడు. వైకాపా ప్రభుత్వ హయాంలో హిల్-2పై మొదట 'వి టెక్నాలజీస్' సంస్థను ఏర్పాటు చేశాడు. 2017లో ఏయూ వేదికగా అప్పటి వైకాపా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఉద్యోగ మేళాలో 'వి టెక్నాలజీస్' పేరుతో స్టాల్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు వల విసిరింది. అనతి కాలంలోనే దాదాపు 100 మంది నిరుద్యోగుల నుంచి రూ.కోట్లలో వసూళ్లు చేసి బోర్డు తిప్పేశారు. తిరిగి 2023లో మళ్లీ 'వారుష్ టెక్నాలజీస్' పేరుతో రంగ ప్రవేశం చేసి సుమారు 150 మంది నిరుద్యోగులను మోసగించినట్లు తెలుస్తోంది. ఎప్పటికప్పుడు మధురవాడలోని పలు ప్రాంతాల్లో సంస్థల చిరునామాలు మార్పులు చేస్తూ వచ్చాడు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

నోటీసు

మహారాజశ్రీ చోడవరం సివిల్ జడ్జివారి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.OP 30/2025

బిట్వీన్:- రొంగలి సురేష్ ...... పిటీషనరు
అండ్
రొంగలి (రంభ) హర్షిత .... రెస్పాండెంటు
To రెస్పాండెంటు
రొంగలి (రంభ) హర్షిత W/o సురేష్
D.No:7-36, సాయి గణేష్ కాలనీ,
మధురవాడ, విశాఖపట్నం

పై నెంబరు పిటీషనులో పిటీషనరు నీ నుండి విడాకులు కోరుచూ చోడవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు పిటీషను దాఖలు చేయగా, శ్రీ కోర్టువారు తే.2-12-2025దీకి వాయిదా వేసియున్నారు. ఆ దినం నీవు స్వయంగాకానీ, అడ్వకేట్ గారి ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి నీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్ననూ వచ్చి తెలియపర్చుకోవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు నీ పరోక్షమందు తదుపరి ఉత్తర్వులు జారీ చేయుదురు.

చోడవరం
తే.12-11-25
D. SIVAPRASAD
Advocate, Chodavaram

A.P. SAMAGRA SHIKSHA, VISAKHAPATNAM DISTRICT
DEPARTMENT OF SCHOOL EDUCATION
e-procurement Tender Notice

Tenders are invited from the Contractors for undertaking the renovation of the community hall in Ward No. 68, S.C. of Mindi village in the Visakhapatnam district for at an estimated cost of Rs.10.00 lakhs, MPLADS Grant. A short-term e-procurement tender has been invited.
These works are being tendered under short-term 'e' procurement.
Start Date: 19.11.2025 at 4.PM. Last date: 26.11.2025 upto 2.00 PM.
Note: Details can be viewed at **https://tender.eprocurement.gov.in** or Contact in person at the office of the Executive Engineer, A.P.Samagra Shiksha, Visakhapatnam District. Cell: 9182650590

EXECUTIVE ENGINEER
AP Samagra Shiksha, Visakhapatnam District

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక ఋణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUILDING CONSTRUCTION

VIZAG TDR | BPS
Contact for BPS PLAN APPROVALS
PILLA BRAHMAJI RAO
Rtd. BUILDING INSPECTOR
GVMC PRESENT LICENSED SURVEYOR
92904 41348

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి ✆ 73862 01191.

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్, ✆ 9396 999 669.

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

PEOPLE CARE

OLD AGE HOME

ఆధునిక వసతులతో AC మరియు నాన్ AC రూమ్స్ మరియు డాక్టర్ పర్యవేక్షణలో రిటైర్మెంట్ హోమ్, అక్కయ్యపాలెం, హైవే బస్టాప్ దగ్గర. Cont: 7794948777.

REAL ESTATE

FLAT FOR SALE

DWARAKANAGAR

Commercial Space for sale an area of 1100 Sft, 4th floor at Road No. 4, Dwarakanagar for Immediate Sale Contact Phone No: 8688921089, 9110750234.

GENERAL

MVP కాలనీలో 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. Contact Ph: 8686997700.

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

GENERAL

పెందుర్తి- దొగ్గవానిపాలెం E/F 147చ॥గ॥ గ్రౌండ్ 2 BHK+ పైన ఓపెన్ సెల్లార్, 2 ఫ్లోర్స్ GVMC ప్లాన్ అప్రూవల్‌తో ఇల్లు అమ్మకం. ✆ 8125222119.

JOBS

Required Chemist. Salary as per Existing Situation Sri Satya Sai Pharmacy, KP Infra, Opp; Gold Coast Apt., Yandla, Vizag- 530 045 ✆ 97044 64829.

Wanted Accountant for Laxmi Exports, VSP. Qlf: Bachelor's Degree in Accounting Proficiency in Tally. ✆ 9393422622.

Wanted Telecallers-2 No's (F) Age 30 Yrs above, English & Hindi Must * Jr. Accountant (F) @ Akkayya palem. Ph: 9348738659.

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact Ph: 7032015042.

JOB OPPORTUNITY
A Fast growing and 2 decades successfully completed organisation requires the below positions in Vizag Division and Branches.
❖ADMINISTRATIVE OFFICERS - 5 No's
❖OFFICE INCHARGES - 7 No's
❖FIELD OFFICERS - 15 No's
Qual: Working / Retired Govt. / Pvt. & Public sectors
Monthly Package: 60,000/- to 1,30,000/-
NOTE: Above posts & Packages decided at the time of interview and based on previous experience.
Interview on 19th & 20th Nov. 2025
C. RAMA KRISHNA, DGM
SEETHAMMADHARA, VIZAG
✆9676811666

రూ. 9 లక్షల బెస్ట్ ప్యాకేజీపై పనిచేయుటకు 3 సం॥ ఏదైనా ఫీల్డ్ Exp. ఉన్న M/F ఏజ్: 30+ & రిటైర్డ్ / గృహిణులు కావలెను. Contact Ph: 9014737483.

టోల్‌గేట్ వద్ద పనిచేయుటకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ, ఇన్‌ఛార్జ్, ఫైర్ & సేఫ్టీ కావలెను. Q: 10th - డిగ్రీ, ITI, B.టెక్, జీ: 18K-28K. Contact Ph: 9573635594, 9121044796.

FACULTY/ TEACHERS

Wanted Experienced & Trained Lady Teachers to Teach Physics & Maths for MID & High School. Candidates who have studied in English Medium Schools only. Need to appply. Olivet School, VSP. Ph: 0891-2569859, 9848498510.

Physics Faculty to Teach 8, 9, 10th CBSE & IIT-Foundation at Kurmannapalem. Resume: hr@varahaacademy.com

Wanted Pre-Primary, Primary Teachers, Ayas, Scavengers (Contract Basis) Sri Raghavendra School, Srinagar, GWK. ✆ 7095646444.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
కాంత
స్క్రీన్-2
ది గర్ల్‌ఫ్రెండ్

నేడు రైతులకు చెక్కుల పంపిణీ

సబ్బవరం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్య రహిత సమాజం కోసం నిర్వహించే సైకిల్ ర్యాలీలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. అనంతరం సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రెండో విడత పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

గుత్త సంస్థపై మేయర్‌కు ఫిర్యాదు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: క్లాప్ (క్లీన్ ఆంధ్ర ప్రదేశ్) వాహనాల గుత్త సంస్థ దుర్గా కన్సల్టెన్సీపై కార్మికులు మంగళవారం మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. క్లాప్ వాహనాలతో వెళ్లి చెత్త సేకరించే కార్మికుల పర్యవేక్షకులుగా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, సంస్థ గుత్తేదారు ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏడాదిన్నర కిందట డబ్బులు తీసుకుని, నేటికీ ఉద్యోగాలు ఇవ్వలేదని వివరించారు. ఇటీవల ఆ గుత్త సంస్థను జీవీఎంసీ బ్లాక్ లిస్టులో పెట్టడంతో, తామంతా మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లపై విచారణ జరిపిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం వంగలి గ్రామంలోని రామాలయం రోడ్డుపై వర్షం పడితే నీరు నిలిచిపోతుంది. – వై.స్వామినాయుడు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై.రాజేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ, సబ్బవరం

?: సబ్బవరం నుంచి పెదనాయుడుపాలెం వెళ్లే దారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. – ఎస్.నాగేంద్ర ✓: వ్యర్థాలను తొలగించే ఏర్పాటు చేస్తాం. – వై.రాజేశ్వరరావు, గ్రామకార్యదర్శి, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వ వార్డు బాలాజీ గార్డెన్స్ లింకు రోడ్ల కాలువలపై పలకలు, ఇనుప గ్రిల్స్ పాడైపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. – రాజేశ్వరరావు ✓: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – రాపర్తి కన్నా, 93వ వార్డు కార్పొరేటర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ బాలుర వసతి గృహం, కొత్త రోడ్డు సమీపంలోని కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. – రవి ✓: మరమ్మతులు చేయిస్తాం. – లలిత, ఏఈ, ఆర్అండ్‌బీ

స్పందించిన వీఎంఆర్డీఏ అధికారులు

స్పందనకు వందనం

వేపగుంట, న్యూస్‌టుడే : వేపగుంట-పినగాడి రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా మేహాద్రి రిజర్వాయర్ బ్రిడ్జి నుంచి పినగాడి వరకు సుమారు 3.92 కిలోమీటర్ల రోడ్డును వీఎంఆర్డీఏ నిర్మిస్తుందని అధికారులు తెలిపారు. శంకుస్థాపన చేసి ఎప్పటికీ పనులు చేపట్టకపోవడంతో ఈ నెల 15న 'రహదారి నిర్మాణం శిలా ఫలకానికే పరిమితమా' శీర్షికతో 'ఈనాడు' పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి వీఎంఆర్డీఏ అధికారులు స్పందించారు. బ్రిడ్జి అవతలి భాగాన్ని అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. విద్యుత్తు స్తంభాలు, మంచి నీటి పైపు లైన్లు మార్పునకు సంబంధించి ఆయా విభాగాలకు ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించామని.. త్వరితగతిన పూర్తి చేస్తామని వీఎంఆర్డీఏ అధికారులు ప్రకటించారు. వేపగుంట నుంచి మేహాద్రి రిజర్వాయర్ బ్రిడ్జి వరకు మిగిలిన భాగాన్ని జీవీఎంసీ నిర్మిస్తుందని తెలిపారు.

వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం

నిర్వహణ శూన్యం.. స్పందించని యంత్రాంగం

పెందుర్తి, న్యూస్‌టుడే

నిత్యం వేలాది వాహనాలు, రైల్వే ప్రయాణికుల రాకపోకలకు వినియోగించే పెందుర్తి రైలు పైవంతెన నిర్వహణ నిర్లక్ష్యానికి గురైందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెందుర్తి - సబ్బవరం మార్గంలోని వెలంపేట సమీపంలో రైలు పైవంతెన ఉంది. వంతెన కింద నుంచి రైళ్లు, పైనుంచి వాహనాలు వెళ్తాయి. దశాబ్దాల క్రితం దీన్ని నిర్మించారు. నిర్వహణను యంత్రాంగం పూర్తిగా విస్మరించింది. దీంతో ప్రమాదకరంగా మారింది.

వంతెన వెంబడి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పలుచోట్ల ఛిద్రమైపోయాయి. కొన్నిచోట్ల పూర్తిగా కూలిపోయాయి. గతంలో పలు వాహనాలు గోడలను ఢీకొన్న ఘటనలున్నాయి. పలు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు జరిగాయి. అయినప్పటికీ గోడల పటిష్ఠతపై యంత్రాంగం దృష్టి సారించలేదు. నిర్వహణ లేకపోవడంతో రక్షణ గోడలకు ఇరువైపులా పెద్దఎత్తున పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు పెరిగిపోయాయి. రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకుల ముఖాలకు తగిలేలా రోడ్డుపైకి వచ్చేశాయి. దీంతో నడక మార్గంలో ఎవరైనా వస్తే చీకట్లో కనిపించని పరిస్థితి నెలకొంది.

వంతెన పైనుంచి కిందకు వెళ్లే మార్గం

ప్రమాదకరంగా మార్గాలు

వంతెనపై నుంచి అటు ఇటూ రాకపోకలు సాగించేందుకు రెండు మార్గాలున్నాయి. ఒక మార్గంలో రైల్వేగేటు పరిసర ప్రాంతాల నివాసితులు వినియోగిస్తున్నారు. ఇది పూర్తిగా ధ్వంసమైపోయింది. ఇనుప మెట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రక్షణ గోడ కూలిపోయింది. మరోవైపు మార్గాన్ని రైలు ప్రయాణికులు ఉపయోగిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో దిగిన పలువురు ప్రయాణికులు ఈ మార్గం ద్వారా వంతెనపైకి వచ్చి సబ్బవరం, అనకాపల్లి వైపు వెళ్తుంటారు. ఈ మార్గం పూర్తిగా ఏటవాలుగా ఉంటుంది. కనీసం రక్షణ కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవు. అదుపు తప్పితే సుమారు యాభై అడుగుల దిగువకు పడిపోయే ప్రమాదం ఉంది.

అంతటా చీకటి

వంతెనపై ఒక్క వీధి దీపం కూడా లేదు. జీవీఎంసీ పరిధిలోనే వంతెన ఉన్నప్పటికీ యంత్రాంగం వెలుగులు నింపడంపై దృష్టి సారించలేదు. రాత్రి పూట పాదచారులు ఈ వంతెనపై ప్రయాణించేటప్పుడు వాహనాలు ఢీకొంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. వంతెనపై నెలకొన్న సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టిసారించి ప్రమాదాలు జరగక ముందే నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'మన గ్రామం...మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధికారులతో కలిసి ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఫార్మా, ఎన్టీపీసీ అధికారులతో మాట్లాడి కాలుష్య సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం ముత్యాలమ్మపాలెంలో కొద్ది నెలల క్రితం హత్యకు గురైన బంగార్రాజు కుటుంబ సభ్యులకు రూ.5లక్షల నగదును అందజేశారు. బంగార్రాజు భార్యకు ఎన్టీపీసీలో ఉపాధి కల్పించి.. వారి పిల్లలను ఎన్టీపీసీ బాలభారతి పబ్లిక్ స్కూల్లో చేర్పించినట్లు తెలిపారు. రూ.2.15కోట్ల విలువ చేసే చేపల వేట సామగ్రిని 43 మంది మత్స్యకార కుటుంబాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్లె రామునాయుడు, ఎంపీడీవో రమేశ్‌నాయుడు, తహసీల్దార్ నాగరాజు, సర్పంచులు చింతకాయల సుజాత, ఎన్టీపీసీ సభ్యులు అర్లిల్లి దేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

చిన్నారి ఎత్తును పరిశీలిస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఎన్.సూర్యలక్ష్మి

సబ్బవరం, న్యూస్‌టుడే: గర్భిణీల్లో తగిన హిమోగ్లోబిన్ ఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం పంచాయతీ పరిధి ఆదిరెడ్డిపాలెంలోని 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించి మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు రక్తహీనత నివారణకు అందించాల్సిన పోషక పదార్థాలను వివరించారు. రక్తంలో హిమోగ్లోబిన్ ఉండేలా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల భద్రతకు సంబంధించిన హెల్ప్‌లైన్ నెం.1098ను తల్లులందరికీ ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లల బరువు, ఎత్తు కచ్చితంగా లెక్కించి రికార్డుల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు డి.అప్పలనరసమ్మ, వై.ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం ప్రారంభమై అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఏయూలోని డా.వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో మంగళవారం జిల్లా యంత్రాంగం, జాతీయ సేవా పథక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ బారిన పడిన వారిని రక్షించే ప్రయత్నం జరగాలని, అది మన నుంచే ఆరంభం కావాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలతో పోలీసులకు చిక్కితే బెయిల్ కూడా రాదని అన్నారు. డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ యువతే భారతదేశానికి పెద్ద సంపద అని, ఈ పరిస్థితిలో పెరుగుతున్న సాంకేతికత, విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు కె.కవిత, పంకజ్ కుమార్ ద్వివేది, ఎస్.ఎస్.పాషా, కె.రామలక్ష్మి, డి.సింహాచలం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

గ్రావెల్ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేస్తున్న దేశపాత్రునిపాలెం గ్రామస్థులు

దేశపాత్రునిపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం కొండ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని... దీనికి తామంతా వ్యతిరేకమని.. తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయవద్దని గ్రామస్థులు ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతి పత్రం అందించారు. గ్రామ రెవెన్యూ పరిధి 9709 హెక్టార్ల విస్తీర్ణంలో గ్రావెల్ తవ్వకాలకు శ్రీలక్ష్మి నరసింహ మినరల్స్ సంస్థ ప్రభుత్వాన్ని అనుమతి కోరడంతో మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో హాజరై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కాలుష్య సమస్య తీవ్రం కావడంతో పాటు పర్యావరణం దెబ్బతిని రోగాల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆర్డీవోకు తెలిపారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ ముకుందరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● పర్యావరణ నిబంధనలకు వ్యతిరేక చర్యలు చేపట్టడం సరికాదని సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వి.వి.రమణ, ఐద్వా నాయకురాలు మాణిక్యం తదితరులు మండిపడ్డారు.

యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో మంగళవారం నుంచి ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత (ఏఎంఆర్)పై అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి పాల్గొని ప్రత్యేక వీడియో విడుదల చేశారు. అనంతరం వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు యాంటీ బయోటిక్స్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 'వర్తమానాన్ని కాపాడుకోండి... భవిష్యత్తును భద్రపర్చుకోండి' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదంతో కూడిన బ్యానర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.కల్యాణి, ఏఎంఆర్ నివారణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు ఐ.వాణి, పి.రత్నకుమారి తదితరులు

బాధితుల సమస్యల పరిష్కారంపై దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : హెచ్ఐవీ బాధిత పిల్లలు, వారి అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మంగళవారం కేజీహెచ్ ప్రసూతి విభాగం సమావేశ మందిరంలో అంతర్గత శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్ఐవీ బాధితులకు అందుతున్న సహాయం, వారి ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు శ్రీహరి, రాధాకృష్ణ, రమణమూర్తి, సౌమని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పెందుర్తి సూర్యానగర్‌లో..

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోని శివాలయాల్లో మంగళవారం ఆదిదంపతుల కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. అర్చకుల వేదమంత్రాల నడుమ పరమేశ్వరుడు, పార్వతీదేవిల కల్యాణం జరిపించారు. ★ జీవీఎంసీ 96వ వార్డు పాత పెందుర్తి శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిగింది. మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు దంపతులు పాల్గొని దేవతామూర్తులకు నూతన వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపించారు. ★ 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని సంపత్ వినాయక ఆలయ ప్రాంగణంలోని పశుపతినాథుడి ఆలయంలో లక్ష బిల్వార్చన జరిగింది. ★ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టు కాలనీలోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల పరిణయం వేడుకగా జరిగింది. ప్రధానార్చకుడు శ్రీకాంత్ శర్మ దేవతామూర్తులకు విశేష అభిషేకాలు, పరిణయోత్సవం జరిపించారు.

శ్రమశక్తినగర్‌లో..

పాత పెందుర్తిలో..

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

వేపగుంట: జీవీఎంసీ పరిధి 89వ వార్డు పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు వస్త్రాలు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది కార్మికులకు మంగళవారం అందించారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఏ ప్రభుత్వం వస్త్రాలు ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వం అందించడం ఆనందంగా ఉందని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

అల్లుడిపై దాడి.. మేనమామలకు రిమాండ్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పాత గొడవల నేపథ్యంలో అల్లుడిపై దాడి చేసిన కేసులో ముగ్గురు మేనమామలను పీఎంపాలెం పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని కొమ్మాది పెంట అప్పన్న (48) కుమార్తెకు అక్క కొడుకు అనూరి జాన్(39)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఈ ఏడాది జనవరిలో భార్యాభర్తల మధ్య వివాదాలు రావడంతో పంచాయితీ పోలీసుల వరకు వెళ్లింది. దీంతో అల్లుడిపై కక్ష పెంచుకున్న అప్పన్న అతని సోదరులు పెంట కుంటోడు(45), పెంట అప్పుడు(40) ముగ్గురు కలిసి ఈ నెల 5న జాన్‌ను కొట్టి గాయపరిచారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. న్యాయస్థానం ఆదేశాలతో ముగ్గురి నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై డి.రాము తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక

పరవాడ, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా భీమిలిలో ఈ నెల 8న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 యోగా పోటీల్లో పరవాడ మండలం వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎన్.అభిరామ్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు ఈ నెల 22 నుంచి 24 వరకు బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు, సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు

స్విమ్మింగ్‌లో ప్రతిభ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ నెల 16న విశాఖ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ మధుబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన కె.ఆద్య, సాత్విక్ ప్రధాన్, జయదీప్, నిఖిల్, బేర్నిక, కార్తిక్, హిమప్రసాద్, యువరాజ్ బంగారు పతకాలు, వైష్ణవి, శరత్, తేజస్వ రూప్ రజత పతకాలు, కార్తికేయ, యశ్వంత్, ఇక్రమ్, సాహెల్ గోవింద కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ హరినాథ్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పి.పద్మజ

సబ్బవరం, న్యూస్‌టుడే: బహిరంగ మల విసర్జన నిర్మూలనే లక్ష్యంగా గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించేందుకు సర్పంచులు, కార్యదర్శులు కృషిచేయాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం స్వచ్ఛతపై నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంఈవో ఎం.జె రవీంద్రబాబు, బి.రామునాయుడు పాల్గొన్నారు.

25 నుంచి అంచనాల కమిటీ పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ 25 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. కమిటీ సభ్యులు 25వ తేదీ రాత్రి విశాఖ చేరుకుని, ప్రభుత్వ బంగ్లాలో బస చేస్తారు. 26న విశాఖ, 27న విజయనగరం, 28న శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి, 28వ తేదీ రాత్రి తిరుగుపయనమవుతారు. కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు, సభ్యులుగా భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, పార్థసారథి, సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, పి.వి.వి.సూర్యనారాయణరాజు, వరుదు కల్యాణి ఉన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

ప్రదర్శన చేస్తున్న పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు

పెందుర్తి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్య రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా చేపట్టిన మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు విద్యాలయాల్లో ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు దేముడునాయుడు, విజయ్‌కుమార్, చిన్నబాబు, తదితరులు పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం సుజాతనగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొని కాలనీవాసులకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 150 మంది ఈ సేవలు వినియోగించుకున్నట్లు థియోఫిలస్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జి.మంజుల, ఉప ప్రిన్సిపల్స్ శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న కాలనీవాసులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ఫార్మాసిటీ ఎస్ఈజెడ్‌లోని ఫైజర్ కంపెనీలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కంపెనీ అధినేత మురళీధర్ శర్మ ప్రారంభించారు. శంకర ఫౌండేషన్ కంటి వైద్య సిబ్బంది పరిసర గ్రామాల్లోని 500 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 350 మందికి కంటి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. 40 మందికి శస్త్ర చికిత్సలు చేయిస్తామని ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు తెలిపారు. కార్యక్రమంలో ఫైజర్ కంపెనీ ప్రతినిధులు రాధాకృష్ణన్, రమేశ్‌కుమార్, రవిచంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

పెందుర్తి, సబ్బవరం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెందుర్తి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. గ్రంథాలయ అధికారిణి బి.చంద్రకళ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ రహిత భారత్' అనే అంశంపై జరిగిన పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు చంద్రకళ తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ★ సబ్బవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 'నాకు నచ్చిన పుస్తకం, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సరోజిని, రత్న, రాజేశ్వరి, ఆనంద్, గ్రంథాలయ అధికారిణి వి.శిరీష పాల్గొన్నారు.

యోగా పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన చిన్నారులు పోటీలో పాల్గొని యోగాసనాలు వేశారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి లక్ష్మణరావు తెలిపారు.

పెందుర్తి శాఖా గ్రంథాలయంలో..

సబ్బవరంలో..



(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గజేశ్- కాంత
రామలక్ష్మి- జిగ్రీస్
తాతా- జటాధర
సప్తగిరి- మాస్ జాతర

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, షిప్‌యార్డు లేఅవుట్, బిర్లానగర్, ఎన్టీఆర్ హౌసింగ్ నివాసాలు, ఎండాడ ఎస్సీ బీసీ కాలనీ, తెలంగ ఎండాడ తదితర ప్రాంతాలకు బుధవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జీవీస్టేషర్ కాంప్లెక్స్ నీటి కేంద్రం నుంచి ఎండాడ బెల్టింగ్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా జరిగే ప్రధాన పైప్‌లైన్ వాల్వ్ మరమ్మతులకు గురవ్వడంతో సమస్య తలెత్తిందన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. శ్రీవాణి తెలిపారు. చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని తమ కళాశాలలో ఈనెల 28వ తేదీ వరకూ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన ఆసక్తిగల విద్యార్థులు బీఎస్సీ గణిత, జంతుశాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, కంప్యూటర్ సైన్సు, బీఏ చరిత్ర, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8522975829 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: తారకరామానగర్ (రుషికొండ) లేఅవుట్‌లో పందుల సంచారంతో ఇబ్బంది పడుతున్నాం. - లేఅవుట్ వాసులు
✓: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం. - కోర్, ఆరోగ్య అధికారి.

స్పందనకు వందనం

వీధుల్లో శుభ్రత చర్యలు

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి గొల్లల ఎండాడ వీధుల్లో చెత్త, చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి శుభ్రత చర్యలు చేపట్టారు.

ఎట్టకేలకు శంఖు చక్రాలకు వెలుగులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై వైకుంఠవాసుల మెట్టపై ఏర్పాటు చేసిన శంఖు చక్ర తిరునామాల విద్యుద్దీపాలంకరణ మొంథా తుపాను నాటి నుంచి మరమ్మతుకు గురైంది. ఈ నేపథ్యంలో ఈ నెల 11న 'ఈనాడు'లో 'అంధకారంలో శంఖు చక్రాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. విద్యుద్దీప అలంకరణకు మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.



ఇరుకైన రోడ్లు.. అధ్వానంగా కాలనీలు

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: తగరపువలస, చిట్టివలస, సంగివలస, భీమిలి పట్టణ వాసులను పలు సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఇరుకైన రోడ్లు, అపరిశుభ్ర పరిసరాలు, అధ్వాన రహదారులతో నరకయాతన పడుతున్నారు. వీటిని పరిష్కరించాల్సిన యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

★ నియోజకవర్గ కేంద్రమైన భీమిలి ప్రధాన రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. నేడ్డవలస కూడలి, ఎమ్మార్వో ఆఫీసు, శివాలయం, గంటస్తంభం రోడ్డు సమీప ప్రాంతాల్లో కేవలం పది నుంచి పదిహేను అడుగుల రోడ్డే ఉండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకుని ముందుకెళ్లడం ఇబ్బందిగా మారింది. నరసింహస్వామి ఆలయం మీదుగా చినబజారు కూడలికి వెళ్లే మార్గానిది ఇదే పరిస్థితి. భీమిలిలోని రోడ్లన్నీ ఎప్పుడో స్వాతంత్ర్యానికి పూర్వం వేసినవి కావడం, వీటి విస్తరణ ప్రకటనలకే పరిమితం కావడం గమనార్హం. తగరపువలస ఆంధ్రాబ్యాంకు రోడ్డు, వలందపేట రోడ్డు, నమ్మివానిపేట రోడ్డు, మార్కెట్ రోడ్డు, చిట్టివలస రహదారుల్లోనూ ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది.

జీరుపేట-చిల్లపేట జంటగ్రామాల్లో తగరపువలస మార్గంలో నివాసాల ముందు నిలిచిన మురుగు

ఇరుకుగా ఉన్న భీమిలి ప్రధానరోడ్డులో వాహనాల రాకపోకలు

అపరిశుభ్రతతో అవస్థలు: మరోవైపు చిల్లపేట, జీరుపేట ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డుని ఆనుకుని ఉన్న కాలనీల్లోని నివాసాల ముందు నిలిచిపోతోంది. దీనికి కారణం సీసీ డ్రైన్ల నిర్మాణం చేపట్టడం లేదు. నివాసితులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. భీమిలిలో పలు వీధుల్లో పురాతన కాలువలే ఉపయోగంలో ఉండటంతో వాటిని ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. చిట్టివలస, సంగివలస, తగరపువలస ప్రాంతాల్లోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలను నిర్మించాలి. ఆదర్శనగర్, సబ్బవానిపేట, సంగివలస కాలనీల వద్ద జాతీయరహదారి సర్వీసురోడ్డులో మురుగు నిలిచిపోవడంతో నివాసితులు తరచూ అసౌకర్యానికి గురవుతున్నారు.

తవ్వారు.. వదిలేశారు

దర్పణం

ఐఎన్ఎస్‌కళింగ (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు నుంచి చేపలుప్పాడ గ్రామంలోకి వెళ్లే ప్రధానరోడ్డును అండర్‌గ్రౌండ్ కేబుళ్ల కోసం ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. విశాలంగా ఉండే తారురోడ్డును ఓ వైపు తవ్వి భూగర్భ విద్యుత్తు లైన్లను వేశారు. ఈ క్రమంలో పదేళ్ల కిందట హుద్‌హుద్‌కి దెబ్బతిన్న ఈ గ్రామాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు దత్తత తీసుకుని తన కుమార్తె దీపావెంకట్ స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా చేయించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్లను సైతం ధ్వంసం చేశారు. గోతులను తవ్వి కేబుళ్లను పాతిపెట్టాక రోడ్డుపైనే మట్టిని కుప్పలుగా వదిలేశారు. అభివృద్ధి పనుల పేరిట ఇష్టారాజ్యంగా గోతులు తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైన్లను, తాగునీటి పైపు లైన్లను, తారురోడ్డును ధ్వంసం చేయడం పట్ల స్థానిక పెద ఉప్పాడ, చిన ఉప్పాడ, చేపల దిబ్బడిపాలెం, నవరత్న ఎస్టేట్స్ లేఅవుట్, నేర్లవలస కాలనీ, ఎస్సీకాలనీ నివాసితులు అవస్థలు పడుతున్నారు.

ధ్వంసమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ

వృద్ధాప్య తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే

భీమునిపట్నం, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో ఎటువంటి ఆసరాలేని తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యతను వారి పిల్లలు తప్పకుండా తీసుకోవాలని భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి డి.సౌజన్య పేర్కొన్నారు. సోషల్ జస్టిస్ అండ్ నల్సా వారి ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ఆవరణలో సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం గురించి అవగాహన కల్పించారు. న్యాయమూర్తి సౌజన్య మాట్లాడుతూ పిల్లలు తమ తల్లిదండ్రుల పోషణ బాధ్యతను తీసుకోవడంతో పాటు అవసరమైతే నెలవారీ భరణాన్ని అందివ్వాలని కోరారు. ఇందు కోసం ఉద్దేశించిన చట్టం గురించి సీనియర్ సిటిజన్లు అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయవాదులు ఎం.వి.పార్వతీశం, పి.వేంకటేశ్వరరావు, ఎం.సి.హెచ్.పాత్రుడు, డి.కనకమహాలక్ష్మి, పి.బాలభాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సౌజన్య

సీహెచ్‌సీలో ఐసీటీసీ కేంద్రం పునఃప్రారంభం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఎయిడ్స్ నియంత్రణ కోసం పనిచేసే సమగ్ర సలహాలు పరీక్షల కేంద్రం(ఐసీటీసీ) పునఃప్రారంభమైంది. ఈ కేంద్రం ఒక కౌన్సెలరు, ల్యాబ్ టెక్నీషియన్ సిబ్బందితో నడుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడ పనిచేసే కౌన్సెలరు ఆర్.వెంకటరాజు ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఈ కేంద్రం సేవలకు అంతరాయం ఏర్పడింది. తాజాగా అనకాపల్లి జిల్లా మాడుగుల సీహెచ్‌సీ నుంచి వి.శ్రీనివాసరావును ఇక్కడకు కౌన్సెలరుగా బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

ఐసీటీసీ కౌన్సెలరుగా నియమితులైన శ్రీనివాసరావు

మర్యాదపూర్వక కలయిక

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆరోవార్డు తెదేపా అధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు ఇవ్వడం పట్ల ఎమ్మెల్యేను సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. నాయకులు రెడ్డి సత్యనారాయణ, కె.సూరిబాబు, ప్రసాద్, పోతిన శ్రీను, నాగోతి వెంకట్రావు, వి.అప్పలనాయుడు, కె.రామకృష్ణ, కె.బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంటాతో ఆరోవార్డు తెదేపా నాయకులు

● నేడు అన్నదాత సుఖీభవ రెండో విడత సాయం

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: ఏటా రైతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని బుధవారం పంపిణీ చేయనున్నారు. రెండోవిడతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2 వేలు, రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి మండలాల్లోని 14,981 మంది రైతులు రూ.10.06 కోట్ల లబ్ధి పొందనున్నారు. * తొలివిడతగా ఆగస్టులో పెట్టుబడి సాయం అందించిన ప్రభుత్వం రెండోవిడత కూడా సకాలంలో పంపిణీకి ఏర్పాట్లు చేయడంతో అన్నదాతలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని రైతన్నలు చెబుతున్నారు.

● పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

మధురవాడ, న్యూస్‌టుడే: నగర పరిశుభ్రత కోసం పాటు పడుతున్న జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఏడోవార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ అన్నారు. మంగళవారం జీవీఎంసీ సమకూర్చిన దుస్తులను వార్డు పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పిలకవానిపాలెంలోని కార్యాలయంలో ఆమె అందజేశారు. తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకట్రావు, వార్డు తెదేపా, జనసేన అధ్యక్షులు కానూరి అచ్యుతరావు, నాగోతి నర్సింహనాయుడు, కార్యదర్శి బైపిల్లి శ్రీరామూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సూపర్‌వైజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: శుభ్రత కోసం నిరంతరం పారిశుద్ధ్య కార్మికులు శ్రమిస్తుంటారని తెదేపా 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. స్వతంత్రనగర్ వార్డు కార్యాలయం వద్ద మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. తెదేపా రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వార్డు అధ్యక్షులు నాగోతి వెంకటసత్యనారాయణ, ఈగల రవి తదితరులు పాల్గొన్నారు.

● దశలవారీగా అభివృద్ధి పనులు

మధురవాడ, న్యూస్‌టుడే: వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకట్రావు అన్నారు. కార్పొరేటర్ పిల్లా మంగమ్మ ఆదేశాలతో మంగళవారం ఏడోవార్డు మల్లయ్యపాలెంలో జీవీఎంసీ వివిధ విభాగాల అధికారులు, తెదేపా నాయకులతో కలిసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే కొత్తగా వేస్తున్న రహదారులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు కానూరి అచ్యుతరావు, కొల్లి చిరంజీవి, కలివెలుపు బుజ్జి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● తాగునీటి సమస్య నివారణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని అప్పికొండవీధిలో తాగునీటి సమస్య నివారించాలని కోరుతూ ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన గొట్టపుబావిని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మంగళవారం ప్రారంభించారు. ప్రస్తుతం మంజూరు చేసిన గొట్టపు బావి వల్ల ఈ ప్రాంతీయులకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. తెదేపా నాయకులు ఎస్.జోగారావు, ఎ.నర్సింగరావు, కె.అప్పన్న పాల్గొన్నారు.

● విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని భీమిలిలోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు పి.ఆర్.పి.వర్మ, ఎం.లక్ష్మణరావు, పి.నర్సింగరావు, ఎల్.ఆదినారాయణ పాల్గొన్నారు.

● మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కొమ్మాది, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు విద్యార్థులంతా దూరంగా ఉండాలని చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొలుగు వెంకటరావు సూచించారు. మంగళవారం పాఠశాలలో పీఎంపాలెం పోలీస్ అధికారి గోవిందరావు సారథ్యంలో నిషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. మంచి చెడు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారితో చైతన్యం తీసుకువచ్చారు.

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత తమ బంగారు భవిత నాశనం చేసుకోరాదని తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. శ్రీవాణి హితవు పలికారు. చిట్టివలసలోని కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

● తీరంలో తాటివనాలు దగ్ధం

గ్రామీణభీమిలి, మధురవాడ, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని రామానాయుడు స్టూడియోకి ఎదురుగా ఉన్న తీరంలో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. బీచ్‌లో ఇసుక తిన్నెలపై దట్టంగా ఉన్న తాటివనాల మధ్యలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడున్న తాటిచెట్లు భారీ సంఖ్యలో కాలిపోయాయి. చెట్లకున్న కమ్మలు ఎండిపోయి ఉండడంతో మంటలు పెద్దగా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఇది ఆకతాయిలు లేదా మందుబాబుల పనై ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అల్లుడిపై దాడి.. మేనమామలకు రిమాండ్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పాత గొడవల నేపథ్యంలో అల్లుడిపై దాడి చేసిన కేసులో ముగ్గురు మేనమామలను పీఎంపాలెం పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ ఏడోవార్డు ప్రియదర్శిని కాలనీకి చెందిన పెంద్ర అప్పన్న (48) కుమార్తెకు అక్క కొడుకు ఆసనాల జాన్(33)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఈ ఏడాది జనవరిలో భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో పంచాయితీ పోలీసుల వరకు వెళ్లింది. దీంతో అల్లుడిపై కక్ష పెంచుకున్న అప్పన్న అతని సోదరులు పెంద్ర కుంటోడు(45), పెంద్ర అప్పడు(40) ముగ్గురు కలిసి ఈ నెల 5న జాన్‌ను కొట్టి చాకుతో గాయపరిచారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. న్యాయస్థానం ఆదేశాలతో ముగ్గురి నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై డి.రాము తెలిపారు.

ప్రీ రిపబ్లిక్‌డే ఎంపిక శిబిరంలో జీవీపీ విద్యార్థిని

అక్షితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కె.ఎస్.బోస్

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) విద్యార్థిని టి.అక్షిత హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్సిటీలో జరిగిన ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి హాజరయ్యారు. భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పదిరోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 200 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఇందులో ఈమె ఒకరు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 40 మందిని 2026 జనవరిలో దిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఎంపిక చేస్తారని జీవీపీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎస్.బోస్, ఎన్ఎస్ఎస్ విభాగాధికారి డాక్టర్ జి.లక్ష్మీనారాయణ తెలిపారు.

బత్తాయి పండ్ల అలంకరణలో రాసపోలమ్మతల్లి

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమ్మతల్లిని గ్రామస్థులు బత్తాయి పండ్లతో మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

స్థిరాస్తి వ్యాపారిపై కత్తితో దాడి

తగరపువలస, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై తన కార్యాలయానికి వెళ్తున్న స్థిరాస్తి వ్యాపారి కోరాడ అప్పలరాజు(42)పై ఆయన స్వగ్రామమైన జీవీఅగ్రహారం పరిధి కొత్తవలసలో మంగళవారం కత్తితో దాడి చేశారు. అదే గ్రామానికి చెందిన బీసపు శ్రీను (24) దారికాచి ఇంటినుంచి స్కూటీపై వస్తున్న ఆయనపై క్రిస్టియన్ లేఅవుట్ ప్రాంతంలో కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో అప్పలరాజు నుదిటిపై, కంటి వద్ద, రెండు చేతులకు కత్తి గాట్లు పడ్డాయి. ప్రాణభయంతో బిగ్గరగా కేకలు వేయడంతో సమీపంలోని వారు రాగా శ్రీను అక్కడ్నుంచి పారిపోయారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించుకుని గాయాలతోనే క్షతగాత్రుడు భీమిలి పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కొత్తవలసకు చెందిన అప్పలరాజు ప్రస్తుతం నగరంలోని విశాలాక్షినగర్ సమీప దయాల్ నగర్‌లో ఉంటూ రోజూ స్వగ్రామంలోని తన స్థిరాస్తి కార్యాలయానికి వచ్చి పోతుంటారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాయాలతో అప్పలరాజు

నీటి సమస్యకు పరిష్కారం

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధి ఎండాడ అంగన్‌వాడీ కేంద్రం-1లో కొద్ది రోజులుగా నెలకొన్న నీటి సమస్యను జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్ సొంత నిధులు వెచ్చించి మంగళవారం పరిష్కరించారు. సంబంధిత కేంద్రంలో నీటి ఇబ్బందుల కారణంగా నిర్వాహకులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిధులతో నీటి సదుపాయం కల్పించడానికి సమయం పడుతుందని నీటి సరఫరా సిబ్బంది చెప్పినట్లు నిర్వాహకులు శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందించి నీటి సమస్యను పరిష్కరించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆకట్టుకున్న నృత్యరూపకం

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని శ్రీరాధామదన్‌మోహన్ స్వామి ఆలయంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీకృష్ణలీలల నృత్యరూపకాన్ని చిన్నారులు ప్రదర్శించారు. దీనికి ముందు సంధ్యా సమయంలో కార్తిక దామోదర దీపాన్ని వెలిగించి, తులసి మాతకు హారతి ఇచ్చారు. అనంతరం మేళతాళాల నడుమ స్వామి వారి పల్లకి సేవ చేపట్టి ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు. అనంతరం లక్ష దీపోత్సవంలో భక్తులు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో నిష్కించన భక్తదాస, యదురాజా దాస, అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

విద్యార్థుల ఉన్నత భవితకు వెలుగులు

పద్మనాభం, న్యూస్‌టుడే: ప్రతిభ గల పేద విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా ఎన్ఎంఎంఎస్ (జాతీయ ఉపకార వేతనం) పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందిస్తున్నారు. పద్మనాభం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జులై నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన పది మంది ఉపాధ్యాయులు సామాజిక బాధ్యత వహించి ఆదివారం, సెలవు దినాల్లో తరగతులు చెబుతున్నారు. డిసెంబర్ 7న పరీక్ష నిర్వహించనున్నారు.

★ పద్మనాభం, రేవిడి, అనంతవరం, గంధవరం, పొట్నూరు, పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు శిక్షణా తరగతులకు హాజరవుతున్నారు. ఔత్సాహికులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

★ సెలవు రోజుల్లో ఖాళీగా ఉండటం కంటే విద్యార్థులకు పాఠాలు బోధించడం ఇష్టం. ఇక్కడ శిక్షణ పొందిన ఐదుగురు విద్యార్థులు ఇప్పటికే ఉపకార వేతనానికి అర్హత సాధించారు. ఆ ఉత్సాహంతోనే ఒక్కొక్కరిగా ఉపాధ్యాయులు ముందుకొచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగాలన్న ఆశయంతోనే ఈ చర్యలు తీసుకున్నాం. - తాలాడ రామకృష్ణ, ఉపాధ్యాయుడు, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

స్వామియే శరణం.. సేవే మార్గం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: అయ్యప్ప మాల ధరించిన భక్తులు 41 రోజుల పాటు కఠోరదీక్ష చేస్తారు. పీఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో ప్రతి ఏటా మాలధారుల సంఖ్య పెరుగుతోంది. ఇలా మాల వేసుకున్న స్వాములకు పీఎంపాలెంలో పోతిన పరశురాం (గురుస్వామి) పీఠం వద్ద మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేస్తూ సేవా తత్పరత చాటుతున్నారు.

✦ పరశురాం పీఠం ఆధ్వర్యంలో ఏటా 41 రోజుల పాటు అయ్యప్ప మండల దీక్ష తీసుకున్న స్వాములతో పాటు శివ, భవాని, ఆంజనేయస్వామి తదితర మాలధారణ చేసిన వారికి నారాయణసేవ చేస్తున్నారు. ప్రతి రోజు సుమారు 800 నుంచి 1000 మందికి మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. గురుస్వామి ప్రధాన శిష్యులైన పోతిన ఎల్లాజి, వాండ్రాసి భాస్కరరావు, పోతిన అప్పన్న, బొడ్డేపల్లి చిరంజీవి, కె.చిన్న(వంట మాస్టారు) తదితరులు బృందంగా ఏర్పడి సొంతంగా నగదు దాతల సహకారంతో గత ఐదేళ్లుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవా కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 22న ప్రారంభమైన నారాయణసేవ డిసెంబర్ 2తో ముగియనుంది. భిక్షకు ఏటా రూ.30 లక్షల వరకు ఖర్చవుతోంది. ✦ వంటకాల్లో స్వాముల సాయం: పీఠంలో ఉన్న 100 మందికి పైగా స్వాములు ప్రతి రోజు వంటలు వండే సమయంలో అవసరమైన సహాయ, సహకారం అందిస్తారు. కూరగాయలు ముక్కలు కోయడం, నీరు అందించడం, స్వాములకు భిక్ష వడ్డించడం తదితర పనులను భక్తితో చేస్తారు. అలాగే పలువురు మహిళలు సైతం సేవలో పాల్గొంటున్నారు.

భిక్ష చేస్తున్న మాలధారణ స్వాములు

సమాజహితంలో కవుల పాత్ర కీలకం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సమాజానికి మేలు చేయడంలో కవుల పాత్ర ఎంతో కీలకమని రచయిత ఇందూ రమణ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అడివివరం శాఖ గ్రంథాలయంలో కవి సమ్మేళనం జరిగింది. గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో కవులు ఇందూ రమణ, కోరాడ నరసింహారావు, మిద్ది అప్పారావు, సి.పద్మావతి, ఎ.శ్రీనివాస్, సీహెచ్ఎస్ఎన్ రాజు, దుర్గాప్రసాద్ పాల్గొని పలు కవిత, సమీక్షలు వినిపించారు. ఈ సందర్భంగా వీరిని పాఠకుల సమక్షంలో ఘనంగా సత్కరించారు.

అడివివరం గ్రంథాలయంలో కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలు

(c) eenadu

విశాఖ తూర్పు

నేడు నీటి సరఫరాకు అంతరాయం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: వెంకోజీపాలెంలో పైపులైను మరమ్మతుల కారణంగా బుధవారం 9, 10, 12 వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. దీనివల్ల విశాలాక్షినగర్, సంజయ్‌గాంధీకాలనీ, దంపతినగర్, హనుమంతువాక, క్రాంతినగర్, సంజయ్‌గాంధీకాలనీ, సింహగిరికాలనీ, పెదగదిలి, శాలిపేట, ఇందిరానగర్, నేతాజీనగర్, రాజీవ్‌నగర్, వెటర్నరీ కాలనీ, ఆదర్శనగర్, సుందర్‌నగర్, వివేకానంద నగర్, ఎస్‌జీ నగర్, రవీంద్రనగర్, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు తదితర ప్రాంతాల్లో కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా జరగదని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 19వ వార్డు లాసన్స్‌బే కాలనీ పోస్టాఫీసు సమీప రహదారిపై వ్యర్థాలు తరలించక దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –రామకృష్ణ, లాసన్స్‌బే కాలనీ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: సిరిపురం బాలాజీనగర్‌లో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడద వెంటాడుతోంది. –రాములమ్మ, సిరిపురం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. –గోవింద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లోని అంతర్గత రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –బుడ్డిగ సత్యనారాయణ మూర్తి, శ్రీకాంత్‌నగర్ ✓: ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. –వెంకటరావు, ఏఈ

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పాతడెయిరీఫారం పోస్టాఫీసు వీధి నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగక రాత్రి వేళ అవస్థలు పడుతున్నాం. –రేణుక, గృహిణి, నేతాజీనగర్ ✓: వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. –రామ్‌శంకర్, పర్యవేక్షకుడు

స్పందనకు వందనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదో వార్డు పరిధి ఆదర్శనగర్, నేతాజీనగర్ కుళాయిల్లో నీటి ధార తక్కువగా రావడంతో తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక పొదుపు సంఘం మహిళలు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో ఏఈ శ్రీనివాస్ స్పందించారు. సంబంధిత సిబ్బందితో మంగళవారం మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

ఎట్టకేలకు పూడిక తొలగింపు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 23వ వార్డు పరిధి మద్దిలపాలెం, చైతన్యనగర్ కాలువల్లోని పూడికలు తొలగించక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై మంగళవారం 'ఈనాడు'లో వెలువడిన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ స్పందించారు. సిబ్బందితో పూడికలు తీయించి పరిసరాల శుభ్రత పనులు చేపట్టారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కిర్లంపూడి లేఅవుట్‌లో చెత్త పేరుకుపోయి స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో వెలువడిన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవింద్ స్పందించారు. సిబ్బందితో మంగళవారం పరిసరాల శుభ్రత పనులు చేపట్టి సమస్య పరిష్కరించారు.

25 నుంచి అంచనాల కమిటీ పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ 25 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. కమిటీ సభ్యులు 25వ తేదీ రాత్రి విశాఖ చేరుకుని, ప్రభుత్వ బంగ్లాలో బస చేస్తారు. 26న విశాఖ, 27న విజయనగరం, 28న శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి, 28వ తేదీ రాత్రి తిరుగుపయనమవుతారు. కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు, సభ్యులుగా భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, పార్థసారథి, సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, పి.వి.వి. సూర్యనారాయణరాజు, వరుదు కల్యాణి ఉన్నారు.

20న మహా రుద్రాభిషేకం

అల్లిపురం, న్యూస్‌టుడే : అల్లిపురం సమీప కెప్టెన్ రామారావు కూడలిలోని శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 20వ తేదీన లింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం నిర్వహిస్తామని ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మహా రుద్రాభిషేకం, కోటి దీపారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రీ రిపబ్లిక్‌డే ఎంపిక శిబిరంలో జీవీపీ విద్యార్థిని

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థిని టి.అక్షిత హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్సిటీలో జరిగిన ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి హాజరయ్యారు. భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పదిరోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 200 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఇందులో ఈమె ఒకరు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 40 మందిని 2026 జనవరిలో దిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఎంపిక చేస్తారని జీవీపీ ప్రిన్సిపల్ బోస్ తెలిపారు.

సమస్యల చట్రంలో ఇసుకతోట

మద్దిలపాలెం, న్యూస్‌టుడే

జీవీఎంసీ 16వ వార్డు పరిధి ఇసుకతోట ప్రాంతంలోని పలు వీధులు, కాలనీల్లో సమస్యలు వెంటాడుతుండటంతో స్థానికులు కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల్లో ఫిర్యాదులిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

★ ఇసుకతోట రజకవీధి, అంబేడ్కర్‌నగర్, ముంతాజ్ హోటల్ వెనుకభాగం తదితర ప్రాంతాల మీదుగా ప్రవహించే గెడ్డలో పూడికలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఆయా ప్రాంతాల్లోనే తాగునీటి పైపులైన్ల మరమ్మతుల కోసం గోతులు తవ్వారు. పనులు పూర్తయినా కొన్ని చోట్ల వాటిని పూడ్చకుండా అసంపూర్తిగా వదిలేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ ఇసుకతోట, జనప్రియ ఏరియా, అంబేడ్కర్‌కాలనీ, రజకవీధి ప్రాంతాల్లో తాగునీటి బోరింగులు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్తు స్తంభాలకు కేబుల్ తీగలు గజిబిజిగా ఉండి పిచ్చుకగూళ్లను తలపిస్తున్నాయి. దీనివల్ల మరమ్మతులు తలెత్తినపుడు సమస్య పరిష్కరించడానికి సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య సకాలంలో పరిష్కారం కాకపోవడంతో సంబంధిత ప్రాంతాల్లో ఎక్కువ సేపు అంధకారం రాజ్యమేలుతోంది.

★ పశు వైద్యశాల మార్గం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇసుకతోట శివాలయం తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ ఆకతాయిల బెడద ఎక్కువైందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్‌కాలనీలో యూజీడీ మురుగు వెంటాడుతోంది. ఇసుకతోట ప్రభుత్వ వసతి గృహం, రజకవీధి, శివాలయం ప్రాంత కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఓ వీధిలో తొలగించని వ్యర్థాలు

★ ఇసుకతోట, శివాలయం ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహనదారులను వెంబడిస్తున్నాయి. కొన్ని సమయాల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ ఈ సమస్య మరింత అధికంగా ఉంది.

పైపులైను మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి వదిలేశారిలా..

★ వార్డులో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెంటాడుతోంది. ఈ సమస్య పరిష్కరించేందుకు ఫాగింగ్ తదితర నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు.

★ ఇసుకతోట పశు వైద్యశాల, జె.ఆర్.నగర్‌కు వెళ్లే మార్గాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పలుచోట్ల గోతులు ఏర్పడడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

★ జీవీఎంసీ సరఫరా చేసే కొళాయి నీరు అన్ని ప్రాంతాలకు ఒకే మాదిరిగా సరఫరా కావడం లేదు. కొన్ని చోట్ల ధార తక్కువగా రావడం, మరికొన్ని చోట్ల తక్కువ సమయానికే సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అన్ని ప్రాంతాలకు కనీసం 45 నిమిషాలు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం ప్రారంభమై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఏయూలోని డా.వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో మంగళవారం జిల్లా యంత్రాంగం, జాతీయ సేవా పథక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ బారిన పడిన వారిని రక్షించే ప్రయత్నం జరగాలని, అది మన నుంచే ఆరంభం కావాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలతో పోలీసులకు చిక్కితే జైలుకే కాదు కూడా రాదని అన్నారు. డ్రగ్స్ బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ యువతే భారతదేశానికి పెద్ద సంపద అని, ఈ పరిస్థితిలో పెరుగుతున్న సాంకేతికత, విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు కె.కవిత, పంకజ్ కుమార్ ద్వివేది, ఎస్.ఎస్.పాషా, కె.రామలక్ష్మి, డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో మంగళవారం నుంచి ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత (ఏఎంఆర్)పై అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి పాల్గొని ప్రత్యేక వీడియో విడుదల చేశారు. అనంతరం వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు యాంటీ బయోటిక్స్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 'వర్తమానాన్ని కాపాడుకోండి... భవిష్యత్తును భద్రపర్చుకోండి' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదంతో కూడిన బ్యానర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.కల్యాణి, ఏఎంఆర్ నివారణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు ఐ.వాణి, పి.రత్నకుమారి తదితరులు

9 నుంచి 'మెగా చిల్డ్రన్ ఫెస్టివల్'

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రేమకుమార్, తదితరులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: డిసెంబరు 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నగరంలోని సెయింట్ ఆంథోని పాఠశాలలో జరగనున్న మూడవ మెగా చిల్డ్రన్ ఫెస్టివల్ (బాలోత్సవం) గోడపత్రికను మంగళవారం డీఈఓ ఎన్.ప్రేమకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఎక్కువ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా కృషి చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ చంద్రశేఖర్, బాలోత్సవ్ అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం పునఃనిర్మాణ పనుల తీరుపై ఆరా..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పునఃనిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులు, గుత్తేదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సంబంధిత స్టేడియంను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పనులు 20 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, ఇంకా జరగాల్సిన వాటిపై వారం రోజుల్లో నివేదిక అందించాలని కోరారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు సత్యనారాయణరాజు, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

గ్రంథాలయ వారోత్సవాలు

ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విశ్రాంత అధికారులు, తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయం విశ్రాంత అధికారి బి.ఆనందరావు అన్నారు. ఎంవీపీకాలనీ నగర శాఖ గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. అందరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత అధికారులు కె.రాములు, పి.మల్లేశ్వరరావు, బి.పైడిరాజు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత అన్నారు. కళాశాలలో మంగళవారం 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థులందరూ చక్కటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ మేరకు ముందుకు సాగాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల అధ్యాపకులు బి.ఆర్.రామవేదవ్యాస్, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న కృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థులు

రహదారిపై యూజీడీ వ్యర్థజలాలు

శివాజీపాలెం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: శివాజీపార్కు మార్గంలో యూజీడీ మ్యాన్‌హోల్ పొంగి మురుగునీరు రహదారిపై ప్రవహిస్తుండడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో తరచూ ఈ సమస్య తలెత్తుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

దర్పణం

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ

హెచ్‌బికాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో మంగళవారం అయ్యప్ప అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి బి.నూకరెడ్డిని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి తనయుడు ప్రతాప్‌రుద్ర, తెదేపా నాయకులు బోర ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని లాసన్స్‌బే కాలనీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమ, మంగళవారాల్లో రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నూకరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

భక్తులకు వడ్డిస్తున్న ప్రతాప్‌రుద్ర, తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ, న్యూస్‌టుడే: 13వ వార్డు పరిధి భగత్‌సింగ్ నగర్‌లో భూగర్భ మురుగు కాలువ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.20 లక్షలతో యూజీడీ పనులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సునీత, వార్డు తెదేపా అధ్యక్షులు సన్యాసిరావు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వెలగపూడి రామకృష్ణబాబు, స్థానిక నాయకులు, తదితరులు

ఏయూలో పుస్తకావిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రచయితలు సామాజిక దృక్పథాన్ని కలిగి ఉండాలని ఆచార్య జర్రా అప్పారావు అన్నారు. ఏయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న సమకాలీన అంశాలను పుస్తక రచయితలు తమ రచనల్లో ప్రస్తావించాలని సూచించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు 'సందువ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆచార్య జి.యోహాన్ బాబు, ఆచార్య వెలమల సిమ్మన్న, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

సందువ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు

'గుత్త' దక్కించుకునేలా ప్రయత్నాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : చెత్త తరలింపు కేంద్రాల నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే గుత్తను తిరిగి దక్కించుకోవడానికి 'రాశా' సంస్థ గుత్తేదారుడు రోజూ జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గాజువాక, పాతనగరంలోని చెత్త తరలింపు కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో 'రాశా' సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని కమిషనర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయినా మెకానికల్ ఇంజినీర్లు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా సీసీఎస్ (క్లోజ్డ్ కాంపాక్షన్ సిస్టం) నిర్వహణ టెండర్లు దక్కించుకునేలా 'రాశా' ప్రతినిధులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తుండడంతో, ఆ సమావేశంలో తమ సంస్థపై ఎలాంటి చర్చ లేకుండా చూసేలా గుత్తేదారుడు నగరంలోని కూటమి కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

గుత్త సంస్థపై మేయర్‌కు ఫిర్యాదు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాల గుత్త సంస్థ దుర్గా కన్సల్టెన్సీపై కార్మికులు మంగళవారం మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. క్లాప్ వాహనాలతో వెళ్లి చెత్త సేకరించే కార్మికుల పర్యవేక్షకులుగా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, సంస్థ గుత్తేదారు ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏడాదిన్నర కిందట డబ్బులు తీసుకుని, నేటికీ ఉద్యోగాలు ఇవ్వలేదని వివరించారు. ఇటీవల ఆ గుత్త సంస్థను జీవీఎంసీ బ్లాక్ లిస్టులో పెట్టడంతో, తామంతా మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లపై విచారణ జరిపిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

బాధితుల సమస్యల పరిష్కారంపై దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : హెచ్ఐవీ బాధిత పిల్లలు, వారి అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మంగళవారం కేజీహెచ్ ప్రసూతి విభాగం సమావేశ మందిరంలో అంతర్గత శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్ఐవీ బాధితులకు అందుతున్న సహాయం, వారి ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు శ్రీహరి, రాధాకృష్ణ, రమణమూర్తి, సౌమని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఇతర వైద్యాధికారులు

అల్లుడిపై దాడి.. మేనమామలకు రిమాండ్

పీఎంపాలెం: పాత గొడవల నేపథ్యంలో అల్లుడిపై దాడి చేసిన కేసులో ముగ్గురు మేనమామలను పీఎంపాలెం పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ ఏడో వార్డు ప్రియదర్శిని కాలనీకి చెందిన పెంట్ర అప్పన్న (48) కుమార్తెకు అక్క కొడుకు ఆసనాల జాన్(33)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఈ ఏడాది జనవరిలో భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో పంచాయితీ పోలీసుల వరకు వెళ్లింది. దీంతో అల్లుడిపై కక్ష పెంచుకున్న అప్పన్న అతని సోదరులు పెంట్ర కుంటోడు(45), పెంట్ర అప్పడు(40) ముగ్గురు కలిసి ఈ నెల 5న జాన్‌ను కొట్టి చాకుతో గాయపరిచారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై డి.రాము తెలిపారు.

కొత్తవలసలో స్థిరాస్తి వ్యాపారిపై..

తగరపువలస, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై తన కార్యాలయానికి వెళ్తున్న స్థిరాస్తి వ్యాపారి కోరాడ అప్పలరాజు(42)పై ఆయన స్వగ్రామమైన జేవీఅగ్రహారం పరిధి కొత్తవలసలో మంగళవారం కత్తితో దాడి చేశారు. అదే గ్రామానికి చెందిన బీసపు శ్రీను (24) దారికాచి ఇంటినుంచి స్కూటీపై వస్తున్న ఆయనపై క్రిస్టియన్ లేఅవుట్ ప్రాంతంలో కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో అప్పలరాజు నుదిటిపై, కంటి వద్ద, రెండు చేతులకు కత్తిగాట్లు పడ్డాయి. ప్రాణభయంతో బిగ్గరగా కేకలు వేయడంతో సమీపంలోని వారు రాగా శ్రీను అక్కడ్నుంచి పారిపోయారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించుకుని గాయాలతోనే క్షతగాత్రుడు భీమిలి పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కొత్తవలసకు చెందిన అప్పలరాజు ప్రస్తుతం నగరంలోని విశాలాక్షినగర్ సమీప దయాల్‌నగర్‌లో ఉంటూ రోజూ స్వగ్రామంలోని తన స్థిరాస్తి కార్యాలయానికి వచ్చి పోతుంటారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. శ్రీవాణి తెలిపారు. చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని తమ కళాశాలలో ఈనెల 28వ తేదీ వరకూ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన ఆసక్తి గల విద్యార్థులు బీఎస్సీ గణిత, జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, కంప్యూటర్ సైన్సు, బీఏ చరిత్ర, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8522975829 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా టేబుల్‌టెన్నిస్ పోటీలు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు మంగళవారం గీతం డీమ్డ్ వర్సిటీలో జరిగాయి. అండర్-17 బాలుర విభాగంలో టి.సామ్‌వేద్, ఎన్.వేదాన్ష్, బాలికల విభాగంలో మౌపర్ణదాస్, ఎస్.కె.ఆరిఫాసుల్తానా, అండర్-19 బాలుర విభాగంలో మహిధర్‌వర్మ, చేతన్‌సాయి బాలికల విభాగంలో మౌపర్ణదాస్, శ్రీకర లాస్య వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. విశాఖ ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదాప్రసాద్‌దాస్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. బుధవారం అండర్-11, -13, -15 బాల, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో జిల్లా టీటీ సంఘం సభ్యులు డి.వి.ఎస్.వై.శర్మ, మురళీకృష్ణ పాత్రో, శాప్ డైరెక్టర్ రాజా రమేష్, అబ్జర్వర్ ఎం.అచ్యుత్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలతో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదాప్రసాద్‌దాస్, తదితరులు

సెక్యూరిటీ కౌన్సెల్ నూతన కార్యాలయం ప్రారంభం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగరంలో పోలీస్‌శాఖతో కలిసి పలు అవగాహన, సేవా కార్యక్రమాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థ సెక్యూరిటీ కౌన్సెల్‌కు సంబంధించిన కార్యాలయాన్ని మంగళవారం సీపీ శంఖబ్రతబాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంస్థకు తానే ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ట్రాఫిక్ సవాళ్లను పరిష్కరించడానికి, సైబర్ నేరాల నియంత్రణకు కౌన్సెల్ సభ్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే మహిళలు, చిన్నారుల భద్రత, నిరాశ్రయుల చేరదీత, యువత అభ్యున్నత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం.. తదితర అంశాలపై సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సెక్యూరిటీ కౌన్సెల్ సభ్యులు శ్రీకృష్ణ బాలాజీ, ధీరజ్, నారాయణ, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ★ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిని మంగళవారం సీపీ శంఖబ్రతబాగ్చీ ప్రారంభించారు.

కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రతబాగ్చీ, తదితరులు

(c) eenadu

బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఆర్థిక సాయం అందజేత

సీతంపేట, న్యూస్‌టుడే : ఆపదలో ఉన్న వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందని విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆరుగురు బాధితులకు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. నగర జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హరీష్, బషీర్, రాజయ్య, జరీనాబేగం, రితిక, సాహిల్ కుటుంబాలకు నగదు అందించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

'గుత్త' దక్కించుకునేలా ప్రయత్నాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : చెత్త తరలింపు కేంద్రాల నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే గుత్తను తిరిగి దక్కించుకోవడానికి 'రాశా' సంస్థ గుత్తేదారుడు రోజూ జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గాజువాక, పాతనగరంలోని చెత్త తరలింపు కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో 'రాశా' సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని కమిషనర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయినా మెకానికల్ ఇంజినీర్లు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా సీసీఎస్ (క్లోజ్డ్ కాంపాక్షన్ సిస్టం) నిర్వహణ టెండర్లు దక్కించుకునేలా 'రాశా' ప్రతినిధులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తుండడంతో, ఆ సమావేశంలో తమ సంస్థపై ఎలాంటి చర్చ లేకుండా చూసేలా గుత్తేదారుడు నగరంలోని కూటమి కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

న్యూస్‌టుడే, జగదాంబకూడలి ?: జీవీఎంసీ 29వ వార్డు కోడిపందాల వీధిలో పార్కింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనాల్లోంచి గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో పెట్రోల్ దొంగిలిస్తున్నారు. –ప్రసాద్. ✓: వీధుల్లో రాత్రి గస్తీని పెంచి, చోరీల నియంత్రణకు అడ్డుకట్ట వేస్తాం.– వరప్రసాద్, ఒకటో పట్టణ సీఐ.

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-10 లోని 8ఎ/3/2/3 వీధిదీపం వెలగక అవస్థలు పడుతున్నాం. –రఘురామరాజు ✓: వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. –అర్చన, వీధిదీపాల ఏఈ.

స్పందనకు వందనం

ఎట్టకేలకు మరమ్మతులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 36వ వార్డు చెంగళరావుపేట జీవీఎంసీ పాఠశాల ఎదురుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత శిథిలమై, మురుగు నీరంతా రోడ్డుపైకి చేరేది. తీవ్ర దుర్వాసతో స్థానిక నివాసితులు, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి.. మరమ్మతులు చేశారు.

నిధులన్నీ ఖర్చు... స్వచ్ఛతకు తూట్లు

మెరుగుపడని పారిశుద్ధ్యం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలో పారిశుద్ధ్య పనులకు ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా..., పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదు. దాదాపు 5 వేల మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులు నిత్యం క్షేత్రస్థాయిలో శుభ్రత పనులు చేస్తున్నారని, 560 క్లాప్ వాహనాలతో ఇంటింటా చెత్త సేకరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నా... కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛత కానరావడం లేదు.

సీతంపేట సమీప రహదారిపై...

నగరం నడిబొడ్డున..!.. నగర శివారు ప్రాంతాలు, మురికివాడల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా చెత్తాచెదారాలు కనిపించడం సర్వసాధారణం. కాని ఇప్పుడు నగర నడిబొడ్డున ఉన్న ప్రాంతాల్లోనూ అపరిశుభ్రత రాజ్యమేలుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా విశాఖ దక్షిణం, ఉత్తరం నియోజకవర్గాల్లోని అక్కయ్యపాలెం, సీతంపేట, అల్లిపురం, జ్ఞానాపురం, రెల్లివీధి, రామకృష్ణ బజారు, స్ప్రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాలలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

ఆయా రోజుల్లో... ప్రతి ఆదివారం పారిశుద్ధ్య కార్మికులకు సెలవు కావడంతో, వాణిజ్య సముదాయాల వద్ద, రహదారులపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. సోమవారం కార్మికులు విధులకు వచ్చినా... సాయంత్రం వరకు వ్యర్థాల కుప్పల్ని తరలించడం లేదు. దీంతో ఆయా రోజుల్లో రాకపోకలు సాగించే వారు, స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

యూజీడీలోనూ అంతే..! ✦ ద్వారకానగర్, డైమండ్ పార్కు పరిసర ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయశాలలు అధికంగా ఉండడంతో ఆయా వ్యర్థాలన్నీ భూగర్భ మురుగునీటి వ్యవస్థ గొట్టాల్లోకి మళ్లిస్తున్నారు.

✦ దీంతో ఎక్కడికక్కడ మురుగు స్తంభిస్తుంది. చిన్నపాటి వర్షం కురిసినా, ఆ ప్రాంతంలో యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి వ్యర్థ జలాలు రోడ్డుపైకి పొంగుతున్నాయి.

✦ కేవలం మురుగుదొడ్ల నుంచి మాత్రమే యూజీడీకి కనెక్షన్ ఉంచి, మిగిలిన కనెక్షన్లను తొలగించాల్సిన పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవడం లేదు. అత్యంత రద్దీగా ఉండే ఆయా ప్రాంతాల్లోని వాణిజ్య సముదాయాల ఎదుట యజమానులు శుభ్రత పనులు చేయించడం లేదు.

✦ మరోవైపు సెల్లార్లు చెత్తతో నిండిపోయి, ఈగలు, దోమలకు నెలవుగా మారుతున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగాధికారులు స్పందించి.. శుభ్రత చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

25 నుంచి అంచనాల కమిటీ పర్యటన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ 25 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనుంది. కమిటీ సభ్యులు 25వ తేదీ రాత్రి విశాఖ చేరుకుని, ప్రభుత్వ బంగ్లాలో బస చేస్తారు. 26న విశాఖ, 27న విజయనగరం, 28న శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి, 28వ తేదీ రాత్రి తిరుగుపయనమవుతారు. కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు, సభ్యులుగా భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, పార్థసారథి, సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, పి.వి.వి.సూర్యనారాయణరాజు, వరుదు కల్యాణి ఉన్నారు.

చెక్కు అందజేస్తున్న పూర్ణచంద్రరావు దంపతులు

కళాక్షేత్రం అభివృద్ధికి రూ.7.50 లక్షల విరాళం

మురళీనగర్, న్యూస్‌టుడే: వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వేములపల్లి కళాక్షేత్రం అభివృద్ధి పనులకు కాలనీవాసి, సీనియర్ సభ్యులు వేములపల్లి పూర్ణచంద్రరావు దంపతులు రూ.7.50 లక్షలు విరాళంగా అందజేశారు. మంగళవారం వేములపల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

20న మహా రుద్రాభిషేకం

అల్లిపురం, న్యూస్‌టుడే : అల్లిపురం సమీప కెప్టెన్ రామారావు కూడలిలోని శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 20వ తేదీన లింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం నిర్వహిస్తామని ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మహా రుద్రాభిషేకం, కోటి దీపారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 21వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు ప్రత్యేక దీపారాధన కార్యక్రమం ఉంటుందన్నారు.

త్వరితగతిన టీడీఆర్ పత్రాల జారీ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : అక్కయ్యపాలెం ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన వారికి త్వరితగతిన టీడీఆర్ పత్రాలు జారీ చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన అక్కయ్యపాలెం బాబా తాజుద్దీన్ అవులియా మసీదు పరిసరాల్లో పర్యటించారు. మసీదుకు సంబంధించిన ఆస్తి ఎంత వరకు కోల్పోయిందో ఆరా తీసి, అందుకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. అనంతరం మసీదు ప్రతినిధులతో మాట్లాడి, పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అలాగే 80 అడుగుల రోడ్డులోనూ ఆస్తులు కోల్పోయిన వారి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము, డీసీపీ రామ్మోహన్‌రావు, ఏసీపీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో మంగళవారం నుంచి ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత (ఏఎంఆర్)పై అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి పాల్గొని ప్రత్యేక వీడియో విడుదల చేశారు. అనంతరం వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు యాంటీ బయోటిక్స్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 'వర్తమానాన్ని కాపాడుకొండి... భవిష్యత్తును భద్రపరుచుకొండి' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదంతో కూడిన బ్యానర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.కల్యాణి, ఏఎంఆర్ నివారణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు ఐ.వాణి, పి.రత్నకుమారి తదితరులు

దాడులు ఆపాలని డిమాండ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో జగదాంబకూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు పెరిగాయని ఆరోపించారు. కేంద్రం చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు చంద్రశేఖర్, పైడిరాజు, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబకూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కనకమహాలక్ష్మికి స్వర్ణపుష్పార్చన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 బంగారు పుష్పాలు నివేదించి పూజలు చేశారు. అష్టాదళ పాదపద్మారాధన పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ శివారు గణేష్‌నగర్ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవస్థానంలో మంగళవారం ఉదయం లక్ష బిల్వార్చన, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సూర్యనారాయణ, కుమార్ ఆధ్వర్యంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాశరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గో పూజలో పాల్గొన్న భక్తులు

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక అనర్థాలు ఉంటాయని ఎస్ఐలు వెంకట్రావు, బి.బాలకృష్ణ అన్నారు. మంగళవారం 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్‌కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులంతా వ్యసనాలకు దూరంగా ఉంటూ, సన్మార్గంలో ముందుకు సాగాలన్నారు. హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, జ్యోతి, విశ్వనాథం, శ్రీనివాస్, భవిత ఉపాధ్యాయులు శారద, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మంజుల అన్నారు. మంగళవారం కళాశాల విద్యార్థులు స్థానిక వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. నేటి యువత డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు లావణ్య, హైమావతి పాల్గొన్నారు.

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని, బాగా చదువుకొని సమాజంలో గౌరవప్రదమైన స్థానం దక్కించుకోవాలన్నారు. తర్వాత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో...

26వ వార్డులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఐలు వెంకటరావు, బాలకృష్ణ, ఉపాధ్యాయులు

గుత్త సంస్థపై మేయర్‌కు ఫిర్యాదు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాల గుత్త సంస్థ దుర్గా కన్సల్టెన్సీపై కార్మికులు మంగళవారం మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. క్లాప్ వాహనాలతో వెళ్లి చెత్త సేకరించే కార్మికుల పర్యవేక్షకులుగా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, సంస్థ గుత్తేదారు ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏడాదిన్నర కిందట డబ్బులు తీసుకుని, నేటికీ ఉద్యోగాలు ఇవ్వలేదని వివరించారు. ఇటీవల ఆ గుత్త సంస్థను జీవీఎంసీ బ్లాక్ లిస్టులో పెట్టడంతో, తామంతా మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మార్గాలపై విచారణ జరిపిస్తామని మేయర్ హామీ ఇచ్చారు.

బాధితుల సమస్యల పరిష్కారంపై దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : హెచ్ఐవీ బాధిత పిల్లలు, వారి అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మంగళవారం కేజీహెచ్ ప్రసూతి విభాగం సమావేశ మందిరంలో అంతర్గత శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్ఐవీ బాధితులకు అందుతున్న సహాయం, వారి ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు శ్రీహరి, రాధాకృష్ణ, రమణమూర్తి, సౌమని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఇతర వైద్యాధికారులు

సమస్యల పరిష్కారానికి హామీ

సీతంపేట, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై పలు సమస్యలపై వినతులు అందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ఉత్సాహంగా టేబుల్‌టెన్నిస్ పోటీలు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు మంగళవారం గీతం డీమ్డ్ యూనివర్సిటీలో జరిగాయి. అండర్-17 బాలుర విభాగంలో టి.సామ్‌వేద్, ఎన్.వేదాన్ష్, బాలికల విభాగంలో మౌర్యవర్ధిని, ఎస్.కె.ఆరిఫాసుల్తానా, అండర్-19 బాలుర విభాగంలో మహిధర్‌ఫర్ష్, చేతన్‌సాయి, బాలికల విభాగంలో మౌర్యవర్ధిని, శ్రీకర లాస్య వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. విశాఖ ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదాప్రసాద్‌దాస్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. బుధవారం అండర్-11, -13, -15 బాల, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో జిల్లా టీటీ సంఘ సభ్యులు డి.వి.ఎస్.వై.శర్మ, మురళీకృష్ణ పాత్రో, టెక్నికల్ డైరెక్టర్ రాజా రమేష్, అబ్జర్వర్ ఎం. అచ్యుత్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలతో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదాప్రసాద్‌దాస్, తదితరులు

నూతన కార్యాలయం ప్రారంభం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగరంలో పోలీస్‌శాఖతో కలిసి పలు అవగాహన, సేవా కార్యక్రమాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థ సెక్యూరిటీ కౌన్సెల్‌కు సంబంధించిన కార్యాలయాన్ని మంగళవారం సీపీ శంఖబ్రతబాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంస్థకు తానే ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ట్రాఫిక్ సవాళ్లను పరిష్కరించడానికి, సైబర్ నేరాల నియంత్రణకు కౌన్సెల్ సభ్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే మహిళలు, చిన్నారుల భద్రత, నిరాశ్రయుల చేరదీత, యువత అభ్యున్నత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం.. తదితర అంశాలపై సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సెక్యూరిటీ కౌన్సెల్ సభ్యులు శ్రీకృష్ణ బాలాజీ, దీపక్, నారాయణ, ఎ.ఎల్.ఎస్. తదితరులు పాల్గొన్నారు. *నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిని మంగళవారం సీపీ శంఖబ్రతబాగ్చీ ప్రారంభించారు.

కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రతబాగ్చీ, తదితరులు

కార్యాలయం ముట్టడికి పిలుపు

సీతంపేట, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. డిసెంబరులో నిర్వహించే ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడికి కార్మికులు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన జిల్లా భవన నిర్మాణ కార్మికుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కోన సత్యారావు అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర, జిల్లా సభ్యులు లక్ష్మణ్, కృష్ణారావు, సూర్యనారాయణ, ఈశ్వరరావు, వై.ఎస్.మూర్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమణ

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మాధవధార, న్యూస్‌టుడే: కంచరపాలెం వెలమ వీధి రైల్వే ట్రాక్ సమీపంలో ఈ నెల 15న చెట్టుకు ఉరేసుకొని ఉన్న గుర్తు తెలియని వ్యక్తి అంత్యక్రియలను మంగళవారం పోలీసుల సమక్షంలో అవర్ హేండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్ఞానాపురం శ్మశానవాటికలో నిర్వహించారు. కంచరపాలెం పోలీసులు మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. వారం రోజులు అయినా ఎవరూ రాకపోవడంతో ఛారిటబుల్ ట్రస్ట్ ముందుకొచ్చి వారి సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

మాధవధార, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైనట్లు కంచరపాలెం పోలీసులు తెలిపారు. కంచరపాలెం దీప్తి నర్సింగ్ హోమ్ వద్ద నివాసం ఉంటున్న గణప మోహన్‌రావు (34) మనస్పర్థల కారణంగా భార్యతో వేరుపడి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. మద్యం తాగే అలవాటు ఉండటంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండురోజుల తర్వాత తిరిగి వచ్చేస్తుండేవాడు. ఈసారి అలా రాకపోవడంతో ఆయన తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

మాధవధార, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ చిన్నారులకు సృజనాత్మకత విద్యను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రామలక్ష్మి తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 53వ వార్డు నరేంద్రనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. క్రమం తప్పకుండా చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ఎప్పటికప్పుడు టి.హెచ్.ఆర్ పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి సెక్టార్లలో ఉన్న సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు తమ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, సమస్యలపై నివేదికను అందించాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీఓ నీలిమ, సూపర్‌వైజర్ జ్యోతి పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ రామలక్ష్మి

ప్రతిభ చూపి.. ప్రశంసలు పొందే...

మాధవధార, న్యూస్‌టుడే: గ్రంథాలయాల ద్వారా నిరంతరం కొత్త విషయాలను తెలుసుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వార్డులో ఉన్న ఎంఎన్ఆర్ పార్కులో ఉన్న గ్రంథాలయంలో మంగళవారం చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, చదరంగం పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎన్ఆర్ పార్క్ అధ్యక్షుడు అన్నెపు నారాయణరావు, సుదర్శరావు, నూకరాజు, శ్రీనివాస్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

సీతంపేట, న్యూస్‌టుడే : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విశాఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 'విశాఖ వైశిష్ట్యం' పేరిట పౌర గ్రంథాయలంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు.

ఎంఎన్ఆర్ పార్కులో చిన్నారులకు బహుమతులు అందజేసిన అతిథులు, నిర్వాహకులు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వాకర్స్‌క్లబ్ గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రంథాలయ పర్యవేక్షకులు నిమ్మగడ్డ బుచ్చయ్య ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన, వివిధ దేశాల కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన ఉంటుందని అధ్యక్షులు ఎస్.భానుప్రకాష్ తెలిపారు.

సిగరెట్ ఇవ్వలేదని దాడి

మాధవధార, న్యూస్‌టుడే: సిగరెట్ ఇవ్వలేదని దాడి చేసిన వ్యక్తిపై కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో నివాసముంటున్న గండిపల్లి ప్రసాద్ (50) ర్యాపిడ్ బైక్‌ను నడుపుతున్నాడు. సోమవారం రాత్రి ధర్మా నగర్ హైవేపై ఉన్న ఆటోలో కూర్చొని సిగరెట్ కాల్చుతున్నాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన అఖిల్ అనే యువకుడు మద్యం మత్తులో వచ్చి తనకు సిగరెట్ కావాలని అడిగాడు. తన వద్ద లేదని ప్రసాద్ చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో అఖిల్.. ప్రసాద్ ముఖం, గడ్డంపై తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో ప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: ఆరోగ్యకర సమాజానికి పారిశుద్ధ్య సిబ్బంది అందిస్తున్న సేవలు ఎనలేనివని, వారి సంక్షేమానికి జీవీఎంసీ ఎంతో కృషి చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. ఈ మేరకు 46వ వార్డులోని సంజీవయ్యకాలనీలో మంగళవారం జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రాలు, పారిశుద్ధ్య సామగ్రి పంపిణీ చేశారు.

మహనీయుల కృషి చిరస్మరణీయం

జగద్గురు పీఠం సలహా మండలి సభ్యుడు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: సమాజానికి నిస్వార్థంగా సేవలందించే మాస్టర్ ఇ.కె., పార్వతీకుమార్ వంటి మహనీయుల కృషి చిరస్మరణీయమని జగద్గురు పీఠం జాతీయ సలహా మండలి సభ్యుడు సి.హెచ్.ఎస్.ఎన్.రాజు అన్నారు. జగద్గురు పీఠం 55వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని తాటిచెట్లపాలెం మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.చంద్రశేఖర గురుప్రసాద్, ట్రస్ట్ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ది వరల్డ్ టీచర్ ట్రస్టు (జగద్గురుపీఠం) అయిదున్నర దశాబ్దాలుగా అందిస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ఈ సందర్భంగా స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. జగద్గురు పీఠం ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, ఎస్.వి.సత్యనారాయణ, బి.ఉషారాణి, దాట్ల రాధ, గొల్లపూడి రవికుమార్, సి.హెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో రాజు, గురుప్రసాద్, సత్యదేవ్ తదితరులు

(c) eenadu

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

యాంటీబయోటిక్స్ వినియోగంపై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో మంగళవారం నుంచి ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత (ఏఎంఆర్)పై అవగాహన వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి పాల్గొని ప్రత్యేక వీడియో విడుదల చేశారు. అనంతరం వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు యాంటీ బయోటిక్స్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 'వర్తమానాన్ని కాపాడుకుందాం... భవిష్యత్తును భద్రపరుచుకుందాం' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదంతో కూడిన బ్యానర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.కల్యాణి, ఏఎంఆర్ నివారణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు రాత్రుళ్లు జరపాలి

సింధియా(శ్రీహరిపురం), న్యూస్‌టుడే : ప్రమాదకర పనులను రాత్రిపూట కాకుండా పగలు చేయడం వల్ల మంగళవారం పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం పరిసరాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భూగర్భ విద్యుత్తు తీగల ఏర్పాటు పనుల కోసం భారీ క్రేన్‌తో పెద్ద పెద్ద బండ్లతో కూడిన డ్రమ్ములను సేవా రహదారిపై తరలించారు. ఈ కారణంగా ఉదయం డ్యూటీలకు వెళ్లే వారు ట్రాఫిక్‌లో నిలిచిపోయారు. ఈ తరహా పనులను రాత్రి పూట జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్తనక్కవానిపాలెం వద్ద రోడ్డుపై నిలిచిన వాహనాలు

సర్కారు బడికి 'సి.ఎస్.ఆర్' సొబగులు

సమకూరుతున్న మౌలిక వసతులు

కోరమాండల్ సంస్థ ఏర్పాటు చేసిన సైన్సు ప్రయోగశాల

మల్కాపురం, న్యూస్‌టుడే: మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆ స్థాయిలోనే మౌలిక వసతులు, సౌకర్యాలు కూడా అవసరం. ప్రతిదానికి ప్రభుత్వం మీద ఆధారపడకుండా స్థానిక పరిశ్రమలు తమ సామాజిక బాధ్యత నిధుల (సి.ఎస్.ఆర్.) నుంచి అందిస్తున్న నిధులతో కొన్ని సౌకర్యాలు సమకూరుతున్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం..

● వెయ్యిమంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ లేదు. ఈ విషయం తెలుసుకున్న కోరమాండల్ సంస్థ 2023లో పాఠశాలలో ప్రయోగశాలను రూ.6 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసింది. దీంతో పాటు తరచూ దంత వైద్యశిబిరాలు, సైన్సు మెళకువలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌ను ఏటా అందిస్తున్నారు.

● స్వజన వెల్ఫేర్ అసోసియేషన్ 'పేరుతో వాలంటీర్లను ఏర్పాటు చేసి ఎల్అండ్‌టీ వారు విద్యార్థులకు నిత్యం పరిసరాల పరిశుభ్రత, పోషకాహార ప్రాధాన్యత, ఆరోగ్యంపై శ్రద్ధ పెంపొందేలా అవగాహన తరగతులను నిర్వహిస్తున్నారు.

● ఇదే సంస్థ సురక్షిత నీటికి ఆర్వోప్లాంటు, చేతుల శుభ్రతకు వీలుగా కొళాయిలను ఏర్పాటు చేశారు. ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

● ఎల్అండ్‌టీ సంస్థ వారు విద్యార్థులకు తరగతి గదుల్లో కార్పొరేట్ అవసరమయ్యే బెంచీలను, 500 మంది విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలతో పాటు పోషకాహారం అందించడానికి 2025లో రూ. 3 లక్షల సంస్థ సీఎస్ఆర్ నిధులను పాఠశాలకు వినియోగించారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో..: పాఠశాలకు ఏ అవసరాలు ఉన్నాయో మేము ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తాం. వారు ఆయా సంస్థలకు చెప్పి వారి సహకారంతో సి.ఎస్.ఆర్. నిధులతో ఒక్కొక్కటిగా సమకూర్చుకుంటూ వస్తున్నాం. కొన్ని రకాల వసతులు సమకూరాయి. భవిష్యత్తులోనూ వారి సహకారం కోరుకుంటున్నాం. – లంక అరుణకుమారి, మల్కాపురం జీవీఎంసీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

నూతన తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న విద్యార్థులు, ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!

కణితి మార్కెట్ రోడ్డులో కష్టాలకు చెక్

మార్కెట్‌రోడ్డు మధ్యలో వాహనాలను పార్కు చేసిన దృశ్యం

గాజువాక, న్యూస్‌టుడే : నిత్యం ట్రాఫిక్ రద్దీతో కిక్కిరిసిపోయే గాజువాక కణితి మార్కెట్ రోడ్డులో వాహనాల అనధికార పార్కింగ్‌కు ట్రాఫిక్ పోలీసులు చెక్ పెట్టారు. కొత్తగాజువాక నుంచి పాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ఈ దారిలో ఇరువైపులా కూరగాయలు, గంపవ్యాపారాలు, తోపుడు రిక్షా, బడ్డీ వ్యాపారాలు తిష్టవేసి దారిని ఇరుకుగా మార్చేశారు. ఇది చాలదన్నట్లు కొనుగోలుదారులు తమవెంట తెచ్చిన ద్విచక్రవాహనాలను ఇష్టానుసారంగా పార్కు చేసేవారు. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు వార్తా కథనాలు వచ్చాయి.

★ గత రెండు రోజులుగా అధ్యయనం చేసిన పోలీసులు మంగళవారం స్పెషల్ ట్రాఫిక్ డ్రైవ్ చేపట్టారు. దారి పక్కన వాహనాలు పార్కు చేయకుండా కేవలం వ్యాపారులు తమకు కేటాయించిన మార్జిన్‌లోనే వ్యాపారాలు చేసుకునేలా, దారి మధ్యలో వాహనాలు నిలిపేలా మార్కింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ సీఐ షేక్ హుస్సేన్, పలువురు ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది రంగంలోకి దిగి డ్రైవ్ చేపట్టారు. అయితే కొనసాగింపు ఉంటేనే సత్ఫలితాలు వస్తాయని ప్రజలు అంటున్నారు.

సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ హుస్సేన్

హైమాస్ట్ దీపం ఏర్పాటు

అగనంపూడి, న్యూస్‌టుడే : పారిశ్రామిక పునరావాస కాలనీలోని శ్రీ పోలమాంబ ఆలయం వద్ద నూతనంగా హైమాస్ట్ దీపం ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు, పరిసర నివాసితుల కోసం జీవీఎంసీ అధికారులు ఈ సౌకర్యం కల్పించారు. మంగళవారం సాయంత్రం దీపానికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయం వద్ద విద్యుత్తు వెలుగులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: గాజువాక సినిమాహాలు కూడలి నుంచి పాతగాజువాక, 100 అడుగుల రోడ్డులో కాలువలు చెత్తతో నిండిపోయాయి. చిరు వ్యాపారులు చెత్తను కాలువల్లో పోసి మురుగు నీరు వెళ్లకుండా చేస్తున్నారు. –భాస్కరరావు, మెహర్‌నగర్, సన్యాసిరావు, గాజువాక

సమాధానం: సిబ్బందితో ప్రత్యేక శుభ్రతా పనులు చేయిస్తాం. –కిరణ్‌కుమార్, ఏఎంఒహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే: **?:** జీవీఎంసీ 92వ వార్డు నరసింహనగర్‌లోని పాఠశాలకి ఆనుకుని ఉన్న కాలువల్లో పూడికలు తీయడం లేదు. – **రాంబాబు, నరసింహనగర్**

✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – **గోపీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్,**

?: జీవీఎంసీ 89వ వార్డు ఖారవేలనగర్ రోడ్లు, డ్రైనేజీలు బాగు చేయాలి. – **జోసఫ్, ఖారవేలనగర్**

✔: రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం – ఎస్.వెంకటలక్ష్మీ, పనుల విభాగం డీఈ

కూడళ్లలో వెలుగులు

చినగంట్యాడ (గాజువాక), న్యూస్‌టుడే : ఎక్కడికక్కడ పడకేసిన హైమాస్ట్ దీపాలను జీవీఎంసీ జోన్-6 విద్యుత్తు సిబ్బంది మార్చారు. 'ఈనాడు' 'మేమున్నాం మీకుతోడుగా' దృష్టికి ప్రజలు దీపాల సమస్యను తీసుకెళ్లగా చినగంట్యాడ, ప్రశాంతినగర్, గోపాలరెడ్డినగర్ కూడళ్లలో హైమాస్ట్ దీపాలను వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో ఉమా రామలింగేశ్వరస్వామి పూజలు

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని విశిష్ట పూజలు జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. పూజల అనంతరం మహా అన్నప్రసాదం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా వస్తున్న భక్తులు

గోపాలపట్నంలో సినిమాలు	శ్రీనరసింహ : శివ, నరసింహం: జిగిరీస్, మౌర్య : కాంత	ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-1: సంతాన ప్రాప్తిరస్తు, స్క్రీన్-2: కాంతార స్క్రీన్-3: శివ

ఘనంగా లక్ష బిల్వార్చన పూజ

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక కాలనీలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం లక్ష బిల్వార్చన పూజను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరై స్వామి వారికి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ 79, 85 వార్డుల తెదేపా అధ్యక్షులు కరణం జగదీష్, కర్రి దశేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరీక్షలు తప్పనిసరి : కమిషనర్

గాజువాక, న్యూస్‌టుడే: తాగునీటి సరఫరాలో నీటి నాణ్యత పరీక్షలు నిరంతరం జరగాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ స్పష్టం చేశారు. మంగళవారం సుందరయ్య కాలనీ 10 ఎంజీడీ పంపింగ్ స్టేషన్‌ను నీటి సరఫరా విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి సరఫరా తీరు, నాణ్యత, సిబ్బంది పనితీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ సత్యనారాయణరాజు, జెడ్సీ శేషాద్రి, ఎస్ఈ ఏడుకొండలు తదితరులు కమిషనర్‌తో పాటు పర్యటనలో పాల్గొన్నారు.

పంపింగ్ స్టేషన్ వద్ద అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

సందడిగా క్రాంతి ప్రాపర్టీస్ వార్షికోత్సవం

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాకలో మంగళవారం క్రాంతి ప్రాపర్టీస్ సంస్థ 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఖాతాదారులు, మార్కెటింగ్ సిబ్బంది కేక్ కోసి మిఠాయిలు పంచుకున్నారు. సంస్థ ప్రతినిధి పెగడ చిన్నారావు, డైరెక్టర్లు వి.శ్రీనివాసరావు, కేవీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సరసమైన ధరలకు స్థిరాస్తులు అందించడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎన్.సూర్యనారాయణ, కె.పద్మజా శ్రీనివాస్, ఎస్.శంకరశ్రీనివాస్, జి.అనురాధ, లతా జయప్రకాశ్, సాంబశివరావు, నాయుడు, సాయిబాబా, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలో పాల్గొన్న క్రాంతి ప్రాపర్టీస్ ప్రతినిధులు

మాదకద్రవ్యాలతో ముప్పు

మాట్లాడుతున్న సీఐ పార్థసారథి, చిత్రంలో సూర్యకళ

గాజువాక, న్యూస్‌టుడే: బాల్యం నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని గాజువాక సీఐ అళహరి పార్థసారథి అన్నారు. మంగళవారం గాజువాక గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలపై బాలలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి సూర్యకళ, వార్డు సభ్యుడు పాలూరి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పెదగంట్యాడ గ్రంథాలయంలో చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించారు. న్యూపోర్టు ఎస్ఐ శ్యాంసుందర్, ఏఎస్ఐ రమణ, గ్రంథాలయాధికారి వీవీ రమణ పాల్గొన్నారు.

గోపాలపట్నం, న్యూస్‌టుడే : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని జీవీఎంసీ 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ అన్నారు. మంగళవారం స్థానిక కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింధియా(శ్రీహరిపురం), న్యూస్‌టుడే: మాదకద్రవ్య రహిత సమాజం కోసం అంకిత భావంతో పనిచేస్తేనే లక్ష్యసాధన సాకారం కాగలదని మలేరియా విభాగం ఏడు వార్డుల అధికారి డి.రవికుమార్ అన్నారు. మంగళవారం 58వ వార్డు శ్రీహరిపురంలో నిర్వహించిన 'నషాముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల తలెత్తే అనర్థాలను వివరించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న శానిటరీ సిబ్బంది

పేదలకు దుప్పట్ల పంపిణీ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక కాలనీలోని సర్వహిత ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం 60 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పెరిగిన చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ట్రస్టు మాజీ అధ్యక్షుడు గంధోళి నర్సింగరావు, వరలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు గుదే సుశీలగజేంద్రరావు, అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు పట్టా రామఅప్పారావు, వి.వెంకటరమణ, కె.హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ అభివృద్ధికి ప్రణాళికలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆదేశాల మేరకు విశాఖపట్నం వ్యవసాయ, మార్కెట్ కమిటీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గోపాలపట్నం రైతుబజార్‌ను సందర్శించారు. రైతుబజార్ అభివృద్ధిలో భాగంగా భవిష్యత్తు అవసరాల నిమిత్తం పలు ప్రణాళికలు రూపొందించారు. వినియోగదారుల రద్దీ మేరకు ఇప్పుడున్న ప్రవేశమార్గాన్ని మూసివేసి.. అన్నక్యాంటీన్ వైపుగా నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. రోడ్డుపై ఉన్న వ్యాపారులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ ఆలోచనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ యలమంచిలి అపర్ణ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మార్కెట్ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. మింది గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడివాడ లతీశ్, పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కళాకృతులు భళా..!

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామ్ హిందుస్థాన్ షిప్‌యార్డుకాలనీలో ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుగుణవతి పర్యవేక్షణలో విద్యార్థులు పలు కళాకృతులను తయారు చేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీగ్రాం గ్రంథాలయాధికారి బి.కనకరాజు, ఉపాధ్యాయుల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

తాము తయారుచేసిన ఆకృతులను చూపిస్తున్న విద్యార్థులు

తెలుగు రచనలవైపు యువత మొగ్గుచూపాలి

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే: తెలుగు రచనల పట్ల రెండు తెలుగు రాష్ట్రాల యువత మొగ్గుచూపాల్సిన అవసరం ఉందని కళారత్న సుంకరి చలపతిరావు అన్నారు. మంగళవారం గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషా సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలుత పలువురు కవులు తెలుగు రచనలను, కవిత్వాలను చదివి వినిపించారు. కవి సమ్మేళనాన్ని జిల్లా నోడల్ అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి సమన్వయం చేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు పలువురు కవులను సత్కరించారు.

తెలుగు కవులను సత్కరించిన దృశ్యం

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

గాజువాక, న్యూస్‌టుడే : సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడాన్ని తట్టుకోలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రతన్ కాంత్ అన్నారు. మంగళవారం గాజువాక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

నేటి నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు

సాయిరాంనగర్(గాజువాక), న్యూస్‌టుడే : కొత్తగాజువాక సాయిరాంనగర్‌లో శ్రీసాయి కృపామందిరంలో భగవాన్ సత్యసాయిబాబా 100వ జయంత్యుత్సవాలకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 19 నుంచి 23 వరకూ ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాయి కృపామందిరం కన్వీనర్ ఉమాశంకర్ తెలిపారు.

ప్రత్యేక రైళ్లు నడపాలని వినతి

కూర్మన్నపాలెం (అగనంపూడి): రద్దీమార్గాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడపాలని దువ్వాడ రైల్వే వినియోగదారుల సంఘ అధ్యక్షుడు కె.ఈశ్వర్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం అంతర్జాలం ద్వారా దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు పంపారు. వచ్చే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల సమయాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లు నడపాలన్నారు.

'గుత్త' దక్కించుకునేలా ప్రయత్నాలు

కార్పొరేషన్: చెత్త తరలింపు కేంద్రాల నుంచి కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే గుత్తను తిరిగి దక్కించుకోవడానికి 'రాశా' సంస్థ గుత్తేదారుడు రోజూ జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గాజువాక, పాతనగరంలోని చెత్త తరలింపు కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో 'రాశా' సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని కమిషనర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయినా మెకానికల్ ఇంజినీర్లు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా సీసీఎస్ (క్లోజ్డ్ కాంపాక్షన్ సిస్టం) నిర్వహణ టెండర్లు దక్కించుకునేలా 'రాశా' ప్రతినిధులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తుండడంతో, ఆ సమావేశంలో తమ సంస్థపై ఎలాంటి చర్చ లేకుండా చూసేలా గుత్తేదారుడు నగరంలోని కూటమి కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

బాధితుల సమస్యల పరిష్కారంపై దృష్టి

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఇతర వైద్యాధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: హెచ్ఐవీ బాధిత పిల్లలు, వారి అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మంగళవారం కేజీహెచ్ ప్రసూతి విభాగం సమావేశ మందిరంలో అంతర్గత శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్ఐవీ బాధితులకు అందుతున్న సహాయం, వారి ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు శ్రీహరి, రాధాకృష్ణ, రమణమూర్తి, సౌమని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూడిక పనులు వెంటనే చేయండి

కరాస, న్యూస్‌టుడే : గవరకంచరపాలెం నుంచి షిప్‌బిల్డింగ్ వరకు వెళ్లే గెడ్డలో పూడిక తీసి మురుగునీరు సజావుగా వెళ్లేటట్లు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ 56వ వార్డులో పర్యటించారు. కార్యక్రమంలో జోన్-5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, జీవీఎంసీ ఈఈలు తారాప్రసన్న, మురళికృష్ణ, డీఈ వీరయ్య, వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గెడ్డను పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

కరాస, న్యూస్‌టుడే : 56వ వార్డు చాకలిగెడ్డకు చెందిన పూజారి ఉదయ్ అనే బాలుడు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ. 38వేల చెక్కును ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా బాలుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్-5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లిరావు, కార్పొరేటర్ రాజశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగోత్సవ్‌లో పతకాల పంట

గాజువాక, న్యూస్‌టుడే: ముంబయిలోని రంగోత్సవ్ సంస్థ ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి బాలబాలికలు చిత్రలేఖన (రంగోత్సవ్ సెలబ్రేషన్స్) పోటీల్లో గాజువాక హైస్కూలు విద్యార్థులు పతకాల పంట పండించుకున్నారు. వీరికి మంగళవారం హైస్కూలు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం విజయప్రశాంతి, చిత్రలేఖనోపాధ్యాయుడు ఎస్.ఎన్.భావనారుషి, ఉపాధ్యాయులు విశ్వేశ్వరరావు, శ్యాంప్రసాద్ చేతుల మీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం విజయప్రశాంతి, ఉపాధ్యాయులు

మారని పోర్టురోడ్డు దుస్థితి

ఫోకస్

దారిలో పార్కుచేసిన వాహనాలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గంగవరం పోర్టు అప్రోచ్‌రోడ్డు అనధికార వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. కణితిరోడ్డు వై.జంక్షన్ కూడలి నుంచి పోర్టుకు వెళ్లే ఈ దారిలో అడుగడుగునా ట్యాంకర్లు, డంపర్లు, లారీలను ఇష్టానుసారంగా పార్కుచేస్తూ అటుగా వెళ్లేవారికి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఈ దారి పక్కన స్వతంత్రనగర్, ఎస్టీకాలనీ, పలు అపార్టుమెంట్లు, నివాసితకాలనీలు ఉన్నాయి. ఆయా ప్రాంతవాసులు రోడ్డు ఎక్కాలంటే అనధికార వాహనాల కారణంగా బిక్కుబిక్కుమంటున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు డ్రైవ్ చేసి వాహనాల నిలుపుదలను నియంత్రించేవారు. కొద్దిరోజులుగా చర్యల్లేక ఎక్కడెక్కడి నుంచో భారీ వాహనాలను తెచ్చి రోజులతరబడి దారికి ఇరువైపులా పార్కు చేస్తున్నారు. దీనివల్ల రాత్రి వేళ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

వాహనాలు, పశువులతో అస్తవ్యస్తంగా..

ఇష్టానుసారం తవ్వేసి.. ఇలా వదిలేసి..

దర్పణం

శ్రీనగర్ (గాజువాక), న్యూస్‌టుడే: గాజువాక 71వ వార్డు పరిధి శ్రీనగర్ కొండప్రాంత కాలనీల్లో భూగర్భ పైపులైన్లు, కేబుల్, మురుగుపారుదల వ్యవస్థ కోసం ఇష్టానుసారంగా గోతులు తవ్వేశారు. రెండేళ్లుగా ఎక్కడికక్కడ రోడ్లను గోతులు చేసి వాటిని పూడ్చకుండా వదిలేయడంతో నివాసితులు అవస్థలు పడుతున్నారు. ఒక కాలనీ నుంచి మరొక కాలనీకి వెళ్లాలంటే దిక్కులు చూడాల్సి వస్తోంది. సుందరయ్యకాలనీ, శ్రీరామ్‌నగర్, దుర్గానగర్, దిబ్బపాలెంవాసులు ఇళ్ల ముందర గోతుల దృష్ట్యా అసంపూర్తి పనులు పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలని వీరంతా కోరుతున్నారు.

శ్రీనగర్‌లో..

గ్రేటర్ విశాఖ ప్రజలకు బిల్డర్స్‌కు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
బిల్డర్స్ డే శుభాకాంక్షలు
FLATS FOR SALE
EXTRA AMENITIES

❖ Green Building Concept
❖ Open Air Theater
❖ Box Cricket
❖ Open Gym
❖ Walking Track
❖ EV charging Points
❖ Rain Showers
❖ 5 years Warranty
98491 54567, 97042 55255
KAPU JAGGARAJUPETA,
NEAR VIGNAN WOMEN'S COLLEGE, VIZAG

(c) eenadu

చిట్టితల్లి.. చిక్కుకోకు

నేడు ప్రపంచ పిల్లల వేధింపుల నివారణ దినం

చిన్నారితో మాటలు కలుపుతారు.. తినుబండారాలు, వస్తువులు ఇచ్చి ఆశ చూపుతారు.. అవకాశం చిక్కగానే పైశాచికంగా ప్రవర్తించి పసి హృదయంపై మాయని గాయం చేస్తారు. ఉమ్మడి జిల్లాలో బాలికలపై వేధింపులు, అత్యాచారాలు ఆగడం లేదు. ఏటా 70కి పైగా పోక్సో కేసుల నమోదు తీవ్రతను చెబుతోంది. ఆయా ఘటనల్లో నిందితులు బంధువులు, బాగా తెలిసినవారే ఉంటున్నారు. తల్లిదండ్రులే ఎదుటి వ్యక్తి ప్రవర్తన, దాని అర్థం వివరించాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు, పార్వతీపురం పట్టణం



ఆపదను గుర్తించేలా..

ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షలకు పైగా బాలికలు, మహిళలున్నారు. తరచూ ఏదో ఒకచోట వేధింపుల ఘటనలు బయటపడుతున్నాయి.

గుడ్ టచ్: సురక్షితంగా, సౌకర్యంగా అనిపించేది గుడ్ టచ్. ఉదాహరణకు భుజం, వెన్ను తట్టడం, చేయి పట్టుకుని నడిపించడం, 'షేక్ హ్యాండ్'. గ్రామం, ఇంటి గుమ్మం దాటని మరెన్నో పిల్లలకు బాగా తెలిసిన వారినుంచి ఏదైనా ఇబ్బంది ఎదురైతే దానిని గుర్తించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. ఆపదను గుర్తిస్తే త్వరగా బయటపడే అవకాశం ఉంటుంది.

బ్యాడ్ టచ్: అసౌకర్యంగా అనిపించి భయం, ఆందోళన కలిగేది. గిల్లడం, బలవంతంగా కౌగిలించుకోవడం, ముద్దు పెట్టడం, పెట్టమని చెప్పడం.. ప్రైవేటు భాగాలను తాకడం, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరించడం.

అనుచితంగా ప్రవర్తిస్తే..

పిల్లలకు ఎవరి నుంచైనా అసౌకర్యం అనిపిస్తే వద్దు అని గట్టిగా చెప్పి, ఆ ప్రాంతం సురక్షితం కాదని పరుగెత్తాలి. అనుచితంగా ప్రవర్తిస్తే గట్టిగా అరవాలి. తక్షణం నమ్మకమైన పెద్దలకు విషయాన్ని చెప్పాలి.

– భారతి, అడల్ట్ కౌన్సిలర్

విస్తృత అవగాహన

శక్తి బృందాలతో కలిసి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇబ్బందికర ప్రదేశాల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలియజేస్తున్నాం.

– ఎల్.శ్రీనివాసరావు, ఏఎస్సై, శక్తి బృందం

26న అంచనాల కమిటీ రాక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర అంచనాల కమిటీ ఈనెల 26, 27వ తేదీల్లో జిల్లాలో పర్యటించనుంది. వచ్చే బుధవారం సాయంత్రానికి కమిటీ సభ్యులు చేరుకుని రామనారాయణాన్ని సందర్శించి, తర్వాత ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. 27న ఉదయం పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని, 10.30 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమవుతారు. ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారథి, పాసిం సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు 2019-20 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన అంశాలను పరిశీలించనున్నారు. జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

మన పల్లెలు.. సినిమా లోగిళ్లు

సినిమా ఓ రంగుల ప్రపంచం.. అలాంటి దృశ్యకావ్యాల్లో మన ఊరు.. మన గుడి.. బడి.. కట్టడాలు కనిపిస్తే ఆ ఆనందమే వేరు. ఒకప్పుడు గోదావరి జిల్లాల్లోనో.. కర్నూలు బుర్రు.. విజయవాడ బెంజ్ సర్కిల్ వద్దో చిత్రీకరణలు సాగేవి. ఇప్పుడు మన ప్రాంతంలోనూ దర్శకులు వస్తున్నారు. మన్యం, మైదానం, అటవీ ప్రాంతాల్లో షూటింగ్‌లు చేస్తున్నారు. పర్యాటకానికి అవకాశం కల్పిస్తూ.. ప్రేక్షకులకు ఆనందం పంచుతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, గంట్యాడ, పాలకొండ

గంట్యాడలోని గిరివినాయక ప్రాంతంలో సినిమా చిత్రీకరణ

శోభన్‌బాబు నుంచి శ్రీవిష్ణు వరకు..

తొలిపొద్దులో 35 ఏళ్ల క్రితం నుంచే చిత్రీకరణలు జరుగుతున్నాయి. శోభన్‌బాబు 'జీవితం', కమల్‌హాసన్ 'మరోచరిత్ర', చిరంజీవి 'రాక్షస శపథం', సుమన్ 'పరువు ప్రతిష్ఠ', బాలకృష్ణ 'బొబ్బిలి సింహం'లో కొన్ని సన్నివేశాల్ని ఇక్కడ తీశారు. అప్పట్లో కేవలం 15 రోజులపాటు బాలకృష్ణ, రమ్యకృష్ణ, మీనా, శరత్‌బాబు, కైకాల సత్యనారాయణ, జగ్గయ్య, శారద తదితరులు స్థానికులకు అందుబాటులో ఉండేవారు. 'పోలో' కోసం నారా రోహిత్, ప్రకాశ్‌రాజ్ వచ్చారు. అల్లరి నరేష్ 'మడత కాజా' చిత్రీకరణ జరిగింది. ఆర్.నారాయణమూర్తి సారథ్యంలో వచ్చిన మూడు చిత్రాలను ఇక్కడే తీశారు. గత నెలలో హీరో శ్రీవిష్ణు బృందం సందర్శించింది.

పవన్‌కల్యాణ్ పిలుపుతో..

ఇటీవల మన్యానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. నలుమూలల పార్వతీపురం రావాలని, ఇక్కడ కూడా చిత్రీకరించాలని కోరారు. దీంతో అప్పటి నుంచి 15 చిత్ర బృందాలు వచ్చాయి. ప్రముఖ యాంకర్ సుమ నటించిన 'జయమ్మ పంచాయతీ'లో కొంత భాగాన్ని పాలకొండ మండలం పెదకోటిపల్లి సమీపంలో తీశారు.

నగరంలో సందడి

విజయనగరం పట్టణంలోని అశోక్ బంగ్లా, రాజుల కోట, జాబిలి లాడ్జి, గంటస్తంభం, జొన్నవలస రాజుల ఇల్లు, కోరుకొండ ప్రాంతాల్లో 'అనుగ్రహం', 'రెండు జెళ్ల సీత', 'సమరసింహారెడ్డి', 'నరసింహనాయుడు', 'శుభసంకల్పం', 'గూండా' తదితర చిత్రాల్లోని కొన్ని సన్నివేశాల్ని తీశారు. గతంలో పేర్లవారి ఇంట్లో శ్యామ్ బెనగల్ బృందం సందడి చేసింది.

ఉమ్మడి జిల్లాలో అందమైన ప్రాంతాలివీ..

- ★ ఎకో టూరిజం కేంద్రం
- ★ తాటిపూడి జలాశయం
- ★ చంపావతి, నాగావళి నదీ తీరాలు
- ★ విజయనగరం గంటస్తంభం, పెద్దచెరువు
- ★ పారామోటర్
- ★ భోగాపురం, డెంకాడ, ఎస్.కోటలోని రిసార్టులు
- ★ కోరాపుట్ గ్రామాల
- ★ ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్
- ★ రబ్బరు డ్యామ్
- ★ ఆడలి వ్యూపాయింట్
- ★ చింతపల్లి, ముక్కాం సముద్ర తీరం
- ★ గోవిందపురం, సాయిబాబా స్థూపం, రామనారాయణం

ఉపయోగాలివీ.. ★ పర్యాటకంగా అభివృద్ధి ★ స్థానికులకు ఉపాధి ★ వ్యాపారాలకు పునాది ★ యువతకు సినీ అవకాశాలు

పురిటిగడ్డ చరిత్రకు చెదలు

పాడైన సామగ్రితో నిండిన గది

నిర్వహణ లేక పైకప్పు పెంకులు ఊడిపోతున్న దృశ్యం

ఒక మహిళ ఎంతో సంకల్పంతో.. సుఖ ప్రసవాల కోసం చరిత్రలో తొలిసారి నిర్మించిన భవనం నిర్వహణ లేక శిథిలమవుతోంది. పైకప్పు పెంకులు ఊడిపడుతున్నాయి. విజయనగరం మహారాజ వంశీయుల ఆడ బిడ్డ రాణీ అప్పలకొండయాంబ 1904లో తన సొంత నిధులతో అంబటి సత్రం సమీపంలో సుమారు అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకర వాతావరణం కల్పించి.. ఘోష ఆసుపత్రి నిర్మించారు. 94 ఏళ్లపాటు ఎంతో మందికి పురుడు పోసిన ఈ వైద్యాలయంలో నేడు చెత్తా చెదారాలు, పందులు, కుక్కలే కనిపిస్తున్నాయి. మొత్తం పది గదులు ఉండగా, నాలుగు గదుల్లో ఇస్మాయిల్ కాలనీ పీహెచ్‌సీ, బోద నివారణ అర్బన్ కేంద్రం, టెలీ మెడిసిన్ విభాగం, రోగి సహాయకులు రాత్రివేళల్లో విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగిస్తున్నారు. మిగిలిన ఆరు గదులు వదిలేయడంతో పాడైపోతున్నాయి. వృథా సామగ్రి ఉంచే డంపింగ్ యార్డులుగా మారాయి. పాత భవనం పరిరక్షణ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఘోష ఆసుపత్రి సూపరింటెండెంటు అల్లు పద్మజ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం వైద్య విభాగం

బినామీదారుల గుండెల్లో.. నోటీసుల గుబులు!

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

జిల్లాలో జిందాల్ భూసేకరణలో బినామీలకు జరిగిన చెల్లింపులపై రెవెన్యూ అధికారులు తాజాగా నోటీసులివ్వడంతో బినామీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పరిహారం పేరుతో రూ.లక్షలు పక్కదారి పట్టించిన వ్యవహారంపై నాయకులు ఒత్తిళ్లు, విచారణ పేరుతో 17 ఏళ్లుగా తాత్సారం చేశారు. మరోసారి నోటీసులు ఇవ్వడంతో పలువురు ప్రజాప్రతినిధుల్లో ఆందోళన నెలకొంది.

జిందాల్ పరిశ్రమకు సేకరించిన భూములు

ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో 2007లో జిందాల్ అల్యూమినా పరిశ్రమ ఏర్పాటుకు 1,166 ఎకరాలను ప్రభుత్వం సేకరించి, పరిహారం చెల్లించింది. ఇందులో సాగులోలేని 12 మందికి 17.55 ఎకరాలకు సంబంధించి రూ.36.10 లక్షల పరిహారం చెల్లించడంతో 2008లో వివాదం తలెత్తింది. దీనిపై 'ఈనాడు'లో వెలువడిన కథనంపై అప్పట్లో రెవెన్యూ, ఏసీబీ అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగుచూశాయి. అప్పటి బినామీలకు నోటీసులు జారీ చేస్తూనే ఉన్నా.. స్పందన లేదు. ఇప్పుడు ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు జీవో వచ్చిన నేపథ్యంలో ఈ నోటీసులు రావడం అలజడి రేపుతోంది.

సందిగ్ధంలో నాయకులు

పరిహారం అందుకున్న వారంతా స్థానిక ప్రజాప్రతినిధుల అనుచరులు, బంధువులే. దీంతో అప్పట్లో ప్రభుత్వం చూసీ చూడనట్లు వదిలేసింది. కర్మాగారానికి అనుకూలంగా తీర్మానాలు ఇచ్చినందుకు నజరానాగా నలుగురు ప్రజాప్రతినిధులకు బినామీదార్ల పేర్ల మీద చెల్లించినట్లు సమాచారం. విషయం బయటకు పొక్కడం, విచారణ జరగడంతో విధిలేక ప్రభుత్వం రికవరీకి ఆదేశించింది. అప్పట్లో భూసేకరణలో కీలకంగా వ్యవహరించిన జిల్లా నాయకుడు, స్థానిక నాయకుడు ప్రస్తుతం వేర్వేరు పార్టీల్లో ఉండడంతో ఏం సమాధానం ఇవ్వాలన్న సందిగ్ధానికి గురవుతున్నట్లు సమాచారం.

వారం తర్వాత రికవరీకి చర్యలు

నోటీసులు అందుకున్న వారంలోగా తీసుకున్న పరిహారం చెల్లించాలి. లేకపోతే రెవెన్యూ రికవరీ చట్టం కింద వారి ఆస్తులు గుర్తించి, అటాచ్ చేసే ప్రక్రియ ప్రారంభిస్తాం. నోటీసు ఒకరికి అందింది. మిగతా వారు అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైంది. నేడో రేపో అందరికీ ఇస్తాం.

– డి.శ్రీనివాసరావు, తహసీల్దార్, ఎస్.కోట

తల్లీ.. పాహిమాం

విజయనగరం పైడితల్లి అమ్మవారు మంగళవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలాలయంలో వేకువజామున పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి చీరలు, రవికలు, పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం వరకు రద్దీ కనిపించింది.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

దీపార్చన సేవ



విజయనగరంలోని మూడు కోవెళ్లలో మంగళవారం రాత్రి మాస శివరాత్రిని పురస్కరించుకుని దీపార్చన సేవ జరిగింది. భక్తులు శివలింగం, శంకు, చక్రం, త్రిశూలం ఆకారంలో దీపాలను వెలిగించారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

భూసేకరణ సమాచారాన్ని సిద్ధం చేయాలి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: భూసేకరణకు సంబంధించిన అంశాలపై పూర్తిస్థాయి సమాచారాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తే, వెంటనే పరిష్కరించాలని సూచించారు. తన ఛాంబర్లో మంగళవారం భూసేకరణ, ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, రైల్వే, పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. పనులను నిర్దేశించిన గడువులో పూర్తిచేయాలన్నారు. కొత్త యూనిట్లు స్థాపించేందుకు ఔత్సాహికులకు అవకాశాలు కల్పించాలన్నారు. జేసీ సేధు మాధవన్, ఆర్డీవోలు కీర్తి, రామ్మోహన్‌రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ ప్రమీలాగాంధీ తదితరులు ఉన్నారు.

2.27 లక్షల మందికి రూ.150.03 కోట్లు

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద రెండో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. జిల్లాలో 2,27,700 మందికి రూ.150.03 కోట్ల మేర అందనుందని వ్యవసాయాధికారి వీటీ.రామారావు తెలిపారు.

నియోజకవర్గం	రైతులు	సాయం (రూ.కోట్లలో)
విజయనగరం	4,605	2.96
నెల్లిమర్ల	27,603	17.90
చీపురుపల్లి	36,916	23.91
గజపతినగరం	43,394	28.78
ఎస్.కోట	41,144	26.98
బొబ్బిలి	35,054	23.79
రాజాం	38,984	25.71

ఏ కన్నూ చూడదు.. కొండ మిగలదు..!

రెల్లి గ్రామ పరిధిలో కరిగిపోతున్న కంకర కొండ

తరలించడానికి సిద్ధం చేసిన గ్రావెల్

కొత్తవలస మండలంలో కంకర అక్రమ తవ్వకాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. జన సంచారం లేనప్పుడు, రాత్రి సమయాల్లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కొండల దిగువ భాగంలో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్లు, లారీల్లో తరలించుకుపోతున్నారు. లేఅవుట్లలో రహదారుల ఏర్పాటు, భూమి చదునుకు పంపి, సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ కంకర రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. అర్థానపాలెం, రెల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని కొండలను మంగళవారం 'న్యూస్‌టుడే' పరిశీలించినప్పుడు ఈ బాగోతం బయటపడింది. అర్థానపాలెం రెవెన్యూలో సర్వే నంబరు 55, రెల్లి రెవెన్యూలో సర్వే నంబరు ఒకటిలోని కొండల దిగువ భాగంలో(అంచున) తవ్వకాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అక్రమార్కులు తమ స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయాన్ని మండల రెవెన్యూ పరిశీలకుడు షణ్ముఖరావు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి, నిర్ధారించుకున్నారు. వీఆర్వోలతో రాత్రిపూట నిఘా ఉంచి, అక్రమ తవ్వకాలను అరికడతామని చెప్పారు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

సంకల్పించారు.. సాధించారు

న్యూస్‌టుడే– రేగిడి

ప్రభుత్వ బడి ఉనికిని కాపాడేందుకు.. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నారు ఉంగరాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు. 'మా బడి ప్రత్యేకతలు ఇవీ' అంటూ ఫ్లెక్సీ పెట్టి గర్వంగా ప్రచారం చేస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో పర్యటించి.. తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. మీ పిల్లల బాధ్యత మాది అని హామీ ఇచ్చారు. వారి సాధకబాధకాలు తెలుసుకుని, అండగా నిలిచారు.

ఫలించిన ఉపాధ్యాయుల కృషి

అందజేసిన సైకిళ్లతో విద్యార్థులు

63 నుంచి 102కు..

ఈ ఏడాది జూన్ నాటికి పాఠశాలలో 1 నుంచి 8 తరగతుల్లో కేవలం 63 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కనీసం ఈ సంఖ్య 100 దాటించాలని ఉపాధ్యాయులు భావించారు. సమీప గ్రామాల్లో పర్యటించారు. కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోకల్లో కలిగే ఇబ్బందులను చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు జి.రాంబాబు, సర్పంచి శోభా భుజంగరావు ఆలోచించారు. గుల్లపాడు, లచ్చరాయపురం గ్రామాల నుంచి వచ్చే ఆరుగురు విద్యార్థులకు హెచ్‌ఎం రూ.36 వేలతో సైకిళ్లు అందజేశారు. యాతపేట, కేఎం వలస, వండానపేట నుంచి వచ్చే విద్యార్థులకు సర్పంచి ఉచితంగా ఆటో ఏర్పాటు చేశారు. ఇందుకు ప్రతి నెలా రూ.4 వేలు వెచ్చిస్తున్నారు. నేడు విద్యార్థుల సంఖ్య 102కు చేరుకుంది.

నమ్మకం నిలబెట్టాలని..

ఇక్కడ సైన్స్ ఉపాధ్యాయుడి పోస్టు భర్తీ కాలేదు. దీంతో గురువులే తలో కొంత సమకూర్చుకుని వాలంటీరును నియమించుకున్నారు. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు ఒక ఉపాధ్యాయుడు స్టడీ అవర్ నిర్వహిస్తారు. స్మార్ట్ టీవీ వినియోగించి విద్యాబోధన చేస్తుంటారు. అందరి సహకారంతో విద్యార్థుల సంఖ్యను పెంచగలిగామని ప్రధానోపాధ్యాయుడు రాంబాబు చెబుతున్నారు. గ్రామస్థులు తమ మీద నమ్మకంతో పిల్లలను కాన్వెంటు మాన్పించి, ఇక్కడకు పంపిస్తున్నారని పేర్కొన్నారు.

సమయపాలన పాటించని వారికి నోటీసులు

బొబ్బిలి: చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

అయిదుగురిపై చర్యలకు కలెక్టర్ ఆదేశం

రామభద్రపురం, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రామభద్రపురం గ్రామ సచివాలయం-3ను సందర్శించారు. సిబ్బంది హాజరుపట్టిక, ప్రజలకు అందుతున్న సేవల జాబితాను పరిశీలించారు. ఉద్యాన శాఖ సహాయకురాలు వరలక్ష్మి, సర్వేయర్ వరప్రసాద్, వెల్ఫేర్ అరుణ చంద్రకుమారి సమయపాలన పాటించకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో రత్నంను ఆదేశించారు.

★ బొబ్బిలి మండలం పారాది అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. శని, సోమ, మంగళవారాల్లో మూడు రోజుల హాజరు నమోదు కాకపోవడం.. మంగళవారం మెనూ ప్రకారం భోజనం వండకపోవడంతో కార్యకర్త జి.విజయలక్ష్మిని సస్పెండ్ చేయాలని, సీడీపీవో విజయలక్ష్మికి షోకాజ్ జారీ చేయాలని పీడీని ఆదేశించారు.

వెంగళరాయలో త్వరలో బోటు షికారు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం ముచ్చర్లవలస సమీప వెంగళరాయసాగర్‌లో వచ్చేనెల నుంచి బోటు షికారు ప్రారంభించాలని మంత్రి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. అయిదు బోట్లను ఏర్పాటు చేయాలన్నారు. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. వీఆర్ఎస్ అంటే తన తండ్రి జన్ని ముత్యాలే గుర్తొస్తారని, అప్పట్లో ఎంతోమంది పోరాడి, గిరిజనుల సంక్షేమం కోసం ఈ ప్రాజెక్టును సాధించారన్నారు. ముత్యాలతోపాటు ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సబ్‌కలెక్టర్ వైశాలి, మత్స్యశాఖ ఏడీఈ సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రైతేరాజు 8లో

అక్కడ ఘటన.. ఇక్కడ అప్రమత్తత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్ దృష్ట్యా జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కొందరు సరిహద్దు ప్రాంతాల నుంచి తప్పించుకునే అవకాశం ఉందన్న సమాచారంతో ముమ్మర తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ దామోదర్ వెల్లడించారు. మంగళవారం రాత్రి జిల్లావ్యాప్తంగా వాహనాలను పరిశీలించామన్నారు. పాత నేరస్థులపై నిఘా పెట్టామని, ఎక్కడైనా గుర్తుతెలియని వ్యక్తులు కనిపించినా, వస్తువులున్నా పోలీసులు, 100, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ★ రైల్వేస్టేషన్ వద్ద తనిఖీల్లో భాగంగా ఓ కారులోని వ్యక్తులను ప్రశ్నించగా.. సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో ఒకటో పట్టణ స్టేషన్‌కు తరలించినట్లు ట్రాఫిక్ ఎస్సై భాస్కరరావు తెలిపారు.

రైల్వే స్టేషన్ సమీపంలో వాహన తనిఖీలు



(c) eenadu

ప్రమాదం వేలాడుతోంది!!



పాలకొండ ప్రధాన రహదారిలో ప్రమాదం పొంచి చూస్తోంది. స్థానిక గాయత్రీ దేవాలయం సమీపాన భారీ వృక్షానికి ఉన్న చెట్టుకొమ్మ విరిగి గత కొన్ని రోజుల నుంచి వేలాడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఈ దృశ్యం కళ్ల ముందే కనిపిస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. పరిశీలించి, వెంటనే కొమ్మను తొలగిస్తామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

నన్నిలా వదిలేస్తే ఊరుకుంటానా!!

రాజాం పట్టణంలోని పాలకొండ కూడలిలో శ్రీనివాస థియేటర్ రోడ్డులో రక్షిత తాగునీటి పథకం పైపులైను దెబ్బతినడంతో మరమ్మతులు కోసం తవ్వారు. ఈనెల 17న పనులు పూర్తిచేసినా.. ఇంకా గొయ్యిని పూడ్చకుండా వదిలేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఆలయాలు, ప్రధాన మార్కెట్‌కు వెళ్లే మార్గం కావడంతో నిత్యం అత్యంత రద్దీగా ఉంటోంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. చర్యలు తీసుకుంటామని ఏఈ వెంకటరామరాజు చెప్పారు. – న్యూస్‌టుడే, రాజాం

శిథిలం.. విధుల్లో భయం భయం



గంట్యాడ మండల కేంద్రంలో వివిధ గ్రామాల రైతులకు సేవలు అందిస్తున్న వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధమైంది. ఇక్కడకు నిత్యం రైతులు వస్తుంటారు. అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం ఇప్పటికే పెచ్చులూడుతోంది. మరోపక్క స్లాబ్ పట్టుకోల్పోతోంది. దీంతో కొన్ని రోజుల కిందట సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లిపోయారు. ఈ కార్యాలయంలో ఇంకా కొన్ని సేవలు అందుతుండడంతో ఎవరో ఒకరు వస్తున్నారు. అధికారులు స్పందించి, తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి శ్యామ్ కుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

బహుమతి సాధించిన విద్యార్థులు

జాతీయస్థాయిలో మెరిసిన మన చిత్రం

గరివిడి, న్యూస్‌టుడే: మహారాష్ట్ర యానిమల్ అండ్ ఫిషరీస్ సైన్స్ కళాశాల, భారత వైద్య పరిశోధన మండలి, వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈనెల 15న ఆన్‌లైన్‌లో జాతీయస్థాయిలో నిర్వహించిన 'వన్ హెల్త్ యూత్ కాంక్లేవ్- 2025'లో గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వేంకటేశ్వర విద్యాలయం తరఫున పాల్గొని, లఘుచిత్రం(షార్ట్‌ఫిల్మ్) విభాగంలో మూడో బహుమతి సాధించారు. మానవ, జంతు, పర్యావరణ ఆరోగ్యం మూడూ ఒక్కటేనని.. ఒకదాని ఆరోగ్యం మిగతా రెండింటిపై ప్రభావం చూపుతుందనే అంశంతో సృజనాత్మకంగా లఘు చిత్రాన్ని చిత్రీకరించారు. విద్యార్థులు వరుణ్, సూర్యభరత్, సాయి సంపత్, మణికంఠ, తరుణ్, హెప్సీబా, మృదుల రాగిణి నటించారు. కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను అభినందించారు.

ఇళ్ల మంజూరులో ఏఐ సాంకేతికత

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) 2.0 పథకం కింద పేదల ఇళ్ల మంజూరుకు సంబంధించిన ప్రక్రియలో ఏఐ(కృత్రిమ మేధ) సాంకేతికతను నిక్షిప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాజకీయాలు, అధికారుల ప్రమేయం లేకుండా ప్రాధాన్యత వారీగా గృహాలు కేటాయించాలన్నది ఈ కార్యక్రమ ఉద్దేశం. అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఆధారంగా తొలుత పాకలు, తర్వాత పెంకుటిళ్లు(కచ్చా) ప్రాధాన్య జాబితా తయారు చేస్తున్నారు. అందుకనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. [illegible] నిర్వహించిన [illegible] రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ మేరకు సూచనలు చేశారు.

సర్వే చేస్తున్న గృహనిర్మాణశాఖ అధికారులు

పెద్దఎత్తున దరఖాస్తులు..

గ్రామీణంలో పేదలకు ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే దిశగా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. గత నెల 22న యాప్‌ను ప్రారంభించారు. ఒక్కరోజే పనిచేసి, సాంకేతిక కారణాలతో తర్వాత నిలిపివేశారు. ఈనెల 8 నుంచి మళ్లీ అందుబాటులోకి రావడంతో సర్వేను పునరుద్ధరించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా గృహాల కోసం 36,711 దరఖాస్తులు వచ్చాయి. మళ్లీ పరిశీలించి, వివరాలను అప్‌డేట్ చేయనున్నారు. ఇప్పటివరకు 112 మందిని ఎంపిక చేశారు. ముందుగా సొంత స్థలంలో కట్టుకునేవారిని పరిగణనలోకి తీసుకుంటారు. మరోవైపు సచివాలయాల్లో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులతో పాటు కొత్తగా స్వీకరిస్తారు. ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించారు.

తప్పుగా నమోదు చేస్తే అంతే..

సర్వేలో ముందుగా సిబ్బంది ఫేషియల్ ఆధారంగా లాగిన్ అయి, తర్వాత లబ్ధిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. వారి ఫేషియల్, నివసిస్తున్న ఇల్లుతో పాటు కొత్తగా నిర్మించే స్థలాన్ని జియోట్యాగ్ చేసి అప్‌లోడ్ చేస్తారు. దీంతో తప్పులకు ఆస్కారం ఉండదని భావిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఒకరిని బదులు మరొకరిని నమోదు చేస్తే చర్యలు తీసుకుంటారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ సహాయకులు, సర్వేయర్లు తిరుగుతున్నారు. సచివాలయాల్లో అందుబాటులో ఉన్న [illegible] ఇతర సిబ్బందిని ఇందులో భాగస్వామ్యం చేసేలా ఇటీవల కలెక్టర్ ద్వారా ఎంపీడీవోలను ఆదేశించినట్లు గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు.

అక్కడ ఆగింది.. అర్బన్ పరిధిలో గృహాల కేటాయింపు ప్రక్రియలో [illegible]. విజయనగరం నగరపాలక సంస్థ, బొబ్బిలి, రాజాం పురపాలక సంఘాలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో సొంత స్థలం ఉండి, కట్టుకునేందుకు 1801 మంది ముందుకొచ్చారు. వీరిలో 1009 మందికి ఇప్పటికే ఇళ్లు మంజూరు చేశారు. సుమారు 150 మంది వరకు నిర్మాణాలు ప్రారంభించారు. తాజాగా కేంద్రం ప్రాధాన్యత కేటగిరీలో జిల్లాను చేర్చడంతో వచ్చే ఆర్థిక ఏడాది వరకు కొత్తవి మంజూరు కావని గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.మురళీమోహన్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణంలో త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు.

ఐదేళ్లు సంరక్షణ.. నిరంతర ఆదాయం

అన్నదాతకు సిరులు కురిపించే వక్క సాగు

మడకశిర, న్యూస్‌టుడే: వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తోంది. ఐదేళ్ల పాటు సంరక్షణ చేపడితే అనంతరం రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. [illegible] ఈ పంట సాగుతో పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

నేల ఎంపిక

సాధారణంగా వక్క అన్ని నేలల్లో పండుతుంది. 25 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే చల్లటి వాతావరణం సాగుకు అనుకూలంగా ఉంటుంది. నీరు నిలవకుండా ఉండే భూములు ఎంపిక చేసుకుంటే మొక్క త్వరితగతిన పెరిగేందుకు మంచి అవకాశం. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగులు

దూరం పాటించాలి. ఇలా ఒక ఎకరాలో 450 నుంచి 500 మొక్కలు నాటుకోవాలి. కొత్తగా నాటిన మొక్కలకు ఎండ నుంచి రక్షణ

నారు పోసే విధానం

సాగుకు ముందు 40 [illegible] ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్క నుంచి విత్తనాలు సేకరించాలి. వాటిని గోనెసంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీటిలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. ఈ మొలకలను మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి ఎరువు, సేద్యం ద్వారా నీరందించాలి. ఇలా అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. నాటిన అయిదేళ్ల అనంతరం ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కేజీల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి, ఉడకబెట్టి, ఆయుదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల ఎండిన వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోగా రూ.4 లక్షల నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూలచెట్లు, చెక్క ఇతర సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

కోసం నీడ ఇచ్చే అవిస మొక్కలను నాటుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు వేస్తే చాలు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. అంతర ఆయిల్‌కు వక్క పంట దిగుబడి ప్రారంభమవుతుంది.

రాష్ట్రంలోనే అమరాపురం అగ్రస్థానం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా, ఒక్క అమరాపురం మండలంలోనే 3,100 ఎకరాల్లో సాగులో ఉంది. అలాగే అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లోనూ ఈ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. అమరాపురం మండలంలో వక్క సాగు ద్వారా రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండడం గమనార్హం.

వర్షమొస్తే.. వరిని కాపాడుకుందాం

కురుపాం గ్రామీణం: వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సూచనలు పాటిస్తే పంటను రక్షించుకోవచ్చని కురుపాం వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు

రక్షణ చర్యలివే...: ● పంట కోసినప్పుడు వరి పనలు పలచగా వేసుకోవాలి. కొన్ని పనల కంకులు ఒకవైపుకు వచ్చినట్లు, మరికొన్ని కంకులు రెండోవైపునకు వచ్చేటట్లు వేస్తే కంకులు గడ్డితో కప్పినట్లు ఉండి మంచు నుంచి తేలికపాటి వర్షం నుంచి కొంత మేరకు రక్షణ కలుగుతుంది. ● పనలను చేలో బాగా ఆరనివ్వాలి. కంకులు నెమ్మదిగా ఎండితే బియ్యం దిగుబడి బాగుండడమే కాక నూక రావడం తగ్గుతుంది. ● పనలు ఆరక చేలోనే ఉండి వర్షం వస్తుందని భయం నెలకొన్నప్పుడు 20 కిలోల ఉప్పును వంద లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పనలపై చల్లితే వర్షం పడినా గింజ మొలకెత్తదు.

తెగులు సోకితే తీసేయాల్సిందే..

ప్రస్తుతం మిరప పంట శాఖీయ దశ నుంచి పూత దశలో ఉంది. ఎక్కువగా జెమిని వైరస్ (ఆకుముడత తెగులు) ఆశిస్తుంది. దీని నివారణకు వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. పొలంలో కలుపు నివారించాలి. పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 8-10 చొప్పున అమర్చాలి. నివారణకు పైరిప్రాక్సిఫెన్ 1.5 మి.లీ. లేదా పైరిప్రాక్సిఫెన్+ఫెన్ ప్రొప్రాతిన్ 1 మి.లీ. మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ప్రదీప్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పంట సాగులో తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందొచ్చని విజయనగరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

ప్రశ్న: రబీలో మొక్కజొన్న పంటను ఎప్పుడు విత్తుకోవాలి? – ఎం.రామలక్ష్మి, చీడివలస, కొత్తవలస మండలం

సమాధానం: మొక్కజొన్నను రబీలో అక్టోబర్ నుంచి నవంబర్ లోగా విత్తితే ఉత్పత్తి బాగుంటుంది.

ప్రశ్న: మినుము విత్తి 20 రోజులైంది. కలుపు నివారణ తెలపండి? – కె.ప్రసాదరావు, రుద్రుపేట, పాలకొండ మండలం

సమాధానం: మినుము పంట 20-25 రోజులకు వెడల్పాకు, గడ్డిజాతి కలుపు నివారణకు కలుపు 2-4 ఆకుల దశలో 200 మి.లీ. ఇమాజితాఫిర్ 5 శాతంను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న: మిరపలో ఎరువుల యాజమాన్యం వివరించండి? -ఎం.గౌరినాయుడు, గుణానపురం, కొమరాడ మండలం

సమాధానం: మిరపలో సేంద్రియ ఎరువులతోపాటు ఎకరాకు 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాష్‌ను వేయాలి. మొత్తం భాస్వరం ఎరువును ఆఖరి దుక్కిలో లేదా నాట్లు వేసే సమయంలో వేసుకోవాలి. యూరియా 65 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోల చొప్పున మొక్కలు నాటిన 30, 60, 90, 120 రోజుల వయసులో నాలుగు దఫాలుగా వేయాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

ఖరీఫ్‌లో సాగవుతున్న పంటల్లో సస్యరక్షణ చర్యలు, రబీ పంటల్లో విత్తన ఎంపిక, విత్తనశుద్ధి వంటి సలహాలకు 94410 13693 నంబరును సంప్రదించాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.కె.లక్ష్మణ్ తెలిపారు.

అవసరానికి మించి వాడితే అనర్థమే

మాట్లాడుతున్న సూపరింటెండెంటు పద్మజ

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: ఎన్నో ప్రాణాంతకమైన వ్యాధులను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించే యాంటీ బయోటిక్స్ మందులను అవసరానికి మించి వాడితే ముప్పు తప్పదని ప్రముఖ వైద్య నిపుణురాలు, విజయనగరంలోని మహారాజా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు అల్లు పద్మజ అన్నారు. యాంటీ బయోటిక్స్ అవగాహన దినం సందర్భంగా మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నచిన్న రోగాలకు ఔషధాలు వాడొద్దని కోరారు. వైద్యుల సూచన మేరకే ఉపయోగించాలని, ప్రతి విషయంలో ఆందోళన చెంది దుకాణాలకు వెళ్లి తీసుకోవడం సరికాదన్నారు. కొన్నింటికి టీకాలు అవసరమని, అలాంటివారు వీటిని వాడొద్దని సూచించారు. యాంటీ బయోటిక్స్ కారణంగా ఏటా లక్షల్లో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైక్రో బయాలజీ విభాగం హెచ్‌వోడీ అరుణశ్రీ, ప్రొఫెసర్లు రమణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	127	224	234

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ రాజుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతిలో ప్రైవేటు పాఠశాలలకు మించి ప్రభుత్వ బడుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆకాంక్షించారు. గతేడాది 87 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో ఏడో స్థానంలో ఉందని, ఈ ఏడాది మరింత ముందుకెళ్లాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో సూచనలు చేశారు. డిసెంబరు 5లోపు సిలబస్ పూర్తిచేసి, వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలన్నారు. వెనుకబడిన వారిని గుర్తించి, అదనపు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై దృష్టిపెట్టాలన్నారు.

ప్రశంసాపత్రాలు.. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన మాస్టర్లు, గైడ్ కెప్టెన్లను కలెక్టర్ అభినందించారు. జిల్లా కమిషనర్ బీపీఏ.రాజు, కె.సౌభాగ్యలక్ష్మి, కె.దుర్గానాగేశ్వరరావు, డి.ప్రవీణ్‌కుమార్, ఎ.కనకలక్ష్మి, పి.వి.శర్వాణి, వి.సూర్యనారాయణ, ఎన్.పుష్పలతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఈవో యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.రామారావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముస్సోరీకి మన అధికారి

వినోద్‌కుమార్

పార్వతీపురం పట్టణం: కుష్ఠు నిర్మూలన జిల్లా అధికారి ఎం.వినోద్‌కుమార్ ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ ఐఏఎస్‌లకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నారు. జిల్లాలో అమలు చేసిన ఆరోగ్య కార్యక్రమాలు, మాతా-శిశు మరణాల అదుపునకు తీసుకున్న చర్యలు, రక్తహీనత నియంత్రణ విధానాలు, సాధించిన ప్రగతిని వివరించనున్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా

క్రీడా విభాగం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బీఎస్ఎన్.మూర్తి ఇటీవల కాకినాడలో జరిగిన 14వ రాష్ట్ర తైక్వాండో- 2025 పోటీల్లో స్వర్ణం గెల్చుకొని సత్తా చాటారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ దామోదర్ తన కార్యాలయంలో సత్కరించారు. ఆరోగ్యం కాపాడుకుంటూ రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు తేవాలని ఆకాంక్షించారు. ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్బీ సీఐ లీలారావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మూర్తిని సత్కరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై ఉప కలెక్టర్ విచారణ

కొత్తవలస, న్యూస్‌టుడే: భూ రికార్డుల్లో మార్పు కోసం కొత్తవలస తహసీల్దారు నగదు తీసుకుని పనిచేయడం లేదని మిందివలసకు చెందిన వై.సూరిబాబు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 'భూ రికార్డుల్లో పేర్ల మార్పునకు లంచమడిగారు?' శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన వార్తకు కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కేఆర్ఆర్‌సీ ఉప కలెక్టర్ మురళి మంగళవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుతో మాట్లాడారు. హెచ్‌డీటీ సునీత, ఎంఆర్ఐ షణ్ముఖరావు, సర్వేయరు పున్నయ్య, చీపురువలస వీఆర్వో సరోజినితో చర్చించి, రికార్డులు తనిఖీ చేశారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, సిబ్బంది బుధవారం కలెక్టరేట్‌కు రావాలన్నారు. ఫిర్యాదుదారు కుటుంబీకులు పలు రెవెన్యూల్లో వంద ఎకరాలకు మించి కొనుగోలు చేశారని, దీనిపైనా విచారణ చేయాలని ఉప కలెక్టర్‌ను కోరినట్లు తెలుస్తోంది.

ఎంఎస్ఎంఈ పార్కు పనుల అడ్డగింత

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండలం కాకర్లవలస గిరిజన గ్రామం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు పనులను మంగళవారం గిరిజనులు అడ్డుకున్నారు. కొండ ప్రాంతంలో తమకు భూములు వద్దని, పార్కు వద్దే ఇవ్వాలని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు పనులు నిలిపివేశారు. డిప్యూటీ తహసీల్దారు గిరిధర్ చెప్పినా వినలేదు. సీఐ నారాయణరావు, ఎస్సై ప్రసాదరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం వద్ద అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో శాంతించారు.

గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు

పది రోజుల్లో ఉద్యోగ విరమణ.. అంతలోనే ఆగిన ప్రయాణం

వెంకటనాయుడు (పాత చిత్రం)

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఆయనో ఉపాధ్యాయుడు. కొడుకులిద్దరినీ బాగా చదివించారు. వారిద్దరూ వైద్య విద్య అభ్యసించారు. వైద్య సేవల కోసం ఇంటి ప్రాంగణంలోనే ఆస్పత్రిని సిద్ధం చేశారు. ఈ నెలాఖరుకు తానూ ఉద్యోగ విరమణ చేసి అందులోనే పిల్లలకు సాయంగా ఉందామని భావించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. బాధిత కుటుంబానికి తీరని వేదనను మిగిల్చింది. 'మా కోసం నాన్న ఎంతో చేశారు. కొద్ది రోజుల్లో ఆయన ఉద్యోగ విరమణ వేడుకలను ఘనంగా చేయాలని భావించాం. ఇలా అంతిమ సంస్కారాలు చేయాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు' అని కుమారులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గరుగుబిల్లి మండలం రావివలసకు చెందిన మరిశర్ల వెంకటనాయుడు(62) నర్సిపురం జడ్పీ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు. పార్వతీపురం పట్టణంలోని బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. మంగళవారం పాఠశాల తరగతులు ముగిశాక ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డుపై పడిపోయారు. చెవి, ముక్కు నుంచి రక్తం రావడంతో స్థానికులు ఆయన్ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందిస్తుండగా కన్నుమూశారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఉండవచ్చని, లేదా ఏదైనా అనారోగ్య సమస్యతో కింద పడిపోవడంతో దెబ్బ తగిలి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆయనకు భార్య లత, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు జిల్లా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న కుమారుడు ఎండీ పిడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీకి ప్రయత్నిస్తున్నాడు. ఆయన మృతిపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని రూరల్ ఎస్సై రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి మృత్యువాత

చంద్రశేఖరరావు (పాతచిత్రం)

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న ఆర్మీ విశ్రాంత ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన నగరపాలక సంస్థ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. విజయనగరం మండలం జమ్మునారాయణపురం గ్రామానికి చెందిన ఎస్.చంద్రశేఖరరావు(70) ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. మంగళవారం ధర్మపురిలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. బైక్‌పై తిరిగి వస్తుండగా రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో ఓ కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు స్పందించి, వెంటనే సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన భార్య అప్పలనరసమ్మ ఈ ఏడాది జనవరిలో మరణించారు. ముగ్గురు కుమార్తెలున్నారు. వారి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు.

కలలు కల్లలై

రోడ్డు ప్రమాదంలో యువ సైనికుడి దుర్మరణం

ప్రసాద్ (పాతచిత్రం)

మెరకముడిదాం, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల కష్టం గుర్తెరిగాడు.. ఉద్యోగం సాధిస్తే తప్ప తమ సమస్యలు తీరవని తెలుసుకున్నాడు.. దేశానికి సేవ చేయడంతో పాటు ఉపాధి దొరుకుతుందని సైనిక కొలువు కోసం కష్టపడ్డాడు. 19 ఏళ్లకే అస్సాం రైఫిల్స్‌లో ఉద్యోగం సాధించాడు.. చేరిన ఏడాదికే రోడ్డు ప్రమాదం ప్రాణాలను హరించింది. యువ సైనికుడి కలలను కల్లలుగా మిగిల్చింది. కుటుంబానికి దిక్కు లేకుండా చేసింది. ఈ విషాదకర ఘటన అసోంలో చోటుచేసుకుంది.

మెరకముడిదాం మండలం గొల్లలవలసకు చెందిన అడ్డూరి లక్ష్మి, పాపారావు దంపతులు వ్యవసాయ కూలీలు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు ప్రసాద్(20) కష్టపడి చదివి అస్సాం రైఫిల్స్‌లో కొలువు సాధించాడు. 2024 డిసెంబరు 14న విధుల్లో చేరాడు. మంగళవారం విధులు నిర్వర్తించడానికి ఇంకో జవానుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. డిఫెన్స్‌కు చెందిన వ్యాను వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ ఘటనాస్థలంలోనే మృతిచెందారు. బుధవారం మధ్యాహ్నం మృతదేహం చీపురుపల్లి చేరుకుంటుందని స్థానికులు తెలిపారు.

EENADU Classifieds

HOME NEEDS

WATER PURIFIER

హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తుంటే జుట్టు రాలడం, చర్మం పొడిబారడం & బట్టలు, పాత్రలు కడిగిన, ఉతికిన తెల్లగా రాకపోవడం మీ సమస్య? ✆ 7675873377.

REAL ESTATE

HOUSE FOR SALE

తోటపాళెం (బాలాజీనగర్) ముత్యాలమ్మగుడి ఎదురు ఏరియాలో RTC బస్టాండ్, కాలేజ్, స్కూల్స్‌కి దగ్గరలో 96 చ.గ. ఇండిపెండెంట్ ఇల్లు అమ్మబడును. Direct పర్సన్ సంప్ర ✆ 99854 14306.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

JOBS

కస్టమర్ అడ్రస్ వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కావాలి. 8125110304 గూడూరు, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, సూళ్లూరుపేట.

FACULTY/ TEACHERS

విజ్ఞాన భారతి హైస్కూల్ రావాడ భోగాపురం నర్సరీ, LKG, UKG బోధించుటకు D.Ed, B.Ed అర్హత గలవారు కావలెను. జీ:10 to 12K ✆ 9703711164

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

యోగా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ఎంపికైన అండర్-17 జట్టుతో పీడీలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్ల ఎంపికను మంగళవారం బొబ్బిలి పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అండర్- 14, 17 విభాగాలకు వేర్వేరుగా జట్లు ఎంపిక చేశారు. డివిజన్ ఇన్‌ఛార్జి ఎస్.వి.నాయుడు, 40 మంది పీడీలు పోటీలను నిర్వహించారు. 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటుకోవాలని ఎంఈవో జి.వాసు సూచించారు.

సేవా దృక్పథం అవసరం

దస్త్రాల తనిఖీలో కలెక్టర్

బొబ్బిలి, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులకు సేవా దృక్పథం అవసరమని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొబ్బిలి పట్టణంలోని సాయినగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చే ప్రజల విషయంలో సానుకూలంగా వ్యవహరించాలన్నారు.

20న డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

రాజాం: రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాదిలో మిగులు సీట్లకు ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పి.స్వప్న హైందవి మంగళవారం తెలిపారు. బీఏ ఎకనామిక్స్ 24, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ 16, బీఎస్సీ మ్యాథ్స్ 37, బీఎస్సీ జువాలజీ 28 సీట్లు ఉన్నాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

? కెల్ల గ్రామానికి వెళ్లే రోడ్డు రెల్లిపేట వద్ద అధ్వానంగా ఉంది. - **స్థానికులు** ★ నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. - **శ్రీనివాస్, పీఆర్ ఏఈ** – న్యూస్‌టుడే, గుర్ల

? రామభద్రపురం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ★ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం. - **రమేష్, ఏఈ** – న్యూస్‌టుడే, రామభద్రపురం

? పాలకొండ ప్రధాన రహదారి పక్కన కేర్ ఆసుపత్రికి వెళ్లే దారి సమీపంలో స్తంభానికి పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. - **స్థానికులు** ★ చర్యలు చేపడతాం. - **కుమార్, ఏఈ** – రాజాం పట్టణం

? రామభద్రపురం శివారు వీధుల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **స్థానికులు** ★ శుభ్రం చేయిస్తాం. - **విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ఖాళీ జాగా కనిపిస్తే పాగా

పట్టించుకోని అధికారులు

ముందు బడ్డీలు.. తర్వాత శాశ్వత దుకాణాలు

న్యూస్‌టుడే – చీపురుపల్లి

చీపురుపల్లి పట్టణంలో విజయనగరం- పాలకొండ, శ్రీకాకుళం ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలు ఆక్రమణల బారిన పడుతున్నాయి. పట్టణం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో చిన్నపాటి ఖాళీ స్థలం కనిపించినా పాగా వేసేస్తున్నారు. రహదారికి ఇరువైపులా బడ్డీలు పెట్టేసి, నెమ్మదిగా శాశ్వత దుకాణాలుగా మార్చేస్తున్నారు. రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని, రహదారుల విస్తరణ సమయంలో తొలగించడం కష్టమవుతుందని పలువురు వాపోతున్నారు.

చీపురుపల్లి గురుకుల విద్యాలయానికి ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు

● చీపురుపల్లి పట్టణ నడిబొడ్డున ప్రధాన రహదారికి ఆనుకుని అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయం వద్ద ఖాళీ స్థలంలో కొద్ది నెలల కిందట కొందరు దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇటీవల దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వీటి వల్ల బాలికలకు రక్షణ లేకుండాపోతోందని వాపోయారు.

● పట్టణ శివారున శ్రీకాకుళం రహదారిలో రావివలస కూడలి దాటాక రోడ్డు పక్కన కొందరు దర్జాగా శాశ్వత దుకాణాలు నిర్మించినా అధికారులు పట్టించుకోవడంలేదు.

చీపురుపల్లి, గరివిడి పట్టణాలు దాదాపు కలిసిపోయాయి. విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారికి ఆనుకుని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి రోడ్డు పొడవునా.. ఖాళీ స్థలం ఉంది. దీంతో బడ్డీలు వెలుస్తున్నాయి. మొదట తాత్కాలికంగా పెట్టినా తర్వాత శాశ్వత నిర్మాణాలు చేపట్టే ప్రమాదముందనే ఆరోపణలు వస్తున్నాయి.

ముందే మేల్కోవాలి..

విజయనగరం- పాలకొండ ప్రధాన దారిలో రెండు పట్టణాల మధ్య రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సమయంలో రద్దీ ఇబ్బందులను తొలగించడానికి శ్రీకాకుళం రహదారిని పుర్రేయవలస కూడలి వరకు విస్తరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలను ఇప్పుడే కట్టడి చేయకపోతే రానున్న రోజుల్లో కష్టమవుతుంది.

● గురుకుల పాఠశాల వెనుక రామాంజనేయకాలనీ రహదారికి ఆనుకుని శ్మశానం వద్ద స్థలంలో కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు.

చర్యలు చేపడతాం.. డిగ్రీ కళాశాల ఎదురుగా బడ్డీలు పెట్టనీయకుండా కొద్ది రోజుల కిందట అడ్డుకున్నాం. అక్కడ ఏర్పాట్లను తొలగించాం. గురుకుల పాఠశాల ఎదురుగా దుకాణాలపై తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి, తొలగించడానికి చర్యలు చేపడతాం.
– జార్జివెస్లీ, ఏఈ, ర.భ.శాఖ, గరివిడి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధాన్యాన్ని తూకం వేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పీఏసీఎస్‌లో మంగళవారం ఎమ్మెల్యే బేబినాయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గోనె సంచులు సరిపడా ఇవ్వాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా.. కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. గత ప్రభుత్వంలో సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం ధాన్యం మిల్లులకు చేరేలోపే ఖాతాల్లో జమవుతాయన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జనసేన నియోజకవర్గ బాధ్యుడు గిరడ అప్పలస్వామి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రౌతు రామ్మూర్తినాయుడు, పీఏసీఎస్ ఛైర్మన్ బి.శ్రీరామ్మూర్తినాయుడు, అల్లాడ భాస్కరరావు, తహసీల్దారు శ్రీను తదితరులు పాల్గొన్నారు. ● విశాఖలో ఇటీవల జరిగిన భాగస్వామ్య సదస్సు రాష్ట్రానికి వరమని ఎమ్మెల్యే అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి ఒక పరిశ్రమ రాబోతుందన్నారు.

అక్రమ భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం.. రాజాం: అనుమతుల్లేకుండా కట్టిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. దరఖాస్తుతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించాలని, రూ.10 వేలు ప్రాథమిక రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

తవ్వారు.. పూడ్చడం మరిచారు

గజపతినగరంలో మెంటాడ రోడ్డు నుంచి బాలాజీనగర్ కాలనీకి వెళ్లే దారిలో గుంత ప్రమాదకరంగా ఉంది. పది రోజుల క్రితం పైపులైను మరమ్మతులకు గురైంది. పనులు చేసేందుకు అధికారులు తవ్వారు. దానిని పూడ్చకుండా వదిలేశారు. ఈ మార్గంలో స్థానికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మలుపు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం పంచాయతీ కార్యదర్శి జనార్దనరావు వద్ద ప్రస్తావించగా.. గుంతను పూడ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

తాగునీటికి కటకట

దత్తిరాజేరు మండలం సరయ్యవలస ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. బొబ్బిలి మండలం పాల్తేరు సమగ్ర మంచినీటి పథకం నుంచి మండలంలోని పలు గ్రామాలకు సరఫరా కావాలి. పోరలి గ్రామం మీదుగా వేసిన భూగర్భ పైపులైను ద్వారా నీరు ట్యాంకులోకి ఎక్కడంలేదు. దీంతో స్థానిక పాఠశాల వద్ద ఓ బోరు తవ్వించారు. రెండు రోజుల పాటు మోటారును ఆన్‌చేసి, మూడో రోజు కుళాయిల ద్వారా ఇస్తున్నారు. ప్రస్తుతం మోటారు కాలిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు

ఏళ్లు గడుస్తున్నా.. పైపులు అక్కడేనా?

రేగిడి మండలం ఉంగరాడ మెట్ట సమీపంలోని కొండ ప్రాంతంలో రక్షిత నీటి పథకం పైపులు నిరుపయోగంగా పడి ఉన్నాయి. రాజాం, చీపురుపల్లి పథకాల పైపులైన్లు వేసే సమయంలో వీటిని ఉంచినట్లు స్థానికులు చెబుతున్నారు. పనులు పూర్తయి చాలా ఏళ్లు గడుస్తున్నా.. వాటిని మాత్రం అలానే వదిలేశారు. నాలుగైదు చోట్ల ఇలానే ఉన్నాయి. ఎవరు, ఎందుకు ఉంచారో తెలియడంలేదని, కనుక్కొని చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజేష్ చెప్పారు. – న్యూస్‌టుడే, రేగిడి

రోడ్డుపై చెట్లు తొలగించరూ

మెరకముడిదాం మండలంలో తుపాను సమయంలో రోడ్లపై పడిన చెట్లను నేటికీ తొలగించలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఊటపల్లి నుంచి మెరకముడిదాం వెళ్లే రోడ్లపై చాలాచోట్ల పడి ఉన్నాయి. రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెట్లు తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిస్తామని పీఆర్ ఏఈ హరికృష్ణ అన్నారు. – న్యూస్‌టుడే, మెరకముడిదాం

నీటి తొట్టె నిరుపయోగం

పశువుల దాహార్తి తీర్చడానికి బొబ్బిలి మండలం పెంట గ్రామంలో నిర్మించిన నీటి తొట్టె నిరుపయోగంగా మిగిలిపోయింది. ఉపాధిహామీ నిధులతో ఈ ఏడాది వేసవిలో దీన్ని నిర్మించారు. నీరు నింపడానికి అందుబాటులో కుళాయి ఏర్పాటు చేయలేదు. వేరే చోట నుంచి తెచ్చి నింపాల్సిన పరిస్థితి. దీంతో పూర్తిగా వదిలేశారు. ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోయింది. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఏపీవో లక్ష్మీపతిరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

సర్వీసు రహదారి విశాలంగా నిర్మించాలి

ఎమ్మెల్యేకు సమస్య విన్నవిస్తున్న ప్రజలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కళా వెంకటరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. నాలుగు మండలాల ప్రజలు, నాయకుల నుంచి వినతులు స్వీకరించారు. విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారిలో చీపురుపల్లి వద్ద ఆర్వోబీ నుంచి కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీకి సర్వీసు రహదారిని విశాలంగా నిర్మించాలని స్థానికులు కోరారు. నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, సారేపాక సురేష్ కుమార్, గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'వైకాపా హయాంలో ఆటవిక పాలన'

చీపురుపల్లి, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ఆటవిక పాలన సాగించారని ఎమ్మెల్యే కళా వెంకటరావు ఆరోపించారు. మంగళవారం చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ అండ్ కో తీరుతో పారిశ్రామికవేత్తలు అయిదేళ్లు రాష్ట్రం వైపు కన్నెత్తి చూడలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సారథ్యంలో విశాఖలో నిర్వహించిన సదస్సు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. భీమిలి ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

రైతులకు బహుమతులు అందజేస్తున్న జేడీ

తెర్లాం, న్యూస్‌టుడే: పాడిపశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆమిటి గ్రామంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. మొత్తం 40 దూడలు పాల్గొనగా.. మూడింటిని ఎంపికచేసి రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. డీఎల్‌డీఏ ఈవో రాధాకృష్ణ, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

గడసాంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న పీడీ

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: విధుల్లో అలసత్వం, బాలల సంరక్షణ, ఆహారం అందించడంలో నిర్లక్ష్యంగా ఉంటే అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందిపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ విమలారాణి హెచ్చరించారు. మంగళవారం దత్తిరాజేరు మండలంలోని గడసాం 1, 2, పోరలి, టి.బూర్జవలసలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పరిసరాల శుభ్రత, తాగునీరు, ఇతర వసతులను తనిఖీ చేశారు.

పాఠశాల పనులు పునఃప్రారంభం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం విశ్వనాథపురంలో రెండేళ్లుగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. భవనం శిథిలమవడంతో గత ప్రభుత్వ హయాంలో జడ్పీ నుంచి రూ.10 లక్షల మంజూరు చేశారు. శిథిల భవనాన్ని కూలదోశారు. అనంతరం పనులు నిలిపేశారు. అప్పటి నుంచి పాఠశాల గ్రామంలోని ఓ ఇంట్లో కొనసాగుతోంది. దీనిపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. వీలైనంత వేగంగా పూర్తిచేసేలా చూస్తామని పీఆర్ జేఈఈ చంద్రశేఖర్ తెలిపారు.

ఆర్వోబీ రక్షణ గోడలకు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

విరిగిపోయిన రెయిలింగ్ తొలగిస్తున్న సిబ్బంది

గరివిడి, న్యూస్‌టుడే: దెబ్బతిన్న గరివిడి రైల్వే వంతెన రక్షణ గోడలు తొలగించి, కొత్తగా నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. పాత గరివిడి నుంచి బద్రిప్రసాద్ కాలనీ వరకు సుమారు 900 మీటర్ల పొడవున ఉన్న ఈ వంతెనపై కీలకమైన విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారి వెళ్తుంది. వాహనాలు అదుపు తప్పి, రక్షణ గోడలను ఢీకొనడంతో రెండు చోట్ల రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. ఇక్కడ ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు 'ఈనాడు' వార్తలు ప్రచురితమయ్యాయి. పనులు చేపట్టామని ఆర్‌అండ్‌బీ ఏఈ జార్జివెస్లీ తెలిపారు.

భవన నిర్మాణానికి సిద్ధం: దత్తిరాజేరు, న్యూస్‌టుడే: దత్తిరాజేరులో విద్యా వనరుల కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని సమగ్ర శిక్షా జేఈ ఉపేంద్ర తెలిపారు. ఈనెల 16న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పాత భవనాన్ని కూల్చేసి, చదును చేస్తున్నామన్నారు. కొత్త నిర్మాణానికి రూ.53 లక్షలు మంజూరయ్యాయన్నారు.

అదాలత్ ప్రయోజనాలు వివరించండి

న్యాయవాదులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

గజపతినగరం, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్ ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా న్యాయవాదులు అవగాహన కల్పించాలని న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్‌కుమార్ సూచించారు. మంగళవారం గజపతినగరంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మాట్లాడారు.





డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

రామభద్రపురం: సాలూరు మండలం దత్తివలస గ్రామానికి చెందిన వెంకటేష్ మద్యం తాగి వాహనం నడుపుతూ రామభద్రపురం రహదారి వద్ద సోమవారం దొరికారని ఎస్సై ప్రసాదరావు తెలిపారు. మంగళవారం సాలూరు కోర్టులో ప్రవేశపెట్టగా.. మేజిస్ట్రేట్ హర్షవర్ధన్ 14 రోజులు జైలు శిక్ష విధించారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామభద్రపురం: రామభద్రపురం మండలం ముచ్చర్లవలస జాతీయ రహదారి వద్ద మంగళవారం రాత్రి కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై ప్రసాదరావు తెలిపారు. దత్తిరాజేరు మండలం స్టేషన్ బూర్జివలస గ్రామానికి చెందిన బి.లక్ష్మణరావు ద్విచక్రవాహనంపై రామభద్రపురం నుంచి స్వగ్రామం వెళ్తుండగా.. విజయనగరం నుంచి రామభద్రపురం వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలయ్యాయి. ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారు నుంచి నిప్పు రవ్వలు రావడంతో స్థానికులు ఆర్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం సీసాలు ధ్వంసం

వంగర: వంగర మండలంలో 2024-25 ఏడాదిలో పోలీసుల దాడుల్లో దొరికిన అక్రమ మద్యం సీసాలను మంగళవారం ధ్వంసం చేశారు. 33 కేసుల్లో దొరికిన 664 మద్యం, 60 బీరు సీసాలు, 4 నాటుసారా కేసుల్లో పట్టుబడిన 42 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు ఎస్సై షేక్‌శంకర్ తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరంగందొర, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో జరిగిందన్నారు.

విగ్రహంపై ఇంకు

మెంటాడ: మెంటాడలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంకు పూశారు. గతంలో పలుచోట్ల ధ్వంసం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రఘురామ్ తెలిపారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

గుర్ల: విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మంగళవారం కెల్ల ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. మత్తుతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. ★ రాజాం: యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దని కమిషనర్ రామచంద్రరావు అన్నారు. రాజాంలో మానవహారం నిర్వహించారు.

వీఆర్వో, ఆర్ఐకు షోకాజ్

రామభద్రపురం: రామభద్రపురంలో మంగళవారం కలెక్టర్ సచివాలయ సందర్శన అనంతరం ఆర్డీవో రామ్మోహనరావు కారులో బొబ్బిలి వెళ్తుండగా.. రోడ్డుపై ఇసుక ట్రాక్టరు చూశారు. రామభద్రపురం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారు వెళ్లి పరిశీలించి, ఖాళీ ట్రాక్టర్ కనిపించిందని తెలిపారు. దీనిపై ఆర్డీవో ఆదేశాలతో ఆర్ఐ, వీఆర్వోకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దారు రఫీజాన్ పేర్కొన్నారు.

పారిశుద్ధ్య లోపాన్ని క్షమించం

గజపతినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయకుంటే కార్యదర్శులపై చర్యలు తప్పవని జడ్పీ సీఈవో బి.సత్యనారాయణ హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం గజపతినగరం మండలం గుడివాడ గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరిగి, చెత్త సేకరణను పరిశీలించారు.

పెంపకందార్లకు నోటీసులివ్వాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణ రహదారులపై పశువులను వదిలేస్తున్న వారికి నోటీసులు ఇవ్వాలని కమిషనర్ రామలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని పురపాలిక మార్కెట్, గౌడవీధి, ఎన్టీఆర్ బొమ్మ, రామాటాకీస్ రోడ్డు, బలిజిపేట రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. రహదారులు ఆవుల పేడతో నిండి ఉండడం గమనించారు. పెంపకం దార్లకు నోటీసులు ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళికి ఆదేశించారు.

జనసేన బలోపేతానికి కృషి

బొబ్బిలి, న్యూస్‌టుడే: జనసైనికులు, వీరమహిళలు పార్టీ బలోపేతానికి మరింత కష్టపడి పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అన్ని వార్డుల్లో పార్టీ కమిటీలను వేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి, ప్రజలకు అండగా ఉండాలన్నారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. నాయకులు కె.సురేష్, లెంక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో దిగుబడులు.. మెంటాడ: రబీ పంటల సాగుకు ముందు నవధాన్యాలు వేస్తే మంచి దిగుబడులు వస్తాయని, భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి ప్రకాష్ అన్నారు. మెంటాడ మండలంలోని జి.టి.పేట, పిట్టాడ, చింతలవలస, లోతుగెడ్డ, కైలాం తదితర గ్రామాల్లో పర్యటించారు.

పాలిథిన్‌తో పర్యావరణానికి నష్టం

సంతకవిటి, న్యూస్‌టుడే: పాలిథిన్ వినియోగంతో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, వస్త్ర సంచులే వాడాలని సారథి విజయ కోదండరామ ఆశ్రమం అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి అన్నారు. మంగళవారం సంతకవిటి మండలం మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌తో క్యాన్సర్ వచ్చే ప్రమాదముందన్నారు. హెచ్ఎం బి.పార్వతి, ఉపాధ్యాయుడు గడే అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలి

సమావేశంలో తెదేపా నాయకులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. ఇటీవల పదవులు వరించిన మండలాధ్యక్షుడు కరణం భాస్కరరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతల చిన్నమ్మతల్లి తదితరులను మంగళవారం రామభద్రపురం పార్టీ కార్యాలయంలో సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

గరివిడి, న్యూస్‌టుడే: బాలల హక్కులు, రక్షణ చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐసీడీఎస్ గరివిడి సీడీపీవో ఆరుద్ర అన్నారు. మంగళవారం ఆర్తమూరు ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవం నిర్వహించారు. బాలల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలన్నారు. పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎస్.భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీడీపీవో ఆరుద్ర

రెండ్రోజుల్లో రైతుబజారుకు తరలాలి

వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

రాజాం, న్యూస్‌టుడే: పాత బస్టాండ్‌లో కూరగాయల వ్యాపారం చేస్తున్నవారంతా రెండ్రోజుల్లో రైతుబజారుకు తరలి వెళ్లాలని కమిషనర్ రామచంద్రరావు సూచించారు. రైతుబజారు ఇన్‌ఛార్జి ఎస్టేట్ అధికారి చిన్నంనాయుడు ఇబ్బందులను తెలియజేయడంతో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యాపారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి, రైతుబజారు ఏర్పాటు చేసిందని, ఆరు బయట వ్యాపారాలతో నష్టం కలిగించొద్దని సూచించారు.



(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం- 80089 02900
విజయనగరం గ్రామీణం-80085 74317
ఎస్.కోట -80085 74326
భోగాపురం -70959 54646

?: చింతపల్లిలోని వీధి కాలువల్లో చెత్త పేరుకుని మురుగు పారడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ☛: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **జ్ఞానేశ్వరరావు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, పూసపాటిరేగ

?: గొల్లలపేటకు వెళ్లే మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **స్థానికులు** ☛: శుభ్రం చేయిస్తాం - **శ్రీకాంత్, కార్యదర్శి**

?: కొండకరకాం శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు జరగడం లేదు. - **స్థానికులు** ☛: పరిశీలించి చెత్తను తొలగిస్తాం. - **కన్నబాబు, కార్యదర్శి** – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

మహిళల కోలాటం

గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని బానాది గ్రామంలో సోమవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవాన్ని కోలాటాలు, బాణసంచా మధ్య ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడు గొంప వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు తులసి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎమ్మెల్యే లలితకుమారి, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, 29 పంచాయతీల తెదేపా నాయకులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

★ ఎన్సీఎస్: **శివ** ★ శ్రీకృష్ణ: **జిగిరీస్** ★ ఆదిత్య: **కె ర్యాంప్** ★ లీలామహల్: **ది గర్ల్‌ఫ్రెండ్** ★ రంజనీ స్క్రీన్-1: **శివ, ది గర్ల్‌ఫ్రెండ్** ★ శివరంజనీ స్క్రీన్-2: **జిగిరీస్, కాంత** ★ హిమగిరి: **కాంత** ★ సప్తగిరి: **ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో**
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

కార్తిక వెలుగులు

వేపాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి సమీపంలోని వల్లంపూడి సాంబమూర్తి ఆలయ ఆవరణలో కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా రాత్రి కాగడాలతో ఘణారాధన చేశారు. సాంబమూర్తి యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులంతా నేలపై విస్తర్లలో స్వామికి భోజనం వడ్డించి కాగడాలను వెలిగించారు.

చకచకా పనులు.. చేరువలో సేవలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో చేపట్టిన పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తికాక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎట్టకేలకు నగరపాలక సంస్థ పరిధిలోని కేంద్రాల నిర్మాణాల్లో పురోగతి వచ్చింది. ఆగిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇవి పూర్తయితే నగరవాసులకు వైద్య సేవలు మరింత చేరువవుతాయి.

స్టేడియంపేట వద్ద జరుగుతున్న పనులు

అయిదు చోట్ల అందుబాటులో..

నగరంలో రూ.5.60 కోట్లతో ఏడు నిర్మించేందుకు మెడికల్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఆమోదం తెలిపింది. ఒక్కొక్క యూపీహెచ్‌సీకి రూ.60 లక్షలతో ప్రతిపాదన చేశారు. తర్వాత ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ఈ నిధులు చాలక మరో రూ.40 లక్షలు వరకు కేటాయించారు. కొత్తపేట కుమ్మరివీధి, గాజులరేగ, వీటీ అగ్రహారం, ఎల్బీ కాలనీ, కేఎల్‌పురంలో పనులు చేపట్టి పూర్తి చేశారు. ప్రస్తుతం సేవలు అందుతున్నాయి.

పూర్తి చేస్తాం..: మధ్యలో నిలిచిపోయిన రెండు ప్రాంతాల్లో పనులు ప్రారంభించాం. వేగంగా జరుగుతున్నాయి. త్వరలో పూర్తిచేసి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగిస్తాం. - **పి.నల్లనయ్య, కమిషనరు**

ఇదీ పరిస్థితి..

స్టేడియంపేట, ప్రశాంతినగర్‌లో అసంపూర్తిగా ఉండిపోయాయి. వైకాపా హయాంలో మొదలైన నిర్మాణాలకు బిల్లు చెల్లింపులు జరగక గుత్తేదారులు ఆపేశారు. అదనపు నిధులు కావాల్సి ఉండగా ఇవ్వలేదు. దీంతో చాలీచాలని గదుల్లో అసౌకర్యాల నడుమ వైద్య సేవలు అందిస్తున్నారు. స్టేడియంపేటలో మిగతా పనులకు రూ.57.92 లక్షలతో చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. రూ.34.71 లక్షలతో బ్రిక్, ప్లాస్టింగ్, రూ.23.21 లక్షలతో కిటికీలు, ప్లంబింగ్ పనులకు ప్రతిపాదించారు. మరో రెండు నెలల్లో పూర్తి కానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రశాంతినగర్‌లో రూ.కోటితో అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచారు. ఇంకా టైల్స్, శానిటరీ పనులు చేయాల్సి ఉంది. రూ.35 లక్షలతో శానిటరీ, ప్రహరీ, ఎలక్ట్రికల్ పనులకు టెండర్లు పిలుస్తామన్నారు.

నెల్లిమర్ల నగర పంచాయతీలో సమస్యలా..?

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేట, నెల్లిమర్లలో ఉన్న 20 వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు వేధిస్తున్నాయా? తాగునీరు సక్రమంగా అందడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? మౌలిక సదుపాయాల్లేక అవస్థలు పడుతున్నారా? వార్డు సచివాలయాల్లో సేవలు అందడం లేదా? ఇబ్బందులపై నేరుగా నగర పంచాయతీ కమిషనరు టి.జయరాం దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పించింది. మీరు చేయాల్సిందల్లా నిర్దేశించిన సమయంలో ఫోన్ చేయడమే..

★ తేదీ 19.11.25 (బుధవారం)
★ సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల వరకు..
ఫోన్ నెంబర్లు: 9177687657, 08922-244248 సంప్రదించాలి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

విజయనగరం ఉడా కాలనీ, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం మత్తు పదార్థాల నివారణ, దుష్పరిణామాలపై అవగాహన సదస్సు జరిగింది. ముందుగా విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా వినియోగించినా, అమ్మినా 1972ను సంప్రదించాలన్నారు. విజయనగరం గ్రామీణ ఎస్సై లక్ష్మణరావు, ఐటీఐ ప్రిన్సిపల్ టి.వి.గిరి, కౌన్సిలర్ విజయనిర్మల, విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడీ కుమారస్వామి, రాజాం ఐటీఐ ప్రిన్సిపల్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: బాలికలు, మహిళల భద్రతే తమ లక్ష్యమని మహిళా పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహమూర్తి అన్నారు. మంగళవారం నగరంలోని జేవీఎస్, లక్ష్మీ గణపతి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రహదారి గుంతలమయం

నెల్లిమర్ల నుంచి సతివాడ వైపు వెళ్లే మార్గంలో గొర్లె పేట వద్ద రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతల్లో వాహనాలు దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్తపేట, రామతీర్థం, ఎంబేరయ్యగుళ్ల వద్ద రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ర.భ.శాఖ ఏఈ నందకుమార్ మాట్లాడుతూ విస్తరణ పనులు చేపడుతున్నామని, గుంతలు లేకుండా చూస్తామన్నారు.
– న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మూడేళ్లుగా చీకట్లోనే

జామిలోని గోస్తనీ మాత ఆలయం సమీపంలోని గోస్తనీ నది వద్ద విద్యుత్తు దీపం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మార్గంలో పలువురు రైతులు పొలాలకు వెళ్లొస్తుంటారు. ప్రత్యేక పూజల రోజుల్లో స్థానికులు ఇక్కడే స్నానాలాచరిస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడ దీపం లేక చీకట్లు అలుముకుని ఇక్కట్లు తప్పడం లేదు. గాలికి తీగలు తెగి పాడై మూడేళ్లు అవుతున్నా చర్యల్లేవు. ఏఈ జ్యోతీశ్వరరావు వద్ద ప్రస్తావించగా పనులు చేయిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, జామి

పెచ్చులూడాయి.. చిక్కులు తెచ్చాయి

ఎస్.కోట మండలం మూలబొడ్డవర గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి రాళ్లు తేలిపోయాయి. సుమారు 2.2 కి.మీ. మేర ఇదే పరిస్థితి. జాతీయ రహదారి 516-బీ నుంచి గ్రామం మొదట్లో పూర్తిగా పెచ్చులూడిపోయింది. లచ్చందొర పాలెం మార్గంలోనూ ఇంతే. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్ జేఈ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

అలుముకున్న అంధకారం

నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో అంధకారం అలుముకుంటోంది. చాలాచోట్ల వీధి దీపాలు లేవు. కొన్ని చోట్ల ఉన్నా పనిచేయడం లేదు. దీంతో రాత్రివేళ ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక అలకనందా కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

తెలుగు భాషపై పట్టు సాధించాలి

మాట్లాడుతున్న అష్టావధాని చంద్రశేఖరం

విద్యావిభాగం, కంటోన్మెంట్, న్యూస్‌టుడే: తెలుగు భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని అష్టావధాని బ్రహ్మశ్రీ కట్టమూరి చంద్రశేఖరం పిలుపునిచ్చారు. పూల్‌బాగ్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం 'సాహిత్య క్రీడ- అష్టావధానం' అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. తెలుగు మాధ్యమం లేకపోతే భాషను మరిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కావాలి

ఆర్టీసీ కూడలి వద్ద సీపీఐ నాయకుల ఆందోళన

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: దళిత, గిరిజన, మైనార్టీల సామాజిక న్యాయం కోసం సీపీఐ దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమం చేస్తోందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు అన్నారు. మంగళవారం విజయనగరంలోని ఆర్టీసీ కూడలి వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆత్మ గౌరవ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. అణగారిన వర్గాల వారిని ఆదుకోవాలని డిమాండు చేశారు. బుగత అశోక్, ఒమ్మి రమణ, రంగరాజు, అప్పలరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కార దిశగా రీ సర్వే

పెట్రోలు బంకు నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కీర్తి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: రీ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో దాట్ల కీర్తి తెలిపారు. సోంపురం కూడలిలో పెట్రోలు బంకు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. మొదటి విడతలో మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్‌గా తీసుకున్నామన్నారు. రెండో విడతలో రెండు, మూడో విడతగా మిగతా వాటిల్లో చేస్తామని చెప్పారు. అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు నాలుగు వరుసల రహదారికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. తహసీల్దారు కోరాడ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

తారకరామ నిర్వాసితులను ఆదుకోండి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: తారకరామ తీర్థసాగర్ నిర్వాసితులు, సారిపల్లి గ్రామస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు. మంగళవారం నిర్వాసితులతో కలిసి కలెక్టర్ రాంసుందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలువ నిర్మాణంలో 15.45 ఎకరాల జిరాయితీ భూమిని కోల్పోయిన రైతులు పరిహారం ఇవ్వాలని కోరినా.. కోర్టులో డిపాజిట్ చేసేశారని వివరించారు. తిరిగి ఇప్పించాలన్నారు. పొలాల ముంపుతో జీవనాధారం కోల్పోయినవారికి పీపీఎఫ్ ప్యాకేజీ మంజూరు చేయాలని విన్నవించారు. పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు, గ్రామస్థులు బి.ఆదినారాయణ, ఎస్.బాబూరావు, నాగరాజు, ప్రకాశరావు, గోపాలమూర్తి పాల్గొన్నారు.

సకాలంలో అర్జీల పరిష్కారం

విజయనగరం గ్రామీణం: పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని మండలప్రత్యేకాధికారి జె.జ్యోతిశ్రీ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతులపై సమీక్షించారు. తహసీల్దారు కూర్మనాథరావు, ఎంపీడీవో వెంకటరావు ఉన్నారు. **భోగాపురం:** మండలంలో ప్రత్యేకాధికారి ఎన్.వెంకటేశ్వరరావు సమీక్షించి, 11 సమస్యలు పరిష్కరించారు.

వైభవంగా అంబలం పూజ

కొత్తవలస, న్యూస్‌టుడే: తుమ్మికాపల్లి ఓంకార ఆశ్రమం ప్రాంగణంలోని ఉమామహేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. శివ, అయ్యప్ప, దుర్గమ్మ మాలధారులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఓంసదనం నిర్వాహకులు బ్రహ్మశ్రీ అంపోలు ఉమామహేశ్వరశర్మ, అర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ ధర్మకర్త పిల్లా సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించారు.

రోడ్లపై పశువులను విడిచిపెట్టొద్దు

నేరవార్తా విభాగం: రహదారులపై పశువులను విచ్చలవిడిగా వదిలితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ సీహెచ్.సూరినాయుడు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇళ్ల వద్దే కట్టుకోవాలన్నారు.

దగ్ధమైన కారు నెల్లూరిది

ఎస్.కోట: బొడ్డవరలో జాతీయ రహదారి పక్కన ఆదివారం రాత్రి దగ్ధమైన కారు నెల్లూరు జిల్లాకు చెందినదని పోలీసులు తెలిపారు. మంగళవారం మెకానిక్‌ను తీసుకువెళ్లి ఇంజిన్, ఛాసీ నంబర్లు గుర్తించి, యజమానితో ఫోన్‌లో మాట్లాడారు. మూడు రోజుల క్రితం వాహనాన్ని తన స్నేహితుడికి ఇచ్చానని, తర్వాత నుంచి ఆయన చరవాణి స్విచ్ఛాఫ్‌లో ఉందని, వాకబు చేస్తానని తెలిపాడన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

భోగాపురం, న్యూస్‌టుడే: తపాలా సేవలు వినియోగించుకోవాలని ఏఎస్పీ సుందరనాయుడు తెలిపారు. స్థానిక తపాలా కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, ఉద్యోగులు పనితీరు, హాజరు పట్టికలను పరిశీలించారు.

సదస్సు జయప్రదానికి పిలుపు

ఎస్.కోట: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 23న విశాఖలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని పట్టణ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు కోరారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గోడప్రతులు ఆవిష్కరించారు. జి.శ్రీనివాసరావు, కేశవ, కోటారావు పాల్గొన్నారు.

వన సమారాధన

మయూరి కూడలి: సారిపల్లిలోని గణపతి నీడి గార్డెన్స్‌లో జిల్లా ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్తిక వనసమారాధన జరిగింది. వందలాది మంది సంఘ సభ్యులు, వారి కుటుంబీకులు తరలివచ్చారు. సంఘ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణంపై రగడ

భోగాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ముంజేరు గ్రామంలో వీధి కాలువ నిర్మాణంపై మంగళవారం రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఓ వర్గానికి చెందిన నాయకులు జేసీబీతో పనులు ప్రారంభించారు. మరో వర్గానికి చెందిన సిద్ధార్థ కాలనీ వాసులు అడ్డుకున్నారు. తమ గ్రామానికి మౌలిక సదుపాయాలు రాకుండా అడ్డుకున్నారని, నేడు ఇటువైపు కాలువ నిర్మిస్తే ఊరుకోమన్నారు. గతంలో ఎలా వెళ్లేదో, ఆ మార్గంలోనే వాడుక నీరు మళ్లించాలని డిమాండ్ చేశారు. దీంతో కొట్లాట జరిగింది. ఎస్సై పాపారావు, ఈవోపీఆర్డీ గాయత్రి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రామపెద్దలు, అధికారుల జోక్యంతో సద్దు మణిగింది.

ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

తెదేపాలోకి వైకాపా నాయకులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోని ఆరో డివిజన్ జమ్ము ప్రాంతానికి చెందిన కొందరు వైకాపా నాయకులు మంగళవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమక్షంలో తెదేపాలో చేరారు. జమ్ము మాజీ ఉప సర్పంచి బార్నాల శ్రీను, నాయకులు బి.శేఖర్, బి.సంజీవరావు, కె.వెంకటరావు తదితరులున్నారు. నగరాధ్యక్షుడు గంటా రవి, కోదండరాం పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

శృంగవరపుకోట: బినామీలకు చెల్లించిన మొత్తాన్ని వసూలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం బొడ్డవరలో నిరసన తెలిపారు. జిందాల్ అవినీతిపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. జిందాల్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, ఉద్యోగ నియామకాలు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలులో అవినీతి జరిగిందన్నారు. బాధ్యులైన రెవెన్యూ అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు.

పుస్తక ప్రదర్శన

విద్యావిభాగం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. నిరంతరం పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నైపుణ్య శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ ప్రొ.మహంతి తెలిపారు. నెల నుంచి మూడు నెలల కాలపరిమితిలో కొన్నింటిని ఉచితంగా, మరికొన్ని తక్కువ రుసుముతో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు 99080 33104, 70937 02999 సంప్రదించాలన్నారు.

ఉద్యమకారులను నియమించాలి

కంటోన్మెంట్: గ్రంథాలయ సంస్థల్లో రాజకీయాలకు అతీతంగా విజ్ఞానవంతులు, గ్రంథాలయ ఉద్యమకారులను ఛైర్మన్లుగా, సభ్యులుగా నియమించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొంగలి పోతన్న, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గురజాడ జిల్లా స్మారక గ్రంథాలయం సమావేశంలో మాట్లాడారు.

పాఠశాలకు గ్రిల్స్ వితరణ

జామి: జామి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గది నాలుగు తరగతి గదుల కోసం బండారు వేణు మాధవి రూ.50 వేలు విలువైన గ్రిల్స్ వితరణ చేశారు. హెచ్ఎం ఎస్.వి.శేఖర్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉద్యానాల అభివృద్ధికి రూ.61.92 లక్షలు

స్టాండింగ్ కమిటీ సమావేశంలో 32 అంశాలకు ఆమోదం

సమావేశంలో పాల్గొన్న మేయరు విజయలక్ష్మి, కమిషనరు నల్లనయ్య తదితరులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 32 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. మంగళవారం సాయంత్రం మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. అధికారులు నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు ఫ్లోర్‌లీడరు ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.1.16 కోట్లతో కొనుగోలు చేసిన రెండు టారస్ వాహనాలను వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు సమస్యలపై అన్ని డివిజన్ల కార్పొరేటర్ల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. 40వ డివిజన్ బొగ్గుల దిబ్బ దగ్గర ఆక్రమణలు తొలగించిన చోట రోడ్డు పనులు ప్రారంభించకుంటే ఇక నుంచి సమావేశానికి హాజరుకానని కార్పొరేటరు సుంకర నారాయణ స్వామి పేర్కొన్నారు. కమిషనరు పి.నల్లనయ్య, సహాయ కమిషనరు కె.అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, జీవీ.రంగారావు, సుంకర నారాయణస్వామి, రేగాన రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేటాయింపుల్లో కొన్ని..

★ ఏడాది కాలం పాటు పార్కులు, ఫౌంటెయిన్ల నిర్వహణకు రూ.37.70 లక్షలు ★ ఆచంటాగార్డెన్స్, పెద్దచెరువు, అయ్యకోనేరు వద్దగల ఉద్యానాల బాగుకు రూ.61.92 లక్షలు ★ ముషిడిపల్లి పథకం మరమ్మతులకు రూ.16.98 లక్షలు ★ ఖాళీ స్థలాల నిర్వహణ, పనుల కోసం రూ.45.75 లక్షలు ★ 34, 36, 40, 42, 45 డివిజన్లలో విద్యుత్తు పనులకు రూ.34.36 లక్షలు ★ 70 అద్దె గదుల నవీకరణ, దుకాణాల కేటాయింపు ★ పద్మావతినగర్-1 నుంచి ఆదిత్యా గార్డెన్ వరకు పైపులైను ఏర్పాటుకు రూ.14.90 లక్షలు.

(c) eenadu

ఏలూరులో మావోలు నివాసమున్న భవనం ఇదే

నగర శివారు..

ప్రశాంతమైన ప్రాంతం.. అక్కడ ఏం జరుగుతుందో.. ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో కూడా తెలియదు..

అలాంటి చోటుకు..

సరిగ్గా మంగళవారం మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట మధ్య.. ఏం జరుగుతుందో తెలిసేలోపే.. ఒక దాని వెనుక ఒకటి పోలీసుల వాహనాలు.. రయ్‌మంటూ దూసుకొచ్చాయి. మఫ్టీలో ఉన్న 70 నుంచి 80 మంది పోలీసులు.. వారంతా గ్రీన్‌సిటీలో ఉన్న ఓ రెండంతస్తుల భవనాన్ని చుట్టుముట్టారు.

అక్కడ ఏం జరుగుతుందో స్థానికులకు అర్థం కాలేదు..

చూస్తుండగానే పోలీసులు నాలుగువైపులా భవనాన్ని కమ్మేశారు. అంతే లొంగిపోవాలని లోపల ఉన్నవారిని హెచ్చరించారు. ఆపై గోడలు దూకి లోపలికి వెళ్లి దొరికిన వారిని దొరికినట్లుగా పట్టుకున్నారు. కాస్త సమయం ఇచ్చినా.. ఆపరేషన్ అటూ ఇటూ అయినా ఏం జరిగేదో తెలియదు. ఎందుకంటే పట్టుబడిన వారి వద్ద ఆయుధాలు ఉన్నాయి.

ఏలూరు నేరవార్తలు, కుక్కునూరు, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

పక్కాగా యాక్షన్ ప్లాన్ అమలు చేశారు పోలీసులు. సినీ ఫక్కీలో మెరుపు దాడి చేసి మావోలను అదుపులోకి తీసుకున్నారు. ఊహించని రీతిలో పోలీసులు ప్రత్యక్షం కావడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న మావోలు ఎలాంటి ప్రతిఘటన లేకుండానే లొంగిపోయారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఈ ఆపరేషన్‌లో స్వయంగా పాల్గొని ముందుండి నడిపించారు.

పోలీసులు ఉండే ఏరియాలో.. ఏలూరులో 15 మంది మావోలను పట్టుకున్నారని తెలియగానే నగరంలో కలకలం చోటుచేసుకుంది. గతంలో వారి జాడ లేదు. ఇప్పుడు నెల రోజులుగా గ్రీన్ సిటీలోని ఇంటిని షెల్టర్ జోన్‌గా చేసుకుని ఉండటంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పైగా ఆ ఏరియాలో ఎక్కువ మంది పోలీసులు నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతాన్నే వాళ్లు ఎందుకు ఎంచుకున్నారంటే.. మినీ బైపాసు పక్కనే ఉండటం.. నిర్మానుష్య ప్రాంతం కావటం, పెద్దగా జన సంచారం లేకపోవడమే. అవసరమైతే 10 నిమిషాల్లో జాతీయ రహదారికి చేరుకోవచ్చు.

పర్యవేక్షిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఉలిక్కిపడిన ఉమ్మడి జిల్లా

ఆపరేషన్ కగార్ పేరుతో మావో ఉద్యమంపై కేంద్రం ఉక్కుపాదం మోపడంతో.. వారంతా వేర్వేరు మార్గాల్లో తలదాచుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఏలూరులోని ఓ భవనంలో ఉన్న 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉమ్మడి జిల్లా ఉలిక్కిపడింది. పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పశ్చిమలో ఎక్కడా వారి జాడ లేదని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ఏలూరు నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిఘా పెంచారు. ముఖ్య కూడళ్లల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

20 ఏళ్ల క్రితం క్యారేజీ బాంబు పేలుడు..

నగర శివారు గుండుగొలనులో 2002లో స్థావరం ఏర్పాటు చేసుకున్న అప్పటి పీపుల్స్‌వార్‌కు చెందిన ఇద్దరు రాత్రి 10 గంటల సమయంలో ల్యాండ్‌మైన్‌ను క్యారేజీలో పెట్టుకుని విశాఖ వెళ్లే రైలు ఎక్కేందుకు ఏలూరు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ప్లాట్‌ఫారంపై ఉండగా ప్రమాదవశాత్తూ అది పేలిపోయింది. దీంతో దాన్ని తరలిస్తున్న కర్నూలు జిల్లా క్యాడర్‌కు చెందిన పీపుల్స్‌వార్ నాయకుడు విజయ్‌భాస్కర్, అతని అనుచరుడు ఘటనా స్థలంలోనే చనిపోయారు. వారి శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.. ఆ పక్కనే ఉన్న మరో ప్రయాణికుడు చనిపోగా కొందరికి గాయాలయ్యాయి.. ఈ ప్రమాదంతో రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం అంతా భీతావహంగా మారిపోయింది. ఈ విషయం తెలుసుకున్న గుండుగొలనులో ఉన్న నక్సలైట్లు కూడా షెల్టర్ వదిలి పరారయ్యారు.

వనం దాటేసి.. జనంలో మాటేసి..

- ఏలూరులో మావోయిస్టుల అలజడి
- 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో ఛాయలు

☛ పాలకోడేరు మండలంలోని ఓ గ్రామంలో కొంత కాలం తలదాచుకున్న ఒక మావోయిస్టును కొన్నేళ్ల కిందట కృష్ణా జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అతనితో సన్నిహితంగా ఉన్న కొందరిని అదుపులోకి తీసుకున్నారు.

☛ విశాఖ, ఒడిశా ప్రాంతాల్లో పట్టుబడిన మావోల జాబితాలో భీమవరానికి చెందిన స్వరూప అనే మహిళా మావోయిస్టు పేరు ఉండటంపై అప్పట్లో పట్టణంలో జల్లెడ పట్టారు.

☛ తణుకులో ఓ ఇంట్లో మావోలు నిల్వ ఉంచిన పేలుడు సామగ్రిని తెలంగాణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

☛ ఒడిశా నుంచి తప్పించుకున్న ఓ మావోయిస్టు ఏడాదిన్నర కిందట భీమవరంలో కొన్ని నెలల పాటు తలదాచుకున్నాడు. ఒడిశా పరిసర రాష్ట్రాల నుంచి వచ్చిన భవన నిర్మాణ కార్మికుల్లో ఒకరిగా ఉన్నాడని తెలిసి చాకచక్యంగా పట్టుకున్నారు.

అదుపులోకి తీసుకున్న వారిని తీసుకువెళుతున్న పోలీసులు

కుక్కునూరు మండలం కొత్త నెమలిపేటలో ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసుల తనిఖీలు

విలీన మండలాల్లో అప్రమత్తం

గతంలో ఖమ్మం జిల్లాలో ఉన్నప్పుడు ప్రస్తుతం జిల్లాలో ఉన్న విలీన మండలాలు కుక్కునూరు, వేలేరుపాడులో మావోల కార్యకలాపాలు ఉండేవి. తర్వాత వారి ఉనికి లేకుండా పోయింది. తాజా ఘటనతో కుక్కునూరు, వేలేరుపాడు పోలీసుస్టేషన్లలో రెండు ఏపీఎస్పీ బెటాలియన్ల క్యాంపులు ఏర్పాటు చేశారు. గతంలో మావోల కార్యకలాపాలు ఉన్న సమయంలో ఇక్కడ ఆ బెటాలియన్లు ఉండేవి. తర్వాత వారి కార్యకలాపాలు తగ్గిపోవడంతో వాటిని ఎత్తేశారు. అబుజ్‌మడ్ ప్రాంతంలో మావోల ఏరివేతతో వారు షెల్టర్‌జోన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు పోలీసులు పసిగట్టారు. అబుజ్‌మడ్ ప్రాంతానికి చేరువగా ఉన్న విలీన మండలాల మీదుగా జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు ఉంటాయని ఊహించిన అధికారులు, ఇక్కడ రెండు క్యాంపులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. పోలీసులు అనుమానించినట్లే.. మావోలు ఏలూరులో షెల్టర్ కోసం ప్రయత్నించి, మంగళవారం పోలీసులకు చిక్కారు. దీంతో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన విలీన మండలాల్లోని ఆదివాసీ గ్రామాల్లోకి మంగళవారం సాయంత్రం పోలీసు బలగాలు వెళ్లాయి. కొత్తగా అక్కడికి వచ్చిన వ్యక్తుల వివరాలు తెలుసుకోవడం, అనుమానిత వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. కొత్త వ్యక్తులు తారసపడితే వారి ఆధార్ కార్డులు తనిఖీ చేస్తున్నారు.

జ్యోతి స్వరూపాయ.. సోమేశ్వరాయ

దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయం ఎదుట కార్తిక అఖండ దీపోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ మూర్తులకు నందమూరి కుటుంబ సభ్యులతో అర్చకులు సహస్రనామ పూజలు చేయించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. సుమారు 1200 మంది పాల్గొన్నారు. సాయంత్రం ఆలయంలో స్వామిని అలంకరించారు.

నా అమ్మ.. ఇక నీకు లేనే అమ్మా!

పురిట్లోనే కన్నుమూస్తున్న మాతృమూర్తులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: నవమాసాలు మోసి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన మాతృమూర్తి మృతితో నవజాత శిశువులు పొత్తిళ్లను వెతుకుతున్నారు. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడేలా వైద్య సేవలు మెరుగు పరిచామని అధికారులు చెబుతున్నా.. ఏటా ఏదొక చోట మాతృమరణం నమోదు అవుతూనే ఉంది.

☛ పాలకోడేరు మండలం మోగల్లుకు చెందిన బాలింత మృతితో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి లేకుండా పోయింది.

☛ భీమవరం గ్రామీణ మండలం అనాకోడేరుకు చెందిన ప్రసూతి మరణంపై ఇటీవల అధికారులు విచారణ చేశారు.

జిల్లాలో గత మూడేళ్లలో పరిశీలిస్తే..

ఏడాది	మరణాలు
2023–24	16
2024–25	8
2025–26	3

(ఇప్పటి వరకు)

- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కిల్కారీ (వాయిస్‌తో కూడిన సమాచారం) పేరిట కొత్త కార్యక్రమాన్ని అందుబాటులో ఉంచింది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన ఆహార నియమాలను, వైద్య పరీక్షలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు వైద్య సలహాలు అందిస్తూ అప్రమత్తం చేయాలి.
- గర్భం దాల్చినప్పట్నుంచి అంగన్‌వాడీలు పర్యవేక్షించాలి. కోడి గుడ్లు, పాలు, రాగి పిండి, జొన్నపిండి, అటుకులు, వేరుశెనగ చిక్కి, ఎండు కర్జూరం, బెల్లం వంటి పౌష్టికాహారం తీసుకున్నారో లేదో పరిశీలించాలి.

గర్భిణులకు అవగాహన

- బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడాలి. ఏదొకచోట బాల్య వివాహాలు నమోదవుతున్నాయంటే పర్యవేక్షణను ప్రశ్నిస్తోంది.
- చాలా మంది కాన్పుల మధ్య ఎడం పాటించడం లేదు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన నామమాత్రం.
- గర్భిణులు ఇచ్చే గుడ్డు కుటుంబ సభ్యులు వినియోగిస్తున్నదీ లేనిదీ పర్యవేక్షణ అంతంత మాత్రమే.
- పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉన్నారని అధికారిక లెక్కల్లో చూపినా రాత్రివేళల్లో ప్రసవాలకు అందుబాటులో చాలాచోట్ల ఉండటం లేదు. హైరిస్క్ గర్భిణులను పర్యవేక్షించాల్సిన వారు క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

రూ.68.97 కోట్ల లబ్ధి

నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్

భీమవరం వన్‌టౌన్, కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెండో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో బుధవారం జమ చేయనున్నాయి. జిల్లాలో 1,03,761 మందికి అన్నదాత సుఖీభవ కింద రూ.51.88 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద రూ.17.09 కోట్లు కలిపి రూ.68.97 కోట్లు అందనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్. వెంకటేశ్వరరావు తెలిపారు.

నియోజకవర్గం	రైతులు	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్ (రూ.కోట్లలో)
ఆచంట	19,175	9.58	3.72
భీమవరం	8,335	4.17	1.51
నరసాపురం	11,965	5.98	1.65
పాలకొల్లు	14,458	7.24	1.67
తాడేపల్లిగూడెం	18,361	9.18	2.96
తణుకు	16,854	8.48	3.03
ఉండి	9,629	4.82	1.79
గణపవరం (మండలం)	4,884	2.44	0.75

చికుబుక్.. కాలేదండి!

నిరీక్షణ జాబితా చాంతాడంత

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజలు ఎక్కడున్నా.. సొంతూరికి రావడం పరిపాటి. రాబోయే పెద్ద పండగకు భాగ్యనగరం నుంచి స్వగ్రామాలకు చేరుకునేందుకు రైళ్లలో రిజర్వేషన్లు చేసుకుందామంటే.. ఎక్కడా ఖాళీల్లేవు. గౌతమి, గోదావరి, గరీబ్‌రథ్, ఫలక్‌నుమా, ఈస్ట్‌కోస్ట్, విశాఖ, కోణార్క్, జన్మభూమి, ఎల్‌టీటీ తదితర రైళ్లలో రిజర్వేషన్లు రిగ్రెట్ చూపుతున్నాయి. వారాంతాలు, ప్రత్యేక రోజుల్లో నడిచే రైళ్లలోనూ నిరీక్షణ జాబితా చాంతాడంత చూపుతోంది.

రెండు నెలల ముందుగానే.. రైలు ప్రయాణానికి 60 రోజులు ముందుగా రిజర్వేషన్లు చేసుకునేందుకు రైల్వే శాఖ అనుమతినిస్తోంది. హైదరాబాద్ నుంచి ఏలూరు, నూజివీడు, ఏలూరు, భీమడోలు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం మీదుగా ప్రయాణిస్తున్న రైళ్లలో రిజర్వేషన్ హాట్ కేక్‌ల్లా బుక్కయ్యాయి.

తప్ప.. తాలు తగ్గితే చాలు

ఉండి, న్యూస్‌టుడే

ఇటీవల అధిక వర్షాలు జిల్లాలో ఖరీఫ్ వరి పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. పూత, పాలుపోసుకునే, గింజ గట్టిపడే దశల్లోని చేలపై స్పష్టంగా కనిపిస్తోంది. దుబ్బుకి ఒకట్రెండు కంకుల్లో గింజలు తాలు, తప్పలొస్తున్నాయి. నేలవాలిన చోట్ల దుబ్బుల్ని కట్టలు కట్టడం, మాని పండు తెగులు, ఆకుముడతలను అరికట్టేందుకు రసాయనాల పిచికారీతో సాగు వ్యయం పెరుగుతోంది.

అయిదోసారి రసాయనాల పిచికారీ

ఎంటీయూ 1100 రకాన్ని 30 ఎకరాల్లో సాగు చేశా. అధిక వర్షాలకు వెన్నులో మచ్చొచ్చింది. తాలు, తప్పలున్న గింజలు కన్పిస్తున్నాయి. ఎకరానికి రూ.25 వేలకు మించి పెట్టుబడి పెట్టా. అయిదోసారి రసాయనాలు పిచికారీ చేస్తున్నా. - **జి.చంటి, కౌలు రైతు**

వరికి వరుణుడి దెబ్బ

ఇదీ పరిస్థితి (ఎకరాలు)	జిల్లాలో వరి సాగు	అధిక వర్షాలు, మొంథా తుపాను వేళ కోతలు పూర్తి	చిరుపొట్ట విచ్చుకోవడం, గింజ పాలుపోసుకునే దశ	గింజ తయారీ
	2,15,068	5600	97,000	61,000

5-10 మధ్య పంట నష్టం ఉండొచ్చు

కంకుల్లో తాలు, తప్పలు, నల్లగింజలు రాకుండా ప్రొపికొనజోల్ ఒక మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఆకుముడత తెగులును అరికట్టేందుకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు/ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గింజలు తాలు, తప్పలైన చేలల్లో దిగుబడి 5-10 శాతం వరకూ తగ్గే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నాం.

-**ఎన్.మల్లికార్జునరావు, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే, ఉండి**

కొలువుల పండగ

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన 66 మంది బాలికలు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలను దక్కించుకున్నట్లు మంగళవారం డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో 50 మంది సీఎస్ఈ విభాగం నుంచి, 9 మంది ఈసీఈ నుంచి, ఈఈఈ నుంచి ఏడుగురు ఉన్నారన్నారు.

ఏమిటి: భీమవరం బుధవారం మార్కెట్‌లో పై వంతెన పక్కన ఉన్న మంచినీటి సర్వీసు రిజర్వాయర్.

ఏమైంది: ఎప్పుడు కూలుతుందో తెలియదు.

ఏం చేస్తున్నారు: కొత్తది నిర్మించాలని 11 ఏళ్ల కిందటే ప్రతిపాదించారు. కానీ కాలేదు. ఇప్పుడు అమృత్ 2.0లో పెడతామన్నా అనుమతి లేదు.

విచిత్రం: ఈ ట్యాంకు దగ్గరే సాంకేతిక, ప్రజారోగ్య విభాగ జిల్లా అధికారుల కార్యాలయం ఉండటం విశేషం.

శిథిలమైన మంచినీటి సర్వీసు రిజర్వాయరు

11 ఏళ్లు.. 30 వేల మంది కన్నీళ్లు

ఇదండీ సంగతి

- 1974లో నిర్మించిన సర్వీస్ రిజర్వాయర్-2 శిథిలం కావడంతో దాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని 13వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 కోట్లు 2014లో కేటాయించారు. పనులు చేయకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.
- పురపాలక సాధారణ నిధులు రూ.3.20 కోట్లు కేటాయించి గత కౌన్సిల్ హయాంలో ఇక్కడే ఉన్న ఖాళీ స్థలంలో శంకుస్థాపన చేశారు.
- 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరోసారి అక్కడే శంకుస్థాపన చేశారు. కానీ పనులు జరగలేదు.
- కొత్త ట్యాంకు నిర్మాణానికి సాంకేతిక, ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పంపించినట్లు ఎం.ఇ పి.త్రినాథరావు తెలిపారు.

ఆరు నుంచి 10 వార్డులకు దిక్కు..

ట్యాంకు ఏమాత్రం కూలినా 6 నుంచి 10 వార్డుల్లో 30 వేల మందికి నీటి సరఫరా ఆగిపోతుంది.

- **భీమవరం పట్టణం, న్యూస్‌టుడే**

ఎందుకిలా చేశావ్ నాన్నా!

యలమంచిలి, మలికిపురం, మామిడికుదురు, న్యూస్‌టుడే: 'రండమ్మా.. ఆధార్ అప్‌డేట్ చేసుకుని వద్దాం' అంటూ నాన్న పిలవగానే ఆ పిల్లలిద్దరూ ఉత్సాహంగా వెంట బయలుదేరారు. 'అమ్మా..వెంటనే వచ్చేస్తామమ్మా' అంటూ వీడ్కోలు చెప్పారు. కానీ ఇక ఎప్పటికీ వెనక్కిరామని ఆ చిట్టి హృదయాలకు తెలియదు. తీసుకువెళ్లిన తండ్రి గోదావరిలోకి తోసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసి ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరంలో పెను విషాదం నెలకొంది. ఫైనాన్స్ వ్యాపారి శిరిగినీడి దుర్గాప్రసాద్ (37) భార్య నాగవేణి, కుమారుడు మోహిత్ (13), కుమార్తె జాహ్నవి (9)తో కలిసి ఇక్కడ నివసిస్తున్నారు. వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని నాగవేణి కన్నవారి ఇంటి వద్దే వీరంతా ఉంటున్నారు. ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ సోమవారం సాయంత్రం పిల్లలిద్దరినీ తీసుకొని దుర్గాప్రసాద్ ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రాత్రి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి స్టేషన్ పరిధి చించినాడ వశిష్ఠ వారధిపై ఈ వాహనం, పాదరక్షలు, కొన్ని చరవాణి నంబర్లతో కూడిన కాగితం కనిపించాయి. మంగళవారం ఉదయం నుంచి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రానికి దుర్గాప్రసాద్, మోహిత్ మృతదేహాలు కనిపించాయి. జాహ్నవి ఆచూకీ కానరాలేదు. బుధవారం మళ్లీ అన్వేషిస్తామని మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు. దుర్గాప్రసాద్ పిల్లలను నదిలోకి తోసి తానూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. యలమంచిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- పిల్లలను గోదావరిలోకి తోసి.. ఆపై తానూ ఆత్మహత్య
- దొరికిన తండ్రి, కుమారుడి మృతదేహాలు

దుర్గాప్రసాద్, మోహిత్ (పాతచిత్రాలు)

ఆచూకీ కానరాని జాహ్నవి

ఏం కష్టమొచ్చిందో..

ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందోనని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ కలహాలా.. ఆర్థిక సమస్యలా.. ఇంకేమైనా కారణాలా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కువైట్ వెళ్లి వచ్చి..

దుర్గాప్రసాద్, నాగవేణిలది ప్రేమ వివాహం. ప్రసాద్ గతంలో ఉపాధి రీత్యా కువైట్ వెళ్లి వచ్చాడు. వడ్డీ వ్యాపారం చేస్తూ పిల్లలిద్దరినీ విశ్వేశ్వరాయపురంలో చదివిస్తున్నారు. నాగవేణి తండ్రి రేకపల్లి వెంకటేశ్వరరావు గల్ఫ్ నుంచి రావడంతో వారం క్రితం వీరంతా ఆ ఊరు వెళ్లారు. తన భర్త, పిల్లలు ఎక్కడున్నారంటూ నాగవేణి రోదిస్తుండడం స్థానికులను కలచివేసింది.

పరుగెడుతుంటే సరదాకు అనుకున్నాం..

ఇద్దరు పిల్లలతో వంతెన మీదకు వచ్చిన దుర్గాప్రసాద్ తొలుత కుమార్తెను నదిలోకి తోసినట్లు భావిస్తున్నారు. ఇది చూసిన కుమారుడు హడలిపోయి పరుగు తీయగా అతడిని తండ్రి వెంబడించినట్లు అటుగా వెళ్లిన ఆటో డ్రైవర్ చెప్పారని.. ప్రసాద్ స్నేహితులు చెబుతున్నారు. సరదాగా పరుగెడుతున్నారనుకున్నామని.. ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఊహించలేదని డ్రైవర్ తెలిపారన్నారు.

వక్క.. ఆదాయం ఎంచక్కా! 8లో

ఆక్వాలో తక్కువ పెట్టుబడితో... లాభాలు ఆర్జించాలి

సంస్థ ఒప్పంద పత్రాన్ని రైతులకు అందజేస్తున్న కలెక్టర్, జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతను వినియోగించి ఆక్వా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కౌంట్ 366-ఆక్వాసాగులో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏఐ పరిజ్ఞానంతో పని చేసే కౌంట్ 366 ఆక్వా స్ట్రీమ్ అనే పరికరాన్ని పరిచయం చేసి పరిశీలించారు. జిల్లాలో 30 మంది రైతుల్ని ఎంపిక చేయడం జరిగిందని ఆమె తెలిపారు. రాబోయే 24 గంటల్లో వాతావరణ మార్పులను బట్టి చేపట్టాల్సిన చర్యల గురించి ఆ పరికరం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, రొయ్య రైతు సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీపీఎస్ సుబ్బరాజు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎల్ఎల్ఎన్‌రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధంలో : కలెక్టర్.. భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాదక ద్రవ్య నిరోధానికి జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. ఎస్పీ నయీంఅస్మితో కలిసి ఆమె మాదకద్రవ్యాల సంబంధిత అధికారులతో జూమ్‌లో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. మాదకద్రవ్యాల నిరోధానికి తీసుకున్న చర్యలపై నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో రాష్ట్రంలోనే మన జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. జిల్లాలో 300 కళాశాలలు, 597 బహిరంగ ప్రదేశాలు, 58 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డ్రగ్స్ నిరోధానికి కళాశాలలు, పాఠశాలల్లో 826 ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎక్కడైనా వాటిని వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1972కి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 40,399 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో డీఎస్పీలు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

తణుకు, న్యూస్‌టుడే: రంగోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ముంబయికి చెందిన 'యాన్ ఆర్గనైజేషన్ ఫర్ నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంపిటీషన్స్' నిర్వహించిన చిత్రలేఖనం, గ్రీటింగ్ కార్డు తయారీ, కలరింగ్, కార్టూన్స్, వ్యంగ్యచిత్రాలు వంటి పోటీల్లో స్థానిక మహిళా జూనియర్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలిపారు. సెప్టెంబరు 10న జరిగిన ఈ పోటీలకు సంబంధించి మంగళవారం విజేతలను ప్రకటించారు. ఇందులో కార్టూన్ విభాగంలో ఎస్.భారతి జయలక్ష్మి ద్వితీయ స్థానం పొందారు. వివిధ విభాగాల్లో 16 మంది బంగారు, 8 మంది వెండి, 5 కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను హిమబిందు, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి, అధ్యాపకులు అభినందించారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

క్షీరారామంలో రుద్రహోమం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మాస శివరాత్రి సందర్భంగా పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రుద్ర హోమం నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం మండపంలో స్వామి కొలువైనట్లు అలంకరణలు చేశారు. సాయంత్రం ప్రదక్షిణలు పూర్తి చేసిన భక్తులు అభిషేక మండపంలో శివ సహస్ర నామార్చనలు చేయించుకున్నారు.

హిమగిరుల అలంకరణలో స్వామివారు

బకాయిల సమస్య పరిష్కరిస్తా : కేంద్ర మంత్రి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పురపాలక సంఘంలో పూర్తి చేసిన పనులకు బిల్లులను సంబంధిత గుత్తేదారులకు విడుదలయ్యేలా చూస్తానని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. 2023-24, 25 ఆర్థిక సంవత్సరాల్లో పూర్తి చేసిన 172 పనులకు రూ.18.80 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని గుత్తేదారులు మంత్రి శ్రీనివాసవర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన పురపాలక శాఖ మంత్రి నారాయణతో మాట్లాడారు. మంగళవారం జరిగిన సమీక్షలో కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఎంఈ పి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖలో ఖాళీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేసే జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ, చిల్డ్రన్ హోం, వన్‌స్టాప్ సెంటర్లలో కాంట్రాక్ట్, ఒప్పంద పద్ధతిలో పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు కావాలంటూ ఐసీడీఎస్ పీడీ బి.శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు westgodavari.ap.gov.in వెబ్ సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని అన్ని ధ్రువపత్రాలతో తమ కార్యాలయంలో ఈనెల 29లోగా అందజేయాలన్నారు. **ఖాళీల వివరాలు:** సోషల్ వర్కర్ 1, డేటా ఎనలిస్ట్ 1, హౌస్ కీపర్ 1, ఎడ్యుకేటర్ 1, మేనేజర్/కోఆర్డినేటర్ 1, వైద్యుడు 1, మల్టీ పర్పస్ స్టాఫ్/కుక్ 1, ఆయాలు 3 ఖాళీలు ఉన్నాయన్నారు.

కట్టని ఇళ్లకు సామగ్రి కొనేశారు..!

వైకాపా హయాంలో ఇష్టారాజ్యం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విద్యుత్తు వైరింగ్ పైపులు, శానిటరీ గొట్టాలు జంగారెడ్డిగూడెం గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో దాదాపు రెండేళ్లుగా వృథాగా ఉన్నాయి. వైకాపా హయాంలో పీఎంఏవై 1లో వచ్చిన లేఅవుట్ కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారుల కోసం కొనుగోలు చేసిన సామగ్రి. విషయం ఏమంటే కట్టని ఇళ్లకు రూ.వందల కోట్లలో సామగ్రిని గృహ నిర్మాణ సంస్థ కొనుగోలు చేసేసింది. ఇనుము, సిమెంట్, రంగులు, వల్లీ ఆర్ట్స్ (వైకాపా మూడు రంగుల పట్టీలు), విద్యుత్తు, శానిటరీ సామగ్రి, డోర్ ఫ్రేమ్స్ తదితరాలు పెద్దఎత్తున కొన్నారు. చాలా ఇళ్లు పునాదుల్లోనే ఆగిపోయాయి. వైకాపా పాలన ముగిసింది. అప్పట్లో కొన్న సామగ్రి ప్రస్తుతం ఎక్కడికక్కడ గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల వద్ద నిరుపయోగంగా ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఇదే పరిస్థితి.

తుప్పు.. ఏళ్ల తరబడి ఇనుము వినియోగించకపోవడంతో చాలా చోట్ల తుప్పు పడుతోంది. మరి కొన్ని చోట్ల సిమెంట్ బస్తాలు, రంగులు గడ్డకట్టాయి. అయితే ఉపయోగించే అవకాశం ఉన్న సామగ్రిని ప్రస్తుతం ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2026 మార్చిలోగా ఇళ్లు కట్టుకునేందుకు గడువు ఉండటం వల్ల కొందరు ఈ సామగ్రి తీసుకెళ్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని తాము కూడా సరఫరా చేస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ వర్గాలు చెబుతున్నాయి.

వక్క.. ఆదాయం ఎంచక్కా!

మడకశిర, న్యూస్‌టుడే: వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తోంది. మొక్కలు నాటి ఐదేళ్ల పాటు సంరక్షిస్తే చాలు రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరగడంతో పాటు ఆదాయం రెట్టింపవుతుంది. చెట్టుకు అవసరమైన నీరు, పేడ, మట్టి అందిస్తే చాలు. ధరలు నిలకడగా ఉంటే రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.

ఐదేళ్లు సంరక్షిస్తే.. నిరంతర రాబడి

నేల ఎంపిక: వక్క అన్ని నేలల్లో పండుతుంది. 35 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత సాగుకు అనుకూలం. నీరు నిలవని భూముల్లో మొక్క త్వరితగతిన పెరుగుతుంది. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగుల దూరం పాటించాలి. ఇలా ఎకరాకు 450- 500 మొక్కలు నాటుకోవచ్చు. కొత్త మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం అరటి మొక్కలు పెంచుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే మొక్క పెరుగుతుంది. రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు అందిస్తూ ఏడాదికోసారి సేంద్రియ ఎరువులు వేస్తారు.

నారు పోసే విధానం: 40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్కల నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనె సంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. వీటిని మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది.



ఎకరాకు రూ.4 లక్షల వరకు.. అయిదేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమై ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 30 కిలోల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి, అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8- 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోను రూ.4 లక్షలు నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూల మొక్కలు, సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

అగ్రస్థానంలో అమరాపురం

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గ పరిధిలోని అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలో తొలి స్థానంలో ఉంది. ఈ మండలంలో 3,100 ఎకరాల్లో ఈ పంట సాగువుతోంది. ఇక్కడి రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండటం గమనార్హం.

రైతేరాజు

చేపల్లో పేను నివారణ

నరసాపురం, న్యూస్‌టుడే: శీతాకాలంలో చలిగాలులు, అత్యల్ప ఉష్ణోగ్రతల ప్రభావంతో ఆక్వా సాగు చెరువుల్లో చేపలు పేను బారిన పడుతుంటాయి. దీనిని సకాలంలో నివారించకుంటే చేపలు మృత్యువాత పడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆక్వా నిపుణులు అడబాల గోపాలరావు తెలిపారు.

ఇది చేపల మొప్పలు, శరీర భాగాలపై వ్యాపించి వాటి రక్తాన్ని పీల్చుతుంది. పేను ప్రభావంతో శరీర భాగాలు దెబ్బతినడంతోపాటు ఇతర వైరస్, ఫంగస్ వ్యాధులు సోకి అవి మృత్యువాత పడుతుంటాయి.

ముందు జాగ్రత్తలు..

రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. చేప పిల్లలను సాగు చెరువుల్లోకి తీసుకొచ్చే ముందే నిర్ధారణ పరీక్షలు చేయించాలి. పేను సోకినట్లు గుర్తిస్తే నివారణ చర్యలు చేపట్టిన తర్వాత పెద్ద చెరువుల్లో వదలాలి. శుద్ధి చేసిన నీటినే నింపాలి. గట్లపై గడ్డి, ఇతర మొక్కలు పెరగకుండా చూడాలి.

మందుల వినియోగంతో.. ప్రభుత్వ అనుమతి పొందిన పురుగు మందులు, ఐవర్‌మెక్టిన్, డిఫ్లుబెంజురాన్ వంటి పరాన్నజీవులను హతమార్చే మందులు చెరువు నీటిలో చల్లాలి. మేతలతో కలిపి ఔషధాలు అందించడం ద్వారా నివారించవచ్చు.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: మిరపలో నల్ల తామర పురుగును ఎలా అరికట్టాలి?

- దశరథ రామయ్య, లింగపాలెం

సమాధానం: మిరప పంట పూత, పిందె దశలో నల్లతామర పురుగు ఆశిస్తుంది. ఇది రసం పీల్చడంతో పూత రాలడంతో పాటు పిందెలు ఎదగవు. వీటి నియంత్రణకు వేపనూనె 1500 పీపీఎం లీటరుకి 60 మి.లీ.స్పినోసాడ్ లేదా 200 మి.లీ.ఫ్లక్సామెటమైడ్ మిశ్రమాన్ని ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నీలి, తెలుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 15-20 వరకు ఏర్పాటు చేయాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

పాడి పశువులపై చలి ప్రభావం

యాజమాన్య పద్ధతులతో నష్ట నివారణ

మొగల్తూరు, న్యూస్‌టుడే: అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే శీతాకాలంలో పశు పోషణలో తగు యాజమాన్య పద్ధతులు పాటించాలని పశు వైద్యుడు కర్పూరం విజయకుమార్ తెలిపారు. లేగదూడలను చలిలో ఆరుబయట వదిలి వేస్తే వాటి శరీర ఉష్ణోగ్రతలు తగ్గి మృత్యువాత పడే ప్రమాదం ఉందని.. పాడి పశువుల్లో దిగుబడి గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు.

ఇవి పాటించండి..

రాత్రి వేళ చలి, పొగ మంచు ప్రభావం పశువులపై పడకుండా వాటిని పాకల్లో ఉంచాలి. దోమలు కుట్టకుండా మెస్‌లు, తెరలు ఏర్పాటు చేయాలి. శీతాకాలంలో రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఉదయం పాలలో వెన్నశాతం తగ్గుతుంది. దీనిని నివారించేందుకు రోజులో సమానంగా ఉండేలా ఉదయం, సాయంత్రం పాలు పితికే వేళలను నిర్దేశించుకోవాలి.

- వేసవిలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో పశువులు చూడి కట్టవు. శీతాకాలంలో పశువులు చూడి కట్టేందుకు అనువైన సమయం. అవి ఎదకు వచ్చేలా వైద్యం, పోషకాలు ఉన్న గ్రాసం అందించాలి.

గ్రాసం చూసుకోవాలి..

శీతాకాలంలో పచ్చగడ్డి ఎదుగుదల ఉండదు. అందుకే సార్వా వరి కోతల సమయంలో ఎండుగడ్డిని కట్టలుగా కట్టి భద్రపరుచుకోవాలి. పచ్చగడ్డి అందుబాటులో ఉన్న సమయంలో పాతర గడ్డి తయారు చేసుకోవాలి. గ్రాసంతో పాటు దాణా కూడా అందిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని.. పాల దిగుబడి సాధారణంగా ఉంటుందని విజయకుమార్ తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

పమిడిముక్కల, న్యూస్‌టుడే : రాత్రి సమయాల్లో గృహాలు, దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నేరస్థుణ్ని చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశామని కృష్ణా జిల్లా పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మిలిటరీ మాధవరం గ్రామానికి చెందిన కడియాల శ్రీధర్ జల్సాలకు అలవాటు పడి సులభంగా సంపాదన మోజులో పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామం వద్ద పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. విచారించగా పమిడిముక్కల మండలం మంటాడ శివాలయంలో, కంకిపాడు, తిరుపతి, పశ్చిమ తిరుపతిలో నేరాలు చేశానని అంగీకరించాడు. గతంలో ఇతడిపై జీఆర్పీ విజయవాడలో మొత్తం 13 కేసులు ఉన్నాయని తెలిపారు. ఇతను రైళ్లలో, రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలపై దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. అతని వద్ద నుంచి 20 గ్రాముల బంగారం, రెండు మోటారు సైకిళ్లు, రూ.10,250 స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.3,10,250 ఉంటుందని తెలిపారు. శ్రీధర్‌ను అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై శ్రీను, సిబ్బందిని పోలీసు అధికారులు అభినందించారు.

మహారాజశ్రీ 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో నర్సాపురం

ఇ.పి.నెం.1595/2018 ఎఆర్‌సి నెం.392/2014

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ , పాలకొల్లు బ్రాంచ్ ....డిహెచ్ ఆర్

మరియు

బి.రామస్వామి మరియు ఇతరులు ...జెడి ఆర్

బొడ్డాని అశ్విని, తండ్రి : రామస్వామి, హెచ్ నెం.20-2-32, సొలస వారి స్ట్రీట్, వార్డు నెం.14, పాలకొల్లు, ప.గో.జిల్లా.

పై నెంబరు గ్రంధములో దిగువ షెడ్యూల్‌లో గల స్థిరాస్తిని జప్తు చేయించి వేలం వేయించుటకు దాఖలు చేసిన పిటీషన్‌లో జెడిఆర్ 5దు అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం మీ హాజరు నిమిత్తం తేది.24-11-2025కి వాయిదా వేసినారు. కావున ఆ తేదీన 10.30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై తగు సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరం

West Godavari Dist., Palakol Sub-District, Palakol Mandal, Palakol Municipal area, 15th Ward, Bangaru Chervuvu Gattu property D.No.20-2-32 with assessment No. 1079008214 RCC roof building consisting of ground floor with plinth are of 454 SFT and 1st floor with plinth are of 413 SFT in an extent of 88.6 Sq. yards or 73.58 Sq. yards or 73.58 Sq. meters **bounded by: East** : Site belongs to Tammineedi Venkata Narayana, **South** : Raja Veedhi, **West** : House of Kolukuluri Rama Murthy, **North** : Raja Veedhi.

ఇట్లు

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్, నరసాపురం

భయం వద్దు.. దారుంది.. నీకు..!

పది, ఇంటర్ ధ్రువపత్రాలు పొందే అవకాశం

చింతలపూడి, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండలం తెడ్లం గ్రామానికి చెందిన చెవటపల్లి రేణు ఇటీవల ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళ్తుండగా దారిలో పదో తరగతి ధ్రువపత్రం ఎక్కడో పడిపోయింది. ఏం చేయాలో తెలియక చదువుకున్న పాఠశాలకు వెళ్లగా వారు చెప్పిన సలహాతో దరఖాస్తు చేసుకోని సర్టిఫికెట్ తిరిగి పొందారు.

పది, ఇంటర్ ధ్రువపత్రాలు జీవితంలో ఎంతో ముఖ్యమైనవి. వాటిని మరచి పోయినా, ఎక్కడైనా పోయినా, చిరిగినా భయపడుతుంటారు. అయితే ఇప్పుడు ఆ భయాందోళనలు లేకుండా నకలు పొందే మార్గాలున్నాయి.

పది ధ్రువపత్రం కోసం.. పది ధ్రువ పత్రానికి 'బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో డూప్లికేట్ ఎస్ఎస్‌సీ దరఖాస్తు ఆప్షన్‌పై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. ప్రింట్ తీసి వివరాలు నింపాలి. దరఖాస్తుకు ఫొటో అతికించి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునితో సంతకం, లేఖ, రూ.50 అఫిడవిట్.. ఎస్సై, డిప్యూటీ తహసీల్దారు, ఇచ్చిన నాట్ ట్రేసింగ్, పోయిన ధ్రువపత్రం జిరాక్స్‌లు జత చేయాలి.

- రూ.250 విలువైన చలానా తీసి, ఇవన్నీ కలిపి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ వారికి పోస్టు పంపాలి. నెలలో పాఠశాలకు నకలు ధ్రువపత్రం వస్తుంది.

ఇంటర్.. బీఐఈఏపీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో స్టూడెంట్ సర్వీసెస్‌లోకి వెళ్లి డూప్లికేట్ లేదా ట్రిప్లికేట్ ఐకాన్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్ ఓపెన్ అవుతుంది. (మొదటి సారి పోతే డూప్లికేట్.. రెండోసారైతే ట్రిప్లికేట్) హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ, మెయిల్ నమోదు చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి చరవాణి సంఖ్యను ఎంటర్ చేశాక.. సర్టిఫికేట్ పోయిందా, చిరిగిందా అనే ఆప్షన్స్‌పై సెలెక్ట్ చేయాలి. పోతే పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ, చిరిగితే ఆ కాపీ అప్లోడ్ చేయాలి. ఎఫ్ఐఆర్ కాపీ కోసం దగ్గరలోని మీసేవలో దరఖాస్తు చేయాలి.

- తర్వాత అఫిడవిట్, ప్రిన్సిపల్‌తో సంతకం చేసిన దరఖాస్తు ఫారం అప్లోడ్ చేయాలి. చలానా తీసి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేస్తే అప్లికేషన్ నంబరు ఓపెన్ అవుతుంది. దాని ద్వారా దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చు. అప్లోడ్ చేసిన ఒక సెట్ పత్రాలు సంబంధిత కళాశాలలో ఇవ్వాలి. అనంతరం డూప్లికేట్ సర్టిఫికేట్ కళాశాలకు వస్తుంది.

విద్యార్థులను ఒత్తిడికి గురి చేయొద్దు : ఆర్జేడీ

ఇరగవరం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులను ఒత్తిడికి గురి చేయకుండా ఒక ప్రణాళిక మేరకు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి అన్నారు. ఇరగవరం, గోటేరు ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డిసెంబర్ 5 నాటికి సిలబస్ పూర్తి చేయాలన్నారు. 6వ తేదీ నుంచి 100 రోజుల ప్రణాళిక అమలు చేసి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, హోమ్ వర్క్ పుస్తకాలను పరిశీలించి సూచనలు చేశారు. సమ్మెటివ్-1 పరీక్ష పేపర్లు మూల్యాంకనం చేసి డిసెంబర్ 5న పాఠశాలల్లో జరిగే ఉపాధ్యాయులు, విద్యార్థుల సమావేశంలో ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలన్నారు. గోటేరు ఉన్నత పాఠశాలలో 173 మంది విద్యార్థులుండగా నూరుశాతం హాజరు కావడం పట్ల అభినందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి.రవీంద్ర, నాగమణి పాల్గొన్నారు.

గోటేరులో విద్యార్థులతో మాట్లాడుతున్న నాగమణి

వైభవోపేతం.. అంజనీసుతుని తెప్పోత్సవం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్ది ఆంజనేయస్వామికి కార్తిక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి తెప్పోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో హంస వాహనంతో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సువర్చలా హనుమద్‌లకు అర్చకులు ప్రత్యేక హారతులు అందించారు. భక్తులు భారీగా పాల్గొని ఈ వేడుకను వీక్షించారు. ఈవో ఆర్వీ చందన పాల్గొన్నారు.

1న తాడేపల్లిగూడెంలో హిందూసమ్మేళనం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాష్ట్ర వ్యాచారణి సభ్యుడు ఓలేటి సత్యనారాయణ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబరు 1న తాడేపల్లిగూడెంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ సమాజానికి, దేశానికి సేవ చేసే విధంగా వ్యక్తి నిర్మాణం చేస్తుందన్నారు. తద్వారా అంతరాలు లేని సమాజం సాధ్యం అవుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ సంఘ చాలక్ సుంకవల్లి రామకృష్ణ మాట్లాడుతూ కులాలు, మతాలవారీగా విడిపోతే హిందూ సమాజం బలహీన పడుతుందన్నారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ టి.భోగేశ్వరరావు, సీనియర్ న్యాయవాది మాకా శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కర్రి ప్రభాకర్ బాలాజీ, నాయకులు గట్టిం మాణిక్యాలరావు, కోట రాంబాబు, పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడిగా భానుప్రసాద్

అధ్యక్షులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

వీరవాసరం, న్యూస్‌టుడే: జిల్లా యాదవ సంఘం అధ్యక్షునిగా కందుల భానుప్రసాద్‌యాదవ్‌ను జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా యాదవ సంక్షేమ సంఘం సమావేశాన్ని సంఘ నాయకుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ అధ్యక్షతన స్థానిక కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షునిగా పని చేసిన గొలగాని సత్యనారాయణ ఆ బాధ్యతల నుంచి తప్పుకుని భానుప్రసాద్ యాదవ్‌ను అధ్యక్షునిగా ప్రకటించారు. సత్యనారాయణను గౌరవ అధ్యక్షునిగా నియమించారు. అనంతరం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు నూతన కమిటీ నియమించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెద్దింటి శ్రీనివాసరావు, కర్రి గంగాధర్ అప్పారావు, కొండ్రు శ్రీనివాసరావు, రేఖ రాజేష్ పాల్గొన్నారు.

తణుకు పురపాలక సంఘ కార్యాలయము

ఆర్.ఒ.సి.నెంబర్: 140/2024/G1 ది. 18-11-2025.

పత్రికా ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనధికార భవనముల క్రమబద్ధీకరణ కొరకు G.O.Ms. No.14, MA & UD dept., Dt. 04-01-2019న జారీచేయుట జరిగినది. దానిని 31-08-2025 వరకు గల అనధికార నిర్మాణాలను మరియు ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన భవనములను క్రమబద్ధీకరణ పొడిగించుచూ G.O.Ms. No. 225 MA & UD dept., Dt. 12-11-2025 తేదీన ప్రభుత్వం వారు ఆదేశాలు జారీచేసియున్నారు.

కావున తణుకు పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మీ యొక్క భవనములను ది. 31-08-2025నకు ముందు అనుమతి పొంది ప్లానుకు విరుద్ధముగా నిర్మించిన, ప్లాను అనుమతి పొందకుండా నిర్మించిన యెడల మీ యొక్క భవనములను క్రమబద్ధీకరించవలసినదిగా తెలియజేయటమైనది. మీ యొక్క దరఖాస్తును ఆన్లైన్ (bps.ap.gov.in) ద్వారా లైసెన్సు టెక్నికల్ పర్సన్స్ ద్వారా పొందుపరిచి క్రమబద్ధీకరించుకొనవలసినదిగా తెలియజేయుటమైనది. లేని పక్షంలో మీ యొక్క భవనములపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని తెలియజేయుటమైనది. మరియు 31-08-2025 తరువాత ప్లాన్ లేకుండా మరియు ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనములను ఎప్పటికప్పుడు తొలగించుట జరుగుతున్నది. కావున భవన యజమానులు అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే నిర్మాణములు జరుపవలసినదిగా తెలియజేయుట జరిగినది. ప్రస్తుతము పట్టణములో ది. 31-08-2025న తరువాత నిర్మిస్తున్న అనధికార నిర్మాణములను తీసివేయుట జరుగుచున్నదని పురప్రజలకు తెలియజేయడమైనది.

సం/- **కమిషనరు,** తణుకు పురపాలక సంఘం

ఉప్పులూరును వణికిస్తున్న జ్వరాలు

వైద్య శిబిరంలో పరీక్షలు

ఉండి, న్యూస్‌టుడే: విషజ్వరాలు ఉప్పులూరును వణికిస్తున్న వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. అయిదు రోజుల వ్యవధిలో సందుకొకరు చొప్పున వివిధ ఆసుపత్రుల పాలయ్యారనే సమాచారంతో అధికార యంత్రాంగం మంగళవారం ఆగ్రామానికి కదిలొచ్చింది. సర్పంచి దుర్గారావు, గ్రామ తెదేపా అధ్యక్షుడు లోకం సుబ్బారావుతో సహ మరో నలుగురు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. తాడేపల్లిగూడెం, భీమవరం ఏరియా ఆసుపత్రులో మరో ఇద్దరు వైద్యసేవలు పొందుతున్నారు. ఇళ్లకే పరిమితమై చికిత్స తీసుకుంటున్న జ్వరపీడితులు మరికొందరున్నారనే సమాచారంతో యండగండి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఐసీ కీర్తన, ఎంపీహెచ్‌ఈవో జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్యబృందం అప్రమత్తమైంది. ఏడు బృందాలుగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, ఇతర వ్యాధిగ్రస్తుల వివరాలపై సర్వే చేపట్టింది.

12 మంది నుంచి రక్త నమూనాల సేకరణ.. రైతు సేవా కేంద్రం ఎదుట పీహెచ్‌సీ ఏర్పాటుచేసిన శిబిరానికి 30 మంది వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వారిలో జ్వరం బారినపడ్డామంటూ వచ్చిన 12 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) వి.క్రాంతి, జిల్లా ఎపిడెమియాలజిస్ట్ జి.సుభాష్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి, ఏఎస్ఎస్ఎన్‌మూర్తి, ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో సీఎస్వీరెడ్డి తదితరులు ఉప్పులూరుకు చేరుకున్నారు. శిబిరానికొచ్చిన రోగులతో మాట్లాడారు.

92.7 FM Rajamahendravaram

92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FOR SALE

ఏలూరు నడిబొడ్డులో బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, మెయిన్‌బజార్ దగ్గర్లో GNT రోడ్, పవర్‌పేట నందు అక్షయ లాడ్జి అమ్మకమునకు కలదు. Cont: 98483 55649.

REAL ESTATE

PLOT FOR SALE

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033.

JOBS

ఏలూరు నగరంలో ప్రముఖ HP పెట్రోలు బంక్‌లో పార్ట్‌టైమ్ మార్నింగ్ / నైట్‌షిఫ్ట్ వర్క్ చేయుటకు యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 93921 80560

ప్రముఖ బ్యాంకింగ్ అనుబంధ సంస్థ యందు పనిచేయుటకు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ ఉద్యోగస్తులు కావలెను. Q: 10th- PG., 25-65Y. ✆ 90001 43296.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

Civil Engineer అనుభవం ఉన్నవారు పశ్చిమ గోదావరి జిల్లానందు పనిచేయుటకు కావలెను. Cont: 8977493338.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.30 పైII

తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

•భీమవరం •ఉండి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే : రెండో పట్టణం పరిధిలో 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు నిమిత్తం బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆశాఖ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండి రోడ్డు, జువ్వలపాలెం రోడ్డు, పాత బస్టాండ్ ప్రాంతం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రోడ్డు పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కాళ్ల, న్యూస్‌టుడే: జక్కరం విద్యుత్తు ఉపకేంద్రంలో పరిధిలో 11 కేవీ నూతన లైన్లు ఏర్పాటు నిమిత్తం బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్.ఎన్.పురం జక్కరం, ఆనందపురం, వాండ్రం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

ఉండి, న్యూస్‌టుడే: ? మహదేవపట్నం నుంచి ఉప్పరగూడెం వెళ్లే దారిలో సంపద సృష్టి కేంద్రం చేర్చి వ్యర్థాలు చెల్లా చెదురుగా పడేస్తున్నారు. - **వెంకటేశ్వరరావు, మహదేవపట్నం**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- **గోపాలకృష్ణ, గ్రామ అభివృద్ధి అధికారి**

ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేత

కాళ్ల, న్యూస్‌టుడే: ఏలూరుపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో కంటి, చెవి, గొంతు, గుండె సంబంధిత వ్యాధులపై పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస రాజు తెలిపారు. క్లబ్ ప్రతినిధులు ఆర్.వి.ఎస్. సూర్యనారాయణరాజు, పి.వీ కృష్ణంరాజు, మేటుపల్లి శ్రీనివాసరావు, మంతెన వెంకట రవివర్మ, కనకర్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉందాం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: బాలికలు సంరక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఒకటో పట్టణ ఎస్సై ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ అన్నారు. పదాల చారిటబుల్ ట్రస్ట్, యాప్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలోని పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలల హక్కులు, రహదారి భద్రత, వ్యక్తిగత రక్షణ విద్య అంశాలపై ట్రస్టు జిల్లా సమన్వయకర్త అకుల మోహన్ వివరించారు. ప్రధానోపాధ్యాయుడు బి.సాయి ప్రసాద్, అల్లు క్రిష్ణ, ఇందుకూరి శివవర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న మండల పరిషత్తు సమావేశం

వీరవాసరం, న్యూస్‌టుడే: ఈ నెల 25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వైభవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సారథీ.. మారదా మా వారధి

దెబ్బతిన్న వంతెనలపై ప్రమాదకర ప్రయాణం

భీమవరం వన్‌టౌన్, వీరవాసరం, న్యూస్‌టుడే

ఇది మడుగుపోలవరంలంకకు వెళ్లే వంతెన. 1986లో దీని నిర్మాణం పూర్తి చేశారు. మడుగుపోలవరంలంక గ్రామ ప్రజలకు మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా ఈ వంతెన ఒక్కటే ఆధారం. పదేళ్లుగా దీని అప్రోచ్ రహదారి కుంగుతోంది. నవుడూరు జంక్షన్ నుంచి మడుగుపోలవరం వరకూ సుమారు 6 కిలోమీటర్ల పొడవైన ఒక వరుస రహదారి విస్తరణ జరిగితేనే వంతెన అప్రోచ్ రహదారికి మరమ్మతులు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పలు వంతెనలు ప్రమాదకరంగా ఉన్నాయి. పలు చోట్ల వంతెనలకు రక్షణ గోడలు విరిగిపోవడం, మరికొన్ని చోట్ల వంతెన స్లాబులు, అనుసంధాన రహదారులు కుంగిపోవడంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. పెరిగిన ట్రాఫిక్ రద్దీ కారణంగా పలు చోట్ల వంతెనలు ఇరుకుగా మారటంతో తరచూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పాలకులు మారినప్పుడల్లా వంతెనల అభివృద్ధికి ఇచ్చే వాగ్దానాలన్నీ నీటిపై రాతల్లానే మారిపోతున్నాయి.

ఇదీ పరిస్థితి.. 165 జాతీయ రహదారిపై ఉండి ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. రెండో వంతెన నిర్మించాలని దశాబ్దాలుగా ఇక్కడ ప్రజలు కోరుతున్నారు. ఉండి మండలం వాండ్రం-పెదపుల్లేరు, ఆకివీడు మండలంలోని కోళ్లపర్రు గ్రామాల్లోని వంతెనలపై అధిక వర్షాల సమయంలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అనాకోడేరు-పల్లెపాలెం, యండగండి-మైప, ఉండి బొండాడ డ్రెయినుపై, పాలకోడేరు మండలం వేండ్ర, వేండ్ర అగ్రహారం గ్రామాలను అనుసంధానించే వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాళ్ల మండలం కోపెల్ల బొండాడ డ్రెయినుపై వారధి ప్రమాదకరంగా ఉంది. భీమవరం-తాడేపల్లిగూడెం రహదారిలోని గరగపర్రు వంతెన ఇరుకుగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

తోలేరు ఆర్అండ్‌బీ రహదారిలో పోలమూరు డ్రెయినుపై ఉన్న వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వీధి దీపాలు లేకపోవడంతో సైకిళ్లపై వచ్చే విద్యార్థులు, వ్యాపారులు, రైతులు ప్రమాదాలకు గురవుతున్నారు.

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ బాలోత్సవ సంబరాల కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలు కలిగించేందుకు బాలోత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ.మురళీకృష్ణరాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సీహెచ్. దిలీప్ చక్రవర్తిలు

డిసెంబరు 12, 13 తేదీల్లో బాలోత్సవం

అభినందనలు తెలిపారు. బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు, విశ్రాంత డీఈవో ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ డిసెంబర్ 12, 13 తేదీల్లో ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, భీమవరం, ఉండి, వీరవాసరం పట్టణ, గ్రామీణ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

ధాన్యం సేకరణ వేగంగా జరగాలి: జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం సేకరణపై జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులతో మంగళవారం జూమ్ సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ అవుతుందన్నారు. ఇప్పటికే 27 లక్షల సంచులు సిద్ధంగా ఉంచామని ఇంకా 33 లక్షల సంచులు అవసరమని వాటిని ఏర్పాటు చేయాలన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి.. పీజీఆర్ఎస్‌లో వస్తున్న ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వీరవాసరం మండలం నవుడూరుకి చెందిన రావి సత్యవతికి చెందిన ఆస్తి విషయంలో వచ్చిన ఫిర్యాదును అధికారులు నిబంధనల ప్రకారమే పరిష్కరించారని తెలిపారు. ఆయన స్వయంగా ఆమెతో పాటు ఆమె కుమారుల సమక్షంలో మంగళవారం విచారణ జరిపి సమస్యకి పరిష్కారం చూపారు.

పాస్‌పోర్టు పోయినది

మోటూరి ప్రేమలత W/o. ప్రేమకుమార్ అను నేను తెలియజేయునది ఏమనగా నా పాస్‌పోర్టు H0410892 నంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ జిరాక్స్ కొరకు ది. 1-10-2025 తేదిన మా ఇంటి దగ్గర నుండి వీరవాసరం సెంటర్‌లో గల జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మోటూరి ప్రేమలత W/o. ప్రేమకుమార్
D.No.3-48, అరుంధతి కాలనీ, వీరవాసరం గ్రామం, వీరవాసరం మండలం, ప||గో||జిల్లా, సెల్ : 84988 47289

మౌలిక సౌకర్యాలకు పెద్దపీట: ఉపసభాపతి

నూతన పాలకవర్గంతో రఘురామకృష్ణరాజు

పాలకోడేరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో రహదారులు, డ్రెయినేజీ, తాగు నీటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం మోగల్లు, కోరుకొల్లులో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మోగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్లు, ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రం, పంచాయతీ కార్యాలయంలో రూ.60 వేలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఉపసభాపతి ప్రారంభించారు. అనంతరం కోరుకొల్లు ఎస్సీ కాలనీలో ఎంపీ నిధులు రూ.29 లక్షలతో నిర్మించిన నాలుగు సిమెంట్ రహదారులను ప్రారంభించారు. కనుమూరు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో దాతలు, సంస్థలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో దాదాపు అన్ని గ్రామాల్లో మైక్రోఫిల్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు, సర్పంచి కృష్ణకుమారి, తెదేపా మండలాధ్యక్షుడు బాబు, శ్రీనివాసరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

పాలకోడేరు, న్యూస్‌టుడే: నూతన పాలక వర్గాలు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తూ భక్తులకు మెరుగైన సేవలందించాలని ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సూచించారు. కోరుకొల్లు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార మహోత్సవం మంగళవారం నిర్వహించారు. కమిటీ ఛైర్మన్ గాదిరాజు రామాంజనేయరాజు, సభ్యులచే దేవస్థానం అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపసభాపతిని ఘనంగా సత్కరించారు. నీటి సంఘం అధ్యక్షుడు గాదిరాజు శ్రీనివాసరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

23న భగవద్గీత పోటీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: తితిదే దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మాదివాడ మల్లేశ్వర వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు సమన్వయకర్త నాగశశికళ మంగళవారం తెలిపారు. పోటీల్లో ఆరో తరగతి విద్యార్థుల నుంచి 45 ఏళ్లు ఉన్న వారు వరకు పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు తితిదే నుంచి గుర్తింపు పత్రంతో పాటు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

రహదారుల భద్రతకు చర్యలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రహదారుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆమె మంగళవారం జూమ్ సమావేశం నిర్వహించారు. రోడ్లపై పశువులు తిరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఆక్రమణలుంటే తొలగించాలన్నారు. ప్రధాన కూడళ్లతో పాటు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 216,165 జాతీయ రహదారులపై పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ నయీం అస్మి, జిల్లా రవాణాధికారి కృష్ణారావు, ర.భ.శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బడిలో పడకేసిన నిర్వహణ

ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ఎంఈవో

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు బాలుర ఉన్నత పాఠశాలలో విద్యా బోధన సంతృప్తికరంగా లేదని, మధ్యాహ్నం భోజనం రుచికరంగా వండటం లేదని, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని అజ్జమూరు గ్రామానికి చెందిన వర్ధినేని లక్ష్మీవరప్రసాద్ అమరావతిలో స్పందనకు ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి డీఈవో కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఎంఈవో రవీంద్ర పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఫిర్యాదుదారుడు ఎంఈవోకు పాఠశాలల్లోని సమస్యలను వివరించారు. విద్య, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఎంఈవో ఆదేశించారు. అలాగే విద్యా, పాఠశాల, భోజన కమిటీల పర్యవేక్షణ పెంచుతామన్నారు.

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
భీమవరం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు అన్ని విధములైన నిర్మాణాలకు, అత్యున్నత ప్రమాణాలతో ప్లానింగ్, డిజైన్ ఎస్టిమేట్ వేస్తూ.. నిర్మాణ రంగంలో సేవలందిస్తున్న సాంకేతిక నిపుణులకు, తోటి బిల్డర్స్‌కు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.
దాట్ల కనస్ట్రక్షన్స్
దాట్ల శ్రీరామరాజు
అధ్యక్షులు: భీమవరం బిల్డర్స్ అసోసియేషన్

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
భీమవరం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు నిర్మాణ రంగంలో సేవలందిస్తున్న సాంకేతిక నిపుణులకు, తోటి బిల్డర్స్‌కు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.
లక్ష్మీ బిల్డర్స్
కలిదిండి అర్జున రాజు - భీమవరం

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
బిల్డర్స్‌డే సందర్భంగా ఇంజినీర్లకు, బిల్డర్స్‌కు, తాపీ పనివార్లకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.
K.V. ASSOCIATES
Architects, Engineers, Planners, Interior Designers
Opp: Municipal Office, భీమవరం
K.V. Ramana, ఇంజినీర్ K.J.V. Hema, M.Tech
Cell: 98491 36906

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
బిల్డర్స్‌డే సందర్భంగా ఇంజినీర్లకు, ఆర్కిటెక్చర్స్‌కు, ప్లానర్స్‌కు, డిజైనర్స్‌కు, తాపీ పనివార్లకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.
C.K. Designers & Builders
Civil Contractors & Consultancy
Er. Chandra kala, B.Tech,(Civil) Approved Valuer
లూథరన్ హైస్కూల్ రోడ్, Opp: మున్సిపల్ ఆఫీసు, భీమవరం
91827 82927, 63095 81927 జాన్: 94922 93819

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
R.రమేష్
A.E: పంచాయతీరాజ్, వీరవాసరం

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
భీమవరం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు నిర్మాణ రంగంలో సేవలందిస్తున్న సాంకేతిక నిపుణులకు, తోటి బిల్డర్స్‌కు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.
వికాస్ డెవలపర్స్
అల్లూరి వెంకట చైతన్యవర్మ
చింతల శ్రీనివాస్, భీమవరం

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
SRI VENKATESWARA RESIDENCY
నర్సయ్య అగ్రహారం
భీమవరం
2 BHK FLATS AVAILABLE
94411 69987 (A.శివరామరాజు)
83099 25923 (M. నారాయణరాజు)
98480 98947 (K.S.N.రాజు)

సోమేశ్వరునికి మాసశివరాత్రి పూజలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం మాస శివరాత్రి సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి రజిత నాగాభరణం, విశేష పుష్పాలంకరణ చేసి సహస్ర నామ పూజలు చేశారు.

భీమేశ్వర ఆలయంలో...

ఆకివీడు, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకుని ఆకివీడులోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి అభిషేకాలు చేశారు. మహిళా మండలి సభ్యులు స్వామి సన్నిధిలో లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. ● పెద కాపవరంలోని బాలాత్రిపురసుందరీదేవి సమేత కుసుమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు.

కాళ్ల, న్యూస్‌టుడే: మాస శివరాత్రి సందర్భంగా కాళ్ల గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన గనిశెట్టి శ్రీనివాసరావు దంపతులతో అర్చకులు పూజలు, రుద్రహోమం చేయించారు. రాత్రి సహస్ర దీపార్చన, కార్తిక దీపోత్సవం నిర్వహించారు.

దాసాంజనేయునికి పంచామృతాభిషేకం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఉదయం కొత్త బస్టాండ్ సమీపాన ఉన్న దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సింధూర్చన చేశారు. తమలపాకులు, పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించారు. స్వామివారి సంకీర్తనలు ఆలపించారు.

లక్షలు వెచ్చించి...మధ్యలో వదిలేసి

చినఅమిరం(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం చినఅమిరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన స్త్రీశక్తి భవన నిర్మాణం ఇది. గతంలో తెదేపా హయాంలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించారు. తర్వాత వైకాపా ప్రభుత్వ హయంలో దీన్ని పట్టించుకోకుండా వదిలేశారు.

ప్రస్తుతం పంచాయతీ సామగ్రి, సమీప ప్రజల పాతవస్తువులను దీనిలో పెడుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే రూ.లక్షలు ఖర్చు చేసి పాతసామాన్లు భద్రపరిచే నిర్మాణంగా వాడుతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కనీసం సమావేశాలు నిర్మించుకునేందుకు చోటు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌ను సంప్రదించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

హాజరైన శాస్త్రవేత్తలు, ఉద్యాన సహాయకులు

ఉద్యాన పంటలతో అదనపు ఆదాయం

ఉండి, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగుతో అదనపు ఆదాయం ఆర్జించవచ్చని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యాన విభాగం సహాయకులకు ఉద్యాన పంటల సాగులో సస్యరక్షణ చర్యలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రాంతాల్లో మట్టి నమూనాల ఆధారంగా అనువైన పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త బిందు ప్రవీణ మాట్లాడుతూ కొబ్బరిలో ఎర్రముక్కు పురుగు లేత, ముదురు తోటలను ఆశించి ఎక్కువగా నష్టాన్ని చేకూరుస్తోందని, లింగాకర్షక ఎరలను ఏర్పాటు చేయడంతో వాటిని అరికట్టవచ్చన్నారు. తణుకు, తాడేపల్లిగూడెం ఉద్యానాధికారులు ప్రియదర్శిని, శ్రీలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు డెబోరా మెస్సియానా, శ్రీనివాసరావు, వినయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉద్యాన పంటల క్షేత్ర ప్రదర్శనలు పరిశీలించారు.

ఉపాధి కోల్పోయాం...ఆదుకోండి

నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 వేలు సాయం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. భీమవరం సీఐటీయూ కార్యాలయంలో ఆటో కార్మికుల సంఘం నాయకులు డి.చిన్న అధ్యక్షతన మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో పెనుగొండలో సీఐటీయూ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కుల గణన చేపట్టాలని వినతి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జన గణనలో కుల గణన చేపట్టి వాటి ఆధారంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమానత్వ సాధన లక్ష్యంతో సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం, ఫార్వార్డ్ బ్లాక్, ఎంసీపీఐయూ పార్టీల అధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఉప తహసీల్దార్ ఎ.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, నాయకులు ఎం.సీతారాంప్రసాద్, ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, ఎంసీపీఐయూ జిల్లా నాయకులు మహంకాళి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వితరణ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కృష్ణబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం పట్టణం 4వ వార్డులోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు ఆయన పుస్తకాలు, పరీక్షల ప్యాడ్‌లను మంగళవారం అందజేశారు. పారిశుద్ధ్యం నిర్వహణకు అవసరమైన బ్లీచింగ్ తదితర సామగ్రిని అందించారు.

వసతుల కల్పనకు చర్యలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైద్యుడు బిలాల్ సహకారంతో మంగళవారం ట్రాక్టర్‌తో మైదానం చదును చేసే పనులు ప్రారంభించారు.

కనకదాస జీవితం ఆదర్శనీయం

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: కుల వ్యవస్థ, అసమానతలపై చైతన్యం తీసుకొచ్చిన కనకదాస జీవితం ఆదర్శనీయమని వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు బి.గోవిందరాజులు తెలిపారు. స్థానిక వర్సిటీ పరిపాలన భవనంలో తత్వవేత్త, కవి భక్త కనకదాసు జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాలలకు వ్యాసరచన పోటీలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 అంశంపై, మీకు ఇష్టమైన పుస్తకంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి..అనంతరం విద్యార్థులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదరంగంలో ఇదీ మా సత్తా

పాలకోడేరు, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గొల్లలకోడేరు శాఖా గ్రంథాలయంలో స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. పాలకోడేరు శాఖా గ్రంథాలయంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై సైకాలజిస్ట్ కేసీహెచ్ వీర్రాజు అవగాహన కలిగించారు.

సరైన సమయంలో చికిత్స అవసరం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మూర్ఛ వ్యాధి తొలి లక్షణాలను గుర్తించి సరైన సమయంలో చికిత్స అందించడంపై దృష్టిసారించాలని ఎన్‌సీడీ కార్యక్రమ వైద్యుడు కె.ఎం.ఆర్.కిశోర్ తెలిపారు. మూర్ఛ దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని భీమవరంలోని శ్రీఉమా సోమేశ్వర మున్సిపల్ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించాలి

వీరవాసరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి సిబ్బందికి పని భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం. ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశాన్ని ఉత్తరపాలెంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అఖిలభారత సీఐటీయూ మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు.

రవి ప్రకాశ్‌ను సత్కరించిన సభ్యులు

సంఘాల అభివృద్ధికి కృషి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు కల్వరి చర్చిలో మంగళవారం ఈస్ట్ ఆకివీడు బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షుడు కూరెళ్ల రవి ప్రకాశ్‌ను సత్కరించారు. సుందర్ సింగ్, దావీదు, వజ్రం పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిపై దాడి జరిగింది. లంకపేటకు చెందిన యువకుడు టైల్స్‌రాయితో కొట్టగా చేతిపై గాయమైందని స్థానికులు తెలిపారు. బాధిత విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

(c) eenadu

నరసాపురం

● నరసాపురం ● పాలకొల్లు ● ఆచంట

'అన్నదాత సుఖీభవ'తో 11,965 మందికి లబ్ధి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 11,965 మంది రైతులకు రూ.7.64 కోట్ల మేర లబ్ధి చేకూరనుందని ఏడీఏ పీవీఎస్ఎస్‌పీ ప్రసాద్ తెలిపారు. నరసాపురం మండలంలో 7,982 మందికి రూ.5.22 కోట్లు, మొగల్తూరు మండలంలోని 3,983 మంది రైతులకు రూ.2.42 కోట్లు జమ కానున్నాయని పేర్కొన్నారు.

పోడూరు, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన లబ్ధిదారులకు బుధవారం రెండో విడత నగదు జమకానుందని వ్యవసాయాధికారి విశ్వేశ్వరరావు తెలిపారు. ఆచంట నియోజకవర్గ పరిధి సిద్ధాంతంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో, పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధించి లంకలకోడేరులో రాష్ట్ర మంత్రి రామానాయుడు ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ బోధనతో సత్ఫలితాలు



పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఉత్తమ బోధనతోనే మంచి ఫలితాలు సాధించడంతో పాటు వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని పాలకొల్లు ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి సూచించారు. పాలకొల్లులోని ఎంఎంకేఎన్ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు.

నేత్రపర్వం.. కార్తిక దీపోత్సవం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మాస శివరాత్రి సందర్భంగా జుత్తిగలోని శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రుద్రాక్షలతో అర్చనలు నిర్వహించారు. రాత్రి కార్తిక దీపోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మహిళలు శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించారు.

నగరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

పెనుగొండ, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా పెనుగొండలోని నగరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మాస శివరాత్రి దీక్షా భక్త బృందం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చనను వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కపిల మల్లేశ్వరుడికి అన్నాభిషేకం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కపిల మల్లేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, అన్నాభిషేకం, శాంతి కల్యాణం నిర్వహించారు. పార్వతీ విశ్వేశ్వర, పార్వతీ సమేత బసవేశ్వర, కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర, అమరేశ్వర స్వామి ఆలయాల్లో బిల్వార్చనలు, సహస్ర నామ పూజలు చేసి పంచహారతులు ఇచ్చారు.
● రుస్తుంబాదలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు, సహస్ర నామార్చనలు చేశారు.

జగన్మాత సేవలో మంత్రి నిమ్మల

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

చివరిలో దిగాలు!

తెగుళ్లతో దిగుబడిపై ప్రభావం

ఆచంట, న్యూస్‌టుడే: ఖరీఫ్ వరిసాగు ఆరంభం నుంచి భారీ వర్షాలు తుపాను ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో చేలు దెబ్బతినగా.. ఇప్పుడు చివరి దశలో ఎండాకు తెగులు వచ్చి పడింది. తుపాను ప్రభావంతో నరసాపురం డివిజన్‌లో 4 వేల ఎకరాల విస్తీర్ణంలో చేలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు బ్యాక్టీరియా ఎండాకు తెగులు ప్రభావంతో ఎకరానికి 2 నుంచి 5 బస్తాల వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు దిగులు చెందుతున్నారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో 50 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగైంది. దాదాపు అన్ని మండలాల్లోనూ ఇప్పుడు ఎండాకు తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయి. సుమారు 10 వేల ఎకరాల్లో దీని ప్రభావం ఉంటుందని అంచనా.

ఎ.వేమవరం సమీపాన ఎండాకు తెగులు సోకిన చేను

ఆరంభం నుంచి నష్టాలే.. తుపాను ప్రభావంతో పోడూరు, ఆచంట, పాలకొల్లు మండలాల్లో 1527 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. 33 శాతం మేర పంట దెబ్బతింటే నష్ట పరిహారం అందించే అవకాశం ఉంది. మరోపక్క ఆచంట, పోడూరు, పెనుగొండ మండలాల్లోని ముంపు ప్రాంతాల్లో ఖరీఫ్‌లో రెండు సార్లు నాట్లు వేశారు. నక్కల కాలువ ముంపు వల్ల వేమవరం వంటి గ్రామాల్లో 200 ఎకరాల్లో పంట పనికిరాకుండా పోయింది. ఇప్పుడు ఎండాకు తెగులుతో నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. అధిక మోతాదులో నత్రజని వినియోగం వల్ల ఎండాకు తెగులు వస్తుందని ఏడీఏ పి.మురళీకృష్ణ తెలిపారు. ఆకులు ఎండిన చేలలో మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండదన్నారు. దీని వల్ల కంకుల్లో చివరి గింజలు పూర్తిగా గట్టిపడకపోవడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు.

సిద్ధాంతం ప్రాంతంలో ఇంజిన్‌తో చేలకు నీటి మళ్లింపు

శివార్లలో నీటి ఎద్దడి

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగు చివరి దశలో సమయంలో సాగునీటి కొరతతో సిద్ధాంతం ప్రాంత రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలకు పూర్తి స్థాయిలో నీరు చేరకపోవడంతో రైతులు ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకొని నీటిని తోడుకుంటూ పంటను కాపాడుకునేందుకు యత్నిస్తున్నారు. అధికారులు స్పందించి సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట	: 90631 44737
పాలకొల్లు	: 80085 74510	పెనుగొండ	: 80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర	: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? జక్కంవారి వీధి చివరిలో వీధిదీపాలు వెలగటం లేదు. రాత్రివేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - **బి. సూర్యనారాయణ, నరసాపురం**
✔ మరమ్మతులు చేయిస్తాం. - **అంజయ్య, పురపాలక కమిషనర్**
నరసాపురం, న్యూస్‌టుడే: ? పంజా కూడలి సమీపాన రహదారి వెంబడి చెత్త పేరుకుపోయింది. - **ఎన్.రాంబాబు**
✔ చెత్త తొలగింపు పనులు చేయిస్తాం. - **పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
మొగల్తూరు, న్యూస్‌టుడే: ? పేరుపాలెం సమీపంలో విద్యుత్తు స్తంభానికి పాదులు ప్రమాదకరంగా మారాయి. - **నానాజీ**
✔ పాదులు తొలగించేలా చర్యలు. - **ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి ఏఈ**

రహదారికి మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి-మేడపాడు ప్రధాన రహదారి దుస్థితిపై 'వెతక్కపోతే దారి.. పడాల్సిందే జారి' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 8న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. భారీ గుంతలను కంకరతో పూడ్పించి తాత్కాలిక మరమ్మతులు చేయించడంతో వాహనదారులకు కొంత మేర ఊరట లభించింది.

ధాన్యం కొనుగోలుకు విస్తృత ఏర్పాట్లు

పత్రాలు పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

ఆచంట, న్యూస్‌టుడే: అన్ని నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను సూచించారు. ఆచంట మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు ఎక్కడ ఎంత మేర ధాన్యం సేకరించారో ఆరాతీశారు. ధాన్యం కొనుగోళ్లు రైతు సేవా కేంద్రాల ద్వారా మాత్రమే జరగాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్డీవో దాసిరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆచంట, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన ఆచంట వేమవరంలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. భూముల రీసర్వే ప్రక్రియపై క్షేత్ర పరిశీలన చేసి సిబ్బందికి సూచనలు చేశారు.

పోటీల్లో బాలలు, పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నరసాపురం పట్టణంలోని వైఎన్ కళాశాల గ్రంథాలయ సమావేశ మందిరంలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు 'సాధారణ జ్ఞానం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని టేలర్, బాప్టిస్టు, జె.సి.బోస్, వశిష్ఠ, సెన్ హౌస్ తదితర ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారోత్సవాల ముగింపు వేడుకలో విజేతలకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ గుడిమెట్ల కోటయ్య తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పోడూరు, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయాల్లో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ సూచించారు. కవిటం సొసైటీ కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. నాణ్యమైన సంచులను రైతులకు అందజేసి ఎక్కడా మోసం జరగకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని వెంకట్ అధికారులకు సూచించారు. ఎంపీపీ సిర్రావు సుమంగళ, సర్పంచి చుట్టుగుళ్ల పూర్ణిమ, సొసైటీ అధ్యక్షుడు ఊడిగ శ్రీనివాసరావు, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు గుబ్బల అప్పన్నస్వామి పాల్గొన్నారు.

కవిటం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతారాంపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ప్రారంభించారు. సర్పంచి పులపర్తి భ్రమరాంబదేవి, రైతులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నేటి నుంచి శిక్షణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీకే వీరభద్రరావు తెలిపారు. బుధ, గురువారాల్లో మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మార్టేరు, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ అన్నారు. మార్టేరు కొత్తకాలనీలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి ఆయన మంగళవారం భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో 122 తాగునీటి ట్యాంకులను నిర్మించనున్నట్లు చెప్పారు. మార్టేరు-ఆచంట, మార్టేరు-శేషమ్మ చెరువు రహదారుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం మార్టేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచి ఎం.కుమారి, జడ్పీటీసీ సభ్యులు కె.గౌరీ సుభాషిణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధనలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ధన్వంతరి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కళాకారుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్.విష్ణుమూర్తి మాట్లాడుతూ సమైక్యంగా ఉంటూ వృద్ధిలోకి రావాలని కోరారు. సంఘ నాయకులు ఉప్పలపు దుర్గా పెద్దిరాజు, పి.వెంకటేశ్వరరావు, తమిరి నాగేశ్వరరావు, చిక్కాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ చెరువు గ్రామంలో మంగళవారం కార్తిక వనసమారాధన జరిగింది. పీఎంపీగా సేవలందిస్తూ నూర్‌బాషా దూదేకుల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన షేక్ సయ్యద్ అలీ జిన్నాను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

యువ గళం.. చైతన్య పథం!

ఎన్ఎస్ఎస్ శిబిరాల ద్వారా గ్రామాల్లో సేవలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం వైఎన్ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు జబీవల వేములదీవి తూర్పులో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ద్వారా వారం రోజుల పాటు పలు ప్రజాహిత, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత, రహదారి భద్రత నిబంధనలపై స్థానికులకు అవగాహన కల్పించేలా చైతన్య ప్రదర్శనలు నిర్వహించారు. సామాజిక సమస్యలపై సర్వే నిర్వహించి ప్రజలతో మమేకమయ్యారు. సేవా శిబిరం ముగింపు సందర్భంగా వాలంటీర్లు వ్యక్తం చేసిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

అవగాహన ప్రదర్శనలో విద్యార్థులు

సమస్యలను ప్రత్యక్షంగా చూశాం.. ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ద్వారా గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూశాం. స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకున్నాం. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తి నిచ్చింది. **- జి.దుర్గమ్మ**

పరిష్కారానికి కృషి.. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రతను సర్వే ద్వారా గుర్తించాం. దీంతో పాటు మరికొన్ని సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వీటిని అధ్యాపకుల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశాం. **- టి.హిమజ**

ప్రజలతో మమేకమై.. సేవా శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నాం. పలు అంశాలపై గ్రామంలో ర్యాలీలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాం. **- కీర్తి చంద్రిక**

ఆ ఊరికో ఆపద్బాంధవి!

యలమంచిలి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన యలమంచిలి జనాభా సుమారు 7 వేలు. ఈ గ్రామంలో ఎవరికైనా అత్యవసర చికిత్స అవసరమైతే 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకొల్లుకు పరుగెత్తాల్సిందే. 108 వాహనం వచ్చేలోపు ప్రాణాల మీదకు వస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. గ్రామస్థుల ఇబ్బందులను గుర్తించిన స్థానిక దాత తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి) సొంత నిధులు సుమారు రూ. 10 లక్షలు వెచ్చించి అంబులెన్స్ సమకూర్చారు. చోదకుడి నియామకంతో పాటు ఇతర సదుపాయాలను కల్పించి త్వరలోనే దీనిని ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. యలమంచిలితో పాటు శివారులోని స్తంభాల చెరువు గట్టు, కర్ణాల పల్లిపాలెం, ఏటిగట్టు వద్ద పల్లిపాలెం, పెదపాలెం, కాపులపాలెం ప్రాంతాల వారికి కూడా ఈ వాహనం సేవలు అందుబాటులో ఉంటాయని దాత తెలిపారు.

శుద్ధి నీరు.. మురుగుపాలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం లంకలకోడేరు పరిధి పెదపేటలో తాగునీటి పైపులైనుకు రంధ్రం ఏర్పడింది. సరఫరా సమయంలో దీని నుంచి నిత్యం శుద్ధి నీరు లీకై డ్రెయిన్లో కలిసిపోతోంది. ఆ ప్రాంతంలో రహదారి కూడా బురదగా తయారవుతోంది. చుట్టు పక్కల ప్రాంతాలకు కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శి కె.రాజేశ్ స్పందిస్తూ పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

పెనుగొండలో సీఐటీయూ జిల్లా మహాసభలు

పెనుగొండ, న్యూస్‌టుడే: సీఐటీయూ జిల్లా 13వ మహాసభలు పెనుగొండలోని జనార్దన స్వామి కల్యాణ మండపంలో ఈ నెల 29, 30 తేదీల్లో జరుగుతాయని ఆ సంఘం నాయకుడు సూర్నీడి వెంకటేశ్వరరావు తెలిపారు. సీఐటీయూ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మహాసభల్లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, డి.ఎన్.వి.డి ప్రసాద్‌లు పాల్గొంటారన్నారు. ప్రజలు, కార్మికుల సమస్యలు, చట్టాలు, హక్కులు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. ఆహ్వాన సంఘం కోశాధికారి నాగిశెట్టి గంగరావు పాల్గొన్నారు.

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: సీఐటీయూ సమావేశాన్ని పాలకొల్లులోని మహిళా సంఘం భవనంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కార్మిక హక్కుల సాధన పోరాటాలతోనే సాధ్యమన్నారు. సంఘం మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మద్యం దుకాణం వద్ద ఆందోళన

నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: మద్యం దుకాణం వద్ద చోటు చేసుకున్న వివాదంలో ఒకరిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఎస్సై వై.నాగలక్ష్మి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీపాలెం సౌత్ పరిధి ఉప్పులూరివారి మెరకకు చెందిన కొట్టు శివన్నారాయణ ఈ నెల 17న రాత్రి మొగల్తూరు కూడలిలో మద్యం దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో చామకూరిపాలేనికి చెందిన హరికృష్ణ దుకాణ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. అతడిని శివన్నారాయణ వారించగా హరికృష్ణ ఆగ్రహించి అతడికి దాడికి పాల్పడ్డాడు. గాయపడిన శివన్నారాయణను చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు మద్యం దుకాణం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. దీంతో మద్యం దుకాణాన్ని తాత్కాలికంగా మూసివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హరికృష్ణపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

21న విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంటలోని విద్యుత్తు సంస్థ కార్యాలయం వద్ద ఈ నెల 21న వినియోగదారుల సమస్యలపై 'ఫిర్యాదులు-పరిష్కార వేదిక' నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ బి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో జ్యోతిర్మయి

నిధుల దుర్వినియోగంపై విచారణ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: నడిపూడి పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు కలెక్టరేట్‌లోని 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీఎల్‌పీవో ఐ.జ్యోతిర్మయి విచారణ చేపట్టారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో పలు దస్త్రాలను పరిశీలించి అధికారులు, ఫిర్యాదులదారులతో మాట్లాడారు. సంబంధిత దస్త్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆమె తెలిపారు. పారదర్శకంగా విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆమెకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ ఎంపీడీవో సూర్యప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి కిశోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

22న మండల సమావేశం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బీవీఎస్ కృష్ణమోహన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

బకాయిలు విడుదల చేయండి: ఎస్టీయూ

ఆచంట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెన్మెత్స సాయివర్మ, గుత్తుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆచంట మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. మహిళా ఉపాధ్యాయులకు ఛైల్డ్‌కేర్ లీవ్ జీవోను వెంటనే విడుదల చేయాలన్నారు. గతేడాది వంద రోజుల కార్యాచరణకు సంబంధించి సీసీఎల్ మంజూరు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారికి విన్నవించినా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు కేశిరాజు కృష్ణ, ముత్తా బత్తుల త్రిమూర్తులు, సుదర్శన కృష్ణ, బండి ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

పాస్‌పోర్ట్ పోయినది

TIRUMANI TULASI DEVI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్ట్ కార్యాలయం అధికారులు ది.07-04-2016న N7847505 నెంబరు గల పాస్‌పోర్ట్ మంజూరు చేశారు. సదరు పాస్‌పోర్ట్ జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.11-11-2025న మాఇంటి నుండి పంటకాలువరోడ్, పాత నవరసపురం గ్రామం నరసాపురం మండలం వద్దగల జిరాక్స్ షాపునకు ఒరిజినల్ పాస్‌పోర్ట్ తీసుకుని వెళ్ళుచుండగా దారిలో పడిపోయినది. గాన నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

TIRUMANI TULASI DEVI
W/o TIRUMANI RADHA KRISHNA
D.No.1-169/2, PATHA NAVARASAPURAM
YENUGUVANI LANKA POST,
NARASAPURAM (M),W.G.Dist., A.P.

పాస్‌పోర్టు పోయినది

Gariki Ratna Kumari అను నాకు Manama పాస్‌పోర్టు కార్యాలయ అధికారులు ది.30-11-2021న V4235247 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేశారు. సదరు పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకొనేందుకు ది.10-11-2025న భీమవరం రోడ్ పాలకొల్లు పట్టణంలోని జిరాక్సు సెంటర్‌కు ఒరిజినల్ పాస్‌పోర్టుతో వెళ్ళుచుండగా దారిలో పడిపోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుచున్నాను.

Gariki Ratna Kumari
W/o Gariki Ramana, D.No.2A-8-11, Ward 31,
Brahmananda Reddy Colony, Palakollu-
534260, W.G.Dt, A.P.

సమగ్ర సర్వేపై అవగాహన కల్పించండి

నరసాపురం, పోడూరు, న్యూస్‌టుడే: సమగ్ర సర్వేపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని ఆ శాఖ డీడీ త్రివిక్రమ్ సూచించారు. నరసాపురం డివిజన్లో ఆయన మంగళవారం పర్యటించారు. పోడూరు మండలం పండితవిల్లూరులో గ్రౌండ్ ట్రూతింగ్(జీటీ) పనులను, సర్వే దస్త్రాలను పరిశీలించారు. మండల సర్వేయర్ మహ్మద్ ఖురేషికి, గ్రామ సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం నరసాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే సమాచారం ముందస్తుగా రైతులకు తెలియపరచాలని, జాయింట్ ఎల్పీ నంబర్లు నమోదవకుండా చూడాలన్నారు. సర్వేశాఖ సహాయసంచాలకుడు జాషువా, డీఐలు ఎం.కుమార్, కె.శ్రీనివాస్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దీపాలు లేక.. ఉన్నా వెలగక!

నిర్వహణ లేమితో గ్రామీణులకు అవస్థలు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో వీధిదీపాలు నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో అసలు వీధి దీపాలు లేక, ఉన్న చోట్లా అవి వెలగకపోవడంతో రాత్రి వేళ రాకపోకలకు గ్రామీణులు అవస్థలు పడుతున్నారు. గుంతల రహదారుల్లో ప్రయాణించే వాహనచోదకులు రాత్రి వేళ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన కూడళ్లు, రహదారుల్లోనూ వీధిదీపాలు పూర్తిగా వెలగడం లేదు. శివారు గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

పాలకొల్లు: చిత్రాయి చెరువు గట్టు ప్రాంతంలో అంధకారం

మరమ్మతుల్లో జాప్యం పాడైన దీపాలకు సకాలంలో మరమ్మతులు చేయడం లేదు. వీటిపై కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా స్పందన ఉండదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళ వీధుల్లో అంధకారం అలముకోవడంతో చోరీల బెడద పెరిగిందని చెబుతున్నారు. ● పాలకొల్లు గ్రామీణ పంచాయతీ పరిధి చిత్రాయి చెరువు గట్టు, బ్యాంకు కాలనీ మార్గాల్లో ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. భగ్గేశ్వరం- సత్యనారాయణపురం మార్గంలో స్తంభాలు తప్ప వీధిదీపాలు లేవు. ● కాపవరం వద్ద పేదల కాలనీలో గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ప్రజలెవరూ నివాసం ఉండటం లేదు. ఇక్కడ మాత్రం పగలు, రాత్రి కూడా వీధి దీపాలు వెలుగుతూనే ఉంటాయి.

పరిష్కారానికి చర్యలు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేయగా.. పాత వాటికి మరమ్మతులు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించేలా కార్యదర్శులకు సూచనలిస్తాం. **- మూర్తిబాబు, డిప్యూటీ ఎంపీడీవో**

బంగారు నగల చోరీ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో బంగారు నగలు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యలమంచిలి మండలం కనకాయలంకకు చెందిన జి.గౌరీదేవి ఈ నెల 7న రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పెద్ద శబ్దం వచ్చింది. లేచి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో నుంచి బయటకు పరుగు పెడుతూ కనిపించారు. బీరువాలో రెండు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కె.గురయ్య తెలిపారు.

రహదారి ప్రమాదంపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: లక్ష్మణేశ్వరానికి చెందిన కల్యాణ్ కుమార్ ఈ నెల 17న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై((అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీఎన్‌మూర్తి తెలిపారు.

SRI Y.N.COLLEGE (Autonomous)
(Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram)
Accredited by NAAC at 'A+' Grade (4th Cycle)
NARSAPUR-534 275, W.G.Dt., A.P.,

SPOT/CATEGORY "B" ADMISSIONS INTO

B.Sc. (Honours) : Mathematics, Physics, Chemistry, Electronics, Computer Science, Data Science, Statistics, Botany, Zoology, Biotechnology, Microbiology, Aquaculture, Geography.
B.Com (Honours) Computer Applications, BBA (Honours), BCA (Honours), BA (Honours) Political Science, B.Voc (Honours) Fashion Technology & Apparel Designing.

Eligible candidates can obtain the application form and detailed information from the College office or can be downloaded from our College website (www.sriyncollege.org) for seeking admission into UG Programmes under Spot Admissions for leftover vacancies / Not reported / Dropouts / Cancelled seats and 30% of Category "B" seats in our College for the academic year 2025-26 as per the following Schedule.

Eligibility: As per the Guidelines of the APSCHE
➢ Application & Registration fee : Rs. 500/-
➢ Commencement of issue of application forms : 17-11-2025
➢ Last date for submission of filled in application: 20-11-2025
➢ Publication of Merit list : 21-11-2025

Dr. A. Ram Satish Secretary & Correspondent
Dr. Ch. Kanaka Rao Principal

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్. విఠలరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కోర్సులు కలిపి 347 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్, బీఏ ఎకనామిక్స్, బీకామ్ జనరల్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీసీఏ, బీఏ స్పెషల్ తెలుగు, బీబీఏ లాజిస్టిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 20వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కనకదాస జీవితం ఆదర్శనీయం

చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గోవిందరాజులు తదితరులు

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: కుల వ్యవస్థ, అసమానతలపై చైతన్యం తీసుకొచ్చిన కనకదాస జీవితం ఆదర్శనీయమని వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయ పరిపాలనాధికారి బి.గోవిందరాజులు తెలిపారు. స్థానిక పరిపాలన భవనంలో తత్వవేత్త, కవి భక్త కనకదాస జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ సూర్యకుమారి, గ్రంథ పాలకుడు రామానందం తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని జగన్నాథపురంలోని బాలాత్రిపుర సుందరి సమేత మల్లేశ్వరస్వామిని కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆలయ అర్చకుల అందజేసిన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పవనసుతుడికి ప్రత్యేక పూజలు



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి నుంచి పెద్దవంతెనకు వెళ్లే మార్గంలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి మంగళవారం ఆలయ అర్చకులు వాడపల్లి రామాచార్యులు ఆధ్వర్యంలో విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని సుగంధ ద్రవ్యాలు, రకరకాల పుష్పాలు, తమలపాకులతో విశేష అర్చనలు చేశారు.

సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు

ఉత్సవాల్లో పాల్గొన్న బాబా భక్తులు

డీఎస్‌చె రువు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణం లోని డీఎస్ చెరువు వద్ద శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు మంగళవారం రథోత్సవంతో మనంగా ప్రారంభమయ్యాయి. వాసవి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ వరకు వేడుకలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు ఆకుల నవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, తోట తిరుపతి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

జన, కులగణన చేపట్టాలి: సీపీఐ

నినాదాలు చేస్తున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: సామాజిక న్యాయం, సమానత్వ సాధన దిశగా జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. జనగణన, కులగణన చేపట్టాలని కోరుతూ సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అశోక్ వర్మకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, అమ్మిరాజు, దత్తాత్రేయ, వెంకట్రావు, బాలయ్య, బ్రహ్మయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చరవాణి వద్దు.. పుస్తకమే ముద్దు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న రంగారావు

తణుకు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం తణుకు శ్రీ భాష్యం ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసం పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెల్‌ఫోన్ వద్దు పుస్తకాలే ముద్దు అంటూ ఉపన్యాసాలు ఇచ్చారు. టి.గుణవర్షిత, పి.వి.అపర్ణ, కె.హర్షవర్ధన్ రెడ్డి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జి.పాండు రంగారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. దోమలకు నిలయాలు

బ్యాంకు కాలనీలో మురుగు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పురపాలక సంఘ పరిధిలో ఖాళీ స్థలాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన, దోమలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకొన్న నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి బ్యాంక్ కాలనీ, హౌసింగ్ బోర్డు, ఇరగవరం, ఎన్జీవో కాలనీల్లో పురపాలక సంఘానికి చెందిన రిజర్వు స్థలాలు 250 ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ఖాళీ స్థలాలు సుమారు వెయ్యి వరకు ఉన్నాయి. పిచ్చి మొక్కలు పెరగడం, నివాసాల మధ్యలో ఇవి ఉండటం, పాముల సంచారంతో రాత్రి వేళలో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

పల్లంగా ఉండటంతో.. కొన్నిచోట్ల ఖాళీ స్థలాలు మురుగు కూపాల్లా మారాయి. ఇవి పల్లంగా ఉండటంతో చుట్టు పక్కల ఉండే మురుగు నీరంతా వాటిలోకి చేరి నిల్వ ఉండి దుర్వాసన వ్యాపిస్తుంది. కొద్దిపాటి వర్షం వచ్చినా నీరంతా వాటిలోకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు విజృంభించి అనారోగ్యాలపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు పందులు సంచరించి మరింత అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది.

యజమానులకు నోటీసులిచ్చాం మున్సిపల్ పరిధిలో ప్రైవేట్ ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేశాం. వాటిలో తుప్పలు తొలగించకపోతే చర్యలు తీసుకొంటామని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశాం. మున్సిపల్ రిజర్వు స్థలాల్లో వెంటనే తుప్పలు తొలగించేందుకు చర్యలు చేపడతాం.

-టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, తణుకు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 99488 53114
తణుకు	: 85558 50851
తణుకు గ్రామీణం	: 63005 79402
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం నవ్యాంధ్రనగర్‌లో పందుల సంచారంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి. - రాజా, స్థానికుడు

✔ పందుల సంచారాన్ని అరికట్టేలా చర్యలు చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? ఏలూరు రోడ్డులోని శంకరమఠం సమీపంలో పురపాలక సంఘం పైపులైను మరమ్మతులకు తవ్విన గుంత పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. - నవీన్, స్థానికుడు

✔ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. త్వరితగతిన గుంతను పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. -వెంకటేశ్వరరావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్

చర్యలు తీసుకుంటాం

తణుకు, న్యూస్‌టుడే: ట్రాక్టర్లు పరిమితికి మించి వ్యర్థాలు లోడ్ చేసి రోడ్లపై పడేసుకుంటూ వెళ్తుండటంతో వెనుక వస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని 'చెత్తను ఎత్తిపోస్తున్నారు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ట్రాక్టర్లపై వ్యర్థాలు రహదారులపై పడకుండా చర్యలు తీసుకుంటామని, పరదాలు కట్టి వెనుక వచ్చే వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు.

ప్రకృతి వైద్యంపై అవగాహన అవసరం

వైద్య దినోత్సవంలో యోగా సభ్యులు

సత్యవతినగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణం సత్యవతినగర్‌లో 8వ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని మంగళవారం ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు భిమిండి రామకృష్ణ ప్రకృతి వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. యోగా, నేచురోపతి వైద్య విధానాలు అనేది మందుల రహిత వైద్య విధానమని వివరించారు. ప్రకృతి వైద్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో యోగా సభ్యులు రామాంజనేయులు, రేణుక, నున్న నాగేశ్వరరావు, మహాలక్ష్మి, మల్లికార్జునరావు, సౌమ్య పాల్గొన్నారు.

అన్న సమారాధన

ఇరగవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా రేలంగిలో కాలువ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి

రమేష్‌ని సత్కరిస్తున్న సత్యనారాయణ తదితరులు

చినతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండల ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తానని సంఘ అధ్యక్షుడు భువనగిరి రమేష్ అన్నారు. మంగళవారం చినతాడేపల్లి పిచ్చుకల రాజారావు తోటలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం కార్తిక వనసమారాధనలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సత్కరించారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఏపీ అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెలగ శ్రీరామమూర్తి, పూర్వాధ్యక్షుడు సమయమంతుల వైకుంఠం పాల్గొన్నారు.

వెంకట్రామన్నగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని వెంకట్రామన్నగూడెం తోటలో జిల్లా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా కార్తిక వనసమారాధనలు జరుపుకొంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీయూ నాయకులు దాసం వరప్రసాద్, గ్రీష్మకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణ సంఘం ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సంఘ నాయకులు ఆకాంక్షించారు. స్థానిక పైబోయిన రఘు తోటలో మంగళవారం నిర్వహించిన కార్తిక వనసమారాధనలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ఎం.కనకారావు, గొడవర్తి శివ, పట్టణ అధ్యక్షుడు మురళి, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీతో సమయం, డబ్బు ఆదా

న్యాయమూర్తి సత్యవతి

తణుకు, న్యూస్‌టుడే: డిసెంబరు 13న కోర్టుల పరిధిలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వహిస్తున్నట్లు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి మంగళవారం తెలిపారు. రాజీ పడే క్రిమినల్, చెక్‌బౌన్స్, భార్యాభర్తల, కుటుంబ తగాదాలు, మెయింటెనెన్స్, ఎక్సైజ్, బ్యాంకు రుణాలు, ప్రామిసరీ నోటు బకాయిలు, సివిల్, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు రాజీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని, కేసులు రాజీచేసుకుని విలువైన సమయం, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

మారంపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మారంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 'బాలల విద్య, హక్కులు-బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు'పై అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 18 సంవత్సరాల విద్యార్థులందరూ విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాలలోనే ఉండాలని బాల కార్మికులుగా ఉండరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వణికిస్తున్న వారధులు

చిన్న వంతెన గోడ ఇలా..

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలో మొదటి, రెండో పట్టణాలను అనుసంధానిస్తూ ఏలూరు కాలువపై నిర్మించిన పలు వంతెనలు శిథిలావస్థకు చేరాయి. కె.ఎన్.రోడ్డులో వంతెన శ్లాబ్ పలు చోట్ల పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. పిట్టగోడల వెంబడి పిచ్చిమొక్కలు మొలిచి బీటలువారాయి. ఇక పట్టణానికి రైల్వే స్టేషన్ మీదుగా ఏలూరు కాలువపై చిన్న వంతెన నిర్మించారు. దీని మీదుగా రెండో పట్టణవాసులతోపాటు సమీప గ్రామాల ప్రజలు రైల్వేస్టేషన్, సబ్‌రిజిస్ట్రార్, కోర్టు, మండల కార్యాలయాలకు రాకపోకలు సాగించే వారు. చాలా కాలం కిందటే ఈ వంతెన శిథిల స్థితికి చేరింది. ప్రస్తుతం గోడలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. సుదీర్ఘకాలం పాటు సేవలు అందిస్తున్న ఈ వారధులపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారిస్తే దీర్ఘ కాలంపాటు సేవలందిస్తాయని పలువురు చెబుతున్నారు. పట్టణ అవసరాల దృష్ట్యా కాలువపై పలు చోట్ల వంతెనలు నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని సూచిస్తున్నారు. 'చిన్నవంతెన, కేఎన్ రోడ్డుపై నిర్మించిన వంతెనల మరమ్మతులకు చర్యలు చేపడతాం. పట్టణవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం' అని పురపాలక కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు.

కేఎన్ రోడ్డులో..

గ్రంథాలయంలో బాలలకు పోటీలు

ఇరగవరం : పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి గ్రామీణం, తణుకు, ఇరగవరం, తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో మంగళవారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆరవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాగభూషణం, బి.నాగరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రంథపాలకుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✦ తణుకు మహిళా శాఖా గ్రంథాలయంలో అధికారిణి ఎస్.ప్రవీణ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ అభియాన్ అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛ అభియాన్‌పై అవగాహన కల్పించారు. ✦ ఇరగవరం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి.అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ పాఠశాలలో 6, 7 తరగతుల విద్యార్థులకు 'మీకు ఇష్టమైన పండగ', 8 నుంచి 10 విద్యార్థులకు 'సెల్‌ఫోన్ వద్దు - పుస్తక పఠనం ముద్దు' అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. స్వచ్ఛ అభియాన్‌పై చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంగెన గంగాధరరావు, ప్రధానోపాధ్యాయులు కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రేలంగి శాఖా గ్రంథాలయంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీరామాంజనేయులు, కామరాజు పర్యవేక్షించారు. గ్రంథపాలకురాలు సీతారామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ✦ తాడేపల్లిగూడెం ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 6, 7 తరగతుల విద్యార్థులకు పర్యావరణ కాలుష్య నివారణ, 8,9,10 తరగతుల విద్యార్థులకు నేను నా దేశం అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా గరికపాటి బాపయ్యశర్మ, ప్రత్తి వీరాస్వామి, ఏవీ లక్ష్మణరావు, ఎ.జనార్దనరావు, ఎ.జానుబాబు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: మాట్లాడుతున్న బాపయ్య శర్మ

ప్రకటన

తూ.గో.జిల్లా, చాగల్లు మండలం, బ్రాహ్మణగూడెం కాపురస్తురాలు షేక్ హుస్సేన్ గారి భార్య శ్రీమతి మస్తాన్ బీబీ గారి తరుపున తెలియజేయునది ఏమనగా, మా క్లయింటు ది.15-09-2025 సం.తేదీన పైడిపర్రు నుండి తణుకు మీదుగా వేల్పూరు వెళ్ళుచూ తణుకులో తన భర్త షేక్ హుస్సేన్ గారి పేరున గల ఒరిజినల్ క్రియ దస్తావేజు నెంబరు 190/2021 జిరాక్స్‌నకు వెళ్ళునప్పుడు సదరు ఒరిజినల్ దస్తావేజు దారిలో పడిపోయినది. సదరు దస్తావేజులు దొరికినచో ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇవ్వగలరని కోరుచున్నాను.

సం/- ఎం.యస్.భగవాన్లు
అడ్వకేట్, తణుకు
తణుకు,
ది.18-11-2025
సెల్: 98668 89422

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 18/2023 in O.S. 299/2018

Between:
ముళ్ళపూడి నాగేశ్వరరావు - D.H.R.
And
దేవా బాలకృష్ణ, S/o. పోలారావు, D.No. 2-36, జగన్నాధపురం, తాడేపల్లిగూడెం మండలం - J.D.R.

పై నెంబరు గ్రంథములో D.H.R. డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తం శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కోర్టు వారి ఎదుట ది. 08-12-2025వ తేదీన ఉ. 10.30 ని.ల లగాయితూ బహిరంగ వేలం వేయుటకు ఆర్డరు వేసియున్నారు. కావున సదరు బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు సదరు వాయిదా రోజు అనగా ది. 08-12-2025వ తేదీ ఉ. 10.30 ని.ల నుండి పై కోర్టు వారి ఎదుట హాజరు అయి బహిరంగ వేలంలో పాల్గొనవలసిందిగా ఈ యొక్క పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

షెడ్యూలు: West Godavari District, Tadepalligudem (M), Tadepalligudem Sub-Division, Jagannadhapuram Panchayat Village, R.S.No. 666/5, Present 2nd ward, D.No. 2-34, Assessment No. 178. RCC Building consisting of ground floor, first, second floor situated in extent of 80 Sq. Yards of site is in the following boundaries:
East: 42' House belongs to Deva Veera Venkata Satyanarayana. **South:** 17' Road margin belongs to Sri Zilla Parishath, **West:** 42' site belongs to Deva Balakrishna, **North:** 17' House belongs to Deva Balakrishna.
Within the above boundaries an extent of 80 sq.yards of site in that RCC building, doors, windows, bathrooms etc., and electrical service number 85, 1853, 1969 and water tap connection No. 144 with all easementary rights.

D.H.R. Value: 3,00,000/- Amina Value: 25,00,000/-

తాడేపల్లిగూడెం
తేది. 18-11-2025
సం/- ముళ్ళపూడి శ్రీనివాసరావు
న్యాయవాది, తాడేపల్లిగూడెం
సెల్: 89190 71651, 94919 78178

అంగన్‌వాడీ కేంద్రాలకు మానవత సహకారం

సామగ్రి అందజేస్తున్న సభ్యులు

తణుకు, న్యూస్‌టుడే: దాతలు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని మానవత సంస్థ రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ కోడూరి రాధాపుష్పవతి పేర్కొన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తణుకుశాఖ ఛైర్‌పర్సన్ కటారి శారదాదేవి ఆర్థిక సహకారంతో స్థానిక ఇంద్రయ్య నగర్, సోమరాజుపేటలోని 198, 199 అంగన్‌వాడీ కేంద్రాలకు 15 కుర్చీలు, 8 నేల చాపలు, 30 స్టీలు వాటర్ గ్లాసులు, స్టీలు డ్రమ్ములు బహూకరించారు. తణుకు శాఖ ఉపాధ్యక్షుడు అక్కిన కాశీ విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి విశ్వనాథరాజు, డైరెక్టర్లు సత్యనారాయణరాజు, శివన్నారాయణ, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, వీరభద్రం పాల్గొన్నారు.

6,904 కుటుంబాలకు లబ్ధి

ఇరగవరం, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ 21వ విడతలో ఇరగవరం మండలంలో 6904 రైతు కుటుంబాలకు, రూ.4.59 కోట్లు మేర ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు మంగళవారం తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున రైతు ఖాతాకు జమ చేస్తారన్నారు.

ఇంటి పనిచేయలేదని బాలిక చేతులపై వాతలు!

కేసు నమోదు

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఏడో తరగతి చదువుతున్న ఓ బాలిక చేతులపై సంరక్షకులు వాతలు పెట్టిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పెంటపాడు గ్రామానికి చెందిన గొండి జ్యోతి భర్త కొంత కాలం క్రితం మృతి చెందారు. అనంతరం ఆమె జీవనోపాధి నిమిత్తం అయిదారునెలల కిందట విదేశానికి వెళ్లారు. ఈ క్రమంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను కొవ్వూరి వెంకటేశ్వరరావుకు, కుమారుడిని అత్త కుమారికి అప్పగించారు. మూడురోజుల కిందట ఇంటి పని చేయలేదనే నెపంతో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు బాలిక చేతులపై వాతలు పెట్టారనే విషయం గ్రామస్థుల ద్వారా ఆమె నాయనమ్మ కుమారికి తెలిసింది. దీంతో ఆమె పెంటపాడు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఎస్సై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ

పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ రాష్ట్ర ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా మంగళవారం విజయవాడలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, కళాశాల సిబ్బంది ఆయనను అభినందించారు.

సాంకేతిక విధానాలు అవలంబించాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: విద్యాబోధనలో సాంకేతిక విధానాలను అవలంబించాలని మండల విద్యాశాఖాధికారి, కోర్సు డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఇరగవరం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమంలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. లీప్ యాప్‌పై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ పరిశీలకులు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

నేడు కేవీకేలో పీఎం-కిసాన్ ప్రత్యక్ష ప్రసారం

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పీఎం-కిసాన్ 21వ విడత నగదు విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేసినట్లు విస్తరణ సంచాలకుడు బి.గోవిందరాజులు తెలిపారు. అలాగే వివిధ పంటలపై ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయం, సమగ్ర పోషక యాజమాన్యం, కలుపు నివారణ, పాడి పశువులు, చేపలు, రొయ్యల పెంపకంపై అవగాహన సదస్సు, ఉద్యాన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇక అక్రమాలకు చెక్

లోకోస్ యాప్‌లో వివరాల నమోదు

స్వయం సహాయక సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం అహ్మద్

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, సమావేశాలు, తీర్మానాలు తదితర వివరాలన్నీ ఇకపై పక్కాగా ఉంటాయి. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తి సమాచారం సభ్యులందరికీ త్వరలో అందుబాటులోకి రానుంది. సంఘాలకు సంబంధించిన అన్ని వివరాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రస్తుతం తణుకు నియోజకవర్గంలో 4478 స్వయం సహాయక సంఘాలు, వీటిలో 16,844 మంది సభ్యులు, 659 మంది ఎన్యూమరేటర్లు ఉన్నారు. ఈ సంఘాల వివరాలన్నీ ఒకేచోట అందుబాటులో ఉంచడంతో పాటు అవకతవకలకు అడ్డుకట్ట వేసేలా కేంద్ర ప్రభుత్వం 2023లోనే లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. పోర్టల్ నిర్వహణ, ఎస్‌హెచ్‌జీల వివరాలు అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో క్షేత్రస్థాయికి చేరలేదు.

పూర్తి సమాచారం అందుబాటులోకి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ యాప్‌ను పునర్వ్యవస్థీకరిస్తున్నారు. ఇప్పటికే వీవోఏల నుంచి అధికారుల వరకు శిక్షణ ఇచ్చారు. వారు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా సంఘాల పూర్తి వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాల వివరాలు

మండలం	సంఘాలు	సభ్యులు	ఎన్యూమరేటర్లు
అత్తిలి	1574	15740	267
ఇరగవరం	1530	15300	217
తణుకు	1374	13740	175

ప్రయోజనాలివీ సంఘాలకు సంబంధించిన బ్యాంకు లింకేజీ రుణాలు, ఉన్నతి, శ్రీనిధి, పెట్టుబడి సాయం, పొదుపు నిల్వ, అంతర్గత అప్పులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సమావేశాల తీర్మానాలు, రుణాలు, వసూళ్లు, బ్యాంకులకు చెల్లింపులు తదితర విషయాలన్నీ లోకోస్ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ వంటి పథకాల గురించి తెలుసుకోవచ్చు. సభ్యులందరూ ప్లేస్టోర్ నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని ప్రత్యేక లాగిన్ ఐడీల ద్వారా ఎక్కడి నుంచైనా వివరాలు పరిశీలించుకోవచ్చు. దీంతో ఆయా సంఘాల ఆర్థిక స్థితిగతుల గురించి అధికారుల వరకు తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

చెట్టు.. ప్రయాణికులపై కూలేట్టు!

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం నుంచి మాధవరం వెళ్లే రహదారిలో చెట్టు ఎండిపోయింది. స్థానికులు ఎవరు దీని గురించి పట్టించుకోకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కూలేటట్టు ఉండటంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు పరిశీలించి సమస్యల పరిష్కరించాలని కోరుతున్నారు.

బిల్డర్స్ డే శుభాకాంక్షలు
ప్రియమైన మా కస్టమర్లకు, బిల్డర్స్‌కు, తాపీమేస్త్రీలకు బిల్డర్స్ డే శుభాకాంక్షలు.

వైష్ణవి ట్రేడర్స్
(సిమెంట్ & ఐరన్)
STVN హిందూ హైస్కూల్ ఎదురుగా, పెంటపాడు
సెల్: 90007 63432

బిల్డర్స్ డే శుభాకాంక్షలతో..

సాయిరామ్ మిషన్ టూల్స్ ఏజన్సీస్
సేల్స్ & సర్వీస్
టౌన్ హాలు గేటు ఎదురుగా, కెనరా బ్యాంక్ క్రింద, తణుకు
ప్రొ॥ వి.సాయి రామకృష్ణారెడ్డి, Cell: 98492 89586

(c) eenadu

ఉత్సాహంగా ఎంపికల పర్వం

కడప క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్‌లో భాగంగా అథ్లెటిక్స్, హాకీ అండర్-17 విభాగానికి సంబంధించి కడపలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి ఎంపికలు మంగళవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 400 మందికి పైగా బాలబాలికలు హాజరై తమ ప్రతిభ ప్రదర్శించారు. పలువురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

సందడిగా స్వాగతోత్సవం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం ఆడి పాడారు. ప్రథమ సంవత్సరంలో చేరిన వారికి సీనియర్లు ఆత్మీయ స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అలరించారు.

లక్ష దీప కాంతుల కార్తికం

పులివెందుల, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పులివెందులలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత మూల విరాట్, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కొలువుదీర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లక్ష దీపోత్సవంలో భాగస్వాములయ్యారు.

అన్నదాతకు తీపికబురు

- నేడు పీఎం కిసాన్–అన్నదాత సుఖీభవ నిధులు జమ
- 1.94 లక్షల మందికి రూ. 131.36 కోట్ల లబ్ధి

ఈనాడు, కడప- న్యూస్‌టుడే, కడప వ్యవసాయం, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి: సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా రైతులకు అండగా నిలవాలని కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. అందులో భాగంగా కేంద్రంతో కలిసి 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేస్తోంది. పెండ్లిమర్రిలో బుధవారం నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా కర్షకుల ఖాతాల్లోకి రెండో విడత నిధులు జమ చేయనున్నారు. పుట్టపర్తి కార్యక్రమం అనంతరం నేరుగా జిల్లాకు సీఎం చేరుకుంటారు. ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు జిల్లాలో 1,94,047 మంది కర్షకులకు రూ. 131.36 కోట్లు మేర లబ్ధి కలగనుంది. పర్యటన ఏర్పాట్లను మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ మనజీర్ సమూన్ జిలాన్, కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విశ్వనాథ్, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తదితరులు పెండ్లిమర్రిలో మంగళవారం పరిశీలించారు. సీఎం కార్యాలయ సూచనల మేరకు రైతులతో చంద్రబాబు ఎక్కువ సమయం కేటాయించేలా సన్నాహాలు చేశారు.

- మధ్యాహ్నం 1.15 గంటలకు హెలికాప్టర్‌లో పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరిక.
- 1.30కు మన గ్రోమోర్ సెంటర్ వద్ద రైతులతో మాటామంతీ.
- 1.40 గంటలకు ప్రజావేదిక వద్దకు చేరిక.
- సాయంత్రం 4 గంటల వరకు అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమం.
- 4.20 గంటలకు చిన్నదాసరిపల్లె చేరుకుని వ్యవసాయ క్షేత్రాల పరిశీలన, రైతులతో ముఖాముఖి.
- 6.15 గంటలకు వెల్లటూరులో తెదేపా కార్యకర్తలు, నాయకులతో సమావేశం.
- రోడ్డు మార్గంలో 6.40కు కడప విమానాశ్రయానికి చేరిక. అక్కడి నుంచి విమానంలో గన్నవరానికి బయలుదేరుతారు.

పెండ్లిమర్రిలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి తదితరులు

నియోజకవర్గాల వారీగా లబ్ధి...

● నియోజకవర్గం ● రైతు కుటుంబాలు ● అన్నదాత సుఖీభవ ● పీఎం కిసాన్ ● మొత్తం(రూ.కోట్లలో)

నియోజకవర్గం	రైతు కుటుంబాలు	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్	మొత్తం
కడప	1,576	0.79	0.19	0.98
పులివెందుల	41,980	20.99	7.32	28.31
ప్రొద్దుటూరు	10,326	5.16	1.85	7.01
కమలాపురం	30,700	15.35	5.32	20.67
మైదుకూరు	34,081	17.04	6.15	23.19
బద్వేలు	34,148	17.07	6.17	23.24
జమ్మలమడుగు	35,184	17.59	6.22	23.81
రాజంపేట (ఒంటిమిట్ట, సిద్దవటం)	6,052	3.03	1.12	4.15

న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తులు బాబాఫక్రుద్దీన్, భార్గవి(పాత చిత్రం)

ఆ ఊరు.. గొడవలే ఎరుగదు

కొండాపురం, న్యూస్‌టుడే: ఆ గ్రామంలో ఇప్పటి వరకు ఎలాంటి గొడవలు చోటుచేసుకోలేదు. ఒక్క పోలీసు కేసు కూడా నమోదు కాలేదంటే నమ్ముతారా! కొండాపురం మండలంలోని చిన్నపల్లె గురించి తెలుసుకుంటే నమ్మక తప్పదు మరి. ఈ గ్రామంలో 23 కుటుంబాలుండగా.. మొత్తం 80 మంది నివాసం ఉంటున్నారు. అందరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. దాదాపు ఇరవై ఏళ్ల పోలీసు రికార్డులను పరిశీలిస్తే ఇక్కడి నుంచి ఏ ఒక్క ఫిర్యాదూ అందలేదని తెలుస్తోంది. గ్రామస్థులందరూ సామరస్యంగా వ్యవహరిస్తారు. ఏదేని సమస్య తలెత్తితే చర్చించుకుని పరిష్కరించుకుంటారు. పిల్లలను బాగా చదివించడంతో పలువురు ఇప్పుడు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. ఆదర్శంగా నిలుస్తున్న ఈ ఊరి వాసులపై ఆ ప్రాంత పోలీసులు, అధికారులు ప్రశంసలు కురిపిస్తుంటారు. ఇటీవల ఆ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు కూడా నిర్వహించారు. 'ఫిర్యాదు రహిత గ్రామం'గా సీనియర్ న్యాయమూర్తి బాబాఫక్రుద్దీన్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి భార్గవి ఊరిని అభినందించారు.

158 పెరిగిన పోలింగ్ కేంద్రాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఒక పోలింగ్ కేంద్రంలో 1,200 ఓట్లకు మించి ఉండకూడదంటూ కేంద్ర ఎన్నికల సంఘం నూతన విధివిధానాలను తెచ్చింది. ఈ మేరకు జిల్లాలో కొత్తగా మరిన్ని ఏర్పాటుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం 1,963 ఉండగా.. తాజాగా ఆ సంఖ్య 2,121కు పెరగనుంది. దీంతో 158 పోలింగ్ కేంద్రాలు అదనంగా పెరిగినట్లైంది. అత్యధికంగా ప్రొద్దుటూరులో 42, కడపలో 39, కమలాపురంలో 28 పెరిగాయి. అత్యల్పంగా పులివెందులలో 8 కేంద్రాలే ఏర్పాటయ్యాయి.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పెంపు
బద్వేలు	272	17
కడప	287	39
పులివెందుల	301	08
కమలాపురం	251	28
జమ్మలమడుగు	315	10
ప్రొద్దుటూరు	268	42
మైదుకూరు	269	14

● 19 చోట్ల మార్పు: కడప, జమ్మలమడుగు, మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గాలను మినహాయించి బద్వేలు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో 19 పోలింగ్ కేంద్రాలను మార్పు చేశారు. పులివెందులలో అత్యధికంగా 7, బద్వేలులో 5, కమలాపురంలో 4, ప్రొద్దుటూరులో 3 కేంద్రాలను మార్పు చేశారు.

దాడి నేరం.. శిక్ష తప్పదు చట్ట ప్రకారం

ఆర్టీసీ సిబ్బందిపై ఇటీవల కాలంలో ప్రయాణికులు దాడులు చేస్తున్న ఘటనలు కొన్నిచోట్ల చోటుచేసుకున్నాయి. దువ్వూరులో ఓ డ్రైవర్‌పై కొందరు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. దీంతో సిబ్బందికి రక్షణ కల్పించేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. 'విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేయడం నేరం. ఎవరైనా దాడి చేస్తే 121, 122, 132 సెక్షన్ల ప్రకారం రెండు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు' అంటూ' స్టిక్కర్లను అన్ని బస్సుల్లో అతికించారు.

- న్యూస్‌టుడే, కడప(చిన్నచౌకు)

కట్టమంటే.. కలిసికట్టుగా కొట్టేశారు

● సర్వేతో వెలుగులోకి ఇళ్ల నిర్మాణ అక్రమాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పేదలందరికీ ఇళ్లంటూ గత వైకాపా ప్రభుత్వం హడావిడి చేసింది. ఇళ్లు కాదు ఊళ్లంటూ ప్రకటనలు గుప్పించింది. లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకునే అవకాశం ఉన్నప్పటికీ తమ అనుకూలురైన గుత్తేదారులకు పనులు కట్టబెట్టింది. ఇదే అదనుగా కొందరు బిల్లులు పొంది పనులు అటకెక్కించారు. మరికొందరు ఆ ప్రభుత్వం గద్దె దిగాక కూడా బిల్లుల కోసం ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో కూటమి పాలకులు స్పందించారు. వైకాపా పాలనలో మంజూరైన గృహాలకు సంబంధించి సర్వేకు అధికారులను ఆదేశించారు. ప్రత్యేక యాప్ రూపొందించి ప్రతి గృహాన్ని తనిఖీ చేయాలని సూచించారు.

- మూడో విడతకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా సుమారు 13 వేల పైచిలుకు గృహాలపై అధికారులు సర్వే చేపట్టారు. చేసిన పనులు, పూర్తికావాల్సిన వాటిని ఫొటోల్లో చిత్రీకరించారు.
- సుమారు ఏడు వేలకు పైగా ఇళ్లు సక్రమంగానే ఉన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మరో ఏడు వేల గృహాలపై నిశితంగా పరిశీలిస్తున్నారు.
- పులివెందులలో 300 పునాది దశలోనే ఉన్నాయని, ప్రొద్దుటూరులో మరో 300 ఇళ్లలో వ్యత్యాసాలున్నట్లు గుర్తించారు.
- పులివెందులకు సంబంధించిన ఇళ్ల విషయం కోర్టులో ఉండగా.. ప్రొద్దుటూరులో అటు గుత్తేదారులు, ఇటు లబ్ధిదారులు కలిసి నిధులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది.
- సుమారు రెండు వేల ఇళ్లకు సంబంధించి ద్వారాలు, కిటికీలు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఎవరైనా అపహరించారా.. లేక కాంట్రాక్టరే ఏర్పాటు చేయలేదా అనే కోణంలో పరిశీలిస్తున్నారు.
- సర్వేపై గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రాజారత్నం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. మరో రెండు రోజుల్లో ప్రభుత్వం వద్ద సమావేశం ఉందని, తదనంతరం అన్ని అంశాలు వెలుగులోనికి వస్తాయని తెలిపారు.

(c) eenadu

అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికైన విద్యార్థినులు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయలక్ష్మితో కలిసి డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు పావని, జాహ్నవిలను అభినందించారు. తమ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ తరఫున నవంబరు 22వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు మనాలిలోని వాజ్‌పేయీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటైనిరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ (ఏబీవీఐఎంఏఎస్) అనే సంస్థలో పది రోజుల పాటు జరగనున్న నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు (ఎన్ఏటీసీ) ఎంపికైనందుకు సంతోషంగా ఉందని విద్యార్థినులు తెలిపారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సలీంబాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయలక్ష్మి

రాకెట్ ఛాలెంజ్ రిజిస్ట్రేషన్‌కు 20న ఆఖరు

కడప విద్య, న్యూస్‌టుడే : రాకెట్ ఛాలెంజ్ పోటీకి విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీ ఆఖరని జిల్లా సైన్స్ అధికారి వేపరాల ఎబినేజర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముగ్గురు కలిసి ఒక జట్టుగా తయారు కావాలని 6 నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులు భాగస్వాములు కావాలని చెప్పారు. విద్యార్థుల్లో రాకెట్ సైన్స్ విజ్ఞానం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం, సమగ్రశిక్ష, సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 83283 75357 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రధాని పర్యటనకు జిల్లా తహసీల్దార్లు

వేంపల్లె, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుల కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా నుంచి ఆరుగురు తహసీల్దార్లను నియమిస్తూ రాష్ట్ర భూపరిపాలనా విభాగం చీఫ్ కమిషనర్ జి. జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేంపల్లె, కమలాపురం, పోరుమామిళ్ల, గోపవరం, సిద్దవటం, దువ్వూరు తహసీల్దార్లు హరనాథరెడ్డి, శివరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, త్రిభువన్‌రెడ్డి, తిరుమలబాబు, సంజీవరెడ్డిలను పుట్టపర్తిలో విధుల కోసం నియమించారు. వీరు ఈ నెల 19 నుంచి 23 వరకు అక్కడే విధులు నిర్వర్తించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

వృక్షశాస్త్ర విభాగం స్కాలర్‌కు డాక్టరేట్

సునీల్‌కుమార్

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం స్కాలర్ సునీల్‌కుమార్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆ శాఖ ఆచార్యులు మధుసూదనరెడ్డి పర్యవేక్షణలో [illegible] విశ్వవిద్యాలయానికి సమర్పించారు. [illegible] పరీక్షలకు పంపగా, వైవా వోస్ కమిటీ సిఫారసు ఆధారంగా పరిశోధకుడు సునీల్‌కు డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించింది.

అప్పుల బాధ తాళలేక చీనీ రైతు ఆత్మహత్య

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: మండలంలోని బిదినంచెర్ల గ్రామానికి చెందిన రైతు ముత్తులూరు పెద్దిరెడ్డి (47) అప్పుల బాధతో విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు గ్రామ సమీపంలో [illegible] ఎకరాల చీనీ తోట ఉంది. కొంతకాలంగా సాగుతో పాటు కుటుంబ అవసరాలకు రూ.20 లక్షల మేర అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో చీనీ పంటకు ధరలు పతనమవడంతో కుంగిపోయారు. దీనికి తోడు రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో మనస్తాపానికి గురై మంగళవారం చెరువు కట్ట వద్దకు వెళ్లి విష ద్రావణం తాగారు. స్థానికులు గుర్తించగా అప్పటికే మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు నందు, కుమార్తె రితిక ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దిరెడ్డి (పాత చిత్రం)

44 గృహ వినియోగ సిలిండర్ల స్వాధీనం

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లె ప్రాంతంలోని హోటళ్లపై మంగళవారం పులివెందుల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్న 44 గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లను వారు స్వాధీనం చేసుకున్నారు. పులివెందుల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, ఆర్ఐ లోకేశ్ స్థానిక నాలుగు రోడ్ల కూడలి, మెయిన్‌బజార్, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలోని పలు హోటళ్లపై ముకుమ్మడి దాడులు నిర్వహించారు. [illegible] గృహ వినియోగ సిలిండర్లు వాడుతున్న వారిని గుర్తించి హోటల్ యజమానులపై కేసులు నమోదు చేశారు.

ఆయకట్టుకేదీ ఆయువుపట్టు!

◆ కాలువల నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం
◆ ఇదీ సర్వారాయసాగర్ జలాశయ దుస్థితి

సర్వరాయ సాగర్ ప్రాజెక్టు

కావాల్సిన నిధులు : సుమారు రూ.100 కోట్లు

అందుబాటులోకి వచ్చే ఆయకట్టు : 35 వేల ఎకరాలు

లబ్ధిపొందే ప్రాంతాలు : కమలాపురం నియోజకవర్గ మండలాలు, ఎర్రగుంట్ల మండలం

భూసేకరణ : 797 ఎకరాలు

కాలువలు : ప్రధాన, ఉప కాలువల నిర్మాణానికి వైకాపా హయాంలో పరిపాలన అనుమతులిచ్చినా 2023 జులై 31 గుత్తేదారుతో 36 నెలల వ్యవధిలో పనులు పూర్తి చేసేలా ఒప్పందం జరిగినా పనులు చేపట్టలేదు.

సమస్య: జలాశయానికి చాలా చోట్ల రివిట్‌మెంట్ వేయకుండా వదిలేశారు. నాసిరకంగా నిర్మించిన కట్టకు పదిచోట్ల లీకేజీలున్నాయి. ఈ మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది.

ఈనాడు, కడప

సర్వారాయసాగర్ కమలాపురం నియోజకవర్గంలోని ఓ జలాశయం. ఇది కొందరికి మాత్రమే లబ్ధి చేకూరుస్తోంది. గండికోట రిజర్వాయర్ నుంచి నీటిని అందుకుని నింపుకొంటోంది. అయితే.. ఈ జలాశయ నీటిని గత ప్రభుత్వంలో భారతి సిమెంట్ పరిశ్రమతో పాటు మాజీ సీఎం జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేపల చెరువులకు మాత్రమే వినియోగించారు. ప్రస్తుతం అదే విధంగా కొనసాగుతోంది.

★ సర్వారాయసాగర్ జలాశయం నిండు కుండను తలపిస్తున్నా.. ఒక్క ఎకరాకూ సాగునీరు అందించలేని దయనీయ పరిస్థితి. ప్రధాన కాల్వలు ఇప్పటికీ పూర్తికాక పోగా.. ఉన్నవి లీకవుతున్నాయి.

ఇదీ విషయం

గాలేరు-నగరి సుజల స్రవంతి పథకంలో భాగంగా కమలాపురం నియోజకవర్గంలోని వీరపునాయునిపల్లె మండలంలో సర్వారాయసాగర్ జలాశయం నిర్మించారు. 3.06 టీఎంసీల సామర్థ్యంతో సుమారు 35 వేల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో దీన్ని నిర్మించారు. అయితే గుత్తేదారులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంకా పనులు పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రిపైనే ఆశలన్నీ

పెండ్లిమర్రికి నేడు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. రూ.100 కోట్లు వెచ్చిస్తే 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. జలాశయం కింది భాగంలో భూములన్నీ బీడుగా ఉన్నాయి. కాలువల తవ్వకాలకు భూములివ్వడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. వేలాది మంది రైతులకు ఉపయుక్తంగా ఉండే ప్రాజెక్టు వినియోగానికి చర్యలు చేపట్టాలని రైతులు విన్నవిస్తున్నారు. వైకాపా హయాంలో స్వప్రయోజనాల కోసమే పాటుపడ్డారని.. ఇప్పుడైనా అన్నదాతలను ఆదుకోవాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి వినతి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే: పెండ్లిమర్రి మండలంలో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించేందుకు కమలాపురం నియోజకవర్గాన్ని సీఎం ఎంచుకోవడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి ముందుగా వెల్లటూరులోని మన గ్రోమోర్ కేంద్రం, ఎరువుల దుకాణానికి చేరుకుని నియోజకవర్గంలోని రైతులతో మాట్లాడుతారన్నారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

కడప నేరవార్తలు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెండ్లిమర్రి రాక సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. కడప పోలీసు కార్యాలయంలో మంగళవారం రాత్రి డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమావేశం ఏర్పాటు చేశారు. పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లి, వెల్లటూరు గ్రామాల్లో సీఎం పర్యటిస్తున్నారని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. కాన్వాయ్ వచ్చే సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రకాష్‌బాబు, వెంకటాద్రి, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్‌తో పాటు డీఎస్పీలు, సీఐలు ఉన్నారు.

సూచనలిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, చిత్రంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

నడి రోడ్డులో రక్షకభటుల రగడ

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: ఇద్దరు పోలీసులు బహిరంగంగా అసభ్య పదజాలంతో దూషణకు దిగిన ఘటన పెండ్లిమర్రి మండలం వెల్లటూరులో మంగళవారం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు కొందరు పోలీసులకు బందోబస్తు విధులు కేటాయించారు. వీరిలో ఓ ఏఎస్సై, కానిస్టేబుల్ వెల్లటూరులోని హోటల్ వద్ద రోడ్డుపై గొడవకు దిగారు. బహిరంగంగా అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. అక్కడే ఉన్న కొందరు సిబ్బంది, స్థానికులు మీరే గొడవ పడితే ఎలా అంటూ సర్ది చెప్పారు. ఈ దృశ్యాలను కొందరు చరవాణిల్లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు.

గొడవను సర్దుబాటు చేస్తున్న తోటి కానిస్టేబుళ్లు, స్థానికులు

కన్యతీర్థంలో సుందరేశ్వరుడికి అన్నాభిషేకం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం సుందరేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. 100 కిలోల బియ్యంతో వండిన అన్నంతో స్వామి వారిని అభిషేకం చేశారు. ప్రపంచంలోని సమస్త జీవరాశులకు అన్నపానాదులకు లోటు లేకుండా ఉండాలనే ఈ కార్యక్రమం చేసినట్లు ప్రధాన అర్చకులు హరిహరశర్మ తెలిపారు. స్వామి వారికి రుద్రాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు సుందరేశ్వరస్వామి ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సుందరేశ్వరుడు

అన్నదానం, షెడ్డు నిర్మాణానికి చేయూత

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పెన్నానది తీరంలోని అయ్యప్ప, అమృతేశ్వర స్వాముల ఆలయాల్లో అయ్యప్ప మాలదారులకు అన్నదానం, షెడ్డు ఏర్పాటుకు రూ.4 లక్షలను దాత గండ్లూరు వీరప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు వితరణ చేశారు. ఈ మొత్తాన్ని ఆలయ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి స్వీకరించారు. అయ్యప్ప మాలదారులకు అన్ని రకాల సౌకర్యాలతో కూడిన షెడ్డును సమకూర్చనున్నామని ఆయన తెలిపారు.

దాత గండ్లూరు వీరప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులను సత్కరిస్తున్న రమేష్‌రెడ్డి

ఆర్టీసీలో సమస్య సాధనకు రిలే నిరాహార దీక్షలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జిల్లా ఆర్టీసీ అధికారి తీరుపై ఎన్ఎంయూ మహిళా ఉద్యోగులు కదం తొక్కారు. సమస్యలు పరిష్కరించడంలో ఆయన నిర్లక్ష్యం వహిస్తున్నారని కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట మంగళవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు ఆర్ఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్ తప్పిదం లేకపోయినప్పటికీ అన్యాయంగా సస్పెండ్ చేశారన్నారు. కేంద్ర ఆర్టీసీ కార్యాలయంలో జారీ చేసిన 1-2019 జీవోను అమలు చేయడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ప్రాంతీయ అధ్యక్షులు నాగముని, జిల్లా కార్యదర్శి సుధాకర్, జోనల్ నాయకులు సుబ్బరాయుడు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు జయరాం, శ్రీనివాసులుతో పాటు అన్ని డిపోల నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, చిత్రంలో జిల్లా అధ్యక్షులు నాగముని, జిల్లా కార్యదర్శి సుధాకర్ తదితరులు

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: ప్రతి వ్యవసాయ విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదిగి రైతు శ్రేయస్సు కోసం పాటు పడాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్‌తోనే చదువులు ఆపకుండా ఉన్నత చదువులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, శ్రీవల్లి, మాధురి, శిల్పకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తెదేపా నేత పి.శ్రీనివాసులు రూ.2 లక్షల చెక్కును ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి మంగళవారం అందించారు. పీ-4 విధానంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు సాయంగా అందించినట్లు దాత వివరించారు. సమాజ శ్రేయస్సు కోసం శ్రీనివాసులు నగదు వితరణ చేయడం అభినందనీయమని ఆయన అభినందించారు.

తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి చెక్కు అందిస్తున్న దాత

రాష్ట్ర లెజిస్లేచర్ కమిటీ జిల్లా పర్యటన రేపు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర లెజిస్లేచర్ కమిటీ ఈ నెల 20వ తేదీ నుంచి రెండు రోజుల పాటు కడప జిల్లాలో పర్యటించనుంది. అందులో భాగంగా 20వ తేదీ విజయవాడ నుంచి రైలులో కడప నగరానికి చేరుకుని అక్కడి నుంచి నేరుగా గండికోటకు బయలుదేరి వెళ్తారు. అక్కడ విశ్రాంతి తీసుకుని 11 గంటల ప్రాంతంలో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కడప నగరానికి చేరుకుంటారు. రాత్రికి కడపలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం పది గంటలకు కడప కలెక్టరేట్‌కు చేరుకుని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఉదయం యోవేవి, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ, ట్రిపుల్‌ఐటీ, రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీ, కడప స్టీల్ ఫ్యాక్టరీపై సమీక్ష చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్, కడప అర్బన్ డెవలప్‌మెంట్, ఏపీ టూరిజం కడప, ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్, ఏపీ మినరల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష చేస్తారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రి ఏడుగంటలకు కడప నుంచి బయలుదేరి వెళ్తారని జిల్లా కేంద్రానికి సమాచారం అందింది.

20న ఏక్తా దివస్ యాత్ర

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: తొలి ఉపప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 20న దేశ వ్యాప్తంగా ఏక్తా దివస్ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా భాజపా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కడప [illegible] పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. [illegible] ఉంటుందని ఆయన వివరించారు. 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఉక్కు మనిషి వల్లభ్ భాయ్ పటేల్ అని కొనియాడారు. జిల్లాలోని భాజపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు. నాయకులు రామ్మోహన్‌రెడ్డి, పవన్‌కుమార్, అశోక్‌రెడ్డి ఉన్నారు.

లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు సత్కారం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా ఎంపికైన కడప తెదేపా నాయకుడు చంద్రమోహన్‌రెడ్డిని ఆ పార్టీ 26వ డివిజన్ నేతలు సత్కరించారు. కడప మాసాపేట పరిధిలోని 26వ డివిజన్ తెదేపా కార్యాలయంలో మంగళవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో డివిజన్ బాధ్యుడు [illegible] శంకర్ ఆధ్వర్యంలో ఆయనకు సత్కారం జరిగింది. పార్టీ కోసం కృషి చేసిన వారికి పదవులు లభిస్తాయనడానికి మోహన్‌రెడ్డి నిదర్శనమని శంకర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ అన్నారు. నాయకులు రహ్మతుల్లా, కొమ్మలపాటి, రాఘవేంద్ర, ప్రణవతి పాల్గొన్నారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఢిల్లీ, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టరు సి.యామిని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లను సంప్రదించాలన్నారు.

పుష్పగిరి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి కొండపై వెలసిన శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం హరిహరుల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారి శివయ్య పర్యవేక్షణలో లెక్కించగా రూ.8,28,180 ఆదాయం వచ్చిందని.. ఆ మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నట్లు ఈవో శ్రీనివాసులు చెప్పారు.

టెట్ అర్హత పరీక్ష రద్దుకు వినతి

కడప విద్య, న్యూస్‌టుడే: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్ష రద్దు కోసం కృషి చేయాలని కోరుతూ మంగళవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తాకృష్ణ చైతన్యరెడ్డిని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఎస్టీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, పాలకొండయ్యలు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 25 నుంచి 30 ఏళ్ల సర్వీస్ కలిగిన వారిని తిరిగి టెట్ అర్హత పరీక్ష రాయాలనడం సరి కాదన్నారు. తమ అభ్యర్థనను రాష్ట్ర విద్యా శాఖ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

పాలకులు దృష్టి సారించాలి

వేంపల్లె, న్యూస్‌టుడే: రాయలసీమలో పెండింగ్ సమస్యలపై బుధవారం సీమలో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులు దృష్టి సారించాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. వేంపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడారు. సీమకు తరతరాలుగా అన్నింటా పాలకులు అన్యాయం చేస్తూనే ఉన్నారన్నారు. వీటికి సత్వరం నిధులు విడుదల చేయించాలని కోరారు.

ముగిసిన అథ్లెటిక్స్, హాకీ జిల్లా స్థాయి ఎంపికలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్‌లో భాగంగా అథ్లెటిక్స్, హాకీ అండర్-17 విభాగానికి సంబంధించి జిల్లా స్థాయి ఎంపికలు మంగళవారం వైఎస్సార్ క్రీడా పాఠశాలలో నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు చంద్రావతి, శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఎంపికలకు సెలెక్షన్ కమిటీ సభ్యులుగా శివశంకర్‌రెడ్డి, ప్రవీణ్‌కిరణ్, సుబ్బయ్య, చరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వరరావు, రెడ్డయ్య, ప్రణవి, రాజేశ్వరి, ప్రశాంతి వ్యవహరించారు. క్రీడా పాఠశాల శిక్షకులు అనిల్, ఖాదర్‌బాషా హాకీ ఎంపికలు చేపట్టారు. అథ్లెటిక్స్, హాకీ జిల్లా స్థాయి ఎంపికలకు 400 మందికి పైగా బాలబాలికలు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు చంద్రావతి, శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. హాకీ బాలుర అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీలు పులివెందులలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. బాలికల అండర్-17 హాకీ రాష్ట్ర స్థాయి పోటీలు నెల్లూరులోని విక్రం సింహపురి యూనివర్సిటీలో నిర్వహించనున్నారని తెలిపారు. బాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించి ఇంకా తేదీలు ఖరారు కాలేదన్నారు. అథ్లెటిక్స్ అండర్-17 బాల బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు పల్నాడు జిల్లాలోని వినుగొండ లయోల హైస్కూల్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నారన్నారు.

★ **రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలురు :** భవానీశంకర్, సంతోష్‌కుమార్, రాజేష్, బాలాజీ, ఈశ్వర్‌సాయి, జాకీర్, సూర్య, సంజయ్, నవీన్, ధనుష్, తమన్, గోవర్ధన్, నిఖిల్,

400 మందికిపైగా బాలబాలికలు హాజరు

సందీప్, బాలాజీ, హర్షవర్ధన్, జితేష్, సోలోమన్.

★ **బాలికలు :** దీక్షామాధురి, నందిని, ముజియా బేగం, నాగమణి, జ్యోత్స్న, వైష్ణవి, నాగతేజ, శ్రీదేవి, చైతన్యశ్రీ, యజ్ఞశ్రీ, షర్మిల, భారతి, దీపిక, అస్మిత, తేజ, నిక్షిత, లుదియా, వేణుమాధురి.

★ **రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన బాలురు :** రాఘవేంద్ర, సాయికృష్ణ, అశ్విన్‌కుమార్, దివాకర్, హర్షవర్ధన్, అక్బర్, నాగభువనేశ్వర్, శివశంకర్, మధుసూదన్‌రెడ్డి, రోహిత్, బ్రహ్మయ్య, లోకేష్, శ్రీకాంత్‌రెడ్డి, చిన్న వెంకటేష్, సుమంత్, తిమోతీ, మహేష్, జగదీష్, నరేష్, వెంకటేష్, గంగాధర్, మహమ్మద్ సుఫియాన్ , హరినాథ్, పవన్, శ్రీనివాస్, సాయిపుష్పేష్, రఫీ.

★ **బాలికలు :** భవిత, దీపిక, ఫాతిమా, కీర్తి, లక్ష్మీ, సుధ, రాజేశ్వరి, రాధ, నీరజ, షాహిదా, ముబీనా, అయిషా, నాగస్వాతి, కోమల ప్రియ, ఇందిరా, పావని, మహబూబ్‌జాన్, షైనీ, హిమాంసుజ, కావ్య, జస్విత, అఫ్రీన్.

వంద మీటర్ల పరుగులో పోటీపడుతున్న బాలికలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

తస్లీమ్

పోరుమామిళ్ల, దువ్వూరు, న్యూస్‌టుడే: పోరుమామిళ్ల పట్టణానికి చెందిన తస్లీమ్, దువ్వూరు షిరిడి సాయి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సబ్‌జూనియర్ విభాగంలో కె.సంజీవ లహరి, జి.నాగ శ్రీచరణ్, క్యాడెట్ విభాగంలో పి.రామ్‌హేమంత్‌కుమార్, సీనియర్ విభాగంలో ఎం.సుధీర్‌కుమార్ గోల్డ్‌మెడల్స్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 21, 22, 23వ తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలి పట్టణంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తస్లీమ్ పాల్గొంటారు. దువ్వూరు విద్యార్థులు ఈ నెల 16, 17వ తేదీల్లో కాకినాడ సూర్యకళా మందిర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, క్యాడెట్, సీనియర్ విభాగం పోటీల్లో పాల్గొని సత్తా చాటారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గంగనపల్లె విద్యార్థులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెండ్లిమర్రి మండలం గంగనపల్లె విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇక్బాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి తెలిపారు. తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు పావని, మహబూబ్ జాన్‌లు హ్యామర్ త్రోలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థినులు షాహిదా, ముబీనా పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో మొదటి, రెండో స్థానాల్లో నిలిచారన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో పల్నాడు జిల్లా వినుగొండ లయోలా హైస్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొననున్నారని తెలిపారు.

ఎంపికైన వారితో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రావతి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

K K Enterprises Kadapa. Telecaller (Male & Female) Salary: 10000 + Incentives. Contact : 8639923418

M.G.Auto Nagar, Proddatur 9390032810.

TO LET

COMMERCIAL

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 350/- మాత్రమే

Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ప్లాస్టిక్ నిషేధం అమలెక్కడ?

చెత్త డబ్బాలోని వ్యర్థాలను తింటున్న పశువులు

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి కలిగే నష్టం అంతా ఇంతా కాదు. ఎప్పటినుంచో పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా వినియోగానికి అడ్డుకట్టపడలేదు. జమ్మలమడుగు - తాడిపత్రి ప్రధాన రహదారిలోని చెత్త డబ్బాలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇలాంటి వ్యర్థాలను తిన్న పశువుల పొట్టలోంచి పశు వైద్యులు శస్త్రచికిత్సల ద్వారా కిలోలకొద్దీ ప్లాస్టిక్ సంచులను బయటకు తీసిన ఘటనలున్నాయి. ఇప్పటికైనా అధికారులు పక్కాగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

బద్వేలు గ్రామీణ: న్యూస్‌టుడే: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం బద్వేలు తెదేపా ఇన్‌ఛార్జి కె.రితేష్ రెడ్డి రూ.3,50,000 విలువైన 10 చెక్కులను 10 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆరోగ్య శ్రీ పథకం వర్తించక సొంత డబ్బుతో వైద్యసేవలు పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలువపల్లె సర్పంచి శ్రీనివాసులు, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బద్వేలు తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి, తదితరులు

హక్కుల సాధనకు బహుజనులు ఏకం కావాలి

మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్

కాశినాయన, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో బహుజనులందరూ ఏకమై వారి హక్కులు కాపాడుకోవాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కాశినాయన మండలంలోని కత్తెరగండ్ల గ్రామ సమీపాన చెన్నవరం సగిలేటి ఒడ్డున వెలసిన సాంబశివ ఆలయంలో యాదవ సంఘం ఏర్పాటు చేసిన కార్తిక మాస వన భోజన మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తొలుత పోరుమామిళ్లలో అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు.

గండికోట నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇళ్లు, భూములు త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొండాపురంలోని తహసీల్దారు గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు. నాయకులు సుబ్బారావు, జయంతు, ఖాదర్ బాషా, దినకర్, కనకరాజు, రామసుబ్బయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు ఎంత కష్టం

జమ్మలమడుగులోని ప్రాంతీయ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన స్థలం

డయాలసిస్ కేంద్రం ఏర్పాటు ఎప్పుడో?

జమ్మలమడుగులో హామీకే పరిమితమైన దుస్థితి

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు

మారుతున్న జీవనశైలితో మధుమేహం, అధిక రక్తపోటుతోపాటు కిడ్నీ సంబంధ సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారు. వీరిలో చాలా మందికి డయాలసిస్ అవసరమవుతోంది. జమ్మలమడుగు ప్రాంతీయ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరడం లేదు. స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని జూన్‌లో వైద్యఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌నాథ్ హామీ ఇచ్చారు. నాలుగు నెలలు అవుతున్నా దీని గురించి ఎలాంటి పురోగతి లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు.

జమ్మలమడుగులో పర్యటనకు వచ్చిన వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌నాథ్

జమ్మలమడుగు ఉప వైద్య విభాగ పరిధి

మండలం	బాధితులు
కొండాపురం	06
పెద్దముడియం	10
మైలవరం	08
జమ్మలమడుగు	11
ముద్దనూరు	07
ఎర్రగుంట్ల	07
ప్రొద్దుటూరు	46
రాజుపాలెం	07

102 మందికి ఇక్కట్లు

జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వో పరిధిలోని ఎనిమిది మండలాల్లో 22 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 102 మంది డయాలసిస్ బాధితులు ఉన్నట్లు గుర్తించారు. ఒకసారి మూత్రపిండాల పనితీరు మందగిస్తే నయం చేయించుకోవడానికి వ్యయప్రయాసలు తప్పవు. జమ్మలమడుగులో డయాలసిస్ కేంద్రం లేక పోవడంతో బాధితులు ప్రొద్దుటూరు, కడప, పులివెందుల తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంతమంది వారానికి మూడు సార్లు వెళ్లాల్సి ఉంటుంది, అలాంటి వారికి బస్సు ఛార్జీల వ్యయం సమస్యగా మారింది. ఇక్కడే ఏర్పాటైతే ఖర్చులు తగ్గుతాయని చెబుతున్నారు. ప్రాంతీయ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేశామని జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత తెలిపారు.

అటవీ భూముల సేకరణకు సర్వే

అటవీ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రామేశ్వరం-ఆర్టీపీపీ మార్గంలో పెన్నా మీదుగా రూ.36.40 కోట్లతో మైపంతెనకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు అటవీ భూసేకరణ నిమిత్తం రెవెన్యూ, ర.భ, ఫారెస్టు అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గతంలో 48 సెంట్ల స్థలం అవసరమని గుర్తించారు. కానీ అదనంగా మరో 60 సెంట్లు అటవీ భూసేకరణపై రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లు ప్రతిపాదించారు. తహసీల్దారు గంగయ్య, మండల సర్వేయరు లక్ష్మీ, ఫారెస్టు రేంజరు హేమాంజలి, రోడ్లు, భవనాల శాఖ డీఈ లక్ష్మీనరసింహులు, వీఆర్వో ప్రేమ్‌సాయి, సర్వేయరు వీరభద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బహుమతితో విద్యార్థినులు సుమవర్షిణి, ఇంద్రజ

జమ్మలమడుగు గ్రామీణ, ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీల్లో జమ్మలమడుగు కస్తూరిబా గాంధీ విద్యాలయ విద్యార్థినులు సుమవర్షిణి, ఇంద్రజ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మంగళవారం విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన శాంతకుమారిని ప్రిన్సిపల్ ప్రణీత, అధ్యాపకులు అభినందించారు. ● ఈ నెల 14, 15వ తేదీల్లో కాకినాడలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన చర్విత్‌రెడ్డి, సుదీప్ రెండో స్థానంలో నిలిచారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ లీల, పక్కన ఉపాధ్యాయులు, వినోద్, సలీమ

ప్రశంసా పత్రాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం రాజేశ్వరి, పక్కన ఉపాధ్యాయుడు మహబూబ్ బాషా

ప్రతిభాపాటవ పోటీల్లో విద్యార్థుల సత్తా

ఖాజీపేట, దువ్వూరు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం పలు పాఠశాలల్లో ప్రతిభా పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఖాజీపేట మండలంలోని శ్రీ సాయికృష్ణ విద్యామందిర్ హైస్కూల్ విద్యార్థులు ఆర్.నవదీప్ (10వ తరగతి), బషీర్ (10వ తరగతి), షబీర్ అలీ (7వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రధానోపాధ్యాయురాలు కృష్ణలీల, ఉపాధ్యాయులు వినోద్, సలీమ్ అందజేశారు. ● ఖాజీపేట మండలంలోని శ్రీ సాయి తేజ హైస్కూల్ విద్యార్థులు ఎం.తేజస (10వ తరగతి), ఎం.లక్ష్మీప్రణతి (9వ తరగతి), బి.మహమ్మద్ రఫీ (9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయుడు, మహబూబ్ బాషా ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. ● దువ్వూరు మండలం గుడిపాడులోని శంకరాచార్య హైస్కూల్ విద్యార్థులు ఎన్ అబ్దుల్ లతీఫ్ (10వ తరగతి), కె. వర్షిత (9వ తరగతి), వి.వి హారికరెడ్డి (8వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి కరస్పాండెంట్ రామ్మోహన్ రెడ్డి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దువ్వూరు మండలం గుడిపాడు శంకరాచార్య హైస్కూల్ కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి

కల్యాణం.. కమనీయం

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆంజనేయనగర్‌లో మంగళవారం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణుల నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామావళి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక నరసింహాపురంలోని లక్ష్మీనృసింహాలయంలో మంగళవారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. మూలవిరాట్ విగ్రహమూర్తులకు అభిషేకాలు అనంతరం శోభాయమానంగా అలంకరించారు. బాలాజీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 300 మంది మహిళలు, యువతులు భక్తి శ్రద్ధలతో విష్ణు సహస్ర నామావళి ఐదు పర్యాయాలు పారాయణం చేశారు.

హరహర శంకర.. శివశివ శంకర

ప్రొద్దుటూరు: గ్రామోత్సవంలో గంగా, రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి

మైదుకూరు భీమేశ్వరాలయంలో మరకతలింగానికి అన్నాభిషేకం

ప్రొద్దుటూరు పట్టణం, మైదుకూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవం సందర్భంగా మంగళవారం శివాలయాల్లో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవాలను నిర్వహించారు. మూలవిరాట్‌లకు ప్రత్యేకాలంకారం చేశారు. డప్పు వాయిద్యాలు, కళాబృందాల ప్రదర్శన మధ్య శివనామస్మరణలతో వేడుకగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆసుపత్రిలో అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా తయారైంది. దుర్వాసన కారణంగా రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం రోగుల పాలిట శాపమవుతోంది. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో విషపురుగులు, దోమలు, పాములు ఆసుపత్రిలోకి వస్తున్నాయని రోగులు వాపోతున్నారు. రాత్రివేళ నిద్రపోయేందుకు కూడా అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి నిత్యం ఆసుపత్రి పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ... అందరి మన్ననలను పొందుతూ నేడు 120వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకొంటున్న శుభ సందర్భంగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారికి మరియు సిబ్బందికి మా శుభాకాంక్షలు.
శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారు
చీఫ్ మేనేజర్, జిన్నా రోడ్డు శాఖ, ప్రొద్దుటూరు.
వీర & శ్రీ కాళేశ్వరి ట్రావెల్స్
ప్రతాప్ రెసిడెన్సీ, మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు.

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
Canara Bank
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ... అందరి మన్ననలను పొందుతూ నేడు 120వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకొంటున్న శుభ సందర్భంగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారికి మరియు సిబ్బందికి మా శుభాకాంక్షలు.
శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారు
చీఫ్ మేనేజర్, జిన్నా రోడ్డు శాఖ, ప్రొద్దుటూరు.
శ్రీ మహేశ్వర బుక్ డిపో
23/85, గంగమ్మ దేవళం వీధి, ప్రొద్దుటూరు.

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
Canara Bank
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ... అందరి మన్ననలను పొందుతూ నేడు 120వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారికి మరియు సిబ్బందికి మా శుభాకాంక్షలు.
శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారు
చీఫ్ మేనేజరు
జిన్నారోడ్డు శాఖ, ప్రొద్దుటూరు.
M/s S.C.Narasimha Reddy & Co.
Managing Partner
S.Krishnarjuna Reddy
Class I Contractor, ప్రొద్దుటూరు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ముద్దనూరు: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మలేరియాధికారి మాట్లాడుతూ ఆసుపత్రిలోని ప్రసవ, టీకాల గదులను, వార్డులను పరిశీలించారు. డాక్టర్ కరిష్మా, సీహెచ్‌వో ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతి

కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విన్నవిస్తున్న జాస్తి వీరాంజనేయులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఉమ్మడి కడప జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన గండికోట, సిద్దవటం, ఒంటిమిట్ట, పుష్పగిరి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్, దానవులపాడు, పెద్దముడియం తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులను కొనసాగించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు. మంగళవారం దిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్ రావత్‌కు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు.

సమష్టిగా కోటి సంతకాల సేకరణ చేపట్టాలి

మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డికి పుస్తకం ఇస్తున్న ఎమ్మెల్యే సుధ

అట్లూరు, న్యూస్‌టుడే: మండలంలో వైకాపా నాయకులు సమష్టిగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోనూ చేపట్టాలని ఎమ్మెల్యే సుధ అన్నారు. మండలానికి సంబంధించిన కోటి సంతకాల సేకరణ పుస్తకాలను మంగళవారం మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే సుధ అందజేశారు. కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని ఘనంగా చేపట్టాలని ఎమ్మెల్యే మండల వైకాపా నాయకులకు సూచించారు.

9వ వర్ధంతి
అనురాగం, ఆప్యాయతలతో మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకొన్న మీరు మా నుండి దూరమై నేటికి 9 సం॥లు గడిచినా మీ తియ్యని జ్ఞాపకాలు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని కోరుకుంటూ...
కీ॥శే॥ అందె పాపయ్య గారి వెంకటరమణ గారు
LFL Head Master,
ఇందిరమ్మ కాలనీ,
కడప రోడ్డు, మైదుకూరు.
జననం : 15-12-1963
మరణం : 19-11-2016
భార్య :
ఎ.వెంకట సుబ్బమ్మ
కుమార్తెలు: B.C.సంధ్య, S.రాధ స్వరూప, A.P.శ్రీలక్ష్మి
అల్లుళ్లు: B.C.వెంకటేశ్వర్లు, S.చైతన్య, M.సుబ్బరాయుడు
మనుమలు : B.C.వెంకట శౌర్యన్, S.వెంకట గునిత్, B.C.వెంకట శ్రీవర్ధన్, M.సుబ్బవిక్రాంత్
మనుమరాండ్రు : B.C.వెంకట దేవిక, S.వార్షిక, M.సుబ్బసంయుక్త

ఎంపీడీవో దృష్టికి సమస్యలు.. పరిష్కారానికి చర్యలు

ఈనాడు మీతోడు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామ వీధుల్లో మెరుగైన సౌకర్యాలు ఎంత వరకు ఉన్నాయో, వివిధ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంగళవారం ప్రొద్దుటూరు మండలంలోని కాకిరేనిపల్లె గ్రామంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి స్థానికుల వద్దకు వెళ్లి తెలుసుకున్నారు. మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'వాక్ విత్ ఎంపీడీవో' కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరిలతోపాటు ఆయా వీధుల్లో పర్యటించారు. కాలువలు లేకపోవడంతో రోడ్లపై, ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ, ఇళ్ల నుంచి బయటకు వదిలిపెడుతున్న వ్యర్థ జలాలతో అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. తాగునీటి గొట్టాలకు తరచూ లీకేజీలు పునరావృతంకావడంతో మరమ్మతులకు ఇబ్బందులు, వర్షాకాలంలో మడుగులు, చిత్తడి కారణంగా స్వచ్ఛత లేక అపరిశుభ్రత, తదితర సమస్యలను శాశ్వతంగా తొలగించాలని గ్రామస్థులు కోరారు. ప్రధానంగా కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రయత్నిస్తామని ఎంపీడీవో చెప్పారు. ఇళ్ల నుంచి వ్యర్థ జలాలను బయటకు వదిలిపెట్టకుండా ఉండేందుకు ఉపాధి హామీ నిధులతో ఇంకుడు గుంతలు (సోక్ పిట్) ఏర్పాటు చేసుకోవాలని కార్యదర్శి తెలిపారు.

నీటి మడుగులను ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డికి చూపిస్తున్న స్థానికులు

వీటికి ప్రాధాన్యమివ్వండి..

● పంచాయతీ కార్యాలయం బయట రోడ్డుపై అన్ని వేళల్లో నీటి మడుగులను తలపిస్తున్నాయి. ● బీసీ కాలనీలో సీసీ రోడ్డు మధ్యలో లోతట్టు ఉన్నందున వర్షాకాలంలో నీటి నిల్వ సమస్య వేధిస్తోంది. ● చౌడూరులోని పెన్నా పరివాహక మార్గంలో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో తరచూ పైపులకు ఏర్పడుతున్న లీకేజీల నుంచి నీటి వృథా కాకుండా మరమ్మతులకు వ్యయ, ప్రయాసలు. కొత్తగా గొట్టాలు ఏర్పాటు చేయాలి ● వృథాగా ఉన్న రక్షిత నీటి ఆర్వో కేంద్రాన్ని పునరుద్ధరించాలి. ● మట్టి దిబ్బలు, వ్యర్థాలను సకాలంలో తొలగించడం లేదు. ● ఎంపీపీ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదిలో బాలలకు ప్రమాదం పొంచి ఉంది.

జన గణనతో పాటు కులగణన చేపట్టాలి

మైదుకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మైదుకూరు, న్యూస్‌టుడే : సమానత్వం, సామాజిక న్యాయం, సాంఘిక భద్రత కోసం జనగణనతోపాటు కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగ సుబ్బారెడ్డి డిమాండు చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. నాయకులు పి.శ్రీరాములు, ఎస్.షావలి, బీవీ.శ్రీనివాసులు, బి.పీరయ్య, బాలసుబ్బయ్య, సుబ్బరాయుడు, ఓబులేసు, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు పట్టణం: దేశంలో భాజపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బలహీనులపై దాడులు జరుగుతున్నాయని సీపీఐ ప్రొద్దుటూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న జ్యోతిరావు పులే విగ్రహం ఎదుట ధర్నా చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ దాడులు ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉన్మాదంతో చేపట్టిన దాడులన్నారు. నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులురెడ్డి, నరసింహ, గురుస్వామి, హరి, శ్రీను మీర్జావలి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: నాయీబ్రాహ్మణులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు కొలవలి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఆంజనేయనగర్‌లో ఆయన మాట్లాడారు. షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు పొందవచ్చన్నారు. ఆదరణ -3 పథకం ద్వారా ఆధునిక సామగ్రికి రూ.1000 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని తెలిపారు. నాయకులు గురుబ్రహ్మం, వెంకటసుబ్బయ్య, ప్రసాదు, బాబు, హరి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌కు అలుగేదీ!

గరిష్ఠ స్థాయికి చేరిన నీరు

రిజర్వాయర్‌కు నీరు చేరకుండా కట్టడి



బ్రహ్మంసాగర్ వైపునకు నీరు పారకుండా లింకు కాలువపై దింపిన షట్టర్లు

చెరువుకు అనుసంధానంగా ఉండాల్సిన అలుగు ఏర్పాటుకాకపోవడంతో బ్రహ్మంసాగర్ జలాశయం కట్టకు రక్షణ కొరవడింది. నీరు ఎక్కువగా చేరితే కట్టకు ప్రమాదం వాటిల్లకుండా దిగువకు నీరు ప్రవహించేలా తక్కువ ఎత్తులో అలుగు నిర్మిస్తారు. 17.74 టీఎంసీల సామర్థ్యం కలిగిన పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయరు విషయంలో 19 ఏళ్లుగా నిర్లక్ష్యం చోటు చేసుకుంది. దీనిని ప్రభుత్వాలు పట్టించుకోలేదు. నాయకులు దృష్టి సారించలేదు. ప్రస్తుతం నిల్వ 17.2 టీఎంసీలకు చేరాయి. తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి దువ్వూరు మండలం ఒకటో ఉప జలాశయం నుంచి లింకు కాలువ ద్వారా రెండో ఉప జలాశయం అక్కడి నుంచి బ్రహ్మంసాగర్ కాలువ ద్వారా రిజర్వాయరులోకి నీరు చేరింది. వెలుగోడు జలాశయం నుంచి గంగ కాలువకు విడుదల చేసిన నీరు జిల్లా సరిహద్దులో 1400 క్యూసెక్కులు పారుతోంది. భారీ వర్షాలు నమోదై రిజర్వాయరులోకి మరింత నీరు చేరితే అలుగు లేకపోవడంతో కట్టకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు గుర్తించారు. దీంతో ఇటీవల బ్రహ్మంసాగర్ వైపునకు కృష్ణమ్మ పరుగులు తీయకుండా చర్యలు తీసుకున్నారు. వెలుగోడు జలాశయం వద్దనే గంగ కాలువలోకి నీరు చేరకుండా షట్టర్లు కిందకు దిగలేదు. దీంతో జిల్లా వైపు నీటి ప్రవాహం కొనసాగింది. సమస్య ఉత్పన్నం కాకుండా ఒకటి, రెండు ఉప జలాశయాల వద్ద ఉన్న లింకు కాలువపై ఉన్న షట్టర్లను తిప్పిరెడ్డిపల్లె వద్ద దింపేశారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

అప్పుడు అవసరం రాలేదు.. ఇప్పుడు ప్రతిపాదనలు పంపాం

బ్రహ్మంసాగర్ జలాశయం నిర్మాణ సమయంలో అలుగు అవసరం లేదనుకుని డిజైన్ చేయలేదు. ప్రస్తుతం దాని ఆవశ్యకతను గుర్తించాం. ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. ఆమోదం లభించగానే టెండర్లు పిలిచి అలుగు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటాం. గతంలో బ్రహ్మంసాగర్‌లో 17.1 టీఎంసీలు నిల్వ చేయగా ప్రస్తుతం 17.2 టీఎంసీలకు చేరడంతో జిల్లాకు నీటి అవసరం లేదనే విషయాన్ని తెలియజేశాం. ఒకవేళ కాలువకు అంతో ఇంతో నీరు వచ్చినా ఒకటి, రెండు ఉప జలాశయాలకు ఉన్న రెగ్యులేటర్ల ద్వారా నియంత్రిస్తాం. గతంతో పోల్చితే బ్రహ్మంసాగర్ సీపేజీ సగానికి సగం తగ్గింది. - శేషుబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, తెలుగుగంగ

120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
Canara Bank
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ... అందరి మన్ననలను పొందుతూ నేడు 120వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకొంటున్న శుభ సందర్భంగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారికి మరియు సిబ్బందికి మా శుభాకాంక్షలు.
శ్రీ ఎం.ఎల్.బ్రబూ గారు
చీఫ్ మేనేజర్, జిన్నా రోడ్డు శాఖ, ప్రొద్దుటూరు.
B.K.R. ఫంక్షన్ హాల్
ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు, యర్రగుంట్ల.

Canara Bank Syndicate
120వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ... అందరి మన్ననలను పొందుతూ నేడు 120వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భంగా కెనరా బ్యాంకు (శ్రీ స్వామి వివేకానంద క్లాత్ మార్కెట్), ప్రొద్దుటూరు మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎం.రామక్రిష్ణ గారికి మరియు సిబ్బందికి మా శుభాకాంక్షలు.
అమ్మా నాన్న జానపాటి
ప్రొ॥ రామక్రిష్ణ
రూం. నెం. 156, వివేకానంద క్లాత్ మార్కెట్, ప్రొద్దుటూరు.
శ్రీ వివేకానంద హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ఓనర్స్ అసోసియేషన్, ప్రొద్దుటూరు.

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

మంత్రి అచ్చెన్నాయుడికి స్వాగతం

మంత్రికి స్వాగతం పలుకుతున్న తెదేపా నేతలు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి తెదేపా నేతలు స్వాగతం పలికారు. పెండ్లిమర్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రానున్న నేపథ్యంలో ఆయన కడప వచ్చారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్‌లు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు.

ఘనంగా రాహుకాల పూజలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం రాహుకాల పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రాహుకాల పూజలు చేస్తున్న మహిళా భక్తులు

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తే ఏదైనా సాధించగలరని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కడప అర్బన్ సీడీపీవో వాణిశ్రీ స్పష్టం చేశారు. కడపలోని ఏఎస్ఆర్ నగర్‌లో మంగళవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. ఆడపిల్లల అభివృద్ధికి ఆటంకం కలిగించే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో మిషన్ శక్తి కోఆర్డినేటర్ శోభారాణి, ఎల్‌పీవో సునీత రాజు, సూపర్‌వైజర్ దీప, సరిత, వైద్యురాలు నిఖిత, హెచ్‌ఎం గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ● బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని శ్రీబాలాజీ ఒకేషనల్‌జూనియర్‌కళాశాల్లో బాలల హక్కులు, చట్టాలపై బాలల పరిరక్షణ అధికారి సుభాష్‌యాదవ్ అవగాహన కల్పించారు. ఎల్‌పీవో సునీత, ఎన్‌ఐసీ అధికారి శ్రీకృష్ణప్రతాప్, యూనస్‌బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కడప అర్బన్ సీడీపీవో వాణిశ్రీ, చిత్రంలో ఇతర అధికారులు

సీసీ రహదారులా.. మేం నిర్మించలేం!

* రూ.1.28 కోట్ల పనులకు గ్రహణం
* బిల్లులు రావని గుత్తేదారుల వెనకడుగు

సిద్దవటం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలకు మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. ఏడు నెలల కిందట మంజూరైన పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఒక్క పని తప్ప మిలిగిన పనులు నిర్మాణానికి నోచుకోలేదు. పనులు చేసినా సరైన ఆదాయం ఉండదనే అనుమానం గుత్తేదారుల్లో నెలకొంది. సాహసించి పనులు చేసినా సమయానికి బిల్లులు రాకపోతే తమకు నష్టాలు తప్పవని సంబంధిత గుత్తేదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన సిమెంటు రహదారి పనులు పట్టాలెక్కకపోవడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మాధవరంలో సిమెంట్ రోడ్డుకు నోచుకోని మట్టి రోడ్డు

మురుగుతున్న రూ.1.28 కోట్ల నిధులు : సిద్దవటం మండలంలో 11 పంచాయతీలకు గాను సీసీ రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.1.28 కోట్ల నిధులతో 28 పనులు మంజూరయ్యాయి. 2026 మార్చి నాటికి పనులన్నీ పూర్తి చేయాల్సి ఉంది. పెద్దపల్లె గ్రామ పంచాయతీకి రూ.20 లక్షల నిధులతో అయిదు సిమెంట్ రహదారి పనులు మంజూరు కాగా ఇటీవల రూ.4 లక్షలకు సంబంధించిన ఒక పని మాత్రమే పూర్తయింది. మిగిలిన 27 పనులు ఇంకా పట్టాలెక్కలేదు. పనులు పూర్తి చేయడానికి ఇక నాలుగు నెలలు మాత్రమే గడువు ఉంది. వచ్చే ఏడాది మార్చిలోపు పనులు పూర్తి చేయకపోతే అవి రద్దయ్యే ప్రమాదం ఉంది. పనులు చేసినా సకాలంలో బిల్లులు వస్తాయనే నమ్మకం లేదని గుత్తేదారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీలకు మంజూరైన సిమెంటు రహదారుల పనుల సంఖ్య, నిధుల వివరాలు

గ్రామ పంచాయతీ పేరు	మంజూరైన పనులు	నిధులు (రూ.లల్లో)
బొగ్గిడివారిపల్లె	5	28.60 లక్షలు
జంగాలపల్లె	2	22 లక్షలు
పెద్దపల్లె	5	20 లక్షలు
మాధవరం-1, 2, 3 వార్డులు	3	9 లక్షలు
జ్యోతి	3	8.50 లక్షలు
కడపాయపల్లె	1	8 లక్షలు
ఎస్. రాజంపేట	1	8 లక్షలు
సిద్దవటం	3	7 లక్షలు
మాచుపల్లె	3	6.90 లక్షలు
పొన్నవోలు	1	6 లక్షలు
లింగంపల్లె	1	4 లక్షలు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం ; గ్రామీణ ప్రాంతాలకు మంజూరైన సీసీ రహదారి పనులు చేపట్టాలని సంబంధిత గుత్తేదారులకు అవగాహన కల్పిస్తున్నాం. బిల్లులు మంజూరు కావని చాలా మందిలో సందేహం ఉంది అది అపోహ మాత్రమే. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఆర్థిక సంవత్సరం ముగిసే చివరి మూడు నెలల్లో పనులు జరిగే అవకాశం ఉంది. పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోతే ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- నాగరాజు, ఏఈఈ, పంచాయతీరాజ్, సిద్దవటం మండలం

ఊరేగుతున్న గంగాగౌరి సమేత శంకరుడు

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

వల్లూరు, న్యూస్‌టుడే: వల్లూరు శివాలయంలో కార్తిక మాసోత్సవాలల్లో భాగంగా గంగాగౌరి పరమేశ్వరుల గ్రామోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని కార్తిక దీపాలు చేతపట్టి శంభోశంకరా హరహరమహాదేవ అంటూ స్వాగతం పలికారు.

చట్టబద్ధ బీసీ రిజర్వేషన్ల అమలుకు వినతి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: జనగణనలో కుల గణన చేసి చట్టబద్ధ బీసీ రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బీసీలలో ఏఏ కులాల వారు ఎంత మంది ఉన్నారో తెలియకుండా ఎంత రిజర్వేషన్లు కల్పిస్తారో తెలియదన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసి ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం రాయలసీమ అధ్యక్షుడు జేవీ రమణ, బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంబోదర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున

ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి

పులివెందుల, న్యూస్‌టుడే: ప్రజలకు సచివాలయాల ద్వారా నాణ్యమైన సేవలందించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని ఉలిమెల్ల, గుంతబజారు, చెన్నారెడ్డికాలనీ సచివాలయాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ.. ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కడప పార్లమెంటరీ కార్యదర్శి ప్రసూనారెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

జన గణనతో పాటు కులగణన చేపట్టాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: జనగణనతో పాటు కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులతో కలిసి స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఇతర నాయకులు

పులివెందులలో ముమ్మరంగా సోదాలు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలో అనుమానాస్పద వ్యక్తుల కోసం పులివెందుల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పులివెందుల గ్రామీణ సీఐ ఎస్సీ రమణ మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. పులివెందులలోని రింగ్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ప్రజలు ఎక్కువ సంచరించే ప్రాంతాలను ఆయన పరిశీలించారు.

ఆటో అద్దం పగలకొట్టిన దుండగులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రవీంద్రనగర్‌లోని బుగ్గయ్య గంగమ్మ ఆలయం వద్ద అదే ప్రాంతానికి చెందిన ఆటో చోదకుడు ముక్తియార్ తన వాహనాన్ని పార్కింగ్ చేసి ఉంచగా గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి వేళ దాని అద్దాన్ని ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం గుర్తించిన బాధితుడు లబోదిబోమన్నాడు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. రాత్రి వేళ ఆకతాయి మూకలు మద్యం తాగి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా పోలీసులు మరింత గస్తీ పెంచాలని వారు కోరుతున్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

కడప విద్య, న్యూస్‌టుడే: వైవీయూ, ఆర్కేవ్యాలీ విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీఎం స్పందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. స్థానిక పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో విశ్వవిద్యాలయాల్లో జరిగిన ఉద్యోగ నియామకాల్లో కోట్లాది రూపాయలు అప్పటి సీఎం వైఎస్ జగన్ బంధువైన ఈసీ సురేంద్రరెడ్డి అర్హత లేకుండా రిజిస్ట్రార్‌గా ఉంటూ వసూలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం విచారణ జరపలేదన్నారు. తక్షణమే విచారణ చేసి అనర్హులను తీసివేయాలన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు అవసరం

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఖాళీ చేతులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు ఎన్ని సార్లు వచ్చినా ఫలితం లేదని.. జిల్లా పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. శిలాఫలకాలకే పరిమితమైన కడప ఉక్కు పరిశ్రమ, మూతపడిన ప్రొద్దుటూరు పాల పరిశ్రమ, చెన్నూరు చెక్కెర పరిశ్రమలను తెరిపించి జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు.

సమస్యలతో ఆశాలు సతమతం

మారుతీనగర్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశా కార్యకర్తలు కనీస వేతనాలు లేక.. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. విధుల్లో ఉద్యోగ భద్రత లేక రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు భరించలేకున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారే తప్ప వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడం లేదన్నారు. వారికి న్యాయం చేయకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ శాంతమ్మ, జిల్లా కోశాధికారి అమ్ములు, ఉపాధ్యక్షులు అనుసూయ, వరలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ

విద్యుత్తు ఉద్యోగుల సేవ ప్రశంసనీయం

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్తు సరఫరా సంస్థ ఎస్‌ఈ రమణ అన్నారు. విద్యుత్తు ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరంలోని చౌడమ్మ, పాపిరెడ్డి వెంకటేశ్వర వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు ఆయన పంపిణీ చేశారు. ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్, విద్యుత్తు ఇంజినీర్లు రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో విద్యుత్తు ఎస్‌ఈ రమణ, తదితరులు

విద్యార్థులూ.. జాగ్రత్తలు అవసరం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. మండలంలోని ఇబ్రహీంపేట, రాచగుడిపల్లె మెయిన్, ఎస్సీ కాలనీ, మలకాటిపల్లెలో ప్రాథమిక పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. ఎంఈవో-2 మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక సేవలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎంఈవో-2 బ్రహ్మయ్య

జాతీయ పోటీలకు పార్నపల్లె విద్యార్థి

నాగచైతన్య

లింగాల, న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు రైల్వేకోడూరులో జరిగిన ఏపీ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పార్నపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి నాగచైతన్య ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జనవరి రెండో వారంలో దిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని హెచ్‌ఎం అర్జున్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని ఎంఈవోలు రామకృష్ణయ్య, విశ్వనాథరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు విక్టర్ అభినందించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పులివెందుల, న్యూస్‌టుడే: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీ అశోక్‌రెడ్డి అన్నారు. పులివెందుల మండలం అచ్చవెల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఏవో చెన్నారెడ్డి కూడా రైతులకు సలహాలు అందించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కమలాపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని కమలాపురం నగర పంచాయతీ కమిషనర్ ప్రహ్లాద్ అన్నారు. పట్టణంలోని కృష్ణానగర్ ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడున్న కోడిగుడ్లు, పాలు, బాలామృతం పొట్లాలను పరిశీలించారు. అక్కడున్న బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. నగర పంచాయతీ ఏఈ తిరువెంగళప్ప, అంగన్‌వాడీ కార్యకర్త రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉద్యోగావకాశాలు

ధ్రువ పత్రాలతో విద్యార్థులు, చిత్రంలో ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, అధ్యాపకులు

కడప విద్య, న్యూస్‌టుడే: నెల రోజుల పాటు నేర్చుకున్న నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'టాలీ ప్రైమ్ విత్ జీఎస్టీ' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేయించారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలోని మండల పరిషత్తు మెయిన్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ అధికారి వనజ కుమారి నేతృత్వంలో పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు వెంకట్రామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్, హెచ్‌ఎం ఆంజనేయులు, సుకన్య, రాజేశ్వరి, చంద్రకళావతి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

[illegible]

లాంఛనంగా స్వాధీనత ప్రకటన

[illegible]

రుణగ్రహీత పేరు మరియు చిరునామా:

1) పురుషోత్తంరెడ్డి కన్‌స్ట్రక్షన్స్ (ప్రొప్రయిటర్ పోలు మహేశ్వరరెడ్డి), డి.నెం.2/139, ... కమలాపురం, కడప జిల్లా - 516289
2) పోలు మహేశ్వరరెడ్డి, ... డి.నెం.1/97, పాతరాజాపాలెం, చాపాడు, కడప జిల్లా - 516355
3) పోలు అర్చనా రెడ్డి, ... డి.నెం.1/97, పాతరాజాపాలెం, చాపాడు, కడప జిల్లా - 516355
4) వీరారెడ్డి పల్లెగార్లపల్లి, ... డి.నెం. 2-97, ... కమలాపురం, కడప జిల్లా - 516289

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.12,75,840/-

రుణ ఖాతా నెంబరు: CUDP4TF2306290013

డిమాండ్ నోటీసు తేదీ: 22.08.2025

స్థిరాస్తుల వివరములు

[illegible]

ప్రదేశం: కడప /జోనల్ కార్యాలయం
తేదీ: 17.11.2025

సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

9వ వర్ధంతి



అనురాగం, ఆప్యాయతలతో మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకొన్న మీరు మా నుండి దూరమై నేటికి 9 సం॥లు గడిచినా మీ తియ్యని జ్ఞాపకాలు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని కోరుకుంటూ...

కీ॥శే॥ అందె పాపయ్య గారి వెంకటరమణ గారు
LFL Head Master, ఇందిరమ్మ కాలనీ, కడప రోడ్డు, మైదుకూరు.
జననం : 15-12-1963
మరణం : 19-11-2016

భార్య : ఎ.వెంకట సుబ్బమ్మ

కుమార్తెలు: B.C.సంధ్య, S.రాధ స్వరూప, A.P.శ్రీలక్ష్మి
అల్లుళ్లు: B.C.వెంకటేశ్వర్లు, S.చైతన్య, M.సుబ్బరాయుడు
మనుమలు : B.C.వెంకట శౌర్యన్, S.వెంకట గునిత్, B.C.వెంకట శ్రీవర్ధన్, M.సుబ్బవిక్రాంత్
మనుమరాండ్రు : B.C.వెంకట దేవిక, S.వాత్విక, M.సుబ్బసంయుక్త

9వ జ్ఞాపకార్థ కూటమి

మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, నా విశ్వాసమును కాపాడుకుంటిని. 2 తిమోతి 4:7

అమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రభువు పాదాల చెంత కన్నీటితో ప్రార్థిస్తూ...

శోకతప్త హృదయాలతో...

కుమారుడు : CHK మోసెస్ జాషువా (MJ), న్యాయవాది, అంగడి వీధి, Cell : 9885890197 మరియు కుటుంబసభ్యులు



శ్రీమతి CHK.జయమ్మ ప్రభాకర్
రిటైర్డ్ స్టాఫ్ నర్స్, ఓల్డ్ రిమ్స్, కడప
జననం : 2/6/1942 మరణం : 19/11/2016

ప్రాంతీయ సదస్సు జయప్రదానికి పిలుపు

మారుతీనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా సంక్షేమ బోర్డు ఛైర్మన్‌ను మాత్రమే నియమించిందే కానీ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించలేదన్నారు. ఈ మేరకు నవంబరు 30న నిర్వహించే ప్రాంతీయ సదస్సులో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రహదారిపై గుంత.. చోదకులకు తప్పదు చింత!

ఈ రోడ్డు విలువ రూ.కోటి పైమాటే! నాలుగేళ్లు కదలని మెదలని గత ప్రభుత్వ పాలకులు ఎన్నికలు రావడానికి ఏడాది ముందు హడావిడిగా చేపట్టిన అభివృద్ధి పనులివి. మాసాపేట కూడలి నుంచి మాచుపల్లి రోడ్డు మీదుగా కేసీ కెనాల్ వరకు గల ప్రధాన రహదారిని వంద అడుగులకు విస్తరించారు. ఇందులో భాగంగా భారీ వ్యయంతో డివైడర్, పాదచారుల బాట, ప్రధాన రహదారిని అభివృద్ధి చేశారు. రెండేళ్ల వ్యవధిలోనే రూ.కోట్లు పెట్టి వేసిన రోడ్లపై భారీ గుంతలు పడడం విమర్శలకు తావిస్తోంది.

- ఈనాడు-కడప, న్యూస్‌టుడే, కడప నగరపాలక

రుణాలిస్తాం.. పరిశ్రమలు పెట్టండి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఎంఎస్‌ఎంఈ ద్వారా రాయితీ రుణాలిస్తామని పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల అసిస్టెంట్ డైరెక్టరు శ్రీనివాసరెడ్డి అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం పరిశ్రమల ఏర్పాటుపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కడప నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమలు పెట్టుకునే వారికి బ్యాంకుల నుంచి రుణాలిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు యువత ఉన్నారు.

అనధికార నిర్మాణాలు క్రమబద్ధీకరించుకోండి

కమలాపురం, న్యూస్‌టుడే: కమలాపురం నగర పంచాయతీలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు క్రమబద్ధీకరించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ప్రహ్లాద్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అందుకు సంబంధించిన బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకానికి సంబంధించి జీవోఆర్టీ నెంబరు 1,173 ప్రకారం దరఖాస్తు సమర్పణ గడువు మరో మూడు మాసాలు పొడిగించారన్నారు. అనుమతులు లేని లేఅవుట్లు, ప్లాట్లను 2026 జనవరి 23లోపు క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

ఆత్మగౌరవం కోసం ఆందోళనలు

కమలాపురం, న్యూస్‌టుడే: సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను నిరసిస్తూ మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. భాజపా గత 11 ఏళ్ల కాలంలో దళిత, గిరిజన, మైనార్టీలపైనా దాడులు మితిమీరిపోతున్నాయన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం పాలన సాగిస్తున్నారని, అంటరానితనం, హింస పెట్రేగిపోతున్నాయన్నారు. ఏపీలో కులగణన చేపట్టి, కులాల ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి పల్ల వరప్రసాద్, నాయకులు గంగయ్య, రాయప్ప, చంద్ర, వెంకటేష్, ఈశ్వరయ్య, అబ్రహాం, గంగన్న పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

(c) eenadu

సదస్సు ప్రారంభించి.. అంతరిక్ష విజ్ఞాన విధానాన్ని విడుదల చేసి ప్రదర్శిస్తున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్, ఎంబీ పాటిల్, ప్రియాంక్ ఖర్గే, క్రిస్ గోపాలకృష్ణ, నసీర్ అహ్మద్, డాక్టర్ మంజుల, శరత్ బచ్చేగౌడ, కిరణ్ మజుందార్ షా తదితరులు

ఆస్ట్రేలియా ప్రతినిధితో కరచాలనం చేసి మాట్లాడుతున్న డీకే శివకుమార్

ప్రపంచమే హద్దుగా ప్రగతి పతాక

- ఐటీ, అంకుర, అంతరిక్ష విధానాల ఆవిష్కరణ
- మొదలైన 28వ బెంగళూరు సాంకేతిక సమ్మేళనం

ఈనాడు, బెంగళూరు : ఇప్పటికే దేశ సాంకేతిక రంగంలో అగ్రపథంలో దూసుకెళ్తున్న కర్ణాటకను.. ఇకపై ప్రపంచ వేదికలో లక్ష్యంగా పరుగులెత్తిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. అమలు చేసిన ఐటీ, అంకుర, అంతరిక్ష సాంకేతిక విధానాలను ఉన్నతీకరించి వచ్చే ఐదేళ్లలో ఈ రంగాలను దేశ ప్రగతిలో భాగస్వామ్యం చేస్తామన్నారు. బెంగళూరు అంతర్జాతీయ ప్రదర్శన కేంద్రం(బీఐఈసీ)లో 28వ సాంకేతిక సమ్మేళనాన్ని(బీటీఎస్) ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసారి బీటీఎస్‌ను 'ఫ్యూచరైజ్'(భవిష్యత్తు కోసం) అనే సందేశ వాక్యంతో నిర్వహిస్తుండగా.. కొత్తతరం సాంకేతికతలను ఈ వేదిక నుంచి ఆవిష్కరించారు.

సాంకేతిక ఫలాలు దండి..

రాష్ట్రం ఇప్పటికే ఏఐ, సైబర్ భద్రత, డేటా సైన్స్, యానిమేషన్, రోబోటిక్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను స్థాపించినట్లు ముఖ్యమంత్రి గుర్తు చేశారు. 'దేశానికి క్వాంటమ్ సాంకేతికతను పరిచయం చేసిన తొలి రాష్ట్రం కూడా కర్ణాటక. ప్రస్తుత బీటీఎస్ ద్వారా తెలియని, ఊహించని సాంకేతికతలను ప్రపంచానికి పరిచయం చేయటమే లక్ష్యం. సాంకేతికత ఆధారంగా సామాజిక, ఆర్థిక న్యాయం, సుస్థిర, సోదర భావనలను పరిరక్షించాలి. ఇదే క్రమంలో కొత్తగా డిజిటల్ సాంకేతికతలైన ఏఐ, క్వాంటమ్, బయోటెక్, అంతరిక్ష, హరిత సాంకేతికతలను కేవలం రాష్ట్ర రాజధానికే పరిమితం చేయకుండా ద్వితీయ శ్రేణి నగరాల్లో విస్తరించేలా చేస్తాం' అని ప్రకటించారు. ఇదే సందర్భంగా సమాచార సాంకేతిక, అంతరిక్ష సాంకేతిక, అంకుర విధానాలను ఆవిష్కరించారు. రానున్న ఐదేళ్లలో దేశ అంతరిక్ష సాంకేతికతలో 50 శాతం, ప్రపంచ స్థాయిలో ఐదు శాతం వాటాను సాధించటమే లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు.

● రాష్ట్రంలో 2034 నాటికి 25 వేల అంకురాలను స్థాపిస్తామని సిద్ధరామయ్య వివరించారు. పారదర్శకత పాలన, పెట్టుబడిదారులకు అవసరమైన హేతుబద్ధ ప్రోత్సాహకాలతో ప్రపంచ వాణిజ్య కేంద్రంగా బెంగళూరు ఆకట్టుకుంటోందన్నారు. నైపుణ్య మానవ వనరులు, వేలాది విద్యా సంస్థలున్న రాష్ట్రంలో ఉపాధి, ఉత్పాదకతకు కొదవ లేదన్నారు.

అంకురాలకు రూ.430 కోట్లు

ఈనాడు, బెంగళూరు : రాష్ట్రం డీప్‌టెక్ సాంకేతికతల్లో ఏర్పాటయ్యే అంకురాల ప్రగతికి- పెట్టుబడులకు రూ.430 కోట్లు కేటాయించినట్లు ఐటీ- బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఈ సందర్భంగా తెలిపారు. ఈ రంగంలో 28 అంకురాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో ఇప్పటికే 16 వెంచర్ క్యాపిటల్స్ పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతి అంకురానికి రూ.2 కోట్ల నుంచి రూ.45 కోట్ల వరకు నిధులు సమకూరే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ దేశంలో తొలి ఐటీ విధానాన్ని 1997లోనే ఆవిష్కరించిన రాష్ట్రం.. నేడు దేశ ఐటీ ఉత్పత్తుల్లో 40 శాతం వాటా సొంతం చేసుకున్నట్లు విశ్లేషించారు. రాష్ట్రమంతటా ఐటీ విస్తరించాలంటే గ్రామీణ ప్రాంతాల్లోనూ పెట్టుబడులకు కంపెనీలు తమ సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు రావాలన్నారు. పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి ఎంబీ పాటిల్ మాట్లాడుతూ బెంగళూరు శివార్లలో ఏర్పాటయ్యే క్విన్ సిటీలో 200ఎకరాల్లో సెమికండక్టర్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దేశ, రాష్ట్ర స్థాయి సెమికండక్టర్ ఉత్పాదనకు అవకాశం కల్పిస్తామన్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు క్రిస్ గోపాలకృష్ణన్, బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షా, విజన్ గ్రూప్ ఆన్ స్టార్టప్ వ్యవస్థాపకులు ప్రశాంత్ ప్రకాశ్ తదితరులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

కియోలోని ప్రాసెసర్‌ను సీఎంకు చూపిస్తున్న ప్రియాంక్

ఏఐ రెడీ పీసీ ఆవిష్కరణ

చేతిలో ఇమిడే దీని ధర రూ.18,999 మాత్రమే

చేతిలో ఇమిడే ఏఐ రెడీ పీసీ ఇదే

ఈనాడు, బెంగళూరు : భారతీయ సిలికాన్ వ్యాలీ బెంగళూరులో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఏఐ రెడీ పర్సనల్ కంప్యూటర్ (ఏఐ రెడీ పీసీ) కియో (నాలెడ్జ్ డ్రివెన్, ఎకనామికల్, ఓపెన్ సోర్స్) ఆవిష్కృతమైంది. సోమవారం ఈ పీసీ వివరాలను కర్ణాటక ఐటీ, బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించిన విషయం తెలిసిందే. మంగళవారం బెంగళూరులో ప్రారంభమైన బెంగళూరు టెక్ సమ్మేళనం (బీటీఎస్)లో ఈ పీసీని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు అధికారికంగా ఆవిష్కరించారు. కర్ణాటక రాష్ట్ర ఎలక్ట్రానిక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కియోనిక్స్) నేతృత్వంలో స్థానిక అంకురాల సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు. ఓపెన్ సోర్స్ రిస్క్-వీ ప్రాసెసర్, లైనక్స్ ఆధారిత ఆపరేటింగ్ సిస్టమ్, వైఫై, ఎథర్నెట్, యూఎస్‌బీ-సి, యూఎస్‌బీ పోర్ట్‌లు, ఆడియో జాక్ వంటి వ్యవస్థలతో బుల్ట్ ఇన్ ఏఐ ఏజెంట్ ప్రోగ్రామింగ్ కలిగిన ఈ పీసీ ధర రూ.18,999 లని ప్రభుత్వం ప్రకటించింది. నెట్‌వర్క్ సదుపాయం లేని ప్రాంతాల్లోనూ డిజిటల్ లెర్నింగ్ ప్రక్రియను సులభతరం చేయాలన్న లక్ష్యంతో ఈ పీసీని తయారు చేసినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. ప్రతి ఇల్లు, ప్రతి విద్యార్థి, చిన్న తరహా వ్యాపారులకు అనుకూలంగా ఈ పీసీ తయారు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వివరించారు. ఈ సమ్మేళనంలో సర్కారు 2025-30 కర్ణాటక ఐటీ, అంతరిక్ష, అంకుర విధానాలను ఆవిష్కరించింది. ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాలు, 1,200 మంది ఎగ్జిబిటర్లు పాల్గొన్న ఈ టెక్ సమ్మిట్ ఈనెల 20న ముగియనుంది.

ఇకపై.. తేలికగా ఇంజక్షన్!

వ్యవస్థ పనితీరును వివరించే నమూనా

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఇంజక్షన్ చేయించుకోవాలంటే పలువురికి భయం. ఇదే భయంతో క్రమం తప్పకుండా రక్త పరీక్ష చేయించుకోవలసిన మధుమేహ బాధితులు వెనుకంజ వేస్తుంటారు. సూది మందు వేయించుకునే సమయంలో నరాలు దొరక్క నాలుగైదుసార్లు సూది గుచ్చితే, వారి పరిస్థితి మరింత దయనీయం అవుతుంది. ఆ సమస్యను తప్పించేందుకు రోబోటిక్స్ ఆధారిత దృష్టి మార్గదర్శిత ఏఐ ఇంజక్షన్ వ్యవస్థను ఐఐఐటీ-బెంగళూరు అభివృద్ధి చేసింది. సంస్థకు చెందిన ఆచార్య డాక్టర్ మాధవరావు, పరిశోధకుడు పి.జగన్ సంయుక్తంగా రూపొందించిన పరికరం ద్వారా చర్మం కింద (సబ్ క్యుటేనియస్), నరాలు, కండరాలను స్పష్టంగా చూడవచ్చు. దీనితో త్వరగా ఇంజక్షన్ చేయడం సాధ్యమవుతుందని ఆచార్య మాధవరావు వివరించారు. బెంగళూరు టెక్ సదస్సు-2025లో ఐఐఐటీ-బీ స్టాల్‌లో మంగళవారం దీన్ని ప్రదర్శించారు.

ఇజ్రాయెల్ దేశ సాంకేతికతతో రూపొందించిన టెమి రోబో

బాష్ ప్రతినిధిని సత్కరిస్తున్న ముఖ్యమంత్రి, ఇతర నేతలు

ఇస్రో ఉపగ్రహ నమూనాను వీక్షిస్తున్న సందర్శకులు

ముగ్గురి ఊపిరి తీసిన చలిపులి

బెళగావి, న్యూస్‌టుడే : చలి పులి నుంచి తప్పించుకునేందుకు కుంపట్లో బొగ్గులు వేసి ఆ కుటుంబం వెచ్చగా నిద్రపోయింది. బొగ్గుల పొగ గదంతా కమ్ముకోవడంతో చివరికి ఊపిరి ఆడక, గది నుంచి బయటకు రాలేక ముగ్గురు కన్నుమూయగా, మరొకరు ప్రాణాలు కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నారు. రిహాన్ (22), మోయిన్ (23), సర్ఫరాజ్ (22) మరణించగా శహనవాజ్ (19) పరిస్థితి విషమంగా మారింది. బెళగావి అమన్‌నగర్‌లో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎమ్మెల్యే ఆసిఫ్ సేఠ్ ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. మాళమారుతి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అత్తింటి సతాయింపులు.. బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

హాసన, న్యూస్‌టుడే : భర్త, అత్త వేధింపులు తాళలేక మహాదేవి (29) అనే గృహిణి తన ఏడాదిన్నర బిడ్డతో కలిసి కావేరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సాలిగ్రామ తాలూకా కర్పూరవళ్లికి చెందిన మహాదేవి తన మొదటి భర్త నుంచి విడాకులు తీసుకుని మూడేళ్ల కిందట అరకలగూడు తాలూకా సీబిహళ్లి గ్రామ నివాసి కుమార్‌ను వివాహం చేసుకుంది. వివాహ సమయంలో ఇతర లాంఛనాలతో పాటు 100 గ్రాముల ఆభరణాలను తీసుకున్నాడు. ఇటీవల తన శీలాన్ని శంకిస్తూ భర్త, అత్త వేధింపులు ఎక్కువ కావడంతో పదిహేను రోజుల కిందటే పుట్టింటికి వచ్చేసింది. ఆమెకు ఫోన్ చేసి దూషించడం, అశ్లీల సందేశాలు పెట్టడాన్ని కుమార్ కొనసాగించాడు. తనపై ఫిర్యాదు చేసేందుకు హాసన మహిళా ఠాణాకు వెళుతున్నట్లు గుర్తించి, ఈ నెల 13న భార్యను అడ్డుకుని మరోసారి దూషించి వెళ్లాడు. మహిళా ఠాణాలో ఫిర్యాదు చేసి, సెల్ఫీ వీడియో తీసి, కుటుంబ సభ్యులు, తనకు పరిచయం ఉన్నవారికి పంపించి రామనాథపుర సమీపంలో కావేరి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. తల్లీ- బిడ్డల మృతదేహాలను మంగళవారం గుర్తించి, మరణోత్తర పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోణనూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుదుటపడిన పార్వతి ఆరోగ్యం

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : తన భార్య పార్వతి ఆరోగ్యం స్థిరంగా ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. శ్వాసకోశ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆమెకు శేషాద్రిపురం అపోలో ఆసుపత్రిలో చికిత్సను వైద్యులు కొనసాగించారని మంగళవారం ఇక్కడ చెప్పారు. తన కుమారుడు డాక్టర్ యతీంద్ర తల్లివద్దే ఉంటూ, ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నాడని తనను కలుసుకున్న విలేకరులకు తెలిపారు. వైద్యుడు డాక్టర్ బీసీ శ్రీనివాస్ నేతృత్వంలోని వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు పార్వతి ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్నానని సిద్ధరామయ్య చెప్పారు.

మెట్రోకూ బాంబు బూచి

'బెంగళూరు'లో మరో కలకలం

బెంగళూరు రాజాజీనగర, యశ్వంతపుర, న్యూస్‌టుడే : తన మాజీ భార్యను హింసిస్తే మెట్రో స్టేషన్‌ను పేల్చివేస్తానంటూ ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఏకంగా మెట్రో రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) అధికారిక ఖాతాకు ఈ-మెయిల్ పంపించాడు. దీంతో అప్రమత్తమైన ఆ విభాగ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవంబరు 13న రాత్రి 11:25 గంటలకు వచ్చిన మెయిల్‌లో బీఎంఆర్‌సీఎల్ మెట్రో స్టేషన్‌ను పేల్చివేస్తామని బెదిరించాడు. 'నా మాజీ భార్యను విధి నిర్వహణలో మానసికంగా హింసిస్తున్నారని నాకు తెలిస్తే మీ మెట్రో స్టేషన్‌లో ఒక దానిని పేల్చివేస్తాను' అని అందులో పేర్కొన్నాడు. దీంతో బీఎంఆర్‌సీఎల్ అసిస్టెంట్ మేనేజింగ్ ఇంజినీర్ విల్సన్ గార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతం అతడికి ఆసుపత్రిలో చికిత్స అందించనున్నారు. అనంతరం మెయిల్ పంపడానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి విచారణ నిర్వహిస్తామని బెంగళూరు నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. ముందు జాగ్రత్తగా మెట్రో స్టేషన్ల అధికారులను అప్రమత్తం చేశామని చెప్పారు.

● '15 సంవత్సరాల కిందట నిందితుడు తన భార్య నుంచి విడాకులు తీసుకున్నాడు. అతడి మానసిక పరిస్థితి బాగాలేదు. ఐదేళ్లుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బెళత్తూరు సమీపంలోని ఓ అద్దింట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు రోజువారీ అవసరాలకు కావలసిన నగదు సహాయం చేస్తున్నారు' అని బెంగళూరు సెంట్రల్ డివిజన్ డీసీపీ అక్షయ్ వివరించారు.

వరుస బెదిరింపులు

ఇటీవల బెంగళూరులో బహిరంగ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపు ఈ-మెయిల్స్ పెరుగుతున్నాయి. ఈ తరుణంలోనే మెట్రోకు మెయిల్ రావడం కలకలం రేపింది. పాఠశాలలకు అనేక నకిలీ బాంబు బెదిరింపులు పంపినందుకుగాను అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళను పోలీసులు ఇటీవలే అరెస్టు చేశారు. మొదట జూన్ 14న నగరంలోని ఒక పాఠశాలకు బాంబు బెదిరింపు రావడంతో ఈ కేసు ప్రారంభమైంది. ఆ తర్వాత మరిన్ని పాఠశాలలకు ఇలాంటి మెయిల్స్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తన ప్రేమికుడు తనను వివాహం చేసుకోవడానికి నిరాకరించాడని, అందుకే ప్రతీకారం తీర్చుకోవడానికి ఆ పేరు ఉపయోగించి బెదిరింపులకు పాల్పడ్డానని విచారణలో ఆమె పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, దిల్లీ, కేరళ, బిహార్, తెలంగాణ, పంజాబ్, మధ్యప్రదేశ్, హరియాణాతో సహా అనేక రాష్ట్రాల్లోని సంస్థలకు ఇలాంటి నకిలీ హెచ్చరికలు పంపానని అంగీకరించిన ఆ మహిళ ప్రస్తుతం అహ్మదాబాద్ పోలీసుల విచారణలో ఉంది.

సౌదీ మృతుల్లో బీదర్ మహిళ

బీదర్, న్యూస్‌టుడే : సౌదీ అరేబియాలో మదీనా సమీపంలో సంభవించిన రోడ్డుప్రమాదం- చెలరేగిన మంటల్లో బీదర్‌కు చెందిన రెహమత్ (80) అనే వృద్ధురాలూ మరణించిందని గుర్తించారు. బీదర్ సమీపంలోని మైలూరు పరిధి సీఎంసీ కాలనీకి చెందిన ఆమె హైదరాబాద్ నుంచి తమ బంధువులతో కలిసి ఉమ్రా యాత్రకు వెళ్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మదీనా వద్ద సంభవించిన ప్రమాదంలో 45 మంది యాత్రికులు ఉండగా.. అందులో ఈ మహిళతో పాటు హుబ్బళ్లికి చెందిన అబ్దుల్ గని అనే వ్యక్తి ఉండటం తెలిసిందే.

వృద్ధుడిని తొక్కేసిన ఏనుగు

చామరాజనగర, న్యూస్‌టుడే : చామరాజనగర తాలూకా గొంబెగల్లు వద్ద ఏనుగు దాడిలో కేతగౌడ (65) అనే వృద్ధుడు మరణించాడు. వీరేగౌడ అనే రైతు త్రుటిలో ఏనుగు బారి నుంచి తప్పించుకున్నాడు. పీజీ పాళ్య గ్రామ పంచాయతీ నుంచి ఒడెయరపాళ్యకు బైకులో వెళుతుండగా కేతేగౌడపై ఏనుగు దాడి చేసింది. బీఆర్‌టి పులి సంరక్షిత ప్రదేశానికి చెందిన డీసీఎఫ్ శ్రీపతి, ఇతర సిబ్బంది కేతేగౌడ నివాసానికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులకు తక్షణ పరిహారంగా రూ.5 లక్షల చెక్కు అందజేశారు. మిగిలిన రూ.15 లక్షలను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందని శ్రీపతి తెలిపారు.

మత్తుపదార్థాల ముఠాకు కటకటాలు

రూ.7.70 కోట్ల విలువైన సరకు స్వాధీనం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధానిని మత్తులో ముంచెత్తాలనే ముఠా ఆటకట్టింది. భారీగా మాదక ద్రవ్యాల గుట్టు రట్టు కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు కేంద్ర నేర నియంత్రణ దళం (సీసీబీ) అధికారులు సోమవారం నుంచి మంగళవారం వరకు కొనసాగించిన వరుస దాడుల్లో 14 మంది విదేశీయులతో పాటు మొత్తం 19 మంది మత్తు మందు వ్యాపారుల ఆటకట్టించారు. వారి నుంచి రూ.7.7 కోట్ల విలువ చేసే 2.80 కిలోల ఎండీఎంఏ పలకలు, 2.10 కిలోల హైడ్రో గంజాయి, ఓ ద్విచక్రవాహనం, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను విలేకరులకు చూపారు. ఆయన అందించిన సమాచారం ప్రకారం.. సుద్దగుంటెపాళ్య పోలీసుఠాణా పరిధిలో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నైజీరియాకు చెందిన మార్వెల్స్ గ్లోరి అనే యువతిని అరెస్టు చేసి రూ.1.5 కోట్ల విలువ చేసే 760 గ్రాముల ఎండీఎంఎ క్రిస్టల్, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. మహదేవపుర ఠాణా పరిధిలో ప్రవీణ్‌కుమార్ (25), యశ్వంత్ (23), రాహుల్‌కృష్ణ (27), అభయ్ (28), సంతోశ్‌కుమార్ (27), రోహన్‌కుమార్ (28) అనే యువకులను అరెస్టు చేసి రూ.60 లక్షల విలువ చేసే హైడ్రోగంజాయి పట్టుకున్నారు. వర్తూరు పరిధిలో కెన్యా మహిళ పోబినా మెసియో (27)ను అరెస్టు చేసి రూ.4.08 కోట్ల విలువైన సరకు స్వాధీనం చేసుకున్నారు. కేజీహళ్లి పరిధిలో విదేశీ తపాలా కార్యాలయానికి సరఫరా చేసిన రూ.1.5 కోట్ల విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. థాయిలాండ్, ఫ్రాన్స్ దేశాల నుంచి తపాలాలో ఈ సరకు వచ్చినట్లు గుర్తించామని పోలీసు కమిషనర్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాలను పరిశీలిస్తున్న కొత్వాల్ సీమంత్‌కుమార్‌సింగ్ తదితరులు

● మరోవైపు.. ఎలాంటి పత్రాలు లేకుండా బెంగళూరులో ఉంటున్న 11 మంది విదేశీయులను అరెస్టు, చేసి నగర శివార్లలో ఉన్న విదేశీ బంధన కేంద్రానికి పంపించారు. ఎలాంటి ఆధారాలు తీసుకోకుండా ఇళ్లు అద్దెకు ఇచ్చిన హెబ్బగోడి నివాసులు శివరామకృష్ణ, సంగప్పపాటిల్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. విదేశీయులకు ఇళ్లు అద్దెకిచ్చే ముందు అన్ని వివరాలూ సమీపంలో ఉన్న పోలీసుఠాణాలో అందించాలని సూచించారు.

విమానాశ్రయంలో దాడులు..

బెంగళూరు (యలహంక): బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు పక్షం రోజులుగా చేపట్టిన దాడుల్లో రూ.14 కోట్ల విలువ చేసే హైడ్రో గంజాయి, విదేశీ ఈ.సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. వాటిని తెచ్చిన పది మందిని బంధించి దర్యాప్తు చేపట్టారు.

ప్రాణులపై కనికరమేదయా?

పెంపుడు జంతువులను జనావాసాల నుంచి దూరం చేయాలనే చర్య సరికాదంటూ వాటిపై మక్కువ పెంచుకున్న వివిధ సంఘాల ప్రతినిధులు బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో మంగళవారం నిర్వహించిన ధర్నా **(న్యూస్‌టుడే, శేషాద్రిపురం)**

హులకల్ పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

యాదగిరి, న్యూస్‌టుడే: శహపుర తాలూకా హులకల్ గ్రామంలోని మణికంఠ కాటన్, జిన్నింగ్ మిల్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకుని అగ్నిమాపదళ సిబ్బంది నాలుగు వాహనాలతో వచ్చేసరికి మిల్లులోని పత్తి బేళ్లు మొత్తం దగ్ధమయ్యాయి. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. కనీసం రూ.15 కోట్ల ఆస్తినష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా.

హొన్నావర మార్గంలో బస్సు బోల్తా

కార్వార, న్యూస్‌టుడే : హానగల్ నుంచి సిద్ధాపుర మార్గంలో హొన్నావరకు వస్తున్న ఆర్టీసీ బస్సు గేరుసొప్ప పరిధి సూళెముక్కి క్రాస్ వద్ద రహదారి పక్కన పల్లంలోకి బోల్తా కొట్టింది. బస్సులోని సిబ్బందితో పాటు పాతిక మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స కోసం హొన్నావరలోని ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం ఉదయం వేగంగా వస్తున్న సమయంలో బస్సు అదుపుతప్పి రహదారి పక్కన చెట్టును ఢీకొట్టి బోల్తా కొట్టింది.



బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంతారావు

చింతామణిలో అఖండ తాండవం

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ-2' తాండవం విడుదలకు ముందస్తు కార్యక్రమాన్ని చింతామణిలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తారు. బాలకృష్ణతో పాటు ముఖ్య అతిథులుగా హ్యాట్రిక్ హీరో శివరాజ్ కుమార్, నటుడు 'దునియా' విజయ్, అఖండ చిత్ర బృందం కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు కర్ణాటక రాష్ట్ర ఎన్‌బీకే ఫ్యాన్స్ కన్వీనర్ జి.కాంతారావు తెలిపారు. హిందూపురం, మదనపల్లె, బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర ప్రాంతాల నుంచి బాలయ్య అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని అంచనా వేస్తున్నామని ఆయన చెప్పారు.

సహజీవనం.. తీసింది ప్రాణం

కలబురగి, న్యూస్‌టుడే : ఒక మహిళతో సహజీవనం చేస్తున్న సమీర్ (26) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. అతనితో సహజీవనం చేస్తున్న తయ్యూబా భాగవాన్ అనే మహిళ తన సోదరుడు అస్లమ్ భాగవాన్‌తో కలిసి అతనిపై దాడి చేసి, గొంతు నులిమి హత్య చేసిందని దర్యాప్తు అధికారులు మంగళవారం వెల్లడించారు. సమీర్ వేధింపులు తాళలేకే హత్య చేశానని ఆమె నేరాన్ని అంగీకరించిందన్నారు. నిందితులను అరెస్టు చేసిన గోల్‌గుంబజ్ ఠాణా పోలీసులు విచారణ కొనసాగించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

సదస్సు ప్రారంభించి మాట్లాడుతున్న సిద్ధరామయ్య

ఓ ప్రదర్శన విభాగంలో వేర్వేరు సంస్థల స్టాళ్లు

హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులతో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, అధికారులు

ప్రవేశ ద్వారం వద్ద స్వాగత ఫలకాలు

ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

గేమర్లను ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేసిన బొమ్మ

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూకుడు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శాస్త్ర, సాంకేతికరంగాల ప్రగతి పతాకగా వర్ధించే బెంగళూరు టెక్ సదస్సు స్థానిక ప్యాలెస్ మైదానంలో ప్రారంభమైన వేళ.. నిపుణులు, ప్రముఖుల సందడి మొదలైంది. నగర శివారు మాదావరలోని బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శన కేంద్రం.. ఈ సదస్సుకు వేదికగా ఎంచుకోగా.. ఆ చుట్టుపక్కల గట్టి భద్రత చర్యలు చేపట్టారు. వివిధ దేశాల ప్రతినిధులు, ఐటీ, బీటీ రంగాలకు చెందిన ప్రముఖులు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ప్రియాంక్ ఖర్గే, ఎంబీ పాటిల్, కియోనిక్స్ అధ్యక్షుడు శరత్ బచ్చేగౌడ, ఐటీ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులను ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. మూడు ప్రధాన హాళ్లలో వెయ్యికి పైగా సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. మధ్యాహ్నం నుంచి స్టాళ్లను వీక్షించేందుకు రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు తరలి వచ్చారు. గురువారం రాత్రి ఏడు గంటల వరకు సదస్సులు, సమావేశాలు కొనసాగిస్తారు.

సీఎంకు స్మరణిక అందిస్తున్న మంత్రి ప్రియాంక్

తెలుగు విజ్ఞాన సమితి దొడ్డమనసు

పాఠశాల దత్తతకు శ్రీకారం

బెంగళూరు (శివాజీనగర) : శివాజీనగర బస్టాండ్ పరిధి ఓపీహెచ్ రోడ్డులోని ప్రభుత్వ తెలుగు పాఠశాలను తెలుగు విజ్ఞాన సమితి దత్తత తీసుకుంది. ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఇప్పటికే రూ.16 లక్షలు ఖర్చు చేయగా, మరిన్ని సేవల కోసం చర్యలు చేపట్టామని సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ రాజు ప్రకటించారు. బడిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వార్షిక బస్సు పాసుకు పూర్తి నిధులు అందించేందుకు సమితి కార్యవర్గ సభ్యుడు డి.గణేశ్ శంకర్ ముందుకు వచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, బోధన సిబ్బంది నియామకాల కోసం విద్యాశాఖ మంత్రి మధు బంగారప్పతో త్వరలో చర్చలు జరుపుతామని చెప్పారు. గతంలో బెంగళూరు జిల్లాలో 130కు పైగా తెలుగు విద్యాసంస్థలు ఉండగా, వాటిలో 65 వేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేసేవారు. ప్రస్తుతం 13 పాఠశాలల్లో ఆరు వేల మంది మాత్రమే చదువుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతిలో 90 శాతం కన్నా ఎక్కువ మార్కులు సాధించే ప్రతిభావంతులకు తలా రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామని సమితి కోశాధికారి సీపీ వరదరాజు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్సూర్, సమితి కార్యవర్గ సభ్యుడు వెంకటేశులు, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసులు, శ్యామల, జమున, లత, చంద్రకళ, బి.మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్‌కు నిధులు అందుకున్న విద్యార్థులతో సమితి ప్రతినిధులు

అబ్దుల్ కుటుంబానికి సహకారం

మంత్రి జమీర్ వెల్లడి

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : మదీనా సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కన్నడిగుడు అబ్దుల్ గని శిరహట్టి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని వక్ఫ్ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. హుబ్బళ్లికి చెందిన గని కుటుంబ సభ్యులు ఉమర్ సాబ్, మౌలా అలి, మైనుద్దీన్ మఖందర్ తదితరులు మంత్రితో మంగళవారం బెంగళూరులో సమావేశమై మాట్లాడారు. బెంగళూరు నుంచి మదీనాకు వెళ్లేందుకు వీసా, విమానం టికెట్లు, అక్కడ ఉండేందుకు హోటల్, ఇతర సదుపాయాలు, అంత్యక్రియల అనంతరం ఉమ్రా యాత్ర నిర్వహించి వెనక్కు వచ్చేందుకు, ఇతర దారి ఖర్చులకు తన సొంత నిధి నుంచి నగదు అందించారు. వారికి కావలసిన సదుపాయాలను కల్పించాలని హజ్ సమితి కార్యనిర్వహణ అధికారి సర్ఫరాజ్‌ఖాన్‌కు సూచించారు. హుబ్బళ్లి నుంచి వారు ముగ్గురూ తమ పాస్‌పోర్టులతో రావడంతో, నేరుగా వారిని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసువెళ్లి, మదీనాకు వెళ్లేందుకు వీడ్కోలు పలికామని వక్ఫ్ శాఖ అధికారులు తెలిపారు.

మృతుని తరఫు బంధువులతో మాట్లాడుతున్న జమీర్ అహ్మద్‌ఖాన్

నేడు ఏక్తా పాదయాత్ర

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఏక్తా పాదయాత్ర నిర్వహిస్తారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా డాక్టర్.రాజ్‌కుమార్ రహదారిలోని ప్రభుత్వ మున్సిపల్ పదవీ పూర్వ కళాశాల మైదానం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

బాలల సహాయవాణి సేవలు కీలకం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో పాఠశాల, కళాశాలు, వసతి నిలయం, బహిరంగ ప్రదేశాల్లో బాలలపై దౌర్జన్యాలు, శారీరక వేధింపులు, మానసిక, లైగింక వేధింపులకు పాల్పడినట్లయితే వెంటనే 1098కు సహాయవాణికి సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. లేకుంటే బళ్లారి నగరం కంటోన్మెంట్‌లోని శాంతిధామ 08392-241373 సంప్రదించాలన్నారు.

విశ్వనాథుని దర్శించుకున్న శ్రీరాములు

బళ్లారి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఇంటూరి నగర్‌లో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వనాథుని ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాలకు మాజీ మంత్రి శ్రీరాములు హాజరయ్యారు. అభిషేకాలు, పూజలు చేశారు. శ్రీరాములు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో శివలింగాన్ని దర్శించుకుంటే మంచి ఫలితం వస్తుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు మాజీ మంత్రిని సత్కరించారు. భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. కార్తీకదీపాలను వెలిగించారు.

కాశీవిశ్వనాథుని ఆలయంలో ఆశీస్సులు పొందుతున్న మాజీమంత్రి శ్రీరాములు

తహసీల్దార్‌కు సేవారత్న ప్రశస్తి

సిరివార, (మాన్వి) : తహసీల్దార్ అశోక్ పవార్‌కు ప్రభుత్వం సేవా రత్న ప్రశస్తిని ప్రకటించింది. కార్యాలయానికి ప్రజలు, అర్జీదారులు వచ్చినప్పుడు అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించటం, సమీక్షలో చురుగ్గా పాల్గొని నిర్ణీత గడువులోపు సర్వే ముగిసే విధంగా చూడటం, ప్రజలతో ఆయన అనుసరించిన వ్యవహార శైలి తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని 2025 సేవా రత్న ప్రశస్తికి ఎంపిక చేశారు. తహసీల్దార్‌ను తాలూకా నౌకర్ల సంఘం అధ్యక్షుడు అరీఫ్‌మియా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

తహసీల్దార్ అశోక్‌ను సత్కరిస్తున్న అరీఫ్‌మియా, సభ్యులు

ఈదారికొస్తే.. విమానం ఎక్కినట్లే!

◆ చెన్నైకి శరవేగంగా ప్రయాణం ◆ పూర్తికావచ్చిన ఎక్స్‌ప్రెస్ మార్గం

హొసకోట శివార్లలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కూడలి.. వంతెనల విన్యాసం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు- చెన్నై గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి సిద్ధమవుతోంది. కేంద్ర భూఉపరితల రవాణాశాఖ ఈ మార్గాన్ని నిర్మాణం చేసింది. నాలుగు వరుసల మార్గ నిర్మాణానికి రూ.17,930 కోట్లు వ్యయం చేశారు. ఈఏడాది ఆఖరుకల్లా దీని సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తాయని జాతీయ రహదారి ప్రాధికార అధికారులు వెల్లడించారు. మొత్తం 262 కిలోమీటర్ల ఈ రహదారి కర్ణాటక పరిధిలో వరకు 110 కిలోమీటర్ల దూరం విస్తరించింది. మిగతా మార్గమంతా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా సాగుతుంది. ఈ మహా రహదారిపై వాహనాన్ని దూకిస్తే.. బెంగళూరు నుంచి చెన్నైకు కేవలం ఐదు గంటల్లో చేరుకోవచ్చట! ఒకమాటలో చెప్పాలంటే బెంగళూరు విమానాశ్రయం చేరుకుని.. అక్కడి నుంచి చెన్నైలోని మీనంబాకం విమానాశ్రయంలో వాలి.. ఆ నగరంలో అడుగుపెట్టే ప్రయాణ సమయంతో ఇది సమానం కాబోతోంది. ఈ దారి పొడవునా ఇరువైపులా పారిశ్రామికవాడలను అభివృద్ధి చేస్తారు. కొత్త లేఔట్‌లతో పాటు సందగుడి వద్ద ఐదువేల ఎకరాల విస్తీర్ణంలో కర్ణాటక గృహ నిర్మాణ మండలి ప్రత్యేక నివాస నగరాన్ని నిర్మిస్తారు. ముళబాగిలు సమీప కెంపాపుర చెరువు వద్ద విహార కేంద్రంగా మార్చేస్తున్నారు. నాలుగు మార్గాల జాతీయ రహదారి అభివృద్ధి కావడంతో చుట్టు పక్కల భూములకు రెక్కలు వచ్చాయి. ఇప్పటికే బెంగళూరు గ్రామీణ జిల్లాలో నరసాపుర పారిశ్రామిక వాడ, కోలారు, ముళబాగిలు, టమక పారిశ్రామిక వాడలు విస్తరించిన విషయం తెలిసిందే. రవాణా వ్యవస్థ ఫలితంగా పారిశ్రామికవాడలు అభివృద్ధి చెందే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. హొసకోట శివార్ల నుంచి దేవనహళ్లి, హొసూరు, తుమకూరు తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఉపకరించే వలయ వరుస మార్గాలను తీర్చిదిద్దారు. ఎలాంటి పరిస్థితిలోనూ వాహనాలు ఎక్కడా ఆగకుండా రయ్యిన దూసుకెళ్లడం ఇక్కడ ప్రత్యేకం. కోలారు, చిత్తూరు ప్రాంతాల వారు బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోవడం ఇకపై ఏమంత శ్రమ కాబోదు. ప్రయాణికుల సమయం, ఇంధనం ఆదా అవుతుందని అధికారులు తెలిపారు.

కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా వలయ వరుస మార్గం

బెంగళూరు- చెన్నై గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి.. సవ్య ప్రయాణానికి మహా వేదిక

రచయిత మునాఫ్‌కు సత్కారం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : కవి, రచయిత, హెబ్బాళ నియోజకవర్గం కర్ణాటక జ్ఞాన విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఎండీ మునాఫ్‌ను బుద్ధ బసవ గాంధీ సాంస్కృతిక ట్రస్టు ఘనంగా సత్కరించింది. జ్ఞాన విజ్ఞాన సమితి తరపున నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో సైన్సు పట్ల అభిరుచి పెంచేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు, కార్యశాలలు, జాగృతిని దృష్టిలో ఉంచుకుని ఆయనను మంగళవారం సత్కరించారు. సంఘం అధ్యక్షుడు రామలింగేశ్వర, సమ్మేళన అధ్యక్షురాలు పుష్ప బసవరాజ బాణకర్ తదితరులు మునాఫ్‌ను సత్కరించిన వారిలో ఉన్నారు.

సన్మాన గ్రహీతతో ట్రస్టు ప్రతినిధులు

కొండముచ్చు దాడిలో నలుగురికి గాయాలు

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని జవుకు గ్రామంలో కొండముచ్చు దాడిలో రెండు రోజుల్లో నలుగురు గాయపడ్డారు. సోమవారం హెచ్.ఎం. సురేశ్, పాలాక్షిలపై దాడి చేసి గాయపరిచింది. ఇద్దరి చేతులకు బలమైన గాయాలయ్యాయి. మంగళవారం నెల్లుడి తిమ్మయ్య ఎడమకాలిపై కరిచింది. ఎ.లోకేశ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం ఆపి ఇంట్లోకి వెళుతుండగా దాడి చేసి చేతిని కొరికింది. గాయపడిన వారు మెట్రి, శ్రీరామరంగాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో తొలుత చికిత్స తీసుకుని మెరుగైన వైద్యం కోసం బళ్లారి వెళ్లారు. కొండముచ్చు కారణంగా ఇంట్లోంచి బయటకు రావాలంటేనే భయంగా ఉంది. అధికారులు దాన్ని బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాయపడిన లోకేశ్

రంగస్థల ఉత్తమ కళాకారుడి కన్నుమూత

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి రంగస్థల కళాకారుడు బూదగుంపి హుసేన్ సాబ్ (71) మంగళవారం ఉదయం అనారోగ్యంతో కన్ను మూశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, రక్త రాత్రి తదితర ఎన్నో నాటకాల్లో నాయకుడిగా, ప్రతి నాయకుడిగా, హాస్య నటుడిగా ఎన్నో పాత్రలు పోషించి ప్రజల మెప్పు పొందారు. చలన చిత్ర నటులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రముఖుల మాట తీరును అనుకరించి వారిలా మాట్లాడే వారు. రంగస్థల రాష్ట్ర స్థాయి ఉత్తమ కళాకారుడి పురస్కారం అందుకున్న ఆయన మృతి కళారంగానికి తీరని లోటని పలువురు వ్యాఖ్యానించారు. పార్టీల కతీతంగా నాయకులు, సంఘ సంస్థల సభ్యులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

బూదగుంపి హుసేన్ సాబ్ (దాచిన చిత్రం)

EENADU eClassifieds

PROFESSIONAL SERVICES

VAASTU

ఇల్లు, ఆఫీస్, స్థలాలకు వాస్తు సరిచేసుకోండి. వాస్తు సిద్ధాంతి డా॥ కుంచాల హనుమంతరావు గారు బెంగుళూరులో 4 రోజులు మాత్రమే ఉంటారు. సం॥ 9246624248

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

'ఆదర్శమూర్తి తిమ్మక్క'

సింధనూరు, న్యూస్‌టుడే: ప్రకృతి, పరిసరాలను సంరక్షిస్తూ తన జీవితాన్నే ప్రజల కోసం దారపోసిన పద్మశ్రీ సాలుమరద తిమ్మక్క ఎందరికో ఆదర్శమూర్తి అని కేఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నిరుపాది గోమర్సి అన్నారు. తిమ్మక్క జ్ఞాపకార్థం స్థానిక వనసిరి ఫౌండేషన్‌తో కలసి మంగళవారం సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంపులోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో పెద్దఎత్తున వనమహోత్సవం జరిపారు. కేఆర్ఎస్, వనసిరి ప్రతినిధులు కలసి మొత్తం 114 మొక్కలు నాటి నీరు పోశారు. సాలుమరద తిమ్మక్కను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ పరిసరాలను కాపాడితే మానవాళికి ఎంతో మేలు చేసినట్లే అని నిరుపాది అన్నారు. కార్యక్రమంలో వనసిరి అధ్యక్షుడు అమరేగౌడ మల్లాపూరు తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న కేఆర్ఎస్, వనసిరి ప్రతినిధులు

మత్తుకు బానిసలు కావొద్దు

కంప్లి, న్యూస్‌టుడే: ఆరోగ్యవంత సమాజం కోసం ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కంప్లి పురసభ పారిశుధ్య ఆరోగ్య ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ బాబు సూచించారు. నిశా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా పురసభ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మత్తుకు బానిస కావొద్దంటూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు జీవన స్వాతి, జి.ఆనంద్, సి.జానకి, గౌడర నాగరత్న, మేఘ, భూమిక తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ సమష్టిగా ప్రతిజ్ఞ

ఎక్స్ కార్ప్.. కొత్త అప్పీలు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : ఆన్‌లైన్ ఖాతాల్లో సమాచారంపై నిర్బంధాన్ని విధించేందుకు సహయోగ పోర్టల్ ఏర్పాటుకు ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ ఎక్స్ కార్ప్ మరోసారి ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకుంది. ఖాతాదారులపై నిర్బంధం, సామాజిక మాధ్యమాలను నిర్బంధించేందుకే సహయోగ పోర్టల్‌ను కేంద్రం ప్రారంభించడం తమ హక్కులను హరించడమేనని ఎక్స్‌కార్ప్ సంస్థ తమ అర్జీలో పేర్కొంది. కేంద్ర న్యాయ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, హోం వ్యవహారాలు, ఆర్థిక, రక్షణ, రైల్వే, భారీ పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శులను ప్రతివాదులుగా చేస్తూ అప్పీలుకు వెళ్లింది. ఇదే వారం ఈ అర్జీపై విచారణ ఉంటుందని సంస్థ తరఫు న్యాయవాదులు తెలిపారు.

విదేశీ మహిళకు చరవాణిని అప్పగిస్తున్న హంపీ పోలీసులు

ఔరా! పర్యాటక మిత్ర నిజాయతి

హొసపేటె, న్యూస్‌టుడే: జపాన్‌కు చెందిన పర్యాటకురాలు పోగొట్టుకున్న ఖరీదైన చరవాణిని అమెకు తిరిగి ఇచ్చి హంపీలో విధులు నిర్వహిస్తున్న పర్యాటకమిత్ర సిబ్బంది తమ నిజాయతీని చాటుకున్నారు. మంగళవారం విరూపాక్షేశ్వర దర్శనానికి వచ్చిన జపాన్ దేశస్థురాలు ఆలయ ఆవరణలో మొబైల్ పోగొట్టుకున్నారు. ఆ మొబైల్ పర్యాటక మిత్ర సిబ్బంది రామానాయక్, విశ్వనాథ్‌లకు దొరికింది. సొంతదారు కోసం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో హంపీ పోలీసులకు అప్పగించారు. మైకుల ద్వారా హంపీ వీధుల్లో దీనిగురించి పోలీసులు ప్రకటించడంతో జపాన్ మహిళ పోలీసుఠాణాకు వెళ్లి మొబైల్ సొంతం చేసుకున్నారు. పర్యాటక మిత్ర సిబ్బంది నిజాయతిని స్థానికులు మెచ్చుకున్నారు.

మంగళముఖీల జీవిత చరిత్రపై సినిమా

హొసపేటె, న్యూస్‌టుడే: మంగళముఖీల జీవనం, ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్మించిన 'శివలీలా' సినిమా జనవరి 1న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుందని దర్శకుడు అశోక్ జయరామ్ తెలిపారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నివురుగప్పిన నిప్పు' అనే సబ్‌టైటిల్ కూడా పెట్టామన్నారు. పద్మశ్రీ పురస్కారగ్రహీత మంజమ్మ జోగతి సహా సుమారు 300 మంది మంగళముఖీలు ఇందులో అభినయిస్తున్నారని వివరించారు. అన్నీ వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం ఈ వర్గాన్ని నిర్లక్ష్యం చేసింది. ఈ నేపథ్యంలో వారు పడుతున్న కష్టాలపై సినిమా నిర్మించామని వివరించారు. ప్రేక్షకులను ఈ సినిమా కంటతడి పెట్టిస్తుందన్నారు. మంగళముఖీల జీవితాలపై చర్చకు తావిస్తుందని తెలిపారు.

వివరాలు తెలుపుతున్న సినిమా దర్శకుడు అశోక్ జయరామ్

అంబామఠం మార్గం సుగమం

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అంబామఠం వెళ్లే యాత్రికులకు రహదారి మరింత సుగమం కానుంది. అంబాదేవి దేవస్థానం నుంచి గొబ్బరకల్లు క్రాస్ వరకు గల కొద్దిపాటి మార్గాన్ని నాలుగువరుసలుగా రూ.2.5 కోట్లతో విస్తరించనున్నారు. సోమలాపూరు క్రాస్ నుంచి గొబ్బరకల్లు క్రాస్ వరకు సులభంగానే వెళ్లగలిగే వాహనాలు అక్కడ నుంచి ఇరుగ్గా ఉండే దేవస్థానం దారిలో ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. మంగళవారం సింధనూరు శాసనసభ్యుడు బాదర్లి హంపనగౌడ ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. తహసీల్దారు అరుణ్ దేశాయ్, ఈఓ చంద్రశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజుగౌడ, అమ్రేశ్ శివనాగప్ప, బసవరాజ్ హిరేగౌడ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం రోజంతా ఎమ్మెల్యే బాదర్లి క్షేత్రంలో విస్తృతంగా పర్యటించారు. హెడిగినాళ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మహిళల కోసం స్థాపించిన 'బెళకు వనధన్' కందుల ప్రాసెసింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు.

నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

బళ్లారి మేయర్‌కు సన్మానం

బళ్లారి: బళ్లారి శిరిడి సాయి సేవా సత్సంగ ట్రస్ట్, ఆర్.ఎస్.బి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన మేయర్‌గా ఎంపికైన పూజారి గాదెప్పను సన్మానించి ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.గోపాలకృష్ణ మాట్లాడారు. దుర్గమ్మ దేవస్థానం పూజారి గాదెప్ప సౌమ్యుడు..అభివృద్ధిపై లక్ష్యం ఉన్న వ్యక్తి..బళ్లారి నగర ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారని గట్టి నమ్మకం ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. శిరిడి సాయి సేవా సత్సంగ్ ట్రస్ట్ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో సభ్యులు బాలాజి, గోవింద రాజులు, జయంతి కిశోర్, ఆర్.ఎస్.బి.ట్రస్ట్ అధ్యక్షుడు పోలా రాధాకృష్ణ, జి.విజయకుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పూజారి గాదెప్పను సత్కరిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు, సభ్యులు

(c) eenadu

బళ్ళారి

• బళ్లారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

రుద్రమునీశ్వర మఠంలో కార్తిక దీపోత్సవం

తాలూకాలోని చికలపర్వి తుంగభద్ర నది తీరంలో ఉన్న రుద్రమునీశ్వర మఠంలో మంగళవారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సదాశివ స్వామీజీ దీపం వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్తిక మాసం, దీపాల ప్రాముఖ్యాన్ని ఆయన వివరించారు. చుట్టుపక్కల గ్రామాలు, క్యాంపుల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చి మఠం ఆవరణంలో ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. హాజరైన భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. - న్యూస్‌టుడే, మాన్వి

కనకదుర్గమ్మకు కార్తికశోభ

బళ్లారి (గ్రామీణ), న్యూస్‌టుడే: నగర ఆరాధ్యదేవత కనకదుర్గమ్మతల్లికి కార్తిక చివరి మంగళవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించారు. సామూహిక లలిత సహస్రనామపఠనం చేశారు. అమ్మవారికి రజతకవచం, పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. భక్తులు పోటెత్తి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. అవంబాడి కోదండరామాలయంలో కార్తికదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తిక పురాణం శ్రవణం చేశారు.

స్వాతంత్ర్యోద్యమంలో బిర్సాముండా పాత్ర కీలకం

హొసపేటె, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరంలో గిరిజన నాయకుడు బిర్సాముండా పాత్ర కీలకమని జిల్లా అదనపు పాలనాధికారి బాలకృష్ణప్ప పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన బిర్సాముండా జయంత్యుత్సవంలో ఆయన మాట్లాడారు. ఆంగ్లేయులకు సింహస్వప్నంగా మారిన బిర్సాముండాను గిరిజన తెగలు గర్వకారణమని కొనియాడారు. మన పార్లమెంట్ భవనంలో బిర్సాముండా భావచిత్రాన్ని ఏర్పాటు చేయడం ఆయనకిచ్చిన గౌరవమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారి టి.రవికుమార్, వాల్మీకి నాయక సమాజం అధ్యక్షుడు గోసల భరమప్ప తదితరులు పాల్గొన్నారు. బిర్సాముండా జీవితచరిత్రపై ఏర్పాటు చేసిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

సరిలేరు మాకెవ్వరూ!

హాకీలో జయకేతనం

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రాదేశిక విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా క్రీడామైదానంలో జరిగిన కలబురిగి విభాగ స్థాయి హాకీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో బళ్లారి బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. గెలుపొందిన జట్లను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల కొరెప్ప, నాగణ్ణ తదితరులు కప్‌లతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు

క్రీడల్లో నగర క్రీడాకారులు ప్రతిభ ఎల్లలు దాటుతోంది. జాతీయ క్రీడ హాకీలో సత్తా చాటిన బాలురు, బాలికల జట్లు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాయి. మరోవైపు షటిల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన బళ్లారి బాలబాలికల జట్టు దేశ రాజధాని దిల్లీలో జరుగనున్న జాతీయ పోటీలకు ఎంపిక కావడం విశేషం.

బాలుర విభాగం..

బళ్లారి జిల్లా క్రీడామైదానంలో హాకీ కోర్టులో జరిగిన కలబురిగి విభాగ స్థాయి హాకీ పోటీలు బాలురు విభాగంలో అండర్-17లో ఫైనల్‌కు చేరుకున్న బళ్లారి-బీదర్ జట్లు తలపడ్డాయి. పోటీల్లో (5-0) గోల్స్‌తో బళ్లారి విన్నర్‌గా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. బీదర్ రన్నర్‌గా నిలిచింది. అండర్-14 విభాగంలో ఫైనల్‌కు బళ్లారి- కలబురిగి జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో 4-0 గోల్స్‌తో బళ్లారి గెలుపొంది, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కలబురిగి రన్నర్‌గా నిలిచింది.

బాలికల అండర్-17 విభాగంలో విజేతగా నిలిచిన బళ్లారి జట్టుతో అధికారులు

బాలికల విభాగం..

జిల్లా క్రీడామైదానంలో జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో అండర్-17లో ఫైనల్‌లో బళ్లారి-రాయచూరు జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో (4-0) గోల్స్‌తో బళ్లారి జట్టు గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. రాయచూరు రన్నర్‌గా నిలిచింది. అండర్-14 విభాగంలో జట్లు రాక పోవడం (వాకోవర్)తో బళ్లారి జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా అధికారులు కప్ అందజేసి అభినందించారు.

బాలుర అండర్-14 విభాగంలో తలపడుతున్న బళ్లారి-కలబురిగి జట్లు

జాతీయ స్థాయి షటిల్‌కు సముద్యత

బళ్లారి (గ్రామీణ), న్యూస్‌టుడే: రాయచూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నగరానికి చెందిన సముద్యత బృందసభ్యులు రాణించి ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా సముద్యత మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా అండర్-14, అండర్-17 బాలికల షటిల్ పోటీల్లో రాణిస్తున్నామన్నారు. ఈనెల 17న జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ, జిల్లా పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించామన్నారు. గత నెల జోనల్ స్థాయిలోనూ ప్రథమ స్థానం పొందామన్నారు. వచ్చే డిసెంబరులో దేశరాజధాని దిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-17 బాలికల షటిల్ పోటీలకు ఎంపికవ్వడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీల్లో మైసూరు జట్టుపై తను, మనోజ్ఞస్వాయి, హసినాస్వాయి రాణించి ప్రథమ స్థానం సాధించామని చెప్పారు. ఈ సందర్భంగా సముద్యత, హసికా, మనోజ్ఞలను క్రీడాప్రియులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలైన సముద్యత బృందాన్ని అభినందించిన క్రీడాధికారులు

'కనకగిరి అభివృద్ధే మా లక్ష్యం'

కారటగి, న్యూస్‌టుడే: కనకగిరి విధానసభ క్షేత్ర అభివృద్ధే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి తెలిపారు. కారటగిలో రూ.90 లక్షలతో నిర్మించిన పురసభ వాణిజ్య సముదాయం, రూ.72.30 లక్షలతో నిర్మించిన బాల్ బ్యాడ్మింటన్ ఇండోర్ మైదానాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం తాగునీరు వంటి కనీస సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నామన్నారు. రూ.34 లక్షలతో చేపడుతున్న హులిగెమ్మ దేవి ఆలయ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పురసభ అధ్యక్షురాలు ఎ.రేఖ, ఉపాధ్యక్షురాలు దేవమ్మ, స్థాయి సమితి అధ్యక్షుడు ఈశప్ప ఇట్టగి, నాయకులు అయ్యప్ప ఉప్పార్, శివారెడ్డి నాయక్, సిద్ధన గౌడ, పురసభ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి శివరాజ్ తంగడగి

'పది' ఫలితాల్లో మెరుగుదల అవసరం

హొసపేటె, న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో ఈసారి జిల్లా మొదటి పది స్థానాల్లో చోటు దక్కించుకోవాలని జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి సూచించారు. పదో తరగతి ఫలితాల మెరుగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఇక్కడ ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిరుడు మన జిల్లా 18వ స్థానంలో ఉండేది. విద్యార్థుల స్థాయిని బట్టి వారికి అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. చురుగ్గా లేని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. డిసెంబరులోగా పాఠ్యాంశాలను పూర్తి చేసి, రెండు నెలలు వారు చదువుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్ రామచంద్రప్ప మాట్లాడారు. కార్యక్రమంలో తాలూకా విద్యాశాఖ అధికారులు శేఖరప్ప హొరపేటె, మైలేశ్ బేవూరు, ఎం.ఎస్.ప్రభాకర్, లేపాక్షప్ప, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి

నెట్‌బాల్ పోటీల విజేత హొన్నాళి జట్టు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: దావణగెర విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పురుషులు, మహిళల నెట్‌బాల్ పోటీల్లో దావణగెర జిల్లా హొన్నాళి ఎస్ఎంఎస్ డిగ్రీకళాశాల విద్యార్థులు ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. మంగళవారం ఇక్కడ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆటల మైదానంలో నిర్వహించిన పోటీల్లో మహిళలు, పురుషులు రెండు విభాగాల్లో కూడా హొన్నాళి కళాశాల విద్యార్థులు రాణించి కప్పులను సొంతం చేసుకొన్నారు. పురుషుల విభాగంలో దావణగెర జీఎంఎస్ డిగ్రీ కళాశాల రజత పతకాన్ని, ప్రభుత్వ విజ్ఞాన కళాశాల కంచు పతకంతో సంతృప్తి చెందాయి. మహిళల విభాగంలో ప్రభుత్వ విజ్ఞాన కళాశాల వెండి పతకాన్ని, దావణగెర జీఎంఎస్ డిగ్రీ కళాశాల కంచు పతకంతో సరిపెట్టుకున్నాయి. బహుమతులను అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కరియప్ప మాళిగే, దావణగెర విశ్వవిద్యాలయం సిండికేటు సభ్యులు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. పోటీలలో సుమారు 25 కళాశాలల జట్లు పాల్గొన్నాయి.

కప్పును గెలుపొందిన హొన్నాళి ఎస్ఎంఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

25న దివ్యాంగులకు క్రీడాపోటీలు

హొసపేటె, న్యూస్‌టుడే: డిసెంబరు 3న జరగబోయే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న దివ్యాంగులకు క్రీడాపోటీలను ఏర్పాటు చేశామని ఆ శాఖ అధికారి రామాంజనేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోటీల్లో గుండు విసిరే పోటీలు, జావెలిన్ త్రో, పరుగు పందేలు, మ్యూజికల్ ఛైర్ పోటీలను నిర్వహిస్తున్నామని ఈనెల 24లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల మూసివేత సరికాదు

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక పబ్లిక్ పాఠశాలల్ని వర్గోన్నతి చేయడం, సమీపంలోని ఉన్నత పాఠశాలలను విలీనం చేయడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను యథా ప్రకారం కొనసాగించాలని కోరుతూ ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు మంగళవారం సండూరు తాలూకా తోరణగల్లులో ఆందోళన నిర్వహించారు. ఎస్.ఎఫ్.ఐ తాలూకా సంచాలకుడు శివారెడ్డి, కార్యదర్శి స్వామి, అక్షయ్‌కుమార్, విద్యార్థులు అమృత, తులసి, మహాలక్ష్మీ, ముత్తమ్మ, కిరణ్‌కుమార్, ప్రవీణ్, మహేశ్ తదితరులు నిరసన తెలియజేసి అధికారికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రికి ఈ అభ్యర్థనపత్రాన్ని పంపించాలని కోరారు.

అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులు

దివ్యాంగుల పింఛను పెంచాలని వినతి

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దివ్యాంగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వారు జీవనం సాగించడం కష్టమైంది. పింఛను పెంచకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయాల్సి వస్తుందని దివ్యాంగులు, తల్లిదండ్రుల ఒక్కూట సంఘం రాష్ట్ర కార్యదర్శి రంగప్ప దాసర్ హెచ్చరించారు. మంగళవారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లగా పింఛను పెంచాలని ఆందోళన చేస్తూ, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని వస్తున్నాం. ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో నిర్వహించిన తరహాలో ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుమారప్ప, వరలక్ష్మి, స్వామి, పార్వతి బాయి, నాగునాయక్, రాజనాయక్, బంగారప్ప తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో కిరాణా దుకాణం బుగ్గి

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి పట్టణ పరిధిలోని రామనగరలో మంగళవారం వేకువజామున చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఓ కిరాణా దుకాణం బుగ్గి అయింది. ఆ ప్రాంత వాసి కల్లనగౌడకు చెందిన దుకాణంలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు ఏర్పడ్డాయని ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు తెలిపారు. దుకాణం పక్కనే యజమాని ఇల్లు కూడా ఉండడంతో, కుటుంబ సభ్యులు వెంటనే మేల్కొని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ దాదాపు కిరాణా సరకులు కాలిపోయాయని బాధితులు తెలిపారు. రూ.25 లక్షల దాకా నష్టం వాటిల్లిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హగరిబొమ్మనహళ్లి పోలీసు ఠాణాలో కేసు నమోదైంది.

హగరిబొమ్మనహళ్లిలో మంటల్లో కాలిపోతున్న దుకాణం

కుడతినిలో కొనసాగుతున్న నిరసన

బళ్లారి, న్యూస్‌టుడే: కుడతిని భూపోరాట సమితి చేస్తున్న నిరవధిక సత్యాగ్రహం మంగళవారానికి 1068వ రోజుకు చేరుకుంది. కుడతిని చుట్టుపక్కల గ్రామాలైన వేణివీరాపురం, హరగినడోణి, సిద్ధమ్మనహళ్లి, యరంగలి, కొళగల్లు, జానెకుంటె తదితర గ్రామాలకు చెందిన రైతులు నిరవధిక సత్యాగ్రహంలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

నిరవధిక సత్యాగ్రహంలో పాల్గొన్న రైతులు

ధర్మస్థలం ఘటనపై విచారణ చేయించాలి

బళ్లారి, న్యూస్‌టుడే: ధర్మస్థలంలో మాయమవుతున్న మహిళలు, యువతులు, అత్యాచారాలకు గురైన ఘటనలపై విచారణ చేయించాలని కోరుతూ జనవాది మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రకుమారి నేతృత్వంలో డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేసి ముఖ్యమంత్రికి పంపాలని కోరారు. జనవాది మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 555 మంది సంతకాలు సేకరించారు. ధర్మస్థలం ఘటనలపై విచారణ చేసి అదృశ్యమైన మహిళలు, యువత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు రుద్రమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠప్పకు శ్రేష్ఠ సహకారి పురస్కారం

బళ్లారి, న్యూస్‌టుడే: హొసపేటెలో 72వ సహకార సప్తాహ కార్యక్రమంలో పురస్కారం అందుకున్న వారిని సన్మానించి అభినందించారు. బళ్లారి జనతా బజార్ మాజీ అధ్యక్షుడు నీలకంఠప్పకు బళ్లారి జిల్లా శ్రేష్ఠ సహకారి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లతామల్లికార్జున, బీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు దారుకేశ్, చంద్రశేఖరయ్యలు పాల్గొని అభినందించారు.

చర్చా పోటీలతో బుద్ధి వికాసం

బళ్లారి, న్యూస్‌టుడే: చర్చా పోటీలతో విద్యార్థుల జ్ఞానం వృద్ధి చెందుతుందని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (వీఎస్కేయూ) ఉపకులపతి ఎం.మునిరాజు తెలిపారు. బళ్లారి వీఎస్కేయూ డా.బి.ఆర్.అంబేడ్కర్ సభాభవనంలో సహకార రంగంపై ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమాన్ని ఉపకులపతి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వర్తమాన వ్యవహారాలకు సంబంధించిన అంశాలు లేదా గాంధీ, డా.బి.ఆర్.అంబేడ్కర్ వంటి మహానాయకుల అంశాలను ఒకరితో ఒకరు చర్చించుకోవడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు వర్తమాన వ్యవహారాలపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. దేశం భవిష్యత్తు నేటి యువతపైనే ఉందన్నారు. విద్యార్థి సంక్షేమ విభాగం డైరెక్టర్ గౌరీ మాణిక మాట్లాడుతూ సహకార రంగంలో జరిగిన చర్చ పోటీల్లో 60 మంది పైగా యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.3, రూ.2వేలు, రూ. వేయి నగదుతో ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆచార్యులు ఉదయకుమార్, రాబర్ట్‌జోష్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీఎస్కేయూ వీసీ మునిరాజు తదితరులు

మాలధారులకు లోటు రానీయొద్దు

హనుమమాల వేసుకున్న భక్తుల సౌకర్యాలపై చర్చిస్తున్న మంత్రి తంగడిగి

గంగావతి, న్యూస్‌టుడే: హనుమమాల దీక్ష విరమణకు అంజనాద్రి వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా సౌకర్యాలు కల్పించాలని కొప్పళ జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడిగి సూచించారు. ఆయన మంగళవారం గంగావతి భక్తుల సౌకర్యాలపై అధికారులతో సమావేశమై చర్చించారు. డిసెంబరు 2,3 తేదీల్లో దీక్ష చేపట్టిన భక్తులు పెద్దసంఖ్యలో అంజనాద్రికి వచ్చే అవకాశం ఉందన్నారు. గత ఏడాది కన్నా ఈసారి భక్తులు సంఖ్య పెరిగే అవకాశముందన్నారు. భక్తులకు పంపిణీ చేసే అన్నప్రసాదాన్ని పరీక్షించాలన్నారు. గంగావతిలో శోభాయాత్ర మొదలు దీక్ష విరమించే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. అంజనాద్రిని విద్యుద్దీపాలతో అలంకరించి అక్కడ పండుగ వాతావరణం కల్పించాలన్నారు. లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ, శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి, పాలనాధికారి సురేశ్ ఇట్నాళ, ఎస్పీ రామ్ అరసిద్ధి తదితరులు పాల్గొన్నారు.

బుడా సముదాయంలో.. దారుణ హత్య

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలో గుర్తుతెలియని వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. హత్యకు గురైన వ్యక్తి వయసు 38 ఉంటుంది. బళ్లారి నగర నడిబొడ్డున హెచ్.ఆర్.గవియప్ప కూడలి(మోతి) సమీపంలోని నగరాభివృద్ధి ప్రాధికార (బుడా) కాంప్లెక్స్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్పీ డా.శోభారాణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం కాలు, ముఖంపై తీవ్ర గాయాలు ఉన్నాయి. మృతదేహాన్ని పరిశీలించి బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రం శవగారానికి తరలించారు. డబ్బు కోసం హత్య చేశారా? మరేవైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో ఏపీఎంసీ మార్కెట్ యార్డ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. రెండు నెలలు క్రితం కూడా మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలంటూ ఒకరిని హత్య చేసిన ారింది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

అంధ విశ్వాసాలను వీడాలి

చెళ్లకెర,న్యూస్‌టుడే: విద్యార్థులు వైజ్ఞానిక ఆలోచనలు అలవర్చుకొంటే అంకుర సంస్థలను ఏర్పాటు చేసి నూతన ఆవిష్కరణలతో పురోగమించగలరని తాలూకా విద్యాశాఖ అధికారి సురేశ్ పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ కువెంపు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తాలూకా స్థాయి ఉన్నత పాఠశాల విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలను విస్మరించాలన్నారు. విద్యార్థులే వైజ్ఞానికంగా ఆలోచించి నమూనాలను రూపొందించడం వల్ల వారిలో సృజనశీలత, నైపుణ్యం పెరగగలవన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ శివలింగప్ప, రచయిత కొర్లకుంటే తిప్పేస్వామి, బీఆర్‌సీ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న తాలూకా విద్యాశాఖ అధికారి సురేశ్ తదితరులు.

సామాజిక న్యాయం కల్పించాలి

బళ్లారి, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా దళిత, అంటురాని వారిపై దౌర్జన్యాలు, దళిత, ఆదివాసి మహిళలు దౌర్జన్యం నుంచి విముక్తి పొందలేదు. సామాజిక న్యాయం కల్పించాలని కోరుతూ సీపీఐ నేతృత్వంలో మంగళవారం నగరంలో ఆందోళన నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రం డీసీ కార్యాలయం అధికారికి అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఆదిమూర్తి నేతృత్వంలో స్థానిక గడిగి చెన్నప్ప కూడలి నుంచి డీసీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అఖిల భారత సీపీఐ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా ఆందోళన నిర్వహించినట్లు డిమాండ్లను వివరించారు.

డీసీ కార్యాలయం ఆవరణలో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నేతలు, కార్యకర్తలు

పవన విద్యుత్తు కంపెనీలకు జరిమానా

చెళ్లకెర(చిత్రదుర్గం): జిల్లాలో పవన విద్యుదుత్పత్తి కంపెనీలు అక్రమంగా ఆక్రమించుకొన్న ప్రభుత్వ భూములకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 కోట్ల మేర జరిమానా విధించినట్లు జిల్లా అటవీ సంరక్షణ అధికారి గోప్యానాయక్ తెలిపారు. ఇంత వరకు సుమారు రూ.10 కోట్లు జరిమానాను వసూలు చేశామన్నారు.

ఘర్షణలో పది మందికి గాయాలు

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని జనతా హౌస్ కాలనీలో మంగళవారం గుంపు ఘర్షణ చోటు చేసుకుంది. ఒకే సముదాయానికి చెందిన రెండు గుంపుల మధ్య జరిగిన ఘర్షణలో పది మందికి పైగా గాయపడ్డారు. పెళ్లి వేడుకలో డీజే పాట విషయమై తలెత్తిన చిన్న గొడవ ఘర్షణకు దారితీసింది. కొట్లాటను విడిపించేందుకు వెళ్లిన పెద్దలు, మహిళలకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు గుంపుల వారు కేసులు పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

గాయపడిన క్షతగాత్రులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

18-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1624.34	1630.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,746	3,590
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,344	7,325
నీటి నిల్వ (టి.ఎం.సి)	74.357	97.448

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఆదర్శ మహిళ తిమ్మక్క

మాన్వి, న్యూస్‌టుడే : నాటిన మొక్కలనే తన బిడ్డల వలే చూసుకున్న సాలుమరద తిమ్మక్కను మనందరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ పేర్కొన్నారు. జనతాదళ్ కార్యాలయంలో తిమ్మక్క శ్రద్ధాంజలి సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించి మాట్లాడారు. తిమ్మక్క సేవలు ఎప్పటికీ మిగిలిపోతాయన్నారు. పర్యావరణ సంరక్షణకు మనం కృషి చేయటం ద్వారా ఆమె ఆశయాన్ని కొనసాగించాలన్నారు. మాన్వి తాలూకా అధ్యక్షుడు ఈరణ్ణ మర్లట్టి, సిరివార తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున పాటీల్, నాయకులు రాజా రామచంద్రనాయక్, శరణప్పగౌడ, ఎం.డి.ఉస్మాన్, సాజీద్, విజయ్‌కుమార్, చెన్నారెడ్డి, రవిపాటిల్, నాగనగౌడ, మౌనేశ్‌నాయక్, శివకుమార్, వీరేశ్ విశ్మకర్మ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న వెంకటప్పనాయక్ తదితరులు

హావభావాలతో అదరగొట్టిన విద్యార్థులు

నాటకంలో రసవత్తర ఘట్టం

బళ్లారి, న్యూస్‌టుడే: ఈ నాటకంలో నటులు మొత్తం మూగ, చెవిటి బాలలు..నోటమాట రాదు..చెవులు వినబడవు. హావభావాల ద్వారా మాత్రమే ప్రేక్షకులను ఆకర్షించారు. గదగ్ గజేంద్ర గడద నరేగల్లు గ్రామానికి చెందిన అన్నదాన విజయ విద్యా ప్రసారక సమితి మూగ, చెవిటి వసతిశాలకు చెందిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు సోమవారం రాత్రి కొట్టూరు మఠంలో ప్రదర్శించిన కడ్లిమట్టి కాశీబాయి నాటకాన్ని జగద్గురు కొట్టూరు బసవలింగ మహాస్వామి ప్రారంభించి మాట్లాడారు. అత్యాచారం, నేరాలు పెరుగుతున్న ఈ రోజుల్లో కడ్లిమట్టి కాశీబాయి జానపద నాటకాన్ని మూగ, చెవిటి విద్యార్థులు ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొంది. కాశీబాయి భర్త, తండ్రి, వ్యాపారి, రైల్వేస్టేషన్ మాస్టర్ పాత్రల్లో పిల్లల ప్రదర్శన పరకాయ ప్రవేశం చేసినట్లుగా ప్రేక్షకుల చూపుల్ని కట్టిపడేశారు. కళాకారులు నిశబ్ద భాష, నటన నైపుణ్యాలను సూచించడం ఈ నాటకంలో ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అయ్యప్ప, సంగనకల్లు చన్ననగౌడ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

సదస్సు ప్రారంభించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

ఓ ప్రదర్శన విభాగంలో వేర్వేరు సంస్థల స్టాళ్లు

హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు

ప్రవేశ ద్వారం వద్ద స్వాగత ఫలకాలు

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూకుడు

గేమర్లను ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేసిన బొమ్మ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శాస్త్ర, సాంకేతిక రంగాల ప్రగతి పతాకగా వర్ణించే బెంగళూరు టెక్ సదస్సు స్థానిక ప్యాలెస్ మైదానంలో ప్రారంభమైన వేళ.. నిపుణులు, ప్రముఖుల సందడి మొదలైంది. నగర శివారు మాదావర లోని బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శన కేంద్రం.. ఈ సదస్సుకు వేదికగా ఎంచుకోగా.. ఆ చుట్టుపక్కల గట్టి భద్రత చర్యలు చేపట్టారు. వివిధ దేశాల ప్రతినిధులు, ఐటీ, బీటీ రంగాలకు చెందిన ప్రముఖులు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ప్రియాంక్ ఖర్గే, ఎంబీ పాటిల్, కియోనిక్స్ అధ్యక్షుడు శరత్ బచ్చేగౌడ, ఐటీ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులను ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. మూడు ప్రధాన హాళ్లలో వెయ్యికి పైగా సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. మధ్యాహ్నం నుంచి స్టాళ్లను వీక్షించేందుకు రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు తరలి వచ్చారు. గురువారం రాత్రి ఏడు గంటల వరకు సదస్సులు, సమావేశాలు కొనసాగిస్తారు.

సిద్ధరామయ్యకు స్మరణిక అందిస్తున్న మంత్రి ప్రియాంక్

ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

తెలుగు విజ్ఞానసమితి దొడ్డమనసు

పాఠశాల దత్తతకు శ్రీకారం

బెంగళూరు (శివాజీనగర) : శివాజీనగర బస్టాండ్ పరిధి ఓపీఎస్ రోడ్డులోని ప్రభుత్వ తెలుగు పాఠశాలను తెలుగు విజ్ఞాన సమితి దత్తత తీసుకుంది. ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ఇప్పటికే రూ.16 లక్షలు ఖర్చు చేయగా, మరిన్ని సేవల కోసం చర్యలు చేపట్టామని సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ రాజు ప్రకటించారు. బడిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వార్షిక బస్సు పాసుకు పూర్తి నిధులు అందించేందుకు సమితి కార్యవర్గ సభ్యుడు డి.గణేశ్ శంకర్ ముందుకు వచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, బోధన సిబ్బంది నియామకాల కోసం విద్యాశాఖ మంత్రి మధు బంగారప్పతో త్వరలో చర్చలు జరుపుతామని చెప్పారు. గతంలో బెంగళూరు జిల్లాలో 130కు పైగా తెలుగు విద్యాసంస్థలు ఉండగా, వాటిలో 65 వేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేసేవారు. ప్రస్తుతం 13 పాఠశాలల్లో ఆరు వేల మంది

బస్‌పాస్‌కు నిధులు అందుకున్న విద్యార్థులతో సమితి ప్రతినిధులు

మాత్రమే చదువుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతిలో 90 శాతం కన్నా ఎక్కువ మార్కులు సాధించే ప్రతిభావంతులకు తలా రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామని సమితి కోశాధికారి సీఏ వరదరాజు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్సూర్, సమితి కార్యవర్గ సభ్యుడు వెంకటేశులు, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసులు, శ్యామల, జమున, లత, చంద్రకళ, బి.మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కుటుంబానికి సహకారం

మంత్రి జమీర్ వెల్లడి

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : మదీనా సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కన్నడిగుడు అబ్దుల్ గని శిరహట్టి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని వక్ఫ్ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. హుబ్బళ్లికి చెందిన గని కుటుంబ సభ్యులు ఉమర్ సాబ్, మౌలా అలి, మైనుద్దీన్ మఖందర్ తదితరులు మంత్రితో మంగళవారం బెంగళూరులో సమావేశమై మాట్లాడారు. బెంగళూరు నుంచి మదీనాకు వెళ్లేందుకు వీసా, విమానం టికెట్లు, అక్కడ ఉండేందుకు హోటల్, ఇతర సదుపాయాలు, అంత్యక్రియల అనంతరం ఉమ్రా యాత్ర నిర్వహించి వెనక్కు వచ్చేందుకు, ఇతర దారి ఖర్చులకు తన సొంత నిధి నుంచి నగదు అందించారు. వారికి కావలసిన సదుపాయాలను కల్పించా

మృతుని తరపు బంధువులతో మాట్లాడుతున్న జమీర్ అహ్మద్‌ఖాన్

లని హజ్ సమితి కార్యనిర్వహణ అధికారి సర్ఫరాజ్‌ఖాన్‌కు సూచించారు. హుబ్బళ్లి నుంచి వారు ముగ్గురూ తమ పాస్ పోర్టులతో రావడంతో, నేరుగా వారిని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసువెళ్లి, మదీనాకు వెళ్లేందుకు వీడ్కోలు పలికామని వక్ఫ్ శాఖ అధికారులు తెలిపారు.

ప్రధానికి బాలుడి లేఖ

గదగ, న్యూస్‌టుడే : బేటగేరి పట్టణంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మురుగు నీరు రహదారులపైనే ప్రవహిస్తోంది. నగర సభ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఎనిమిదో తరగతి విద్యార్థి సాయిరామ్ తన ఆవేదనంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఓ లేఖ ద్వారా వివరించాడు. తన ఇల్లు, బడి వీధుల్లో నడవాలంటే దుర్గంధాన్ని తట్టుకోలేకపోతున్నామని ఆ లేఖలో పేర్కొన్నాడు. బురద నిండిన రహదారిలో పలు సార్లు తాను జారి పడ్డానని కూడా ఆవేదన వ్యక్తం చేశాడు.

తుమకూరుకు మెట్రో ఏలనో?

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : తుమకూరు వరకు మెట్రో రైలు ప్రాజెక్టును విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ చేసిన ప్రతిపాదనను బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య తప్పుబట్టారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసేందుకు చర్యలు చేపట్టిన బీఎంఆర్‌సీఎల్ విధానాన్నీ తూర్పారబట్టారు. నగర పరిధిలో ఆయా మార్గాలను విస్తరించేందుకు సమయం తీసుకుంటున్న మెట్రో.. ఇప్పుడు అత్యవసరంగా తుమకూరు వరకు మార్గాన్ని విస్తరించవలసిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు.

'స్నేక్ శ్యామ్'కు తప్పిన ప్రమాదం

మైసూరు, న్యూస్‌టుడే : ఒక ఇంటి ఆవరణలోకి వచ్చిన నాగు పామును పట్టుకునేందుకు వచ్చిన మాజీ కార్పొరేటర్ 'స్నేక్ శ్యామ్' త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇప్పటి వరకు వందలాది పాములను రక్షించి, స్థానిక అడవిలో ఆయన విడిచి పెట్టారు. సోమవారం సాయంత్రం ఓ చెట్టుపైకి ఎక్కిన నాగు పాము ఆయనపైకి దూకడంతో చివరి క్షణంలో పక్కకు తప్పుకొని, కాటు నుంచి తప్పించుకున్నారు. మరో ప్రయత్నంలో ఆ పామును పట్టుకుని అడవిలో విడిచి పెట్టి వచ్చారు.

గోమాతపై పులి పంజా

మైసూరు : సరగూరు చుట్టుపక్కల పులి దాడులు కొనసాగుతున్నాయి. బెణ్ణగెరె వద్ద కొందరు గోపాలకులు సోమవారం తమ ఆవుల్ని మేపుకుంటున్న సమయంలో హఠాత్తుగా వచ్చిన ఒక పులి ఆవుపై దాడి చేసి చంపి, కొంత దూరం ఈడ్చుకువెళ్లింది. పక్కనే ఉన్న రైతు జయప్ప నిర్ఘాంత పోయి కేకలు వేయగా, సమీపంలో ఉన్న గోపాలకులు, రైతులు అక్కడకు వచ్చేలోగా పులి పరారైంది. వారి ఫిర్యాదుతో పులి కోసం అటవీశాఖ సిబ్బంది అదనంగా బోనులు ఏర్పాటు చేశారు.

తిమరోడికి హైకోర్టులో ఊరట

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : సహ కార్యకర్త మహేశ్ శెట్టి తిమరోడిని దక్షిణ కన్నడ జిల్లా నుంచి సరిహద్దు బహిష్కరణ శిక్షను విధిస్తూ పుత్తూరు తహసీల్దారు ఇచ్చిన ఆదేశాలను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. గత సెప్టెంబరు 18న తహసీల్దారు స్టెల్లా వర్గీస్ ఇచ్చిన ఆదేశాలు ఇప్పటి వరకు స్టే కొనసాగుతూ వచ్చింది. తాను జిల్లాలో ఉన్నప్పటికీ.. ఎటువంటి అహితకర ఘటనలు చోటు చేసుకోలేదని, తాను ఎవరినీ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయలేదని తిమరోడి పేర్కొన్నారు. ఆయన తరపు న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకుని తహసీల్దారు ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ సూరజ్ గోవిందరాజు కొట్టివేశారు.

ఎక్స్ కార్ప్.. కొత్త అప్పీలు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : ఆన్‌లైన్ ఖాతాల్లో సమాచారంపై నిర్బంధాన్ని విధించేందుకు సహయోగ పోర్టల్ ఏర్పాటుకు ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ ఎక్స్ కార్ప్ మరోసారి ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకుంది. ఖాతాదారులపై నిర్బంధం, సామాజిక మాధ్యమాలను నిర్బంధించేందుకే సహయోగ పోర్టల్‌ను కేంద్రం ప్రారంభించడం తమ హక్కులను హరించడమేనని ఎక్స్ కార్ప్ సంస్థ తమ అర్జీలో పేర్కొంది. కేంద్ర న్యాయ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, హోం వ్యవహారాలు, ఆర్థిక, రక్షణ, రైల్వే, భారీ పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శులను ప్రతివాదులుగా చేస్తూ అప్పీలుకు వెళ్లింది. ఇదే వారం ఈ అర్జీపై విచారణ ఉంటుందని సంస్థ తరపు న్యాయవాదులు తెలిపారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	95
క్యారెట్-	100
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	85
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	65
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	135
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	65
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపురం)

ఉపాధ్యాయుడిపై వేటు

ఉడుపి, న్యూస్‌టుడే : మొరార్జీ దేశాయి పాఠశాలలో ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న మదరస్ మకాందార్ అనే ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జంధ్యం ధరించారనే ప్రశ్నలు అడగుతున్నారని, కొందరు విద్యార్థులతో ఈ విషయంలో గుంజీళ్లు తీయిస్తున్న ఆరోపణలు ఆయనపై వచ్చాయి. కలబురగికి చెందిన మదరస్‌పై స్థానికులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆయనను సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించారు.

'డెవిల్' పాట విడుదల

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో కారాగారం నుంచి బెయిలుపై బయటకు వచ్చినప్పుడు చిత్రీకరణలో పాల్గొన్న నటుడు దర్శన్ నటించిన 'డెవిల్' సినిమాలో మూడో పాటను చిత్ర నిర్మాతలు విడుదల చేశారు. ఇప్పటికే నెమ్దియాగిర్బేకు, ఒందే ఒందు సల.. పాటలకు చక్కని స్పందన లభించింది. ఇప్పుడు 'హో అలో హూ మొరె' పాటను విడుదల చేశారు. ఈ చిత్రానికి అజనీశ్ లోకనాథ్ సంగీతాన్ని అందించారు. 'డెవిల్' సినిమా డిసెంబరు 12న విడుదల చేస్తామని శ్రీ జైమాత కంబైన్స్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

'రామేశ్వరం'లో అఖిలేష్

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : బిహారులో ఓటమి పాలైన అనంతరం సమాజవాది పార్టీకి నేతృత్వం వహిస్తున్న అఖిలేశ్ యాదవ్ నిరాశకు గురి కాలేదు. బెంగళూరుకు వచ్చి రామేశ్వరం కెఫేలో తనకు ఇష్టమైన మసాలా దోశ రుచి చూశారు. మైసూరులో విద్యాభ్యాసం చేసిన అఖిలేశ్‌కు కర్ణాటకలో పలువురు స్నేహితులు ఉన్నారు. నగరంలోని ఒక బంధువు ఇంటికి వచ్చిన ఆయన.. మంగళవారం కెఫేకు వెళ్లి దోసె రుచి చూసి. . గత స్మృతులు అన్నీ జ్ఞాపకానికి వచ్చాయని ట్వీట్ చేశారు.

దోశ ఆరగిస్తున్న అఖిలేశ్

కొండముచ్చు దాడిలో నలుగురికి గాయాలు

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని జవుకు గ్రామంలో కొండముచ్చు దాడిలో రెండు రోజుల్లో నలుగురు గాయపడ్డారు. సోమవారం హెచ్.ఎం.సురేశ్, పాలాక్షిలపై దాడి చేసి గాయపరిచింది. ఇద్దరి చేతులకు బలమైన గాయాలయ్యాయి. మంగళవారం నెల్లుడి తిమ్మయ్య ఎడమకాలిపై కరిచింది. ఎ.లోకేశ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం ఆపి ఇంట్లోకి వెళుతుండగా దాడి చేసి చేతిని కొరికింది. గాయపడిన వారు మెట్రి, శ్రీరామరంగాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో తొలుత చికిత్స తీసుకుని మెరుగైన వైద్యం కోసం బళ్లారి వెళ్లారు. కొండముచ్చు కారణంగా ఇంట్లోంచి బయటకు రావాలంటేనే భయంగా ఉంది. అధికారులు దాన్ని బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విపణిలోకి పల్చని గడియారాలు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : చేతి గడియారాల తయారీలో అగ్రగామిగా కొనసాగుతున్న టైటాన్, తన ఎడ్జ్ అల్ట్రా స్లిమ్ విభాగంలో 3.3 మి.మీ. పల్చని చేతి గడియారాన్ని బెంగళూరు విపణిలోకి విడుదల చేసింది. జేపీనగరలోని ది స్పేస్‌లో జిమ్సన్ వాచెస్‌తో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాహుల్ పాండే, జైకిషన్ మెహతా దీన్ని విడుదల చేసి, పనితీరును వివరించారు. తక్కువ బరువు, పల్చని, సమకాలీన శ్రేణి చేతి గడియారాలకు యువత నుంచి చక్కని స్పందన లభిస్తోందని రాహుల్ పాండే తెలిపారు.

నూతన శ్రేణి గడియారాలను ప్రదర్శిస్తున్న సంస్థ ప్రతినిధులు

చలితో కాస్తా జాగ్రత్త

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మరో నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా చలి గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బీదర్, విజయపుర, బాగలకోటె, బెళగావి, కలబురగి జిల్లాల్లో ఉదయ వేళ నాలుగు నుంచి ఆరు డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించారు. బాలింతలు, నవజాత శిశువులు, వృద్ధులు మరికొద్ది రోజులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరించారు. ఇప్పటికే తుమకూరు జిల్లాను చలిపులి పట్టి పీడిస్తోందని జనం ఆందోళన చెందుతున్నారు.

EENADU Classifieds
PROFESSIONAL SERVICES
VAASTU
ఇల్లు, ఆఫీస్, స్థలాలకు వాస్తు సరిచేసుకోండి. వాస్తు సిద్ధాంతి డా॥ కుంచాల హనుమంతరావు గారు బెంగుళూరులో 4 రోజులు మాత్రమే ఉంటారు. సం॥ 9246624248

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఈదారికొస్తే.. విమానం ఎక్కినట్లే!

◆ చెన్నైకి శరవేగంగా ప్రయాణం ◆ పూర్తికావచ్చిన ఎక్స్‌ప్రెస్ మార్గం

హొసకోట శివార్లలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కూడలి.. వంతెనల విన్యాసం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు- చెన్నై గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి సిద్ధమైంది. కేంద్ర భూఉపరితల రవాణాశాఖ ఈ మార్గాన్ని సిద్ధం చేసింది. నాలుగు వరుసల మార్గ నిర్మాణానికి రూ.17,930 కోట్లు వ్యయం చేశారు. ఈఏడాది ఆఖరికంతా దీని సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తాయని జాతీయ రహదారి ప్రాధికార అధికారులు వెల్లడించారు. మొత్తం 262 కిలోమీటర్ల ఈ రహదారి కర్ణాటక సరిహద్దు వరకు 110 కిలోమీటర్ల దూరం విస్తరించింది. మిగతా మార్గమంతా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా సాగుతుంది. ఈ మహా రహదారిపై వాహనాన్ని దూకిస్తే.. బెంగళూరు నుంచి చెన్నైకు కేవలం ఐదు గంటల్లో చేరుకోవచ్చట! ఒకమాటలో చెప్పాలంటే బెంగళూరు విమానాశ్రయం చేరుకుని.. అక్కడి నుంచి చెన్నైలోని మీనంబాకం విమానాశ్రయంలో వాలి.. ఆ నగరంలో అడుగుపెట్టే ప్రయాణ సమయంతో ఇది సమానం కాబోతోంది. ఈ దారి పొడవునా ఇరువైపులా పారిశ్రామికవాడలను అభివృద్ధి చేస్తారు. కొత్త లేఅవుట్‌లతో పాటు నందగుడివద్ద ఐదువేల ఎకరాల విస్తీర్ణంలో కర్ణాటక గృహ నిర్మాణ మండలి ప్రత్యేక నివాస నగరాన్ని నిర్మిస్తారు. ముళబాగిలు సమీప కెంపబుర చెరువు పడవ విహార కేంద్రంగా మార్చేస్తున్నారు. నాలుగు మార్గాల జాతీయ రహదారి అభివృద్ధి కావడంతో చుట్టు పక్కల భూములకు రెక్కలు వచ్చాయి. ఇప్పటికే బెంగళూరు గ్రామీణ జిల్లాలో నరసాపుర పారిశ్రామిక వాడ, కోలారు, ముళబాగిలు పారిశ్రామిక వాడలు విస్తరించిన విషయం తెలిసిందే. రవాణా వ్యవస్థ ఫలితంగా పారిశ్రామికవాడలు అభి

కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా వలయ వర్తుల మార్గం

వృద్ధి చెందే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. హొసకోట శివార్ల నుంచి దేవనహళ్లి, హోసూరు, తుమకూరు తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఉపకరించే వలయ వర్తుల మార్గాలనను తీర్చిదిద్దారు. ఎలాంటి పరిస్థితిలోనూ వాహనాలు ఎక్కడా ఆగకుండా రయ్యిన.. దూసుకెళ్లడం ఇక్కడ ప్రత్యేకం. కోలారు, చిత్తూరు ప్రాంతాల వారు బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోవడం ఇకపై ఏమంత శ్రమ కాబోదు. ప్రయాణికుల సమయం, ఇంధనం ఆదా అవుతుందని అధికారులు తెలిపారు.



బెంగళూరు- చెన్నై గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి.. సవ్య ప్రయాణానికి మహా వేదిక

కాగితపు సంచులే మేలు

తరగతి గదుల్లో కాగితం సంచులను తయారు చేస్తున్న విద్యార్థులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : రాజధాని నగరం బసవనగుడిలో కొనసాగుతున్న వేరుసెనగ జాతరలో వినియోగించడానికి వీలుగా కాగితపు సంచులను విద్యార్థులు సిద్ధం చేస్తున్నారు. రోటరీ క్లబ్ సహకారంతో స్థానిక దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఐదు వేల కాగితం సంచులు ఇప్పటికే సమకూర్చారు. ఈ జాతరలో ప్లాస్టిక్ వాడరాదని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) ఇదివరకే తీర్మానించింది. ప్లాస్టిక్ సంచులు పూర్తిగా నిషేధించారు. తయారు చేసిన సంచులను వరుసగా.. ఎప్పటికప్పుడు వ్యాపారులకు అందిస్తున్నారు. పర్యావరణ సంరక్షణలో విద్యార్థుల పాత్రను పదుగురు మెచ్చుకున్నారు. నాలుగు రోజుల పాటు కొనసాగే జాతరకు వచ్చేవారు వేరుసెనగ కాయలను కొనుగోలు చేయడం ఆనవాయితీ. ఆ సరకును తీసుకెళ్లడానికి కాగితపు సంచులు ఎంతో అనువుగా ఉన్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాలువలో కరిరాజు విలవిల

మండ్య, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రం కావేరి నది ఆధారంగా మళవల్లి తాలూకా శివనసముద్ర సమీపంలో విద్యుత్తు ఉత్పాదనకు నీరు సరఫరా చేయడానికి ఉపకరించే కాలువలో పడిన ఏనుగును 48 గంటల అనంతరం బయటకు తీశారు. శనివారం రాత్రి నీటిని తాగేందుకు వచ్చి.. 50 అడుగుల లోతు కాలువలోకి దిగింది. మళ్లీ పైకి రాలేక ఇబ్బంది పడుతున్న ఏనుగును ఆదివారం గుర్తించారు. విద్యుత్తు ఉత్పాదన కేంద్రం ప్రతినిధులు, అటవీశాఖ సిబ్బంది సోమవారం ఉదయం నుంచి ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముందుగా కాలువలోకి ఎక్కువ నీరు రాకుండా గేట్లను మూసేశారు. ఏనుగుకు కావలసిన ఆహారాన్ని అందిస్తూ వచ్చారు. క్రేన్‌లో ఎక్కేందుకు ఏనుగు భయపడుతుండగా, దానికి స్పృహ తప్పించారు. రెండు క్రేన్ల సహాయంతో మంగళవారం మధ్యాహ్నానికి దాన్ని పైకి తీసుకువచ్చామని మండ్య జిల్లాధికారి కుమార్ తెలిపారు. ఈ 12 ఏళ్ల మగ ఏనుగుకు ప్రథమ చికిత్స అందించి, పూర్తిగా కోలుకున్న అనంతరం అడవిలో విడిచి పెడతామని అటవీ శాఖాధికారి (డీసీఎఫ్) ప్రభు చెప్పారు.

కాలువలో చిక్కిని ఏనుగును.. క్రేను సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

రచయిత మునాఫ్‌కు సత్కారం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : కవి, రచయిత, హెబ్బాళ నియోజకవర్గం కర్ణాటక జ్ఞాన విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఎండీ మునాఫ్‌ను బుద్ధ బసవ గాంధీ సాంస్కృతిక ట్రస్టు ఘనంగా సత్కరించింది. జ్ఞాన విజ్ఞాన సమితి తరపున నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో సైన్సు పట్ల అభిరుచి పెంచేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు, కార్యశాలలు, జాగృతిని దృష్టిలో ఉంచుకుని ఆయనను మంగళవారం సత్కరించారు. సంఘం అధ్యక్షుడు రామలింగేశ్వర, సమ్మేళన అధ్యక్షురాలు పుష్ప బసవరాజ బాణకర్ తదితరులు మునాఫ్‌ను సత్కరించిన వారిలో ఉన్నారు.

మునాఫ్‌ను సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

అమ్మో చిరుతపులి

కొండ దిగుతున్న చిరుతపులి

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని మార్కెట్ యార్డు వెనుక మంజునాథ లేఅవుట్లో అకస్మాత్తుగా చిరుత ప్రత్యక్షమై ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. స్థానికులు లైటింగ్ నాగరాజు, విజయ్, హరీశ్, టైలర్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం పచ్చిక బయలులో మేకలు మేపుతుండగా పావగడ కొండపై నుంచి చిరుత దిగివచ్చింది. కాపరులు సమీపంలోని హరీశ్, నాగరాజులకు సమాచారం ఇవ్వగా హరీశ్ తన చరవాణిలో పులి తిరుగుతున్న సన్నివేశాలను చిత్రీకరించారు. స్థానికులు అందరూ కట్టెలు చేతపట్టి కేకలు వేస్తూ చిరుతను కొండపైకి తరిమేశారు.

సంచార నియమాలపై జనజాగృతి

ట్రాఫిక్ సిబ్బందితో చర్చిస్తున్న ఎమ్మెల్యే సురేష్‌కుమార్

బెంగళూరు (కెంగేరి) : రాజాజీనగర్ నియోజకవర్గం భాష్యం సర్కిల్‌లో ఎమ్మెల్యే ఎస్.సురేష్‌కుమార్ సంచార నియమాల గురించి జాగృతి కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసుగా మారారు. మంగళవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మహమ్మద్‌అలీ, సబ్‌ఇన్‌స్పెక్టర్ సంజయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు అక్రం పాషా, రాఘవేంద్ర, లోకేష్‌తో కలిసి ఎమ్మెల్యే జాగృతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భాజపా నాయకులు సుందర్శన్, గరిశ్‌గౌడ, కామధేనుసురేష్, ఉమేశ్, సంజయ్‌కుమార్, అమిత్‌జైన్, మోహన్‌రాజ్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు కబుర్లు

అయ్యప్పస్వామి వ్రతపూజలు ప్రారంభం

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు పారిశ్రామికవాడ మూకండపల్లిలోని మునీశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో అయ్యప్పస్వామి వ్రత పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పి.సుబ్రహ్మణ్యం శెట్టి నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి సదుపాయాలను ఏర్పాటు చేశారు. 48 రోజులు అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతాయి. ఆలయానికి సంబంధించిన స్థలంలో అయ్యప్పస్వామి భక్తులు, మూకండపల్లి యువజన సంఘం సహకారంతో శుభ్రత, అభివృద్ధి పనులు చేపట్టారు.

విధులు బహిష్కరించిన ఉద్యోగులు

మూతపడిన తాలూకా కార్యాలయం

డెంకణీకోట న్యూస్ టుడే : పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులు విధులను బహిష్కరించారు. కొత్త పింఛన్ పథకాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. డెంకణీకోట తాలూకా కార్యాలయం తలుపులు మూతపడ్డాయి. కెలమంగలం బీడీఓ కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఉద్యోగుల ఆందోళనతో ప్రజలు ఇబ్బంది గురయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ధర్నాలో వివిధ సంఘాల నాయకులు

డెంకణీకోట న్యూస్ టుడే : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంగళవారం డెంకణీకోటలో జాక్టో, జియో సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఆయా సంఘాల అధ్యక్షులు మురుగేశన్, తిమ్మప్ప నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సంఘం రాష్ట్ర ఆడిటర్ నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాక్టో నాయకులు తిమ్మప్ప, మంజునాథ్, మోహన్, జాన్, శేఖర్, జియో నాయకులు జీవ, శాంత, జార్జి, సత్య, కదిరవన్, స్టాలిన్, శ్రీధరన్, శీల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిజా శంకరుల కల్యాణం

గౌరీ శంకరుల కల్యాణ విగ్రహాలు

హనుమంత నగర్‌లోని బలమురి గణపతి దేవాలయంలో గిరిజా శంకరులు కల్యాణం వైభోగంగా జరిగింది. ఉదయం శంకరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాల అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం మహా మంగళ హారతులిచ్చారు. పవిత్ర కార్తిక దీపోత్సవాలు కనువిందు చేశాయి. మరో మూడు రోజుల్లో మార్గశిరమాసం ప్రవేశించనుంది. మాసానాం మార్గశిరోహం అని భగవద్గీతలో గీతాచార్యుడు సెలవిచ్చారు. ఇకపై వైష్ణవాలయాలు సందడి చేస్తాయి. - **న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)**

తన్వీర్ అహమ్మద్‌కు ఘనస్వాగతం

తన్వీర్‌ను స్వాగతిస్తున్న హర్షేంద్రకుమార్, తదితరులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : లక్షదీపోత్సవాల సందర్భంగా మంజునాథ దర్శనానికి పాదయాత్ర చేస్తూ ధర్మస్థలకు చేరిన ప్రముఖ కాలమిస్టు తన్వీర్ అహమ్మద్ ఉల్లాకు ధర్మాధికారి సోదరుడు హర్షేంద్రకుమార్ ఎదురేగి స్వాగతం పలికారు. అభిమానులు ఆయనను పూలమాలలతో ముంచెత్తారు. మంజునాధుడిని దర్శించుకుని ధర్మాధికారి వీరేంద్రహెగ్గడేను కలిసి పాదయాత్ర అనుభవాలను పంచుకున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు

జ్యోతి వెలిగిస్తున్న మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్, జిల్లాధికారి శుభాకల్యాణ్ తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే : సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాలకు 50 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో ఈనెల 28న ఐదువేల అంగన్వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ పూర్వ ప్రాథమిక పాఠశాలలు, మరో మూడు పథకాలను ప్రారంభిస్తామని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ తెలిపారు. మంగళవారం ఐసీడీఎస్ సువర్ణ మహోత్సవం, గృహలక్ష్మీ బ్యాంక్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ 1975లో ఐసీడీఎస్ పథకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 17 వేల మంది డిగ్రీలు చేసిన టీచర్లు, 4 వేల మంది పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసినవారున్నారని, వీరందరినీ వినియోగించుకొని మొదటి దశలో 5 వేల అంగన్వాడీల్లో ఈనెల 28న ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. మహిళలపై దౌర్జన్యాలు, ఆడపిల్లలను అవహేళనగా మాట్లాడడం వంటి వాటిని నియంత్రించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచడానికి 'అక్కపడెను' రూపొందించినట్లు తెలిపారు. ఎన్‌సీసీ, గృహరక్ష సిబ్బంది దేవాలయాలు, ఉద్యానవనాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బాలికల వసతి గృహాల వద్ద గస్తీ తిరుగుతారన్నారు. నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందడానికి మహిళల పాత్ర అత్యంత కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్య పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు పాయసం తినిపించడం, దివ్యాంగులకు బ్రెయిలీ లిపి పరికరాల కిట్లను మంత్రి హెబ్బాళ్కర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లాధికారి శుభాకల్యాణ్, గ్యారంటీ పథకాల అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా శిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సిద్ధరామణ్ణ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మహిళలు

'విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందాలి'

విద్యార్థుల మధ్య స్పీకర్ ఖాదర్, మునిరాజు, ప్రముఖులు

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : భారత దేశం ప్రపంచంలోనే బలమైన దేశంగా మారాలనేది అందరి ఆకాంక్ష అని, విద్యార్థులు, యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందాలని స్పీకర్ యు.టి.ఖాదర్ సూచించారు. మంగళవారం చిక్కబానువారలోని ఆర్.ఆర్.కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని స్పీకర్ ప్రారంభించి మాట్లాడారు. నేటి విద్యార్థులే దేశ సంపద అని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని కలలను నిజం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మునిరాజు మాట్లాడుతూ విద్యార్థుల విజయాలను చూసి తల్లిదండ్రులు గర్వపడే విధంగా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థుల విజయాలు దేశ నిర్మాణంలో ఉపయోగపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుడు వై.రాజారెడ్డి, కార్యదర్శి హెచ్.ఆర్.కిరణ్, డైరెక్టర్లు హెచ్.ఆర్.అరుణ్, సిద్ధార్థ, సుప్రత, ప్రిన్సిపల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేఎస్‌సీఏ ఎన్నికలు వాయిదా

బెంగళూరు (క్రీడలు) న్యూస్‌టుడే : కర్ణాటక క్రికెట్ సంఘం-కేఎస్‌సీఏ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈనెల 30న జరగాల్సిన ఈ ఎన్నికలు హఠాత్తుగా వాయిదా పడడంతో అధ్యక్ష స్థానానికి నామపత్రాలను అందించిన మాజీ అంతర్జాతీయ క్రికెటర్ వెంకటేశ్‌ప్రసాద్ నిరాశ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడుతూ దాదాపు నెలరోజుల పాటు ఈ ఎన్నికలు వాయిదా వేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. చిన్నస్వామి క్రీడాప్రాంగణానికి పూర్వ వైభవం తీసుకురావడానికి తమ బృందం కంకణం కట్టుకొని ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎందుకు ఎన్నికలు వాయిదా వేశారో అర్థం కాలేదన్నారు.

సమాజ సేవలకు సంపూర్ణ సహకారం

సన్మాన గ్రహీతలతో శోభాకరంద్లాజె, మునిరాజు తదితరులు

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : పేద విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇచ్చి వారు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేసిన షన్‌షైన్ కరాటే శిక్షణ కేంద్రం వ్యవస్థాపకులు, శిక్షకుడు రాఘవేంద్రప్రతాప్ అభినందనీయులని కేంద్రమంత్రి శోభాకరంద్లాజె పేర్కొన్నారు. పార్లమెంట్ క్రీడోత్సవ్‌లో భాగంగా దాసరహళ్లి నియోజకవర్గం ఎంఈఐ క్రీడామైదానంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన ప్రముఖులను మంత్రి సత్కరించారు. కరాటే విభాగం కింద రాఘవేంద్రప్రతాప్ సింగ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో పేదలు, బలహీనవర్గాల ప్రజలకు సేవలందిస్తున్న వారికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మునిరాజు, నాయకులు సోమశేఖర్, మంజునాథ్‌గౌడ, హరీశ్, సుజాతా మునిరాజు, సమాజ సేవకులు పాల్గొన్నారు.

కడలేకాయ పరిషలో జనసందోహం

దుకాణాల వద్ద వినియోగదారులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : బసవనగుడిలో చారిత్రక వేరుసెనగ జాతర జరిగే ప్రాంతమంతా జనసాగరంలా కనిపిస్తోంది. దుకాణాల వద్ద యాత్రికులు కొనుగోళ్లతో కిటకిటలాడుతున్నారు. వేరుసెనగ దర అధికంగా ఉన్నా కొనుగోలు చేస్తున్నారు. పాదచారిమార్గాలపై డేరాలు వేసిన వరుస దుకాణాల వద్ద వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. తెచ్చిన సరుకంతా అమ్ముడు పోవటంతో మళ్లీ తెప్పించుకుంటున్నారు. గృహాలంకార వస్తువులను మహిళలు ఉత్సాహంగా కొంటున్నారు. మెహందీ డిజైన్లు అరచేతుల్లో వేయించుకొని మురిసిపోతున్నారు. రంగుల రాట్నాల వద్ద బాలల క్యూ కనిపిస్తోంది. విద్యుద్దీపాల వెలుగుల్లో యాత్రికుల వదనాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

అనుమానాస్పదంగా మహిళ మృతి

బెంగళూరు (యశ్వంతపుర): ఉరేసుకుని స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని మంగళవారం ఇక్కడి రాజగోపాలనగర పోలీసులు గుర్తించారు. మృతురాలిని ఎడ్విన్(28)గా గుర్తించారు. భర్త ఆమెను హత్య చేశారని బాధితురాలు కుటుంబ సభ్యులు ఆరోపించారు. నగదు కోసం తన కుమార్తెను భర్త హత్య చేసి నాటకం ఆడుతున్నాడని తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరు దొంగల అరెస్టు

ముళబాగిలు : ఇద్దరు ద్విచక్రవాహనాల దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 26 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గల్‌పేట పోలీసులు తెలిపారు. నగరంలోని అజాద్ నగర్‌కు చెందిన మెకానిక్ జునైద్‌పాష, బీటీ కాలనీకి చెందిన మామాజాన్‌లను బేతమంగల జిగ్‌జాగ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసుల పనితీరును ఎస్పీ బి.నిఖిల్ అభినందించారు.

ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

చింతామణి, న్యూస్‌టుడే : తాలూకాలోని దొడ్డగంజూరు ప్రభుత్వం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓబయ్య..పదో తరగతి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవరించారని ఆరోపిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. విషయం తెలిసిన బీఈవో ఉమాదేవి వచ్చి వివరాలు తెలుసుకొని ఉన్నతాధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతానికి సదరు ప్రధానోపాధ్యాయుడిని నెల రోజులు సెలవులో పంపిస్తామని హామీ ఇచ్చారు.

మాదకద్రవ్యాల స్వాధీనం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నిషేధిత మాదక ద్రవ్యాలు ఎండీఎంఏ క్రిస్టల్, గంజాయి తదితర వాటిని విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను నగర పోలీసులు అరెస్టు చేశారు. వాటి విలువ రూ.9.45 లక్షలు ఉంటుందని తెలిపారు. బాగలూరు నివాసి యాసిన్ (25)ను ఆర్‌ఎంసీ యార్డు పోలీసులు అరెస్టు చేయగా, తిమ్మయ్యరోడ్డు నివాసి మహ్మద్ అజం(24)ను జాలహళ్లి పోలీసులు అరెస్టు చేశారు.

విద్యుదాఘాతంతో కారు దగ్ధం

ముళబాగిలు : తాలూకాలోని కరవిరెడ్డిహళ్లి గ్రామం వద్ద విద్యుదాఘాతంతో ఒక కారు ఇంజిన్‌లో మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. కారు యజమాని వెంకటేశప్ప పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా కారులో మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా గాయాలయ్యాయి. వెంకటేశప్పను ఆసుపత్రికి తరలించారు. కారులో ఆయన ఒక్కరే ఉన్నాడని నంగలి పోలీసులు తెలిపారు.

బాలికల ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా యషికా

ఫుట్‌బాల్ క్రీడాకారులతో కుమార్, అస్లాంఖాన్, చిత్రా

బెంగళూరు (క్రీడలు) : ఆంధ్రప్రదేశ్ అనంతపురంలో నేటి నుంచి డిసెంబరు ఏడు దాకా జరుగనున్న డాక్టర్ తలిమెరెన్ బాలికల జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు కర్ణాటక జట్టును ప్రకటించారు. కిక్ స్టార్ట్ ఫుట్‌బాల్ జట్టుకు చెందిన యషిక హరిబాబు కెప్టెన్‌గా ఎంపికైంది. జట్టు వివరాలు : ప్రయుక్త ఆర్యా, ఉరాధీమిరీ, టి.చరిష్మా లూయిస్, రచన, పూజితారెడ్డి, వి.ఎన్.సించన, దివ్యామూర్తి, నిధాషిక్, అనన్యగుప్తా, అవికాదేశ్‌ముఖ్, దివ్యాశ్రీరామ్, చార్వీఆనంద్, ఎం.వైష్ణవీ, సంజనానాయర్, మమత, సమీరాసుజిత్, సి.తంగా, సుజనా క్షత్రియాన్ ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రధాన కోచ్‌గా ఎస్.శాంతి, సహాయ కోచ్‌గా రోహిత్‌కుమార్, టీమ్ మేనేజర్‌గా సాయి దివ్యాశ్రీ, ఫిజియోథెరపిస్ట్‌గా గుత్తిచాందినీ వ్యవహరిస్తారు. జట్టు సభ్యులను కర్ణాటక ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు బి.కమల్, కార్యదర్శి ఎం.కుమార్, సంఘం అధికారులు అస్లాంఖాన్, శరవణన్, కోశాధికారి బి.కె.మునిరాజు, హనీఫ్‌మహమ్మద్, మాజీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి చిత్రా అభినందించారు. ఈ పోటీలో పాల్గొంటున్న ఇతర క్రీడాకారిణీల జాబితాను ప్రకటించారు.

యువత ఉద్యోగాల సృష్టిపై దృష్టి పెట్టాలి

జ్యోతి వెలిగిస్తున్న దివ్యా, చందన్‌కుమార్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : నేటి యువత ఉద్యోగాల వేటలో పడకుండా సొంతంగా పరిశ్రమలు స్థాపించి పలువురికి ఉపాధి చూపాలని సీఈవో దివ్యా రంగేనహళ్లి పిలుపునిచ్చారు. మంగళవారం రాజాజీనగరలోని కేఎల్‌ఈ సొసైటీ ఎస్.నిజలింగప్ప కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, శిక్షణ, వినోదం పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి సాధన వెనుక ఒక పోరాటం ఉంటుందని, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే జీవితంలో అనుకున్నది సాధించవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చక్కని భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. సాంకేతికత, వినూత్న ఆవిష్కరణలను అర్థం చేసుకుంటే వ్యాపార రంగంలో రాణిస్తారన్నారు. కళాశాల విద్యార్థినులు మహిళా సాధకులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయక పోలీసు కమిషనర్ చందన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్, బోధన, బోధనేతర సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

దాడులు, దౌర్జన్యాలను నియంత్రించాలి

స్వతంత్ర ఉద్యానవనం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దేశంలో మహిళలు, దళిత పీడిత ప్రజలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మంగళవారం ఇక్కడ స్వతంత్ర ఉద్యానవనంలో సీపీఐ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆపార్టీ కార్యదర్శి సాతి సుందరేశ్ మాట్లాడుతూ దేశంలో మహిళలపై దౌర్జన్యాలు నానాటికీ పెరుగుతున్నా నియంత్రించాల్సిన చర్యలు పాలకులు చేపట్టలేదన్నారు. నిత్యం అత్యాచారాలు, గృహహింస, హత్యలు, సామూహిక దాడులకు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారితో పాటు దళిత, పీడిత వర్గాల ప్రజలపై మనువాదులుతో పాటు అగ్రవర్ణాలు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడులను నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలో బీఎంఎస్‌కు ప్రశస్తి

జ్ఞాపిక అందుకుంటున్న జట్టు సభ్యులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : నందినీ అవుట్‌లో సాన్స్‌కప్-2025 కోసం నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి మహిళల అంతర పాఠశాల, ఇంటర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో బీఎంఎస్ కళాశాల విజేతగా నిలిచింది. సాన్స్ పబ్లిక్ పాఠశాలలో మూడు రోజుల పాటు వేర్వేరు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 50 పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో సాన్స్ పబ్లిక్ పాఠశాల అధ్యక్షుడు శ్రీకంఠప్ప, డైరెక్టర్ అభిషేక్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడల్లో పాల్గొంటే శారీరక, మానసిక సామర్థ్యాలు పెంపొందుతాయని ప్రముఖులు వెల్లడించారు.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

సహకార రత్న పురస్కారాల ప్రదానం

సాధకులతో మంత్రి, ప్రజా ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : సహకార రంగంలో ఉత్తమ సేవలు అందించిన శరణు పాటిల్ (ఆర్‌పీఎంసీ డైరెక్టర్, రాయచూరు), సయ్యద్ సాబ్(రాష్ట్ర మత్స్య సహకార మండలి ప్రతినిధి, మైసూరు) సహకార రత్న పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల రాయచూరులోని వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి బోసురాజు ప్రదానం చేశారు. వీరిని ఆర్‌పీఎంసీ అధ్యక్షుడు జయపరతరావ్ పతంగె, ఉపాధ్యక్షుడు శేఖర్ పాటిల్, సభ్యులు అభినందించారు.

రుద్రమునీశ్వర మఠంలో కార్తిక దీపోత్సవం

తాలూకాలోని చికలపర్వి తుంగభద్ర నది తీరంలో ఉన్న రుద్రమునీశ్వర మఠంలో మంగళవారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సదాశివ స్వామీజీ దీపం వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్తిక మాసం, కార్తిక దీపాల ప్రాముఖ్యాన్ని ఆయన వివరించారు. చుట్టుపక్కల గ్రామాలు, క్యాంపుల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చి మఠం ఆవరణలో ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. హాజరైన భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. - న్యూస్‌టుడే, మాన్వి

పది ఫలితాలు మెరుగుపడాలి

రాయచూరు, న్యూస్‌టుడే : కల్యాణ కర్ణాటక ప్రాంతంలో పదో తరగతి ఫలితాలు శాతాన్ని పెంచేందుకు అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి రష్మి కోరారు. రాయచూరు, కొప్పళ, విజయనగరం, కలబురగి, బీదర్, బళ్లారి, ధారవాడ జిల్లాలకు చెందిన విషయ సంపన్మూలుల రాయచూరు సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఒక రోజు శిక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రష్మి మాట్లాడుతూ పరీక్షల బోర్డు మాదిరి ప్రశ్నా పత్రాలను పరిచయం చేయాలని, జనవరి, ఫిబ్రవరిలో సన్నాహక పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు తీసుకోవాలన్నారు. కలబురగి విద్యాశాఖ అదనపు కమిషనర్ రాహుల్ తుకారాం పాండే మాట్లాడుతూ బడికి రాని పిల్లలను తిరిగి పంపేలా తల్లిదండ్రులను ఒప్పించాలని కోరారు. జిల్లా పాలనాధికారి నితీష్ మాట్లాడుతూ గతేడాది కంటే అత్యధిక శాతం సాధించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. జడ్పీ సీఈఓ ఈశ్వరకుమార్, జిల్లా విద్యాశాఖ ఉప నిర్దేశకుడు బడిగేర్, తాలూకాల విద్యాశాఖ అధికారులు, 190 మంది సంపన్మూల నిపుణులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న రష్మి, తదితరులు

ధర లేక కందిపోతున్న అన్నదాతలు

రాయచూరు మార్కెట్‌లో కంది రాసులు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని వ్యవసాయ ఉత్పత్తుల విపణుల్లో (ఏపీఎంసీ) ఎరువు కంది ధాన్యానికి సీజన్ ఆరంభంలోనే ధర లేదు. కొన్ని రోజులుగా మార్కెట్లకు పంట వస్తోంది. కేంద్రం క్వింటాలుకు నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.7550. జిల్లాలోని ఏ మార్కెట్లో కూడా ఈ రేటును ఇవ్వడం లేదు. రాయచూరు ఏపీఎంసీ వెల్లడించిన అధికారిక గణాంకాల మేరకు మంగళవారం కనిష్ఠ ధర రూ. 5201, గరిష్ఠ, మాదిరి రేటు రూ. 6189 పలికింది. గరిష్ఠ ధరతో పోలిస్తే రూ.1361 తక్కువ. లింగసూగూరు, దేవదుర్గ, మాన్వి, సింధనూరులో అటు ఇటుగా ఇంతే పలుకుతోంది. వెయ్యి రూపాయలకు పైగా పతనం కావడం రైతులకు మింగుడు పడటం లేదు. ధాన్యాన్ని వెనక్కి తీసుకెళితే రవాణా ఖర్చులు అదనం. దీంతో ఇచ్చిన రేటుకే విక్రయించుకోవడం కన్పిస్తోంది. తుంగభద్ర ఎడమ కాలువ, నారాయణపుర కుడికాలువ పరిధిలో, మెట్ట ప్రాంతంలో కంది పండిస్తారు. మార్కెట్ చివరికి సీజన్ ముగుస్తుంది. నిరుడు ఆరంభంలో రూ.8 వేలకు అమ్ముకోవడం గమనార్హం. ధర ఊపందుకునేందుకు సేకరణ కేంద్రాల సంఖ్య పెంచాలని లింగసూగూరులో రైతులు తాజాగా ఆందోళనలు చేశారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు రెండు దశాబ్దాల క్రితమే కంది బేడల ఖని జాగారంగా పిలవబడే కలబురగిలో కందిబోర్డు నెలకొల్పారు. దీని వల్ల రవ్వంత ప్రయోజనం లేదని రైతు సంఘాలు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలోని కల్యాణ కర్ణాటకలోని కలబురగి, బీదర్‌లో సహా విజయపురలో అత్యధికంగా సాగు అవుతోంది.

ముంచిన అతివృష్టి

సెప్టెంబరు, అక్టోబరులో సంభవించిన అతివృష్టి కంది రైతును నిండా ముంచింది. వరి, మిరప, సెనగ కంటే అధికంగా కంది దిగుబడులను కోల్పోయారు. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా విపత్తు కారణంగా 3 నుంచి 4 క్వింటాళ్లు మాత్రమే చేతికొస్తున్నాయి. జిల్లాలో లింగసూగూరు, దేవదుర్గలో అత్యధికంగా కంది సాగు చేస్తారు. ఒక పక్క పంట హాని, మరో వైపు ధర దిగజారడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సేకరణ కేంద్రాల వల్ల ఉపయోగం లేదని రైతులు అంటున్నారు. నిబంధనల ప్రకారం ఎకరాకు నాలుగు క్వింటాళ్లు, గరిష్ఠంగా 40 క్వింటాళ్లు మాత్రమే సేకరిస్తారు. సన్న, చిన్న కారు రైతులు ఇంత కంటే ఎక్కువ పండిస్తారు. వీరంతా గత్యంతరం లేక మార్కెట్లకు తెస్తున్నారు. కేంద్రాల నుంచి సొమ్ము జమ కావటానికి కనీసం 15 రోజులు అవసరం. ఏపీఎంసీలోని వర్తకులు వెంటనే డబ్బు చెల్లిస్తున్నందున కేంద్రాలకు వెళ్లే వారు నామమాత్రమే.

21న ఆందోళన చేస్తాం

- ప్రభాకర్ పాటిల్ (రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు)

కంది రైతుల సమస్యలపై ఈనెల 21న జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తాం. కొనుగోలు కేంద్రాల్లో గంధరగోళం నెలకొంది. మాన్వి కేంద్రంలో పేరు నమోదు చేస్తే రాయచూరులో విక్రయించుకోవాలని సూచిస్తోంది. అక్కడికి వెళితే మా పరిధిలో రావటంలేదన్నారు. దాంతో మార్కెట్లలోనే అమ్ముకుంటున్నారు. కొందరు వ్యాపారులు అన్‌లోడ్ ఛార్జీ వసూలు చేస్తూ, క్వింటాలుకు రూ.300 వరకు కుంటూ, కాటాలో మోసాలు చేస్తున్నారు. వీటిన్నటిని అరికట్టాలని జిల్లా అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెస్తాం.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూకుడు

హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : శాస్త్ర, సాంకేతిక రంగాల ప్రగతి పతాకగా వర్ధిల్లే బెంగళూరు టెక్ సదస్సు స్థానిక ప్యాలెస్ మైదానంలో ప్రారంభమైన వేళ.. నిపుణులు, ప్రముఖుల సందడి మొదలైంది. నగర శివార ఆవాదులలోని బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శన కేంద్రం.. ఈ సదస్సుకు వేదికగా ఎంచుకొనగా.. ఆ చుట్టుపక్కల గట్టి భద్రత చర్యలు చేపట్టారు. వివిధ దేశాల ప్రతినిధులు, ఐటీ, బీటీ రంగాలకు చెందిన ప్రముఖులు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ప్రియాంక్ ఖర్గే, ఎంబీ పాటిల్, కియోనిక్స్ అధ్యక్షుడు శరత్ బచ్చేగౌడ, ఐటీ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులను ప్రభుత్వం మనసారా సత్కరించింది. మూడు ప్రధాన హాళ్లలో వెయ్యికి పైగా సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. మధ్యాహ్నం నుంచి స్టాళ్లను వీక్షించేందుకు ప్రజలు, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు తరలి వచ్చారు. గురువారం రాత్రి ఏడు గంటల వరకు సదస్సులు, సమావేశాలు కొనసాగిస్తారు.

సున్నా వడ్డీతో ఆర్థికాభివృద్ధి

మొక్కకు నీళ్లు పోస్తున్న శ్రీనివాస్, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : సహకార సంఘాల్లో రైతులకు ఇస్తున్న సున్నా వడ్డీ రుణాన్ని తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాయచూరు తాలూకా ఏగనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఏ ఉద్దేశంతో రుణాన్ని పొందారో అందులోనే పెట్టుబడి పెట్టాలని సలహా ఇచ్చారు. సకాలంలో రుణాలు చెల్లించి సంఘాలు నిలదొక్కుకునేందుకు, కొత్తగా అప్పులు ఇచ్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 72వ అఖిల భారత సహకార సప్తాహలో భాగంగా సహకార క్షేత్రంలో కార్యదక్షత, పారదర్శకత, డిజిటలీకరణపై సమావేశం నిర్వహించారు. మొక్కకు నీళ్లు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించిన శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘాలను విస్తరించుకుంటూ సభ్యులను పెంచుకుంటే ఈ రంగం మరింత బలోపేతమవుతుందన్నారు. సోలార్ సెల్కో సంస్థ ప్రతినిధి కాశీనాథ్ మఠద ప్రసంగిస్తూ వ్యవసాయంలో సోలార్ ఉప కరణాలను వాడాలని కోరారు. రాయితీతో విక్రయిస్తున్నందున పెట్టుబడి వ్యయం తగ్గుతుందని చెప్పారు. జిల్లా సహకార శిక్షకురాలు మంజుల, పంచాయతీ సభ్యులు అనిల్ నాయక్, వీరేశ్, పత్తిన ప్రతినిధులు గురుస్వామి, పూజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తికమాస దీపోత్సవం

దీపం వెలిగిస్తున్న స్వామీజీ, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే: మఠాల, పీఠాల సేవలను విస్తరించేందుకు భక్తులు, ప్రభుత్వాల సహకారం అవసరమని సోమవారపేట మఠం పీఠాధిపతి రాయచోటి వీర శివాచార్య పేర్కొన్నారు. సోమవారం రాత్రి పీఠం ఆవరణలో కార్తిక మాస దీపోత్సవం జరిగింది. స్వామీజీ జ్యోతి వెలిగించి సందేశం ఇస్తూ..భక్తుల చేయూతను కొనసాగిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక కార్యకలాపాలను విస్తృతం చేస్తామని వెల్లడించారు. పాత శిలా మంటపం పునరుద్ధరణ పనులకు మంత్రి బోసురాజు ఎమ్మెల్సీ నిధి నుంచి రూ.10 లక్షలు ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సమాచార హక్కు కమిషనర్ (కలబురగి విభాగం) వెంకటసింగ్‌ను సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు రవి, శాంతప్ప, సాజిద్ సమీర్, హట్టి బంగారు గనుల కంపెనీ మాజీ అధ్యక్షుడు గిరిజా శంకర్, పుండ్ల రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగితపు సంచులతో పర్యావరణ రక్ష

వాహనంలోకి చేర్చిన కాగితం సంచులతో విద్యార్థులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : రాజధాని నగరం బసవనగుడిలో కొనసాగుతున్న వేరుసెనగ జాతరలో వినియోగించడానికి వీలుగా కాగితపు సంచులను విద్యార్థులు సిద్ధం చేస్తున్నారు. రోటరీ క్లబ్ సహకారంతో స్థానిక దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఐదు వేల కాగితం సంచులు ఇప్పటికే సమకూర్చారు. ఈ జాతరలో ప్లాస్టిక్ వాడరాదని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) ఇదివరకే తీర్మానించింది. ప్లాస్టిక్ సంచులు పూర్తిగా నిషేధించారు. తయారు చేసిన సంచులను వరుసగా.. ఎప్పటికప్పుడు వ్యాపారులకు అందిస్తున్నారు. పర్యావరణ సంరక్షణలో విద్యార్థుల పాత్రను పదుగురు మెచ్చుకున్నారు. నాలుగు రోజుల పాటు కొనసాగే జాతరకు వచ్చేవారు వేరుసెనగ కాయలను కొనుగోలు చేయడం ఆనవాయితీ. ఆ సరకును తీసుకెళ్లడానికి కాగితపు సంచులు ఎతో అనువుగా ఉన్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మనిర్భర్ దరఖాస్తు గడువు పొడిగింపు

రాయచూరు, న్యూస్‌టుడే : ఆత్మ నిర్భర్ పథకం కింద రుణాలు పొందేందుకు దరఖాస్తు అవధిని ఈ నెల 28 వరకు పొడిగించినట్లు మాన్వి పురసభ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వీధి వ్యాపారాలు చేసుకునే వారికి తొలి దశలో రూ.15 వేలు, రెండో దశలో రూ.25 వేలు, మూడో దశలో రూ.50 వేల రుణాన్ని మంజూరు చేస్తారు. దరఖాస్తుకు గుర్తింపు కార్డు, ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతా, పాస్‌ఫొటో, కుటుంబ సభ్యులు, వ్యాపార స్థలంలో పోటోలు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను జత చేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆదర్శ మహిళ తిమ్మక్క

తిమ్మక్క చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

మాన్వి, న్యూస్‌టుడే : నాటిన మొక్కలనే తన బిడ్డల వలే చూసుకున్న సాలుమరద తిమ్మక్కను మనందరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ పేర్కొన్నారు. జనతాదళ్ కార్యాలయంలో తిమ్మక్క శ్రద్ధాంజలి సభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించి మాట్లాడారు. తిమ్మక్క సేవలు ఎప్పటికీ మిగిలిపోతాయన్నారు. పర్యావరణ సంరక్షణకు మనం కృషి చేయటం ద్వారా ఆమె ఆశయాన్ని కొనసాగించాలన్నారు. మాన్వి తాలూకా అధ్యక్షుడు ఈరణ్ణ మర్లట్టి, సిరివార తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున పాటిల్, నాయకులు రాజా రామచంద్రనాయక్, శరణప్పగౌడ, ఎం.డి.ఉస్మాన్, సాజిద్, విజయ్‌కుమార్, చెన్నారెడ్డి, రవిపాటిల్, నాగనగౌడ, మౌనేశ్‌నాయక్, శివకుమార్, వీరేశ్ విశ్వకర్మ పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ జయంతి సభ

రాయచూరు, న్యూస్‌టుడే : మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ జయంతిని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని జిల్లా సంఘటనా కార్యదర్శి శంకర్ కల్లూరు ఒక ప్రకటనతో తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు బసవరాజ పాటిల్ ఇటగి, ఎంపీ కుమారనాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీలు, పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు, కేపీసీసీ సభ్యులు హాజరవుతారని వివరించారు. సీనియర్లు, ప్రముఖులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తహసీల్దార్‌కు సేవారత్న ప్రశస్తి

తహసీల్దార్ అశోక్‌ను సత్కరిస్తున్న ఆరీఫ్‌మియా, సభ్యులు

సిరివార, (మాన్వి) : తహసీల్దార్ అశోక్ పవార్‌కు ప్రభుత్వం సేవా రత్న ప్రశస్తిని ప్రకటించింది. కార్యాలయానికి ప్రజలు, లబ్ధిదారులు పెట్టుకున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించటం, కుల సమీక్షలో చురుగ్గా పాల్గొని నిర్దిష్ట గడువులోపు సర్వే ముగిసే విధంగా చూడటం, ప్రజలతో ఆయన అనుసరించే వ్యవహార శైలి తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని 2025 సేవా రత్న ప్రశస్తికి ఎంపిక చేశారు. తహసీల్దార్‌ను తాలూకా నౌకర్ల సంఘం అధ్యక్షుడు ఆరీఫ్‌మియా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

ఘర్షణలో పది మందికి గాయాలు

గాయపడిన క్షతగాత్రులు

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని జనతా హౌస్ కాలనీలో మంగళవారం గుంపు ఘర్షణ చోటు చేసుకుంది. ఒకే సముదాయానికి చెందిన రెండు గుంపుల మధ్య జరిగిన ఘర్షణలో పది మందికి పైగా గాయపడ్డారు. పెళ్లి వేడుకలో డీజే పాట విషయమై తలెత్తిన చిన్న గొడవ ఘర్షణకు దారితీసింది. కొట్లాటను విడిపించేందుకు వెళ్లిన పెద్దలు, మహిళలకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు గుంపుల వారు కేసులు పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

ముగ్గురి ఊపిరి తీసిన చలిపులి

బెళగావి, న్యూస్‌టుడే : చలి పులి నుంచి తప్పించుకునేందుకు కుంపట్లో బొగ్గులు వేసి ఆ కుటుంబం వెచ్చగా నిద్రపోయింది. బొగ్గుల పొగ గదంతా కమ్ముకోవడంతో చివరికి ఊపిరి ఆడక, గది నుంచి బయటకు రాలేక ముగ్గురు కన్నుమూయగా, మరొకరు ప్రాణాలు కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నారు. రిహాన్ (22), మోయిన్ (23), సర్ఫరాజ్ (22) మృతి చెందగా శహనవాజ్ (19) పరిస్థితి విషమంగా మారింది. బెళగావి అమన్‌నగర్‌లో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది.

'మెట్రో'కూ బాంబు బూచి

'బెంగళూరు'లో మరో కలకలం

నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : తన మాజీ భార్యను హింసిస్తే మెట్రో స్టేషన్‌ను పేల్చివేస్తానంటూ ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఏకంగా మెట్రో రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) అధికారిక ఖాతాకు ఈ-మెయిల్ పంపించాడు. దీంతో అప్రమత్తమైన ఆ విభాగ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవంబరు 13న రాత్రి 11:25 గంటలకు వచ్చిన మెయిల్‌లో బీఎంఆర్‌సీఎల్ మెట్రో స్టేషన్‌ను పేల్చివేస్తామని బెదిరించాడు. 'నా మాజీ భార్యను విధి నిర్వహణలో మానసికంగా హింసిస్తున్నారని నాకు తెలిస్తే మీ మెట్రో స్టేషన్‌లో ఒక దానిని పేల్చివేస్తాను' అని అందులో పేర్కొన్నాడు. దీంతో బీఎంఆర్‌సీఎల్ అసిస్టెంట్ మేనేజింగ్ ఇంజినీర్ విల్సన్ గార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతం అతడికి ఆసుపత్రిలో చికిత్స అందించనున్నారు. అనంతరం మెయిల్ పంపడానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి విచారణ నిర్వహిస్తామని బెంగళూరు నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. ముందు జాగ్రత్తగా మెట్రో స్టేషన్‌లలో అధికారులను అప్రమత్తం చేశామని చెప్పారు.

● '15 సంవత్సరాల కిందట నిందితుడు తన భార్య నుంచి విడాకులు తీసుకున్నాడు. అతడి మానసిక పరిస్థితి బాగాలేదు. ఐదేళ్లుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బెళత్తూరు సమీపంలోని ఓ అద్దింట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు రోజువారీ అవసరాలకు కావలసిన నగదు సహాయం చేస్తున్నారు' అని బెంగళూరు సెంట్రల్ డివిజన్ డీసీపీ అక్షయ్ వివరించారు.

వరుస బెదిరింపులు

ఇటీవల బెంగళూరులో బహిరంగ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపు ఈ-మెయిల్స్ పెరుగుతున్నాయి. ఈ తరుణంలోనే మెట్రోకు మెయిల్ రావడం కలకలం రేపింది. పాఠశాలలకు అనేక నకిలీ బాంబు బెదిరింపులు పంపినందుకు గాను అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళను పోలీసులు ఇటీవలే ఇటీవల అరెస్టు చేశారు. మొదట జూన్ 14న నగరంలోని ఒక పాఠశాలకు బాంబు బెదిరింపు రావడంతో ఈ కేసు ప్రారంభమైంది. ఆ తర్వాత మరిన్ని పాఠశాలలు ఇలాంటి మెయిల్స్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తన ప్రేమికుడు తనను వివాహం చేసుకోవడానికి నిరాకరించాడని, అందుకే ప్రతీకారం తీర్చుకోవడానికి ఆ పేరు ఉపయోగించి బెదిరింపులకు పాల్పడ్డానని విచారణలో ఆమె పేర్కొనట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, దిల్లీ, కేరళ, బిహార్, తెలంగాణ, పంజాబ్, మధ్యప్రదేశ్, హరియాణాతో సహా అనేక రాష్ట్రాల్లోని సంస్థలకు ఇలాంటి నకిలీ హెచ్చరికలు పంపానని అంగీకరించిన ఆ మహిళ ప్రస్తుతం అహ్మదాబాద్ పోలీసుల విచారణలో ఉంది. బెదిరింపు సందేశాలను పంపేటప్పుడు ఎవరికీ దొరక్కుండా ఉండేందుకు వీపీఎన్‌లు, వర్చువల్ మొబైల్ నంబర్లను వినియోగించిందని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

అబ్దుల్ కుటుంబానికి సహకారం

మంత్రి జమీర్ వెల్లడి

మృతుని తరఫు బంధువులతో మాట్లాడుతున్న జమీర్ అహ్మద్‌ఖాన్

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : మదీనా సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కన్నడిగుడు అబ్దుల్ గని శిరహట్టి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని వక్ఫ్ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. హుబ్బళ్లికి చెందిన గని కుటుంబ సభ్యులు ఉమర్ సాబ్, మౌలా అలి, మైనుద్దీన్ మఖందర్ తదితరులు మంత్రితో మంగళవారం బెంగళూరులో సమావేశమై మాట్లాడారు. బెంగళూరు నుంచి మదీనాకు వెళ్లేందుకు వీసా, విమానం టికెట్లు, అక్కడ ఉండేందుకు హోటల్, ఇతర సదుపాయాలు, అంత్యక్రియల అనంతరం ఉమ్రా యాత్ర నిర్వహించి వెనక్కు వచ్చేందుకు, ఇతర దారి ఖర్చులకు తన సొంత నిధి నుంచి నగదు అందించారు. వారికి కావలసిన సదుపాయాలను కల్పించాలని హజ్ సమితి కార్యనిర్వహణ అధికారి సర్ఫరాజ్‌ఖాన్‌కు సూచించారు. హుబ్బళ్లి నుంచి వారు ముగ్గురూ తమ పాస్‌పోర్టులతో రావడంతో, నేరుగా వారిని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసువెళ్లి, మదీనాకు వెళ్లేందుకు వీడ్కోలు పలికామని వక్ఫ్ శాఖ అధికారులు తెలిపారు.

అత్తింటి సతాయింపులు..

బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

హాసన, న్యూస్‌టుడే : భర్త, అత్త వేధింపులు తాళలేక మహాదేవి (29) అనే గృహిణి తన ఏడాదిన్నర బిడ్డతో కలిసి కావేరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సాలిగ్రామ తాలూకా కర్పూరవళ్లికి చెందిన మహాదేవి తన మొదటి భర్త నుంచి విడాకులు తీసుకుని మూడేళ్ల కిందట అరకలగూడు తాలూకా సీబిహళ్లి గ్రామ నివాసి కుమార్‌ను వివాహం చేసుకుంది. వివాహ సమయంలో ఇతర లాంఛనాలతో పాటు 100 గ్రాముల ఆభరణాలను తీసుకున్నాడు. ఇటీవల తన శీలాన్ని శంకిస్తూ భర్త, అత్త వేధింపులు ఎక్కువ కావడంతో పదిహేను రోజుల కిందటే పుట్టింటికి వచ్చేసింది. ఆమెకు ఫోన్ చేసి దూషించడం, అశ్లీల సందేశాలు పెట్టడాన్ని కుమార్ కొనసాగించాడు. తనపై ఫిర్యాదు చేసేందుకు హాసన మహిళా ఠాణాకు వెళుతున్నట్లు గుర్తించి, ఈ నెల 13న భార్యను అడ్డుకుని మరోసారి దూషించి వెళ్లాడు. మహిళా ఠాణాలో ఫిర్యాదు చేసి, సెల్ఫీ వీడియో తీసి, కుటుంబ సభ్యులు, తనకు పరిచయం ఉన్నవారికి పంపించి రామనాథపుర సమీపంలో కావేరి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. తల్లీ- బిడ్డల మృతదేహాలను మంగళవారం గుర్తించి, మరణోత్తర పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోణనూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుదుటపడిన పార్వతి ఆరోగ్యం

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : తన భార్య పార్వతి ఆరోగ్యం స్థిరంగా ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. శ్వాసకోశ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆమెకు శేషాద్రిపురం అపోలో ఆసుపత్రిలో చికిత్సను వైద్యులు కొనసాగించారని మంగళవారం ఇక్కడ చెప్పారు. తన కుమారుడు డాక్టర్ యతీంద్ర తల్లివద్దే ఉంటూ, ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నాడని తనను కలుసుకున్న విలేకరులకు తెలిపారు. వైద్యుడు డాక్టర్ బీసీ శ్రీనివాస్ నేతృత్వంలోని వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు పార్వతి ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్నానని సిద్ధరామయ్య చెప్పారు.

తెలుగు విజ్ఞానసమితి దొడ్డమనసు

పాఠశాల దత్తతకు శ్రీకారం

బస్‌పాస్‌కు నిధులు అందుకున్న విద్యార్థులతో సమితి ప్రతినిధులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : శివాజీనగర బస్టాండ్ పరిధి ఓపీఎస్ రోడ్డులోని ప్రభుత్వ తెలుగు పాఠశాలను తెలుగు విజ్ఞాన సమితి దత్తత తీసుకుంది. ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ఇప్పటికే రూ.16 లక్షలు ఖర్చు చేయగా, మరిన్ని సేవల కోసం చర్యలు చేపట్టామని సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణరాజు ప్రకటించారు. బడిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వార్షిక బస్సు పాసుకు పూర్తి నిధులు అందించేందుకు సమితి కార్యవర్గ సభ్యుడు డి. గణేశ్ శంకర్ ముందుకు వచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, బోధన సిబ్బంది నియామకాల కోసం విద్యాశాఖ మంత్రి మధు బంగారప్పతో త్వరలో చర్చలు జరుపుతామని చెప్పారు. గతంలో బెంగళూరు జిల్లాలో 130కు పైగా తెలుగు విద్యాసంస్థలు ఉండగా, వాటిలో 65 వేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేసేవారు. ప్రస్తుతం 13 పాఠశాలల్లో ఆరు వేల మంది మాత్రమే చదువుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతిలో 90 శాతం కన్నా ఎక్కువ మార్కులు సాధించే ప్రతిభావంతులకు తలా రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామని సమితి కోశాధికారి సీఏ వరదరాజు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్సూర్, సమితి కార్యవర్గ సభ్యుడు వెంకటేశులు, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసులు, శ్యామల, జమున, లత, చంద్రకళ, బి. మెహబూబ్ పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు ఒడిశా
బుధవారం నవంబరు 19, 2025

అవినీతి అంతం... కావాలి పంతం

కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో సీఎం మోహన్ పాఠాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: విలువలకు కట్టుబడి, పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తామని చెప్పి బాధ్యతలు చేపడుతున్న కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ప్రవర్తన వల్ల అప్రతిష్ఠ మిగులుతోందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పేర్కొన్నారు. ఈ పరిస్థితి ఇక్కడితో ఆగిపోవాలని, అవినీతిపై సమరశంఖం పూరించాలని పిలుపునిచ్చారు. మంగళవారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్ (సచివాలయం) వేదికగా సీఎం అధ్యక్షతన 30 జిల్లాల పాలనాధికారులు, ఎస్పీల రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఇతర శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలు మనపై ఆశలు పెంచుకున్నారు

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పాలనా వ్యవస్థలో అవినీతికి తావులేదని, స్వచ్ఛతకు పెద్దపీట వేసిన తమ ప్రభుత్వం ఎంతో ఆశిస్తోందన్నారు. జనం అంచనాలు, ఆశలు తలకిందులు కాకూడదన్నారు. తమ 524 రోజుల పాలనలో ప్రజలతో మమేకమై వారి ఇబ్బందులు విన్నామని, వారంతా ప్రగతి కోరుతున్నారని, పథకాల ఫలాలు తమ ముంగిళ్లకు చేరాలని అభిలషిస్తున్నారన్నారు.

ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

సంపన్న ఒడిశా ధ్యేయం

2036 నాటికి స్వతంత్ర ఒడిశా శతాబ్ది వేడుకలు జరుపుకోనుండగా, ఈ వ్యవధిలోగా ఉత్కళ రాష్ట్రం సంపన్నం కావాల్సి ఉందన్నారు. ఈ లక్ష్యానికి చేరుకోవడం సులువైన విషయం కాకపోయినా కలిసికట్టుగా పనులు చేస్తే కచ్చితంగా నెరవేరుతుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ, పారిశ్రామిక రంగం ముందంజ వేస్తున్న నేపథ్యంలో ఆర్థిక పరిస్థితి బాగుందన్నారు. 2036 నాటికి వికసిత్ ఒడిశా, 2047 నాటికి వికసిత్ భారత్ ధ్యేయానికి చేరువ కావాలంటే మనమంతా పారదర్శకంగా, బాధ్యతగా పనులు చేయాల్సి ఉందన్నారు.

కూర్చుంటే పనులు కావు

అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే పనులు జరగవని, క్షేత్రస్థాయికి వెళ్లాలని, అప్పుడే ప్రజా సమస్యలు తెలుస్తాయని మోహన్ అన్నారు. తాను సీఎంను అయినా భవనాలు, వంతెనలు కట్టలేనని, ఇది ప్రధాన కార్యదర్శి వల్ల కూడా సాధ్యం కాదని, కాకపోతే మనం పరిశీలించాలన్నారు. లోటుపాట్లు తెలియాలంటే పాలనాధికారులు గ్రామాలకు వెళ్లాలని, పరిస్థితి అధ్యయనం చేయాలని, నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయా? అన్నది సమీక్షించుకోవాలన్నారు.

సదస్సులో పాల్గొన్న కార్యదర్శులు, కలెక్టర్లు

రూ.17 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు

తమ ప్రభుత్వం పాలనా బాధ్యతలు చేపట్టిన స్వల్ప వ్యవధిలో రాష్ట్రానికి రూ. 22 లక్షల కోట్లు పెట్టుబడుల ప్రతిపాదనలు రాగా, ఇంతవరకు రూ. 17 లక్షలు కోట్లు విలువైన నిర్మాణాలకు ఒప్పందాలు కుదిరాయన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధికి సంకేతమని, అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని, యువతకు ఉపాధి సాధ్యమవుతుందన్నారు. దేశంలో తొలిసారిగా అన్నదాతలకు క్వింటాలు ధాన్యానికి రూ. 316లు మద్దతు ధర చెల్లిస్తున్న రాష్ట్రం ఒడిశా అని, అన్నదాతల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. సుభద్ర, ఇతర పథకాల వల్ల మహిళలు లబ్ధి పొందుతున్నారన్నారు.

ఇసుకాసురులపై చర్యలు తీసుకోండి

ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని, సంపద దోచుకుంటున్న వారిపై ఉక్కుపాదం మోపాలని, డ్రోన్‌ల సాయం తీసుకోవాలన్నారు. అక్రమ మద్యం, ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా పెంచి అక్రమార్కుల భరతం పట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. జవాబుదారీ తనంతో పనులు చేయాలని, జనహితం ధ్యేయం కావాలని, ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలన్నీ ప్రజల ముంగిళ్లకు చేర్చే బాధ్యత పాలనాధికారులదేనని చెప్పారు. చాలకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్నవారిని గుర్తించి బదిలీలు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం చేసినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు.

హరిబాబును కలిసిన బెంగాల్ గవర్నర్

పశ్చిమబెంగాల్ గవర్నరు సి.వి.ఆనందబోస్ సోమవారం రాత్రి భువనేశ్వర్ వచ్చారు. రాజ్‌భవన్‌లో ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబును కలిశారు. వీరిద్దరు వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.
–న్యూస్‌టుడే, భువనేశ్వర్

పోలీసుల అదుపులో 13 మంది అక్రమ వలసదారులు

పరారీలో ఉన్న వారి కోసం తనిఖీలు ముమ్మరం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ఉలికిపాటుకు గురిచేస్తోన్న అక్రమ వలసదారుల చొరబాటు కేసును పోలీసు యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. ఇప్పటివరకు 13 మందిని అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇందుకోసం జగత్సింగ్‌పూర్‌తో పాటు కేంద్రపడ జిల్లాలను జల్లెడ పడుతున్నారు. ఇందులో భాగంగా బస్సులు, ఇతరత్రా రద్దీ ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు అక్రమ వలసదారులను సకాలంలో అరెస్టుచేసిన పోలీసు యంత్రాంగం, నివాసాల కూల్చివేతకు తక్షణ చర్యలు తీసుకున్న జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, డీజీపీ వై.బి.ఖురానియా కొనియాడారు. పోలీసుల వివరాల మేరకు.. సికందర్ ఆలం(40) తారికుండ పంచాయతీ పరిధి బెహ్రాం బస్తీ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. ఐదేళ్ల కిందట ఆక్రమించిన ఆ స్థలంలో 10 ఇళ్లు నిర్మించారు. వీటిలో బంగ్లాదేశీయులుగా అనుమానిస్తున్న 30 మంది అక్రమ వలసదారులు నివశిస్తుండేవారు. వీరిలో సోమవారం 13 మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. అనుమానితులు సమర్పించిన ఆధార్‌కార్డులు పశ్చిమబంగాకు చెందినవిగా ఉండగా, అవి నకిలీ అని దర్యాప్తులో తేలింది.

జేసీబీతో కూల్చేస్తున్న ఇళ్లు

క్షేత్రస్థాయి సిబ్బందికి శ్రీముఖాలు

కొంతమంది రెవెన్యూ అధికారుల దృష్టికి తెలిసే సికందర్ ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఆక్రమణ నివాసాలకు టీపీసీఓడీఎల్ సిబ్బంది విద్యుత్తు అనుసంధానం చేయడాన్ని జిల్లా యంత్రాంగం తప్పుపట్టింది. ఈ విషయమై జగత్సింగ్‌పూర్ కలెక్టర్ జె.సోనాల్ మాట్లాడుతూ సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి శ్రీముఖాలు జారీ చేశామన్నారు. దీనిపై విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్న సోనాల్, పరారీలో ఉన్న మిగతా అక్రమ వలసదారులను వీలైనంత త్వరగా అదుపులోకి తీసుకోవాలని పోలీసుశాఖకు దిశానిర్దేశం చేశామన్నారు. మేజిస్ట్రేట్ హోదాలో సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తొరై సమక్షంలో ఆక్రమణలు (10 నివాసాలు) కూల్చివేసినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది.

మధురగానం మూగబోయింది

★ హ్యూమన్‌సాగర్ మృతి, ప్రముఖుల సంతాపం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా కళా జగత్తులో మధుర గానం మూగబోయింది. అతి పిన్నవయసు (32)లో వందకు పైగా చిత్రాల్లో హిట్ బాణీలు అందించి, పాడి మన్ననలందుకున్న హ్యూమన్ సాగర్ మృత్యువుతో పోరాడి ఓడిపోయారు. మూత్రపిండాలు, కాలేయ వ్యాధుల బారినపడిన ఆయన భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్సకు చేరారు. వైద్యులు ఆయనను బతికించడానికి చేసిన ప్రయత్నాలు వృథా అయ్యాయి. సాగర్ పలు ఆల్బంలలోనూ పాటలు పాడి మెప్పించారు.

గొప్ప గాయకుడ్ని కోల్పోయాం

సాగర్ మృతిపై గవర్నరు కంభంపాటి హరిబాబు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రం గొప్ప గాయకుడ్ని కోల్పోయిందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంగళవారం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, విపక్షనేత నవీన్‌పట్నాయక్ తదితర ప్రముఖులు, పలువురు సినీ కళాకారులు సంతాపం తెలిపారు. భువనేశ్వర్ నుంచి మృతదేహాన్ని మంగళవారం ఉదయం కటక్‌లోని సాగర్ నివాసానికి తరలించారు. ఇక్కడ కొద్దిసేపు అభిమానుల సందర్శనార్థం ఉంచారు. తర్వాత సాగర్ జన్మస్థలం బొలంగిర్ జిల్లాలోని టిట్లాగడ్‌కు తరలించారు. అక్కడ క్రైస్తవ సంప్రదాయం ప్రకారం సమాధి చేశారు.

హ్యూమన్‌సాగర్ (పాత చిత్రం)

బిహార్ సీఎంగా నితీష్ ప్రమాణ స్వీకారోత్సవానికి మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి గురువారం బిహారులోని పట్నా వెళ్లనున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ పదవీ ప్రమాణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ వేడుకలో దిల్లీ పెద్దలతో పాటు భాజపా, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలంతా పాల్గొంటున్నారు. ఈమేరకు మోహన్ కూడా హాజరవుతారని సీఎంఓ అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: హత్యకేసులో ఐదుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా న్యాయస్థానం తీర్పునిచ్చింది. జిల్లా న్యాయమూర్తి సత్యనారాయణ షడంగి మంగళవారం వెలువరించిన తుది తీర్పునకు సంబంధించి ప్రభుత్వ న్యాయవాది(పీపీ) బిక్రమ్ కుమార్ కుందు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. 2014 ఆగస్టు 9న బుదరాయవలస ప్రాంతానికి చెందిన కడగల్ల అప్పలనారాయణ హత్యకు గురయ్యారు. దీనిపై కేసు నమోదు కాగా ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం 14 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి సత్యనారాయణ షడంగి నిందితులైన పతివాడ సూర్యారావు, పతివాడ శంకరరావు, పతివాడ శ్రీనివాస్, పతివాడ త్రినాథ్‌రావు, పి.సత్యంలకు జీవిత ఖైదు ఖరారు చేస్తూ తుది తీర్పు వెల్లడించారు. నిందితులకు రూ.10 వేలు చొప్పున జరిమానా చెల్లించాలని, లేని యెడల మరో ఆరు నెలల కారాగార శిక్ష విధించాలని తీర్పునిచ్చారు.

ఆధ్యాత్మికపథం అనుసరణీయం

● ముఖ్యమంత్రి మోహన్ చరణ్

శాంతి సందేశ జెండాలు చూపుతున్న సీఎం మోహన్, మంత్రి హరిచందన్ తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'అహింసా పరమోధర్మః' అన్న సత్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న బ్రహ్మకుమారీ ఈశ్వరీయ సేవాసంస్థ శాంతి, సమత, మమత, సమైక్యత సందేశమిస్తుండటం అభినందనీయమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. భువనేశ్వర్‌లోని జనతా మైదానంలో బ్రహ్మకుమారీ సేవా సంస్థ 50 వసంతాల ఉత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ ఆధ్యాత్మికపథం అనుసరణీయమని, దీన్ని బోధిస్తున్న బ్రహ్మకుమారీలు విశ్వవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ హితం కోరుతున్న తీరు ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా 'సంపన్న ఒడిశా, స్వర్ణిమ ఒడిశా' అభియాన్ సంచిక ఆవిష్కరించారు. 2036 నాటికి స్వతంత్ర ఒడిశా వందేళ్ల వేడుకలు జరుపుకోనుండగా బ్రహ్మకుమారీలు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపనులు, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వయిన్, ఎమ్మెల్యేలు ఆకాష్‌దాస్ నాయక్, బాబూసింగ్, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అరవిందపాఢి, స్వస్తి గ్రూపు సంస్థల అధినేత జె.కె.మహంతి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శాంతి సందేశ వాహనాలు శుభారంభం చేశారు.

సందడిగా సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ 17వ వార్షికోత్సవం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని ఉన్న సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ 17వ వార్షికోత్సవం సోమవారం రాత్రి సందడిగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు డి.ఎన్ రావు, పద్మ దంపతులు హాజరయ్యారు. అతిథులుగా శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయంప్రతిపత్తి కళాశాల ప్రధానాచార్యులు రాధాకాంత్ బుయాన్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్పీ నందా, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ ప్రజ్ఞపాణి పాల్గొన్నారు. డీఎన్ రావు మాట్లాడుతూ బోధనా సిబ్బంది అంకితభావానికి, తల్లిదండ్రుల నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. వార్షికోత్సవం నేపథ్యంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రధానాచార్యులు సునీత పాణిగ్రహి, ప్రాంతీయ డైరెక్టర్ సంబిత్ పాత్ర్ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై వర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు, పద్మ దంపతులు, ప్రధానాచార్యులు రాధాకాంత్ బుయాన్

ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో కళాకారుల అభినయం

నవీన్‌కు విజయవంతంగా క్యాటరాక్ట్ ఆపరేషన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి, విపక్షనేత నవీన్‌పట్నాయక్‌కు మంగళవారం భువనేశ్వర్‌లోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో క్యాటరాక్ట్ ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. ఆయనను వెంటనే డిశ్చార్జ్ చేశారని, ప్రస్తుతం బాగానే ఉన్నారని నవీన్ నివాస్ వర్గాలు తెలిపాయి.

దిల్లీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల అధికారులు

రాయగడ జిల్లాకు జాతీయ అవార్డు

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లాకు నీటి పొదుపు-ప్రజా భాగస్వామ్యం అంశంలో 2024కు గాను జాతీయ స్థాయి అవార్డు లభించింది. మంగళవారం దిల్లీలోని విజ్ఞాన్ భవనంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరై అవార్డు అందజేశారు. రాయగడ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ్ కుమార్ ఖేముండు హాజరై ట్రోఫీ, రూ 25 లక్షల నగదు బహుమతి అందుకున్నారు. జాతీయ స్థాయిలో అసాధారణ విజయం అందుకున్నామని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అభినందించారు.


కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న అక్షయ్ ఖేముందు

హరిశ్చంద్ర జాతికి మార్గదర్శి

● గవర్నర్ హరిబాబు

వేదికపై సంచిక ఆవిష్కరిస్తున్న గవర్నరు హరిబాబు, అతిథులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రహితం, సమాజ సేవ ధ్యేయంగా తుదిశ్వాస విడిచే వరకు ఉద్యమించిన హరిశ్చంద్ర బక్షిపాత్ర్ జాతికి మార్గదర్శి అని గవర్నరు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. సోమవారం రాత్రి భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో హరిశ్చంద్ర 92వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నరు మాట్లాడుతూ విలువలు, ప్రజాహితం కోరి హరిశ్చంద్ర చేపట్టిన ఉద్యమాలు చిరస్మరణీయమన్నారు. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో జయప్రకాష్ నారాయణ్‌తో కలిసి సాగించిన పోరు రాష్ట్ర చరిత్రలో లిపిబద్ధమైందన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది దుష్యంతదావె, హరిశ్చంద్ర స్మృతి సంఘం అధ్యక్షుడు, మాజీ మంత్రి ప్రఫుల్ల చంద్ర ఘడై, కార్యదర్శి లోపముద్ర బక్షిపాత్ర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు బక్షిపాత్ర్ స్మారక పురస్కారాలను గవర్నరు అందజేశారు.

డిసెంబరు 9న కటక్‌లో టీ-20 క్రికెట్ మ్యాచ్

1 నుంచి ఆన్‌లైన్‌లో టిక్కెట్ల అమ్మకం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ బారాబటి స్టేడియంలో డిసెంబరు 9న భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. దీనిపై సోమవారం రాత్రి కటక్ కలెక్టరేట్‌లో పాలనాధికారి సిద్ధార్థ బాపు సాహెబ్ శిందే అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఒడిశా క్రికెట్ అకాడమీ (ఓసీఏ) ప్రతినిధులు పాల్గొన్నారు. టిక్కెట్ల విక్రయాలు, భద్రతపై కూలంకషంగా చర్చించారు. గతంలో జరిగిన ఒక మ్యాచ్‌లో అపశ్రుతులు దొర్లినందున ఈసారి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. డిసెంబరు 1 నుంచి ఆన్‌లైన్‌లో టిక్కెట్ విక్రయాలు, డిసెంబరు 5న కౌంటర్ సేల్ జరుగుతుందని ఓసీఏ కార్యదర్శి సంజయ్ బెహర విలేకర్లకు చెప్పారు.

బారాబటి క్రికెట్ స్టేడియం

పేరుకే ఉచితం... కానరాని సౌకర్యం

అసంతృప్తి వ్యక్తం చేస్తున్న బ్రహ్మపుర నగర పౌరులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: పేరుకే బహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) ఉచిత సిటీ వైఫై.. అది అలంకారప్రాయంగా మిగిలిందని, ఎక్కడా ఆ సేవలు అందడం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. 2018లో బీఈఎంసీలోని పలు ప్రాంతాల్లో ఉచిత వైఫై జోన్లు ప్రారంభించారు. రూ.కోటి వ్యయంతో నగరంలో కళ్లికోట కళాశాల, టౌన్‌హాలు, పీవీఎన్ రావు పెట్రోల్ బంకు కూడలి, పాత బస్టాండ్ ట్రాఫిక్ టవర్, అన్నపూర్ణ మార్కెట్, అర్బన్ బ్యాంక్ రోడ్డు, గిరిజా, మయూరి కూడళ్లు, ఎస్ఎన్‌టీ రోడ్డు, రామలింగేశ్వర పార్కు రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా బీఈఎంసీ కార్యాలయం వరకు ఏర్పాటు చేసిన సిటీ వైఫై సేవలు అందడం లేదు. కనీసం నగర పాలక సంస్థ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు కూడా వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీనిపై ఇటీవల బీఈఎంసీ వర్క్స్, కాంట్రాక్టింగ్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఉపమేయరు వివేక్ రెడ్డి, కార్పొరేటర్లు సంజీవ్‌కుమార్ మిశ్ర, త్రిపతిపాత్ర్, సురేంద్ర మహరణా, డి.కరుణాకర్ తదితరులు కమిషనర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీన్ని అప్పట్లో గుత్త తీసుకున్న సంబంధిత సంస్థకు ఇప్పటి వరకు కోట్లాది రూపాయలు చెల్లించినా నగరవాసులకు ఆ సేవలు అందకపోవడం ఏమిటని వారు నిరసన వ్యక్తం చేశారు. ఇందుకోసం ఆ సంస్థకు ఏటా రూ.36 లక్షలు చెల్లిస్తున్నారని, ఎందుకు సేవలు అందడం లేదని నిలదీశారు. ఈ ఏడాది నవంబరు నాటికి ప్రైవేటు సంస్థ గడువు పూర్తవుతుందని, కొత్తగా టెండరు ప్రక్రియ చేపట్టాలని, ఉత్తమ సేవలందించే సంస్థకు వైఫై సేవలు అందించే బాధ్యతలు అప్పగించాలని ఉపమేయరు వివేక్ కమిషనర్ అరవింద్ రాజెషిర్కెకు సూచించారు.

ఎస్ఎన్‌టీ రోడ్డులో స్తంభానికి అమర్చిన బీఈఎంసీ సిటీ వైఫై బోర్డు

ధనుయాత్రలో కంసునిగా మెప్పించనున్న సుశీల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన బరగడ్ ధనుయాత్ర కోసం కంసుని పాత్రధారి ఎంపిక పూర్తయింది. ఈ పాత్ర పోషించడానికి 44 మంది పోటీ పడి దరఖాస్తులు చేశారు. సోమవారం నిపుణుల సమక్షంలో వారంతా తమ హావభావాలు ప్రదర్శించారు. బరగడ్ జిల్లా బడెన్‌కు చెందిన సుశీల్ మెహర్ ఈ ఏడాది యాత్రలో కంసునిగా ప్రేక్షకులను మెప్పించనున్నారు. శ్రీకృష్ణ, బలరాం, దేవకి, వసుదేవ, నంద, ముష్టిక తదితర పాత్రధారుల ఎంపిక ఇదివరకే పూర్తయింది. కీలకమైన కంసునిగా ఎవరు హావభావాలు ప్రదర్శించగలరన్న దానిపై జరిగిన రిహార్సిల్‌లో సుశీల్ ఎంపికయ్యారు. డిసెంబరు 24 నుంచి జనవరి 3 వరకు ధనుయాత్ర జరుగుతుంది.

కంసుని వేషధారి సుశీల్ మెహర్

జాతీయ సైక్లోథాన్ విజేత స్వస్తిసింగ్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ ఆధ్వర్యంలో గుజరాత్‌లోని కెవడియాలో ది యూనిటీ ట్రయల్ పేరిట నిర్వహించిన జాతీయ సైక్లోథాన్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన స్వస్తిసింగ్ విజేతగా నిలిచింది. సోమవారం నిర్వహించిన 60 కిలోమీటర్ల మహిళా ఎలైట్ వ్యక్తిగత రోడ్‌రేస్ సైక్లింగ్‌లో స్వస్తి మొదటిస్థానంలో నిలిచి పతకం గెలుచుకుంది. దీంతో పాటు రూ.3 లక్షల నగదు పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ తన వెబ్‌సైట్‌లో ఆయా వివరాలను పోస్టు చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపింది. ఈ పోటీల్లో 26 రాష్ట్రాల నుంచి 160 మంది పోటీపడగా మహిళా విభాగంలో స్వస్తి విజేతగా నిలవడం హర్షణీయమని ఆ శాఖ పేర్కొంది.

పతకం, ప్రశంసాపత్రంతో స్వస్తిసింగ్

పారా స్విమ్మింగ్‌లో రాష్ట్రానికి పతకాల పంట

హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఆక్వాటిక్ కాంప్లెక్స్‌లో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగిన 25వ జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్ర పారా క్రీడాకారులు సత్తా చాటారు. తొలిరోజు ఏడు పతకాలు గెలుచుకోగా రెండోరోజు నిర్వహించిన పోటీల్లో వివిధ కేటగిరీల్లో పోటీపడిన పురుషులు, మహిళా క్రీడాకారులు 26 పతకాలు గెలుచుకున్నారు. రాష్ట్ర క్రీడా శాఖ ఆ వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేస్తూ పతకాల విజేతలను అభినందించింది.

పతకాలతో రాష్ట్ర క్రీడాకారులు

(c) eenadu

బ్రహ్మపురలో నేటి నుంచి ఎంపీ క్రీడోత్సవాలు

మాట్లాడుతున్న ఈఈ నాగేశ్వర సుబుద్ధి. చిత్రంలో ఉపకమిషనర్ ఆశీర్వాద్ పరిదా తదితరులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) ఆధ్వర్యంలో నేటి నుంచి నగరంలోని వివిధ చోట్ల ఎంపీ క్రీడోత్సవాలు-2025 ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు సోమవారం బీఈఎంసీ కాన్ఫరెన్స్ హాల్లో సన్నాహక సమావేశం జరిగింది. ఇందులో ఉపకమిషనర్ ఆశీర్వాద్ పరిదా, ఈఈ నాగేశ్వర సుబుద్ధి మాట్లాడుతూ ఈ నెల 28వరకు స్థానిక స్పోర్ట్స్ ఎరీనా, క్రికెట్ క్రీడామైదానం, మహారాజాస్ మైదానం, ఎమ్మెల్సీ క్రీడామైదానాల్లో సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ బాలబాలికలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, స్కేటింగ్ తదితర అంశాల పోటీలు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. పోటీల నిర్వహణకు పాఠశాలలు, కళాశాలలు పీఈటీలు సహకరించాలని, క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. తొలిరోజు పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో తదితరాలు జరుగుతున్నట్లు వారు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వేదికపై పాల్గొన్న అతిథులు, ఓలీవుడ్ నటులు, పోలీసు అధికారులు తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ మోసాలు, నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారి చైతన్యానికి గంజాం పోలీసు జిల్లా ఆధ్వర్యంలో ముమ్మరంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబరు 29 నుంచి ప్రారంభమైన సైబర్ భద్రత చైతన్య అభియాన్-2025 ముగింపు వేడుకలు సోమవారం ఛత్రపురంలోని సంస్కృతి భవనంలో జరిగాయి. గంజాం ఎస్పీ శుభేందు కుమార్ పాత్ర పర్యవేక్షణలో నిర్వహించిన ఇందులో బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) కమిషనర్ ప్రదీప్త్ అరవింద్ దాశ్‌మిశ్ర, సబ్‌కలెక్టర్ శిఖాశ్ బోరాఖ్, ఛత్రపురం ఎస్‌డీపీవో అధ్యక్షురాలు కల్యాణి ప్రధాన్, ఓలీవుడ్ నటీనటులు సూర్యమయి, సార్థక్, మహుళ్, మన్మథ్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. అదనపు ఎస్పీ సీమా స్వయిన్ మాట్లాడుతూ సైబర్ భద్రత అభియాన్ కింద పోలీసు జిల్లాలోని 26 పోలీసు స్టేషన్ల పరిధుల్లో 82 విద్యాసంస్థల్లో, 56 బజార్లలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలచంద్ర షడంగి. చిత్రంలో ఇతర ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో త్వరలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రారంభం కానుండగా, రైతులు, కౌలు రైతుల నుంచి సజావుగా ధాన్యం సేకరించాలని, ప్రభుత్వ నిబంధన ప్రకారం మిల్లర్లు రైతులకు గోనె సంచులు, రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ కూలీ కింద సొమ్ము చెల్లించాలని రైతు సంఘాల నాయకులు డిమాండు చేశారు. దక్షిణాంచల రైతు మహాసభ, అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ (ఏఐకేఎంఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గంజాం కళా పరిషత్ ఆవరణలో సమావేశం నిర్వహించింది. ఆయా సంఘాల నాయకులు సిమాంచల నాయక్, బాలచంద్ర షడంగి, దరబేవర పోయి, ప్రకాశ్ పోయి తదితరులు మాట్లాడారు. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం గంజాం జిల్లాలో 5.2 లక్షల మంది రైతులు, 2.5 లక్షల మంది కౌలు రైతులున్నారని చెప్పారు. జిల్లాలో నలభై శాతం భూములకు సాగునీటి సౌకర్యముండగా, దీంతో ఎక్కువగా ధాన్యం పండిస్తున్నారని చెప్పారు. ఈసారి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేపడతామన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● రామాయణం నాటకంలో అశ్లీలతపై ఫిర్యాదు

థాణా అధికారికి ఫిర్యాదును అందజేస్తున్న దర్శకుల సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి థాణా పరిధిలోని మౌణిజం గ్రామంలో ఇటీవల గ్రామ యాత్ర సందర్భంగా ప్రదర్శించిన రామాయణం నాటకంలో హద్దుమీరిన అశ్లీలతపై గంజాం జిల్లా రంగస్థల దర్శకుల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై సంఘం అధ్యక్షుడు రాజ్‌గోపాల్ పాడి నాయకత్వంలో మంగళవారం పలువురు ప్రతినిధులు దిగపొహండి థాణాలో ఫిర్యాదు చేశారు. నాటకంలో రావణ పాత్రధారి, నాటక సంస్థ, యాత్ర కమిటీ తదితర బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సమితి స్థాయి మేళాలో పాల్గొన్న ఎమ్మెల్యే

మహిళకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాఖెముండి, కాశీనగర్, న్యూస్‌టుడే: గుమ్మ సమితిలో ఏర్పాటుచేసిన సమితి స్థాయి మత్స్య, పశుసంపద మేళాకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మంగళవారం పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే రూపేష్ మాట్లాడుతూ సమితి స్థాయిలో ఈ మేళా నిర్వహించడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. సమితి అధ్యక్షురాలు సునేమి మండల్, సమితి అభివృద్ధి అధికారి దులాల మాఝి పాల్గొన్నారు. ● కాశీనగర్ పంచాయతీ సమితి సాధారణ సమావేశం సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రూపేష్ పాణిగ్రాహి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.3,500 పింఛను అందజేస్తామని చెప్పి ఇప్పుడు లేదని, కొత్తగా పింఛను మంజూరు చేయకపోవడంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు గవర తిరుపతిరావు, బీడీఓ దంబరుధర్ మల్లిక్, సర్పంచి రామప్రసాద్ పట్నాయక్ పాల్గొన్నారు.

విభీషణులపై చర్యలు తీసుకోలేరు: సీఎం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌లో ఉన్న విభీషణులపై చర్యలు తీసుకుంటే ఆ పార్టీ మిగలదని, ఎందుకంటే వారు 70 శాతానికిపైగా ఉన్నారని, ఆ పార్టీ నాయకులు ఏమీ చేయలేరని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్నారు. భువనేశ్వర్‌లోని భాజపా కార్యాలయంలో పార్టీ నాయకత్వం అభినందన సమావేశం చేపట్టింది. నువాపడలో భాజపా భారీ విజయం సాధించిన నేపథ్యంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సహకరించిన ఇతర నాయకులంతా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మోహన్ మాట్లాడుతూ కష్టఫలం అనుభవించక తప్పదని, కాంగ్రెస్‌కిది వర్తిస్తుందన్నారు. నువాపడ ఉప ఎన్నికలో భాజపా విజయానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపిన సీఎం త్వరలో తాను నువాపడ వెళ్లి ప్రజలను కలుసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, పార్టీ వ్యవహారాల బాధ్యుడు విజయపాల్‌సింగ్ తోమర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పార్వతీ దేవికి లక్ష కుంకుమార్చనలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కార్తీక శుద్ధ చతుర్థి సందర్భంగా స్థానిక మార్కెట్ పేటలోని శతాబ్దాల పురాతన శ్రీ రేవణ సిద్ధేశ్వర స్వామి మందిరం ఆవరణలోని పార్వతీ దేవికి మంగళవారం 'లక్ష కుంకుమార్చనలు' భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మందిరం ప్రధాన అర్చకులు బి.కిరణ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పది మంది చొప్పున మహిళలు పది బృందాలుగా ఏర్పడి విడతలవారీగా తల్లికి కుంకుమార్చనలు చేశారు.

సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

శివపార్వతులకు ప్రత్యేక పూజలు

పట్టణ బి లైన్ శ్రీ రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వర (వైదిక పరిషత్) ఆలయంలో కార్తీక మాసోత్సవం మూడు రోజుల పాటు జరిగింది. మహిళలతో లక్ష లలితా కుంకుమార్చన, లక్ష బిల్వ దళార్చన, జ్యోతిర్లింగార్చన, శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, ఖరగ్‌పూర్

ఘనంగా అంబలం పూజ

లమతపుట్ సమితి పరిధిలోగల ఒనకడిల్లిలో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. ఒనకడిల్లీ పీటంకు చెందిన బి.వెంకటరమణ, బి.గోపాల కృష్ణ గురుస్వాముల 18వ పడిపూజ సందర్భంగా అంబలం పూజను ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, మాచ్‌ఖండ్

వృద్ధులకు రగ్గుల పంపిణీ

రాయగడ, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్, బస్టాండు, వివిధ మందిరాల వద్ద ఉంటున్న వృద్ధులు, అభాగ్యులకు రగ్గులు పంపిణీ చేశారు. స్థానిక డైలీ మార్కెట్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తున్న ధర్మాన రాజు మంగళవారం 150 మందికి రగ్గులు అందించారు.

వినతుల స్వీకరణ కార్యక్రమం బహిష్కరణ

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి ఖుర్జి పంచాయతీలో మంగళవారం బీడీఓ దుర్గాప్రసాద్ దొర అధ్యక్షతన జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని స్థానికులు బహిష్కరించారు. సమస్యలు నమోదు చేస్తున్నారు తప్పా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని సర్పంచి పదలామ్ హంతాల్ అన్నారు.

కొత్త పంచాయతీ ఏర్పాటుకు వినతి

కలెక్టరేట్ వద్ద బిసంకటక్ సమితి ప్రజలు

రాయగడ, న్యూస్‌టుడే: బిసంకటక్ సమితి పరిధిలో కొత్త పంచాయతీ ఏర్పాటు చేయాలని 14 గ్రామాల నుంచి వచ్చిన ప్రతినిధులు కోరారు. మంగళవారం వీరంతా కలెక్టరేట్‌కు చేరుకొని అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్‌ను కలిసి గోడు వినిపించారు. డుకుమ గ్రామ పంచాయతీ 14 గ్రామాలకు దూరంలో ఉందన్నారు. పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. జియారి గ్రామాన్ని పంచాయతీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

క్యాంపస్ నిర్మాణానికి సన్నాహాలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం రండాపల్లి ప్రాంతంలో విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ నిర్మాణం జరగనుంది. 40 ఎకరాల ప్రభుత్వ స్థలానికి సంబంధించిన పట్టాలను మంగళవారం అదనపు తహసీల్దార్ చిత్తరంజన్ పట్నాయక్ వర్సిటీ రిజిస్ట్రార్ మహేశ్వర్ చంద్ర నాయక్‌కు అందజేశారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని నాయక్ తెలిపారు.

రిజిస్ట్రార్‌కు పట్టా అందజేస్తున్న అదనపు తహసీల్దార్

తొలగించినవారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

ఆందోళనలో తిరుపతి, వంటవారు, సహాయకులు

రాయగడ, గుణుపురం: దక్షిణ ఒడిశా జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకంలో తొలగించిన వంట వారిని, సహాయకులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. సోమవారం సంఘం ముఖ్య సలహాదారుడు తిరుపతి గొమాంగో నేతృత్వంలో పద్మపూరు జగమండ కొండపై సమావేశం ఏర్పాటు చేశారు. 14,379 మంది వంటవారు, సహాయకులను ప్రభుత్వం తొలగించారని, వీరిని విధుల్లోకి తీసుకోకపోతే వచ్చేనెల 5న అసెంబ్లీ ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

సైబర్ అవగాహనపై మోడల్ ప్రదర్శన

జయపురం, న్యూస్‌టుడే: సైబర్ సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కొరాపుట్ జిల్లా శాఖ తరపున మోడల్ ప్రదర్శన జరిగింది. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిమిలిగుడ ఉన్నత పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు 20 మోడల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా మనబ్రత శత్పథి హాజరయ్యారు.

శిబిరంలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ తదితరులు

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి

ర్యాలీలో పాల్గొన్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్‌లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మంగళవారం 'ఏక్తా దివాస్' నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి నిత్యానంద్‌గండ్, ఎంపీ బలభద్రమాఝి, ఎమ్మెల్యే గౌరీశంకర్ మాఝి, మాజీ ఎంపీ పర్శురామ్‌మాఝి తదితరులు భారీ ర్యాలీగా పపదహండి సాహీద్ మీనార్ వద్దకు వెళ్లి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు.

లాంతర్ల వెలుగులో పిల్లలు చదువుతున్నారు

ఇది మనకు అప్రతిష్ఠ కాదా కలెక్టర్ గారూ?: సీఎం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అస్కా పట్టణానికి చేరువలోని సువర్ణపురం గ్రామం అంధకారంలో ఉంది. ఇంతవరకు ప్రజలు విద్యుత్తు వెలుగులు చూడలేదు. పిల్లలు లాంతర్లు, కొవ్వొత్తుల వెలుతురులో పాఠాలు చదువుతున్నారు. ఈ విషయమై మంగళవారం ఒక టీవీ ఛానెల్ ప్రసారం చేసింది. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన జిల్లాల జాబితాలో ఉన్న గంజాంలో ఈ దుస్థితి మనందరికీ అప్రతిష్ఠ కాదా? అంటూ ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పాలనాధికారి వి.కీర్తివాసన్‌ను ప్రశ్నించారు. భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఈ విషయం ప్రస్తావించిన సీఎం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వర్సిటీ ప్రాంగణంలో మహాయజ్ఞం

కొరాపుట్, న్యూస్‌టుడే: కేంద్రీయ విశ్వవిద్యాలయం ఒడిశాలో మూడు రోజుల జాతీయ సెమినార్‌ను ప్రారంభించారు. విశ్వవిద్యాలయ సంస్కృత విభాగం ఆధ్వర్యంలో మహాయజ్ఞం నిర్వహించి వేదిక్ సెమినార్‌ను ప్రారంభించారు. వీసీ ఎన్.సి.పండా, ప్రొఫెసర్ పతాంజలి మిశ్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ప్రకాష్‌కుమార్‌కు ఘన స్వాగతం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త ప్రకాష్‌కుమార్‌ను ఐఐటీ ఖరగ్‌పూర్ ఆచార్య సుదీప్ మిశ్ర నేతృత్వంలో బృందం స్వాగతం పలికింది. ఆయన డిజిటల్ లైబ్రరీ, నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా సందర్శించారు.

ప్రకాష్ కుమార్‌కు స్వాగతం పలికిన ఐఐటీ బృందం

పాత్రఫుట్ వంతెన వద్ద ఆందోళన

ఆందోళన చేస్తున్న మోర్చా సభ్యులు

జయపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: జయపురం సమితిలో ఉన్న అతి పురాతన పాత్రపుట్ వంతెన వద్ద వంతెన సురక్ష మోర్చా మంగళవారం ఆందోళన చేసింది. 94 ఏళ్ల కిందట ఈ వంతెన నిర్మించారు. ఇటీవల మరమ్మతులకు గురైంది. అధికారులు వెంటనే కొత్తది నిర్మించాలని మోర్చా సభ్యులు పలుమార్లు కోరుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మంగళవారం మోర్చా సభ్యులు బిశ్వజిత్ నాయక్, హేమంత్‌కుమార్ మహాపాత్ర్ నేతృత్వంలో ఆందోళన చేశారు. నూతన వంతెన నిర్మాణానికి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. బొయిపరిగుడ తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలోనే టెండర్లు పిలుస్తామని అంతవరకు 6 చక్రాల వాహనాలు నిషేధిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి బెంచ్‌ప్రెస్‌లో మూడు స్వర్ణాలు

జయపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో జరిగిన బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్‌లో వివిధ విభాగాల్లో కొరాపుట్‌కు మూడు స్వర్ణాలు, ఒక రజత పతకం వరించినట్లు కోచ్ ఘస్సీరామ్ హరిజన్ పేర్కొన్నారు. భువనేశ్వర్‌లో ఉత్కళ్ స్కూల్ తరపున జరిగిన పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 93 కిలోల విభాగంలో ఘస్సీరామ్ మొదటి స్థానంలో నిలిచి రికార్డు సాధించారు. జశ్వంత్ ప్రధాన్ రజతం, శ్రీరామ్ పట్నాయక్ 74 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించారు.

విజేతలుగా ఘస్సీరామ్, జశ్వంత్, శ్రీరామ్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

గ్రామ పంచాయతీ సభ్యురాలిపై దాడి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ గ్రామీణ పరిధిలోని చంగ్వాల్ గ్రామ పంచాయతీ సభ్యురాలు దీపాలిసింగ్‌పై గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి దాడిచేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కి చెందిన ఆమెపై దాడి జరగడం ఇది రెండోసారి. పోలీసులు ఈ దాడిపై ఎటువంటి ప్రకటన చేయలేదు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: కళాశాల విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన జగత్సింగ్‌పూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓంప్రకాష్ ఆచార్య ఎస్‌వీఎం అటానమస్ కళాశాలలో ప్లస్‌త్రీ చదువుతున్నారు. సోమవారం రాత్రి నబకృష్ణ చౌదరి స్టేడియం సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న స్నేహితుని వద్దకు ఆచార్య వెళ్లారు. రాత్రి అక్కడే ఓ గదిలో ఒంటరిగా గడిపిన ఆచార్య మంగళవారం ఉదయానికి పైకప్పునకు ఉరేసుకొని వేలాడుతుండటాన్ని స్నేహితుడు గుర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరీక్షకు తరలించారు. అసహజ మరణం కింద కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

వసతిగృహంలో విద్యార్థిని మృతి

భవాని హరిజన్ (పాతచిత్రం)

నవరంగపూర్, న్యూస్‌టుడే: సరైన సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లకపోవడంతో విద్యార్థిని మృతిచెందిన ఘటన నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ థాణా పరిధిలో బుర్జా పంచాయతీలో జరిగింది. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న భవాని హరిజన్(13) సోమవారం అస్వస్థతకు గురైంది. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా తల్లిదండ్రులకు సమాచారం అందజేసి నిర్లక్ష్యం చేశారు. మంగళవారం వారు వసతిగృహానికి చేరుకొని బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతిచెందిందని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమితి విద్యాశాఖాధికారి ఈశ్వర్ మాఝిని అడగ్గా, దీనిపై దర్యాప్తు చేసి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రాణిపేట గ్రామంలోని ఈ నెల 10న పి.చిన్నప్పుడు ఇంట్లో చోరీ జరిగినట్లు థాణాలో ఫిర్యాదు చేశారని థాణా అధికారి ప్రశాంత్ భూపతి తెలిపారు. కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు వివరించారు. భూపతి తెలిపిన వివరాల ప్రకారం.. పదో తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి అల్మారా పగలగొట్టి రెండు తులాల బంగారం, 50 తులాలకు పైగా వెండి, రూ.25 వేలు నగదు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని, నిందితులను గుర్తించి వారి వద్ద ఈ మొత్తం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు రాణిపేట గ్రామానికి చెందిన గోర్ల నవీన్(25), ధనాన గణేష్(25), మీసాల వివేక్(27), పర్లాఖెముండిలోని కండ్ల వీధికి చెందిన కిరణ్ దబాల్(20)గా గుర్తించినట్లు, వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు వివరించారు.

వ్యానులో చెలరేగిన మంటలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా దారింగిబాడిలో పర్యటించేందుకు పది మంది పర్యాటకులతో వస్తున్న బొలెరో వాహనంలో మంగళవారం హఠాత్తుగా మంటలు చెలరేగాయి. వాహనంలో ఉన్న వారు బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు నియంత్రించారు.

ఏకబిగిన ప్రయాణం: చాంద్‌బాలి (భద్రక్) ప్రాంతం నుంచి పర్యాటకులు కొంధమాల్ జిల్లా దారింగిబాడి అందాల్ని తిలకించేందుకు సోమవారం బొలెరో వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో ఎక్కడా వాహనాన్ని ఆపకుండా ఏకబిగిన ప్రయాణించి మంగళవారం కొంధమాల్ జిల్లాకు చేరుకున్నారు. దారింగిబాడిలోని ఎకో రిట్రీట్‌కు సమీపంలో 59వ నెంబరు జాతీయ రహదారిపై శ్రీనికేతా గ్రామం సమీపంలోని అంబొఖాలియా ఘాటీలో హఠాత్తుగా వాహనం నిలిచిపోయి, ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయని బొలెరో చోదకుడు దీపక్ నాథ్ విలేకరులకు చెప్పాడు.

చోరీ సరకు వాహనం: డీఐ పైపులు స్వాధీనం

బ్రహ్మపుర నగరం: గంజాం జిల్లా జగన్నాథప్రసాద్ థాణా పరిధిలో ఇటీవల ఓ సరకు వాహనం, అందులోని డక్టైయిల్ ఐరన్ (డీఐ) పైపులు చోరీకి గురయ్యారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి, ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని ఎస్పీ కార్యాలయం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుల నుంచి సరకు వాహనం, పది డీఐ పైపులు స్వాధీనం చేసుకున్నారు.

సారాబట్టీలపై ఆబ్కారీ దాడులు

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని నువాగూడలో మంగళవారం ఆబ్కారీ అధికారులు సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. 1,680 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఓఐసీ సుబ్రత్ కేసరి హిరణ్ అధ్యక్షతన దాడులు జరిగాయి.

ఇద్దరు యువకుల దుర్మరణం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: ఖైర్‌పుట్ సమితి గుమ్మాజరన్ జలపాతంలో నలుగురు యువకులు గల్లంతవ్వడా ఇద్దరు బయటపడ్డారు. మరో ఇద్దరు మృతిచెందారు. మృతులు జయపురానికి చెందిన జె.శ్రీకాంత్, లింగరాజ్ మహాపాత్ర్‌లు గుర్తించారు.

సైబర్ మోసాల రాకెట్‌ను ఛేదించిన ఝార్సుగుడ పోలీసులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఝార్సుగుడ జిల్లా పోలీసులు అతి పెద్ద సైబర్ మోసాల రాకెట్‌ను ఛేదించారు. మ్యూల్ ఖాతాదారులు, మధ్యవర్తులు మొత్తం 12 మందిని పట్టుకున్నారు. నిందితుల్లో 20-25 ఏళ్ల వయసున్న పది మందిని అరెస్టు చేసి మంగళవారం న్యాయస్థానానికి తరలించారు. మరో ఇద్దరు బాలుర్ని పట్టుకుని, వారిని జువెనైల్ జస్టిస్ బోర్డు (జేజేబీ)లో హాజరుపరిచారు. సాయంత్రం ఝార్సుగుడ థాణాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రెడ్డి రాఘవేంద్ర గుండాల మాట్లాడుతూ నిందితుల నుంచి వివిధ బ్యాంకులకు చెందిన 61 బ్యాంకు ఖాతాలు, వివిధ బ్యాంకుల 41 ఏటీఎం కార్డులు, 19 చరవాణులు, సిమ్‌లు, ఓ కారు, మరో ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర (మధ్యలో), ఇరువైపులా పోలీసు అధికారులు. చిత్రంలో అరెస్టయిన నిందితులు

రూ.లక్షకు రూ.వెయ్యి ఎర: సైబర్ మోసగాళ్లు మధ్యవర్తుల ద్వారా విద్యార్థులు, కార్మికులు తదితర వర్గాల వారికి సొమ్ము ఆశ చూపి, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ రాఘవేంద్ర తెలిపారు. ఆయా వర్గాల వారి బ్యాంకు పూర్తి వివరాలు 'కిట్' (ఏటీఎం కార్డు, పాస్ పుస్తకం, అంతర్జాల సౌకర్యం, వారి పేరిట సిమ్ కార్డు)ను మధ్యవర్తులు సేకరిస్తున్నారు. ఇందుకోసం సంబంధిత బ్యాంకు ఖాతాదారు (మ్యూల్ ఖాతాదారు)కు రూ.5 వేలు, మధ్యవర్తికి రూ.5 వేలు, వారందరినీ సమన్వయపరుస్తున్న వ్యక్తికి రూ.5 వేలు సైబర్ మోసగాళ్లు చెల్లిస్తున్నారు. ఆ కిట్‌ను వినియోగించి సైబర్ మోసాలకు పాల్పడిన సొమ్మును ఏటీఎం కార్డుల ద్వారా మోసగాళ్లు డ్రా చేసుకుంటున్నారు. మధ్యవర్తుల ద్వారా మ్యూల్ ఖాతాదారుల అకౌంట్‌కు సైబర్ మోసగాళ్లు నగదు పంపించి, దాన్ని డ్రా చేయించి మోసగాళ్లు పంపిన బ్యాంకు ఖాతాకు ఏటీఎం కేంద్రాల్లోని డిపాజిట్ యంత్రాల ద్వారా బదిలీ చేయిస్తున్నారు ఇలా లావాదేవీలు జరిపిన ఖాతాదారుకు రూ.లక్షకు రూ.వెయ్యి ఇస్తున్నారని ఎస్పీ రాఘవేంద్ర పేర్కొన్నారు.

నా కుమారుని మృతికి ముగ్గురు కారణం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తన కుమారుని మృతికి సినీ పరిశ్రమకు చెందిన ముగ్గురు కళాకారులు కారణమని హ్యూమన్‌సాగర్ తల్లి సపారిసునా ఆరోపించారు. మంగళవారం ఆమె కటక్‌లో విలేకర్లతో మాట్లాడుతూ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న సాగర్‌తో ఆ ముగ్గురు స్టేజ్‌షోలు చేయించారని, దీనివల్ల ఆరోగ్యం మరింత క్షీణించిందన్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

జనవరి నుంచి రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన

జయపురం, న్యూస్‌టుడే: తమ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించకుంటే వచ్చే ఏడాది జనవరి నుంచి జయపురం ప్రధాన ట్రాఫిక్ కూడలివద్ద నిరసన చేస్తామని, పేపర్‌మిల్లు రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం స్థానిక యాదవ్ భవన్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పీఎఫ్, బకాయి జీతాలు తదితర సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. డిసెంబరు చివరికి పనులు పూర్తికాకపోతే జనవరి నుంచి ఆందోళన చేస్తామని తెలిపారు. బసంత్ బెహర, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్‌లపై దాడులు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: ఇటీవల గుణుపురం, రామన్నగుడలో ఎలాంటి పత్రాలు లేకుండా నడుపుతున్న క్లినిక్‌లపై దాడి చేసి ఆరు క్లినిక్‌లను సబ్ కలెక్టర్ మూయించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పత్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ దిలీప్, ఆరోగ్యశాఖ అధికారులు

భూవివాదంపై చర్యలు తీసుకోండి

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితిలో ఉన్న బంజరు భూమిలో మొక్కజొన్న సాగు విషయంలో రెండు గ్రామాల మధ్య జరుగుతున్న వివాదం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సమాజ సేవకుడు బి.హరిరావు నేతృత్వంలో గ్రామస్థులు తహసీల్దార్ శోభన్‌కుమార్ బెహరాకు వినతిపత్రాన్ని అందజేశారు. బామణియాగూడ ఠాకురాణి మందిరం వద్ద 40 ఎకరాల బంజరు భూమిలో పొరుగు గ్రామమైన భైరాగిపొదర గ్రామస్థులు ఆక్రమించి మొక్కజొన్న సాగు చేస్తున్నారు. దీనిపై గతంలో పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లగా, దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ దిశగా వినతి పత్రాన్ని అందజేసినట్టు పేర్కొన్నారు.

పిండివంటల పోటీకి మంచి స్పందన

నిర్వాహకులతో విజేతలు, న్యాయనిర్ణేతలు

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో లేడీస్ క్లబ్ వారు సోమవారం లయన్స్‌క్లబ్ హాల్‌లో నిర్వహించిన పిండి వంటల పోటీలకు మంచి స్పందన లభించింది. మహిళలు వివిధ రకాలైన సంప్రదాయ వంటలను ప్రదర్శించారు.

చీపురుతో స్కూల్ శుభ్రం చేసిన డీఈఓ

నవరంగపూర పట్టణం సాన్‌మాసిగావ్ ఉన్నత పాఠశాలను డీఈఓ ఛత్రపతి సాహు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త, బూజులు పేరుకుపోవడంతో ఆయనే చీపురు పట్టుకొని శుభ్రం చేశారు. – న్యూస్‌టుడే, నవరంగపూర్

(c) eenadu

● శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ యువకుడు ఇటీవల జిల్లా పరిషత్తు కార్యాలయం వద్ద రెండు కిలోల గంజాయితో పోలీసులకు చిక్కాడు. అతను వినియోగిస్తూ తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడ్డాడు. వారికి కోర్టు 6 నెలల పాటు జైలు శిక్ష విధించింది.

● కొన్ని రోజుల కిందట పొన్నాడ వంతెన వద్ద 9 మంది యువకులు 17 కిలోల గంజాయితో పోలీసులకు చిక్కారు. నిందితులు 18 నుంచి 25 ఏళ్ల లోపు వారు కావడం గమనార్హం.

కుర్రాళ్లే.. నేరగాళ్లు..!

సులువుగా డబ్బు సంపాదనకు గంజాయి అక్రమ రవాణా

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు తోడు చాప కింద నీరులా వినియోగం పెరుగుతోంది. పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ పట్టుకుంటున్న వారిలో అత్యధికంగా యువకులే ఉంటున్నారు. గతంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన వారితో పాటు ఎక్కువగా అంతరాష్ట్ర యువకులు ఉండేవారు. తక్కువ ధరకు ఒడిశా నుంచి కొనుగోలు చేసి ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే యోచనతో గంజాయి అక్రమ రవాణాకు మొగ్గు చూపుతున్నారు.

విక్రయించడానికి సిద్ధం చేసిన గంజాయి ప్యాకెట్లు

వినియోగం..విక్రయం

ఒడిశాలో కిలో రూ.2 వేల నుంచి రూ.3 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఒకసారి తెచ్చుకుని కొన్ని రోజుల పాటు వినియోగిస్తూ మత్తులో ఉంటున్నారు. తెలిసిన వారికి, స్నేహితులకు ప్యాకెట్లు, కాగితపు పొట్లాల్లో పెట్టి విక్రయిస్తున్నారు. పరిమాణం మేరకు ఒక్కొక్కటి రూ.100, రూ.300, రూ.500, రూ.వెయ్యి వరకు అమ్ముతున్నారు. మత్తుకు బానిసవడమే కాకుండా వ్యాపారంగా మలుచుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

సంవత్సరం	స్వాధీనం చేసుకున్న గంజాయి (కిలోల్లో)	నిందితులు
2023–24	219	16
2024–25	986	139
2025	1275	220

అనుమానం రాకుండా..

శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, ఎచ్చెర్ల, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు వారానికి లేదా 10 రోజులకు ఒకసారి ద్విచక్ర వాహనాలపై ఒడిశాకు వెళ్తున్నారు. పెద్ద మొత్తంలో తీసుకొస్తే పోలీసులకు అనుమానం వస్తుందని రెండు నుంచి నాలుగు కిలోల వరకు తీసుకొస్తున్నారు. తనిఖీ కేంద్రాలు లేని మార్గాలను ఎంచుకుంటూ స్వస్థలాలకు చేరుకుంటున్నారు.

భవిష్యత్తు పాడు చేసుకోవద్దు..

గంజాయి వినియోగించినా.. విక్రయించినా చట్టపరంగా కఠిన శిక్షలుంటాయి. ఈ విషయంలో ఎవర్నీ ఉపేక్షించబోం. యువత మత్తుకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు. ఇప్పటికే వందల మందిని అదుపులోకి తీసుకున్నాం. కొందరికి సంవత్సరానికి పైగా జైలు శిక్ష పడింది. ఎక్కడైనా గంజాయి వినియోగించినా లేదా విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలి. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ

44 మృత వలస పక్షులు స్వాధీనం: వేటగాడి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: చిలికా వన్యప్రాణి డివిజన్ టాంగీ రేంజ్ పరిధిలోని చిలికా సరస్సులో మంగళవారం మధ్యాహ్నం చేపలు వేటాడుతున్న ఒకర్ని గస్తీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న రెండు సంచుల్లో పరిశీలించగా.. వివిధ జాతులకు చెందిన 44 మృత వలస పక్షులు దొరికాయి. ఆయనను అరెస్టు చేసినట్లు చిలికా డీఎఫ్‌వో అమ్లాన్ నాయక్ రాత్రి ఒక ప్రకటనలో వివరించారు. మరో వేటగాడు పరారయ్యాడని తెలిపారు.

● కోటబొమ్మాళికి చెందిన సలీం గతేడాది కబడ్డీ ఆడుతుండగా ప్రమాదవశాత్తు కుడి కాలి లిగమెంట్ తెగిపోవడంతో ఆటకు దూరమైపోయాడు. ఆరు నెలల పాటు ఇంటికే పరిమితమయ్యాడు. వైద్యులు సూచనల మేరకు ఏసీఎల్ మార్పిడి తర్వాత నెల రోజులకు మళ్లీ మైదానంలో అడుగు పెట్టాడు.

పొందూరు మండలం రాపర్తి గ్రామానికి చెందిన టి.అనంత్‌కుమార్ ఎత్తు నుంచి పడిపోవడంతో కుడి కాలి ఏసీఎల్‌కు గాయమైంది. శ్రీకాకుళం నగరంలోని సర్వజనాసుపత్రిలో వైద్యులు లిగమెంట్ మార్పిడి చేశారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు.

మన దగ్గరా ఆర్థోస్కోపీ

● జీజీహెచ్‌లో అధునాతన చికిత్స

కొత్త ఏసీఎల్ అమరిక

ఏసీఎల్ దెబ్బతిన్న రోగిని వార్డులో పరీక్షిస్తున్న ప్రొ.లుకలాపు ప్రసన్నకుమార్

న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం): రోడ్డు ప్రమాదాలు, క్రీడలు, ఇతర ఘటనల్లో ఎముకలు, కీళ్లకు గాయాలైతే ఒక్కోసారి శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఆర్థోస్కోపిక్ ద్వారా చేయాలంటే ఒకప్పుడు విశాఖలోని కార్పొరేట్ ఆసుపత్రులను సంప్రదించి రూ.లక్షలు ఖర్చు చేసేవారు. ప్రస్తుతం ఆ అవసరం లేదు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఉచిత వైద్యం అందుబాటులోకి వచ్చింది. మోకాలి లిగమెంట్ చీలికలు, భుజం డిస్క్‌లోకేషన్ వంటి సమస్యలకు పరిష్కారం చూపడానికి ఆర్థోస్కోపీ చికిత్స చేస్తున్నారు. కోత పెద్దగా లేకుండా.. రోగులు త్వరగా సాధారణ జీవనంలోకి రావడానికి ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. జీజీహెచ్‌లో ఆర్థోస్కోపీ ద్వారా ప్రస్తుతం మోకాలు (ఏసీఎల్), భుజం కండరం (సుప్రాస్పినేటస్) మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఆర్థోపెడిక్ విభాగ వైద్యులు చిన్న చీలికలతోనే దెబ్బతిన్న లిగమెంట్‌ను తొలగించి శరీరంలోని మరొక కండర భాగంతో కొత్త ఏసీఎల్ అమరుస్తున్నారు. సుమారు గంట పాటు చికిత్స చేస్తున్నారు. నెలకు 10 మంది చికిత్స పొందుతున్నారు.

నిర్లక్ష్యం ప్రమాదమే..

ఏసీఎల్, సుప్రాస్పినేటస్ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందితే సాధారణ జీవితం తిరిగి పొందొచ్చు. లేనిపక్షంలో ఒత్తిడి పెరిగి ఎముకలు అరిగిపోతాయి. చికిత్స అనంతరం ఫిజియోథెరపీ సక్రమంగా తీసుకుంటే శత శాతం ఫలితం ఉంటుంది. క్రీడాకారులకు ఎక్కువగా ఈ సమస్యలు వస్తుంటాయి. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాల్లోనూ ఈ తరహా ఇబ్బందులు బయటపడుతున్నాయి.

– ప్రొ.లుకలాపు ప్రసన్నకుమార్, ఎముకల వైద్య విభాగాధిపతి, సర్వజనాసుపత్రి, శ్రీకాకుళం

అతివేగం.. ఆపై నిర్లక్ష్యం

● లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు ● ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు

నందిగామ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

దెబ్బతిన్న బస్సు

నందిగామ, న్యూస్‌టుడే: వరుసగా ప్రైవేట్ బస్సులు ప్రమాదాలకు గురవుతున్నా డ్రైవర్లల్లో మార్పు రావటం లేదు. ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కె.కావేరీ ట్రావెల్స్ బస్సు ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనాసాగరం వద్ద లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. అదృష్టం వల్ల ప్రాణాలతో బయటపడ్డారు.

● విజయవాడ వైపు వెళ్తున్న లారీని అనాసాగరం ఫ్లై ఓవర్‌పై ఓవర్‌టేక్ చేసేందుకు బస్సు డ్రైవర్ ప్రయత్నిస్తుండగా లారీని ఢీకొట్టింది. ఓవర్‌టేక్ చేసేందుకు హైవేపై తగినంత స్థలం లేక పక్కన రోడ్డు మధ్యలో డివైడర్ ఉండటంతో బస్సు డ్రైవర్ లారీని ఢీ కొట్టుకుంటూ ముందుకెళ్లి బ్రేకులు వేశాడు. అదే డివైడర్‌ను ఢీకొట్టి ఉంటే బస్సు పల్టీ కొడితే ప్రమాద తీవ్రత ఎక్కువై ప్రాణహాని జరిగేది.

నలుగురికి తీవ్రగాయాలు

బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలు కాగా వీరిలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 35 మందితో బయలుదేరగా అనాసాగరం వద్దకు వచ్చేసరికి 25 మంది ఉన్నారు. ప్రమాదంతో ప్రయాణికులంతా వణికిపోయారు. కాపాడాలంటూ కేకలు వేశారు.

బస్సు సామర్థ్యం సరిగానే ఉంది

ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సును నందిగామ ప్రాంతీయ రవాణా శాఖ అధికారిణి పద్మావతి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పూర్ణిమ పరిశీలించారు. బస్సు నడిపి కండిషన్ బాగానే ఉందని నిర్ధారించారు. బస్సు బ్రేకులు, రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగా ఉన్నట్లు గుర్తించారు. హైవేపై తగినంత స్థలం లేకపోయినా లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించడం వల్లే ప్రమాదం జరిగిందని ఎంవీఐ పూర్ణిమ తెలిపారు.

ప్రతిభ వెలికితీతకు సర్గిఫులో చక్కని వేదిక

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పర్లాఖెముండి పట్టణ శివారులోని హత్తిబడి ప్రాంతంలో ఉన్న మైనారిటీ వసతి గృహం ప్రాంతంలో రెండు రోజులపాటు జరిగే సర్గిఫులో ఉత్సవం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పాల్గొని మాట్లాడుతూ గిరిజన అభివృద్ధికి, ఆదివాసీల కళలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని, అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలనేదే సీఎం కోరిక అన్నారు. జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, బల్ల సాయమ్మ, ఎస్.వీరరాజు, నిర్మలశెఠి, సబ్ కలెక్టర్ అనూప్ పండా పాల్గొన్నారు.

సర్గిఫులో పుస్తకాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే రూపేష్, అతిథులు

ఐదేళ్లు సంరక్షణ.. నిరంతర ఆదాయం



అన్నదాతకు సిరులు కురిపించే వక్క సాగు

మడకశిర, న్యూస్‌టుడే: వక్క తోటల సాగు అన్నదాతకు సిరులు కురిపిస్తుంది. ఐదేళ్ల పాటు సంరక్షణ చేపడితే అనంతరం రాబడి మొదలవుతుంది. ఏటా దిగుబడి పెరుగుతూ ఆదాయం రెట్టింపవుతుంది. చెట్లకు అవసరమైన మేరకు నీరు, పేడ, మట్టిని అందిస్తే చాలు.

నేల ఎంపిక

సాధారణంగా వక్క అన్ని నేలల్లో పండుతుంది. 25 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే చల్లటి వాతావరణం సాగుకు అనుకూలంగా ఉంటుంది. నీరు నిలవకుండా ఉండే భూమిని ఎంపిక చేసుకుంటే మొక్క త్వరగా పెరుగుతాయి. సాలుకు సాలుకు మధ్య 9 అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య 7 అడుగుల దూరం పాటించాలి. ఒక ఎకరాలో 450 నుంచి 500 మొక్కలు నాటుకోవచ్చు. కొత్తగా నాటిన మొక్కలకు ఎండ నుంచి రక్షణ కోసం నీడ ఇచ్చే అరటి మొక్కలను నాటుకోవాలి. రెండేళ్ల వరకు నీడలోనే పెరుగుతుంది. వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగుల మందుల అవసరం ఉండదు. సేంద్రియ ఎరువులు ఏడాదికి ఒకసారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. అనంతరం అయిదేళ్లకు వక్క పంట దిగుబడి ప్రారంభమవుతుంది.

నారు పోసే విధానం

సాగుకు ముందు 40 ఏళ్ల వయసున్న మంచి దిగుబడి ఇచ్చే మొక్క నుంచి విత్తనాలు సేకరిస్తారు. వాటిని గోనెసంచుల్లో కట్టి రెండు నెలల పాటు నీడలో ఉంచి నీరు పోస్తే మొలక వస్తుంది. ఈ మొలకలను మట్టి వేసిన పాలిథిన్ కవర్లలో ఉంచి నీరు పోస్తే ఏడాదికి 2 అడుగులు పెరుగుతుంది. అనంతరం గుంతల్లో నాటి బిందు సేద్యం ద్వారా నీరందించాలి. ఇలా అయిదేళ్ల పాటు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. నాటిన అయిదేళ్ల అనంతరం ఒక చెట్టు నుంచి గుత్తుగా 30 కేజీల వరకు పచ్చి కాయలు వస్తాయి. వీటిని ఒలిచి.. ఉడకబెట్టి.. అయిదు రోజుల పాటు ఎండబెడితే 3 కిలోల ఎండిన వక్క సిద్ధమవుతుంది. ఇలా ఏటా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వక్క దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు ధర రూ.52 వేలు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తే రూ.లక్ష పెట్టుబడి పోను రూ.4 లక్షల నికర లాభం వస్తుంది. అదనపు ఆదాయం కోసం అంతర పంటలుగా తమలపాకు, మిరియాలు, పూలచెట్లు, చెట్లు, ఇతర సుగంధ ద్రవ్యాలను సాగు చేసుకోవచ్చు.

రాష్ట్రంలోనే అమరాపురం అగ్రస్థానం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం వక్క సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 6 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా, ఒక్క అమరాపురం మండలంలోనే 3,100 ఎకరాల్లో సాగులో ఉంది. అలాగే అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లోనూ ఈ పంట అత్యధికంగా సాగు చేస్తున్నారు. అమరాపురం మండలంలో వక్క సాగు ద్వారా రైతులు ఏటా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఆదాయం పొందుతుండడం గమనార్హం.

రైతేరాజు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: జీడి, మామిడి పంటలతోపాటు ఆరుతడి పంటల్లో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్.వి.హరికుమార్ అన్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల వల్ల పంటలకు వివిధ రకాల పురుగులు ఆశించి నష్ట పరుస్తున్నాయి. వీటి నివారణకు పలువురు రైతులు ప్రశ్నలు అడగ్గా సమాధానం ఇచ్చారు.

మామిడి పూత త్వరగా రావాలంటే ఎలా..?

?: ప్రశ్న: మామిడిలో పూత త్వరగా వచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.
– కె.రామారావు, పెద్దసవలాపురం

☛: సమాధానం: వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఉష్ణోగ్రతలు 15-19 డిగ్రీలు ఉంటే పూత బాగుంటుంది. పూత త్వరగా బయటకు రావాలంటే పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుంది.

?: పుచ్చ పంట సాగుచేయాలంటే అనుకూలమైన రకాలు, విత్తనాలు వేసుకునే సమయం తెలపండి.
– కొంగరాపు ప్రసాద్, కొంగరాం

☛: పుచ్చ పంట సాగు చేయాలనుకుంటే డిసెంబరు రెండో పక్షం నుంచి జనవరి మొదటి పక్షం వరకు నారు పెంచి ఫిబ్రవరి నెల వరకు కూడా నాటుకోవచ్చు. పుచ్చ పంటలో షుగర్ బేబీ రకం 2-3 కిలోలు, ఆర్కజ్యోతి, అర్కమానిక్, అసాహి, యమాటో 6-8 కిలోల బరువుతో పెరిగి మంచి దిగుబడులు ఇస్తాయి. ఇవి గులాబీ, ఎరుపు రంగు గుజ్జు కలిగి ఉంటాయి.

?: చామంతిలో ఆకుమచ్చ తెగులు కనిపిస్తుంది. నివారణకు చర్యలు తెలపండి.
– ఎం.నారాయణరావు, చిన్నసాన

☛: చామంతిలో ఆకులు ఎండి వాడిపోతే మాంకోజెబ్ అనే మందు 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తెగులు నివారణతోపాటు ఆశించిన దిగుబడి వస్తుంది.

కాయతొలిచే పురుగుతో నష్టమే

బెండకాయను తింటున్న పురుగు

సారవకోట, న్యూస్‌టుడే: బెండ, మొక్కజొన్న పంటలకు కాయతొలిచే పురుగు ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. వీటిని నివారిస్తే దిగుబడి బాగుంటుంది. నేలల్లో 4, 5 సార్లు మెత్తగా దున్నాలి. విత్తనాలు వేసిన తరువాత నీటి తడి అందించి, 4, 5 రోజులకు రెండో సారి నీరివ్వాలి. కాయ, మొక్క తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తిస్తే లీటరు నీటికి 5 మి.లీ. నీమాయిల్ (వేపనూనె) చొప్పున, ఇమామెక్టిన్ బెంజోయేట్ ఒక లీటరుకు 0.5 గ్రా. చొప్పున 100 గ్రా. పొడిమందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలని సూచించారు. పది రోజుల వ్యవధిలో 2 సార్లు ఇలా చేయాలన్నారు.

గడ్డికి నిప్పు.. భూసారానికి ముప్పు

చెన్నాయివలస వద్ద పొలంలో వరిగడ్డికి నిప్పు

వరి గడ్డికి రైతులు నిప్పు పెట్టడంతో భూసారం కోల్పోతుందని వ్యవసాయ అధికారి కింజరాపు రవికుమార్ తెలిపారు. భూమి పైపొరలో ఉన్న పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నాశనమై, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. పంట కోసిన తరువాత వాటిని భూమిలో కలియ దున్నడం వల్ల తేమశాతం పెరిగి, నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. భూ సారం పెరిగి మొక్కకు అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. రబీలో వేసే పంటకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. –న్యూస్‌టుడే, జలుమూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరవాడ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: గాజువాక - ఎలమంచిలి ప్రధాన రహదారిలో ఊటగెడ్డ పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన శిడా పెడెంటి (28) కొంత కాలంగా లంకెలపాలెంలోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై అచ్యుతాపురం వైపు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన పక్కనే గేదె కళేబరం ఉంది. విషయం తెలుసుకొని పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని సీఐ తెలిపారు. దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. కేసు నమోదు చేసి శిడా బంధువులకు సమాచారం అందించినట్లు వివరించారు.

ఏమరపాటుగా ఉంటే అంతే..

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఉదయపురం కూడలి వద్ద కల్వర్టుపై రంధ్రం ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే కూడలి కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. కల్వర్టును పరిశీలించి, మరమ్మతు పనులకు చర్యలు తీసుకుంటామని పుర ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

వంతెన పునర్నిర్మించరూ

బెండిగేటు నుంచి పలాస వైపు వెళ్లే ప్రధాన బెండిగెడ్డపై ఉన్న రహదారి వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఏడేళ్ల కిందట ఇక్కడ రైల్వే అండర్ పాసేజ్ నిర్మాణం చేపట్టారు. అది ఈ వంతెన సమీపం వరకు చేరింది. గతంలో ఇక్కడ వంతెన పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టి వదిలేశారు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆర్అండ్‌బీ జేఈ జగదీష్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

నివాసాలు పెరుగుతున్నా.. రోడ్డు వేయరా!

పురుషోత్తపురంలోని అర్హులైన లబ్ధిదారులకు గృహనిర్మాణానికి ఏపీ ఆదర్శ పాఠశాల సమీపంలో స్థలాన్ని కేటాయించారు. అక్కడ ఇళ్ల నిర్మాణం జోరుగా జరుగుతోంది. సరైన రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. ఈ విషయమై పుర కమిషనర్ రమేష్ స్పందిస్తూ.. కాలనీ ఏర్పాటు సమయంలో మౌలిక సదుపాయాలు కోసం గతంలో ప్రతిపాదించారని, వివిధ శాఖల ద్వారా పనులు జరగాల్సి ఉందని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బ్రహ్మపుర సర్కిల్ ఆర్‌సీసీఎఫ్‌కు జాతీయ స్థాయి అవార్డు

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్‌సీసీఎఫ్ వి.నీలాన్నావర్

కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొత్త దిల్లీలోని విజ్ఞాన భవన్‌లో 'జాతీయ వాటర్ అవార్డ్స్-2024' ప్రదానోత్సవం జరిగింది. ఉత్తమ అదర్ దేన్ స్కూల్, కాలేజ్ ఔట్‌సైడ్ క్యాంపస్ కేటగిరీలో హరియాణాలోని చౌధురి చరణ్ సింగ్ హరియాణా అగ్రికల్చరల్ యూనివర్సిటీ (హిసార్), బ్రహ్మపుర ఆర్‌సీసీఎఫ్ అటవీ సర్కిల్‌లు సంయుక్తంగా మొదటి స్థానంలో నిలిచాయి. వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బ్రహ్మపుర సర్కిల్ ఆర్‌సీసీఎఫ్ (రీజనల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) వి.నీలాన్నావర్ అవార్డు అందుకున్నారు.– న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

సామాజిక, ఆర్థిక ప్రగతికి పునాది

పలాస పట్టణం, న్యూస్‌టుడే: సహకార సంఘాలు సామాజిక, ఆర్థిక ప్రగతికి పునాది అని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని 'సహకార సంఘాలతో మెరుగైన సమాజం' అంశంపై కళాశాలలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన చామంతి, అను, పావనిలకు జ్ఞాపిక, ధ్రువపత్రాలు, బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందించారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణ, జోనల్ మేనేజరు శ్రీనివాస్, స్థానిక బ్యాంకు మేనేజరు కనకమహాలక్ష్మి, కళాశాల వాణిజ్య, సైన్సు విభాగాల అధ్యక్షుడు వెంకటరమణ, శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు.

సేకరణలో జాప్యం.. నీరుగారుతున్న లక్ష్యం

ట్రాక్టర్ తొట్టెలు అందక చెత్తసేకరణలో తలెత్తుతున్న ఇబ్బందులు

నియోజకవర్గం	మంజూరైన ట్రాక్టర్లు
ఆమదాలవలస	11
ఎచ్చెర్ల	29
ఇచ్ఛాపురం	19
నరసన్నపేట	7
పలాస	8
పాతపట్నం	5
శ్రీకాకుళం	15
టెక్కలి	8

పాతపట్నం, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని ప్రభుత్వం అవగాహన కల్పిస్తోంది. చెత్త సేకరణతో సంపద సృష్టి కార్యక్రమం, స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం పనులు మొక్కుబడిగానే సాగుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో చెత్తసేకరణ ధ్యేయంగా కొన్ని గ్రామాలను ఎంపిక చేసి, ట్రాక్టర్లు మంజూరు చేశారు. ఉన్నతాధికారుల నిర్వాకంతో దానికి సంబంధించిన తొట్టె ఇంత వరకు ఇవ్వకపోవడంతో చెత్తసేకరణ సాగక పంచాయతీలు ఇబ్బందులు పడుతున్నాయి. రూ.లక్షలు వ్యయం చేసి కొనుగోలు చేసిన ఇంజిన్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

చాపరలో వినియోగానికి దూరంగా ట్రాక్టర్ ఇంజిన్

పంచాయతీలపై అదనపు భారం

శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లోని ఎంపిక చేసిన 102 పంచాయతీలకు ట్రాక్టర్లు, ఇంజిన్లు పంపిణీ చేశారు. దాంతోపాటు అందించాల్సిన తొట్టెలు పంపిణీ చేయకపోవడంతో ఆయా పంచాయతీ కేంద్రాల వద్ద ట్రాక్టర, ఇంజిన్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇంజిన్ ఖరీదు రూ.7.5 లక్షలు ఉండగా తొట్టె ఖరీదు రూ.2.5 లక్షలు మాత్రమే. తొట్టె కూడా అందిస్తే పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లను వినియోగించి గ్రామంలో సేకరించి చెత్తను సుదూరంలో ఉన్న డంపింగ్ యార్డుకు తరలించాలి. తొట్టె లేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. ఆటోలు, ఇతర వాహనాలతో సేకరిస్తున్నారు. ట్రాక్టర్ అయితే ఒక్కసారికే తరలించేందుకు అవకాశం ఉంటుంది. ఆటోలు, ఇతర వాహనాలు వినియోగించడం వల్ల ఒక పనికి పలుమార్లు తిరగాల్సి వస్తోంది. దీని వల్ల కార్మికులకు శ్రమ, ఖర్చులు అదనం అవుతున్నాయి. ఇంజిన్లు ఇచ్చిన వెంటనే తొట్టెలు కూడా కేటాయించినట్లయితే వినియోగంతో పాటు లక్ష్యం కూడా నెరవేరుతుందని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు 'తొట్టెలను త్వరలో రానున్నట్లు ఉన్నతాధికారులు తెలియజేశారు' అని జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తెలిపారు.

యువకుడి మృత్యువాత

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏపీలోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని శివ కూడలి వద్ద మంగళవారం ఒడిశాకు చెందిన టికెలాల్ బరియా(36) అనుమానాస్పదంగా మృతి చెందారు. మృతుడు మండలంలోని చెన్నాపురం వద్ద ఇటుకల బట్టీలో కార్మికుడిగా పని చేస్తున్నారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా.. బరియాకు మద్యం తాగే అలవాటు ఉన్నట్లు తెలిసింది. తాగి చనిపోయాడా? లేదా గుండెపోటా? లేదా ఇంకేమైనా కారణమా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

చెన్నైలో భారీ వర్షం

కోయంబేడు 100 అడుగుల రోడ్డులో వర్షంలో వెళ్తున్న వాహనాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం కన్నియాకుమరి తీరం వెంట కొనసాగుతుందని, రానున్న 24 గంటల్లో పశ్చిమ, వాయువ్య దిశలో నెమ్మదిగా కదులుతోందని, 22వ తేదీ ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడే మరో అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. అదేవిధంగా రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్రతరమయ్యాయని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో 24వ తేదీ వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని, గడచిన 24 గంటల్లో నాగపట్టణం జిల్లా వేదారణ్యంలో అత్యధికంగా 17 సెం.మీ వర్షపాతం నమోదైంది. చెన్నైలో మంగళవారం పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. చెన్నై సెంట్రల్, ఎగ్మూర్, వేప్పేరి, పురసైవాక్కం, చేట్‌పేట్, టీనగర్, మెరీనా మొదలైన ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో వాతావరణ ఒక్కసారిగా మారిపోయింది.

కుట్రాలం జలపాతంలో స్నానానికి నిషేధం

ట్రిప్లికేన్: తెన్కాశి జిల్లాలోని పశ్చిమ కనుమల్లో ఉన్న పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ కనుమల దిగువన ఉన్న కుట్రాలం ప్రధాన జలపాతంలో ప్రవాహం పెరిగింది. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా తదుపరి ఆదేశాల వరకు జలపాతంలో పర్యాటకులు స్నానం చేయడానికి అధికారులు నిషేధం విధించారు.

ధాన్యం కొనుగోలులో తేమ శాతాన్ని పెంచాలి

ప్రధానికి స్టాలిన్ లేఖ

జిల్లా కార్యదర్శులతో వేర్వేరుగా మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

ప్యారిస్, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి వరి ధాన్యం కొనుగోలులో తేమ శాతాన్ని 17 నుంచి 22కి పెంచాలని కోరుతూ ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాశారు. అందులో... రాష్ట్రంలో ముఖ్యంగా డెల్టా జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో అత్యధికంగా వరి దిగుబడి వచ్చిందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ తరఫున నవంబరు 16వ తేదీ వరకు 1,932 ప్రత్యక్ష ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 1,86,674 మంది రైతుల నుంచి 14.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.3,559 కోట్లకు కొనుగోలు చేశామన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాల వర్షాలు తీవ్రం అయ్యాయని, దీంతో ధాన్యం కొనుగోలుకి తేమని 7 నుంచి 22 శాతానికి నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 19వ తేదీ కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖను కోరిందని, అధికారులు రాష్ట్రంలో పర్యటించి, ధాన్యం నమూనాలు సేకరించి వెళ్లారని, కానీ ఇప్పటివరకు అందుకు సంబంధించిన ఉత్తర్వులు రాలేదని తెలిపారు. తమిళనాడు రైతుల సంక్షేమానికి మంచి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

ఈసారి కోవైలో పట్టు సాధించాలి

ప్యారిస్: చెన్నై అన్నా అరివాలయంలో 'ఉడన్‌పిరప్పే వా' పేరిట కోయంబత్తూరు జిల్లాలోని పార్టీ కార్యదర్శులతో మంగళవారం స్టాలిన్ 'వన్ టూ వన్' నిర్వహించారు. ఈ సందర్భంగా కోయంబత్తూరు జిల్లాలో మెజారిటీ స్థానాల్లో డీఎంకే గెలిచేలా చేయాలని నిర్వాహకుల సమక్షంలో మాజీ మంత్రి సెందిల్ బాలాజీకి సూచించారు. గత ఎన్నికల్లో కోయంబత్తూరు జిల్లాలో 10 స్థానాల్లో అన్నాడీఎంకే గెలవడంతో ఈసారి డీఎంకే కచ్చితంగా విజయం సాధించాలని తెలిపారు. అంతేకాకుండా 'ఎస్ఐఆర్' పనుల్లో గందరగోళం కారణంగా లక్షలాది మంది ఓట్లను తొలగించే అవకాశం ఉందని, కావున పనులపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని సూచించారు.

సౌర విద్యుత్తుతో చక్కని ఫలితాలు

> చెన్నై వేలచ్చేరికి చెందిన వ్యాపారవేత్త పి.ఎ.ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు ఆ ప్రాంతంలో చర్చనీయమైన వ్యక్తిగా మారారు. ఎందుకంటే.. ఆయనుండే అపార్ట్‌మెంట్ భవనానికి కరెంటు బిల్లు పెద్దగా కట్టకపోవడమే. పైకప్పు సౌర విద్యుత్తు వల్లే ఇది సాధ్యమవుతోందని అంటున్నారాయన. – ఈనాడు–చెన్నై

❖ పైకప్పు సోలార్‌తో స్ఫూర్తిగా నిలిచిన ప్రవీణ్‌కుమార్
❖ విజయగాథను ఉదాహరణగా చూపుతున్న ప్రభుత్వం

భవనంపై సౌర యూనిట్ వద్ద ప్రవీణ్‌కుమార్

ప్రవీణ్‌కుమార్‌కు రెండు ఎలక్ట్రికల్ వాహనాలున్నాయి. అయినా కరెంటు బిల్లు నామమాత్రంగానే వస్తోంది. 2021లో ఆయన వేలచ్చేరిలోని అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొన్నారు. చుట్టుపక్కల ఇళ్ల యజమానులతో మాట్లాడి, వారిని ఒప్పించి భవనంపైన సౌరశక్తి పలకల్ని ఏర్పాటు చేసుకున్నారు. భవనంలోని మిగతా నివాసాలవారూ ఆ స్థలాన్ని వినియోగించుకునేలా ఈ పలకల్ని పందిరిలాగా అమర్చారు. మొదట్లో 4 కిలోవాట్ సామర్థ్యంతో ఈ పలకల్ని ఉంచినా.. ఆ తర్వాత ఓ ఎలక్ట్రిక్ కారు, ఎలక్ట్రిక్ స్కూటర్ కొన్నారు. ఇక్కడాయన కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. వీటిని కొన్నాక ఈ ఏడాది ఏప్రిల్‌లో మరో 4 కిలోవాట్‌ను పెంచారు. దీంతో పైకప్పు సౌర విద్యుత్తు సామర్థ్యం 8కిలోవాట్లు అయ్యింది.

'రెండు దఫాలుగా 8 కిలోవాట్ల పైకప్పు సోలారుకు పెట్టిన రూ.4లక్షల్లో మూడేళ్లలో 4 కిలోవాట్లకు తిరిగొచ్చేసింది. ఇంకో 4 కిలోవాట్లకు త్వరలో వచ్చేస్తుంది. పైకప్పు సోలారుకు 25 ఏళ్ల జీవితకాలాన్ని ఇచ్చారు. బ్యాటరీలు సైతం వారంటీ కిందే ఉన్నాయి. కాబట్టి వాడకం మీద పెద్దగా కంగారుపడటం లేదు' అంటున్నారు ప్రవీణ్ కుమార్. ఇప్పుడు చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లలో ఉన్న ఆరుగురు సైతం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని పైకప్పు సోలారు పెట్టించారు. మరోవైపు ప్రభుత్వ విభాగాలు సైతం పర్యావరణహిత మార్గాల్లో ఈ విజయగాథను ఉదాహరణగా చూపుతున్నాయి.

మూడేళ్లలో వచ్చేసిన పెట్టుబడి వ్యయం

వినియోగం ఇలా..

- ఎలక్ట్రిక్ కారుకి ఒకసారి ఛార్జింగ్ చేస్తే 500కి.మీ దాకా ప్రయాణిస్తుంది. ఇందుకు ఒకసారికి 70యూనిట్ల విద్యుత్తు తీసుకుంటుంది.
- ప్రవీణ్‌కుమార్ ఉన్న ఫ్లాట్‌లో 4 పడక గదులున్నాయి. రెండేసి నెలలకు సుమారు 2వేల యూనిట్ల విద్యుత్తు వినియోగమవుతుంటుంది. 1000 యూనిట్లు దాటి విద్యుత్తు వినియోగించేవారికి యూనిట్ ధర రూ.11. దీంతో సుమారుగా రూ.22వేల దాకా బిల్లొస్తుంటుంది.
- వాడిన విద్యుత్తు, వినియోగిస్తున్న విద్యుత్తు దాదాపు సమానమవుతుండటంతో ప్రవీణ్‌కుమార్‌కు కరెంటు బిల్లు అంతగా రావట్లేదు.
- సౌర విద్యుత్తు వినియోగిస్తున్నందుకు కిలోవాట్‌కు రూ.100 చొప్పున చెల్లిస్తూ వస్తున్నట్లుగా తెలిపారు. ఇది స్థిరంగా ఉంటుందని వివరిస్తున్నారు.

2 నెలలకు 2 వేల యూనిట్లు

అపార్ట్‌మెంట్‌పై ఎండ ఎక్కువగా తగులుతుండటంతో రోజుకు ఈ సోలార్ ప్యానెళ్లు 32 యూనిట్ల విద్యుత్తును సగటున ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రవీణ్‌కుమార్‌కు రెండు నెలలకోసారి కరెంటు బిల్లొస్తుంది. అది వచ్చేలోపు రెండు నెలలకు 2వేల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. దీంతో ఆయన కరెంటు బిల్లు పెద్దగా కట్టాల్సిన పరిస్థితి రావట్లేదు.

నేడు కోవై రానున్న ప్రధాని మోదీ

'పీఎం కిసాన్' నిధుల విడుదల

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు కొడిసియా మైదానంలో బుధవారం సేంద్రియ వ్యవసాయ సదస్సు ప్రారంభమై మూడు రోజులపాటు జరుగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని సదస్సును ప్రారంభించి సేంద్రియ వ్యవసాయంలో రాణిస్తున్న రైతులకు అవార్డులను అందజేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం 21వ విడత నిధులను విడుదల చేయనున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా కోయంబత్తూరు విమానాశ్రయంలో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశారు. మోదీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పుట్టపర్తి నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి 1.25 గంటలకు కోయంబత్తూరు చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో కొడిసియా మైదానానికి చేరుకుని సమావేశం పూర్తయిన తర్వాత 3.15 గంటలకు కోయంబత్తూరు విమానాశ్రయం చేరుకుని 3.30 గంటలకు ఢిల్లీ బయలుదేరుతారు. ఈ సందర్భంగా 3 వేల మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టనున్నారు. కొడిసియా మైదానం చుట్టుపక్కల ప్రాంతాలను తాత్కాలిక రెడ్‌జోన్‌గా ప్రకటించారు. దీంతో సోమవారం రాత్రి 7 గంటల నుంచి బుధవారం రాత్రి 7 గంటల వరకు డ్రోన్ ఎగురవేతకు పోలీసులు నిషేధం విధించారు.

బాలాపురం పంచాయతీకి కేంద్ర పురస్కారం

కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ ప్రతాప్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: జలవనరుల సంరక్షణలో ఉత్తమ పంచాయతీగా తిరువళ్లూరు జిల్లా బాలాపురం ఎంపికైంది. న్యూఢిల్లీలోని కేంద్ర జల్‌శక్తి శాఖ ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ ప్రతాప్ పురస్కారం అందుకున్నారు.

రౌడీల ఆగడాలు అడ్డుకోవాలి: ఈపీఎస్



సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నైలో రౌడీయిజం పెరిగిపోయిందని, అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై ప్యారిస్‌లో హైకోర్టు దగ్గర్లో రెండు రౌడీ ముఠాలు చేతుల్లో కత్తులతో ఘర్షణ పడ్డాయని, దీంతో ప్రజలు భయంతో పరుగులు తీసినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. డీఎంకే పాలనలో ముఖ్యంగా రాజధాని చెన్నై రౌడీల సామ్రాజ్యంగా మారిందని ఆరోపించారు. పోలీసుశాఖను గుప్పిట్లో ఉంచుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ కుంభకర్ణుడిలా నిద్రలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి పాలనలో ప్రజలు ఎలా ప్రశాంతంగా ఉంటారని ప్రశ్నించారు. చెన్నైలో రౌడీల ఆగడాలను అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రధానితో భేటీ

సైదాపేట: కోయంబత్తూరుకు బుధవారం రానున్న ప్రధాని మోదీని పళనిసామి కలిసి మాట్లాడనున్నట్లు సమాచారం. విమానాశ్రయంలో ముందుగా ప్రధానిని స్వాగతించి అక్కడే భేటీ కానున్నట్లు తెలుస్తోంది. కూటమి వ్యవహారం, రాష్ట్రంలో అన్నాడీఎంకే-భాజపా కూటమి విజయావకాశం, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించనున్నట్లు సమాచారం. అలాగే టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ కూడా మోదీని స్వాగతించే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

నీతీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానం

సైదాపేట: బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎడప్పాడికి ఆహ్వానం అందినట్లు సమాచారం. 20న ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఇందులో పాల్గొనాలని ఎన్డీయే ముఖ్యమంత్రులు, నేతలకు ఆహ్వానం పంపుతున్నారు. ఈ నేపథ్యంలో పళనిసామికి కూడా ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది.

పాత పింఛను విధానం డిసెంబరులోగా అమలుచేయాలి

● జాక్టోజియో ఆందోళన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పాత పింఛను విధానాన్ని ఈ ఏడాది డిసెంబరులోగా ప్రభుత్వం అమలు చేయాలని జాక్టోజియో తరఫున డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లతో మంగళవారం చెన్నై ఎళిలగం వద్ద జాక్టోజియో తరఫున జరిగిన ఆందోళనలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాక్టోజియో రాష్ట్ర సమన్వయకర్త వెంకటేశన్ మాట్లాడుతూ.. ప్రస్తుత ముఖ్యమంత్రి గత పాలనలో జరిగిన ఆందోళనలలో పాల్గొని తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తామని చెప్పారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా పాత పింఛను విధానాన్ని అమలుచేయలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వసూలు చేసిన రూ.84 వేల కోట్లలో రూ.42వేల కోట్లు ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌కు జోడించాలన్నారు. మిగిలిన రూ.42వేల కోట్లు ఎల్ఐసీ ఖాతాలకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. తద్వారా పాత పింఛను పథకం వెంటనే అమలు చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

ఖాళీగా ఉన్న ఎళిలగంలోని ప్రభుత్వ కార్యాలయం

ఆందోళనలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ప్రజాస్వామ్య దేశంలో విమర్శించే హక్కుంది

● కమల్‌హాసన్

ప్రసంగిస్తున్న కమల్‌హాసన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య దేశంలో విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడైన కమల్‌హాసన్ పేర్కొన్నారు. సినీ గేయ రచయిత స్నేగన్ తండ్రి శివసంగు చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం తంజావూర్ జిల్లా పుదుకారియపట్టి గ్రామంలోని వారి నివాసంలో జరిగింది. ఇందులో కమల్‌హాసన్, మంత్రి అన్బిల్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ.. తాను మొదట సామాజిక సేవ చేస్తూ రాజకీయాల్లో ఉన్న సీనియర్ నాయకుల సలహాలు తీసుకొని పార్టీని స్థాపించినట్లు చెప్పారు. దేశం విషయానికొస్తే అందరం కలిసి నిలబడాలన్నారు. డీఎంకేకు వ్యతిరేకంగా పార్టీ పెట్టిన తాను నేడు అదే పార్టీకి మద్దతుగా వ్యవహరిస్తున్నారని కొందరు అంటున్నారని, ప్రజాస్వామ్య దేశంలో విమర్శించే హక్కు అందరికీ ఉందన్నారు.

బిహార్‌లో నీతీశ్.. తమిళనాడులో ఈపీఎస్

విలేకరులతో మాట్లాడుతున్న దిండుక్కల్ శ్రీనివాసన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బిహార్ ఎన్నికల విజయానికి 'ఎస్ఐఆర్'నే కారణమని, అక్కడ నీతీశ్ కుమార్‌లానే తమిళనాడులో ఎడప్పాడి పళనిసామి ముఖ్యమంత్రి అవుతారని అన్నాడీఎంకే మాజీ మంత్రి దిండుక్కల్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం దిండుక్కల్‌లో విలేకరులతో మాట్లాడుతూ... బిహార్ ఎన్నికల ఫలితాలు తమిళనాడులోనూ ప్రతిబింబిస్తాయని, రానున్న ఎన్నికల్లో అన్నాడీఎంకే 220కిపైగా సీట్లు గెలిస్తే పళనిసామి కూడా నీతీశ్ కుమార్‌లానే ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. 'ఎస్ఐఆర్' వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం ఉందన్నారు. వాళ్లు విధులను బహిష్కరించడం సరైనదేనన్నారు. 'సర్' పనులతో దిండుక్కల్ నియోజకవర్గంలో సుమారు 40 నుంచి 50వేల ఓట్లు తగ్గుతాయన్నారు. అవన్నీ నకిలీ, మరణించినవారివేనని పేర్కొన్నారు.

అధికారంలో భాగస్వామ్యం ఉండదు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల తరువాత ఏర్పడే ప్రభుత్వంలో వీసీకేకు భాగస్వామ్యం ఉండదని వీసీకే ప్రధాన కార్యదర్శి, విళుపురం ఎంపీ రవికుమార్ పేర్కొన్నారు. విళుపురంలో కొత్తగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. వీసీకే ప్రారంభించినప్పటి నుంచి అధికారంలో భాగస్వామ్యం కావాలన్నదే నినాదంగా ఉందని, సమయం వచ్చినప్పుడు భాగస్వామ్యాన్ని అడుగుతామన్నారు. 2026 ఎన్నికల్లో ఆ అవకాశం లేదన్నారు. డీఎంకే స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఈసారి కూటమిలో వీసీకేకు రెండంకెల సీట్లు లభిస్తాయని పేర్కొన్నారు.

కోవై, మదురై మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం నిరాకరణ

సైదాపేట, న్యూస్‌టుడే: కోయంబత్తూరు, మదురై నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం నిరాకరించినట్లు సమాచారం. కోయంబత్తూరు, మదురైలో మెట్రో రైలు సేవలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రాజెక్టు నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం తిప్పి పంపినట్లు సమాచారం. జనాభాను కారణంగా చూపుతూ నివేదికను వెనక్కు పంపినట్లు తెలుస్తోంది. 20 లక్షల కంటే ఎక్కువమంది జనాభా ఉండే నగరాలకే మెట్రో రైలు ప్రాజెక్టు వర్తిస్తుందని కేంద్రం తెలుపుతుంది. కోవై, మదురై రెండు నగరాల్లోనూ 20 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్నట్లు కేంద్రం వివరణ ఇచ్చినట్లు సమాచారం.

డీఎంకే ప్రేరణతోనే రెవెన్యూ ఉద్యోగుల నిరసన

● నయినార్ నాగేంద్రన్

వీవో చిదంబరనార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాగేంద్రన్

టీనగర్, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వం పురిగొల్పడంతోనే రాష్ట్రంలో రెవెన్యూ శాఖ ఉద్యోగులు 'ఎస్ఐఆర్' పనులను బహిష్కరించి నిరసన తెలుపుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. మంగళవారం తిరునెల్వేలిలో స్వాతంత్ర్య సమర యోధుడు వీవో చిదంబరనార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. డీఎంకే ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేంద్రానికి వ్యతిరేకంగా వ్యవహరించడంపైనే దృష్టి సారించిందని ఎద్దేవా చేశారు.

200కిపైగా స్థానాల్లో విజయం

ప్యారిస్: రాష్ట్రంలో 200కిపైగా నియోజకవర్గాల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని నయినార్ నాగేంద్రన్ ధీమా వ్యక్తం చేశారు. తూత్తుకుడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని, డీఎంకే ప్రభుత్వం వారిని బెదిరించి పని చేయిస్తోందని ఆరోపించారు. పలు కోర్కెలతో పోరాటం చేసిన శుభ్రతా కార్మికులపై దాడిచేసి, ఇంటి వరకు వెళ్లి బెదిరించారన్నారు.

వీఆర్, ఏఆర్‌లకు మించిన ఎక్స్ఆర్!

ఫ్రుగల్ టెక్నాలజీ థీమ్‌తో అంతర్జాతీయ సింపోజియం ❖ తొలిసారిగా నిర్వహిస్తున్న ఐఐటీ మద్రాస్

ఈనాడు-చెన్నై: ఐఐటీ మద్రాస్ సరికొత్త సింపోజియంతో ముందుకొస్తోంది. తొలి అంతర్జాతీయ 'ఎక్స్ఆర్ సింపోజియం ఫర్ ది గ్లోబల్ సౌత్'ను నిర్వహిస్తోంది. ఈనెల 28న ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లోని ఐసీఎస్ఆర్ భవనంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సింపోజియం నిర్వాహణలో ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఔలు సహకారం తీసుకుంటోంది.

ఎక్స్ఆర్‌తో పనిచేసే పరికరాన్ని పరీక్షిస్తున్న ఐఐటీఎం పరిశోధకుడు

సమాజంలో మార్పులకు అనుగుణంగా..

ఐఐటీఎంలోని (ఎక్స్‌టీఐసీ) వీఆర్, ఏఆర్ సాంకేతికతల మీద, ఈ రెండు కలిపి ఎక్స్ఆర్, హెప్టిక్ సాంకేతికతలపై పరిశోధనలు చేస్తోంది. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సమస్యలకు కొత్త పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో విద్యా, పారిశ్రామిక సంస్థలతో కలిసి పనిచేస్తోంది.

ఖర్చు తగ్గించేందుకు..

ఈ సింపోజియం ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ **ప్రొఫెసర్ మణివణ్ణన్** మాట్లాడుతూ.. ఫ్రుగల్ సాంకేతికత ఆవిష్కరణల ద్వారా ఖర్చు తగ్గించేందుకు ఈ సింపోజియంను నిర్వహిస్తున్నామని వివరించారు. అభివృద్ధి చెందే దేశాలకు ఇదెంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వివిధ దేశాల్లోని సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ సాంకేతికతను తీసుకెళ్లాలనేది ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్య, ఆరోగ్య, శిక్షణ, ప్రజాసేవల రంగాల్లో వీటి వినియోగం మీద పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు.

ప్రత్యేకతలివే..

- ఏఆర్, వీఆర్ సాంకేతికత మిశ్రమంగా ఎక్స్ఆర్ సాంకేతికతను తెస్తున్నారు. దీన్ని ఫ్రుగల్ థీమ్‌తో ఐఐటీ మద్రాస్ వేదికగా ప్రదర్శనలు చేయనున్నారు.
- ఈ సింపోజియం ద్వారా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని వివిధ దేశాలకు చెందిన సాంకేతిక నిపుణుల్ని తీసుకురావడం, ఆవిష్కర్తల్ని, పరిశోధకులతో మాట్లాడించడం చేయాలనుకుంటున్నారు.
- ఎక్స్ఆర్ వినియోగంలో ఏఐని ఎలా వాడాలనేదానిపై పరిశోధక పత్రాల్ని సమర్పించనున్నారు.
- వైద్య, ఆరోగ్య, శిక్షణ రంగాల్లో ఈ కొత్త సాంకేతికతను తీసుకొచ్చే మార్గాలు, సాధ్యాసాధ్యాలపై చర్చలు జరపనున్నారు.
- రోదసి, సముద్రాలకు సంబంధించి విషయాలను తెలుసుకునేందుకు ఎక్స్ఆర్ అవకాశాల్ని చర్చించనున్నారు.

మహోన్నతం.. విక్టోరియా హాల్ వైభవం

● 20వ తేదీ పునఃప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని విక్టోరియా హాల్ 65ఏళ్ల తర్వాత అందుబాటులోకి రానుంది. నగరంలో బ్రిటిష్ కాలంలో నిర్మించిన పలు భవనాలు నేటికీ గంభీరంగా నిలిచి ఉన్నాయి. ఈ కోవలో చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ భవనం, రిప్పన్ భవనానికి మధ్య ఎరుపు రంగులో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న పురాతన కట్టడం విక్టోరియా హాల్. 65ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ భవనం చరిత్ర గురించి ప్రస్తుత తరానికి తెలియదు. విక్టోరియా పబ్లిక్ హాల్‌ని 1887లో క్వీన్ విక్టోరియా స్వర్ణోత్సవాలకు గుర్తుగా నిర్మించారు. ఈ భవనాన్ని ఇండో-సార్సెనిక్ శైలిలో ఆర్.ఎఫ్.సింషామ్ రూపకల్పనలో టి.నంపెరుమాల్ చెట్టియార్ నిర్మించారు. అప్పట్లో రూ.2.27లక్షల ఖర్చుతో నిర్మాణం పూర్తయింది. ఈ భవనానికి గొప్ప చరిత్ర ఉంది.



ప్రముఖుల ప్రసంగాలు

1897లో స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, గోపాలకృష్ణ గోఖలే వంటి నాయకులు ఇందులో ప్రసంగాలు చేశారు. అందేకాకుండా ఈ హాలులో విద్యుత్, గ్యాస్ లైటింగ్‌ను ప్రవేశపెట్టారు. 1895లో ఇక్కడే మొదటి సినిమా ప్రదర్శితమైంది. అన్నాదురై నాటకాలు కూడా ఇక్కడే ప్రదర్శితమయ్యాయి. అన్నా, ఎంజీఆర్ మొదటిసారి కలిసిన ప్రదేశం కూడా ఇదే. వివిధ చారిత్రక సంఘటనలకు చిహ్నంగా ఉన్న విక్టోరియా పబ్లిక్ హాల్ 1960 తర్వాత ప్రాముఖ్యత కోల్పోవడం ప్రారంభించింది. భవనం కొద్దికొద్దిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం పాత రూపు మారకుండా పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో చెన్నై 2.0 పథకం కింద రూ.32.62 కోట్ల వ్యయంతో పునరుద్ధరించారు. రానున్న 20వ తేదీ దీనిని ముఖ్యమంత్రి స్టాలిన్ పునఃప్రారంభించనున్నారు.

అన్నాడీఎంకే ఏకమయ్యే రోజు త్వరలోనే వస్తుంది

● సెంగోట్టయన్

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే ఏకమయ్యే రోజు త్వరలోనే వస్తుందని, తనను పార్టీలోకి మళ్లీ చేర్చుకోవడం గురించి పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ మంత్రి సెంగోట్టయన్ పేర్కొన్నారు. మదురై మీనాక్షి అమ్మవారిని సోమవారం రాత్రి దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలకు మంచి జరగాలని దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత ప్రార్థనలు చేస్తుంటారని, వారిద్దరు అన్ని మతాలను సమానంగా చూస్తారని, వారి మార్గంలోనే తాను నడుస్తున్నట్లు తెలిపారు. అన్నాడీఎంకేని ఏకం చేసే చర్యలు జరుగుతున్నాయని, అది మంచి నిర్ణయమని చెప్పారు. భాజపా తనకు ఎలాంటి నిబంధనలు విధించలేదని, తానే వెళ్లి వారిని కలిసినట్లు చెప్పారు. అందరూ కలవాలన్నదే తన కోరికని, అది నెరవేరే కాలం త్వరలోనే వస్తుందన్నారు.

(c) eenadu

బుస్సి ఆనంద్, ఆదవ్ అర్జునపై కేసు నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: టీవీకే నేతలు బుస్సి ఆనంద్, ఆదవ్ అర్జునపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల సంఘం 'ఎస్ఐఆర్' ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టీవీకే తరఫున చెన్నై ట్రిప్లికేన్‌లో ఆందోళన జరిగింది. ఇందులో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్, ఎన్నికల నిర్వహణ విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున తదితరులు పాల్గొన్నారు. ఆ సమయంలో పార్టీ కార్యకర్తలు రోడ్డు మధ్య ఉన్న బారికేడ్లు, మొక్కలను నాశనం చేశారని పేర్కొంటూ ట్రిప్లికేన్ పోలీసులు బుస్సి ఆనంద్, ఆదవ్ అర్జున తదితరులపై రెండు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

క్రీడా రాజధానిగా తమిళనాడు

హాకీ ప్రపంచకప్ చూపుతున్న మంత్రులు అన్బిల్ మహేశ్, కోవి చెళియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దేశంలో క్రీడలకు రాజధానిగా తమిళనాడు మారిందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ తెలిపారు. పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్-2025 పోటీలు తమిళనాడు క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ తరఫున నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను ప్రపంచకప్ పరిచయ కార్యక్రమం తంజావూర్ అన్నై సత్యా క్రీడా మైదానంలో మంగళవారం జరిగింది. ఇందులో మంత్రులు కోవి చెళియన్, అన్బిల్ మహేశ్ పాల్గొన్నారు. అనంతరం అన్బిల్ మహేశ్ విలేకరులతో మాట్లాడుతూ... వర్షాకాలం కావడంతో పాఠశాలల ప్రాంగణాల్లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, బావులపై మూతలు వేయాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు తలెత్తకుండా చూసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించామన్నారు.

నాడు డెలివరీ బాయ్.. నేడు సంస్థ యజమాని

✦ 'గుడ్ టైమ్ సర్వీస్' పేరుతో వివిధ రకాల సేవలు ✦ 8 శాఖలను విజయవంతంగా నడుపుతున్న యువకుడు

- న్యూస్‌టుడే, ఆర్కేనగర్

మనం ప్రారంభించే వ్యాపారం చిన్నదైనా, పెద్దదైనా.. దానిపై మనకు పూర్తి నమ్మకం ఉంటే ఆ వ్యాపారాన్ని వృద్ధిలోకి తీసుకురాగలం. ఇందుకు చక్కని ఉదాహరణ వేలూర్ యువకుడు సురేందర్. 'గుడ్ టైమ్ సర్వీస్' పేరుతో చిన్న స్థాయిలో సంస్థ ప్రారంభించి నేడు 8 శాఖలను విజయవంతంగా నడుపుతున్నారు. సాధారణ డెలివరీ బాయ్‌గా మొదలైన ఆయన ప్రస్థానం నేడు ఓ కంపెనీకి యజమానయ్యే వరకు చేరింది. నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సురేందర్ వ్యాపార విజయ రహస్యాన్ని ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

ఉద్యోగులతో సురేందర్

పెట్టుబడిగా పీఎఫ్ డబ్బులు

మాది వేలూర్. వ్యాపారం ప్రారంభించడానికి ముందు ఓ కొరియర్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేశాను. తర్వాత ఫుడ్ డెలివరీ కంపెనీలో కూడా పనిచేశాను. నాతో పాటు పాఠశాల, కళాశాలలో చదివిన కొందరు స్నేహితులు ఏసీ మెకానిక్‌లుగా, ఎలక్ట్రీషియన్లుగా, ప్లంబర్లుగా పనిచేస్తున్నారు. నేను డెలివరీ చేయడానికి ఇళ్లకు వెళ్తున్నపుడు వాళ్లు మెకానిక్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్లకు అధిక డిమాండ్ ఉందని, కానీ దొరకడం లేదని చెప్పారు. అప్పుడే నాకు ఓ ఆలోచన తట్టింది. వినియోగదారులకు టెక్నీషియన్లను అందించే వ్యాపారం ఎందుకు ప్రారంభించకూడదని ఆలోచించాను. దాని గురించి స్నేహితులు, పరిచయస్థులతో చర్చించాను. వెంటనే 'గుడ్ టైమ్ సర్వీస్' పేరుతో సంస్థను ప్రారంభించాను. ఇందుకుగాను నేను పని చేసిన కంపెనీలో వచ్చిన పీఎఫ్ డబ్బులను పెట్టుబడి పెట్టాను. మొదట ఇళ్లలో క్లీనింగ్ పని ఎక్కువగా కనిపించింది. దీంతో దానిపై దృష్టి సారించాను. ఫేస్‌బుక్‌లో నా పేజీలో ఇళ్లలో క్లీనింగ్ సేవల గురించి ఓ పోస్ట్ పెట్టాను. తెలిసినవాళ్లకు షేర్ చేశారు. తర్వాత చాలామంది కస్టమర్లు సంప్రదించారు. గార్డెన్ క్లీనింగ్, పార్శిల్ డెలివరీ, వాటర్ ట్యాంక్ క్లీనింగ్, డీప్ క్లీనింగ్, బాత్రూమ్ క్లీనింగ్, ఇంటికే వెళ్లి కార్ వాష్ చేయడం తదితర 10కిపైగా సేవలను వినియోగదారులకు అందించాం.

ఏడాదికి రూ.80 లక్షలకుపైగా ఆదాయం

ఇందుకుగాను ఎక్కడా కార్యాలయం పెట్టలేదు. సామాజిక మాధ్యమాలు, నోటి ప్రచారంతో వ్యాపారం అభివృద్ధి చెందింది. తర్వాత అవసరానికి తగ్గట్టు మరికొంత మందిని ఉద్యోగంలో పెట్టుకున్నాను. నేడు 30మందికిపైగా పనిచేస్తున్నారు. కళాశాలల్లో చదువుతూ ఖర్చులకు పార్ట్ టైం ఉద్యోగం చేయాలనుకునే యువకులకు అవకాశాలు కల్పిస్తున్నాను. వేలూర్‌లోని కాట్పాడి, సత్తువాచ్చేరి, పాగాయం, సెనపాక్కం తదితర ప్రాంతాలలో ఇళ్లలో వండిన ఆహారాన్ని మధ్యాహ్నం వినియోగదారులు చెప్పే పాఠశాలలు, కార్యాలయాలకు తీసుకెళ్లి అందిస్తూ డబ్బా వాలాగా మారాము. అలాగే కొరియర్ సర్వీస్ కూడా ఉంది. సంస్థ ప్రారంభించి ఏడేళ్లవుతోంది. నేడు వేలూర్, తిరువణ్ణామలై, రాణిపేట, ఆంబూర్, కాంచీపురం, ఆర్కాడు, గుడియాత్తం తదితర ఎనిమిది శాఖలు విజయవంతంగా నడుస్తున్నాయి. ఏడాదికి రూ.80 లక్షలకుపైగా ఆదాయం వస్తోంది.

రెండు రోజుల పోలీసు కస్టడీకి మావోయిస్టు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అప్పర్‌భవాని అడవిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను ధ్వంసం చేసిన కేసులో మావోయిస్టును రెండు రోజుల పోలీసుల కస్టడీకి అప్పగిస్తూ ఊటీ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017లో అప్పర్‌భవాని సమీపంలోని అడవిలో అటవీశాఖ తరఫున ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని చోరీకి గురవగా, మరికొన్ని ధ్వంసమయ్యాయి. మరో ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించగా మారణాయుధాలతో ప్రవేశించిన మావోయిస్టులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి మావోయిస్టులు విక్రంగౌడ, మణివాసగం, సంతోష్, సోమన్‌లపై మంజూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మరో కేసులో మణివాసగాన్ని 2019లో కేరళలో, విక్రంగౌడను గతేడాది కేరళలో పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. సంతోష్, సోమన్‌ని కేరళ పోలీసులు అరెస్ట్ చేసి తిరుచ్చూర్ జైలుకి తరలించారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ధ్వంసం కేసు విచారణ ఊటీలోని కుటుంబ సంక్షేమ కోర్టులో సోమవారం విచారణకు వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న సంతోష్‌ని కోర్టులో హాజరుపరచలేదు. సోమన్‌ని కేరళ పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారు. మూడు రోజుల కస్టడీకి అనుమతించాలని రాష్ట్ర పోలీసులు కోరడంతో రెండు రోజులు అనుమతిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19వ తేదీ సోమన్‌ని కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు.

ఏకాంబరనాథర్ ఆలయానికి సిద్ధమైన స్వర్ణ రథం

డిసెంబరు 6న ట్రయల్ రన్

కొత్తగా తయారు చేసిన స్వర్ణ రథం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురంలోని ప్రసిద్ధ ఏకాంబరనాథర్ ఆలయానికి కొత్తగా తయారు చేయించిన స్వర్ణ రథం ట్రయల్ రన్ డిసెంబరు 6వ తేదీ నిర్వహించి 7వ తేదీ ప్రత్యేక అభిషేకం జరుపనున్నారు. ఆలయంలో 17 ఏళ్ల తరువాత డిసెంబరు 8వ తేదీ మహా కుంభాభిషేక నిర్వహణకు దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇదిలా ఉండగా 25 అడుగుల ఎత్తు, 13 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో రథాన్ని తయారు చేశారు. 2 టన్నుల రాగి రేకులకు 22 కిలోల బంగారంతో తాపడం చేసి రథానికి అమర్చారు. ఈ స్వర్ణ రథాన్ని కాంచీపురం సమీప ఒరిగై గ్రామంలోని పరమాచార్య మణి మండపం ప్రాంగణంలో నిర్మించిన షెడ్డులో ఉంచారు. దీనికి డిసెంబరు 6న సాయంత్రం 4 గంటలకు ట్రయల్ రన్ నిర్వహిస్తారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ప్రారంభిస్తారు. అక్కడి నుంచి రథం ప్రధాన మార్గాల గుండా ఏకాంబరనాథర్ ఆలయానికి చేరుకుంటుంది. 7వ తేదీ ఉదయం రథానికి అభిషేకాన్ని నిర్వహిస్తారు.

పైకారా జలపాత సందర్శనకు నిషేధం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీలోని పైకారా జలపాతం వద్ద నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా సోమవారం నుంచి పర్యాటకుల సందర్శనకు నిషేధం విధించారు. ఈ మేరకు నీలగిరి అటవీశాఖ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పనులు పూర్తయిన తర్వాత పర్యాటకులను అనుమతించనున్నట్లు తెలిపింది. ల్యాంబ్స్ రాక్, డాల్ఫిన్ నోస్ మార్గంలో మరమ్మతు పనులు జరుగుతున్నాయని, కావున అటుగా వాహనాలకు అనుమతి లేదని తెలిపారు. పర్యాటకులు నడిచి వెళ్లి ప్రకృతి అందాలను తిలకించవచ్చని సూచించింది.

డీఎంకేను ఓడించడానికి పార్టీలు ఏకమవ్వాలి

తమిళిసై

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తమిళిసై

వేలూరు, న్యూస్‌టుడే: డీఎంకేను ఓడించడానికి అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. వేలూరు కలెక్టరేట్ వద్ద ఉన్న ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం భాజపా తరఫున జరిగిన పోలింగ్ ఏజెంట్ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కోయంబత్తూరుకు విచ్చేస్తున్న ప్రధాని మోదీని ముఖ్యమంత్రి స్టాలిన్ నేరుగా స్వాగతించకుండా లేఖ ద్వారా ప్రకటనతో స్వాగతించడం సరికాదన్నారు. రాష్ట్రంలో పలు సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా మేకెదాటు ఆనకట్టకు సంబంధించిన డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ముందుంచలేదని ఆరోపించారు. మహిళలకు సురక్షితం కాని డీఎంకేను ఓడించాలనే ఉద్దేశం ఉన్న పార్టీలు ఒంటరిగా నిలవకుండా కలిసి పనిచేయాలని సూచించారు.

కార్తిక దీపోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

సమావేశంలో మంత్రులు ఈవీ వేలు, శేఖర్‌బాబు తదితరులు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మహా దీపోత్సవాలు ఈ నెల 21న ప్రారంభమై డిసెంబరు 7వ తేదీ వరకు జరుగుతాయి. డిసెంబరు 3న కొండపై మహాదీపం వెలిగిస్తారు. ఈ క్రమంలో ఉత్సవాలకు ఏర్పాట్ల గురించి కలెక్టరు కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. మంత్రులు శేఖర్‌బాబు, ఈవీ వేలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. సమావేశంలో రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.పిచ్చాండి, జిల్లా కలెక్టరు తర్పగరాజ్, జిల్లా ఎస్పీ సుధాకర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మిస్టర్ యూనివర్స్ శరవణన్‌కు ఘనస్వాగతం

విలేకర్లతో మాట్లాడుతున్న శరవణన్

సైదాపేట, న్యూస్‌టుడే: వరుసగా మూడో ఏడాదిగా మిస్టర్ యూనివర్స్‌గా నిలిచిన శరవణన్‌కు చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ తరఫున 16వ మిస్టర్ యూనివర్స్ పోటీలు ఇండోనేషియాలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరిగాయి. ఇందులో భారతదేశం సహా 35 దేశాలకు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. భారత్ తరఫున అర్జున అవార్డు గ్రహీత భాస్కరన్ నేతృత్వంలో 75 మంది పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించారు. భారత పురుషుల జట్టు 715 పాయింట్లు పొంది పసడి పతకం కైవసం చేసుకుంది. మహిళల జట్టు 245 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. నామక్కల్ జిల్లా పార్శనూరుకు చెందిన శరవణన్ మూడోసారిగా ఓవరాల్ ఛాంపియన్ టైటిల్ గెలుచుకున్నారు. తద్వారా మిస్టర్ వరల్డ్ టైటిల్‌ను నిలబెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో విమానం ద్వారా చెన్నై చేరుకున్న శరవణన్, ఇతర పతకాలు సాధించిన క్రీడాకారులకు ఘన స్వాగతం లభించింది.

మయిలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనిశా సోదాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా మయిలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారి నుంచి అధికారులు లంచాలు తీసుకుంటున్నట్లు విళుపురం అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందింది. ఆ మేరకు అనిశా డీఎస్పీ అళగేశన్ నేతృత్వంలో సోమవారం సాయంత్రం సదరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు సోదాలు నిర్వహించారు. తరువాత సబ్ రిజిస్ట్రార్ నదియా, ఉద్యోగులను విచారించారు. జ్ఞలెక్కల్లో చూపని రూ.2 లక్షలను స్వాధీనం చేసుకొని నదియాపై కేసు నమోదు చేశారు.

రూ.42 కోట్లతో రైతు సేవా కేంద్రాల ఏర్పాటు

టీనగర్, న్యూస్‌టుడే: వ్యవసాయ కోర్సులు చేసిన వారిని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం 'ముఖ్యమంత్రి రైతు సంక్షేమ సేవా కేంద్రాలు'ని ఏర్పాటు చేసిందని, వీటికి విశేష స్పందన లభిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం తెలిపారు. ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. తమిళనాడులో వ్యవసాయ కోర్సులు పూర్తి చేసిన యువత స్వయం ఉపాధి పొందడానికి, వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడానికి వీలుగా రాష్ట్రవ్యాప్తంగా 1000 రైతు సంక్షేమ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి రూ.42 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకానికి యువత నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. పథకాన్ని ఇటీవల ప్రకటించగా ఇప్పటివరకు 1,768 మంది దరఖాస్తు చేసుకోగా, 973 మందికి ప్రాజెక్ట్ నివేదికలు తయారు చేసి బ్యాంకులకు సమర్పించారని పేర్కొన్నారు. ఇందులో ఇప్పటికే 413 మందికి బ్యాంకు రుణాలు మంజూరయ్యాయని, రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల అంచనా వ్యయంతో కేంద్రాలు ఏర్పాటు చేయడానికి 30 శాతం సబ్సిడీని రెండు వాయిదాలలో ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ఈ-సేవా కేంద్రాల ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు, చిన్న యంత్రాలు, డ్రోన్ సేవలు అద్దెకు పొందవచ్చని సూచించారు.

'వీవోసీ'కి ఘన నివాళి

చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి అన్బరసన్, మేయర్ ప్రియ, అధికారులు

ప్యారిస్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు వీవో చిదంబరం పిళ్లై(వీవోసీ) 89వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెన్నై గిండిలోని గాంధీ మండపం ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి మంత్రి అన్బరసన్, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు ప్రభాకరరాజా, అసన్ మౌలానా, అధికారులు పుష్పాంజలి ఘటించారు.

రెవెన్యూ ఉద్యోగుల సమ్మె

ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పనుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో సరైన ప్రణాళిక, శిక్షణ లేకుండా తమపై ఒత్తిడి తెస్తున్నారని, ఫలితంగా అదనపు పని భారం తమపై పడుతోందని రెవెన్యూ అధికారులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారుల సంఘం మంగళవారం నుంచి సమ్మె చేయనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు కోయంబత్తూరు జిల్లాలోని రెవెన్యూ శాఖ అధికారులు మంగళవారం ఒకరోజు సమ్మె చేశారు. జిల్లాలో 90శాతం ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో కార్యాలయాలు ఖాళీగా కనిపించాయి.

విద్యను లాభం పొందే సంస్థగా పరిగణించకూడదు

మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: లాభం పొందే సంస్థగా విద్యను పరిగణించకూడదని మద్రాసు హైకోర్టు అభిప్రాయపడింది. చెన్నై కేళంబాక్కంలోని ప్రైవేటు విశ్వవిద్యాలయంలో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొంటూ విద్యార్థుల తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు.. అన్ని డీమ్డ్ వర్సిటీల్లో రుసుముల నిర్ధరణ కమిటీ నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయడాన్ని నిర్ధారించాలని రాష్ట్ర ప్రభుత్వం, యూజీసీ, జాతీయ వైద్య కమిషన్‌కు ఉత్తర్వులు ఇచ్చారు. అదనపు తరగతులు నిర్వహించడం తప్పనిసరి కానప్పుడు అందుకు ఫీజు వసూలు చేయాలన్న అవసరం లేదని తెలిపిన న్యాయమూర్తులు.. లాభం ఆర్జించే సంస్థగా విద్యను పరిగణించకూడదని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పిటిషన్‌దారులైన విద్యార్థుల నుంచి వసూలు చేసిన అదనపు రుసుములను తిరిగి ఇవ్వాలని ఆదేశించారు.

లక్షల్లో ఓట్ల తొలగింపునకు కుట్ర

ఎన్ఆర్ ఇళంగో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ ఇళంగో

ప్యారిస్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వల్ల లక్షల్లో ఓట్లను తొలగించే అవకాశం ఉందని డీఎంకే న్యాయ విభాగ కార్యదర్శి ఎన్ఆర్ ఇళంగో ఆరోపించారు. చెన్నై తేనాంపేటలోని అన్నా అరివాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఒకరోజు జరిగే ఎన్నికలకు పలు నిబంధనలు పాటించే ఎన్నికల కమిషన్.. నెలపాటు జరిగే ఎస్ఐఆర్ పనులను ఎప్పుడు చేపట్టాలనేది పరిగణలోకి తీసుకోలేదన్నారు. పూర్తిగా బీఎల్‌వోలపై ఆధారపడి చేపట్టే ఈ ప్రక్రియలో వారికి ఒక రోజు మాత్రమే శిక్షణ ఇచ్చారన్నారు. ఈ వ్యవహారంలో కోర్టు మంచి తీర్పు ఇస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఓట్లు తొలగిస్తే కచ్చితంగా సుప్రీంకోర్టుకి వెళ్తామని తెలిపారు. 2004లో కరుణానిధి ఓటర్ల జాబితాలు సరిచేయాలని కోరారని, అంతేకాకుండా అన్ని ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను క్రమబద్ధీకరించాలని 100కి పైగా ఉత్తరాలను ఎన్నికల కమిషన్‌కి పంపారని గుర్తు చేశారు. అనర్హులు, మృతిచెందిన వారు, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించాలని, అర్హులను తొలగించకూడదని పేర్కొన్నారు.

తండ్రి అంత్యక్రియలకు డబ్బులు లేక పిల్లలు ఆవేదన

☛ సాయం చేసిన గ్రామస్థులు

☛ బాధితులను పరామర్శించిన ముఖ్యమంత్రి

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపం పూటై గ్రామానికి చెందిన కమలకణ్ణన్(46) కూలీ. ఇతనికి భార్య వసంత(40), కుమార్తెలు లావణ్య(24), రీనా(21), రిషికా(17), కుమారుడు అభినేష్(13) ఉన్నారు. వసంత అనారోగ్యంతో ఏడేళ్ల క్రితం మృతి చెందింది. ఇదిలా ఉండగా కమలకన్నన్‌కు మూత్రపిండాల సమస్య తలెత్తింది. మెరుగైన చికిత్స పొందడానికి ఆర్థికస్థోమత లేక, పూట గడవక కుటుంబం అవస్థ పడింది. ఈ క్రమంలో ఇంజినీరింగ్ చదువుతున్న పెద్ద కుమార్తె లావణ్య కళాశాల ఫీజు కట్టలేక చదువు మానేసింది. అదేవిధంగా 8వ తరగతి చదువుతున్న రీనా, 10వ తరగతి చవుతున్న రిషికా కూడా పాఠశాలకు వెళ్లడం మానేశారు. ప్రస్తుతం అభినేష్ ఒక్కడే పూటై గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలలో 8వ తరగతి చదువున్నాడు. ఈ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కమలకన్నన్ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. అంత్యక్రియలు జరపడానికి కూడా డబ్బులు లేక నలుగురు పిల్లలు విలపించారు. దీంతో గ్రామస్థులు చందాలు వేసుకొని అంత్యక్రియలు సోమవారం సాయంత్రం జరిపించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ముఖ్యమంత్రి స్టాలిన్.. కమలకన్నన్ పెద్ద కుమార్తె లావణ్యతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అప్పుడు యువతి.. కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించింది. తప్పక సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. తాను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, వెంటనే ఆయన్ను కలవాలని సూచించారు.

శబరిమలై వెళ్లే భక్తుల కోసం సమాచార కేంద్రాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళనాడు నుంచి శబరిమలై వెళ్లే భక్తుల కోసం కేరళలో సమాచార, సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామని దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. ఆయన సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో.. శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజ డిసెంబరు 27 వరకు జరగుతుందని, తరువాత ఆలయం మూతబడి మకర జ్యోతి ఉత్సవం కోసం డిసెంబరు 30 నుంచి 2026 జనవరి 16వ తేదీ వరకు తెరుస్తారని పేర్కొన్నారు. శబరిమలై యాత్రకు తమిళనాడు నుంచి వెళ్లే భక్తుల సౌకర్యార్థం తమిళనాడు, కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో, కలైకావిళిలో, శబరిమలైలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే సమాచార కేంద్రాల సేవలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని వివరించారు. ఈ కేంద్రాలు రానున్న జనవరి 20వ తేదీ వరకు పనిచేస్తాయని తెలిపారు. అదేవిధంగా చెన్నైలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని టోల్‌ఫ్రీ నంబరు 1800 425 1757పై, కలైక్కావిళిలోని కేంద్రాన్ని 94880 73779, 94862 70443, 94428 72911 నంబర్లపై, శబరిమలైలోని కేంద్రంలో డిసెంబరు 2వ తేదీ వరకు శివకుమార్‌ను 94439 94342, ప్రేమ్‌కుమార్‌ను 63858 06900, సందీప్ కుమార్ 85310 70571 నంబర్లు, 3 నుంచి 17వ తేదీ వరకు చెర్మరాజా 83440-21828, 4928 4928, సతీష్ కుమార్ 75588 39969, 18 నుంచి జనవరి 2వ తేదీ వరకు సుందర్ 89219 37043, శివశంకర్ 90806 50431, సజీవన్ 99405 768898 నంబరుపై సంప్రదించవచ్చని సూచించారు.

పలు రైళ్ల సేవల్లో మార్పులు

సైదాపేట, న్యూస్‌టుడే: తిరునిండ్రవూరు రైల్వే డిపోలో జరుగుతున్న నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

* బెంగళూరు- చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12608), కోయంబత్తూరు- చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12680) ఈ నెల 23న చెన్నై సెంట్రల్- కట్పాడి మధ్య తాత్కాలికంగా రద్దయ్యాయి. తిరుపతి- చెన్నై సెంట్రల్ (16054) రైలు అరక్కోణం-చెన్నై సెంట్రల్ మధ్య రద్దయింది. అలాగే అదేరోజు చెన్నై సెంట్రల్ నుంచి బెంగళూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు (12607) సెంట్రల్-కాట్పాడి మధ్య, చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతి వెళ్లే రైలు (16053) సెంట్రల్-అరక్కోణం మధ్య తాత్కాలికంగా రద్దయ్యాయి. చెన్నై సెంట్రల్ నుంచి కోయంబత్తూరు వెళ్లే వందేభారత్ (20643) గంట ఆలస్యంగా మధ్యాహ్నం 3.15 గంటలకు సెంట్రల్ నుంచి బయలుదేరుతుంది.

కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ తదితరులు

పికిల్ బాల్ జట్ల ప్రకటన

సైదాపేట, న్యూస్‌టుడే: ఇండియా పికిల్ బాల్ లీగ్ (ఐపీబీఎల్)కు జట్లను ప్రకటించే కార్యక్రమం మంగళవారం చెన్నైలో జరిగింది. ఇందులో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు. డిసెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు దిల్లీలో ఈ లీగ్ జరుగనుంది. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, క్రీడాభివృద్ధి కమిషన్ సభ్య కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి, ది టైమ్స్ గ్రూప్ ఎండీ వినీత్ జైన్, ఇండియా పికిల్ బాల్ సంఘ అధ్యక్షుడు సూర్య వీర్ పుల్లర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా వృషభోత్సవం

వృషభానికి పూజలు చేస్తున్న అర్చకులు

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోస్థలంలో కార్తిక మాసం సందర్భంగా మంగళవారం వృషభోత్సవం వైభవంగా జరిగింది. ప్రదోషకాలంలో పరమేశ్వరునితో పాటు ఆయన వాహనమైన వృషభానికి కూడా పూజలు చేయడం ఓ సంప్రదాయంగా వస్తోంది. పైగా కార్తిక మాసం కావడం మరీ విశేషం. కార్యదర్శి కిషోర్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ప్రసాద్, మేనేజర్ శంకర్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కౌన్సిలర్ల సమావేశం రసాభాస

ఛైర్మన్‌కు అందజేసిన రంగు మారిన స్టీల్ పాత్రలు, వెండి గొలుసు

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి పట్టణ పంచాయతీ కౌన్సిలర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. పంచాయతీ అధ్యక్షురాలు షకీలా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే కౌన్సిలర్లు రవి, దీప మాట్లాడుతూ.. పట్టణ సరిహద్దులోని చెరువులో వ్యర్థ జలాలు కలుస్తుండటంతో నీరు కలుషితమైందని, డీఎంకే అసమర్థ పాలనతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. చెరువు వద్ద నిర్మించిన బోరు బావుల నుంచి సరఫరా చేస్తున్న నీటితో స్టీల్ పాత్రలు, వెండి గొలుసులు సైతం రంగు మారాయని పేర్కొంటూ వాటిని షకీలాకు అందించారు. దీన్ని డీఎంకే కౌన్సిలర్లు వ్యతిరేకించారు. పదేళ్ల అన్నాడీఎంకే పాలనలోనూ చెరువులో వ్యర్థ జలాలు కలిశాయని, అప్పుడు సరైన చర్యలు చేపట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. దీంతో ఇరు పార్టీల కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈవో భాస్కర్ వారిని శాంతపరిచారు.

ఓటు హక్కుని ఎవరూ తొలగించలేరు: ప్రేమలత

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఓటు హక్కుని ఎవరూ తొలగించలేరని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ పేర్కొన్నారు. దిండుక్కల్‌లో ఆమె నేతృత్వంలో పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను డీఎంకే నెరవేర్చలేదని ప్రజల్లో అసంతృప్తి ఉందని, డీఎండీకే ఉండే కూటమే ఈసారి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'సర్'తో ఓట్లను తొలగిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇలాంటి ఆరోపణలు వస్తూనే ఉంటాయన్నారు. ఎన్నికల్లో కొన్ని తప్పులు జరగడం నిజమేనన్నారు. నిజాయతీగా ఎన్నికలు జరగాలన్నదే డీఎండీకే వైఖరని పేర్కొన్నారు. డీఎండీకే వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతుందన్నారు. కూటమి విషయంలో స్పష్టంగా ఉందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ప్రశ్నార్థకంగానే ఉన్నాయన్నారు.

'సర్'ను వ్యతిరేకిస్తున్నట్లు విజయ్ నటిస్తున్నారు: అప్పావు

టీనగర్, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ 'ఎస్ఐఆర్'కు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు నటిస్తున్నారని, నిజంగా పోరాడలేదని రాష్ట్ర శాసనసభ స్పీకర్ అప్పావు ఆరోపించారు. మంగళవారం ఆయన తిరునెల్వేలిలో విలేకర్లతో మాట్లాడుతూ.. విజయ్ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో ఏకీభవిస్తున్నారని పేర్కొన్నారు. ఆయనను ప్రజలు నమ్మబోరన్నారు. ఎస్ఐఆర్ వ్యవహారంలో రెవెన్యూ శాఖ ఉద్యోగులను డీఎంకే ప్రభుత్వం పురిగొల్పుతున్నట్లు చేస్తున్న ఆరోపణలను ఖండించారు.

డీఎంకే జిల్లా కార్యవర్గ సమావేశం

మాట్లాడుతున్న సీహెచ్ శేఖర్

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపం తండలంలో డీఎంకే జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రమేష్‌రాజ్ అధ్యక్షత వహించారు. ఐటీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'సర్' పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రానున్న శాసనసభ ఎన్నికలలోగా కొత్త సభ్యులను చేర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు పగలవన్, యూనియన్ కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ప్రస్తుతానికి ఎన్డీయేలోనే ఉన్నాం

తమిళ వార్తాపత్రిక ఇంటర్వ్యూలో పుదువై సీఎం రంగసామి వెల్లడి



ముఖ్యమంత్రి రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో భాజపా మంత్రి జాన్‌కుమార్ ముఖ్యమంత్రి రంగసామికి ఇబ్బందులు సృష్టిస్తున్నారు. లాటరీ సంస్థ అధినేత మార్టిన్ కుమారుడు జోస్ చార్లెస్‌తో వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా ఓ వర్గాన్ని ఏర్పాటు చేయాలనే యోచనలో జాన్‌కుమార్ ఉన్నారు. ఇందుకోసం తీసుకుంటున్న చర్యలను భాజపా అధిష్ఠానం చూసి చూడనట్లు వ్యవహరిస్తోంది. కానీ, ఇదంతా మౌనంగా ఎదుర్కొంటున్న రంగసామి... బిహార్ ఎన్నికల్లో విజయం సాధించినందుకు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు శుభాకాంక్షల సందేశం పంపారు. ప్రధానిని కలవడానికి దిల్లీ వెళ్లేందుకు కూడా సిద్ధమవుతున్నారు. అదే సమయంలో తమిళనాడులో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి డీఎంకే ఎన్నికల ఇన్‌ఛార్జి జగద్రక్షగన్‌ని కలిసి మాట్లాడారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఎన్నార్ కాంగ్రెస్ వ్యూహం ఏంటన్నదానిపై రంగసామి ఓ తమిళ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: 2026 ఎన్నికల్లో ఎన్డీయేలో కొనసాగుతారా?

జవాబు: ఆ విషయం ఎన్నికలు వచ్చినప్పుడు చెప్తాను. ప్రస్తుతం ఎన్డీయేలో ఉండే మాట్లాడుతున్నాను. బిహార్‌లానే పుదుచ్చేరిలో 2026 ఎన్నికల ఫలితాలు ఉంటాయి.

ప్ర: పుదుచ్చేరికి రాష్ట్ర హోదా దక్కకుంటే కూటమి నుంచి వైదొలుగుతారా?

జ: రాష్ట్ర హోదా కావాలని డిమాండ్ చేస్తున్నాం. దానిని పొందడం చాలా అవసరం.

ప్ర: కొత్తవాళ్లు పార్టీ ప్రారంభించే ప్రయత్నాలు చేస్తున్నారా?

జ: ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా పార్టీని స్థాపించవచ్చు. ఆ ప్రకారం కొత్తవాళ్లు రాజకీయాల్లోకి రావడాన్ని ఆహ్వానిస్తున్నాము.

ప్ర: ఎన్నార్ కాంగ్రెస్ నియోజకవర్గాలే లక్ష్యంగా జోస్ చార్లెస్ పనులు సాగిస్తున్నారా?

జ: ఎవరైనా ఏ నియోజకవర్గంలోనైనా పనులు చేయవచ్చు. అది వారి హక్కు. కానీ ప్రజలు వారిని అంగీకరిస్తారా? లేదా? అనేది ఎన్నికల్లోనే తెలుస్తుంది.

ప్ర: జోస్ చార్లెస్ విమర్శలకు బదులిస్తారా?

జ: ప్రజాస్వామ్య దేశంలో అందరికి మాట్లాడే హక్కు ఉంది. వారి ఆరోపణలకు సమయం వచ్చినప్పుడు బదులిస్తాను.

పళని ఆలయంలో భక్తులకు శొంఠి కాఫీ పంపిణీ

● చలి నుంచి ఉపశమనం కలిగించేలా ఏర్పాటు

భక్తులకు శొంఠి కాఫీ అందజేస్తున్న సిబ్బంది

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రసిద్ధ పళని మురుగన్ ఆలయానికి కార్తీక మాసంలో భక్తులు అధికంగా వస్తారు. గత కొన్నిరోజులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తుల రాక పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం తమిళనాడు, కేరళ నుంచి కూడా భక్తుల రాక అధికంగా ఉంది. మరో వైపు రాష్ట్రంలో కొన్నిరోజులుగా వర్షాలు పడుతున్నాయి. పళని చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర చలి నెలకొంది. దీంతో ఆలయానికి మెట్ల మార్గాన చేరుకునే భక్తులకు చలి నుంచి ఉపశమనం కలిగించేందుకు ఆలయం తరఫున తెల్లవారుజామున 4.30 గంటల నుంచి వేడివేడి శొంఠి కాఫీ ఉచితంగా అందిస్తున్నారు. ఇప్పటికే మెట్ల మార్గాన వచ్చే భక్తులకు మజ్జిగ అందజేస్తున్న నేపథ్యంలో చలి కారణంగా శొంఠి కాఫీ అందిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఎక్కడికక్కడే పొయ్యిలు పెట్టి కాఫీ తయారు చేస్తున్నారు.

జోరుగా సర్ పనులు

పనులను గమనిస్తున్న జిల్లా అదనపు ఎన్నికల అధికారి శివకృష్ణమూర్తి

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ పనులు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం చెన్నైలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓటరు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లు ఆసక్తిగా విచ్చేసి ఎన్యూమరేషన్ పత్రాలను అధికారుల సూచనలతో పూర్తి చేసి అందించారు. విల్లివాక్కం నియోజకవర్గంలోని లోకనాథన్ ప్రాథమిక పాఠశాలలోని కేంద్రంలో పనులను జిల్లా అదనపు ఎన్నికల అధికారి శివకృష్ణమూర్తి పరిశీలించారు.

జాక్టో-జియో ఆందోళన

ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘం (జాక్టో-జియో) తరఫున 10 అంశాల కోరికలను డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు సహా జాక్టో-జియో సభ్యులు కోయంబత్తూరు దక్షిణ జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు.

రాష్ట్రంలో 6 రోప్‌వే కారిడార్లు

డీపీఆర్ కోసం బిడ్ల ఆహ్వానం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పర్వత మాల పరియోజన' కింద తమిళనాడు వ్యాప్తంగా ప్రణాళిక చేయబడిన 6 రోప్‌వే ప్రాజెక్ట్‌లకు వివరణాత్మక నివేదికలు (డీపీఆర్) తయారు చేయడానికి నేషనల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సాంకేతిక సలహాదారుల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించింది. ఆ ప్రకారం రాష్ట్రంలో గుర్తించిన రోప్‌వే కారిడార్‌లలో తిరువణ్ణామలైలోని పర్వతమలై, ఊటీలోని గ్లెన్‌మోర్గాన్-సింగార పవర్ హౌస్, కురంగణి-టాప్ స్టేషన్, తోరణమలై మురుగన్ ఆలయం, విరుదునగర్ జిల్లాలోని చదురగిరి కొండల వద్ద రెండు స్ట్రెచ్‌లు ఉన్నాయి. కారిడార్ల తాత్కాలిక పొడవు 0.5 కి.మీ నుంచి 4.6 కి.మీ వరకు ఉంటుంది. కన్సల్టెంట్ సంస్థ విస్తృతమైన సర్వేలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. వీటిలో స్థలాకృతి, భూసాంకేతిక అంచనాలు, అమరిక ప్రణాళికలను సిద్ధం చేయడం, ఖర్చుల అంచనా, ట్రాఫిక్ డిమాండ్ విశ్లేషించడం, పర్యావరణ, అటవీ ప్రభావాలను అంచనా వేయడం, ప్రాజెక్ట్ నిర్మాణం, రాయితీ పత్రాలు రూపొందించడం లాంటి పనులున్నాయి. చట్టబద్ధమైన అనుమతులు, భూసేకరణ ప్రణాళికలను పొందడానికి మద్దతు కూడా ఈ పరిధిలోకి వస్తుంది. రాష్ట్రంలోని రోప్‌వే ప్రాజెక్ట్‌ల ప్రతిపాదన అభ్యర్థన, కేటాయింపు కోసం ఆరు నెలల కాలక్రమాన్ని నిర్దేశిస్తుంది. అంతేకాకుండా కఠినమైన సాంకేతిక, ఆర్థిక అర్హత ప్రమాణాలను వివరిస్తుంది.

ఓటర్ల ఖాతాల్లో రూ.15 వేలు వేసే అవకాశం

భాజపాపై సీమాన్ విమర్శలు

విలేకర్లతో మాట్లాడుతున్న సీమాన్

సైదాపేట, న్యూస్‌టుడే: బిహార్‌లోని ఓటర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు వేసి ఎన్డీయే విజయం సాధించిందని, అలాగే తమిళనాడులో కూడా రూ.15 వేలు వేసే అవకాశం ఉందని నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీవో చిదంబరనార్ వర్ధంతి సందర్భంగా చెన్నై గిండిలోని ఆయన విగ్రహానికి సీమాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ... తమిళనాడులో చాలా కాలం నుంచి నకిలీ ఓటర్లు ఉన్నారని, అయితే ఇప్పుడే ఉన్నట్లుగా ప్రస్తుతం 'సర్' నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. బిహార్‌లాగే తమకు ఓటేయరనుకున్న వారి ఓటు హక్కు తొలగించేందుకే ఈ పనులు జరుగుతున్నాయని ఆరోపించారు.

పరిహారం చెల్లించకపోవడంతో ప్రభుత్వ బస్సు జప్తు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా కండమంగళం సమీపం నవమ్మాళ్ మరుదూర్ గ్రామానికి చెందిన రంగప్పన్(70) 2011 ఏప్రిల్ 27వ తేదీ దిండివనం సమీపం మొలచ్చూర్ గ్రామం వద్ద పుదుచ్చేరి వైపు వెళుతున్న ప్రభుత్వ బస్సు ఢీకొని మృతి చెందాడు. ఘటనపై కిళియనూర్ పోలీసులు దిండివనం కోర్టులో కేసు దాఖలు చేశారు. 2023 మార్చి 30వ తేదీ విచారించిన కోర్టు.. బాధిత కుటుంబానికి రవాణా శాఖ తరఫున రూ.32.61 లక్షలు పరిహారం అందజేయాలని తీర్పునిచ్చింది. ఇదిలా ఉండగా పరిహారం అందకపోవడంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. 2025 అక్టోబరు 24న విచారించిన న్యాయమూర్తి ప్రియ.. బాధిత కుటుంబానికి రూ.67,85,500 అందజేయాలని రవాణాశాఖను ఆదేశించారు. ఈ నేపథ్యంలో నష్ట పరిహారం ఇంకా అందకపోవడంతో కోర్టు సిబ్బంది దిండివనం వంతెన కింద ఆగి ఉన్న ప్రభుత్వ బస్సును మంగళవారం జప్తు చేసి కోర్టులో అప్పగించారు.

ఆకట్టుకున్న వేషధారణ పోటీలు

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం పెరువాయల్‌లోని టీజేఎస్ పబ్లిక్ పాఠశాలలో జిల్లాస్థాయి వేషధారణ పోటీలు మంగళవారం నిర్వహించారు. సుమారు 52 పాఠశాలలకు చెందిన 320 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, అబ్దుల్‌కలాం వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విజేతలకు కరస్పాండెంట్ మనోజ్ బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ కస్బార్ తదితరులు పాల్గొన్నారు.

21న రైతు సమావేశం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లాలో ఈనెల 21వ తేదీ రైతు సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కలైసెల్వి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంచీపురం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని ప్రజావేదిక భవనంలో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని, జిల్లాలోని రైతులు సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: శ్రీపెరుంబుదూర్ విద్యుత్తు డివిజన్‌లోని 230/110/33 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో 20వ తేదీ మాసాంతర అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో ఆరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీకే నాయుడు నగర్, సన్నిధి వీధి, గాంధీ రోడ్డు, ఎంజీఆర్ నగర్, భారతి నగర్, చెన్నై-బెంగళూరు బైపాస్ రోడ్డు, ఆక్సిల్ ఇండియా, వల్లకోట, అరుణ్ ఎక్సెలో, వల్లం, వడక్కాల్, ఎరయూర్, కైవల్యం నగర్, టెంపుల్ గ్రీన్ తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా రూ.100 కోట్లకు పైగా మోసం

✦ అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా ఏజెంటు సహా ఆరుగురి అరెస్టు

అరెస్టయిన శ్రీనాథ్ రెడ్డి, అనిత, సూర్య శ్రీనివాస్, శేషాద్రి యతిరాజ్ ● స్వాధీనం చేసుకున్న ఏటీఎం కార్డులు, బ్యాంకు ఖాతా పుస్తకాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా రూ.100 కోట్లకు పైగా మోసానికి పాల్పడిన అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాకి చెందిన భారతదేశ ఏజెంట్, ప్రముఖ బ్యాంకు మేనేజరు, ప్రైవేటు సంస్థ యజమాని సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు... చెన్నై పెరుంగుడికి చెందిన కార్తీక్ ఫైనాన్స్ సంస్థ నడుపుతున్నారు. ఈయన ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు వస్తాయని భావించి రూ.1.43 కోట్లు పోగొట్టుకున్నారు. ఇందుకు సంబంధించి చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో.. 'సూర్య ఇంపోర్ట్స్, ఎక్స్‌పోర్ట్స్' సంస్థ యజమాని సూర్య శ్రీనివాస్ బ్యాంకు ఖాతాలకు నగదు వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం అతనిని అరెస్టు చేసి విచారించారు. ఈక్కాట్టుతాంగల్‌లోని ప్రైవేటు బ్యాంకు బ్రాంచ్ మాజీ మేనేజరు శేషాద్రి యతిరాజ్ ఇందులో సూత్రధారి అని తెలియడంతో అతన్ని, మనీ మ్యూల్స్‌గా వ్యవహరించిన దినేష్, అరుణ్‌పాండియన్‌లను అరెస్టు చేశారు. శేషాద్రి యతిరాజ్ తన బ్యాంకులోని ఖాతాల వివరాలను సైబర్ నేరగాళ్లకు ఇచ్చి, ఒక్కో ఖాతాకు రూ.5 లక్షల వరకు తీసుకున్నట్లు తేలింది. అదేవిధంగా శేషాద్రి యతిరాజ్ బ్యాంకులో ఖాతా ఉన్న సూర్య శ్రీనివాస్ పలు విధాలుగా హవాలా నగదు పరివర్తన చేశాడని, శేషాద్రి యతిరాజ్ తనకు వచ్చే నగదులో సూర్య శ్రీనివాస్‌కు కూడా వాటా ఇచ్చేవాడని తెలిసింది. సూర్య శ్రీనివాస్ తన సంస్థలో పనిచేసేవారి వివరాలను శేషాద్రికి చెప్పి అతని బ్యాంకులోనే ఖాతాలు ప్రారంభించి వారిని కూడా మోసం చేసినట్లు వెల్లడైంది.

దేశంలో ముఖ్య ఏజెంట్ శ్రీనాథ్ రెడ్డి

శేషాద్రి యతిరాజ్ వందకు పైగా ఖాతా వివరాలను ముఖ్య సైబర్ నేరగాడు అయిన శ్రీనాథ్ రెడ్డికి విక్రయించేవాడని, రూ.కోటికి రూ.5 లక్షల చొప్పున నగదు తీసుకునేవాడని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. అనంతరం చెన్నై కేకే నగర్‌లో ఉంటున్న శ్రీనాథ్ రెడ్డిని అరెస్టు చేశారు. శ్రీనాథ్ రెడ్డి నకిలీ సంస్థలు నడిపి, వాటి ద్వారా మోసంలో మనీ మ్యూల్స్‌ను చేర్చాడని గుర్తించారు. ఇందుకు సహకరించిన అతని కార్యాలయ ఉద్యోగి అనితను అరెస్టు చేశారు. శ్రీనాథ్ రెడ్డి అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు ముఖ్యమైన భారతీయ ఏజెంట్‌లలో ఒకడని తెలిసింది. ఇతను చెన్నై కేంద్రంగా ఐదు నకిలీ షెల్ సంస్థలను సృష్టించి 150కి పైగా బ్యాంకు ఖాతాలను ప్రారంభించి, వాటిని అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు ఇచ్చి సుమారు రూ.150 కోట్లకు పైగా మోసానికి పాల్పడి రూ.కోట్లలో కమీషన్ పొందినట్లు వెలుగుచూసింది. శ్రీనాథ్ రెడ్డికి తమిళం, తెలుగు, కన్నడ మొదలైన భాషలు తెలియడంతో వివిధ రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించి వారి ద్వారా దేశవ్యాప్తంగా మోసానికి పాల్పడినట్లు తెలిసింది. శ్రీనాథ్ రెడ్డి అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు విక్రయించిన 150కి పైగా బ్యాంకు ఖాతాల్లో 128 ఖాతాలపై దేశవ్యాప్తంగా 120 కేసులు ఉన్నాయని, వాటిల్లో తమిళనాడులో 18 కేసులు ఉన్నట్లు తేలింది. అరెస్టయిన శ్రీనాథ్ రెడ్డి, అనిత, శేషాద్రి యతిరాజ్‌లను పోలీసులు కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేసేందుకు చర్యలు చేపట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ.. తండ్రి, కుమార్తె మృతి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా సెంజి సమీపం తుత్తిపట్టు ప్రాంతానికి చెందిన వెంకటేశన్(42) కుమార్తె సూర్యప్రియ(17) పుదుచ్చేరిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మొదటి ఏడాది చదువుతోంది. మంగళవారం తెల్లవారు జామున వెంకటేశన్ కుమార్తెను కళాశాలకు తీసుకెళ్లడానికి ద్విచక్ర వాహనంపై విళుపురం వైపు బయలుదేరాడు. విక్రవాండి సమీప కంజనూర్ వద్ద పెట్రోలు బంక్ వద్ద వెళుతుండగా లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. కిందపడిన తండ్రి, కుమార్తెపైకి లారీ ఎక్కిదిగడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కంజనూర్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకొని లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

ఘటనాస్థలి

ప్యారిస్: మదురై జీవా నగర్‌కి చెందిన వెంకటసుబ్బు(56), పద్మావతి దంపతులు. వీరు మంగళవారం తెల్లవారుజామున అలంగానల్లూర్‌కి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సికందర్ చావడి వద్ద వెళ్తుండగా అకస్మాత్తుగా శునకం అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడింది. ఆ సమయంలో వెనుక వచ్చిన ప్రభుత్వ బస్సు కిందపడిన వెంకటసుబ్బు, పద్మావతి పైనుంచి వెళ్లింది. వెంకటసుబ్బు ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. పద్మావతి తీవ్రంగా గాయపడింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో బాలిక...

ఇలక్య (పాతచిత్రం)

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం అళింజివాక్కానికి చెందిన విజయకుమార్ కారు డ్రైవర్. ఈయన తన భార్య తమిళ్‌సెల్వి, కుమార్తె ఇలక్య(8), కుమారుడు ఇనియన్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా సత్యవేడులోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై మంగళవారం వెళ్లాడు. తిరిగి వస్తుండగా గుమ్మిడిపూండి సమీప తచ్చూరు వద్ద వీరి వాహనాన్ని కారు ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇలక్య మృతి చెందింది. ఘటనపై కవరప్పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో మహిళ...

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం భరణంబేడుకు చెందిన సావిత్రి(40) వ్యవసాయ కూలీ. ఈమె మంగళవారం ఉదయం ఇటుకల లోడు ట్రాక్టర్‌పై కూర్చొని వెళ్తుండగా కీళ్‌ముదలంబేడు వద్ద లారీ ఢీకొంది. ప్రమాదంలో సావిత్రి అక్కడికక్కడే మృతి చెందింది. కవరప్పేట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల బస్సు కిందపడి ఏడాదిన్నర బాలుడు...

గురుశాంత్ (పాతచిత్రం)

వేలూరు: తిరుప్పత్తూరు జిల్లా వాణియంబాడి సమీపం కృష్ణాపురానికి చెందిన వేలు, తిలక దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఏడాదిన్నర వయసున్న కుమారుడు గురుశాంత్ ఉన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం ఇద్దరు కుమార్తెలను పాఠశాల బస్సు ఎక్కించడానికి తిలక కుమారుడితో పాటు వెళ్లింది. రోడ్డుపై ఆగి ఉన్న బస్సులో కుమార్తెలను ఎక్కిస్తుండగా బాలుడు గురుశాంత్ బస్సు వెనుక చక్రం వద్దకు వెళ్లాడు. గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు కదిలించడంతో చక్రం కింద నలిగి బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కావలూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సింగపూర్‌లో పిడుగుపాటుకు పుదుకోట్టై యువకుడు...

ఆర్కేనగర్: పుదుకోట్టై జిల్లా వడకాడు సెర్వకారన్‌పట్టి గ్రామానికి చెందిన సెందూరన్ అనే యువకుడు సింగపూర్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆయన బుకిట్‌పటాక్ అనే ప్రాంతంలో పనిచేస్తుండగా పిడుగుపాటుకు మరణించారు. మృతదేహాన్ని సొంతూరికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

నిందితుడు చరణ్

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మధురాంతకం సమీపం శిలావట్టం గ్రామానికి చెందిన చరణ్(20).. అదే గ్రామానికి చెందిన మధుమిత(17)ను నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. మధుమితకు పెళ్లికి ముందు నుంచి మరో యువకుడితో పరిచయం ఉంది. వివాహమైన తరువాత కూడా అతనితో సెల్‌ఫోన్లో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న భర్త పలుమార్లు మందలించాడు. అయినా ఆమె ప్రవర్తన మారకపోవడంతో సోమవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న కొండపైకి తీసుకెళ్లి గొడవపడ్డాడు. ఆగ్రహంతో వెంట తీసుకెళ్లిన కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం ఇంటికి వచ్చి విషయాన్ని తల్లికి చెప్పడంతో ఆమె మధురాంతకం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చరణ్‌ను అరెస్టు చేసి మధుమిత మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

డ్రగ్స్ ముఠా నాయకుడు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మెథాంఫెటమైన్ అనే మత్తుపదార్థం, మత్తుమాత్రలు విక్రయిస్తున్న నైజీరియా, కాంగో దేశాలకు చెందిన ఐదుగురిని పోలీసులు కొన్ని రోజుల క్రితం అరెస్టు చేశారు. వారిని విచారించగా.. చెన్నై ట్రిప్లికేన్‌కు చెందిన మతిన్ అహ్మద్ రాష్ట్ర వ్యాప్తంగా మత్తుమాత్రలు విక్రయిస్తున్న ముఠాకు నేతృత్వం వహిస్తున్నట్లు తెలిసింది. దీంతో అతనిని మనవాళనగర్ పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్టు చేసి రూ.85 లక్షల విలువైన 55 గ్రాముల మెథాంఫెటమైన్ సహా 40 మత్తుమాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

పోక్సో కేసులో బాలుడు సహా ఇద్దరు...

ట్రిప్లికేన్: తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. ఇదిలా ఉండగా అదే పాఠశాలకు చెందిన ప్లస్‌వన్ విద్యార్థి ఆమెను ప్రేమిస్తున్నాడు. ఆమెతో సన్నిహితంగా ఉన్న సమయంలో పిచ్చైమణి అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసి బాలికను బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాలిక ఆరోగ్యం దెబ్బతినడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె గర్భవతిగా నిర్ధారించారు. తల్లిదండ్రులు విచారించగా.. బాలిక అసలు విషయం చెప్పింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి బాలుడు సహా పిచ్చైమణిని పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

ఉన్నతాధికారుల వేధింపులతో ఎంటీసీ ఉద్యోగి ఆత్మహత్య



యువరాజ్ (పాతచిత్రం)

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా గూడువాంజేరి సమీపం ఆదనూర్ ప్రాంతానికి చెందిన యువరాజ్(52) ఎంటీసీ తాంబరం డిపో వర్క్‌షాప్‌లో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. గత ఆగస్టు 12వ తేదీ నుంచి మెడనొప్పితో బాధపడుతున్నారు. వైద్య సెలవులు కోరుతూ వర్క్‌షాప్ మేనేజర్ గోవిందరాజ్‌కు వైద్యుల సర్టిఫికెట్ పంపారు. అయినా గోవిందరాజ్ సెలవులు మంజూరు చేయలేదు. దీంతో సర్టిఫికెట్‌ను పైఅధికారిణి స్వర్ణలతకు పంపి సెలవు కోరారు. ఆమె కూడా నిరాకరించి విధులకు హాజరు కాని జాబితాలో ఉంచారు. దీంతో యువరాజ్ వేతనంలో కోత పడింది. దీని గురించి స్వర్ణలత, గోవిదరాజ్‌కు వివరించగా మూడు నెలలుగా వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో మానసిక వేదనకు గురైన యువరాజ్ తన మరణానికి స్వర్ణలత, గోవిందరాజ్ కారణమని లేఖ రాసి చెన్నై డీజీపీ కార్యాలయానికి ఈ-మెయిల్ పంపి సోమవారం రాత్రి గూడువాంజేరి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాంబరం రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రైవేటు కంపెనీ ఉద్యోగి...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు సమీపం అగరం గ్రామానికి చెందిన మన్సూర్ సిరాజ్(24) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఈయన సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కడంబత్తూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

పొదల్లో వ్యక్తి మృతదేహం లభ్యం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని అక్కరై ప్రాంతంలో ఉన్న మాజీ క్రికెటర్ దినేష్ కార్తిక్ ఇంటికి సమీపంలో ఉన్న పొదల్లో ముఖానికి టేపు చుట్టి కుళ్లిన స్థితిలో మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. సమాచారం మేరకు నీలాంగరై పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ప్రాథమిక దర్యాప్తులో.. మృతుడు వేలూర్ జిల్లా కాట్పాడికి చెందిన కలైయరసన్(33) అని, భార్యను వదిలేసి చెన్నై నగరంలో ఏడాదిగా నివసిస్తున్నట్లు తెలిసింది. మృతికి కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

భార్యను హత్య చేసిన భర్త



మహాలక్ష్మి (పాతచిత్రం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా బర్గూర్ సమీపం కోదయళగనూర్‌కు చెందిన వెంకటేశ్(34), మహాలక్ష్మి(29) దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగు నెలల క్రితం భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తడంతో మహాలక్ష్మి పిల్లలను తీసుకొని ధర్మపురి జిల్లా అరూర్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా ఈ నెల 15వ తేదీ అరూర్‌కి వెళ్లిన వెంకటేశ్ భార్య, పిల్లలను తిరుచ్చెందూర్ మురుగన్ ఆలయానికి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి సోమవారం ఉదయం అరూర్‌కు వచ్చారు. అప్పుడు దంపతుల మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన వెంకటేశ్ కత్తితో భార్య గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం పిల్లలతో పరారయ్యాడు. అరూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని పరారీలో ఉన్న వెంకటేశ్ కోసం గాలిస్తున్నారు.

కూలీని చంపి పాతిపెట్టిన దుండగులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా ఆసనూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కేర్‌మాళం కొండ ప్రాంతంలో ఉన్న చిక్కున్‌సేపాళయం గ్రామంలో సెంగుట్టవన్ అనే వ్యక్తి పొలంలో కొందరు పశువులు మేపుతుండగా దుర్వాసన వచ్చింది. పొలంలో ఓచోట గుంత తీసి పూడ్చి ఉండటాన్ని గుర్తించారు. తింగళూర్ గ్రామ వీఏవో సుభాష్ కుమార్ సమాచారం మేరకు ఆసనూర్ పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. అనంతరం సత్యమంగళం తహసీల్దార్ జమునారాణి, డీఎస్పీ ముత్తరసు తదితరుల సమక్షంలో పెరుందురై ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ నందకుమార్ ఆధ్వర్యంలోని వైద్య బృందం సోమవారం ఘటనా స్థలానికి చేరుకుంది. గుంత తవ్వి చూడగా 40-45 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం కనిపించింది. తలపై బలమైన గాయం ఉన్నట్టు గుర్తించారు. దర్యాప్తులో మృతుడు కళ్లిపట్టికి చెందిన కూలీ సెల్వంగా తెలిసింది. ఇతను కొన్ని నెలలుగా పనికి వెళ్లగా వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ తిరుగుతున్నాడని, ఇంకా పెళ్లి కాలేదని, అతని సోదరి కౌందంబాడిలో ఉన్నట్లు తేలింది. ఇందుకు సంబంధించి సెల్వం స్నేహితులు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉంగరం కోసం వృద్ధుడి హత్య

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా కుడియా తండలం గ్రామానికి చెందిన మన్నారుస్వామి(89) ఈనెల 13వ తేదీ ఉదయం స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు గాలించగా ఆలయం వద్ద ఉన్న పొదల్లో శవంగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. ఆయన వేలికి ఉన్న రెండు గ్రాముల బంగారు ఉంగరం కోసం అదే ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (19), దినేష్(25) హత్య చేసినట్లు తెలిసింది. దీంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ ఉపాధ్యాయిని ఆత్మహత్యాయత్నం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లా కుంభకోణం కొర్కై ప్రాంతానికి చెందిన చిత్ర(57) అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయిని. ప్రస్తుతం 'ఎస్ఐఆర్' విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా కుంభకోణం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కాంతిరాజన్ ఆమెను ఫోన్‌లో సంప్రదించి బుధవారంలోగా 200 ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని, లేకుంటే సస్పెండ్ చేస్తానని బెదిరించినట్లు సమాచారం. దీంతో ఒత్తిడికి గురైన చిత్ర రెండు లేఖలు రాసిపెట్టి నిద్రమాత్రలు మింగింది. సహోద్యోగులకు ఫోన్ చేసి విషయం చెప్పింది. వారు వెంటనే ఆమె ఇంటికి వెళ్లి కాపాడి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కుంభకోణం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది.

పళ్లిపట్టులో 50 మందికి అస్వస్థత

పళ్లిపట్టు: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీటిని తాగిన సుమారు 50 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. పళ్లిపట్టు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం పంచాయతీ అధికారులు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిపేశారు. జిల్లా ఆరోగ్య శాఖ సహాయ డైరెక్టరు ప్రియ, పట్టణ పంచాయతీ సహాయ డైరెక్టరు జయకుమార్ పళ్లిపట్టు వచ్చి బాధితులను పరామర్శించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు.

ప్రైవేట్ బస్సులో రూ.4 కోట్ల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుకోట్టైలో ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న రూ.4కోట్ల విలువైన హైగ్రేడ్ డ్రగ్స్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పుదుకోట్టై నుంచి వెళ్లే ఓ ప్రైవేట్ బస్సులో మత్తుపదార్థాలు తరలిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులకు సమాచారం అందింది. ఆ మేరకు రామనాథపురం కస్టమ్స్ విభాగ జాయింట్ కమిషనర్ ప్రకాశ్, సిబ్బంది సోమవారం సాయంత్రం కలియనగరి గ్రామం వద్ద వాహనాల సోదాలు చేపట్టారు. పుదుకోట్టై నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సుని ఆపి తనిఖీ చేశారు. ఓ బ్యాగులో కిలో బరువున్న రూ.4 కోట్ల విలువైన మత్తుపదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బ్యాగు ఎవరిదో తెలియకపోవడంతో డ్రైవరు, కండక్టరును విచారించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu